Declaration to be given by the Author/Pu In-copyright books.

To
The Digital Library of India,
IIIT, Hyderabad

Name of the Author/Publisher: S.B.P.

Address: Kapileswarapuram
E.G. Dist

City:
State: A.P.
Phone no:
Email:

We are happy to grant permission to scan all the books published by our organiza permission in this letter also authorizes and right to the Digital Library of India to scan, (books published by the said publisher / Autho with out any financial implications from DLI

We will continue to retain the copyrig can make it free to the read for the gen provide the above contact information for an the physical book from us.

SL.NO	TITLE
1	శ్రీమద్వాల్మీకి రామాయణం ఉత్తరకాండం
2	" " యుద్ధకాండం, బాల
3	" " అరణ్య, కిష్కింధ, సుందర
4	" " సుందరకాండం
5	" " అయోధ్యకాండం
6	కబీరు దాసు చరిత్రము
7	తిరుప్పావై

PS: please add separate sheet for all your ti

Sincerely,

Signature: 8/9/08

Name: S.B.P.B.K. SATYANI

Designation: KAPILESWAR

Company: E.G. Dist. A.P.

Date: 8.9.2008

శ్రీమద్వాల్మీకి రామాయణము



యుద్ధ కాండము

శ్రీరస్తు.

శ్రీరామచంద్రసద్గురుపరబ్రహ్మణేనమః.

ఐహికాముష్మికఫలప్రదంబును, వాల్మీకిమహర్షి ప్రణీతంబును, నగు

శ్రీమద్వాల్మీకి రామాయణము.

యుద్ధకాండము.

ఈ గ్రంథము.

కాశ్యపసగోత్ర సంభూతుండును, సీతారామార్య పుత్రుండును, నగు

బరహారు - త్యాగరాయశాస్త్రులచే

నిఖిలజగదుపకారార్థము

యథావాల్మీకముగసులభశైలితో తెనుగునవచనకావ్యముగరచియింపబడి

స్వకీయ

గీర్వాణభాషారత్నాకరముద్రాక్షరశాలయందు

ముద్రింపబడిప్రకటింపబడియె.

చన్నపట్టణము.

౧౮౯౩ సం॥

౩—సంపుటము.

ముద్రణము 2005

ప్రతులు 1000

ప్రచురణ : శ్రీ సర్వారాయ ధార్మిక విద్యా ట్రస్టు
కాకినాడ, తూ.గో.జిల్లా.
పిన్ : 533 001

సర్వస్వామ్య సంకలితము

ప్రతులకు సర్వారాయ ధార్మిక విద్యా ట్రస్టు
పాలనా విభాగము
కపిలేశ్వరపురం - 533 309
తూ గో జిల్లా

ముద్రణ శ్రీ లక్ష్మి గణపతి బైండింగ్ వర్క్సు
మెయిన్ రోడ్, కొవ్వూరు
ఫోన్ : 08813 - 231575

శ్రీ ర స్తు.

శ్రీ మ ద్వా ల్మీ కి రా మా య ణ ము - వ చ న కా వ్య ము.

యు ద్ధ కా ం డ

వి ష యా ను క్ర మ ణి క.

శ్రీ ర స్తు.

ఇరువదితొమ్మిదవసర్గ ప్రారంభము.

రావణాసురుడు చారులను రామునొద్దకుబంపుట

యుద్ధకాండ విషయానుక్రమణిక ముగిసెను.

శ్రీరస్తు

శ్రీరామచంద్రసద్గురుపరబ్రహ్మణేనమః.

శ్రీమద్వాల్మీకి రామాయణము - యుద్ధకాండము.

(*) సీతాదేవిని జూచివచ్చిన హనుమంతుని రాముడు గౌరవించుట. (*)

అట్లుహనుమంతుడు చెప్పిన మాటలనంతయు శ్రీరాముడువిని మిగుల సంతోషముగలవాడై యిట్లనియె. ఈహనుమంతునిచే నీభూలోకమునందు ఎవరిచేతను జేయశక్యముగాని మిగుల గొప్పదైన కార్యము జేయబడినది. మఱియు నీహనుమంతునిచే జేయబడిన కార్యము మనస్సునందు దలంచుటకుగూడ నలవికానిది. గరుత్మంతుడును, వాయుదేవుడును, హనుమంతుడునుదప్ప యిమ్మహాసముద్రమును దాటగలవానిని యింకొకని నేనెచ్చోటను జూచినదిలేదు. దేవతలకును, యక్షులకును, గంధర్వులకును, ఉరగులకును, రాక్షసులకును, కంన్నెత్తిచూడ శక్యముగానిదియును, రావణాసురునిచే మిక్కిలిచక్కగా రక్షింపబడినదియును, నగు లంకాపట్టణమును బ్రవేశించి బలముగలిగి మఱలజీవవంతుడై నెవడురాగలడు హనుమంతునితో సమానమైన పరాక్రమమును, బలమునుగలవాడుతప్ప యితరుడెవ్వడును నెదిరింపగూడనిదియును, రాక్షసులచే మిక్కిలి చక్కగా రక్షింపబడినదియును, నగు లంకాపురమును బ్రవేశించుటకు సమర్థుడుకాడు. సుగ్రీవునియొక్క భృత్యుడగు హనుమంతుడుసుగ్రీవుడు ఉత్తరువుచేసినప్రకారము భృత్యకార్యమును నెరవేర్చె. అట్లు తనకాజ్ఞాపించినపనిని నెరవేర్చినదియగాక తనపరాక్రమమునకు దగినబలముతో లంకాదహనముమొదలగు కార్యములనుగూడచేసె. శ్లో॥ యోహి భృత్యోనియుక్తస్సన్ భర్త్రాకర్మణిదుష్కరే । కుర్యాత్తదనురాగేణతమాహుఃపురుషోత్తమమ్ ॥ లోకమునందు యే భృత్యుడు తనయజమానునిచే నసాధ్యమగుకార్యమునందు నియమింపబడి యాకార్యమునుజేసి పిదప యజమానునిచే నాజ్ఞాపింపబడని యాకార్యమున కనుకూలమైన పనినిగూడ చేయునో ఆతని నుత్తమమైన భృత్యుడనిచెప్పుదురు. శ్లో॥ నియుక్తోయఃపరంకార్యం నకుర్యాన్నృపతేఃప్రియమ్ । భృత్యోయుక్తస్సమర్థశ్చ తమాహుర్మధ్యమంనరమ్ ॥ ఏభృత్యుడుఉత్సాహముగలవాడును, సమర్థుడును,నై యజమానుడాజ్ఞాపించిన కార్యమునుజేసి యజమానునికి బ్రియమగు నాకార్యమున కనుకూలమైన కార్యమునుగూడ జేయడో యతనిని మధ్యముడైన పురుషునిగా జెప్పుదురు. శ్లో॥ నియుక్తోనృపతేఃకార్యం నకుర్యాద్యస్సమాహితః । భృత్యోయుక్తస్సమర్థశ్చతమాహుఃపురుషాధమమ్ ॥ ఏభృత్యుడుజాగరూకుడును, ఉత్సాహముగలవాడును సమర్థుడునునై యజమానునిచే నాజ్ఞాపింపబడిన కార్యమునుగూడ జేయడో, యతనిని పురుషాధమునిగా జెప్పుదురు. కావున నీహనుమంతుడు తనకాజ్ఞాపించిన కార్యమును జేసినదియగాక లంకాదహనము మొదలగు మహత్కార్యములనుగూడ జేసి మిగుల కీర్తినిబొందె. సుగ్రీవునకును మిగుల సంతోషమును గలుగజేసె. ఇపుడు యీహనుమంతుడు సీతనుజూచి వచ్చుటచేత నేనును, రఘువంశోద్భవులగు వారందరును, మహాబలుడగు లక్ష్మణుడును స్వహత్యాదోషములను బొందక ధర్మంబున గాపాడబడితిమి. ఇప్పుడు ప్రియమైన సమాచారమును జెప్పినట్టి యీహనుమంతునకు దగిన సంతోషమును జేయకున్నానే అనునదిమాత్రము దుఃఖితుడనగునా మనస్సును పలుమారు బాధింపుచున్నది. ఇట్టిసంతోషకాలమున (అనగాసీతనునన్నును సంరక్షించిన యీకాలమున) మహోపకారుడును, మహాత్ముడును, నగు హనుమంతునకు నేమియిచ్చినందీరును? నాయొక్కసమస్తద్రవ్యములను యిచ్చినను దీరదు. కాబట్టి యిట్టికాలమునందు యీహనుమంతునికి నేనిచ్చునట్టి కౌగిలియే నాయొక్కసకలద్రవ్యమును యిచ్చినట్లు అగుగాకయనియె. అనియిట్లు రాముడుచెప్పి సంతోషముచే బులకాంకితశరీరుడగుచు మహాత్ముడును, కృతకార్యదురంధరుడును, నగు హనుమంతుని ఆలింగనముజేసికొనె. ఇట్లు ఆలింగనమును జేసికొని కొంచెముసేపు ధ్యానించి మఱల వానరులకు ప్రభువగు సుగ్రీవుడు వినుచుండగ నిట్లనియె. సీతను వెదకుటయందు అన్నికార్యములను జక్కగా నెరవేర్పబడెను. ఐనను సముద్రమును దలంచు

కొంటినేని నామనస్సునకు మిగుల భయము దోచుచున్నది ఈవానరులందఱును, దాటుటకు శక్యముగానిదియును, విశేషజలముతో గూడినదియును, నగు మహాసముద్రమును దాటి దక్షిణపుగట్టున నెట్లుచేరగలరు. ఐనను నాయొక్క ప్రియురాలగు సీతాదేవితో వానరులందఱును క్షణమాత్రలో సముద్రమునుదాటి రాగలరని చెప్పబడియున్నది. ఇప్పుడీవానరులందరును సముద్రమును దాటుటకు నేయుపాయముగలదో దానిని చెప్పుమనియె. అనియిట్లు శత్రుమర్దనుడును, మహాబాహుడునునగు రాముడు హనుమంతునితో చెప్పి శోకాక్రాంతచిత్తుడై చింతింపచుండె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి మొదటి సర్గ ముగిసెను.

సుగ్రీవుడు రాముని ధైర్యమునవలంబించి యుండుమని చెప్పుట.

అట్టితఱిని శ్రీమంతుడగు సుగ్రీవుడు వ్యసనమునందు మునిగయున్నవాడును, దశరథమహారాజ పుత్రుడును, నగు రామునిజూచి దుఃఖోపశమనముగ నిట్లనియె. ఓమహాపరాక్రమవంతుడవగు రాముడా! నీవేలప్రాకృతునివలె వ్యసనముఖబొందుచున్నావు? వ్యసనపడవలదు. "కృతఘ్నుండు స్నేహమునువిడిచి పెట్టునట్లు" వ్యసనమునువిడువుము. రాముడా! సీతాదేవియొక్క సమాచారమును, శత్రువు నివసించుచుండు స్థానమును, తెలిసియుండగ నీకువ్యసనము గలుగుటకు గారణము నాకుదెలియలేదు. ఓరామా! నీవు మతిమంతుడవు. నీతిశాస్త్రముల నెఱిగినవాడవు. ప్రాజ్ఞుడవు. పండితుడవు. కావున బరమాత్మధ్యానము గలయోగి "మోక్షమార్గనిరోధమగుబుద్ధిని వదిలిపెట్టునట్లు" సంతోషమును నశింపజేయునట్టి పాపిష్ఠమైన బుద్ధినివిడిచిపెట్టుము. మేము పెద్దపెద్దమొసళ్ళచే నిండినిబిడీకృతంబైన సముద్రమును దాటి లంకాపట్టణమునందు బ్రవేశించి కోటలమీదనెక్కి నీశత్రువగు రావణాసురుని సంహరించెదము. శ్లో॥ నిరుత్సాహస్యదీనస్యశోకపర్యాకులాత్మనః। సర్వార్థావ్యవసీదంతివ్యసనంచాధిగచ్ఛతి ॥ లోకమునందు ఎవడు, ఉత్సాహములేనివాడును, అందుచేదీనుడును, దానివలనవ్యాకులమైన మనస్సుగలవాడును, అగునో, అట్టివాడు సకలకార్యములను జెడగొట్టుకొనును. మఱియు మహాకష్టమునుగూడపొందును. కావున మహాశూరులును, సమర్థులును, నగు మనవానరోత్తములు అందఱును నీకు సంతోషమును గలిగించుటకొఱకు అగ్నిహోత్రమునందు ప్రవేశించుటకుగూడ సిద్ధముగ నున్నారు. ఈవానరశ్రేష్ఠులయొక్క సంతోషమును జూడగ నెట్టికార్యమునైనను జేయుదురనుటకు సందేహములేదు. ఇదియథార్థము. నేనెట్లు పరాక్రమముచే శత్రువైన పాపిష్ఠుడగు రావణాసురునిజంపి సీతాదేవినితీసికొనిరాగలనని ఉత్సాహమును గలిగియున్నానో నీవును అట్లే యుత్సాహముతోగూడి యుండవలయు. రామా! సముద్రమునందు సేతువునుగట్టి రాక్షసరాజగు రావణాసురునియొక్క లంకాపట్టణమును జూచుటకు దగిన యుపాయమును ఆలోచింపుము త్రికూటపర్వత శిఖరమునందుండెడు ఆలంకాపట్టణమును మనముజూచితిమేని యుద్ధమునందు రావణాసురుని జచ్చినవానిగా నిశ్చయించుకొనుము. మహాభయంకరమైనదియును, వరుణునికి నివాసస్థానమైనదియును, నగుసముద్రమునందు వారధినిగట్టక ఇంద్రునితోగూడిన సురాసురులైనను లంకాపట్టణమును నశింపజేయలేరు. సముద్రమునందు సేతువుగట్టియవ్వలికి సకలవానరసైన్యమును సముద్రమును దాటినదైనదనియును, జయమునొందినదనియును, నిశ్చయింపుము. యుద్ధమునందు మహాపరాక్రమవంతులును కోరినరూపమును ధరించువారును, నగువానరులు రాక్షసులతోగూడిన లంకాపట్టణమును పెల్లగించి తీసికొనివచ్చుటకు గూడ సమర్థులుగ నున్నారు ఓజగత్ప్రభువగు రామచంద్రా! దశరథరాజనందనా! సకలకార్యములను నశింపజేయునట్టి యీవ్యసనమును వదులుము. లోకమునందు వ్యసనము పురుషుని పరాక్రమమును నశింపజేయును. మహాప్రాజ్ఞుడవగు నోరామా! శౌర్యమును నవలంబించి యుండువాడు దేనినివదలకుండవలయునో అట్టిధైర్యపరాక్రమములను నవలంబించియుండుము. నీవంటిశూరులును, మహాత్ములును, నగు మనుష్యులు అగపడనిదానినిగురించియైనను, నాశనము నొందినదానిని గురించియైనను, వ్యసనమునొందదగదు. వ్యసనాక్రాంతులైరేని సకలకార్యనాశనమగును. నీవు బుద్ధిమంతులలో శ్రేష్ఠుడవు. సకలశాస్త్రార్థముల నెఱిగినపండితుడవు. ఇపుడునాబోటివారి సహాయముతో శత్రువునుజయింపుము. ఓరామా! నీవుయుద్ధమునందు ధనుస్సును ధరియించి నిలువంబడితివేని నీయెదుట నిలిచి యుద్ధముజేయశక్తిగలవాడొక్కడైనను యీమూడులోకములయందును నాదృష్టికగుబడలేదు.

ఈవానరులయందు సంబంధించియుండు నీయొక్కకార్యముయెన్నటికిని జెడదు. అక్షయమగు నీసముద్రమునుదాటిత్వరలో సీతాదేవినిజూడగలవు. కావుననో రామచంద్రా! ఇంతవఱకు వ్యసనమునొందినది చాలును. ఇకకోపమును బొందుము. కోపమునొంది భయంకరుడుగ నుండువానికి

సకలమైనవారును భయపడుదురు. శత్రువులునిర్వ్యాపారులైరేని భాగ్యహీనులగుదురు. నదులకు రాజును, మహాభయంకరమును, నగు సముద్రమునుదాటుటకు, సూక్ష్మబుద్ధిగలనీవు, మాతోడంగూడి యుపాయమును వెదకుము. నాయొక్కయీవానరసైన్యము సముద్రమునుదాటెనేని జయమునుబొందినదని నిశ్చయింపుము. యుద్ధమునందు మహాపరాక్రమశాలులును కోరినరూపమును ధరింప శక్తిగల వారును, నగు నీవానరులు శత్రువులగు రాక్షసులను రాళ్లవర్షము గురిపించుటచేతను, వృక్షవర్షము గురిపించుటచేతను, హతము జేయుదురు. ఓరామా! ఏవిధముచేతనైనను సముద్రమును దాటుటకుసిద్ధముగనున్నాను. కావున రావణాసురుడు సంహరింపబడెననియే తలంచుచున్నాను. వ్యర్థముగ ననేకమాటల జెప్పుటవలన నేమిప్రయోజనము. అన్నివిధములచేతను నీకుజయముగలుగును. నాకట్టి శుభసూచకములగుపడుచున్నవి మఱియు నామనస్సు మిగులసంతోషించుచున్నది అనిచెప్పె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి రెండవ సర్గము గిసెను.

ఆంజనేయుడురామునకు లంకాపట్టణనిర్మా క్రమమును జెప్పుట.

ఇట్లు సుగ్రీవుడు చెప్పగానే పరమార్థవేత్తయగు రాముడు సుగ్రీవునియొక్క సయుక్తములగు మాటలనువిని అట్లనేకానిమ్మనిచెప్పి పిదప హనుమంతునిజూచి యిట్లనియె. ఆంజనేయా! నేనుతపస్సుచేసికాని, సేతువుగట్టికాని, సముద్రమునుశుష్కింప జేసికాని, యేవిధముచేనైనను నీసముద్రమునుదాటుటకు సమర్థుడనగుచున్నాను. ఓఆంజనేయా! దుర్గమంబైన లంకాపట్టణమునకు యెన్నికోటలున్నవి. మఱియు నందలి సైన్యపరిమాణమును, ద్వారదుర్గమునందు ప్రవేశింప శక్యముగాని రక్షణవిధమును, రహస్యమగు రక్షణకార్యమును, రాక్షసులయొక్క గృహములు మొదలగు వానినంతయు, గండ్లతో ప్రత్యక్షముగజూచినట్లు విశదముగ దెలియజేయుము. నీవు ఆయాసములేక సావకాశముగ లంకలోనంతయు జూచియున్నావు. యథార్థముగ సర్వమునుజెప్పుము. నీవు సర్వవిధములచేతను సమర్థుడవనిచెప్పె. అంత వాక్యకోవిదుడును, వాయుదేవుని పుత్రుడును నగు హనుమంతుడు రామునిజూచి యిట్లనియె. ఓరామచంద్రా! లంకాపట్టణము, దుర్గకర్మవిధానముచే సంరక్షింపబడుచుండు విధమును సైన్యములచే గాపాడబడుచుండు క్రమమును, ప్రభువగు రావణాసురునియందు రాక్షసులకు గలస్నేహమును, రావణాసురుని ప్రభావముచే లంకయొక్క సర్వసమృద్ధి విధమును, సముద్రముయొక్క భయంకరమును, సైన్యసమూహములయొక్క విభాగమును, రథగజతురగాది వాహనములయొక్క విభజనమును, మొదలగు నంతయు జెప్పెదవినుము. రామా! ఆలంకాపట్టణము మహాసంతోషముగలజనులచే నిండియున్నది. మదించిన ఏనుగులచేతను. గొప్పగొప్ప రథములచేతను, రాక్షస సమూహములచేతను, గుఱ్ఱములచేతను, నిండి నిబిడీకృతముగ నుండుటయగాక శత్రువులకు బ్రవేశింప నలవికానిదిగనున్నది. మఱియు దృఢమగు సామానులచే జేయబడిన తలుపులుగలవిగను, గొప్పగడియమ్రానులు గలవిగను, విస్తారములను మిగుల పెద్దవియును నగు నాలుగుద్వారములుగలవిగను నున్నది. ఆద్వారములయందు విశేషబలముగలవియును, గొప్పవియును, నగు బాణములయొక్క యంత్రములును, శిలాయంత్రములును, గలవు. అచ్చటనె లంకాపట్టణమునుగూర్చి వచ్చెడు శత్రువులయొక్క సైన్యంబంతయునాయంత్రములవలన మడియుచున్నది. మఱియు నాద్వారములయందు వీరులగు రాక్షసులసమూహముచే సంస్కరింపబడినవియును, నగు ఇనుముతో జేయబడిన యినపగుదియలునూఱునూర్లుగనుంచబడియున్నవి. స్వర్ణమయమును, గొప్పదియును, నెదిరించుటకు శక్యముగానిదియును, వజ్రవిద్రుమ వైడూర్యముక్తాప్రవాళాదులచే రచియింపబడిన మధ్యప్రదేశములుగలదియును, మిగులపొడువైనదియును, నగు ప్రాకారముగలదు. అట్టిప్రాకారముయొక్క చుట్టును మహాభయంకరములైనవియును, మిగుల చల్లనినీళ్లుగలవియును, సొగసైనవియును, మిక్కిలి లోతుగలవియును, మొసళ్లనుమత్స్యములునుగలవియును, నగుఅగడ్తలుగలవు. ఆద్వారప్రదేశములందు ఆ అగడ్తలకు నాలుగుతట్లును కొయ్యలతో జేయబడిన సంచారమార్గములు నాలుగుగలవు. అందు ప్రజలు సంచరించుటకుగాను మిగులవిశాలములైనవియును, గొప్పవిన్నైనవియును, నగు ననేకయంత్రములుగలవు. అచట ద్వారరక్షకులు నివసించుటకుగాను యిండ్లుకట్టబడియున్నవి. అచ్చటి సంచారమార్గములు శత్రుసమూహము వచ్చినతోడనే లంకాపట్టణమును సంగ[illegible] ఎట్లనిన, అందుండు విశాలములగు అనేకయంత్రములచేత అగడ్తలయందు మూయబడియుండు సంచారోపయుక్తములైన పలకలన్నియును ఎత్తివేయబడుచున్నవి పిదప అయ్యగడ్తలను దాటుటకు అసాధ్యము. ఆసంచారమార్గములయం దొకటిమాత్రము నెవరిచేతను గదలింప శక్యముగాదు. మిగుల బలిష్ఠముగనుండును. మి

క్కిలిదృఢమైనది. అనేకములైన స్వర్ణమయములగు స్తంభములలోను బ్రకాశించుచుండును. ఓరామా! ఆరావణాసురుడు సాధారణముగ చలనములేని మనస్సుగలవాడై మిగుల జాగ్రతతో సోమరితనములేక తనకు శత్రువులులేకపోయినను శత్రువులతో యుద్ధముసేయువానివలె మహాయుత్సాహముతో తానే ప్రతిదినమును సైన్యములను విచారించుకొనుచుండును. మఱియు నాలంకాపట్టణము త్రికూటపర్వతము మీదనుండుటవలన ఎక్కిపోవుట కాధారములేదు. అచటికిపోవుటకు దేవతలకుగూడ శక్యముగాదు. చూచువారలకు మహాభయమును గలిగించును. నదిచేగలిగినదుర్గమును, పర్వతముచే గలిగిన దుర్గమును, వనసమూహముచేగలిగిన దుర్గమును, కృత్రిమదుర్గమును, అను నాలుగుదుర్గములుగలవు. ఓరామచంద్రా! ఆలంకాపట్టణము మిగుల విశాలమగు సముద్రముయొక్క ఆవలిగట్టునందున్నది. అట్టిసముద్రమును దాటిపోవుటకు నోడమార్గములేదు. ఈదేశవార్త యాదేశమునకు దెలియుటకు మార్గములేదు. దేవతలయొక్క పట్టణముతో సమానమగు లంకాపట్టణము పర్వతాగ్రమున నిర్మింపబడియున్నది. ఎట్టివారికిని జయింప శక్యముగానిది. గుఱ్ఱములును, ఏనుగులును, సమృద్ధిగ గలిగియున్నది. పర్వత వనజలదుర్గములతో గూడియున్నది. దురాత్ముడగు రావణాసురుని పట్టణమగు లంకాపట్టము, అగడ్తలచేతను, ఫిరంగులచేతను, నానావిధములగు యంత్రములచేతను, బ్రకాశించుచున్నది. మఱియు నాలంకాపట్టణముయొక్క పూర్వద్వారమునందు పదివేలమంది రాక్షసులు కావలియున్నారు. వారందరును శూలాయుధపాణులుగను, జయింపనలవికానివారుగను, ఖడ్గాయుధములతోనే యుద్ధమును జేయువారుగను నుండెదరు. ఆలంకాపట్టణముయొక్క దక్షిణద్వారమునందు రథగజపదాతిసైన్యములతోగూడ లక్షమంది రాక్షసులు గావలియున్నారు. వారలు మహాసమర్థులు. పశ్చిమద్వారమునందు పదిలక్షలమంది రాక్షసులు కావలియున్నారు. వారందఱును చర్మముతో జేయబడిన కవచములను ఖడ్గములను ధరించియున్నారు. సమస్తాస్త్రప్రయోగములను జక్కగా నెఱింగినవారు. ఉత్తరద్వారమునందు నూరుకోట్లమంది రాక్షసులు కావలియున్నారు. వారందఱును రథికులుగను, గుఱ్ఱములు వాహనములుగా గలవారుగను, మంచి కులమునం బుట్టినవారుగను, రావణాసురునియందు బ్రీతిగలవారగుటవలన గౌరవింపబడుచుండువారుగను, నుండెదరు. మఱియు నప్పట్టణముయొక్క మధ్యస్థానమునందు జయింప నలవికాని రాక్షసులు నూఱునూర్లుగను, వేలువేలుగను, కోట్లుకోట్లుగను నున్నారు. నేను అట్టి లంకాపట్టణముయొక్క యగడ్తలమీద సంచరించెడి మార్గములను బగులగొట్టివేసితిని. అగడ్తలను బూడ్చివేసితిని. ఆపట్టణమునంతయు గాల్చివేసితిని. ప్రాకారములను బగులగొట్టి చూర్ణమగునట్లుసేసితిని. మఱియు సైన్యమునందు కొంతభాగమైన మిగుల పరాక్రమశాలులగు రాక్షసులనున్ను జంపితిని. ఎట్టియుపాయముచేనైనను సముద్రమును దాటుచున్నాము. నిశ్చయముగ లంకానగరము వానరులచేనాశమునొందింపబడినదనియే తలంపుము. అంగదుడును, ద్వివిదుడును, మైందుడును, జాంబవంతుడును, పనసుడును, నలుడును, సేనానాయకుండైననీలుడునునున్నారు. కావునవీరలేచాలును. తక్కిన సేనలతోటి నీకు బ్రయోజనమేమి? రఘునందనా! రామచంద్రా! వీరలుగగనమార్గమునఁనెగిరిపోయి పర్వతములతోను, వనములతోను, అగడ్తలతోను, బహిర్ద్వారములతోను, ప్రాకారములతోను, గృహములతోను, గూడిననారావణాసురునియొక్క గొప్పపట్టణమగులంకానగరమును అడుగుతో బెళ్లగించి యిచటికితీసికొనిరాగలరు. ఓరామచంద్రా! ఈప్రకారముగ సైన్యములనన్నింటిలోను సారవంతులైన అంగదుడు మొదలగువారలకు అతిత్వరితముగ నాజ్ఞాపింపుము. మంచిముహూర్తకాలమునందు ప్రయాణముజేయుటకు బ్రయత్నింపుము.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి మూడవ సర్గము సను.

(*)

రాముడు సుగ్రీవునితో ప్రయాణసన్నాహము జేయుమనిజెప్పుట.

ఇట్లు మహాతేజుడును, సత్యపరాక్రముడును, నగు రాముడు హనుమంతుడు చెప్పిన దానినంతయుగ్రమముగా విని హనుమంతునిజూచి యిట్లనియె. ఓఆంజనేయా! భయంకరుడును, రాక్షసుడును నగు ఏరావణాసురునియొక్క పట్టణమగు లంకాపట్టణమునుగూర్చి చెప్పుచున్నావో దానిని అతిత్వరితముగనే నాశనముజేసెదను. ఇదిసత్యము. అనినీవు తెలిసికొనుమనిచెప్పి సుగ్రీవునితట్టు తిరిగిచూచి సుగ్రీవుడా! ఇప్పుడే ప్రయాణముసేయవలయును. ఇప్పుడు సూర్యుండాకాశమధ్యమును బొందియున్నాడు. కావుననీయభిజిన్ముహూర్తము మనకు జయమును గలిగించును. మఱియు సూర్యుడు ఆకాశమధ్యమును బొందియుండు నీజయప్రదమగు నభిజిన్ముహూర్తమున నేను ప్రయాణమగుదునేని సీతను దీసికొనిపోయిన రావణాసురుడెక్కడికిబోయి తప్పించుకొనగలడు. (తప్పించుకొనిపోలేడు.) సీతనాయొక్క ప్రయాణవార్తవిని "విషమును ద్రావి పీడితుడై ప్రాణమును

బోగొట్టుకొను నవస్థయందుండువాడు అమృతమును స్పృశించి కొంచము ప్రాణధారణ శక్తిగలవాడగునట్లు" జీవితాశగలదియగును. సుగ్రీవుడా! నేటిదినము ఉత్తర ఫల్గునీ నక్షత్రముగదా? రేపటిదినము చంద్రుడు హస్తనక్షత్రముతో చేరగలడు. కావున సకలసైన్యముతోగూడ నేడే ప్రయాణమగుదము. ఇప్పుడు శుభశకునములు ప్రాదుర్భవించుచున్నవి. అగుటవలన రావణాసురుని అవశ్యముగ సంహరించి జనకమహారాజపుత్రియగు సీతనుదీసికొనివచ్చెదను. మఱియు నాకన్నుయొక్క మీదిభాగము చలించుటవలన నామనోరథమీడేరి జయముగలుగునని తెలియజేయువానివలె నున్నదనిచె ఇట్లు కార్యనిర్వాహక దురంధరుడును, ధర్మస్వభావముగల వాడును, నగు రాముడు తానుచెప్పినమాటకు వానరప్రభువగు సుగ్రీవునిచేతను, లక్ష్మణునిచేతను పూజింపబడిమఱలనిట్లనియె. నీలుడు బలిష్ఠులగువానరులయొక్క లక్షసైన్యముతోగూడి మార్గముజూచుటకు సైన్యమునకుముందుగబోవునుగాక, అనిచెప్పి నీలునింజూచి ఓసేనాపతివగు నీలుడా! కందమూలఫలములుగలదియును, చల్లని యరణ్యమును జలమును, గలదియును, తేనెతోనిండియుండునట్టిదియును, నగు మార్గమున నతిత్వరితముగ సేనల బిలుచుకొని పొమ్ము. దురాత్ములగు రాక్షసులు త్రోవయందు కందమూలఫలములను, నీళ్లనుజెడిపివేతురు. కావుననీవు అతిజాగ్రతతో రాక్షసులు అట్లుచేయకుండునట్లు సర్వదా గాపాడుచుండుము. మఱియు రాక్షసులు పల్లపు భూములయందును, జలములచే బోగూడదగనిస్థానములయందును, అరణ్యములయందును దాగియుందురు. కావున మనవారలు మధ్యమధ్య మీదికెగిరి మార్గమును లెస్సగ జూడవలయును. మఱియు బలము తక్కువగనుండెడు సైన్యమును కొంత ఇచ్చటనుంచి ఈస్థలమును గాపాడుచుండునట్లు చేయవలయును. మనది మిగుల గొప్పకార్యముగావున నందఱును మిగుల పరాక్రమముగలవారై యుండవలయును. మహాబలశాలులగు వానరులు అనేకవేలొక్కటిగజేరి మహాసముద్రమునవలె మిగుల భయంకరమైయుండు సైన్యము సేనాగ్రభాగమున నడువవలయును. మఱియు పర్వతసమానుడగు గజుడును, మహాబలవంతుడగు గవయుడును, గవాక్షుడును "మదించిన యాబోతులు ఆవులముందు నడుచునట్లు" సేనకుముందు బోవుచుండవలయును. వానరశ్రేష్ఠుడును, ఎగురువారలలో నుత్తముడును నగు ఋషభుడు వానరసైన్యముయొక్క కుడిభాగమును రక్షించుచు బోవలయును. మహాబలవంతుడును, మదగజమువలె నితరులకు నెదిరింప నలవిగానివాడును, నగు, గంధమాదనుడు వానరసైన్యముయొక్క ఎడమభాగమును గాపాడుచు బోవలయును. నేనును "ఇంద్రుడు ఐరావతమునెక్కి పోవునట్లు" ఆంజనేయునిపైనెక్కి సేనలకు ఉత్సాహముగలుగునట్లు పురికొలుపుచు సైన్యమధ్యమున వచ్చుచుండెదను. మఱియు యమునితో సమానుడగు నీలక్ష్మణుడు అంగదునిపైనెక్కి "సార్వభౌమమను ఏనుగుపైనెక్కి పోవునట్టి యక్షేశ్వరుడగు కుబేరునివలె" పోవుచుండవలయును. ఎలుగుబంట్లకు రాజును, మహాబల పరాక్రమశాలియును, నగు జాంబవంతుడును, సుషేణుడును, వేగదర్శియును, ఈముగ్గురును సైన్యముయొక్క వెనుకభాగమును గాపాడుచుండవలయును.

అని ఇట్లు రామచంద్రుడుచెప్పగా అంత వానరోత్తముడును, వానరరాజును, నగు సుగ్రీవుడు మహాబలపరాక్రమశాలులగు వానరుల నందఱిని పయనముకండని యాజ్ఞాపించె. అంత వానరులందఱును మిగుల యుద్ధోత్సాహులై పర్వత శిఖరములనుండియు గుహలయందుండియు బైలువెడలి ఎగిరి గంతులు వేయుచుండిరి. అంత ధర్మాత్ముడగు రామచంద్రుడు వానరేశ్వరుడగు సుగ్రీవునిచేతను, లక్ష్మణునిచేతను, లెస్సగ బూజింపబడినవాడగుచు వానరసేనాసమేతుడై దక్షిణదిక్కునుగూర్చి ప్రయాణంబయ్యె. అట్లు రామచంద్రుడు పైనమైపోవుచుండగ, ఏనుగులతో సమానుగలవారైన వానరులు నూరులుగాను, వేలవేలుగను, లక్షలుగను, కోటులుగను రామునిచుట్టును పరివేష్టించి పోవుచుండిరి. అట్లు రాముని పరివేష్టించిపోవుచుండిన యావానరులందఱును యుద్ధమునకు బోవుటచే మిగుల సంతసించినవారును, మహాబల గర్వితులునునై సుగ్రీవునిచే బరిపాలింపబడినవారై ఎగురుచును, గంతులు వేయుచును, గట్టిగనఱచుచును, ఒరుగులిడుచును, సింహనాదములు చేయుచును, మంచివాసనగల తేనియలను ద్రావుచును, ఫలములను దినుచును, మంచివాసనగలిగి చక్కగ బూచియుండెడు పూగుత్తులతో నొప్పుచుండెడి వృక్షములనుబట్టి యూచుచును, దక్షిణదిక్కునకు బోవుచుండిరి. అప్పుడు ఆవానరులు మహాబలగర్వితులై అందు కొందఱు మఱికొందఱిని పైకెత్తి క్రిందబడవేయుచుండిరి. అట్లు శక్తిలేక క్రిందబడినవారు తమ్ము త్రోసినవారిని యాక్షేపించుచుండిరి. అంత శక్తిమంతులగువారు తమ్ముత్రోసినవారిని మఱల బడద్రోయుచుండిరి. వానరులందఱును తమలో తామిట్లనుకొనుచుండిరి. మనము రావణాసురుని జంపవలయును. రాక్షసులనందఱిని వధింపవలయును. అని ఇట్లు చెప్పుచు రామునిదగ్గర సింహనాదములు చేయుచుండిరి. అపుడు మహాపరాక్రమవంతుడగు ఋషభుడును, నీలుడును, కుముదుడు ఈముగ్గురును అనే

కవానరులతో గూడినవారై సేనకుముందుపోవుచు మార్గమును చక్కగ పరిశోధింపుచుండిరి. శత్రు సంహారకులగు సుగ్రీవుడును, శ్రీరాముడును, లక్ష్మణుడును, మహాబలపరాక్రమశాలులగు ననేక వానరవీరులును, చుట్టును పరివేష్టించియుండ మధ్యమున బోవుచుండిరి. మహాశౌర్యవంతుడగు శతవలి పదికోట్ల వానరవీరులచే పరివేష్టితుడై తానొక్కడే సమస్తవానరసేనను రక్షింపుచుండె. అర్కజ పనస గజ కేసరులు నలువురును, ఒక్కొకడు నూరుకోట్ల వానరవీరులతోగూడి సైన్యముయొక్క తూర్పుభాగమును గాపాడుచుండిరి. సుషేణుడును జాంబవంతుడును ఋక్షసైన్యముచే బరివేష్టితులై సుగ్రీవుడు తమముందర నడువ వానరసేనయొక్క జఘనమును రక్షింపుచుండిరి. వానరసేనానాయకుడును, మిగుల బలపరాక్రమశాలియును, వానరోత్తముడును, ఎగిరిపోవువారలలో శ్రేష్ఠుడును, నగు నీలుడు నలుదిక్కులను పాలింపుచు నావానరసైన్యమును గాపాడుచుండె. మఱియు మహాశౌర్యవంతులగు దధిముఖుడును, ప్రజముడును, గంధుడును, రభసుడును, వీరునలువురును వానరసేనయందంతటను తిరుగుచు వారలను త్వరపరచుచు పోవుచుండిరి. ఈరీతిగ నావానరోత్తములు మహాబల గర్వితులై పోవుచు, కొట్లతోను, పొదలతోను, తీగలతోనుగూడి ప్రకాశించుచుండునదియును, పర్వతోత్తమమును నగు సహ్యపర్వతమును, మార్గమున లెస్సగ జూచియుండెడు తామరకమలములతో నొప్పియుండెడు సరోవరములను, తటాకములను, చక్కగ పుష్పించియుండెడి యరణ్యములను జూచుచు పోవుచుండిరి. మఱియు సముద్రజలమువలె విశాలమైనదియును, మహాభయంకరమైనదియును, మిగులగొప్పదియును, నగు నావానరసేన, అత్యుగ్రశాసనుడగు రామునివలని భయముచే పట్టణములపైగాని యూళ్లపైగాని పడక సముద్రఘోషమువలె మహాధ్వనిజేయుచు పోయిరి. అట్టియెడ మిగుల శూరులగు వానరులందఱును రామునకు ఉత్సాహము గలిగించుటకై యతనిపార్శ్వమున, ప్రేరేపింపబడిన గుఱ్ఱములవలె అతివేగముగ పరుగులెత్తుచుండిరి. అప్పుడు పురుషోత్తములగు నారామలక్ష్మణులు, హనుమదంగదులపై నెక్కియున్నవారగుటచే బృహస్పతి శుక్రులతోగూడుకొనియున్న చంద్రసూర్యులవలెనే యొప్పుచుండిరి. అట్లు ధర్మాత్ముడగు రాముడు, వానరేశ్వరుడగు సుగ్రీవునిచేతను, లక్ష్మణునిచేతను, పూజింపబడి సన్మానింపబడినవాడగుచు సేనాసమేతుడై దక్షిణదిక్కునకు బోవుచుండె. అప్పుడు మిగుల జ్ఞాపకశుద్ధిగలవాడును, మహాప్రజ్ఞావంతుడును, అంగదునిపై గూర్చున్నవాడును. నగు లక్ష్మణుడు, పరిపూర్ణ మనోరథుడై రామునిజూచి మిగులమంగళవాక్యముతో నిట్లనియె. అన్నా! రామచంద్రా! నీవతిశీఘ్రముననే సీతాదేవిని నపహరించిన రావణాసురునిజంపి సీతాదేవిని తీసికొనిన ఫలమనోరథుడవై సర్వసమృద్ధముగనయోధ్యానగరమును జేరగలవు. రామచంద్రా! ఆకసమునందును, భూమియందును మిగుల గొప్పశుభసూచకములేవిగలవో అవన్నియును నీకార్యసిద్ధిని సూచించుచున్నవి. వాయువు మిగుల హితముగను, మంగళకరముగను, మహాసుఖముగను, మిగుల మృదువుగను సేనకెదురుగాకనువెంబడించివీచుచున్నది. మృగములును, పక్షులును, నిండుమధురస్వనముతో గూయుచున్నవి. దిక్కులన్నియు మిగుల ప్రసన్నములై నిర్మలముగనున్నవి. సూర్యుడు మిగుల స్వచ్ఛముగ ప్రకాశించుచున్నాడు. వేదవిదుడును మిగులపరిశుద్ధుడును, భృగు పుత్రుడును, నగు శుక్రుడు మిగుల ప్రసన్నమైన కాంతితో నిన్ననుసరించి ప్రకాశించుచున్నాడు. మఱియుమిగుల పరిశుద్ధులును, కాంతిమంతులును, నగు మహర్షులు ధ్రువునకు ప్రదక్షిణముగ దిరుగుచు మిగులప్రకాశించుచున్నారు. అన్నా! రామా! మహాత్ములగు నిక్ష్వాకువంశమునబుట్టిన మన పితామహులలో నుత్తముడును రాజర్షియును, నగు త్రిశంకమహారాజు, పురోహితుడగు వసిష్ఠునితోగూడి మిగుల నిర్మలముగ ప్రకాశించుచున్నాడు. మఱియు మిగుల పూజ్యులగు నిక్ష్వాకువుల వంశమునందు జన్మించిన మనయొక్క యుత్తమనక్షత్రమగు విశాఖానక్షత్రముగూడ, దుష్టగ్రహములవలన నుపద్రవములేక మిగుల నిర్మలముగ ప్రకాశించుచున్నవి. అదియునుగాక నిరృతిదేవతగాగలదియును, రాక్షసులయొక్క నక్షత్రమును నగు మూలానక్షత్రము, తనకు సమీపముననుండెడు ధూమకేతువుచే గాల్పబడి మిగుల తపింపజేయబడుచున్నది. కావుననిదంతయు రాక్షసుల వినాశమునకు గలిగినదిగాని వేఱుగాదు. శ్లో॥ కాలేకాలగృహీతానాం నక్షత్రంగ్రహపీడితం॥ మృత్యువుచే పట్టుబడిన వారలయొక్క నక్షత్రము వారియొక్క అంత్యకాలమునందు దుష్టగ్రహపీడితమైయుండును. అన్నా! రామచంద్రా! జలములు మిగుల స్వచ్ఛములై మహారుచిగలవియైయున్నవి. అరణ్యములు మంచిపండ్లతోనిండి యొప్పుచున్నవి. సమస్తవృక్షములును ఆయాఋతువులక్రమముచే చక్కగపుష్పించి మంచివాసనలతో నొప్పుచున్నవి. మఱియు వ్యూహములుగా నేర్పఱుపబడిన ఈ వానరసేనలు "తారకాసురునిజంపుటకు జేయబడినయుద్ధమునందు దేవసేనలవలె" మిగులప్రకాశించుచున్నవి. పూజ్యుడవగు నోరాముడా! నీవు ఈశుభసూచకములనన్నిటిని

చూచి మిగుల సంతసించెను. లక్ష్మణుడు పరమసంతుష్టుడై ఈరీతిగ సన్నుతుడగు రాముని యూరడించెను. అట్లుపండ్లునుగోళ్లునే యాయుధములుగాగల ఋక్షవానరులయొక్క మహాసేన భూమినంతయు నావరించి పోవుచుండె. అప్పుడు వానరసేనలయొక్క చేతులచేతను కాళ్లచేతను లేచినదుమ్ము సూర్యుని ప్రకాశమును మాపి మహాభయంకరముగ లోకమునందంతయు నిండెనది. మఱియు మహాభయంకరముగనున్న యావానరసేన మేఘసమూహము ఆకాశమును గప్పినట్లు సమస్త పర్వతములతోను వనములతోనుగూడిన దక్షిణభూమినంతయు పరివేష్టించిపోవుచుండె. అప్పుడువానరసేన సందులేకచాటుచుండుటచే నదులలోనినీళ్ళు అడ్డగింపబడినవై యుండి ఆసేనలుదాటిపోగానే మహాప్రవాహమువచ్చినటు నదులుపొరలిఅనేకామడల దూరము ప్రవహించినవి. ఆవానరసైన్యములు, నిర్మలములగు నీళ్లతోనొప్పుచుండెడి సరోవరములడ్డమైనప్పుడు వాటిలోదిగియావలిగట్టునకెక్కి పోయిరి; చెట్లతో విశేషముగనొప్పుచుండెడి పర్వతములడ్డమైనప్పుడు వాటినితొలిగిదాటిపోయిరి; మిట్టపల్లములులేని సమభూములయందంతటను వ్యాపించిపోయిరి; మిగులఫలవంతములగు నరణ్యములడ్డమైనప్పుడు ఆవృక్షముల క్రిందుగబోయిరి ఈరీతిగనాగొప్ప వానరసేనభూమినంతయునాక్రమించి పోవుచుండినది. మఱియువాయువేగమువంటి వేగముగల యావానరులు రామకార్యార్థము మిగుల పరాక్రమమును అవలంబించిమహాసంతోషమునుబొందిన మనస్సుగలవారై యతివేగముగబోవుచుండిరి.

అట్లుపోవుచున్న యావానరులు తమకుగల బలపరాక్రమసంతోషాతిశయములను నొండొరులకు జూపుకొనుచు, యావన ధర్మమువలనగలిగిన కావరపుచేష్టలు చేయుచుండిరి. అందుకొందఱువానరులు అతివేగముగ బోవుచుండిరి. కొందఱు యెగురుచుండిరి. మఱికొందఱు కిలకిలమని ధ్వనులు చేయుచుండిరి. ఇంకకొందఱు తోకలతో నేలపై గొట్టిరి. కొందఱు పాదములతో నేలనుచరచిరి. మఱికొందఱు చేతులుచాచి వృక్షములను విఱిచిరి. పర్వతములను పగులగొట్టిరి. పర్వతవాసులగు వానరులు కొందఱు పర్వతాగ్రములపైనెక్కి కేకలు వేయుచుండిరి. మఱికొందఱు సింహనాదములు చేయుచుండిరి. కొందఱుతమతొడలవేగముచేత ననేకతీగెలను తెంపివేసిరి. మఱికొందఱు మహాపరాక్రమముచే విజృంభించి తాళ్లతోను, వృక్షములతోను, చెల్లాటలాడుచుండిరి. మిగుల భయంకరాకారులగు నావానరసమూహములు నూఱులునూఱులుగాను వేలవేలుగను కోట్లుకోట్లుగను భూమినంతయు నావరించియుండిరి. మఱియు మిగులగొప్పదియగు నావానరసేన ప్రభుడగు రామునితోగూడినదియును, పరమసంతోషముచే పులకాంకితమైనదియును, సుగ్రీవునిచే జక్కగసంరక్షింపబడినదియునునై అహోరాత్రములు నడుచుచుండినది. వానరులందఱును యుద్ధమునందలి సంతోషముచే అతివేగముతో బోవుచుండిరి. సీతాదేవిని యతివేగముగ విడిపింపవలయునను కోరికతో కొంచముసేపైన నొకచోటనిలువక పోవుచుండిరి. అట్లుపోవుచున్న యావానరులు నానావిధములైన వృక్షముల సమూహములతో గిక్కిరిసియున్న సహ్యపర్వతమును మలయపర్వతమును జేరిరి. అప్పుడు రామచంద్రుడు సహ్యపర్వతమునందును మలయపర్వతమునందునుగల నానావిధములైన యేళ్ళను సెలయేళ్లను జూచుచు పోవుచుండెను. ఆవానరులు మార్గమునందు సంపెంగచెట్లను, బొట్టుగుచెట్లను, మామిడిచెట్లను, అశోకచెట్లను, తెల్లవావిలిచెట్లను, గన్నేరుచెట్లను, వేమిచెట్లను, ఊడుగచెట్లను, కానుగచెట్లను, జువ్విచెట్లను, మఱ్ఱిచెట్లను, తుమ్మికచెట్లను, నేరేడుచెట్లను, ఉసిరికచెట్లను, కదంబచెట్లను జూచుచు బోయిరి. అట్టియెడ మిగుల రమణీయమగు తాళ్లప్రదేశములయందును, అరణ్యములయందునునున్న నానావిధములైన వృక్షములు వాయువేగముచే గదలింపబడినవై యావానరులపై పూలవృష్టిగురిసినవి. మఱియు మంచివాసనగల తేనెతోనిండియుండెడు నరణ్యములయందుండి బైలువెడలినదియును, మంచిగంధమువలె మిగులచల్లనైనదియును, మెల్లగవీచుచున్నదియును, నగుగాలి, అందలి తేనెనాశించియుండెడి తుమ్మెదలయొక్కధ్వనులతో గూడుకొని మిగులమనోహరముగ వీచుచుండినది. పర్వతోత్తమమైన సహ్యపర్వతము విశేషముగ ధాతువులచే నలంకృతమై యుండెనది. వానరులు ఆధాతువులను త్రొక్కుటచే అందుండి లేచినపరాగముగాలిచేనెగిరి వానరసైన్యమునంతయు గప్పెనది. మఱియు మనోహరములైన పర్వతచరియలయందుండు నవియును, చక్కగబూచియున్నవియును, నగు మొగలిచెట్లును, తెల్లవావిలిచెట్లును, మిగుల మనోజ్ఞములైన గురివిందచెట్లును, మాధవీవృక్షములును, దుంపరాష్మచెట్లును, లెస్సగబూచియుండెడు మొల్లచెట్లును, కానుగుచెట్లును, ఇప్పచెట్లును, పొగడవృక్షములును, వేగిసచెట్లును, తుమికిచెట్లును, బొట్టుగచెట్లును, పుష్పించియున్ననాగకేసరవృక్షములును, మామిడిచెట్లును, పాటలీవృక్షములును, చక్కగపుష్పించియున్నకాంచన వృక్షములును, ఖర్జూరపుచెట్లును, మద్దిచెట్లును, ఇనుగుడుచెట్లును, అడవిమల్లెలును, చం

ద్రచెట్లును, బూరుగుచెట్లును, యెఱ్ఱగోరంటచెట్లును, శ్రీతాళవృక్షములును, వేమిచెట్లును, ఉసిరికచెట్లును, కదంబవృక్షములును, నల్లపూలయశోకవృక్షములును, ఉలిమిరిచెట్లును, ఊడుగచెట్లును, మెట్టతామరలును, మెఱయుచున్నవానరులచే మిగులకదిలింపబడినవి. ఆసహ్యపర్వతమునందుచల్లని నీళ్ళతో నొప్పుచున్నవియును, చక్రవాకములచే సంచరింపబడినవియును, నీరుకోళ్ళకునికి పట్టయినవియును, నీరుకాకులకును క్రౌంచపక్షులకును స్థానభూతంబైనవియును, పందులుమొదలగు దుష్టమృగములకు నివాసస్థానంబైనవియును, నగునడబావులును, పల్లపునేలలును, ఎలుగుబంట్లకును, సివంగులకును, సింగములకును, మహాభయంకరములగు పెద్దపులులకును, మిగుల వెఱపుగలిగించునట్టికౄరగజములకును, నివాసమగు వనములును, చక్కగ పూచియున్నకమలములచేతను, చెంగలువలచేతను, తెల్లగలువలచేతను, నల్లగలువలచేతను, నీటియందుబుట్టినపలుదెరంగులగు పువ్వులచేతను మనోజ్ఞములైనజలాశయంబులును, వానరసేనలచేకలత నొందింపబడినవి అప్పుడు ఆసహ్యపర్వతము చరియలయందున్న సమస్త పక్షులును అరచినవి. అంతవానరులు ఆపర్వతమునందున్న సరోవరములయందు స్నానముచేసి దప్పిదీర్చుకొని యొకరిపైనొకరు నీళ్ళుగొట్టుకొనుచుండిరి. అట్లుస్నానముచేసి పర్వతముపైనెక్కి మహామదమునొందినవారై అమృతతుల్యములగు పండ్లను గడ్డలను పువ్వులను భుజించిరి. మఱియు తేనెవలె పింగళవర్ణముగల యావానరులు, అచ్చటచ్చట వ్రేలాడుచున్నవియును, తూమెడు తేనెతో నొప్పుచున్నవియును, నగు తేనెతెట్టెలను, గొట్టి, [illegible] తేనెఁద్రావి పరమ సంతోషముతోబోయిరి. అట్లుబోవునపుడు వానరులు మార్గమున గొప్ప వృక్షములను విరుచుచు, తీగెలను తెంచుచు గొప్పపర్వతములను పగులగొట్టిపిండిజేయుచు పోయిరి. ఆవానరులట్లు తేనెద్రావుటచే మదించి కొందఱుఱుకుచు చెట్లులేనిస్థలమున నడుచుచుండిరి. కొందఱు చెట్లెక్కుచుండిరి. మఱికొందఱు చెట్లెక్కి దుముకుచుండిరి. అట్టియెడ వానరసేనలచే నిండియుండినభూమి "పండినవరిపైరులచే నిండినదానివలెనే" యొప్పియుండెనది. అప్పుడునిడుపైనచేతులు గలవాడును, కమలములవంటికండ్లుగలవాడును, నగురాముడు మహేంద్రపర్వతముచేరి; విశేషముగ చెట్లచే నలంకృతంబైయున్న యామహేంద్రపర్వత శిఖరమును ఎక్కె. దశరథరాజపుత్రుడగు రాముడట్లు మహేంద్రపర్వతశిఖరముపైనెక్కి తాబేళ్లతోను చేపలతోనునిండియుండెడు సముద్రమును జూచె. అప్పుడు ఆవానరసైన్యములును సహ్యపర్వతమును మలయపర్వతమునుదాటి క్రమక్రమముగ మహాభయంకరమగు ధ్వనిగలసముద్రమును చేరంబోయిరి. అంతచూచువారలకు మహాసంతోషమును గలుగజేయువాడును, పురుషోత్తముడును, నగురాముడులక్ష్మణసుగ్రీవులతోడ నాపర్వతముపైనుండిదిగి సముద్రమునుజూచుటకై యతివేగముగ మహాసంతోషముతో సముద్రతీరమునకు బోయె. అట్లు రామచంద్రుడు సముద్రతీరమునకుబోయి మహావేగవంతములగునలలచే గట్టుననున్నతాళ్లపై గొట్టుచున్న యాసముద్రమునుజూచి సుగ్రీవునితో నిట్లనియె.

ఓసుగ్రీవుడా! మనము ఇప్పుడు సముద్రతీరమును జేరితిమి. ఇదివరకేమనము చేసిన యాలోచనను గుఱించి మఱలయిప్పుడు యోచింపవలయును. ఇంకనదులకు భర్తయగు సముద్రమేయగుపడుచున్నదికాని యెంతమాత్రము గట్టు అగుబడుటలేదు. ఏదేనియొకయుపాయములేక యీసముద్రమును దాటుటకు శక్యముగాదు. కావున మనమిచటవిడిసి యీవానరసేనలీసముద్రమును దాటి యవతలిదరిజేరు నుపాయమును ఆలోచింపవలయును. అనిచెప్పి, సీతాపహరణముచే మహావ్యసనపీడితుడై యున్నవాడును మహాబాహుడునునగు రాముడు సముద్రతీరమునందు సేనలను విడియుటనుగుఱించి సుగ్రీవునితో నిట్లనియె. వానరోత్తముడవగు నోసుగ్రీవుడా! మనసైన్యములనన్నిటిని యీసముద్రతీరమునందు విడియుటకు ఆజ్ఞాపింపుము. ఈసముద్రమును దాటనాలోచించుటకు మనకిప్పుడు అవకాశము గలిగినది. ఇందెవ్వరుగాని తమతమసైన్యమునువిడిచి యీవలావలబోగూడదు. మహాశౌర్యవంతులగు వానరులు వెలుపలంతట నుదిమగుదుండవలయును. విరోధులు ప్రఛన్నవేషులై అచ్చటచ్చట దాగియుందురు. వారినిమహాజాగ్రతగ కనుగొనవలయును. అనిరాముడు సుగ్రీవునితో జెప్పె. అట్లు రాముడు చెప్పగవిని సుగ్రీవుడు లక్ష్మణసమేతుడై, నానావిధములైన వృక్షములతోనొప్పియున్న సముద్రతీరమునందు సేనలను విడియజేసె. అట్టియెడ సముద్రతీరమున దిగియున్న మధువర్ణులగు నావానరసేన "రెండవసముద్రమువలెనే యొప్పియుండె. అప్పుడు ఆవానరోత్తములు సముద్రతీరమునందుదిగి సముద్రమునుదాటి యావలిదరిజేరుటకు యత్నించుచుండిరి. ఆవానరసేనలు దిగియునప్పుడుగలిగినధ్వని సముద్రధ్వనినిగూడ నణగద్రొక్కి ప్రకాశించుచుండినది. సుగ్రీవునిచేబాలింపబడుచున్న యాగొప్పవానరసేన, వానరులొక్కవైపునను, కొండముచ్చు లొక్కవైపునను, ఎలుగుబంట్లొక్కవైపునను, మూడువిధములుగ విడిసి రామకార్యమునందాసక్తిగలదియైయుండె. అప్పుడు ఆగొప్పవానర

సేన సముద్రతీరమునవిడిసి, వాయువేగముచే మిగుల నుప్పొంగుచున్న సముద్రమును జూచి మహాసంతోషమునొందిరి. అట్లు సముద్రమునుజూచి సంతసించియంత, మిగుల దూరముననుండుటచే పొందనలవిగాని యావలిగట్టు గలదియును, ఇంతదూరమున్నదని కొలతబెట్టుటకలవిగాని యవతలిగట్టుగలదియును, రాక్షససమూహములచే సేవింపబడినదియును, వరుణునకునికిపట్టైనదియును, మెట్టిజంతువునైనబట్టుకొనజాలినంత భయంకరములగు మొసళ్లచే నొప్పుచున్నదియును, సాయంసంధ్యాసమయమున మహాభయంకరముగనుండునదియును, నురుగుదబ్బలచే నవ్వుచున్నట్లున్నదియును, అలలసమూహములచే నృత్యమాడుచున్నట్లున్నదియును, చంద్రోదయకాలమున మిగుల పొంగునదియును, చంద్రునియొక్క ప్రతిబింబములచే బ్రకాశించుచున్నదియును, మహాభయంకరమగు ప్రళయవాయువువలెనతివేగముగల మొసళ్లతోను, తిమింగలములతోను నిండియున్నదియును, మణులతోనొప్పుచుండెడి పడిగలతోనిగుల ప్రకాశించుచుండెడి మహాసర్పములచే నొప్పుచున్నదియును, మహాజంతువులచే బ్రవేశింప నలవిగానిదియును, నానావిధములైన పర్వతములతో నిండియుండునదియును, యెవ్వరికినిచూర నశక్యంబైనదియును, మార్గము లేనిదియును, మహాలోతు గలదియును, అసురులకు నివాసస్థానంబైనదియును, నగుసముద్రమునుజూచి వానరోత్తములు మహావ్యసనము నొందినవారైరి. అప్పుడు గొప్పగొప్ప యలలు మొసళ్లతోను, మహాసర్పములతోను, గూడుకున్నవియై గాలిచే మిగుల నెగరగొట్టబడి మిగుల నుప్పొంగి మెగురుచుండినవి. అట్టియెడ మిగుల బ్రకాశించుచున్నజలబిందువులుగలదియై అగ్నికణములవలె చూపట్టుచున్నదియును, మహాభయంకరములగు క్రూరసర్పములచే నొప్పుచున్నదియును, అసురులకు నివాసయోగ్యంబైనదియును, మిగుల భయంకరంబైనదియును, పాతాళమువలెనున్నదియునునగు సముద్రము ఆకాశమునకు సమానమైనది గావున నిదియాకాశమనియు నిదిసముద్రమనియు కొంచమైనను భేదములేకయుండినది. మఱియు సముద్రజలమట్లు పొంగిపొంగి యాకాశముతో జేరె. ఆకాశమును సముద్రజలముతో గూడుకున్నదాయె. కావున నక్షత్రములతో నిండియుండు నయ్యాకాశమును రత్నములతో నిండియుండు సముద్రమును ఒకటితోనొకటి సరిపోలి యెంతమాత్రమును భేదములేక చూపట్టుచుండెను. మఱియు మేఘసమూహములతో నిండియున్న యాకాశమునకును అలలపఙ్క్తులతో నిండియున్న సముద్రమునకును యెంతమాత్రము భేదమగుపడినదిగాదు. అప్పుడు సముద్రమునందలి యలలు ఒకటితోనొకటి తాకుటచే యుద్ధమునందలి గొప్పభేరులవలె మహాభయంకరముగ ధ్వనించుచుండినవి. రత్నసమూహములతోను నీళ్లతోను గలసి గాలిచే నెగురగొట్టబడి కోపము నొందినట్లున్నదియును, జలజంతువుల సమూహముతో నిండియున్నదియును, గాలిచే నెగురగొట్టబడిన యలలధ్వనిచే మాటలాడుచున్నట్లున్నదియును, గాలిగొట్టుటచే నల్లకల్లోలముగ నున్నదియునునగు సముద్రమును మహోత్సాహముగల యావానరులుచూచిరి. అప్పుడు ఆవానరులు మహాకల్లోలముగ తిరుగుడునొందియున్న సముద్రమునుజూచి పరమాశ్చర్యమును బొందిరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి నాలుగవ సర్గము గసెను.

(*)

రాముడు సీతాదేవిని తలంచుకొని చింతించుట.

సేనానాయకుడగు నీలుడు మంచిరక్షకుల నేర్పరచి సముద్రపుయొక్క యుత్తరపుగట్టున శాస్త్రోక్తముగ సేనను విడియజేసె. అప్పుడు వానరోత్తములగు మైందద్వివిదులిద్దఱును ఆవానరసేనను రక్షించుటకు నలుప్రక్కలను తిరుగుచు గాచియుండిరి. అట్లు సైన్యమంతయు సముద్రతీరంబున విడిసినపిదప రాముడు తనపార్శ్వమున నున్న లక్ష్మణునిజూచి యిట్లనియె.

శ్లో ॥ శోకశ్చకిలకాలేనగచ్ఛతాహ్యపగచ్ఛతి ॥ తమ్ముడా! లక్ష్మణా! వ్యసనము, కాలముగడవనుగడవను క్షీణించిపోనుగదా? అయినను నాప్రియురాలిని యెడబాయుటచే గలిగిన నావ్యసనము దినములు గడవనుగడవను వృద్ధియగుచున్నది. లక్ష్మణా! నాప్రియురాలు దూరదేశమున నున్నదని నాకెంతమాత్రమును వ్యసనములేదు. మఱియు రాక్షసులచే నపహరింపబడినదనియును నాకు దుఃఖములేదు. ఏలనసగా నేను సీతను మఱలపొందగలను. అయినను యిప్పుడు ఆసీతయొక్క యావనము వృథాగాపోవుచున్నది. అందునగుఱించియే నాకుమిగుల వ్యసనముగ నున్నది అనియిట్లు లక్ష్మణునితో జెప్పి తనలోతానిట్లని వాయుదేవుని గూర్చి చింతించె. ఓవాయుదేవుడా! నీవు నాప్రియురాలుండుస్థలమున సంచరించి యచ్చటనుండు నామనోహరిని తాకి, యచ్చటనుండి మఱలవచ్చి నన్నుతాకుము. మాయిరువురకు దేహస్పర్శనము నీవలన గలుగవలయునేకానియిపుడు వేరువిధముచే గలుగదు. మాకిరువురకును అన్యోన్యముఖావలోకనము మాత్రము నాప్రాణనాయకి ముఖ

ముతోపోలిక గ చంద్రునివలన గలుగవలయును. సమస్తసుఖములనువిడిచి నావెంటనడవికివచ్చిన నాప్రియురాలు రావణాసురునిచే నపరింపబడినపుడు, "అయ్యో నాథుడా!" అనినన్నుగుఱించి అరచినమాట యిప్పుడు నామనసునందుండి "విషముత్రాగినవానికిసమస్తావయవములను దహించునట్లు" నన్నుకాల్చుచున్నది. అయ్యో! నాప్రియురాలినియెడబాయుటయనెడి కట్టెలుగలదియును, ఆమనోహరిని చింతించుటయనెడి మంటలుగలదియును నగు మన్మథాగ్ని రాత్రింబగళ్లును, నాదేహమునుకాల్చుచున్నది. అనియిట్లుచింతించియంతలక్ష్మణునితో నిట్లనియె. లక్ష్మణా! నేను నిన్నువిడిచి సముద్రజలమునందు బడియుండెదను. నేనట్లునీళ్లలోబడియుండుచోని మన్మథుండు నన్నెంతయు కాల్పజాలడు. లక్ష్మణా! నేనును సీతయును మేమిద్దరమును భూమిపైనుండుటచేతనే యింతమాత్రమునైనను యీవిరహవేదనకోర్చి బ్రతికియున్నాను. మఱియు సీత ప్రాణముతో నున్నదని వినుచుండుటచే "నీళ్లుపుష్కలముగనుండెడుచేని సమీపముననుండెడు నీళ్లులేనిచేను ఆనీళ్లుగలచేని తేమచే బ్రతికియుండునట్లు" నేనింతవరకు బ్రతికియున్నాను. తమ్ముడా! లక్ష్మణా! నేనుశత్రువులనుజయించి, సొగసైన పిఱుదులుగలదియును, తామరఱేకులవలె నిడుపులైన నేత్రములుగలదియును, నగుసీతను "అఖండసంపదనువలె" యెప్పుడుపొందగలను. మఱియు మహాసుందరమగు దొండపండువంటి యధరముతో నొప్పుచుండెడి యాసీతయొక్క ముఖపద్మమును కొంచెముపైకి లేవనెత్తి "రోగియగువాడుదివ్యౌషధమును త్రాగునట్లు" ఆసీతయొక్క యధరామృతమును ఎప్పుడు పానము చేయుదును. అయ్యో! సీతనన్నెప్పుడుకౌగలించుకొనునో; ఆసీత నన్నుకౌగలించుకొనగా, మిగుల బలిసినవియును, ఒకటితోనొకటి యొరుసుకొనుచున్నవియునునగు నాసీత స్తనములు గడగడవణకుచు నాదేహమును ఎప్పుడు తాకగలవు? నల్లనికడగంట్లుగల యాసీత రాక్షసులచేజిక్కువడి, నేనునాథుడనై యుండగ అనాథవలె మిగుల పరితపించుచున్నది. అయ్యో! సీతజనకమహారాజుకూతురయ్యును, నాకుప్రియురాలయ్యును, దశరథమహారాజునకు కోడలయ్యును, రాక్షసస్త్రీలనడుమచిక్కి మిగుల దురవస్థపడుచున్నదే కాలగతియేమనవచ్చును. అయ్యో! శరత్కాలమునందు నల్లనిమేఘములను పటాపంచలుగనెగురగొట్టి చంద్రబింబము బైలువెడలునట్లు, సీతయాక్రూరరాక్షసులవద్దనుండి తప్పించుకొని నాయెదుట కెప్పుడురాగలదు? స్వభావముచేతనే మిగులకృశించియుండెడు సీత యిప్పుడు దేశకాలవైపరీత్యముల వలన గలిగిన వ్యసనముచేతను, ఆహారములేకుండుట చేతను, మిగుల నధికముగ కృశించియుండును ఓతమ్ముడా! లక్ష్మణా! నేనెప్పుడు రాక్షసేశ్వరుడగు రావణునియురమ్మున బాణములను గాఢనేసి మఱల సీతనుగైకొని నామనస్సునందలి వ్యసనమును విడిచి సుఖముగనుండగలను. మఱియు మిగుల పవిత్రురాలును, పతివ్రతయును, దేవకన్యతోసమానురాలును, నగు సీత పరమసంతోషముతో గూడినదియై నాకంఠమును తన చేతులతో కౌగలించుకొని యానందబాష్పములు ఎపుడువిడువగలదు. అయ్యో! మహాఘోరమగు నీసీతావియోగవ్యసనమును "నల్లనిమురికివస్త్రమునువలె" ఎప్పుడు విడువగలను. అనియిట్లు రామచంద్రుడు అనేకవిధములుగ విలపించుచుండగానే సూర్యుడు కాంతిహీనుడై అస్తమయమును బొందె. అంతసంధ్యాకాలము ప్రాప్తించె. అట్టియెడ రాముడు లక్ష్మణునిచే నూరడింపబడి, తామరఱేకులవంటి నేత్రములుగల సీతను దలచుచు మహావ్యసనపీడితుడై సంధ్యావందన మాచరింపబోయెను.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి అయిదవ సర్గ ముగిసెను.

(*)

రావణుడు ఆంజనేయుడుచేసిన కార్యమును గుఱించి రాక్షసులతో నాలోచించుట.

అంతనచ్చటలంకయందు రాక్షసేశ్వరుడగు రావణాసురుడు, ఇంద్రునితో సమానుడగు నాంజనేయుడు చేసినమహాఘోరమును భయంకరమునునగు కార్యమునుజూచి సిగ్గుపడికొంచెము తలవంచి రాక్షసులనందరిని జూచి యిట్లనియె.

ఓరాక్షసులారా! వానరమాత్రుడైనయాంజనేయుడు, శత్రువులచేనెదిరింపగూడని లంకానగరమునందు ప్రవేశించి సీతనుజూచిపోయె. మఱియు నయ్యాంజనేయుడు చైత్యప్రాసాదమునుపాడుజేసె. ఉత్తమరాక్షసులనందఱినిజంపి లంకానగరమును మిగుల వ్యాకులమును బొందునట్లుజేసె. ఓరాక్షసులారా! ఇంకమనమేమి చేయవలయును? ఏకార్యమునుజేసినమనకుమేలుగలుగునో దానినిచక్కగా యోచించిచెప్పుడు. దానిని జేసెదను. మీకుశుభములు గలుగుగాక. మిగులబలవంతులగు నోరాక్షసులారా! బుద్ధిమంతులగు పెద్దలు, మంత్రాలోచనమువలననే జయముగలుగునని చెప్పుదురుగదా? కావుననిప్పుడు రామునిగూర్చి యాలోచన జేయవలయునని తలచుచున్నాను. రాక్షసులారా! లోకమునందు, ఉత్తమమధ్యమఅధమములని పురుషులు మూడువిధములుగనున్నారు. వారియొక్కభేదముల నెఱుగుట మిగుల

దుస్తరము. కావున వారిగుణదోషములను వర్ణించి చెప్పెదనువినుము. ఎవ్వడు, మంతనమునందు మిగుల సమర్థులును, తనమేలుగోరువారును, నగు మంత్రులతోగాని, సుఖదుఃఖములయందు తమతోసమానముగనెంచు స్నేహితులతోగాని, తనమేలుగోరునట్టి బంధువులతోగాని చక్కగ నాలోచించి తనశక్తికొలదిని కార్యములుచేయుచు దైవముపై భారముమోపి యుండునోవాడు ఉత్తమపురుషుడందురు. ఎవ్వడు, స్వబుద్ధిచేత చక్కగ నాలోచించి ధర్మబుద్ధిగలవాడై కార్యములుజేయుచు దైవమును నమ్మియుండునోవాడు ఉత్తమపురుషుడందురు.

ఎవ్వడు, చక్కగనాలోచింపకయు, గుణదోషములను నిశ్చయింపకయు, దైవమును నమ్మక అహంభావుడై కార్యమునారంభించి యుపేక్షచేయునో వాడు అధముడందురు. ఎట్లుపురుషులుత్తమ మధ్యమాధమములని మూడువిధములో అట్లేమంతనములును మూడు విధములుగ నున్నవి. అవెట్లనిన చెప్పెదవినుడు. ఆలోచించుటయందు మంత్రులందఱు నైకమత్యముగలిగియుండి శాస్త్రమునందుచెప్పబడినరీతిని మిగులనాశక్తితో నాలోచింతురో యట్టిమంత్రము ఉత్తమ మంత్రంబనిచెప్పుదురు. మఱియునాలోచించుటయందు మంత్రులందఱు పరస్పరయభిప్రాయములుగలవారై యుండి కార్యావసానమునందు నేకాభిప్రాయము గలవారగుదురో అట్టి మంత్రముమధ్యమమంత్ర బని చెప్పుదురు. ఏమంత్రమునందు మంత్రులందఱు భిన్నాభిప్రాయములుగలవారై తమతమ యభిప్రాయములను విడువక వాదింపుచు ఐకమత్యమునుబొందకయుందురో అట్టి మంత్రము అధమమంత్రంబని చెప్పుదురు. కావున మిగుల బుద్ధిమంతులగు మీరు చక్కగనాలోచించి చేయదగిన కార్యమునునిశ్చయింపవలయును. ఇదేనాకు గావలసిన కార్యము. రాముడు మహాపరాక్రమశాలులగు వానరవీరులనేక వేలమందినిగూర్చుకొని మనలనెదిరించుటకొఱకు లంకానగరమునకు వచ్చును. మఱియు రాముడు తమ్మునితో గూడినవాడై వానరసైన్యములను వెంటబెట్టుకొనివచ్చి తనశక్తిచే సముద్రమును సుఖముగదాటగలడు. ఇందుకొంతమాత్రము సందియములేదు. ఒకవేళ రాముడు తనపరాక్రమముచేత సముద్రమును యెండించినను యెండించును. లేకయింకేకార్యమునైనను జేసినను జేసును. అనగా నెవ్విధముచేతనైనను లంకానగరమును బ్రవేశింపగలడు. కావుననేను జెప్పినట్లు రాముడు వానరసేనలతో లంకానగరము బ్రవేశింపగా వారలకును నాకును బద్ధవైరముగలుగును. అప్పుడు నాపట్టణమును సైన్యమును చక్కగ గాపాడుకొను ఉపాయమును ఆలోచింపుడు.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి ఆరవ సర్గముగిసెను.

రాక్షసులు రావణాసురునితో రాముని జయింపగలవని చెప్పుట.

అని ఇట్లు రావణాసురుడుచెప్పగవిని, నీతిబాహ్యులును, వివేకహీనులును, మహాబలులును, నగు రాక్షసులందఱును శత్రుబలంబుదెలియక, రాక్షసేశ్వరుడగు రావణాసురునిజూచి చేమోడ్పుగీలించి రావణాసురునితో నిట్లనిచెప్పిరి. రాక్షసేశ్వరుడవగు నో రావణాసురుడా! గదలు, యీటెలు, బల్లెములు, ఖడ్గములు, శూలములు, అడ్డగత్తులు మొదలగువానితో నొప్పుచుండెడి గొప్పసైన్యము మనకుండగ నీవేలచింతించెదవు? రావణాసురుడా! నీవుపాతాళలోకమందుండు భోగవతీపురమునకు బోయి యుద్ధమునందు పన్నగులను జయించితివి. కైలాసపర్వత శిఖరమునను న్నవాడును, బహుమంది యక్షులచే బరివేష్టితుడైనవాడును, నగు కుబేరుడు మహాయుద్ధమున నీకోడిపోయె. ఓమహాప్రభువా! రాక్షసేశ్వరా! రావణాసురుడా! ఈశ్వరునికిస్నేహితుడును మిగుల బ్రసిద్ధిబొందినవాడును, మహాబలుడును లోకపాలుడును, నగు కుబేరునియుద్ధమున జయించితివి. మఱియు నీవనేకమంది యక్షులనుజంపి మిగులక్షోభనుగావించి వారినిబద్ధులగజేసి కైలాసపర్వతశిఖరమునుండి ఈపుష్పకవిమానమును దెచ్చితివి. రాక్షసోత్తమా! రావణాసురుడా! దానవేశ్వరుడగు మయుడు నీవలనిభయమునకోడి నీతోస్నేహముజేయగోరి తనకూతురగు మండోదరిని నీకుభార్యగానిచ్చె. మఱియు మిగులబలపరాక్రమముచే గర్వితుడును, ఎవ్వరికిగాని నజేయుడును, కుంభీనసకుప్రియుడును, నగు మధువనుదానవనాథుని యుద్ధమున జయించి నీకులోపరచుకొంటివి. మహాబాహుడా! రావణాసురుడా! నీవురసాతలమునకుబోయి వాసుకి, తక్షకుడు, శంఖుడు, జటుడుఅనునాగరాజులను జయించివారినిలోపరుచుకొంటివి. మఱియు వినాశములేనివారును, మహాబలపరాక్రమశాలులును, యుద్ధవీరులును, బ్రహ్మదేవునిగూర్చితపంబాచరించి వరములను బొందియున్నవారును, నగు కాలకేయులను రాక్షసులు తమశక్తికొలదిని యొకసంవత్సరమునీతో యుద్ధముచేసి తుదకు పోరాడలేక నీయధీనమును బొందిరి. శత్రుసంహారకుడా! రావణాసురా! ఓప్రభువా! నీవు ఆకాలకేయులతోడి సఖ్యముచేసి వారివలననానావిధమాయలను అభ్యసించితివి. మఱియు మహాబలప

రాక్రమశాలులును, యుద్ధవీరులును, చతురంగబల సమేతులును నగు వరుణపుత్రులు నీచేయుద్ధమున జయింపబడిరి. రాక్షసేశ్వరా! రావణాసురుడా. నీవు, యమదండమేగొప్పమొసలిగాగలదియును, శాల్మల్యాయుధములను వృక్షములచే నలంకరింపబడినదియును, కాలపాశమే గొప్పయలలుగాగలదియును, యమకింకరులను సర్పములచేనొప్పచున్నదియును, నగు యమసైన్యమను మహాసముద్రమునుజొచ్చియుద్ధమునందు యమునిబారద్రోలి మహాజయమువడసితివి. అదియునుగాక నీవు యమునితోజేసినయుద్ధమునుజూచిసమస్తలోకములు గడగడ వణకినవి. మఱియు దేవేంద్రునితోసమానమైన పరాక్రమముగలవారును, యుద్ధవీరులును, నగు క్షత్రియులు అనేకులు గొప్పవృక్షములవలె భూమియందంతయునిండియుండిరి. రావణాసురుడా! రాముడు పరాక్రమముచేతను, గుణములచేతను, యుద్ధమునందలి యుత్సాహముచేతను, వారలకంతమాత్రము సమానుడుగాడు. అట్టి అజేయులైన రాజులను నీవుజయించియున్నావు. కావున రాముడనగా నీకెంతమాత్రము. రాజాధిరాజా! రావణాసురుడా! నీవు ఊరకనేయుండుము. నీవుశ్రమపడవలదు మహాబలుడగు నీ ఇంద్రజిత్తు ఒకడే ఆవానరులనందఱిని నశింపజేయగలడు. రాక్షసేశ్వరా! రావణాసురుడా! ఈ ఇంద్రజిత్తు ఈశ్వరునిగురించి యొకమహాయాగముజేసి లోకమునందెవ్వరికిని సాధ్యముగాని వరములనుపొందియున్నాడు. మఱియు నీ ఇంద్రజిత్తు, శక్తితోమరాదియాయుధములే మత్స్యములుగాగలదియును, వెడచల్లబడినప్రేగులే పాచిగాగలదియును, ఏనుగులను తాబేళ్లచేనిండినదియును, గుఱ్ఱములను కప్పలతోనిండియొప్పుచున్నదియును, ఏకాదశరుద్రులును, ద్వాదశాదిత్యులును, నను గొప్పమొసళ్లుగలదియును, సప్తవాయువులును అష్టవసువులును, నను గొప్పసర్పములుగలదియును, రథగజతురగములే జలసమూహములుగాగలదియును, కాల్బలములేయిసుకదిబ్బలుగాగలదియును మిగుల గొప్పసముద్రమువలెనున్నదియును, నగు దేవసేనయందు ప్రవేశించి దానినంతయుతారుమారుచేసి దేవేంద్రునిబట్టికట్టి లంకకుగొనివచ్చెనుమహాశూరుడుగదా! నీవు రాక్షసేశ్వరుడా! రావణాసురుడా! బ్రహ్మదేవుడువచ్చి నీకుజెప్పుటచేత ఇంద్రునివిడిచిపుచ్చితివి, అంతశంబరాసురవృత్రాసురులను జంపినశూరుడగు ఇంద్రుడు సమస్తదేవతలచే సేవింపబడినవాడగుచు స్వర్గమునకుబోయె. కావున నట్టిమహాబల పరాక్రమశాలియగునీకొడుకు ఇంద్రజిత్తునుబంపుము. నిమిషమాత్రములోన రాముని సమస్తవానరసేనలతోగూడ చంపివైచును నీచుడగు నయ్యాంజనేయునివలన అదరిపాటునగలిగినయీపదనుగురించి మనస్సునందు నీవెంతమాత్రము చింతింపవలదు. నీవురాముని సులభముగజంపగలవు.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి యేడవ సర్గము గిసెను.

(*)

—{ ప్రహస్తుడు రావణునితో తానుయుద్ధమునకబోయి రాముని జంపెదనని చెప్పుట. }—

అంత మహాశౌర్యవంతుడును, నీలమేఘమువంటి దేహచ్ఛాయగలవాడును, సేనానాయకుడును నగు ప్రహస్తుడు రావణాసురునిజూచి చేమోడ్చుగేలించి ఇట్లనియె. రాక్షసేశ్వరుడా! రావణాసురుడా! దేవతలుగాని, దానవులుగాని, గంధర్వులుగాని, పిశాచములునుగాని, పక్షులుగాని, పన్నగులుగాని, యుద్ధరంగమున నిన్నెదిరింపజాలరు. ఇంక వానరులు నిన్నెదిరింప సమర్థులుగారని చెప్పనేల. మనలనెవ్వరు యెదిరింపజాలరను నమ్మకముతో మత్తులమైయుండుటచేత, ఆంజనేయుడు మనలను వంచించి ఇంతకార్యముచేసెనుగాని లేనిచో నేను బ్రతికియుండగ నావానరుడు ఇచటనుండి ప్రాణములతో నెంతమాత్రము బోజాలడు. ఓమహారాజా! నీవిపుడు నాకాజ్ఞ నిమ్ము. ఇచ్చితివేని చతుస్సముద్రముద్రితమగు నీభూమండలమునగల పర్వతములయందును, అడవులయందును, మహారణ్యములయందును, గలవానరులనందరినిజంపి భూలోకమునందెచ్చటను వానరులులేకుండునట్లు చేసెదను రావణాసురుడా! నేనులంకానగరమును రక్షించెదను. నీవుచేసిన యపరాధమునకు వానరులెంతమాత్రము నీకు దుఃఖము గలుగ జేయజాలరు. అనిప్రహస్తుడుచెప్పె. అంత దుర్ముఖుడను రాక్షసుడుమిగులకోపోద్దీపితుడై రావణాసురునిజూచి ఇట్లనియె. ఓరాక్షసేశ్వరుడా! మహారాజా! మనకుగలిగిన యవమానముక్షమింపవగనదికాదు. కోతియగు నాంజనేయుడువచ్చి లంకానగరమును, అంతఃపురమును పాడుచేసి శ్రీమంతుడవును రాక్షసేశ్వరుడవును నగు నీకుగావించిన యవమానము యెంతమాత్రము క్షమింపదగినదికాదు. కావున నేనొక్కడనేయీక్షణమునబోయి వానరులందఱును మహాభయంకరమగు సముద్రములో దాగినగాని ఆకాశమున కెగిరినగాని, పాతాళమునందుజొచ్చినగాని, వారినిచంపివచ్చెదను. అనిదుర్ముఖుడుచెప్పె.

అంత మహాబలవంతుడగు వజ్రదంష్ట్రుడు మిగులకోపమునుబొంది, మహాభయంకరమైనదియును, మాంసముచేతను, నెత్తురుచేతను, పూయబడినదియును, నగు ఇనుపగు

దియను చేతబట్టుకొని ఇట్లనియె. లక్ష్మణ సుగ్రీవసమేతుడును, మిగుల దుర్ధర్షుడును, నగు రాముడుండగ మిగులకుత్సితుడును, తప్పుచేసిన యామదానితో సమానుడును, నగు నాంజనేయునితో మీకేమి పనియున్నది. కావుననిప్పుడు నే నొక్కరుడనేపోయి లక్ష్మణ సుగ్రీవులతోడ రాముని ఈ ఇనుపగుదియచేజంపి వానరసేననంతయు పాడుచేసివచ్చెదను. రాక్షసేశ్వరుడా! రావణుడా! నేనింకొక విశేషముచెప్పెదను. ప్రీతిగలదేని వినుము. ఏమరుపాటులేకయుండి యుపాయముచేతనే శత్రువులను జయింపవలయును. కావున కామరూపులును, మహాబలపరాక్రమశాలులును, భయంకరాకారులును, నగు రాక్షసులు మనుష్యశరీరములను ధరించి వేలవేలుగ నా రామునియొద్దకుపోయి యెంతమాత్రమును తొట్రుపాటులేక రామునితో "మేము నీతమ్ముడగు భరతుడు పంపగావచ్చినాము. ఆభరతుడును సేనలంబిలుచుకొని వెనుకవచ్చుచున్నాడు" అనిచెప్పవలయును. అంత మేమతివేగముగ శూలశక్తిగదలను, ధనుర్బాణములనుధరించి యిచ్చటనుండి యతిత్వరితముగ నచటికిబోయి, ఆకాశమున గుంపులుగుంపులుగాచేరి, ఆవానరసేనపై శిలావృష్టియు శస్త్రవృష్టియుగురిపించి వారిని యమలోకమునకుబంపెదము. అంత రామలక్ష్మణులిద్దరు సంకటమునుబొంది అవశ్యముగ ప్రాణములు విడుతురు. అనివజ్రదంష్ట్రుడు చెప్పె అంత మహాబలపరాక్రమశాలియును, యుద్ధవీరుడును, కుంభకర్ణుని కుమారుడును, నగు నికుంభుడు పరమకుపితుడై లోకభీకరుడగు రావణునితోనిట్లనియె.

ఓ మహారాజా! తండ్రీ! రావణాసురుడా! వీరందఱు నుసితోగూడ నిచ్చటనేయుందురుగాక నేనొక్కరుడనేపోయి రామలక్ష్మణ సుగ్రీవులను, ఆంజనేయుని తక్కిన సమస్త వానరసేనలను చంపివచ్చెదను అనిచెప్పె. అంతపర్వతాకారుడగు వజ్రహనుడను రాక్షసుడు మిగుల కోపోద్దీపితుడై నాలుకతో నోరునాకుకొనుచు యిట్లనియె. మీరుమిగుల నిర్భయముగ మీమీకార్యములను స్వేచ్ఛగా జేసికొనుచుండుడు. నేనొక్కరుడనేపోయి యావానరులనందఱిని భక్షించివచ్చెదను. మీరందఱును యెంతమాత్రముచింతలేక నెమ్మదితో మద్యమును ద్రాగుచు, ఆడుచు, పాడుచు, నుండుడు. నేనొక్కరుడనేపోయి లక్ష్మణుని, సుగ్రీవుని, అంగదుని, ఆంజనేయుని, రణపండితుడగు రాముని, జంపివచ్చెదను. అని వజ్రహనుడు చెప్పె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి యెనిమిదవ సర్గ ముగిసెను.

విభీషణుడు రావణాసురునకు సీతను రామునకిమ్మని బోధించుట.

అంత నికుంభుడును, రభసుడును, మహాబలుడగు సూర్యశత్రుడును, సుప్తఘ్నుడును, యజ్ఞవాహుడును, మహాపార్శ్వుడును, మహోదరుడును, దుర్జయుండగు నగ్నికేతుడును, రశ్మికేతుడును, మహాబలపరాక్రమ శాలియును, రావణాసురునికుమారుడును, నగు యింద్రజిత్తును, ప్రహస్తుడును, విరూపాక్షుడును, యూపాక్షుడును, మహాబలుడగు వజ్రదంష్ట్రుడును, ధూమ్రాక్షుడును, అతికాయుడును, దుర్ముఖుడును, మఱియు ననేకరాక్షసులును, ఇనుపగుదియలను, అడ్డకత్తులను, ఈటెలను, బల్లెములను, శక్తులను, శూలములను, గొడ్డండ్రను, బాణసమేతములగు ధనువులను, మిగుల విశాలములై కఱుకైన కత్తులను, ధరించి, పరమకుపితులై చటాలునలేచి మహాతేజమున వెలుగుచు రావణాసురునిజూచి యిట్లనిరి రాక్షసేశ్వరుడా! మహారాజా! రావణాసురుడా! మేమిప్పుడేపోయి రామలక్ష్మణసమేతుడగు సుగ్రీవుని, లంకానగరమును పాడుజేసినవాడును, పరమనీచుడును, నగు నాంజనేయుని జంపివచ్చెదము. అనిచెప్పగవిని విభీషణుడు, ఆయుధధారులై ప్రయాణసన్నద్ధులైయున్న యారాక్షసులనందఱిని నివారించివారిని మరల గూర్చుండబెట్టి చేతులను ముకుళించుకొని శిరము నందిడుకొని యిట్లనిచెప్పె

నాయనా! సామదానభేదములను మూడుపాయములచేసాధ్యముగాని కార్యమునకు దండోపాయము ప్రయోగింపవలయునని పెద్దలగుపండితులు చెప్పుదురు. మఱియు ప్రమత్తులైయుండువారియందును, శత్రువులచే నాక్రమింపబడినవారలయందును, దైవోపహతులగు వారలయందును, దండోపాయముశాస్త్రోక్తముగ బ్రయోగింపబడునేని యదిసిద్ధించును. ఓరాక్షసులారా! రాముడట్టివాడుగాడు. అతడు ప్రమత్తుడుగాడు. ఎవ్వరికి జయింపనలవియైనవాడుగాడు. మహాబలవంతుడు జయింపబడినరోషముగలవాడు. ఎదిరింపనలవిగానివాడు. కావుననట్టి రాముని మీరేట్లు తిరస్కరింపగోరుచున్నారు. మఱియు నాంజనేయుడు మహాభయంకరమగు సముద్రమునుదాటి యెవ్వరికినిచేయనలవిగానికార్యమును జేసెను. ఇట్టికార్యమెవ్వనికిగాని తలంపునకైనవచ్చునా? రాక్షసులారా! శత్రువుయొక్క బలపరాక్రమములెంతమాత్రము యెన్ననలవిగానివి. కావునమీరు సాహసించి పరిభవముచేయ నెత్నింపరాదు. ఇదియునుగాక రావణాసురుడు మహాపరాక్రమశాలియగు రాముని భార్యను జనస్థానమునుండి యపహరించితెచ్చె. మీరో

కవేళ ఆరాముడు ఖరదూషణాదుల జంపుటచే రావణాసురున కపరాధముగాఁ దోఁచినాఁడని చెప్పెదరేమో. రాముడు వారినూరక చంపినవాఁడు గాఁడు. అతనిపైకి నీదుర్మార్గుఁడగు ఖరుఁడు యుద్ధమునకుఁ బోఁగా తన్ను రక్షించుకొనుటకు వానినిఁ జంపెను. ఎవరుగాని తమశక్తి కొలఁదిని ప్రాణములను రక్షించుకొనవలయును గదా. కావున నా రామునియందేమి దోషమున్నది. అన్నా! రావణాసురుఁడా! శ్లో॥ అయశస్యమనాయుష్యం పరదారాభిమర్శనం। అర్థక్షయకరం ఘోరం పాపస్య చ పునర్భవం॥ పరులభార్యలనంటుటచేత నకీర్తి గలుగును; ఆయుక్షీణమగును; ధనము నశించును; మహాఘోరము ప్రాప్తించును. మిగుల పాపము గలుగును. ఈకారణముచేత సీతాదేవివలన మనకు మహాభయము సంభవించును. కావున సీతను మరల రామునికియ్యవలయును. కలహము గలిగించునట్టి కార్యము చేసి యేమి ప్రయోజనము? మహాపరాక్రమశాలియును, ధర్మము దప్పక నడుచువాఁడును, నగు రామునితో నిరర్థకముగ వైరము బెట్టుకొనుట మనకు యుచితము గాదు. కావున రామునకు సీతనివ్వవలయును. మఱియు యేనుగులతోను గుఱ్ఱములతోను నొప్పుచున్నదియును, సమస్తములగు రత్నములతో నిండినదియును, నగు నీలంకానగరమును బ్రవేశించి, రాముడు తనబాణపరంపరలచే నీలంకను నాశము చేయకమునుపే సీతాదేవిని ఆరామునకు సమర్పింపవలయును. నామాట విను. మహాభయంకరమైనదియును మిగుల గొప్పదియును, యెదిరింపనలవిగానిదియును, నగు వానరసేన మనలంకానగరమును ముట్టడి వేయుటకు మునుపే సీతాదేవిని రామునకియ్యవలయును. మఱియు రాముని ప్రియభార్య నతనికివ్వమేని మనలంకానగరము నిశ్చయముగ నాశమొందును. శూరులగు రాక్షసులందఱు నశింతురు. అన్నా! నీవు నాకు ప్రియబంధువగుటవలన నేనిట్లు నిన్ను వేడుకొనుచున్నాను. నామాటవిని నేను చెప్పినట్లు చేయుము. నేను నీకు హితమును యథార్థమును, నగు మాట చెప్పుచున్నాను. కావున రామునకు సీతనిచ్చి వేయుము. నీవు సీతను యివ్వవేని, ముందు, నిన్ను జంపుటకు రాజకొమారుఁడగు రాముఁడు, శరత్కాలమునందలి సూర్యకిరణములతో సమానములైనవియును, మిగుల దృఢమైనవియును, అమోఘములైనవియును, నగు బాణములను బ్రయోగించును. కావున సీతాదేవినియిచ్చివేయుము. రావణాసురుఁడా! శ్లో॥ త్యజస్వకోపం సుఖధర్మనాశనం। భజస్వధర్మం రతికీర్తివర్ధనం॥ సుఖమును, ధర్మమును నశింపఁజేయునట్టి కోపమును విడువుము. సంతోషమును కీర్తిని వృద్ధి జేయునట్టిదియగు ధర్మమును అవలంబింపుము. అని విభీషణుఁడు రావణాసురునితో జెప్పె. అంత మూర్త్యుపసమింగ రాక్షసేశ్వరుఁడగు రావణాసురుఁడు విభీషణుఁడు చెప్పినమాటను విని, ఆసభయందుండిన రాక్షసుల నందఱిని పొమ్మని సెలవిచ్చి తానునుయింటికి వెళ్లె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి తొమ్మిదవ సర్గము గిసెను.

విభీషణుఁడు అంతఃపురమునకుఁ బోయి రావణునకు బోధించుట.

అంత మఱునాఁడు ఉదయమున, మహాశౌర్యవంతుఁడును, మిగుల కాంతిమంతుఁడును, నగు విభీషణుఁడు, రావణాసురునకు నీతిచెప్పుటయను భయంకరమైన కార్యమును చేయఁబూని, పర్వతశిఖరముతో సమానమైనదియును, మిగుల నత్యున్నతంబై పర్వతశిఖరము వలెనేయున్నదియును, చక్కఁగను విభజనగను నేర్పఱుపబడినతొట్టికట్లు గలదియును, విద్వాంసులచే నిండినదియును, మిగుల బుద్ధిమంతులును స్వామియందమితభక్తిగలవారును. స్వామికిష్టమైనకార్యములు చేయుటయందు మిగుల సమర్థులును, నగు ప్రధానులకుని క్షిప్తమునదియును, చక్కఁగ రక్షింపబడినదియును, మదపుటేనుగులయొక్క నిట్టూర్పులచేత నుడివడుచున్న గాలితో నొప్పుచున్నదియును, శంఖములయొక్క ధ్వనులచే మిగుల ధ్వనింపఁజేయబడుచున్నదియును, వాద్యధ్వనులచే బ్రతిధ్వని జేయబడుచున్నదియును, స్త్రీజనసమూహముచే గ్రిక్కిరిసియున్నదియును, కలకలధ్వనులతో నొప్పుచున్న రాజమార్గముగలదియును, పుటముదీరిన బంగారముచే జేయబడిన మదపుటేనుగులతో నొప్పుచున్నదియును, శ్రేష్ఠములైన యాభరణములచే నలంకృతంబైనదియును, గంధర్వపట్టణము వలెనున్నదియును, సమస్త సంపదతోఁ గూడి దేవనగరమువలెనున్నదియును, సమస్తమణులతో నిండినదై నాగలోకమువలెనున్నదియును, రాక్షసేశ్వరుఁడును, తనకన్నయును, నగు రావణాసురుని యంతఃపురమును, తనదేహకాంతియే కిరణములుగఁ గలవాఁడగుచు సూర్యుఁడు ఆకాశమును ప్రవేశించునట్లు, ప్రవేశించె. మహాతేజుఁడగు విభీషణుఁడట్లు రావణాసురుని యంతఃపురము బ్రవేశించి పోవుచు తనయన్నకు జయముగలుగుటకొఱకు, వేదవేత్తలగు బ్రాహ్మణులు చెప్పుచుండిన పుణ్యాహమంత్రముల ధ్వనులను వినెను. మఱియు పెరుగుపాత్రలచేతను, నేతిపాత్రలచేతను, పూలచేతను, అక్షతులచేతను పూజింపబడినవారును, మంత్రవేత్తలును వేదవేత్తలును, నగువారును, నగు బ్రాహ్మణులను మహాబలుఁడగు విభీషణుఁడు చూచె. అంతమహా

బాహుడగు విభీషణుడు రాక్షసులచే పూజింపబడిన వాడై, లోనికింబోయి, తనకాంతిచే మిగుల ప్రకాశించుచు సింహాసనమునగూర్చున్నవాడును, కుబేరునితమ్ముడును, నగు రావణాసురునిజూచి నమస్కారము చేసె.

అట్లునమస్కరించి ఆచారమార్గముల నెఱిగిన విభీషణుడు రాజసత్కారముచేసి నిలిచినతోడనే రాక్షసేశ్వరుడగు రావణాసురుడు నేత్రసంజ్ఞచే నొకబంగారు పీఠమునుజూపె. అంతవిభీషణుడు దానిపైగూర్చుండియుండె. అట్లుగూర్చుండియుండి మంత్రులుతప్ప తక్కినజనులందఱుపోగానే, మంత్రులయెదుట మహాపరాక్రమశాలియగు రావణాసురునితో, మిగులహితమైనదియును, అనేకహేతువులచే నిశ్చయింపబడినదియును, యుక్తియుక్తమునునగు మాటనుచెప్పె. అట్లామాటచెప్పుటకుమునుపే, దేశకాలములచక్కగనెఱిగి యేదేశమున నేకాలమున నేకార్యము చేయవలయునో దానినిచెప్పువాడును, లోకమునందలిమంచిచెడుగులను చక్కగ దెలిసినవాడును, నగు విభీషణుడు క్రమముగ అన్నను ప్రసన్నునిగజేసికొని, మెల్లమెల్లగ నతనికిట్లనియె.

అన్నా! రావణాసురుడా! సీతాదేవిని మననగరమునకుదెచ్చినది మొదలు అమంగళకరములగు నిమిత్తములనేకములు గాన్పించుచున్నవి. అగ్నిహోత్రము సమంత్రకముగ వ్రేల్వబడినదయ్యును, చక్కగ ప్రజ్వలింపక, మిగులదట్టమైన పొగతోగూడి రవలెగియుచు లెస్సగ వృద్ధిపొందుటలేదు. అగ్నిహోత్రగృహములయందును, అగ్నిగుండములయందును, వేదాధ్యయనస్థలములయందును, పాములగుపడుచున్నవి. హవిస్సునకు చీమలెక్కుచున్నవి. ఆవులపొదుగులయందు పాలెండిపోవుచున్నవి. మదపుటేనుగులు మదముడిగిపోవుచున్నవి. గుఱ్ఱములు మిగుల దీనములుగ నఱచుచున్నవి. మఱియు సమస్తజంతువులును ఆహారను దినుటలేదు. అన్నా! రాక్షసేశ్వరుడా! రావణాసురుడా! మనగాడిదెలును, ఒంటెలును, కంచరగాడిదెలును, రోమములువీడి కన్నీళ్ళుగార రోదనముచేయుచున్నవి. పలువిధములచికిత్సచేయబడినవయ్యును స్వభావస్థితికి రాకయున్నవి. మిగుల క్రూరవాయసములు గుంపులుగూడి యఱచుచు మనపురమందంతటను సంచరించుచున్నవి. మఱియు విమానశిఖరములయందు గుంపులుగుంపులుగా గూర్చుండియున్నవి. ఓమహారాజా! అన్నా! రావణాసురుడా! గద్దలు గుంపులుగూడి మనపట్టణమునకుమీదుగ నిలిచియున్నవి. రెండుసంధ్యలయందును నక్కలు మనపట్టణసమీపమునకు వచ్చి మిగుల నమంగళముగ నఱచుచున్నవి. మఱియు మాంసము దినెడికుక్కలు మొదలగు మృగములు గుంపులుగుంపులుగ గూడి పిడుగుధ్వనివంటి మహాభయంకరమైన ధ్వనితో మనపట్టణ ద్వారములయందు గూయుచున్నవి. ఇట్లుసమస్తకార్యములు జరుగుచున్నవి. కావునదీనికిప్రాయశ్చిత్తముగ సీతాదేవిని రామునకిచ్చుట యుచితమని నాకు తోచుచున్నది. రాజాధిరాజా! రావణాసురుడా! నేను అజ్ఞానమువలననో, లోభమువలననోయీమాటచెప్పితిని. కావున నీవు నాయందు దోషమును దలపకుము. ఈదుశ్శకునదోషములు సమస్తరాక్షసులకును, రాక్షసస్త్రీలకును, అంతఃపురస్త్రీలకును, మనపట్టణముననుండెడు సమస్తజనములకును గాన్పించుచున్నవి. మంత్రులందఱును నీకుభయపడి యీవిషయమును నీతోజెప్పకున్నారు. నేనుతమ్ముడనాటచే చూచినదివిన్నదిఅంతయు నీకవశ్యముగ చెప్పవలయును. కావున నేజెప్పితిని. ఇంకనీవున్యాయప్రకారముగ నాలోచించికార్యమును నిశ్చయించి నీయిష్టము చొప్పున చేయుము. అని, అన్నయును, రాక్షసోత్తముడును, నగు రావణాసురునితో మంత్రి మధ్యమునతమ్ముడగు విభీషణుడిట్లు హితవాక్యములుచెప్పె. అంతమిగుల హితమైనదియును, అధికయర్థముగలదియును, మహామృదువైనదియును, హేతుసహితమైనదియును, భూతభవిష్యద్వర్తమానములయందును మిగులమేలుగలిగించునదియును, నగు నామాటవిని రావణాసురుడు మిగుల కోపోద్దీపితుడై తనపట్టువిడువక యిట్లనిబదులుచెప్పె. నాకు దేనివలనను భయములేదు. రామునకెంతమాత్రమును సీతను యిచ్చుటలేదు. దేవేంద్రునితోగూడ సమస్తదేవతలు రామునికిసహాయులైవచ్చినను, రాముడెంతమాత్రము నాయెదుట నిలువజాలడు. అనియిట్లు, దేవసైన్యమునునశింపజేయువాడును, మహాబలపరాక్రమశాలియును, యుద్ధవీరుడును, నగురావణాసురుడు యీమాటచెప్పి, తనకు హితము చెప్పుచున్నవాడును, సోదరుడును, నగు విభీషణునకు సెలవిచ్చిపంపె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి పదియవ సర్గముగిసెను.

రావణాసురుడు రాక్షససభజేర్చి యాలోచించుట.

సీతయందు అమితమోహము గలవాడును, పాపిష్ఠుడును, రాక్షసేశ్వరుడును, నగు రావణాసురుడు, మిగులపాపకార్యములనుచేయుటచేతను, స్నేహితులను అనాదరణచేయుటచేతను, మిగుల కృశించినవాడయ్యె. అట్లాసమయముగడచిన పిమ్మట రావణాసురుడుయుద్ధమునకై మం

త్రులతోను స్నేహితులతోను ఆలోచింపదలచె. అటుతలచి మహారథుడగు రావణాసురుడు, బంగారు కిటికీలచేనొప్పుచున్నదియును, రత్నములచేతను పవడములచేతను నలంకరింపబడినదియును, చక్కగ శిక్షతీరిన గుఱ్ఱములబూన్పబడినదియునునగు రథమునకు ప్రదక్షిణముచేసి యారథముపైనెక్కె. అట్లు రాక్షసోత్తముడగు రావణాసురుడు మహామేఘధ్వనితో సమానమైన ధ్వనిగల గొప్పరథమునెక్కి సభాస్థలమునకుబోయె. అప్పుడు కొందఱు యోధులు డాలుకత్తులను ధరించినవారును, మఱికొందఱు సమస్తాయుధములను ధరించినవారును, నై రాక్షసేశ్వరుడగు రావణాసురునిముందుపోయిరి. కొందఱు నానావిధములైన వికృతవేషములనుధరించినవారును, పలువిధములైన నగలను ధరించినవారునునై యావరావణాసురుని ప్రక్కను వెనుకను పరివేష్టించిపోయిరి. అంతఅతిరథులగు రాక్షసులుకొందఱురథములపైనెక్కియు, కొందఱు మదించిన యేనుగులపైనెక్కియు, కొందఱుచాకచక్యముగల గుఱ్ఱములపై నెక్కియు రావణాసురునివెనువెంట బోయిరి. మఱియుకొందఱు గదలను పరిఘములను ధరించియు, కొందఱుశక్తితోమరములనుధరించియు, కొందఱు గండగొడ్డండ్రను ధరించియు, మఱికొందఱు శూలములను ధరించియుబోయిరి. అట్లు రావణాసురుడు ఆసభాస్థానమును చేరంబోవుచుండ అనేకవాద్యములయొక్క ధ్వనియును శంఖధ్వనియును తుములంబై యొప్పినది. అప్పుడు ఆపూజ్యమగు మహారథముయొక్క చక్రధ్వని దశదిశలను పిక్కటిల్ల మహాకాంతితో గూడుకొనినదై రాజమార్గమున బోవుచుండె. అట్లుబోవుచున్న రాక్షసేశ్వరుడగు రావణాసురునకు రాక్షసులచే బట్టబడిన శ్వేతచ్ఛత్రము పున్నమచంద్రునివలెనే ప్రకాశించుచుండె బంగారు పూగుత్తులునడుమగలవియును, స్వచ్ఛమైనస్ఫటికమువంటి యాకారముగలవియును, నగు వింజామరలు ఆరావణాసురునియొక్క యెడమకుడి పార్శ్వముల ప్రకాశించుచుండె. అప్పుడచటనున్న రాక్షసులందఱును భూమిపైనిలుచుండి కృతాంజలులై రథముపైనున్న రావణాసురునకు నమస్కరించుచుండిరి. అంతశత్రుసంహారకుండును, మహాపరాక్రమశాలియునునగు రావణాసురుడు రాక్షసులచే జయజయశబ్దములచేతను, ఆశీర్వచనములచే తను పొగడబడినవాడగుచు మిగుల సుందరముగ నిర్మింపబడిన సభాస్థలముచేరె అట్లుసభాస్థలముచేరి మహాతేజుడగు రావణాసురుడు తనదేహకాంతిచే వెలుగుచు, బంగారముతోను వెండితోనుజేయబడిన స్తంభములుగలదియును, నిర్మలములైన స్ఫటికమణులతో జేయబడిన మధ్యరంగములుగలదియును, బంగారువస్త్రమేరత్నకంబళముగలదియును, విశ్వకర్మచే మిగుల రమణీయముగ నిర్మింపబడినదియును, ఆఱునూర్లపిశాచములచే గాపాడబడినదియును, మిగులసుందరమైయొప్పుచున్నదియును, నగు నాసభయందు బ్రవేశించె. అట్లు రావణాసురుడు ఆసభయందు ప్రవేశించియందువైడూర్యమణివికారమైనదియును, ప్రియకమృగచర్మముచే గప్పబడినదియును, దిండుతోగూడి యున్నదియును, మిగుల గొప్పదియును, మహాశ్రేష్ఠమైనదియును, నగు సింహాసనముపై గూర్చుండె. అటుసింహాసనముపై గూర్చుండి యీశ్వరునివలె మిగుల శీఘ్రగమనముగల దూతలనుజూచి యిట్లనియె.

ఓదూతలారా! మనకిప్పుడొకగొప్పపనివచ్చినది. దానినిత్వరగాసమర్థించుకొనవలయును. కావునమీరుపోయి రాక్షసులనందఱిని అతివేగముగ నిచటికి గొనిరండు. అనివారలకాజ్ఞాపించిపంపె. అంతనాదూతలు రావణాసురుడు చెప్పినమాటవిని నిర్భయముగ రాక్షసులయిండ్లయందు బ్రవేశించి, క్రీడాశయ్యాలయందును, ఉద్యానవనములయందును ఉన్నరాక్షసులకందఱికిని రావణాసురునియాజ్ఞను దెలుపుచు లంకానగరమునందెల్లయెడలను తిరిగిరి. అప్పుడు ఆరాక్షసులు దూతలవలన రావణాసురుని యాజ్ఞావిధానమునువినికొందఱు రమణీయములగు రథములను, కొందఱు గర్వించియుండెడు గుఱ్ఱములను, మఱికొందఱుయేనుగులను యెక్కియు యింకకొందఱు కాలినడకతోనుయతివేగముగ బోయిరి. మిగులశ్రేష్ఠమగు నాలంకాపురము, అట్లుపోవుచున్నరథగజతురగపదాతిసమూహములచే నిండినదియై పక్షిసమూహములచేనిండిన యాకాశమువలె ప్రకాశించుచుండె. అంతనారాక్షసులు నానావిధములగువాహనములనుద్వారదేశముననిలిపి సింహములుపర్వతగుహలయందు ప్రవేశించునట్లు కాలినడకతో సభయందు ప్రవేశించిరి అట్లుఆరాక్షసులు సభయందు ప్రవేశించి రాజగురావణాసురునిపాదములకెరిగి యతనిచే సన్మానింపబడి కొందఱు కాంచనపీఠములయందును కొందఱుదర్భాసనములయందును, మఱికొందఱు భూమియందునుగూర్చుండిరి. మఱియునారాక్షసులు రాజాజ్ఞవలనసభకువచ్చి రావణాసురునిచే సన్మానింపబడి యథాయోగ్యముగ రాక్షసేశ్వరుడగు రావణాసురుని సమీపమునగూర్చుండి యుండిరి. అచటకార్యమునిశ్చయించుటయందు శక్తిమంతులగు ముఖ్యమంత్రులును, మంచిగుణవంతులును, సర్వజ్ఞులును, తమబుద్ధిచే సమస్తము నెఱుగువారును, నగు నమాత్యులును గుంపులుగుంపులుగా యథాక్రమముగగూర్చుండియుండిరి. అప్పుడు

శూరులగు రాక్షసులనేకులు సమస్తకార్యములను చక్కగనాలోచించుటకు రాక్షసేశ్వరునియొక్క కాంచనవర్ణమగు సభయందు గుంపులుగుంపులుగ చేరిరి. అట్టియెడ మహాత్ముడును, మిగులకీర్తిమంతుడును,నగువిభీషణుడు, విశాలమైనదియును, మహాశ్రేష్ఠమైనదియును, బంగారముచే మిగులవిచిత్రముగ నిర్మింపబడిన యవయవములు గలదియును, మహాసుందరమైనదియును, మంచిగుఱ్ఱములచే పూన్పబడినదియును, నగునొకదివ్యరథమునెక్కి అన్నయగురావణాసురుని సభకువచ్చె. అట్లుపోయి విభీషణుడు అన్నయెదుటనిలిచి ప్రవరచెప్పిపాదములకు నమస్కరించె. అదేరీతిగ శుకుడును ప్రహస్తుడును రావణాసురునకు నమస్కరించిరి. అంతరావణాసురుడు వేఱువేఱుగ వారివారియోగ్యతకు తగినయాసనములనిచ్చె. అప్పుడుఆసభయందున్న రాక్షసులు బంగారముతో చేయబడిసమస్తమణులను పొదగబడిన యాభరణములను దివ్యాంబరములను పుష్పమాలికలనుధరించి, మిగులశ్రేష్ఠమైన యగరుగంధమును పూసికొనియుండిరి. వారుధరించియున్న పూలదండలయొక్కయు చందనముయొక్కయు వాసనయెల్లెడలను నిండి పరిమళించుచుండె. ఆసభయందెవ్వఱుగాని అఱవకుండిరి. ఒకానొకడుగూడ అబద్ధమాడకుండిరి. ఒక్కడుగూడ గట్టిగానైన మాటలాడకుండిరి. ఆసభయందున్న వారందఱును యాదేశీన ప్రయోజనము గలవారును, మహాశౌర్యవంతులునునై యుండిరి. మఱియు వారందఱును రాజగురావణాసురుని ముఖముచూచుచుండిరి. అట్టియెడ మహాధీరుడగు రావణాస్సురుడు, ఆసభయందు ఆయుధములను ధరించినవారును, మంచిమనసుగలవారును, మిగులబలపరాక్రమశాలులును, నగురాక్షససమూహమునందు "అష్టవసువుల నడుమనున్న దేవేంద్రునివలె" తనదివ్యతేజస్సుచే వెలుగుచుండె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి పదునొకండవ సర్గముగిసెను.

(*)

కుంభకర్ణుడు రావణాసురుని దూషణములచే గౌరవించుట.

అప్పుడు యుద్ధమునందు జయించువాడగు రావణాసురుడు ఆసభనంతయు కలయజూచి సేనానాయకుడగు ప్రహస్తునిజూచి యిట్లనియాజ్ఞాపించె. ఓసేనానాయకుడా! అస్త్రవిద్యయందు పండితులగు చతుర్విధయోధులగు భటులుమహాజాగ్రతతో పట్టణమును రక్షించునట్లు ఆజ్ఞాపింపుము. అని రావణాసురుడుచెప్పగానే మహావినయముగలవాడగు ప్రహస్తుడు రాజాజ్ఞాప్రకారము చేయగోరి సేననంతయు నాగృహమునకులోపల వెలుపలనుంచె. మఱియు పురరక్షణముకొఱకు సైన్యమును వేఱుగనిలిపి యంతప్రహస్తుడు రావణాసురుని సమీపమునకువచ్చి కూర్చుండి యిట్లనియె.

ఓమహారాజా! రావణాసురుడా! మిగులబలవంతుడవగునీయొక్కసైన్యములోపల వెలుపలనంతటను గావలియుంచియున్నాను. ఇంకనీవు చేయగోరినకార్యమును, స్వస్థచిత్తుడవై శీఘ్రముగ జేసికొనుము అనిప్రహస్తుడుచెప్పగానే రాజ్యమునకు మేలుచేయుటయందుఆసక్తిగల రావణాసురుడు మిగులసుఖముగోరి స్నేహితులమధ్యమున నిట్లనియె. ఓరాక్షసులారా! ధర్మకామార్థములయందు సంకటములు గలిగినప్పుడు ప్రియమును అప్రియమును, సుఖమును దుఃఖమును, లాభమును నష్టమును, మేలును కీడును తెలిసికొనుటకు మీరుశక్తిమంతులుగదా. మీరుసకలవిధములచేతను లెస్సగనాలోచించినిశ్చయింపుడు.ఆరంభించిన కార్యమేదైన నిదివరకు నాకెప్పుడుగాని విఫలమైనదిలేదు. మఱియు దేవేంద్రుడు చంద్రుడుమొదలగు గ్రహములతోను దేవతలతోనుగూడి జయలక్ష్మిబొందునట్లు నేనుమీతోగూడి జయలక్ష్మిని బొందుచున్నాను. ఇదిగాక నేనిదివరకె మీకందఱికిని యీవిషయమును గురించిచెప్పియున్నాను. కుంభకర్ణుడు నిదురించియుండుటచే నతనికిమాత్రము యీవిషయమును చెప్పలేదు. ఏలననగా మహాబలపరాక్రమశాలియును, సకలాయుధధారులలోనుత్తముడును, నగునీకుంభకర్ణుడు యీయారు మాసములనుండి నిదురించియుండెను. ఇప్పుడు అతడీసభకు వచ్చియున్నాడు. కావునమీరందఱు వినుచుండ నొకతేపసంక్షేపముగ జెప్పెదనువినుడు. జనకమహారాజు కూతురును, రామునిభార్యయును, నగుసీతను రాక్షసులు సంచరించునట్టి దండకారణ్యమునుండి తెచ్చియున్నాను. మిగుల మందగమనముగల ఆసీత నాశయ్యపైజేరుటకెంతమాత్రము సమ్మతించినదిగాదు. ముల్లోకములయందును యీసీతతో సమానురాలగు స్త్రీయెచ్చటగానము. ఆసీతసన్ననినడుమును పెద్దపిఱుదులును, శరద్రుతువునందలి చంద్రునితో సమానమైన ముఖమునుగలిగి బంగారుప్రతిమతో సమానమైమిగుల సౌందర్యముగలిగి మయునిచే జేయబడిన మాయవలెనున్నది. మిగులనెఱ్ఱనైనవియును, మహాకోమలంబైనవియును, సమముగనున్నవియును, ఎఱ్ఱనిగోళ్లతో నొప్పుచున్నవియును, నగునాసీతయొక్క పాదములుచూచి నాకుమదనబాధ మఱిమఱి నతిశయించుచున్నది. మఱియు హుతాగ్నిజ్వాలవలె

ప్రకాశించుచు సూర్యప్రభవలెనుండెడి యాసీతనుజూచి నాశరీరము మన్మథాగ్నిచే మిగులదహింపబడుచున్నది. మిగుల ఉన్నతమైన ముక్కుగలదియును, సొగసగు నేత్రములతో నొప్పుచున్నదియును, విశాలమైనదియును, మహాసౌందర్యము గలదియును, నగునాసీతయొక్క ముఖమునుచూచి అట్టివివశుడనై మన్మథాధీనుడ నగుచున్నాను. మఱియు కోపము వచ్చినపుడును, సంతోషముగలిగినపుడును, వ్యసనము ప్రాప్తించినపుడును, సంతాపము జెందినపుడును విడువక బాధింపుచు తెల్లవారునట్లు చేయువాడగు మన్మథుడు నన్నుమిగుల కలత నొందించుచున్నాడు. మిగులనిడుదలైన కండ్లుగలయాసీత తనభర్తయగు రామునకెదురుచూచుచు నన్నొకసంవత్సరము గడువడిగినది. అంతనేను ఆసుందరాంగియడిగిన గడువుకొప్పుకొంటిని. అయిననేనిప్పుడు, దారినడచిన గుఱ్ఱమువలె మన్మథునిబారినిబడి అలసియున్నాను. కలతనొందింపగూడనిదియును, పెక్కుజంతువులచే నొప్పుచున్నదియును, నగుసముద్రమును వానరులెట్లు దాటగలరు? మఱియు నాదశరథమహారాజు పుత్రులైన నెట్లుదాటగలరు? అట్లుగాక వారుదాటివచ్చినచో, ఒకవానరుడేమనతో నంతగొప్ప యుద్ధముచేసెను. కార్యగతులు తెలియనలవిగానివి. కావున వారివారిమనస్సునకు తోచినట్లుచెప్పుడు. పూర్వము మీసహాయమువలన దేవాసురులతో యుద్ధముజేసి జయించితిని. అప్పుడు సహాయులైయుండిన మీరలిప్పుడుగూడ యున్నారు. కావునమనుష్యునివలన నాకెంతమాత్రముభయములేదు అయినను చక్కగనాలోచింతము. ఇప్పుడు రాజపుత్రులగు రామలక్ష్మణులు సుగ్రీవాది వానరులతోగూడి సీతయుండెడి స్థలమును తెలిసికొని అచ్చటసముద్రముయొక్క ఉత్తరపు దరిగుందున్నారు. కావుననిప్పుడు సీతనివ్వవలయునో, లేకదశరథరాజ పుత్రులగు రామలక్ష్మణులను చంపగలమో, మీరులెస్సగ నాలోచించి నిశ్చయించుకొని నాకుచెప్పుడు. అయినవానరుల సహాయముచే సముద్రముదాటి యిచ్చటికివచ్చుటకు ప్రపంచమునందు ఎవ్వడును శక్తిమంతుడుగాడు. కావునదృఢముగ నాకేజయముగలదు. అనియిట్లు మన్మథావేశ వివశుడై రావణాసురుడు ఘోషింపగ కుంభకర్ణుడువిని మిగులకోపోద్దీపితుడై యిట్లనియె.

లక్ష్మణసమేతుడగు రామునిభార్యనిచ్చటికి బలవంతముగ తెచ్చుటకుమునుపే చక్కగాలోచించి యుండువేని "యమునానదియమున పర్వతమును బొందునట్లు" మనస్సునిశ్చయమును బొందియుండునుగదా. మహారాజా! రావణాసురుడా! నీవిప్పుడు ఆలోచించునట్లు, సీతను దెచ్చుటకుమునుపేమాతో లెస్సగానాలోచించి యుండువేని మిక్కిలి బాగుగానుండును. రాజా! ఎవ్వడుగాని కార్యముచేయుటకుమునుపే చక్కగనాలోచించి న్యాయబుద్ధిచే రాచకార్యములచేయునో అట్టిరాజునీవలె వెనుకపరితాపమునొందడు. మంచికార్యములైనను చక్కగనాలోచించి, ఉపాయముచేజేయకుండెనేని, అపాత్రునకు బెట్టినయన్నమువలె మహాదోషయుక్తములగును. అదియునుగాక యెవడు ముందు చేయవలసిన కార్యమును వెనుకజేసి, వెనుక జేయవలసినకార్యమును ముందుచేయగోరునో అట్టివాడు మంచిచెడుగులు తెలిసినవాడుకాడు. మఱియు చక్కగా నాలోచింపక చపలుడై కార్యములుచేయువానికధికబలమున్నను విరోధులు సమయము గనిపెట్టియుండి "హంసపక్షులు క్రౌంచపర్వతముయొక్క రంధ్రముదారినిదూరి పోయినట్లు" వానినిపరాజయము నొందింతురు. ఇప్పుడు నీవెంతమాత్ర మాలోచింపక మహాఅపాయకరమగు నీకార్యమును జేసితివి. భాగ్యవశముచేత "విషముతో గలిసిన మాంసమువలె" నిన్నురాముడు చంపకున్నాడు. పాపరహితుడా! అన్నా! రావణాసురుడా! నీవుముందు మించినదియును, అసమానంబైనదియును, నగునీకార్యమును నేనుదక్కనన్యుడు సమర్థింపజాలడు. కావుననేను నీశత్రువులను సంహరించి నీకార్యము చక్కపరిచెదను రాక్షసేశ్వరుడా! రావణాసురుడా! నీశత్రువు దేవేంద్రుడైనను, సూర్యుడైనను, అగ్నిహోత్రుడైనను, వాయుదేవుడైనను, కుబేరుడైనను, వరుణుడైనను యుద్ధముచేసి సంహరించెదను. అన్నా! రావణాసురుడా! నేనుపర్వతమువంటి దేహముతోను, మిగులకఱుకైనకోరలతోను గొప్పయినుపగుదియనుదాల్చి సింహనాదముచేయుచు యుద్ధమునకుపోగా దేవేంద్రుడైనను భయపడిపరుగెత్తిపోవును. మఱియురాముడు ఒకబాణమును నాపైసంధించి రెండవబాణమును ప్రయోగించునంతలో ఆరాముని జంపి యాతనిరక్తము పానముచేసెదను. నీవునెమ్మది నొందిస్వస్థముగనుండుము. రావణాసురుడా! నేనురాముని జంపి నీకు సుఖము గలుగజేసెదను. నీకుజయముగలుగుటకు యత్నించి రామలక్ష్మణుల నిద్దఱిని జంపి, వానరోత్తముల నందఱిని భక్షించెదను. మఱియు నీవుయథేచ్ఛముగ క్రీడింపుచుండుము. శ్రేష్ఠమగు మద్యమును త్రాగుము. పరితాపమునువిడిచి నీకిష్టమగు కార్యములనుచేసికొనుచుండుము. నేనురాముని జంపెదను. అంతసీత చిరకాలము నీస్వాధీనములోనుండును. అనికుంభకర్ణుడు చెప్పె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి పంద్రెండవ సర్గ ముగిసెను.

——(*)

మహాపార్శ్వునితో రావణాసురుడు తనకుగలిగిన శాపమును జెప్పుట.

అంతమహాబలశాలియగు మహాపార్శ్వుడు, రావణాసురుడు మిగులకోపమును బొందియున్నాడని తెలిసికొని యతనిని ప్రసన్నునిజేయుటకై కొంతసేపు ఆలోచించి చేతులుమొగిడ్చి నమస్కరించి యిట్లనియె.

స్వామీ! మహారాజా! రావణాసురుడా! ఎవ్వడుగాని తేనియలను త్రాగుటకు మృగములతోను పాములతోను నిండియుండు వనమునకుబోయి అతిప్రయాసముచే తేనెనుసంపాదించి దానిన్ద్రాగడో వాడుమూఢుడు. శత్రుసంహారకుడా! రావణాసురుడా! ప్రభుడవగు నీకుప్రభువెవ్వడు. నీవుశత్రువులను తలపైదన్నిసీతతో గ్రీడింపుచుండుము. మిగుల బలపరాక్రమవంతుడా! రావణాసురుడా! సీతయొప్పకున్నను కుక్కుటవృత్తినవలంబించి బలాత్కారముచేత నాసీతనాక్రమించి సుఖముగక్రీడింపుచు సంతసమునుబొందుము. ఇట్లునీకోరిక నెరవేరినపిదప నీకేదైనభయము సంభవించినను, లేకసంభవింప బోవునదిగనున్నను, సంభవింపనిమ్ము. నీకెంతమాత్రమును భయములేదు. కుంభకర్ణుడును, మహాబలశాలియగు నింద్రజిత్తును, మాతోగూడుకొన్నవారై వజ్రధరుడగు యింద్రునినైన ప్రహరింపగలరు. ఓమహారాజా! యుద్ధముచేయుటకు శక్తిలేనివారిచే నేర్పరుపబడిన సామదానభేదములను నీమూడుపాయములను విడిచిదండోపాయముచే కార్యముసాధింపుము. మహాబలుడా! రాక్షసేశ్వరా! రావణాసురుడా! నీశత్రువు లిచ్చటికివచ్చినతోడనే వారినందఱిని శస్త్రప్రయోగముచే నీస్వాధీనులనుగా జేసెదము. ఇందుకెంతమాత్రమును సంశయములేదు. అనియిట్లు మహాపార్శ్వుడుచెప్పె. అంతరాక్షసేశ్వరుడగు రావణాసురుడు మిగులసంతసించి యతనినిమిగుల సన్మానించి మఱలనతనితో నిట్లనియె.

ఓమహాపార్శ్వుడా! నాకొకరహస్యమున్నది. నీవుదానినెఱిగియుండుము. బహుకాలమునకుముందు నాకొకసంగతి జరిగియున్నది. దానిని నీకెఱిగించెదవినుము. నావలనిభయముచే దాగిదాగిరహస్యముగ బ్రహ్మదేవునింటికి పోవుచున్నదియును, గగనమార్గమునందు అగ్నిజ్వాలవలె నున్నదియును, నగుపుంజికస్థలయను నప్సరసనునేను జూచితిని. అంతనే నాపుంజికస్థలను బలవంతముగ దిగంబరినిగాజేసి భోగించితిని. అంతట ఆపుంజికస్థలవాడిన తామరతీగవలె మహాదైన్యముతో బ్రహ్మదేవుని దగ్గరకుబోయినది. ఈవృత్తాంతము మహాత్ముడగు బ్రహ్మదేవునకు తెలిసినట్లు నాకుతోచుచున్నది. అంతబ్రహ్మదేవుడు మిగుల కోపోద్దీపితుడై నన్నుద్దేశించి యిట్లనిచెప్పె.

ఓరావణాసురుడా! ఇదిమొదలు నీవిట్లుబలాత్కారముగ పరస్త్రీనిపొందుదువేని అప్పుడేనీతల నూరుద్రయ్యలుగ పగిలిపోవును. ఇందుకెంతమాత్రమును సంశయములేదు. అనిబ్రహ్మదేవుడు నన్నుశపించె. కావుననేను బ్రహ్మదేవుని శాపమునకు భయపడి సీతనుబలవంతముగ నాపాన్పునకు చేర్పకున్నాను. ఓమహాపార్శ్వుడా! సముద్రమునకువలె వేగమును, వాయువునకువలె గమనశక్తియును, నాకుగలదని రామునకుదెలియదు. అందుచేతనే నాపైకివచ్చుచున్నాడు. ఆరాముడు, పర్వతగుహయందు నిదురించుచున్న సింహమువలె నున్నవాడును, నిదురించియున్న మృత్యువువలె నున్నవాడును. కోపిష్ఠుడును, నగునన్ను పురికొల్ప గోరుచున్నాడు. మఱియు నారాముడు యిదివరకు ఎన్నడును నాతోటియుద్ధమున, మిగులతీక్ష్ణములై రెండునాలుకలుగల క్రూరసర్పములవలెనుండెడు నాబాణముల దెబ్బలుతినియెఱుగడు. కావుననేనాపైకి యుద్ధమునకు వచ్చుచున్నాడు. ఓమహాపార్శ్వుడా! ఇంకస్వల్పకాలములోనే "ఏనుగులపై కొఱవికట్టెలను వేయునట్లు" వజ్రములతో సమానములైన బాణములను గుంపులుగుంపులుగ రామునిపై బ్రయోగించెదను. మఱియును "ఉదయకాలమునందుసూర్యుడుదయించి నక్షత్రములయొక్క కాంతినిపోనడచునట్లు" నేనుగొప్పసేనా సమేతుడనై ఆరామునిని ఆతనిసైన్యమునుగూడ ఖండించివైచెదను. ఇదియునుగాక వేయికండ్లుగల దేవేంద్రుడుగాని, వరుణుడుగాని, యుద్ధమున నాయెదుటనిలువజాలరైరి. మఱియుకుబేరునిగూడ నాభుజబల పరాక్రములచేజయించి కుబేరపాలితమగు నీలంకానగరమునుగూడ తీసుకొంటిని.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి పదమూడవ సర్గ ముగిసెను.

(*)

విభీషణుడు రావణాసురునితో సీతనురామునకు సమర్పింపుమని చెప్పుట.

అంతవిభీషణుడు రాక్షసేశ్వరుడగు రావణాసురుని మాటలను, కుంభకర్ణుని గర్జనములను, విని, రాక్షసోత్తముడగు రావణాసురునితో మిగులహితమును అర్థయుక్తమునునగు మాటనుచెప్పె. రాక్షసేశ్వరుడా! రావణా

సురుడా! వక్షస్థలమున పడగలుగలవియును, చింతయను విషముగలదియును, చిఱునగవనుకఱకు కోఱలుగలదియును, అయిదువ్రేళ్లనే అయిదుతలలుగ గలిగిగొప్పదేహము గలదియును, నగుసీతయను గొప్పసర్పమును నీవేలకోరితివి. పండ్లనుకోఱలునే యాయుధములుగా గలవారును, పర్వత శిఖరాకారులును, నగువానరులు లంకానగరము ప్రవేశింపకమునుపే సీతాదేవిని రామునకీయ్యుము. మఱియు వజ్రములతో సమానములైనవియును, వాయువేగమువంటి వేగముగలవియును, రామునిచే బ్రయోగింపబడినవియును, నగుబాణములు రాక్షసోత్తముల తలలుచదియ్యుటకు మునుపే సీతాదేవిని రామునికియ్యుము. ప్రహస్తుడా! ప్రాణమును హరించునట్టివియును, పిడుగుతో సమానమైన వేగముగలవియును, మహాతీక్ష్ణములైనవియును, నగురాముని బాణములు నీదేహమునందు ప్రవేశించి భేదింపకున్నవి. కావుననీవిట్లు ఆత్మస్తుతి చేసికొనుచున్నావు. కుంభకర్ణుడుగాని, యింద్రజిత్తుగాని, రాక్షసేశ్వరుడగు రావణాసురుడుగాని, మహాపార్శ్వుడుగాని, మహోదరుడుగాని, కుంభుడుగాని, నికుంభుడుగాని, అతికాయుడుగాని, మహాకాయుడుగాని మఱియెవ్వఱుగాని యుద్ధమునందు రాముని ఎదుటనిలుచుటకు శక్తిమంతులుగారు. నీవు ప్రాణములతోనుండి సూర్యుని సహాయపఱచుకొని యున్నగాని, దేవతలను సహాయపరచుకొని యున్నగాని, లేకయింద్రుని తొడపైగూర్చుండి యున్నగాని, మృత్యువుతొడపై గూర్చుండియున్నగాని, గగనమునకెగిరినను గాని, పాతాళము జొచ్చినను గాని, రాముడు నిన్నువిడువడు. అనివిభీషణుడుచెప్పె. అంత ప్రహస్తుడు అతనితో నిట్లనియె.

విభీషణా! దేవతలవలనగాని, దానవులవలనగాని, మఱియెవరివలనగాని మాకుభయములేదు. మఱియు యక్షులవలనగాని, గంధర్వుల వలనగాని, ఉరగుల వలనగాని, యుద్ధమునందు మాకెంత మాత్రమును భయములేదు. ఇంక మానవుడును, రాజపుత్రుడును, నగురామునివలన మాకెంతమాత్రమును భయములేదని చెప్పనేల. అనిప్రహస్తుడు విభీషణునితో జెప్పె. అంతపూజ్యమైన స్వభావముగలవాడును, రాజునకు మేలుగోరువాడును, నగువిభీషణుడు ప్రహస్తునిమాటను వినినతోడనే, ధర్మార్థకామములను చక్కగనాలోచించి మఱలప్రహస్తునితో యిట్లనిచెప్పె.

ప్రహస్తుడా! రాక్షసేశ్వరుడగు రావణాసురుడును, మహోదరుడును, నీవును, కుంభకర్ణుడును, యోచించు కార్యము, అధర్మమునం దిష్టముగలవానికి స్వర్గగమనము సిద్ధింపని యట్లు, రామునివిషయమై యెంతమాత్రమును ప్రయోజనములేదు. ప్రహస్తుడా! "తెప్పగూడలేని వానికిమహాసముద్రము దాటనలవిగానియట్లు" నీకుగాని, నాకుగాని, సమస్తరాక్షసులకుగాని కార్యముజక్కగదెలిసిన రామునివధించుటకు సాధ్యముగాదు. ఓప్రహస్తుడా! ధర్మాత్ముడును, మహారథుడును, ఇక్ష్వాకువంశోద్భవుడును, మహాసమర్థుడును, జనరంజకుడునునగు రామునియొక్క యుద్ధకార్యములకు దేవతలుగూడ మోహితులగుదురు. మఱియు, మిగులకఱుకైనవియును, వంగినవియును, కంకపక్షిఱెక్కలవలె ఱెక్కలుగలవియును, మహావేగముగలవియై సమీపింపనలవిగానివియును, రామునిచేవిడువబడినవియును, నగుబాణములు నీదేహమునందు చొరగలవు. కావుననీవిట్లు కొనియాడు కొనుచున్నావు. ప్రహస్తుడా! రావణాసురుడుగాని, మహాబలుడగు త్రిశిరుడుగాని, కుంభకర్ణుడుగాని- ఈకుంభకర్ణుని కొడుకగుని కుంభుడుగాని, యింద్రజిత్తుగాని, మఱియెవ్వరుగాని, యుద్ధమునందు దేవేంద్రునితో సమానుడగు రామునిఎదిరించుటకు సమర్థులుగారు. మఱియు దేవాంతకుడుగాని, నరాంతకుడుగాని, అతిరథుడును మహాబలుడును, నగునతికాయుడుగాని, పర్వతముతో సమానమైన బలముగలవాడగు అకంపనుడుగాని యుద్ధమునందు రామునితోయెదుట నిలుచుటకు సమర్థులుగారు. ఓప్రహస్తుడా! ఆలోచింపక కార్యములుచేయువాడును, స్వభావముచేతనే మిగులక్రూరుడును, సప్తవ్యసనములయందు దగిలినవాడును, నగునీరావణాసురుడు రాక్షసవినాశమగు కార్యముచేయయత్నింపగా, మిత్రరూపముననుండెడు శత్రువులగు మీరందఱును అతనికిసహాయపడుచున్నారు. తుదలేనిదేహముగలదియును, వేయితలలుగలదియును, మహాభయంకరమైనదియును, మిగులబలముగలదియును, నగురామునితోటి వైరమనుసర్పము మిగులబలవంతముగ రావణాసురుని దేహమును చుట్టుకొనియున్నది. మీరీరాక్షసేశ్వరుని, అట్టియుపద్రవమునుండి తప్పించివిడిపింపుడు. రాజుఒకవేళ తప్పుమార్గమునబడినను, రాజుచే సకల సుఖములబొంది నెరవేఱినకోరికలుగలవారగు స్నేహితులందఱును వొక్కటియై "మహా భయంకరములగు భూతములచే బట్టుకొనబడిన మానవునివలె" తలవెండ్రుకలుబట్టి యీడ్చియైనను అతనిరక్షింపవలయును. ఓప్రహస్తుడా! మిగులవిశేషజలముతో నొప్పుచుండెడి లక్ష్మణుడనుసముద్రమున బడెడివాడును, రాముడనుబడబానలములో బడనిశ్చయించి యున్నవాడును, నగురావణాసురుని, మీరందరును ఒక్కటియై, యతిశీఘ్రముగదాటించి కాపాడవల

యును. నేను జెప్పెడు సంగతి, ఈలంకానగరమునకును, సమస్తబంధుమిత్రులతోగూడిన రాజునకును, మేలుచేయును. నాకుదోచినమాట చెప్పుచున్నానువినుడు. రాజపుత్రుడగు రామునకు అతనిభార్యయగుసీతనిచ్చివేయుదము. ఇంకొక విశేషమునుచెప్పెదనువినుము. మంత్రియగువాడు, శత్రువులయొక్క బలమును తనబలమును చక్కగదెలిసికొని, శత్రువునకునుతనకును, గలవృద్ధిక్షయములను దెలిసికొని, తగినమార్గముచే రాజునకు మేలుగలుగుమార్గమునందు కార్యములను చేయవలయును.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి పదునాలగవ సర్గ ముగిసెను.

(*)

—(*)విభీషణయింద్రజిత్తుల సంవాదము.(*)—

అంతరాక్షసవీరులలో నుత్తముడును, మహాబలపరాక్రమశాలియును నగు నింద్రజిత్తు, బుద్ధియందు బృహస్పతితో సమానుడగు విభీషణుడు చెప్పినమాటను మిగుల గమనముతోవిని, అతనితో నిట్లనియె.

చిన్నాయనా! విభీషణా! నీవుమిగులభీతినిబొందినిష్ప్రయోజనమగుమాట చెప్పితివి. ఇదియేటిమాట? ఈవంశమునబుట్టినవాడుగూడ యిట్టిఅల్పమైన మాట చెప్పడు. ఇట్టినీచకార్యమును చేయనుజేయడు. ఈవంశమునందు మాచిన్నాయనగు విభీషణుడొకడు మాత్రమే బలము, ప్రభావము, పరాక్రమము, శౌర్యము, ధైర్యము, స్థైర్యము, తేజము మొదలగునవిలేనివాడు. రాక్షసుడవగునోవిభీషణుడా! పిరికివాడా! మమ్మేలభయపరచెదవు? మాలోనొకస్వల్పరాక్షసుడు, రాచకొమరులగు రామలక్ష్మణులను యుద్ధమునసునాయాసముగ చంపగలడు. ఓయీ! విభీషణా! ముల్లోకములకు ప్రభువును దేవరాజునునగు యింద్రుడు నాచేగట్టువడిభూతలమునందు బడద్రోయబడెను. మఱియు సమస్తదేవతలును భయపడి పరమభీతులై గుంపులుగుంపులుగ దశదిశలకును పరుగెత్తిపోయిరి. నేనుమహాధ్వనిగలుగునట్లు సింహనాదము చేయుచు, ఐరావతమునుబట్టి నేలపైబడద్రోసి, బలవంతముగ దానిదంతములను పెఱికికొని వానిచే సమస్తదేవతలను భయపరచితిని. నేను దేవతుల గర్వమునుబోగొట్టితిని. నావలనిభయముచే నసురోత్తములుగూడ పరమదుఃఖమునొందుదురు. అట్టిమహాపరాక్రమశాలినగునేను, మనుష్యులును పరమనీచులును రాచబిడ్డలును, నగురామలక్ష్మణులను జయింప నెట్లు సమర్థుడనుగాను? ఇదియేటిమాట. అనియింద్రజిత్తుచెప్పె. అంతఆయుధధారులలో నుత్తముడగు విభీషణుడు, ఇంద్రునితోసమానుడును, దుర్జయుండును, మహాపరాక్రమశాలియును, నగు నింద్రజిత్తుతో మహాగొప్పఅర్థముగల మాటలతో నిట్లనియె.

నాయనా! ఇంద్రజిత్తా! నీకు మంత్రాలోచనము నిశ్చయించుటయందు శక్తిలేదు. నీవుపసివాడవు. ఇప్పటికి నీబుద్ధిపరిపక్వమైనదిగాదు. కావున నీవినాశము కొఱకు తెలివిమాలినమాటలు విశేషముగ ప్రేలెదవు. ఇంద్రజిత్తా! రావణాసురునకు రామునివలన చేటుగలుగుట గుర్తెఱిగియు తెలివిలేమితననుచే నందుకుసమ్మతించుచున్నావు. కావున నీవు రావణాసురునకు పుత్రుడవై "మిత్రుఁడవలె గాన్పించు శత్రుడవైయున్నావు." నీవుచంపదగినవాడవు. మిగుల దుర్బుద్ధివి. మఱియు నీవుబాలుడవు. మిగుల బలము గలవాడవు. ఎంతటికార్యమునకైన సాహసించువాడవు. కావున నిన్నిప్పుడుయిచటికితీసికొనివచ్చి యీయాలోచనసభయందు ప్రవేశింపబెట్టినవాడుగూడ చంపదగినవాడు. ఇంద్రజిత్తా! నీవుమూఢుడవు. మహాగర్వముడవు. అడకువలేనివాడవు. మహాక్రూరబుద్ధివి. నీచుడవు. దుష్టమతివి. మూర్ఖుడవు. దుర్మార్గుడవు. తెలివిలేనివాడవు. నీవుపసివాడనౌటచే కీడుమేలులు తెలియక ప్రేలుచున్నావు. బ్రహ్మదండమువంటి కాంతితోప్రకాశించునవియును, జ్వాలలతోనొప్పుచున్నవియును, కాలదండముతోసమానమైనవియును, మృత్యువువంటి రూపముగలవియును, రామునిచే ప్రయోగింపబడినవియును, నగు బాణములను యుద్ధమునం దెవడు సహింపగలడు? అని చెప్పివిభీషణుడు రావణాసురునిజూచి యిట్లనియె. అన్నా! రాక్షసేశ్వరుడా! రావణాసురుడా! ధనసంచయములను, అమూల్యపదార్థములను, నానావిధములైన యాభరణములను, శ్రేష్ఠములగు వస్త్రములను, నానావిధములైన రత్నములను, సీతాసమేతముగ రామునకుసమర్పించి వ్యసనరహితులమై సుఖముగనుందము.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి పదునైదవసర్గ ముగిసెను.

(*)

—{రావణాసురుడు విభీషణునిదూషించి వెళ్ళబొమ్మనుట.}—

అనియిట్లు చక్కగ మనస్సునకు దగులునట్లు హితవాక్యములనుచెప్పుచున్న విభీషణునిజూచి రావణాసురుడు మృత్యువుచే ప్రేరేపింపబడిన వాడగుచు మిగుల పరుషవాక్యములతో నిట్లనియె.

శ్లో॥ వసేత్సహసపత్నేన క్రుద్ధేనాశీవిషేణవా । నతుమిత్రప్రవాదేనసంవసేచ్ఛత్రుసేవినా ॥ ఓరీ! విభీషణా! కేవ

లము శత్రువుతోగాని మహాకోపమునొందియుండెడి విషసర్పముతోగాని సహవాసము చేయవచ్చును. మిత్రునివలె అభినయించుశత్రుపక్షపాతితో నెంతమాత్రము సహవాసముసేయరాదు. మఱియు, శ్లో॥ జానామిశీలంజ్ఞాతీనాం సర్వలోకేషురక్షస । హృష్యంతేవ్యసనేష్వేతే జ్ఞాతీనాం జ్ఞాతయస్సదా ॥ ఓరీ! రాక్షసుడా! సర్వలోకములయందును దాయాదుల స్వభావమునాకు జక్కగా దెలుసును. ఈదాయాదులు నిరంతరముతమజ్ఞాతులకైన సంకటములువచ్చినపుడు సంతసించుచుందురు. శ్లో॥ ప్రధానంసాధనంవైద్యంధర్మశీలంచరాక్షస । జ్ఞాతయోహ్యవమన్యంతే శూరంపరిభవంతిచ ॥ రాక్షసుడా! ఓరీ! విభీషణా! దాయాదులు తమవారిలోధనాదులచే శ్రేష్ఠుడైనవానిని, కార్యసాధకుడైనవానిని, పండితుని, ధార్మికుని, శూరుని, అవమానింతురు. ఇంతేగాక తిరస్కారముగూడ చేయుదురు. శ్లో॥ నిత్యమన్యోన్యసంహృష్టావ్యసనేష్వాతతాయినః। ప్రచ్ఛన్నహృదయాఘోరాజ్ఞాతయస్తుభయావహాః ॥ మాయబడిన మనస్సుగలవారును, అనగా మనస్సులో నొకటియు వెలపటనొకటియు గలవారనుట. ఒకరివిషయమునందొకరు మహాసంతోషము నొందినవారును అనగా మంచికాలమునందు మహాప్రేమతోనున్నట్లు అభినయించుచు నెప్పుడెప్పుడు సమయముదొరకునా, అని కాచియుండువారనుట, ఆపత్కాలములయందు ద్రోహముచేయువారును, మహాభయంకరులును, నగు దాయాదులవలన నెప్పుడును భయముగలదు. ఓరీ! విభీషణా! ఇందుకు నిదర్శనముగ పద్మవనమను ఒకఅరణ్యముగలదు. అందలియేనుగులు, తమ్ముబట్టుటకొరకు పాశములను చేతదీసికొనివచ్చిన మనుష్యులనుజూచి కొన్నిశ్లోకములుచెప్పినవి. వాటినిచెప్పెదను వినుము. మనకగ్నివలన భయములేదు. ఇతరఆయుధముల వలన భయములేదు. ఈపాశములవలనను భయములేదు. అయినను యీమానవులు తమకార్యమునందుపయోగించుకొనుటకై వీరియొద్దనుంచుకొనియుండెడు మనజాతి యేనుగులవలన మాత్రము మనకు భయముగలదు. మనలను బట్టుకొనుటకు మనజాతియేనుగులే ఉపాయము చెప్పుచున్నవి. ఇందుకెంతమాత్రమును సంశయములేదు. శ్లో॥ కృత్స్నాద్భయాత్ జ్ఞాతిభయంసుకష్టంవిదితంవచః ॥ సమస్తకష్టములకన్నను జ్ఞాతులవలనిభయము మిగుల గష్టతరమైనది. ఇదిమహాప్రసిద్ధము. శ్లో॥ విద్యతేగోషుసంపన్నం విద్యతేబ్రాహ్మణేదమః । విద్యతేస్త్రీషుచాపల్యంవిద్యతేజ్ఞాతితోభయం॥ గోవులయందు సంపదగలదు. బ్రాహ్మణులయందు యింద్రియనిగ్రహముగలదు. స్త్రీలయందు చాపల్యముగలదు. జ్ఞాతులయందు (వలన) భయము గలదు. సౌమ్యుడా! ఓరీ! విభీషణా! అదేప్రకారముగ నీవుజ్ఞాతివి కావున, నేనుసమస్తలోకముల వారిచే పూజితుడనై మహదైశ్వర్యమునుబొంది దాయాదులలో శ్రేష్ఠుడనైయుండుట నీకెంతమాత్రము యిష్టపడినదిగాదు. శ్లో॥ యథాపుష్కరపర్ణేషు పతితాస్తోయబిందవః । నశ్లేషముపగచ్ఛంతితథానార్యేషుసంగతం ॥ "తామరాకులయందుపడిన నీటిబిందువులు ఒకటితోనొకటిచేరకుండునట్లు" దుర్మార్గులతో నెన్నాళ్ళుసహవాసముచేసినను యెంతమాత్రముస్నేహముగలుగదు. తుమ్మెదలు మిగుల ఆశతోపుష్పమునందుండు తేనియలను ద్రావి పిదప ఆపుష్పముపై నిమిషమాత్రమైనను నిలువక యెట్లుపరుగెత్తిపోవునో, అట్లునీవు నావలన సమస్తసుఖములను అనుభవించి యిప్పుడు నన్నువిడనాడగోరుచున్నావు. కావున దుష్టులతోటి సహవాసమట్టిదేను. శ్లో॥ యథాపూర్వంగజస్స్నాత్వాగృహ్యహస్తే నవైరజః । దూషయత్యాత్మనోదేహం తథానార్యేషుసౌహృదం ॥ ఏనుగు మొదటచక్కగస్నానముచేసి పిమ్మట తనతొండముతో దుమ్ముదీసికొని ఎట్లుదేహమంతయు మన్నుబోసికొని చెఱచుకొనునో, అట్లేదుర్మార్గులు ముందుగ స్నేహముచేసి వెనుకదానికివిఘాతముగావింతురు. శ్లో॥ యథాశరదిమేఘానాంసించతామపిగర్జతాం । నభవత్యంబుసంక్లేదస్తథానార్యేషుసౌహృదం ॥ శరదృతువు నందు మేఘములు తూరుచు మిగుల నార్భాటముగ గర్జించుచుండినను, భూమిపై గొంచెముగూడ నెట్లు తేమమైనను గలుగకుండునో అట్లుదుర్మార్గులతోటి సహవాసముగూడయేయుండును. ఓరీ! రాక్షసుడా! విభీషణా! ఇతరుడొకడు యీవిధముగచెప్పియుండునేని యిదివరకు వానిని నాశనముచేసియుందును. నీవుతమ్ముడవని మన్నించితిని. కులముచెరుపబుట్టినవాడా! "నీవుదహింపబడుదువుగాక"నా యెదుటనిలవకుము. పొమ్ము. అనియిట్లు రావణాసురుడు మహాకఠినముగ జెప్పినతోడనే, న్యాయవాదియగు విభీషణుడు గదచేతికి దీసికొని నలువురు మంత్రులతోగూడ గగనవీధికెగిరె. అట్లుమిగుల కాంతిమంతుడగు విభీషణుడు గగనమార్గమునకెగిరి మిగుల కోపోద్దీపితుడై, రాక్షసేశ్వరుడగు రావణాసురునిజూచి యిట్లనియె.

రాక్షసేశ్వరుడా! రావణాసురుడా! నీవునాకుఅన్నవుగావున నీవు ఏమిచెప్పగోరెదవో, దానినంతయు చెప్పుము. నీవునాకుఅన్నవు. పూజనీయుడవు. తండ్రితో సమానుడవు. అయినను ధర్మమార్గమునుదప్పిప్రవర్తించుచున్నావు. అసత్యమగు నీవుచెప్పిన పరుషవాక్యమునకు మాత్ర

ము సహింపజాలను. ఓరావణాసురుడా! నేనునీమేలుకోరి చక్కగ నాలోచించి నిశ్చయించి నీకుహితమగు మాటచెప్పితిని. అట్లుచెప్పినను బుద్ధిహీనులును, కాలచోదితులైనవారును, హితోపదేశమును వినరు. రాక్షసేశ్వరుడా! రావణాసురుడా! శ్లో॥ సులభాః పురుషా రాజన్ సతతంప్రియవాదినః । అప్రియస్యచపథ్యస్య వక్తా శ్రోతా చదుర్లభః॥ మిగుల ప్రియవచనములాడువారలు అనేకులెల్లప్పుడును సులభముగ దొరుకుదురు. అప్రియములైనను మిగుల హితవాక్యములు చెప్పువారును వినువారును దొరుకుట యరుదు. మఱియు సమస్తప్రాణులను చంపునట్టి కాలమృత్యువుచే గట్టబడి నశించుచున్న నిన్నుజూచి "మండుచున్న గృహమునువలె" నిన్నుజూచి యూరకుండజాలక, యింతగూరము చెప్పితిని.

మండుచుండెడి నిప్పుతో సమానములైనవియును, మహాతీక్ష్ణములైనవియును, బంగారుచే నలంకరింపబడినవియును నగుబాణములచేరాముడు నిన్నుకొట్టుచుండ చూచుటకునాకిష్టములేదు. మఱియు యుద్ధమునందు, మహాబలపరాక్రమశాలులును, అస్త్రవేత్తలును, నగు రాక్షసులు కాలమృత్యువుచేగొట్టబడి యిసుకతోజేసిన సేతుకట్టలవలె నాశమొందుదురు. నీవు గురువగుటవలన నీమేలుగోరి నాకుతోచినదిచెప్పితి. ఆవిషయమునందు నన్నుక్షమింపుము. సమస్తప్రయత్నములచే నిన్నును యీ లంకానగరమును సమస్తరాక్షసులను రక్షించుకొనుము. నీకుమంగళమగుగాక. నేనుపోయెదను. నేనుపోయినపిమ్మట నీవు సుఖముగనుండుము. రాక్షసుడా! రావణాసురుడా! నేను నీమేలుగోరి యెంతచెప్పినను నామాట నీకు రుచింపకున్నది. గతాయువులగువారు చచ్చినవారితో సమానులేగదా? కావున అట్టివారు నీస్నేహితులుచెప్పెడి హితవాక్యములను వినరు.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి పదునారవ ము గిసెను.

విభీషణుడు తనమంత్రులతోగూడలంకానగరమునువిడిచి శ్రీరాములసన్నిధికి వచ్చుట.

రావణాసురుని తమ్ముడగు విభీషణుడు, యిట్లు రావణునితో పరుషముగ మాటలాడి తత్క్షణమున ముహూర్తకాలములో లక్ష్మణసమేతుడగు రాముడున్నచోటికిబోయె. అట్లుగగనమార్గముననున్నవాడును, మేరుపర్వత శిఖరముయొక్క యాకారమువంటి యాకారముగలవాడై మిగుల ప్రకాశించుచు మెఱుపుతీగవలెనున్నవాడును, నగు విభీషణుని భూమియందున్న వానరులందఱును జూచిరి. మఱి యునట్లు అనల, శరభ, సంపాతి, ప్రఘసలను నలుగురు రాక్షసులతోగూడివచ్చుచున్న విభీషణునిజూచి, మహాబుద్ధిమంతుడును, అజేయుడును వానరాధిపుడును, నగు సుగ్రీవుడు వానరులతోగూడి యాలోచించె. అట్లు సుగ్రీవుడు ఒకముహూర్తకాలము ఆలోచించి యంత ఆంజనేయుడు మొదలగు వానరులనంపఱినిగూర్చి వారితోమిగుల నుత్తమమగు నీమాటజెప్పె. ఓవానరులారా! ఈరాక్షసుడు సమస్తాయుధములను ధరించి నలుగురు రక్కసులతోగూడమనలను చంపుటకు వచ్చుచున్నాడు. చూడుడు. అనిసుగ్రీవునిమాటవిని, వృక్షములను, పర్వతములను చేతబుచ్చుకొని యిట్లనిచెప్పిరి. వానరేశ్వరుడా! సుగ్రీవుడా! ఈదురాత్ములనుచంపుటకు మాకు శీఘ్రముగ సెలవియ్యవలయును. వీరలుమిగుల స్వల్పశౌర్యముగలవారలు. వీరినిజంపి నేలపైబడద్రోసెదము. అనియిట్లు వానరులు ఒకరితోనొకరు మాటలాడుచుండగానే విభీషణుడు సముద్రముయొక్క ఉత్తరపుదరిచేరి క్రిందికిదిగక ఆకాశమార్గముననేయుండె. అట్లాకాశమార్గముననుండె, మహాప్రాజ్ఞుడును, మిగులపూజ్యుడును, నగు విభీషణుడు సుగ్రీవాది వానరశ్రేష్ఠులనందఱినిజూచి పెద్దయెలుంగనవారందఱు వినునట్లు యిట్లనియె. దురాచారుడును, రావణాసురుడను పేరుగలవాడును, రాక్షసేశ్వరుడును, నగు రాక్షసుడు ఒకడుగలడు. నేను ఆరావణాసురునకు తమ్ముడను. నాపేరువిభీషణుడందురు. ఇది అట్లుండనిండు. ఆరావణాసురుడు జటాయువునుజంపి జనస్థానముననుండి సీతాదేవిని అపహరించి తెచ్చియున్నాడు. ఆసీతాదేవి మహావ్యసనముచేత పరవశయైయున్నది. ఆసీతాదేవిచుట్టును రాక్షసస్త్రీలను కావలియుంచియున్నాడు. నేనుఆరావణాసురునితో సీతాదేవిని రామునకివ్వుమనియుక్తియుక్తములగు మాటలతో పెక్కుకారణములను చూపుచు పలుమారు బోధించితిని. అట్లుబోధించినను "మృత్యుసన్నిహితుడైనవాడు ఔషధమును దిననియట్లు" కాలచోదితుడగు నారావణాసురుడు నేనెన్ని హితవాక్యములు చెప్పినను నామాటలను వినడాయె. అట్లు నేనుజెప్పిన హితవచనములను వినకుండుటయేగాక అతడు నన్ను పరుషములాడి, దాసునింబోలె దూషించి యవమానించె. కావుననేను పుత్రులను భార్యనుగూడ విడనాడి రాముని శరణాగతినైవచ్చితి. ఆకారణముచేత, సమస్తలోకములవారికిని శరణుపొందతగినవాడును, మహాత్ముడును, రఘువంశమునజన్మించినవాడును, నగు రామునికొఱకు, విభీషణుడను నేనువచ్చియున్నానని శీఘ్రముగదెలుపుడని విభీషణుడు సుగ్రీవాది వానరులతోజెప్పె. అంత నీమాటను విన్నంతనేమ

మహాపరాక్రమశాలియగు సుగ్రీవుడు అతివేగముగ రాముని యొద్దకుబోయి లక్ష్మణుని యెదుట రామునితో నిట్లనియె. రామా! రావణాసురుని తమ్ముడు విభీషణుడనువాడు నలువురు రాక్షసులతో గూడవచ్చి నిన్నుశరణుజొచ్చినాడు. విరోధులను తపింపజేయునట్టి రామచంద్రా! వానరులకు మేలుగలుగుటకును, శత్రువులకు కీడుగలుగుటకును, కార్యాకార్య విచారము చేయుటయందును, సేనాసన్నివేశమునందును, చారులను బంపుటయందును, మిగుల హెచ్చరికగలవాడవై యుండుము. నీకుమంగళమగుగాక, ఈరాక్షసులు కామరూపులు. అగపడకుండయుండి యుద్ధముచేయుదురు. వీరలు యుద్ధవీరులు. మిగుల కపటోపాయులు. వీరలనెంతమాత్రమునమ్మరాదు. ఒకవేళ ఈవిభీషణుడు రాక్షసేశ్వరుడగు రావణాసురుడు పంపినచారుడై యుండును. వీడుమనలోచక్కగాయిమిడిపోయి మనకు మిత్రభేదము గలిగించును. అట్లుగానియెడల మిగుల బుద్ధిమంతుడగు నీవిభీషణుడు మనకుచక్కగా నమ్మకముబుట్టించి మనలోయిమిడియుండి ఛిద్రముదొరికినప్పుడు, తానేమనలను బ్రహరించును. కావున శత్రుసైన్యమువారినిగ్రహింపరాదుగాని మిత్రసేనలను మూలబలములను, భృత్యసేనలను, వీటినన్నిటినిగ్రహింపవచ్చును. ప్రభుడవగు నోరాముడా! ఈతడు నీకు శత్రువును, రాక్షసేశ్వరుడును, నగు రావణాసురునితమ్ముడు. శత్రుపక్షమునుండివచ్చినవాడు. కావున యితనినెట్లునమ్మవచ్చును. యుక్తవ్యాపారములుగలవారిలో నుత్తముడవగు నోరామా! ఈవిభీషణుడు రావణాసురునిచే బంపబడిన చారుడనియెంచుము. కావున నతని పరిగ్రహింపగూడదని యోచించెదను. రామచంద్రా! ఈరాక్షసుని, రావణాసురుడు కుటిలోపాయముచేత పంపెను. నీవీతని చక్కగా నమ్మినవెనుక ప్రచ్ఛన్నుడై మనలను బ్రహరించుటకువచ్చినాడు. మిగుల ప్రజ్ఞావంతుడగు శత్రువు యెవ్వరికిని దెలియకుండునట్లు తనశత్రుసేనలయందు బ్రవేశించి ఛిద్రము వచ్చుతరిగాచియుండి అనేక కాకులను ఒకగుడ్లగూబచంపినట్లు తనశత్రువులను జంపును. ఈవిభీషణుడు మహాక్రూరుడగు రావణాసురుని తమ్ముడుగదా! కావున యితనిని యితనిమంత్రులను మిగులక్రూరముగ చంపవలయును అనియిట్లు మాటలాడుటయందు పండితుడును వానరేశ్వరుడును, నగు సుగ్రీవుడు వాక్యవిశారదుడగు రామునితోనతివేగముగజెప్పి యూరకుండె. అంత మహాకీర్తిమంతుడగు రాముడు సుగ్రీవుడుచెప్పిన మాటనువిని తన సమీపముననున్న యాంజనేయుడు మొదలగు వానరులతో నిట్లనియె. వానరశ్రేష్ఠులారా! వానరేశ్వరుడగు సుగ్రీవుడు రావణాసురునితమ్ముడగు విభీషణునిగురించి యుక్తియుక్తమును, అర్థముతోగూడినదియును, నగు మాటచెప్పె. అది మీరుగూడవినుచుంటిరిగదా. వానరులారా! కార్యసంకటమువచ్చినప్పుడు మిగులబుద్ధిమంతుడును, సత్పురుషుడును, మిగులసమర్థుడును, స్నేహితునియొక్క శాశ్వత సంపదనుగోరువాడును, నగు మఱియొకస్నేహితుడుగూడ నుపదేశించుట యుచితము. కావున మీరలుమీకుదోచిన యర్థమును జెప్పుడు. అనిరాముడడుగగానే వానరులందఱును రామునకు మేలుసేయగోరి రామునిజూచి యుపచారపూర్వకముగనతిత్వరితముగ తమతమ యభిప్రాయములను యిట్లనిదెలిపిరి. రాముడా! ముల్లోకములయందును నీకుతెలియని యర్థంబేమియునులేదు. అయినను మాయందలి స్నేహధర్మమును వెల్లడిచేయుటకును మమ్ము గౌరవించుటకును యిమ్మడుగుచున్నావు. మఱియు నీవు సత్యమే వ్రతముగా గలవాడవు. మహాశూరుడవు. పరమధార్మికుడవు. దృఢమైన శౌర్యము గలవాడవు. ఎట్టికార్యమునుగాని పరీక్షించి చేయువాడవు. జ్ఞాపకశుద్ధిగలవాడవు. నీవు స్నేహితులయందమిత ప్రేమ గలవాడవు. కావున బుద్ధిశాలులును, మిగుల సమర్థులును, నగు నీమంత్రులు క్రమముగనొక్కరొక్కరుగ యుక్తియుక్తముగ వారివారికి దోచిన యభిప్రాయమును జెప్పవలయును. అని యావానరులందఱును యీప్రకారముగజెప్పిరి. అంత మొట్టమొదట మహాబుద్ధిమంతుడగు నంగదుడు విభీషణుని పరీక్షించుటనుగురించి రామునితో యిట్లనియె. రామచంద్రా! శత్రువుయొద్దనుండివచ్చినవాడు సమస్తవిధములచేతను సందేహింపదగినవాడేను. విభీషణునియందు మనము తటాలున నమ్మకముంచరాదు. మఱియు కుటిలముగలవారు తమయభిప్రాయమును యితరులకు దెలియకుండ నటించుచు ఛిద్రములగపడి నపుడు చక్కగబ్రహరింతురు. కావుననట్టి గొప్ప అపాయముసంభవించును. ఏవిషయమునందుగాని గుణదోషములను చక్కగ విచారించి నిశ్చయించి గుణములుండెనేని యంగీకరింపవలయును. దోషములుండెనేని విసర్జింపవలయును. మహారాజా! రామా కొంచమైనను గుణముగాని దోషముగాని లేనివాడొక్కడైననుండడందురేమో! యీవిభీషణునియందు దోషగుణములు హెచ్చుగనుండిన నిస్సందేహముగ వీనిని విడువవలయును. అట్లుగాక దోషగుణములకన్నను గుణములు హెచ్చుగనుండినచో వీనినంగీకరింపవలయును. అనియంగదుడు రామునితో జెప్పె. అంతశరభుడు చక్కగ నాలోచించి నిశ్చయించి అర్థయుక్తమగు నీమాటజెప్పె. పురుషోత్తముడా! రామచంద్రా! అతివేగముగ నీవిభీషణునియొద్ద కొక

చారునిపంపుము. మఱియు సూక్ష్మబుద్ధియగు నొకచారుని బంపి యతనిని చక్కగాపరీక్షించి నీతిశాస్త్రమునందుచె ప్పబడినచొప్పున యథాన్యాయముగ నంగీకారముచేయవ లయును. అని శరభుడుచెప్పె.

అంత మిగులపండితుడగు జాంబవంతుడు శాస్త్రోక్తప్ర కారముగనాలోచించి గుణయుక్తమును దోషరహితము నునగు నీమాటచెప్పె. ఈవిభీషణుడు, నీతోబద్ధవైరముగల వాడును, పాపిష్ఠుడును, రాక్షసేశ్వరుడును, నగురావణా సురునికి తమ్ముడు. ఆరావణాసురునియొద్దనుండి వచ్చినవా డు. అతడిప్పుడుయిచ్చటికివచ్చుటకుతగినకారణముగూడలే దు. కావునసమస్తవిధములచేనితడుసంశయింపదగినవాడు. అని జాంబవంతుడుచెప్పె. అంత న్యాయాన్యాయము లా లోచించుటయందు మిగులపండితుడును, చక్కగమాటలా డువాడును, నగు మైందుడుతెస్సగనాలోచించి హితుస హితమగునీమాటచెప్పె. రాజోత్తమా ! రామచంద్రా! మంచిమాటలచే నారావణాసురుని వృత్తాంతమంతయు మెల్లగనీవిభీషణునివలన దెలిసికొనవలయును. అట్లుయీవి భీషణునియొక్క వాస్తవమైనభావమును దెలిసికొని, నతమ దుష్టుడో లేక సాధువొకనుగాని తగినయాలోచనచేయవల యును. అనిమైందుడుచెప్పె. అంత, శాస్త్రసంస్కారసం పన్నుడును, మంత్రులలోనుత్తముడును నగు నాంజనేయు డు, మిగులమృదువైనదియును, విశేషార్థముతోగూడుకొ న్నదియును, మధురమైనదియును, మహాసూక్ష్మమైనదియు ను, నగు నీమాటచెప్పె. ఓరామచంద్రా! బృహస్పతివచ్చి నీతోమాటలాడిననుగూడ, మిగులశ్రేష్ఠమైన బుద్ధిగలవాడ వును, సమర్థుడవును, మాటలాడుటయందు పండితుడవు ను, నగు నిన్నుఅతిక్రమించుటకు శక్తిమంతుడుగాడు. రా జోత్తమా! రామా! నేనునాకుగలతర్కవాదకుశలతచేత గాని, స్పర్ధచేతగాని, నేనందఱికన్ననతిశయుండనుగావల యుననిగాని, నా ఇష్టముచొప్పుననుగాని, సమాధానము చెప్పుటలేదు. అయిననీకు నాయందుగలగౌరవముచేత నా కుదోచినమట్టుకు యథార్థమునుచెప్పుచున్నాను. గుణదో షములు నిర్ణయించి యాతని చేర్చుకొనడముగానిలేక త్రోసివేయడముగాని చేయవలయునని మంత్రులుచెప్పిన మాటయందు నాకుదోషముచక్కగానగపడుచున్నది. అ ట్టికార్యముఉచితముగాదు. రాచకార్యములయందు ప్రవే శపెట్టక గుణదోషములు తెలిసికొనుటకు సాధ్యముగాదు. గుణదోషములు తెలిసికొనకయే, రాచకార్యములయందు నియోగింపగూడదు. కావునఅంగదుడుచెప్పినమాటసరియైె నదికాదు. చారునిబంపిరహస్యముగ నతనియభిప్రాయము తెలిసికొనవలయునని శరభుడుచెప్పినమాటయు సరియైన దికాదు. ఏలననగా దూరముననున్నవానియొద్దికిచారులనం పవలయును. సమీపముననమాటలాడుచుండువాని యొద్దకు చారునిఅంపుటచే నేమిప్రయోజనము. మఱియు విభీషణు డుఅనుచితదేశమున అనుచితకాలమునవచ్చినాడని జాం బవంతుడుచెప్పె. ఆవిషయమునుగురించియు నాకుతోచి నమట్టుకు కొంతచెప్పవలసియున్నది. వినుము. ఈదేశము నుయీకాలమును విభీషణుడువచ్చుటకు తగినదేను. ఏలన నగా, ఈవిభీషణుడు, రావణాసురుని, నిన్నునుచక్కగవి మర్శించి, రావణాసురునియందలి దోషగుణములను, నీ యందలి సుగుణములను చక్కగదెలిసికొని, రావణాసురు నియందలి దుస్స్వభావమును, నీయందలిపరాక్రమమునుజూ చి తనమనస్సునందుచక్కగనాలోచించి రావణునివిడిచినీ యొద్దకువచ్చె అటువచ్చుటయుక్తముగానేయున్నది. రాము డా! కొందఱు తెలియబడకుండరహస్యముగపోయివిభీషణుని వృత్తాంతమడుగవలయునని మైందుడుచెప్పిన విషయమం దును ఆలోచింపవలసియున్నది. ఎట్లనగా, తటాలునపో యి అడిగినయెడల, బుద్ధిమంతుడగు వాడుసందేహపడును. అట్లుసంశయించుటచే సుఖముకొఱకు వచ్చినస్నేహితుడు గూడ దుష్టుడుగానగుపడును. రామా! అట్లు సందేహిం పకమాటలాడినను తనయభిప్రాయమును దాచుకొనియే మాటలాడును. కావునయెంతసమర్థునకైనను వానిహృద యాభిప్రాయమెఱుగుటకు శక్యముగాదు. మఱియు నీవిభీ షణుడు మాటలాడుచుండగా నతనియందు దురభిప్రాయ మున్నట్లునాకగుపడలేదు. వీనిముఖవిలాసముగూడ మిగుల నిర్మలముగనున్నది. కావునఅతనియందెంతమాత్రము నా కుసంశయములేదు. దురభిప్రాయముగలవాడు నిస్సందే హముగను, నిర్భయముగనురాజాలడు. ఇతనుమిగులనిస్సం శయముగను నిర్భయముగనువున్నాడు. ఈతనిమాటలుగూ డ దురభిప్రాయముతోగూడుకున్నవి యెంతమాత్రమును గావు. కావుననీతనియందెంతమాత్రము సంశయములేదు. శ్లో॥ ఆకారశ్ఛాద్యమానోపి నశక్యోవినిగూహితుం। బలాద్ధివివృణోత్యేవ భావమంతర్గతంనృణామ్॥ మానవు లుముఖవిలాసమెంతదాచినను దాగియుండదు. ముఖవిలా సముమనస్సులోనుండెడి యభిప్రాయమును బలవంతము గబయలుపఱచును. ఈవిభీషణునియందుదోషములేదు. కా ర్యవేత్తలలోనుత్తముడవగు నోరామభద్రా! కార్యము, దే శకాలములననుసరించి తగినపురుషులయందు చక్కగప్ర యోగింపబడునేని శీఘ్రముగఫలించును. కావున నీవిభీషణు డు, నీవుచేయుచున్నప్రయత్నమునువినియు, రావణాసు

రుని దురాచారమునుజూచియు, నీవువాలినిజంపి సుగ్రీవునకుపట్టాభిషేకము చేయుటనువినియు, రాజ్యమునుగోరి బుద్ధిపూర్వకముగ నీయొద్దకువచ్చినాడు. ఈవిషయమిట్లున్నదిగాన విభీషణునిఅవశ్యముగ గ్రహింపవచ్చును. నేనునాశక్తికొలదిని నాకుతోచినమట్టుకు విభీషణునియొక్క నిష్కాపట్యమును గురించిచెప్పితిని. బుద్ధిమంతులలో నుత్తముడా! రామా! నేనుచెప్పినదంతయు వినావుగదా. తక్కినకార్యమునునీయిష్టముచొప్పున చేయుము.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి పదునేడవసర్గ ముగిసెను.

(*)

రాముడు సుగ్రీవాదులకు నీతినిబోధించి విభీషణునిచేర్చుకొనుట.

అంత మిగులపండితుడును, యెదిరింపనలవిగానివాడునునగు రాముడు, ఆంజనేయుడుచెప్పినమాటవిని, ప్రసన్నమనస్కుడై తనమనస్సులోనున్న యభిప్రాయమునుజెప్పె. నాకును విభీషణునిగురించి కొన్నిమాటలుచెప్పవలయుననియున్నది. వాటినంతయును నాశ్రేయమునుగోరునట్టి మీరందఱునువినగోరుచున్నాను కావునచెప్పెదనువినుడు. అతనియందెన్నిదోషములున్నను శరణాగతుడైవచ్చినవానినెన్నడైనను విడువరాదు. ఇదిపెద్దలకు పూజనీయమైనది. అంతవానరోత్తముడగు సుగ్రీవుడు రాముడుచెప్పినమాటవిని మిగులమంగళకరమగు నీమాటచెప్పె. ఈరాక్షసుడుదుర్మార్గుడుగానున్నను సాధువుగానున్ననుమనకవశ్యములేదు. ఇతడుయిట్టికష్టకాలమువచ్చినపుడు అన్ననేవిడిచివచ్చినాడుగదా. ఇంకయెవ్వనివిడువడు. కావుననితనినిపరిగ్రహింపరాదుఅనిచెప్పె. అంతసత్యపరాక్రముడును, కకుత్స్థవంశోద్భవుడును, నగు రామచంద్రుడు, వానరేశ్వరుడగు సుగ్రీవునిమాటవిని వానరులనందఱినిజూచి పిమ్మటశుభలక్షణుడగు లక్ష్మణునిదిక్కు తట్టుతిరిగిచూచి చిరునగవుతోనిట్లనియె.

వానరేశ్వరుడగు సుగ్రీవుడుచెప్పినమాట, శాస్త్రాధ్యయనముచక్కగజేసినవానికిని పెద్దలనుసేవించినవానికిని దక్కనన్యులకిట్టిమాట చెప్పనలవిగాదు. ఈవిషయమునందు ప్రత్యక్షమైనదియును లోకవ్యవహార సిద్ధమైనదియును, మహాసూక్ష్మమైనదియును, నగు నొకరాజధర్మముగలదు. అదినాకుగోచుచున్నది. చెప్పెదనువినుము. జ్ఞాతులును, ఇరుగుపొరుగు రాజులును, సంకటములుగలిగినప్పుడు ప్రహరింపయత్నింతురు. కావునవారు శత్రువులనియే చెప్పబడుదురు. ఆకారణమువలన విభీషణుడు రావణాసురునివిడిచి యిచటికివచ్చినాడు. ఇదియునుగాక మిగులయోగ్యులగురాజులు తమకిష్టులగు జ్ఞాతులను గౌరవింతురు. అట్టిరాజులకుగూడ, గట్టివాడగు జ్ఞాతివిషయమునందు విశేషముగ సంశయముగలిగియుండును. అట్లుండనింకపాపియగురావణాసురుడు జ్ఞాతినినమ్మునా? కావున విభీషణుడువానిచే శంకింపబడినవాడై యిచ్చటికివచ్చినాడు. సుగ్రీవుడా! శత్రుసేనను గ్రహించుటయందు నీవుపదోషముచెప్పితివో, దానినిగూర్చి నీకుశాస్త్రోక్తముగ చెప్పెదనువినుము. మనమురాక్షసకులస్థులముగాము. కావునమనము రాక్షసరాజ్యమపేక్షింపము. కావునరాక్షసుడగు విభీషణుడురాజ్యమునపేక్షించిమనవద్దకువచ్చినాడు. అయిననునీవు, రాక్షసులకింత శాస్త్రపరిజ్ఞానమున్నదాయని యడిగెదవేమో? రాక్షసులయందును మంచిపండితులుందురు. విభీషణుడట్టిజ్ఞానముతో వచ్చినాడు కావుననితనిని గ్రహింపవచ్చును. సంశయములేదు. మఱియు. శ్లో॥ అవ్యగ్రాశ్చ ప్రహృష్టాశ్చ న భవిష్యతి సంగతాః॥ జ్ఞాతులుకలతలేనివారును సంతసించినవారునునై యొకరితోనొకరు కలసియుండరు. కావున నెల్లప్పుడును పరస్పరవిరోధము గలిగియుందురు. అందువలన నితడురావణాసురునకుభయపడి మనవద్దికివచ్చినవాడుగానున్నాడు. అందుకుతగినట్లు యితనికంతధ్వని గొప్పదృష్టాంతముగనున్నది. జ్ఞాతులుపరస్పర విరోధముగలిగియుందురనుమాట లోకప్రసిద్ధముగదా. కావుననీవిభీషణుడుభయపడి మనదగ్గిరకువచ్చినాడు గనుకనితనిని గ్రహింపవచ్చును. నాయనా! మిత్రుడా! సుగ్రీవా! లోకమునందు తోబుట్టువులందఱును భరతునివంటివారుగానుండరు. మఱియు తండ్రులకుపుత్రులును నావంటివారుగానుండరు. లోకమునందు నీవంటిస్నేహితులును గలుగజాలరు. కావునలోకులందఱును పరమధర్మాత్ములైయుందురని యెంచకుము. అనిరామచంద్రుడులక్ష్మణునితోజెప్పె. అంతమిగులపండితుడగు సుగ్రీవుడు, రాముడుచెప్పినమాట విన్నంతనేదిగ్గునలేచి రామునకునమస్కరించియిట్లనియె.

ఓర్పుగలవారలలో నుత్తముడవగు నోరాముడా! రావణాసురుడుయీవిభీషణుని రహస్యముగ నిచటికిబంపెను. కావుననతనిచేర్చుకొనుట యుక్తముగాదని నాకుతోచుచున్నది. పాపరహితుడా! ఆజానుబాహుడా! రామా! ఈరాక్షసుడు కుటిలోపాయముచేత రావణాసురునిచే బంపబడినవాడు. ఇతడుప్రచ్ఛన్నవేషుడైయుండి, మనకునమ్మకముబుట్టించి నిన్నునునన్నునులక్ష్మణుని ప్రహరించుటకొఱకువచ్చియున్నాడు. నీవుయితనినిచేర్చుకొందువేని మంత్రివర్గసమేతముగ మనమందఱమును జంపబడుదుము. మ

తియునీవిభీషణుడు, మహాక్రూరుడగు రావణాసురునితమ్ముడుగదా. ఇతనినెట్లునమ్మవచ్చును. అనివానరేశ్వరుడునుమాటలయందు నేర్పరియును, నగు సుగ్రీవుడు, మాటలయందుపండితుడును రఘువంశమునబుట్టినవారిలో నుత్తముడును నగు రామునితోనీప్రకారముగజెప్పి యూరకుండె. అంతరామచంద్రుడు సుగ్రీవుడుచెప్పినమాటవిని, కొంతసేపుఆలోచించి వానరోత్తముడగు సుగ్రీవునితో మిగుల మంగళకరమగు నీమాటనుజెప్పె. సుగ్రీవుడా! ఈరాక్షసోత్తముడగు విభీషణుడుపరమదుష్టుడైననుకానిమ్ము లేక పరమయోగ్యుడైనను కానిమ్ము. ఇతడు ఏవిధముచేతనైనను నాకుకొంచెమైనను కీడుచేయజాలడు. వానరేశ్వరుడా! సుగ్రీవా! నాకుకోపమువచ్చి నేనుచంపగోరుదునేని లంకలోనుండురాక్షసులనుమాత్రమేకాదు? లోకమునందుగల సమస్తరాక్షసులను, పిశాచములను, దానవులను, యక్షులనుగూడ నాబొటనవ్రేలిచివరతో చంపగలను. అదట్లుండనిమ్ము. ఒకపావురము, తన్నుశరణుబొందిన తనశత్రువునొకనియథాన్యాయముగబూజించి తనమాంసమును అతనికి ఆహారముగనిచ్చి తినుమనిప్రార్థించె. ఈమాటలోకప్రసిద్ధమైయున్నదిగదా. వానరేశ్వరుడవగు నోసుగ్రీవుడా! ఆపావురము తనభార్యనపహరించిన బోయవాడురాగానే వానినిచేరదీసిరక్షించెనుగదా. అట్లుండమానవుడు, శరణుజొచ్చిన తనశత్రువునైననుగాపాడవలయునని యేలచెప్పవలయును? పూర్వము, కణ్వమహామునిపుత్రుడును, సత్యవాదియును, ఋషిశ్రేష్ఠుడును, నగు కండుమహాముని, పరమధర్మబోధకమును, సత్యమైన యర్థమునుజెప్పునదియునునగు నొకకథజెప్పె. దానినిజెప్పెదవినుము. శ్లో॥ బద్ధాంజలిపుటందీనం యాచంతంశరణాగతం। నహన్యాదానృశంస్యార్థ మపిశత్రుంపరంతప॥ శత్రువులను తపింపజేయువాడా! ఓరాజా! చేయబడినచేమోడ్పుగలవాడును, మహాదైన్యమునుబొందినవాడును, రక్షింపుమనివేడుచున్నవాడును, శరణుజొచ్చినవాడును, నగు శత్రువునైనను, క్రౌర్యములేకుండుటయను ధర్మముకొఱకు, యెంతమాత్రమునుచంపగూడదు. శ్లో॥ ఆర్తోవాయదివాదృప్తః పరేషాంశరణాగతః। అరిఃప్రాణాన్ పరిత్యజ్యరక్షితవ్యఃకృతాత్మనా॥ పండితుడగువాడు, తనశత్రువులలో పరమదుఃఖితుడైనవాడుగాని, మిగులగర్వించినవాడుగాని మఱియెవ్వడుగాని శరణుజొచ్చెనేని, తనప్రాణములైననువిడిచి వానినిరక్షింపవలయును. శ్లో॥ సచేద్భయాద్వామోహాద్వాకామాద్వాపినరక్షతి। స్వయాశక్త్యాయథాసత్త్వం తత్పాపంలోకగర్హితం॥ భయముచేతగాని, అజ్ఞానముచేతగాని, ఇచ్ఛచేతగాని, తనశక్తికొలదినిశరణాగతునిరక్షింపకుండునో, అతడు మహాపాపమునుబొందును. మఱియు లోకమునందును నిందితుడగును. మఱియు శరణనివచ్చినవానినిరక్షింపకున్నయెడల అతడునష్టకాముడై, తన్నురక్షింపనివానిచూచుచుండగానే యతనిపుణ్యమునంతయు దీసికొనిపోవును. శరణన్నవానినిరక్షింపకున్నవానికి సమస్తపుణ్యమునునశించిపోవును. శ్లో॥ ఏవందోషోమహానత్ర ప్రపన్నానామరక్షణే। అస్వర్గ్యంచాయశస్యంచబలవీర్యవినాశనం॥ శరణాగతులను రక్షింపకున్నచో యిట్టిగొప్పదోషముగలుగును. దానివలన నరకప్రాప్తియగును. అపకీర్తిగలుగును. బలపరాక్రమములునశించును. కావున సత్యమైనదియును, మిగులశ్రేష్ఠమైనదియును, నగు కండుమహామునియొక్కమాటచొప్పననేనుజేసెదను. అట్లుచేయుటచే పరమధర్మమును, మహాకీర్తియును, స్వర్గప్రాప్తియును, ఫలప్రాప్తియునుగలుగును. శ్లో॥ సకృదేవప్రపన్నాయతవాస్మీతిచయాచతే। అభయంసర్వభూతేభ్యోదదామ్యేతద్వ్రతంమమ॥ ఒకతేపమాత్రమే "శరణాగతుడను. నీవాడను" అనిచెప్పియాచించునేని వానికిసమస్తభూతములవలన భయములేకుండునట్లుచేసెదనని వరమిచ్చెదను. ఇదినావ్రతము. అనిరాముడుసుగ్రీవునితోజెప్పిమఱలనిట్లనియె.

వానరోత్తముడా! సుగ్రీవుడా! ఇతడువిభీషణుడైనను విభీషణవేషముతోవచ్చినరావణాసురుడైనను వీనికినేనుఅభయమునయిచ్చితిని. తత్క్షణమేతోడ్కొనిరమ్ము. అనిరాముడుచెప్పినమాటవిని, వానరప్రభువగు సుగ్రీవుడు అతనిశరణాగతవాత్సల్యమునకు మిగులనాశ్చర్యమునుబొంది కకుత్స్థవంశోద్భవుడగురామునితోనిట్లనియె. ధర్మజ్ఞుడా! సమస్తలోకములకును ప్రభువగురాముడా! సమస్తప్రాణులకునుసుఖమునిచ్చువాడా! రామచంద్రా! దృఢమైనవ్రతముగలవాడవును. న్యాయమార్గముననున్నవాడవునునగు నీవిట్లుమహాశ్రేష్ఠమగు మాటచెప్పితివి. ఇదిపరమాశ్చర్యముగనున్నది. స్వామీ! ఇప్పుడు నామనస్సునకుగూడ విభీషణుడుమహాపరిశుద్ధుడనితెలిసినది. నీవునుఆంజనేయుడును చెప్పినయుక్తియుక్తములగు మాటలచేతను, అతనియాకారమువలనను చక్కగాపరీక్షించి తెలిసికొంటిని. ఓరామచంద్రా! కావున మిగులపండితుడగు విభీషణుడుఅతివేగముగవచ్చి మాలోనొకడైయుండుగాక. మాకునుస్నేహితుడగుగాక. అని సుగ్రీవుడురామునితోచెప్పె. అంతమానవేశ్వరుడగు రాముడు సుగ్రీవుడు చెప్పినమాటనువిని, వానరేశ్వరుడగు సుగ్రీవునిచే గొనిపోబడిన విభీషణునితో, "గరుత్మంతునితోదేవేంద్రుడునేరునట్లు" స్నేహముతోజేరె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి పదునెనిమిదవసర్గము గిసెను.

విభీషణుని సముద్రజలముచే నభిషేకించుట.

అట్లు రామచంద్రుడు అభయమియ్యగానే, మహాపండితుడును, రావణాసురునితమ్ముడును, నగు విభీషణుడు మహాసంతోషమునుబొంది, మిగుల నమ్రుడై తలవంచి నేల జూచుచు, తనయనుచరులతోగూడ గగనముననుండి నేలపైదిగెను. అట్లు నేలకువచ్చి, ధర్మాత్ముడగు విభీషణుడు తననలువురు మంత్రులతోగూడ రామునిపాదములపైబడె. అట్లు రామునిపాదములపైబడె, అతనితో ధర్మయుక్తమగునీమాటచెప్పె. ఇదివరలోనీమాట సుగ్రీవాదులకుమిగుల కటువుగానుండినను, ఇప్పుడందిరికినివినుటకు మహాసంతోషకరముగానున్నది. నేనురావణాసురునితమ్ముడను. అతడు నన్నుఅవమానించెను. కావున సమస్తభూతములకు సురక్షకుడవగు నిన్నుశరణుబొందితిని. నేను, నాకువాసస్థానమగు లంకానగరమును, స్నేహితులను, ధనములను, విడిచినీవేగతియని నీయొద్దకువచ్చి నిన్నుశరణుజొచ్చితిని. ఇంకనారాజ్యమును, ప్రాణమును, సుఖములును నీయధీనములు. అనియిట్లువిభీషణుడుచెప్పినమాటనురాముడువిని, మిగులసాంత్వవచనములనతనినూరడించి, మిగుల నాదరముతోకరుణాకటాక్ష వీక్షణములజూచుచు నిట్లనియె. విభీషణా! రాక్షసుల బలాబలములనుయథార్థముగ నాకుజెప్పుము. అని రామచంద్రుడడుగగానే అంతవిభీషణుడు రావణాసురునిబలమంతయుజెప్పనారంభించి యిట్లనియె.

రాజపుత్రుడా! రాముడా! రావణాసురుడు బ్రహ్మదేవునివరముచేత గంధర్వులకును అసురులకును రాక్షసులకును మఱియు సమస్తభూతములకును చంపనలవిమైనవాడుగాడు. మఱియు రావణాసురునకు తమ్ముడును, నాకన్నయును నగు కుంభకర్ణుడు మహాబలపరాక్రమశాలి. మిగులతేజోవంతుడు. యుద్ధమునందు దేవేంద్రునకుసమానమైనబలముగలవాడు. ఇదియునుగాక కైలాసపర్వతమునందు జరిగినయుద్ధమునందుకుబేరుని సేనానాయకుండగు మాణిభద్రునిజయించిన మహాపరాక్రమశాలియును, రావణాసురుని సేనానాయకుడును, నగు ప్రహస్తునిగురించి, ఆంజనేయునివలన వినియుందురుగదా! మఱియు ఆరావణాసురునికుమారుడు యింద్రజిత్తనువాడు యుద్ధమునందు జ్యాఘాతవారణమును అంగుళీకవచమును, అనగానొవరికిగాని భేదింపనలవిగాని అకవచమునుదొడిగికొని, ధనుర్బాణములనుధరించినిలుచుండి, అట్టిఅదృశ్యుడగును. రాముడా! యుద్ధసమయమున రెండుపక్షములవారును బద్ధవ్యూహములై యుండునపుడు, ఈయింద్రజిత్తు హోమాదులచే నగ్నిహోత్రుని తృప్తినొందించి, ఆయగ్నిహోత్రునిమహిమచే నంతర్ధానుడై శత్రువులనుచంపును. మఱియు మహోదరుడును మహాపార్శ్వుడును, అకంపనుడునువీరుమొదలగు రావణాసురుని సేనానాయకులనేకులున్నారు. వారలుయుద్ధమునందు దిక్పాలురకుసమానులు. ఆలంకానగరమునందు, మాంసమునునెత్తురునే యాహారముగాగలవారును, కామరూప కామగమనములుగలవారును, నగు ప్రధానరాక్షసులు పదివేలకోట్లున్నారు. రాక్షసేశ్వరుడగు రావణాసురుడు ఆరాక్షసులను సహాయులుగనుంచుకొని దిక్పాలురతోగూడ యుద్ధముచేసెను. అప్పుడుఆదిక్పాలురును, సమస్తదేవతలును, మహాపరాక్రమశాలియగు రావణాసురునిచే జయింపబడి పారిపోయిరి. అనియిట్లు విభీషణుడుచెప్పగావిని దృఢపరాక్రమశాలియగు రాముడు మనస్సులోనంతయును ఆలోచించి, విభీషణునితోనిట్లనియె.

విభీషణుడా! నీవుయథార్థముగయిప్పుడుచెప్పిన, రావణాసురునికార్యములన్నియు నామనస్సునకువచ్చినవి. విభీషణా! నేను, ప్రహస్తుడుమొదలగు సమస్తమంత్రులతోను, బంధువులతోనుగూడ రావణాసురునిజంపి నిన్నులంకానగరమునకు రాజుగాజేసెదను. ఈమాటసత్యము. నీకుచెప్పుచున్నాను. రావణాసురుడు రసాతలముచొచ్చినను, పాతాళముప్రవేశించినను, బ్రహ్మలోకమునకుబోయినను నేనతనినిప్రాణములతోవిడువను. మఱియు యుద్ధరంగమునందు రావణాసురుని పుత్రమిత్రబంధు సేనాసమేతముగచంపకయే, నేనయోధ్యానగరమునకుబోను. నాముగ్గురుతమ్ములతోటి శపథముసేయుచున్నాను. అనియిట్లు, దుఃఖరహితములగు కార్యములుగల రామచంద్రుడుచెప్పినమాటవిని, ధర్మాత్ముడగు విభీషణుడు రామునకుశిరస్సాష్టాంగనమస్కారముచేసియిట్లనియె.

రామచంద్రా! నేను, రాక్షసులనుచంపుటయందును, లంకానగరమును ధర్షించుటయందును నాశక్తికొలదిని సహాయముచేసెదను. మఱియు శత్రుసేనలయందుచొచ్చి యుద్ధముచేసెదను. అనివిభీషణుడు రామునితోచెప్పె. అంతరాముడట్లుచెప్పుచున్న విభీషణునికౌగలించుకొని, మహాసంతోషమునుబొంది లక్ష్మణునిజూచి యిట్లనియె. కులమునకుగౌరవముగలిగించునట్టిలక్ష్మణా! నేనుసంతసించితిని. నీవుసముద్రజలముతెచ్చి యాజలముచేనతిశీఘ్రముగ, మహా

పండితుడగు ఈవిభీషణుని రాక్షసరాజుగా నభిషేకము చేయుము. అని రాముడుచెప్పగానే లక్ష్మణుడు రాజాజ్ఞ చొప్పున వానరశ్రేష్ఠులమధ్యమున విభీషణుని రాక్షస రాజుగా నభిషేకముచేసె. అప్పుడు వానరులందఱును, రామునియనుగ్రహమునుజూచి పరమసంతోషమున తత్క్ష ణమె సింహనాదములనుచేసి మహాత్ముడగు రామునిసాధు వాక్యములచే ప్రశంసించిరి. అంత యేకాంతమున సుగ్రీ వుడును, ఆంజనేయుడును, విభీషణునితో నిట్లనిరి. మన మందఱమును మహాపరాక్రమశాలులగు నీవానరసేనలతో గూడ నక్షోభ్యమగు నీసముద్రమును నెట్లుదాటగలము? మఱియుమనమందఱమును సేనాసమేతులమై వరుణునికుని కిపట్టగు సముద్రమును అతిశీఘ్రముగనెట్లుదాటగలమో అ ట్టియుపాయము మాకు తెలియదు. నీవు చెప్పవలయును. అనిసుగ్రీవాంజనేయులు అడుగగానే ధర్మజ్ఞుడగు విభీషణు డుయిట్లనియె. వానరశ్రేష్ఠులారా! రాజగు రాముడు స ముద్రుని శరణుపొందవలయును. ఎన్నరాని ఈసముద్రు డు, రామునికూటస్థుడగు సగర చక్రవర్తిచేత త్రవ్వబడిన వాడు. మఱియు సముద్రుడు మిగుల కృతజ్ఞుడు. కావున రాముని కార్యమును తప్పకచేయును. అని విభీషణుడుచె ప్పె. మిగుల పండితుడగు విభీషణుడిట్లుచెప్పగావిని సుగ్రీ వుడంత రామలక్ష్మణులున్న స్థలమునకుబోయె. అంతవి శాలమైన కంఠముగల సుగ్రీవుడు, విభీషణుడు చెప్పినట్లు మంగళకరమగు సముద్రోపాసనమునురామునకుజెప్పె. ధ ర్మశీలుడగు రామునకది ఇష్టపడినది. అంత మహాతేజుడును కార్యములయందు సమర్థుడును నగురాముడు, లక్ష్మణుని, వానరేశ్వరుడగు సుగ్రీవుని, చూచి, వారలసన్మానించుటకై చిఱునగవుతో నిట్లనియె. లక్ష్మణా! ఈవిభీషణుడు చెప్పిన యాలోచన నాకు సమ్మతముగనున్నది. నీకును సమ్మతమ గునేని నీవు సుగ్రీవునితో నాలోచించి నాకుచెప్పుము. మ ఱియు సుగ్రీవుడు మహాపండితుడు. నీవును ఆలోచనచే యుటయందు మిగుల శక్తిమంతుడవు. కావున మీరిద్దరును ఆలోచించి కార్యమును నిశ్చయించి మీకు సమ్మతమైనదా నిని చెప్పుడు. అని యిట్లు రాముడు చెప్పినమాటవిని, మ హా పరాక్రమశాలులగు లక్ష్మణ సుగ్రీవులిద్దఱును చేతులు మొగిడ్చి మహా వినయముతో నిట్లనిరి. పురుషోత్తమా! రా మా! ఏమియునాలోచని ఇట్టికాలమునందు మిగుల సుఖావ హముగ విభీషణుడు చెప్పినమాట మాకేలసమ్మతిపడదు? మహా భయంకరమైనదియును, వరుణున కునికిపట్టయినది యును, నగు సముద్రమునందు సేతువు గట్టకయే, లం కానగరమునకు బోవుటకు దేవేంద్రునితోగూడిన దేవాసు రలకైన నలవిగాదు. పండితుడగు విభీషణుడుచెప్పినమాట యథార్థము. ఆప్రకారమే చేయవలయును. కాలముపో గొట్టగూడదు. మనమందరమును సమస్త సేనలతోగూడ, రావణాసురునిచే పాలింపబడుచుండెడి లంకానగరమున కుజేరునట్లు సముద్రుని ప్రార్థింపవలయును. అని ఇట్లు లక్ష్మణసుగ్రీవులు చెప్పినమాటవిని, రాముడు సముద్రతీర మున ధర్భలను పఱచుకొని "అగ్నివేదియందు అగ్నిహో త్రుడుబోలె" దానిపైపరుండె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలిపందొమ్మిదవసర్గ ము గిసెను.

రావణాసురుడుశుకుడను దూతను రామునివ ద్దకుబంపుట.

అంత మహా పరాక్రమశాలియగు శార్దూలుడను రా క్షసుడువచ్చి, సుగ్రీవునిచేత చక్కగారక్షింపబడినదై సము ద్రతీరమున విడిసియున్న సైన్యమునుజూచె. మిగులదురా త్ముడును, రాక్షసేశ్వరుడును, నగు రావణాసురుని చారు డైన శార్దూలుడనువాడు ఏమఱుపాటులేక వానరసేన నంతయు కలయజూచి మఱలనతి వేగముగ లంకానగరము నకుబోయి రావణాసురునితో నిట్లనియె. రాక్షసేశ్వరు డా! రావణాసురుడా! ప్రవేశింప నలవిగాక మిగులనగా ధమైనదియును, యెన్ననలవిగానిదియును, నగు వానరభ ల్లూకముల సైన్యము రెండవసముద్రమువలె లంకానగర ముపైకి వచ్చుచున్నది. మఱియు దశరథమహారాజ కుమా రులును, అన్నదమ్ములును, నగు రామలక్ష్మణులిద్దరును, మి గుల శ్రేష్ఠమగు నాయుధములనుధరించి, సీతయుండుస్థల మునకు వచ్చుచున్నారు. రాక్షసరాజా! రావణాసురుడా! మహాతేజులగు నారామ లక్ష్మణులు సముద్రతీరమునదిగి యున్నారు. ఆవానరసైన్యమెటుజూచినను పదియామడల దూరము భూమిని ఆవరించియున్నది. మహారాజా! రా వణాసురుడా! నీవు శీఘ్రముగ దూతలంబంపి చక్కగా చూచిరమ్మని యాజ్ఞాపింపుము. మఱియు నీవిషయమునం దు సామదాన భేదములను నీ మూడుపాయములలోనేదై న ప్రయోగింపవలయును. అని శార్దూలుడుచెప్పిన మాట విని, రాక్షసేశ్వరుడగు రావణాసురుడు యేమఱుపాటులే కఅతిశీఘ్రముగ తానుజేయవలసిన కార్యమును నిశ్చయిం చి, కార్యమునెఱిగినవారిలో నుత్తముడగు శుకుడనురా క్షసునిజూచి యిట్లనియె. నీవుపోయి వానరేశ్వరుడగు సు గ్రీవునిజూచి నామారుగ నేనుజెప్పుమాటలను విడువక, మహాధైర్యమును అవలంబించి మృదువచనములచే మిగుల

ర్రావ్యముగ నిట్లనిచెప్పుము. వానరేశ్వరా! మహారాజా! సుగ్రీవుడా! నీవు మంచికులమునందుబుట్టినవాడవు. మహాబలముగలవాడవు. మఱియు బ్రహ్మపుత్రుడగు ఋక్షరజుని కుమారుడవు. కావుననాకు బంధుడవు. తోడబుట్టుతోసమానుడవు. ఇదిగాక నీకు ఇందువలన లాభముగాని నష్టముగాని యెంతమాత్రమునులేదు. సుగ్రీవుడా! నేను రాచకొమారుడగు రామునిభార్యను అపహరించితినను దానివలన నీకేమినష్టము. నీవు బుద్ధిమంతుడవు. చక్కగా నాలోచించుకొనుము. ఇదంతయు నీకేల. నీవు ఊరక కిష్కింధకుబొమ్ము. ఈ లంకానగరము వానరుల కెంతమాత్రము పొందవలవిగాదు. దేవతలును గంధర్వులును గూడ బ్రవేశింపజాలరు. ఇంకవానరులును మానవులును ప్రవేశింపజాలరనిచెప్పనేల? అని ఇట్లు రాక్షసేశ్వరుడగు రావణాసురుడు చెప్పిపంపగా శుకుడట్లు పక్షిరూపమును ధరించి యతివేగముచే గగనమార్గమున రామలక్ష్మణసుగ్రీవాదులున్నచోటునకుబోయె. అట్లు శుకుడు సముద్రమునకు కొంచెనుమీదుగ గగనమార్గమున బహుదూరముపోయి సుగ్రీవాదులున్నస్థలమును జేరి, ఆకాశమార్గముననేయుండి, దురాత్ముడగు రావణాసురుడు చెప్పిపంపినమాటల నన్నిటిని ఒకటైనను విడువక సుగ్రీవునిజూచి యంతయుజెప్పె. అట్లుసుగ్రీవునితో జెప్పుచున్న శుకునిజూచి వానరులు యతనిని పిడికిళ్ళతో బాదుచుటకు అతిశీఘ్రముగ గగనవీధికెగిరిరి. అట్లుపైకెగిరి యావానరులు బలవంతముగ నతనిబట్టుకొని ఆకాశముననుండి నేలపై బడద్రోసిరి. అట్లావానరులుతన్ను బాధింపగ శుకుడు రామునిబేర్కొని ఇట్లనివిలపించె. కకుత్థ్సవంశోద్భవుడవగు నోరాముడా! ధర్మాత్ములుదూతలనుజంపరు. నన్ను ఈ వానరులు చంప నెత్నించియున్నారు. కావున వలదని యాజ్ఞాపింపుము. మఱియు నెవ్వడుస్వామిమతమునువిడిచి తనయిష్టముచొప్పున చెప్పునో అట్టి దూతనుమాత్రము అవశ్యము చంపవలయును. అని శుకుడు రామునితో జెప్పె. అట్లు శుకుడు యేడ్చుచుచెప్పుచున్న మాటలనువిని రామచంద్రుడు కరుణించి, శుకుని గొట్టుచున్న వానరోత్తములనుజూచి చంపవద్దని యాజ్ఞాపించె. అట్లు వానరులు పీడించి ఱెక్కలు కొంతవఱకువిఱువగా తేలికపడిన ఱెక్కలతో శుకుడు గగనవీధికెగిరి యచటనిలిచి సుగ్రీవునిజూచి మఱలనిట్లనియె. మహాబలపరాక్రమసంపన్నుడా! సుగ్రీవుడా! లోకమును నేడ్పించునట్టి రావణాసురునకు నేనేమి చెప్పవలయునో చెప్పుము. అని ఇట్లు రావణాసురునిచారుడగు శుకుడడుగగానే వానరోత్తముడును, వానరరాజును, మహాబలపరాక్రమశాలియును, మిగులశక్తిమంతుడును, నగు సుగ్రీవుడు శుకునితోనిట్లనియె. నీవునాకు మిత్రుడవుకావుగాన కరుణింపదగినవాడవుకావు. నీవు నాకొక ఉపకారముచేసినవాడవునుగావు. నాకుయిష్టుడవునుగావు. మఱియు నాకు మిత్రుడగు రామునకు శత్రుడవు. అదియునుగాక నాశత్రువగు వాలికిస్నేహితుడవుగావున నీవు వాలివలెనే చంపదగినవాడవు. రాక్షసేశ్వరుడా! రావణాసురుడా! నేను శీఘ్రకాలములోనే వచ్చి పుత్రమిత్ర బంధుసమేతముగ నిన్నుజంపెదను. మఱియు నపరిమిత సేనలతోవచ్చి లంకానగరమునంతయుభస్మముచేసెదను. ఓరిమూఢుడా! రావణాసురుడా! నీవు సమస్తదేవతలతోగూడిన దేవేంద్రునిచే రక్షింపబడినవాడవైనను, ఇంద్రునిమరుగుజొచ్చినను, సూర్యునిసమీపమునకు బోయినను, పాతాళలోకములో బ్రవేశించినను, రాముడునిన్నెంతమాత్రము విడువడు. అవశ్యము వధించును. రామునిబారింబడిన నిన్ను, మూడు లోకములయందునుపిశాచములు గాని, రాక్షసులుగాని, గంధర్వులుగాని, అసురులుగాని యెంతమాత్రను రక్షింపజాలరు. నీవు జటాయువును చంపితినని గర్వించియున్నావు కాబోలు. అతడుముసలివాడు. వృద్ధుడు. శక్తిలేనివాడు. అట్టివానిని జంపుట హెచ్చుగాదు. మఱియు నీవు సీతను దొంగిలి తెచ్చితినిగదాయని, ఒడలెఱుగకయున్నావు. విశాలములగు నేత్రములుగల సీతాదేవిని రాముడుగాని లక్ష్మణుడుగాని లేనికాలమునదెచ్చితివి. దానిచే నేమిఫలము. వారలుండుకాలమున దెచ్చితేగదా నీకు వారిశక్తితెలియును. నీప్రాణములు అపహరించునట్టివాడును, మహాబలముగలవాడును, మిగుల బుద్ధిమంతుడును, దేవతలకైన నెదిరింపనలవిగానివాడును, నగు రాముని నీవెఱుగవు. అని రావణాసురునితో జెప్పుమని సుగ్రీవుడు శుకునితో జెప్పె. అంతవానరోత్తముడును వాలిపుత్రుడును, నగు నంగదుడు సుగ్రీవునితో నిట్లనియె. ఓ మహారాజా! సుగ్రీవుడా! ఈ శుకుడు దూతకాడు. రావణాసురునిచారుడని నాకుతోచుచున్నది. ఇతడిచటనేయుండి మనసైన్యమునంతయు చక్కగా కనిపించెను. కావున వీనినిపట్టిచంపుడు. ఇతనిని లంకానగరమునకు బోనివ్వరాదు ఇదినాయిష్టము. అని యంగదుడు సుగ్రీవునితో జెప్పె. అంతసుగ్రీవుడట్లేచేయుడని వానరులకాజ్ఞాపించె. అప్పుడువానరులు రాజాజ్ఞవలన మీదికెగిరి అనాథవలె విలపించుచున్న యాశుకునిబట్టి బంధించిరి. అంత శుకుడచట మహాభయంకరులగు వానరులచే మిగుల పీడితుడై మిగులమహాత్ముడును, దశరథరాజ పుత్రుడును నగు రామునిబేర్కొనియిట్లనివిలపించెను.

ఓరాముడా! రాముడా! అయ్యయ్యో, ఈ వానరులు బలవంతముగ నాఱెక్కలు విఱుచుచున్నారు. నాకండ్లు పీకుచున్నారు. నిరపరాధినగు దూతనైన నేను వధింపబడుదునే, నేను పుట్టినదిమొదలు యిప్పటివరకును జేసినపాపములన్నియును నిన్నుజెందును. అని శుకుడు రామునిజేరొక్కని విలపించె. అప్పుడు రాముడు శుకునిరోదనమువిని దూతను జంపవలదు. వానిని భద్రపఱచి పెట్టుండని వానరులకాజ్ఞాపించి శుకుని చంపకుండునట్లుచేసె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి యిరువదియవ సర్గ ముగిసెను.

▶(✻)◀

—{ రాముడు సముద్రమునందు ధనుస్సునుప్రయోగించుట. }—

అంతశత్రుసంహారకుడగు రాముడు, సముద్రతీరమున దర్భలుపఱచుకొని తూర్పుముఖముగానుండి, చేతులు మొగిడ్చి సముద్రునకు నమస్కరించి, మహాసర్పముయొక్క శరీరకాంతివంటి కాంతిగల తనకుడిచేయి తలగడగానుంచుకొని, సముద్రునకెదుట శయనించె. మఱియు మిగుల సమర్థుఁడును మహాబాహుడును, నగు రాముడు, పూర్వము, బంగారుచే జేయబడిన యాభరణములచే నలంకరింపబడినదియును, శ్రేష్ఠములగు బంగారు బాహుపురులను, శ్రేష్ఠములయినముత్యములతో నొప్పుచున్న యాభరణములనుధరించియున్న యుత్తమస్త్రీలభుజములచే ననేకవిధముల బరామృష్టమైనదియును, పూర్వము చందనాగరు గంధములును రక్తగంధములును బూయబడి మంచివాసనలచే నొప్పుచున్నదియును, బాలసూర్యునివలె ప్రకాశించుచున్నదియును, పూర్వము హంసతూలికాతల్పమునందు సీతాదేవితలగడపైనుంచబడి ప్రకాశించుచున్నదియును, గంగాజలముచే సేవింపబడి తక్షకసర్పముయొక్క శరీరమువలె నున్నదియును, యుద్ధమునందు గడియప్రమానితోసమానమై శత్రువులకు మహాదుఃఖము గలుగజేయునదియును, మిత్రులకు మహాసంతోషమును గలుగజేయునదియును, మోకాటివరకువ్యాపించి మిగులపొడవైనదియును, సముద్రములే హద్దుగాగల భూమండలమునకంతయును ఆశ్రయమైనదియును, ప్రదక్షిణముగ బాణములు విడుచుచున్న తనయల్లెత్రాటియొక్క వఱపుచే పోయినచర్మము గలదియును, గొప్పయినుపగుదియతో సమానముగనున్నదియును, అనేకవేలగోదానములుచేసినదియును, నగు తనగొప్పకుడిభుజమును తలగడగానుంచుకొని, "ఇప్పుడునాకుచావుగాని లేక సముద్రమును దాటుటగాని సిద్ధింపవలయును." అనిమనస్సునందు సంకల్పించి, మిగులశుచియై మనోనియమమునువాజ్నియమమునుగలిగి, సముద్రమునకెదుట శయనించె. అట్లురాముడు నియమముతో దర్భలుపఱచిననేలపై బరుండగ మూడహోరాత్రములుగడచినవి. మఱియు నీతివేత్తయును, పరమధార్మికుడును, నగు రాముడు, సముద్రతీరమున మూడహోరాత్రములు దర్భలపై శయనించియుండి, నదీపతియగు సముద్రునియెడతెగక ఉపాసించుచుండె. అట్లురాముడు శుచియై యథాయోగ్యముగయెంతపూజించినను, మూఢుడగు సముద్రుడు రామున కగపడడయ్యె. అంత రాముడు సముద్రునిపైగోపించి, కొనకన్నులెఱ్ఱజేసి, తనసమీపముననున్నవాడును, శుభలక్షణములతో నొప్పుచున్నవాడును, నగులక్ష్మణునిజూచి యిట్లనియె.

తమ్ముడా! లక్ష్మణా! సముద్రుడు ప్రత్యక్షముగాకయున్నాడు. చూచితివా యితని గర్వము? శ్లో॥ ప్రశమశ్చక్షమాచైవఆర్జవంప్రియభాషితా। అసామర్థ్యంఫలంత్యేతే నిర్గుణేషుసతాంగుణాః॥ కోపములేకుండుటయు, అపరాధమునకోర్చుటయు, కుటిలములేకుండుటయు, ప్రియవచనములాడుటయు, అనునీసత్పురుషగుణములు దుష్టులకుశక్తిహీనతవలెదోచును. మఱియు, శ్లో॥ ఆత్మప్రశంసినంధృష్టందుష్టంవిపరిధావకం। సర్వత్రోత్సృష్టదండంచలోకస్సత్కురుతేనరం॥ లోకమునజనులు, ఆత్మస్తుతి చేయువాడును, దయలేనివాడును, దుష్టుడును, అధికప్రసంగియును, మంచిచెడుగు అనువివేచనములేక అందఱినితప్పకదండించువాడును, నగుపురుషునిగౌరవింతురు. శ్లో॥ నసామ్నాశక్యతేకీర్తిర్నసామ్నాశక్యతేయశః। ప్రాప్తుంలక్ష్మణలోకేస్మిన్జయోవారణమూర్ధని॥ తమ్ముడా! లక్ష్మణా! ఈలోకమునందు కీర్తిగాని, యశస్సుగాని, యుద్ధరంగమునందు గెలుపుగాని, మంచితనముచేత బొందనలవిగావు. లక్ష్మణా! ఇదిగోచూడుము, ఈక్షణముననే, నాబాణపరంపరలచే నఱుకబడినవియును, సముద్రమునందంతటను తేలుచున్నవియునునగు మొసళ్ళచేత నీసముద్రము నిండియుండునట్లుచేసెదను. మఱియు గొప్పదేహములుగల సర్పములును, ఏనుగుల యాకారముగల చేపలయొక్క తొండములును నాచేనఱుకబడి సముద్రమునబడియుండుట చూడగలవు. లక్ష్మణా! నాబాణపరంపరలచే, శంఖములయొక్కయు, ముత్యములయొక్కయు, సమూహములతో నొప్పుచున్నదియును, మత్స్యములతోను మొసళ్ళతోను గూడినదియును, నగుసముద్రమును యిప్పుడే యెండిపోవునట్లు చేసెదను. నేను మిగుల ఓర్పుతోనుండుటచేతగదా యీసముద్రుడు నన్నుశక్తిహీనునిగనెంచియున్నాడు. కావున నిట్టి

దుష్టులవిషయమునందు ఓర్పు యెంతమాత్రమును తగదు. సామోపాయముచే నెంతచూచినను యీసముద్రుడు నాకు ప్రత్యక్షముగాకయున్నాడు. ఓలక్ష్మణా! ధనుస్సును,సర్పములతో సమానములైన బాణములను దెమ్ము. ఈసముద్రము యెండిపోవునట్లుచేసెదను. అంతవానరులు కాలినడకతోనే లంకానగరమునకు బోవునట్లుచేసెదను. నేనిప్పుడు మిగుల కుపితుడనై కలతబెట్టనలవిగాని సముద్రమును కలతనొందించెదను. మఱియు చెలియలికట్ట నతిక్రమింపకుండునదియును, అలలచేనిండినదియును, నగుసముద్రను నాబాణములచే నతివేగముగ హద్దులేని దానిగాజేసెదను. లక్ష్మణా! ఈసముద్రముననుండెడి దానవులతోగూడ కలతనొందించెదను. అనియిట్లులక్ష్మణునితోజెప్పి, రాముడు ధనుర్బాణములనుధరించి, మహాకోపముచేత కండ్లుగిరగిరంద్రిప్పుచు ప్రళయకాలాగ్నిహోత్రమువలె మండుచు తేరిచూడనలవిగానివాడైయుండె. అట్లుండి రాముడు మహాభయంకరముగ ధనుర్జ్యాఘోషముచేసి ధనుస్సును దృఢముష్టింబట్టి, తనబాణములచే లోకములువడవడవడక,"దేవేంద్రుడనేకవజ్రాయుధములను బ్రయోగించునట్లు" మిగులతీక్ష్ణములగు బాణములను ప్రయోగించె. అంతనాఘోరబాణములు మహాకాంతిచేవెలుగుచు, భయపడినసర్పములతోనొప్పుచుండెడి సముద్రజలమునందు అతివేగముతోజొచ్చె. అప్పుడు సముద్రమునందలి అలలవేగము వాయువేగముతోగలసినదియును, మొసళ్లుచేపలుమొదలగు వానితోగూడినదియునునై మహాభయంకరముగనుండె. మఱియు మహాసముద్రమతివేగముగల గొప్పఅలల సమూహములతో నొప్పుచున్నదియును, అలలవేగమున బైకివచ్చిన శంఖములతోను ముత్యపుచిప్పలతోను గూడుకొన్నదియును, పొగతోగూడుకొని తిరుగుడువడుచున్న అలలుగలదియునై యొప్పియుండె. ఇంకను సముద్రముననుండునవియును, మిగుల ప్రకాశించుచున్న నేత్రములుగలవియునునగు సర్పములు మిగుల పీడనొంది విషముగ్రక్కుచు వెలువడినవి. పాతాళలోకముననుండువారును మిగుల పరాక్రమశాలులును నగు దానవులును రామబాణాగ్నిచే మిగుల పీడితులైరి. అప్పుడు మొసళ్ళతోను మత్స్యములతోను గూడిన సముద్రపు అలలు, వింధ్యమందరపర్వతములతో సమానములై అనేకములుగ లేచినవి. అట్టియెడ సముద్రము, మిగుల తిరుగుడువడుచున్న అలల సమూహములు గలదియును. భ్రాంతినొందిన సర్పములును రాక్షసులునుగలదియును, తిరుగుడువడుచున్న గొప్పమొసళ్లు గలదియునునై యొప్పుచుండె. అంతమహాభయంకరమైన వేగముగలవాడును,మహాభయంకరముగ శరసంధానము చేయుచున్నవాడును, మిగులకోపముచే నిట్టూర్పులు విడుచుచున్నవాడును, నగు రామునిజూచి, లక్ష్మణుడు రామునొద్దకుబోయి యింక బాణముసంధింపవలదు. చాలునుపూరకుండుము అని ధనుస్సునుగట్టిగా బట్టుకొనియె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి యిరువదియొకటవ సర్గ ముగిసెను.

▸(*)◂

సముద్రుడు శరీరమునుధరించి రామునివద్దకు వచ్చుట.

అంతట అప్పటికిని అగుబడకుండిన సముద్రునిగూర్చి, రాముడు మహాభయంకరముగ నిట్లనియె. సముద్రుడా! నిన్నిప్పుడు పాతాళలోకముతోగూడ యెండిపోవునట్లు చేసెదను. మఱియునోసముద్రుడా! నాబాణప్రయోగముచే నీళ్లన్నియుయింకిపోయి, జలజంతువులన్నియు దహింపబడి నపిమ్మట నీవున్నచోటునయిసుకమాత్రమే యుండును. సముద్రుడా! నాధనువునుండి విడువబడిన బాణవర్షముచే నిన్నెండిపోవునట్లు జేసినపిమ్మట, వానరులు కాలినడకతో నిన్నుదాటి, ఆవలిగట్టునకు బోదురు. దానవులకు నివాసస్థానమైన యోసముద్రుడా! నీవునాబలమునుగాని పరాక్రమమునుగాని కొంచెమైనను ఆలోచించికనుగొనలేవు. మఱియు నావలనగలుగునట్టి బాధనుగూడ తెలిసికొనజాలకున్నావు. నీకీయజ్ఞానము దానవులతోటి సహవాసదోషమువలన గలిగినదేమో? అనిచెప్పి మహాబల పరాక్రమశాలియగు రాముడు బ్రహ్మదండముతో సరివచ్చు బాణమును దీసికొని దానిని బ్రహ్మాస్త్రముచే నభిమంత్రించి, మిగుల నుత్తమమగు ధనువునందు సంధించి, ఆకర్ణాంతముగనీడ్చె. అట్లురాముడుధనుస్సునుఅతివేగముతోనాకర్షింపగానే భూమ్యాకాశములు పగిలినట్లుండినవి. పర్వతములన్నియు గడగడవడికినవి. లోకమునంతయు చీకటిగప్పినది. దశదిశలును కాంతిహీనములాయె. సరోవరములును, నదులును, కలతనొందినవి. చంద్రసూర్యులును అడ్డముగ నడిచిరి. నక్షత్రములు అడ్డముగనడిచె. అప్పుడు సూర్యకిరణములచే ప్రకాశింపజేయబడియున్నదియును. చీకటిచేగప్పబడినదియును నగు నాకాశము కొఱవులగుంపులచే ప్రకాశించుచున్న దానివలెనేయుండె. మహాభయంకరమగు ధ్వనితో ఆకాశమునందుండి పిడుగులు పడినవి. మఱియు ఆకాశమునందు ప్రళయవాయువులు మహాభయంకరముగవీచినవి. ఆమహావాయువేగమునకు మేఘములు ఆకాశమునుగప్పినవి. గొప్పవృక్షములు విఱిగిపడినవి. పర్వతా

గ్రములును సామాన్య పర్వతములును మహావ్యథనొందినవి. అప్పుడు ఆకాశమునందు వ్యాపించియున్న మహామేఘములన్నియు నొక్కటిగజేరి, మెఱుపువలె అగ్నిజ్వాలలం గ్రక్కినవి. ఆయగ్నులు పిడుగులై నేలపై బడెను. మఱియు చూడదగిన మనుష్యాది భూతములును పిడుగుధ్వనికి సరిగా నఱచినవి. చూడనలవిగాని పిశాచాది భూతములును, మహాభయంకరముగ నఱచినవి. అంత సమస్తభూతములును, మిగుల భయపడి నేలబడి కలత నొందినవియును, మహాదుఃఖమునొందినవియును నైయుండె. మఱియు సమస్తభూతములతోఁగూడియున్నదియును, గొప్ప అలలతోఁగూడినవియును, మహాక్రూరసర్పములతోను, క్రూరరాక్షసులతోనుగూడినదియును, నగు మహాసముద్రము మిగులభయంకరమైన వేగముగలదాయెను. అట్లతివేగమునుగలదియైన సముద్రము చెలియలికట్టవిడిచి, ఆమడమూరము వెనుకకుబోయెను. అట్లు వెనుకకుబోయిన సముద్రునిపై, శత్రుసంహారకుడగు రాముడు బాణము సంధింపడాయెను. అప్పుడు మిగుల గొప్ప పర్వతమగు మేరుపర్వత శిఖరమునుండి ఉదయించుచున్న సూర్యునివలె, సముద్రమధ్యమునుండి సముద్రుడుద్భవించె. మఱియు మిగుల సుందరమైన దేహముగలవాడును, ఎఱ్ఱని పూలదండలను, వస్త్రములను ధరించినవాడును, తామరఱేకులతో సమానములైన నేత్రములుగలవాడును, నానావిధములైన ఉత్తమపూలదండలను తలయందు ధరించినవాడును, గనులయందు బుట్టినరత్నములతోను, బంగారుసొమ్ములతోను, తనయందు బుట్టినయాభరణములతోను, అలంకరింపబడినవాడై, నానావిధములైన ధాతువులచే నలంకరింపబడిన హిమవత్పర్వతమువలెనున్నవాడును, కౌస్తుభమణికితో బుట్టువైన ముక్తాహారము నడుమనున్నదియును, ఎఱ్ఱని కాంతిగలదియును, నగు నాయకమణిని తనవిశాల వక్షస్థలమునందు ధరించినవాడును, గొప్ప అలల సమూహముగలవాడును, మేఘసమూహములచేతను, వాయువుచేతను, వ్యాకులుడైనవాడును, నగు సముద్రుడు మండుచున్న నోరుగల సర్పములతోఁగూడవైలువెడల చూడబడెను. మిగుల సుందరములైనరూపములుగలదేవతలలో నుత్తముడగు సముద్రుడు తిరుగుడునొందిన గొప్ప మొసళ్లుగలవాడును, కలతనొందిన సర్పములును, రాక్షసులును, గలవాడును, నానావిధములైన యాకారములు గల గంగా సింధువు మొదలగు గొప్పనదులచే బరివేష్టింపబడినవాడునునై రామునకు గాన్పించె. అంత మహాపరాక్రమశాలియగు సముద్రుడు రామునిదగ్గరకుబోయి తానుగానే ముందుగ రామునిబిలిచి నమస్కరించి బాణమును హస్తమునధరించియుండు రామునితో నిట్లనియె. ఓరామా! ప్రసన్నుడవగుము. భూమియును,

యువును, ఆకాశమును, నీళ్లును, నిప్పును, అనునైదు భూతములును స్థిరమైనమార్గమును అవలంబించి వాటివాటిస్వభావమునందున్నవి. అందువలన మిగుల లోతుగలిగి దాటనలవిగాకుండుట నాస్వభావము. నేనుదీనిని విడువనలవిగాదు. నేను ఈతత్వమును నీకుదెలిపితిని. రాజపుత్రుడా! రాముడా! కామమువలనగాని, లోభమువలనగాని, భయమువలనగాని, మొసళ్ళతోను, మత్స్యములు మొదలగు జలజంతువులతోను నిండియుండెడి నీటిని యెంతమాత్రము స్తంభింపజాలను. అయినను నాశక్తికి తగినకార్యము మాత్రముచేసెదను. రామచంద్రా! మీసేన సముద్రముదాటునంతవరకు, మొసళ్లు మొదలగు జంతువులు సైన్యమును బాధింపకుండునట్లు చేసెదను. రాముడా! వానరులు సముద్రముదాటుటకై మెరకేర్పడుటకు తగిన సహాయముచేసెదను. అనిచెప్పగావిని రాముడు సముద్రునిజూచి యిట్లనియె. సముద్రుడా! వ్యర్థముగానిదగు నీమహాబాణమును సంధించితినే, దీని నేస్థలమునవిడుతును. అని రాముడడిగె. అంత మహాతేజుడగు సముద్రుడు, రాముడు చెప్పినమాటనువిని, ఆగొప్ప బాణమునుజూచి, రామునితో నిట్లనియె. రాముడా! ఈప్రదేశమునకు సమీపముననే ఉత్తరమున, నీవలె లోకమునందు మిగుల ప్రఖ్యాతినొందినదియును, ద్రుమకుల్యమను పేరుగలదియును, మిగుల సుందరమైనదియును, నగు నొకప్రదేశముగలదు. అచట మిగుల భయంకరమైన చూపుగలవారును, మహాక్రూరకార్యముల జేయువారును, మహాపాపులును, నగు చెంబడివాండ్రు మొదలగు దొంగలనేకులున్నారు. వారు నాజలముద్రావుచు మహాదుష్టకార్యములను చేయుచున్నారు. రామచంద్రా! ఆపాపకర్ములు నన్నుతాకుటను నేను సహింపజాలను. కావున నీయమోఘ బాణమును వారిపై బ్రయోగింపుము. అనిసముద్రుడుచెప్పె. అంత మిగుల పరాక్రమవంతుడగు రాముడు సముద్రుడుచెప్పిన మాటనువిని సముద్రుని యిష్టము చొప్పున, మిగుల ప్రకాశమానమగు నాబాణమును ద్రుమకుల్యముపైవిడిచె. అదిమొదలు, రాముడు ఏస్థలముపై మండుచున్న పిడుగుతో సమానమైన యాబాణమును బ్రయోగించెనో, ఆస్థలము మరుకాంతారమని లోకమున మిగులప్రఖ్యాతినొందె. అప్పుడు ఆబాణప్రయోగముచే పీడింపబడిన ఆభూమి గొప్పధ్వనిగలుగునట్లు అఱచె. ఆదెబ్బతగిలిన స్థలముదారిని పాతాళజలముపైకెగిరె. ఆకూపము వ్రణకూపమని ప్రసిద్ధినొందె. ఆవ్రణకూపమునందలి జల

మునము ద్రజలమువలెనే ఎల్లప్పుడు నాశములేకయుండును. అట్లు భూమిపగులుచుండగ మహాభయంకరమగు ధ్వనిగలిగినది. మఱియు రాముడట్లు బాణమును ప్రయోగింపగానే, ఆద్రుమకుల్యామున పల్లపు నేలయందున్న జలము శోషించిపోయె, అట్లు జలమెంతయుపోవుటచే నాస్థలము మరుకాంతారమని మూడులోకములయందును బ్రఖ్యాతినొందె. అంత దేవతల పరాక్రమమువంటి పరాక్రమముగలవాడును, పండితుడును, దశరథరాజపుత్రుడును, నగు రాముడు, సముద్రకుక్షిప్రదేశమగు నాద్రుమకుల్యామునను్న పాపములను నశింపజేసి దానికి మరుకాంతారమను పేరొసగి యంత నామరుకాంతారమునకిట్లు వరమిచ్చె. ఈ మరుకాంతారము, విశేషముగా గోవులుగలదియును, రోగములులేనిదియును, ఫలములతోను మూలములతోను తేనియలతోనుగూడినదియును, అందలి ప్రాణులకు మిగులనన్యోన్య స్నేహముగలదియును, విశేషముగ పాలుగలదియును, మంచి సువాసనతో నొప్పుచుండెడి నానావిధములైన మూలికలుగలదియునునై యుండగలదు. అని రాముడువరమిచ్చె. రాముని వరదానమహిమచే మరుకాంతారమిట్లు అనేకసుగుణములతోగూడి, నిరంతరము మహాశుభకరమైన ప్రదేశమైయుండె. అట్లే ద్రుమకుల్యము నాశమొందినపిదప నదీపతియగు సముద్రుడు, సమస్త శాస్త్రములనెఱిగిన రామునిజూచి యిట్లనియె. సౌమ్యుడా! రామా! శ్రీమంతుడగు నలుడను నీవానరుడు విశ్వకర్మయొక్కపుత్రుడు. ఇతడు విశ్వకర్మచే వరములను బొందియున్నాడు, ఇతడు విశ్వకర్మతో సమానుడు. మిగుల నుత్సాహముగల ఈ వానరుడు నాయందు సేతువును నిర్మించవలయును. నేనా సేతువుమునగకుండ పైకెత్తి పట్టుకొనియుండెదను. ఈతడు తండ్రితో సమానుడు. అనియిట్లు సముద్రుడు రామునితో జెప్పియంతనదృశ్యుడయ్యె. అప్పుడుమిగులబలవంతుడును, వానరోత్తముడును, నగు నలుడు లేచి రామునిజూచి రామునితో నిట్లనియె. రాముడా! నేను నా తండ్రియిచ్చిన శక్తిని అవలంబించి, మిగుల విశాలమగు నీసముద్రమునందు సేతువు గట్టెదను. సముద్రుడు చెప్పిన మాటనిశ్చయము. శ్లో॥ దండఏవ వరోలోకే పురుషస్యేతి మేమతిః। ధిక్ క్షమామకృతజ్ఞేషు సాంత్వం దానమథాపి వా॥ లోకమున కృతజ్ఞులుగానివారి విషయమునందు క్షమయు సామదానోపాయములును పనికిరావు. పురుషుడు దండోపాయమునే ప్రయోగింపవలయునని నాయభిప్రాయము. మిగులభయంకరాకారుడగు నీసముద్రుడు సగరునిచే ద్రవ్వబడినవాడయ్యును కృతజ్ఞతలేక, రాముడు దండించునను భయముచేత సేతువుగట్టుటకు రామునకు స్థలమిచ్చె. శ్రీరాముడా! మందరపర్వతమునందు విశ్వకర్మ నాతల్లికొకవరమిచ్చె. నేనా విశ్వకర్మయొక్క ముఖ్యపుత్రుడను. శిల్పవిద్యయందు విశ్వకర్మతో సమానుడను. మఱియు నితరులెవ్వరు చెప్పకుండిన నాగుణములను నేనెంతమాత్రము చెప్పను. నేను సముద్రమున సేతువుగట్టగలను. సముద్రుడు నిశ్చయము చెప్పినాడు. నేనజ్ఞాపకము వచ్చియుంటిని. రాముడా! నీకిష్టముగలదేని యిప్పుడే వానరులు సేతువుగట్ట యత్నింతురుగాక! అని నలుడు చెప్పగానే రాముడు వానరులతో సేతువుగట్టమని చెప్పె. అంతవానరోత్తములందఱును రామునిచే తనాజ్ఞాపింపబడినవారై, మిగుల సంతోషమునుబొంది లక్షలలక్షలుగా గుంపులుగూడి మహారణ్యములకబోయిరి. అట్లుపోయి, గొప్పపర్వతములతో సమానయాకారములుగల యావానరశ్రేష్ఠులందఱును మహావృక్షములనువిఱిచి సముద్రమునకు జేర్చిరి. మఱియు నావానరులు, మద్దిచెట్లను, సన్నమద్దిచెట్లను, చండ్రచెట్లను, వెదుళ్లను, కొండమల్లెచెట్లను, ఏరుమద్దిచెట్లను, తాడిచెట్లను, బొట్టుగుచెట్లను, తిమిశవృక్షములను, మారేడుచెట్లను, ఏడాకులయరటిచెట్లను, పూచియుండెడుకొండగోగుచెట్లను, మామిడిచెట్లను, అశోకవృక్షములనుదీసికొనివచ్చి సముద్రమునునించిరి. ఆవానరోత్తములు కొన్నిచెట్లను వ్రేళ్లతోడను, కొన్నిటిని వ్రేళ్లులేకుండగను, కొన్నిటిని వ్రేళ్ళతోగూడను, పెఱికి దేవేంద్రుని టెక్కెములోయన పైకెత్తి తెచ్చి సముద్రములోబడవైచిరి. మఱియు నావానరులు తాటిచెట్లను, దాడిమచెట్లను, టెంకాయచెట్లను, తాండ్రచెట్లను, పొగడచెట్లను, తుమ్మచెట్లను, వేపచెట్లను, దీసికొనివచ్చి సముద్రమున బడవైచిరి. గొప్పయాకారములుగలవారును, మిగులబలముగలవారును, నగు నావానరులు, ఏనుగులంతటిప్రమాణముగల ఱాళ్ళను, గొప్పపర్వతములను, పెకలించి యంత్రములచే గొనిపోయి సముద్రమునబడవైచిరి. అట్లావానరులు సముద్రమునందు పర్వతములను వేయుచుండగ తటాలుననీళ్లుపైకెగిరి ఆకాశమునందంతటనువ్యాపించినవి. అప్పుడు వానరులు సముద్రమునుమిగుల కలతబెట్టిరి.

ఆవానరులలో గొందఱు నూరామడ నిడువుగల దారములను బట్టుకొనియుండిరి. కొందఱు కొలతకొయ్యలనుబట్టుకొనియుండిరి. మఱికొందఱు పరీక్షించుచుండిరి. ఈరీతిగనలుడు, సముద్రమధ్యమున, పదియామడ వెడల్పుగలదియును, నూరామడ నిడివిగలదైనదియును, నగు నొకగొప్పసేతువునుగట్టె. అట్లు రామునియాజ్ఞచే వానరులు గుంపులుగుంపులుగా జేరి, మేఘకాంతివంటి కాంతిగలశిల

రములతోనొప్పుచుండెడి పర్వతములతోను, తృణములతోను సేతువుగట్టిరి. మఱియు పూచియుండెడి కొనలుగల వృక్షములతోనుగూడ వానరులు సేతువుగట్టిరి. అట్లు వారధిగట్టునపుడు యేనుగులతో సరిపోలుచున్న వానరులు, ఱాళ్ళను, కొండలను, పర్వతములను, యెత్తికొనిపరుగెత్తుచుండగ, చూచువారలకత్యంత ఆశ్చర్యకరముగనుండె. అప్పుడాసముద్రమునందు గొప్పగొప్ప ఱాళ్లను, పర్వతములను, వేయుటచేత మహాఘోరమగుధ్వనిగలిగె. ఏనుగులతోసమానులైనవారును మిగుల సంతసించినవారును నగు వానరులు అతివేగముగ మొదటిదినను పదునాలుగుయోజనములదూరము సేతువుగట్టిరి. భయంకరాకారులును, మహాబలపరాక్రమశాలులును, నగు వానరులు రెండవదినమున మహావేగముతో నిరువదియోజనముల దూరము సేతువుగట్టిరి. మహాకాయులగు నవ్వనచరులు మూడవదిన నతివేగముతో నిరువదియొక్క యోజనముల దూరము సేతువునునిర్మించిరి. అంతనాలవదినమందు అతివేగమువహించి యిరువదిరెండు యోజనములదూరము సేతువుగట్టిరి. మఱియు అతివేగముతోపనులుచేయునట్టి వానరులు, ఐదవదినమున సువేలపర్వతమువరకు నిరువదిమూడు యోజనములదూరము సేతువుగట్టిరి. తండ్రివలెనేశిల్పకార్యమునందు మిగుల సమర్థుడును, మిగుల కాంతిమంతుడును, విశ్వకర్మకుమారుడును, మహాబలముగలవాడును, వానరోత్తముడును, నగు నలుడు, సముద్రమధ్యమున సేతువునుగట్టి సమాప్తిచేసె. మొసళ్లకునికిపట్టయిన సముద్రమధ్యమున నలునిచే గట్టబడినదియును, మిగుల సుందరమైనదియును, కాంతిమంతంబైనదియును, నగు సేతువు "గగనమార్గమునను౦డుస్వాతీవీధివలెనే'' ప్రకాశించుచుండె. అప్పుడు దేవతలు, గంధర్వులు, సిద్ధులు, సాధ్యులు, పరమర్షులు మొదలగువారందఱును, ఆయద్భుతమును జూడగోరి యచ్చటికివచ్చి గగనముననుండిరి. అట్లువచ్చిన దేవగంధర్వులు మొదలగువారు, పదియోజనముల వెడల్పుగలదియును, నూఱుయోజనముల నిడివిగలదియును, ఎట్టివారికినిగాని మిగులనసాధ్యమైనదియునునగు సేతువునుజూచిరి. అప్పుడు వానరులు యిటునటునెగురుచు, సింహనాదములను చేయుచు మహాసంతోషముననుండిరి. మఱియు మనస్సుతోనైనయెన్నలవిగానిదియును, దుస్సహంబైనదియును, మిగుల నాశ్చర్యకరమైనదియును, గగుర్పాటు నొందించునదియును నగు నాసేతుబంధనమును, సమస్తభూతములును జూచినవి. మహాపరాక్రమశాలులును, సేతువుగట్టుచుండినవారును అట్లు సముద్రమున సేతువుగట్టుచుపోయినవారును, నగునావేలకొలదివానరులు సముద్రముయొక్క దక్షిణపు దరిచేరిరి. మిగులవిశాలమైనదియును, చక్కగా నేర్పఱుపబడినదియును, మిట్టపల్లములులేక చదరముగ నున్నదియును, రంధ్రములులేక యున్నదియునునగు నమ్మహాసేతువు సముద్రమధ్యమున పాపటవలెనుండె. అంతవిభీషణుడు గదచేతబట్టుకొని మంత్రులతోగూడుకొని వానరులపైకివచ్చిన శత్రువులను సంహరించుటకు సముద్రముయొక్క దక్షిణపుదరియందుండె. అప్పుడు సుగ్రీవుడు, సత్యపరాక్రమశాలియగు రామునితోనిట్లనియె.

రాముడా! నీవు ఆంజనేయునిపై నెక్కుము. లక్ష్మణుడు అంగదునిపైనెక్కును. మొసళ్లకునికిపట్టగు నీసముద్రము మిగులవిశాలమైనదిగదా! కావునమిరు నడచిరాజాలరు. ఈయాంజనేయాంగదులు మిమ్ము నాకాశమార్గమున దీసికొనిపోయి సముద్రమును దాటింపుదురు. అనిసుగ్రీవుడు రామునితోజెప్పె. అంతమంచిధనస్సుగలవాడును, ధర్మాత్ముడును, శ్రీమంతుడును, నగురాముడు, అట్లుచేయుట యుచితముగాదని లక్ష్మణ సుగ్రీవులతో గూడ నాసేనముందఱనడిచె. అప్పుడు కొందఱు వానరులు నడుమపోయిరి. కొందఱుప్రక్కలంబోయిరి కొందఱు వానరులు, దారిచాలకనీటంబడిరి. కొందఱు వానరులు మార్గము చాలక దరిననిలిచియుండి, ఆవలపోయిరి. మఱికొందఱు గరుత్మంతునివలె, ఆకాశమార్గమున నెగిఱిపోయిరి. అట్టియెడ మహాభయంకరమగు వానరసేనలో గలిగిన మహాధ్వనిచేత, మహాభయంకరమగు సముద్రధ్వని, అణగిపోయినది. అంతనావానరసేన, వానరేశ్వరుడగు సుగ్రీవునితోగూడ, నలునిచేగట్టబడిన సేతువుదారిని సముద్రమును దాటి, విశేషముగ గడ్డలును, పండ్లను, నీళ్లునుగల దక్షిణతీరమునవిడిసెను. అట్టియెడ దేవతులు, సిద్ధులు, చారణులు, మహర్షులు మొదలగు వారందఱు, రామునకు దక్కనన్యునికి చేయనలవిగానిదియును, మిగుల నాశ్చర్యకరంబైనదియును, నగు నారాముని కార్యమునుజూచి, అతివేగముతో రామునిదగ్గరకువచ్చి, మిగుల శుభజలముచేత, అందఱును వేఱువేఱుగ రామునకు నభిషేకముచేసి యిట్లనిచెప్పిరి. మానవేశ్వరుడా! రామా! శత్రువుల నందఱను జయింపుము. అనేకసంవత్సరములు చతుస్సముద్రముద్రితమగు భూమండలమునంతయు నేలుము. అని యిట్లాదేవతలుమొదలగువారు, దేవతలచేతను మానవులచేతను పూజితుడగు రాముని, నానావిధములయిన మంగళ వచనములచే పూజించిరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి యిరువది రెండవసర్గ ముగిసెను.

—(*)—

రాముడు అశుభశకునములనుజూచి లంకకు నాశముగలుగునని లక్ష్మణునితో జెప్పుట.

శుభాశుభనిమిత్తములను జక్కగ దెలిసినవాడును, లక్ష్మణాగ్రజుడును, నగు రాముడు కొన్నిమంచిశకునములను జూచి, లక్ష్మణునికౌగలించుకొని యిట్లనియె.

లక్ష్మణా! మనము చల్లనిమంచినీళ్లుగలదియును, పండ్లతోనిండియుండెడు వనములుగలదియును, నగు ప్రదేశమును వాసస్థానముగ నేర్పఱచుకొని, యీసేనాసమూహములనన్నిటిని చక్కగా విభజించి, వ్యూహముగ దీర్చియుందము. మఱియు మహాబలపరాక్రమశాలులగు భల్లూకములయొక్కయు, వానరులయొక్కయు, రాక్షసులయొక్కయు వధారూపమైనదియును, జననాశము గలిగించునదియును, నగు మహాభయముగలుగునని నాకుతోచుచున్నది. లక్ష్మణా! వాయువు మహాభయంకరముగ వీచుచున్నది. భూమిగడగడవణకుచున్నది. పర్వతశిఖరములు వడవడవడకుచున్నవి. చెట్లువిఱిగిపడుచున్నవి. మేఘములు గద్దలతోసమానములైనవియును, చూడగూడనివియును, మిగుల భయంకరములైన ధ్వనులు గలవియును, మహాభయంకరములైనవియునునై మిగుల భయంకరముగ రక్తబిందువులతో గలసి వర్షించుచున్నవి. మఱియు సంధ్యయును, ఎఱ్ఱ గంధముతోసమానమై, మహాభయంకరమైయున్నది. సూర్యుడు మండుచు నిప్పులు గురిపించుచున్నాడు. మృగములును, పక్షులును, మిగుల దీనములై మహాభయంకరములై సూర్యునకెదుట నిలుచుండి, అంతటను దీనస్వరముతో నఱచుచు, మహాభయమును సూచించుచున్నవి. రాత్రియందు చంద్రుడు మిగుల కాంతిహీనుడై సంతాపము నొందించుచున్నాడు. ఇదియునుగాక అంతమునందు నల్లని కాంతులు గలదియును, దానికివెనుక కొంచము యెఱ్ఱనికాంతిగలదియును, నడుమమిగుల నెఱ్ఱగానుండునదియును, మిగుల హ్రస్వమైనదియును, మహాభయంకరమైనదియును, ఇదివరకెప్పుడును చూడబడనిదియును, ప్రళయకాలమునందు గలుగు పరివేషమువలె నున్నదియునునగు పరివేషము సూర్యునిచుట్టును అగపడుచున్నది. తమ్ముడా! లక్ష్మణా! నిర్మలమైన సూర్యమండలము నడుమ నల్లనిచిహ్నము గాన్పించుచున్నది. నక్షత్రములుగూడ మిగుల మలినముతో గూడుకొని, కాంతిహీనములై లోకములకు ప్రళయము గలుగునని చెప్పుచున్నట్లున్నవి. చూడుము. లక్ష్మణా! కాకులును, డేగలును, గద్దలును, దుర్బలములగు పక్షులజేరుచున్నవి. నక్కలును మహాభయంకరమై అమంగళకరమైన ధ్వనులతోనఱచుచున్నవి. లక్ష్మణా! భూమి, వానరులచేతను, రాక్షసులచేతను ప్రయోగింపబడిన పర్వతములతోను, శూలములతోను, కత్తులతోను, కప్పబడినదై, మాంసముతోను రక్తముతోను గూడిన బురదతోనిండియుండగలదు. ఇప్పుడతిశీఘ్రముగ వానరులనందఱిని వెంటబెట్టుకొని అతివేగముతో, ఎదిరింప నలవిగానిదియును రావణాసురునిచే పాలింపబడినదియును, నగు లంకానగరముపై పోదము. అనియిట్లుధర్మాత్ముడును, మంచిధనస్సుగలవాడును, యుద్ధప్రియుడును మిగుల సమర్థుడును నగు రాముడు లక్ష్మణునితోజెప్పి ధనుస్సును ధరించి లంకాభిముఖుడై వానరసేనలకు ముందునడచె. అంతవిభీషణుడును, సుగ్రీవుడును మొదలగు వానరోత్తములందఱును శత్రువులను జంపుటయందు నిశ్చయముగలవారై సింహనాదములను జేయుచు లంకపైకిపోయిరి. రామునకు సంతోషము గలుగుటకై, ధైర్యవంతులును పరాక్రమవంతులును, నగు వానరులు జేయుచుండిన చేష్టలనుజూచి, రాముడు మిగుల సంతసించె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలియిరువదిమూడవసర్గ ముగిసెను.

—(*)—

రాముడుతనసైన్యమును వ్యూహములుగనేర్పరుచుట.

అట్లు రాజగు రాముని ముందిడికొని యొప్పుచున్నయా వానరవీరసైన్యము చంద్రునితో నొప్పుచున్న శుభనక్షత్రములతోగూడిన శరదృతువునందలి పౌర్ణమిరాత్రివలెనే మిగుల ప్రకాశించుచుండె. అట్టియెడ భూమి సముద్రముతోసమానమైన కాంతిగల యావానరసేనచే పీడింపబడుచున్నదై, మిగుల భీతినొంది, అతివేగముతో వడవడవడకె. అప్పుడు ఆవానరులు, లంకలోనుండివచ్చుచున్నదియును, తుములమైనదియును, గగుర్పాటునొందించునదియును, నగు భేరీమృదంగములయొక్క ధ్వనులను, లంకలోనిసైనికులయఱపునువినిరి. అట్లువానరోత్తములు ఆలంకానగరమున నుండి వచ్చిన యాధ్వనినివిని, మహాసంతోషమును బొందిరి వారలు ఆధ్వనినివిని సహింపలేక అంతకంటె హెచ్చుధ్వనిగలుగునట్లుగా సింహనాదములను జేసిరి. అట్లు మహాగర్వముతో సింహనాదములను జేయుచున్న వానరులు "ఆకాశమునందలి మేఘగర్జనవలె" మఱియును గర్జించుచుండిన ధ్వనినిలంకలోని రాక్షసులువినిరి. అట్టియెడ రాముడు, నానావిధములగు ధ్వజములతోను, పతాకములతోను, ఒప్పుచు

న్న లంకానగరమునుజూచి మనస్సునదుఃఖమునొంది సీతనుదలచియిట్లనియాలోచించెను. జింకపిల్లనేత్రములవంటి నేత్రములుగలసీత, "దుష్టగ్రహమగు నంగారకగ్రహముచే బీడింపబడినరోహిణివలె" ఈలంకానగరమునందు రావణాసురునిచే బంధింపబడియున్నది. అనిమనంబునదుఃఖించెను. పిమ్మట మహాశౌర్యవంతుడగు రాముడు, వేడినిట్టూర్పులను విడిచి లక్ష్మణునిజూచి, ఆకాలమునకుదగినమాటలతో నిట్లనియె.

తమ్ముడా! లక్ష్మణా! ఆకాశమును తాకుచున్నట్లు మిగులపొడవైనదియును, త్రికూటపర్వత శిఖరమునందున్నదియును, విశ్వకర్మచే నతిసుందరముగ నిర్మింపబడినదియును, నగునీలంకానగరమునుచూడుము. ఈలంకాపట్టణము, అనేకములైన విమానములచే అనగావిమానాకారగృహములచేనొప్పుచు, "తెల్లనిమేఘములచే గప్పబడినయాకాశమువలె" మిగులప్రకాశించుచున్నది. మఱియునీలంక, మిగులమనోజ్ఞములగు పండ్లతోనుపువ్వులతోను గూడినవియును, పలువిధములైనపక్షిధ్వనులతో నొప్పుచున్నవియును, చక్కగనుప్పొంగియున్నవియును, చైత్రరథముతోసమానములైనవియును, నగు వనములచేమిగులప్రకాశించుచున్నది. లక్ష్మణా! మదించినపక్షులతో నొప్పుచున్నవియును, మధుపానమత్తుచే కదలకుండెడి తుమ్మెదలుగలవియును, కోకిలచేనిండియుండెడు పూలగుత్తులచేప్రకాశించుచున్నవియును, నగు వనములు గాలిచేగదులుచున్నవి చూడుము.

అని యిట్లుదశరథరాజనందనుడగు రాముడు లక్ష్మణునితోజెప్పె. అంతరాముడు, శాస్త్రమునందు చెప్పబడినప్రకారము సేననంతయు వ్యూహముగదీర్చుటకు వానరవీరులకిట్లనియాజ్ఞాపించెను. విరోధులకు జయింపనలవిగానివాడును, మహాపరాక్రమశాలియును, నగు నంగదుడు, నీలునితోగూడి, తనసైన్యమునుదీసికొని, వానరసేనయొక్కయురమ్మునందుండవలయును. వానరోత్తముడగు ఋషభుడు తనవానరసైన్యముతో, వానరసేనయొక్క కుడిపార్శ్వమున నుండవలయును. మదపుటేనుగువలె నెదిరింపనలవిగానివాడును, మహాబలవంతుడును, నగు గంధమాదనుడు, తనసైన్యముతో వానరసేనయొక్క యెడమపార్శ్వమున నుండవలయును. నేనును, లక్ష్మణుడును సావధానులమై శిరోభాగమున నుండెదము. జాంబవంతుడును, సుషేణుడును, వేగదర్శియుననీమహాబలశాలులగు భల్లూకోత్తములుమువ్వురును, వానరసేనయొక్క కుక్షినిగాపాడుచుండవలయును. మఱియు మిగులతేజోవంతుడగు వరుణుడు లోకముయొక్క పడమటిదిక్కును గాపాడునట్లు, వానరేశ్వరుడగు సుగ్రీవుడు వానరసేనయొక్క వెనుకటిభాగమును గాపాడుచుండవలయును అని రాముడు వానరవీరులకాజ్ఞాపించెను. ఇట్లు ఆవానరసేన చక్కగగరుడవ్యూహముగ నేర్పఱుపబడి వానరవీరులచే రక్షింపబడి నడుచు, మేఘసమూహములతోగూడిన యాకాశమువలె నొప్పుచుండె. అందలి వానరులందఱును గొప్పగొప్ప పర్వతములను, చెట్లను, చేతులంబట్టుకొని, యుద్ధమునందు రాక్షసులను మర్దించనిచ్ఛగలవారై, లంకానగరముపైబోవయత్నించిరి. అట్లు యత్నించి వానరులందఱును, పిడికిళ్ళచేతగాని, పర్వతశిఖరములచేతగాని, యీలంకాపట్టణమునుచూర్ణముచేతమని నిశ్చయించిరి. అంత మహాతేజుడగురాముడుసుగ్రీవునిజూచియిట్లనియె.

సుగ్రీవుడా! సేనలంతయు చక్కగావ్యూహముగ నేర్పఱుపబడినదిగదా! ఇంకనీశుకుని విడిపింపుము అని రాముడుచెప్పగావిని, మహాబలుడును, వానరేశ్వరుడును నగు సుగ్రీవుడు, రామునియొక్కయాజ్ఞచే రావణాసురుని దూతయగు శుకునివిడిపించెను. అట్లు వానరులచేతలెస్సగమర్దింపబడినవాడును, మహాభయమునుబొందినవాడును, రామునియాజ్ఞచే విడిపింపబడినవాడును, నగు శుకుడు, తత్క్షణమె రాక్షసేశ్వరుడగు రావణాసురుని యొద్దకిబోయెను. అంత రావణాసురుడు శుకునిజూచినవ్వుచునిట్లనియె.

శుకుడా! ఆవానరులు నీఱెక్కలువిఱిచికట్టిరాయేమి? నీఱెక్కలునఱుకబడినట్లున్నవి. నీవు మిగులచపలచిత్తులగు నావానరులచే జిక్కలేదుగదా? అని యిట్లురావణాసురుడడుగగానే, శుకుడు భయముచే మిగుల తొట్రుపడుచు, రాక్షసేశ్వరుడగు రావణాసురునితో మిగులశ్రేష్ఠమగు నీమాటనుచెప్పె. రావణాసురుడా! నేనిచ్చటినుండి సముద్రముయొక్క యుత్తరపుదరిజేరి, యచ్చటసుగ్రీవునిజూచి, మృదుమధురవచనములతో, నీవుచెప్పినట్లుగానే, కొంచెమైన హెచ్చుతక్కువలేక స్పష్టముగ జెప్పితిని. ఆ వానరులు నన్నుజూచినతోడనే మిగుల కోపోద్దీపితులై, గగనమునకెగిరి నన్నుబట్టుకొని పిడికిళ్ళతోబాదిచి, చంపుటకుయత్నించిరి. ఓరాక్షసేశ్వరుడా! సేనావానరులతో మాటలాడుటకు సాధ్యముగాలేదు. ఇంకవారలనడుగుటెట్లులభించును? వారలవలన ప్రత్యుత్తరమెట్లుగలుగును? వారుస్వభావముచేతనే మహాకోపముగలవారు. మిగుల క్రూరులు. రావణాసురుడా! విరాధుని, కబంధుని, ఖరుని, వీరలనుజంపిన మహాపరాక్రమశాలియగు రాముడు, సుగ్రీవునితోగూడి, సీతయుండెడు నీలంకకువచ్చియు

న్నాడు. మఱియు నట్టిధనుర్ధరుడగు రాముడు సముద్రమునకు సేతువుగట్టి, సముద్రమును దాటివచ్చి, రాక్షసులను తృణీకరించియున్నాడు. మహారాజా! రావణాసురుడా! పర్వతాకారులును మేఘాకారులును నగు మెలుగుబంట్లయొక్కయు, వానరులయొక్కయు సేనాసమూహములు, వేలవేలుగ భూమినంతయు నావరించియున్నవి. మఱియు రాక్షససేనాసమూహములకును, వానరేశ్వరుడగు సుగ్రీవునియొక్క సేనాసమూహములకును, దేవదానవులకువలె యెంతమాత్రమును సంధికుదరదు. ఇదిగో వానరులు లంకాపుర ప్రాకారముపైకి వచ్చుచున్నారు. శీఘ్రముగ సీతను రామునికివ్వనైననిమ్ము. లేకచక్కగ యుద్ధముచేయనైనచేయుము. ఈరెంటిలో నేదైననొకదానిని, అతివేగముగ చేయుము. అనిశుకుడు రావణాసురునితో జెప్పె. ఇట్లు శుకుడుచెప్పగావిని రావణాసురుడతికోపముచే నెఱ్ఱనైననేత్రములుగలవాడును, కోపాగ్నిచే శుకునిదహించువానివలెనున్నవాడునునై పండ్లుపటపటంగొఱుకుచునిట్లనియె.

దేవతలును దానవులును, గంధర్వులును ఒక్కటైనా పైకియుద్ధమునకువచ్చినను, సమస్తలోకములును నన్నుభయపెట్టినను, సీతను యెంతమాత్రమునియ్యను. శుకుడా! వసంతఋతువునందు పూచినచెట్టును; మదించినతుమ్మెదలు ముసురుకొనునట్లు నాబాణములు రాముని దేహమును అతిశీఘ్రములో ముసురుకొనగలవు. బహుకాలముగ నమ్ములపొదియందున్నవియును, మిగుల ప్రకాశించుచున్నవియును నగు బాణములు గుంపులుగుంపులుగా ప్రయోగించి, “కొఱవికట్టెలచే నేనుగులను బాధించునట్లు” రామునిబాధించెదను. మఱియు నేనుమిగులగొప్పదగు రాక్షససేనాపరివృతుడనై “ఉదయించుచున్నసూర్యుడు జ్యోతిశ్చక్రమునందుగల సమస్తగ్రహములయొక్క కాంతినిపోగొట్టునట్లు” ఈరామునియితనితో గూడనుండెడు వానరసేనను నశింపజేసెదను. ఓశుకుడా! నాకుసముద్రునకువలె మహావేగమును, వాయువునకువలె గమనమునుగలదని రాముడెఱుగడు. అందుచేతనే నాతోయుద్ధముచేయవలయుననియున్నాడు. మఱియు నాయమ్ములపొదియందున్నవియును, విషముతోగూడిన పాములవలె నున్నవియును, నగు బాణములను యుద్ధమునందు రాముడెప్పుడును చూచినదిలేదు. కావుననాతో యుద్ధముచేయగోరుచున్నాడు. రాముడుయుద్ధమునందునాపరాక్రమమును యెంతమాత్రము నెఱుగడు. శుకుడా! నేనుయుద్ధరంగమున శత్రుసైన్యమునందు ప్రవేశించి, బాణకోణములయందు ధ్వనించునదియును, అల్లెత్రాటిధ్వనియే మిగులకుములంబై మహాభయంకరమైనదియును, భీతులును, దుఃఖితులును, నగు వారలరోదనధ్వనియే విశేషముగ గలదియును, బాణములయొక్కయు, అస్త్రములయొక్కయు ధ్వనులేగొప్పధ్వనులుగాగలదియును నగు నాయొక్కవిల్లనెడి వీణె వాయించెదను. మఱియు సహస్రాక్షుడగు దేవేంద్రుడుగాని, వరుణుడుగాని, యముడుగాని, కుబేరుడుగాని, నిప్పవంటిబాణములు ప్రయోగించియు, మహాయుద్ధమునందు నన్నెదిరింపజాలకపోయిరి. అనిరావణాసురుడు శుకునితో జెప్పె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలియిరువదినాలగవసర్గ ముగిసెను.

శుకసారణులను రావణాసురుని మంత్రులురామునిసేనలవిధమును తెలియజేయుట.

దశరథరాజపుత్రుడగు రాముడు వానరసేననుగూర్చుకొనిసముద్రమునుదాటివచ్చెననివిని, శ్రీమంతుడగు రావణాసురుడు, మంత్రులైనశుకసారణులనుజూచియిట్లనియె.

వానరసేనంతయు దాటనలవిగాని సముద్రమునుదాటినది. మఱియు రాముడుసముద్రమున మున్నెప్పుడులేని సేతువును గట్టినాడనివింటిని. అయినను సముద్రమునందు, సేతువుగట్టినారనునది నాకెంతమాత్రమును నమ్మకములేదు. మీరువానరులకుదెలియకుండ, గోప్యముగ వానరసేనయందుప్రవేశించి, ఆసేనయొక్కపరిమితియును, వారిపరాక్రమమును, అందుముఖ్యులైన వానరులెవ్వరైనదియును, రామసుగ్రీవులయొక్క ముఖ్యమంత్రులెవ్వరైనదియును, యుద్ధమునందుముందునిలిచెడి శూరులెవ్వరైనదియును, వానరసేనయందుశూరులెవ్వరైనదియును, అట్టిమహాసముద్రమునందు సేతువెట్లుగట్టినదియును, అట్టిమహాబలులగువానరులుండుస్థలములను, రామునియొక్కయు పరాక్రమమును, ఆయుధములను, లక్ష్మణునిశౌర్యమును, ఈవిషయములన్నటిని యథార్థముగ తెలిసికొనిరండు మఱియు మహాశౌర్యవంతులగు నావానరసేనానాయకుడెవ్వడు? ఈవిషయములన్నియు నిశ్చయముగదెలిసికొని, అతివేగముగరావలయును. అనిరావణాసురుడు శుకసారణులకుజెప్పె.

అంతమహాపరాక్రమశాలులగు శుకసారణులు యిట్లు రావణాసురునిచే నాజ్ఞాపింపబడి, వానరరూపములనుదాల్చి మహావేగముగపోయి వానరసేనయందు ప్రవేశించిరి. అట్లుప్రవేశించి, ఆశుకసారణులు, చింతింపనలవి

గానిదియును, చూచువారలకు గగుర్పాటు నొందించునదియును, నగు నా వానరసైన్యమును లెక్కింపజాలరైరి. మఱియు పర్వత శిఖరములయందును, పగిలియున్న పర్వతముల యొక్క పైభాగముయందును, పర్వతగుహలయందును, సముద్రతీరమునందును, అరణ్యములయందును, ఉద్యానవనములయందును విడిసియున్నదియును, కొంతసేన సముద్రము దాటియున్నదియును, కొంతదాటుచున్నదియును, ఇంకను కొంత దాట బోవుచున్నదియును, కొంతవిడిసియున్నదియును, కొంతవిడియ బోవుచున్నదియును, మహాభయంకరమైన ధ్వనిగలదియును, మహాబలము గలదియును, కలత బెట్ట గూడనిదియును నగు నా వానరసేనా సముద్రమును, శుకసారణులు నలుగడలం గలయజూచిరి. అట్లు ఆ శుకసారణులు వానరవేషములను దాల్చి యితరులకు దెలియకుండ సంచరించుచున్న వారయ్యును, మహాతేజుడగు విభీషణుడు వారలను కనుగొనెను. అట్లు విభీషణుడు, ఆ శుకసారణులను బట్టి రాము నొద్దకు గొనిపోయి యిట్లనియె.

శత్రుపురములను జయించునట్టి రాముడా! వీరలు రాక్షసేశ్వరుడగు రావణాసురుని మంత్రులు. శుకసారణులను పేరుగలవారు. మన గుట్టు తెలిసికొని పోవుటకొఱకు లంకాపురమునుండి వచ్చిన వేగువారలు. అని విభీషణుడు రామునితో జెప్పె. అప్పుడు ఆ శుకసారణులు రాముని జూచి, మహావ్యసనమును బొంది, ప్రాణములందలి ఆశ విడిచి, చేమోడ్పు గీలించి, మహాభయముతో నిట్లని చెప్పిరి. సౌమ్యుడా! రాముడా! మేమిద్దరమును, మీ సేనంతయు చక్కగా చూచి యందలి సంగతులు తెలిసికొనిపోవుటకు, రావణాసురుడు పంపగా నిచ్చటికి వచ్చినవారము. అని శుకసారణులు రామునితో జెప్పిరి. అంత సమస్తభూతములకును మేలు సేయువాడును, దశరథమహారాజు కుమారుడును, నగు రాముడు వారు చెప్పిన మాట విని నవ్వుచు నిట్లనియె.

మీరు మా సేననంతయు జూచి, మమ్ములను చక్కగ పరీక్షించి, మీ రావణాసురుడు చెప్పిన కార్యమంతయు నెరవేర్చుకొని, యథేచ్ఛగా లంకకు బొండు. మీ రింక కొంత చూడవలసియుండు నేని, దానినంతయు జూచుకొనుడు. అటుగాకేని విభీషణుడు మీకు మా సేననంతయు చక్కగా చూపించును. మీరిప్పుడు మా చేత జిక్కియుండుటచే జీవించు విషయమై యెంతమాత్రము భయపడనక్కఱలేదు. శ్లో॥ న్యస్తశస్త్రౌ గృహీతౌ వా న దూతౌ వధమర్హతః॥ ఆయుధము లేక పట్టుబడినవారిని గాని, దూతలను గాని చంపగూడదు. కావున మీరు నిరాయుధులై యుండుటచేత మిమ్ములను జంపము. అని రాముడు శుకసారణులకు జెప్పి యంత విభీషణుని జూచి యిట్లనియె. విభీషణా! వీరు శత్రుపక్షము నాకర్షించునట్టి చారులయ్యును, అడుగుకొనుచున్నారు గావున నీ యిద్దఱు రాక్షసులను విడిచిపెట్టుము. అని విభీషణునితో జెప్పి యంత రాముడు మఱల శుకసారణులజూచి వారితో నిట్లనియె.

శుకసారణులారా! మీరు మఱల లంకానగరమునకు బోయి, కుబేరుని తమ్ముడును, రాక్షసేశ్వరుడును నగు రావణాసురునితో, నేను జెప్పు మాటలన్నియు కొంచెమైనను వ్యత్యస్తము లేక చెప్పవలయును. నీవు ఏ బలమును అవలంబించి నా భార్యయగు సీతను అపహరించితివో అట్టి బలమును, నీ బంధుమిత్రసేనా సమేతముగ నిప్పుడు చూపవలయును. రేపు ఉదయమున, ప్రాకారములతోను బహిర్ద్వారములతోను గూడి నలంకానగరమును, రాక్షససైన్యమును నా బాణపరంపరలచే నాశము చేసెదను చూడుము. రావణాసురుడా! రేపు ఉదయమున "వజ్రాయుధమును ధరించువాడగు దేవేంద్రుడు దానవులపై వజ్రాయుధమును విడుచునట్లు" మహాభయంకరమగు నా కోపమును నీపై బూపబోవుచున్నాను. కావున బలమును ధరించి జాగ్రతగనుండుము. అని రావణాసురునితో జెప్పుమని రాముడు శుకసారణులతో జెప్పె. అంత నా శుకసారణులు రాముడు చెప్పిన మాటలను విని, ధర్మమునందలి ప్రీతిగల రాముని "జయింపుము జయింపుము" అని జయశబ్దములం బొగడి, అతివేగముతో లంకానగరమునకు బోయి రాక్షసేశ్వరుడగు రావణాసురుని జూచి యిట్లనిరి.

రాక్షసేశ్వరుడా! రావణాసురుడా! మేము వానరసేనలో నుండగ మమ్ము విభీషణుడు పట్టుకొనిపోయి రామునకు నప్పగించెను. అంత ధర్మాత్ముడును, మహాపరాక్రమశాలియును, నగు రాముడు మమ్ములను జూచి, మేము వధార్హులమయ్యును మమ్ము దయచేత విడిపించె. మఱియు, దశరథ రాజపుత్రుడును, శ్రీమంతుడును, నగు రాముడును, లక్ష్మణుడును, విభీషణుడును, మహాతేజుడును దేవేంద్రునితో సమానమైన పరాక్రమము గలవాడును నగు సుగ్రీవుడును, ఈ నలువురు నొక్కచోట నున్నారు. వీరు దిక్పాలురతో సమానులు. మహాశూరులు, సమస్తాస్త్రములను దెలిసినవారు. దృఢపరాక్రమముగలవారు. వీరలు పురుషులలో నుత్తములు. రాక్షసేశ్వరుడా! వానరులందఱు నట్లుండనిమ్ము. ఈ రామలక్ష్మణ సుగ్రీవ విభీషణులు నలుగురు మాత్రమే, ప్రాకారములతోను, బహిర్ద్వారములతోను గూడిన యీ లంకానగరమును పెకలించుకొనిపోయి మఱియొకచోట నుంచుటకు శక్తిగలవారు. వెయ్యేటికి, రాముని రూప

నము, ఆయుధములనుజూడగా, లక్ష్మణవిభీషణ సుగ్రీవుల చే రక్షింపబడు రాముడొక్కడే లంకానగరమును నాశనము చేయగలడని తోచుచున్నది. మఱియు రామలక్ష్మణ సుగ్రీవులచేత రక్షింపబడుచుండెడి యావానరసేన, యింద్రునితో గూడిన దేవాసురలచేతైన నెదిరింపనలవి గానిదిగనున్నది. రావణాసురుడా! అట్లుపదియామడ వెడలుపును నూరామడ పొడవియును, గలసేతువుస్పష్టముగ గట్టబడియున్నది. వానరసేన సముద్రముదాటినది. రాముడుసముద్రముయొక్క దక్షిణపుగట్టున విడిసియున్నాడు. సేనకొంత దాటినది. కొంతదాటుచున్నది, దానికంతముగపడలేదు. మఱియు మహాబల పరాక్రమశాలులగు నావానరులు మహాసంతోషముతో నిప్పుడేయుద్ధము చేయగోరుచున్నారు. కావునవారితో విరోధముచాలును. ఇకవద్దు. శాంతమును అవలంబింపుము. దశరథరాజనందనుడగు రామునికిసీతనిచ్చిపంపుము. అనిశుకసారణులు రావణాసురునితో జెప్పిరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి యిరువదిఅయిదవసర్గముగిసెను.

రావణాసురుడు వానరసేననుజూచి వారిలోగలబలవంతులనడిగి తెలిసికొనుట.

అంతరాక్షసేశ్వరుడగు రావణాసురుడు, సారణుడు ప్రియముగజెప్పిన హితవాక్యమునువిని, సారణునిజూచి యిట్లనియె.

ఓసారణుడా! దేవతలును, గంధర్వులును, దానవులును, అందఱునొక్కటై యుద్ధమునకువచ్చినను, సమస్తలోకములునన్ను భయపెట్టినను, నేనెంతమాత్రము సీతనివ్వను. నీవుశూరుడవుగావు. నీవువానరులచేత దెబ్బలుతిని వారిచేజయింపబడి మహాభయమును బొందియున్నావు. కావున సీతనిచ్చివేయుటమంచిదని చెప్పుచున్నావు. శత్రుడెవడు నన్నుయుద్ధమున జయింపగలడు. అనియిట్లు రాక్షసేశ్వరుడగు రావణాసురుడు ఆసారణునితో జెప్పి, అంతవానరసేననంతయుజూడగోరి, అనేకతాటిచెట్లయొక్క పొడవుగలిగి మంచువలెమిగుల తెల్లనైయుండు మేడపైనెక్కె. రావణాసురుడట్లు శుకసారణులతోగూడ మేడపైనెక్కి కోపోద్దీపితుడై, సముద్రమును పర్వతములను వనములనుజూచుచు, వానరసేనచే నిండియుండెడు భూప్రదేశమునుజూచె. మఱియు రాక్షసేశ్వరుడగు రావణాసురుడు, ఆదిఅంతములు లేనిదియును, లెక్కబెట్టనలవి గానిదియును, మిగులగొప్పదియును, నగువానరసైన్యమునుజూచి యంతసారణునితో నిట్లనియె.

ఓసారణుడా! ఈవానరోత్తములలో నెవ్వరుశూరులు? మిగుల బలశాలులెవ్వరు? ఎవ్వరధికోత్సాహమునవెనుకదియ్యక యుద్ధమునెదుర నిలుతురు? సుగ్రీవుడెవ్వరిమాటలనువినును? అగ్రసేనా నాయకుడెవడు? ఓరీ! సారణా! వీరిలోనుత్తములగు వానరులెవ్వరు? ఈవిషయములన్నియును నాకువాస్తవముగజెప్పుము. అనిసారణునడిగె. అంతవానరులను తెలిసికొనివచ్చిన సారణుడు, రాక్షసేశ్వరుండగు రావణాసురుడడుగగానే, వారిలోముఖ్యులగు వానరులను మాత్రము చెప్పనారంభించె, ఎవడనేకవేల సేనానాయకులచేపరివేష్టింపబడి, లంకానగరాభిముఖుడైనిలిచి సింహనాదము సేయుచున్నాడో, ఎవనిసింహనాదముయొక్క మహాధ్వనికి, ప్రాకారములతోను, బహిర్ద్వారములతోను, పర్వతములతోను, వనములతోను, ఉద్యానవనములతోనుగూడిన లంకయంతయు వడవడవడకుచున్నదో, ఎవ్వడు, సమస్తవానరులకును ప్రభువును, మహాబలుడును, నగుసుగ్రీవునియొక్క సేనాగ్రభాగమునందున్నవాడో, అట్టిమహాపరాక్రమశాలియగు నీవానరుడు నీలుడనుపేరుగలవాడు. వీడుఅగ్రసేనా నాయకుడు. ఎవ్వడుకాళ్లనేలయందూని, చేతులపైకెత్తి మహాకోపముతో లంకకెదురుగ నిలుచుండి విజృంభించియున్నాడో, ఎవడుపర్వతశిఖరముతో సమానమైన యాకారముగలవాడును, పద్మకింజల్కముతో సమానమైన దేహచ్ఛాయగలవాడును, నైయున్నాడో, ఎవ్వడుమిగులకుపితుడైమాటిమాటికిని తోకను నేలపైగొట్టుచున్నాడో, ఎవ్వనితోక నేలపైగొట్టుటచే గలిగినధ్వనిచే దశదిశలును ప్రతిధ్వనులిచ్చునట్లు చేయుచున్నాడో, ఆయీవానరుడు అంగదుడను పేరుగలవాడు. ఈతడు వానరరాజైన సుగ్రీవునిచే వానరయౌవరాజ్యాభిషిక్తుడాయెను. నిన్నుయుద్ధమునకు బిలుచుచున్నాడు. వీడువాలికొడుకు. వాలితోసమానుడు. ఇతడుసుగ్రీవునికి మహాయిష్టుడు. దేవేంద్రునికొఱకు వరుణుడుబోలె, రామునికొఱకు మహాపరాక్రమమును అవలంబించియున్నాడు. మఱియు రామునిమేలుగోరువాడును, మహావేగముగలవాడును, నగునాంజనేయుడు లంకకువచ్చి సీతనుకనుంగొనిపోవుట యీయంగదుని ప్రోత్సాహమువలననే జరిగినది. రాక్షసేంద్రా! రావణాసురుడా! మహాశౌర్యవంతుడును, అజేయుడును, నగునీయంగదుడు, వానరోత్తముల సేనలను అనేకములనుతీసికొని తనసేతోగూర్చుకొని నీపైకివచ్చుచున్నాడు. ఈవాలిపుత్రుడగు నంగదునకువెనుక, మిగుల గొప్పసైన్యమును దీసికొని యుద్ధసన్నద్ధుడై వచ్చుచున్నాడుచూడుము. అతడేనలుడనువాడు. అతడేసముద్ర

మునందు సేతువుగట్టినవాడు, మహాబలపరాక్రమశాలి. ఎవ్వారు తమదేహములు విదర్చుకొని సింహనాదములుసేయుచు, నలునివెనువెంటలంకపైకి వచ్చుచున్నారో అట్టిశౌర్యవంతులగు వానరోత్తములుపదినూరుకోట్లు యేసిమిదిలక్షలు చందనవనమునందుండువారు. వీరుమిగుల భయంకరమగు పరాక్రమముగలవారు. యుద్ధమున సహింపనలవిగానివారు. మహాభయంకరులు. మిగులక్రూరులు. ఈనలు డొక్కడేతనసేనంగూడి యీలంకానగరమును మర్దింపగోరుచున్నాడు. ఇదిగోచూడుము, వెండివలె తెల్లనిదేహముగల ఈవానరుడు శ్వేతుడనుపేరుగలవాడు. ఈతడుమిగులయుద్ధచపలుడు. మహాభయంకరమైన పరాక్రమముగలవాడు. మిగులబుద్ధిమంతుడు. ముల్లోకములయందునుమిగులప్రసిద్ధినొందినవాడు. ఈశ్వేతుడతి శీఘ్రముగా సుగ్రీవునొద్దకుబోయి, మరలనతిత్వరలో, వానరసేనయందుప్రవేశించి, దానినివిభజించుచు సేనలను ప్రోత్సాహపరచుచు, మహావేగముతో [illegible]టుసటుబోవుచున్నాడు. ఇదిగో ఈతడుకుముదుడు. వీడుమున్ను, నానావిధములైన శిఖరములతోగూడినదియును, గోమతీ తీరముననున్నదియును, మహాసుందరమైనదియును, సంకోచమనుపేరుగలదియును, నగు పర్వతముపైనుండి, గోమతీ తీర వానరరాజ్యమునుపాలింపుచుండును. ఎవ్వనితోకయందలి వెంట్రుకలుమిగులపొడవులై బహుదూరమువ్యాపించియున్నవియును, పసుపువన్నెగలవియును, ఎఱ్ఱనివియును, మిగులతెల్లనివియును, నానావర్ణములుగలవియునునై విదుర్చుకొనియున్నవో అట్టియీకుముదుడు వేయిలక్షలవానరులను వెంటబెట్టుకొనివచ్చుచున్నాడు. ఈతడుమిగులభయంకరమైన కార్యములుగలవాడు. మహాధైర్యవంతుడు. మిగులకోపముగలవాడు. అతిభయంకరుడు. ఈకుముదుడును, తానొక్కడె తనసేనతో లంకాపురినిమర్దింపగోరుచున్నాడు. రాక్షసేశ్వరుడా! రావణాసురా! సింహముతోసమానుడును, కపిలవర్ణముగలవాడును, మిగులనిడుపులైనకండ్లుగలవాడును, మిగులనిశ్చలదృష్టితో లంకానగరమునుదహించువానివలె చూచుచున్నవాడును, నగు నీవానరోత్తముడు రంభుడనుపేరుగలవాడు. ఈతడు వింధ్యపర్వతము, కృష్ణగిరి, సహ్యపర్వతము, సుదర్శనపర్వతము అనునీ పర్వతములపైనుండి యచ్చటివానరరాజ్యమును పాలింపుచుండును. మఱియు, మహాశూరులును, భయంకరమైనపరాక్రమముగలవారును,మిగులభయంకరులు, నగు వానరశ్రేష్ఠులు నూటముప్పదిమూడులక్షలు ఈరంభునిపరివేష్టించివచ్చుచున్నారు. ఈవానరులుతమపరాక్రమముచే నీలంకానగరమును మర్దింపగోరుచున్నారు. మహాబలపరాక్రమశాలివగు నో రావణాసురుడా! అదిగోచూడుము. చెవులునిక్కబొడుచుకొని మాటిమాటికినావులించుచున్నవాడును, మిగుల కోపాతిశయమువలన వడవడవడకుచున్నవాడును, మాటిమాటికి అడ్డముగచూచుచున్నవాడును, పలుమారుతనతోకనుజూచుకొని సింహనాదము చేయుచున్నవాడును, మహా బలముగలవాడును, యెంతమాత్రము భయములేనివాడును, నగు నీవానరనాయకుడు శరభుడనువాడు. అతడుయుద్ధమునందు వెనుకకుతిరగడు. మృత్యువునకైనభయపడడు. అతడు నిరంతరమునుమిగుల రమ్యమగు సాల్వేయ పర్వతముపైనుండి వానరరాజ్యమేలుచుండును. మఱియు నీశరభునిచేతిక్రింద విహారులనుపేరుచే నొప్పుచున్నవానరవీరులు నలుబదిలక్షలమందియున్నారు. వారందఱును మహాబలముగలవారు. రాక్షసరాజా! రావణాసురుడా! ఇదిగోచూడుము. గొప్పదేహముగలిగి మేఘమువలెనాకాశము నావరించియున్నవాడును, భేరిధ్వనివలె సింహనాదము సేయుచున్నవాడును, యుద్ధమునకైమహాసంతోషముతోనున్నవారును, వానరశ్రేష్ఠులును, నగు వానరవీరులనడుమనున్నవాడై దేవతలమధ్యనుండెడు దేవేంద్రునివలెనున్నవాడును, నగు నీవానరయూథపతి పనసుడు. ఈతడుమహాభయంకరుడు. ఎప్పుడుగాని యుద్ధమునసహింపవలవిగానివాడు. ఇతడుమిగులనుత్తమమగు పారియాత్రపర్వతమునసుండువాడు. ఈపనసునిక్రిందయేబదిలక్షలవానరోత్తములున్నారు. వారందఱును వేరువేరుగా నధికసేనలుగలవారు. ఇదిగో, మహాభయంకరముగనున్నదియును, మిగుల మనోజ్ఞముగనున్నదియును సముద్రతీరముననుండి రెండవ సముద్రమువలెనున్నదియును నగు సేనసమమ ప్రకాశించుచున్నవాడును, దుర్దరపర్వతముతోసమానుడును, నగు నీయూథపతివినతుడను పేరుగ

లవాడు. ఈతడు నదీశ్రేష్ఠమగు పర్ణాసనదియందు నీళ్లుద్రావుచు నాతీరమున సంచరించుచుండువాడు. ఈవినతునిక్రింద అఱువదిలక్షలవానరులున్నారు. ఇతడు క్రోధనుడను సేనానాయకుడు. ఈతడు యుద్ధమునకు నిన్ను బిలుచుచున్నాడు. ఈతనిక్రింద ననేకమంది పరాక్రమవంతులగు వానరశ్రేష్ఠులున్నారు. వారలక్రింద వేలువేలుగ మిగులశ్రేష్ఠులగు వానరులున్నారు. రాక్షసేశ్వరుడా! రావణాసురుడా! బలముచేత గర్వించినవానరులనందఱిని అవమానించువాడును, బంగారువన్నెగల దేహముతో నొప్పుచున్నవాడును, తన దేహమును మిగుల పెంచుచున్నవాడును, నగు నీ వానరసేనాపతి గవయుడనువాడు. ఈతడు మహాతేజముగలవాడు. మిగుల కోపవంతుడు. నీపైకి యుద్ధమునకు వచ్చుచున్నాడు. ఈగవయునిక్రింద డెబ్బదిలక్షలవానరులున్నారు. ఈగవయుడొక్కడే తనసేనతో నీలంకానగరమును మర్దింపగోరుచున్నాడు. ఈ వానరోత్తములందఱును యుద్ధమునందు జయింపనలవిగానివారు. మహాబలవంతులు. కామరూపులు. వీరలక్రింద వేలువేలుగా సేనలున్నవి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి యిఱువదియాఱవ సర్గ ముగిసెను.

(*)

సారణుడు రావణాసురునకు వానరవీరుల పేళ్లను వెవ్వేరుగ దెలియజెప్పుట.

రాక్షసేశ్వరుడా! రావణాసురా! రామకార్యార్థమై పరాక్రమించినవారును, రామునికొఱకు ప్రాణములనైనవిడువనిశ్చయించినవారును, మహాపరాక్రమశాలులునునగు వానరులనందఱినిచూడుము. వారినందఱిని వెవ్వేరుగ తెలియజెప్పెదను వినుము. అదిగో పొడవులైనవియును, మిగుల యొల్లనివియును, పసుపువన్నెగలవియును, తెల్లనివియును, నానావర్ణములుగలవియును, తోకపైకెత్తబడుటచే వెదచల్లబడినవియును, సూర్యునివలె ప్రకాశించుచున్నవియును, నగు తోకయొక్క వెండ్రుకలచే ప్రకాశించుచున్న యీవానరుడు హరుడనువాడు. మహాభయంకరమైన కార్యములుగలవాడు. మఱియు వానరేశ్వరుడగు సుగ్రీవునిబంట్లగు వానరోత్తములు వేలవేలుగ గుంపులుగూడి, చెట్లు మొదలైనవి పట్టుకొని యతివేగముతో లంకానగరముపై కెక్కుటయందాశగలవారై, ఈ హరుని వెంబడి వచ్చుచున్నారు. శత్రుపురములను జయించునట్టి రావణాసురుడా! ఈహరుడు, మహాబలపరాక్రమశాలులగు వానరులను వేయికోట్లమందిని వెంటబెట్టుకొనివచ్చి యుద్ధమునందు నిన్ను జయింపగోరుచున్నాడు. మహారాజా! రావణాసురుడా! నల్లని నీలమేఘములవలెనున్నవియును, నల్లని కాటుకకొండలవలెనున్నవియును, యుద్ధమునందు మిగుల సత్యపరాక్రమముగలవియును, లెక్కింప నలవిగానివియును, చూచుటకు శక్యముగానివియును, మహాసముద్రమువలె మితిలేకయున్నవియును, నగు నీభల్లూకములను చూడుము. కొన్ని పర్వతప్రదేశములయందును, కొన్ని హెచ్చుతక్కువలగు స్థలములయందును, నదీతీరములయందును నుండెడు ఈ యెలుగుబంట్లు మిగుల భయంకరములైనవి. ఇవి నీపైకి యుద్ధమునకు వచ్చుచున్నవి. రావణాసురుడా! మేఘములచేత బరివేష్టింపబడినవాడును, వర్షాధిదేవతయును, నగు నింద్రునివలె నీభల్లూకములచే బరివేష్టింపబడియుండెడి యీ సేనానాయకుడు ధూమ్రుడనువాడు. ఇతడు సమస్తభల్లూకములకు ప్రభువు. ఇతడు నర్మదానదీజలములు ద్రావుచు ఋక్షవంతమను పర్వతముపై వాసముచేయుచుండును. మఱియు పర్వతముతో సమానమైన రూపముగల వానరుడొకడు, అదిగో చూడుము. అతడు ధూమ్రుని తమ్ముడు. అన్నవంటి రూపముగలవాడు. పరాక్రమమున అన్నకంటె మిగుల నధికుడు. రాక్షసేశ్వరా! రావణాసురుడా! ఇదిగో చూడుము. ఇతడు జాంబవంతుడను పేరుగలవాడు. ఇతడనేకమంది సేనానాయకులకు నాయకుడు. మహాశౌర్యవంతుడు. గురుశుశ్రూష చక్కగ జేయువాడు. యుద్ధరంగమునందజేయుడు. మహాబుద్ధిమంతుడగు నీజాంబవంతుడు, మున్ను దేవాసురులయుద్ధమునందు ఇంద్రునకు మిగుల గొప్పసహాయము చేసి అనేకవరములను పొందియున్నాడు. మఱియు నీజాంబవంతునిక్రింద, గొప్పదేహములుగలవారును, రాక్షసులతోను, పిశాచములతోను సమానులైనవారును, నిప్పుతో సమానమైన కాంతిగలవారును, విశేషముగ వెండ్రుకలతో గప్పబడినవారును, నగు సైనికులనేకవేలమందియున్నారు. వారు పర్వతశిఖరములపైకెక్కి మేఘములతో సమానములైన గొప్పబండలను రువ్వుచు

న్నారు వీరుమృత్యువునకైననుభయపడరు. రాక్షసేశ్వరా! అదిగోచూడుము. మహాకోపమునుబొందినవాడును,కోపాతిశయముచేత నెగురుచున్నట్లున్నవాడును, నగు వానరశ్రేష్ఠుడు దంభుడనువానరసేనానాయకుడు. మహాబలముగలవాడు. యుద్ధమునందు దేవేంద్రునకుసమానుడు. అతనిసేనలనుజూడుము. వారందఱును పరమాశ్చర్యముచే లంకానగరముతట్టుచూచుచున్నారు. రావణాసురుడా! నడుచునపుడు, ఒకయడుగుపెట్టినంతనె యోజనదూరముననుండెడిపర్వతమునుజేరువాడును, లేచినిలిచినపుడొకయోజనముపొడవుగలిగియుండువాడును, చతుష్పాదజంతువులలోనన్నిటికంటెగొప్పయాకారముగలవాడును, నగునీవానరసేనానాయకుడు సన్నాదుడనువాడు.ఇతడుమున్ను దేవేంద్రునితో యుద్ధముచేసి యెంతమాత్రమును పరాజయమునుబొందినవాడుగాడు. ఇతడుయూధపతులలో మేటియైనవాడు. వానరులకందఱికినిపితామహుడు. ఇతడు దేవేంద్రునితోసమానమైనపరాక్రమముగలవాడు. ఇతడగ్నిదేవునివలనగంధర్వకన్యకకుపుట్టినవాడు. అగ్నిదేవుడు దేవాసురులయుద్ధముజరిగినపుడు, దేవతలకుసహాయముచేయుటకొఱకు యితనినిబుట్టించెను. రాక్షసేశ్వరుడా! రావణాసురా! ఈవానరోత్తముడు, నేరేడిచెట్టుచేనొప్పుచున్నదియును, సమస్తకిన్నరులకును వాసస్థానమైనదియును, నీయన్నయగుకుబేరునిచేబాలింపబడినదియును, కుబేరునకువిహారస్థానమైయొప్పుచున్నదియును, పర్వతములలోనెల్ల శ్రేష్ఠమైనదియును,నగు హిమవత్పర్వతముమీద వాసముచేయుచుండును. ఈతడు క్రోధనుడనువాడు. మహాకాంతిమంతుడు. మిగులబలపరాక్రమములుగలవాడు. ఎప్పుడుగానియుద్ధములయందు ఆశగలవాడు. ఆత్మస్తుతిచేసికొనడు. ఈతడువానరసేనానాయకుడు. ఇతనిక్రింద వేయికోట్లవానరవీరులున్నారు. ఈక్రోధనుడొక్కడె తనసైన్యముతో నీలంకానగరమునుమర్దింపగోరుచున్నాడు. ఇదిగోయిచ్చటనొక వానరశ్రేష్ఠుడున్నాడుచూడుము. ఇతడు పూర్వములంకకువచ్చినఆంజనేయుని తండ్రి కేసరియనుపేరుగలవాడు. ఈతడు వానరులకును యేనుగులకును పూర్వవిరోధమునుజ్ఞాపకముంచుకొని, యేనుగులను భయపరచుచు,తానుపోవుమార్గమున యేనుగులనెత్తి పర్వతములపైగొట్టుచు, పర్వతములనెత్తి యేనుగులపై బడవైచుచు, ఏనుగులను గొప్పవృక్షములపైవైచుచు, వృక్షములుపెరికి యేనుగులపై బడవేయుచు, యిట్లనేకవిధములచే, గజములంజంపుచుగంగానదీతీటతమునసంచరించుచు, పర్వతగుహాలయందు వాసముచేయుచుండును. మఱియు సైన్యమునకంతయు ముఖ్యుడును, వానరోత్తముడునునగు నీవానరశ్రేష్ఠుడు, హిమవత్పర్వతమునబుట్టినగంగానదీ సమీపముననున్నదియును, మందరపర్వతముతో సమానమైనదియును, నగు, ఉశీరబీజమను పర్వతమున "స్వర్గముననుండు దేవేంద్రునివలె" వాసముచేయుచు మహాసుఖముగనుండును. ఈతనిక్రింద వేయిలక్షలవానర వీరులున్నారు. ఇతడు, ఉత్సాహముచేతను, శౌర్యముచేతను, గర్వించినవారును, సింహనాదములను చేయుచున్నవారును, మహాబలము గలవారును, మిగులవేగము గలవారునునగు నావేయిలక్షల వానరులకునునాధుడు.

రాక్షసరాజా! రావణాసురుడా! అదిగోచూడుము.అచ్చట,వాయువుచేనెగురగొట్టబడినదియును, ఎఱ్ఱనికాంతిగలదియును, నానావిధముల సుళ్లుదిరుగుచున్నదియును, నగుదుమ్ము,అగుపడుచున్నది.అచ్చటమిగులబలవంతులగువానరసేనలుయుద్ధసంరంభముతోనున్నవి. వాటినడుమగాలిచేనెగురగొట్టబడిన మేఘమువలెనున్నవాడును, ఎవరికిగానిసహింపనలవిగానివాడును,నగునావానరసేనానాయకుడుప్రమాధియనువాడు. రావణాసురుడా! తెల్లనిముఖముగలవియును, మిగులబలముగలవియును,నగుపదికోట్లకొండముచ్చులు, సేతువుకట్టికాగానే,లంకాపురినిమర్దించుటకొఱకుఅతివేగముతోవచ్చుచున్నవి. వీటికిసేనానాయకుడుగవాక్షుడు. వాడు ఆకొండముచ్చులనడుమవచ్చుచున్నాడుచూడుము. ఓమహారాజా! రావణాసురుడా! సర్వకాలములయందును ఫలించువృక్షములతోనొప్పుచున్నదియును,ఎల్లప్పుడుశ్రేష్ఠములైనతేనియలతోనొప్పియుండుటచేదుమ్మెదలతో గూడియున్నదియును, సూర్యుడుతనసమీపమునబోవుటచే కాంచనమయమైనకాంతిగలదియును,అచ్చటసంచరించెడుమృగపక్షులన్నిటినితనకాంతివంటికాంతిగలవాటినిగజేయునదియును,నిరంతరమునుమహర్షిసమూహములచేనొప్పుచున్నదియును, స

మస్తఫలములతో నొప్పుచున్నవృక్షములతో నిండియుండునదియును, నగుబంగారుపర్వతమగు మేరుపర్వతమునందు వానరవీరులలో నుత్తముడగు కేసరియనువాడు నివసించియుండును. అనఘాత్మా! రావణాసురుడా! మిగులరమణీయములగు బంగారుకొండలు అరువదివేలున్నవి. రాక్షసులలో నీవు సర్వోత్తముడవైయున్నట్లు వాటిలో ముఖ్యమగు పర్వతమొకటికలదు. కపిలవర్ణముగలవారును, తెల్లనివన్నెగలవారును, ఎఱ్ఱనిముఖములుగలవారును, తేనెవలెగోరోచనపుఛాయగలవారును, కటుకోఱలుగలవారును, గోళ్ళేఆయుధములుగా గలవారును, నాలుగుకోఱలుగలసింహములవలెనున్నవారును, పెద్దపులులవలెదుర్జయులును, నిప్పుతో సమానమైనవారును మహాక్రూరసర్పములవలెనున్నవారును, మిగులపొడవులైన తోకలుగలవారును, మదపుటేనుగలతో సమానమైనవారును, మహాపర్వతములవలెనున్నవారును, గొప్పమేఘధ్వనివలెసింహనాదముచేయువారును, గుండ్రములైనవియును, రక్తపింగళవర్ణముగలవియును, నగు నేత్రములుగలవారును, మహాభయంకరులును, మిగులభయంకరమైన గమనమును కంఠధ్వనియునుగలవారును, నగునీవానరులు ఆయుత్తమపర్వతముపై నివసించియుందురు. వారందఱును యీలంకానగరమును జూచియిప్పుడే మర్దింపగోరుచున్నారు. ఓరాక్షసేశ్వరా! రావణాసురుడా! అదిగోచూడుము. ఈవానరులకు సేనానాయకుడు వీరిమధ్యమునందుప్రకాశించుచున్నాడు. అతని పేరుశతవలియని భూమియందంతటను ప్రసిద్ధినొంది యున్నాడు. అతడుమహాశౌర్యవంతుడు. మహాబుద్ధిమంతుడు. జయేచ్ఛగలవాడై నిరంతరముసూర్యుని, ఆరాధించుచుండును. అతడొక్కడేతనసైన్యముతో లంకానగరమునుమర్దింపగోరుచున్నాడు. అతడుమహాబలపరాక్రమశాలి. యుద్ధవీరుడు. తనపౌరుషమునువదలకదృఢముగనిలుచువాడు. ఈ శతవలిరామకార్యార్థమై తనప్రాణములనైనవిడుచును. మఱియుగజుడును, గవయుడును, గవాక్షుడును, నీలుడును, నలుడునుఅనునీవానరులుఒక్కొక్కడును పదికోట్ల సైన్యముతోగూడియున్నారు ఈరీతిగానే, వింధ్యపర్వతముననివసించువారును, మితిలేనిపరాక్రమముగలవారును, నగువానరోత్తములనేకులున్నారు. వారినిలెక్కింపనలవిగాదు. ఓమహారాజా! రాక్షసేశ్వరా! ఈవానరులందఱును అమితపరాక్రమముగలవారు. వీరందఱునుపర్వతములతో సమానమైనదేహములుగలవారు. భూలోకమునను౦డెడిపర్వతములనన్నిటిని క్షణమాత్రములోనపిండిచేసితూర్పారపట్టగలరు. అనిసారణుడు రాక్షసేశ్వరుడగురావణాసురునితో జెప్పె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలియిరువదియేడవ సర్గ ముగిసెను.

▸(❋)◂

రావణాసురునకు శుకుడుపూర్ణముగ వానరవీరులపేళ్ళను వేర్వేరుగ దెలియజెప్పుట.

అంతశుకుడు, సారణుడుచెప్పినదంతయువిని, అతడు పూర్ణముగచెప్పకుండుటచే, తాను రాక్షసేశ్వరుడగురావణాసురునకువానరసైన్యమునంతయుజక్కగాజూపి యిట్లని చెప్పనారంభించె. ఓమహారాజా! రావణాసురుడా! మదపుటేనుగులవలెనున్నవారును, గంగాతీరమునను౦డెడు మఱ్ఱిచెట్లవలెనున్నవారును, హిమవత్పర్వతమునబుట్టినమద్దిచెట్లవలెనున్నవారును, నగునీవానరులందఱిని చక్కగచూచుచున్నావుగదా. వీరుదుర్జయులు. మహాబల పరాక్రమములుగలవారు. కామరూపులు. దైత్యదానవులతో సమానులు. యుద్ధరంగమునందు దేవతలపరాక్రమమువంటి పరాక్రమముగలవారు. మఱియునీవానరులు తొమ్మిదివేలకోట్లును, యేడువేలకోట్లును, ఐదువేలకోట్లును, పెక్కువేల శంఖములును, అనేకనూరుల బృందంబులునునై యున్నారు. రాక్షసేశ్వరా! ఈవానరులు సుగ్రీవునిమంత్రులు. వీరునిరంతరము కిష్కింధానగరముననుందురు. దేవగంధర్వులకు బుట్టినవారు. పుట్టినదిమొదలుకొనియిచ్ఛకువచ్చినరూపమునెత్తుచు కామరూపులైయున్నారు. దేవా! రావణాసురుడా! మంచిరూపవంతులును యౌవనవంతులును నగునీయిద్దఱినిచూడుము. వీరిద్దఱుమైందద్వివిదులను పేరుగలవారు. యుద్ధమునందు వీరికిసమానుడెవ్వడును లేడు. వీరిద్దఱును బ్రహ్మదేవుని యనుమతినిబొంది. అమృతముద్రావియున్నారు. వీరుయుద్ధమునందు మహాపరాక్రమమును అవలంబించి లంకానగరమును మర్దింపగోరుచున్నారు. ఈ మైందద్వివిదులప్రక్కన, కొండలవలెనిద్దఱు పదికోట్లసై

స్యముచే పరివేష్టింపబడి లంకానగరమును మర్దించుటకై చూచుచున్నారు చూడుము, వీరిరువురును సుముఖుడు, దుర్ముఖుడను పేళ్లుగలవారు. మృత్యువుకొడుకులు. తండ్రితోసమానులు. ఓ మహాప్రభూ! రావణాసురుడా! మదపుటేనుగువలెనుండెడి యావానరునిజూడుము. ఈతడు కుపితుడయ్యెనేని సముద్రమునైన క్షోభనొందించును. ఇతడు లంకకువచ్చి సీతనుజూచి నీతో మాట్లాడి పోయినాడు. పూర్వము నీవు అతనిజూచి యున్నావుగదా. మఱలవచ్చి యున్నాడు చూడుము. ఈతడు, అందఱికిని మొదటివాడగు కేసరీక్షేత్రపుత్రుడు. వాయుదేవునకు బుట్టినవాడు. ఇతనిపేరు హనుమంతుడందురు. సముద్రమును దాటి లంకకువచ్చిన మహాత్ముడియితడేను. ఈతడు కామరూపి. మహాబలపరాక్రమశాలి. సర్వవ్యాపకుడగు వాయుదేవునివలెనే అడ్డగింపనలవిగానివాడు. పూర్వమియితడు పసివాడుగనుండగానే యొకనాడు మిగుల నాకలిదప్పులుగలవాడై, ఉదయించుచున్న సూర్యునిజూచి, బలగర్వితుడై "నాకాకలితీరకున్నది. ఈసూర్యునిబట్టి తినెదను" అనియోచించి మూడువేల ఆమడల దూరముపైకిబోయి, దేవతలకుగాని దానవులకుగాని మహర్షులకుగాని యెంతమాత్రము తేరి చూడనలవిగాని దేవుడగు సూర్యదేవునిసమీపమునకు బోజాలక, ఉదయపర్వతముపైబడెను. మిగులదృఢమైన చెక్కిలి మీదిభాగముగలయీవానరుడు, అట్లాపర్వతముపైబడగానే యితనిచెక్కిలి మీదిభాగమొకటి కొంచెము విఱిగినది, కావుననేయితనికి హనుమంతుడను పేరువచ్చినది. మిగులనమ్మకమగు వానరుడొకడుచెప్పగ యీహనుమంతుని వృత్తాంతము నాకు దెలిసినది. ఇదియథార్థము. ఈహనుమంతునియొక్క బలముగాని, రూపముగాని, మహిమగాని చెప్పుటకలవిగాదు. ఈతడొక్కడె తనపరాక్రమముచేత లంకాపురిని మర్దింపగోరుచున్నాడు. మహారాజా! రావణాసురుడా! ఈయాంజనేయునకు సమీపమున, మహాశూరుడును, శ్యామలవర్ణముగలవాడును, తామరతేకులతో సమానములైన నేత్రములుగలవాడును, నగునొక దివ్యపురుషుడున్నాడు చూడుము. అతడుయిక్ష్వాకువంశమునబుట్టినవారిలో నెల్లశ్రేష్ఠుడు. లోకప్రసిద్ధమగు పరాక్రమముగలవాడు. అతనిధర్మమువిడువడు. అతండును ధర్మమునతిక్రమింపడు. వేదవేత్తలలో నెల్లశ్రేష్ఠుడు. బ్రహ్మాస్త్రము మొదలగు సమస్తములైన అస్త్రములను దెలిసినవాడు. వేదములన్నియు చక్కగా దెలిసినవాడు. తన బాణములచే నాకాశమునైన భేదింపగలడు. పర్వతములనైనను పిండిచేయగలడు, మృత్యువుతో సమానమైన కోపముగలవాడు. దేవేంద్రుని పరాక్రమమువంటి పరాక్రమముగలవాడు. నీవుజనస్థానమునుండి తెచ్చిన సీతాదేవి యాతనిభార్యయే. అతడే రాముడు. నీతో యుద్ధమునకై వచ్చుచున్నాడు. మఱియు నారాముని కుడిప్రక్కయందు, నిర్మలమైన బంగారుయొక్క కాంతివంటి దేహకాంతిగలవాడును, విశాలమైన ఱొమ్ముగలవాడును, ఎఱ్ఱని నేత్రములుగలవాడును, మిగుల నల్లనై వంకరలుగనుండెడి తలవెంట్రుకలుగలవాడును, నగునొక రాచకొమరుడున్నాడు. చూడుము. అతడు రాముని తమ్ముడు. లక్ష్మణుడను పేరుగలవాడు రామునకు ప్రాణమునకన్న ప్రియమైనవాడు. ఆలక్ష్మణుడు నీతిశాస్త్రమునందును యుద్ధమునందును, మిగులసమర్థుడు. సమస్తశాస్త్రములను చక్కగ దెలిసినవాడు. మహాకోపముగలవాడు. అజేయుడు. జయశీలుడు. మహాశౌర్యముగలవాడు. మిగులబుద్ధిమంతుడు. అధికబలముగలవాడు. రామునకు కుడిభుజమువంటివాడు. ఎల్లప్పుడును రామునకు బైటిప్రాణమువంటివాడు. ఈలక్ష్మణుడు రామునికొఱకు ప్రాణములనైన విడుచును. అతండొక్కడే యుద్ధమునందు సమస్తరాక్షసులను జంపవలయునని కోరుచున్నాడు. అదిగో నలువురు రాక్షసులచే బరివేష్టితుడై రాముని యెడమప్రక్కనున్నాడు. చూడుము. అతడే రాక్షసరాజైన విభీషణుడు. శ్రీమంతుడును, రాజరాజునునగు రాముడు యీవిభీషణుని లంకారాజ్యమునకు రాజుగానభిషేకించెను. కావున నీవిభీషణుడు యుద్ధసన్నద్ధుడై నీపైకియుద్ధమునకు వచ్చుచున్నాడు. వీరినడుమ పర్వతమువలె నిశ్చయుడైయున్నవాడును, సమస్తవానరసేనలను జూచుచున్నవాడును, నగువాతడే సమస్తవానరులకు రాజగు సుగ్రీవుడు. "హిమవత్పర్వతము సమస్తపర్వతములను అతిశయించియుండునట్లు" ఇతడు, కాంతిచేతను, కీర్తిచేతను బుద్ధిచేతను, జ్ఞా

నము చేతను, కులము చేతను, సమస్తవానరులను అతిశయించియున్నాడు. ఇతడు ప్రవేశింప నలవిగానిదియును. పర్వతదుర్గములచే నావరింపబడినదియును, చుట్టు సమస్తములైన చెట్లలో నిండియుండునదియును, గుహారూపమైనదియును, నగు కిష్కింధయందు ప్రధానయూథపులతో గూడివాసము సేయుచుండును. ఈతనివక్షస్థలమందు, నూరు కమలములు గలదియును, బంగారుమయమైనదియును, దేవతలకును మానవులకును దుర్లభంబైనదియును నగు కాంచనమాల వెలుగుచున్నది చూడుము. దానియందు వీరలక్ష్మి యున్నది. దానినిధరించినవాడు యెప్పుడు గాని యుద్ధమునందు పరాజయమును బొందడు. రాముడు యుద్ధమునందు వాలిని జంపి, ఈ కాంచనమాలను, తారను, శాశ్వతమగు వానరరాజ్యమును, సుగ్రీవునకునిచ్చె.

రాక్షసేశ్వరా! రావణాసురుడా! నూరులక్షలొక కోటియనియు నూరువేలకోట్లు ఒకశంఖమనియు చెప్పుదురు. నూరువేలశంఖములొక మహాశంఖమగుచున్నది. నూరువేల మహాశంఖములొక బృందమని చెప్పబడుచున్నది. నూరువేలబృందము లొకమహాబృందమగుచున్నది. నూరువేలమహాబృందము లొకపద్మమని చెప్పుదురు. నూరువేలపద్మములొక మహాపద్మమగును. మహాపద్మములు నూరువేలొక ఖర్వమని చెప్పబడును. నూరువేలఖర్వములొక మహాఖర్వమగుచున్నది. మహాఖర్వములు నూరువేలొక సముద్రమనబడును. నూరువేల సముద్రములొక ఓఘమగుచున్నది. ఓఘములు నూరువే లొకమహౌఘమనబడుచున్నది. ఇట్లు వేయికోటులును, నూరుశంఖములును, వేయిమహాశంఖములును, నూరుబృందములును, వేయిమహాబృందములును, నూరుపద్మములును వేయిమహాపద్మములును, నూరుఖర్వములును, నూరుసముద్రములును, నూరుఓఘములును, కోటిమహౌఘములునుగల సేనతో గూడి, విభీషణుడును అతనిమంత్రులగు రాక్షసులును తన్నుపరివేష్టించి నడువ మహాబల పరాక్రమశాలియును, వానరేశ్వరుడును, నగుసుగ్రీవుడు నీతో యుద్ధము సేయవచ్చుచున్నాడు. మహారాజా! రావణాసురుడా! మహాక్రూరగ్రహముతో సమానముగ ప్రకాశించుచున్నదియును, సమీపమునకువచ్చియున్నదియును, నగునీమహాసేనను జూచి, ఇంక మనకు జయముగలుగునట్లుగను, శత్రువులచే నపజయము రాకుండునట్లుగను జక్కగ ప్రయత్నము చేయవలయును. అనియిట్లు రావణాసురునితో నతనిమంత్రియగు శుకుడు చెప్పె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి యిరువదియెనిమిదవ సర్గముగిసెను.

శ్రీరస్తు.

శ్రీరామచంద్రసద్గురుపరబ్రహ్మణేనమః

యుద్ధకాండము — ఇరువదితొమ్మిదవసర్గ ప్రారంభము.

(*)

(*)రావణాసురుడు శార్దూలుడు మొదలగు చారులను రామునొద్దకు బంపుట.(*)

అవ్విధముగ శుకునిచేత జెప్పబడిన వానరాధిపతులను, మఱియు రామునిప్రక్కనున్నవాడును, తనకుదమ్ముడును, నగు విభీషణుని, మహావీర్యముగలవాడును, రామునకు దక్షిణభుజమువలె నున్నవాడును, నగు లక్ష్మణుని, సర్వవానరులకధిపతియును, భయంకరమైన పరాక్రమముగలవాడును, నగు సుగ్రీవుని, మఱియు నితరులగు హనుమదాదివానరులను, జూచి రావణాసురుడుంగొంచెముగా ద్వరపాటుగలవాడును, కోపోద్దీపితుడునునయ్యె. అంతట నారావణాసురుడు తనకుభయముగలుగునట్లు రామునివృత్తాంతమును బొగడుచున్న శుకసారణులను, చారులను, నానావిధములగువాక్యములచేత బెదిరించె. అప్పుడాశుకసారణులిరువురును సిగ్గుచేతతలవంచుకొనియుండిరి. ఆసమయమునందు రావణాసురుడు రోషగద్గదవాక్కుచేత సంరబ్ధుడై కఠినములగుమాటలను జెప్పదలచియిట్లనియె. ఓశుకసారణులారా! ఒకప్రభువునునాశ్రయించి జీవించుచున్న మంత్రులునిగ్రహానుగ్రహములయందు దమప్రభువునకిష్టముగాని మాటను జెప్పుట తగదనిన్యాయశాస్త్రము చెప్పుచుండగా మీరిద్దఱును నాముందట నివ్విధముగాశత్రువులను బొగడుటకొంచెమైనను ఉచితముగానుండలేదు. మఱియునోరాక్షసోత్తములారా! ప్రతికూలముగ సంచరించుచున్నవారును, యుద్ధముకొఱకు బ్రవర్తించుచున్నవారును, నగు శత్రువులయొక్కవృత్తాంతమును దగనికాలమునందు బొగడుట మీయిరువురకునుదగునా? తగదు. తగనికార్యమును జేసితిరి. ఓశుకసారణులారా! మీరు, రాజశాస్త్రములగు నీతిశాస్త్రములయొక్కసారమును గ్రహించి జీవింపకపోవుటచేత నాచార్యులను, గురువులను, వృద్ధులను, వ్యర్థముగా సేవించినవారైతిరి. మఱియు నోశుకసారణులారా! మీరిరువురును శాస్త్రగ్రంథములను భారముకొఱకు వహించితిరే గాని జ్ఞానముకొఱకుగాదని తోచుచున్నది, ఇట్టిమూర్ఖులగు మంత్రులతో గూడుకొనిననేను దైవయోగముచేత రాజ్యమును జేయుచున్నాడనేగాని మంత్రులగుమీయొక్కసహాయముచేత రాజ్యమును జేయుచున్నవాడనుగాను. ఓశుకసారణులారా! నాయెదుట బరుషవచనములను బలుకుచున్నమీకుమరణభయముగలుగకుండుటకు గారణమేమి? ప్రభుత్వమును జేయుచున్న నాయొక్కజిహ్వ శుభాశుభఫలములనివ్వగలదు. మఱియు నోశుకసారణులారా! "శ్లో॥ అప్యేవదహనంస్పృష్ట్వావనేతిష్ఠతిపాదపాః। రాజదోషపరామృష్టాస్తిష్ఠంతేనాపరాధినః॥ వనమునందలి వృక్షములుదావాగ్నిస్పర్శగలిగినప్పుడు బ్రదుకనివిధముగ రాజులకపకారమును జేసినదోషులుగూడ జీవింపజాలరను నీతిశాస్త్రమును మీరెఱుగరా? నీతిశాస్త్రమును సంపూర్ణముగజదివియును, మీరివ్విధముగమాటలాడుట యుచితమనితోచలేదు. కావున పాపాత్ములును, శత్రుపక్షమును స్తోత్రమునుజేయుచున్నవారును, నగు మిమ్ములజంపుదును. అయినను పూర్వమునందుమీరుచేసిన ఉపకారమునుస్మరించి మిమ్ములవదలుచున్నాను. మునుపటియుపకారము స్మరణకురానియెడల మిమ్ములజంపియేయుందును. శుకసారణులారా! మీమోమును జూడగూడదు. మీరు నాసమీపముననుండకపొండు. మీరు పూర్వమునాకు ఉపకారమును జేసియుండుటవలన మిమ్ములజంపకవిడిచిపెట్టుచున్నాననియె. అంతట నాశుకసారణులిరువురును చమత్కృతఘ్నతను, రావణాసురుని పౌరుషవచనములను, దలచుకొనివచ్చినవారితో సమానులమైతిమనితలచుకొనిసిగ్గుచేతదలనువంచుకొని జయజయశబ్దములచేత రావణాసురునిబొగడుచు నచ్చోటనుండి బయలువెడలిపోయిరి. అంతట నారావణాసురుడు తనసమీపమునందున్నమహోదరుడను మంత్రిపుంగవునిబిలిచి యిట్లనియె. మహోదరుడా! నీతివిశారదులగు చారులనిక్కడకు రప్పింపుమని చెప్పె. అంతటనామహోదరుడు రావణాసురునివచనానుసారముగ నీతిశాస్త్రములను నెఱిగిన చారులను అతిశీఘ్రముగరప్పించె. అప్పుడు రావణాసురుని యాజ్ఞనుశిరసావహించి నీతివిశారదులగు చారులుమిగుల శీఘ్రముగావచ్చిరి. వచ్చిచేతులనుముకుళించుకొని జయజయ శబ్దములచేత రావణాసురునకాశీర్వచనమును జేసిరి. అట్లుపరమభక్తితోవచ్చినవారును, మిగులనమ్మకముగలవారును, భయములేనివారును, నగు చారులనుజూచి రాక్షసాధిపతియగు రావణాసురుడు యిట్లనియె. ఓచారులారా! మీరిక్కడనుండి బయలువెడలిపోయి రామునియుద్యోగమును సర్వమును దెలిసికొనిరండు. మఱియు నా రామునిమంత్రులలో

నెవ్వరు రామునకంతరంగభూతులో, ఎవ్వరుమిగుల ప్రియముగలవారో, ఎవ్వరుపరమమిత్రులో, వారలనుబరీక్షించి తెలిసికొనిరండు. మఱియు నోచారులారా! రాముడొంటరిగానిద్రించుచున్నాడో, లేక బహుమందిచేతజుట్టుకొనబడి నిద్రించుచున్నాడో తెలిసికొనిరండు. మఱియునోచారులారా! రాముడొంటరిగానే మేలుకొనియుండునో లేకబహుమందితోగూడుకొని మేలుకొనుచున్నాడో తెలిసికొనిరండు. మఱియునింకను మిగులనేర్పరితనముతో సర్వమును దెలిసికొనియతిశీఘ్రముగ రావలయును. మఱియునోచారులారా!

శ్లో॥ చారేణవిదితశ్శత్రుః పండితైర్వసుధాధిపైః। యుద్ధేస్వల్పేనయత్నేన సమాసాద్యనిరస్యతే॥

చారులమూలకముగ శత్రువుల వృత్తాంతమును సర్వమును జక్కగ దెలిసినవారును, పండితులునునగు ప్రభువులు యుద్ధములయందుమిగులస్వల్పమగుప్రయత్నముచేత నేశత్రువులనుజంపగలరు. ఈ విషయమంతయును మీరెఱిగినవిషయమేగాని వేరుగాదుగదాయనియె. అంతటచారులు మిగులసంతోషముగలవారై తమయాజ్ఞానుసారముగ బ్రవర్తించెదమని రావణాసురునితో జెప్పి శార్దూలుడను వానిముందుంచుకొని యారావణాసురునకు బ్రదక్షిణనమస్కారమును జేసిరి. అవ్విధముగ నాచారులుమహాత్ముడును, రాక్షసోత్తముడునునగు రావణాసురునకు నమస్కారమును జేసి రామలక్ష్మణులున్నచోటునకుబోయిరి. అప్పుడు సువేలపర్వతముయొక్కయగ్రభాగమునందు రామలక్ష్మణులు సుగ్రీవవిభీషణులతోగూడుకొనినవారైయుండిరి. అట్టిరామలక్ష్మణులను రావణాసురుని చారులు ప్రచ్ఛన్నవేషములను ధరించినవారైచూచిరి. మఱియునాచారులు భయపీడితులై యావానరసైన్యమును సర్వమునుజూచినవారైరి. అవ్విధముగా సంచరించుచున్న రామలక్ష్మణులు ధర్మాత్ముడును రాక్షసేంద్రుడును, నగు విభీషణునిచేతజూడబడిరి. పిమ్మటనావిభీషణుడిచ్ఛానుసారముగసంచరించుచున్నయారాక్షస చారులను తనవారిచేత బట్టుపఱునట్లు చేసె. పిమ్మటశార్దూలుడనురాక్షసుడు మిగులబాపాత్ముడనిచెప్పి బంధించునట్లు చేసె. అట్లుచేసియనంతరమందు వానరభటులచేత జంపించుటకు యత్నించె. అప్పుడుదయాస్వభావముగల రాముడు వారలజంపగూడదని చెప్పి విడిపింపజేసె. అధికమగు పరాక్రమముగలవానరవీరులచేతను, స్వల్పమైనపరాక్రమముగల వానరవీరులచేతను నారావణాసురుని చారులధికముగా బీడింపబడినవారైయచ్చోటనేమియును జేయజాలక భ్రాంతచిత్తులును, ప్రాణములను మాత్రము తప్పించుకొన్నవారునునై లంకాపట్టణమునకు మరలబోయిరి. పోయిసర్వకాలములయందును వెలుపలదిరుగునట్టి యారాక్షసులు రావణాసురునివద్దకుబోయినమస్కరించి మహాబలుడగు రాముడు సువేలాద్రియొక్క శిఖరమునందున్నాడని తెలిపిరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి యిరువదితొమ్మిదవ సర్గముగిసెను.

—(*)—

{ శార్దూలుడనుచారుడు రామునియొక్కయు సైన్యముయొక్కయువృత్తాంతమునురావణాసురునకు దెలుపుట }

అంతటనాచారులు, పరులచేత క్షోభపెట్టశక్యముగానియావానరసైన్య వృత్తాంతమును, సువేలాద్రియందుగూర్చున్న రామునివృత్తాంతమును లంకాధిపతియగురావణాసురునకు దెలియజేసిరి. మహాబలుడగు రామునివృత్తాంతమును చారులవలనవిని రావణాసురుడు మిగుల ఉద్వేగముగలవాడై శార్దూలునితో నిట్లనియె. శార్దూలుడా! నీముఖవిలాసము మునుపటివలె నుండలేదు. మఱియునో రాక్షసోత్తమా! నీవుదీనుడవైయున్నావు. ఇట్లుండుటకు గారణమేమి? కోపోద్దీపితులగు శత్రువులచేతిలో దగులుకొనికష్టములనుబొందలేదుగదా? నీవృత్తాంతమును సర్వమును జెప్పుమనినవిని యాశార్దూలుడు రాక్షసోత్తముడగు రావణాసురునితోమాట్లాడదలంచిమెల్లమెల్లగ నిట్లనియె. రాక్షసరాజోత్తమా! రావణాసురుడా! వానరోత్తములందఱును శత్రువులయొక్కచారులచేత దెలియదగినవారుగారు. ఆవానరవీరులందఱును మిగుల బరాక్రమముగలవారును, బలముగలవారునునైయున్నారు. అంతయగాక రామునిచేతగాపాడబడుచున్నారు. మఱియునావానరవీరులు సంభాషించుటకుగూడ దగినవారుగారు. కాబట్టియక్కడమనమాటకుబదులుమాటపుట్టదు. మఱియునో రాక్షసోత్తమా! రావణాసురుడా! పర్వతములతో సమానులగు వానరులచేతశత్రుమార్గముమిగులజక్కగా గాపాడబడుచున్నది. నేనక్కడబ్రవేశించినతోడనేవానరులవృత్తాంతము చారులకు గోచరముగాదని తెలిసికొంటిని. నేనావానరసైన్యమునందుబ్రవేశింపగానే యందలివానరులు వచ్చినన్నుబలాత్కారముగబట్టుకొనిరి. అంతనేను మిగులభయమునుబొందితిని. అప్పుడుబలవంతులును, కోపముగలవారునునగు వానరవీరులువచ్చి దంతములచేతను, మోకాళ్లచేతను, పిడికిళ్లచేతను, పాదతలములచేతను, మిగులగఠినముగా గొట్టిరి. అంతట నావానరవీరులందఱును, నన్నుబాధించి రాముని సమీపమునకు గొనిపోయిరి. అప్పుడు నేనునెత్తురుచేతవ్యాప్తమైనసర్వావయవములును గలవాడను, మిగులవ్యసనమునుబొందినవాడను, చపలములైనయింద్రియములుగలవాడను

నైతిని. మఱియు నావానరవీరులచేత నానావిధములుగా
గొట్టబడుచుంటిని. అప్పుడు నేను చేతులను ముకుళించుకొని
యాచించుచున్నవాడనైయుంటిని. మఱియు నాసమయము
నందు నేను రామునిచేత జీవింపగలనని తలచితిని. అంతట
రాముడు దయచేత నన్ను విడిపించె. ఆ రాముడు సువేలాద్రి
యందుండి తాళ్లచేతగొప్పదగు సముద్రమును గట్టుచు
న్నాడు. మఱియు నా రాముడు మిగులతీక్ష్ణములగు నాయు
ధములుగలవాడై లంకాపట్టణముయొక్క ద్వారమును ఆవ
రించుకొనియున్నాడు. ఆ రాముడు గరుడవ్యూహమునవ
లంబించినవానరవీరులచేతజుట్టబడినవాడైనన్నువదిలిపెట్టెమ
నలంకాపట్టణమునకభిముఖముగాయుద్ధసన్నద్ధుడైవచ్చుచు
న్నాడు. రావణాసురుడా! ముందుగా బ్రాకారముమీదికి
రాముడువచ్చుచున్నాడు. కావున రామునకు సీతనైనని
మ్ము. కాదేని యతిశీఘ్రముగ రామునితోయుద్ధమునైనజే
యుమనియె. అవ్విధముగ శార్దూలుడు చెప్పిన మాటనువిని
రాక్షసాధిపతియగు రావణాసురుడు మనస్సుచేత సర్వ
మును ఆలోచించిచూచి మిగులగొప్పదగు వాక్యమునుజె
ప్పదలచి యాశార్దూలునితోనిట్లనియె. శార్దూలుడా! దేవ
తలును, గంధర్వులును, దానవులునునొకటిగాజేరి నాతో
యుద్ధమును జేసిన ప్పటికిన్ని సర్వలోకములనుండి భయము
గలిగినను నేనుసీతనిచ్చువాడనుగానని చెప్పె. మహాతేజోవం
తుడగు రావణాసురుడివ్విధముగాజెప్పి మరలజెప్పదలచి
యిట్లనియె. శార్దూలుడా! మీరువానరసైన్యమును సర్వము
నుగలియ వెదకితిరిగదా? అక్కడనుండు వానరులలో నెవ్వ
రెవ్వరో తెలిసినయెడలజెప్పుము. మఱియునో రాక్షసుడా!
శార్దూలుడా! సౌమ్యుడా! ఆవానరులెటువంటివారు. మఱి
యు నెట్టిసామర్థ్యముగలవారు. ఆవానరులలో నెవ్వరెవ్వ
రుజయింపశక్యముగానివారు. ఆవానరులెవ్వరిపుత్రులు. ఎ
వ్వరిమనములు. ఆవృత్తాంతమును సర్వమును జెప్పుము. ఆ
విధమును సర్వమును జెప్పితివేని యావానరుల బలాబలము
నుదెలిసికొనగలను. యుద్ధమును జేయవలయునని కోరికగ
లవారు ముఖ్యముగా శత్రువులబలమును దెలిసికొనవలయు
ను. కావున నావృత్తాంతమును సర్వమును దెలిసికొనవల
యుననియె. ఇవ్విధముగా రావణాసురుడు చెప్పినమాటల
నువిని యుత్తముడగు శార్దూలుడు రావణాసురునియొ
క్కసన్నిధియందు సకలవృత్తాంతమును జెప్పదలచినవాడై
యిట్లనియె. రావణాసురుడా! ఋక్షరజసునకు బుత్రుడగు
సుగ్రీవుడు యుద్ధమునందు శత్రువులచేత జయింపనలవి
గానివాడు. గద్గదుడనువానికి బుత్రుడగు జాంబవంతుడను
వాడు మిగుల బ్రసిద్ధుడు. ఆగద్గదునకు ధూమ్రుడనియెడు

మఱియొకపుత్రుడుగలడు. అతడక్షుడు మొదలుగాగల రా
క్షసులతో ఘోరమగు యుద్ధమును జేసి వారలను జయించె.
మఱియునతడు దేవేంద్రునకు గురువగు బృహస్పతికినిబుత్రు
డనబడును. ధర్మదేవతకుబుత్రుడగుసుషేణుడు మిగులవీర్య
ముగలవాడు. రాక్షసరాజోత్తమా! సోమునకు బుత్రుడగు
దధిముఖుడనువాడు మిగులసౌమ్యమగు స్వభావముగలవా
డు. సుముఖుడనియెడువానరుడతి దుర్ముఖుడు. వాడధికమ
గువేగముగలవాడు ఆవానరోత్తమరూపమునుగా బ్రహ్మ
దేవుడు మృత్యుదేవతనే పుట్టించెనని తోచుచున్నది. అగ్ని
దేవునకు బుత్రుడగు నీలుడనువానరోత్తముడు వానరసైన్య
మునకు సర్వమునకు నధిపతియైయున్నాడు. మఱియు
రాక్షసరాజోత్తమా! వాయుదేవునకు బుత్రుడగు హను
మంతుడు మిగులబ్రసిద్ధుడు. దేవేంద్రునకుమనముడును,
వాలికి బుత్రుడునునగు నంగదుడు శత్రువులచేత నాక్రమిం
పనలవిగానివాడు. మఱియునయ్యంగదుడు మిగులబడుచు
వాడు. అశ్వనీ దేవతలకు బుత్రులగు మైందుడు ద్వివిదుడ
నుసిద్ధయువానరోత్తములు మహాబలవంతులు. యమునకుబు
త్రులగు గజుడును, గవాక్షుడును, శరభుడును, గంధమా
దనుడును నను నైదుగురును కాలాంతకునితో సమానులు.
మఱియునో రాక్షసరాజోత్తమా! యుద్ధమును జేయవల
యుననియెడు కోరికగల వానరులు పదికోట్లమందికెక్కువ
సంఖ్యగలవారైయున్నారు. శ్రీమంతులును, దేవపుత్రులు
నునగు నావానరవీరులయొక్క పుట్టువులను నేను జెప్పజాల
ను. మఱియు నో రావణాసురుడా! దశరథమహారాజునకు
బుత్రుడును, వయోవంతుడునునగు రాముడు సింహసంహ
ననుడని తెలిసికొనుము. అతడు ఖరదూషణ త్రిశిరలను రా
క్షసోత్తములను సంహరించె. ఈభూలోకమునందెవ్వడు
ను బరాక్రమమునందు రామునితో సమానుడు లేడు. కావు
న నేయా రాముడు యమునితో సమానులగు విరాధ కబం
ధులను సంహరించె. మఱియునో రాక్షసోత్తమా! రాము
నిగుణములను వర్ణింప నీభూలోకమునందెవడును సమర్థు
డు లేడు. ఆ రామునిచేత జనస్థానమునందున్న రాక్షసులం
దఱును జంపబడిరి. ఆ రామునకు దమ్ముడగు లక్ష్మణుడుత్త
మగజమువంటివాడు. ఆలక్ష్మణుని బాణముతగిలెనేని దే
వేంద్రుడుగూడ జీవింపజాలడు. మఱియునో రాక్షసోత్త
ముడా! సూర్యునకు బుత్రులగు శ్వేతుడు, జ్యోతిర్ముఖుడన
ను నిరువురును. బహుబలవంతులు. వరుణదేవునకు బుత్రుడ
గు హేమకూటప్లవంగుడనియెడు వానరోత్తముడధికమైన
బలముగలవాడు. విశ్వకర్మకు బుత్రుడగు నళుడనియెడువా
నరుడు వానరోత్తముడు. వసుపుత్రుడగు దుర్ధరుడను వా

నరోత్తముడు మిగుల విక్రాంతుడనియును, బలవంతుడనియును, ప్రసిద్ధినివహించె. రాక్షసులలో గొప్పవాడును, నీ తమ్ముడును, నగు విభీషణుడు లంకాపట్టణమున కాధిపత్యమును బొంది రామకార్యమునందు మిగుల నిష్టముగలవాడై సంచరించుచున్నాడు. అనిచెప్పె. ఇవ్విధముగ సువేలాద్రియందు నివసించియున్న వానరసైన్యము యొక్క వృత్తాంతమును సర్వమును దెలియజెప్పి మిగిలిన కార్యమునందు నీవే కర్తవనియె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి ముప్పదవ సర్గము గిసెను.

{మాయచే రాముని శిరస్సు కల్పించి రాముడు చచ్చిపోయె}
{నని రావణాసురుడు సీతకు రాముని శిరస్సును జూపుట.}

అంతట నాచారులందఱును పరులచేత జయింపశక్యముగాని వానరసైన్యముతో గూడుకొని సువేలాద్రియందు నివసించియున్న రాముని వృత్తాంతమును సర్వమును లంకాధిపతియగు రావణాసురునికొఱకు సవిస్తరముగ జెప్పిరి. ఇవ్విధముగా జారులు చెప్పినమాటలు విని రాముడు మహాబలుడని తెలిసికొని రావణాసురుడు మిగులను ద్వేగముగలవాడై మంత్రులతో నిట్లనియె. ఓ మంత్రిపుంగవులారా! మీరందఱును అతిశీఘ్రముగ నొకటిగా జేరుకొని నాయొద్దకు రండు. ఇది యాలోచించుటకు దగినకాలమైయున్నది. కావున మనముచక్కగ నాలోచింపవలయుననియె. అవ్విధముగా రావణాసురుడు చెప్పినమాటలను విని మంత్రులందఱును నొకటిగా జేరికొని యతిశీఘ్రముగ రావణాసురునివద్దకు వచ్చిరి. అంతట నా రావణాసురుడు శ్రేష్ఠులగు తనమంత్రులతో గూడ నాలోచించె. దుర్ధరుడగు రావణాసురుడప్పటికాలమున కేది తగియున్నదో యావిషయమును సర్వమును జక్కగా నాలోచించి తనమంత్రులనందఱును బంపి తనయింటిలోనికి బోయె. అట్లు తనగృహమునకు బోయిన పిమ్మట మహాబలుడును, అనేకములగు మాయలను నేర్చినవాడును, నగు విద్యుజ్జిహ్వుడనియెడు రాక్షసుని బిలిచి మహామాయుడగు రావణాసురుడు సీతామహాదేవియున్న చోటునకు బోయె. పోవునప్పుడా మాయలను దెలిసిన యావిద్యుజ్జిహ్వునితో నిట్లనియె. విద్యుజ్జిహ్వుడా! మనమిరువురమును మాయచేత, జనకచక్రవర్తికి గూతురగు సీతను మోహపుచ్చుదము. కావున నో రాక్షసోత్తముడా! నీవు నీమాయచేత గల్పింపబడిన రాముని శిరస్సును దీసికొని ధనుర్బాణములను ధరించి నా వెంటరమ్మనియె. ఇవ్విధముగా రావణాసురుడు చెప్పినమాటలను విని విద్యుజ్జిహ్వుడనియెడు రాక్షసుడు మంచిది అని చెప్పె. అంతట నా రావణాసురుడు విద్యుజ్జిహ్వు నంగీకరించినందుకు మిగుల సంతోషమును బొందినవాడై యా విద్యుజ్జిహ్వునకు నొకదివ్యాభరణమును బహుమతిగా సమర్పించె. అంతట మహాబలుడును, రాక్షసులకధిపతియును, నగు రావణాసురుడు సీతామహాదేవిని జూడవలయుననెడు కోరికగలవాడై యశోకవనమునందు బ్రవేశించె. పిమ్మట మిగుల దీనురాలును, దీనత్వమును బొందుటకు దగనిదయును, మోమును వంచుకొని యున్నదియును దుఃఖమును బొందుచున్నదియును, భూమియందు బడియున్నదియును, భర్తయగు రాముని సర్వకాలములయందును ధ్యానమును జేయుచున్నదియును, అశోకవనమధ్యమందున్నదియును, మిగుల భయంకరస్వభావముగల రాక్షసస్త్రీలచేత సేవింపబడుచున్నదియును, నగు సీతాదేవియొద్దకు గుబేరునకు దమ్ముడగు రావణాసురుడు పోయె. పోయి తనపేరును మిగుల సంతోషముతో బొగడుకొనుచు నా సీతాదేవితో మిగుల కఠినములగు మాటలను జెప్పదలచి యిట్లనియె. మంగళకరురాలైనయో సీతా! నేను బహువిధములచేత నిన్ను ప్రార్థించుచుంటినిగదా? ఎవ్వరిని గుఱించి భయమును బొందుచున్నావు. ఖరాసురుని సంహరించినవాడును, నీకు భర్తయును నగు రాముడు యుద్ధమునందు జంపబడెను. మఱియు నంతటితో నీమూలమంతయును ఛేదింపబడియె. అందువలన నీగర్వమంతయును నణచబడెను. కావున నిక వ్యసనమును వదలుకొని నాకు భార్యవగుము. ఓసీ! మూఢురాలా! ఇక నీ విదురబుద్ధిని విడిచిపెట్టుము. చచ్చినవానిని గుఱించి యేడ్చి నీవేమి చేయగలవు. ఏమియును జేయజాలవు. కావున మంగళప్రదురాలవైనయో సీతా! నాకు భార్యవై సకలరాక్షసస్త్రీలకును యజమానురాలవగుము. స్వల్పమైన పుణ్యముగలదానవును, పురుషార్థహీనురాలవును, మూఢురాలవును, పండితురాలననియెడు అభిమానముగలదానవు, నైనయో సీతా! నీభర్తయగు రాముడు వృత్రాసురుడు చంపబడిన విధముగా జంపబడెను. రఘుకులోద్భవుడగు రాముడు నన్ను జంపుటకొఱకు వానరేశ్వరుడగు సుగ్రీవునిచేత బంపబడిన వానరసైన్యముతో గూడుకొనినవాడై సముద్రముదగ్గరకు వచ్చె. వచ్చి సముద్రముయొక్క యుత్తరతీరమును బీడించుచుండె. అట్లు సూర్యాస్తమయమువఱకును గొప్పదగు వానరసైన్యముతో గూడుకొనినవాడైయుండె. అంతట నా రాముడు సైన్యముతో గూడ మార్గాయాసముచేత సముద్రతీరమునందు నిద్రించె. అట్లు సుఖముగా నిద్రించియున్న వానరసైన్యముయొక్క వృత్తాంతమును దెలిసికొనుటకు నేను జారులను బంపితిని. అంతట బ్రహస్తునిచేత బంపబడిన

నాబలమంతయును బయలువెడలి యారాత్రియందే రామలక్ష్మణులున్నచోటునకుబోయెను. అవ్విధముగబోయిన రాక్షసులందఱును, పట్టసములు, పరిఘలు, చక్రములు, శూలములు, అధికముగా ప్రకాశించుచున్నకూటములు, ముద్గరములు, యష్టులు, తమరములు, శక్తులు, ముసలములు, మొదలగు నాయుధములనెత్తి వానరులయందు ప్రయోగించిరి. పిమ్మట మిగులబలవంతుడును, యుద్ధములయందుమిగులసమర్థుడును, నగు ప్రహస్తుడు గొప్పదగు ఖడ్గమునెత్తి నిద్రనుబొందుచున్న రామునియొక్క శిరస్సును ఖండించెను. ఆసమయమునందు విభీషణుడు నిగ్రహింపబడియె. అంతట లక్ష్మణుడుమిగుల భీతుడై వానరులతోగూడ బరుగెత్తిపోయె. మఱియు నోసీతా! వానరాధిపతియగు సుగ్రీవునిశిరస్సు భగ్నముచేయబడియె. మఱియు రాక్షసులు హనుమంతునిదవుడనుగోసి చంపివేసిరి. మోకాళ్లతో నెగురుచున్న జాంబవంతుడు పట్టసములను నాయుధములచేత వృక్షము నరకబడిన విధముగ నరకబడియె. మైందుడు, ద్వివిదుడు, అనునిద్దరు వానరోత్తములును జంపబడిరి. ఆయిరువురునుబిట్టూర్పులనువిడుచుచు, రోదనమునుజేయుచు, నెత్తురుప్రవాహముతోగూడ క్రిందబడిరి. మఱియును శత్రువులను బాధించునట్టి యామైందద్వివిదులిద్దఱును, ఖడ్గముచేతనడిమికి రెండుఖండములుగా ఖండింపబడిరి. మఱియునోసీతా! పనసుడు పనసవృక్షమువలె భూమియందుబడె. దరీముఖుడు నానావిధములగు బాణములచేత ఛేదింపబడినవాడై భూమియందుబడె. గొప్పదగు తేజస్సుగల కుముదుడుబాణములచేతనిష్కూజుడై చేయబడియె. మఱియు ననేకులగు రాక్షసుల నానావిధములగు బాణములచేత నంగదుడు ఛేదింపబడియె. అంతటనయ్యంగదుడు నెత్తురుగారుచుండగాగ్రహింపబడియె. మఱియునటులనే యింకను నితరులగు వానరులు నానావిధములగు ఏనుగులచేతను, రథసముదాయములచేతను మథింపబడిరి. అట్లు మథింపబడినవారైవాయువేగమునకు దాళజాలక మేఘములుపరుగెత్తినవిధముగబరుగెత్తిరి. మఱికొందఱగు వానరులు నానావిధములుగా బాధింపబడినవారై భీతచిత్తులగుచు సకలదిక్కులకునుబరుగెత్తిరి. ఆ రాక్షసులచేత దరుమబడిన వానరులందఱును సింహములచేత దరుమబడిన యేనుగులవిధమును బొందిరి. కొందఱు వానరులు సముద్రమునందు బడద్రోయబడిరి. కొందఱు వానరులాకాశమునాశ్రయించిరి. కొందఱు వానరులు తమకులోచితవ్యాపారము నవలంబించినవారై వృక్షములనెక్కిరి. మఱియును వృక్షములనెక్కినవానరులునానావిధములగు రాక్షసులచేత సముద్రతీరములయందును, పర్వతములయందును, వనములయందును, చిత్రవిచిత్రములుగ వధింపబడిరి. ఓసీతా! నాసేనచేత నీభర్తయగు రాముడివ్విధముగా సైన్యముతోగూడ జంపబడియె. మఱియు నోసీతా! నెత్తురుచేతదడుపబడినదియును, దుమ్ముచేతవ్యాప్తమైనదియును, నగు నీభర్తయొక్క శిరస్సుతీసికొనిరాబడినదనియె. అట్లుచెప్పినపిమ్మట శత్రువులచేతజయింపనలవిగానివాడును, రాక్షసులకధిపతియును నగు రావణాసురుడు సీతాదేవి వినుచుండగా దనవద్దనున్న రాక్షసస్త్రీతోనిట్లనియె. ఓసీరాక్షసాంగనా! క్రూరములగు పనులనుజేయునట్టి విద్యుజ్జిహ్వుడనియెడు రాక్షసుని నీవక్కడకు దీసికొనిరమ్ము. వచ్చునప్పుడు యుద్ధమునందు ఛేదించితీసికొనిరాబడిన రామునిశిరస్సును దీసికొనివచ్చునట్లుచెప్పుమనియె. అంతటనారాక్షసస్త్రీ పోయి యావృత్తాంతమునువిద్యుజ్జిహ్వునితో జెప్పె. అంతటనావిద్యుజ్జిహ్వుడు రామునిశిరస్సును, రామునిధనుర్బాణములను దీసికొనివచ్చి రావణాసురునకు శిరస్సుతో నమస్కరించుచు రావణాసురునియొక్క యెదుటనుండె. అంతట రాక్షసరాజగు రావణాసురుడు తనయెదుటనున్నవాడును, గొప్పదగు జిహ్వగలవాడును, సమీపముననున్నవాడును, నగువిద్యుజ్జిహ్వునితో నిట్లనియె. ఓరీ! విద్యుజ్జిహ్వుడా! దశరథమహారాజునకు బుత్రుడగు రామునియొక్క శిరస్సును సీతకుజూపుము. ఈ దీనురాలు భర్తయొక్కచరమావస్థను చూచుగాక. కావున నాలస్యమునుజేయకచూపుమనియె. ఇవ్విధముగా రావణాసురుడు చెప్పినమాటలనువిని సీతాదేవిచేత బ్రియముగాజూడదగిన యారామునిశిరస్సును సీతయొక్క యెదుట బెట్టియంతర్హితుడయ్యె. అంతట రావణాసురుడు ముల్లోకములయందును ప్రసిద్ధమైనదియును, ప్రకాశించుచున్నదియును, నగురాముని ధనుస్సునుగాలితో, జిమ్ముచు సీతాదేవితోనిట్లనియె. ఓసీతా! నారితోగూడుకొనినయీధనుస్సు రామునిది. ప్రహస్తుడు రాత్రియందు నిద్రనుబొందుచున్న రామునిజంపిప్రహస్తుడుయీధనుస్సును రామునిశిరస్సునుదీసికొనివచ్చె. మఱియు నాప్రహస్తుడు దెచ్చిన రామునిశిరస్సును ధనుస్సును విద్యుజ్జిహ్వునిచేత నీవుచూచుటకు దెప్పించితిని చూడుమనిచెప్పి కాలితోదన్ని చూపుచుండె. మఱియు నధికమగు కీర్తిగలదియును, జనకచక్రవర్తికి బుత్రికయును నగు నాసీతాదేవిని దనకుభార్యగానుండుమనియె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి ముప్పదొక్కటవసర్గ ముగిసెను.

—{ రాముడు నిజముగచనిపోయెనని సీతాదేవిదుఃఖించుట. }—

అంతట నాసీతాదేవి యారామునిశిరస్సును, శ్రేష్ఠమగు ధనుస్సును, హనుమంతునిచేత జెప్పబడిన స్నేహవిషయమును, రామునినేత్రములను, ముఖవర్ణమును, వెంట్రుకలను, వెంట్రుకల చివరలను, మంగళకరమగు చూడామణిని, చూచి సర్వవిధములగు నానవాళ్ళచేతను రామునిశిరస్సునుగా దెలిసికొనిమిగులదుఃఖమునుబొందె. మఱియునాసీతాదేవియాడు జింకవలె వ్యసనమునుబొందుచు కైకేయినిబహువిధములనిందించె. మఱియునిట్లనియె. ఓకైకేయీ! నీకోరిక సఫలమయ్యెగదా? కులదీపకుడగు రాముడుచంపబడెను. కలహస్వభావురాలవగు నీచేత కులమంతయును నశింపజేయబడెను. ఓకైకేయీ! పూజ్యుడగు రామునిచేత నీకేమియపకారముజేయబడెను. నీవేమినిమిత్తముగ నాకు నారచీరలనుగట్టించి యరణ్యమునకుబంపితివని కైకేయిని ఉద్దేశించి కొంతసేపు రోదనమును జేసె. పిమ్మట దపోవంతురాలగు నాసీతాదేవి గడగడవణకుచు "ఛిన్నమైనయరటిచెట్టువలె" గ్రిందబడియె. అట్లుక్రిందబడి క్షణమాత్రమునకు దెలివొంది యారామునిశిరస్సును ముద్దుపెట్టుకొని యధికముగా రోదనమును జేయుచు నిట్లనియెన్. అయ్యో రాముడా! నాప్రాణనాథా! నేనుజంపబడినదాననైతినిగదా? గొప్పవగుభుజములుగలవాడవును, వీరవ్రతములుగలవాడవును, నాతోగూడవ్రతములనాచరించువాడవును, నైనయోరాముడా! నీయొక్క చరమావస్థనుజూచితిని అయ్యో! నేనువిధవనైతినిగదా? భార్యకంటె భర్తయగువాడు ముందుగమరణమునుబొందుట యుత్తమముగాదుగదా? సచ్చరిత్రములుగల నాయందేమి యపకారము గలుగుటవలననీవు ముందుగా మరణమునుబొందితివి? నేనేమియును అపకారమును జేయలేదుగదా? నీవెందుకు మరణమునుబొందితివి? దుఃఖములమీదదుఃఖములను బొందుచున్నదానను, దుఃఖసముద్రమునందుమునిగియున్నదానను, అయిననన్నురక్షించుటకొఱకు వచ్చిననీవు మరణమును బొందితివిగదా? అయ్యోదైవమా! నేనేమిచేయుదును, రఘుకులోద్భవుడవైనయోరాముడా! పుత్రుడవగునీచేత మాయత్తగారైన కౌసల్యాదేవి గూడలేనియావువలె నధికమైన దుఃఖముగలదయ్యె. అపరిమితమగు పరాక్రమముగల యోరాముడా! నీకుదీర్ఘాయుష్యముగలుగునని యనేకులగు జ్యోతిష్కులు నీజననకాలమునందు జెప్పిరి. రఘుకులోద్భవుడవైన యోరాముడా! అట్టిజ్యోతిష్కులమాట లబద్ధములగునట్లుగా నీవల్పాయువునుబొందితివే? అయ్యో నేనేమిచేయుదును. జ్యోతిష్కుల వచనములను నిందింపనేల? సర్వవిషయములను దెలిసిననీ ప్రజ్ఞయంతయును నశించిపోయినదని యెన్నుచున్నాను. సకలభూతములకును గారణమైన కాలమివ్విధమగు బుద్ధిని నీకుబుట్టించెనని తలచుచున్నాను. మఱియునోరాముడా! నీతిశాస్త్రవేత్తవగు నీవు మరణకాలమును దెలిసికొనలేకపోవుటకు గారణమేమి? మఱియునోరాముడా! మిగులనేర్పరివగునీవు వ్యసనములను బోగొట్టుకొనుటయందు మిగులసమర్థుడవుగదా? అట్టినీవు నీదుఃఖమునుబోగొట్టుకొనలేకపోవుటకుగారణమేమి? పద్మపత్రములవంటి నేత్రములుగలయో రాముడా! నీవునానిమిత్తముగ బయలుదెడలివచ్చి మిక్కిలి ఘాతకురాలును, కాళరాత్రిస్వరూపురాలును, నగుమృత్యువును గౌగిలించుకొని మరణమునుబొందితివా? అయ్యో నేనికనెట్లుజీవింపగలను. పురుషోత్తముడవును, గొప్పవగు భుజములుగలవాడవునునైన యోరాముడా! దీనురాలనగునన్ను విడిచిపెట్టి ప్రియమగుభూమిని నాలింగనమును జేసికొని శయనించుచున్నావా? వీరుడవైనయోరాముడా! బంగారముచేత నలంకరింపబడినదియును, సర్వకాలములయందును నీచేతధరింపబడినదియును, నగునీధనుస్సును, సర్వకాలములయందును మిగులప్రియముతో గంధమాల్యములచేతబూజించుచుందును. రఘుకులోద్భవుడవైన యోరాముడా! నీకుదండ్రియును, నాకుమామగారును, నగుదశరథమహారాజుతోడను, మఱియునితరులగు పితృదేవతలతోడను సమముగ స్వర్గలోకమునందు నివసించితివా? గొప్పదగుపుణ్యముచేసినవారలచేత గోరదగినదియును, పావనమైనదియును, నగు మీరాజర్షి వంశమును నీవంతరిక్షమునందు నక్షత్రభూతుడవైచూచుచున్నావా? ఏమి రాజశ్రేష్ఠుడా! రామచంద్రా! నీవునన్నెందుకుజూడవు పసదానను, బాల్యముచేతబొందబడినదానను, నీకుధర్మకార్యములయందు సహాయముగ సంచరించుచున్నదానను, భార్యను, నగునాతోసంభాషింపకుండుటకు గారణమేమి? కకుత్స్థునికులమునందుబుట్టినయోరాముడా! నీవునాపాణిని గ్రహించుకాలమునందు నాతోసర్వకాలములయందును ధర్మయుతముగ సంచరించెదనని చెప్పితివిగదా? కావుననిప్పుడు నన్నువదలి దుఃఖమునుబొందుచున్ననన్నుగూడ స్వర్గలోకమునకు దీసికొనిపొమ్ము.

గతిమంతులలో నుత్తముడవైన యోరాముడా! నీవేమినిమిత్తముగ నన్నువిడిచిపెట్టిపోతివి? అధికమగుదుఃఖమును బొందుచున్న నన్నునీలోకమునందువిడిచి నీవువేరొకలోకమునకుబోవుటయుచితమా? రఘుకులోత్తముడవైన యోరాముడా! మంగళములతోగూడుకొన్నదియును, నాచేత

సంగనము చేసికొనబడుచున్నదియును, నగు నీశరీరము పక్షులచేత భక్షింపబడుచున్నదకాబోలు. నేనేమిచేయుదును. మఱియునో రాముడా! సంపూర్ణములగు దక్షిణలు గలవియును, రాజులచేత జేయదగినవియును నగు నగ్నిష్టోమాదియజ్ఞములచేత యజనముచేసిన నీశరీరమునకు అగ్నిసంస్కారమేమినిమిత్తముగ గలుగలేదు? పూజ్యుడవైన యో రాముడా! మనముముగ్గురము బయలువెడలి యరణ్యమునకువచ్చితిమి. ఇప్పుడులక్ష్మణుడొక్కడే యయోధ్యాపట్టణమునకుబోయెనేని కౌసల్యాదేవి యధికమగు దుఃఖముచేత పీడింపబడినదగుచు సీతారాములెక్కడనున్నారని లక్ష్మణునినడుగగలదు. అవ్విధముగా నడుగుచున్న కౌసల్యాదేవిలక్ష్మణునివలన నీస్నేహితుడగు సుగ్రీవునిసైన్యమంతయునునశించుటను, రాత్రియందు రాక్షసులచేత నీవు చంపబడుటనువిని యధికముగా దుఃఖమునుబొందగలదు. మఱియునో రాముడా! ఆకౌసల్యాదేవి నిద్రనుబొందుచున్ననీవు మరణమునుబొందితివనియును, నేను రాక్షసులవశమును బొంది దుఃఖించుచున్నాననియునువిననేని ఆకౌసల్యాదేవి యొక్కహృదయముబ్రద్దలగును. అట్లుహృదయము బ్రద్దలైనపిమ్మట నాకౌసల్యాదేవి మరణమునుబొందగలదు. అయ్యో! పాపాత్మురాలనగు నానిమిత్తముగ దశరథమహారాజునకుబుత్రుడవును, ఇట్టిదుర్మరణమునకు దగనివాడవును నగు నీవు సముద్రమునుదాటిగోష్పదమునందు మృతినొందితివి. అయ్యో! నేనేమిచేయుదును. కులనాశకురాలనగు నేనన్యాయముగ దశరథరాజనందనుడగు రామునిచేత వివాహమునుచేసికొనబడితిని. ఆర్యపుత్రుడగు రామునకు నన్నుమృత్యురూపమైన భార్యనుగా దైవము పుట్టించెనుగాబోలు. అయ్యో నేనెట్టిపాపమును జేసితినోగదా? నేను పూర్వజన్మమునందుత్తమదానమగు కన్యాదానమునకు విఘ్నమును జేసితిని. కావున నేసర్వలోకపూజ్యుడగు రామునకు భార్యనయ్యును నేనివ్విధముగ దుఃఖమునుబొందుచున్నాను. ఓ రావణాసురుడా! నన్నిప్పుడతిశీఘ్రముగ రామునిమీదబడవేయుము. భార్యనగునన్ను భర్తయగు రామునితోజేర్పుము. ఇట్టిమంగళకార్యమును జేసి పుణ్యాత్ముడవగుము. ఓ రావణాసురుడా! నాశిరస్సును రామునిశిరస్సుతో సమముగజేర్పుము. నాశరీరమును రామునిశరీరముతోజేర్పుము. ఇవ్విధముగజేసితివేని మహాత్ముడును, నాకుభర్తయును, నగు రామునితోగూడ బరలోకమునకుబోయెదననియె. ఇవ్విధముగా జెప్పి విశాలములగు నేత్రములుగల సీతాదేవిభర్తయగు రామునియొక్క శిరస్సును, ధనుస్సును, మాటిమాటికిజూచి యధికముగా దుఃఖమునుబొందె. ఇవ్విధముగ సీతాదేవి దుఃఖమునుబొందుచుండగా రావణునిసైన్యమునందున్నయొక్క రాక్షసుడు చేతులనుముకుళించుకొని రావణునొద్దకువచ్చె. వచ్చిజయజయశబ్దములనుచ్చరించి రావణాసురునకనుగ్రహమునుగలుగునట్టుల నమస్కారమును జేసియిట్లనియె.

రాక్షసరాజోత్తమా! రావణాసురుడా! నీసేనాపతియగు ప్రహస్తుడువచ్చి ద్వారదేశమునందు నిలిచియున్నాడు. మఱియునతడుమంత్రిపుంగవులనందఱ వెంటబెట్టుకొనివచ్చియున్నాడు. అతడు మిమ్ములజూడవలయుననియెడు కోరికచేతవచ్చియుండి ముందుగామమ్ములబంపె. రాక్షసమహారాజవైన యోరావణాసురుడా! మిగులశీఘ్రముగా జేయవలసినకార్యమొకటి గలిగియున్నదట. కావునరాజభావము నవలంబించి యోర్పుగలవాడవై వారలకుదర్శనమునిమ్మని యానేకవిధముల నారాక్షసుడుప్రార్థించె. ఇవ్విధముగా నారాక్షసుడుచెప్పినమాటనువిని రావణాసురుడు అశోకవనమునందలి మంత్రులనుజూచుటకుబోయె. అంతట నారావణాసురుడు మంత్రులయొక్కసభయందు ప్రవేశించి రామునియొక్కపరాక్రమమును దెలిసికొని మంత్రులతో దనకార్యమును సర్వమునునిశ్చయించె. అట్లురావణాసురుడుబయలువెడలిపోయినపిమ్మట రామునియొక్క శిరస్సును, రామునిధనుస్సును, మాయమైపోయె. పిమ్మట భయంకరములగు పరాక్రమముగల యామంత్రులతోగూడ రాక్షసాధిపతియగు రావణాసురుడప్పుడు రామకార్యములయొక్క నిశ్చయములను జక్కగాసమర్థించె. అట్లుసకలకార్యములను నిశ్చయించినపిమ్మట రాక్షసాధిపతియగు రావణాసురుడు తనసమీపమునందున్నవారును, సర్వకాలములయందును దనకుహితమునుగోరుచున్నవారును, నగు మంత్రులతో నాకులమునకుదగినమాటలను జెప్పదలచి యిట్లనియె.

మంత్రిపుంగవులారా! మీరందఱును భేరీనాదముచే తనాసైన్యమును సర్వమును మిగులశీఘ్రముగ రప్పింపుడనియె. అంతటనామంత్రులందఱును రావణాసురునిమాటనంగీకరించినవారై యారావణునిసైన్యమును సర్వమునురప్పించి సైన్యమంతయును వచ్చియున్నదని రావణాసురునకు దెలిపిరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి ముప్పదిమూడవసర్గ ముగిసెను.

— రాముడుబ్రతికియున్నాడని సరమయనురాక్షస్త్రీసీతాదేవికి ధైర్యముజెప్పట. —

అవ్విధముగామోహమునుజెంది వ్యసనమును జెందుచు

న్నదియును, విదేహరాజునకుబుత్రికయును, ప్రియురాలును, మిగులస్నేహితురాలును, నగు సీతాదేవినిజూచి సరమయను రాక్షసస్త్రీయాసీతయొద్దకువచ్చె. అట్లుసమీపమునకువచ్చి మృదువుగసంభాషించునట్టి సరమయనుపేరుగల యారాక్షసస్త్రీ రాక్షసేన్ద్రునిచేత మోహమునుబొందింపబడినదియును, మిగుల దుఃఖమును బొందుచున్నదియును, నగుసీతాదేవిని నాసమయమునందు ఊరడించెను. రావణాసురునిచేత సీతాసంరక్షణకొఱకు నియమింపఁబడినదియును, మిగులబశ్చాత్తాపముతోఁగూడుకొన్నదియును, దృఢవ్రతములుగలదియును, నగు నాసరమతనచేత గాపాడబడుచున్న సీతతోనాయశోకవనమునందు స్నేహమునుజేసె. అంతట "నష్టమైనతెలివిగలదియును, భూమియందుబొర్లిగింతలనుపెట్టి దుమ్ముచేతవ్యాప్తమైన శరీరముగలదియును, ధ్వస్తురాలును, నగు నశ్వస్త్రీవలెనున్న" సీతనునాసరమచూచె. పిమ్మటబరమమిత్రురాలగు నాసరమస్నేహవశముచేత నాసీతాదేవినూఱార్పదలచియిట్లనియె.

విదేహరాజపుత్రికవైనయోసీతా ! నీవోర్చుకొనుము. నీమనస్సునకు వ్యసనములేకపోవుగాక. భయంకరస్వభావురాలవగునోసీతా! రావణాసురునిచేత జెప్పబడినమాటలకు బదులుమాటల నుస్వయముగా జేసితివి. నీవుచెప్పిన మాటలు మిగులయుక్తియుక్తముగనున్నవి. ఆవచనములనన్నింటిని నేనువిని మిగులనానందమునుబొందితిని. రావణాసురుడేమిచేయునో యనుభయముచేతనే నీయశోకవనమధ్యయందురహస్యముగాదాగియుండివింటిని. ఓసీతా ! నిన్నుగాపాడుటకంటె నాకునాప్రాణములయందు ప్రియమధికముగాలేదు. మఱియునోసీతా ! రాక్షసాధిపతియగురావణాసురుడేమినిమిత్తముగ మిగులసంభ్రమముతోబయలువెడలిపోయెనో, యావిషయమును సర్వమును నేను రహస్యముగానుండి తెలిసికొనివచ్చితిని. సకలవిషయములనుదెలిసిన రామునకునిద్రాకాలమునందు మరణముగలుగునని నీవునిశ్చయింపకుము. పురుషోత్తముడైన రామునకుఅట్టిమరణముగలుగునని నీవెన్నకుము. వృక్షములతో యుద్ధమునుజేయునట్టివానరులితరులచేత సులభముగాజంపదగినవారుగారు. దేవతలందఱును దేవేన్ద్రునిచేతగాపాడబడుచున్నవిధముగరామునిచేతవానరులందఱును గాపాడబడుచున్నారు. దీర్ఘములైనవియును, వర్తులాకారములుగలవియును, నగు భుజములుగలవాడును, శ్రీమంతుడును, మిగులవిశాలమగుఱొమ్ముగలవాడును, అధికమగుప్రతాపముగలవాడును, శ్రేష్ఠమగుధనుస్సును ధరించినవాడును, మరణకర్మనుజేయువాడును, భూలోకమునందుధర్మాత్ముడుప్రసిద్ధినొందినవాడును, విక్రమముగలవాడును, తనను, ఇతరులను, గాపాడదగినవాడును, తమ్ముడగులక్ష్మణునితోఁగూడుకొనినవాడును, నీతిశాస్త్రముజక్కగజదివినవాడును, శత్రుసైన్యమును నాశనముజేయువాడును, అపరిమితములగు బలపౌరుషములుగలవాడును, శత్రువులనునశింపజేయువాడును, శ్రీమంతుడును, రఘుకులమునందుబుట్టినవాడును, నగు రాముడు మరణమునుబొందలేడు. కావుననీవువ్యసనమునుబొందకుము.

మనస్సునందు సర్వకాలములయందును, అనుచితకృత్యములనునాలోచించువాడును, సకలభూతములకువిరోధియైనవాడును, భయంకరములగు కార్యములనుజేయువాడును, సకలమాయలనుదెలిసినవాడును, నగు రావణాసురుడుతనమాయచేత రామునిశిరస్సునుజేసి నీకుజూపించెను. ఇదినిజమగుశిరస్సుగాదు. కావుననీవుచింతింపకుము. నీదుఃఖకాలమంతయును పోయినది. నీకుసుఖకాలము వచ్చినది. లక్ష్మీదేవి దృఢముగానిన్నుబొంద చున్నది. నేనునీకుప్రియములగుమాటలనుజెప్పుచున్నాను. నావచనములు ప్రియములేగాకహితకరములనియును దెలిసికొనుము. ఇకనీవు నాకుప్రియమునుజేయుము. వ్యసనమునుబొందకుము. రాముడువానరసైన్యముతోగూడ సముద్రమునుదాటి దక్షిణతీరమునందు ప్రవేశించియున్నాడు. కకుత్స్థునివంశమునందుబుట్టినవాడును, లక్ష్మణునితోఁగూడుకొనినవాడును, నగు రాముడు పరిపూర్ణమైనయర్థముగలవాడై నాకుగనబడెను. మఱియునారాముడు సముద్రముయొక్క దక్షిణతీరమునందున్నసైన్యముచేత గాపాడబడుచున్నాడు ఈరావణాసురుడు స్వల్పబలముగలవాడగుటచే రాక్షసులనుబంపిరామునిబలమునుదెలిసికొని వచ్చుటకొఱకుబంపె. అంతటరఘుకులమునందు బుట్టినరాముడు సముద్రమునుదాటివచ్చెనని రావణాసురుడు తనచారులవలనదెలిసికొని మంత్రులతోగూడదగినవిధముగ నాలోచించుచున్నాడని చెప్పె. ఇవ్విధముగాసరమయనియెడురాక్షసస్త్రీ సీతాదేవితో సంభాషించుచుండగా సర్వప్రయత్నములను జేయుచున్నసైన్యముయొక్క భయంకరమగు శబ్దమువినబడియె. మఱియును దండముయొక్క దెబ్బచేత మ్రోగుచున్నరణభేరియొక్క భయంకరమగుధ్వనినివిని మధురముగ సంభాషించునట్టిసరమసీతాదేవితోనిట్లనియె.

తల్లీ! సీతాదేవీ! మిగులభయంకరమైనదియగు నీభేరియొక్క గొప్పదగు ధ్వనినివినుము. ఈమహాధ్వని "మేఘధ్వనివలె" ప్రకాశించుచున్నది. మదపుటేనుగులన్నియునయుద్ధసన్నద్ధములగుచున్నవి. రథములనువహించునట్టిగుఱ్ఱము

లుగూడయుద్ధమున కభిముఖములైయున్నవి. ప్రాసములనియెడునాయుధములను ధరించిన భటులనేకులు గుఱ్ఱముపైకిఁ మిగులసంతోషముగలవారైయున్నారు. మఱియునక్కడక్కడ, పదాతులందఱును గుంపులు గుంపులుగా గూడి యాలోచనలు సేయుచున్నారు. అత్యద్భుతమైన దర్శనముగల సేనలు రాజమార్గమును సర్వమును నాక్రమించుచున్నది. మఱియును రావణుని సేనలు, ధ్వనిచేయుచున్న మేఘములుసముద్రమునందు వ్యాపించుచున్న విధముగ లంకాపురమునందంతటను వ్యాపించుచున్నవి. మఱియునో సీతా! నిర్మలములగు శస్త్రములయొక్కయు, చర్మములయొక్కయు, కవచములయొక్కయు, రథములయొక్కయు, గుఱ్ఱములయొక్కయు, ఏనుగులయొక్కయు, రాక్షసులయొక్కయు, కాంతిపుంజము వేసవికాలమునందు వనమునుదహింపజేయుచున్న యగ్నిహోత్రునియొక్క నానావిధవర్ణములుగల జ్వాలాసముదాయమువలె ప్రకాశించుచున్నది. చూడుము. మఱియునో సీతా! ఘంటానాదమునువినుము. రథములయొక్కధ్వనినివినుము హేషాధ్వనులనుజేయుచున్న గుఱ్ఱములయొక్కధ్వనిని మఱియు నితరములగు మంగళవాద్యములయొక్క ధ్వనులనువినుము. మఱియునో సీతా! మిగులదీర్ఘములగు హస్తములనుధరించినవారును, రాక్షసేశ్వరుడగు రావణాసురునకు భటులును, నగు రాక్షసులయొక్క సంభ్రమముచూచువారలకు రోమాంచమును గలుగజేయుచున్నది. మఱియునో సీతా! పద్మపత్రములవంటి నేత్రములుగల రాముడు దేవేంద్రుడు రాక్షసులను వధించినవిధముగ రావణాసురుని పుత్రమిత్రకళత్రాదులతో గూడ వధించి నిన్నుబొందగలడు. మఱియునో సీతా! అపరిమితమగు పరాక్రమముగలవాడును, కోపరహితుడును, నగు రాముడుయుద్ధమునందు రావణాసురుని సంహరించి నిన్నుబొందగలడు. మఱియునో సీతా! తమ్ముడగు లక్ష్మణునితో గూడుకొనినవాడును, నీకు బెనిమిటియును, నగు రాముడు, "శత్రువులను నశింపజేయునట్టి దేవేంద్రుడు విష్ణుదేవునితో గూడ శత్రువులయందు బరాక్రమించినవిధముగ" రాక్షసులయందు బరాక్రమమునుజూపగలడు. ఓసీతా! శత్రువులనుజంపి యిక్కడకువచ్చిన రామునియొక్క తొడయందు మహాసంతోషముతో గూర్చున్నదానవును, కృతార్థురాలవును, పతివ్రతవును, నగు నిన్నుజూచి నేను సంతోషమును బొందగలను. మంగళకరురాలవైన యోసీతా! నీవుమిగుల శీఘ్రముగా ఆనందబాష్పములను విడువగలవు మఱియునో సీతా! విశాలమగుఱొమ్ముగల యారామునియొక్క వక్షస్థలమును కౌగలించుకొని సంతోషమును బొందగలవు. మఱియునో సీతా! చిరకాలమునుండి నీపిరుదులయందుబడియున్నదియును, అనేకమాసములనుండి విప్పబడకయున్నదియును, నగు నీజడను మహాబలుడగురాముడు గొద్దిచినములలో విడదీసి నీకుసంతోషమును గల్పింపగలడు. మఱియునో సీతా! ఉదయించుచున్న పూర్ణచంద్రునితో సమానముగనున్న రాముని మోమును జూచి "కుబుసమును వదలిన పామువలె" సంతోషించుచు దుఃఖమునువిడిచి యానందమునుబొందగలవు. మిథిలాపట్టణమునకధిపతియగు జనకచక్రవర్తికి గూతురవైనయోసీతా! సుఖమునుబొందుటకుదగిన రాముడు మిగులశీఘ్రముగా రావణాసురుని యుద్ధమునందుజంపి ప్రియురాలవగు నీతో జేరికొని సంపూర్ణముగ సుఖమునుబొందగలడు. మఱియునో సీతా! మహానుభావుడును, అధికమగు వీర్యముగలవాడును, నగు రామునితో గలిసికొని నీవుపరమానందమును బొందగలవు. మఱియును రామునితో గలిసికొనిననీవువర్షముచేత సస్యమేవిధముగా వికసించునో ఆవిధముగా వికసింపగలవు మఱియునో సీతా! మేరుపర్వతమునకు ప్రదక్షిణమును జేయుచున్నవాడును, ఉత్తమాశ్వములవలెమండలగతినిసలుపుచున్నవాడును, దేవుడును, నగు సూర్యునిశరణుబొందుము. ఈసూర్యుడు ప్రజలకందఱకును ప్రభువు. కావున సూర్యదేవుని నారాధింపుము.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి ముప్పదిమూడవ సర్గ ముగిసెను.

--(*)-

సరమ సీతాదేవిని యూరడించుట.

అవ్విధముగ రావణాసురుడు చెప్పినమాటలచేత మోహమునుబొందియున్నదియును, అధికమగు సంతాపముగలిగియున్నదియును, నగు సీతాదేవికి సరమయనునది మృదుమధురవచనములచేత, ఆకాశము వర్షోదకముచేత భూమిదేవికి సంతోషమునుగలిగించువిధముగ" సంతోషమునుగలిగించెను. అంతటనూరకుండక సీతాదేవికి హితకర్త్రియగు సరమ స్నేహితురాలికి జేయదగినకార్యమును జేయవలయుననికోరికగలదియును, ముందుగానవ్వుచున్నదియును, కాలమునుగుర్తెరిగినదియును, నగుచు నిట్లనియె. నల్లని నేత్రములుగలయోసీతా! నేను రామునిదగ్గరకుబోయి మారువేషముగలదాననై నీకుశలవార్తనుదెలిపి యామహానుభావుని కుశలవార్తనుదెలిసికొనిరావలయుననితలచుచున్నాను. నిరాధారమగునాకాశమార్గమునందు బోవుచున్ననాతో గూడ సమముగ వాయుదేవగరుత్మంతులుగూడ రాజాలరు. నేను

ఆకాశమునందెవ్వరికిని గనబడకుండ బోగలను. కావునరామునియొద్దకుబోయివచ్చెదననియె. ఇవ్విధముగా బలుకుచున్నసరమతో సీతాదేవి మృదువయినదియును, మధురమైనదియును, దుఃఖమును సూచించుచున్నదియును, నగుమాటనుజెప్పదలచి యిట్లనియె. తల్లీసఖురాలా! సరమా! నీవు ఆకాశమునకేకాదు, రసాతలలోకమునకు బోవుటకుగూడ సమర్థురాలవనుటకు సందియములేదు. నావిషయమగు కార్యములలో నీకుశక్యముగానికార్యమేదియునులేదు. అమ్మా! సరమా! నీకునాకు బ్రియముజేయవలెనని స్థిరముగాబుద్ధియందూహగలదేని యిప్పుడు రావణాసురు డేమిచేయుచున్నాడో తెలిసికొనిరావలయునని ప్రార్థించుచున్నాను. మాయాబలుడును, శత్రువులను ఏడిపించువాడును, నగు రావణాసురుడు మిగుల గ్రూరుడు. అట్టిదుష్టాత్ముడగురావణాసురుడు "పానముచేసినవానిని వెంటనేమద్యముమోహమును గల్పించువిధముగ" నన్ను మోహపెట్టుచుండును. దురాత్ముడగు నారావణాసురుడు నన్ను బెదరించుచుచుండును మఱియు భయపెట్టుచుండును. మిగుల భయంకరులగు రాక్షసస్త్రీలచేత సర్వకాలములయందును నన్ను గాపాడుచుండును. అందువలన నేనుమిగుల భయముగలదానను సందేహముగలదానను నైతిని. కావున నామనస్సెప్పుడును స్వస్థతలేనిదైయుండును. ఈయశోకవనమునందున్నటువంటినేను ఆరావణాసురునియొక్క భయమువలన, నుద్విగ్నురాలునైయుంటిని. మఱియు నోసరమా! నీకునాయందు సర్వోత్తమమగునధికారముగలదేని యారావణాసురునియొక్క కథయును, ఆరావణాసురునియొక్క నిశ్చయమునుదెలిసికొనిరావలయుననియె. ఇవ్విధముగా సీతాదేవిచెప్పినమాటనువిని మృదువుగా సంభాషించుచున్న యాసరమ సీతాదేవియొక్క కన్నీటిని దుడుచుచునిట్లనియె. తల్లీ! జానకీ! సీతాదేవీ! నీకిట్టియభిప్రాయముగలదేని నేనురావణాసురునివృత్తాంతమును దెలిసికొనివచ్చుటకు బోయెదను. పోయిశత్రువుడగు రావణాసురునివృత్తాంతమును దెలిసికొనివచ్చెదను. మరలవచ్చినపిమ్మట నన్నుబాడ మనియె. ఇవ్విధముగా నాసరమ సీతాదేవితో జెప్పి రావణాసురునియొక్క సమీపమునకుబోయి యారావణాసురునియొక్కయు, అతనిమంత్రులయొక్కయు, ఆలోచనను సర్వమును దెలిసికొనియె, అట్లుదురాత్ముడగు నారావణాసురునియొక్కనిశ్చయమును సర్వమును దెలిసికొని మరల అశోకవనమునకు వచ్చె వచ్చియావనమునందు బ్రవేశించి పిమ్మట సీతాదేవినిబూచె. ఆసమయమునందు నష్టమైనకాంతిగల పద్మమువలెనున్న యాసీతాదేవి తనయాగమనమును గోరుచుండె. అంతటనాసీతాదేవి తనసమీపమునకు వచ్చినదియును, మనోహరముగ మాటలాడునదియును, నగు నాసరమనుమెల్లగా గౌగిలించుకొని తనసమీపమున గూర్చుండబెట్టుకొని యిట్లనియె. అమ్మా! సరమా! నీవిక్కడగూర్చుండి అక్కడజరిగినవృత్తాంతమును సర్వమును వాస్తవముగ జెప్పుము. దురాత్ముడును, క్రూరుడును, నగునారావణాసురునియొక్క నిశ్చయమును దెలిసికొనవలయునని కోరికగలిగియున్నది. కావున రావణాసురుని వృత్తాంతమును జెప్పుమని గడగడ వణకుచు నడుగుచున్న సీతాదేవినిజూచి సరమ, దురాత్మునును, క్రూరుడును, నగు రావణాసురునియొక్క నిశ్చయమును సర్వమును జెప్పదలచి యిట్లనియె. తల్లీ! పూజ్యురాలా! సీతాదేవీ! నిన్నువిడిచిపెట్టుమని రావణాసురునితల్లియగు కైకేసిపుత్రుడగు రావణాసురునితో జెప్పె. అవిధముగానేమంత్రులలో వృద్ధుడగు అవిద్ధుడు గూడబహువిధములసీతను విడువుమని చెప్పె. మఱియు నోరావణాసురుడా! మానవోత్తముడగురాముని బూజించి సీతాదేవినినివ్వుము, జనస్థానమునందు రాముడుచేసిన యద్భుతకార్యములను జూచితివిగదా? అవియన్నియునునీకునిదర్శనములైయున్నవిగదా? రాముడు సముద్రమును దాటివచ్చుటను జూచితిగదా? హనుమంతునిమాహాత్మ్యముతెలుగుదువుగదా? ఈలోకమునందు సామాన్యుడగు మానవుడు యుద్ధములయందు రాక్షసులను సంహరింపగలడా? సంహరింపజాలడు. అనునీతలంపును వదలిపెట్టినీవు సీతాదేవినిరామునకు సమర్పింపుమని జెప్పె. ఇవ్విధముగామంత్రివృద్ధులతోగూడ అవిద్ధుడనియెడుమంత్రిచెప్పె ఆప్రకారమెన్నివిధములుగానెందఱుచెప్పినను, ఆరావణాసురుడు, "ధనాశగలవాడు ధనమును విడువనివిధముగా" నిన్నువిడువననియె. కావున నోతల్లీ! సీతా! ఆరావణాసురుడు యుద్ధమునందు మరణమునుబొందకనిన్నువిడుచువాడుగాడు. మంత్రులతోగూడుకొనిన యాఘాతకుడు బ్రతికియుండగా నిన్నువదలనని నిశ్చయించుకొని యున్నాడు. మఱియు నారావణాసురుడు మృత్యువునొందుటకు సిద్ధముగనున్నవాడగుటచేత నిట్టితలంపుగలవాడై యున్నాడు. ఆరావణాసురునకు గొంచెమైనను భయములేదు. కావున యుద్ధమునందు జంపబడక యిచ్చువాడుగాడు. నల్లనినేత్రములుగలదానా సీతా! రావణాసురుడు తనయొక్కయు, తనవారియొక్కయు, మరణానంతరమందుగాని యేకార్యమునుజేయడు. కావునరాముడుమిగుల గ్రూరములగు బాణములచేత యుద్ధమునందు రావణాసురుని జంపినిన్ను అయోధ్యాపట్టణమునకు దీసికొనిపోగలడని యాసరమ చెప్పుచుండె. ఇట్లుసరమచెప్పుచుం

డుగా, రణభేరులయొక్కయు, శంఖములయొక్కయు ధ్వని వానరసైన్యమునందుండి వినఁబడియె. ఆమహాధ్వనివలన భూమియంతయును గంపముగలదై గడగడవణఁకె. అట్లు వానరసైన్యమునుండి వచ్చుచున్నగొప్పదగుధ్వనిని లంకాపట్టణమునందున్న రాక్షసులందఱు నువిని తేజోరహితులైరి మఱియు నారాక్షసులందఱునుదమకురాజగు రావణాసురునియొక్కదోషముచేత విపరీతములగు చేష్టలుగలవారును, దీనులును నైరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి ముప్పదియాఱవసర్గ ముగిసెను.

మాల్యవంతుఁడను రాక్షసుఁడు రావణాసురునితో ధర్మశాస్త్రము బుగను బడుచున్నదని చెప్పుట.

అట్లుశంఖధ్వనితోఁగూడిన రణభేరులయొక్క ధ్వనులతోఁగూడ రఘుకులమునందుఁ బుట్టినవాఁడును, శత్రుపురములను జయించువాఁడును, గొప్పవగుబాహువులు గలవాఁడునునగు రాముఁడువచ్చుచున్నాఁడని రాక్షసులందఱును దలఁచిరి. అంతటరాక్షసాధిపతియగు రావణాసురుఁడుఆమహాధ్వనిని విని క్షణమాత్రము ధ్యానముచేసి తనసమీపమునందున్న మంత్రులనుజూచెను. అంతటమహాబలుఁడగు నారావణాసురుఁడు సభయందంతటను ధ్వనిగలుగునట్లుగా, మంత్రులనందఱనుజూచి యిట్లనియె.

మఱియును లోకములకు సంతాపమును గలుగఁజేయువాఁడును, క్రూరుఁడును, రాక్షసాధిపతియును, నగు రావణాసురుఁడు అసహ్యపడుచు నిట్లనియె. మంత్రిశ్రేష్ఠులారా! రాముఁడు సముద్రమునుదాటి వచ్చెననియును, అధికమగు బలసముదాయముగలవాఁడనియును, మీరందఱును జెప్పఁగా నేనువింటిని. మఱియునోమంత్రిపుంగవులారా! మీరందఱును యుద్ధమునందుసత్యమగు పరాక్రమముగలవారని నేనెఱుఁగుదును. యుద్ధమునందు మిగులసామర్థ్యముగల మీరందఱును రాముని పరాక్రమమును దెలిసికొని యుద్ధమునుజేయుటయందుఁ గుతూహలములేనివారలై యున్నారు. ఇట్లుండుటకుఁగారణమును జెప్పుఁడనియె. ఇవ్విధముగా రాక్షసాధిపతియగు రావణాసురుఁడు చెప్పినమాటనువిని రావణాసురునితల్లికి దండ్రియును, మిగులబుద్ధిమంతుఁడును, నగుమాల్యవంతుఁడిట్లనియె.

రాక్షసోత్తమా! రావణాసురుఁడా! "శ్లో॥ విద్యాస్వభివినీతో యో రాజా రాజన్నయానుగః। సశాస్తి చిరమైశ్వర్యమరీంశ్చ కురుతే వశే" విద్యలయందుమిగులనేర్పుగలవాఁడును, నీతిశాస్త్రానుసారముగ సంచరించువాఁడును, నగు రాజుచిరకాలము రాజ్యమనుభవించుటయేగాక శత్రువులనుస్వాధీనులనుగాఁ జేసికొనును మఱియు నోరాక్షసరాజోత్తమా! రావణాసురుఁడా! "శ్లో॥ సందధానో హి కాలేన విగృహ్ణంశ్చారిభిస్సహ। స్వపక్షవర్ధనం కుర్వన్మహదైశ్వర్యమశ్నుతే" బలహీనతగలిగియున్నప్పుడు శత్రువులతో సంధిని జేయువాఁడును, బలముగలిగినప్పుడు శత్రువులనునిగ్రహించువాఁడును, నగు రాజుతనపక్షము వానివృద్ధినొందించుకొనుచుఁ జిరకాలమైశ్వర్యము ననుభవింపఁగలఁడు. కావుననో రాక్షసరాజా! రావణాసురుఁడా! "శ్లో॥ హీయమానేన కర్తవ్యో రాజ్ఞా సంధిస్సమేన చ। నశత్రుమవమన్యేత జ్యాయాన్కుర్వీత విగ్రహమ్ ॥" హీనస్థితినిబొందుచున్నవాఁడును, సమబలుఁడునునగువాఁడు శత్రువునితోఁగూడసంధిని జేయవలయును. తానధికుఁడైయున్న సమయమునందు శత్రువును అవమానింపవలయును. అంతయగాకవానితో యుద్ధమునుజేసి యోచింపవలయును. కావుననోరావణాసురుఁడా! రామునితోఁగూడ సంధిని జేయుట యుచితమనియిప్పుడు నామనస్సునకుఁదోచుచున్నది. మఱియు నోరావణాసురుఁడా! మహాబలుఁడగు రాముఁడుహీనబలులమగు మనతో యుద్ధమును జేయునో చేయఁడో యని సంశయింపకుము. రామునితో మనకుసీతానిమిత్తముగ విరోధముగలిగియున్నది. అట్టివిరోధమిప్పుడు సీతనుసమర్పించుటచేతఁ బోవును. కాఁబట్టినీవుసీతాదేవినిదీసికొనిపోయి రామునకు సమర్పింపుము. ఆరామునకు జయముగలుగవలయునని సకలదేవతలును, ఋషులును, గంధర్వులును, గోరుచున్నారు. కావుననీవు రామునితో విరోధమును బెట్టుకొనకుము. రామునితోఁగూడ సంధిని జేయుటకుయత్నింపుము. పూర్వము వద్దునైశ్వర్యసంపన్నుఁడగు బ్రహ్మదేవుఁడు దేవతలకును రాక్షసులకును ధర్మాధర్మములనెడు రెండు పక్షములను గలుగఁజేసె. మహానుభావులగు దేవతలకు ధర్మమనియెడు పక్షము స్థిరముగానుండునట్లు నిర్మించెను. రాక్షసుల కధర్మమనియెడుపక్షము స్థిరముగానుండునట్లు నియమించెను. కావుననోరావణాసురుఁడా! "శ్లో॥ ధర్మో వై గ్రసతే [illegible] తః కృతం భూద్యుగం। అధర్మో గ్రసతే ధర్మం తతస్తిష్యః ప్రవర్తతే" ధర్మమధర్మమును మ్రింగివేసెనేని యట్టికాలము కృతయుగమగును అధర్మముధర్మమునుదినినయెడల నట్టికాలమేకలియుగమనఁబడును. ఇప్పుడుఅధర్మముధర్మముచేత నిగ్రహింపఁబడియున్నది. కాఁబట్టిమనకుశత్రువులగు రాముదులిప్పుడుమనకంటె బలవంతులైయున్నారు. నీవుయోచనలేకప్రవర్తించుటవలన అధర్మమిప్పుడువృద్ధినొందినదై మనలనునశింపఁజేయుచున్నది. దేవతలకనుకూలవగు ధర్మమి

ప్పుడు మిగుల మనోహరముగా వృద్ధినొందుచున్నది. మఱియు నో రావణాసురుఁడా! నీవు విషయములయందుఁ గోరికగలవాఁడవై కొన్ని కారణములచేత, అగ్నితో సమానులగు మునివరులకు మిగుల గొప్పదగు నుద్వేగమును గలిగించితివి. మహానుభావులైన యా ఋషుల కోపము మండుచున్న యగ్నితో సమానమైనది. రావణాసురుఁడా! తపస్సుచేతఁ బ్రకాశించుచున్న యాత్మతత్త్వము గలవారును, ధర్మము యొక్క యనుగ్రహమును బొందు శక్తిగలవారును, నగు బ్రాహ్మణులు ముఖ్యములగు యజ్ఞములు జేయుచున్నారు. మఱియును శాస్త్రోక్తప్రకారముగ నగ్నిహోత్రములయందు హోమములను జేయుచున్నారు. మఱియు నా బ్రాహ్మణులు రాక్షసులను లక్ష్యముసేయక బ్రహ్మఘోషములను చ్చరించుచు వేదములను మిగుల నధికముగాఁ బఠించుచున్నారు. అగ్నితో సమానులగు పరమర్షుల యొక్క యగ్నిహోత్రముల వలనఁ బుట్టిన ధూమము పదిదిక్కులయందును వ్యాపించినదై రాక్షసుల తేజస్సును సర్వమును నీడ్చివేయుచున్నది. అందువలన రాక్షసులు భయముగలవారై పదిదిక్కులను బరుగెత్తుచున్నారు. మఱియు బ్రాహ్మణులందఱును నన్యదేశములయందు దృఢవ్రతములు గలవారై పుణ్యకర్మలను జేయుచున్నారు. అట్టి మునివరులచేతఁ జేయఁబడుచున్న తపస్సు రాక్షసుల సంపదను మిగుల దీవ్రముగాఁ దపింపఁజేయుచున్నది. అది యంతయు నటుండనిమ్ము. మఱియు నో రావణాసురుఁడా! నీవు పూర్వము ఘోరమగు తపస్సును జేసి దేవతలవలనను, దానవులవలనను, యక్షులవలనను, మరణము గలుగకుండునట్లు వరమును గోరితివి గాని యితరులవలన మరణము గలుగకుండునట్లు వరమును గోరినవాఁడవు కావు. కావున నో రావణాసురుఁడా! వృథమైన పరాక్రమము గలవారును, అధికమైన బలము గలవారును, నగు మానవులును, వానరులును, భల్లూకములును, కొండముచ్చులును, మన లంకాపట్టణమునకు వచ్చి మిగుల భయంకరముగ గర్జించుచున్నారు. మఱియు నో రావణాసురుఁడా! నానావిధములైనవియును, భయంకరములైనవియును, నగు దుశ్శకునములు గనఁబడుచున్నవి. ఇవియన్నియును జూడఁగా మన రాక్షసకులమంతయును నశించునని నేను దలఁచుచున్నాను. మేఘములు మిగుల భయంకరములగు నాకారము గలిగినవై మిగులఁ గఠినముగా గర్జించుచున్నవి. మఱియు నా మేఘములన్నియును మిగుల వేఁడిగల నెత్తురును వర్షించుచున్నవి. గుఱ్ఱములు అపరిమితముగ రోదనమును జేయుచు గన్నీళ్లను విడుచుచున్నవి. ధ్వజములన్నియును ధ్వస్తములైనవి. లంకాపట్టణమంతయును నిప్పుడు గాంతివిహీనమైయున్నవి. గర్దభములును, నక్కలును, గ్రద్దలును, మిగుల భయంకరముగా ధ్వనిఁ జేయుచున్నవి. నక్కలన్నియును లంకాపట్టణములోనికి వచ్చి గుంపులు గుంపులుగాఁ జేరి కూయుచున్నవి. కాళికాశక్తులు పకపక నవ్వుచు స్వప్నములయందు స్త్రీలతో జగడము వేసి గృహములలోని పదార్థములను దొంగిలించుచున్నవి. మఱియు నా కాళికాశక్తులు స్త్రీలను వీధులలోనికి యీడ్చుచున్నవి. గృహములయందలి బలికర్మలను కుక్కలు దినుచున్నవి. గాడిదెలు గోవులతో రమించి సంతానమును గలిగించుచున్నవి. ఎలుకలు ముంగిసలతో రమించుచున్నవి. పిల్లులు పెద్దపులులతోఁ గూడ విహరించుచున్నవి. గాడిదెలు కుక్కలతోఁ గూడ రతికేళులను సలుపుచున్నవి. కిన్నరులు రాక్షసులతోడను, మనుష్యులతోడను, రతికేళులను సలుపుచున్నారు. తెల్లని దేహచ్ఛాయయును, ఎఱ్ఱని పాదచ్ఛాయయును గల పావురపుఁబిట్టలు కాలచోదితములైనవై రాక్షసుల నాశముకొఱకు దిరుగుచున్నవి. గృహములయందుఁ బెంపఁబడుచున్న గోరువంకలు మధురములగు వాక్యములను విడిచిపెట్టి చీచీయనియును, కూచియనియును, కూయుచున్నవి. మఱియు నవియన్నియును జగడమాడుచుఁ గ్రిందఁబడుచున్నవి. ఒకానొకప్పుడొక దానితో నొకటి పెఱియవేసికొనుచున్నవి. పక్షులును, మృగములును సూర్యాభిముఖములుగా రోదనమును జేయుచున్నవి. మిగుల భయంకరుఁడును, వికటాకారము గలవాఁడును, బోడిగానుండువాఁడును, కృష్ణపింగళవర్ణము గలవాఁడును, నగు యముఁడు సాయంప్రాతఃకాలములయందు గృహములన్నింటిని వెదకి వెదకి చూచుచున్నాఁడు. ఈ దుశ్శకునములే గాక మఱికొన్ని దుశ్శకునములు గూడఁ గనఁబడుచున్నవి. కాఁబట్టి యో రావణాసురుఁడా! ఇప్పటి విషయమును సర్వము దెలిసికొని చేయఁదగిన కార్యమును నిశ్చయించి యీ కాలమునకుఁ దగిన విధముగా నాలోచింపుమయె. ఇట్లు మంత్రులలో నుత్తముఁడగు మాల్యవంతుఁ డివ్విధముగాఁ జెప్పి మరల రావణాసురుని యొక్క మనస్సును బరీక్షించి చూచి పిమ్మట నా రావణాసురుని జూచి యేమియును బలుకక యూరకుండెను.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి ముప్పదైదవ సర్గము ముగిసెను.

రావణాసురుఁడు తన సైన్యమును ఆయా స్థలములయందు నిలుపుట.

ఇవ్విధముగా మాల్యవంతుఁడు చెప్పిన మాటలను విని దుష్టాత్ముఁడగు నా రావణాసురుఁడు కాలవశమును బొందినవాఁడై యంగీకరింపనివాఁడయ్యె. అంతట నా రావణాసు

రుఁడు గోపోద్రిక్తుఁడై బాణములనువేసి కోపముచేత గ్రుడ్లనుద్రిప్పుచు నామాల్యవంతునితో నిట్లనియె.

మాల్యవంతుఁడా! నీవుహితుఁడవనుబుద్ధిచేత నిన్నడిగితిని. నీవుపరుషవచనములనుబలికితివి. పరపక్షమునందుబ్రవేశించి నీవీవిధముగ మాటలాడుచున్నట్లు తోఁచుచున్నది. కాఁబట్టినీమాటలు నాచెవులకింపైయుండలేదు. మఱియు నోమాల్యవంతుఁడా! మానవజాతివాఁడును, మిగులదీనుఁడును, ఒకరుఁడును, వానరుల నాశ్రయించినవాఁడును, తండ్రిచేత నరణ్యమునకు వెడలగొట్టఁబడినవాఁడును నగు రాముఁడు సమర్థుఁడని నీవుతలఁచుటకుఁగారణమేమి? రాక్షసులకందఱకును బ్రభుఁడను, దేవతలకుఁగూడ భయంకరుఁడను, సర్వవిక్రమములచేతను గొప్పవాఁడనునగునన్ను దక్కువగాఁదలఁచుటకుఁ గారణమేమి? ఏయుఁడవైనయో మాల్యవంతుఁడా! నీవుద్వేషముచేతనో, శత్రువులయందలిపక్షపాతముచేతనో, ఇతరులప్రోత్సాహముచేతనో యిట్లుపలుకుచున్నావని తోఁచుచున్నది. మఱియు నోమాల్యవంతుఁడా! శత్రువులయొక్క ప్రోత్సాహములేనియెడల శాస్త్రముయొక్క తత్వమును దెలిసినవాఁడును, మంత్రిపుంగవుఁడునునగు వాఁడుప్రభువును, రాజ్యమునుజేయుచున్నవాఁడును నగువానితో మిగులఁగఠినములగు మాటల నీవిధముగాఁజెప్పునా? పద్మములయందునివసించక బరులునుసంచరించుచున్న లక్ష్మివలెనున్న సీతనువనములోనుండితీసికొనివచ్చిన నేనురామునకుభయపడి యొందుకిత్తును. మఱియు నోమాల్యవంతుఁడా! అనేకులగు వానరులతోఁ గూడుకొనినవాఁడును, లక్ష్మణసుగ్రీవులతోఁజేరియున్నవాఁడును, నగురాముని నైదారుదినములలోజంపివేయుదును. నీవుచూచుచుండుము. నేనుయుద్ధమును జేయుటకుయత్నించినపుడు దేవతలుగూడ నాయెదుటనిల్వఁజాలరు. అట్టి నాయెదుట రాముఁడెట్లునిలువగలఁడు. అదియునుఁగాక దేవతలకుఁగూడ భయంకరుఁడవగు నాకుభయమెట్లుగలుగును? మిరునాకు భయముగలుగునట్లుచెప్పనేల. మఱియు నోమాల్యవంతుఁడా! నన్నురెండుతునకలుగా శత్రువుడు ఖండించినను ఖండింపనిమ్ము. నేనుమాత్రము శత్రువునకు నమస్కరించి వానియనుగ్రహమునకుఁ బాత్రుఁడనుగాను. ఇవ్విధముగామూర్ఖించి మాటలాడుట యుచితముగాదని యెదవేమో యిట్లుచెప్పుటనాకుస్వభావమైయున్నది. లోకముతో సహజగుణమేవిధముచేతనైననుబోవునా? పోదు. కాఁబట్టి యికనీవిట్టి మాటలనుజెప్పకుము. రాముఁడు "కాకతాళన్యాయముగా" సముద్రమునుగట్టెనేగాని దృఢమైనశక్తితోఁ గట్టినవాఁడుగాఁడు. రాముఁడు సముద్రమునుగట్టినందుకుగా భయమునుబొంది నీవిట్లుపలుకట యుచితమా? ఆరాముఁడు సముద్రమునుదాటి వానరసైన్యముతోఁగూడ నిక్కడకువచ్చినను నాచేతమరణమును బొందకపోఁజాలఁడు. కావున నోమాల్యవంతుఁడా! నీవు భయమును బొందకుమనియె. ఇట్లుపలుకుచున్న రావణాసురుని గోపముగలవానినిగాఁదెలిసికొని యామాల్యవంతుఁడుసిగ్గుచేత నేమియునుబలుకక యూరకుండెను. మఱియు నారావణాసురునకు సంతోషముగలుగునట్లుగా నాశీర్వచనములనుజేసి రావణాసురునియాజ్ఞనుబొంది తనయింటికిబోయెను.

అంతట రావణాసురుఁడుమంత్రులతోఁగూడఁ జక్కగ నాలోచించి చేయఁదగిన కార్యమునునిశ్చయించి లంకాపట్టణముయొక్క సంరక్షణను జక్కగాఁజేయఁదొడంగె. అంతటనారావణాసురుఁడు లంకాపట్టణముయొక్క తూర్పువాకిలినిగాపాడుటకు బ్రహస్తునినియమించె. దక్షిణపువాకిటినిగాపాడుటకు మిగులఁ బరాక్రమవంతులగు మహాపార్శ్వమహోదరులను నియమించె. పశ్చిమద్వారమును గాపాడుటకుఁ బుత్రుఁడగు నింద్రజిత్తును నియమించె. అంతటఁ దనమంత్రులతో నిట్లనియె.

మంత్రిపుంగవులారా! నేనుత్తరద్వారమునందుశుకసారణులతోగూడను త్తరద్వారమునుగాపాడెదను. అనిచెప్పిగొప్పదగువీర్యమును, పరాక్రమమునుగల విరూపాక్షుఁడనియెడురాక్షసుని అనేకకోట్ల రాక్షసులతోఁగూడ పట్టణముయొక్క మధ్యప్రదేశమును గాపాడునట్లునియమించె. ఇవ్విధముగా రాక్షసోత్తముఁడగు రావణాసురుఁడు లంకాపట్టణమును గాపాడువారలను నియమించి కాలబోధితుఁడై తనను గృతార్థునిగాఁదలఁచె. పిమ్మట నారావణాసురుఁడు మంత్రులనందఱను సత్కరించి చేయఁదగినపనులనునియమించి మంత్రులయొక్క యాశీర్వచనములను బొందినవాఁడై తనయంతఃపురములోనికిఁ బోయెను.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి ముప్పదాఱవసర్గము గిసెను.

రాముడుతనసైన్యమును ఆయాస్థలములయందునిలుపుట.

అంతటనక్కడ వానరాధిపతియగుసుగ్రీవుఁడును, మానవాధిపతియగు రాముడును, వాయుపుత్రుఁడగు హనుమంతుఁడును, భల్లూకాధిపతియగు జాంబవంతుఁడును, రాక్షసాధిపతియగు విభీషణుఁడును, వాలిపుత్రుఁడగు నంగదుఁడును, లక్ష్మణుఁడును, శరభుఁడును, సుషేణుఁడు

ను, మైందుఁడును, ద్వివిదుఁడును, గజుఁడును, గవాక్షుఁడును, కుముదుఁడును, నలుఁడును, పనసుఁడును, మఱియు నితరులును నొక్కటిగాఁజేరి శత్రువుఁడగు రావణాసురునిజయించుటకుఁగాఁ దగినవిధముగ నాలోచించిరి. అందు ముందుగ నాసైన్యములోఁ బ్రధానుఁడగువాఁడిట్లనియె.

వానరోత్తములారా! ఈలంకాపట్టణము రావణాసురునిచేతఁ బాలింపఁబడుచున్నది. కాఁబట్టి యీలంకాపట్టణము దేవతలచేతను, ఉరగులచేతను, గంధర్వులచేతను, మఱియు నితరులచేతనుగూడ జయింపనలవిగాదు. కావున మీరందఱును గార్యసిద్ధినిముందునిడుకొని తగినవిధముగ నాలోచింపుఁడు ఈపట్టణమునందు రాక్షసాధిపతియగు రావణాసురుఁడు సన్నిహితుఁడై యున్నాఁడనియె. ఇవ్విధముగ నావానరులందఱును మాట్లాడుచుండఁగా రావణాసురునకుఁ దమ్ముఁడగు విభీషణుఁడు గ్రామ్యపదములులేనిదియును, సంపూర్ణమును, సారవంతమును, నగునర్థముగలదియును నగువాక్యమును జెప్పఁదలఁచి యిట్లనియె.

రఘుకులోత్తమా! రాముఁడా! నామంత్రులగునలుఁడు, శరభుఁడు, సంపాతి, ప్రఘసుఁడను నలువురునులంకాపట్టణమునకుఁబోయి యిప్పుడేవచ్చిరి. ఈనామంత్రులనలువురును, పక్షిరూపములనుధరించి శత్రువుఁడగు రావణాసురునియొక్క సైన్యమునందుఁ బ్రవేశించి యారావణాసురునిచేత నిశ్చయింపఁబడినవిషయమును సర్వమును దెలిసికొనివచ్చిరి. మఱియుదురాత్ముఁడగు నారావణాసురునియొక్కవృత్తాంతమును సర్వమునునామంత్రులు నాతోఁజెప్పిరి. కావుననోరాముఁడా నేనావిషయమునుసర్వమునుజెప్పెదను, వినుము. ప్రహస్తుఁడనువాఁడు లంకాపట్టణముయొక్క తూర్పువాకిలియందుఁ గావలియున్నాఁడు. దక్షిణద్వారమును, మిగులవీర్యముగల మహాపార్శ్వమహోదరులు సంరక్షించుచున్నారు. అనేకకోటిరాక్షసులతోఁ గూడుకొనినవాఁడై యింద్రజిత్తు పశ్చిమద్వారమునఁ గావలియున్నాఁడు. ఆయింద్రజిత్తునకు సహాయులుగానున్నవారందఱును, పట్టలు, ఖడ్గములు, ధనుస్సులు, శూలములు, ముద్గరములు మొదలుగాఁగల యాయుధములనుధరించియున్నారు. నానావిధములగు శస్త్రములనుధరించినవారును, మిగులశూరులును, అసంఖ్యులును, నగు రాక్షసులతోఁగూడుకొని యాయింద్రజిత్తు యుద్ధోన్ముఖుఁడును, మిగులనుద్వేగము గలవాఁడునునై యున్నాఁడు. మఱియును రావణాసురుఁడు వీరులగు ననేకవేలరాక్షసులతోఁగూడుకొని యుత్తరద్వారమును స్వయముగఁ గాపాడుచున్నాఁడు, విరూపాక్షుఁడు శూలఖడ్గధనుస్సులనుధరించి యనేకులగు రాక్షసులతోఁ గూడుకొనినవాఁడై లంకాపట్టణముయొక్క మధ్యమగుల్మమును గాపాడుచున్నాఁడు. ఇవ్విధముగా లంకాపట్టణమునందలి గుల్మములనన్నిఁటిని గాపాడుచున్న రాక్షసవీరుల వృత్తాంతమును సర్వమును దెలిసికొని నామంత్రులు మిగులశీఘ్రముగ నిక్కడకువచ్చిరి. వేయియేనుఁగులును, పదివేలరథములును, ఇరువదివేలగుఱ్ఱములును, కోటిరాక్షసులును, విక్రాంతులును, బలవంతులును, యుద్ధమునందుసమర్థులును, రావణాసురునకిష్టులగు రాక్షసులును అనేకవేలరాక్షసవీరులును నొక్కొక్కయోధునకు సహాయమును జేయుచున్నారు. మఱియు నోరామచంద్రుఁడా! ఇప్పుడు నేనుజెప్పిన యోధులకును, మఱియునితరులగు ననేకయోధులకును, యుద్ధకాలమునందు మితిలేని చతురంగబలములుగలవు. ఈవిషయమును నామంత్రులవలన సవిస్తరముగఁ దెలిసికొంటినని చెప్పి పిమ్మట విభీషణుఁడు తనమంత్రులును, రాక్షసోత్తములును నగు నలుగురనిజూపె. పిమ్మటలంకాపట్టణమునందలి సకలవృత్తాంతమును మంత్రులమూలకముగఁ దెలిపించె. అట్లుసేసినపిమ్మట నావిభీషణుఁడు పద్మపత్రములవంటి నేత్రములుగల రామునకుఁ బ్రియమును జేయవలయునని మెండు కోరికగలవాఁడై యిట్లనియె.

రాముఁడా! పూర్వము రావణాసురుఁడు కుబేరునితోఁ గూడయుద్ధమునుజేసె. అప్పుడు రావణాసురునితోఁగూడ నరువదినూరువేల రాక్షసులు బయలువెడలిపోయిరి. రందఱును, పరాక్రమమునందును, వీర్యమునందును, మునందును, దురాత్ముఁడగు రావణాసురునకు సమానులు. అట్టిరాక్షసులింకను ననేకకోట్లుగలరు. నేనివ్విధముగాజెప్పుట నిను భయముగలిగింపఁ దలఁచికాదు. కోపమునుబుట్టింపఁదలఁచి యివ్విధముగఁజెప్పుచున్నాను. రాముఁడా! కావుననావిషయముగఁ గోపమునుబొందకుము, రాముఁడా! నీవుయుద్ధమునందు దేవతలనుగూడ నిగ్రహించుటకుఁ దగినసామర్థ్యముగలవాఁడవు. కాఁబట్టి నీవుచతురంగబలముతోఁ గూడుకొనినవాఁడవై యీవానరసైన్యమును నొక్కటిగాఁజేర్చుకొని రావణాసురుని వధింపఁగలవనియె. ఇవ్విధముగా విభీషణుఁడు చెప్పుచున్నమాటలనువిని రఘుకులోద్భవుఁడగు రాముఁడు శత్రునాశముకొఱకుఁ దగినమాటలను జెప్పఁదలఁచి యిట్లనియె.

విభీషణుఁడా! వానరపుంగవుండగునీలుఁడు లంకాపట్టణముయొక్క పూర్వద్వారమునందుఁ గావలియున్న ప్రహస్తునితోఁగూడ నానావిధ వానరులసహాయముచేతయుద్ధమునుజేయఁగలఁడు. వాలిపుత్రుఁడగునంగదుఁడు గొప్ప

దగు వానరసైన్యముతో గూడుకొనినవాఁడై దక్షిణద్వారమునందుఁగావలియున్న మహాపార్శ్వ మహోదరులను బాధింపఁగాక. వాయుపుత్రుఁడును. అపరిమితమగుపరాక్రమముగలవాఁడును, నగుహనుమంతుఁ డనేకవానరవీరులతోఁగూడఁ గూడుకొనినవాఁడై పశ్చిమద్వారమునందుఁ గావలియున్న యింద్రజిత్తునువధింపఁగలఁడు. దైత్యదానవసముదాయములకును, మహాత్ములగు ఋషులకును, అపకారమును జేయుటయం దిష్టముగలవాఁడును, నీచస్వభావముగలవాఁడును, వరదానబలముతోఁ గూడుకొనినవాఁడును, సర్వలోకములను నాక్రమించినవాఁడును, సకలలోకప్రజలకును సంతాపమునుగలిగించువాఁడును, లంకాపట్టణముయొక్క యుత్తరద్వారమును గాపాడుచున్నవాఁడునునగు రావణాసురునిసంహరించుటకు నేనులక్ష్మణునితోఁగూడ నుత్తరద్వారమునకుఁబోయెదను. వానరాధిపతియగుసుగ్రీవుఁడును, మిగులఁబరాక్రమవంతుఁడగు జాంబవంతుఁడును, విభీషణుఁడవగునీవును, లంకాపట్టణముయొక్క మధ్యమగుల్మమును గాపాడుచున్నవాని వధింపుఁడు. ఈవానరులందఱును యుద్ధకాలమునందు మానుషరూపము నవలంబించుట యుచితముగాదు. మానుషరూపమును మనవానరులుధరించినయెడల రాక్షసులును, మానవరూపమునుధరింతురు. అప్పుడు నాకు గుర్తు తెలియకపోవును. దానిచేత ననేకవిధములగు కీడులుసంభవించును. కావున వానరులు వానరాకారములతోడనే యుద్ధమును జేయుట యుచితమని తోఁచుచున్నది. కావుననిట్టిధముగఁ జేయింతమనిచెప్పి మఱియునిట్లనియె.

రాక్షసోత్తముఁడా! విభీషణుఁడా! సప్తసంఖ్యాతులమగుమనమందఱమును శత్రువులతో యుద్ధమునుజేయుదము. మఱియునోవిభీషణుఁడా! దశరథమహారాజునకు నీతోఁగూడ నైదుగురుపుత్రులని తలఁచుచున్నాను. కావున మిగులఁదేజోవంతుఁడగు లక్ష్మణునియొక్కయు, నీయొక్కయుసహాయముచేత నేనుశత్రువులను జయించెదనని చెప్పి మతిమంతుఁడగు నారాముఁడు కార్యములనుసిద్ధించుటకొఱకు సువేలాద్రినెక్కుట ముఖ్యకృత్యమని నిశ్చయించె. అంతట మిగులరమణీయమగు సువేలాద్రిపర్వతముయొక్క తటమునుజూచె. అంతటగొప్పదగు సైన్యముతో గూడుకొనినవాఁడును, తనసైన్యముచేత భూమినిసర్వమునునాక్రమించినవాఁడును, మిగులసంతుష్టమైన రూపముగలవాఁడును, మహానుభావుఁడును, నగురాముఁడు శత్రువులనువధించుటకు నిశ్చయించె. ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి ముప్పదేడవసర్గ ముగిసెను.

రాముడు మొదలగువారుసువేలపర్వతముమీఁద నెక్కి లంకాపట్టణమునుజూచుట.

అంతట లక్ష్మణునకన్నయగు రాముఁడు సువేలాద్రిమీఁద నెక్కవలయునని యెడు నిష్టముగలవాఁడును, నైసుగ్రీవునితోడను, ధర్మజ్ఞుఁడును, అనురక్తుఁడును, రాక్షసుఁడును, ఆలోచనను దెలిసినవాఁడును, సకలవిధులను దెలిసినవాఁడును, నగువిభీషణునితోడను మృదుమధుర వచనములనిట్లనియె.

స్నేహితులారా! నానావిధములగు ధాతువులచేత జిత్రితమైనదియును, మిగులమనోహరమైనదియును, నగు పర్వతోత్తమము మీఁదికిఁబోయి యీరాత్రియంతయును నక్కడసుఖముగా నివసింతము. మఱియునోమిత్రులారా! తనమరణముకొఱకు నాభార్యను పీరావణాసురుఁ డపహరించెనో యట్టి రావణాసురునకు నివాసస్థానమగు లంకాపట్టణమును సర్వమును నీపర్వతము మీదనెక్కి చక్కఁగఁ బరిశీలించి చూచెదము. మఱియు నోమిత్రులారా! సుగ్రీవవిభీషణులారా! రావణాసురుఁడు, రాక్షసకులమునకుఁ దగినదియును, నీచమైనదియును, నగుబుద్ధిచేతఁ జేసినదుర్మార్గమువలన రాక్షసకులమంతయును నిందితమైనదయ్యె. రాక్షసాధముఁడగు రావణాసురుని పేరును జెప్పఁగానే నాకపరిమితముగాఁ గోపముపుట్టుచున్నది. దుర్మార్గుఁడగు నారావణాసురుని దుర్మార్గమువలనరాక్షసులకులమంతయును నాశముగావలసివచ్చె. మఱియు నోమిత్రులారా! "శ్లో॥ ఏకోపాకురు తేపాపం కాలపాశవశంగతః। నీచేనాత్మాప చారేణకులంతేన వినశ్యతి॥ కాలవశమును బొందినవాఁడై కులములోనొక్కఁడు పాపమునుజేయును. అట్లుపాపమును జేసిన దుర్మార్గుని వలనకమునిందితమైన యాపాపముచేతఁ గులమంతయు నశించును. కావుననొక్క రావణాసురుని మూలకముగవానికులమునకు సర్వమునకును నాశము గలుగవలసివచ్చెనని రాముఁడు చెప్పె.

ఇవ్విధముగ నారాముఁడు క్రోధోద్దీపితుఁడై మాటలాడుచున్నవాఁడగుచు వాసముచేయుటకొఱకుఁ జిత్రములగు చరియలుగల సువేలపర్వతము నెక్కె. ఆరాముని వెంటనంటి లక్ష్మణుఁడుగూడ నెక్కె. ఆలక్ష్మణుఁడు పరాక్రమమునుజూపుట యందాశగలవాఁడై ధనుర్బాణములనుధరించి యారామునితోఁ గూడఁబోయె. అంతటనారామలక్ష్మణులతోఁగూడ సుగ్రీవవిభీషణులు తమమంత్రులతోఁ గూడుకొనినవారై యాపర్వతమునెక్కిరి. వార

లతోఁగూడ, హనుమంతుఁడు, అంగదుఁడు, నీలుఁడు, మైందుఁడు, ద్వివిదుఁడు, గజుఁడు, గవాక్షుఁడు, శరభుఁడు, గంధమాదనుఁడు, పనసుఁడు, కుముదుఁడు, మిగులబుద్ధిమంతుఁడగు ఋషభుఁడును, గొప్పదగు తేజస్సుగల దుర్ముఖుఁడును, శతవలియనువాఁడును, మఱియునితరులగు ననేకవానరులును, బయలువెడలిపోయిరి. వారందఱు నునతిశీఘ్రముగ నడచునట్టిశక్తిగలవారైరి. మఱియువారందఱును పర్వతములయందు సంచరించునట్టి సామర్థ్యము గలవారును, వాయువేగమువంటి వేగముగలవారును నైయుండిరి. ఇట్టివారందఱును రఘుకులోద్భవుఁడగు రామునితోఁగూడ నాసువేలాద్రిమీఁదికిఁబోయిరి.

అవ్విధముగ వారందఱును నతిశీఘ్రముగ నాపర్వతముమీఁదనెక్కి యాపర్వతశిఖరమునం దాకాశమునఁ బ్రేలాడుచున్న స్వర్గపట్టణమువలె నున్నదియును, మిగులమంగళకరమైనదియును, ప్రసిద్ధములగు ద్వారములు గలదియును, ప్రాకారములచేత నలంకరింపఁబడినదియును, రాక్షసులచేత సంపూర్ణముగ నిండియున్నదియును, నగులంకాపట్టణమును జూచిరి. మఱియువారందఱును ప్రాకారమునందున్నవారలును, నల్లనివారలును, నగు రాక్షసులచేత నాలంకాపట్టణమునకు రెండవ ప్రాకారము నిర్మించినవిధముగనుండెను. అట్టిప్రాకారమునుజూచి వానరులందఱును మహాశ్చర్యమును బొందిరి. మఱియు నావానరులందఱును యుద్ధమును జేయవలయునని మిగుల కోరికగల రాక్షసులను జూచి రాముఁడు చూచుచుండఁగానే నానావిధములును, భయంకరములును నగు సింహనాదములను జేసిరి. అంతఁ గొంతసేపటికి సంధ్యాకాలముచేత రంజింపఁబడినవాఁడై సూర్యుఁడస్తమయమును బొందెను. అంతటఁ బూర్ణచంద్రునియొక్క కాంతిచేతఁ బ్రకాశించుచున్న రాత్రి మిగులమనోహరమైనదై ప్రవర్తిల్లుచుండెను. విభీషణునిచేత నమస్కరింపఁ బడి సత్కరింపఁ బడినవాఁడగు రాముఁడును, వానరాధిపతియగు సుగ్రీవుఁడును, లక్ష్మణుఁడును, వానరయోధులును, యూథనాథులును, నాసువేలపర్వతముయొక్క పృష్ఠభాగమునందు సుఖముగాఁగూర్చుండిరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి ముప్పదెనిమిదవసర్గ ముగిసెను.

-(*)---

{లంకాపట్టణవైభవమును జూచి రాముఁడు మొదలగువారు సంతోషించుట.}

ఆసువేలపర్వతాగ్రమునందు నివసించినవీరులగు వానరులందఱును నారాత్రినిసర్వమును సుఖముగాఁ గడిపి పిమ్మట లంకాపట్టణమునందలి వనములను, ఉద్యానవనములనుజూచిరి. మఱియు నావానరులందఱును, సమములను, సౌమ్యములును, రమ్యములును, విశాలములును, మిగులదీర్ఘములును, చూచుటకు రమ్యములైనవియును, నగువనములను, ఉద్యానవనములను జూచి మిగులనాశ్చర్యముగలవారైరి.

సంపెగవృక్షములచేతను, అశోకవృక్షములచేతను, పున్నాగవృక్షములచేతను, ఏపిచెట్లచేతను, తాటిచెట్లచేతను, వ్యాప్తమైనదియును, తమాలవృక్షములయొక్క వనములచేత వ్యాప్తమైనదియును, తమలపాకుతీఁగలచేత వ్యాప్తమైనదియును, ఈతచెట్లచేతను, మద్దిచెట్లచేతను తీఁగలతోఁగూడుకొనిన నానావిధములను వృక్షములచేతను, పుష్పించిన మేడాకులయరటి చెట్లచేతను, మఱియును దివ్యములైనవియును, నానావిధములైనవియును నగు వృక్షములచేతను వ్యాప్తమైనదై లంకాపట్టణము స్వర్గపట్టణమువలెఁ బ్రకాశించుచుండెను. మఱియు నవిచిత్రములగు పుష్పములతోఁ గూడుకొన్నవియును, ఎఱ్ఱనివియును, మృదువైనవియును, నగుచిగురుటాకులచేతను, పచ్చికగడ్డిగల ప్రదేశములచేతను, కడిమిచెట్లచేతను, చిత్రములగు వనపంక్తులచేతను, నాలంకాపట్టణము మిగులమనోహరమైనదైయుండెను. మఱియు నాలంకాపట్టణమునందలి వృక్షములన్నియును, మానవులాభరణములను ధరించినవిధముగ మిగులఁ బరిమళముగలవియును, మిగుల రమ్యములైనవియును, నగుపుష్పములును, ఫలములును ధరించుచున్నవి. మఱియు నారావణాసురునియొక్క యుద్యానవనము, చైత్రరధముతో సమానమైనదియును, మనోజ్ఞమైనదియును, సర్వఋతువులయొక్క ధర్మములుగలదియును, తుమ్మెదలతోఁ గూడుకొన్నదియును, నగుచుమిగుల మనోహరముగఁ బ్రకాశించుచున్నది. మఱియు నాలంకాపట్టణసమీపమునందలి కొండకాలువయందు నీటికాకులచేతను, కొంగలచేతను, నాట్యమును జేయుచున్న నెమళ్లచేతను, కోకిలచేతను, జేయఁబడుచున్న మిగులమనోహరములగు ధ్వనులు వినఁబడుచుండెను. మఱియు సర్వకాలములయందును మదించినపక్షులును, మిగులబలిసిన తుమ్మెదలును, కోకిలలయొక్క సముదాయములును, మిగులమనోహరముగ ధ్వనిఁజేయుచున్నవి. మఱియు సింహనాదములును, తుమ్మెదలయొక్క ధ్వనులును, కాటుకపిట్టలయొక్క కూతలును, బెగ్గురుపక్షులయొక్క ధ్వనులును మిగుల మనోహరములైయున్నవి అట్లు మిగుల మనోహరములైన వనములయం

దు కామరూపులగు వానరులందఱును మిగులసంతోషించి నవారై ప్రవేశించిరి.

అవ్విధముగ నావనమునందు బ్రవేశించినవారును, గొప్పదగు తేజస్సుగలవారును, నగు నావానరులయొక్క ముక్కులకుసంతోషమును గలుగజేయునదియును, పుష్పములయొక్క పరిమళముతో గూడుకొన్నదియును, పరిమళించుచున్నదియును, నగు వాయువు వీచుచుండె. అంతటనానావానరవీరులలో గొందఱు సుగ్రీవునియొక్క యనుమతమును బొందినవారై యావానరసైన్యములోనుండి బయలువెడలి నానావిధములగు ధ్వజములుగల లంకాపట్టణమునకుబోయిరి. పోయియాపట్టణమునందలి పక్షులను భయపఱచిరి. మృగములను, ఏనుగులను బెదరించిరి. మఱియు నధికముగాధ్వనిజేయుచు లంకాపట్టణమునకు సర్వమునకును, కంపమునుబుట్టించిరి, మహావేగముగల వానరు లివ్విధముగా భూమిని సర్వమును దమపాదతాకునుచేత బీడనొందునట్లుగా జేసిరి. ఆవానరులయొక్క పాదములవలన బుట్టిన దుమ్ము మిగులశీఘ్రముగ నాకాశమునకుబోయెను. ఆవానరులయొక్క ధ్వనినివిని భల్లూకములును, సింహములును, వరాహములును, మహిషములును, ఏనుగులును, మృగములును, మిగులభయమునుబొందినవై నానాదిక్కులకునుబరుగెత్తినవయ్యె. ఆత్రికూటాచలముయొక్క శిఖరములలోనొకటి యాకాశమును స్పృశించుచున్నదియును, సకలదిక్కులయందును బుష్పములచేత గప్పబడినదియును, మహారజతముతో సమానమైనదియును, నూరామడవెడల్పుగలదియును, నిర్మలమైనదియును, చూచుటకు సుందరమైనదియును, మిగులమృదువైనదియును,మిగులసంపన్నమైనదియును, మిగులగొప్పదియును, పక్షులచేతగూడబొందశక్యముగానిదియును, మనోవాక్కాయకర్మలచేతగూడ నెక్కుటకుశక్యముగానిదియును, నైయుండె. ఆశిఖరమునందున్నదియును, రావణాసురునిచేత బరిపాలింపబడుచున్నదియును,నూరామడవెడల్పుగలదియును, ముప్పదామడపొడవుగలదియును, నగు లంకాపట్టణము ప్రకాశించుచుండె. ఆలంకాపట్టణము,తెల్లనిమేఘములతోసమానములైనవియును,మిగులనున్నతములైనవియును, నగు మేడలచేతను, బంగారముచేతను, వెండిచేతను, నిర్మింపబడిన ప్రాకారముచేతను, మేడలచేతను, విమానములచేతను, మిగులనధికముగ నలంకరింపబడియుండె. "వర్షాకాలమునందు మేఘములచేతనాకాశమలంకరింపబడినవిధముగ" నా లంకాపట్టణమునందలి ప్రాసాదము అనేకవేలస్తంభములచేత బ్రకాశింపజేయుచుండె, లంకాపట్టణమునకు మిగులనుత్తమమగు భూషణమైనదియును, కైలాసపర్వతశిఖరముయొక్క యాకారమువంటి యాకారముగలదియును, ఆకాశమునొఱయుచున్నదియును, నగు రావణాసురునియొక్క మేడమిగుల మనోహరమైనదై ప్రకాశించుచున్నదయ్యె. ఆరావణాసురుడుసర్వకాలములయందును అనేకులగురాక్షసులచేత గాపాడబడుచుండె. మఱియు మనోహరమైనదియును, అనేకములగునుద్యానవనములు గలదియును, పర్వతములచేత బ్రకాశించుచున్నదియును, నానావిధములగు పక్షులయొక్కకూతలుగలదియును, నానావిధములగు మృగములచేత సేవింపబడుచున్నదియును, నానావిధములగువనపరంపరలుగలదియును, సకలసంపదలతోడను గూడుకొనినదియును, రావణాసురునిచేత బరిపాలింపబడుచున్నదియును, నగు లంకాపట్టణమును లక్ష్మణునకన్నయును, సంపదగలవాడును, నగు రాముడు ఆవానరవీరులతో గూడుకొనినవాడైచూచె. మిగులగొప్పవగు గృహములచేత గిక్కిరిసియున్న యాలంకాపట్టణమునుబూచి లక్ష్మణునకన్నయును, సర్వోత్తమమగుపరాక్రమముగలవాడును, నగురాముడు పరమాశ్చర్యమునుబొందె.మఱియు నారాముడుమిగుల గొప్పదగు వానరసైన్యముతోగూడ, రత్నములచేత నిండియున్నదియును, నానావిధములగు స్థితులుగలదియును, మేడలయొక్క పఙ్క్తులచేతనలంకరింపబడినదియును. మిగులగొప్పవగుయంత్రములచేతను, తలుపులచేతను బ్రకాశించుచున్నదియును, నగు లంకాపట్టణమునుబూచి సంతోషించె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలిముప్పదితొమ్మిదవసర్గ ముగిసెను.

— సుగ్రీవుడు రావణాసురునిమీదికెదుమికి యుద్ధముజేయుట. —

అంతట నారాముడు, సుగ్రీవునితోడను, వానరయూధపతులతోడను, గూడుకొనినవాడై రెండామడ వెడల్పుగలిగిన సువేలాద్రియొక్క యగ్రభాగమున జూచె. పిమ్మట నాయగ్రభాగమునకు బోయెను. పోయి క్షణమాత్రముసేపు అక్కడనుండి పదిదిక్కులను బరిశీలించిచూచె. పిమ్మటరమ్యమగు త్రికూటాచలముయొక్క శిఖరమునందు విశ్వకర్మచేతనిర్మింపబడినదియును,రమ్యములగు వనములచేత బ్రకాశించుచున్నదియును, మిగుల రమ్యములగు నేర్పాటులుగలదియును, నగు లంకాపట్టణమునుజూచె. ఆసమయమునందాపట్టణగోపురమునందలి గోపుర శృంగారమునందున్నవాడును, రాక్షసాధిపతియును, శత్రువులచేత జయింప నలవిగానివాడును, తెల్లనివింజామరములచేత వీవబడుచున్నవా

దును, జయసూచకమైన గొడుగులతో గూడుకొన్నవాడును, ఎఱ్ఱచందనముచేత బూయబడిన దేహముగలవాడును, రత్నమయములగు నాభరణములచేత నలంకరింపబడినవాడును, నల్లనిమేఘములతో సమానమైన కాంతిగలవాడును, బంగారముచేత నిర్మింపబడిన వస్త్రములనుధరించినవాడును, ఐరావతముయొక్క దంతముల పోట్లవలన గలిగినకాయలచేత బ్రకాశించుచున్న ఱొమ్ముగలవాడును, కుందేటి నెత్తుటితో సమానకాంతిగల యెఱ్ఱనివస్త్రమును ధరించిన వాడును, సంధ్యాకాలమునందలి రక్తిమచేత వ్యాప్తమైన మేఘసముదాయమువలె నున్నవాడును నగు రావణాసురునిజూచి వానరోత్తములును, రఘుకులోద్భవుఁడగు రాముడుఁ జూచుచుండగా సుగ్రీవుఁడుమిగులశీఘ్రముగ లేచినవాడయ్యె. అంతట నాసుగ్రీవుఁడు క్రోధవేగముతో గూడుకొనిన వాడును, సత్వముతోను, బలముతోడను గూడుకొనినవాడును, నాపర్వతాగ్రమునుండి బయలువెడలి గోపురస్థలముమీదికెగిరె. మఱియు నాసుగ్రీవుఁడు క్షణమాత్రము సేపు భయరహితమైన మనస్సుతో జూచి యారావణాసురుని దృణప్రాయునిగా జేసి యారావణాసురునితో గఠినములగు మాటలను జెప్పదలచి యిట్లనియె. ఓరీ! రాక్షసాధమా! రావణాసురుఁడా! నేను లోకనాథుడగు రామునకు స్నేహితుఁడను. మఱియు నారామునకు దాసుఁడను. కావున యామహామహునియొక్క తేజోమహిమచేత నీవు నాచేతిలోనుండి తప్పించుకొనిపోజాలవనియె. ఇవ్విధముగాబలికి యతిశీఘ్రముగ నెగిరి యారావణాసురునిమీదికెగిరె. ఎగిరి యారావణాసురునియొక్క శిరోభూషణమునాక్రమించి భూమియందుబడవైచె. అట్టికార్యమును జేసినవాడును, మరల దనకభిముఖముగవచ్చుచున్నవాడును, నగు సుగ్రీవునిజూచి యారావణాసురుఁడిట్లనియె. ఓరీ! సుగ్రీవుఁడా! నీవు నాయెదుటికి రాకమునుపు చక్కనికంఠముగలవాడవని కీర్తినొందియుంటివి. ఇప్పుడు నాయెదుటికి వచ్చితివి గాన నీచక్కనికంఠమును బాడుచేసెదను. ఇకమీదనీకు సుగ్రీవుఁడనియెడు పేరుపోయి కుగ్రీవుఁడను పేరు వచ్చునట్లు చేయుదుననియె. ఇవ్విధముగాబలికి యారావణాసురుఁడు మిగులశీఘ్రముగ లేచి తనబాహువులచేత నాసుగ్రీవుని ఒడిసిపట్టుకొని భూమియందు బడవైచె. అంతలో నాసుగ్రీవుఁడు తెప్పిరిల్లి లేచి యారావణాసురునిబాదివిపట్టుకొని బంతిని గ్రిందగొట్టినవిధముగ విసరి క్రిందగొట్టె. అంతట నారావణసుగ్రీవులిరువురును, చెమటచేతవ్యాప్తమైన దేహముగలవారలైరి. మఱియు నయ్యిరువురును నెత్తురుచేత బూయబడిన దేహముగలవారైరి. మఱియు నయ్యిరువురును గలిసికొనిన దేహముగలవారైరి. ఇంతియగాక యొకరిశరీరముతో నొకరిశరీరమును గట్టుకొనిరి. మఱియు నయ్యిరువురును శాల్మలివృక్షములవలెం, మోదుగుచెట్లవలెను బ్రకాశించుచుండిరి. మఱియు నారావణసుగ్రీవులిరువురును, పిడికిడిపోటులచేతను, పాదతలప్రహరములచేతను, మోచేతిదెబ్బలచేతను, హస్తాగ్రములదెబ్బలచేతను. మిగులఘోరముగ యుద్ధమును జేసిరి. మఱియునారావణసుగ్రీవులిరువురును మిగుల నధికమగు వేగముగలవారైయాగోపురముయొక్కయు, వేదికయొక్కయు, మధ్యప్రదేశమునందును నెగిరి యెగిరిపడుచు నధికమగు బాహుయుద్ధమును జేసిరి. మఱియు నతివిచిత్రముగయుద్ధమునుజేసిరి. మఱియునయ్యిరువురును నధికముగనిట్టూర్పులనువిడుచుచుగొంతసేపూరకుండి పిమ్మటభూతలమునువదలి ఆకాశమునకెగిరిరి. ఎగిరియంతరాళమునందునిలిచి కొంతసేపు యుద్ధమును జేసి యాగడ్తయొక్కయు, ప్రాకారముయొక్కయు మధ్యప్రదేశమునందు బడిరి. అంతనచ్చోటనుండి లేచి బాహువులనియెడు పాశములచేత బరస్పరమును బంధించుకొని మిగులనధికముగ యుద్ధమును జేసిరి. మఱియు నారావణసుగ్రీవులిద్దఱును, ఆటోపమును, శిక్షాభ్యాసమును, జూపించుచు నధికముగా యుద్ధమును జేసిరి. అవ్విధముగ యుద్ధమును జేయుచున్న యారావణసుగ్రీవులిద్దఱును, పెద్దపులులవలెను, సింహములవలెను, క్రోధముగలవారై ప్రవర్తించిరి. మఱియు నేనుగుపిల్లలవలెయుద్ధమును జేసిరి. అట్లు కొంతతడవు యుద్ధమును జేసి యొకరినొకరు కొట్టుకొని యధికముగ బీడింపబడినవారగుచు యుద్ధభూమియందు బడిరి. మరలలేచి యాయిరువురును ఉద్యోగించి యొకరినొకరు తిట్టుకొనుచు నానావిధములగు యుద్ధమార్గములచేత బ్రవర్తించిరి. బాల్యమునందు జేసినసాధనముతోడను, బాల్యశిక్షతోడను, బలముతోడను, గూడుకొనినవారును, మిగులనధికమగు పరాక్రమముగలవారును, నగు నారావణసుగ్రీవులు యుద్ధమును జేయునపుడు గొంచెమైనను శ్రమనొందినవారుగాకపోయిరి. ఏనుగులనుగట్టిత్రేయుట కుపయుక్తములగుకొయ్యలతో సమానములగు బాహువులతో యుద్ధమును జేసిరి. మఱియునయ్యిరువురు, చిరకాలము ఒకరితో నొకరు కలిసికొనినవారై మండలగతులను సలుపుచుయుద్ధమును జేసిరి. మఱియు నాయిరువురును నొకరినొకరుచంపవలయుననియెడు కోరికగలవారై భక్షణపదార్థముకొఱకు రెండుపిల్లులు ఏవిధముగా యుద్ధము జేయునో యావిధముగా యుద్ధమును జేసిరి.

మఱియు నయ్యిరువురును మండలాకారగతులతోడను, విచిత్రములును, నానావిధములును, నగు గతులతోడను,

గోమూత్రికాగతులతోడను, పోవుచువచ్చుచు మిగులవిచిత్రముగయుద్ధమునుజేసిరి. మఱియు నద్దముగా దిరగడముచేతను, శంకరగతులచేతను, నొకరినొకరు తాకుచుండిరి. మఱియు నొకరినొకరువిడుచుచుండిరి. ఒకానొకప్పుడయ్యిరువురును నభిముఖముగానడచుచుండిరి. కొంతసేపుమెల్లమెల్లగానడచుచుండిరి. మఱియు నధికముగావినోదకరముగయుద్ధమునుజేసిరి. పార్శ్వగమనములతోగొంతసేపుయుద్ధమునుజేసిరి. మఱియు నొకరినొకరు జయింపవలయునని యెడు గోరికతోవంగివంగినడచుచు యుద్ధమునుజేసిరి. ఒకానొకప్పుడు వెనుకకునడచుచుండిరి. మఱియుయొకప్పుడు పాదములతో దన్నవలయుననియెడు కోరికగలవారై యధోముఖముగా నెగురుచుండిరి. మఱియొకప్పుడొకరిబాహువుల నొకరాక్రమింపవలయుననియెడు కోరికగలవారై పరస్పరమును సమీపమునకువచ్చుచుండిరి. ఇవ్విధముగా యుద్ధమునుజేయుచుండగా నారావణాసురుడు తనమాయాబలమును జూపింపవలయుననియెడు కోరికగలవాడయ్యె. ఆవిషయమునువానరాధిపతియగు సుగ్రీవుడు తెలిసికొనియె. అంతటజయముగలవాడును, శ్రమలేనివాడును, నగు రావణాసురుడువానరాధిపతియగు సుగ్రీవునిచేతవంచింపబడినవాడై యంతరిక్షమునకెగిరె. ఆసమయమునందు వానరాధిపతియగు సుగ్రీవుడుయుద్ధమునందుసమర్థుడనియెడు గీర్తిబొందినరాక్షసాధిపతియగు రావణాసురునకుశ్రమగలుగునట్లుయుద్ధమునుజేసి యంతరిక్షమున కెగిరిపోయి వానరమధ్యయందునివసించియున్న రామునిసమీపమునకుబోయె. ఇవ్విధముగాసూర్యపుత్రుడగు సుగ్రీవుడు, మిగులనాశ్చర్యకరమగు యుద్ధమునుజేసి యధికమగుసంతోషముగలవాడగుచు రఘుకులోద్భవుడగు రామునకుసంతోషమును గలుగజేయుచును, వానరోత్తములచేత నధికముగ గీర్తింపబడుచు నావానరసైన్యములోపల బ్రవేశించె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి నలుబదవసర్గము ముగిసెను.

వానరులుయుద్ధముజేయుటకై లంకలో బ్రవేశించుట.

అంతట లక్ష్మణునకన్నయగు రాముడు సుగ్రీవునియందుయుద్ధచిహ్నములనుజూచి సుగ్రీవునిగౌగలించుకొని యిట్లనియె.

సుగ్రీవుడా! నీవునాతోనాలోచింపక యీసాహసకృత్యమునుజేసితివి. రాజులగువారుయీవిధముగా సాహసకర్మలనుజేయుదురా? నీవునాతోనాలోచింపకనన్నును, నాసైన్యమును, విభీషణుని, సంశయమునుగలిపి సాహసప్రియుడవైనయోసుగ్రీవుడా! పరమసాహసమునుజేసితివి. వీరుడవైనయోసుగ్రీవుడా! ఈవిధముగా నికమీదటనాలోచింపక యిట్టిసాహసకృత్యమునుజేయకుము. నీకేమైనన పకారముగలిగియుండెనేని నాకుసీతతో నేమిప్రయోజనము గలదు. నీవులేకపోయినపిమ్మట మహానుభావుడవైనయోసుగ్రీవుడా! తమ్ములగుభరతలక్ష్మణశత్రుఘ్నులు నాకెందుకు. నాకీదేహముతో బ్రయోజనమేమి? నీవిక్కడకురాకమునుపు నేనుజీవించియును బ్రయోజనములేదని తలచియుంటిని. వరుణదేవునితో సమానుడవైన యోసుగ్రీవుడా! నీపరాక్రమమును నేనెఱిగియుండియును నీవురాకమునుపు భయమునుబొందుచుంటిని. మహాబలుడవైనయోసుగ్రీవుడా! రావణాసురుని బుత్రమిత్రకళత్రాదులతోగూడ సంహరించి విభీషణునిలంకాపట్టణమునకధిపతినిగాజేసి భరతునకుగోసలాధిపత్యము నిచ్చి దేహమునువిడువదలచియుంటినని చెప్పె. ఇవ్విధముగా రాముడుచెప్పుచున్నమాటలనువిని సుగ్రీవుడు రామునితో నిట్లనియె.

వీరుడవును,రఘుకులోద్భవుడవునగుయోరాముడా! నీభార్యనపహరించినవాడును, దుర్మార్గుడును, నగు రావణాసురునిజూచినతోడనే నాపరాక్రమమును నేనెఱిగియుండియును నెట్లుసహింపగలనని యె. ఇవ్విధముగా బలుకుచున్నమాటలనువిని రఘుకులోద్భవుడగు రాముడుసుగ్రీవుని గౌరవించి మిగులసంపన్నుడగు లక్ష్మణునితోనిట్లనియె. తమ్ముడా! లక్ష్మణా! చల్లనియుదకమును, గ్రహించిఫలవంతములగువనములయందు మనసైన్యమును సర్వమును గరుడవ్యూహాదివ్యూహములనుగ బన్ని యీపర్వతమునందు నివసింతము. మఱియునోతమ్ముడా! లోకక్షయమునుగలుగజేయునట్టిదియును, మిగులవీరులగు రాక్షసులకును, వానరులకును నాశమునుగలుగజేయునట్టిదియును నగు భయమువచ్చినట్లుతోచుచున్నది. మిగులగఠినములగు గాలులువీచుచున్నవి. భూమియంతయునుగడగడవణకుచున్నవి. పర్వతములయొక్క యగ్రభాగములువణకుచున్నవి. వృక్షములుపడుచున్నవి. మేఘములన్నియును నీచములగు పక్షులయాకారమునుధరించి యంతరిక్షమునందుదిరుగుచున్నవి. మఱియునుమిగులగఠినములైనవియును, పరుషములగు ధ్వనులుగలవియునునైయున్నవి. మఱియునోలక్ష్మణుడా! కౄరములయినయాకారముగల నెత్తురునుగురియుచున్నవి. సంధ్యాకాలమురక్తచందనముతో సమానమైన యాకారముగలదియును, మిగులభయంకరమైనదియును, నైయున్నది. సూ

ర్యమండలములోనుండి యగ్నిమండలముక్రిందబడుచున్నది. అప్రశస్తములగు నక్కలు మొదలగుజంతువులు మిగులభయముగలుగునట్లు సూర్యాభిముఖముగా దీనస్వరముతో నేడ్చుచున్నవి. రాత్రులయందుజంద్రుడుప్రకాశరహితుడై కనబడుచున్నాడు. మఱియునోలక్ష్మణుడా! లోకనాశముకొఱకుజంద్రుడురక్తిమయును, నలుపును, గలకిరణములుగలవాడై కనబడుచున్నాడు. మిగులబొట్టిదియును, కఠినమైనదియును, అప్రశస్తమైనదియును, ఎఱ్ఱనికాంతిగలదియును, నగుపరివేషముపుట్టుచున్నది. మఱియు నోలక్ష్మణుడా! సూర్యమండలమునందు నల్లనిచుక్క గనబడుచున్నది. మఱియు నోతమ్ముడా! లక్ష్మణా! కాకములును, డేగలును, కాకులును, క్రిందికిబడుచున్నవి. నక్కలుఅమంగళకరములగువాక్యములనుబలుకుచు మిగులనధికములగు ధ్వనులుగలవై యధికముగా రోదనమును జేయుచున్నవి. కావుననిది రాక్షసులకు నాశకాలమనితోచుచున్నది. కాబట్టియోలక్ష్మణా! మనముగొప్పదగు వానరసైన్యముతోగూడుకొనినవారమై రావణాసురునిచేత బాలింపబడుచున్నదియును, శత్రువులచేత నాక్రమింపశక్యముగానిదియును, నగు లంకాపట్టణమునకిప్పుడు శీఘ్రముగాబోదమనియె. వీరుడును, లక్ష్మణునకన్నయును, మహాబలుడును, నగు రాముడులక్ష్మణునితో జెప్పుచు నాపర్వతాగ్రమునుండిక్రిందికిదిగె.

అవ్విధముగ, రఘుకులోద్భవుడును, ధర్మాత్ముడును, నగురాముడు పర్వతాగ్రమునుండి క్రిందికిదిగి శత్రువులచేతజూచుటకుగూడ శక్యముగానిదియగు తనసైన్యమునుసర్వమునుజూచె. అంతట గాలజ్ఞుడును, రఘుకులోద్భవుడును,నగు రాముడు సుగ్రీవునితోగూడ మిగులగొప్పదగు వానరసైన్యమునుసర్వమును సన్నద్ధముసేసి యిదితగినకాలమని చెప్పుచు యుద్ధమునకు బ్రేరేపించె. అంతనాసమయమునందు మహాబలుడగు రాముడు మిగులగొప్పదగు సైన్యముతో గూడుకొనినవాడును, ధనుర్ధారియునునై లంకాపట్టణమునకభిముఖముగాబయలువెడలె ఆరామునితోగూడ విభీషణసుగ్రీవులును, జాంబవంతుడును, నళుడును, ఋక్షరాజగు నీలుడును, లక్ష్మణుడును బయలువెడలె. వారికివెనుకకోతులయొక్కయు, కొండముచ్చులయొక్కయు, భల్లూకములయొక్కయు, సైన్యమంతయును, గొప్పదగుభూమినిసర్వమునునాచ్ఛాదించుచు బయలువెడలె. ఏనుగులతోసమానులును, శత్రువులనునివారించువారును, నగు నావానరులందఱును, అనేకములగుశైలశృంగములను, మిగులగొప్పవగు వృక్షములను, ఆయుధములనుగా గ్రహించిరి. అంతటఅన్నదమ్ములుశత్రునాశకులునునగు రామలక్ష్మణులు చిరకాలమునకు రావణాసురునిచేత బరిపాలింపబడుచున్న లంకాపట్టణమునుబొందిరి. ఆలంకాపట్టణము పతాకములయొక్కమాలికలుగలదియును, రమ్యమైనదియును, శ్రేష్ఠములగు ఉద్యానవనములచేత బ్రకాశించుచున్నదియును, చిత్రములగు ప్రాకారములుగలదియును, శత్రువులచేత బొందనశక్యముగానిదియును, మిగులనున్నతములగు ప్రాకారముతోరణములుగలదియును, దేవతలచేతగూడ బ్రవేశింపనలవిగానిదియును, నగు లంకాపట్టణమునందు వానరులందఱును, రామవాక్యములచేత బ్రేరేపింపబడినవారై యుద్ధమునకొఱకు బ్రవేశించిరి. ఆసమయమునందు రాముడుధనుర్ధారియును, తమ్ముడనునగు లక్ష్మణునితోగూడుకొనినవాడును, నగుచు, పర్వతశిఖరమువలె మిగులనున్నతముగులంకాపట్టణముయొక్క యుత్తరద్వారమునడ్డగించె. మఱియునుదనదగు వానరసైన్యమును సర్వమునుగాపాడె. రావణాసురుడున్నయుత్తరద్వారమునందు నాక్రమించుటకువీరుడును, లక్ష్మణునకనుచరుడును, దశరథమహారాజునకుబుత్రుడును, నగు రాముడుప్రవేశించె. రావణాసురునిచేతబాలింపబడుచున్నయుత్తరద్వారమును గాపాడుటకు రామునికంటె నితరుడెవడునుసమర్థుడుగాడు. రావణునిచేత బాలింపబడుచున్నదిగనుకనే వరుణదేవునిచేత గాపాడబడుచున్నసముద్రమువలె బ్రవేశింపనలవిగానిదియును, మిగులభయంకరమైనదియును, మిగులభయంకరులును, నానావిధములగునాయుధములతోగూడుకొనినవారును, నగురాక్షసులచేతగూడ గాపాడబడుచున్నదియును, అల్పమైనబలముగలవారలకు భయమునుగలుగజేయునదియును, పాతాళలోకమువలె బ్రవేశింపనలవిగానిదియును అనేకవిధములగు నాయుధములతోగూడుకొనినదియును, విచిత్రములగుకవచములుగలదియును, నగు లంకాపట్టణమునుజూచి రాముడుమహాశ్చర్యమునుబొందె. వీర్యవంతుడగు నీలుడనియెడు వానరాధిపతిమైందద్వివిదులనియెడు వానరోత్తములతోగూడుకొనినవాడై లంకాపట్టణముయొక్క తూర్పుద్వారమునునాక్రమించె. మహాబలుడగునంగదుడు, ఋషభ, గవాక్ష, గజ,గవయులతోగూడుకొనినవాడై లంకాపట్టణముయొక్క దక్షిణద్వారమునాక్రమించె. బలవంతుడగుహనుమంతుడు మిగులపరాక్రమవంతులని ప్రసిద్ధినొందినప్రమాథిప్రఘసులను వానరోత్తములతోడను, మఱియునితరులగు వానరోత్తములతోడను, గూడుకొనినవాడై పశ్చిమద్వారమునాక్రమించె. సుగ్రీవుడు, గరుత్మంతునితోడను, వాయుదేవునితోడను, సమానులును, మిగులపరాక్రమముగలవారును, నగు సకలవానరవీరులతోడనుగూడుకొని

నవారై మధ్యమగుల్మమును గాపాడుచుండెను. మఱియును
సుగ్రీవుడొక్కడును డెబ్బదియొక్కడవానరయూథములలోమిగు
లప్రసిద్ధులగుముప్పదిమూడుకోట్ల వానరులు నిలిచియుండిరి. రా
మునియాజ్ఞనుబొందినవారై లక్ష్మణవిభీషణులు ప్రతిద్వార
మునందును అనేకవానరకోట్లను ప్రవేశపెట్టిరి. రామునకు
పశ్చిమభాగమునకు సమీపమునందు మిగులనధికసంఖ్యగల
వానరవీరులతోడను, జాంబవంతునితోడను, గూడుకొనిన
వాడునునై సుగ్రీవుడు నివసించియుండెను. పెద్దపులులవంటి
వారును, మిగులభయంకరములగు కోరపన్నులు గలవారు
ను, నగువానరోత్తములందఱును, వృక్షాగ్రములను, పర్వ
తాగ్రములను నాయుధములనుగా ధరించుమిగుల సంతోష
ముతో యుద్ధసన్నద్ధులై యుండిరి. ఆవానరులందఱును, వి
కారములగుతోకలుగలవారును, గోళ్ళాయుధములుగా
గలవారును, వికారములైనవియును, చిత్రములైనవియు
ను, నగు నవయవములుగలవారును, వికారములగు మోము
లుగలవారునునైయుండిరి. మఱియు నావానరులలో గొంద
ఱు పదియేనుగుల బలముగలవారైయుండిరి మఱికొందఱు
నేకయేనుగులబలముగలవారైయుండిరి కొందఱు వేయియే
నుగులకెంతటిబలముగలిగియుండునో అంతటిబలముగలవా
రైయుండిరి. కొందఱు ఓఘసంఖ్యగలయేనుగులకుగల పరా
క్రమముగలవారైయుండిరి. కొందఱు అసంఖ్యకు మూడుగు
ణములకధికమైన పరాక్రమముగలవారై యుండిరి. మఱి
కొందఱు అపరిమితబలపరాక్రమములుగలవారై యుండిరి.
అట్టివానరులందఱును నొక్కచోట జేరుట మిగులనాశ్చర్య
మును, విచిత్రతను, గలుగజేయుచుండెను ఆవానరసైన్యమం
తయును, శలభములవలెమిగుల దట్టముగా భూమ్యంతరిక్ష
ములయందంతటను వ్యాపించియుండెను. మఱికొందఱువాన
రులెగిరిపడుచు లంకాపట్టణమును సర్వమును నాక్రమించి
రి. మఱియు ననేకవేలవానరులు లొక్కటిగాజేరి యుద్ధమును
జేయుటకొఱకు లంకాద్వారములనన్నిటిని నాక్రమించిరి.
మఱియు ననేకకోట్లవానరులొక్కటిగా చేరుకొని చిత్రకూ
టపర్వతమును లంకాపట్టణమును నాక్రమించిరి. ఇవ్విధము
గా నాలంకాపట్టణమంతయును, వృక్షములను జేతియందుధ
రించినవారును, మిగులబలవంతులును, నగు వానరులచేత
వాయువుచేత నాక్రమింపబడినవిధముగా సర్వదేశముల
యందును నాక్రమింపబడియెను. మేఘములతోసమానులును,
దేవేంద్రునిపరాక్రమముతో సమానమగు పరాక్రమముగ
లవారును, నగు వానరులచేత వీక్షింపబడినవారై రాక్షసు
లందఱును మిగులనాశ్చర్యమునుబొందిరి. సముద్రముబ్రద్ద
లగునప్పుడేవిధముగా మిగులభయంకరమగు ధ్వనిగలుగునో
యావిధముగానేయుద్ధోన్ముఖులగు వానరులవలన సర్వలో
కభయంకరమగు గొప్పధ్వనియొకటిగలిగె ఆగొప్పదగుశ
బ్దముచేత, ప్రాకారతోరణములతోగూడుకొనిన లంకాప
ట్టణమును, పర్వతములతోడను, వనములతోడనుగూడుకొ
నినభూమియును గడగడవణకె. రామలక్ష్మణులచేతను,సు
గ్రీవునిచేతను జక్కగాగాపాడబడుచున్న యావానరసైన్య
ము దేవదానవులకుగూడ ప్రవేశింప నలవిగానిదైయుండె.
ఇవ్విధముగా రాక్షసవధనిమిత్తము వానరసైన్యమునుసర్వ
మును ప్రవేశపెట్టి మంత్రులతోగూడనాలోచించి మాటిమా
టికిని జేయదగినకార్యమును నిశ్చయించె. పిమ్మటజేయదగి
నకార్యమును దెలియవలయునని వేడుకోరికగలవాడును,
న్యాయముయొక్కయు, సామాద్యుపాయముల యొక్క
యు వాస్తవమును దెలిసినవాడునునగు రాముడువిభీషణు
నియొక్కయనుమతమునుబొంది రాజధర్మమునననుసరించె.
ఆసమయమునందు విభీషణుడు రామునితో నిట్లనియె. రఘు
కులోత్తమా! రామచంద్రా! యుద్ధసమయమునందు రావ
ణాసురుడువచ్చి శరణన్నయెడల లంకారాజ్యమును రావ
ణాసురునకే యివ్వమనియె. ఆవచనమునువిని రాముడువిభీ
షణునియోగ్యతకు మహానందమునుబొందె అంతటరాము
డు వాలిపుత్రుడగు నంగదునిబిలిచి యిట్లనియె. నాయనా!
సౌమ్యుడా! అంగదుడా! నీవు రావణాసురునియొద్దకుబోయి
నామాటలుగాజెప్పుము. మనోవ్యథను, భయమును దలి
లంకాపట్టణములోనికెగిరిపొమ్ము. పోయినేను జెప్పితిననియి
ట్లుచెప్పుము. ఓ పోయినయైశ్వర్యముగలవాడా! మరణము
నుబొందుటకు సిద్ధముగనున్నవాడా! నష్టమైన తెలివిగలవా
డా! రావణాసురుడా! నీవుగర్వాతిశయముచేత,ఋషుల
కును, దేవతలకును, గంధర్వులకును, అప్సరస్త్రీలకును,
నాగులకును, యక్షులకును, రాజులకును, మఱియు నితరు
లకును, నానావిధములగు కీడులను జేసితివి. అట్టిపాపకృత్య
ములకు గారణమైనదియును, బ్రహ్మదేవునియొక్క వరము
నబుట్టినదియును, నగు నీమదమంతయును నశించెనని యెన్న
ము నాభార్యయగు సీతను అపహరించుటవలన మిగుల
కోపముగలవాడనగుటచేత నిన్నుదండించువాడనై వచ్చి
యుంటిని. మఱియుదండమునుధరించినవాడనై లంకాద్వా
రమునందువచ్చియున్నాను. రావణాసురుడా! నీవు నాచే
తజంపబడినవాడవై దేవతలయొక్కయు, మహర్షులయొ
క్కయు, రాజర్షులయొక్కయు, మఱియునితరులయొక్క
యు, పదవినిబొందగలవు ఓరీ! రావణాసురుడా! నీవుబల
ముచేతను, మాయచేతను, నన్నతిక్రమించి సీతనుదీసికొని
వచ్చితివి. ఇప్పుడాసీతనుదీసికొనివచ్చి సమర్పింపుము, అట్లు

చేయకపోతివేని నేనుమిగుల తీక్ష్ణములగు బాణములచేత నీ లోకమును సర్వమును రాక్షసరహితమైనదానినిగా జేయ దలచియున్నాను. కాబట్టి నీవింకమీదటనైనను, దుర్మార్గమునువిడిచిపెట్టి సీతనుదెచ్చి నాకు సమర్పించి శరణనుము. ధర్మాత్ముడును, రాక్షసులలో శ్రేష్ఠుడును, నగు నీవిభీషణుడు వచ్చినన్ను శరణుజొచ్చెను. కావున మహానుభావుడగు విభీషణుడు, లంకారాజ్యమును సర్వమును నిష్కంటకముగ బొందగలడు. అధర్మముగసంచరించుచున్నట్టి నీవికమీదక్షణమైనను, రాజ్యమునను భవించుటకు దగవు. అవివేకముగలవాడవును, పాపాత్ముడవును, మూర్ఖులే సహాయులుగా గలవాడవును, నగు నోమూఢుడా! రావణాసురుడా! నీవికమీద రాజ్యమును బాలించుటకు నర్హుడవుగావు. కావున నీవుసీతను సమర్పించుటయందిష్టము లేనియెడల ధైర్యమునవలంబించి శౌర్యముగలవాడవై యుద్ధమునుజేయుము యుద్ధమునందు నాబాణములచేత మరణమునుబొందితివేని పవిత్రుడవు కాగలవు. నాకంటికెదుటబడిననీవు మనోవేగమువంటి వేగముగలపక్షి భూతుడవై మూ ల్లోకములయందును బ్రవేశించినను, నీవుజీవింపజాలవు. నీకుహితమును జెప్పుచున్నాను. నావచనములను వినుము. కాదేని లోకములోని రాక్షసులనందఱను వధించెదను. రాక్షసులందఱును మరణమునబొందినపిమ్మట నీకుశ్రాద్ధక్రియలను జేయువారు లేరుగనుక ముందుగా శ్రాద్ధక్రియలను జేసికొనిరమ్ము మఱియునికమీద లంకాపట్టణమును జూడవుగనుక యిప్పుడే లంకాపట్టణమును సర్వమును జక్కగజూచిరమ్ము. నీప్రాణము నాయధీనమైయున్నది కావున నేనివ్విధముగ జెప్పితినని చెప్పుమనియె. అనాయాసముగ సకలకార్యములనుజేయునట్టి రామునిచేత నీవిధముగా జెప్పబడినమాటలనువిని యంగదుడు మూర్తీభవించిన యగ్నివలె నాకాశమునకుబోయె. అవ్విధముగ నంతరిక్షమునకు బోయి క్షణమాత్రములో శ్రీమంతుడగు నాయంగదుడు రావణాసురుని గృహమునకు బోయె. పిమ్మట మంత్రులతో గూడుకొనినవాడును, కొంచెమైనను తత్తరపాటులేనివాడును, నగు రావణాసురునిజూచె, అంతట వానరోత్తముడును, బంగారపుభుజబందులుగలవాడును, ప్రజ్వలించుచున్నయగ్నిదేవునితో సమానుడును నగు నాయంగదుడు రావణాసురుని సమీపమునకు దుమికిపోయి యెదుటనిలుచుండె. పిమ్మట దననుదానే తెలిసికొని రాముడుచెప్పిన మాటలలో నొక్కటియైనను ఎచ్చుతగ్గు కాకుండునట్లు మంత్రులతోగూడుకొనిన రావణాసురునకు దెలిపె. అట్లు తెలిపి మఱియునిట్లనియె. ఓరీ! రాక్షసాధమా! రావణాసురుడా! అనాయాసముగ సకలకార్యములను జేయువాడును, కోసలదేశాధిపతియును నగు రామునకు నేనుదూతను. వాలికిబుత్రుడను. అంగదుడనుపేరుగలవాడను. నాపేరిదివఱకెన్నడైనను నీచెవికివచ్చినదా? రాకుండెనేని యిప్పుడువినుము. కౌసల్యాదేవికి సంతోషమును గలుగజేయువాడును, రఘుకులమునందు బుట్టినవాడును, నగు రాముడు నీకు జెప్పుమనినమాటలను జెప్పెదను. సావధానుడవై వినుము. నీవుపురుషుడవైతివేని పట్టణములోనుండి బయలువెడలివచ్చి యుద్ధమునుజేయుము. పుత్రమిత్రకళత్ర జ్ఞాతిబంధుజనులతోగూడ నిన్ను జంపుటకు వచ్చియున్నాడను. నీవొక్కడవును జంపబడినపిమ్మట మూడులోకములు నభయరహితములగును. దేవతలకును, దానవులకును, యక్షులకును, గంధర్వులకును, ఉరగులకును, రాక్షసులకును, ఋషులకును, శత్రువుడవగు నిన్నుజంపి లోకములకు మేలు చేసెదను. నీవుసద్బుద్ధినవలంబించి సత్కారపూర్వకముగ సీతనుదీసికొనివచ్చి సమర్పింపకపోతివేని నిన్నుసంహరించి లంకాపురరాజ్యైశ్వర్యమును సర్వమును విభీషణునకిచ్చెదనని రాముడుచెప్పెనని రామవచనములుగ జెప్పె. ఇవ్విధముగ వానరోత్తముడగు నంగదుడు మిగులబరుషములగు మాటలను జెప్పుచుండగావిని రాక్షససముదాయమునకధిపతియగు రావణాసురుడధికమగు కోపమును బొందినవాడయ్యె. అంతట నారావణాసురుడు కోపముచేత గన్నులెఱ్ఱగాజేసికొని తనమంత్రులతో నిట్లనియె. మంత్రిపుంగవులారా! దుర్బుద్ధిగలవారలలో నుత్తముడగు నీయంగదునిబట్టి మాటిమాటకిని వధించునట్లు చేయుడనియె. అట్లుమండుచున్న యగ్నియొక్క తేజస్సువంటి తేజస్సుగల రావణాసురునియొక్క మాటను మంత్రులువిని నలుగురు రాక్షసోత్తములను నియోగించిరి. అంతట మిగులభయంకరులగు నలుగురు రాక్షసులు బయలువెడలి యాయంగదుని బట్టుకొనిరి. ఆసమయమునందు వీర్యవంతుడగు నంగదుడు తన పరాక్రమమును జూపింపదలచి యారాక్షసులకు బట్టుబడియె. అంతట నాయంగదుడు తనబాహుద్వయమును బట్టుకొనిన యారాక్షసులను పక్షులనుబట్టుకొనిన విధముగబట్టుకొని పర్వతముతో సమానమగనున్న మేడమీదికెగిరె. అవ్విధముగనెగురుచు నంతరిక్షమునకుబోవునపుడు గొంతదూరముపోయినపిమ్మట నక్కడనుండివిదలించి క్రిందబడవైచె. ఆసమయమునందు రావణాసురుడు చూచుచుండగ నారాక్షసులు నలువురును గ్రిందబడిరి. అంతటనధికమగు ప్రతాపముగలవాడును, వాలిపుత్రుడునునగు నంగదుడు పర్వతశిఖరమువలెమిగులబొడవైనదియును, రావణాసురుని సంబంధమైనదియును నగు మేడయొక్క యగ్రభాగమును జూచె.

అట్లుచూచిఆక్రమించె అప్పుడు రావణాసురుడు చూచుచుండగా నంగదునిచేత నాక్రమింపబడిన మేడబ్రద్దలయ్యె మఱియు నాప్రాసాదమును "హిమవత్పర్వతముయొక్కశృంగమును వజ్రాయుధముచేత బ్రద్దలుసేసినవిధముగ" బ్రద్దలుసేసె. అవ్విధముగా బ్రాసాదశిఖరమునువిఱిచి తనపేరునువినిపించి యధికముగసింహనాదమునుజేసియాకాశమునకెగిరిపోయె. ఆసమయంబున నాయంగదుడు రాక్షసులకందఱకును, వ్యసనమును, వానరులకందఱకునుసంతోషమునుగల్పించుచుండె. అప్పుడనుగానిరుతెగలవారికిని సంతోషవ్యసనములనుగల్పించుచు నంతరిక్షమార్గమునబోయి ముందుగవానరులమధ్యకుబోయి పిమ్మటరాముని పార్శ్వమునకుబోయె.

అవ్విధముగ బ్రాసాదమునువిఱుచుటచేత రావణాసురుడధికముగుకోపమునుబొందె. మఱియు వనకునాశముగలుగునని తలచి యధికముగనిట్టూర్పులనువిడిచె. ఆసమయమునం దక్కుడసంతోషముగలవారును, సంతోషముచేత నధికముగా రోదనమునుజేయుచున్నవారును, నగు ననేకులగువానరులతోగూడుకొనినవాడై యారాముడుశత్రువులను జంపవలయుననియెడు కోరికగలవాడగుచు యుద్ధమునకు బ్రవర్తిల్లెను. మహావీర్యుడును, పర్వతశిఖరముతోగూడుకొనినవాడును, నగు సుషేణుడు కామరూపులగు ననేకవానరవీరులతో గూడుకొనినవాడై సుగ్రీవవచనానుసారముగ "నక్షత్రములు చంద్రునినాక్రమించినవిధముగ" నాలంకాపట్టణమునాక్రమించెను. అవ్విధముగనాక్రమించినసూరత్వహీనులసంఖ్యగలవానరులయొక్క సైన్యము లంకాపట్టణమునందుబ్రవేశించి సముద్రమునతిక్రమించియుండుటనుజూచి రాక్షసులందఱును మహాశ్చర్యమునుబొందిరి. మఱికొందఱు యుద్ధమునుజేయవలయుననియెడు కుతూహలముగలవారై యధికముగ సంతోషమునుబొందిరి. వానర సముదాయముచేతదట్టముగా నాక్రమింపబడిన ప్రాకారముయొక్కయునగర్తయొక్కయు, మధ్యప్రదేశమును, వానరులచేత నిండియున్న ప్రాకారమునుజూచి రాక్షసులందఱును మిగులదీనులైరి. మఱియు నారాక్షసులందఱును భయమోహితులై హాహాకారములనుజేసిరి. అంతటమిగులభయంకరమైనకోలాహలధ్వని యాలంకాపట్టణమునందంతటనువ్యాపించె. ఆసమయమునందు రాక్షసులందఱును నానావిధాయుధములనుధరించి ప్రళయకాలమునందు బయలువెడలునట్టి గాలులవలెసంచరించిరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి నలుబదొక్కటవసర్గ ముగిసెను.

—{ రావణాసురుడు సైన్యముతోగూడ యుద్ధమునకై బైలువెడలుట. }—

అంతట రాక్షసులందఱును నతిశీఘ్రముగ రావణాసురునిగృహములోనికిబోయి రామునిచేతను, వానరులచేతను, లంకాపట్టణమంతయును నాక్రమింపబడెననిచెప్పిరి. అట్లులంకాపట్టణమంతయును వానరులచేత నాక్రమింపబడెనని విని రావణాసురుడధికముగ కోపముగలవాడై మునుపటికంటెనధికముగా రాక్షసులను యుద్ధముసేయుడని నియమించి మేడమీదికెక్కె. అప్పుడనుగ మేడమీదనెక్కి వానరులచేత భూమియంతయును నాక్రమింపబడియుండుటనుజూచి భయమునుబొంది "హా హా యీవానరులసంహరించెదెట్లు" అని విచారమునుబొందెను. అవ్విధముగజింతించి పిమ్మటగొంతసేపటికి రావణాసురుడు ధైర్యమునవలంబించె. పిమ్మటవిశాలములగు నేత్రములుగల యారావణాసురుడు రఘుకులోద్భవుడగు రాముని, వానరసముదాయమునుజూచె. ఆసమయమునందు రఘుకులోద్భవుడగు రాముడు వానరసైన్యముతోగూడ నధికసంతోషముగలవాడగుచు నతివేగముగవచ్చి సర్వస్థలములయందును రాక్షసులచేతదట్టముగా నాక్రమింపబడి కాపాడబడుచున్న లంకాపట్టణమునుజూచె. అవ్విధముగ, దశరథరాజనందనుడగు రాముడు, చిత్రములగు ధ్వజములను, పతాకములును, గల లంకాపట్టణమునుజూచి సీతాదేవిని గురించినవ్యసనముతోగూడినమనస్సుగలవాడై వ్యసనమును బొందె. ధర్మాత్ముడగు నారాముడు సీతాదేవి నిమిత్తముగ వ్యసనమునుబొందుచు శత్రువులను శీఘ్రముగవధింపుడని వానరులకాజ్ఞనిచ్చె. అనాయాసముగ సకలవ్యాపారములనుజేయునట్టి రాముడుయీవిధముగాజెప్పగానే వానరులందఱును నొకరినొకరుద్దుకొనినడచుచు మిగులభయంకరముగా సింహనాదములనుజేసిరి. మఱియు నాసమయమునందువానరులందఱును శిఖరములయందు వ్యాపింతమనియును, పిడికిటిపోటులచేత లంకాపట్టణమును సర్వమును విరుగగొట్టుదమనియునుదలచిరి. అంతట నావానరులందఱునుబ్రయత్నించి మిగులగొప్పవగు పర్వతశిఖరములను, శృంగములను, నానావిధములగు వృక్షములనుబెల్లగించి యాయుధములనుగా ధరించియుండిరి. రాక్షసాధిపతియగు రావణాసురుడుచూచుచుండగా నావానరసైన్యమంతయును, రామునకుబ్రియముసేయుటకొఱకు లంకాపట్టణముమీదనెక్కిరి. మఱియును బంగారపుదేహచ్ఛాయగలవారును, ఎఱ్ఱనిమోముగలవారును, నగు నావానరులందఱునురామునికొఱకు విడిచిపెట్టబడిన జీవముగలవారైయే

పిచెట్లను, తాడిచెట్లను రాళ్ళను నాయుధములను గాధరించి లంకాపట్టణమునందంతటను వ్యాపించిరి. అంతట వానరోత్తములందఱును, పర్వతాగ్రములచేతను, పిడికిటిపోటులచేతను, ప్రాకారాగ్రములను, అరణ్యములను, తోరణములను మథించిరి. మఱియు వానరులు నిర్మలమగు నుదకముతోఁ గూడిన యగడ్తలను, దుమ్ములచేతను, పర్వతాగ్రములచేతను, తృణములచేతను, కట్టెలచేతను, పూడ్చిరి. పిమ్మట వేయివేయి వానరులకధిపతులగువారును, కోటికోటి వానరులకధిపతులగువారును, నూఱుకోట్ల వానరులకధిపతులగువారును, నగు వానరోత్తములు లంకాపట్టణము నునాక్రమించిరి. మఱియు వానరోత్తములందఱును సువర్ణమయములగు తోరణములను జెంచివైచిరి. కైలాసశిఖరములతో సమానములగు గోపురములను బ్రద్దలుసేసిరి. మిగులగొప్పవియును, మదించినవియునైన యేనుగులతో సమానులును, నగు వానరోత్తములు తమయిష్టానుసారముగ నెగిరిదుముకుచుండిరి. అధికముగ ధ్వనిజేయుచుండిరి లంకాపట్టణమునందంతటను నిరంతరముగ బరుగెత్తుచుండిరి. మఱియు మహాబలులగు రామలక్ష్మణులు రాక్షసులను జయించుదురని కూతలిడుచుండిరి. రఘుకులోద్భవులగు రామునిచేత బరిపాలింపబడుచున్న సుగ్రీవుడుగూడ జయమును బొందునని చెప్పుచుండిరి. కామరూపులగు వానరు లివ్విధముగా గూయుచు ధ్వనిజేయుచు లంకాపట్టణముయొక్క ప్రాకారమునందు బరుగెత్తుచుండిరి. ఇట్లు వానరులందఱును లంకాపట్టణమునందల్లకల్లోలము చేయుచున్న సమయమునందు, వీరబాహుడు, సుబాహుడు, నలుడు, మొదలుగాగల సైన్యమును సర్వమును సన్నద్ధముగాఁ జేసికొని ప్రాకారమును బీడించుచుండిరి. లంకాపట్టణముయొక్క తూర్పుద్వారమునందు కుముదుఁడనియెడు వానరోత్తముఁడు జయించునట్టి సామర్థ్యముగల పదికోట్లవానరులతోఁ గూడుకొనినవాఁడై నివసించియుండె. ఆకుముదుఁడనియెడు వానరోత్తమునకు సహాయమును జేయుటకొఱకు ప్రఘసుఁడనియెడు వానరోత్తముఁడేతెంచె. మహాబాహువగు పనసుఁడనియెడు వానరుఁడును, వీరుఁడగు శతవలియను వానరుఁడును, అనేకవేలవానరులతోఁ గూడుకొనినవారై దక్షిణద్వారమును వలంబించియుండిరి మఱియు సుబలవంతుఁడును, తారకుదంద్రియును, నగు సుషేణుఁడనియెడు వానరుఁడిరువదికోట్లవానరులతోఁ గూడుకొనినవాఁడై లంకాపట్టణముయొక్క పశ్చిమద్వారమును నాక్రమించియుండె. బలవంతుఁడగు రాముఁడు లక్ష్మణునితోఁ గూడ నరువదికోట్లవానరులతోఁ గూడుకొనినవాఁడై యుత్తరద్వారము నాక్రమించియుండె. ఆ రామునిన నుసరించి బలవంతుఁడును, వానరాధిపతియును, నగు సుగ్రీవుఁడు ఆవరించియుండె. కొండముచ్చులయొక్క జాతియందు బుట్టినవాఁడును, మిగులగొప్పదగు శరీరముగలవాఁడును, చూచుటకు మిగులభయంకరముగనున్నవాఁడును, మహావీరుఁడును, నగు గవాక్షుఁడు, కోటివానరవీరులతోఁ గూడుకొనినవాఁడై రామునియొక్క సమీపమునందుండె. భయంకరమగు వేగముగల భల్లూకజాతివారిలోనుత్తముఁడును, శత్రువులనువధించువాఁడును, గొప్పదగు పరాక్రమముగలవాఁడును, నగుధూమ్రుఁడనియెడు వాఁడు కోటివానరవీరులతోఁ గూడుకొనినవాఁడై రాముని పార్శ్వమునందుండె. మఱియు నాసమయమునందు గొప్పదగు వీర్యముగలవాఁడును, గదను చేతియందు బెట్టుకొనినవాఁడును, మహాబలుఁడునునగు విభీషణుఁడు నలుగురు మంత్రులతోడను గూడుకొనినవాఁడై రాముని పార్శ్వమునందుండె. గజుఁడును, గవయుఁడును, శరభుఁడును, గంధమానుఁడును, సకలదిక్కులయందును సంచరించుచు వానరసైన్యమును గాపాడుచుండిరి. అంతట రాక్షసాధిపతియగు రావణాసురుఁడు కోపముచేత వ్యాప్తమైనమనస్సుగలవాఁడై యాసమయమునందు యుద్ధమునకు బయలువెడలుఁడని సకలసైన్యములకును నాజ్ఞయిచ్చె. అవ్విధముగా రావణాసురునియొక్క ముఖమునుండి బయలువెడలిన వాక్యమును విని యారాక్షసులందఱును మిగులభయముగలుగునట్లు కూతలిడుచు లంకాపట్టణమునందంతటను సంచరించుచుండిరి. పిమ్మట చంద్రునివలె తెల్లగనున్న యగ్రభాగములుగల రణభేరులు బంగారపుబెత్తములచేత గొట్టబడినవై మిగులభయంకరముగ మ్రోగుచుండె. అవ్విధముగ రణభేరులను మ్రోగించిన పిమ్మట మిగులభయంకరులగు రాక్షసులయొక్క ముఖవాయువుచేత బూరింపబడిన శంఖము లనేకవేలు మిగులభయంకరముగా మ్రోగుచుండె. ఆసమయమునందాభరణకాంతులచేత బ్రకాశించుచున్న శరీరములుగలవారును, శంఖములతోఁ గూడుకొన్నవారును, నగు రాక్షసులు మెఱుపులతోఁ గూడుకొనినవియును, కొంగపక్షులతోఁ గూడుకొనినవియును, నగు మేఘములవలె బ్రకాశించుచుండిరి. అంతట రావణాసురునిచేత బ్రేరణచేయబడిన రాక్షససేనయంతయును, ప్రళయకాలమునందలి సముద్రముయొక్క వేగమువంటి వేగముగలదై బయలువెడలె. ఆసమయమునందు వానరసైన్యమునుండి బయలువెడలిన సింహనాదధ్వని మలయపర్వతమునందలి సకలచాయలయందు నువ్యాపించె. మఱియు నధికబలవంతులగు రాక్షసులయొక్క శంఖదుందుభిధ్వనులును, సింహనాదధ్వనులును, భూమ్యంతరిక్షములయందును, సముద్రములయందును వ్యాపిం

చిప్రతిధ్వనులనుగలుగఁజేయుచుండెను. మఱియు నాసమయమునందు, ఏనుఁగులయొక్క ఘీంకారములును, గుఱ్ఱములయొక్క హేషాధ్వనులను, రథపుగాండ్లయొక్క ధ్వనులును, నపరిమితముగా బయలువెడలెను. ఆసమయమునందు మిగులభయంకరమైన యుద్ధము సర్వస్థలములయందును వ్యాపించెను. ఆ యుద్ధము పూర్వము దేవదానవులకు జరిగిన యుద్ధమువలె మిగులభయంకరమైనదై యుండెను. ఆసమయమునందు భయంకరులగు రాక్షసులు తమ పరాక్రమములను జెప్పుకొనుచు మిగుల ప్రకాశించుచున్న గదలచేతను, శక్తియను నాయుధములచేతను, గండ్రగొడ్డండ్లచేతను, వానరులనందఱను ననేకవిధములఁ గొట్టిరి. ఆసమయమునందు వానరులందఱును, వానరరాజగు సుగ్రీవుడును, రామలక్ష్మణులును, జయించుదురని యధికముగఁ గూతలిడుచుండిరి. మఱియు నో వానరరాజోత్తమా! సుగ్రీవా! జయముగా నుండుమనిరి. ఇవ్విధముగా బలికి తమ నామధేయములను, పరాక్రమములను జెప్పికొనుచుండిరి. అంతట గొప్పవగు శరీరములుగల యా వానరులందఱును, వృక్షములచేతను, పర్వతాగ్రములచేతను, గోళ్లచేతను, దంతములచేతను, మిగులవేగముగలవారై యా రాక్షసులనందఱిని గొట్టిరి. మఱియును గ్రిందు సంచరించుచున్న యా వానరులందఱును నధికమగు కోపముగలవారై యా గిరిప్రాకారములయందున్న రాక్షసులను గ్రిందఁబడవైచిరి. ఆ వానరులివ్విధముగఁ జేయుటకు మునుపు భయంకరులగు రాక్షసులు ప్రాకారములయందుండి క్రిందసంచరించుచున్న వానరులను, భిండివాలములచేతను, ఖడ్గములచేతను, శూలములచేతను మిగుల నధికముగాఁ గొట్టుచుండిరి. ఆసమయమునందు రాక్షసులకును, వానరులకును, మిగులనాశ్చర్యకరమైనదియును, మాంసముచేతను, నెత్తురుచేతను, వ్యాప్తమైనదియును, సంకులమైనదియును, నగు యుద్ధము జరిగెను.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి నలుబదిరెండవసర్గ ముగిసెను.

—(*)—

{ రాక్షసులును, వానరులును, ఒకరితో నొకరు యుద్ధమును జేయుట. } —

అంతట యుద్ధమును జేయుచున్నవారును, మహానుభావులును, నగు నా వానరులకును, రాక్షసులకును, అధికమైన కోపమును గలుగఁజేయునట్టిదియును, మిగులభయంకరమైనదియు నగు యుద్ధము జరిగెను. ఆసమయమునందు, రావణాసురునకు జయము గలుగవలయుననియెడు కోరికగలవారును, భయంకరములగు వ్యాపారముగలవారును, నగు రాక్షసులు పదిదిక్కులయందును వ్యాపించునట్లు కూతలిడుచు బంగారపుపూసల్లచేత నలంకరింపఁబడిన గుఱ్ఱములతోడను, అగ్నిజ్వాలలతో సమానములగు ధ్వజములతోడను, సూర్యునితో సమానములగు రథములతోడను, మిగుల మనోహరములగు కవచములతోడను గూడుకొనినవారై యుద్ధమునకు బయలువెడలిరి. ఆసమయమునందు రామునకు జయము గలుగవలయునని తలంచుచున్న వానరులయొక్క గొప్పదగు సైన్యము రాక్షససైన్యమునకభిముఖముగా యుద్ధమును జేయుటకు మిగుల శీఘ్రముగ బయలుదేఱెను. ఇవ్విధముగా నొకరి నొకరు జయింపవలయుననియెడు కోరికతో బయలుదేఱుచున్న రాక్షసులకును, వానరులకును సంతలోపల మిగులభయంకరమైనదియును, సంకులమైనదియును నగు యుద్ధమయ్యె. మఱియు నాసమయమునందు వాలిపుత్రుడగు నంగదునితో నింద్రజిత్తను నామధేయముగల రాక్షసోత్తముడు "గొప్పదగు తేజస్సుగల యముడు పరమేశ్వరునితో యుద్ధమును జేసినవిధముగ" యుద్ధమును జేసెను. విభీషణుని మంత్రియును, శత్రువులచేత జయింప నలవిగానివాఁడును నగు సంపాతి ప్రజంఘుడనువానితో మిగుల భయంకరమగు యుద్ధమును జేసెను. జంబుమాలియను రాక్షసుడు వానరోత్తముడగు హనుమంతునితో యుద్ధమును జేసెను. మిగులభయంకరమగు కోపముగలవాఁడును, రావణాసురునకు దమ్ముడును నగు విభీషణుడు యుద్ధమునందు మిగుల నధికమగు వేగముగలవాఁడును, రాక్షసోత్తముడును నగు మిత్రఘ్నుఁడనువానితో యుద్ధమును జేసెను. బహుబలుఁడగు గజుఁడనియెడు వానరోత్తముడు, తపనుఁడనియెడు రాక్షసోత్తమునితో యుద్ధమును జేసెను. అధికమైన తేజస్సుగల నీలుఁడనియెడు వానరోత్తముడు నికుంభుఁడనియెడు రాక్షసోత్తమునితో యుద్ధమును జేసెను. వానరాధిపతియగు సుగ్రీవుడు ప్రఘసుఁడను రాక్షసునితో యుద్ధమును జేసెను. శ్రీమంతుడగు లక్ష్మణుడు విరూపాక్షునితో యుద్ధమును జేయుట కుద్యమించెను. శత్రులచేత జయింపనలవిగాని యగ్నికేతుడును, రశ్మికేతుడును, సుప్తఘ్నుడును, యజ్ఞకోపుడును నగు రాక్షసులు రామునితో గూడ యుద్ధమును జేయుటకు సన్నద్ధులైరి. వజ్రముష్టియను రాక్షసుడు మైందుడను వానరునితో యుద్ధమును జేసెను, అశనిప్రభుడు ద్వివిదుడను వానరునితో యుద్ధమును జేసెను. భయంకరులగు నాయిరువురు రాక్షసులతో మైందద్వివిదులిరువురును ఘోరమగు యుద్ధమును జేయఁదలచిరి. వీరుఁడును, భయంకరుడును, యుద్ధములయందు జయింపనలవిగానివాఁడును, నగు ప్రతాపుడను రాక్షసోత్తముడధికమగు వేగముగలవాఁడై నలుఁడను వానరోత్తమునితో యుద్ధమును జేయుటకువచ్చె. ధర్మునను వానికి పుత్రుడును, బలవంతుడు

ను, మిగులప్రసిద్ధుడును, నగు సుషేణుడను వానరుడు విద్యున్మాలియను వానితోగూడ ఘోరమగు యుద్ధమును జేసె. భయంకరులును, మఱియు నితరులును నగు వానరులితరులగు రాక్షసులతోగూడ నానావిధములగు యుద్ధములను జేయుటకు యత్నించిరి. అంతట నక్కడ సంకులమైనదియును, గగుర్పాటును గలుగజేయునదియును, నగుయుద్ధము, జయమునుగోరుచున్న వానరులకును, రాక్షసులకును జరిగె. ఆసమయమునందు వానరులయొక్కయు, రాక్షసులయొక్కయు, దేహములనుండి తలవెండ్రుకలనియెడు నాచుగలదియును, శరీరములనియెడు కాష్ఠములతో గూడుకొనినదియును, నగు నెత్తురుటేరు లపరిమితముగా బ్రవహించె. మఱియు నాసమయమునందు శత్రువులయొక్క సైన్యమును బ్రద్దలుసేయునట్టివాడును, వీరుడును నగు నంగదుని నింద్రజిత్తు కోపోద్దీపితుడై దేవేన్ద్రుడు వజ్రాయుధముచేత గొట్టువిధముగ గదతో గొట్టె. అంతట శ్రీమంతుడగు నంగదుడు, మిగులకోపముగలవాడును, వేగముగలవాడును, నై బంగారముచేత జిత్రములగు నవయవములుగలదియును, గుఱ్ఱములతోడను, సారథితోడను గూడ కొనినదగు నాయింద్రజిత్తుయొక్క రథమును విరుగగొట్టె. ప్రజంఘుడనువాడు, విభీషణునకు మంత్రియగు సంపాతిని తీక్ష్ణములగు మూడు బాణములచేత గొట్టె. అశ్వకర్ణుడను రాక్షసుడు ప్రజంఘుడనువానిని గొట్టె. మహాబలుడును, రథమునందున్నవాడును, నగు జంబుమాలియనువాడు తనరథముయొక్క సామర్థ్యముచే గోపోద్దీపితుడై హనుమంతుని యొక్క ఱొమ్ము బ్రద్దలగునట్లు కొట్టె. అంతటవాయుదేవునకు బుత్రుడగు హనుమంతుడు ఆరథమును బట్టుకొని యాజంబుమాలితోగూడ రథమును హస్తతలముచేత విరుగగొట్టె. ప్రతపుడను రాక్షసుడు నలుడనువానిని మర్దించె. అంత భయంకరుడగు నలుడు గోపోద్దీపితుడై ప్రతపనునియొక్క గ్రుడ్లను బెరికి క్రిందబడవైచె. మఱియు నాసమయమునందు తీక్ష్ణములగు బాణములచేత, నారాక్షసునిచేత బ్రద్దలుగా జేయబడిన యవయవములుగలవాడై సుగ్రీవుడు సైన్యమును సర్వమును మ్రింగుచున్న ప్రఘసుడనువాని నేడాకులయరటిచెట్లచేత గొట్టె. మఱియు నాసమయమునందగ్నికేతుడును, దుర్ధర్షుడును, రశ్మికేతుడును, సుప్తఘ్నుడును, యజ్ఞకోపుడును, నను రాక్షసులు తీక్ష్ణములగు బాణములతో రాముని గొట్టిరి, అంతట రాముడు మిగుల గోపముగలవాడై, భయంకరములును, అగ్నిజ్వాలలతో సమానములైనవియును, తీక్ష్ణములయినవియును నగు బాణములచేత నానలుగురు రాక్షసులయొక్కయు శిరస్సులను ఛేదించె. మఱియు నాసమయమునందు మైందుడు వజ్రముష్టియనువానిని పిడికిటితో గొట్టె. అంతట నావజ్రముష్టియనువాడు గుఱ్ఱములతోడను, రథముతోడనుగూడ పట్టణముయొక్క యట్టముప్రదేశమువలె భూమియందు బడె. మఱియు నికుంభుడను రాక్షసుడు, కాటుకకొండతో సమానమైన దేహముగల నీలుడను వానరుని తీక్ష్ణములగు బాణములచేత, సూర్యుడు మేఘమును కిరణములచేత గొట్టువిధముగ గొట్టె. అంతటను రకుండక యతిశీఘ్రముగ హస్తములతో సకలకార్యములను జేయునట్టి యానికుంభుడు నూరుబాణములను బ్రయోగించి నీలుని శరీరము బ్రద్దలగునట్లుసేసె మఱియు నానావిధములుగ బాధించె. అంతట నానీలుడు ఆనికుంభుని రథచక్రమును, యుద్ధకాలమునందు విష్ణుదేవుడు చక్రమును ధరించినవిధముగ ధరించి యానికుంభుని సారథియొక్క శిరస్సును ఛేదించె. వజ్రాయుధముతోడను, పిడుగుతోడను సమానుడగు ద్వివిదుడు అశనిప్రభుడను రాక్షసోత్తముని సకలరాక్షసులును వ్యసనమును బొందుచుండగనొక్క పర్వతశిఖరముతో గొట్టె. అంతనాయశనిప్రభుడు అపరిమితమైనకోపముగలవాడై పర్వతశిఖరమునే యాయుధముగా ధరించినవాడును, వానరోత్తముడును నగు ద్వివిదుని వజ్రాయుధములతో సమానములగు బాణములచేతగొట్టె. అవ్విధముగ నాబాణములచేత గొట్టబడిన ద్వివిదుడు కోపఘూర్ణితనేత్రములుగలవాడై యొక్కయేపిచెట్టును జేతబూని యశనిప్రభుడనియెడు రాక్షసోత్తముని రథాశ్వసారథి సమేతముగా మర్దించె. ఆసమయమున మఱియొకచోట యుద్ధమును జేయుచున్న విద్యున్మాలియను రాక్షసోత్తముడు బంగారపుసొమ్ములచే నలంకరింపబడిన బాణములచేత మాటిమాటికిని ధ్వనిజేయుచుండె. అంతటనాసుషేణుడనియెడు వానరోత్తముడు రథమునందున్నయావిద్యున్మాలినిజూచి క్రోధముచేనెఱ్ఱనైన నేత్రములుగలవాడై గొప్పదగనొక్క పర్వతశిఖరముతో నాతనిరథమును జూర్ణముసేసె. అంతటనావిద్యున్మాలియను రాక్షసోత్తముడు మిగులలాఘవముతో గూడుకొనినవాడై రథమునుండి క్రిందికిదుమికి గదను జేబూని భూమియందు నిలిచియుండె. అంతట నాసుషేణుడపరిమితమగుకోపముతోగూడుకొనినవాడై మిగులగొప్పదగు నొక్కశిలను జేబూని యావిద్యున్మాలినిదరిమె. అవ్విధముగవచ్చుచున్న సుషేణునిజూచి విద్యున్మాలియను రాక్షసుడుతనచేతనున్న గదతో నాసుషేణుని ఱొమ్ముబ్రద్దలగునట్లు కొట్టె. అవ్విధముగగొట్టిన నాదెబ్బను లక్ష్యముసేయక యాసుషేణుడు మిగులగొప్పదగు నాయుద్ధభూమియందెల్లవారునుజూచుచుండగ దనచేతనున్నశిలచేత నారాక్షసుని

పొమ్మునుబ్రద్దలుసేసెను. అవ్విధముగశిలచేత గొట్టబడినవి ద్యున్మాలియనురాక్షసోత్తముడుపొడిపొడిగా జేయబడిన హృదయముగలవాడై భూమియందుబడి ప్రాణములనువిడిచెను. ఇవ్విధముగనాయుద్ధమునం దు శూరులగు రాక్షసోత్తములు కేవలదానవయుద్ధమునందువలెనేచంపబడిరి.

అప్పుడాయుద్ధభూమి, భగ్నములగు ఖడ్గములతోడను, గదలతోడను, శక్తులనునాయుధములతోడను, తోమరములనియెడు నాయుధములతోడను, పట్టసములనియెడు నాయుధములతోడను, విరుగగొట్టబడినరథములతోడను, ఛేదింపబడినగుఱ్ఱములతోడను, చంపబడిన మదపుటేనుగులతోడను, మృతులైపడియున్నవానరులతోడను, రాక్షసులతోడను, రథములయొక్క చక్రములతోడను, ఇరుసులతోడను, దండములతోడను, గూడుకొనినదైమిగులభయంకరమైయుండెను. మఱియు నారణభూమియందంతటను నక్కలువ్యాపించియుండెను. మఱియును దేవదానవులయుద్ధముతోసమానమైనదియును, సంకులమైనదియును, మిగులసమ్మర్దముగలదియును నగు యుద్ధమునందువానరులయొక్కయు, రాక్షసులయొక్కయు, మొండెములెగిరిపడుచుండెను. మఱియునాసమయమునందు వానరోత్తములచేత బ్రద్దలు సేయబడినశరీరములుగలవారును, నెత్తురుచేతబూయబడినశరీరముగలవారునునై కొందఱు రాక్షసులు మరణమును బొందిరి. మఱికొందఱు రాక్షసులుయుద్ధమును మనుపటి కంటెనధికముగ యుద్ధమును జేయవలయునను తలంపుతో సూర్యాస్తమయమునుగోరుచుండిరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి నలుబదిమూడవసర్గ ముగిసెను.

{ రామలక్ష్మణులను, వానరులను, ఇంద్రజిత్తుఅంతర్ధానముగానుండిబాణములచేగొట్టుట. }

అవ్విధముగారాక్షసులును, వానరులును, యుద్ధమును జేయుచుండగా సూర్యుడస్తమయమునుబొందెను. అంతట వానరులయొక్క ప్రాణములనపహరించునట్టి రాత్రివచ్చెను. అంతటనొకరితోనొకరు యుద్ధమును జేయుచున్నవారును, ఒకరితోనొకరు విరోధమును బెట్టుకొనుచున్నవారును, ఒకరినొకరుజయింపవలయునని యెడు కోరికగలవారును, నగు వానరులకును, రాక్షసులకును, రాత్రియుద్ధముప్రవర్తించెను. ఆప్రకారముమిగులభయంకరమగు చీకటియందు రాక్షసులును, వానరులును, గుర్తుతెలియకయొకొక్కరు నుతమవారినిదామెచంపుకొనుచుండిరి. మఱియువారలలో వారుజయించుము. బ్రద్దలుసేయుము. ఎందుకుబరుగెత్తెదవు. అనిసంభాషించుచుండిరి. అట్లుసంభాషించుటచేతనా చీకటిసమయమునందు మిగులదుములమగుశబ్దముప్రవర్తించెను. ఆ రాత్రిసమయమునందునల్లనిశరీరముగలవారును, బంగారపుకవచములనుధరించినవారును, నగు రాక్షసులు ప్రజ్వలించుచున్న తృణజ్యోతిస్సులనియెడు ఓషధులతోగూడుకొనినపర్వతములవలెగనబడుచుండిరి. అతిక్రమింపశక్యముగాని యాచీకటిసమయమునందు రాక్షసులందఱును కోపముతోగూడుకొనినవారును, మిగులవేగముగలవారునునై వానరులనుభక్షించుచుండిరి. అంతట నావానరులు మిగుల గొప్పదగు కోపముగలవారై, బంగారపుసొమ్ములనుధరించునగుఱ్ఱములను, అగ్నిజ్వాలలతోసమానములగు ధ్వజములను, తీక్ష్ణములగుదంతములచేతజీల్చివేసిరి. మఱియు బలవంతులగునావానరులు యుద్ధమునందు రాక్షససైన్యమును సర్వమును నానావిధములబీడించుచుండిరి. మఱియు నావానరులధికమగుకోపముగలవారై, యేనుగులను, ఏనుగులమీదనెక్కినవారలను, పతాకములతోడను, గూడుకొనినరథములను, దంతములచేతగఱచి ధ్వంసముచేసిరి. ఆసమయమునందు రాముడును,లక్ష్మణుడును, క్రూరసర్పములతోసమానములగు బాణములచేత,గనబడుచును, గనబడకయును, సంచరించుచున్నవారును, శ్రేష్ఠులునునగురాక్షసులనగొట్టుచుండిరి. ఆసమయమునందు గుఱ్ఱములగిట్టలచేతనెగురగొట్టబడినదియును, రథములయొక్కతాకుడుచేత బుట్టినదియును, నగు ధూళపరాగముచెవులను, గన్నులను, గప్పియుద్ధమును జేయుచున్నవారలకు మార్గము తెలియకుండునట్లుసేసి యధికమగుబాధనుగల్పించెను. అవ్విధముగామిగులభయంకరమైనదియును, గగుర్పాటునుగలుగజేయునదియునగు నాయుద్ధమునందు, మిగులభయంకరమైనవియును, నెత్తురేయుదకముగాగలవియునునగు నదులు ప్రవహింపనారంభించెను. అంతటరణభేరులయొక్కయు, మద్దెళ్ళయొక్కయు, శంఖములయొక్కయు, పిల్లనగ్రోవులయొక్కయు, ధ్వనిమిగులనాశ్చర్యకరమైనదై బయలువెడలెను. మఱియు నాధ్వనిభూమ్యాకాశములయొక్క మధ్యప్రదేశమునందువ్యాపించెను. మరణమునుబొందుచున్నవారును, ధ్వనిజేయుచున్నవారును, నగు రాక్షసులయొక్కయు, రాక్షసులచేతబీడింపబడుచున్నవానరులయొక్కయు, ధ్వనిమిగులభయంకరమైనదై బయలువెడలెను. ఆసమయమునందా యుద్ధభూమి, చంపబడిక్రిందబడియున్న వానరవీరులతోడను, శక్తులు,శూలములు, గండ్రగొడ్డండ్లు, క్రిందబడియున్నపర్వతాగ్రములతోడను, కామరూపులును, క్రిందబడియున్నవారును, నగు రాక్షసులతోడను, గూడుకొనినదై

శస్త్రములనియెడు పుష్పములతో గూడుకొనినదైయుండెను. ఆరాత్రి, తెలియశక్యముగానిదియును, ప్రవేశింపశక్యముగానిదియును, నెత్తురుయొక్క ప్రవాహముగలదియును, మాంసమనియెడుబురదతో గూడికొనినదియును, రాక్షససంహారిణియును, మిగుల భయంకరమైనదియును నైయుండెను. అంతటమిగులభయంకరమగునాచీకటియందు, రాక్షసులందఱును రామునిమీదబాణవర్షమును గురిపించిరి. ఆరాత్రి సకలభూతములకు గాళరాత్రివలెనైయుండెను. అవ్విధముగ యుద్ధమును జేయుచున్నవారును, ఘోషయుక్తులును, నగు రాక్షసులయొక్కయు, వానరులయొక్కయు, సంకులసమరమునందలిశబ్దము, ప్రళయకాలమునందలి సప్తసముద్రములయొక్కధ్వనివలె మిగులభయంకరమైనదైయుండెను. ఆసమయమునందు రాముడు తనమీదయుద్ధమునకువచ్చిన రాక్షసులనార్గురను, తీక్ష్ణములగుబాణములచేత మర్దించెను. మఱియు నాసమయమునందు రాముడగ్నిజ్వాలలతో సమానములైనవియును, మిగులదీక్ష్ణములైనవియును, నగు బాణసముదాయములచేత క్షణమాత్రములో యమశత్రుడు, దుర్ధర్షుడును, మహాపార్శ్వమహోదరులును, వజ్రదంష్ట్రుడును, మహాకాయుడును, శుకసారణులును, నగ్నస్థానములయందు గొట్టబడిరి అట్టియుద్ధమునుండి తొలగినవారందఱును నాయుర్దాయమాత్రము మిగులుగాగలవారైరి. అట్టియుద్ధరంగమునందు మహాబలుడగురాముడు, బంగారముచేతనలంకరింపబడినవియును, చిత్రములైనవియును, అగ్నిజ్వాలలతో సమానములైనవియును, నగుబాణములచేత దిక్కులను బ్రకాశింపజేసె. మఱియు నారామునకభిముఖులుగానున్న రాక్షసులందఱును నగ్నిహోత్రమునుమీదికి జొచ్చునట్టి శలభములవలె మరణమును జెందిరి. మఱియును బంగారపుఱెక్కలతో గూడుకొని వేలవేలుగా బయలువెడలుచున్న రామునిబాణములచేత నారాత్రి మెఱుగుడుపూవులచేత నంతరిక్షము ప్రకాశించువిధముగ బ్రకాశించుచుండెను. మఱియు నాసమయమునందు ఆరాత్రి రాక్షసులయొక్కయు, వానరులయొక్కయు, ధ్వనులచేత మిగులభయంకరమైనదయ్యె. అధికమైనయాశబ్దములచేత వ్యాప్తమయిన త్రికూటాచలము మిగులభయంకరమగు ప్రతిధ్వనులనిచ్చె. మిగులగొప్పదగు శరీరముగలవారును, చీకటితో సమానములగువర్చస్సులుగలవారును, నగుకొండముచ్చులొకరినొకరు కౌగలించుకొని యారాక్షసులనందఱను మ్రింగుచుండిరి. ఆసమయమునందు అంగదుడు యుద్ధమునందు శత్రువుడగు నింద్రజిత్తును సంహరించుటకు సక్తుడై యాయింద్రజిత్తును, గుఱ్ఱములను, సారథిని మర్దించెను. అవ్విధముగా బ్రవర్తించుచున్నదియును, మిగులభయంకరమైనదియును, నగుయుద్ధమునందింద్రజిత్తువాలిపుత్రుడగు నంగదునిచేత చంపబడినగుఱ్ఱములను, సారథియును గలవాడై రథమునువిడిచి మాయమైపోయెను. అవ్విధముగవాలిపుత్రుడగు నంగదుడుచేసినకార్యమును జూచి దేవతలును, దేవర్షులును, రామలక్ష్మణులును, మిగులసంతోషమును బొందిరి. మఱియుసకలభూతములును, యుద్ధమునందింద్రజిత్తుయొక్క సామర్థ్యమును నెఱిగియుండుటచేత నయ్యంగదునిమాహాత్మ్యమునకు మిగులనానందమును బొందినవయ్యె. ఆసమయమునందు వానరులందఱును నంగదుడుచేసిన మహాకార్యమునుజూచి యనేకవిధముల బ్రశంసించిరి. మఱియుమిగులభయంకరముగ యుద్ధమును జేయునట్టి యంగదునిచేతయుద్ధమునందు అపజయమును బొందినవాడైయింద్రజిత్తుమిగులభయంకరమగు కోపమునవలంబించెను. ఆసమయమునందు మహానుభావుడగు రాముడువానరులతో నిట్లనియె.

ఓవానరోత్తములారా! మీరందఱును సుగ్రీవునితో గలిసి యొక్కచోటునకు రండు. ఆయింద్రజిత్తు బ్రహ్మదేవునివలన వరములనుబొందినవాడుగనుక ముల్లోకములను నధికముగ బాధించుచున్నాడు. ఇదిమీకు మేలునుగలుగజేయునట్టి కాలముగునుచేత మీకార్యముసిద్ధించుటకొఱకు కివ్విధముగనింద్రజిత్తుమనయంగదునిచేత బరాభవింపబడియె. అయినను నింద్రజిత్తు భయమును బొందెనని యెన్నగూడదు. నేనాయింద్రజిత్తును వధించెదను. మీరందఱును పరితాపమును వదలియుండుడనియె. అంతట నవ్విధముగ నంతర్ధానమును బొందినవాడును, యుద్ధములయందు మిగులగఠినముగ బ్రవర్తించువాడును, పాపాత్ముడును, రావణాసురునకు బుత్రుడును నగునింద్రజిత్తువజ్రముతో సమానమైనవియును, మిగులదీక్ష్ణములైనవియును, బాణములను తానునితరులకు గనబడనివాడై యుపయోగించెను. మఱియు నయ్యింద్రజిత్తుయుద్ధమునందుమిగులగోపయుక్తుడగుటచేత నాగమయములగు బాణములచేత రామలక్ష్మణులయొక్క సర్వావయవములకును నొప్పిగలుగునట్లుబాధించెను. మఱియుసకలభూతములకును నదృశ్యుడైయున్నవాడును, కపటయుద్ధమును జేయువాడునునగు నయ్యింద్రజిత్తు అన్నదమ్ములగు రామలక్ష్మణులను శరబంధముచేతబంధించెను. మఱియునధికమగుకోపముగలయాయింద్రజిత్తుచేతబురుషోత్తములగు రామలక్ష్మణులు అపరిమితముగగొట్టబడిరి. అంతట నావానరవీరులందఱును భీతచిత్తులై రామలక్ష్మణులనుజూచుచుండిరి. అవ్విధముగబాణములను బ్రయోగించియును, ఆబాణములచే

రామలక్ష్మణుల నధికముగ బాధింపజాలక ప్రకాశరూపుడును, రావణాసురునకు బుత్రుడును, నగు నయ్యింద్రజిత్తు మాయను బ్రయోగించి వారల బాధింపయత్నించె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి నలుబదినాల్గవసర్గ ముగిసెను.

ఇంద్రజిత్తు రామలక్ష్మణులను మూర్ఛింప జేయుట.

అంతట రాజపుత్రుడును, ప్రతాపవంతుడును, మహాబలుడును, నగు రాముడయ్యింద్రజిత్తు నిలిచియున్నచోటును దెలిసికొనుటకు వానరయూథముల కధిపతులగు సుషేణుని దాయాదులనిరువురను, నీలుని, ప్లవగర్షభుని, అంగదుని, వాలిపుత్రుడగు నంగదుని, అతిబలవంతుడగు శరభుని, మిగులవినయసంపదగల జాంబవంతుని, మహాబలుడగు సానుప్రస్థుని, ఎద్దుయొక్క మూపురమువంటి మూపురముగల ఋషభుని, నియమించె. అంతట నావానరవీరులందఱును మిగులభయంకరములగు వృక్షములను జేతబూని దశదిక్కులను వెదకుచు నాకాశమునందు బ్రవేశించిరి. ఆసమయమునందు దివ్యాస్త్రవేత్తయగు నయ్యింద్రజిత్తు మిగుల వేగముగల బాణములచేత నావానరులయొక్క వేగమును నివారించె. మఱియు ననేకములగు దివ్యాస్త్రములను బ్రయోగించె. భయంకరమగు వేగముగల యావానరులు ఆయింద్రజిత్తుయొక్క బాణములచేత నధికముగ గొట్టబడిన దేహముగలవారై యంధకారముచేత నావృతుడైయున్న యాయింద్రజిత్తును, మేఘములచేత నావృతుడైన సూర్యునిజూచినవిధముగ జూచిరి. మఱియు యుద్ధములయందెప్పుడును జయమునే పొందునట్టి యాయింద్రజిత్తు రామలక్ష్మణులయొక్క శరీరమును బ్రద్దలుసేయునట్టి బాణములనే యధికముగ బ్రయోగించె. మఱియును గోపయుక్తుడగు నయ్యింద్రజిత్తు సర్వాకారములును, మిగుల దీక్ష్ణములును నగు బాణములచేత నన్నదమ్ములును, వీరులును, నగు రామలక్ష్మణుల అవయవములయందంతటను దట్టముగ గొట్టె. ఆసమయమునందు దమశరీరమునందలి రక్తప్రవాహముతో గూడుకొనిన రామలక్ష్మణులిరువురును బూచిన మోదుగులవలెనుండిరి. పిమ్మట ప్రాంతభాగములయందెఱ్ఱగనుండు నేత్రములుగలవాడును, కాటుకకొండతో సమానమగు దేహముగలవాడును, రావణాసురునకు బుత్రుడును, నగు నయ్యింద్రజిత్తు కనబడకయుండియే యన్నదమ్ములగు నారామలక్ష్మణులతో నిట్లనియె. ఓరామలక్ష్మణులారా! యుద్ధమును జేయుచున్నవాడు కనబడకయుండెనేని యింద్రుడుగూడ జయింపజాలడు. ఇకనుమీరు జయింపజాలరనుటనుగుఱించి నేను విశేషముగ జెప్పవలయునా? మఱియు నోరామలక్ష్మణులారా! అన్నదమ్ములగు మిమ్ముల గంకపత్రములుగల బాణములచేత బాధించెదను. వానరులనందఱిని యమలోకమునకు బంపెదనని చెప్పి ధర్మజ్ఞులును, అన్నదమ్ములును, నగు రామలక్ష్మణులను దీక్ష్ణములగు బాణములచేత బాధించి మిగుల నానందముగలవాడై సింహనాదముజేసె. మఱియును గాటుకకొండవలెనల్లని దేహచ్ఛాయగలవాడగు నింద్రజిత్తు ధనుస్సునధికముగ నాకర్షించి మిగుల గొప్పదగు నాయుద్ధమునందు భయంకరములగు బాణములను మాటిమాటికిని అపరిమితముగ బ్రయోగించె. మఱియును వీరుడును మర్మజ్ఞుడునునగు నయ్యింద్రజిత్తు తీక్ష్ణములగు బాణములను బ్రయోగించి రామలక్ష్మణులయొక్క మర్మస్థానములను బగులగొట్టి యతిభయంకరముగ సింహనాదమును జేసె. ఆయుద్ధమునందు క్షణమాత్రములో శరబంధముచేత గట్టబడినవారైన యారామలక్ష్మణులిట్టునట్టు చూచుటకుగూడ శక్తిలేనివారైరి. మఱియును బాణములచేత బ్రద్దలుసేయబడిన యవయవములుగలవారును, బాణములచేత గ్రుచ్చబడినశరీరముగలవారును, నగు నారామలక్ష్మణులిరువురును దారములేని యింద్రధ్వజములవలె బ్రకాశించిరి. మర్మస్థానములయందు దెబ్బలుదగులుటచేత గంపమును బొందుచున్న యవయవములుగలవారును, మర్మస్థానములు భేదముసైయుండుటచేత నధికముగ బీడనొందుచున్నవారును, గొప్పవగు ధనుస్సులుగలవారును, భూమికి బ్రభువులు, నగు నారామలక్ష్మణులు దాళజాలక భూమియందు బడిరి. వీరులగు నారామలక్ష్మణులిరువురును నావీరశయ్యయందు నెత్తురుచేత వ్యాప్తమైన శరీరముగలవారును, బాణములచేత వ్యాప్తమైన సర్వావయవములును గలవారును, మిగుల దుఃఖమును బొందినవారును నై పడియుండిరి. ఆరామలక్ష్మణులయొక్క శరీరములయందు వ్రేలుపెట్టుటకుగూడ సందులేక బాణములు గ్రుచ్చబడియుండె. పాదాదికేశాంతమువఱకును గ్రూరములగు బాణములచేత గొట్టబడనిచోటు లేనిదయ్యె. క్రూరుడును, కామరూపియును, నగు నయ్యింద్రజిత్తుచేత గొట్టబడిన దేహములుగల యారామలక్ష్మణులు ప్రస్రవణాచలము లుదకమును మెండుగ ప్రవింపజేసినవిధముగ రక్తమును స్రవించుచుండిరి. మర్మస్థానములయందు బాణములచేత గొట్టబడినశరీరముగల రాముడు, పూర్వము ఆయింద్రజిత్తుచేతనే కొట్టబడి దేవేంద్రుడు క్రిందబడిన విధముగ గ్రిందబడియె. మఱియు బంగారపు పిడులుగలవియును, మిగుల దీక్ష్ణములగు నగ్రభాగములుగలవియును, గాలిచేత నెగురగొట్టబడిన దుమ్మువలె వ్యాపించునట్టి స్వభావ

ముగలవియును, దోసిలియొక్క యాకారమువంటియాకారముగలవియును, మఱియు నానావిధములైనవియును, నగు బాణములచేతఁగొట్టబడిన శరీరముగల రాముడు ధనుస్సునుబట్టుకొని వీరశయ్యయందు బడియుండె. మఱియును భిన్నమైన ముష్టిప్రదేశముగలవాడును, వీడిపోయిననారిగల బాణమునుబట్టుకొని వీరశయ్యయందు బడియున్నవాడును, నగు రామునిజూచి లక్ష్మణుడు రాముడు యిక జీవింపడని తలంపుగలవాడయ్యె. మఱియును బద్మపత్రమువంటి నేత్రములుగలవాడును, శరబంధముచేత గొట్టబడినశరీరముగలవాడును, భూమియందుబడియున్నవాడును, నగు రాముని గురించిదుఃఖమునుబొందె. వానరులును, ఆరామునిజూచి యధికమగు సంతాపమునుబొందిరి, మఱియును వీరులును, బాణములచేత నపరిమితముగగొట్టబడిన శరీరముగలవారును, వీరశయ్యయందు బరున్నవారును నగు నారామలక్ష్మణులను జుట్టుకొని వాయుదేవునకు బుత్రుడగు హనుమంతుడు మొదలగు వానరులు మిగుల సంతాపమునుబొందిరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి నలుబదైదవ సర్గము ముగిసెను.

రామలక్ష్మణులు జచ్చిరనివ్యసనపడుచున్న వానరులకు విభీషణుడు ధైర్యముజెప్పుట.

అంతట వానరులందఱును భూమ్యంతరిక్షములను జూచుచు బాణములచేతవ్యాప్తమైనశరీరముగలవారును, అన్నదమ్ములును, నగు రామలక్ష్మణులనుజూచిరి. ఆసమయమునందు భయంకరమగు వ్యాపారముగల యింద్రజిత్తు ఆవిధముగా వ్యాపారమునుజేసి "వర్షించినపిమ్మట నింద్రుడూరకుండువిధముగ" నూరకుండె. అప్పుడచ్చోటునకు సుగ్రీవునితోగూడ విభీషణుడువిచ్చేసె. ఆసమయమునందు నీలద్వివిదమైందులును, సుషేణ, కుముదాంగదులును, హనుమంతునితోగూడ రామలక్ష్మణులనుగురించి యధికముగదుఃఖమును బొందిరి. ఆసమయమునందు చేష్టారహితులును, మెల్లమెల్లని నిట్టూర్పులుగలవారును, నెత్తురుప్రవాహముచేతవ్యాప్తమైనశరీరములుగలవారును, బాణపరంపరలచేత వ్యాప్తమైనవారును, వీరశయ్యయందు బరున్నవారును, స్తబ్ధులైయున్నవారును, సర్పములవలెనిట్టూర్పులనువిడుచుచున్నవారును, మదమైనపరాక్రమముగలవారును, నెత్తురుయొక్కప్రవాహముచేత బూయబడిన అవయవములుగలవారలును, తాపనీయములగు ధ్వజములవలెనున్నవారును, వానరయూథములచేత జుట్టుకొనబడియున్నవారును, బాణజాలములచేత వ్యాప్తమైనదేహముగలవారును, నగు రామలక్ష్మణులనుజూచి విభీషణునితోగూడి వానరులందఱును నధికమగు వ్యసనముగలవారైరి. మఱియు నావానరులందఱును నాకాశమును, మఱియునితరములగు దిక్కులనుజూచుచున్నవారలగుచు మాయచేతగప్పబడియున్న యుద్ధమునందు మిగులసమర్థుడగు నింద్రజిత్తును జూడలేకపోయిరి. ఆసమయమునందు మాయచేతదాగియున్నవాడును, తన యన్నకుమారుడును, నగు నింద్రజిత్తును విభీషణుడుమాత్రము మాయాతంత్రములనెఱిగినవాడగుటచేత జూచె. విభీషణుడు, వరదానమహిమచేత నిరుపమానమగు వ్యాపారములుగలవాడును, సామ్యములేనివాడును, మాయచేతసంతర్హితుడై యున్నవాడును, వీరుడును, తేజోవిక్రమకీర్తులతోగూడుకొన్నవాడును, నగు నింద్రజిత్తునుజూచి యత్యాశ్చర్యమునుబొందె. అంతటనాయింద్రజిత్తు తనయొక్కవ్యాపారమును, వీరశయ్యయందుబరున్న రామలక్ష్మణులనుజూచియధికమగుసంతోషముగలవాడగుచు దనసమీపమునందున్న రాక్షసులనందఱజూచి యిట్లనియె, రాక్షసోత్తములారా! ఖరదూషణులను సంహరించినవారును, మహాబలవంతులును, నాబాణములచేతగొట్టబడినవారును, అన్నదమ్ములును, నగు రామలక్ష్మణులను, ఈశరబంధమునుండి యెవ్వరును విడిపింపజాలరు. మఱియు దేవదానవులును, ఋషులుమొదలగువారును మఱియు ముల్లోకములలోనివారును, నొక్కటిగాజేరి ప్రయత్నించినను, ఈరామలక్ష్మణులను విడిపింపజాలరు. ఈరామలక్ష్మణుల పరాక్రమమునుగుఱించివ్యసనమునుబొందుచున్నటుటచేత అవయవములను శయ్యయందు జేర్పలేకవ్యసనమును బొందుచున్నవాడును, నాకు దండ్రియునునగు రావణాసురునకు రాత్రియంతయునుమిగుల కఠినముగ గడచిపోవుచున్నది. మఱియు నీరామలక్ష్మణులమూలకముగ లంకాపట్టణమంతయు వర్షాకాలమునందలినది వలెనాకులమైయున్నది. ఇట్టిరామలక్ష్మణులనిరువురంజంపి సకలరాక్షసులకును గలిగియున్న కష్టములనదొలగించితిని. మఱియునో రాక్షసులారా! రామలక్ష్మణులయొక్కయు, సకలవానరులయొక్కయు బరాక్రమమును శరత్కాలమునందలి మేఘములవలె నిష్ఫలములయ్యె. అనియిట్లుయింద్రజిత్తు తనసమీపమునందు సంచరించుచున్న రాక్షసులతో నివ్విధముగాజెప్పి పిమ్మట వానరయూథాధిపతులనందఱను నానావిధములబాధించె. అంతటనీలమైందద్వివిదులనుదొమ్మిదేసిబాణములచేతగొట్టె. అంతట నూరకుండక శత్రునాశకుడగు నయ్యింద్రజిత్తు మఱియును మూడేసిబాణములచేతగొట్టె. అంతటగొప్పదగు ధనుస్సుగలయింద్రజిత్తుమిగుల దీక్ష్ణముగనొక్కబాణముచేత జాంబవంతునివక్ష

స్థ్సలముబ్రద్దలగునట్లుగొట్టె. పిమ్మటమిగులవేగముగహనుమంతునికొఱకు బదిబాణములబ్రయోగించె. అపరిమితముగు తేజస్సుగలగవాక్షుశరభులను మహావేగముగల యింద్రజిత్తు రెండేసిబాణములచేతగొట్టె. అంతటనాయింద్రజిత్తు మిగులద్వరగలవాడై గోలాంగూలేశ్వరుడును, వాలికిబుత్రుడును, నగు అంగదునిమీదననేకాస్త్రములనుబ్రయోగిం- ఇవ్విధముగ నయ్యింద్రజిత్తునిప్పులతో సమానములగు బాణములచేత వానరులనందఱునుబాధించి యతిభయముగలుగునట్లు సింహనాదమునుజేసె. మహాబాహువగు నింద్రజిత్తు మిగులదీక్ష్ణములగుబాణములచేత వానరులనందఱునుబాధించి వెరవుగలుగునట్లు సేసి యిట్లనియె.

ఓ రాక్షసోత్తములారా! నేనీయుద్ధరంగమునందు రామలక్ష్మణులను మిగులభయంకరమగు శరబంధముచేతబంధించితిని. చూడుడనియె. ఇవ్విధముగా నింద్రజిత్తుచెప్పిన మాటనువిని కపటయుద్ధమునుజేయునట్టి రాక్షసులందఱు నునింద్రజిత్తుయొక్క కర్మచేత నధికమగు సంతోషముగలవారై యధికమగునాశ్చర్యమునుబొందిరి. మఱియును మేఘములతో సమానులగు రాక్షసులందఱును గొప్పధ్వనిగలుగునట్లుగా సింహనాదములనుజేసిరి. మఱియు రాముడు చంపబడెననితలచియింద్రజిత్తును మిగులగౌరవముతో బూజించిరి. భూమియందునిట్టూర్పులులేక గదలకక్రింపబడియున్న రామలక్ష్మణులనుజూచి రెల్లవారును నాశ్చర్యమును బొందిరి. అంతటనింద్రజిత్తుయుద్ధమునందు జయముగలవాడగుటచేత నధికమగుసంతోషముగలవాడగుచు రాక్షసులకందఱకును సంతోషమునుగలుగజేయుచు లంకాపట్టణములోనికిబోయె. అప్పుడుబాణములచేత వ్యాప్తములైయున్న రామలక్ష్మణులయొక్క సర్వావయవములనుజూచి సుగ్రీవుడధికముగభయమునుబొందె. అవ్విధముగ భయమును బొందుచున్న సుగ్రీవునితో విభీషణుడిట్లనియె.

వానరోత్తముడా! సుగ్రీవుడా! కన్నీళ్ళతోగూడుకొనినవాడవును, దీనుడవును, వ్యాకులమైన నేత్రములుగలవాడవునునై నీవువ్యసనమునుబొందుటవలన బ్రయోజనమేమి? వ్యసనమునువిడిచిపెట్టుము. మఱియునోసుగ్రీవుడా! ఇటువంటియుద్ధములు సహజముగాజయమునుగలుగజేయవు. వీరుడవైనయోసుగ్రీవుడా! ఇంద్రజిత్తుయుద్ధమునుజేసి యింతటితోబోవుటచేత మనకదృష్టముగలుగగలదు. మహాత్ములును, మహానుభావులును, నగు నీరామలక్ష్మణులుమోహమునుబొందియున్నారు. ఈమోహమును విడిచిపెట్టగలము. ఆత్మనుస్థిరమైనదానినిగాజేయుము. వానరోత్తముడవైనయోసుగ్రీవుడా! దిక్కులేనివాడనగు నన్నుగాపాడుము. సత్యమునందును, ధర్మమునందును, నాసక్తిగలవారలకుమృత్యువువలన భయముగలుగనేరదనియె. ఇవ్విధముగాజెప్పియావిభీషణుడువ్యసనమునుబొందుచున్న సుగ్రీవునియొక్కనేత్రములను ఉదకముచేతదుడిచె. మఱియును ధర్మాత్ముడగు నావిభీషణుడు ఉదకముచేతబట్టుకొనిజపమును జేసి సుగ్రీవునినేత్రములనుదుడిచె. అవ్విధముగ బుద్ధిమంతుడును, వానరోత్తముడును నగు సుగ్రీవుని ముఖమునుదుడిచి యాకాలమునకు దగినమాటనుజెప్పదలచి యిట్లనియె.

వానరోత్తముడవైన యోసుగ్రీవుడా! ఈకాలముదుఃఖమునుబొందుట కుచితమైనదిగాదు. అధికమగుస్నేహము అకాలమునందు మరణముగలుగునని యెదుట తలంపును గలిగించును. కాబట్టినీవుసకలకార్యనాశకమగు వ్యసనమును విడిచిపెట్టుము. రామునకుముందుగ సంచరించునట్టివానరులకుహితమగు కార్యమునుగురించి యోచింపుము. మఱియునోసుగ్రీవుడా! రామునకుమరల తెలివివచ్చువఱకును నీవానరసైన్యమునుసర్వమునుగాపాడుము. ఈరామలక్ష్మణులిప్పుడు లబ్ధమైనసంజ్ఞలుగలవారై యున్నారు. కాబట్టి మనకిదివ్యసనమునుబొందుటకు దగినకాలముగాదు. రామునకేమియునుగీడు రానేరదు. రాముడుమరణమునుబొందదగియుండలేదు. ఈరామునిముఖమునందు ఆయుర్హీనులగు వారిముఖమునందున్నవిధముగ గాంతియుండలేదు. కాబట్టి మనసైన్యమును సర్వమునునోదార్చికొనుము. నీయాత్మను నోదార్చికొనుము. మరలమనకార్యములన్నిటిని ఒకటిగ జేసికొనగలము. వికసితమైననేత్రములుగల యీవానరులందఱునునిప్పుడుగలిగినయుపద్రవముచేత నధికమైనభయముగలవారై మిగులవేగముతో బరుగెత్తుకొనివచ్చుచున్న నన్నుజూచిపలాయనమునుజేయుటయుచితమని యొకరితో నొకరు రహస్యముగ మాటలాడుకొనుచున్నారు. మనసైన్యమంతయును బరుగెత్తిపోయెనేని మనముఏకార్యమును జేయజాలము. కాబట్టియోసుగ్రీవుడా! నీవుధైర్యమునవలంబించి యీవానరసైన్యమును సర్వమునునోదార్పుము. ఇవ్విధముగజేసితివేని వానరులందఱును భయమునువదలియెప్పటివలెనుండగలరనిచెప్పి రాక్షసోత్తముడగు విభీషణుడుసుగ్రీవునినోదార్చె. పిమ్మటబరుగెత్తుచున్న వానరసైన్యమును సర్వమునునూరార్చె. ఆసమయమునందు, మహామాయగలవాడును, సకలవిధసైన్యముగలవాడును, నగు నింద్రజిత్తు లంకాపట్టణమునందు బ్రవేశించి తండ్రియగురావణాసురునిసమీపమునకుబోయె. పోయిసింహాసనమునందుగూర్చున్న రావణాసురునకు నమస్కరించి నమస్కారగ

మునుజేసి రామలక్ష్మణులు మరణమునుబొందిరని ప్రియముగలుగునట్లుసెప్పె. అంతటనారావణాసురుడు పరమానందముతోనగిరిదుమికి పుత్రునిగౌగలించుకొని యిట్లనియె.

ఓపుత్రుడా! ఇంద్రజిత్తా! మనకుశత్రువులగు రామలక్ష్మణులనుజంపి నాకుబరమానందమును గలుగజేసితివనిచెప్పియధికమగు ప్రియముతోగూడుకొనినమనస్సుగలవాడైపుత్రుడగునింద్రజిత్తుయొక్క శిరస్సునముద్దుపెట్టికొని జరిగిన వృత్తాంతమునుసర్వమునుసమగ్రముగజెప్పుమనియె. అంతటనయ్యింద్రజిత్తు జరిగినవృత్తాంతమునుసర్వమును జెప్పి శరబంధముచేత రామలక్ష్మణులుబంధింపబడి తేజోరహితులైయున్నారనియె. అవ్విధముగామహారథుడగునింద్రజిత్తుచెప్పినమాటలనువిని రావణాసురుడుహర్షవేగములతోగూడుకొనినయంతరాత్మగలవాడై దశరథమహారాజునకు బుత్రుడగు రామునివలన గలిగిన పరితాపమునువదలి శ్లాఘించె.

శ్రీమద్యుద్ధకాండమునందలి నలుబదారవసర్గము గిసెను.

--(*)--

{రామలక్ష్మణులుజచ్చిరనిదలంచినరావణాసురుడు మూర్ఛపోయినరామలక్ష్మణులనుసీతకుజూపించుట.}

అవ్విధముగనింద్రజిత్తుయుద్ధమునందు జేయదగినకార్యమునుజేసి లంకాపట్టణమునకుబోయినపిమ్మట వానరోత్తములందఱును రామునకుజుట్టునుగూర్చుండి యధికమగు దుఃఖముగలవారైయుండిరి. మఱియు నాసమయమునం దుహనుమంతుడును, అంగదుడును, నలుడును, సుషేణుడును, కుముదుడును, నలుడును, గజుడును, గవాక్షుడును, గవయుడును, గంధమాదనుడును, జాంబవంతుడును, వృషభముయొక్కమూపురమువంటి మూపురముగల రంభుడును, శతవలియును, పృథువనువాడును, మఱియునితరులగువానరాధిపతులును, వానరసేనలును, వృక్షములను బట్టుకొని సకలదిక్కులను జూచిరి. పిమ్మట నూర్ధ్వాధోదిక్కులనుజూచిరి. మఱియువారందఱును తృణములుగదలినను రాక్షసులువచ్చిరని భయపడుచుచూచుచుండిరి. ఆసమయమునందు రావణాసురుడు లంకాపట్టణములోపల మిగులసంతోషముగలవాడై పుత్రుడగునింద్రజిత్తునుబంపి సీతను రక్షించునట్టిరాక్షసస్త్రీలనుబిలిపించె. అంతటనారావణాసురునియాజ్ఞాప్రకారముగ త్రిజటమొదలుగాగల రాక్షసస్త్రీలందఱునువచ్చిరి. అప్పుడు రావణాసురుడు మిగులసంతోషముగలవాడై యారాక్షసస్త్రీలతోనిట్లనియె.

ఓరాక్షసస్త్రీలారా! సీతయెవరియొక్క యాశ్రయబలముచేతగర్వించి నన్నుబొందకయున్నదో, అట్టిరామలక్ష్మణులుఇంద్రజిత్తుచేత జంపబడిరనిచెప్పి యారామలక్ష్మణులనుజూపుడు. రామలక్ష్మణులను జూపించుటకు సీతనుబుష్పకముమీదనెక్కించుకొనిపొండు. ఆసీతయెవ్వానిసహాయముచేత గర్వించియున్నదో తెలియదు. ఆసీతయొక్క భర్తయగురాముడుతమ్మునితోగూడ యుద్ధమునందు జంపబడెనుగదా? కావుననికమీదట సీతశంకారహితమైనదియును, ఉద్వేగరహితమైనదియును, నిరపేక్షురాలును, సర్వాభరణభూషితురాలునునై నన్నుబొందగలదు. ఇప్పుడాసీత, యుద్ధమునందుగాలవశమునుబొందినవాడును, తమ్మునితోగూడుకొనినవాడును, నగు రామునిజూచికొంచెమైననితరవిషయమునందాశలేనిదియును, వేరొకగతిలేనిదియును, అపేక్షారహితమైనదియును, విశాలములైననేత్రములుగలదియును, నైస్వయముగానే నన్నుబొందగలదని చెప్పె. అంతదురాత్ముడగు రావణాసురునియొక్కవాక్యమునువిని రాక్షసస్త్రీలందఱును, పుష్పకమున్నచోటునకుబోయిరి. అంతటనారాక్షసస్త్రీలందఱును రావణాసురునియొక్కయాజ్ఞానుసారముగ బుష్పకమునుగ్రహించి సీతాదేవియున్న యశోకవనములోనికిబోయిరి. అంతటనారాక్షసస్త్రీలందఱును, భర్తయొక్కదుఃఖముచేత బరాజితురాలును, వ్యసనమునుబొందుచున్నదియును, నగు సీతను బుష్పకవిమానముమీదనెక్కించిరి. అవ్విధముగ త్రిజటతోగూడసీతనుబుష్పకముమీదనెక్కించి యాసీతకురామలక్ష్మణులనుబూపించుటకొఱకుబయలువెడలిరి. ఆసమయమునందులంకాధిపతియగు రావణాసురుడు లంకాపట్టణమునుపతాకాధ్వజమాలికలుగలదానినిగాజేసె. మఱియును నధికముగసంతోషముగలవాడయ్యె. మఱియునులంకాపట్టణమునందంతటనుసంతోషకరములగు ధ్వనులచేత నింద్రజిత్తు రామలక్ష్మణులనుజంపెనని చాటింపునుజేయించె. అప్పుడు విమానమునందుగూర్చుండి సీతత్రిజటతోగూడ జంపబడియున్నవానరసైన్యమును సర్వమునుజూచె. మఱియును మాంసమునుభుజించువారును, సంతోషించిన మనస్సుగలవారును, నగు రాక్షసులనుజూచె. అంతటరామలక్ష్మణులయొక్కపార్శ్వభాగములయందు దుఃఖార్తులైకూర్చున్న వానరవీరులనుజూచె. పిమ్మటశరతల్పమునందు బరున్నవారును, స్పృహలేకయున్నవారును, బాణములచేతబీడింపబడియున్నవారును, నగు రామలక్ష్మణులనుజూచె. ఆరామలక్ష్మణులుభిన్నములగు కవచములుగలవారును, బాణములచేతగ్రుచ్చబడియున్నవారును, బాణములచేత ఛేదింపబడిన సర్వావయవములునుగలవారును, బాణస్తంబము

యులును, నై యుండిరి. మఱియును వీరులును, పురుషోత్తములును, అన్నదమ్ములును, తామరపువ్వులవంటి నేత్రములుగలవారును, శరతల్పములయందు బరున్నవారును, నగు రామలక్ష్మణులను బూచి యాసీతాదేవి యధికమైనదుఃఖముగలదై విలపించెను. మఱియును తెల్లని నేత్రములు గలదియును, నిగూఢమైనయవయవములుగలదియును, నగు నాసీతాదేవి దుమ్ముసందుబొర్లి గింతలను బెట్టుచున్న రామలక్ష్మణులనుజూచి యపరిమితముగ దుఃఖమునుబొందెను. దేవతలయొక్క ప్రభావముతోసమానమైన ప్రభావముగలవారును, అన్నదమ్ములును, నగు రామలక్ష్మణులనుజూచి కన్నీళ్లతోగూడిన దుఃఖముచేత గొట్టబడినదై యారామలక్ష్మణులయొక్క మరణమునుగురించి యోచించుచు నధికమైన దుఃఖముగలదై యిట్లనియె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి నలుబదేడవ సర్గ ముగిసెను.

రాముడు మరణమును బొందలేదని త్రిజట సీతాదేవికి ధైర్యమును జెప్పుట.

అప్పుడు యుద్ధరంగమునందు జంపబడియున్న భర్తను, మహాబలుడగు లక్ష్మణుని, బూచి సీతాదేవి దుఃఖముచేత బీడింపబడినదై యధికముగ దుఃఖమునుబొందెను. అట్లు దుఃఖమునుబొందుచు నాసీత యిట్లనియె. లక్షణశాస్త్రమును జక్కగా దెలిసిన పండితులు నేను పుత్రవతి నగుదుననియును, వైధవ్యమును బొందననియును దృఢముగా జెప్పిరి. ఇప్పుడే యుద్ధరంగమునందు రాముడు చంపబడుటచేత వారందఱును అసత్యముగ మాటలాడువారలైరి. సోమయాజులును, సత్రయాగములను జేసిన వారును, నగు మహాత్ములు నన్ను రాజపత్నినిగాను, సోమపానమును జేసినదానను అగుదునని చెప్పిరి. వారిమాటలుగూడ నసత్యములయ్యె. అనేకులగు జ్యోతిష్కులు నాయందు శుభలక్షణము లనేకములుండుటచేత నేను సర్వకాలములయందును మంగళములు గలదాననై యుందునని చెప్పిరి. ఇప్పుడు రాముడీయుద్ధరంగమునందు మరణమును బొందుటచేత ఆవచనములన్నియును నసత్యములయ్యె. మఱికొందఱగు లక్షణవేత్తలు నన్ను వీరభార్యనుగా జెప్పిరి. ఇప్పుడు రాముడు యుద్ధమునందు మరణమును బొందుటచేత వారందఱు నసత్యమును మాటలాడువారైరి. పాదములయందు పద్మాకారములగు రేఖలుగల స్త్రీలు భర్తలతోగూడ రాజ్యాభిషిక్తులగుదురని చెప్పుదురు. నాపాదములయందనేకములగు పద్మాకారరేఖలు గనబడుచున్నవి. నాకిట్టి దుర్దశపట్టుటకు గారణము తెలియదయ్యె. మఱియును వైధవ్యమును బొందునట్టి స్త్రీలయందెట్టి దుర్లక్షణములుగలవో యట్టి దుర్లక్షణములు నాయందేమియును లేవు. నాకిట్టి దుర్దశపట్టుటకు గారణమేమి. మఱియు శుభాశుభలక్షణములను బోధించునట్టి శాస్త్రములు పద్మాకారములగు రేఖలు పాదములయందుగల స్త్రీలు తప్పక సౌఖ్యములను బొందుదురని బోధించుచున్నవి. అట్టిశాస్త్రములన్నియును నిప్పుడు వ్యర్థములగుటకు గారణమేమియోగదా? మఱియు నాతలవెండ్రుకలన్నియును, సూక్ష్మములును, సమములును, నల్లనివియును నైయున్నవి. మఱియు నాకనుబొమలు విడివిడిగానున్నవి. నాపిక్కలు గుండ్రములును, రోమరహితములును నై యున్నవి. మఱియు నాదంతములు మిగుల దట్టముగా గదిసికొనియున్నవి. మఱియు నానేత్రోపాంతప్రదేశములును, నేత్రములును, హస్తములును, పాదములును, పిక్కలును, తొడలును, శుభలక్షణములుగలవై యున్నవి. నాగోళ్లు గుండ్రముగానున్నవి. మఱియు మృదువులై యున్నవి. ఇంతయగాక నాయంగుళములు సమానములై యున్నవి. మఱియు నాస్తనములు విరళములుగాక చక్కగా బలిసియున్నవి. మఱియు నాస్తనములయందలి చూచుకములు మగ్నములై యున్నవి. పార్శ్వోరస్కములు మిగులనున్నతములై యున్నవి. నానాభి మిగుల లోతుగనున్నది. నాదేహచ్ఛాయ మణియొక్కవర్ణమువలె నున్నది. అంగరుహములన్నియును మృదువులై యున్నవి. నాపాదతలములును, అంగుళములును భూప్రదేశమునందు తాకుచున్నవి. మఱియు నాయందనేకములగు శుభలక్షణములు గలిగి యున్నవి. మఱియు నాపాదములయందు సంపూర్ణమగు యవాకారరేఖలున్నవి. పాణియును, పాదమును, ఛిద్రములు లేనివై యున్నవి. మఱియు నాకాలుసేతులెఱ్ఱనివర్ణము గలవై యున్నవి. మఱియు నాయందు మందమగు నవ్వుగలదు. ఇవ్విధముగ కన్యాలక్షణవేత్తలగు బ్రాహ్మణోత్తములు చెప్పిరి. మఱియును జ్యోతిష్కులలో నుత్తములగువారు నేను భర్తతోగూడ బట్టాభిషిక్తురాలనగుదునని చెప్పిరి. అట్టివచనము లిప్పుడు వ్యర్థములయ్యె. అయ్యో రామలక్ష్మణులు జనస్థానము నందంతటను దిరిగి సకలదేశములయందును బ్రవృత్తినిబొందిరి. మఱియు నారామలక్ష్మణులు దాటశక్యముగాని సముద్రమునుదాటి తుదకు గోష్పదమునందు మరణమును బొందిరి. అయ్యో వారుణాస్త్రము, ఆగ్నేయాస్త్రము, ఐంద్రాస్త్రము, వాయవ్యాస్త్రము, బ్రహ్మశిరోనామకాస్త్రము, మొదలుగాగల యస్త్రములు రామలక్ష్మణులకు జ్ఞప్తికిరాలేదు కాబోలు. అయ్యో!

కసటుడకయుద్ధమును జేయుచున్న యుగ్రదంష్ట్రమాయచేత జేతత్రసనితో సమానులగు రామలక్ష్మణులను సంహరించె. హా ప్రాణనాథా! నేనిక దిక్కు-లేనిదాననైతిని. యుద్ధమునందు రఘుకులోద్భవుడగు రాముని దృష్టి మార్గమును బొందిన శత్రుడెవ్వడును బ్రతికినవాడుగాడు. రామునకు మనోజవ మున్నరొండల శత్రుడెవ్వడును జీవింప జాలడు. యుద్ధమునందు దమ్మునితోగూడ రాముడు మరణమునుబొందుటనుజూడగా దైవమునకు శక్యముగాని పనియేదియును లేదని తోచుచున్నది. నేను మహాబలులగు రామలక్ష్మణుల నుగురించి వ్యసనమును బొందలేదు. నేను నన్నుగురించియును, నా తల్లినిగుఱించియును, వ్యసనమును బొందదము లేదు. దీనురాలగు మాయత్తను, గౌసల్యాదేవిని గురించి యధికముగ వ్యసనమును బొందెదను. పూజ్యురాలగు నాకౌసల్యాదేవి సర్వకాలములయందును, వనవాసవ్రతమును సమాప్తినొందించి సీతాలక్ష్మణులతోగూడ వచ్చిన రామలక్ష్మణుల నెప్పుడుచూతునా, యనివ్యసనమునుబొందుచుండును. కావున నేనామహాదేవిని గుఱించి వ్యసనమును బొందెదనని యధికముగ వ్యసనమును బొందుచుండె. ఇవ్విధముగా వ్యసనమును బొందుచున్న యాసీతాదేవితో త్రిజటయను రాక్షసస్త్రీ యిట్లనియె.

అమ్మా! సీతాదేవి! నీవువ్యసనమును బొందకుము. నీ భర్తయగు రాముడు జీవించుచున్నాడు. రాముడు బ్రదుకుటకు దగినవియును, మిగులగొప్పవియును, నగు కారణములనేకములు గనబడుచున్నవి. మఱియునోసీతాదేవీ! అన్నదమ్ములగు నీ రామలక్ష్మణులు జీవించుచున్నారు. మఱియునోసీతా! నీభర్తయగు రాముడు యుద్ధభూమియందు బడియుండుటచేత వానరయూథాధిపతు లందఱి యొక్కయు, ముఖములు గోపపరీతములును, హర్షపర్యుత్సుకములునునైయున్నవి. మఱియునోసీతా! ఈరామలక్ష్మణులు నిజముగ మరణమునుబొంది యుండిరేని పుష్పకమను పేరుగలదియును, దివ్యమైనదియునునగు నీవిమానమివ్విధముగా నిలిచి యుండదు. మఱియునోసీతా! ఈవానరసైన్యమంతయును నిప్పుడు సముద్రమునందు జుక్కానిలేని యోడవలెబోయిన యుత్సాహముగలదియును, ఉద్యోగరహితమైనదియును, హతమైనవీరప్రధానులు గలదియును నైయుండి యుద్ధభూమియందు సంచరించుచున్నట్లు కనబడుచున్నది. ఇవ్విధముగ గనబడుచున్న యీవానర సైన్యమంతయును ఉద్వేగములేనిదియును, బలముగలదియును, కకుత్స్థవంశజుల ముందుబుట్టిన రామలక్ష్మణులను గాపాడుచున్నది. తవిషయమునునీయందలి ప్రియముచేత జెప్పితిని. కాబట్టి నీవీ శుభనిమిత్తములచేత నీవు ధైర్యమునవలంబింపుము. రామలక్ష్మణులు యీయుద్ధమునందు జంపబడలేదు. నేను నీయందలి స్నేహముచేత నవ్విధముగ బలుకుచున్నదానను. ఇదివఱకెన్నడును నీతోనబద్ధపు పచనములను జెప్పియుండలేదుగదా? నీవు సచ్చరిత్రలు గలదానవగుటవలన నీయందధికమగు ప్రియముగలదాననైతిని. ఈరామలక్ష్మణులను దేవదానవులందఱును నొక్కటిగగూడి యుద్ధమునుజేసియును సంహరింపజాలరు. అనినామనస్సున దృఢముగ దోచుచున్నది. మఱియునోసీతా! నీకింకొకగుర్తును జూపెదను. చూడుము. ఈరామలక్ష్మణులు యిరువురును జ్ఞప్తిలేక భూమియందు బడియున్నను వీరియందలి కాంతి లక్ష్మి యింతవఱకు వదలిపోలేదు. మఱియు నోసీతా! ఈలోకమునందు మృతినొందినవారలయొక్కయును, మరణమును బొందబోవుచున్న వారియొక్కయు ముఖములయందు వికారమగుకాంతి కనబడును. అట్టికాంతి యీరామలక్ష్మణుల ముఖములయందు గనబడుటలేదు. జనకచక్రవర్తి పుత్రికవైన యోసీతా! శోకమోహదుఃఖములనువిడిచిపెట్టుము. రామలక్ష్మణులు మూర్ఛనొంది యున్నారుగాని మరణమునుబొంది యుండలేదు. ఈరామలక్ష్మణులు మరణమునుబొందినారనితలచి నీవు మరణమునుబొందుట యుచితముగాదనియె. ఇవ్విధముగా బలుకుచున్న త్రిజటయొక్క వాక్యములనువిని దేవతాంగనతో దుల్యురాలగు సీతాదేవి చేతులుమొగ్గి యోయమ్మా! త్రిజటా! నీవిప్పుడు చెప్పినదంతయును నిజమగుగాక. నాయభీష్టము నెరవేరుగాకయనియె. అంతలోమనోవేగమువంటి వేగముగల యాపుష్పకముమరలె. అప్పుడాసీతాదేవి యాత్రిజటతోగూడ మరల అశోకవనమునకువచ్చె. ఆయశోకవనములోనికివచ్చినపిమ్మట నందలి రాక్షసస్త్రీలతోగూడ పుష్పకమునుదిగి రావణాసురునకు విహారభూమియైనదియును, నానావిధములగు వృక్షములతో నిండియున్నదియునునగు మునుపటి చోటుబ్రవేశించె. పిమ్మట నాసీత రామలక్ష్మణులయొక్క యవస్థను జూచివచ్చినదగుటచేత దలచుకొని యధికమగు దుఃఖమునుబొందె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి నలుబదెనిమిదవ సర్గ ముగిసెను.

—{ రాముడుకొంచెము మూర్ఛదెలిసి చచ్చిపోయిన వానివలెనుండులక్ష్మణునిజూచి విలపించుట. }—

అప్పటికిగూడ మిగులభయంకరమగు శరబంధముచేత బద్ధులగు రామలక్ష్మణులిరువురును సర్పములవలె నిట్టూర్పు

లవిలుచుచున్నవారును, నెత్తురుచేత వ్యాప్తమైనశరీరముగలవారునునై భూమియందుబడియుండిరి. ఆసమయమునందు మహాబలులును. వానరోత్తములును, నగు సుగ్రీవాదులు మహాత్ములగు నారామలక్ష్మణులను జుట్టుకొనిదుఃఖపూరితులై యుండిరి. ఇంతలోపల వీర్యవంతుడగు రాముడుధైర్యముగలవాడును, బలముగలవాడును, నగుటచేత శరబంధమునందు గట్టబడియుండియును మూర్ఛనుండి తేరె. అట్లు మూర్ఛదేరి నెత్తురుచేత వ్యాప్తమైయున్నవాడును, అధికముగువ్యసనమును బొందియున్నవాడును, దీనమైనవదనముగలవాడును, తనకుదమ్ముడును, నగు లక్ష్మణునిజూచి యత్యాతురుడై యధికముగవ్యసనమునుబొందె. అట్లువ్యసనమును బొందుచునిట్లనియె. అయ్యో! ఇకనాకు సీతతోబనియేమి. నేనుజీవించుటవలన బ్రయోజనమేమి? యుద్ధమునందు జచ్చి భూమిపైఁబడియున్న యీతమ్మునిజూచితిని. ఇకనెట్లు జీవింపగలను. ఒకవేళజీవించినను నిరర్థకమైన జీవనముగలవాడనగుదును. కావున నేనుగూడ మరణమునుబొందెదను. ఈమనుష్యలోకమునందు వెదకిచూచినయెడల సీతవంటి యాఁడుదిలభించినను లభించునుగాని లక్ష్మణునివంటి తమ్ముడులభింపడు. మఱియును దమ్ముడగు నీలక్ష్మణుడు నాకు మంత్రియును, నాతోసమానముగ శత్రువధనుచేయువాడునునైయుండె. ఇట్టితమ్మునివదలి నేనుజీవింపజాలను. కాబట్టి యీవానరులందఱునుజూచుచుండగ నాప్రాణములను విడిచిపెట్టెదను. పుత్రునిజూడవలయుననుకోరికగలవారును తల్లులును, నగు కౌసల్యతోడను, కైకతోడను, సుమిత్రతోడను నేనేమనిచెప్పుదును. నిజముగ నీలక్ష్మణుడు మరణమును బొందెనేని నేనేమియును నాతల్లులకుబ్రత్యుత్తరమునుజెప్పజాలనుగనుక మరణమునుబొందెదను. లక్ష్మణుడులేక నేనొంటిగనయోధ్యాపట్టణమునకుబోతినేని చూడలేనియాఁడులేడివలెరోదనమునుజేయుచున్న సుమిత్రాదేవిని నేనెవ్విధముగనోదార్పగలను. నేనులక్ష్మణునితోగూడ నడవికివచ్చితినిగదా? ఇప్పుడు నేనిక్కడ లక్ష్మణునిజంపుకొని యయోధ్యాపట్టణమునకుబోయి లక్ష్మణుడెక్కడనున్నాడని కీర్తివంతులగు భరతశత్రుఘ్నులడిగిరేని నేనేమనిచెప్పగలవాడను. అయ్యయోసుమిత్రాదేవియొక్క యుపాలంభమును నేట్లుసహింపగలను. ఏమియునుజెప్పజాలను. కావుననేనిక్కడనే ప్రాణములనువిడిచిపెట్టెదను. ఛీ నేనెంతపాపపుజన్మగలవాడను. నానిమిత్తముగ బూజ్యుడగు నీలక్ష్మణుడు ప్రాణహీనుడై యుద్ధభూమియందు బడెనని కొంతసేపు దుఃఖించి పిమ్మటలక్ష్మణునుద్దేశించి యిట్లనియె. తమ్ముడా! లక్ష్మణా! సర్వకాలములయందును దుఃఖమును బొందుచున్ననన్నునోదార్చుచుందువుగదా? అట్టినీవిప్పుడు మరణమునుబొందియుండుటచేత నాతోసంభాషించుటకు శక్తిలేనివాడైయుంటివి. తమ్ముడా! లక్ష్మణా! ఇంతకుముందునీవు యీస్థలమునందు ఘోరముగయుద్ధమునుజేసి యనేకవేల రాక్షసులనుజంపితివి. అట్టినీవు యీయుద్ధభూమియందు శత్రువులచేత జంపబడితివి. మఱియు నోతమ్ముడా! లక్ష్మణా! నీవీ శరతల్పమునందు నెత్తురుచేతవ్యాప్తమైన శరీరముగలవాడవును, బాణములచేత వ్యాప్తమైన శరీరముగలవాడవునై యస్తమయకాలమునందలి సూర్యునివలె బ్రకాశించుచున్నావు. తమ్ముడా! లక్ష్మణా! బాణములచేత గొట్టబడిన మర్మస్థానములుగలవాడవగుటచేత మాటలాడజాలక యుంటివా? నీవుమాటలాడకపోయినను నీముఖకాంతిచేత నీకుగల బాధసూచింపబడుచున్నది. తమ్ముడా! లక్ష్మణా! నీవునాతోగూడ నేవిధముగా వనమునకువచ్చితివో యావిధముగ నేనుగూడ నీతోయమలోకమునకువచ్చెదను. బంధువులకిష్టుడవును, సర్వకాలములయందును నాకుబరిచర్యలను జేయువాడవును, నగు నీవు నాదుర్నయములచేత నిట్టి యవస్థను బొందితివి తమ్ముడా! పరాక్రమవంతులలో నుత్తముడా! లక్ష్మణా! నీకుగోపమువచ్చినప్పుడుగూడ గఠినములగుమాటలను బలుకువాడవుగావు. నీనోటనెప్పుడును నేనుబరుషములగుమాటలను వినియుండలేదనిచెప్పి పిమ్మట దనసమీపమునయున్న సుగ్రీవునుద్దేశించి యిట్లనియె. సుగ్రీవుడా! కార్తవీర్యార్జునుడు వేయిభుజములుగలవాడగుటచేత నొక్కమారు ఐదునూరుల బాణములను బ్రయోగించె. అట్టికార్తవీర్యార్జునుడు ప్రయోగించినబాణములన్నిటిని రెండుభుజములేగల యీలక్ష్మణుడు అపరిమితవేగముతో నిమిషమాత్రములోపలఖండించె. అదికారణముగ నీలక్ష్మణుడస్త్రవిద్యయందు సర్వోత్తముడని ప్రసిద్ధినిగాంచె. మఱియునో సుగ్రీవుడా! ఈలక్ష్మణుడు నానావిధములగునస్త్రములనుబ్రయోగించి మహానుభావుడగు దేవేంద్రునిగూడ జయించును. అటువంటిమహానుభావుడును, మిగులవెలగలశయ్యయందు బరుండుటకుదగిన యీలక్ష్మణుడు యిప్పుడు భూమియందు బడియున్నాడు. వానరోత్తమా! సుగ్రీవుడా! నేను విభీషణుని రాక్షసాధిపతినిగా జేసెదననిచెప్పితిని. నామాట అసత్యమైపోయె. కాబట్టి విభీషణుని దనయింటికిబొమ్మనిచెప్పు. నాదురదృష్టవశముచేత నివ్విధముగసంభవించెననిచెప్పుము మఱియునోసుగ్రీవుడా! నీవిప్పుడే నీసైన్యముతోగూడనీచోటువదలిపొమ్ము. నేనులేనని తెలిసినయెడల బలవంతుడగు రావణాసురుడు నిన్నుదరిమిచంపును. కావున నీవిక్కడనుండుట యుచితముగాదు. మఱియు నోసుగ్రీవు

డా! నీవు అంగదునిముందునిడుకొని సేనాసమేతుడవై నీలనళాదులతోగూడ సముద్రమునుదాటిపొమ్ము. మఱియునో సుగ్రీవుడా! ఎవ్వరికిని జేయశక్యముగానికార్యమును జేసి హనుమంతుడు మిగుల ప్రయాసమునుబొందెను. గోలాంగూలాధిపతియును, ఋక్షరాజునునగు జాంబవంతునిచేత ఘోరమగుయుద్ధముచేయబడియె. అంగదుడును, సంపాతియును, మిగులభయంకరమగు యుద్ధమును జేసిరి. గవయుడును, గవాక్షుడును, శరభుడును, గజుడును, మఱియునితరులగువానరులును, నాకొఱకు ప్రాణములమీదగూడ నాశనుబొందక మిగుల భయంకరమగు యుద్ధమును జేసిరి. ఎవ్వరెంతకష్టబడినను నిష్ప్రయోజనమయ్యె. కావున వానరోత్తముడవైనయోసుగ్రీవుడా! మానవులు దైవయత్నమును దప్పింపజాలరు. శత్రువులను దపింపజేయువాడవును, వానరోత్తముడవును నైనయోసుగ్రీవుడా! మిత్రుడవును, శోభనమైన హృదయముగలవాడవును, ధర్మభీరుడవును, నగు నీచేతనే యేకార్యముచేయదగియున్నదో యాకార్యములన్నియును జేయబడినవి. స్నేహితునికార్యము చేయదగినమట్టుకు జేయబడినదని చెప్పి యావానరులనందఱనుద్దేశించి యిట్లనియె. ఓవానరోత్తములారా! మీకందఱకును నేనాజ్ఞనిచ్చితిని. కాబట్టి మీరందఱును యథేష్టముగ బొండనియె. ఇవ్విధముగా రామునిచేత జెప్పబడుచున్న వచనములనువిని యధికముగు వ్యసనముగలవారై వానరులందఱును గన్నీళ్లనువదలిరి. అంతట విభీషణుడు వానరసైన్యమును సర్వమునుని లువదగినస్థలములయందు నిలిపి యతిత్వరితగమనముగలవాడును, గదాపాణియునునై రాముడున్నచోటునకువచ్చె. కాటుకకొండతో సమానమైనదేహచ్ఛాయగలవాడును, అతిత్వరితగమనముగలవాడును, నగు విభీషణునిజూచివానరులందఱును నింద్రజిత్తునుగాదలచి భయపడియుపరిగెత్తిరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి నలుబదితొమ్మిదవసర్గ ముగిసెను.

రామలక్ష్మణ సుగ్రీవాదులవద్దకు విభీషణుడు వచ్చుట.

అంతట నధికమగు తేజస్సుగలవాడును, మహాబలుడును, నగు సుగ్రీవుడిట్లనియె. ఇదియేమి? ఈవానరసైన్యమంతయును వాయువుచేతగొట్టబడిన యోడలవలె జెదరిపోవుచున్నదే అనియె. ఆవచనమునువిని వాలిపుత్రుడగు నంగదుడిట్లనియె. అయ్యో వానరరాజోత్తమా! మహాబలులగురామలక్ష్మణులను నీవుచూడజనులేదాయేమి? చూచుచుండియే, యివ్విధముగా బలుకుటకుగారణమేమి? వీరులును, దశరథమహారాజునకు బుత్రులును నగు రామలక్ష్మణులు బాణజాలములచేత వ్యాప్తమైన శరీరముగలవారైయున్నారు. మఱియు నీమహానుభావులిరువురును నెత్తుటిచేతవ్యాప్తమైనశరీరముగలవారై శరతల్పమునందు బడియున్నారు. చూడుము. కావుననే, వానరులందఱును వ్యసనముగలవారై పోవుటకు యత్నించుచున్నారనియె. ఇవ్విధముగా జెప్పిన మాటలనువిని వానరోత్తముడగు సుగ్రీవుడు అంగదునితో నిట్లనియె. నాయనా! అంగదుడా! ఈవానరసైన్యమంతయును బరుగెత్తుటకు రామలక్ష్మణులు కారణముగాదనితలచుచున్నాను. ఇట్లు పరుగెత్తుటకు మఱియొకవిధమైనభయముగారణమని తలచుచున్నాడను. చూడుము. మఱియు నీవానరులందఱును వ్యసనయుక్తములగు వదనములుగలవారును, ఆయుధములను వదలినవారును, భయమువలనను త్ఫుల్లమైన నేత్రములుగలవారునునై పరుగెత్తుచున్నారు మఱియు నోయంగదుడా! ఈవానరులందఱును సిగ్గులేనివారలై యధికముగ బరుగెత్తుచున్నారు. మఱియును గొందరు ఎగిరెగిరిదుముకుచున్నారు. చూడుమనియె. ఇంతలోపల విభీషణుడు గదాపాణియైవచ్చి సుగ్రీవునకు ఉత్సాహమును గల్పించుచు రఘుకులోద్భవుడగు రామునిజూచె. అంతటసుగ్రీవుడు, వానరులకుభయంకరుడగు విభీషణునిజూచి తనసమీపమునందున్నవాడును, భల్లూకాధిపతియును నగు జాంబవంతునితో నిట్లనియె. జాంబవంతుడా! చూడుము. ఈవచ్చుచున్నవాడు విభీషణుడు. ఈవిభీషణునిజూచి మనవారలందఱును నింద్రజిత్తనియెడు సందేహముచేత భయముగలవారై పరుగెత్తుచున్నారు. కాబట్టిపరుగెత్తుచున్న వానరులనందఱతోడను నీవచ్చుచున్నవాడు విభీషణుడనియును, భయమునుబొందనక్కరలేదనియును జెప్పినిలువుమనియె అంతట భల్లూకాధిపతియగు జాంబవంతుడివ్విధముగా సుగ్రీవుడుచెప్పినవాక్యములనువిని పరుగెత్తుచున్న వానరులందఱనునిలిపె. అవ్విధముగ జాంబవంతునిచేత జెప్పబడినవాక్యమునువిని వానరులందఱును భయమునువదలినవారై వచ్చువానిని విభీషణునిగాదెలిసికొని పరుగెత్తకనిలిచిరి. అంతట విభీషణుడు రామునిసమీపమునకువచ్చి బాణములచేతవ్యాప్తమైన రామునిశరీరమునుజూచె. పిమ్మటలక్ష్మణునిజూచి ధర్మాత్ముడగు విభీషణుడు మిగులవ్యాకులములైన యింద్రియములుగలవాడయ్యె. అంతట నావిభీషణుడు, రామలక్ష్మణులనేత్రములను ఉదకముచేతగడిగిదుఃఖముచేత బీడింపబడిన మనస్సుగలవాడై వ్యసనమునుబొందెను. మఱియునిట్లనిలంచెను. అధికమగు బలముతోగూడుకొనినవారును, యుద్ధమునందు ప్రీతిముగలవారును, మిగులబరాక్రమముగలవా

రును, నగు నీరామలక్ష్మణులు కపటయుద్ధమును జేయునట్టి రాక్షసులచేత నెట్టి యవస్థను బొందింపబడిరి. దుర్మార్గుఁడును, దురాత్ముఁడును, నాయన్నయైన రావణాసురునకు బుత్రుఁడును, నగు నింద్రజిత్తు కపటయుద్ధమును జేసి సరళమగు పరాక్రమముగల రామలక్ష్మణులను నిట్టియవస్థనుబొందించె. అయ్యో! ఈరామలక్ష్మణులు బాణములచేతనమితముగా గొట్టబడిరి. నెత్తురుచేత వ్యాప్తమైన శరీరము గలవారైరి. మఱియునీరామలక్ష్మణులు పెక్కు బాణములచేత గ్రుచ్చబడిన శరీరముగలవారై నిద్రను బొందుచున్న వారివలె భూమియందుబడియున్నారు. నేనీ రామలక్ష్మణుల పరాక్రమము నాశ్రయించి యధికమగు ప్రతిష్ఠను బొందదలచితిని. ఇట్టి రామలక్ష్మణులిరువురును నిప్పుడుమరణముఁబొందక భూమియందుబడియున్నారు. నేనిప్పుడుబ్రతికియుండియునువిపత్తునుబొందితిని మఱియును నష్టమైనమనోరథముగలవాఁడనైతిని. ఇప్పుడు శత్రువుడగు రావణాసురుడు తనప్రతిజ్ఞను నెరవేర్చుకొనినవాఁడును, ప్రాప్తమనోరథుడునునయ్యెను నిర్వ్యసనమునుబొందుచుండెను. ఇవ్విధముగా వ్యసనమును బొందుచున్న విభీషణుని గౌగలించుకొని మిగులబలముగలవాడును, వానరాధిపతియును నగు సుగ్రీవుడిట్లనియె. ధర్మజ్ఞుఁడవైనయోవిభీషణుఁడా! నీవులంకాపట్టణమునందు రాజ్యమునుబొందగలవు. ఈవిషయమునందు గొంచమైననుసందేహములేదు. రావణుఁడుపుత్రమిత్రాదులతోగూడ మరణమునుబొందునుగాని కోరికలనుసఫలములనుగా బొందలేడు. ఈరామలక్ష్మణులిరువురును నీవ్యాధిచేత బీడింపబడరు. నీవుభయమును బొందకుము. మఱియునీయిరువురును మోహమునువదలి యుద్ధమునుజేసి రావణాసురుని బుత్రమిత్రాదులతోగూడవధింపగలరు. కావుననీవుభయమునుబొందకుమనియె. ఇవ్విధముగా నాసుగ్రీవుడు, రాక్షసోత్తముడగు విభీషణునోదార్చి తనపార్శ్వమునందుసంచరించుచున్నవాఁడును, మామయునునగు సుషేణునితో నిట్లనియె. మామా! సుషేణుఁడా! శత్రునాశకులగు నీరామలక్ష్మణులిరువురును మూర్ఛదేరినపిమ్మట వానరాధిపతులను వీరినివెంటబెట్టుకొని కిష్కింధాపట్టణమునకుబొమ్ము. నేనురావణాసురునిబుత్రాదులతోగూడసంహరించియింద్రుడు జయలక్ష్మిని దోడ్కొనిపోయినవిధముగ సీతాదేవిని దోడ్కొనివచ్చెదననియె. ఇవ్విధముగాసుగ్రీవుడుచెప్పిన వాక్యమునువిని సుషేణుడిట్లనియె. సుగ్రీవుడా! పూర్వము దేవదానవులకుమిగులభయంకరమగుయుద్ధమయ్యె. అప్పుడు శరసంస్పర్శమునందు బండితులగు రాక్షసులు శస్త్రవేత్తలగు దేవతలను మాటిమాటికిని గొట్టిరి. అప్పుడు బాణములచేత బీడింపబడినవారును, మూర్ఛనుబొందియున్నవారును, నగు దేవతలకు బృహస్పతిమంత్రములచేతను, ఔషధములచేతను, జికిత్సలనుజేసె. ఆయౌషధములన్నియును నిప్పుడు క్షీరసముద్రతీరముననున్నవి. ఆయౌషధములను దీసికొనివచ్చుటకు క్షీరసముద్రతీరమునకు వానరులు శీఘ్రముగబోయివచ్చునట్లుచేయుము. సంపాతి, పనసుడు మొదలుగాగల వానరులుమిగులశీఘ్రముగ బోదగినవారు. మనవానరులందఱును, పర్వతములయందుబుట్టినట్టి యాయౌషధములను దెలిసినవారు. ఆసముద్రతీరమునందు జంద్రమనియును, ద్రోణమనియునుపేరుగలరెండు పర్వతములు గలవు. ఆపర్వతములయందు దేవనిర్మితములగు సంజీవకరణి, విశల్యకరణి, యనుపేర్లుగలవియును, దేవతలచేతనిర్మింపబడినవియును నగు రెండౌషధములుగలవు. ఆపర్వతసమీపమునందే పూర్వము దేవతలమృతమును మథించిరి. కావుననాయౌషధములను దేవతలక్కడనుంచిరనిచెప్పి మఱియునిట్లనియె.

వానరరాజోత్తమా! సుగ్రీవుడా! వాయుపుత్రుడగుహనుమంతుడచ్చోటునకు బోదగినవాడు. ఇతరులెవరునునచ్చోటునకు బోజాలరనియె. ఇంతలోపల మెరుపులతోగూడిన మేఘములను బారదోలుచున్నదియును, సముద్రోదకమును గంపింపజేయుచున్నదియును, భూమికి కంపమునుగలుగజేయుచున్నదియును, నగు నొకమహావాయువుపుట్టె. ఆమహావాయువుచేత సకలద్వీపములయందును నుండునట్టి గొప్పవియగు వృక్షములును, మఱియునితరములగు వృక్షములను బెల్లగిలి యావాయువుతోగూడవచ్చి లవణసముద్రమునందుబడినె. మఱియునక్కడనున్నవియును, భోగములుగలవియును, నగు సర్పములును, మఱియునితరములగు కొన్ని జలజంతువులును, లవణసముద్రమునందు పడినె. అంతట గొంతసేపటికి వానరులందఱును, మహాబలవంతుడును, అగ్నిహోత్రునివలెబ్రజ్వలించుచున్నవాడును, నగు గరుత్మంతునిజూచిరి. అట్లువచ్చిన గరుత్మంతునిజూచి పరమపురుషులును, మహాబలవంతులును, నగు రామలక్ష్మణులను బంధించుకొనియున్న సర్పములన్నియును భయముచేత పలాయితములయ్యె. అంతటనాగరుత్మంతుడు రామలక్ష్మణులను జూచిమహానందమునుబొందె. పిమ్మటజంద్రునితోసమానమగు మోములను దనహస్తములచేత దుడిచె. అవ్విధముగ గరుత్మంతుడు తనహస్తములచేత స్పృశించగానే యారామలక్ష్మణులయొక్క శరీరమునందలియవయవములన్నియును వ్రణములేమియు లేనివయ్యె. అంతగొంతసేపటికి ఆరామలక్ష్మణులకు మరలమునుపటివలెనే తేజస్సు, బలము, వీర్యము, ఉత్సాహము, ఓజస్సు, చూపుబు

ద్ధి, మొదలగు గుణములన్నియునువచ్చె. ఇవ్విధముగ దేవేష్టునితో సమానులును, గొప్పదగు పరాక్రమముగలవారును, నగు రామలక్ష్మణులను లేపిసంతుష్టులగు నారామలక్ష్మణులనుగౌగలించుకొనియె. అంతటరాముడు పరమానందముగలవాడై యాగరుత్మంతునితో నిట్లనియె. గరుత్మంతుడా! నీయనుగ్రహముచేత మేమురావణాసురునకు బుత్రుడగు నింద్రజిత్తువలన గలిగినదియును, మిగులగొప్పదియును నగు వ్యసనమునుండి తొలగితిమి. మఱియు మేమిరువురమును, మునుపటివలెనే సర్వోత్తమమగు పరాక్రమముగలవారమైతిమి. మాతండ్రియగు దశరథమహారాజును, మాతాతయగు నజమహారాజును జూచునపుడెట్టి యానందముగలుగునో యట్టియానందము నిన్నుజూచుటవలనగలిగె. రూపసంపన్నుడవును, దివ్యమగు పూలమాలికగలవాడవును, దివ్యగంధమునలదుకొనిన వాడవును, దివ్యములగు వస్త్రములనుధరించినవాడవును, దివ్యాభరణములచేత నలంకరింపబడినవాడవును, నగు నీవెవరు, నీవృత్తాంతము నాకేమియును దెలియకుండుటంజేసి యివ్విధముగ నడుగుచున్నానని యె. అంతట మహాతేజోవంతుడును, మహాబలవంతుడును, పక్షిరాజులలో నుత్తముడును, ప్రీతినొందినయాత్మతత్త్వము గలవాడును, సంతోషయుతములగు నేత్రములుగలవాడును నగు గరుత్మంతుడు రామునితోనిట్లనియె. కకుత్స్థకులము నందుబుట్టిన యోరాముడా! నేనునీకు స్నేహితుడను. నీకు బయటనుసంచరించుచున్న ప్రాణమువంటివాడను. గరుత్మంతుడను పేరుగలవాడను. నీవుచెప్పినట్లు నేనేగరుత్మంతుడను. మీకుసహాయమును జేయుటకిక్కడకు వచ్చితిని. మహావీర్యముగలయసురులైనను, మహాబలులగు దానవులైనను, దేవగంధర్వ సిద్ధాసురులైనను, దుర్మార్గుడగునింద్రజిత్తుచే జేయబడిన యీశరబంధమును బోగొట్టజాలరు. కద్రువుయొక్క బిడ్డలును, మహాబలముగలవియును, తీక్ష్ణములగు కోరలుగలవియును, అధికమగు విషముగలవియును, నీసర్పములన్నియును నింద్రజిత్తుయొక్క మాయాబలముచేత బాణరూపమును ధరించినవై మిమ్ములబాధించె. సత్యపరాక్రమముగలయోరాముడా! ధర్మజ్ఞుడా! యుద్ధమునందు శత్రుసంహారకుడగు లక్ష్మణునితోగూడ నీవీశరబంధమునుండి తప్పించుకొనుటచేత మిగులనదృష్టముగలవాడవైతివి. నేనునీకిట్టియవస్థగలుగుటనువిని మిగుల త్వరగలవాడనైవచ్చితిని. మఱియుమీకును నాకునుగల స్నేహవశముచేత వచ్చుటసంభవించె. నేనువచ్చుటచేత మిగులభయంకరమగు నీశరబంధమువలన విడివింప బడితిరి. ఇక మీదట మీరు ప్రమాదమును బొందగూడదు. రాక్షసులు సహజముగానే కపటయుద్ధమును జేయువారు. మీరుశూరులును, పరిశుద్ధమగు నభిప్రాయముగలవారును, నగుటచేతమీబలమును నిష్కపటముగజూపుచు యుద్ధమును జేయుదురు. ఇకమీద నెప్పటికిని రాక్షసులను నమ్మి నిష్కపటయుద్ధమును జేయగూడదు. ఇప్పుడు జరిగినవిషయమువలననే రాక్షసులు కపటయుద్ధమును జేయువారుసదాయని యెన్నవలయుననియె. మహాబలవంతుడగు గరుత్మంతుడు యివ్విధముగా జెప్పి పరమస్నేహితుడగు రాముని నాలింగనము సేసికొని మరలనిట్లనియె. స్నేహితుడా! రఘుకులోద్భవుడా! ధర్మమునుగుర్తెఱిగినవాడా! శత్రువులయందుగూడ బ్రియముగలవాడా! రాముడా! నేనువచ్చినవిధముగామరలబోవుటకుననుజ్ఞనిమ్ము. రఘుకులోద్భవుడవైన యోరాముడా! మనకిరువురకును స్నేహమెట్లుగలిగినదను విషయమును దెలిసికొనవలయునని నీకభిలాషగలిగియున్నట్లు తోచుచున్నది. ఈవిషయమునందిప్పుడపేక్షను బెట్టికొనకుము. వీరుడవైన యోరాముడా! నీవు యుద్ధమునందు సకలకార్యములను నెరవేర్చుకొనినపిమ్మట నేనేవిధముగా స్నేహితుడనైనదియును దెలియగలవు. మఱియు నోరాముడా! లంకాపట్టణమునందలి బాలవృద్ధుల నుదప్ప దక్కినవారలనందఱను సంహరించి శత్రువగురావణాసురునివధించి సీతాదేవినిబొందగలవనియె. ఇవ్విధముగాబలికి శీఘ్రమగు పరాక్రమముగల గరుత్మంతుడు ఆవానరులలోపలనున్న రామునకుగలబాధను సర్వమునుదొలగించియందలివానరులకందఱకును ప్రదక్షిణముగా దిరిగి వాయువేగమువంటి వేగముగలవాడైపోయె. అంతటవానరాధిపతులందఱును రఘుకులోద్భవులగు రామలక్ష్మణులుబాధారహితులైయుండుటనుజూచి మహానందము గలవారై తోకలను ఝాడించుచు సింహనాదములను జేసిరి. పిమ్మట రణభేరులను, మృదంగములను మ్రోగించిరి. శంఖములను బూరించిరి. మఱియు ననేకవిధములగు ధ్వనులను జేసిరి. మఱియునావానరులందఱును భుజాస్ఫాలనములను జేయుచు నానావిధములగు వృక్షములను బెల్లగించి యాయుధములనుగాధరించిరి. రాక్షసులను భయపరచుచు మిగుల భయంకరములగు సింహనాదములను జేసిరి. మఱియునావానరులందఱును యుద్ధమును జేయవలయుననియెడు కుతూహలముగలవారై లంకాపురద్వారములనాక్రమించిరి. మఱియు నాసమయమునందు వానరాధిపతులందఱును, వర్షాకాలమునందలి మేఘములవలె మిగులభయంకరమగు గర్జనములను జేసిరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి యేబదవ సర్గము గిసెను.

రామలక్ష్మణులుమూర్ఛదేరుటనువిని రావణాసురుడు ధూమ్రాక్షుని యుద్ధమునకు బంపుట.

అప్పుడు మిగులబలవంతులును, ధ్వనిజేయుచున్న వారలునునగు వానరోత్తములయొక్క తుములధ్వనిని రాక్షసులతోగూడ రావణాసురుడు వినియె. మఱియు రావణాసురుడు మేఘధ్వనివంటి వానరులధ్వనినివిని తనసమీపముననున్న మంత్రులతోనిట్లనియె. ఓ రాక్షసోత్తములారా! సంతుష్టులగు ననేక వానరులయొక్కధ్వని వర్షాకాలమునందలిమేఘధ్వనివలె వినబడుచున్నది. ఈధ్వనినివినుటచేత నీవానరులకధికమైన సంతోషముగలిగియున్నట్లు తోచుచున్నది. ఇందుకేమియును సందేహములేదు. మఱియు నీవానరులందఱును విపులములగు ధ్వనులచేత సముద్రమును నల్లకల్లోలమునుగా జేయుచున్నారు. అన్నదమ్ములగు రామలక్ష్మణులు మిగుల దీక్ష్ణములగు బాణములచేత నిదివఱకు బద్ధులైరి. ఇప్పుడీమహానాదమును వినుటచేత రామలక్ష్మణులు విముక్తులైరి కాబోలునని తోచుచున్నదనియె. ఇవ్విధముగా రాక్షసాధిపతియగు రావణాసురుడుచెప్పి తనసమీపముననున్న రాక్షసులనుజూచి యిట్లనియె.

రాక్షసోత్తములారా! వానరులందఱును సేడ్వదగిన కాలమునందు సంతోషముగలవారై యుండుటకు గారణమేమియో తెలియకున్నది. కాబట్టి మీరు దెలిసికొనిరండనియె. అంతట నారాక్షసులందఱును రావణాసురుని వచనమునువినుటచేత మిగుల దత్తరపాటుగలవారై ప్రాకారమునెక్కిరి. ఎక్కి మహాత్ముడగు సుగ్రీవునిచేత బరిపాలింపబడుచున్న వానరసైన్యమును జూచిరి. అప్పుడు రఘుకులోద్భవులును, మహానుభావులును, నగు నారామలక్ష్మణులు శరబంధమునుండి తొలగినవారై పరమసంతోషముతో గూర్చుండిరి. అట్టి రామలక్ష్మణులను జూచి యారాక్షసులందఱును మిగుల వ్యసనమును జెందిరి. అంతట నారాక్షసులందఱును భీతచిత్తులై ప్రాకారములనుండి దిగి దీనవదనములుగలవారై రాక్షసేశ్వరుడగు రావణాసురుని సమీపమునకు వచ్చిరి. పిమ్మట వాక్యవేత్తలగు రాక్షసులు దీనములగు ముఖములుగలవారై రావణాసురునకావృత్తాంతమును సర్వమునుజెప్పి మఱియు నిట్లనిరి. రాక్షసోత్తముడవైన యోరావణాసురుడా! యుద్ధమునందు యింద్రజిత్తుచేశరబంధముచేతగట్టబడినవారును, అన్నదమ్ములును,నగు రామలక్ష్మణులిప్పుడు శరబంధమునుండి ముక్తులైయున్నారు. ఏనుగుయొక్క పరాక్రమమువంటి పరాక్రమము గలవారును, విముక్తులును, భయరహితులునునై పాశములను భేదించిన యేనుగులవలె యుద్ధభూమియందు ప్రకాశించుచున్నారని చెప్పిరి. మహాబలుడును, రాక్షసేంద్రుడును నగు రావణాసురుడు ఆరాక్షసులయొక్క మాటలనువిని విచారముచేత నాక్రమింపబడిన చిత్తముగలవాడును, శోకసనాక్రాంతమైన ముఖముగలవాడునునై యిట్లనియె. మిగుల భయంకరములును, వీర్యముచేత సంపాదింపబడినవియును, సర్పములతో సమానములైనవియును, వ్యర్థములుగానివియును, సూర్యునితో సమానములైనవియును, నగు బాణములచేత నింద్రజిత్తుచే యుద్ధమునందు గట్టబడిరి. అట్టి శరబంధముచేత గట్టబడియును, నాకుశత్రువులును నగురామలక్ష్మణులు శరబంధమునుబొందియును విముక్తులైరి. కావున నికమీద నాసైన్యమంతయును నశించునని తోచుచున్నది. ఆదిశేషువుయొక్క తేజస్సువంటి తేజస్సుగల బాణములన్నియును నిష్ఫలములయ్యె. కాబట్టి యికమీద నాయాయువు శత్రువులచేత నశింపజేయబడినదియే,యని తలచుచున్నాననియె. ఇవ్విధముగాజెప్పి యారావణాసురుడు క్రోధోద్దీపితమగు సర్పమువలె నిట్టూర్పులను విడుచుచు రాక్షసోత్తములలో నుత్తముడగు ధూమ్రాక్షునితో నిట్లనియె.

భయంకరమైన పరాక్రమముగల యోధూమ్రాక్షుడా! నీవపరిమితసైన్యముతో గూడుకొనినవాడవై రామలక్ష్మణులను, వానరులను సంహరించుటకొఱకు యుద్ధమునకు బొమ్మనియె. బుద్ధిమంతుడును, రాక్షసేంద్రుడును, నగు రావణాసురునిచేత నివ్విధముగా జెప్పిన వాక్యములను విని ధూమ్రాక్షుడు పరమసంతోషముగలవాడై యారావణాసురునకు నమస్కారమును జేసి యారాజమందిరమునుండి బయలువెడలె. అట్లు బయలువెడలి ద్వారమధ్యప్రదేశమునకువచ్చి బలాధ్యక్షునితో నిట్లనియె. బలాధ్యక్షుడా! నీవెందుకాలస్యమును జేయుచున్నావు. ఇకనాలస్యమును జేయక సైన్యమును సర్వమును శీఘ్రముగ సన్నద్ధముగ జేయుమనియె. ఇవ్విధముగ ధూమ్రాక్షుడు చెప్పినమాటలను విని బలాధ్యక్షుడనువాడు రావణాసురుని యాజ్ఞానుసారముగ సైన్యమును సర్వమును సన్నద్ధముగజేసె. అంతట ఘంటలను, గట్టుకొనినవారును, భయంకరమైన యాకారముగలవారును, నగురాక్షసులందఱును బరమానందముతో గర్జించుచు బయలువెడలివచ్చి ధూమ్రాక్షుని జుట్టుకొనిరి. మఱియు నారాక్షసులు నానావిధములగు నాయుధములను జేతులయందు బెట్టుకొనినవారును, శూలములు, ముద్గరములు, ఆనియెడునాయుధములను ధరించినవారునునై, బయలు వెడలిరి. మఱికొందఱు రాక్షసులు, గదలు, పట్టసములు, దండములు, ఇనుపరోకళ్లు, పరిఘలు, భిండివాలము

లు, భల్లములు, గండ్రగొడ్డండ్లు, మొదలుగాగల యాయుధములను ధరించినవారై మేఘములవలె ధ్వనిజేయుచు బయలువెడలిరి. మఱికొందఱు రాక్షసులు చక్కగానలంకరింపబడిన ధ్వజములతో గూడుకొనిన రథముల నెక్కి బయలు వెడలిరి. మఱికొందఱు బంగారపునగలచేత నలంకరింపబడినవియును, నానావిధములయిన ముఖములుగలవియును నగు గాడిదెలను, అతిశీఘ్రముగ బరుగెత్తునట్టి గుఱ్ఱములను మదించినయేనుగులను, ఎక్కి పెద్దపులులవలె భయంకరులై బయలువెడలిరి. అప్పుడు గాడిదెయొక్క కంఠధ్వనివంటి కంఠధ్వనిగల యాధూమ్రాక్షుడు, తోడేళ్లయొక్కయు, సింహములయొక్కయు, ముఖములవంటి ముఖములుగలవియును, బంగారపుసొమ్ముచేత నలంకరింపబడినవియును, గాడిదెలచేత వహింపబడుచున్న రథము నెక్కి బయలు వెడలె. మహావీర్యముగల ధూమ్రాక్షుడనేకలక్షల రాక్షసులతో గూడుకొనిబయలువెడలినవాడై హనుమంతుడు నివసించియున్న పశ్చిమద్వారమునకుబోయె. ఆసమయమునందు గాడిదెలచేత వహింపబడుచున్న రథము నెక్కి పోవుచున్నవాడును, గాడిదెయొక్కకంఠధ్వనివంటి కంఠధ్వని గలవాడును, మిగుల భయంకరుడును, భయంకరమైన పరాక్రమముగలవాడును, నగు నాధూమ్రాక్షునకు నాకాశమునందలి దుశ్శకునములు సందేహమును గల్పించినవయ్యె. మఱియు నాసమయమున రథముయొక్క శిరస్సునందు భయంకరమై గ్రద్దయొకటి పడియె. మఱియును ధ్వజాగ్రమునందు పీనుగులను భక్షించునట్టి గ్రద్దలు సంచరించుచుండె. నెత్తురుచేత దడపబడినదియును, మిగుల గొప్పదియును, తెల్లనిదియును, నగుకబంధము వ్యసనకరమగు ధ్వనిని జేయుచు ధూమ్రాక్షునియొక్క సమీపమునందు బడియె. మఱియు నాసమయమునందు నెత్తురువర్షము గురిసె భూమియంతయును గడగడవణకె. మిగుల భయంకరమైన ధ్వనిగలదగుచు వాయువు ప్రతికూలముగ వీచుచుండె. దిక్కులన్నియును జీకటిచేత వ్యాప్తములైనవై ప్రకాశములేకయుండె. రాక్షసులకు భయమును గలుగజేయునట్టివియును, భయంకరములైనవియును, నగు నాదుశ్శకునములను జూచి ధూమ్రాక్షుడు మిగుల బరితాపముగలవాడయ్యె మఱియు నాధూమ్రాక్షుని ముందర సంచరించుచున్న రాక్షసులందఱును నపరిమితమగు మోహమునుజెందిరి. అంతట భయంకరుడును, మిగులబలముగలవాడును. యుద్ధమును జేయవలయుననియెడు కుతూహలముగలవాడును, నగు నాధూమ్రాక్షుడనేకులగు రాక్షసులతో గూడ బయలు వెడలినవాడై, పెద్దదగు ప్రవాహమును బోలియున్నదియును, రామునిభుజములచేత బాలింపబడుచున్నదియును, నగువానరసైన్యమును జూచె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలియేబదొక్కటవ సర్గము ముగిసెను.

—{ వానరులును ధూమ్రాక్షునిసైన్యమును యుద్ధము జేయుట. }—

అప్పుడు, భయంకరమైన పరాక్రమము గలవాడును, యుద్ధమును జేయవలయుననియెడు కోరికతో బయలువెడలినవాడును, నగు ధూమ్రాక్షుని జూచి వానరులందఱును యుద్ధమును జేయవలయు ననియెడు కోరికగలవారై సింహనాదములను జేసిరి. అంతట నా రాక్షసులకును వానరులకును, మిగుల భయంకరమగు సంకులయుద్ధమయ్యె. ఆయుద్ధమునందు వానరులను రాక్షసులును, రాక్షసులను వానరులును, వృక్షములతోడను, శూలములతోడను, ముద్గరములతోడను, భయంకరములగు పరిఘలతోడను, చిత్రములగు త్రిశూలములతోడను, మఱియుననేకవిధములగు నాయుధములతోడను, గొట్టుకొనిరి. అప్పుడు వానరులు గోపాక్రాంతచిత్తులై రాక్షసులనుజంపి నేలగలిపిరి. ఆసమయమునందు రాక్షసులును, క్రోధాక్రాంతచిత్తులై మిగుల దీక్ష్ణములగు బాణములచేత వానరులననేకులను జంపిరి. మఱికొందఱగు నావానరులను, మిగుల భయంకరములను, కంకపత్రములు గలవియును, సరళములైనవియును, నగు బాణములచేతను, భయంకరములగు గదలచేతను, పట్టసములచేతను, ముద్గరములచేతను, గొట్టించిపిరి. ఇవ్విధము గా రాక్షసులచేత నానావిధములగు నాయుధములచేత వానరులందఱును చీల్చబడిన శరీరములు గలవారైరి. అంతట వానరులందఱును గోపోద్దీపితులై భయములేని వారలవలె సంచరించుచు భయంకరములగు కర్మలను జేసిరి. మఱియు బాణములచేత బ్రద్దలుగా జేయబడిన శరీరములు గలవారును, శూలములచేత గ్రుచ్చబడిన దేహము గలవారును, నగు వానరవీరులందఱును భయంకరములగు వృక్షములను, శిలలను నాయుధములనుగా గ్రహించిరి. పిమ్మటభయంకరమగు వేగముగల యావానరులందఱును భయంకరులగు రాక్షసులను నానావిధములుగా మర్దించిరి. మఱియు దమపేళ్లను పేర్కొనుచుండిరి. ఆసమయమునందు నానావిధములగు శిలలను, అనేకములగు చెట్లను ధరించిన వానరులకును, నానావిధములగు నాయుధములను ధరించిన రాక్షసులకును మిగుల సంకులమగు యుద్ధమయ్యె. అట్టియుద్ధమునందు జయశీలురగు వానరులచేత రాక్షసులు మథింపబడిరి.

కొందఱు రాక్షసులు ఆవానరుల దెబ్బలకు తాళజాలక నెత్తురు గ్రక్కిరి. మఱియు నప్పుడు వానరులు గోపోద్దీపితులై రాక్షసుల పార్శ్వభాగములను జీల్చిరి. కొందఱు రాక్షసులు శిలలచేత జూర్ణము సేయబడిరి. కొందఱు రాక్షసులు దంతములచేత జీల్చబడిరి. అంతట నూరకుండక వానరులందఱును రాక్షసుల ధ్వజములను విఱిచిరి. గాడిదెలను జంపిరి. రథములను జూర్ణము సేసిరి. రాక్షసులు కొందఱు క్రిందబడిరి. పర్వతములవంటి యేనుగులు మథింపబడియె. గుఱ్ఱములు నలగగొట్టబడియె. మఱియు నావానరులందఱును గోపోద్దీపితులై గోళ్ళచేత రాక్షసుల ముఖములను జీల్చిరి. అంతట నారాక్షసులందఱును వెలవెలబోవుచున్న ముఖములుగలవారును, మూఢులునునై నెత్తురు గ్రక్కుచు భూమియందుబడి మృతులైరి. ఆసమయమునందు మఱికొందఱు రాక్షసులు గోపోద్దీపితులై భయంకరారావములను సల్పిరి. మఱియును వజ్రాయుధమువంటి పాదతలములచేత వానరులను మర్దించిరి. మఱియును నతివేగముగల వానరవీరులచేత వేగముగలవారైరి. అంతనయ్యురు తెగలవారికిని పిడికిటిపోట్లతోడను, పాదతాడనములతోడను, దంతములతోడను, వృక్షములతోడను, మిగుల భయంకరమగు యుద్ధముజరిగె. ఆసమయమునందు రాక్షసులందఱును వానరులచేత నధికముగా గొట్టబడినవారై నిలువజాలక పరుగెత్తిరి. అట్లుపరుగెత్తుచున్న వానరసైన్యమును జూచి రాక్షసోత్తముడగు ధూమ్రాక్షుడు గోపోద్దీపితుడై యుద్ధమును జేయుచున్న వానరులతో మిగుల భయంకరమగు యుద్ధమును జేసె, అంతట నాధూమ్రాక్షుడు ప్రాసములనియెడు నాయుధములచేత వానరులనధికముగామర్దించె. అంతట నావానరులందఱును నాదెబ్బలకు తాళజాలక నెత్తురుగ్రక్కుచు గ్రిందబడిరి. కొందఱు వానరులు ముద్గరములను నాయుధములచేత గొట్టబడి క్రిందబడిరి. కొందఱు పరిఘములను నాయుధములచేత మథింపబడిరి. కొందఱు భిండివాలములను నాయుధములచేత జీల్చబడిరి. కొందఱు త్రిశూలములచేత దఱుమబడిరి. కొందఱు వానరులు పట్టసములను నాయుధములచేత గొట్టబడినవారై విహ్వలత్వమునుబొందిరి. కొందఱు శూలములను నాయుధములచేత గొట్టబడినవారై నెత్తురు గారుచుండగా గ్రిందబడిరి. మఱికొందఱు వానరులు త్రిశూలములను నాయుధములచేత బ్రద్దలుసేయబడిన హృదయములు గలవారైరి. కొందఱువానరులు చీల్చబడిన దేహములు గలవారైరి. కొందఱు వానరులకు బేగులుబయలునకువచ్చె. అంతట వానరులచేతను, రాక్షసులచేతను, వృక్షములచేతను, రాళ్ళచేతను సంకులమైనదియును, మిగుల భయంకరమైనదియును, నగుసంకులయుద్ధముజరిగె. మఱియు నాసమయమునందు ధనుస్సుయొక్క నారియనియెడు వీణాగానముచేత మధురమైనదియును, హిక్కయనియెడు తాళములతోగూడుకొనినదియును, మందమగు కంఠధ్వని యనియెడు సంగీతముగలదియును, నగుయుద్ధగాంధర్వము మిగుల మనోహరమైనదయ్యె. అప్పుడు ధూమ్రాక్షుడు ధనుర్ధారియై యాయుద్ధరంగమునందలి వానరులను గెలిజేయుచు బాణవర్షమును గురిపించుచు వానరులనందఱినిదఱిమె. అట్లుధూమ్రాక్షునిచేత మర్దింపబడినదై వ్యసనమును బొందుచున్న వానరసైన్యమునుజూచిహనుమంతుడుఅపరిమితముగా గోపమును బొందినవాడై గొప్పదగు శిలనొక్కదానిం బట్టుకొని బయలువెడలె. పిమ్మట గోపముచేత నెఱ్ఱగా జేయబడిన నేత్రములు గలవాడును, తండ్రియగు వాయుదేవునియొక్క పరాక్రమమువంటి పరాక్రమముగలవాడును, నగుహనుమంతుడు గొప్పదగు శిలనుగ్రహించి ధూమ్రాక్షుని రథముమీద బడవైచె. అవ్విధముగా హనుమంతునిచేత విసరివేయబడి తనకభిముఖముగా వచ్చుచున్న శిలనుజూచి గదనుధరించి ధూమ్రాక్షుడు మిగులవేగముతో రథమునుండి భూమిమీదికి దుమికె. అట్లు హనుమంతునిచేత బ్రయోగింపబడినశిల ధూమ్రాక్షుని రథమును జూర్ణముచేసె. అవ్విధముగ గుఱ్ఱములతోడను, సారథితోడను గూడుకొనినరథమును జూర్ణముగాజేసి హనుమంతుడంతట నూరకుండకనానావిధములగు వృక్షములతో మిగులభయంకరమగు యుద్ధమునుజేసె. ఆయుద్ధమునందనేకులగు రాక్షసులు బ్రద్దలయిన తలలుగలవారును, నెత్తురుచేతవ్యాప్తమైన శరీరములు గలవారునునై భూమియందు బడిరి. ఇవ్విధముగా యుద్ధమునుజేసి వాయుదేవునకు బుత్రుడగు హనుమంతుడు రాక్షససైన్యమును దఱిమి పర్వతశిఖరము నొకదానిని గ్రహించి ధూమ్రాక్షునకభిముఖముగా బయలువెడలె. అట్లు తనకభిముఖముగా వచ్చుచున్నవాడును, వీర్యవంతుడును, నగుహనుమంతునిజూచి ధూమ్రాక్షుడు గోపోద్దీపితుడై గదయనునాయుధమునుధరించి హనుమంతున కెదురుగా బరుగెత్తికొనివచ్చి యనేకములగు కంటకములుగల యాగదను హనుమంతునిరొమ్ముమీదబడవైచె. అవ్విధముగానాగదచేత గొట్టబడియును హనుమంతుడు లక్ష్యముసేయక తనచేతనున్న పర్వతశిఖరమును ధూమ్రాక్షుని శిరస్సునందు బడవైచె. అట్లు పర్వతశిఖరముచేత గొట్టబడిన యాధూమ్రాక్షుడు విహ్వలితమైన సర్వావయవములును గలవాడై గొప్పదగుపర్వతమువలె గ్రిందబడియె. అవ్విధము

గజచ్చిక్రిందబడియున్న ధూమ్రాక్షునిజూచి చావగామిగిలిన రాక్షసులందఱును మిగుల భయముగలవారై వానరులచేత దఱుమబడుచు లంకాపట్టణములోనికి బరుగెత్తిపోయిరి. అవ్విధముగ హనుమంతుడు మిగుల భయంకరమగు యుద్ధమును జేసి రక్తప్రవాహములుగల నదులను బ్రవహింపజేసె. అంతట శత్రువధచేత బుట్టినశ్రమగలవాడును, మహానుభావుడును, వానరులచేత బూజింపబడుచున్నవాడును, నగుహనుమంతుడు పరమసంతోషమును బొందె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి యేబదిరెండవ సర్గ ముగిసెను.

రావణాసురుడు ధూమ్రాక్షుడుజచ్చుటనువిని వజ్రదంష్ట్రుని యుద్ధమునకుబంపుట.

అంతట రాక్షసాధిపతియగు రావణాసురుడు ధూమ్రాక్షుడు చచ్చెననువార్తనువిని యధికమగు కోపముగలవాడై పామువలె బుసకొట్టుచుండె. పిమ్మట పెద్దవగు నిట్టూర్పులనువిడిచి కోపముచేత గాలుష్యముగలవాడై శూరుడగు వజ్రదంష్ట్రుడనియెడు రాక్షసోత్తమునితో నిట్లనియె. వీరుడవైనయోవజ్రదంష్ట్రుడా! నీవనేకులగు రాక్షసులతోగూడ యుద్ధమునకు బయలువెడలుము. పోయి సకలవానరసమేతముగ దశరథనందనులగు రామలక్ష్మణులను, సుగ్రీవుని, జయించి రమ్మనియె. అంతట మాయావియగు నావజ్రదంష్ట్రుడు నీవచనానుసారముగ బోయివచ్చెదనని రావణాసురునితో జెప్పి యనేకులగు రాక్షసులతోగూడుకొనినవాడై బయలువెడలె. అట్లుబయలువెడలునపుడు ఆవజ్రదంష్ట్రుడు, ఏనుగులతోడను, గుఱ్ఱములతోడను, ఒంటెలతోడను, గాడిదెలతోడను, గూడ బయలువెడలె. పతాకములచేతను, ధ్వజములచేతను, చిత్రములగు రథములచేత నలంకరింపబడియుండె. మఱియు నావజ్రదంష్ట్రుడు విచిత్రములగు భుజబంధులనియెడు సొమ్ములచేతను, శిరోభూషణములచేతను నలంకరింప బడియుండె. మఱియు నావజ్రదంష్ట్రుడు దృఢములగు కవచములను దొడుగుకొనిధనుర్ధారియై బయలువెడలె, అట్లుబయలువెడలి పతాకములచేత నలంకరింబడినదియును, ప్రజ్వలించుచున్నదియును, పుటమువేయబడిన బంగారుపుసొమ్ములచేత నలంకరింపబడినదియును, నగురథమునకు సైన్యముతోగూడ బ్రదక్షిణమును జేసి యారథనుమీదనెక్కె. ఆసమయమునందు, కత్తులు, తోమరములు, చిత్రములగు శూలములు, ఇనుపరోకళ్లు, భిండివాలములు, పాశములు, శక్తులు, పట్టసములు, మొదలుగాగల యాయుధములను ధరించి పదాదులుగూడ బయలువెడలిరి. మఱియు నాపదాతులు, ఖడ్గములు, చక్రములు, గదలు, మిగుల దీక్ష్ణములగు గండ్రగొడ్డండ్లు, మఱియు ననేకములగు నాయుధములను జేతులయందుగలవారై బయలువెడలిరి. మఱియు నారాక్షసోత్తములందఱును విచిత్రములగు వస్త్రములను ధరించినవారగుటచేత, అధికముగ బ్రకాశించుచుండిరి. మఱియును శూరత్వముగలవియును, పర్వతములవలె మిగులగొప్పవియును, మదించినవియును నగు నేనుగులుగూడ బయలువెడలె. అట్టియేనుగులమీదనెక్కి యుద్ధములయందు నేర్పుగలవారును, తోమరములు, అంకుశనులు మొదలుగాగల యాయుధములుగలవారును, నగురాక్షసోత్తములనేకులు బయలువెడలిరి. మఱియు మహాబలవంతులును, శూరులును, నగురాక్షసులనేకులు బయలువెడలిరి. అవ్విధముగ బయలు వెడలనదియును, భయంకరమైనదియును నగు రాక్షససైన్యము మిగుల మనోహరమైనదై ప్రకాశించుచుండె. మఱియు నాసైన్యమంతయును వర్షాకాలమునందు మెఱుపుతీగలతో గూడిన మేఘమువలె బ్రకాశించుచుండె. అట్లు బయలువెడలిన రాక్షసులందఱును నంగదుడు సైన్యముతో గూడుకొని కాచియున్న దక్షిణద్వారమునకు బయనమైరి. అవ్విధముగరాక్షససైన్యమంతయును బయలువెడలిన సమయమునందనేకములగు నపశకునములు గలిగె. మఱియు నాసమయమునందు మేఘరహితమైన యంతరిక్షమునుండి యుల్కలు రాలె. అప్పుడు రాక్షసయోధులందఱును భయమోహితులై యెగిరిక్రిందబడిరి. నక్కలు అగ్నిజ్వాలలను గ్రక్కుచుభయంకరముగా గూయుచుండె. మఱియు ననేకములగు మృగములు రాక్షసులయొక్క నాశనమునకు సూచకమైన ధ్వనులను జేయుచుండె. ఇట్టియుత్పాతములనన్నిటిని జూచియును మహాబలుడగు వజ్రదంష్ట్రుడు దిగులొందక ధైర్యము నవలంబించి తేజోవంతుడును, యుద్ధమునందు ఉత్సాహముగలవాడును,నగుచు బయలువెడలె. అవ్విధముగాబయలువెడలన రాక్షసులనుజూచి జయశీలురగు వానరులందఱును దశదిక్కులను ధ్వనిగలవానినిగాజేయుచు నధికముగా గూతలిడిరి. అంతట భయంకరులును, భయంకరములగు నాకారములుగలవారును, ఒకరినొకరు చంపవలయుననియెడు నభిలాషగలవారును, నగువానరులకురాక్షసులతోగూడ సంకులయుద్ధమయ్యె. అప్పుడు మహోత్సాహముగల యారాక్షసులందఱును నెగిరియెగిరి దుముకుచు గొంతసేపు యుద్ధమును జేసిరి.

అంతట నారాక్షసులందఱును భిన్నమైనశరీరముగలవారును, తలవెండ్రుకలుగలవారును, నెత్తురుచేతవ్యాప్తమైనస

ర్వావయవములుగలవారునునై భూమియందుబడిరి. అప్పుడుశూరులగు రాక్షసులుగొందఱు నొకరినొకరుపట్టుకొని పరిఘములను నాయుధములు జేతులయందుగలవారును, యుద్ధరంగమునుండి వెనుకకుమరలనివారునునగుచు నానావిధములగు నాయుధములను విసరివైచిరి. ఆసమయమునందు వృక్షములయొక్కయు, శిలలయొక్కయు, శస్త్రములయొక్కయు మిగులగొప్పదగు ధ్వనిభయంకరమైనదియును హృదయములను బ్రద్దలుగజేయునదియునునై బయలువెడలె. మఱియును రథచక్రములయొక్కయంచులవలన గలిగినధ్వనియును, ధనుస్సుయొక్క ధ్వనియును, శంఖములయొక్కయు, రణభేరులయొక్కయు, మద్దెలలయొక్కయు, ధ్వనిమిగులసంకులమైనదై బయలువెడలె. అంతటనారాక్షసులలోగొందఱు అస్త్రములనువిడిచిపెట్టి బాహుయుద్ధమును జేసిరి. మఱికొందఱురాక్షసులు పాదతలములచేతను, పాణులచేతను, పిడికిళ్లచేతను, వృక్షములచేతను, మోకాళ్లచేతను, మిగులభయంకరమగుయుద్ధమును జేసిరి. అప్పుడుగొందఱురాక్షసులు భిన్నమైన శరీరములుగలవారైరి. యుద్ధమునందధికమగు మదముగలవానరులచేత గొందఱురాక్షసులు చూర్ణముచేయబడిరి. అప్పుడుమహాబలుడగు వజ్రదంష్ట్రుడు మిగులభయంకరములగుబాణములచేత నధికముగా వానరులకు భయమునుగల్పించుచు బ్రళయకాలమునందలియమునివలె భయంకరుడై సంచరించుచుండె. మఱియునాసమయమునందు బలవంతులును, అస్త్రవేత్తలును, నానావిధములగునాయుధములనుధరించినవారును, నగురాక్షసులుక్రోధోద్దీపితులై వానరసేనలనుగొట్టిరి. అవ్విధముగా వానరులనుగొట్టుచున్న రాక్షసులనుజూచి వాలిపుత్రుడగు నంగదుడు మునుపటికంటె నధికమగుకోపముగలవాడై ప్రళయకాలమునందలి యగ్నిదేవునివలె యుద్ధభూమియందు సంచరించుచుండె. అవ్విధముగసంచరించుచు నారాక్షసులనందఱునుజూచి వీర్యవంతుడగు నంగదుడు గోపముచేత గన్నులనెఱ్ఱగాజేసికొని వృక్షమునొక్కదానిం బట్టుకొని బయలువెడలి సింహమునీచములగు మృగములనుదరుమువిధముగ సకలరాక్షసులనుదరిమె. అంతటదేవేన్ద్రునియొక్క పరాక్రమమువంటి పరాక్రమముగల అంగదుడు మిగులభయంకరమగు యుద్ధమునుజేసె. ఆసమయమునందు భయంకరముగల రాక్షసులందఱును నంగదునకభిముఖులై యుద్ధమునుజేసి యంగదునిచేత బ్రద్దలుసేయబడిన శిరస్సులుగలవారై ఛేదింపబడిన వృక్షములవలె గ్రిందబడిరి. ఆసమయమునందాయుద్ధభూమియంతయును, రథములచేతను, గుఱ్ఱములచేతను, చిత్రములగు ధ్వజములచేతను, వానరులయొక్కయు, రాక్షసులయొక్కయు శరీరములచేతను, నెత్తురుచేతనువ్యాప్తమైనదై మిగులభయంకరమైనదైయుండె. మఱియునాయుద్ధభూమి హారకేయూరవస్త్రములచేతను, శస్త్రములచేతను, నలంకరింపబడినదై శరత్కాలమునందలిరాత్రివలె బ్రకాశించుచుండె. ఆసమయమునం దంగదునియొక్కవేగముచేత మిగులగొప్పదియగు రాక్షసబలమంతయును వాయువుచేత మేఘముచెదరువిధమునగాచెదరె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి యేబదిమూడవ సర్గ ముగిసెను.

-(✵)-

వజ్రదంష్ట్రుడు అంగదునితో యుద్ధముజేసి చచ్చుట.

అవ్విధముగ రాక్షసబలమంతయును నశించుటచేతను, అంగదునకధికమగు జయముగలుగుటచేతను, మహాబలుడగు వజ్రదంష్ట్రుడుమిగులగోపముగలవాడై పిడుగుయొక్క ధ్వనివంటిధ్వనిగలుగునట్లుగా ధనుష్టంకారమునుజేసి వానరసైన్యముమీద మిగులభయంకరమగు శరవర్షమునుగురిపించె. ఆసమయమునందు ముఖ్యులగు రాక్షసులందఱునునానావిధములగు నాయుధములనుధరించినవారై రథములయందెక్కియధికమగు యుద్ధమునుజేసిరి. అప్పుడు వానరులలో శూరులగు వానరోత్తములందఱును, వృక్షములను, రాళ్లను, ఆయుధములనుగా ధరించినవారై యొక్కటిగాజేరికొని మిగుల భయంకరమగుయుద్ధమునుజేసిరి. అట్టియుద్ధమునందనేకులగు రాక్షసోత్తములనేకములగు నాయుధములను వానరులమీద బ్రయోగించిరి. అప్పుడువీరులును, మదపుటేనుగులతో సమానులును, నగు వానరోత్తములు రాక్షసులమీదమిగుల భయంకరములగు వృక్షములను, శిలలను, బ్రయోగించిరి. అవ్విధముగ యుద్ధమును జేయుచున్నవారలును యుద్ధములయందు వెనుకదీయనివారును, నగు రాక్షసవీరులకును, వానరోత్తములకును నప్పుడుమిగుల భయంకరమగుయుద్ధముజరిగె. ఆసమయమునందు రాక్షసోత్తములలో గొందఱును, వానరోత్తములలోగొందఱును బ్రద్దలైనశిరస్సుగలవారును, భిన్నములగుపాదములు మొదలుగాగలయవయవములుగలవారును, వృక్షములచేతను, శిలలచేతను, నానావిధములగు నాయుధములచేతను. వ్యాప్తములైనశరీరముగలవారునునై భూమియందు బడిరి. కొందఱువానరులును, రాక్షసులును నెత్తురుచేతవ్యాప్తమైన శరీరముగలవారైరి. కొందఱు వానరులును, రాక్షసులును, కంకపక్షులచేతను, గ్రద్దలచేతను, నక్కలచేతను, భక్షింపబడుచుండిరి. ఆసమయమునందు భయపడెడు స్వభావముగల

వానరులయొక్కయు, రాక్షసులయొక్కయు, కబంధములుభయంకరములై కనబడుచుండె. మఱియునాసమయమునందు రాక్షసులలో గొందఱును, వానరులలో గొందఱును, భిన్నములగుభుజములను, హస్తములను, శిరస్సులను, శరీరములనుగలవారై యారణభూమియందుబడిరి. మఱియునాసమయమునందు మహాబలుడగు వజ్రదంష్ట్రుడుసూచుచుండగా వానరసైన్యముచేత జంపబడుచున్న రాక్షససైన్యమంతయును గ్రిందబడుచుండె. అంతట బ్రతాపవంతుడగువజ్రదంష్ట్రుడు వానరులచేత గొట్టబడుచున్నవారును, భయపడుచున్నవారును నగు రాక్షసులనుజూచి కోపముచేత కన్నులనెఱ్ఱగాజేసికొని ధనుర్ధారియై యావానరసైన్యమునందు బ్రవేశించె. అంతట కంకపత్రములుగలవియును, సరళములైనవియును, నగు బాణములచేత వానరులగొందఱజీల్చె. అంతట వానరులందఱును బాణములచేత గ్రుంచబడినశిరస్సులుగలకొందఱజూచి మిగులభయమునుబొందిరి. అప్పుడు వానరులందఱును బ్రహ్మదేవుని బ్రజలువెంబడించిన విధముగా నంగదునివెంబడించిరి. ఆసమయమునందు వాలిపుత్రుడగు నంగదుడు వజ్రదంష్ట్రుని బాణములచేత భగ్నులైనవానరులనుజూచె. పిమ్మటమిగుల గోపముతో వచ్చుచున్నవజ్రదంష్ట్రునిజూచి కోపోద్దీపితుడయ్యె. అంతట వానరోత్తమ రాక్షసోత్తములగు నంగదుడును, వజ్రదంష్ట్రుడును, మిగుల గోపముగలవారై మదపుటేనుగులవలె యుద్ధసన్నద్ధులైరి. అట్టిసమయమునందు మహాబలుడగు వజ్రదంష్ట్రుడు తోమరములచేత నంగదునియొక్క మర్మస్థలములను, "ఏనుగుయొక్కమర్మస్థానములను బగులగొట్టువిధముగా" బగులగొట్టె. అప్పుడువాలిపుత్రుడును, మహాబలవంతుడును, నగు నంగదుడు నెత్తురుచేత వ్యాప్తములైనసర్వావయవములును గలవాడగుటచేత గ్రోధోద్దీపితుడై యధికమగు పరాక్రమమునవలంబించి యావజ్రదంష్ట్రునిమీద మిగులభయంకరమగు వృక్షమును బ్రయోగించె. అవ్విధముగనంగదునిచేత బ్రయోగింపబడినదియును, అధికవేగముతోవచ్చుచున్నదియును, నగు వృక్షమునుజూచి రాక్షసోత్తముడగు వజ్రదంష్ట్రుడు మిగుల విభ్రాంతుడై యావృక్షమును దనబాణములచేత నానావిధములుగాఛేదించె. అంతటవానరోత్తముడగు నంగదుడా వజ్రదంష్ట్రునియొక్క యధికమగు పరాక్రమమునుజూచి మరలమిగులగొప్పదగు నొక్కపర్వతమును ఆవజ్రదంష్ట్రునిమీద బ్రయోగించియతిభయంకరారావముగలుగునట్లు సింహనాదమును జేసె. అంతట రథమునుండి దిగివచ్చుచున్నవాడును, మిగుల బరాక్రమముగలవాడును, నగు వజ్రదంష్ట్రునిజూచి యంగదుడుగదాపాణియై భూమియందునిలుచుండె. పిమ్మటనాగదను వజ్రదంష్ట్రుని రథముమీద బ్రయోగించి గుఱ్ఱములుమొదలగువానితోగూడ రథమునుచూర్ణముజేసె. అంతటనూరకుండక యాయంగదుడు వృక్షములచేత నలంకరింపబడిన మఱియొకపర్వతమును గైకొని వజ్రదంష్ట్రునియొక్క శిరస్సునందు బ్రయోగించె. అప్పుడు వజ్రదంష్ట్రుడు నెత్తురుచేతవ్యాప్తమైనశరీరముగలవాడై మూర్ఛనొంది క్రిందబడియె. అవ్విధముగదనచేతిలోనిగదను కౌగిలించుకొని కొంతసేపు మూర్ఛనొంది క్రిందబడియుండె. అంతగొంతసేపటికి దెలివొంది కోపోద్దీపితుడై తనచేతియందలి గదచేత నంగదునియొక్కఱొమ్మునందు గొట్టె. అంతటనయ్యిద్దఱును ముష్టియుద్ధముజరుగనారంభించె. అప్పుడువానరోత్తమ రాక్షసోత్తములగు నంగద వజ్రదంష్ట్రులు నెత్తురుచేతవ్యాప్తములైనదేహములుగలవారును, బాణములయొక్క దెబ్బలచేతబుట్టినయాయాసముగలవారును, నగుచు బరస్పరమునుగొట్టుకొనిరి. మఱియునయ్యిరువురును మిగులబరాక్రమముగలబుధాంగారకులవలె యుద్ధమునుజేయుచుండిరి. అంతటగొంతసేపటికి వానరోత్తముడును, అధికమైన తేజస్సుగలవాడును, నగు నంగదుడు పుష్పములతోడను, ఫలములతోడను, గూడుకొనిన వృక్షమును నాయుధముగా ధరించియుండె. మహాబలుడగు వజ్రదంష్ట్రుడు మిగులశ్రేష్ఠమైనదియును, పరమపావనమైనదియును, కింకిణీజాలములచేత వ్యాప్తమైనదియును, చర్మముచేత నలంకరింపబడినదియును నగు ఖడ్గమును ధరించి నిలుచుండె. అంతట నయ్యిరువురును నధికమైనకోపముగలవారై విచిత్రములగు గతులతో సంచరించుచుండిరి. మఱియునయ్యిరువురును జయకాంక్షగలవారైపరస్పరమును దయారహితముగ గొట్టుకొనిరి. ఆసమయమునందయ్యిరువురును నెత్తురుతోగూడుకొని వ్రణములచేతబూచినమోదుగుచెట్లవలె బ్రకాశించుచుండిరి. మఱియు నయ్యిరువురును నతివిచిత్రముగ యుద్ధమునుజేయుచు నలసి కొంతసేపు మోకాళ్లను భూమిమీదమోపి యుద్ధమునుజేసిరి. అంతగొంతసేపటికి వానరోత్తముడగు నంగదుడు కోపముచేత కన్నులనెఱ్ఱగాజేసికొని "కఱ్ఱచేతగొట్టబడినపామువలె" లేచె. అంతటనయ్యంగదుడు మిగులనిర్మలమైన ఖడ్గముచేత వజ్రదంష్ట్రునియొక్క శిరస్సునుఖండించె. అప్పుడు నెత్తురుచేతవ్యాప్తమైన శరీరముగలయా వజ్రదంష్ట్రునియొక్కశిరస్సు ఖడ్గముచేతద్రుంచబడినదై కోపముచేతనెఱ్ఱగాజేయబడినవియును, ద్రిప్పబడినవియును, నగు గ్రుడ్లుగలదగుచు గ్రిందబడియె. అవ్విధముగజంపబడినవజ్రదంష్ట్రునిజూచి రాక్షసులందఱును భయముచేత మోహితులైరి.

మఱియును వానరులచేత గొట్టబడినవారగుచు భయముగలవారై లంకాపట్టణమునకు బరుగెత్తిరి. అట్లు లంకాపట్టణమునకు బోవునపుడు ఆ రాక్షసులందఱును విషణ్ణవదనులును, సిగ్గుచేతవంపబడినమోముగలవారునునై యుండిరి. ఆ సమయమునందు దేవేంద్రునియొక్క మహిమవంటి మహిమగల యంగదుడు వజ్రదంష్ట్రుని సంహరించి యావానర సైన్యముయొక్క మధ్యయందుగూర్చుండి "మహాబలుడును, వేయినేత్రములుగలవాడును, నగు దేవేంద్రుడు దేవతలతో గూడుకొనిసంతోషమును బొందువిధముగ" సంతోషమును బొందుచుండె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి యేబదినాల్గవ సర్గ ముగిసెను.

—{ రావణాసురుడుఅకంపనునిరామలక్ష్మణులమీదికి యుద్ధమునకుబంపుట. }—

అవ్విధముగ, వాలిపుత్రుడగు నంగదునిచేత వజ్రదంష్ట్రుడు జంపబడినవృత్తాంతమును దెలిసికొని రావణాసురుడు తనసమీపమునందు జేతులనుముకుళించుకొనియున్నవాడును, బలాఢ్యుడును, నగుప్రహస్తునితో నిట్లనియె. రాక్షసోత్తమా! సకలశస్త్రములను దెలిసినయకంపనుని ముందిడుకొని మిగుల భయంకరమగు పరాక్రమముగల రాక్షసులందఱను యుద్ధమునకుబయలువెడలునట్లుచేయుము. ఈయకంపనుడు శత్రుసైన్యమును నిగ్రహించుటయందు మిగుల సామర్థ్యముగలవాడు. తనబలమును సర్వమును గాపాడుటయందు దగినసామర్థ్యముగలవాడు. సేనానాయకుడు. ఇంతయగాక యుద్ధమునందు మిగుల గోరికగలవాడు. ఇంతయగాక సర్వకాలములయందును నాకుమేలుగలుగవలయుననియే గోరుచుండువాడు. కావున శత్రువులనుదపింపజేయునట్టి యీయకంపనుడు కకుత్స్థుని కులమునందు బుట్టిన రామలక్ష్మణులను, మహాబలుడగు సుగ్రీవుని, మిగుల భయంకరులగు వానరోత్తములనుజయింపగలడనియె. అంతట నాప్రహస్తుడు రావణాసురుని యాజ్ఞను శిరస్సుమీద బెట్టుకొని రాక్షససైన్యమును సర్వమును మిగుల శీఘ్రముగ బయనముసేసె. అప్పుడు నానావిధములగు నాయుధములనుధరించినవారును, భయంకరమగు దర్శనముగలవారును, నగు రాక్షసులనేకులు బలాఢ్యుడగు ప్రహస్తునిచేత బ్రేరేపింపబడినవారై బయలువెడలిరి. ఆసమయమునందు పుటముపేయబడిన బంగారుకుండలములను ధరించినవాడును, మేఘముయొక్క కాంతివంటి కాంతిగలవాడును, మేఘముతో సమానుడును, ఉరుమువంటి కంఠధ్వని గలవాడును, నగునకంపనుడు రథమునెక్కి భయంకరులగు ననేకరాక్షసులతో గూడుకొనినవాడై బయలువెడలె. ఆయకంపనుడు యుద్ధమునందు దేవతలచేతగూడ ధర్షింపశక్యముగానివాడు. మఱియు నాయకంపనుడు తేజస్సుచేత సూర్యునివంటివాడు. అట్టియకంపనుడు యుద్ధమును జేయవలయు ననియెడు కోరికతో బయలువెడలగానే రథమునువహించుచున్న గుఱ్ఱములకు అకస్మాత్తుగా దైన్యముసంభవించె. మఱియు యుద్ధమునందభిలాషగల యాయకంపనుని యొక్క యెడమనేత్రమునందు గంపముగలిగె. మఱియు నాయకంపనుడు వెలవెలబోవుచున్న ముఖవర్ణము గలవాడును, గద్గదస్వరముగలవాడును, నయ్యె. మఱియు నాదినముసుదినమయ్యును, రూక్షమైనవాయువుగల దుర్దినమయ్యె. మఱియు సకలమృగములును, పక్షులును, క్రూరములును, భయంకరములును, నగువాక్యములనుబలికె. పెద్దపులియొక్క పరాక్రమమువంటి పరాక్రమము గలవాడును, సింహమునియొక్క మూపురమువంటి మూపురముగలవాడును, నగునాయకంపనుడుఆదుశ్శకునములను గమనింపకయే యుద్ధభూమికిబయనమై పోయె. అవ్విధముగ నకంపనుడు సకలరాక్షససైన్యములతోగూడ బోవుచున్న సమయమునందు గలిగిన కలకలధ్వని సముద్రమునుగూడ క్షోభపెట్టుచుండె. ఆమహాధ్వనినివినుటచేత వానరుల సైన్యమంతయు మిగుల భయముగలదయ్యె. పిమ్మట వానరులందఱును, వృక్షములు, పర్వతములు, మొదలగువాని నాయుధములనుగాధరించి యుద్ధమును జేయుటకుద్యుక్తులైరి. అంతట నావానరులకును, రాక్షసులకును, మిగుల భయంకరమగు యుద్ధముజరిగె. ఆవానరులును, రాక్షసులును, రామరావణులకొఱకు బ్రాణములయందలి యాశను వదలుకొనిరి. మఱియు నావానరులును రాక్షసులునందఱును నతిబలముగలవారు. అందఱును నతిశూరులు. అందఱును బర్వతములతోసమానమైన యాకారము గలవారైయుండిరి. మఱియు నావానరులును, రాక్షసులును నొకరినొకరు చంపవలయుననియెడు కోరికగలవారైయుండిరి యుద్ధమునందు మిగులవేగముగలవారును, అధికముగ గూత లిడుచున్నవారును, క్రోధావేశముచేత బరుషవచనములను మాటలాడుచున్నవారును, నగు వానరులయొక్కయు, రాక్షసులయొక్కయు, ధ్వని మిగుల భయంకరమైనదైయుండె. ఆసమయమునందు వానరులయొక్కయు, రాక్షసులయొక్కయు, పాదఘట్టనమువలన గలిగినదియును, మిగుల భయంకరమైనదియును, ఎఱ్ఱనికాంతిగలదియును, నగుపరాగము పదిదిక్కులయందును వ్యాపించి దిగ్విభాగము లేకుండునట్లు చే

యుచుండె. మఱియు నాదుమ్మొకట్టముగా వ్యాపించుటవలన నొకరినొకరు కనబడకయుండిరి. మఱియు ధ్వజములును, పతాకములును, కవచములును, గుఱ్ఱములును, ఆయుధములును, రథములును, పరాగముచేత గప్పబడుటవలన గనబడకయుండె. ఆసంకుల యుద్ధమునందు బరుగెత్తుచున్నవానరులయొక్కయు, రాక్షసులయొక్కయు భయంకరములగు ధ్వనులుమాత్రము వినబడుచున్నవిగాని రూపములు కనబడడములేదు. అదికారణముగ గోపవంతులగు వానరులు గోపవంతులగురాక్షసులనే సంహరించుచుండిరి. దుమ్ముచేత సర్వస్థలములయందును జీకటివ్యాపించుటచేత నిర్విశేషముగా యుద్ధమొజరుగుచుండె నవ్విధముగ యుద్ధమును జేయుచున్న సమయమునందు శస్త్రములుమొదలగు వానిదెబ్బలచేత బయలువెడలిన రక్తముప్రవాహరూపముగ బయలువెడలి యాదుమ్మునుసర్వమును నణచె. అప్పుడు ఆరణభూమియంతయును, పీనుగులచేత వ్యాప్తమైయుండె. మఱియు నాయుద్ధమునందు రాక్షసులును, వానరులును, పరస్పరమును బరాక్రమించి, వృక్షములు, శక్తులనియెడు నాయుధములు, శిలలు, ప్రాసములు, గదలు, పరిఘలు, తోమరములు, మొదలుగాగల యాయుధములచేత గొట్టుకొనుచుండిరి. మఱియు బర్వతములవలె మిగుల బెద్దవియగు నాకారములుగల వానరులును, రాక్షసులును, పరిఘలవలె మిగుల బొడవులగు భుజములచేత నధికముగా గొట్టుకొనుచుండిరి. మఱియు నాసమయమునందు భయంకరులగు వానరవీరులు రాక్షసులను గొట్టిరి. ఆసమయమునందు రాక్షసులునధికమగుకోపముగలవారును, ప్రాసములును, తోమరములును, నాయుధములుగాగలవారునునై మిగుల దారుణములగు నాయుధములచేత వానరుల నందఱను గొట్టిరి. ఆసమయమునందు రాక్షససైన్యాధిపతియగు నకంపనుడు మిగుల నధికమగు కోపముగలవాడై భయంకరమగు పరాక్రమముగల రాక్షసులనందఱను యుద్ధసన్నద్ధులనగాజేసె. మఱియు నప్పుడు వానరులందఱును మిగుల గొప్పవగు వృక్షములచేతను, మిగుల గొప్పవగు శిలలచేతను, రాక్షసులను జీల్చిరి. మఱియు శస్త్రములచేత నారాక్షసుల నానావిధములుగా ఖండించుచుండిరి. ఆసమయమునందు వానరవీరులగుకుముదుడును, నలుడును, మైందుడును, ద్వివిదుడును, కోపోద్దీపితులై యతివేగముగ యుద్ధమునకు వచ్చిరి. అంతట నావానరులందఱును రాక్షసులను నానావిధముల బాధించుచుండిరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి యేబదైదవసర్గ ముగిసెను.

హనుమంతుడు అకంపనుని సంహరించుట.

అట్లువానరోత్తములచేత జేయబడినదియును, మిగుల భయంకరమైనదియును, నగు కర్మనుజూచి యకంపనుడు యుద్ధమును జేయదలచి యధికముగ గోపమును జెందె. ఆవిధముగా నధికమైన కోపముగలవాడై సర్వోత్తమమగు ధనుస్సునుకదలించుచు యుద్ధమునందు శత్రువులు చేయునట్టి కర్మనుజూచి తనసారథితో నిట్లనియె. సారథీ! చూడుము. అక్కడనసేకులగు వానరులు రాక్షసులను జంపుచున్నారు. కావున నచ్చోటునకు మనరథమునుబోనిమ్ము. మఱియు నోసారథీ! బలవంతులును, భయంకరములగు శరీరములుగలవారును, నగువానరులు, వృక్షములును, శిలలును, ఆయుధములుగాగలవారై సమ్ముఖముగా నిలిచి యున్నారు. కావున యుద్ధమునందు మిగుల శ్రేష్ఠులగు నీవానరులను జంపవలయునని కోరుచున్నాను. ఈవానరులచే మిగుల బలముగలరాక్షససైన్యమంతయును నశింపజేయబడినదనిపల్కె. అంతట రథికులలో నుత్తముడగు నకంపనుడు మిగులవేగముగల రథముతో గూడబోయి బాణములచేత నావానరులనందఱను గొట్టె. ఆసమయమునందు వానరులందఱును యుద్ధమునుజేయలేక పోవుటయేగాక యాయకంపనుని ముందఱనిలుచుటకు గూడ సామర్థ్యములేనివారైరి. మఱియు నప్పుడకంపనునియొక్క బాణములచేత గొట్టబడి వానరులందఱును నిలువజాలక పరుగెత్తిరి. మఱియు నకంపనునివలలో దగులుకొని మృత్యువశమును బొందిన వానరులనుజూచి మహాబలవంతుడగు హనుమంతుడు బయలువెడలి మహావేగముతో వచ్చె. అవ్విధముగా వచ్చుచున్న హనుమంతునిజూచి యుద్ధమునందు మిగుల సామర్థ్యముగలవారును, వీరులును, నగువానరాధిపతులందఱును మహాసంతోషముతో వచ్చిచుట్టుకొనిరి. మఱియు నాసమయమునందు వానరాధిపతులందఱును బలవంతుడగు హనుమంతుని నాశ్రయించుటచేత మిగుల బలముగలవారైరి. ఆసమయమునందు మిగుల బలవంతుడగు నకంపనుడు తనసమ్ముఖముగా యుద్ధసన్నద్ధుడైయున్న హనుమంతుని మీద దేవేంద్రునివలె బాణవర్షముగురిపించె. అవ్విధముగా నకంపనునిచేత బ్రయోగింపబడినవియును, మిగుల దీక్ష్ణములైనవియును, తనశరీరమునందు గ్రుచ్చబడి యున్నవియును, నగుబాణములను లక్ష్యముచేయక హనుమంతుడ డయ్యె. అంతట మిగుల తేజస్సుగలవాడును, వాయుదేవునకుపుత్రుడును, నగు హనుమంతుడు భూమిని సర్వమును

వణికించుచునా యకంపనునివరిమె. మఱియునధికముగ గూత లిడుచుండె. అవ్విధముగా సింహనాదమును జేయుచున్నవాడును, తేజస్సుచేత బ్రకాశించుచున్నవాడును, నగు నాహనుమంతునియొక్క రూపమగ్నిదేవునియొక్క రూపము వలెజూచుటకుగూడ శక్యముగానిదైయుండె. పిమ్మటవానరోత్తముడగు హనుమంతుడు తనకు దెబ్బలుతగలకున్నమ్మకముగలవాడై యధికమగు కోపముతో నొక్కపర్వతమును బెల్లగించె.

అవ్విధముగ నాహనుమంతుడు నపర్వతమును నొక్కచేతితో బట్టుకొని యధికముగా సింహనాదమును జేసి యాపర్వతమును గిరగిర ద్రిప్పె. అంతట నాపర్వతము చేత, పూర్వము దేవేంద్రుడు వజ్రాయుధమును జేతబట్టుకొని నముచియను వానిని దరిమినవిధముగా రాక్షసోత్తముడగు నకంపనుని దరిమె. అవ్విధముగ బర్వతమును ధరించివచ్చుచున్న హనుమంతుని దూరముననే చూచి యకంపనుడు క్రోధోద్దీపితుడై యర్ధచంద్రాకారములగు బాణములచేత నాపర్వతమును జూర్ణముసేసె. అట్లు రాక్షసోత్తముడగు నకంపనుని బాణములచేత గొట్టబడినదై యంతరిక్షముననే యాపర్వతము చూర్ణమగుటను జూచి హనుమంతుడు క్రోధమూర్ఛితుడయ్యె. అట్లు క్రోధోద్దీపితుడై యాహనుమంతుడు మద్దిచెట్లతో గూడుకొనినదియును, మిగులబొడవైనదియును, నగు మరియొక పర్వతమును బెల్లగించె. అట్లు మహాతేజోవంతుడగు హనుమంతుడు మద్దిచెట్లతో గూడుకొనినదియును, గొప్పవగు స్కంధములుగలదియును, నగు నాపర్వతమును గ్రహించినవ్వియధికమగు శ్రీతితో గిరగిర ద్రిప్పె. మఱియు గోపోద్దీపితుడగు నాహనుమంతుడధికమగు వేగముతో బరుగెత్తుచు నూరువేగముచేత మార్గమధ్యమునందలి వృక్షములన్నిటిని విఱుచుచుండె. మఱియును బాదతాకుడుచేత భూమిని బ్రద్దలుసేయుచుండె. అంతట నాహనుమంతుడు, ఏనుగులను, ఏనుగులమీద నెక్కినవారలను, రథములను, రథములమీ నెక్కి యుద్ధమును జేయుచున్నవారలను, పాదచారులగు రాక్షసవీరులను సంహరించె. అవ్విధముగ యుద్ధమునందు బ్రళయకాలమునందలి యమునివలె బ్రాణాపహారమును జేయుచున్న హనుమంతుని జూచి రాక్షసులందఱును భయముచే తబరుగిడిరి. అవ్విధముగ రాక్షసులకు భయమును గలుగజేయుచున్నవాడును, గోపోద్దీపితుడై తనకభిముఖవచ్చుచున్నవాడును, నగు హనుమంతుని జూచి వీరుడగు నకంపనుడు గోపోద్దీపితుడై మిగులభయముగలుగునట్లు సింహనాదమును జేసె. అట్లు అకంపనుడు సింహనాదము జేసి మహావీర్యుడగు హనుమంతునిమీద మిగులదీక్ష్ణములగు పదిబాణములను బ్రయోగించి బాధనొందించె. అప్పుడవ్విధముగా ననేకములగు బాణములచేతగొట్టబడినవాడును, వీర్యుడును, నగు హనుమంతుడు వృక్షములచేత నిండియున్న పర్వతమువలెగనబడెను. అంతట నాహనుమంతుడు మిగుల వేగముగలవాడై మరియొక వృక్షమును బెల్లగించుకొనివచ్చి యాయకంపనుని శిరస్సుమీద విసరివైచె. అట్లు మహానుభావుడును, కోపవంతుడును నగు హనుమంతునిచేత విసరివేయబడిన వృక్షముల చే గొట్టబడిన యకంపనుడు క్రిందబడి మరణమును బొందె. అవ్విధముగ భూమియందుబడి మరణమును బొందియున్నవాడును, రాక్షసోత్తముడును, నగు నకంపనుని జూచి రాక్షసులందఱును, భూకంపముగలుగునపుడు వృక్షములు గడగడవణకువిధముగా వణకుచుండిరి. అంతట నపజయమును బొందిన యారాక్షసులందఱును మిగులభయముగలవారును, వానరులచేత గొట్టబడినవారును నై పలాయితులైరి మఱియు నారాక్షసులందఱును విరియబడిన తలవెండ్రుకలుగలవారును, అపజయమును బొందినవారును, చెమటతో గూడుకొనిన అవయవములుగలవారును నై పరుగెత్తిరి. అవ్విధముగ నారాక్షసులందఱును బరుగెత్తునపుడొకరినొకరు రుద్దుకొనుచు నధికమగు భయమువలన లంకాపట్టణమునకు బోయిరి. మఱియు నవ్విధముగ బోవునపుడు భయముచేత మాటిమాటికిని వెనుకకు దిరిగి చూచుచుండిరి. అవ్విధముగ రాక్షసులందఱును లంకాపట్టణమునందు బ్రవేశింపగానే మహాబలులగు వానరులందఱును నొక్కటిగా జేరి హనుమంతుని మిగుల గౌరవముతో బూజించిరి. అంతట నాహనుమంతుడును, వానరులనందఱను బూజించె. మఱియును బలవంతుడగు నాహనుమంతుడు మిగులననుకూలతగలవాడై సంచరించె. మఱియును జయశీలురగు వానరులందఱును సమశక్తికొలది కూతలువేయుచు మిగిలిన రాక్షసులయొక్క ప్రాణములనపహరించిరి. వాయుదేవునకు బుత్రుడును, వానరోత్తముడును నగు హనుమంతుడు, రాక్షసోత్తముడును, భయంకరుడును, శత్రువులను నశింపజేయువాడును, నగు బలిచక్రవర్తిని విష్ణుదేవుడు సంహరించినవిధముగ అకంపనుని సంహరించె. ఆసమయమునందు దేవతలును, రామలక్ష్మణసుగ్రీవాదులును, మఱియు నితరులగు వానరోత్తములును, మహాబలుడగు విభీషణుడును హనుమంతుని బూజించిరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి యేబదారవ సర్గ ముగిసెను.

రావణాసురుడు ప్రహస్తుని యుద్ధమునకు బంపుట.

అంతట రాక్షసాధిపతియగు రావణాసురుడు అకంపనునియొక్కవధనువిని కొంచెము సేపు దీనమైన ముఖముగలవాడై తనసమీపమునందున్న మంత్రులనుజూచె. అంతట నా రావణాసురుడు క్షణము సేపుమంత్రులతోగూడ నాలోచించె. పిమ్మట బూర్వాహ్ణమునందే బయలువెడలి రాక్షసాధిపతియగు రావణాసురుడు సకలగుల్మములను జూడదలచి లంకాపట్టణమునందంతటను దిరుగుటకుబయలువెడలె. పిమ్మట రాక్షస సముదాయముచేత గాపాడబడినదియును, నానావిధములగు గుల్మములచేత నావృతమైనదియును, పతాకములయొక్కయు, ధ్వజములయొక్కయు, సముదాయముగలదియును, నగు లంకాపట్టణమును సర్వమునుజూచె. మఱియునపుడు రాక్షసాధిపతియగు రావణాసురుడు శత్రువులచేత నాక్రమింపబడియున్న లంకాపట్టణమునుజూచియధికమగు కోపముగలవాడై యుద్ధకోవిదుడగు ప్రహస్తునితోనిట్లనియె. సమీపమునందు నివసించియున్నశత్రుసైన్యముగలదియును, లెస్సగాశత్రుసైన్యముచేత బీడింపబడినదియును, నగు లంకాపట్టణమునకు యుద్ధముచేతదప్పమఱియొకకారణముచేత మేలుగలుగదు. కావునయుద్ధశాస్త్రవిశారదుడవైనయోప్రహస్తుడా! నేను, నీవు, కుంభకర్ణుడు, ఇంద్రజిత్తు, నికుంభుడును. తప్పనితరులెవ్వరును నీభారమునువహింపజాలరు. కావున సేనాపతివైనయోప్రహస్తుడా! నీవుసకలరాక్షససైన్యమును వెంటబెట్టుకొని బయలువెడలి వానరులునివసించియున్న చోటునకుబొమ్ము. ప్రహస్తుడా! నీవుబయలువెడలినతోడనే రాక్షసులయొక్కసింహనాదములనువిని చపలస్వభావముగల వానరసైన్యమంతయునునిశ్చయముగాబరుగెత్తిపోగలదు. చపలస్వభావముగలవారును, నీతిలేనివారును, నగువానరులు ఏనుగుసింహనాదమునువినిభయమునుబొందినవిధముగా రాక్షసులయొక్క మహానాదమునువిని పలాయితులగుదురు. అట్లువానరసైన్యమంతయునుబయలువెడలిపోగానే రాముడులక్ష్మణునితోగూడ దిక్కులేనివాడై స్వాధీనుడుగాగలడు. మఱియు నోప్రహస్తుడా! యుద్ధమునందుమరణమునుబొందుట యుత్తమము గానియుద్ధమును జేయక శత్రువులమూలకముగ మరణమునుబొందుటయుచితముకాదు. కాబట్టి నాకుయుద్ధమును జేయుటయే యుచితమనితోచుచున్నది. ఇట్లుగా జేసినాకు మేలుగలుగజేయవలయునని యెడు కోరికగల నీకేమితోచుచున్నదో చెప్పమనియె. ఇవ్విధముగా రావణాసురుడు చెప్పినమాటలనువిని సేనాపతియగు ప్రహస్తుడు రాక్షసేంద్రుడగు రావణాసురునితో శుక్రాచార్యులుచెప్పువిధముగా జెప్పదలచియిట్లనియె. రాక్షసరాజోత్తమా! నేనుమంత్రులతోగూడ నివిషయమునందనేకవిధములచేత విచారించిచూచితిని. పిమ్మట జేయదగినకార్యమునునిశ్చయించితిని. ఆవిషయమును సర్వమును జెప్పెదను. వినుము. సీతాదేవిని రామునకు సమర్పించుటయుచితముగానున్నది. సీతనునివ్వకపోయినయెడల మనకుమిగుల భయంకరమగుయుద్ధము జరుగునని నిశ్చయించితిని. మఱియునో రావణాసురుడా! నేనుదానములచేతను, మానములచేతను, నానావిధములగు సాంత్వవచనములచేతను, నీవలనబూజింపబడితిని. నీచేతబూజింపబడుచున్ననేనునీకు ప్రియమును జేయుటకు సిద్ధముగనున్నాను. నీనిమిత్తముగ బుత్రదారధనాదులతోగూడ బ్రాణములనువదలుటకుసిద్ధముగనున్నాను. నేనునీనిమిత్తముగ మిగులగొప్పదగు యుద్ధమును జేసెదను. చూడుమనియె. ఇవ్విధముగా నాప్రహస్తుడు రాక్షసాధిపతియగు రావణాసునితో జెప్పి బలాధ్యక్షులును, తనముందఱనివసించియున్నవారును, నగురాక్షసయోధులతోనిట్లనియె. రాక్షసోత్తములారా! మనరాక్షసబలమును సర్వమునునతిశీఘ్రముగదీసికొనిరండు. నేను నాదుబాణములనుబ్రయోగించి వానరసైన్యమునుజంపివానరులమాంసములచేత బక్షులుమొదలగు మాంసభక్షకజంతువులకు దృప్తిగలిగించెదననియె. ఇవ్విధముగా బ్రహస్తుడుచెప్పినమాటలనువిని రాక్షసయోధనాధులందఱును మిగులద్వరగలవారై రాక్షససైన్యమును నొక్కచోటునకురప్పించిరి. అంతటమిగుల దీక్ష్ణములైనవియును, నానావిధములైనవియును, నగు నాయుధములతోగూడుకొనినవారును, ఏనుగులవంటివారును, నగు రాక్షసవీరులచేత లంకాపట్టణమంతయును, నిండినిబిడీకృతమయ్యె. ఆసమయమునందగ్ని త్రములనర్చించుటకొఱకు వ్రేల్చుచున్నఆజ్యముయొక్కయు బ్రాహ్మణపూజార్థముగ నుపయోగించుచున్నపూలమాలికలుమొదలగువానియొక్కయు, పరిమళముతోగూడుకొనినవాయువు పట్టణమునందంతటను వీచుచుండె. మఱియు నాసమయమునందు రాక్షసులందఱును మహాసంతోషముగలవారై యభిమంత్రితములగు పూలమాలికలన గ్రహించిరి. మఱియుధనుస్సులు మొదలుగాగల యాయుధములుగలవారై యతివేగముగవచ్చి రావణాసురునిజూచి నమస్కరించి ప్రహస్తునిజుట్టుకొని నిలుచుండిరి. అంతట బ్రహస్తుడుపరమసంతోషముగలవాడై రావణాసురునియొక్కయాజ్ఞనుబొంది రణభేరిని మ్రోగింపజేసి సకలాయుధములతోడనుగూడుకొనినరథముమీదనెక్కె. మిగుల వేగముగలగుఱ్ఱములతోగూడుకొనినదియును, యోగ్యుడగు సారథితోగూ

డుకొనినదియును, మిగులపెద్దదగు మేఘధ్వనివంటిధ్వనిగలదియును, ప్రత్యక్షముగ చంద్రసూర్యులతో సమానమైనదియును, సర్పధ్వజముతోగూడుకొనినదియును, చక్కనిరక్షకసామగ్రిగలదియును, చక్కనియవయవములుగలదియును, బంగారుపుసొమ్ములతోగూడుకొనినదియును, సంపదచేతనప్పుడున్నదానివలెనున్నదియును,నగురథముమీదనెక్కి రావణాసురునియొక్క యాజ్ఞనుబొందినవాడును, నధికమగు సైన్యముతోగూడుకొనినవాడునునై యాప్రహస్తుడు లంకాపట్టణమునుండి బయలువెడలెను. పిమ్మట మేఘధ్వనితో సమానమైన దుందుభిధ్వనియును, సముద్రమునుగూడ కంపింపచేయునట్టివావిచిత్రములనియెడువాద్యములయొక్క ధ్వనియును, శంఖధ్వనులును, సేనాపతియగు ప్రహస్తుడుబయలువెడలగానే మిగులభయంకరమైనవై బయలువెడలుచుండెను. అప్పుడు మిగులభయంకరములగు నాకారములుగలవారును, భయంకరములగు రూపములుగలవారును, ప్రహస్తునకు ముందునడుచుచున్నవారును, నగు రాక్షసులుమిగులభయంకరములగు కూతలనుబెట్టుచు బయలువెడలిరి. మఱియునాసమయమునందు నరాంతకుడు, కుంభహనుడు, మిగులపెద్దవాడగు మహానాదుడునుయెడు ప్రహస్తునిమంత్రులును మున్నగువారు ప్రహస్తునితోగూడ బయలువెడలిరి. ఇవ్విధముగమిగులభయంకరమగు రాక్షసవ్యూహముతోగూడ నాప్రహస్తుడు తూర్పుద్వారమునుండి బయలువెడలెను. అవ్విధముగ నాప్రహస్తుడు, ఏనుగులగుంపువంటి రాక్షసగుంపుతోగూడుకొనినవాడును, సముద్రముయొక్క ప్రవాహమువంటి ప్రవాహముగల సైన్యముతోగూడుకొనినవాడును, ప్రళయకాలమునందలి యమునితో సమానుడును, నై బయలువెడలెను. అట్లుప్రహస్తుడుయుద్ధసన్నద్ధుడై బయలువెడలిన సమయమునందు మిగులనధికముగా కూతలిడుచున్న రాక్షసులయొక్క భయంకరమగు ధ్వనిచేత భీతినొందినవై లంకాపట్టణమునందలి భూతములన్నియును వికారమైనధ్వనులుగలవై కూతలిడుచుండెను. మఱియు నాసమయమునందు మాంసమును, నెత్తురును, భుజించునట్టి పక్షులును, మేఘశూన్యమైన యాకాశమునందు అపసవ్యముగాను, మండలాకారముగాను, దిరుగుచుండెను. మఱియునప్పుడు నక్కలుమిగుల భయంకరములగు నగ్నిజ్వాలలనుగ్రక్కుచు మిగులభయంకరారావములుగలుగునట్లుగా కూయుచుండెను. మఱియునాసమయమునందాకాశమునుండి యుల్కలురాలుచుండెను. వాయువు మిగుల గఠినముగావీచుచుండెను. గ్రహములన్నియును, నొకదానితోనొకటిగలిసికొనినవైప్రకాశింపకుండెను. మఱియు నాసమయమునందు ప్రహస్తునిరథముమీద మేఘములుమిగులగఠినములగు ధ్వనులుగలవగుచు నెత్తురునువర్షించుచుండెను. ఆప్రహస్తునిరథపుటెక్కెముయొక్క శిరస్సునందు ఒకగ్రద్దదక్షిణాభిముఖముగాగూర్చుండెను. ఆగ్రద్దతనముక్కులచేతఱిందుతెక్కెలనుగోకికొనుచు నారథముయొక్క శోభనుసర్వమును నపహరించెను. యుద్ధమునందు ప్రవేశించుచున్నవాడును, గుఱ్ఱములనుదోలుచున్నవాడును, నగుసూతునిచేతియందలి గుఱ్ఱపుకొరడానిర్నిమిత్తముగ గ్రిందబడియె. మఱియు నాసమయమునందు మిగులజక్కగా ప్రకాశించుచున్నప్రయాణకాలీనలక్ష్మి నిమిషములో నశించిపోయెను. గుఱ్ఱములుతొట్రుపాటుగలవై నేలకుమ్రొగ్గెను. ఇవ్విధముగాయుద్ధముకొఱకు బయలువెడలివచ్చుచున్నవాడును, ప్రసిద్ధములగుబలపౌరుషములుగలవాడును, నగు ప్రహస్తునిజూచివానరులందఱును నానావిధములగు నాయుధములను ధరించినవారై బయలువెడలిరి. అంతట నావానరులు యుద్ధముకొఱకు వృక్షములనుబెల్లగించుచుండుటచేతను, మిగులపెద్దగుత్తాళ్లను, ఆకర్షించుటచేతను అతిసంకులమగు ధ్వనియొకటిగలిగెను. మఱియునారెండువిధములగు సేనయందును యుద్ధమునుజేయవలయుననియెడు కుతూహలములతో సింహనాదములుమిగులభయంకరములుగ గలిగినవయ్యెను. మఱియునొకరినొకరు చంపవలయుననియెడు కోరికతో బిలుచుచున్న వానరులయొక్కయు, రాక్షసులయొక్కయు కూతమిగుల గంభీరముగావినబడుచుండెను. అంతటనధికమగు వేగముతో యుద్ధమునుజేయవలయుననియెడు కుతూహలముతో వచ్చుచున్న యావానరసేననుజూచి దుర్బుద్ధిగల యాప్రహస్తుడు, శలభమగ్నిహోత్రము మీదికిదుముకువిధముగా నావానరసైన్యముమీదికి బోయెను.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి యేబదియేడవ సర్గ ముగిసెను.

నీలుడను వానరుడు ప్రహస్తుని జంపుట.

అట్లువానరసైన్యముమీదికి వచ్చుచున్నవాడును, భయంకరమగు పరాక్రమముగలవాడును, నగు ప్రహస్తునిజూచి శత్రునాశకుడగు రాముడు, నప్పుడు దనసమీపముననున్న విభీషణునితోనిట్లనియెను. రాక్షసోత్తమా! అధికమగుసైన్యముతోగూడుకొనినవాడును, భయంకరమైన శరీరముగలవాడును, నగు ఆవచ్చువాడెవ్వడు? వానివృత్తాంతమును దెలుపుమనిపలికిన విభీషణుడిట్లనియెను. రఘునందనా! రాముడా! ఈవచ్చువాడు ప్రహస్తుడనియెడు పేరుగలవాడు. మఱియు నీతడు రావణాసురుని సేనానాయకుడు. వీడులం

కాపట్యములోని మూడుభాగముల సైన్యముతోగూడుకొనినవాడు. అధికమగు వీర్యముగలవాడు. నానావిధములైన యస్త్రములను నేర్చినవాడు. పరాక్రమమునందు మిగుల ప్రసిద్ధుడనయె. అప్పుడు భయంకరమైన పరాక్రమముగలవాడును, యుద్ధమునకు బయలువెడలి వచ్చుచున్నవాడును, అతిభయంకరముగ గర్జించుచున్నవాడును, మిగుల బెద్దదగుశరీరముగలవాడును, రాక్షసులతోగూడుకొనియున్నవాడును, నగు ప్రహస్తుని, బలవంతులగు రాక్షససైన్యమును జూచెను. మఱియు నారాక్షసులందఱును మిగులగోపముగలవారై యతిభయంకరముగ సింహనాదములను జేసిరి. ఆసమయమునందు వానరులజంపవలయుననియెడు తలంపులుగల రాక్షసులచేత గ్రహింపబడినఖడ్గములు, శక్తులు, కత్తులు, బాణములు, శూలములు, ముసలములు, గదలు, పరిఘలు, ప్రాసములు, నానావిధములగు గండ్రగొడ్డండ్లు, చిత్రములగుధనుస్సులు మొదలుగాగల యాయుధములు మిగులమనోహరములై ప్రకాశించుచుండె. అప్పుడు వానరోత్తములందఱును యుద్ధమును జేయవలయుననియెడు గోరికగలవారై పుష్పించినవృక్షములను, మిగులవిశాలములును, పొడవులును, నగు శిలలను గ్రహించి యుద్ధసన్నద్ధులైరి. అంతటనయ్యిరుతెగలవారికిని మిగులభయంకరమయినదియును, మిగుల గొప్పదియును, నగు యుద్ధముజరిగె. మఱియు నారాక్షసులును, వానరులును, బాణవర్షమును, శిలావర్షమును గురిపించిరి. ఆయుద్ధమునందనేకులగు వానరసేనాపతులను సంహరించిరి. వానరవీరులును అనేకులగు రాక్షసులను సంహరించిరి. మఱియునాయుద్ధమునందు గొందఱు శూలములను నాయుధములచేత సంహరింపబడిరి కొందఱుసర్వోత్తమములగు నాయుధములచేత జంపబడిరి. కొందఱు వానరులు పరిఘములనియెడు నాయుధములచేత మారణము చేయబడిరి. కొందఱు గండ్రగొడ్డండ్లచేతనరకబడిరి. కొందఱువానరులు నానావిధములగు నాయుధములచేతగొట్టబడి యుచ్ఛ్వాసనిశ్వాసలుగూడలేనివారగుచు భూమియందుబడిరి. మఱికొందఱగు వానరులరొమ్ములు చీల్చబడియె. ఇవ్విధముగా రాక్షసులు వానరులను సంహరించుచుండిరి. అట్లు రాక్షసులు యుద్ధమును జేయుటనుజూచి వానరులుమిగుల గోపముగలవారైరి. అట్లుకోపోద్దీపితులై వృక్షములచేతను, పర్వతశిఖరములచేతను మర్దించి కొందఱగు రాక్షసులను గ్రిందబడవైచిరి. మఱికొందఱు రాక్షసులు వజ్రాయుధమువలె మిగులదృఢములైనపిడికిళ్లచేత జంపబడిరి. అట్టిపిడికిటిపోట్లకు దాళజాలక యారాక్షసులు నెత్తురునుగ్రక్కుచు గ్రిందబడి మరణమును జెందిరి. అప్పుడాయిరుతెగవారిలో గొందఱు దీనస్వరములతో నేడ్చుచుండిరి. కొందఱు సింహనాదములను జేయుచుండిరి. అంతట నయ్యిరుతెగలవారికిని మిగులభయంకరమగు యుద్ధముజరిగె. ఆసమయమునందు వానరులును, రాక్షసులును, కోపోద్దీపితులును, వీరకార్యములను జేయువారును, నగుచు భయరహితులై యితరులకుభయమునుగలుగజేయునట్టి కార్యములను జేసిరి. మఱియు నాసమయమునందు నరాంతకుడు, కుంభహనువు, మహానాదుడు, సమున్నతుడునని యెడు ప్రహస్తునిమంత్రులు నలుగురును, వానరులను అనేకులను జంపిరి. అవ్విధముగ నా నలుగురుమంత్రులును, వానరులను సంహరించుటను జూచి ద్వివిదుడనియెడు వానరోత్తముడు నరాంతకుడనియెడు మంత్రిని పర్వతశిఖరముచేత సంహరించె. అంతట దుర్ముఖుడనియెడు వానరోత్తముడు గొప్పదగు నొక్కవృక్షమును జేతియందుబెట్టుకొనివచ్చి సమున్నతుడనియెడుమంత్రినిసంహరించె. అప్పుడు జాంబవంతుడు కోపోద్దీపితుడైవచ్చి మిగులగొప్పదగు నొక్కశిలను బట్టుకొనివచ్చి మహానాదుడనియెడు మంత్రియొక్క ఱొమ్మును బ్రద్దలుసేసెను. పిమ్మట దారుడను వానరోత్తముడు మిగులబొడవగు నొక్కవృక్షమునుగొనివచ్చి వీర్యవంతుడగు కుంభహనుని యొక్క శిరస్సును బ్రద్దలుసేసెను. అంతటనా కుంభహనుడు మరణమునుబొందెను. అట్లుతన మంత్రివరులు నలుగురును మరణమునుబొందుటనుజూచి ప్రహస్తుడు మిగుల కోపముగలవాడును, ధనుర్ధారియునై భయంకరమగు యుద్ధమును జేసె. మఱియునాప్రహస్తుడు రెండువిధములగు సేనలయందును, మిగుల కల్లోలముగలదియును, మితిలేనిదియును, నగు సముద్రముయొక్కధ్వనివంటి ధ్వనిగలవాడగుచు మూర్తీభవించివచ్చినప్రళయకాలమువలె సంచరించుచుండె. అట్లుసంచరించుచు యుద్ధశాస్త్రవిశారదుడగు ప్రహస్తుడు మిగులగొప్పదియగు బాణసమూహముచేత నాయుద్ధమునందు వానరులనందఱ నధికముగా బీడించుచుండె. అట్టియుద్ధమునందు జచ్చినరాక్షసులయొక్కయు, వానరులయొక్కయు, కళేబరములచేత నాయుద్ధభూమియంతయును, పర్వతములచేతవలెనే వ్యాప్తమైయుండె. మఱియునాయుద్ధభూమియందు నెత్తురుప్రవహించుచుండె. మఱియు నాయుద్ధభూమియంతయును, పుష్పించిన మోదుగుచెట్లచేత బ్రకాశించుచున్నవసంతకాలమును బోలియుండె. ఆసమయమునందు వానరులును, రాక్షసులును, మిగుల భయంకరమగు యుద్ధమును జేసి చంపబడిన వీరులనియెడు తటములుగలదియును, భగ్నములగు నాయుధములనియెడు గొప్పవగు వృక్షములుగలదియును, నెత్తురుయొక్క ప్ర

వాహమనియెడు ఉదకప్రవాహముగలదియును, యముడనియెడుసముద్రమునకు బోవుచున్నదియును, హృదయములయొక్క దక్షిణభాగములయందలి మాంసములనియెడు బురదగలదియును, ప్రేగులనియెడు నాచుగలదియును, బద్దలయినశరీరములు, శిరస్సులునునని యెడు చేపలుగలదియును, కరచరణాద్యవయవములనియెడు పచ్చికలు గలదియును, గ్రద్దలనియెడు హంసలయొక్క సమూహములచేతవ్యాప్తమైనదియును, కంకపక్షులనియెడు సారసపక్షులు గలదియును, మేదస్సనియెడు నురుగుకలదియును, దుఃఖించుచున్నవారియొక్క ధ్వనియనియెడు నిమ్నోన్నతపవనధ్వనిగలదియును, క్రూరపురుషులనియెడు క్రూరములగు జలజంతువులుగలదియును, నగునదిని యుద్ధభూమియందు గల్పించి యానదినిదాటిరి. మఱియు నావానరులును, రాక్షసులును, ఆనదిని, పద్మములయందలి పరాగముచేత నెఱ్ఱని శరీరములుగల యేనుగులవలె నెత్తురుచేత నెఱ్ఱనైన శరీరముగలవారై దాటిరి. పిమ్మట రథమునందున్నబాణసముదాయమును బ్రయోగించుచున్నవాడును, మిగుల భయంకరుడునునగు ప్రహస్తుని వానరసేనాధిపతియగు నీలుడుసూచె. ఆసమయమునందు, ప్రహస్తుడనియెడి రాక్షసోత్తముడు రథమునందు నివసించినవాడై గొప్పదగు వాయువు ఆకాశమునందలి మేఘములను బారదోలువిధముగ వానరులనుబారదోలుచుండె. అంతట నాప్రహస్తుడు తనతో యుద్ధమును జేయుటకుద్యుక్తుడైన నీలుడనియెడు వానరోత్తముని జూచి సూర్యునియొక్క కాంతివంటి కాంతిగల తనరథమును నతనిమీదికి నతిశీఘ్రముగ నడిపించె. అంతట ధనుర్ధారులలో నుత్తముడగు ప్రహస్తుడను రాక్షసోత్తముడు మిగుల నుత్తమమగు నాయుద్ధమునందు ధనుస్సును నాకర్షించి నీలుడను వానరోత్తమునిమీద ననేకములగు బాణములను బ్రయోగించె. ఆబాణములన్నియును నతివేగముగానీలునిదాకి కోపోద్దీపితములగు సర్పములవలె భూమియందు బ్రవేశించె. అవ్విధముగ నానీలుడను వానరోత్తముడు మిగులదీక్ష్ణములగు బాణములచేత గొట్టబడినవాడగుటచేత నధికమగు కోపముతో నొక్క మహావృక్షమును బెల్లగించి తీసికొనివచ్చె. పిమ్మట వీర్యవంతుడగు నానీలుడు, శత్రువులచేత ధర్షింప శక్యముగానివాడును, మఱియును దనతో యుద్ధమును జేయుటకు వచ్చుచున్నవాడును, నగుప్రహస్తునిమీద బ్రయోగించె. అవ్విధముగ నావృక్షముచేత గొట్టబడిన రాక్షసోత్తముడగు ప్రహస్తుడు గోపోద్దీపితుడై వానరసేనాధిపతియగు నీలునిమీద మిగులభయంకరమగు బాణవర్షమును గురిపించె. అంతట మహాబలుడగు నీలుడనియెడు వానరోత్తముడు, ఆప్రహస్తునియొక్క భయంకరములగు బాణములను నివారింపశక్తిలేనివాడై యూరకుండె. మఱియు నానీలుడు, "గోవులును, వృషభములును, శీఘ్రముగా వచ్చెడు శరత్కాలవర్షమునుదలనువంచుకొని భరించినవిధముగా" సహింపశక్యముగాని ప్రహస్తునియొక్క బాణవర్షమును సహించె. అవ్విధముగ నానీలుడను వానరోత్తముడు కన్నులుమూసికొని యాశరవర్షమును గొంతసేపుసహించె. పిమ్మట గోపోద్దీపితుడై మిగులపెద్దదగు నొక్క యేపిచెట్టును గ్రహించి మనోవేగమువంటి వేగముగల ప్రహస్తునిరథముయొక్క గుఱ్ఱములను జావగొట్టె. అంతట మహాబలుడగు నానీలుడు మిగులవేగముతో బ్రహస్తునిచేతియందలి ధనుస్సును బలాత్కారముగ లాగికొని యాధనుస్సును విఱిచి యెల్లవారును భయపడునట్లుగా సింహనాదమును జేసె. అంతట రాక్షససేనాపతియగు ప్రహస్తుడు సిద్ధనుష్కుడై మిగుల భయంకరమగు ముసలమనునాయుధమును ధరించి సింహనాదమునుజేయుచు నెగిరిదుమికె. అంతటవానరరాక్షససేనాధిపతులగు నానీలప్రహస్తులిరువురును, మిగులనధికమగు బలముగలవారును, అధికమగు వైరముగలవారును, నెత్తురుచేతవ్యాప్తమైన శరీరముగలవారునునై మదపుటేనుగులవలె యుండిరి. అంతట నయ్యిరువురును నొకరినొకరు మిగులదీక్ష్ణములగు కోరపన్నులచేత శరీరములయందు గాయములుగలుగునట్లు కఱచుచుండిరి. మఱియు నయ్యిరువురును, పులులయొక్కయు, సింహములయొక్కయు, చేష్టలవంటిచేష్టలుగలవారై చూచువారికి పెద్దపులులవలెను, సింహములవలెను గనబడుచుండిరి. మఱియు నయ్యిరువురును యుద్ధమునువదలిపోనివారును, అధికమగుపరాక్రమముగలవారును, జయించవలయుననియెడు కోరికగలవారునునై యుండిరి. వృత్రాసురునితోడను, దేవేంద్రునితోడను సమానులగు నయ్యిరువురును గీర్తిని సంపాదింపవలయుననియెడు కోరికగలవారై యుండిరి ఆసమయమునందు ప్రహస్తుడనియెడు రాక్షసోత్తముడు ముసలముతో నీలునిముఖమును బ్రద్దలుసేసె. అట్లుప్రహస్తుడు మిగుల సన్నద్ధుడై కొట్టడముతోడనే యానీలునియొక్క ముఖమునుండి నెత్తురుగారుచుండె. అంతట వానరోత్తముడగు నీలుడు గోపోద్దీపితుడై మిగుల పెద్దదగు నొక్క వృక్షమును బెల్లగించుకొనివచ్చి ప్రహస్తుడను రాక్షసోత్తమునియొక్క తొమ్ముబ్రద్దలగునట్లు గొట్టె. ఆదెబ్బను లక్ష్యము సేయక యాప్రహస్తుడు ముసలమును గిరగిరద్రిప్పుచవచ్చి వానరోత్తముడగు నీలునిదరిమె. అట్లు మిగులవేగముతో వచ్చుచున్నవాడును, యుద్ధసన్నద్ధుడునునగు ప్రహస్తునిజూచి వా

నరోత్తముడగు నీలుడు మిగుల వేగముగలవాడై మిగుల గొప్పదగు నాకొండశిలను నాయుధమునుగా గ్రహించెను. పిమ్మట యుద్ధమును జేయవలయునని యెడు కోరికగలవాడును, ముసలమును నాయుధముతో యుద్ధమును జేయుచున్నవాడును, నగు ప్రహస్తుని యొక్క శిరస్సు బ్రద్దలగునట్లు కొట్టెను. అట్లు నీలుడను వానరోత్తముని చేత బ్రయోగింపబడిన గొప్పదగు నాశిల రాక్షసాధిపతియగు ప్రహస్తుని యొక్క శిరస్సును నవేక ప్రక్కలు చేసెను. అంతట నాప్రహస్తుడని యెడు రాక్షససేనాపతి వికలములైనయింద్రియములు గలవాడును, ప్రాణరహితుడును, నిస్తేజస్కుడును నై "ఛేదింపబడినమూలములుగల వృక్షము వలె" నతిశీఘ్రముగ గ్రిందబడెను. అట్లు బ్రద్దలయిన శిరస్సువలనను, శరీరము వలనను, ప్రస్రవణాచలమునుండి యుదకము ప్రవహించుచున్న విధముగా రక్తము గారుచుండెను. అట్లు నీలుడను వానరోత్తముని చేత రాక్షససేనాపతియగు ప్రహస్తుడు చంపబడగానే యదివరకు నిశ్చలముగానున్న రాక్షససైన్యమంతయును; భయముగలదై మరల లంకాపట్టణమునకు బోయెను. మఱియు సేనాపతియగు ప్రహస్తుడను రాక్షసోత్తముడు మరణమును బొందినపిమ్మట "గట్టు బద్దలై పోయినపిమ్మట నుదకము నిలవక పోవునట్లు" రాక్షససైన్యము గూడ యుద్ధభూమియందు నిలువక పరుగెత్తె. అట్లు రాక్షససేనాపతియగు ప్రహస్తుడు మరణమును బొందిన పిమ్మట రాక్షసులందఱును, యుద్ధమును జేయవలయునని యెడు కుతూహలములేనివారై లంకాపట్టణమునకు బోయి యేమియును జెప్పజాలక మూకత్వమును బొందియుండిరి. మఱియు నా రాక్షసులందఱును మిగుల నధికమగు శోకసముద్రమునందు మునిగి యేమియును దెలియనివారై మూర్ఛనొందియుండిరి. అంతనకూడ మహాబలుడును, జయమును బొందినవాడును, తాను జేసిన యుద్ధకర్మను జూచుచున్నవారి చేత గొనియాడబడుచున్నవాడును నగు నీలుడను వానర సేనాపతి రామలక్ష్మణులతో జేరుకొని పరమసంతోషము గలవాడై యుండెను.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి యేబదియెనిమిదవసర్గము ముగిసెను.

——(*)——

రావణాసురుడు యుద్ధమునకు బైలు వెడలుట.

ఆయుద్ధమునందు వానరోత్తముడగు నీలుని చేత రాక్షససేనాపతియగు ప్రహస్తుడు జంపబడిన పిమ్మట భయంకరమగు నాయుధములుగలదియును, సముద్రము యొక్క వేగమువంటి వేగముగలదియును, నగు రాక్షససైన్యమంతయును, పరుగెత్తిపోయెను. అట్లు రాక్షససైన్యమంతయును పరుగెత్తిపోయినపిమ్మట సేనాపతియగు ప్రహస్తుడు వానరోత్తముడగు నీలుని చేత జంపబడెనను వార్తను రాక్షసాధిపతియగు రావణాసురునకు దెలిపిరి. అవ్విధముగ రాక్షసులు చెప్పిన మాటను విని రాక్షసాధిపతియగు రావణాసురుడు అపరిమితమగు కోపమును బొందెను. అట్లు యుద్ధమునందు, తన సేనాధిపతియగు ప్రహస్తుడు మరణమును బొందిన వృత్తాంతమును విని యా రావణాసురుడు గొంతసేపు దుఃఖమును బొందెను. పిమ్మట క్రోధావిష్టమైన మనస్సుగలవాడై దేవేంద్రుడు చెప్పిన విధముగ రాక్షసయోధవీరులతో నిట్లనియెను.

రాక్షసోత్తములారా! నా సేనాపతియగు ప్రహస్తుడు చతురంగబలములతో గూడ యుద్ధమునకు బోయి రాముని సైన్యము చేత జంపబడియె. కావున శత్రువు డగు రాముని కొఱకు ఉపేక్షను జేయగూడదు. కాబట్టి నేను గొంచెమైనను విచారము లేనివాడనై శత్రువులను జయించుటకొఱకు బ్రయత్నమును జేసెదను. మఱియు నో రాక్షసోత్తములారా! యుద్ధమునకు నేనే బోయెదను. ఇప్పు డగ్నిహోత్రము వలె బ్రజ్వలించునట్టి నాబాణముల చేత రామలక్ష్మణులతో గూడ వానర సైన్యమును సర్వమును నశింప జేసెదననియె. ఇవ్విధముగా జెప్పి యగ్నిహోత్రముతో సమానముగ బ్రకాశించుచున్నదియును, సర్వోత్తములగు గుఱ్ఱముల చేత బూన్పబడినదియును, మిగుల నధికముగా బ్రజ్వలించుచున్నదియును నగు రథముమీద దేవేంద్రునకు శత్రువగు రావణాసురుడెక్కె. అట్టి రథముమీద నెక్కి శంఖముల యొక్కయు, రణభేరుల యొక్కయు, ధ్వనులతోడను, సింహనాదములతోడను, స్తోత్రపాఠములతోడను గూడుకొనినవాడై బయలువెడలె. మఱియును రాక్షస రాజోత్తముడగు రావణాసురుడు పర్వతములతోడను, మేఘములతోడను, సమానములగు నాకారములు గలవారును, అగ్నిహోత్రమువలె బ్రజ్వలించుచున్న నేత్రములు గలవారును, మాంసమును దినువారును, నగు రాక్షసులతో గూడుకొని భూతగణములతో గూడుకొనిన రుద్రుని వలె బయలువెడలె. అంతట మిగుల నధికమగు తేజస్సుగల యా రావణాసురుడు బయలువెడల, మహాసముద్రము యొక్కయు, మేఘము యొక్కయు, ధ్వనివంటి ధ్వనిగలదియును, యుద్ధసన్నద్ధమై వృక్షములను, పర్వతములను, నాయుధములుగా ధరించినదియును, భయంకరమైనదియును, నగు వానరసైన్యమును జూచెను. అట్లు బయలువెడలివచ్చుచున్నదియును, మిగుల భయంకరమైనదియును, నగు రాక్షససైన్యమును బూచి యాదిశేషువు వలె మిగుల బొడవులగు భుజములుగల రాముడు వాన

రసైన్యముతో గూడుకొనినవాడును, మహోహరమగు జయలక్ష్మితో గూడుకొనినవాడును, నగుచు అస్త్రములను ధరించినవారలలో నుత్తముడగు విభీషణునితో నిట్లనియె. రాక్షసరాజోత్తమా! విభీషణుడా! మనకభిముఖముగా వచ్చుచున్నదియును, నానావిధములగు పతాకములతోడను, ధ్వజజములతోడను, గూడుకొనినదియును, ప్రాసములు, ఖడ్గములు, శూలములు, మఱియు, నితరములగు నాయుధములతోడను గూడుకొనినదియును, ఐరావతముతో సమానములగు ఏనుగులతో గూడుకొనినదియును, నగు నీరాక్షససైన్యమెవ్వరిదనియడిగె. ఇవ్విధముగా రాముడు చెప్పినమాటనువిని దేవేంద్రునియొక్క పరాక్రమమునుగల విభీషణుడు మహాత్ములగు రాక్షసులబలప్రవేగమును, రామునకు దెలిపె. రాజేంద్రా! రాముడా! ఏనుగులయొక్క స్కంధమునందెక్కియున్నవాడును, మహానుభావుడును, బాలసూర్యునివలె నెఱ్ఱని మోముగలవాడును, ఏనుగులయొక్క శిరస్సును గంపింపజేయుచున్నవాడును నై వచ్చుచున్న యీరాక్షసుడకంపనుడని తెలిసికొనుము. సింహకేతనుడును, దేవేంద్రునియొక్క ధనుస్సువలె ప్రకాశించుచున్న ధనుస్సును గంపింపజేయుచున్నవాడును, మిగులభయంకరముగా గోరపన్నులును గనబరచుచున్నవాడును, రథమునెక్కియున్నవాడును, నగు రాక్షసుడు సర్వోత్తమమగు పరాక్రమముగల యింద్రజిత్తని తెలిసికొనుము. మఱియు నో రాముడా! వింధ్యపర్వతముతోడను, అస్తాచలముతోడను, మహేంద్రపర్వతముతోడను, సమానమగు దేహముగలవాడును, ప్రశస్తమగు ధనుస్సును ధరించినవాడును, నిరుపమానమగు ధనుస్సును గంపింపజేయుచున్నవాడును, నగు రాక్షసుడు అతిరథుడని ప్రసిద్ధినిబొందిన యతికాయుడు. బాలసూర్యునివలె నెఱ్ఱని నేత్రములుగలవాడును, ఘంటానాదములతో గూడుకొనిన యేనుగునెక్కినవాడును, నగు రాక్షసుడు మహోదరుడను నామధేయముగల మహానుభావుడు. బంగారుచేత జేయబడిన బాండములనియెడు నాభరణములతో గూడుకొనినదియును, సంధ్యాకాలమునందలి మేఘమువలె ప్రకాశించుచున్నదియును, నగు గుఱ్ఱముమీద నెక్కి వచ్చువాడు పిశాచనామధేయముగల రాక్షసోత్తముడు. వాడు పిడుగులయొక్క వేగమువంటి వేగముగలవాడు. మెఱుపువలె దళతళమని ప్రకాశించుచున్నదియును, వజ్రాయుధముయొక్క వేగమువంటి వేగముగలదియును, మిగుల దీక్ష్ణమైనదియును, నగు శూలమును ధరించి వృషభవాహనమునెక్కి వచ్చుచున్న యీరాక్షసుడు అధికమగు కీర్తిగల త్రిశిరుడను నామధేయముగలవాడు. మేఘముతో సమానమైన దేహచ్ఛాయగలవాడును, మిగులవిశాలమైన తోమ్ముగలవాడును, సర్వకేతనుడును, ధనుష్టంకారమును జేయుచున్నవాడును, నగు రాక్షసుడు కుంభుడను నామధేయముగలవాడు. బంగారుచేత జేయబడి వజ్రములచేత జెక్కబడినదియును, మిగులనధికముగా ప్రకాశించుచున్నదియును, పొగలను గ్రక్కుచున్నదియును, నగు పరిఘమను నాయుధమును గ్రహించి వచ్చుచున్నవాడును, రాక్షససైన్యమునకు ధ్వజమువంటివాడును, అద్భుతమైన పరాక్రమవ్యాపారముగలవాడును, నగు నా రాక్షసుడు నికుంభుడను పేరుగల రాక్షసోత్తముడు. రాముడా! అగ్నిజ్వాలతో సమానమైన కాంతిగల పతాకలుగలదియును, ధనుస్సులతోడను, ఖడ్గములతోడను, గూడుకొన్నదియును, నగు రథమునెక్కినవాడును, పర్వతశిఖరమును నాయుధముగా ధరించినవాడును, నగు రాక్షసోత్తముడు నరాంతకుడను నామధేయముగలవాడు. మఱియు నో రామచంద్రుడా! నానావిధములును, భయంకరములును, నగు రూపములుగలవారును, పెద్దపులులయొక్కయు, ఒంటెలయొక్కయు, ఏనుగులయొక్కయు, సింహములయొక్కయు, ముఖములవంటి ముఖములుగలవారును, గిరగిర ద్రిప్పుచున్న నేత్రములుగలవారును, నగు భూతములతో గూడుకొనినవాడును, దేవతలయొక్క మదమునుగూడ నణచివేయువాడును, చంద్రునితో సమానమైన కాంతిగలదియును, సూక్ష్మమైన శలాకగలదియును, మిగుల శ్రేష్ఠమైనదియును, నగు గొడుగుచేత ప్రకాశించుచున్నవాడును, భూతగణములతో గూడుకొనిన రుద్రునివలె ప్రకాశించుచున్నవాడును, నగు వాడు మహానుభావుడగు రావణాసురుడు. మఱియునో రామచంద్రా! కిరీటమును ధరించినవాడును, చలించుచున్న కుండలములచేత ప్రకాశించుచున్న ముఖముగలవాడును, వింధ్యపర్వతముతో సమానమైన శరీరముగలవాడును, దేవేంద్రునియొక్కయు, సూర్యునియొక్కయు మదమును నశింపజేసినవాడును, నగు రావణాసురుడు సూర్యునివలె ప్రకాశించుచున్నాడు. చూడుమనియె. అంతట రాముడు శత్రువుల నశింపజేయునట్టి సామర్థ్యముగల విభీషణునితో నిట్లనియె. మిత్రుడా! విభీషణా! ఆహా రావణాసురుడు మిగులనధికమగు తేజస్సుగలవాడు. మఱియు రాక్షసాధిపతియగు నీరావణాసురుడు సూర్యునివలె జూడనలవిగాకయున్నాడు. మఱియు నీరావణాసురునియొక్క శరీరము మిగుల స్పష్టగా గనబడుచున్నది. ఇటువంటియాకారము దేవాసురవీరులలో నెవ్వరికిని లేదు ఆహా యీరావణాసురుని యాకారము మిగుల రమ్యమైనది. మఱియు నో రాక్షసోత్తమా! అధికమగు తేజస్సుగల రావణాసురునియొక్క యోధులందఱును, పర్వతాకారములుగల

వారైయున్నారు. అందఱును పర్వతములతో యుద్ధముగు జేయుటయందు దగినసామర్థ్యముగలవారు. అందఱును, ప్రజ్వలించుచున్నవియును, మిగుల భయంకరమైనవియును, నగు నాయుధములను ధరించినవారు. అందఱునధికమగు తేజస్సుగలవారు. ఇట్టి రాక్షసవీరులతో గూడుకొనిన యీ రావణాసురుడు మిగుల నధికముగా బ్రకాశించుచున్నవియును, మిగులదీర్ఘములైనవియును, దేహములుగలవియును, నగు దేహములతో గూడుకొని శరీరధారియైవచ్చినయమునివలె బ్రకాశించుచున్నాడు. ఆహా నేడునాయదృష్టవశముచేత దాపాత్ముడగు నీరావణాసురుడు నాకంటికి గనబడెను. ఇప్పుడు సీతనపహరించుటవలన గలిగియున్న కోపమును నీపాపాత్మునియందు విడిచిపెట్టెదననియె. ఇవ్విధముగా జెప్పి వీర్యవంతుడగు రాముడు మిగులశ్రేష్ఠమగు ధనుస్సును ధరించి బాణమునెక్కుబెట్టి లక్ష్మణుడుసహాయముగాగలవాడై నిలిచియుండె. ఆసమయమునందు మహానుభావుడును, రాక్షసులకధిపతియును, నగు రావణాసురుడు తనభటులగు రాక్షసవీరులనుబిలిచి యిట్లనియె.

ఓ రాక్షసయోధవీరులారా! మీరందఱునుబోయి ద్వారములయందును, గృహగోపురములయందును జక్కగా గావలియుండుడు అట్లుగాదేని మనమందఱమును నిక్కడకువచ్చియుండుటచేత బట్టణములోనికి నెవ్వరునులేరుగదాయనితలచి వానరులందఱును లంకాపట్టణమునందు బ్రవేశించి లంకాపట్టణమును సర్వమును బాడుసేయుదురు. కావున మిగులజాగరూకతతో గావలియుండుడనిచెప్పి రాక్షసవీరుల నయ్యాకార్యములయందు నియోగించె. అట్లు రాక్షసులందఱను నియోగించినపిమ్మట మహాసముద్రమును గోప్పదగుచే పయల్లకల్లోలమును జేయువిధముగ మిగులబలవంతుడగు రావణాసురుడు వానరసేనయనియెడు సముద్రమును జీకాకుపఱచె. అట్లుయుద్ధసన్నద్ధుడైవచ్చుచున్నవాడును, మిగులనధికముగా బ్రకాశించుచున్న బాణములతోడను, ధనుస్సుతోడను గూడుకొన్నవాడును, రాక్షసులకు బ్రభుడును, నగు రావణాసురునిజూచి వానరాధిపతియగు సుగ్రీవుడు మిగులపెద్దదగు నొక్కపర్వతశిఖరమును నాయుధముగా జేసికొని బయలువెడలివచ్చి యీ రావణాసురునిదరిసె. అంతట నాసుగ్రీవుడు నానావిధములగు వృక్షములతోగూడుకొనినచరియలుగల పర్వతశిఖరమును నారావణాసురునిమీద విసరివైచె. అట్లు సుగ్రీవునిచేత విసరివేయబడిన వృక్షము తనకభిముఖముగా వచ్చుచున్న వృక్షమును రావణాసురుడు బంగారు పిడ్లుగల బాణములచేత ఛేదించె. అవ్విధముగ రావణాసురునిచే ఛేదింపబడి, మిగులశ్రేష్ఠములగు వృక్షములతోడను, చరియలతోడను, గూడుకొనిన యీపర్వతశిఖరము భూమియందుబడియె. అంతట నారావణాసురుడు గొప్పదగు సర్పముతో సమానమైనదియును, యమునితోసమానమైనదియును, వాయువేగమువంటి వేగముగలదియును, మిణుగురులుగల యగ్నివలె బ్రకాశించుచున్నదియును, దేవేంద్రునియొక్క వజ్రాయుధముతోసమానమైనవేగముగలదియును, నగు బాణమును సంధానముచేసి సుగ్రీవునిమీద బ్రయోగించె. అట్లు రావణాసురునిచేత బ్రయోగింపబడినదియును, దేవేంద్రునియొక్క వజ్రాయుధముతోసమానమైనదియును, మిగులదీక్ష్ణమైన యగ్రభాగముగలదియును, నగు బాణము సుగ్రీవునిదేహమును దూటుసేసికొని కుమారస్వామిచేత బ్రయోగింపబడినబాణముక్రౌంచపర్వతమును దూటుసేసికొని పోయినవిధముగ బోయె. అంతటవీరుడగు నాసుగ్రీవుడు రావణాసురునిబాణముచేత పీడింపబడుచున్నవాడును, విపరీతమైనచిత్తముగలవాడునునై కూయుచుభూమియందు బడియె. అట్లుభూమియందు దెలివిదప్పి బడియున్న సుగ్రీవునిజూచి రాక్షసులందఱునుబరమానందమునుబొందిరి. అంతట గవాక్షుడు, గవయుడు, సుదంష్ట్రుడు, జ్యోతిముఖుడు, నభుడు, మొదలుగాగలవానరవీరులు పర్వతములనాయుధములనుగా గ్రహించి మిగులవృద్ధినిబొందుచున్న శరీరములుగలవారై రాక్షసోత్తముడగు రావణాసురునకభిముఖముగా బరుగెత్తిరి. అప్పుడు రాక్షసాధిపతియగు రావణాసురుడు మిగులదీక్ష్ణములగు నగ్రభాగములుగల బాణసముదాయములచేత నావానరులయొక్క యాయుధములనన్నిటినినిష్ఫలముగాజేసె. బంగారముచేత జిత్రముగాజేయబడిన పిడ్లుగల బాణసముదాయములచేత నావానరులనందఱను ఛేదించె. అవ్విధముగ నారావణాసురుని బాణముచేత ఛేదింపబడినవారును, మిగులగొప్పవగు శరీరములు గలవారును, నగు వానరులందఱును గ్రిందబడి మూర్ఛనుబొందిరి.

అవ్విధముగా రావణాసురునిచేత గొట్టబడినవారును, దిక్కులేనివారివలె గూతలిడుచున్నవారును, నగు నావానరులందఱును రావణాసురునిబాణములచేత నధికముగా గొట్టబడినవారై రామునియొద్దకుబోయి మమ్ములగాపాడుమని ప్రార్థించిరి. అంతట మహానుభావుడగురాముడు ధనుర్బాణములనుధరించినవాడై యతిశీఘ్రముగబయలువెడలె. అప్పుడు లక్ష్మణుడు చేతులనుముకుళించుకొని రామునిసమీపమునకుబోయి పరమార్థయుక్తమగుమాటను జెప్పదలచి యిట్లనియె.

రఘుకులోత్తమా! పూజ్యుడవగునీవు రావణాసు[illegible]

జంపగలవు. అయినను దుర్మార్గుడగు రావణాసురుని జంపవలయునని కోరికనాకుగలిగియున్నది. కావున నేను రావణాసురుని జంపెదను. నాకాజ్ఞనిమ్మనియె. అవ్వచనమునువిని యధికమగు తేజస్సుగలవాడును, సత్యమగుపరాక్రమముగలవాడును, నగురాముడు లక్ష్మణునితో నిట్లనియె. నాయనా! లక్ష్మణా! నీకట్టియభిలాషగలదేనిపొమ్ము. పోయియుద్ధమునందధికమగు యత్నముగలవాడవగుము. రావణాసురుడధికమగు వీర్యముగలవాడు. మఱియు నద్భుతమగు పరాక్రమముగలవాడు. ముల్లోకములయందలి వారందఱును నొక్కటినైనను గోపయుక్తుడగు రావణాసురుని సంహరింపజాలరు. యుద్ధసమయమునందు రావణాసురునియందలి ఛిద్రములను, నీయందలిఛిద్రములను జక్కగ నాలోచింపుము. నేత్రముచేతను, ధనుస్సుచేతను గూడ నన్నునీవు చక్కగ గాపాడుకొనుమనియె. ఇవ్విధముగా రాముడుచెప్పినమాటనువిని యాలక్ష్మణుడు పరమసంతోషముగలవాడై రామునిబూజించికౌగలించుకొని నమస్కారములనుజేసి యుద్ధమునకుబోయె. అట్లు లక్ష్మణుడు బయలువెడలి వచ్చుటకుముందుగ మిగుల బొడవులగు భుజములుగలవాడును, వాయుదేవునకు బుత్రుడును, నగు హనుమంతుడు, మిగుల భయంకరమగు ధనస్సును ధరించిన వాడును, మిగుల భయంకరములగు శరీరములుగలవానరులరు బాణపరంపరలచేత గప్పుచున్నవాడును, నగు రావణాసురునిజూచి వానిబాణములను నివారింపజేసి యారావణాసురునిదరిజేరె. అట్లుతరిమిరావణాసురుని రథసమీపమునకు బోయి కుడిభుజమునెత్తి యారావణాసురునకు భయమును గలిగించుచు ధీమంతుడగు నాహనుమంతుడిట్లనియె.

ఓరీ! రాక్షసాధమా! రావణా! దేవదానవగంధర్వయక్షులకు నీవలన నపరిమితమగు భయము గలిగియుండె. అట్టినీకిప్పుడు నిస్సంశయముగ వానరులవలన భయముగలిగె. ఇదిగోచూడుము. నాకుడిభుజమునెత్తితిని. ఈభుజముచేత నీయందుజిరకాలమునుండి నివసించియున్న యంతరాత్మను లేచిపోవునట్లు చేయుదుననియె. ఇవ్విధముగా హనుమంతుడు చెప్పినవాక్యమునువిని భయంకరమగు పరాక్రమముగల రావణాసురుడు గోపముచేత గన్నులనెఱ్ఱగాజేసికొని యిట్లనియె. ఓరీ! వానరాధమా! ఆంజనేయా! ముందుగా నన్నుగొట్టుము. కొట్టిస్థిరమగు కీర్తినిబొందుము. ముందుగా నీవలనిదెబ్బను బొందితినేని నీబాహుబలమును దెలిసికొందును. పిమ్మట నిన్నుజంపుట సులభమైయుండుననియె. అట్లురావణాసురుడు చెప్పినమాటనువిని వాయుపుత్రుడగు హనుమంతుడిట్లనియె. ఓరీరాక్షసాధమా! రావణా! ముసుపునీపుత్రుడగు అక్షకుమారుని సంహరించితినిగదా? ఆవిషయమునునిప్పుడు దలచుకొనుమనియె. ఇవ్విధముగా హనుమంతుడు చెప్పినమాటనువిని మహాతేజస్సుగలవాడును, రాక్షసులకధిపతియును, నగు రావణాసురుడు గోపోద్దీపితుడై యాహనుమంతుని దనహస్తతలముచేతగొట్టె. అట్లు రావణాసురునిచేతగొట్టబడి హనుమంతుడాదెబ్బకు దాళజాలక మిగుల జలనమునుబొందె. అంతట గొంతసేపటికి ధైర్యమునుదెచ్చుకొని యధికమగు బుద్ధిగలవాడును, తేజోవంతుడును, నగు హనుమంతుడపరిమితమగు కోపముగలవాడై తనహస్తతలముచేత దేవతలకు శత్రుడగు రావణాసురునిగొట్టె. అట్లు మహానుభావుడగు హనుమంతునిచేత గొట్టబడిన యారావణాసురుడు భూకంపముగలుగు నపుడు పర్వతము కదలువిధముగాగదలె. మఱియు నవ్విధముగా హనుమంతునిభుజముచేత గొట్టబడి వణకుచున్నరావణాసురునిజూచి ఋషులును, వానరులును, దేవతలును మహాశ్చర్యముతో గూతలిడిరి. రాక్షసులందఱును నాశ్చర్యమునుబొందిరి అంతగొంతసేపటికి వణకునువదలి మహాతేజోవంతుడగు రావణాసురుడిట్లనియె.

ఓరీ! వానరవీరుడా! ఆంజనేయా! నాకుశత్రువుడవగు నీవు పరాక్రమముచేత గొనియాడదగినవాడవై తివనియె. ఇవ్విధముగా రావణాసురుడు చెప్పిన మాటనువిని వాయుపుత్రుడగు హనుమంతుడిట్లనియె. ఓరీ! రావణాసురుడా! నాపరాక్రమము మిగుల వ్యర్థమైనదని తలచుచున్నాను. నాచేతిదెబ్బను దినియును నీవుబ్రతికి యుండుటచేత నాపరాక్రమము వ్యర్థమైనదని తలచుచున్నాను. యుక్తాయుక్తజ్ఞానశూన్యుడా! రావణాసురుడా! ఒక్కదెబ్బకే నన్ను శ్లాఘించుచున్నావేమి? ఇదిగోచూడుము. నాపిడికిటిపోటు నిన్నిప్పుడు యమలోకమునకు బంపుననియె. అవ్విధముగ హనుమంతుడు పలికినపలుకునువిని యారావణాసురుడపరిమితముగా గోపమునుజెందె. అంతట వీర్యవంతుడగు నారావణాసురుడు గోపముచేత నెఱ్ఱనైననేత్రములు గలవాడై కుడిభుజమునెత్తిపిడికిలిబట్టి యధికమగువేగముతో హనుమంతుని రొమ్మునగొట్టె. అట్లురావణాసురుడు గొట్టిన దెబ్బకు దాళజాలక హనుమంతుడు విహ్వలుడయ్యె. అవ్విధముగ మహాబలవంతుడగు హనుమంతుడు విహ్వలుడగుటనుజూచి యతిరథుడగు రావణాసురుడంతటితో హనుమంతునివదిలి తనరథమును నీలునకభిముఖముగాబోనిచ్చె. అంతట నధికమగు ప్రతాపము గలవాడును, రాక్షసులకధిపతియును, పదితలకాయలుగలవాడును, నగు రావణాసురుడు, సర్పములతో సమానములైనవియును, భయంకరము

లయినవియును, శత్రువులయొక్క మర్మస్థానములను భేదించునవియును, నగుబాణములచేత వానరసేనాపతియగు నీలునిఁగొట్టె. అవ్విధముగ వానరసేనాధిపతియగు నీలుడు రావణాసురుని బాణములచేత గొట్టబడి యధికమగుకోపమును జెందె. అంతట నొక్కచేతితో నొక్కపర్వతాగ్రమును దెచ్చి రావణాసురునిమీద బ్రయోగించె. అంతలోపల బుద్ధిమంతులలో నుత్తముడును, తేజోవంతుడును, నగు హనుమంతుడు మూర్ఛదేరి మిగుల గోపముగలవాడైయుద్ధమును జేయవలయు ననియెడు కోరికతో నీలునితోయుద్ధమును జేయుచున్న రావణాసురునకిట్లనియె.

ఓరీ! రాక్షసాధమా! రావణాసురుడా! నాతోయుద్ధమును జేయుచున్న నీవీవిధముగా మరియొకనిమీదికి బరుగెత్తికొనివచ్చుట యుచితముగాదు. కావున వెనుకకు మరలి యుద్ధమును జేయుమనియె. ఆసమయమునందు మహాతేజోవంతుడగు రావణాసురుడు మిగులదీక్ష్ణములగు నేడు బాణములచేత నీలునిచేత బ్రయోగింపబడిన పర్వతాగ్రమునుజూర్ణము సేసె. అట్లుతనచేతబ్రయోగింపబడిన పర్వతాగ్రము రావణాసురుని బాణములచేత జూర్ణమగుటను జూచి నీలుడనియెడు వానరోత్తముడు ప్రళయకాలాగ్నివలె గోపముచేత మండిపడియె. అంతట నానీలుడనియెడు వానరసేనానాయకుడు పుష్పించియున్న మద్దిచెట్లను, ఏపిచెట్లను, మామిడిచెట్లను, చంద్రచెట్లను, రావణాసురునిమీద బ్రయోగించె. అంతటరావణాసురుడు కోపోద్దీపితుడై యావృక్షములనన్నిటిని ఛేదించి మిగుల భయంకరమగు బాణవర్షమునుగురుపించె. అవ్విధముగ బర్వతముమీద మేఘుడువర్షించినవిధముగ నానీలునిమీద బాణవర్షమును గురిపించె. ఆసమయమునందు నీలుడను వానరోత్తముడు మిగుల జిన్నదగు నాకారమునవలంబించి రావణాసురునియొక్క ధ్వజాగ్రమునందుబడియె. అట్లు ధ్వజముయొక్కయగ్రభాగమునందు సంచరించుచున్న నీలునిజూచి రావణాసురుడు గోపోద్దీపితుడై మండిపడియె. అప్పుడునీలుడనువానరోత్తముడు మిగుల భయంకరమగు సింహనాదమునుసలుపుచు రావణాసురునియొక్క ధ్వజాగ్రమునందును, ధనుస్సుయొక్క యగ్రభాగమునందును, కిరీటముయొక్కయగ్రభాగమునందును, అనేకరూపములనుధరించి సంచరించుచుండె. అవ్విధముగసంచరించుచున్న నీలునిజూచి హనుమంతుడును, రామలక్ష్మణులును మిగుల నాశ్చర్యమును బొందిరి. ఆసమయమునందు రావణాసురుడును, వానరోత్తముడగు నీలునియొక్క లాఘవముచేత మిగుల నాశ్చర్యముగలవాడై ప్రజ్వలించుచున్నదియును, అద్భుతమైనదియును, నగు నాగ్నేయాస్త్రమును స్వీకరించె. అప్పుడు వానరులందఱును నీలుడనువానరోత్తముని లాఘవమును, రావణాసురునియొక్క చాతుర్యమునుజూచి యధికమగుసంతోషముగలవారైరి. పిమ్మటనందఱును నొక్కటిగాజేరి భూమ్యంతరిక్షములు బ్రద్దలగునట్లుగా గూతలిడిరి. ఆమహాధ్వనిచేత రావణాసురుడు గొంచెముసేపు స్తబ్ధుడైయుండి యేమియును యోచింపజాలని మనస్సుగలవాడై యుండె. అంతగొంతసేపటికి ధైర్యమునవలంబించి యారావణాసురుడు క్రోధోద్దీపితుడై యాగ్నేయాస్త్రమును స్వీకరించితనయొక్కధ్వజాగ్రమునందు నివసించియున్ననీలుడను వానరోత్తమునిజూచె. చూచియధికమగు తేజస్సుగలవాడును, రాక్షసులకధిపతియును, నగురావణాసురు డిట్లనియె. ఓరీ! వానరా! మిగుల గొప్పదగు మాయనవలంబించిమిగులలాఘవము గలవాడవైతివి. నీవిప్పుడనేకములగు రూపములను ధరించుచున్నావుగదా? నీవు సమర్థుడవగుదేని యిప్పుడు నీప్రాణములను గాపాడుకొనుము. నీవువిశేషమగు ప్రయత్నముతో నీప్రాణమును గాపాడుకొనుచున్నవాడవయ్యును, నాయస్త్రమునకు దాళజాలక ప్రాణహీనుడవగుదువనిచెప్పె. పిమ్మట మిగుల బొడవులగు భుజములుగలవాడును, రాక్షసాధిపతియును, నగురావణాసురుడు, ఆగ్నేయాస్త్రమునుబాణముతో సంధానము సేసి వానరసేనాపతియగు నీలునిమీద బ్రయోగించె. అవ్విధముగ నాయాగ్నేయాస్త్రముచేత ఱొమ్మునందు గొట్టబడిన నీలుడను వానరోత్తముడు అయ్యస్త్రముచేత దహింప జేయబడినవాడై యతిశీఘ్రముగ గ్రిందబడియె. అప్పుడానీలుడను వానరోత్తముడు తనతండ్రియగు నగ్నిదేవునియొక్క మాహాత్మ్యముచేతను, తనతేజోబలముచేత గ్రిందబడియును మోకాళ్లయొక్క యాధారముతోనిలిచి ప్రాణహీనుడు మాత్రముగాకయుండె. అవ్విధముగ మూర్ఛనొందియున్న నీలుడను వానరోత్తమునిజూచి యుద్ధమునందుత్సాహముగల రావణాసురుడు మేఘధ్వనివంటి ధ్వనిగల రథమును నతిశీఘ్రముగ లక్ష్మణుని మీదికి దోలించె. అట్లుబయలువెడలి పోవుచు మార్గమధ్యయందువానరులనందఱ బారదోలె. అవ్విధముగ బారదోలి క్రోధాగ్నిచేతమండిపడుచు భూమియంతయును వణకునట్లు ధనుష్టంకారమును జేసె. అప్పుడు అధికమగు పరాక్రమముగల లక్ష్మణుడపరిమితముగ ధనుష్టంకారమును జేయుచున్న రావణాసురునిజూచి యిట్లనియె. ఓరీ! రాక్షసరాజా! రావణా! నీవువానరులతో యుద్ధమును జేయుటతగదు. కావున నాతోయుద్ధమును జేయుటకు రమ్మనియె. అట్లుపలుకుచున్న లక్ష్మణునియొక్కవాక్య

ముసు, లక్ష్మణునియొక్క ధనుష్టంకారధ్వనినివిని రాక్షసరాజగు రావణాసురుడు కోపోద్దీపితుడై తనకభిముఖముగావచ్చుచున్న లక్ష్మణునియొద్దకుబోయి యిట్లనియె. రఘుకులోద్భవుడవైన యోలక్ష్మణుడా! నీవువిపరీతబుద్ధిగలవాడవును మరణమును బొందవలయుననియెడు గోరికగలవాడవును నై యదృష్టవశముచేత నిప్పుడు నాకన్నులకు గనబడితివి. నీవిప్పుడే నాబాణములచేత బ్రాణహీనుడవై యమలోకమునకు బోగలవనియె, ఆమాటలనువిని సుమిత్రాదేవికి బుత్రుడగు లక్ష్మణుడు మిగులదీక్ష్ణములైనవియును, భయంకరములైనవియును, నగు కోరపన్నులుగల రావణాసురుని దృణప్రాయముగాజేయుచు నిట్లనియె. ఓరీ! రాక్షసరాజా! రావణాసురుడా! పాపాత్ములలో నుత్తముడా! అధికమగు సామర్థ్యముగలవారు యివ్విధముగా బింకములు వలుకరు. మఱియు నివ్విధముగా దమనుదామే శ్లాఘించుకొనరనిచెప్పి మఱియు నిట్లనియె. రాక్షసోత్తముడవైన యోరావణాసురుడా! నీబలమును, పరాక్రమమును, ప్రతాపమును నేనుబాగుగ నెఱుగుదును. కావుననే నేనిప్పుడు ధనుర్బాణములను ధరించి యుద్ధసన్నద్ధుడనై వచ్చియుంటిని. నీవును యుద్ధసన్నద్ధుడవైరమ్ము. నిన్ను నీవు పొగడుకొనుట వలన బ్రయోజనమేమి యనియె. ఇవ్విధముగా లక్ష్మణుడు సెప్పినమాటలనువిని రాక్షసాధిపతియగు రావణాసురుడు మిగుల దృఢములగు పిడ్డుగల యేడుబాణములను బ్రయోగించె. ఆబాణముల నేడింటిని మిగులదీక్ష్ణములగు నగ్రభాగములుగలవియును, చిత్రములగు పిడ్డుగలవియును, నగు బాణములచేత భేదించె. అంతట రాక్షసాధిపతియగు రావణాసురుడు ఛేదింపబడిన పడగలుగల సర్పోత్తములవలెనున్నవియును, లక్ష్మణునిచేత ఛేదింపబడినవియును, నగుతనబాణములను, మిగులదీక్ష్ణములైనవియును, లక్ష్మణునిచేత దనమీదబ్రయోగింపబడుచున్నవియును, నగు బాణములను బూచి లంకాపురాధిపతియగు రావణాసురుడపరిమితమగు కోపమునుజెందె. అట్లుకోపోద్దీపితుడై మిగుల దీక్ష్ణములగు బాణములను నాలక్ష్మణునిమీద బ్రయోగించె. అవ్విధముగ రావణాసురునిచేత వర్షింపబడుచున్న బాణవర్షమునకు భీతినొందక మంగలకత్తులతో సమానములైనవియును, అర్ధచంద్రాకారములైనవియును, నగు బాణములచేత నాబాణవర్షమును నశింపజేసె. అట్లులక్ష్మణుడు తనబాణములనన్నిటిని వ్యర్థముగజేసి తనమీదమిగుల దీక్ష్ణములగు బాణములనుబ్రయోగించుటనుజూచి రాక్షసాధిపతియగు రావణాసురుడు మిగులనాశ్చర్యమును బొందినవాడై లక్ష్మణుని మీద మిక్కిలితీక్ష్ణములగు బాణములను బ్రయోగించె. అంతటలక్ష్మణుడు గోపోద్దీపితుడై రావణాసురునిజంపదలచి మిగులశీఘ్రముగ దేవేంద్రునియొక్క వజ్రాయుధముతో సమానమైనవియును, అగ్నిహోత్రునివలె బ్రకాశించుచున్నవియును, తీక్ష్ణమైనయగ్రభాగములుగలవియును, నగు బాణములను రావణాసురునిమీద బ్రయోగించె. అంతట రావణాసురుడును గోపోద్దీపితుడై యాబాణములనన్నింటిని ఛేదించి ప్రళయకాలాగ్నితో సమానమైన బాణముచేత లక్ష్మణునియొక్క నుదురుబ్రద్దలగునట్లుగొట్టె. అంతట లక్ష్మణుడు ఆదెబ్బకు దాళజాలక దిమ్మరబోయి కొంతసేపటికి దెలివొంది శిథిలమగు ధనుస్సునుబాగుగజేసికొని తీవ్రమగు బాణములచేత దేవేంద్రునకు శత్రువగు రావణాసురునియొక్క ధనస్సును భేదించె. అవ్విధముగ రావణాసురుని ధనుస్సునుభేదించినపిమ్మట నాలక్ష్మణుడు మిగుల దీవ్రములగు మూడుబాణములనుబ్రయోగించె. ఆబాణముల నేడిమికిదాళజాలక రావణాసురుడు మూర్ఛనుబొంది కొంతసేపటికి దెలివొందె. అవ్విధముగభేదింపబడిన ధనుస్సుగలవాడును, బాణములచేతగొట్టబడినవాడును, మేదస్సుచేత దడపబడిన శరీరముగలవాడును, నెత్తురుచేతవ్యాప్తమైన దేహముగలవాడును, యుద్ధమునందు మిగులనధికమగు సామర్థ్యముగలవాడును, నగు రావణాసురుడు శక్తియను నాయుధమునుగ్రహించె. అంతట రాక్షసరాజగు రావణాసురుడు,పొగలేనియగ్నివలెమండుచున్నదియును, వానరసైన్యమునకు భయమునుగల్పించుచున్నదియును, వేగముచేత బ్రజ్వలించుచున్నదియును, నగు నాశక్తియను నాయుధమును లక్ష్మణునిమీదబ్రయోగించె. అట్లురావణాసురునిచేత బ్రయోగింపబడి యతివేగముగవచ్చుచున్న శక్తిమీద లక్ష్మణుడగ్నిహోత్రముతోసమానములగు ననేకబాణములను బ్రయోగించె. అవ్విధముగననేక బాణములచేత గొట్టబడినదియయ్యును నాశక్తి వెనుకకు మరలక యతివేగముగవచ్చి దశరథమహారాజునకు బుత్రుడగు లక్ష్మణునియొక్క విశాలమగు ఱొమ్మునుదూటువుచ్చుకొనిపోయె.

అవ్విధముగ మహాశక్తిగలవాడును, రఘుకులోత్తముడును, నగు లక్ష్మణుడు రావణాసురుని శక్తిచేతగొట్టబడినవాడై విహ్వలుడయ్యె. అట్లువిహ్వలుడైన లక్ష్మణునిజూచి రాక్షసరాజగు రావణాసురుడు లక్ష్మణుని భుజములచేతబట్టుకొనియె. అట్లుపట్టుకొనిన రావణాసురుడు మేరుమందరహిమవత్పర్వతములను దేవతలతోగూడలేవనెత్తుటకుదగినసామర్థ్యముగలవాడయ్యును భుజములచేత నాలక్ష్మణుని లేవనెత్తుటకుదగినసామర్థ్యములేనివాడయ్యె. అవ్విధముగ లక్ష్మణుడు బ్రహ్మసంబంధమగు శక్తిచేత స్తనాం

తరమందు గొట్టబడి క్రిందబడునప్పుడు విష్ణుదేవునియొక్క యచింత్యమగు తనభాగమునుస్మరించెను. (అనగా లక్ష్మణుడు విష్ణ్వంశసంభూతుడు గావున బూర్వస్మృతిగలవాడై తననిజస్వరూపమగు విష్ణ్వంశమునుస్మరించె.) విష్ణ్వంశస్మరణగలవాడై మానవదేహముతోనున్నవాడును, రాక్షసులయొక్కమదమును నశింపజేసినవాడును, సుమిత్రాదేవికి బుత్రుడును, నగు లక్ష్మణుని దేవతలకు శత్రువగు రావణాసురుడు తనభుజములచేత బలాత్కారముగ బట్టుకొని యెగురుటకు శక్తిలేనివాడయ్యె. ఆసమయమునందువాయుపుత్రుడగు హనుమంతుడదియంతయునుజూచి క్రోధోద్దీపితుడై రావణాసురున కభిముఖముగా బరుగెత్తుకొనివచ్చి వజ్రాయుధముతో సమానమగు పిడికిలియొక్క దెబ్బచేత రావణాసురునియొక్క ఱొమ్ముబ్రద్దలగునట్లుగొట్టె. అట్లుహనుమంతుని ముష్టిప్రహారముచేతగొట్టబడి రాక్షసాధిపతియగు రావణాసురుడుతాళజాలక క్రిందబడి గడగడవణికె. మఱియు నాసమయమునందు రావణాసురుడు నోటచేతను, ముక్కులచేతను నేత్రములచేతను, చెవులచేతను నెత్తురునుగ్రక్కె. అట్లునెత్తురునుగ్రక్కుచు ఘూర్ణమానుడై యారథమునందేపడి మూర్ఛనుబొందె. అవ్విధముగరథముమీదబడిమూర్ఛనుబొంది యేమియును దెలియనివాడయ్యె. అట్లుమూర్ఛనుబొంది రథముమీదబడియున్నవాడును, యుద్ధమునందధికమగు పరాక్రమముగలవాడును, నగు రావణాసురునిజూచి ఋషులును, వానరులును, దేవతలును, గంధర్వులును, పరమానందమునుబొందిరి. అంతట తేజోవంతుడగు హనుమంతుడు రావణాసురునియొక్క శక్తియను నాయుధముచేతబీడింపబడిన లక్ష్మణుని భుజములచేతబట్టి యెత్తుకొని రఘుకులోద్భవుడగు రామునిసమీపమునకు గొనిపోయె. అప్పుడు శత్రువులకు గదల్పనలవిగాని లక్ష్మణుడు, స్నేహితుడును, సర్వోత్తమమగుభక్తిగలవాడును, నగుహనుమంతునకు నెత్తికొనిపోవుటకు సులభుడైయుండె. ఆసమయమునందు రావణాసురునిచేత బ్రయోగింపబడిన శక్తియనునాయుధము యుద్ధమునందు జయింపనలవిగానివాడగు లక్ష్మణునివదలిపోయి రావణాసురుని రథముమీదమునుపున్నచోటుననుండె.

విచారింప శక్యముగాని విష్ణుదేవునియొక్క భాగమునుస్మరించుచుండుటచేత శత్రునాశకుడగు లక్ష్మణుడుమూర్ఛనువదలినవాడును, గాయములులేనివాడునునయ్యె. అప్పడక్కడ నధికమగు తేజస్సుగల రావణాసురుడును మూర్ఛదేరి మరలమిగుల దీక్ష్ణములగు బాణములనుసంధించె. ఆసమయమునందు రఘుకులోద్భవుడగు రాముడు క్రిందబడియున్న మహావీరులుగలదియును, పరుగెత్తుచున్నదియును, నగు వానరసైన్యమునుజూచి రావణాసురుని దరుముటకు యత్నించె. అట్లుయుద్ధసన్నద్ధుడైన రామునిజూచి హనుమంతుడు సమీపమునకువచ్చి యిట్లనియె.

రామచంద్రా! విష్ణుదేవుడు మిగులబలముగల గరుత్మంతుని ఎక్కి యుద్ధసన్నద్ధుడైన విధముగ నీవునునామీద నెక్కి యీరావణాసురుని వధింపుమనియె. ఇవ్విధముగావాయుపుత్రుడగు హనుమంతుడు చెప్పినమాటనువిని రఘుకులోద్భవుడును, మహాశూరుడును, నగు రాముడు, బలవంతుడును, వానరులలో నుత్తముడును, నగు హనుమంతునిమీద నెక్కె. అవ్విధముగ హనుమంతునిమీదనెక్కి సకలాయుధములనుధరించిన రాముడు విరోచనుడను రాక్షసోత్తముని జంపుటకు గరుడవాహనారూఢుడైన విష్ణుదేవునివలె బ్రకాశించె. అంతట నెల్లభూతములకును భయముగలుగునట్లుధనుష్టంకారమునుజేయుచు రాక్షసోత్తముడగు రావణునిసమీపమునకువచ్చి గంభీరమగు వాక్కుతోనిట్లనియె. ఓరీ! రాక్షసోత్తమా! నీవుకదలక యిక్కడనేయుండుము. నాకిటువంటియపకారమునుజేసి నీవెక్కడకుపోగలవు. నీవు దేవేంద్రునియొద్దకుబోయినను, యమునిదగ్గరకు బోయినను, సూర్యునిసమీపమునకు బోయినను, బ్రహ్మదేవునిదగ్గరకుబోయినను, అగ్నిదేవునొద్దకుబోయినను, పరమేశ్వరునిసమీపమునకుబోయినను, పదిదిక్కులలో నేదిక్కునకుబోయినను జంపుదును. నీవెక్కడకుబోయినను నాబాణమును దప్పించుకొనిపోజాలవు. ఇప్పుడు నీశక్తియనునాయుధముచేత గొట్టబడిన లక్ష్మణుడు నీపుత్రమిత్రాదులకందఱకును మృత్యురూపుడై వచ్చెననియెన్నుము. నేనుపూర్వము మిగులదీక్ష్ణములగుబాణములను బ్రయోగించి జనస్థానమునందున్నవారును, పదునాలుగువేలసంఖ్యలుగలవారును, యుద్ధసన్నద్ధులై నానావిధములగు నాయుధములను ధరించినవారును నగు రాక్షసులను సంహరించితిని. ఇప్పుడునిన్ను జంపుటకు వచ్చితిని. చూడుమనియె. ఆవిధముగా రఘుకులోద్భవుడగు రాముడుచెప్పినమాటనువిని రావణాసురుడు క్రోధోద్దీపితుడై ప్రళయకాలాగ్నితోసమానములైనవియును, మిగులదీక్ష్ణములైనవియును, నగు బాణములను, వాయుదేవునకుపుత్రుడును, మిగులగొప్పదగు పరాక్రమముగలవాడును, వానరోత్తముడును రఘుకులోద్భవుడగు రాముని వహించుచున్నవాడును నగు హనుమంతునిమీద బ్రయోగించె. అవ్విధముగరావణాసురునిచేతగొట్టబడినవాడును, మహానుభావుడును, స్వతస్సిద్ధమగుతేజస్సుతోగూడుకొనినవాడును, నగు హనుమంతునియొక్క తేజస్సుయొక్క తేజస్సు మునుపటి

కంటె నధికముగా వృద్ధిని బొందె. అంతట నవ్విధముగా రావణాసురునిచేత గాయముపడునట్లుగా గొట్టబడినవాడగు హనుమంతునిజూచి యధికమగు తేజస్సుగల రాముడు అపరిమితమగు కోపమును బొందె. అట్లు గోపోద్దీపితుడై యారాముడు విజృంభించి రావణాసురునియొక్క రథమును, రథచక్రములను, గుఱ్ఱములను, గొడుగును, ధ్వజపతాకలను, సారథిని, శూలఖడ్గాద్యాయుధములను, ఛేదించె. మఱియు ననేకములగుతీక్ష్ణబాణములను బ్రయోగించె. అంతట వజ్రాయుధముతో సమానమైనదియును, మిగుల దీక్ష్ణమైనదియును, నగునొక్కబాణముచేత నతిశీఘ్రముగ దేవేంద్రునకు శత్రువగు రావణాసురునియొక్కబంగారువలె బ్రకాశించుచున్న తొమ్మునందు దేవేంద్రుడు వజ్రాయుధముచేత బర్వతమునందు గొట్టినవిధముగాగొట్టె. వీరుడును, వజ్రాయుధముయొక్కయు, పిడుగుయొక్కయు దెబ్బలచేతగూడ వణకనివాడును, నగు రావణాసురుడు రామబాణములచేత బీడింపబడినవాడై ధనుస్సును గ్రిందబడవైచి గడగడవణకె. అవ్విధముగా భయముచేత గడగడవణకుచున్న రావణాసురునిజూచి రాముడుమరల నర్ధచంద్రాకారమగు బాణమును బ్రయోగించి దానిచేత సూర్యునివలె బ్రకాశించుచున్న రావణాసురుని కిరీటమును ఛేదించె. అంతట "గోరలులేనిసర్పమువలె"ఉన్నవాడును, "కిరణములులేనిసూర్యునివలె" వెలుగుచున్నవాడును, పోయినసంపదగలవాడును, ఛేదింపబడిన కిరీటము గలవాడును, రాక్షసేంద్రుడునునగు రావణాసురునితో నారాముడిట్లనియె.

ఓరీ! రావణాసురుడా! నీవు మిగుల భయంకరమగు యుద్ధమును జేసితివి. నిన్నువిరథునిగాజేయుటవలన నేను వీరుడగు వానిని జయించినవాడనైతిని. ఇకనీవుపోయి కొంచెముసేపు ఆయాసమును దీర్చికొనుము. ఇప్పుడు నాబాణములచేత నిన్నుజంపి యమపురమునకు బంపను. కావున బొమ్ము. నీకాజ్ఞనిచ్చితిని. నీవును యుద్ధమునందు బీడింపబడినవాడవైతివి. కాబట్టి యోరావణాసురుడా! ఇక నతిశీఘ్రముగ లంకాపట్టణమునకుబొమ్ము. పోయి ఆయాసమును దీర్చికొనిరమ్ము. మరల రథమునెక్కి ధనుర్ధారివై వచ్చి నాబలమును జూడుమనియె. ఇవ్విధముగా రాముడు చెప్పినమాటలనువిని పోగొట్టబడిన మదమును సంతోషమును గలవాడును, ఛేదింపబడిన ధనుస్సుగలవాడును, చంపబడినసారథియును, గుఱ్ఱములునుగలవాడును, బాణములచేత బీడింపబడినవాడును, ఛేదింపబడిన గొప్పదగు కిరీటముగలవాడును, నగురావణాసురుడు మిగుల శీఘ్రముగలంకాపట్టణమునకుబోయె. రాక్షసులకధిపతియును, దేవేంద్రునకు శత్రువును, నగురావణాసురుడు లంకాపట్టణములోనికిబోయిన పిమ్మట నారాముడు యుద్ధభూమియందు బడియున్నవానరులను, లక్ష్మణుని వ్రణరహితులనుగా జేసె. అట్లు దేవేంద్రునకు శత్రుడగు రావణాసురుడు దెబ్బలుదిని బయలువెడలి పోయినపిమ్మట దేవదానవులును, భూతగణములును, దిక్కులును, సముద్రములును, ఋషులును, మహోరగులును, భూచరజలచరములును, బరమ సంతోషము గలవయ్యె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి యేబదితొమ్మిదవసర్గ ముగిసెను.

——(*)——

రావణాసురునిఆజ్ఞచే రాక్షసులుకుంభకర్ణుని నిద్రలేపుట.

అట్లు రాముని బాణములవలనిభయముచేత బీడింపబడినవాడును, పోయినమదముగలవాడును, నగు రావణాసురుడు మిగుల బాధను బొందుచున్న యింద్రియములు గలవాడగుచు లంకాపట్టణమునందు బ్రవేశించె. అట్లు ప్రవేశించి మహాత్ముడగు రామునిచేత, "సింహముచేతనేనుగువలెను" "గరుత్మంతునిచేత సర్పమువలెను" అవమానింపబడిన వాడయ్యె. మఱియును రాక్షసాధిపతియగు రావణాసురుడు బ్రహ్మదండమువలె బ్రకాశించుచున్నవియును, మెఱుపుతీగలతోసమానమైన తేజస్సుగలవియును, నగు రామునిబాణములను స్మరించుచు మిగుల బరితాపమును బొందె. అవ్విధముగ వ్యసనమునుబొందుచు సువర్ణమయమైనదియును, మిగుల శ్రేష్ఠమైనదియును, నగు సింహాసనముమీదగూర్చుండి తనవారలగు రాక్షసులనందఱజూచుచు నిట్లనియె.

ఓరాక్షసోత్తములారా! నాచేత జేయబడినదియును, మిగుల భయంకరమైనదియును, నగు తపస్సంతయును వ్యర్థమయ్యె. దేవేంద్రునితో సమానుడనగు నేను మానవుడగు రామునిచేత జయింపబడితిని. నీకు మానవులవలన భయముగలుగునని బ్రహ్మదేవుడు మిగుల భయంకరముగా జెప్పినమాట నేటికినిజమైనట్లు కనబడుచున్నది. బ్రహ్మదేవునిమాట యబద్ధమగునా? ఓరాక్షసోత్తములారా! నేను దేవదానవగంధర్వులచేతను, యక్షరాక్షస పన్నగులచేతను భయముగలుగకుండునట్లు వరమునుగోరితినిగాని మానవులవలన మరణముగలుగకుండునట్లు వరమును గోరనైతిని. మఱియు నోరాక్షసోత్తములారా! పూర్వము నేను రఘుకులమునందు బుట్టిన యనరణ్యుడను వానితో యుద్ధమును జేసి యోడించితిని. అప్పుడాయనరణ్యుడు గోపోద్దీపితుడై యోరీరాక్షసుడా! మాకులమునందు దశరథుడనుమహారా

జునకు రాముడనువాడు పుత్రుడై పుట్టి నిన్ను బుత్రమిత్రకళత్రాదులతోగూడ సంహరించునని చెప్పె. ఆరాము డితడే యని తలచుచున్నాను. మఱియును బూర్వమునందు నేను మదోద్రిక్తుడనై పూజ్యురాలును, తపోవంతురాలును నగు వేదవతియొక్క శిఖను బట్టిలాగితిని. అప్పుడు అమ్మహాత్మురాలు నీలంకలోబుట్టి నీలంకకుజేరి నీవంశమంతయును నశించునట్లు సేసెదననియె. ఆపూజ్యురాలే సీతయని తోచుచున్నది. మేరుపర్వతము నెత్తిననాడు పార్వతీదేవి కోపోద్దీపితురాలై యోరీరాక్షసాధమా! నీవు స్త్రీరత్నమును అపహరించి దానిభర్తచేత సకుటుంబముగ నాశమును బొందుదువని శపించె. నేను గర్వించి కేలిచేయుటచేత నందికేశ్వరుడు గోపించి నావంటివికృతరూపములుగలవానరులచేత నీలంకాపట్టణమంతయును నాశమగునని శపించె. బలాత్కారముగ రంభనుబట్టుటచేత నలకూబరుడు నీకు స్త్రీమూలకముగ నాశముగలుగునని శపించె. వరుణకన్యకయగు పుంజికస్థలయను స్త్రీకి నవమానమును గల్పించుటచేత స్త్రీమూలకముగ నశింతువని బ్రహ్మశాపముగలిగె. మఱియు ననేకులగు ఋషిశ్రేష్ఠులును శపించిరి. ఆమాటలన్నియును వ్యర్థములగునా? కానేరవు. కాబట్టి యోరాక్షసోత్తములారా! మీరీవిషయమును సర్వమును మనస్సునయందుంచికొని లంకాపట్టణమును గాపాడుటయందధికమగు ప్రయత్నము గలవారలుగ కావలయును. మఱియు నోరాక్షసోత్తములారా! మిగుల గంభీరుడును, దేవతలయొక్కయు, రాక్షసులయొక్కయు, గర్వమును నశింపజేయువాడును, బ్రహ్మదేవునిశాపముచేత దిరస్కరింపబడిన వాడును, నగు కుంభకర్ణుడు మేలుకొనునట్లు సేయుడనియె. ఇవ్విధముగ నారావణాసురుడు తానవమానమును బొందుటను, ప్రహస్తుడు చంపబడుటను దలచుకొని మహాబలముగలవాడయ్యును నికరాముని జయింపజాలమనుభయముచేత బలికి మఱియు నిట్లనియె.

ఓరాక్షసోత్తములారా! మీరు ద్వారములయందు మిగుల ప్రయత్నముగలవారై యుండుడు. ప్రాకారములమీదనెక్కి కాపాడుడు. నిద్రనుబొందియున్న కుంభకర్ణుని మేలుకొలుపుడు. కుంభకర్ణుడు కాలోపహతచేతనుడైతొమ్మిదేసి మాసములు, ఆరేసిమాసములు, ఏడేసిమాసములు, ఎనిమిదేసిమాసములు నిద్రించుచుండును. నేటికిబూర్వము తొమ్మిదిదినములనాడు నిద్రనుమేల్కొని యాలోచించినిద్రనుబొందె. కావున మహాబలుడగు కుంభకర్ణుని మిగుల శీఘ్రముగ మేలుకొలుపుడు. రాక్షసోత్తములారా! ఆకుంభకర్ణుడు యుద్ధమును జేయునపుడు సకలరాక్షసులలోపలనుత్తముడనిప్రసిద్ధినిబొందె. అతడునిద్రనువదలిలేచెనేని వానరులను, రాజపుత్రులగు రామలక్ష్మణులను శీఘ్రముగ వధింపగలడు. మఱియు నీకుంభకర్ణుడు యుద్ధసమయమునందు రాక్షసులకందఱకును, ముఖ్యుడై యుండును, అట్టికుంభకర్ణుడు అవివేకముచేత గ్రామ్యసుఖమునందాసక్తిగలవాడైనిద్రించుచున్నాడు. అయినను అతడు మేలుకొననేని రామునిచేత యుద్ధమునందవమానింపబడిన నాకు సాహాయ్యమును జేయడాయేమి? చేయగలడనియె. అవ్విధముగ జెప్పుచున్న యారావణాసురుని వాక్యములనువిని మిగుల వేగిరపాటుగలవారై కుంభకర్ణుని గృహమునకుబోయిరి. మఱియు నారాక్షసులందఱును రావణాసురునిచేత నాజ్ఞాపింపబడినవారై గంధమాల్యాదులను భక్ష్యాదులను దీసికొని యతిశీఘ్రముగబోయిరి. అంతట ఆమడవెడల్పు గలదియును, మిగులగొప్పదియును, మిక్కిలి రమ్యమైనదియును, నానావిధ పుష్పగంధములచేత బరిమళించుచున్నదియును, నగు కుంభకర్ణునియొక్క గుహయందు బ్రవేశించి మహాబలులగు నారాక్షసులందఱును నతని, నిట్టూర్పు వాయువులచేత నిలువజాలకుండిరి. అట్లుప్రవేశించుటకు దగినసామర్థ్యములేనివారయ్యును, మంగళకరమైనదియును, మిగులమనోహరమైనదియును, బంగారముచేత నిర్మింపబడినదియును, నగు నాగుహలోనికి అధికమగు ప్రయత్నముతో బ్రవేశించిరి. ప్రవేశించి సుఖముగానిద్రించుచున్నవాడును, రాక్షసోత్తముడును, చూచుటకుగూడ భయమును గలుగజేయుచున్నవాడును, నగుకుంభకర్ణుని జూచిరి. పిమ్మట నారాక్షసులందఱును వికృతాకారముగలవాడును, పర్వతమువలెగ్రింద బడనిద్రించుచున్నవాడును, అధికమగు నిద్రనుబొందియున్నవాడును, నగు కుంభకర్ణునిమేలుకొలిపిరి. మఱియు నారాక్షసులందఱును, మిగులబొడవులగు రోమములచేతవ్యాప్తమైన శరీరముగలవాడును, మిగులగ్రూరమగు సర్పమువలె నిట్టూర్పులనువిడుచుచున్నవాడును, నిట్టూర్పువాయువులచేత నారాక్షసులకందఱకును భయమును గల్పించుచున్నవాడును, భయంకరములగు ముక్కుయొక్కరంధ్రములు గలవాడును, పాతాళలోకమువలె విపులమగు మోముగలవాడును, పడకయందుసర్వావయవములును దాకునట్లు పరున్నవాడును, మేదస్సుయొక్కయు నెత్తురుయొక్కయు, గంధముగలవాడును, సువర్ణమయములగు భుజబందులు మొదలుగాగల సొమ్ములచేత బ్రకాశించుచున్న సర్వావయవములుగలవాడును, కిరీటమునుధరించియున్నవాడును, శత్రువులను నశింపజేయునట్టి సామర్థ్యముగలవాడును, అధికమగుబలముగలవాడును, రాక్షసోత్తముడును, నగు కుంభ

కర్ణునిఁజూచిరి. అంతట మహాత్ములగు రాక్షసులందఱును, కుంభకర్ణునకెదుట మేరుపర్వతములనుబోలిన మాంసపురాసులను అతనికి దృప్తిగలుగుటకుగల్పించిరి. మఱియునానావిధములగు మృగములయొక్కయు, ఎనుములయొక్కయు, అడవిపందులయొక్కయు మాంసపురాసులను దెచ్చిపెట్టిరి. ఇంతయగాక యారాక్షసోత్తములందఱును మిగులనాశ్చర్యకరమగు నన్నపురాశిని దెచ్చిపెట్టిరి. మఱియునసేకములగు నెత్తురుకుండలను, కల్లుకుండలను దెచ్చిపెట్టిరి. ఇవ్విధముగ రాక్షసులందఱును అనేకములగు భోజనపదార్థములనాకుంభకర్ణునకెదుట బెట్టిరి. శత్రువులను దపింపజేయునట్టిసామర్థ్యముగల కుంభకర్ణునిశరీరమునందు లోకోత్తరములగు గంధాదులనుబూసిరి. మఱియును దివ్యములగు పూలమాలికలచేతను, పరిమళించుచున్న గంధములచేతను, సుగంధధూపములచేతను, నాకుంభకర్ణుని శరీరమునకలంకారమునుజేసిరి. పిమ్మట నారాక్షసులందఱును నాలుగు దిక్కులయందునువ్యాపించి మేఘములవలె గర్జించిరి. చంద్రునితో సమానములగు శంఖములను భంభంభంబని మహాధ్వనిగలుగునట్లుబూరించిరి. మఱియునానావిధములుగానారాక్షసులందఱును నొక్కటిగాజేరి మిగులసంకులముగా ధంధంధం అనిగూతలిడిరి. మఱియు నీవిధముగానారాక్షసులందఱును కుంభకర్ణుని మేలుకొలుపుటకొఱకు నానావిధములగు ధ్వనులనుజేసిరి. శంఖనాదములను, భేరీనాదములనుచేసిరి. చేతులతోనధికముగాధ్వనిగలుగునట్లుచేసిరి. సింహనాదములవంటినాదములనుజేసిరి. ఆమహాధ్వనులనువిని పక్షులాకాశమునకెగిరి ఏదిక్కునకునుబోజాలక యరచుచుగ్రిందబడియె. మిగులదైన్యముతో ధ్వనిజేయుచున్న రాక్షసులయొక్కయార్తనాదములచేత మహానుభావుడును, నిదురనుబొందుచున్నవాడును, నగు కుంభకర్ణుడు మేలుకొనకపోయె. అంతటరాక్షసులందఱును ముద్గరములను నాయుధవిశేషములను, ముసలములను, గదలను, గ్రహించిరి. అట్లుగ్రహించి పర్వతశిఖరములచేతను, ముసలములచేతను, గదలచేతను, వృక్షములచేతను, హస్తములచేతను, ముద్గరములచేతను, పిడికిలిదెబ్బలచేతను, సుఖముగానిద్రించియున్నయాకుంభకర్ణునిగొట్టిరి. ఆసమయమునందు బలవంతులగు రాక్షసులుగూడ కుంభకర్ణునియొక్కనిట్టూర్పువాయువుయొకతాకుడుకు దాళజాలకపోయిరి. మఱియునాసమయమునందు భయంకరమగు పరాక్రమముగల రాక్షసులుపదివేలమంది యొక్కటిగాజేరుకొని మృదంగములను, ధణధణమని తప్పెట్లను, రణభేరులను, శంఖములను కడవలను, నొక్కమాటుగా మ్రోగించిరి. కాటుకకొండలవంటి రాక్షసులు నానావిధములగు ప్రయత్నములనుజేసినను కుంభకర్ణుడు మేలుకొనడయ్యె. అట్లుచేసినప్రయత్నములకు గుంభకర్ణుడుమేలుకొనకపోవుటచేత నారాక్షసులందఱునునాలోచించి యంతకంటెనధికమగు ప్రయత్నమునుజేసిరి. అంతటనారాక్షసులందఱును, గుఱ్ఱములను, ఒంటెలను, గాడిదెలను, ఏనుగులను, నాకుంభకర్ణునిమీదనెక్కించి దండములచేతను, కొరడాలచేతను, అంకుశములచేతను, గొట్టియతివేగముగానడిపించిరి. మఱియారణభేరులను, మృదంగములను, శంఖములను దమబలముకొలది మ్రోగించిరి. మఱియు నాకుంభకరునియొక్క యవయవములను, మిగులగొప్పవగు కట్టెలచేతను, కంటములచేతను, మిగులదృఢముగామర్దించిరి. మఱియుముద్గరములు, ముసలములు, మొదలుగాగల యాయుధములతో దమశక్తికొలదిగొట్టిరి. ఆమహాధ్వనిచేత లంకాపట్టణమంతయును నిండినదై ప్రతిధ్వనిగలదయ్యె. మఱియునామహాధ్వని పర్వతములయందును, వనములయందునుగూడ వ్యాపించినదై ప్రతిధ్వనినిగలుగజేయుచుండె. అప్పటికిని నాకుంభకర్ణుడు మేలుకొనడయ్యె. అంతట నారాక్షసులందఱును నొక్కమాటుగా బంగారపుసాధనములతో వేయిరణభేరులనుమ్రోగింపజేసిరి. ఇవ్విధముగనెన్ని ప్రయత్నములుసేసినను శాపహతుడగుటచేత నాకుంభకర్ణుడు నిద్రనుండి మేలుకొనకపోయె. అంతటనారాక్షసులందఱును నధికమగు తమపరాక్రమములను జూపి యాకుంభకర్ణుని అనేకవిధములబాధించిరి. కొందఱురాక్షసులు మరల రణభేరులనుమ్రోగించిరి. కొందఱు మరలనధికమగు సింహనాదములనుజేసిరి. కొందఱురాక్షసులు కుంభకర్ణునియొక్క తలవెంద్రుకలనుబట్టి లాగిరి. మఱికొందఱు చెవులనుకఱచిరి. మఱికొందఱు రాక్షసులనేకనూరుల జలకుంభములనుదెచ్చిచెవులయందాజలమునుబోసిరి. ఇవ్విధముగజేసినను, గొప్పదగునిద్రవశమునుబొందిన కుంభకర్ణుడు మేలుకొనకపోయె. అప్పుడు మఱికొందఱురాక్షసులు కూటములు, ముద్గరములు, మొదలగు నాయుధములనుధరించినవారై కుంభకర్ణునియొక్క వక్షస్థలమునందును, అవయవములయందును, విశేషముగాగొట్టిరి. మఱియును బలవంతులగు రాక్షసులుకొందఱు త్రాళ్లచేతదృఢముగాగట్టబడిన గదావిశేషములచేత నాకుంభకర్ణుని నధికముగాగొట్టిరి. ఇవ్విధముగా గొట్టబడినప్పటికిని కుంభకర్ణుడు నిద్రనువదలకపోయె. అంతటనారాక్షసులందఱును, యోచించి వేయియేనుగులను, ఆకుంభకర్ణునిమీదనెక్కించి పరుగెత్తించుటచేతగూడ మహాకాయుడగు కుంభకర్ణుడు మేలుకొనడయ్యె. అప్పటికిని నూరకుండక యారాక్షసులందఱును

నొక్కటిగాజేరి పర్వతశిఖరములచేతను, వృక్షములచేతను, మిగులనధికముగాగొట్టిరి. అంతట నాకుంభకర్ణుడు నిద్రనువదలి యాకలిచేత నధికముగా బీడింపబడినవాడును, నావలించుచున్నవాడునునై మిగులశీఘ్రముగలేచె, అట్లులేచినాగభోగాచలశృంగములతో సమానములైనవియును, పర్వతశిఖరములయొక్క సారమువంటి సారముగలవియును, నగు బాహువులనువిసరి యాకుంభకర్ణుడు బడబాముఖముతోసమానమైనతననోరును దెరచె. అవ్విధముగ నావలించుచున్న యాకుంభకర్ణునియొక్కనోరు పాతాళలోకముతోసమానమైయుండె. మఱియు నాసమయమునందా కుంభకర్ణుడు మేరుపర్వతముయొక్కశిఖరాగ్రమునందు ఉదయించుచున్న సూర్యునిబోలియుండె. మఱియు నవ్విధముగానిద్రనువదలిన యాకుంభకర్ణునియొక్క యాకారము వర్షాకాలమునందు వర్షించుచున్నమేఘముయొక్కయాకారమునుబోలియుండె. మఱియు మేల్కొనినవాడును, ఆవలించుచున్నవాడును, నగు నాకుంభకర్ణుడు పర్వతమునుండిబయలువెడలిన వాయువువలె గనబడెను. మఱియు నవ్విధముగామేల్కాంచినపిమ్మట నధికమగుకోపముతో ద్రిప్పుచున్నయాకుంభకర్ణునియొక్క నేత్రములు ప్రజ్వలించుచున్నయగ్నిహోత్రముతోడను, మెఱపుతీగలతోడను సమానములైయుండె. అంతటనాకుంభకర్ణుడు, నానావిధములైనవియును, అనేకములును, నగు భక్ష్యపదార్థముల నన్నింటిని జూచె. పిమ్మటమహాబలుడగు నాకుంభకర్ణుడు, అడవిపందులయొక్కయు, ఎనుములయొక్కయు, మాంసమునుభుజించె. అవ్విధముగానాకలిచేత బీడింపబడుచున్న కుంభకర్ణుడు మాంసపురాసులనన్నింటినిభుజించి యండలిమద్యములను, నెత్తురును బానముచేసి మిగులదృప్తిగలవాడయ్యె. అట్లుభుజించి కుంభకర్ణుడు తృప్తినొందియుండుటను దెలిసికొనిరాక్షసులందఱును దమయత్నము సఫలమగుటకు సంతసించినవారై శిరస్సులనువంచి యాకుంభకర్ణునకు నమస్కారమునుజేసిరి, అంతటనిద్రచేత జక్కగా దెఱువుడుపడనినేత్రములుగలవాడును, కలుషములైననేత్రములుగలవాడును, నై నాలుగుదిక్కులను గలయజూచి తనసమీపమునను న్నరాక్షసులనుజూచె, అంతట రాక్షసోత్తముడగు నాకుంభకర్ణుడు తనసమీపముననున్న రాక్షసులనందఱును అనేకవిధములనూరార్చె. పిమ్మట దన్నుమేలుకొలుపుటకుమిగుల నాశ్చర్యముగలవాడగుచు నారాక్షసులతోనిట్లనియె. ఓరాక్షసోత్తములారా! మీరేమినిమిత్తముగనన్ను మేలుకొలిపితిరి. మనకధిపతియగు రావణాసురుడు కుశలముగనున్నాడుగదా? అతనికేమియును భయములేదుగదా? మీరందఱు

సుమిగులత్వరగలవారై నన్నునిద్రనుండి మేలుకొలుపుటచేత నితరులవలన భయముగలిగియున్నదనితోచుచున్నది. అయినను గానిమ్ము ఇప్పుడురాక్షసరాజగు రావణాసురునకుగలిగినభయమునుబోగొట్టెదను. దేవేంద్రునినైననుబడగొట్టెదను. అగ్నిహోత్రునినైనను నశింపజేయగలను. వాకుగురుడగు రావణాసురుడుతగినకారణములేనిది నన్ను మేలుకొనునట్లుచేయడని తలంచుచున్నాను. కాబట్టి నన్నులేపుటకు దగినకారణమును జెప్పుడనియె. ఇవ్విధముగా జెప్పుచున్నవాడును, మహాబలుడును, నగు కుంభకర్ణునితో రావణాసురునకు మంత్రియగు యూపాక్షుడనువాడు చేతులను ముకుళించుకొనినవాడై యిట్లనియె. రాక్షసోత్తమా! కుంభకర్ణా! మనకు దేవకృతమగు భయమెంతమాత్రమైనను గలిగియుండలేదు. మానవులవలన నధికమగుయుద్ధసంబంధమైన భయముగలిగియున్నది. ఇప్పుడు మానవులవలన గలిగినభయమువంటిభయము దైత్యులవలనను, దానవులవలనను, ఇదివఱకెన్నడును గలిగియుండలేదు మఱియునోరాక్షసోత్తమా! ఇప్పుడధికమగుభయము గలిగియున్నది. మఱియునో రాక్షసోత్తమా! పర్వతములయొక్క యాకారములవంటి యాకారములుగలవానరులచేత లంకాపట్టణమంతయును, చుట్టబడినది. మనరాజగు రావణాసురుడు రామునిభార్యయగు సీతనుసపహరించుకొనివచ్చె. అందువలన రాముడు రోషోద్దీపితుడును, యుద్ధసన్నద్ధుడునై వచ్చె. వానిచేతమిగుల భయముకలిగియున్నది. ఇంతకుమునుపొక వానరుడువచ్చి యీలంకాపట్టణమంతయును దగులబెట్టిపోయె. మఱియు నావానరుడు సకలవానరులతోగూడ యుద్ధమునకు బోయి నక్షకుమారునిసంహరించె. ఇప్పుడు దేవకంటకుడును, రాక్షసాధిపతియును, నగు రావణాసురుడు సూర్యునియొక్క తేజస్సువంటి తేజస్సుగల రామునితో యుద్ధమును జేసి మరణమునుబొందితినేయనితలచె. అంతటరాముడు దయగలవాడై విడిచిపెట్టె. ఇవ్విధముగయుద్ధమెన్నడును రావణునకు దైత్యదానవులతోగూడ గలుగలేదనియె, అవ్విధముగయూపాక్షుడు చెప్పినవాక్యమునువిని రావణాసురునకుయుద్ధమునందపజయముగలుగుటను దెలిసికొని కుంభకర్ణుడుకన్నులనుద్రిప్పుచునాయూపాక్షునితోనిట్లనియె. ఓయూపాక్షుడా! ఇప్పుడువానరసైన్యమును రామలక్ష్మణులతో గూడసంహరించెదను, పిమ్మట రావణాసురుని జూచెదను. వానరులయొక్కనెత్తురుచేత రాక్షసులకు దృప్తినొందించెదను, నేను రామలక్ష్మణులయొక్క నెత్తురునుద్రాగి తృప్తిబొందెదననియె. ఇవ్విధముగా, కుంభకర్ణుడుకోపోద్రిక్తుడును, గర్వోద్రిక్తుడునునై చెప్పినవాక్యములనువిని రాక్ష

సులలోముఖ్యుడగు మహోదరుడనువాడు చేతులనుముకుళించుకొని యిట్లనియె. రాక్షసోత్తమా! ముందుగా నీవు యుద్ధమునకుబోవుట యుచితముగనుండలేదు. కావునరావణాసురునియొక్క వాక్యమునువిని గుణదోషములనువిచారించి పిమ్మట యుద్ధమునకుబోయి శత్రువులను జయింతమనియె. అంతట నాకుంభకర్ణుడు మహోదరునివాక్యమునువిని యధికమగు తేజస్సుగలవాడును, మహాబలుడును, నగు నాకుంభకర్ణుడు రాక్షసులతోగూడుకొనినవాడైబయలువెడలె. అట్లుభయంకరమైన పరాక్రమముగలవాడును, భయంకరమైన నేత్రములు గలవాడును, నగుకుంభకర్ణుని బయనముచేయించి రాక్షసులందఱును రావణాసురుని గృహమునకు అతిశీఘ్రముగబోయిరి. పోయి ఉత్తమమగు సింహాసనమునందు గూర్చున్న రావణాసురుని జూచి యారాక్షసులందఱును జేతులను ముకుళించుకొనినవారై యిట్లనిరి. రాక్షసరాజోత్తమా! రావణాసురుడా! నీతమ్ముడగు కుంభకర్ణుడుమేల్కొనియెను. అతనిక్కడకువచ్చునటులనాజ్ఞాపించెదవా? లేకనీవక్కడకు బోయెదవాయని యడిగిరి. అంతట రావణాసురుడు పరమసంతోషముగలవాడై యారాక్షసులతోనిట్లనియె. రాక్షసోత్తములారా! నేనక్కడకువచ్చుట రాజధర్మమునకు విరుద్ధముగనుండును. కాబట్టి మీరా కుంభకర్ణునకు దగినమర్యాదనుజేసి యిక్కడకు దీసికొనిరండనియె. అంతట నారాక్షసులందఱును వల్లెయనిబయలువెడలిపోయి కుంభకర్ణునితోనిట్లనిరి. రాక్షసోత్తమా! కుంభకర్ణుడా! రాక్షసరాజగు రావణాసురుడు నిన్ను జూడవలయునని యభిలషించుచున్నాడు. కావున నీవక్కడకువచ్చుటకు దగినప్రయత్నమును జేయుము. సంతోషము గలవాడవగుమనిరి. అంతట గుంభకర్ణుడు అన్నయగురావణాసురునియొక్కయాజ్ఞను దెలిసికొని శయ్యమీదనుండి యతిశీఘ్రముగలేచె. పిమ్మట బరమసంతోషముగలవాడై ముఖమునుగడుగుకొని చక్కగానలంకరించుకొనినవాడై మిగులనుత్తములగు మద్యాదులను భుజించుటకుయత్నించె. అంతటనారాక్షసులందఱును రావణాసురునియొక్క యాజ్ఞానుసారముగ నానావిధములగు మద్యభాండములను దీసికొనివచ్చిరి. అప్పుడాకుంభకర్ణుడు రెండువేల మద్యభాండములయందలి మద్యమునుపానముసేసి యధికమగు తేజోబలములుగలవాడును, కొంచెముమైకముగలవాడును, నగుచు రావణాసురునియొద్దకు బోవుటకుయత్నించె. ఆసమయమునందు సంతుష్టుడగు నాకుంభకర్ణుడు కాలాంతకుడగు యమునితోసమానుడైయుండె. మఱియు నాకుంభకర్ణుడనేకవేల రాక్షసులతో గూడుకొనినవాడై యన్నయగు రావణాసురునిగృహమునకుబోవుచున్నసమయమునందు అతనిపాదఘట్టనములనుభరింపజాలకభూమియంతయును గడగడవణకె. అవ్విధముగ బయలువెడలి పోవునప్పుడు ఆకుంభకర్ణుడు వేయికిరణములుగల సూర్యునిబోలియుండె. అంతట జేతులను ముకుళించుకొని బ్రహ్మదేవుని గృహములోనికి దేవేంద్రుడు పోయినవిధముగాబోయె. అవ్విధముగ రాజమార్గమునందు బోవుచున్నవాడును, శత్రువులనునశింపజేయువాడును, నగుకుంభకర్ణునిజూచి యాపట్టణమునకు బయలునసంచరించుచున్నవానరులందఱును మిగులభయమునుబొందిరి. అంతట నావానరవీరులలోగొందఱు రామునియొద్దకుబోయి రక్షింపుమనిప్రార్థించిరి. కొందఱు భయభ్రాంతులై క్రిందబడిరి. కొందఱుభయముచేత నలుదిక్కులకును బరువెత్తిరి. కొందఱుమహాభయముచేత గ్రిందబడిరి. మఱియునావానరులందఱును సూర్యునివలె బ్రకాశించుచున్నవాడును, పర్వతశిఖరముతోసమానమగు కిరీటమునుధరించిన వాడును, నగు కుంభకర్ణునిజూచి భయముచేతభీతితులై నానాదిక్కులకునుబరుగిడిరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి యరువదవ సర్గ ముగిసెను.

——(*)——

కుంభకర్ణుడు రావణాసురునివద్దకు బోవుట.

అప్పుడు అధికమగు తేజస్సుగలవాడును, మిగులశ్రేష్ఠమగు పరాక్రమముగలవాడును, నగురాముడు, కిరీటముగలవాడును, మిగులగొప్పదగుశరీరముగలవాడును, నగు కుంభకర్ణునిజూచె. పూర్వమునందు ఆకాశమును నాక్రమించుచున్న నారాయణుని బోలియున్నవాడును, పర్వతమునొక్కయాకారమువంటి యాకారము గలవాడును, రాక్షసశ్రేష్ఠుడును, నగుకుంభకర్ణునిజూచె. అప్పుడు వానరసైన్యమంతయును, నల్లనిమేఘముతో సమానుడును, బంగారపుభుజబంధులనియెడు సొమ్ములచేత నలంకరింపబడినవాడును, నగుకుంభకర్ణునిజూచి భయముచేత మరలమునుపటివలెనేపరుగిడిరి. అవ్విధముగ బరుగెత్తుచున్నవానరసైన్యమును, వృద్ధినిబొందుచున్నకుంభకర్ణునిజూచి రాముడుమిగులనాశ్చర్యమును బొందుచు దనసమీపముననున్న విభీషణునితోనిట్లనియె.

మిత్రుడా! రాక్షసోత్తమా! విభీషణుడా! పర్వతముతో సమానుడును, కిరీటముగలవాడును, పచ్చనినేత్రములు గలవాడును, మెఱుపుతీగెలతోగూడిన మేఘమును బోలియున్నవాడును, లంకాపట్టణమునందు సంచరించుచున్నవాడును,

నగు వీడెవడు. మఱియు నో విభీషణుడా! మిగుల గొప్పవాడగు నీ రాక్షసుడు ధూమకేతుభూతుడై కనబడుచున్నాడు. వీడెవ్వడు. వీనిని జూచి వానరులందఱును నాలుగు దిక్కులకును బరుగెత్తుచున్నారు. మిగుల గొప్పవాడగు నీరాక్షసు డెవ్వడో చెప్పుము. నేనిదివఱకెన్నడును నిటువంటి భూతమును జూడలేదు. కావున వాని వృత్తాంతమును సర్వమును జెప్పుమనియె. అనియిట్లు అనాయాసముగ సకలకార్యములను జేయువాడును, రాజపుత్రుడును, నగు రాముడివ్విధముగా నడిగిన వాక్యములను విని బుద్ధిమంతులలో నుత్తముడగు విభీషణుడు కకుత్స్థుని కులమునందు బుట్టిన రామునితో నిట్లనియె.

రామచంద్రా! ఈవచ్చుచున్న రాక్షసుడు విశ్రవసునకు బుత్రుడగు కుంభకర్ణుడు. ఇతడు యుద్ధమునందు యముని జయించెను. ఈకుంభకర్ణునకు దుల్యుడగు రాక్షసుడు మఱియొక్కడెవ్వడును లేడు. వీనిచేత యుద్ధములయందు దేవతలును, దానవులును, యక్షులును, భుజంగములును, రాక్షసులును, గంధర్వులును, విద్యాధరులును, కిన్నరులును, అనేకులనేక పర్యాయములు భంగపఱుపబడిరి. శూలము చేతియందు గలవాడును, వికారములగు నేత్రములు గలవాడును, అధికమగు బలము గలవాడును, నగు కుంభకర్ణుని జయింపదలచి యుద్ధమును జేసి దేవతలందఱును నీతని జంపజాలక యముడని తలచి మిగుల భయమును బొందిరి. మహాబలుడగు నీకుంభకర్ణుడు స్వయముగానే యధికమగు తేజస్సు గలవాడు. మహానుభావుడును, ఆకలిచేత బీడింపబడినవాడును, నగు నీకుంభకర్ణుడు పుట్టినతోడనే యనేకములగు జంతువులను భుజించెను. అట్లు సకలభూతములను భుజించుచుండగా జంతువులన్నియును మిగుల భయమును బొందినవై దేవేంద్రుని యొద్దకు బోయి శరణు సొచ్చెను. అంతట వజ్రాయుధధారియగు దేవేంద్రుడు మిగుల గోపముగలవాడై తన వజ్రాయుధముచేత గుంభకర్ణుని గొట్టెను. అట్లు దేవేంద్రుని యొక్క వజ్రాయుధముచే గొట్టబడి గోపోద్దీపితుడై మహానుభావుడగు కుంభకర్ణుడు కోపోద్రేకముచేత మిగుల భయంకరముగా గూతవేసె. అవ్విధముగా గూయుచున్న కుంభకర్ణునియొక్క కూతను విని లోకములోని భూతములన్నియును నధికముగా భయమును బొందె. భూమియంతయును గడగడవణకె. పిమ్మట మహాబలుడగు కుంభకర్ణుడు కోపోద్రిక్తుడై యా దేవేంద్రుని వాహనమగు నైరావతముయొక్క దంతమును బెఱికి దానితో దేవేంద్రుని ఱొమ్ము పగులునట్లు గొట్టె. అట్లు కుంభకర్ణుడు గొట్టిన దెబ్బకు దాళజాలక యింద్రుడు మిగుల గోపమును జెందియును నతనితో యుద్ధమును జేయజాలక పరుగెత్తె. అంతట దేవతలును, బ్రహ్మర్షులును, దానవులును, మిగుల భయముగలవారై యింద్రునితో గూడ బ్రహ్మలోకమున కతిశీఘ్రముగ బోయి కుంభకర్ణునియొక్క దుర్మార్గతనమును బ్రహ్మదేవునితో జెప్పిరి. మఱియును వారందఱును నా బ్రహ్మదేవునితో గుంభకర్ణుడు ప్రజలను భక్షించుచున్నాడనియును, దేవతలను బెదరించుచున్నాడనియును, ఆశ్రమములను బాధసేయుచున్నాడనియును, పరస్త్రీలనపహరించుచున్నాడనియును, జెప్పి మఱియు నిట్లనిరి. దేవోత్తమా! బ్రహ్మదేవా! ఇవ్విధముగా బ్రతిదినమందును జంతువులు భుజింపబడుచుండెనేని యతిశీఘ్రకాలములోనే లోకమంతయును నిర్మానుష్యము కాగలదనిరి. ఇవ్విధముగా దేవేంద్రుడు మొదలగువారు చెప్పిన మాటలను విని సర్వలోకములకును పితామహుడగు బ్రహ్మదేవుడు సకలరాక్షసులతో గూడ గుంభకర్ణుని రప్పించి చూచె. అట్లు తనయొద్దకు వచ్చిన కుంభకర్ణుని జూచి బ్రహ్మదేవుడు గూడ భయమును బొందె. అంతగొంతసేపటికి ఆ కుంభకర్ణుని మంచి మాటలచేత నమ్మకము గలవానినిగా జేసికొని యిట్లనియె. ఓరీ కుంభకర్ణుడా! నీవు నిశ్చయముగా లోకనాశమునకై కుంభకర్ణుడను పేరుచేత నిర్మింపబడితివి. కావున నీవిది మొదలుకొని మరణమును బొందినవానితో సమానుడవై పడియుండగలవనియె. అంతట నా కుంభకర్ణుడు బ్రహ్మశాపముచేత దిరస్కరింపబడినవాడై క్రిందబడియె. అప్పుడు రావణాసురుడు మిగుల సంభ్రాంతుడై దేవోత్తమా! బ్రహ్మదేవుడా! బంగారపు చెట్టును ఫలకాలమునందు ఛేదించుచున్నావు. నీకు మనుమడగు కుంభకర్ణుని నివ్విధముగా శపింపదగునా? నీమాటల బద్ధముగా నేరవు. ఇందు కేమియును సందేహము లేదు. కావున నో బ్రహ్మదేవుడా! నీవీ కుంభకర్ణుడు మేలుకొనుటకును, నిద్రను బొందుటకును, దగినకాలమును నిర్ణయింపుము. నా ప్రార్థన నంగీకరింపుమనియె. అట్లు రావణాసురుడు పలికిన మాటలను విని బ్రహ్మదేవు డిట్లనియె. ఓ రాక్షసశ్రేష్ఠుడా! రావణాసురుడా! ఈకుంభకర్ణుడు ఆరుమాసముల కాలము నిదురను బొందును. ఒక్కదినము మేలుకొనియుండును. ఆ యొక దినమునందును నీకుంభకర్ణుడు ముల్లోకములను గూడ భక్షించుటకు దగిన శక్తిగలవాడై యుండును. మఱియు నితడా దినమునందు గోపోద్రిక్తుడయ్యెనేని యగ్నిహోత్రుని వలె సకలలోకములను నాశమును బొందింపగలడని చెప్పె. అది మొదలుకొని యీ కుంభకర్ణుడు, ఆరుమాసములు నిద్రను బొందుచు నొక్కదినము మేలుకొనుచునుండె. ఇప్పుడు రావణాసురుడు నీపరాక్రమమునకు భయమును బొందినవాడై నిద్రను బొందుచున్న యీ కుంభకర్ణుని మేలుకొలిపిం

చె. అందువలనభయంకరమగు పరాక్రమముగల యీకుంభకర్ణుడు తనశిబిరములోనుండి బయలువెడలె. అట్లు క్రోధోద్దీపితుడై వచ్చుచున్న యీకుంభకర్ణుడు వానరులనుజూచి మిగులవేగముతో బరుగిడివచ్చుచున్నాడు. అట్టికుంభకర్ణునిజూచిమనవానరులందఱును నధికమగు భయముగలవారై పరుగిడివచ్చుచున్నారు. కోపయుక్తుడైన యీకుంభకర్ణుని వానరులేవిధముగా సంహరింపగలరు. ఏవిధముచేతను సంహరింపజాలరు. కావున నోరామచంద్రా! మనవానరులతో మనలను భయపెట్టుచుటకు రావణాసురునిచేత నిర్మింపబడెన మిగుల బొడవగు యంత్రమనిచెప్పుము. అట్లయ్యేనేని యీవచ్చుచున్న కుంభకర్ణునిజూచి వానరులుయంత్రమనితలచి నిర్భయులగుదురనియె. ఇవ్విధముగా విభీషణునిచేత సయుక్తికముగా జెప్పబడిన వాక్యమునువిని రాముడు పరమసంతోషముగలవాడై నీలుడనునామధేయముగలవానరసేనాపతితో నిట్లనియె.

నీలుడా! వానరోత్తమా! నీవుశీఘ్రముగబొమ్ము. పోయి వానరులనందఱ నొక్కటిగాజేర్చి లంకాపట్టణముయొక్క ద్వారముల నాక్రమించునట్లు సేయుము. మఱియును, పర్వతశిఖరములను, మిగుల బొడవులగువృక్షములను, పెద్దపెద్దశిలలను దెప్పింపుము. అట్లుసేసి వానరులందఱును నాయుధములను ధరించియుండునట్లు సేయుమనియె. ఇవ్విధముగా రాముడుసెప్పినమాటలనువిని నీలుడనువానరసేనాధిపతి రామునివచనానుసారముగ వానరులకందఱకును నాజ్ఞనిచ్చె. అంతట గవాక్షుడు, శరభుడు, హనుమంతుడు, అంగదుడు, మొదలుగాగలవారందఱును, పర్వతములతో సమానములగు పర్వతశిఖరముల నవలంబించి లంకాపురద్వారమునకు బయలువెడలిపోయిరి. అవ్విధముగ జయశీలురును, వీరులును, నగువానరులందఱును, రామునివాక్యమునువిని శత్రుసైన్యమును బీడించుచుండిరి. అంతట మిగుల భయంకరమైనదియును, శైలములచేత నధికముగా బ్రకాశించుచున్న హస్తములుగలదియును, పర్వతసమీపమునందు సంచరించుచున్న మేఘసమూహమువలె బ్రకాశించుచున్నదియును, నగువానరసైన్యము ప్రకాశించుచుండె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలియఱువదొక్కటవసర్గముగిసెను

(*)

రావణ కుంభకర్ణులు స్నేహముగ సంభాషించుట.

అంతట నిద్రామదముచేత మిగులవ్యాకులమైనవాడును, రాక్షసోత్తముడునునగు కుంభకర్ణుడు సకలసంపదలతోడను గూడుకొనిన రాజమార్గమునందు బోవుచుండె. మఱియు ననేకవేలరాక్షసులతో గూడుకొనినవాడును, శత్రువులచేతజయింపనలవిగానివాడును, నగు కుంభకర్ణుడు గృహములనుండివచ్చుచున్న పుష్పవర్షములతో గూడుకొనినవాడగుచుబోయె. అట్లుపోయి బంగారముచేత నిర్మింపబడినగవాక్షములతో గూడుకొనినదియును, సూర్యునివలె బ్రకాశించుచున్నదియును, మిగులవిశాలమైనదియును, మిగులమనోహరమైనదియును, రాక్షసాధిపతికినివాసస్థానమైనదియును నగు లంకాపట్టణమునుజూచె. పిమ్మట సూర్యుడు మేఘమునందు బ్రవేశించినవిధముగా నాకుంభకర్ణుడు రాక్షసాధిపతియగు రావణాసురునియొక్క గృహమునందు బ్రవేశించె. పిమ్మట గొంచెముదూరమునందున్న సింహాసనమునందుగూర్చున్నవాడును, అన్నయును, నగు రావణాసురుని, దేవేంద్రుడు బ్రహ్మదేవునిజూచినవిధముగా జూచె. అవ్విధముగ ననేకులగు రాక్షసులతోగూడుకొనినదియును, తనయన్నయగు రావణాసురునకు నివాసస్థానమైనదియును, నగు రావణాసురుని యంతఃపురమునందు బ్రవేశించునప్పుడు కుంభకర్ణుడు తనయడుగులచేత భూమినిగడగడవణకించె. అవ్విధముగా నాకుంభకర్ణుడు రావణాసురుని గృహమునందుబ్రవేశించి మిగుల నుద్వేగమునుబొందియున్నవాడును, సింహాసనమునందు గూర్చున్నవాడును, నగు రావణాసురునిజూచె. అప్పుడా రావణాసురుడు తనసమీపమునకువచ్చియున్నకుంభకర్ణునిజూచి పరమసంతోషము గలవాడగుచు దిగ్గునలేచి యాకుంభకర్ణుని సమీపమునకు బోయె. అంతటమహాబలుడగు కుంభకర్ణుడు సింహాసనమునందుగూర్చున్నవాడును, తనకన్నయైనవాడును, నగురావణాసురునియొక్క పాదములకునమస్కరించి యోఅన్నా! రాక్షసోత్తమా! రావణాసురుడా! నన్నురప్పించుటకు గారణమేమి? నేనిప్పుడేమిచేయవలయుననియె. అంతట రావణాసురుడు పరమసంతోషముగలవాడై సింహాసనమునుండి లేచినవాడై తమ్ముడగు కుంభకర్ణుని గౌగలించుకొనియె. అప్పుడాకుంభకర్ణుడవ్విధముగా నన్నయగు రావణాసురునిచేత గౌగిలించుకొనబడినవాడై పరమానందమును బొందె. పిమ్మట దగినసింహాసనమునందుగూర్చుండె. అట్లుకూర్చుండి మహాబలుడగు కుంభకర్ణుడు కోపముచేతనెఱ్ఱనైన నేత్రములుగలవాడగుచు నిట్లనియె.

రాక్షసరాజోత్తమా! అన్నా! రావణాసురుడా! నీవేమినిమిత్తముగ బరమాదరముతో నన్నుమేలుకొలిపితివి. ఆకారణమును జెప్పుము. ఇప్పుడుఏదుర్మార్గుడు మరణమును బొందుటకు సిద్ధముగనున్నాడు. ఆవిషయమును సర్వము

ను దెలియఁజెప్పుమనియె. అంతట రావణాసురుడు, తనతమ్ముఁడగు కుంభకర్ణుడు శత్రువులయందు గోపముగలవాడై యుండుటను దెలిసికొని నేత్రములను గిరగిర ద్రిప్పుచు నిట్లనియె. మహాబలుఁడవైనయో కుంభకర్ణుడా! నీవు నిద్రించి యిప్పటికి జిరకాలమైనది. నీవు సుఖముగా నిద్రించియుండుటచేత రామునివలన గలిగియున్న భయమును దెలిసికొనిన వాడవుగావు. తమ్ముఁడా! కుంభకర్ణుడా! దశరథమహారాజునకు బుత్రుడగు రాముడు సుగ్రీవునితోడను, వానరసైన్యముతోడను, గూడుకొనినవాడై సముద్రమును దాటి మనపట్టణమును సమూలముగ నాశనమును బొందించుచున్నాడు. చూడుము. అయ్యో! మనలంకాపట్టణమునందలి వనములును, ఉపవనములును, నాశమును బొందినవి. వానరులందఱును సముద్రమునకు గట్టుకట్టి యాకట్టమీఁదుగావచ్చి లంకాపట్టణమునందంతటను వ్యాపించిరి. మఱియునో తమ్ముఁడా! కుంభకర్ణుడా! రాక్షసులలో ముఖ్యులగు వారందఱును వానరులచేత యుద్ధమునందు జంపబడిరి. తమ్ముఁడా! కుంభకర్ణుడా! ఒకప్పుడును యుద్ధమునందు వానరులు మరణమును బొందడములేదు. నేను బూర్వము యుద్ధమునందు వానరులను జయించినవాడను గాను. కావున మహాబలుడవైనయో కుంభకర్ణుడా! ఇప్పుడు నాకు మానవులవలనను, వానరులవలనను, మిగుల భయము గలిగియున్నది. కాబట్టి నన్ను రక్షింపుము. ఇప్పుడు నీవీవానరులనందఱను నాశమును బొందింపుము. వానరనాశమునకొఱకు నీవు మేలుకొలుపబడితివి. ఇప్పుడు మనధనాగారములయందలి ధనమంతయును నశించిపోయినది. మఱియు నిప్పుడు మనలంకాపట్టణము నందలి బాలురును, వృద్ధులును, దప్పదక్కినవారందఱును మరణమును బొందిరి. కాబట్టి యీబాలవృద్ధులనైననురక్షింపుము. మిగుల దృఢములగు భుజములుగల యోకుంభకర్ణుడా! నీవు నీ అన్నయగు నానిమిత్తముగ మిగుల దుష్కరమగు యుద్ధమును జేయుము. శత్రువులను దపింపజేయునట్టి యోతమ్ముఁడా! కుంభకర్ణా! ఇదివఱకెన్నఁడును నేనీవిధముగా నీతో జెప్పియుండలేదు. నీయందు నాకు మిగుల స్నేహము గలదు. ఇంతయగాక నీవు మిగుల బలవంతుడవనియును, దలచుచుందును. రాక్షసోత్తముడవైన యోకుంభకర్ణుడా! అనేక పర్యాయములు నీవు దేవాసురులయుద్ధములయందు దేవతలను, రాక్షసులను, విభజించి జయించితివి. కావున భయంకరమైన పరాక్రమముగల యోకుంభకర్ణుడా! ఇప్పుడు నీపరాక్రమమును సర్వమును బూపుము, శీఘ్రముగ యుద్ధమునకు లెమ్ము. సర్వభూతములయందును నీతో సమానుడగు బలవంతుడెవ్వడును లేడు, యుద్ధమునందు ప్రియముగలవాడవును, బంధువులకిష్టుడవును, నాయందు ప్రేమగలవాడవును, నగునో కుంభకర్ణుడా! నీయొక్క తేజస్సుచేత శత్రుసైన్యమును సర్వమును, "శరత్కాలమునందలి మేఘమును వాయువు పారదోలువిధముగ" బారదోలుమనియె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి యరువదిరెండవ సర్గ ముగిసెను.

(✱)

కుంభకర్ణుడు రావణాసురుని జూచి నీతి జెప్పి వానివలె నిందించుట.

అవ్విధముగా రావణాసురుడు చెప్పిన దుఃఖవార్తను సర్వమును విని కుంభకర్ణుడు పకపక నవ్వుచు నిట్లనియె. రాక్షసరాజోత్తమా! అన్నా! ఇప్పుడు విచారమును బొందనేల. ఇదివఱకే మనమాలోచించునపుడు మనకు గీడువచ్చునని నిశ్చయించితిమిగదా? అదేవిధముగా మనకు గీడువచ్చినది. నీవు హితులవచనములను వినక యిట్టియాపద వచ్చునట్లు చేసితివి. సీతాదేవిని నపహరించుటవలన గలిగిన పాపఫలము, "పాపాత్మునకతిశీఘ్రముగ నరకలోకపతనము సంభవించినవిధముగా" నిన్ను బొందినది. రాక్షసరాజోత్తమా! ముందుగా నీవు విచారింపక చేయదగనిపనిని జేసితివి. కేవలము గాబరాక్రమ మదముచేత నాలోచింపక చేసి కీడును దెచ్చికొంటివి. మఱియునో రాక్షసరాజోత్తమా! లోకములో నెవ్వడు, ఐశ్వర్యముచేత మదించినవాడై పూర్వోత్తర సందర్భముల నాలోచింపక కార్యములను జేయునో యట్టివాడు కార్యాకార్యములను, నయానయములను నెఱుగడు. మఱియు నో రావణాసురుడా! దేశకాలముల నాలోచింపక చేయబడు కర్మలన్నియును, "అయోగ్యులగు జనులయందు జేయబడిన కార్యములవలెనే" నాశమును బొందును. మఱియునో రాక్షసరాజోత్తమా! ప్రతికార్యమునందును, ఉత్తమమధ్యమాధమ కార్యముల నాలోచింపవలయును. పిమ్మట నామూడువిధములగు కార్యములయందును, ఆరంభోపాయమును, పురుషద్రవ్యసంపదను, దేశకాలవిభాగమును, విపత్ప్రతీకారమును, కార్యసిద్ధి, అను నైదింటిని యోచింపవలయును. ఇవ్విధముగ నాలోచించువాడు సభయందు ప్రవర్తింపదగినవాడు. మఱియు నోరాక్షసోత్తమా! శాస్త్రానుసారముగ దగినసమయమును గనిపెట్టి కార్యములను జేయవలయును. ఇంతయగాక తనబుద్ధిచేత మంత్రులను, స్నేహితులను జక్కగ నాలోచించి, వీరు తగినవారనియును, వీరు తగనివారనియును, తెలిసికొనవలయును. మఱియునో రాక్షసోత్తమా! రావణాసురుడా! ఉత్తముడగు పురుషుడు ధర్మార్థకామములను మూటిని జక్కగ నాలో

చించి యనుభవింపవలయును. అవ్విధముగ ననుభవింపతగిన కాలములయందు ధర్మార్థకామములమూటినైనను, రెంటినైనను, అనుభవించుచుండవలయును. అట్లుగాదేని యామూటిలోపల నుత్తమమైనదాని దెలిసియనుభవింపవలయును. ఇవ్విధముగ రాజయినను, రాజమాత్రుడైనను, ఆలోచింపక ప్రవర్తించెనేని యట్టివాని యొక్క జీవనము వ్యర్థమగును. మఱియు నోరాక్షసోత్తమా! తనకుదగినవీలులేనికాలమునందు శత్రువులకైనను దగినద్రవ్యము నివ్వవలయును. కాదేని సామప్రియభాషణలను ఆడవలయును. కాదేని శత్రువర్గమువారికి భేదమును గలిగింపవలయును. మఱియునో రాక్షసోత్తమా! అట్లుగాదేని తగినవీలుండెనేని పరాక్రమమునవలంబించి దండోపాయమును బ్రయోగింపవలయును. ఇవ్విధముగనన్నింటిని దెలిసి ప్రవర్తించువాడు నయానయములను దెలిసికొనవలయును. మఱియునోరాజోత్తమా! ఎవ్వడుధర్మార్థకామములనుగుఱించి మంత్రులతోగూడ నాలోచించిచేయునో అట్టివాడు లోకమునందు వ్యసనమునుబొందనేరడు. మఱియునో రాక్షసరాజోత్తమా! రావణాసురుడా! తనకుహితమునాలోచించిచేయదగినకార్యమునందును, చేయదగని కార్యమునందును బ్రవర్తింపవలయును. సకలకార్యములను దెలిసినవాడు సకలకార్యములను దెలిసినమంత్రులతో గూడనాలోచించునేని సుఖమునుబొందును. పశువులయొక్క బుద్ధులవంటి బుద్ధులుగల పురుషులు శాస్త్రార్థములను దెలియక మంత్రులయందు బ్రవేశించి మిగులబ్రగల్భముగలవారైమాటలాడుదురు. అర్థశాస్త్రములనెఱుగనివారును, మిగులగొప్పదగు సంపదనుగోరుచున్నవారును, నగు మంత్రులుచెప్పువిధముగానుత్తముడగువాడు చేయగూడదు. లోకములో ఏమానవులు హితమువలె గనుబడుచున్న అహితమునుదార్ఢ్యమువలన జెప్పుదురో యట్టిమానవులనుఆలోచనసభలోనుండి వెలుపలికినెట్టివేయవలయును, మఱియునో రాక్షసోత్తమా! దుష్టులగుమంత్రులు సకలోపాయములను దెలిసిన శత్రువులచేత బ్రేరేపింపబడినవారై విపరీతములగుకార్యములను జేయుదురు.

అట్లు మిత్రులవలె గనబడుచున్నవారును, క్రూరకృత్యములను జేయుచున్నవారును, నగు మంత్రులనెఱిగి రాజగువాడుగపట స్వభావముగలవాడయ్యునుగపటములేనివానివలె సంచరించుచుండవలయును. ఇట్లుచేయక చపలస్వభావముగలవాడై సంచరించుచున్న రాజులయొక్క ఛిద్రములను, క్రౌంచపపర్వతములయొక్క రంధ్రమును హంసలు తెలిసికొనినవిధముగా జానిసికొనుచుందురు. అట్లుపరులకు దనఛిద్రములు దెలియుటచేత నవశ్యముగ నాశముగలుగును. మఱియు నోరాక్షసరాజోత్తమా! అన్నా! రావణాసురుడా! శత్రువునియొక్క వృత్తాంతమును జక్కగ దెలిసికొనియును నాత్మరక్షణ నెవ్వడు సేసికొనడో యట్టివాడవశ్యముగ ననేకములగు అనర్థములనుబొందును. ఇదియంతయును నీకు దమ్ముడనగుటచేత జెప్పితినిగాని నిన్నవమానమునుబొందింపదలచి చెప్పినవాడనుగాను. కావున నోరాక్షసోత్తమా! నాకేమికార్యము సేయదగియున్నదో యట్టికార్యమునిర్ణయించిచెప్పుమనియె. ఇవ్విధముగా గుంభకర్ణుడు సెప్పినవాక్యమునువిని కనుబొమల ముడివేయుచు గోపోద్దీపితుడై యిట్లనియె.

ఓరీ! కుంభకర్ణుడా! ఇదియేమి? పూజ్యుడగు గురుడు శిక్షించువిధముగ నన్నుశిక్షించుచున్నావు. ఇవ్విధముగ నీవు సంభాషించుటయుచితముగాదు. కావున నీకాలమునందు జేయదగినకృత్యమేదియో దానిని విధింపుము. భ్రాంతివలన

పరాక్రమగర్వముచేతనో,

నేనుముందుగమిగిలి సంచరించితిని. ఇప్పుడు ఆవిషయమును గుఱించి విశేషముగ సంభాషించుటవలన బ్రయోజనమేమి? ఏమియునుబ్రయోజనములేదు. కావునరాక్షసోత్తముడవైనయోకుంభకర్ణుడా! ఈకాలమునందు మనమేకార్యమును జేయవలయునో యాకార్యమునుగుఱించి యోచింపుము. బుద్ధిమంతులగువారు గడచిపోయినదానిగుఱించి విచారింపరు. గతించినది గతించినదేగాని మరలవచ్చునదిగాదు. నేనుఅవివేకముచేత దెలియకచేసినతప్పునునీవుసవరింపుము నీకునాయందు బ్రియస్నేహముగలిగియున్నయెడల నీపరాక్రమమునజూపుము. అట్లుగాదేని నీహృదయమునందేకార్యముచేయవలయునని తోచుచున్నదో యట్టికార్యమునుజేయుము. లోకములో నెవ్వడుఆపత్కాలమునందుగాపాడునో వాడుస్నేహితుడనబడును. నీతిలేక చెడ్డకార్యములను జేసినవానియందు దయగలిగియుండనికార్యముల నెవ్వడు బాగుసేయునోవాడుబంధువనబడునని యె. ఇవ్విధముగాదారుణమైనదియును, గంభీరమైనదియును,నగు వచనమునుబలుకుచున్నవాక్యములనువిని కుంభకర్ణుడుతన అన్నయగురావణాసురునకు గోపమువచ్చెననితలచిమిగులమృదువగు వచనములను బలుకదలచెను. పిమ్మట నాకుంభకర్ణుడన్నయగు రావణాసురుడధికముగా క్షోభనుబొందుచున్న యింద్రియములుగలవాడైయుండుటను దెలిసికొని సాంత్వవచనములచేతనూరార్చుచు నిట్లనియె. రాక్షసరాజోత్తమా! సంతాపమును బొందకుము. రోషమును వదలిపెట్టుము. స్వస్థచిత్తుడవుగమ్ము. రాక్షసరాజోత్తమా! అన్నా! నేనుజీవించియుండ

గానీవిట్లు వ్యసనమును బొందకుము. నీవు ఎవ్వనికొఱకుగా బరితాపమును బొందుచున్నావో యట్టివాని నాశమును బొందింతును. నేను సర్వవిధముల చేతను బ్రమాణమును జేసి చెప్పుచున్నాను. నా వచనములను నమ్ముము. నీవు నాకు బ్రియమైన బంధువుడవగుటచేతను, భ్రాతృస్నేహమువలనను నిట్లు పలికితిని. ఈకాలమునందు ఏకార్యము చేయదగియున్నదో యాకార్యమును అవశ్యముగ జేయుదును. నేను బోయి శత్రువులతో మిగుల భయంకరమగు యుద్ధమును జేసెదను. చూడుము. మిగుల నధికమగు భుజబలముగల యోరావణాసురుడా! అన్నా! ఇప్పుడీ యుద్ధభూమియందు యుద్ధమును జేయుచున్న నాయొక్క పరాక్రమమును జూడుము. నేను రాముని జంపి యతని శిరస్సును దెచ్చి నీకు జూపెదను. అట్లు సేయుటచేత వానర సైన్యమంతయును భయముచేత బరుగెత్తికొనిపోవును. అదియంతయును జూచి నీవు పరమానందమును బొందుము. రాముని మరణమును విని సీత యధికమగు దుఃఖమును బొందునుగాక. మఱియు నో రాక్షసోత్తమా! రావణాసురుడా! నీకు మిగుల సంతోషకరమగు రాముని మరణమును వినగలవు. లంకాపట్టణమునందలి రాక్షసులందఱును ఏరాముని చేత మరణమును బొందిరో యారాముని నిప్పుడు మరణమును బొందించెదను. మఱియు నో రావణాసురుడా! ఇప్పుడు తమ బంధువులు నాశమును బొందుటవలన నధికమగు వ్యసనమును బొందుచున్న స్త్రీలయొక్క వ్యసనమును శత్రువగు రాముని జంపి నశింపజేసెదను. మఱియు నో రాక్షసోత్తమా! అన్నా! ఇప్పుడు నేను వానరాధిపతియగు సుగ్రీవుని రణరంగమునందు నానావిధములగు నాయుధముల చేత మర్దించెదను. ఇట్లు సేయుటచేత నా సుగ్రీవుడు రక్తముచేత వ్యాప్తమైన శరీరముగలవాడై సూర్యునితో గూడిన మేఘము వలె గనబడును. మఱియు నో రాక్షసోత్తమా! అట్టి సుగ్రీవుని జూచి నీవు అధికమగు నానందమును బొందగలవు. మఱియును పాపరహితుడవైన యో రావణాసురుడా! ఇప్పుడు నీవు దశరథమహారాజునకు బుత్రుడగు రాముని జంపుచున్న రాక్షసుల చేత గాపాడబడినవాడవగుచు సకల వానరవీరులను నీవు మరణమును బొందింపగలవు. గాని నీవు ఆవానరుల చేత జంపబడగలవు. మఱియు నో రాక్షసోత్తముడా! ముందుగా రాముడు నన్ను జంపెనేని పిమ్మట నిన్ను జంపగలడు. నేను జీవించియుండగ నిన్ను రాముడు చంపజాలడు. రాక్షసాధిపతివైన యో రావణాసురుడా! నేను నా మరణమును గుఱించి వ్యసనమును బొందను. కావున శత్రువులను దమింపజేయునట్టి యో రావణాసురుడా! నన్నిప్పుడు యుద్ధమునకు బంపుము. సాటిలేని పరాక్రమముగల యో రావణాసురుడా! యుద్ధమునకు యితరుడు పంపదగినవాడుగాడు. మహాబలుడవైన యో రాక్షసోత్తముడా! నేనిప్పుడు యుద్ధమునకుబోయి నీ శత్రువులనందఱు సంహరించెదను. ఇప్పుడు నాతో యుద్ధమునకు దేవేంద్ర యమ అగ్ని వాయు వరుణ కుబేరాదులలో నెవ్వడు వచ్చినను మరణమును బొందించెదను. వారందఱును నొక్కటిగా వచ్చినను మరణమును బొందించెదను. మఱియు నో రాక్షసోత్తమా! పర్వతమువంటి శరీరముగలవాడును మిగుల దీక్ష్ణమగు శూలమును ధరించినవాడును, మిగుల దీక్ష్ణములగు కోరపన్నులుగలవాడును, నతిభయంకరారావముగలుగునట్లు సింహనాదమును జేయుచున్నవాడును, నగు నన్ను జూచి దేవేంద్రుడుగూడ భయమును బొందును. నేను దేవేంద్రునిగూడ శక్తిని, గదను, తీక్ష్ణములగు బాణములను, బ్రయోగించి చంపనక్కరలేదు. ఒక్క పిడికిటిపోటుతో సంహరించెదను. అట్లుగాదేని బాణములను బ్రయోగించుచు యుద్ధమును జేయుచున్న నాయెదుట నీలోకములో నెవ్వడును నిలువజాలడు. ఒకవేళ రాముడు నా పిడికిటిపోటును సహించెనేని నా బాణముల చేత రఘుకులోద్భవుడగు నా రామునియొక్క రక్తమును పానము సేయించెదను. రాక్షసరాజోత్తమా! రావణాసురుడా! నేను జీవించియుండగ నీవేల వ్యసనమును బొందెదవు. నేను నీ శత్రువులను నశింపజేయుటకుద్యుక్తుడనైతిని. కావున నో రాక్షసోత్తమా! నీవు రామునివలని భయమును విడిచిపెట్టుము. నేనిప్పుడే యుద్ధమునందు రాముని జంపెదను. మహాబలులగు రామలక్ష్మణులను జంపి నీకు సంతోషమును గలుగజేసెదను. లంకాపట్టణమును దగ్ధముసేసినవాడును, అనేకులగు రాక్షసులను సంహరించినవాడును, నగు హనుమంతుని, మఱియు నితరులగు వానరులను జంపి నీకానందమును గలిగించెదను మఱియు నో రాక్షసోత్తమా! నీకపరిమితమగు కీర్తిని సంపాదించుటకు గోరికగలవాడనగుచున్నాడను మఱియు నో రాక్షసరాజోత్తమా! నీవు దేవేంద్రునివలనను, బ్రహ్మదేవునివలనను గూడ భయమును బొందకుము. మఱియు నో రాక్షసోత్తమా! దేవతలను గూడ నేను యుద్ధమునందు జంపివేయుదును. నాకు గోపము వచ్చుటచేతనే దేవతలు నాశమును బొందుదురు. నేను యమునిగూడ మరణమును బొందింపగలను. అగ్నిదేవుని గూడ భక్షింపగలను. నక్షత్రములతో గూడ సూర్యుని గ్రిందబడవేయగలను. దేవేంద్రుని వధింపగలను. సముద్రమును సర్వమును పానముసేయగలను. పర్వతములను జూర్ణముసేయగలను. భూమిని బ్రద్దలుసేయగలను చిరకాలమునుండి శయనించియున్న కుంభకర్ణునియొక్క పరాక్రమమును, సకలశత్రువులను నేను భ్రమింగుచుండగా జూడగలవు. రాక్షసోత్తమా! అన్నా! ము

ళ్లోకములను భక్షించినప్పటికిని నాయాకలితీరదు. సుఖార్థుఁడవైన యోరావణాసురుఁడా! దశరథరాజనందనుఁడగు రామునిజంపి నీకపరిమితమగు సుఖమునుగలిగింపగలను. లక్ష్మణునితోగూడ రామునిజంపి సకలవానరముఖ్యులను భక్షింపగలను. రాక్షసోత్తమా! నీయిష్టానుసారముగరమింపుము. మిగులమనోహరమగు మద్యమును బానముసేయుము. చేయదగినకార్యములను జేయుము. నీమనస్సునందలి పరితాపమునుబోగొట్టుకొనుము. నేనిప్పుడు శీఘ్రముగాబోయిరామునిజంపగలను. రాముడు మరణమునుబొందెనేనిచిరకాలమునుండి నీకుస్వాధీనురాలుగానిసీతాదేవి స్వాధీనురాలు కాగలదు.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి యరువదిమూడవసర్గ ముగిసెను.

-(*)——

{మహోదరుఁడు కుంభకర్ణుని అవలించి అయిదుగురు రాక్షసులు యుద్ధమునకు బోయెదమని చెప్పుట.}

అవ్విధముగ మాటలాడుచున్నవాడును, అధికమగుభుజబలముగలవాఁడును, అపరిమితమగు శరీరముగలవాఁడును, నగు కుంభకర్ణునియొక్కవాక్యములనువిని మహోదరుఁడనువాడు, మంత్రులతో విచారింపక రావణుఁడు రామునితో యుద్ధమును జేసెదననుట యుచితముగనుండలేదని చెప్పిన వాక్యములు బాగుగనుండలేదని చెప్పదలచియిట్లనియె. కుంభకర్ణుఁడా! నీవురాజకులమునందుబుట్టినప్పటికిని ధృష్టుడవు, ఇంతయగాక నీతిశాస్త్రజ్ఞానముగూడ లేనివాడవు. మఱియును నీవుమిగులస్వల్పమైన బుద్ధిగలవాడవు. గర్వోద్రిక్తుడవు. కాబట్టినీవు కార్యాకార్యముల నెఱుగక పలుకుచున్నావు. మఱియునోకుంభకర్ణుఁడా! నీవు పసితనముచేతను, పరాక్రమముచేతను, తెలివిలేనివాడవై రాక్షసరాజగు రావణాసురునకు నయానయములు తెలియవనిపలుకుచున్నావే గాని నీవుసర్వమును తెలిసి పలుకుచున్నవాడవుగావు. కుంభకర్ణుఁడా! రాక్షసోత్తముడగు రావణాసురుడు, స్థానమును, హానివృద్ధులను, దేశకాలవిభాగములను, ఇతరులయొక్కయు తనయొక్కయు, తారతమ్యములను జక్కగనెఱిగినవాడు. మఱియునోకుంభకర్ణుఁడా! కేవలబలముగలవాడును, పెద్దలనాశ్రయించి బుద్ధిబలమును సంపాదించుకొననివాడును, స్వల్పబుద్ధిగలవాడును, నగుమానవుఁడుగూడనశక్యమగుకార్యమును జేయఁడు. ఇకనుబుద్ధిమంతులలోనుత్తముడగు రావణాసురుడు విచారింపక చేయడనియును, అశక్యమైనకార్యమును జేయడనియును జెప్పవలయునా? చెప్పనక్కరలేదు. ఈరావణాసురుడు సర్వమునునాలోచించియేసకలకార్యములను జేయుచున్నాడు. కావుననీవిట్లుపలుకుటయుచితముగనుండలేదు. మఱియునోకుంభకర్ణుఁడా! నీవుధర్మార్థకామములు వేరువేరుగనుండుననియని చెప్పుచున్నావు. అట్లుచెప్పుటకుగాని తెలిసికొనుటకుగాని నీకేమియును నాధారమగుశాస్త్రములేదు. మఱియునోకుంభకర్ణుఁడా! సకలసుఖములకును, కర్మయనునది సాధకమైయున్నది. అయినను పుణ్యకర్మయందశ్రేయస్సుగూడ ఫలమగుచున్నది. పాపకర్మలకు శ్రేయస్సుగూడ ఫలమగుచున్నది. కావునబుణ్యకర్మవలన సుఖమేగలుగుననియును, పాపకర్మవలనదుఃఖమెకలుగుననియును నియమములేదు. కాబట్టి నీవు రావణాసురునితో బాపకర్మకు దగినఫలమును బొందెదవని చెప్పినమాట యుక్తియుక్తముగ నుండలేదు. రాక్షసోత్తమా! కుంభకర్ణుఁడా! ధర్మార్థములును, మఱియునితరములును, మోక్షఫలమునిచ్చుననుటకు సందియములేదు. అధర్మానర్థములయొక్క ఫలముప్రత్యవాయమును గలుగజేయునది. ఈలోకమునందును, పరలోకమునందును సుఖమునుగలుగజేయునట్టిదియగుధర్మార్థకామరూపమైన కర్మపురుషులచేత సేవింపబడుచున్నది. మఱియు నట్టికర్మకనుగుణమైనఫలముగూడననుభవింపబడుచున్నది. కేవలముగ గామమునపేక్షించితిరుగువాడును, శుభ్రములగు కర్మలనుబొందుచున్నాడు. మఱియునోకుంభకర్ణుఁడా! రావణాసురునిచేత జేయబడిన సీతాపహరణరూపమైన కర్మమాకందఱకును నిష్టమైనదిగా నిమాకిష్టములేనిదికాదు. అదియంతయునటుండనిమ్ము. కుంభకర్ణుఁడా! నీవు ఒక్కఁడవేబయలువెడలి శత్రువునితో యుద్ధమును జేయుటకుబోయెదనని చెప్పుచున్నావు. ఇట్టిసాహసమునిక జేయకుము. మఱియునోకుంభకర్ణుఁడా! నీవునేనొక్కఁడనే పోయెదనని చెప్పుచున్నావు. ఇట్లుచెప్పుటయుచితముగ నుండలేదు. నీవచనములనుచితములైయుండుటకుదగినకారణమును జెప్పెదను. వినుము. పూర్వమునందు రాముడుజనస్థానమునందనేకవేల రాక్షసులనొక్కఁడేజయించెను. అట్లు సకలరాక్షసులను జంపినవాఁడును, రఘుకులోద్భవుడునునగు రాముని నీవు ఒక్కఁడవును నెట్లుజయింపగలవు. మఱియు కుంభకర్ణుఁడా! పూర్వమునందు జనస్థానమునందధికమగుతేజస్సుగలవారగు రాక్షసులనేకులు రామునితోయుద్ధమును జేయజాలక పరుగెత్తి యీపట్టణమునకు వచ్చిరి. ఆవచ్చినవారిప్పటికిని భయమునుబొందుచున్నారు. అట్టివారలనిప్పటికిని జూచుచున్నావుగదా? నీవు ఆవిషయమునుసర్వమును తెలిసియును, సింహమువలెగోపోద్దీపితుడును, దశరథమహారాజునకు బుత్రుడునునగు రామునినిద్రనుబొందుచున్నసర్పమును మేలుకొలుపుటకిచ్ఛయించువానివలె సం

హరించుటకొఱకు ప్రయత్నించుచున్నావు. నీవు ఇట్లు స్వేచ్ఛముగ ప్రవర్తించుట యుచితముగాదు. మఱియు నో కుంభకర్ణుడా! అధికమగు తేజస్సుచేత ప్రకాశించుచున్నవాడును, కోపముచేత సమీపించుటకుగూడ శక్యముగాకయున్నవాడును, మృత్యువువలె సహింపనలవిగానివాడును, నగు రామునితో నీవు యుద్ధమును జేయుటకు ప్రయత్నించుట యుచితముగాదు. మఱియు నో కుంభకర్ణుడా! శత్రువుడగు రామునితో యుద్ధమును జేయుటకు నీవు ఒక్కరుడవే పోయెదనని చెప్పుచున్నావు. అట్లు చెప్పుట నా మనస్సునకేమియును నిష్టముగనుండలేదు. కుంభకర్ణుడా! హీనమైన సేనాదులుగలవాడు, అధికమైన సేనలతో గూడుకొని శత్రువును, సామాన్యునిగా దలచి యుద్ధమునకు బోయెనేని జీవితాశను వదలుకొనిపోయినవానితో సమానుడనబడును. కావున నిట్టి కృత్యమును లోకములో నెవ్వడు సేయును. రాక్షసోత్తముడవైన యో కుంభకర్ణుడా! మనుష్యులయందు రామునితో సమానుడగువాడెవ్వడును లేడు. నీవు దేవేంద్రునితోడను, యమునితోడను, ఏకకాలమునందు యుద్ధమును జేయుటకు యత్నించినట్లు తోచుచున్నదనియె. ఆమహోదరుడివ్విధముగా నాటోపముకలవాడై చెప్పి మరల సకలలోకములకును భయమును గలుగజేయునట్టి రావణాసురునితో నెల్లరాక్షసులును వినుచుండగ నిట్లనియె. రాక్షసరాజోత్తమా! రావణాసురుడా! నీవు సీతను బొందియును మరల నివ్విధముగా నెందుకు మాటలాడెదవు? రాక్షసోత్తమా! నీవు వాస్తవముగ నభిలషించితివేని సీత నీకు స్వాధీనురాలు కాగలదు. దానికి దగిన యుపాయమును నే నొక్కదానిని జూచితిని. ఆయుపాయముచేత నీవు సీతను స్వాధీనురాలినిగా జేసికొనగలవు. రాక్షసాధిపతివైన యో రావణాసురుడా! నీకు సమ్మతమయ్యెనేని యావిషయమును జెప్పెదను, వినుము. నేనును, ద్విజిహ్వుడును, సంహ్రాదియనువాడును, కుంభకర్ణుడును, వితర్దనుడును, ననునైదుగురమును యుద్ధమునకు బోయెదము. కాబట్టి మమ్ముల నైదుగురను యుద్ధమును జేయుటకు బంపెదనని మన లంకాపట్టణమునందంతటను చాటింపును జేయింపుము. ఇట్లు సేసితివేని మేమైదుగురమును బోయి యా రామునితో మిగుల భయంకరమగు యుద్ధమును జేసెదము. యుద్ధమును జేసి నీ శత్రువులనందఱను జయింపగలము. ఉపాయముల చేత జేయశక్యముగాని కార్యమేదియును లేదు. మఱియు నో రాక్షసరాజోత్తమా! మేమైదుగురమును నొక్కటిగా జేరి యుద్ధమును జేసితిమేని మన శత్రువగు రాముడు జీవింపజాలడు. కాబట్టి నే నీవిధముగా నైదుగురమును జేరి యుద్ధమును జేయుట యుచితమని తలచుచున్నాను, మఱియు నో రాక్షసోత్తముడా! మేము రామునితో యుద్ధమును జేసి యతని బాణములచేత బ్రద్దలు సేయబడిన శరీరముగలవారమై రాముని పేరుచేత చిహ్నితములైనవియును, మిగుల దీక్ష్ణములైనవియును నగు బాణములతో గూడ నిక్కడకు రాగలము. మఱియు నో రాక్షసోత్తమా! మేమీవిధముగా యుద్ధమును జేసి రామలక్ష్మణుల నిరువురిని భక్షించి యతిశీఘ్రముగ వచ్చి నీ పాదపద్మములకు నమస్కారమును జేసెదను. అప్పుడు నా కోరికను దీర్పుము. మఱియు నా సమయమునందు నమ్ముల నేనుగమీద నెక్కించి పట్టణమునందంతటను రాముని నీరాక్షసులు జంపివచ్చిరి గనుక నాకు బూజసేయుడైరని చాటింపును జేయింపుము. మఱియు నో రాక్షసోత్తమా! రావణాసురుడా! శత్రువులను నశింపజేయువాడా! మేము రాముని జంపివచ్చినపిమ్మట మిగుల సంతోషమును బొంది భృత్యులకివ్వదగిన భోగముల నివ్వుము. మఱియు మా యభిలాషల నన్నింటిని దీర్పుము. రాక్షసోత్తమా! మాకు దృప్తిగలుగునట్లు ధనమును యివ్వుము. మఱియు నో రాక్షసోత్తమా! మాల్యములను, వస్త్రములను, వీరగంధానులేపనమును, పానముచేయదగిన ద్రవ్యమును, నానావిధులగు యోధులకు నివ్వుము. నీవును మిగుల సంతోషముగలవాడవై యధికమనోహరమగు మద్యమును పానము సేయుము. మఱియు నో రాక్షసోత్తమా! మిగుల నధికుడగు రాముడు రాక్షసులచేత భక్షింపబడెనని లోకమంతయును జెప్పుచున్నది. కావున లోకాపవాదము వ్యర్థముగా నేరదు. కాబట్టి నీవు లోకాపవాదము వ్యర్థముగా నేరదని తలచి గృహములోనికి బొమ్ము. పోయి సీతను రహస్యస్థలమునకు రప్పించి సాంత్వవచనములచేత సంభాషింపుము. మఱియు నో రాక్షసోత్తమా! ధనధాన్యములచేతను, కామములచేతను, నానావిధములగు రత్నములచేతను లోభపెట్టుము. భయమును, దుఃఖమును గలుగజేయునట్టి యనేక కపటోపాయములచేతను సీతాదేవి భర్తృహీనరాలగుటచేత గోర్కె లేకపోయినను నిన్ను బొందగలదు. మఱియు నో రాక్షసరాజోత్తమా! ఆసీతాదేవి మిగుల మనోహరుడగు భర్త నశించిపోవుటను జూచి యిక నుభర్త దొరకడని యెడు నాశలేకపోవుటవలనను, స్త్రీలబుద్ధి సహజముగా నల్పమైనదగుటవలనను, నీవశమును బొందగలదు. మఱియు నో రాక్షసోత్తమా! పూర్వకాలమునందధికమగు సుఖముగలదియును, సర్వకాలములయందును సుఖమును బొందదగినదియును, ఇప్పుడు దుఃఖముచేత బీడింపబడుచున్నదియును, నగు సీతాదేవి దిక్కులేనిదై యిక నను సుఖమును బొందింపదగినవాడవు నీవే గదా యని తలచి సర్వవిధములచేతను నిన్ను బొందగలదు. రాక్షసరాజోత్తమా! ఈవిషయము సర్వమును నా బుద్ధి

చేతనిర్ణయింపబడినది. రాముడు నిజముగ అనర్థముగలుగునని నిశ్చయించితిని. నీవిక్కడనేయుండుము. కొంచెమయినను యుద్ధమునకు నీవుపోవలయునని యెడు కుతూహలములేని వాడవగుము. మఱియు నోరాక్షసోత్తమా! నీసైన్యమంతయును నాశమును బొందనేరదు. సందేహమును బొందకుము. మేముపోయియుద్ధమును జేసెదను. యుద్ధమును జేయనివాడు కీర్తిసుఖలాభములను బొందనేరడు. కావున నిప్పుడు మనము యుద్ధమునుజేసియే తీరవలయును. యుద్ధమును జేయుటచేత కీర్తిసుఖలాభములను బొందగలవు.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి యరువదినాలగవసర్గ ముగిసెను.

——(*)——

కుంభకర్ణుడు యుద్ధమునకు బైల వెడలుట

అవ్విధముగాబలుకుచున్న మహోదరునివాక్యములనువిని కుంభకర్ణుడు ఆమహోదరుని అవలించి రాక్షసోత్తముడును, అన్నయును, నగురావణాసురునితో నిట్లనియె. రాక్షసోత్తమా! రావణాసురుడా! దురాత్ముడగు నారాముని వధించి నీభయమునుబోగొట్టెదను. రాముని వలని భయమును బోగొట్టినతోడనే నీవు శత్రువులు లేనివాడవగుము. శూరులగువారు జలములేని మేఘము లురిమినట్లు వ్యర్థముగా గర్జింపరు. యుద్ధమునందలి కర్మచేత శూరులగువారు గర్జించుదురు. కాబట్టి నేనీయుద్ధమును జేయునపుడు నా ప్రాగల్భ్యమును జూపెదను. ఇప్పుడు నేనేమియును జెప్పను. శూరులగువారు గోపమువచ్చెనేని తమపౌరుషమును జూపక శాంతినిబొందరు. తమనుదామే శ్లాఘించుకొనరు. మఱియు నోరాక్షసోత్తమా! శూరులగువారు ముందుగా దమపరాక్రమమును జెప్పక యుద్ధమునందు దమ సామర్థ్యమును జూపుదురని చెప్పి యామహోదరున కభిముఖుడై యిట్లనియె.

ఓరీ! మహోదరుడా! వివశతనుబొందినవారలును, బుద్ధిహీనులును, పండితులమనితలచుచున్నవారును, నగు నీయట్టివారలయొక్క మాటలనువినుటచేత రాక్షసరాజగు రావణాసురున కిట్టియాపద సంభవించినది. మఱియు నోమహోదరుడా! కుత్సితపురుషులును, ప్రియముగమాటలాడుచున్నవారును, రాక్షసరాజగు రావణాసురుని ననుసరించుచున్నవారును, నగు నీయట్టివారలచేత యుద్ధమునందు యిదివఱ కిట్టిజయము సంపాదింప బడినది. మహోదరుడా! లంకాపట్టణమునందలి రావణాసురుడుతప్ప దక్కిన వారందఱును మరణమునుబొందిరి. సైన్యమంతయును నశించినది. ధనాగారములన్నియును శూన్యములైనవి. మీరందఱును జేరి యీరావణాసురునకు శత్రువులు సేయదగినపనులను జేసితిరి. అదియంతయునుండనిమ్ము. ఇదిగో చూడుము. నేనుశత్రువులను జయించుటకు బయలువెడలి పోయెదను. పోయిమీరుచేసిన తప్పులనన్నింటిని జక్కపఱచెదననియె. ఇవ్విధముగా బలుకుచున్నవాడును, బుద్ధిమంతుడునునగు కుంభకర్ణునియొక్క వచనమునువిని రాక్షసాధిపతియగు రావణాసురుడు పకపకనవ్వుచు నిట్లనియె. కుంభకర్ణుడా! రాక్షసోత్తమా! ఈమహోదరుడు రామునితో యుద్ధమునుజేసి భయమును బొందినవాడయ్యె. కాబట్టి యుద్ధవిశారదుడవగు నోకుంభకర్ణుడా! నీవలెనితరులు యుద్ధమును జేయజాలరు. నీతో సమానుడును, నీయట్టి స్నేహితుడును నాకెవ్వడునులేడు. కాబట్టి యోకుంభకర్ణుడా! నాకు జయమును సంపాదించుటకొఱకును, నాశత్రువగు రాముని వధించుటకొఱకును బయలువెడలి యుద్ధమునకు బొమ్ము. నాభయమునుబోగొట్టి నన్నుగాపాడుదువనియెడు తాత్పర్యముతో నిన్ను మేలుకొలిపితిని. శత్రువులను నశింపజేయునట్టి యోకుంభకర్ణుడా! ఈసమయము స్నేహితులగువారలు మేలుసేయదగిన కాలమైయున్నది. కాబట్టి యోకుంభకర్ణుడా! నీవుయమునివలె శూలమును నాయుధమును ధరించినవాడవై యుద్ధమునకు బయలువెడలిపొమ్ము. పోయి వానరులనందఱను సంహరింపుము. రామలక్ష్మణులను భక్షింపుము. మఱియు నోకుంభకర్ణుడా! వానరులందఱును నిన్నుజూచినతోడనే యధికమగు భయముగలవారై పరుగెత్తుదురు. మఱియు నిన్నుజూచినతోడనే రామలక్ష్మణులయొక్క హృదయములు బ్రద్దలు కాగలవనియె. రాక్షసోత్తముడును, మహారాజును, నగు రావణాసురుడు, మహాబలుడగు కుంభకర్ణునితో నివ్విధముగా జెప్పి తన్నుమరల బుట్టినవానినిగా దలచె. మఱియు నారావణాసురుడు కుంభకర్ణునియొక్క బలపరాక్రమముల నెఱిగినవాడును, చంద్రునివలె నిర్మలమైన బుద్ధిగలవాడును, నగుచు బరమానందముగలవాడయ్యె. ఇవ్విధముగా రావణాసురుడు చెప్పిన వాక్యములనువిని మహాబలుడగు కుంభకర్ణుడధికసంతోషముగలవాడగుచు బయలువెడలె. అట్లు రాక్షసరాజోత్తముడగు రావణాసురునియొక్క వాక్యమునువిని కుంభకర్ణుడు యుద్ధోన్ముఖుడై శత్రువులను నశింపజేయుటయందు దగిన సామర్థ్యముగల శూలమును నతివేగముగా గ్రహించె. ఆశూలము సర్వకాలాయస నిర్మితస్వరూపము గలదియును, మిగుల నధికముగా బ్రజ్వలించుచున్నదియును, వుటము వేయ

బడిన బంగారపునగలచేత నలంకరింప బడినదియును, దేవేంద్రునివజ్రాయుధముతో సమానమైనదియును, మిగుల భయంకరమైనదియును, దేవదానవ గంధర్వయక్షాదులను నవివళ్ళకు సంహరించినదియును, రక్తవర్ణముగలమాలికల చేత నధికమగు తేజస్సుగలదియును, మండుచుండెడు నగ్నితోసమానమైనదియును, శత్రువులయొక్క నెత్తురుచేతబ్రకాశించుచున్నదియును, నైయుండె. అట్టి యాయుధమును గ్రహించి యధికమగు తేజస్సుగల కుంభకర్ణుడు రావణాసురునితో నిట్లనియె.

రాక్షసరాజోత్తమా! నేనొక్కడనే బయలువెడలి పోయెదను. మనసైన్యమంతయును నిక్కడనే యుండునట్లు సేయుము. నేనుబోయి యిప్పుడే మిగులబలవంతులగు వానరులనందఱను భక్షింపగలననియె. అట్లుకుంభకర్ణుడు చెప్పినవాక్యమునువిని రావణాసురుడిట్లనియె. రాక్షసోత్తమా! కుంభకర్ణుడా! నీవుఒక్కడవేపోవుట మిగులనుచితముగనుండలేదు. కావున శూలములు, ముద్గరములు మొదలుగాగల యాయుధములనుధరించిన సేనలతోగూడ బయలు వెడలిపొమ్ము. వానరులధికమగు బలముగలవారలు. మఱియు నతితీవ్రతగలవారలు. ఇంతయగాక దృఢప్రయత్నములుగలవారు. కావున నీవుఒక్కడవేపోతివేని వానరులందఱునునొకటిగాజేరి దంతములచేతగఱచి నిన్నునాశమును బొందింతురు, కావున శత్రువులచేత బెదిరింపనుగూడ నలవిగాని వారలగు సేనలతోగూడ బయలువెడలిపొమ్ము. రాక్షసులకు గీడునుగలుగజేయుచున్న శత్రుసైన్యమును సర్వమునునశింపజేయుమనియె. అంతట నధికమగు తేజస్సుగలరావణాసురుడు సింహాసనమునుండి దిగ్గనలేచి మణులచేత గూర్చబడినదియును, పుష్పములచేత నలంకరింపబడినదియును, నగు పూలమాలికను కుంభకర్ణునియొక్క శిఖయందు బెట్టియలంకరించె. మఱికొన్నిపూలమాలికలచేత గంఠప్రదేశమును, వక్షస్థలమును నలంకరించె. మఱియు మిగుల మనోహరములగు భుజబంధులు, ఉంగరములు మొదలుగాగల యాభరణములచేత నలంకరితునిగా జేసె. మఱియు ననేకవిధములయినవియును, అధికమగు పరిమళముగలవియును, నగు పూలమాలికలచేతగూడ నలంకరితునిగా జేసె. పిమ్మట మిగుల మనోహరములగు పోగులచేత నాకుంభకర్ణునియొక్క కర్ణములను నలంకరింపజేసె. ఆసమయమందు మిగులగొప్పవగు చెవులుగల కుంభకర్ణుడు బంగారపు భుజబందులు మొదలుగాగల యాభరణములచేత నలంకరింపబడినవాడై చక్కగా హోమముచేయబడిన యగ్నిహోత్రమువలె బ్రకాశించుచుండె. అంతట నాకుంభకర్ణుడు నల్లనివర్ణముగల మొలనూళ్ళను ధరించె. అట్లుమొలనూళ్ళనుధరించుటచేత సముద్రమథన కాలమునందు వాసుకిచేత గట్టబడిన మందరపర్వతమువలె బ్రకాశించుచుండె. పిమ్మట నాకుంభకర్ణుడు బంగారముచేత జేయబడి నదియును, శస్త్రములయొక్క ధారమును సహించునదియును, గాలిదూరుటకుగూడ నలవిగానిదియును, మెఱుపులయొక్క కాంతివంటికాంతిగలదియును, తనయొక్క కాంతిచేత నధికముగా బ్రకాశించుచున్నదియును, నగుకవచమునుధరించినవాడై సంధ్యాకాలమునందలి మేఘములచేత వ్యాప్తమైన పర్వతోత్తమమువలె బ్రకాశించుచుండె. మఱియునాసమయమునందు సర్వాభరణములచేతను అలంకరింపబడిన సర్వావయవములునుగలవాడును, శూలమనుఆయుధము హస్తమునందు గలవాడును, నగు కుంభకర్ణుడు త్రివిక్రమావతారమునందు విశ్వరూపమును ధరించిన నారాయణునివలె బ్రకాశించుచుండె. అంతట మహాబలుడగు కుంభకర్ణుడు, అన్నయగు రావణాసురుని కౌగిలించుకొని ప్రదక్షిణనమస్కారమునుజేసె. అట్లుశిరస్సుతోగూడ నమస్కారమును జేసి ప్రయాణమునుజేసె. అంతటనారావణాసురుడు బయలువెడలుచున్నవాడును, గొప్పదగు శరీరము గలవాడును, గొప్పదగుధ్వనినిజేయుచున్నవాడును, గొప్పదగు బలముగలవాడును, నగుకుంభకర్ణునకు బ్రశస్తములగు నాశీర్వచనములనుజేసి పంపించె. ఆసమయమునందు రథికులగు రాక్షసోత్తములు శంఖములయొక్కయు, దుందుభులయొక్కయుధ్వనులతోగూడినవారును, శ్రేష్ఠములగు నాయుధములనుధరించినవారును, నగుసేనలతోడను, ఏనుగులతోడను, గుఱ్ఱములతోడను, మేఘధ్వనివంటిధ్వనిగలరథములతోడను, గూడుకొనినవారై రథికులలోనుత్తముడగు కుంభకర్ణునితోగూడబయలువెడలిరి. మఱియు నారాక్షససైనికులు మిగుల భయంకరుడును, మహాబలుడును, నగుకుంభకర్ణుని వెంటనంటి సర్పములతోడను, ఒంటెలతోడను, గాడిదలతోడను, గుఱ్ఱములతోడను, సింహములతోడను, ఏనుగులతోడను, మఱియుననేకములగు మృగములతోడను, పక్షులతోడనుగూడ బయలువెడలిరి. అంతట దానవులకును, దేవతలకును, శత్రువగు కుంభకర్ణుడు, పుష్పవర్షముచేతవ్యాప్తమైనశరీరముగలవాడును, గొడుగును ధరించినవాడును, మిగులదీక్ష్ణమగుత్రిశూలమునుధరించినవాడును, మదముచేతనధికముగమదించినవాడును, రక్తచందనముచేత వ్యాప్తమైనశరీరముగలవాడును, నైబయలువెడలె మఱియునాసమయమునందు, అధికమగుసింహనాదముగలవారును, మిగుల బలముగలవారును. భయంకరులును, భయంకరము

లగు నేత్రములుగలవారును, శస్త్రములను హస్తములయందు గలవారును, నగు ననేక రాక్షసవీరులుగూడ బయలు వెడలిరి. మఱియు నారాక్షసవీరులు, ఎఱ్ఱని నేత్రములు గలవారును, మిగులనధికమగు శరీరముగలవారును, కాటుక కొండయొక్క కాంతివంటి కాంతిగలవారును, నైయుండిరి. అట్టి రాక్షసవీరులందఱును, శూలములను, మిగుల దీక్ష్ణములగు ఖడ్గములను, గండ్రగొడ్డండ్లను, మిగులబొడవులగు పరిఘములను నాయుధములను, గదలను, ముసలములను, తాలస్కంధములను, మఱియు నితరములగు ననేకవిధాయుధములను, ధరించియుండిరి. అంతట మహాబలుడగు కుంభకర్ణుడు, మిగులభయంకరమైనదియును, చూచువారలకు రోమాంచమునుగలుగజేయునదియును, నగుశరీరమును ధరించివచ్చి యాసైన్యమునందు ప్రవేశించె. ఆసమయమునందు ఆకుంభకర్ణుడు నూరుధనుస్సుల వెడల్పుగలవాడును, ఆరునూరులధనుస్సులపొడవుగలవాడును, మిగుల భయంకరుడును, బండిచక్రములతో సమానములగు నేత్రములుగలవాడును, మిగుల గొప్పదగు పర్వతములతో సమానుడును, కాలినపర్వతములతో సమానుడును మిగులగొప్పదగు నోరుగలవాడును, నగుకుంభకర్ణుడు పకపకనవ్వుచు నారాక్షససైనికులతో నిట్లనియె.

ఓరాక్షససైనికోత్తములారా! నేనీసమయమునందు అగ్నిదేవుడు శలభములను నశింపజేయు విధముగా వానరసైన్యమును సర్వమును నాశమునుబొందించెదను. వనములయందు సంచరించునట్టి వానరులందఱును నిప్పుడు నాకపకారమును జేయజాలరు. మావంటివారలకు వానరజాతియంతయును ఉద్యానవనమువంటిది. కావున నేను ఉద్యానవనమునందు విహరించు విధముగా వానరసైన్యమునందు విహరించెదను. మఱియు నోసైనికోత్తములారా! మనలంకాపట్టణము నాక్రమించుటకు మూలకారణమైన రామునిలక్ష్మణునితోగూడ వధించెదను. అంతట వానరసైన్యమంతయును నశింపజేయబడినదగునని యె. ఇవ్విధముగా బలుకుచున్న కుంభకర్ణునియొక్క వాక్యములనువిని రాక్షసులందఱును మిగుల భయంకరమైనవియును, సముద్రములనుగూడ గంపింపజేయదగినవియును నగు సింహనాదములను

అంతట సకలరాక్షసవీరులతోగూడ బయలువెడలుచున్నవాడును, బుద్ధిమంతుడునునగు కుంభకర్ణునకు ప్రయాణకాలమునందు మిగులభయంకరములగు దుశ్శకునములనేకములు గనబడియె. మఱియు భయంకరమైన యాకారములుగల నక్కలు అగ్నిజ్వాలలను గ్రక్కుచున్న ముఖముల చేత నతిభయంకరములగు కూతలనుబెట్టుచుండె. మేఘములు గాడిదయొక్క దేహకాంతివంటి కాంతిగలవై పిడుగులను, ఉల్కలను, వర్షించుచుండె. ఆసమయమునందు సముద్రములతోడను, వనములతోడను, గూడ భూమియంతయును గడగడవణకె. మఱియు నానావిధములగు పక్షులు అపసవ్యముగా మండలాకారముగ దిరుగుచుండె. మఱియు మార్గమునందు బోవుచున్న కుంభకర్ణునియొక్కయు, సైన్యముయొక్కయు, ఉపరిభాగమునందు గ్రద్దలు మాలికవలె దిరుగుచుండె. మఱియు నాసమయమునందు కుంభకర్ణునియొక్క యెడమ నేత్రమునందును, ఎడమభుజమునందును, గంపముగలిగె. మఱియు భయంకరమైన ధ్వనిగలదియును, ప్రజ్వలించుచున్నదియును, నగు నుల్కావర్షముకురిసె. మఱియు నాసమయమునందు సూర్యుడు గాంతిహీనుడయ్యె. కఠినమైనదియును, భయంకరమైనదియును, నగువాయువువీచుచుండె. ఆసమయమునందు కుంభకర్ణుడు యమునిచేత ప్రేరేపింపబడినవాడై రోమాంచమును గలుగజేయునట్టివియును, మిగుల భయంకరములైనవియునునగు నుత్పాతములనుజూచియును, లక్ష్యముసేయక పయనమయ్యె. అంతట బర్వతముతో సమానుడగు నాకుంభకర్ణుడు పాదచారియై యాప్రాకారమునుదాటి బయలునకువచ్చి మేఘములతో సమానముగ నున్నదియును, భయంకరమైనదియును, నగు వానరసైన్యమును జూచె. ఆసమయమునందు వానరవీరులును, పర్వతముతో సమానుడును, రాక్షసోత్తముడునునగు కుంభకర్ణునిజూచి వాయువుచేత ప్రేరితములగు మేఘములవలె నిల్వజాలక నానాదిక్కులకు బరుగెత్తిరి. అట్లు మిగుల భయంకరమైనదియును, మేఘసముదాయమువలె భిన్నభిన్నముగా బరుగెత్తుకొని పోవుచున్నదియును, నగువానరసైన్యమునుజూచి కుంభకర్ణుడు అధికమగుసంతోషముగలవాడగుచు మిగుల పెద్దదగుమేఘమువలె గూతవైచె. ఆమహాధ్వనిని మేఘముయొక్కధ్వనిని వినినవిధముగావిని యావానరులందఱును, ఛేదింపబడిన యేపిచెట్లవలె గ్రిందబడిరి. ఆసమయమునందు మహాత్ముడును, మిగుల పెద్దదగుపరిఘయను నాయుధమును ధరించినవాడును, శత్రునాశముకొఱకు బయలువెడలినవాడును, నగు నాకుంభకర్ణుడు వానరులకందఱకును, భయమునుగలుగజేయుచు ప్రళయకాలమునందు గాలదండమును ధరించి సంచరించుచున్న యమునివలె సంచరించుచుండె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి యఱువదైదవ సర్గము ముగిసెను.

కుంభకర్ణునిజూచి పరుగెత్తుచున్న వానరులకు అంగదుడు ధైర్యముజెప్పుట.

అంతట పర్వతశిఖరముతో సమానుడును, మహాబలముగలవాడును, నగునాకుంభకర్ణుడు ప్రాకారమునుదాటి బయలువెడలిపోయె. అవ్విధముగా బయలు వెడలిన కుంభకర్ణుడు సముద్రములయందు గూడ ధ్వనిగలుగునట్లు సింహనాదములనుజేయుచుండె. మఱియు నాధ్వనిచేత బిడుగులుపడుచున్నవికాబోలుననియెడు భయము గలుగుచుండె. మఱియు నామహాధ్వనిచేత పర్వతములు గూడ బ్రద్దలగుచుండె. అవ్విధముగా సింహనాదములను జేయుచున్నవాడును, ఇంద్రునిచేతను, యమునిచేతను, వరుణదేవుని చేతనుగూడ జయింపశక్యముగానివాడును, భయంకరములగు నేత్రములుగలవాడును, నగు కుంభకర్ణునిజూచి వానరులందఱును నధికమగుభయముచేత బరుగెత్తుకొనిపోయిరి. అవ్విధముగ బరుగెత్తుకొనిపోవుచున్న వానరులనుజూచి వాలిపుత్రుడగు నంగదుడు, మహాబలులగు, నల, నీల, గవాక్ష, కుముదులనువారితో నిట్లనియె.

ఓవానరోత్తములారా! మీరందఱును శ్రేష్ఠములగు మీకులములను, మీపరాక్రమములను మఱచి సామాన్యులగు వానరులవలె బరుగెత్తుచున్నారు, ఇట్లుపరుగెత్తుట తగునా? తగదు, కావున ఉత్తమ స్వభావముగల యోవానరోత్తములారా! మీరందఱును వెనుకకుమరలుడు. మీరుపౌరుషమును వదలి ప్రాణములనేల గాపాడుకొనియెదరు, అట్లుసేయుటయుచితముగాదు. ఈవచ్చువాడు రాక్షసుడుగాడు. రావణాసురుడు యుద్ధమును జేయజాలక మనకు భయమునుగలుగజేయుటకు దగినవియును, పురుషవేషముగలదియును, నగు యంత్రమునుబంపె, ఈవచ్చునది యంత్రముగాని రాక్షసుడుగాడు. కాబట్టి మనము పరాక్రమము నవలంబించి యీరాక్షసాకృతియంత్రమును వధింతము. ఓవానరోత్తములారా! వెనుకకుమరలుడనియె. ఇవ్విధముగాబలికిన యంగదునివాక్యములనువిని యావానరులందఱును ధైర్యమునుదెచ్చుకొని యొక్కటిగాజేరి వృక్షములను, పర్వతములను జేతులయందు బట్టుకొనినవారై యుద్ధభూమికిబోయిరి. అట్లువెనుకకుమరలి యుద్ధభూమికివచ్చి యావానరులందఱును అధికమగు కోపముగలవారై మదవృషభములవలె నాకుంభకర్ణునిమీదబడి కొట్టిరి. అట్లు మిగుల బెద్దవియగు, పర్వతశిఖరములచేతను, శిలలచేతను గొట్టబడియును, మహాబలుడగు నాకుంభకర్ణుడు గొంచెమైననుగదలనివాడయ్యె మఱియు నాకుంభకర్ణుని యవయవములయందు బడవేయబడిన శిలలన్నియును బగిలి చూర్ణములయ్యె, మఱియు నాకుంభకర్ణుని శరీరమునందు విసరివేయబడిన వృక్షములన్నియును, భగ్నములై క్రిందబడియె. అంతట నాకుంభకర్ణుడధికమగు కోపముగలవాడై యధికమగు తేజస్సుగలవానరసైన్యములను, మిగుల నాయత్తుడై వనములనగ్నిదేవుడు మధించువిధముగా మధించె. అంతటగొందఱు వానరోత్తములు నెత్తుటిచేతదడపబడిన శరీరముగలవారై నేలయందు శయనించిరి. కొందఱు వానరులెఱ్ఱనిపుష్పములుగల వృక్షములవలె క్రిందబడిరి. ఆసమయమునందు గొందఱు వానరులెగిరియెగిరి దుముకుచుండిరి. మఱికొందఱు వానరులు నిలువజాలకపరుగెత్తుచుండిరి. ఇవ్విధమయినవారలగుచు వెనుకదిరిగిచూచుటకుగూడ శక్తిలేనివారైరి. ఆసమయమునందుగొందఱు, వానరులు సముద్రమునందుబడిరి. కొందఱువానరులు ఆకాశమునకెగిరిపోయిరి. మఱికొందఱువానరులు బలవంతుడగు రాక్షసునిచేత నానావిధములుగా బాధింపబడుచుండిరి. అట్లుకుంభకర్ణునిచేత బాధింపబడుచున్న వానరులు వ్యసనముతో గూడినముఖములుగలవారై లోతుగలప్రదేశములయందు ప్రవేశించిరి. మఱికొందఱుఏమార్గముచేత సముద్రమును దాటివచ్చిరో యామార్గమునేయనుసరించిపోయిరి. ఋక్షగణములలోగొందఱువృక్షములనెక్కిరి. కొందఱుపర్వతములమీదికి బరుగెత్తిరి, కొందఱు శత్రువులకు గానరాకుండ సముద్రమునందుమునిగిరి. కొందఱుగుహలయందుప్రవేశించిరి. గుహలయందుప్రవేశించి చచ్చినవారివలెబడి నిద్రను బొందుచుండిరి. కొందఱువానరులు గుహలయందుప్రవేశించి కూర్చుండిరి. కొందఱువానరులు గుహలయందుప్రవేశించి యేమియునుమాటాడకయూరకుండిరి. ఇట్లునానావిధములగునవస్థలను బొందియున్న వానరులనుజూచి యంగదుడిట్లనియె, ఓవానరోత్తములారా! మీరుపరుగెత్తక వెనుకకుదిరిగి ధైర్యమునవలంబించియుండుడు. మనముయుద్ధమును జేయుదము. మీరుభగ్నులైపోయి భూమియంతటనుదిరిగినను మీకునివసించుటకు యీరాక్షసబాధలేని చోటుదొరకదు. కాబట్టి మీరువెనుకకుమరలుడు. ప్రాణసంరక్షణకొఱకుగా ఏలమానమును విడిచిపెట్టెదరు. పరులచేత సహింపశక్యముగాని పరాక్రమములుగల యోవానరోత్తములారా! నిరాయుధులై పరుగెత్తుకొనిపోతిరేని మీపిరికితనమునుజూచి మీభార్యలునవ్వుదురు. భార్యయుపహసించుటనుజూచుచు జీవించుటకంటె మరణమేయుత్తమమైనదిగాదా? అదియునుగాక యోవానరోత్తములారా! మిగుల ప్రసిద్ధములయినవియును, గొప్పవియునునగు కులములయందు మీరుపుట్టితిరి. అట్టిమీరుభయగ్రస్తులై ప్రాకృతులగు వానరులవలె బరుగె

త్తుటయుచితమా? కాదు. అయోగ్యులవలెమీరుగూడ బరా
క్రమమునువదలి పరుగెత్తిపోవుటతగునా? తగదు. అదియు
నుగాక యోవానరోత్తములారా! మీరందఱునునిదివఱకుస
భలోమిగులభయంకరములయినవియును, మీపరాక్రమము
నుదెలుపునట్టివియును, నగు మాటలనుబలికితిరి. ఆమాటల
న్నియును నిప్పుడెక్కడకుబోయినవి. ఆహా మీరు జీవించి
యుండగానే మీమాటలువ్యర్థములైనవై వినబడుటనువిని
మీరెట్లుజీవింపగలరు.

మఱియు నోవానరోత్తములారా! మీరందఱును సత్పు
రుషులుపోయిన మార్గమునబొందు. భయమునువిడిచిపె
ట్టుడు. మఱియునోవానరోత్తములారా! అల్పజీవితులమగు
మనమందఱమును నిప్పుడు మరణమునుబొంది యీయుద్ధ
భూమియందు శయనింతము. యుద్ధమునందు జచ్చిపొందశ
క్యముగానిబ్రహ్మలోకమునుబొందుదము. అట్లుగాకనియు
ద్ధమునందు శత్రువులనుజంపి యపరిమితమగుకీర్తిని బొందు
దము. కాదేనిమనకు మరణమునుబొందుటయనియెడు మూ
ల్యముచేత వీరులుపొందదగిన లోకమునబొందుదము. కుం
భకర్ణుడు రామునిజూచినపిమ్మట మరల లంకాపట్టణమున
కుబోజాలడు. ప్రజ్వలించుచున్న యగ్నిహోత్రమునందు
బడినశలభమువలె మరణమునుబొందగలడు. మఱియునో
వానరోత్తములారా! మనమందఱమును నొకరాక్షసునితో
యుద్ధమునుజేయజాలక ప్రాణములను గాపాడుకొనుటకు
యత్నించితిమేని మనకీర్తియంతయును నాశమునుబొందున
నియె. ఇవ్విధముగా బలుకుచున్నవాడును, బంగారపుభుజ
బందులనుధరించినవాడును, శూరుడును, నగు నంగదుని
తోబరుగెత్తుచున్న వానరులందఱును శూరవిగర్హితమగు
వాక్యమును జెప్పదలచి యిట్లనిరి. వానరోత్తముడా! అంగ
దుడా! మేమందఱమును, కుంభకర్ణుడను రాక్షసునితోయు
ద్ధమునుజేసితిమి. ఇకను మేమునిలవజాలము. ఇదిమేమిక్క
డనుండుటకుదగినకాలముగాదు. మాకుయుద్ధమునందలియ
భిలాషకంటె ప్రాణములయందభిలాష యధికముగానున్నద
నిరి. ఇవ్విధముగా జెప్పియావానరులందఱును నాలుగుది
క్కులకును బరుగిడిరి. అప్పుడు భయంకరములగునేత్రము
లుగలవాడును, భయంకరుడును, యుద్ధమునకువచ్చుచున్న
వాడును, నగు కుంభకర్ణునిజూచి యావానరాధిపతులంద
ఱును మునుపటికంటెనధికముగా బరుగెత్తిరి. అవ్విధము
గాబరుగెత్తుచున్న వానరులతో మరల నయ్యంగదుడు మృ
దువగు వచనములనుబలికె. అట్టి సాంత్వవచనములను విని
యావానరవీరులందఱును వెనుకకుమరలిరి. మరలివాయుదే
వునకు బుత్రుడగు హనుమంతునితో గూడుకొనినవారై యధి
కముగుసంతోషమునుబొందిరి. మఱియు నయ్యంగదునియొ
క్కయాజ్ఞానుసారముగ బ్రవర్తింపదలచినిలచిరి. ఆసమ
యమునందు ఋషభుడు, శరభుడు, మైందుడు, ధూమ్రు
డు, నీలుడు, కుముదుడు, సుషేణుడు, గవాక్షుడు, రం
భుడు, తారుడు, ద్వివిదుడు, హనుమంతుడు, మొదలుగా
గలవానరవీరులందఱునునతిశీఘ్రముగ యుద్ధాభిముఖులైరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి యరువదాఱవ సర్గ
ముగిసెను

❖

వానరులును కుంభకర్ణుడును యుద్ధముజేయుట

అవ్విధముగ నంగదుడుచెప్పినవాక్యమునువిని యధికమై
నశరీరముగల యావానరవీరులందఱును యుద్ధమునజేయ
వలయుననియెడు కుతూహలముగలవారై యుద్ధమునందు
మరణమునైనను బొందుటయుచితముగాని భయముచేతబ
రుగెత్తిపోవుట యుచితముగాదనితలంచిరి. అంతటవా వా
నరులందఱునునంగదునివాక్యములచేత నధికమగుపరాక్రమ
ముగలవారును, వీర్యాతిశయమునవలంబించినవారును,యు
ద్ధోన్ముఖులుననైనిలిచిరి అంతటనావానరులందఱును యు
ద్ధమునకు బయలువెడలిపోవుచు మరణముగలుగునని దృఢ
ముగానిశ్చయించుకొనిరి. అట్లుమరణమునుబొందుటకు గూ
డనిశ్చయించుకొనినవారై యావానరులందఱును మిగులసం
కులముగుయుద్ధమును జేసిరి. మఱియు నావానరవీరులందఱు
ను, మిగులబెద్దవగు వృక్షములను, పర్వతములను, శిలల
ములను గ్రహించి కుంభకర్ణునిమీదికి బరుగెత్తిరి. ఆసమయ
మునందధికమగు శరీరముగలవాడును, పరాక్రమముగల
వాడును, నగు కుంభకర్ణుడు అపరిమితమగుకోపముగలవా
డై గదయనునాయుధమునుధరించి శత్రువులగు వానరుల
మీదవిసరివైచె. అప్పుడు ఏడెనిమిదివేల వానరులునాశమును
బొంది భూమియందుబడిరి. మఱియునాసమయమునందు
కుంభకర్ణుడు తనబాహువులచేత బదేసిమంది వానరులను,
ఇరువదేసిమంది వానరులనుబట్టికొని పిండిపిండిగానలుపు
చుండె మఱియునాకుంభకర్ణుడు అధికమగా గోపముగల
వాడై గరుత్మంతుడు సర్పములనుభక్షించినవిధముగ వాన
రులనందఱ భక్షించుచుండె. అంతగొంతసేపటికి ఆవాన
రులందఱును ధైర్యమును దెచ్చుకొని యొక్కటిగాజేరి వృక్ష
ములను, పర్వతములను, హస్తములయందు ధరించినవారై
యుద్ధభూమియందుబ్రవేశించిరి. ఆసమయమునందు ద్వివి
దుడనువానరోత్తముడు మిగులబెద్దదగు నొకపర్వతమును
బెల్లగించుకొనివచ్చి పర్వతశిఖరముతో సమానుడగుకుంభ

కర్ణునిమీదికి బర్వతముమీదికి మేఘముపోవునట్లుపోయె. పోయియాపర్వతమును కుంభకర్ణునిమీదబ్రయోగించె. పిమ్మట మిగులగొప్పదగు శరీరముగలకుంభకర్ణునితో యుద్ధమునుజేయజాలక రాక్షససైన్యముతో యుద్ధమునుజేయదలచి రాక్షససైన్యమునందు బ్రవేశించె. అంతటనాద్వివిదుడును వానరోత్తముడు రాక్షసులగుఱ్ఱములను ఏనుగులను, రథములను, అనేకవేలరాక్షసులను, మర్దించె. పిమ్మట మఱియొకపర్వతశిఖరమునుగ్రహించి మరలనారాక్షససైన్యమును సర్వమును సంహరించె. ఆసమయమునందు రథికులలో శ్రేష్ఠులగు రాక్షసులుభయంకరములగు సింహనాదములనుజేయుచున్నవారై ప్రళయకాలమునందలి యమునితోసమానమగుబాణములచేత ధ్వనిచేయుచున్నవానరులయొక్క శిరస్సులనపహరించిరి. ఆసమయమునందు యుద్ధభూమియందు గొన్నియశ్వములునశించె. కొందఱుసారథులు చచ్చిరి. రక్తముప్రవాహరూపముగబ్రవహించుచుండె. అట్లగుటచేతనాయుద్ధభూమి మిగులభయంకరమైనదై యుండె. అప్పుడుమహానుభావులగు వానరులు గొప్పవగువృక్షములను, ఆయుధములుగాగ్రహించిరథములను, గుఱ్ఱములను, ఒంటెలను, రాక్షసులను, నాశముసేసిరి. ఆసమయమునందుహనుమంతుడు నానావిధములును, ననేకములునునగు పర్వతశిఖరములను, వృక్షములనుగ్రహించి కుంభకర్ణునిశిరస్సుమీదవర్షింపజేసిరి. అప్పుడుమహాబలుడగు కుంభకర్ణుడుశూలముచేత నాపర్వత శిఖరములనన్నింటిని జూర్ణముసేసె. ఇంతయగాక యావృక్షములనన్నింటిని ఛేదించె. పిమ్మటదనశూలముచేత గొట్టబడినవానరసైన్యమంతయును నిలువజాలకపరుగెత్తె. అంతటనాకుంభకర్ణుడు వానరసైన్యమునందు బ్రవేశించి నానావిధములబాధించుచుండె. అప్పుడు హనుమంతుడుమిగులపెద్దదగు పర్వతశిఖరమునొకదానిగ్రహించివానరసైన్యమునందుబ్రవేశించి యుద్ధమును జేయుచున్న కుంభకర్ణునకభిముఖముగానిలిచె. పిమ్మట మిగులశ్రేష్ఠమగు పర్వతమువలె భయంకరమైన శరీరముగలవాడును, మిగులభయంకరుడును నగు కుంభకర్ణునిమీద నీపర్వతశిఖరమును విసరివైచె దానిదెబ్బచేతబయలువెడలినరక్తము కుంభకర్ణునియొక్కశరీరమంతయునుదడిసె, అప్పుడుకుంభకర్ణుడు గోపోద్దీపితుడై తనచేతనున్నశూలమును గిరగిరద్రిప్పియనేకములగు శిరములచేతబ్రకాశించుచున్నదియును, హనుమంతునిచేత బ్రయోగింపబడినదియును, నగు పర్వతమునుజూర్ణముసేసె. పిమ్మట కుమారస్వామి తనశూలముచేతగ్రౌంచపర్వతమునుగొట్టినవిధముగా హనుమంతునియొక్కఱొమ్మునసూటువడునట్లు తనశూలముచేతగొట్టె. అంతటహనుమంతుడు ఆదెబ్బకుదాళజాలక నెత్తురునుగ్రక్కుచు బ్రళయకాలమునందలి మేఘమువలెగర్జించె. అవ్విధముగానెత్తురునుగ్రక్కుచు బీడితుడైయున్న హనుమంతునిజూచి రాక్షసులందఱును నధికమగు సంతోషము గలవారై మిగులభయంకరములగు సింహనాదములనుజేసిరి. అంతట వానరులందఱును గుంభకర్ణునివలని భయముచేత బీడింపబడినవారై యాయుద్ధభూమియందు నిలువజాలకపరుగిడిరి. అప్పుడుబలవంతుడగు నీలుడనువానరోత్తముడు వానరసైన్యమునుసర్వమునునిలిపి బుద్ధిమంతుడగు కుంభకర్ణునిమీదనొక్కపర్వతశిఖరమును విసరివైచె. అట్లునీలునిచేత బ్రయోగింపబడినదియును, కుంభకర్ణునకభిముఖముగా బ్రకాశించుచున్నదియును, నగు పర్వతశిఖరము నాకుంభకర్ణుడు తనపిడికిటబొడిచి చూర్ణమునుజేసె. అట్లుపిడికిటిపోటుచేత జూర్ణముచేయబడి యాపర్వతశిఖరము విస్ఫులింగములతో గూడ గ్రిందబడియె. ఆసమయమునందు ఋషభుడు, శరభుడు, నీలుడు, గవాక్షుడు, గంధమాదనుడు, మొదలుగాగల వానరవీరులు కుంభకర్ణునకభిముఖముగాబరుగెత్తిరి. పిమ్మటమహాబలులగు నావానరులు, పర్వతములచేతను, వృక్షములచేతను, పాదములచేతను, మిగులపెద్దదగు శరీరముగలకుంభకర్ణునిగొట్టిరి. ఆదెబ్బలన్నియును కుంభకర్ణునకు సుఖస్పర్శగలవైయుండెనుగాని దుఃఖకరములుగానివయ్యె. ఆసమయమునందు గుంభకర్ణుడు వానరులదౌర్జన్యమునుజూచికోపోద్రిక్తుడై మహావేగముగల ఋషభుడను వానరోత్తముని భుజములచేతగౌగిలించుకొనియె. అట్లుకుంభకర్ణునిభుజములచేత బీడింపబడిన యావానరోత్తముడు నోటనుండిరక్తముగ్రక్కుచున్నవాడై క్రిందబడియె. పిమ్మటనాకుంభకర్ణుడుపిడికిలిదెబ్బచేత శరభనీలులనుగొట్టె. పాదతలముచేత గవాక్షుడనువానిగొట్టె. పిమ్మటనధికమగు కోపముగలవాడై గంధమాదనుడనియెడు వానరోత్తముని పాదముచేత దన్నె. అవ్విధముగనాకుంభకర్ణునిచేత గొట్టబడినయా వానరులందఱును మిగులబాధనొందినవారై ఛేదింపబడినమోదుగుచెట్లవలె భూమియందుబడిరి. అవ్విధముగ మహానుభావులును, ముఖ్యులును, నగువానరవీరులుకుంభకర్ణునిచేత గొట్టబడినవారై క్రిందబడగానే వానరులందఱును నొక్కమాటుగా గుంభకర్ణునిమీదబడిరి. పర్వతములతో సమానుడగు కుంభకర్ణునిమీదబడియా వానరవీరులందఱునుకఱచిరి. గోళ్లచేతగిచ్చిరి. మోకాళ్లతోబొడిచిరి. పిడికిళ్లతోగుద్దిరి. ఇవ్విధముగా బర్వతముతోసమానుడగు నాకుంభకర్ణుడు వానరవీరులచేత వ్యాప్తమైనశరీరముగలవాడై వృక్షములతోగూడుకొనినపర్వతమువలె బ్రకాశించుచుండె. అంతట

మహాబలుడగు నాకుంభకర్ణుడు బాహువులచేత వానరుల నందఱబట్టుకొని గరుత్మంతుడు సర్పములను భక్షించినవిధముగాబట్టికొనియె. అట్లుకుంభకర్ణునిచేత పాతాళలోకముతోసమానమగు నోటియందు బడవ్రేయబడిన వానరులందఱును కుంభకర్ణునియొక్క ముక్కులలోనుండియును, చెవులలోనుండియును మరలబయలునకువచ్చిరి. మఱియును రాక్షసోత్తముడగు కుంభకర్ణుడు మిగుల గోపము గలవాడై యావానరులనందఱను విఱిచికొని భక్షించుచుండెను. మఱియును నాకుంభకర్ణుడప్పుడు యుద్ధభూమినిసర్వమునుమాంసముచేతను, నెత్తురుచేతను, దడపబడినదానినిగాజేసి యావానరసైన్యమునందు బ్రళయకాలాగ్నివలె బ్రవేశించినాశమునుజేయుచుండెను. ఆసమయమునందు, కుంభకర్ణుడువజ్రాయుధమునుధరించిన యింద్రునివలెను, కాలపాశమునుధరించినయమునివలెను, శూలాయుధమునుధరించిన రుద్రునివలెను బ్రకాశించెను. మఱియునాకుంభకర్ణుడు, ప్రళయకాలమునందలియగ్నిదేవుడు గ్రీష్మకాలమునందు వనములనుదహింపజేసినవిధముగా వానరసైన్యమును సర్వమునుదహింపజేయుచుండెను. ఆసమయమునందు ఆవిధముగా కుంభకర్ణునిచేత గొట్టబడిన వానర వీరులందఱును, తమయందలి ముఖ్యులందఱును నశించుటకు జింతించి యాయుద్ధభూమియందు నిలవజాలక నానాదిక్కులకు బరుగెత్తిరి. మఱియు నావానరవీరులందఱును నవ్విధముగా గుంభకర్ణునిచేతబీడింపబడినవారై యధికముగా దుఃఖమునుపొందుచు నతిశీఘ్రముగ రామునియొద్దకుబోయి శరణుజొచ్చి ప్రార్థించిరి. పిమ్మట రామునితో దమదుఃఖవృత్తాంతమును సర్వమునుజెప్పికొనిరి. ఆసమయమునందు యుద్ధభూమియందు వాలిపుత్రుడగు నంగదుడు మిగులభంగపాటునుబొందిన వానరులనుజూచి యధిక వేగము నవలంబించి కుంభకర్ణునితోయుద్ధమును జేయుటకు బయలువెడలిపోయెను. పిమ్మటమిగులపెద్దదగు పర్వతశిఖరమునొక్కదానిని గ్రహించి మాటిమాటికినిధ్వనిజేయుచుండెను. ఇంతయగాక కుంభకర్ణునితో గూడ యుద్ధమునకువచ్చిన రాక్షసులను భయపఱచుచుండెను. అంతటనాయంగదుడు కుంభకర్ణునియొక్క శిరస్సునందు శైలశిఖరమును విసరివైచెను. అవ్విధముగ నంగదునిచేత గొట్టబడిన యాకుంభకర్ణుడప్పుడధికమైన కోపముగలవాడయ్యె అట్లుమిగులగోపముగలయాకుంభకర్ణుడు వానరులకందఱకును నధికమగు భయమును గలుగజేయుచు నధికవేగముతో నంగదునితో యుద్ధమునకుబోయెను. పోయిమహాబలుడగు కుంభకర్ణుడు అంగదునిమీద శూలమను నాయుధమును బ్రయోగించెను. అట్లుకుంభకర్ణునిచేత బ్రయోగింపబడినదియును, తనకభిముఖముగావచ్చుచున్నదియును, నగు శూలమును, యుద్ధమునందు మిగులనేర్పుగలవాడును, వానరోత్తముడును, బలవంతుడును, నగు అంగదుడులాఘవమువలన దప్పించుకొనియెను. అట్లుతప్పించుకొని యతిశీఘ్రముగనెగిరి పాదతలముచేతనాకుంభకర్ణునియొక్క ఱొమ్మునుబగలదన్నెను. అట్లువాలిపుత్రుడగు నంగదునిచేత నధికకోపము కలుగజేయబడినవాడును, పర్వతముతో సమానుడును, నగు కుంభకర్ణుడు మూర్ఛనొందెను. అంతటగొంతసేపటికి దెలివొందియాకుంభకర్ణుడు గోపోద్దీపితుడై యంగదునిఱొమ్ము పగులునట్లొక్క పిడికిటిపోటును బొడిచెను. ఆదెబ్బకు దాళజాలక యంగదుడు మూర్ఛనుబొందెను, అవ్విధముగవానరోత్తముడగు నంగదుడు మరణమునుబొందినవానిచందముగగ్రింద బడెను. పిమ్మట గుంభకర్ణుడు వానినంతటితోవదలిశూలమను నాయుధమునుధరించి సుగ్రీవున కభిముఖముగా బరుగెత్తెను. అట్లుతనకభిముఖముగా వచ్చుచున్నవాడును, మహాబలుడును, నగు కుంభకర్ణునిజూచి వీరుడును, వానరాధిపతియును నగు సుగ్రీవుడెగిరెను. అవ్విధముగనెగిరి వానరోత్తముడగు సుగ్రీవుడొకపర్వతాగ్రమునుగ్రహించి యధికమగు వేగముతో మహాబలుడగుకుంభకర్ణునికభిముఖముగాబరుగెత్తెను. అట్లుపరుగెత్తుకొనివచ్చుచున్నవాడును, వానరోత్తముడును, నగు సుగ్రీవునిజూచి కుంభకర్ణుడు వికారమునుబొందుచున్న సకలావయవములనుగలవాడగుచు వానరోత్తముడగు నాసుగ్రీవునకభిముఖముగా బరుగెత్తెను, అట్లు సుగ్రీవున కభిముఖముగా నిలుచుచున్నకుంభకర్ణునిజూచి వానరులందఱునుమిగులభయమునుబొందుచుండిరి. అట్లు సుగ్రీవునకభిముఖముగా నిలుచుచున్నవాడును, వానరులయొక్కనెత్తురుచేత వ్యాప్తమైన శరీరముగలవాడును, వానరులను భక్షించువాడును, నగు కుంభకర్ణునిజూచి సుగ్రీవుడిట్లనియెను. ఓరీ కుంభకర్ణుడా! నీచేతవానరులందఱును సంహరింపబడిరి. మిగులదుష్కరమగుయుద్ధముచేయబడియెను. ఇంతయగాక యనేకులగు వానరులనుభక్షించితివి. అందువలన నీచే నధికమగు కీర్తిపొందబడియెను. ఇంతవఱకునీవుచేసిన యుద్ధముచాలును. ఆవానరసైన్యమునుసర్వమును విడిచిపెట్టుము. ప్రాకృతులగువానరోత్తములతో నీకేమిప్రయోజనముగలదు. కావున నోరాక్షసోత్తముడా! కుంభకర్ణుడా! నేనీపర్వతమును నీమీదబ్రయోగించెదను. ఈపర్వతముయొక్క దెబ్బనుసహింపుమనియెను. ఇవ్విధముగా సుగ్రీవునిచేత జెప్పబడినదియును, సత్త్వధైర్యములతో గూడినదియును, నగు వాక్యమునువిని రాక్షసోత్తముడగు కుంభకర్ణుడిట్లనియెను. ఓరీ! సుగ్రీవుడా! నీవు బ్రహ్మదేవునకు మనుమడవు. ఋక్షరజుడనువానికిబుత్రుడవు.

ఇంతయగాక యధికమగు బలపౌరుషములు గలవాడవనికీర్తిని బొందితివి. ఇట్టిమహానుభావుడవగు నీవు యివ్విధముగ బడాయిమాటలు పలుకవచ్చునా? పలుకగూడదు. మాటలాడక యుద్ధమును జేసి నీపరాక్రమమును జూపుమనియె. అట్లుకుంభకర్ణుడు చెప్పినమాటలనువిని సుగ్రీవుడు గోపోద్దీపితుడై వజ్రాయుధముతోడను, పిడుగుతోడను సమానమైనపర్వతముచేత గుంభకర్ణునియొక్క-ఱొమ్ము బ్రద్దలగునట్లుకొట్టె. అట్లుమిగులవిశాలమగు కుంభకర్ణునియొక్క-వక్షస్థలమునందు సుగ్రీవునిచేత బ్రయోగింపబడిన పర్వతమును జూచి వానరులందఱును పరమానందమునుబొందిరి. అదిచూచి రాక్షసులు వ్యసనమునుబొందిరి. అట్లుసుగ్రీవుడు పర్వతముచేత గొట్టినపిమ్మట గుంభకర్ణుడు గోపోద్దీపితుడై నోరుదెరచె. పిమ్మట దనచేతనున్నశూలమును నాయుధమును గిరగిరద్రిప్పి సుగ్రీవునిజంపుటకొఱకు బ్రయోగించె. అట్లుకుంభకర్ణునిచేత బ్రయోగింపబడినదియును, మిగులదీక్ష్ణమైనదియును, మెఱుపువలె బ్రకాశించుచున్నదియును, నగు నాశూలమును నాయుధమును హనుమంతుడు చివుక్కుననెగిరి భుజములచేత బట్టుకొనియె. అట్లుపట్టుకొనినపిమ్మట వానరోత్తముడగు హనుమంతుడు దానిని మోకాటిక్రింద బెట్టివిరిచె. అవ్విధముగ హనుమంతునిచేత శూలము విరవబడుటనుజూచి వానరసైన్యమంతయును బరమానందమునుబొందియధికముగ గంతులువైచిరి. మఱియునావానరులందఱును పరమానందముగలవారై సింహనాదములను జేసిరి. మఱియు నాశూలమునవ్విధముగా విరుచుటనుచూచి హనుమంతునినసేకవిధములబూజించిరి. అట్లుతనశూలము భగ్నమగుటనుజూచి రాక్షసాధిపతియును, మహానుభావుడును, నగు కుంభకర్ణుడు మిగులగోపమునుబొందె. పిమ్మట మలయపర్వతముయొక్క- శిఖరమును గ్రహించి యాశిఖరమును సుగ్రీవునిమీద బ్రయోగించె. అట్లుశిఖరముచేత గొట్టబడివానరాధిపతియగు సుగ్రీవుడుమూర్ఛనొందె. అట్లుస్మృతిలేకక్రింబడియున్నసుగ్రీవునిజూచి రాక్షసులందఱును బరమానందముగలవారై యధికముగా గూతలిడిరి. అంతటనాసుగ్రీవుడు భయంకరమైనపరాక్రమముగలవాడును, వానరోత్తముడును, నగు సుగ్రీవునొద్దకుబోయి మిగుల భయంకరమగు వాయువు మేఘమును బాదివినవిధముగబాదివె. మిగుల గొప్పదగు మేఘమునుబోలియున్న యాసుగ్రీవుని బట్టుకొని కుంభకర్ణుడు లంకాపట్టణమునకుబోవుచుండె. ఆసమయమునందు మిగులబొడవులగు శిఖరములతోగూడిన మేరుపర్వతమువలె బ్రకాశించుచుండె. అట్లుసుగ్రీవుని బాదివిపట్టుకొనిపోవుచున్న యాకుంభకర్ణుని రాక్షసులందఱును అనేకవిధములుగ బొగడిరి. ఆమహాధ్వనినివిని దేవతలుగూడబరమాశ్చర్యమునుబొందిరి. అప్పుడాదేవేంద్రునకు శత్రుడగుకుంభకర్ణుడు దేవేంద్రునియొక్క- పరాక్రమమువంటి పరాక్రమముగలవాడును, వానరోత్తముడును, నగు సుగ్రీవునిబట్టుకొనిపోవుచు నిట్లనితలచె. ఈసుగ్రీవుడపహరింపబడెనేనివానరసైన్యమంతయును నశించినదగును. అంతట రామలక్ష్మణులుగూడ సులభముగజంపబడుదురనితలచె. ఆసమయమునందు వానరసైన్యమంతయును మిగులభయముగలదై నాలుగుదిక్కు-లకును బరుగిడుచుండె. అట్లువానరసైన్యముచేతబరుగెత్తిపోవుటను, కుంభకర్ణుడుసుగ్రీవుని బట్టుకొనిపోవుటనుజూచి, మతిమంతుడగు హనుమంతు డిట్లనియోచించె. అయ్యయ్యో! సుగ్రీవుడివ్విధముగాబట్టుకొనిపోబడినపిమ్మట మనమేమిసేయుదము. ఈసమయమునందేమియునుదోచడములేదు. అయిననిప్పుడు చేయదగినకార్యమేదియో దానిని జేయుటయుచితము. కావుననేను బర్వతమువంటి శరీరముగలవాడనై యీకుంభకర్ణుని నశింపజేసెదను. మహాబలుడగుకుంభకర్ణుడు నాయొక్క- పిడికిటిపోట్లచేత జంపబడెనేని వానరరాజోత్తముడగుసుగ్రీవుడు శత్రువుల చేతిలోనుండితప్పించుకొనును. అంతటవానరులందఱును బరమానందముగలవారగుదురు. అట్లుగాదేనివానరాధిపతియగు సుగ్రీవుడు స్వయముగానే విడిపించుకొని రాగలడు. దేవదానవులందఱునునొక్క-టిగాజేరినను, ఈసుగ్రీవునిజేరకాలము పట్టుకొనజాలరు. అయిననునిప్పుడు సుగ్రీవుడుతనశరీరమునుదాను మరచియున్నాడు. కుంభకర్ణునియొక్క- బర్వతముచేతగొట్టబడుటవలననిప్పుడీసుగ్రీవుడు మూర్ఛనుబొందియున్నాడు. ఈసుగ్రీవుడింకొకక్షణము సేపటికి మూర్ఛనువదలి మరలదెలివొందును. అప్పుడీసుగ్రీవుడు వానరులకేదియిష్టమో దానినిజేసివానరులకు సంతోషమును గలుగజేయగలడు. అట్లుగాకయొకవేళసుగ్రీవుడునాచేత విడుదలజేయబడెనేనిమహానుభావుడగు సుగ్రీవుడు వ్యసనమును బొందును. అదియునుగాక యిదివఱకు శాశ్వతముగానున్నసుగ్రీవునికీర్తి నాశమునుబొందును. కావునక్షణముసేపు నిదానించియోచించి చూతము. ఇంతలోపలభిన్నమైన వానరసైన్యమును, మంచిమాటలచేతనోదార్తమని యోచించుచుండె. ఇవ్విధముగా హనుమంతుడు ఆలోచించి నావాదిక్కు-లకు బరుగెత్తుకొనిపోవుచున్నవానరసైన్యమును పరాక్రమవచనములచేత బరుగెత్తిపోకుండునట్లునిలిపె. ఆసమయమునందు గుంభకర్ణుడు వానరోత్తముడగు సుగ్రీవునిబట్టుకొనిపోయి లంకాపట్టణమునందుబ్రవేశించె. అట్లుకుంభకర్ణుడు లంకాపట్టణమునందా రాజవీథియందు బోవుచుండగా నాపట్టణగోపురముల

యందు నివసించినవారందఱును గుంభకర్ణునిమీద బుష్పవర్షమునుగురిపించిరి. మఱియు పేలాలవర్షమునుగూడ గురిపించిరి. అట్లుకురియుచున్న పుష్పాదివర్షమువలన గలిగిన పరిమళగంధము ననుభవించుచు గుంభకర్ణుడు రాజమార్గమునందు మెల్లగ బోవుచుండె. ఆసమయమునందు రాజమార్గమంతయును మిగుల జల్లదనముగలదైయుండె. అప్పుడు మహాబలుడగు నాసుగ్రీవుడు తెలివొందె. పిమ్మట నాసుగ్రీవుడు కుంభకర్ణునియొక్క భుజమధ్యప్రదేశమునందు దెలివిగలవాడయ్యును దప్పించుకొనివచ్చుటకు వీలులేక యోచించుచుండె. మఱియును మహానుభావుడగు సుగ్రీవుడు లంకాపట్టణమునందలి రాజమార్గమును సర్వమునుజూచుచు నాలోచించుచుండె. మఱియునిట్లనితలచె. అయ్యో! నేనేమిచేయుదును. నన్నునివ్విధముగా గుంభకర్ణుడు పట్టుకొనిపోవుచుండెనే. దీనికి నేనేమి ప్రతిక్రియనుజేయుదును. కానిమ్ము. ఏవిధముగానైనను నీకుంభకర్ణునిచేతులనుండి తప్పించుకొని వానరుల కండఱకును సంతోషమును గలుగజేయుదుననితలచె. పిమ్మట మెల్లగాసమయమును జూచుకొని కుంభకర్ణునియొక్క ముక్కును దంతములతో కొఱికి క్రిందబడవైచె. చెవులనుగోళ్ళతో జించివైచె. అట్లు కుంభకర్ణునియొక్క ముక్కును చెవులనుబాడుసేసి పాదములచేతను, హస్తములచేతను, మర్దించుచుండె. అంతట నాకుంభకర్ణుడు ఆసమయమునందు నెత్తురుచేత వ్యాప్తమైన శరీరముగలవాడయ్యె. అట్లుక్రిందబడ ద్రేయబడి కుంభకర్ణునిచేత మర్దింపబడుచున్న సుగ్రీవుడుమెల్లగా సమయమును జూచుకొని యాకాశమునకెగిరి యధికవేగముతో రామునియొద్దకు బరుగెత్తుకొనిపోయె. ఆసమయమునందు మహాబలుడును. పోయినముక్కును చెవులును గలవాడును, నగుకుంభకర్ణుడు నెత్తురుచేతవ్యాప్తమైన శరీరముగలవాడై ప్రస్రవణాచలమువలె ప్రకాశించుచుండె. అట్లునెత్తురుచేత వ్యాప్తమైనశరీరముగలవాడును, మిగులగొప్పదగు శరీరముగలవాడును, భయంకరమైన పరాక్రమముగలవాడును, మహాబలుడును, నగుకుంభకర్ణుడు యుద్ధమును జేయవలయుననియెడు బుద్ధిగలవాడయ్యె. ఆసమయమునందు నెత్తురుచేత వ్యాప్తమైన శరీరముగలవాడును, రావణాసురునకు దమ్ముడును, నగుకుంభకర్ణుడు గోపోద్దీపితుడై సంధ్యాకాలమునందలి మేఘమువలె ప్రకాశించె. అట్లుసుగ్రీవుడంతరిక్షమునకెగిరిపోయినపిమ్మట దేవేంద్రునకు శత్రువగు కుంభకర్ణుడు యుద్ధమునుజేయవలయుననియెడు నభిలాషతో బరుగెత్తె. అట్లుపరుగెత్తునపుడు యుద్ధమును జేయుటకుదగిన యాయుధములేదనుతలంపుగలవాడై కొంతసేపాలోచించె. పిమ్మటభయంకరుడగు నాకుంభకర్ణుడు, మిగులభయంకరమైనదియును, ముద్గరమనుపేరుగలదియును, నగునాయుధమును ధరించె. అంతటనధికమగు తేజస్సుగల యాకుంభకర్ణుడు లంకాపట్టణమునుండిబయలువెడలినవాడై మిగులభయంకరమైనవానరసైన్యమునందు బ్రవేశించె. అట్లు వానరసైన్యమునందు బ్రవేశించి యాకుంభకర్ణుడు ప్రళయకాలాగ్నివలె భగ్గుభగ్గునమండిపడుచు నావానరసైన్యమునుభక్షించె. అట్లు వానరులయొక్క నెత్తురును, మాంసమును, భుజింపవలయుననియెడు కోరికగలవాడై యావానరసైన్యమునందు బ్రవేశించి కోపావేశముచేత శరీరము తెలియనివాడై రాక్షసులను, పిశాచములను, భల్లూకములను, వానరులను, భేదములేకభక్షించుచుండె. మఱియునాకుంభకర్ణుడు ప్రళయకాలమునందు మృత్యుదేవతసకలభూతములను భక్షించినవిధముగ సకలవానరసైన్యమును సర్వమును భక్షించుచుండె. మఱియు నాసమయమునందు కుంభకర్ణుడు, ఇద్దఱుముగ్గురును, నలుగురైదుగురుని నొక్కొక్కపర్యాయముపట్టుకొని భక్షించుచుండె. మఱియునాసమయమునందు గుంభకర్ణుడు పర్వతాగ్రములచేత వానరులయొక్క మేదోమాంసములను బగులగొట్టుకొని భక్షించుచుండె అట్లుకుంభకర్ణుడు వానరులనుభక్షించుచున్న సమయమునందు వానరులందఱును మిగులభయమును బొందుచున్నవారై రాముని దగ్గరకుబోయిరి. ఆసమయమునందు, కుంభకర్ణుడు మిగులగోపముగలవాడై మునుపటికంటె నధికముగా వానరులనందఱను భక్షించుచుండె. మఱియు నాసమయమునందు, కుంభకర్ణుడు బాహువులచేత నూరేసివానరులను, ఏడ్గురేసివానరులను, ఎనిమిదేసివానరులను, ముప్పదేసి వానరులను, బట్టుకొనిభక్షించుచుండె. ఆసమయమునందు శత్రువులయొక్క పట్టణములను జయించుటయందు దగినసామర్థ్యముగలవాడును, సుమిత్రాదేవికిబుత్రుడును, శత్రుసైన్యమునుబాధించుచున్నవాడును, నగులక్ష్మణుడు కుంభకర్ణునితో మిగుల భయంకరమగు యుద్ధమును జేసె. ఆయుద్ధమునందు, వీర్యవంతుడగు లక్ష్మణుడు, కుంభకర్ణునియొక్క శరీరమునం దేడుబాణములను బ్రయోగించె. పిమ్మట నపరిమితసంఖ్యాకములగు బాణములను బ్రయోగించె. ఆసమయమునందు మహాబలుడగు కుంభకర్ణుడు లక్ష్మణుని లక్ష్యముసేయక భూమిగడగడ వణకునట్లు యుద్ధరంగమునందు నడచుచు రామునకభిముఖముగా బరుగెత్తె. అప్పుడు దశరథమహారాజునకు బుత్రుడగు రాముడు, రౌద్రాస్త్రమును బ్రయోగించుచు గుంభకర్ణునియొక్క హృదయమునందు మిగులదీక్ష్ణములగు బాణములనుబ్రయోగించె. అట్లు రాముని-

బాణములవేడిమికిఁదాళజాలక యాకుంభకర్ణుడు పరుగెత్తుచుండెను. ఆసమయమునందు కోపోద్దీపితుడైన కుంభకర్ణునియొక్క ముఖమునుండి యగ్నితోసమానములగు జ్వాలలు బయలువెడలె. మఱియునవ్విధముగా రాముని బాణములచేత గొట్టబడినవాడును, రాక్షసోత్తముడును, నగుకుంభకర్ణుడు మిగులభయంకరముగా గూతవేసె. పిమ్మట క్రోధోద్దీపితుడై యుద్ధభూమియందు మిగులవేగముతో బరుగెత్తుచు వానరులనందఱ భక్షించుచుండె. ఆసమయమునందు రాముడు క్రోధోద్దీపితుడై యాకుంభకర్ణునియొక్క తొమ్మునందు మిగులదీక్ష్ణములగు బాణములను బ్రయోగించె. ఆసమయమునందు, కుంభకర్ణునియొక్క హస్తమునుండి గదయనునాయుధము క్రిందబడియె. మఱియు నట్టియెడ భూతలమున సకలాయుధములను వదలిపెట్టె. ఆసమయమునందుమహాబలుడగు కుంభకర్ణుడు తననునిరాయుధునిగాదలచె. పిమ్మట పిడికిళ్లతోడను, మోకాళ్లతోడను,మిగులభయంకరమైన యుద్ధమునుజేసె. ఆసమయమునందు, కుంభకర్ణుడు బాణములచేత గొట్టబడిన యవయవములుగలవాడును, నెత్తురుచేత వ్యాప్తమైన శరీరముగలవాడును, నై ప్రస్రవణాచలమువలె బ్రకాశించుచుండె. ఆసమయమునందు తీవ్రమగుకోపముచేతను, నెత్తురుచేతను, వ్యాప్తమైనశరీరముగలవాడగుచు సకలవానరులను భక్షించుచుండె. అంతటభయంకరమైన పరాక్రమముగల కుంభకర్ణుడు భయంకరమగు నొక్కపర్వతశిఖరమును గిరగిరద్రిప్పి రామునిమీద బ్రయోగించె. ఆసమయమునందు కుంభకర్ణుడు ప్రళయకాలమునందల యమునిబోలియుండె. అట్లు కుంభకర్ణునిచేతబ్రయోగింపబడిన పర్వతశిఖరముతనమీదికి రాకమునుపే రాముడు మిగులదీక్ష్ణములును, బంగారముచేతజిత్రములైనయవయవములుగలవియును, నగునేడుబాణములచేత ఛేదించె. మఱియును మేరుపర్వతముతో సమానమగు నాపర్వతశిఖరము రెండునూఱులవానరులమీదబడుటకుద్యుక్తమయ్యె. అవ్విధముగనుద్యుక్తమైన యాపర్వతశిఖరము వానరులమీద బడకమునుపే క్రిందబడునట్లుచేసె. ఆసమయమునందు ధర్మాత్ముడగు లక్ష్మణుడు కుంభకర్ణునివధయందభిలాషగలవాడై నానావిధములగు నుపాయముల నాలోచించుచు రామునితో నిట్లనియె.

అన్నా! రాముడా! నెత్తురును ద్రాగుటచేత మదించిన యీకుంభకర్ణుడు తనవారలను, ఎదుటివారలను దెలియక యందఱిని భక్షించుచున్నాడు. కావున మనవానరులందఱును పర్వతముమీదను, చెట్లమీదను, ఎక్కినవిధముగానే కుంభకర్ణునిమీద నెక్కుట యుచితముగనున్నది. అట్లయ్యెనేని దుర్బుద్ధిగల యీకుంభకర్ణుడు భారముచే మోయజాలక క్రిందబడును. అట్లుక్రిందబడిన పిమ్మట వీడు వానరులను జంపజాలడు. ఆసమయమునందు మనముతగినయుపాయములచేత జయమునుబొందవచ్చుననియె. అవ్విధముగా బుద్ధిమంతుడును, రాజపుత్రుడును, నగు లక్ష్మణుడు చెప్పినమాటలనువిని వానరులందఱును బరమానందముగలవారై కుంభకర్ణునిమీద నెక్కిరి. అట్లు వానరులెక్కిన పిమ్మట కుంభకర్ణుడు కోపోద్దీపితుడై మదపుటేనుగు తనమీది మావటివారలను విదలించువిధముగ నావానరులనందఱను విదలించుచుండె. అట్లుకుంభకర్ణునిచేత విదలించివేయబడినవానరులనుజూచి రాముడీరాక్షసుడు మహాదుష్టుడనితలచె. పిమ్మట ధనుస్సునుగ్రహించి తీవ్రములగుబాణములను సంధించె. అంతటవీరుడగు రాముడుకోపముచేత నెఱ్ఱనైననేత్రములుగలవాడై నేత్రములచేత సర్వమును దహింపజేయుచున్నవానివలెనుండె. అంతటరఘుకులోత్తముడగు రాముడు మిగులవేగముగలవాడును, అధికమగు కోపముగలవాడును, నగుచు గుంభకర్ణునకభిముఖముగా బరుగెత్తె. ఆసమయమునందు, కుంభకర్ణుని భయమువలన బీడింపబడి పరుగెత్తుకొనిపోవుచున్న వానరవీరులను జూచె. మఱియు నారాముడు, దృఢమైననారిగలదియును, మిగుల భయంకరమైనదియును, బంగారముచేత జిత్రముగా జేయబడినదియును, సర్పముతో సమానమైనదియును, నగు ధనుస్సును గ్రహించి మిగుల శ్రేష్ఠములగు బాణములు గలవాడగుచు యుద్ధమున కభిముఖుడయ్యె. అట్లు యుద్ధమున కభిముఖుడును, వానరులచేత జుట్టుకొనబడినవాడును, జయింపనలవిగానివాడును, మహాబలుడును, నగు రాముడు లక్ష్మణునితోగూడ బయలువెడలె. అట్లు బయలువెడలినపిమ్మట నారాముడు, మహానుభావుడును, కిరీటములుగలవాడును, శత్రువులను నశింపజేయువాడును, నెత్తురుచేత వ్యాప్తమైన సర్వావయవములుగలవాడును, మహాబలుడును, కోపోద్దీపితమగు మదపుటేనుగువలె వానరులమీదికిబరుగెత్తుచున్నవాడును, వానరులనుజంపుటకువెదకుచున్నవాడును, కోపోద్దీపితుడును, రాక్షసులచేత జుట్టబడినవాడును, వింధ్యపర్వతముతోడను, మందరపర్వతముతోడను, సమానుడును, బంగారపు భుజబంధులచేత నలంకరింపబడినవాడును, మేఘములవలె నోటనెత్తురును గ్రక్కుచున్నవాడును, వానరులనెత్తురును నాలుకచేతగ్రహించుచున్నవాడును, ఎఱ్ఱనినేత్రములుగలవాడును, వానరసైన్యమునుమర్దించుచున్నవాడును, యమునితోసమానముగనున్నవాడును, నగుకుంభకర్ణునిజూచె. అట్లుప్రజ్వలించుచున్న యగ్నివలె బ్రకాశిం

చుచున్నవాడును, రాక్షసోత్తముడును, నగు కుంభకర్ణుని జూచి పురుషోత్తముడగు రాముడు ధనుస్సును సంపూర్ణముగ నాకర్షించెను. ఆకర్షించి ధనుష్టంకారమును జేసెను. ఆ ధనుష్టంకారమును విని రాక్షసోత్తముడగు కుంభకర్ణుడు, కోపోద్దీపితుడగుచు, ఆధ్వనిని సహింపనివాడగుచు, నగుచు రాముని కభిముఖముగా బరుగెత్తుచుండెను. ఆసమయమునందు, వాయువుచేత నెగురగొట్టబడిన మేఘముతో సమానుడును, ఆదిశేషునితో సమానములగు భుజములుగలవాడును, పర్వతమును బోలియున్నవాడును, యుద్ధమును జేయవలయునని మెండు నభిలాషతో దనకభిముఖముగా వచ్చుచున్నవాడును, నగు కుంభకర్ణునిజూచి రాముడిట్లనియె.

ఓరీ రాక్షసాధిపతీ ! యుద్ధమునకురమ్ము. వ్యసనమును బొందకుము. నేనుధనుర్ధారినై నీతోయుద్ధమును జేయుటకుసిద్ధముగనున్నాను. దేవేంద్రునకు శత్రువవగునో కుంభకర్ణుడా! నేనురాముడను ఇకనీవుక్షణమాత్రకాలములో ప్రాణహీనుడవు కాగలవనియె. ఆమాటలనువిని కుంభకర్ణుడు, తనతోమాటలాడుచున్నవాడు రాముడనితలచి వికారమైన ధ్వనిగలుగునట్లుగా బకపకనవ్వె. మఱియునాసమయమునందుఆకుంభకర్ణుడుకోపోద్దీపితుడై వానరులనందఱదరిమె. మఱియు నావానరులకందఱకును భయమునుగల్పించుచుండెను. మఱియు నాసమయమునందు వానరులయొక్క హృదయములు భయముచేత బ్రద్దలగుచుండెను. ఆసమయమునందు, అధికమగు తేజస్సుగల కుంభకర్ణుడు, మునుపటికంటె నధికముగాను, మేఘముయొక్క ధ్వనివంటి ధ్వనిగలుగునట్లుగాను, సకలభూతములకును భయముగలుగునట్లుగాను, పకపకనవ్వి రఘుకులోద్భవుడగు రామునితో నిట్లనియె

ఓరీ! రాముడా! నేనువిరాధుడనుగాను, కబంధుడను రాక్షసుడనుగాను, ఖరుడను దానవుడనుగాను. వాలినిగాను మారీచుడనుగాను. నేనుకుంభకర్ణుడను. నీతోయుద్ధము జేయుటకువచ్చితిని. ఓరీరాముడా ! మిగులభయంకరమైనదియును, ఇనుముతోజేయబడినదియును, నగుముద్గరమను నాయాయుధమును జూడుము. పూర్వము నేను, ఈయాయుధముచేతనే దేవతలను, దానవులనుజయించితిని. నేనిప్పుడు ముక్కును చెవులును లేకయుంటినని యవమానమును జేయుటయుచితముగాదు. ముక్కును, చెవులును లేకపోవుట నాకువిశేషబాధ యేమియునులేదు. ఇక్ష్వాకువంశోత్తముడవైన యోరాముడా ! నాపరాక్రమమును గొంచెముగాజూపెదను. ముందుగా నాపరాక్రమమును జూపిపిమ్మటనిన్నుభక్షించెదను. అంతటనారాముడుకుంభకర్ణునియొక్క మాటలనువిని మంచిపిడులుగల బాణములను బ్రయోగించెను. అట్లువజ్రాయుధముతో సమానములగు వేగముగల బాణములచేత గొట్టబడియును, నాకుంభకర్ణుడు బాధను బొందినవాడు గాడయ్యె. ఆసమయమునందు రాముడుకోపోద్దీపితుడై పూర్వముఏబాణములచేత, ఏపిచెట్లను నేడింటిని నఱికెనో, ఏబాణములచేత వాలినిజంపెనో, యటువంటి బాణమును కుంభకర్ణుని శరీరమునందు బ్రయోగించెను. ఆబాణములు వజ్రాయుధముతో సమానములై యుండెను. అప్పుడు దేవేంద్రునకు శత్రువగు కుంభకర్ణుడా బాణములను వర్షమును సహించిన విధముగ సహించుచు మిగులభయంకరమైన వేగముగల తనముద్గరమనునాయుధమును గిరగిరద్రిప్పి యారాముని బాణవేగమును బాడుసేసె. మఱియు నాసమయమునందు నెత్తురుచేత వ్యాప్తమైన యాముద్గరమను నాయుధమును గిరగిరద్రిప్పి దేవసైన్యమునకుగూడ భయమునుగలుగ జేయుచు నాముద్గరమునుగిరగిరద్రిప్పివానరులలో గొందఱిని సంహరించెను. అంతట రాముడు కోపోద్దీపితుడై యస్త్రములలోనుత్తమమగు వాయవ్యాస్త్రమును నాకుంభకర్ణునిమీద బ్రయోగించెను. అంతట నావాయవ్యాస్త్రము కుంభకర్ణునియొక్క బాహువును ముద్గరముతోగూడహరించెను. అప్పుడు కుంభకర్ణునియొక్కభుజము ముద్గరమనునాయుధముతోగూడ రాముని వాయవ్యాస్త్రముచేత ఛేదింపబడినదై వానరసైన్యమునందుబడెను. ఆ బాహువుక్రిందబడియనేకులగు వానరులు నాశమును బొందిరి. అట్లుబాహువుక్రిందబడిచావగా మిగిలినవానరులు మిగుల దీనమగుమనస్సులుగలవారై యాబాహువునకు సమీపమునందుగూర్చుండిరి. పిమ్మటమిగుల భయంకరమగుద్వంద్వయుద్ధమునుజూచిరి. మఱియు నాసమయమునందు రాముని వాయవ్యాస్త్రముచేత ఛేదింపబడిన బాహువుగల యాకుంభకర్ణుడు ఛేదింపబడిన యగ్రభాగముగల పర్వతమువలెబ్రకాశించుచుండెను. అట్లుప్రకాశించుచు నాకుంభకర్ణుడధికమైన కోపముగలవాడై మిగిలినచేతితో గొప్పదగువాకఱవృక్షమునుబెల్లగించి యాయాయుధమునుగాధరించి రాజోత్తముడగు రామునితో యుద్ధమునుజేయుట కతివేగముగాబరుగెత్తె. అప్పుడురాముడు, బంగారముచేత జిత్రములైనదియును, ఐంద్రాస్త్రముతో గూడినదియును నగు బాణముచేత, ఏపిచెట్టుతోగూడుకొనినదియును, సర్పముయొక్కపడిగవలె భయంకరమైనదియును, నగు నాకుంభకర్ణునియొక్క రెండవబాహువునుగూడఖండించెను. అట్లురాముని యైంద్రాస్త్రముచేత ఛేదింపబడిన యాకుంభకర్ణునియొక్క రెండవబాహువుగూడపర్వతమువలె గ్రిందబడియె.

అది క్రిందబడునప్పుడు సమీపమునందున్న వానరులను, రాక్షసులను, వృక్షములను, పర్వతములనుగూడ గ్రిందబడవైచె. ఆసమయమునందు రాముడు ఛేదింపబడిన బాహువులుగలవాడును, తనకభిముఖముగా యుద్ధమునుజేయుటకు వచ్చుచున్నవాడును, సకలభూతములకును భయముగలుగునట్లు ధ్వనిజేయుచున్నవాడును, నగుకుంభకర్ణునిజూచి యర్ధచంద్రాకారములగు రెండుబాణములను బ్రయోగించి యాకుంభకర్ణునియొక్క రెండుపాదములను ఛేదించె. అట్లురామునిచేత ఛేదింపబడిన యాకుంభకర్ణునియొక్క పాదములు దిక్కులను, మూలదిక్కులను, పర్వతములను, గుహలను, గొప్పదగుసముద్రమును, లంకాపట్టణమును, వానరులయొక్కయు, రాక్షసులయొక్కయు సైన్యమును, ధ్వనిగలవానినిగా జేయుచు గ్రిందబడియె. అవ్విధముగ ఛేదింపబడిన బాహువులుగలవాడును, నరకబడినపాదములు గలవాడునునగు కుంభకర్ణుడు బడబాముఖముతో సమానమగు ముఖమును దెరచుకొని యాకాశమునందు జంద్రుని మ్రింగుటకు బరుగెత్తుచున్న రాహువువలె రాముని మ్రింగవలయునని యెడు తలంపుతో నతిశీఘ్రముగా బరుగెత్తుకొని వచ్చుచుండె. ఆసమయమునందు రాముడాశ్చర్యకోపములుగలవాడై తీక్ష్ణములగునగ్రభాగములుగలవియును, బంగారముచేత జేయబడినపిడ్లుగలవియునునగు బాణములచేత నతనినోటిని నిండించె. అట్లుబాణములచేత నిండింపబడిననోరుగలకుంభకర్ణుడేమియును మాటలాడజాలక యధికముగా నరిచె. అంతగొంతసేపటికి గ్రిందబడి మూర్ఛనుబొందె. అంతటనారాముడు సూర్యునియొక్క కాంతివంటికాంతిగలదియును, బ్రహ్మదండముతోడను, ప్రళయకాలమునందలి యమునితోడను సమానమైనదియును, శత్రువులకమంగళమునుగలుగజేయునదియును, వాయువేగమువంటి వేగముగలదియును, మిగులదీక్ష్ణమైనదియును, శ్రేష్ఠమైన పిడిగలదియునునగు నైంద్రాస్త్రమునుస్వీకరించె. పిమ్మట వజ్రములచేతను, బంగారముచేతను, సుందరమగుపిడిగలదియును, ప్రకాశించుచున్న సూర్యునియొక్క కాంతివలె బ్రకాశించుచున్నదియును, దేవేంద్రునియొక్క వజ్రాయుధముతోడను, పిడుగుతోడను, సమానమైనవేగముగలదియును, నగు నానైంద్రాస్త్రమును కుంభకర్ణునిమీద బ్రయోగించె. అట్లురామునిచేత బ్రయోగింపబడినదియును, తనయొక్క కాంతిచేతదిక్కులను బ్రకాశింపజేయుచున్నదియును, పొగతోగూడినయగ్నిజ్వాలవలె బ్రకాశించుచున్నదియును, దేవేంద్రునియొక్క వజ్రాయుధముతో సమానమైన పరాక్రమముగలదియును, నగునా యైంద్రాస్త్రము కుంభకర్ణునిమీదికిబోయె. అట్లుపోయి మిగుల గొప్పదగు పర్వతశిఖరముతో సమానమైనదియును, తెరవబడిన కోరపన్నులు గలదియును, చలించుచున్నవియును, సుందరములైనవియును నగు కుండలములుగలదియును, నగునాకుంభకర్ణునియొక్క శిరస్సును, పూర్వము దేవేంద్రుడు వృత్రాసురునియొక్క శిరస్సును ఖండించినవిధముగా ఖండించె. ఆసమయమునందు, కుండలాదులచేత నలంకరింపబడినదియును, మిగుల బెద్దదియును, నగుకుంభకర్ణునిశిరస్సు "రాత్రియందుపునర్వసూనక్షత్రగతుడైనచంద్రునివలె" బ్రకాశించుచుండె. అట్లురామునిబాణములచేతగొట్టబడినదియును, పర్వతముతో సమానమైనదియును, నగునాకుంభకర్ణునిశిరస్సు క్రిందబడియె. ఆశిరసుక్రిందబడినప్పుడు దానివేగముచేత లంకాపట్టణమునందలిమేడలును, ప్రాకారములును, విరిగిక్రిందబడియె. మఱియు నాసమయమునందు కుంభకర్ణుడు తనశరీరమును గ్రిందబడవేయునప్పుడు పరుగెత్తుచున్న వానరులయొక్క యనేకకోట్లు క్రిందబడిరి. అట్లు మితిలేని యాకారముగలవాడును, హిమవత్పర్వతముతో సమానమయిన వాడును నగు నాకుంభకర్ణుడు సముద్రమునందు బడియె. అట్లుసముద్రమునందు, పడునప్పుడాకుంభకర్ణుడు సముద్రమునందలిమొసళ్ళను, శ్రేష్ఠములగుచేపలను, సముద్రమునందలిపెద్దపెద్దసర్పములనుమర్దించె.

అవ్విధముగాయుద్ధమునందు బ్రాహ్మణులకును, దేవతలకును, శత్రువగుకుంభకర్ణుడు చంపబడినసమయమునందుభూమియును, పర్వతములును, వణకె. దేవతలందఱునునొక్కటిగాజేరి సంతోషముచేతగూతలిడిరి. మఱియు నాసమయమునందు రామునిపరాక్రమమునకు సంతోషించియక్షులు, గంధర్వులు, దేవతలు, మహర్షులు, ఉరగులు, సుపర్ణులు, గుహ్యకులు, మొదలగువారందఱునునంతరిక్షమునందుండి పరమానందమును బొందిరి. ఆసమయమునందు రాక్షసులందఱును, దేవతలచేత భేదింపబడినదానవులు దేవేంద్రునిజూచి భయమునుబొందినవిధముగా భయముగలవారైరి. మఱియు నాకుంభకర్ణునిమరణముచేత నధికమైన వ్యసనముగలవారై యేడ్చిరి. ఆసమయమునందు రాముడురాహువునోటనుండి బయలునకువచ్చిన సూర్యుడుచీకటినిబోగొట్టువిధముగా కుంభకర్ణునిజంపుటచేత వానరులకుగలభయమును సర్వమును బోగొట్టె. అప్పుడువానరులందఱును, పద్మపత్రములవలె వికసించినమోముగలవారై యధికమగు సంతోషమును బొందిరి. మఱియు శత్రువులచేత జయింపనలవిగానివాడును, భయంకరమైనపరాక్రమముగలవాడునునగు కుంభకర్ణునిజంపినరాముని కనేకవిధ

ములబూజలుసల్పిరి. భరతునకన్నయగు రాముడు, దేవేన్ద్రుడువృత్రాసురుని సంహరించినవిధముగా గొప్పవగు యుద్ధములయందు దేవతలసముదాయమును మర్దించువాడును, అదివఱకెన్నడును, అపజయమును బొందనివాడును నగు కుంభకర్ణునిసంహరించి పరమానందమును బొందె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి అరువదియేడవసర్గ ముగిసెను.

(*)-

— రావణాసురుడు కుంభకర్ణుని మరణమునువిని దుఃఖించుట. —

అంతటరాక్షసులందఱును నతివేగముగాబోయి మహానుభావుడగురామునిచేత రాక్షసోత్తముడగు కుంభకర్ణుడు చంపబడెనని రావణునకు దెలిపిమఱియునిట్లనిరి. రాక్షసరాజోత్తమా! రావణాసురా! యమునితోసమానుడగుకుంభకర్ణుడుకాలకర్మలతోగూడుకొనినవాడై వానరసైన్యమును బారదోలె. కొందఱగువానరయోధులను భక్షించె. అట్లు కొంతసేపుక్షణముసేపు శత్రువులనందఱనుదపింపజేసిరాముని తేజస్సునుసహింపజాలక శాంతినిబొందె. అప్పుడునీతమ్ముడగు కుంభకర్ణుడురామునిబాణములచేత బ్రయోగింపబడినవాడై చూచుటకుగూడ భయంకరమైన సముద్రమునందుబ్రవేశించె. మఱియునాకుంభకర్ణుడు రామునిచేత ఛేదింపబడిన కంఠమును, ఱొమ్మును, భుజములునుగలవాడై తనశరీరమునుండి యధికముగా నెత్తురునుస్రవింపజేయుచుండె. అట్లునెత్తురును స్రవింపజేయుచు బర్వతమువలె సముద్రముయొక్క ద్వారమును నాక్రమించుకొనియుండె. మఱియునిప్పుడాకుంభకర్ణుడు కార్చిచ్చుచేతదగులబెట్టబడినదైమోద్దకట్టినవృక్షమువలె సముద్రమునందునిలిచిసగముశరీరముతో గనబడుచున్నాడని యారాక్షసులందఱును జెప్పిరి. మహాబలుడగు కుంభకర్ణుడుయుద్ధమునందు రామునిచేత జంపబడెననువార్తనువిని రావణాసురుడుక్రిందబడిమూర్ఛవొందె. మఱియుబినతండ్రియగు కుంభకర్ణుడు చచ్చినవృత్తాంతమునువిని దేవాంతకనరాంతకులును, త్రిశిరుడును, అతికాయుడును, అపరిమితముగారోదనమును జేసిరి. మఱియునాసమయమునందు, అనాయాసముగ యుద్ధమును జేయునట్టిరామునిచేత, అన్నయగు కుంభకర్ణుడుమరణమునుబొందె ననువార్తనువిని మహోదరమహాపార్శ్వులుమిక్కుటమగు దుఃఖముగలవారై యధికముగానేడ్చిరి. అంతగొంతసేపటికి రాక్షసోత్తముడగు రావణాసురుడుమూర్ఛనుండితేరి కుంభకర్ణునివధవలన మిగుల దీనుడైయువ్విధముగ వ్యసనమునుబొందె. వీరుడవును, శత్రువులయొక్క గర్వమునునణచివేయువాడవును, మహాబలుడవునునైనయోకుంభకర్ణుడా! దైవవశముచేత నీవునన్నువదలియమునినగరమునకుబోతివా? మఱియునుమహాబలుడవైనయోకుంభకర్ణుడా! బంధువులయొక్కయు, నాయొక్కయు, శల్యమును, ఎత్తివేయన శత్రుసైన్యమునుసర్వమునుదపింపజేసి నన్నువదలి నీవొక్కడవేయమునగరమునకుబోతివా? తమ్ముడా! కుంభకర్ణుడా ! ఇప్పుడునేనుండియునులేనివాడనైతిని. తమ్ముడా! ఇప్పుడునాదక్షిణభుజముపడిపోయెను. ఇప్పుడునేనెవనియాధారముచేత దేవదానవులనగణించి భయమునుబొందకయుందును. ఆహా, ఇవ్విధమగు పరాక్రమముగలవాడును, దేవదానవులయొక్కమదమునుబోగొట్టువాడును, ప్రళయకాలమునందలి యగ్నితోడను, రుద్రునితోడను, సమానుడును నగు నాతమ్ముడుయుద్ధమునందు రామునిచేతజంపబడియె. హా! తమ్ముడా! వజ్రాయుధముగూడనీకువ్యసనమును గలుగజేయనిదయ్యె. అట్టిమహానుభావుడవగు నీవురామునిబాణములచేత భేదింపబడినవాడవై భూమియందుబడి యేవిధముగా నిద్రనుబొందుచున్నాడవు. ఇప్పుడుయుద్ధమునందుజంపబడిననిన్నుజూచి యాకాశమునందున్నదేవతలందఱును ఋషులతోగూడబరమానందముగలవారై ధ్వనిజేయుచున్నారు. మఱియు నిప్పుడుతగినసమయముదొరకుటచేత వానరులందఱును పరమసంతోషముగలవారైనాదుర్గములను, నాలంకాపట్టణముయొక్కద్వారములను, ఆక్రమింతురు. ఇకనాకురాజ్యముతో నేమిప్రయోజనము నాకుసీతవలన బ్రయోజనమేమి? కుంభకర్ణుడులేకపోవుటవలన నాకుబ్రాణమునందాశలేకయున్నది. నేనిప్పుడు నాతమ్మునిజంపినరామునియుద్ధమునందు జంపకపోతినేని మరణమునుబొందుటయేయుత్తమకార్యము. మరియు నేనుబ్రతికియుంటినేని నాబ్రదుకువ్యర్థమగును. ఇప్పుడేనేనునాతమ్ముడున్నచోటునకుబోయెదను. నాతమ్మునివదలి నేనుక్షణమైనసేపైనను జీవింపజాలనని యనేకవిధంబులనేడ్చుచు మరలకుంభకర్ణునుద్దేశించియిట్లనియె.

తమ్ముడా! కుంభకర్ణుడా! నీవుమరణమునుబొందితివిగదా? ఇకనేనెట్లుదేవేన్ద్రునివధింపగలను. పూర్వముఅపకారమునుజేసిన దేవతలునన్నిప్పుడుపరిహాసమును జేయుదురుగదా? నేనుదేవతలచేతబరిహాసింపబడుచు నెట్లుజీవింతును. నేనుశుభకరమగువిభీషణునివచనమును వినకపోతిని. అవివేకమువలన మహాత్ముడగు విభీషణునివాక్యములుబాగుగనుండలేదని నిందించితిని. అందువలన నిప్పుడుకుంభకర్ణప్ర

హస్తులనుజంపుకొంటిని. ఈకుంభకర్ణప్రహస్తులయొక్కమరణము కెనాకుమిగులదుఃఖమును గలుగజేయుచున్నవి. నాయవివేకముతుదకుయీవిధముగా బరిణమించె. ఇదియధికమగుదుఃఖకాలమయ్యె. ధార్మికుడును, శ్రీమంతుడును, నగువిభీషణునిదిట్టి వెడలగొట్టినందుకుదగినఫలమునిప్పుడనుభవించుచున్నాడను. అయ్యోయిప్పుడునేనేమిచేయుదునని యనేకవిధములవిలపించె. ఇట్టివ్యసనముచేత నకులమైనమనస్సుగలరావణుడుకుంభకర్ణునుద్దేశించి మరియు ననేకవిధములవిలపించి మరలగుంభకర్ణుని మరణమునుదలచుకొని దుఃఖమునుభరింపజాలకక్రిందబడిమూర్ఛబొందె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి యిరువదెనిమిదవసర్గముగిసెను.

—{ రావణాసురునిపుత్రులు యుద్ధమునకు బైలు }— వెడలుట.

ఇవ్విధముగా దుఃఖించుచున్నవాడును, దురాత్ముడును, దుఃఖముచేత మిగులదపింప జేయబడుచున్నవాడును, నగు రావణాసురునియొక్క విలాపమునువిని త్రిశిరుడను రాక్షసోత్తముడిట్లనియె.

రాక్షసరాజోత్తమా! రావణాసురా! మాపిన్నతండ్రియగుకుంభకర్ణుడునీవుచెప్పినవిధముగా నధికమైనపరాక్రమముగలవాడనుటకు సందియములేదు. అట్టిపరాక్రమము గలవాడయ్యును దైవవశముచేత మరణమునుబొందె. సత్పురుషులగువారు నీవలెమరణమును బొందినవారలనుగురించి దుఃఖమునుబొందరు. రావణాసురా! రాక్షసరాజోత్తమా! నీవొక్కడవేమూడులోకములకునుదగినవాడవు. అట్టినీవేమిటిమిత్తముగ నిన్నుగురించి దుఃఖమునుబొందుచున్నావు. నీవద్దబ్రహ్మదేవునిచేత, ఇవ్వబడినశక్తియును, కవచమును, ధనుస్సునుగలవు. ఇంతయగాక మేఘధ్వనివంటి ధ్వనిగలదియును, వేయిగుఱ్ఱములచేత బూన్పబడినదియునునగు రథముగలదు. నీవుపూర్వమునం దొక్కొక్కపర్యాయమునిరాయుధుడవై యుద్ధమునకుబోయి దేవదానవులను జయించితివి. అట్టిమాహాత్మ్యముగల నీవుసర్వాయుధములతోగూడినవాడవై యిప్పుడు రాముని జయించుటకు గొంచమైననుసందేహములేదు. కాబట్టియోరాక్షసమహారాజా ! నీవుధైర్యముగనుండుము. నేనుయుద్ధమునకుబోయెదను. పోయిగరుత్మంతుడు సర్పములనుభక్షించినవిధముగశత్రువులనందఱను సంహరించెదను. మరియునోరాక్షసరాజోత్తమా! దేవాధిపతియగు నింద్రుడుశంబరాసురుని సంహరించినవిధముగను, విష్ణుదేవుడుసింహికావిప్రజిత్తులకుబుత్రుడగు నరకాసురునిసంహరించి క్రిందబడవైచినవిధముగను నేనిప్పుడు రామునిసంహరించి వీరశయ్యయందు బరుండబెట్టెదవనియె. ఇవ్విధముగా త్రిశిరుడుచెప్పినవాక్యమునువిని రాక్షసాధిపతియగు రావణాసురుడు కాలచోదితుడై మరలనప్పుడు తననుబుట్టినవానినిగాదలచె. మరియు నాసమయమునందు, త్రిశిరునియొక్కవాక్యమునువిని దేవాంతకనరాంతకులును, తేజోవంతుడగు నతికాయుడును, యుద్ధమునందుహర్షముగలవారైరి. పిమ్మట నారాక్షసోత్తములు యుద్ధమునకునేనునేననిపలికిరి. మరియునాసమయమునందు దేవేంద్రునకు సమానమైన పరాక్రమముగల రావణాసురునిపుత్రులందఱును నంతరిక్షమునందునిలిచి యుద్ధమునకుమేముమేమనిపలికిరి. ఆరావణాసురునిపుత్రులందఱును, మాయావిశారదులును, దేవతలయొక్కమదమును నడపదగినవారును, యుద్ధమునందుజయమునుబొందువారును, మిగులనధికమగు బలముతోగూడినవారును, విశేషమగుకీర్తిగలవారును, నైయుండిరి. మరియు నారావణుని పుత్రులలోనొక్కడును యుద్ధమునందుఅపజయమునుబొందినవారుగారు. మరియు నారాక్షసపుత్రులందఱును దేవతలతోడను, గంధర్వులతోడను, కిన్నరులతోడను, ఉరగులతోడను, ననేకపర్యాయములు యుద్ధమునుజేసిరి. మరియు నారాక్షసపుత్రులందఱును యుద్ధములయందు మిగులసమర్థులు. అందఱును నధికమగు ...నముగలవారు. అందఱునుదేవతలవలన వరములను బొందిరి. అట్టిచిత్రచరిత్రముగలవారును, సూర్యునితోసమానమగుతేజస్సుగలవారును, శత్రువులయొక్కబలమునునశింపజేయువారునునగు పుత్రులతోగూడిన యారావణాసురుడు మిగులగొప్పవారగు రాక్షసులమదమును నడచునట్టిదేవతలతోగూడుకొనినదేవేంద్రుని బోలియుండె. అంతటనారావణాసురుడు మహాసంతోషముగలవాడై భూషణములచేత బుత్రులనందఱను నలంకరింపజేసి మిగులబ్రశస్తములగు వాక్యములచేత నాశీర్వదించి యుద్ధమునకుబోయిరమ్మనియె. యుద్ధమునందు మిగులగోరికగలవారును, మదోన్మత్తులును, తనకుదమ్ములును, నగుమహోదరమహాపార్శ్వులను రావణాసురుడు పుత్రులను రక్షించుటకొఱకునియమించె. అంతటవారందఱును, యుద్ధములయందు శత్రువులనేడ్పించువాడును, మహానుభావుడును నగు రావణాసురునకు నమస్కారమును జేసిరి. పిమ్మట మిగులగొప్పవగు శరీరములుగల యారాక్షసులందఱును రావణాసురునకు బ్రదక్షిణముగాదిరిగిపోయిరి. పిమ్మట నారాక్షసోత్తములందఱును యుద్ధమునందు, కు

తూహలముగలవారై నానావిధములగు నోషధులచేతనునలంకరించుకొని యుద్ధమునకు బయలువెడలిరి. అంతట; త్రిశిరుడు, అతికాయుడు, దేవాంతక నరాంతకులును, మహాపార్శ్వులును, కాలము ముగియుటచేత యుద్ధమునకు బయలువెడలిరి. ఆసమయమునందు మహోదరుడు సుదర్శనమను నామధేయముగలదియును, నల్లనిమేఘముతో సమానమైనదియును, ఐరావతముయొక్క కులమునందుబుట్టినదియును, నానావిధములగు నాయుధములతోగూడినదియును, అంబుల పొదులచేత నలంకరింపబడినదియును, నగు నేనుగుమీదనెక్కి యస్తాద్రియందలి సూర్యునివలెబ్రకాశించుచుండె. మఱియు నాసమయమునందు రావణాసురునకు బుత్రుడగు త్రిశిరుడను రాక్షసోత్తముడు, శ్రేష్ఠములగు గుఱ్ఱములతోగూడుకొనియున్నదియును, నానావిధములైన యాయుధములతోగూడినదియును, నగు రథశ్రేష్ఠమునధిష్ఠించె పిమ్మట, త్రిశిరుడను రాక్షసోత్తముడు ధనుర్ధారుడై రథమునధిష్ఠించి మెఱుపులతోడను, ఉల్కలతోడను, ఇంద్రధనుస్సుతోడను, గూడుకొని సమేఘము పర్వతమునధిష్ఠించినవిధముగ బ్రకాశించుచుండె. మఱియు నాసమయమునందు కిరీటములతోగూడుకొనిన మూడుతలలుగల త్రిశిరుడు రథమునెక్కిన సమయమునందు, సువర్ణమయములగు శిఖరములతోగూడుకొనిన హిమవత్పర్వతమువలె బ్రకాశించుచుండె. పిమ్మట ధనుర్ధారులలో నుత్తముడును, తేజోవంతుడును, రావణాసురునకు బుత్రుడును, నగు నతికాయుడు రథమునధిష్ఠించె. అవ్విధముగ నయ్యతికాయుని చేతనధిష్ఠింపబడినదియును, మంచిచక్రములును, ఇరుసును గలదియును, దివ్యమగు కాణిగలదియును, అంబులపొదుల చేతను, బాణములచేతను, ప్రకాశించుచున్నదియును, ప్రాసములు, ఖడ్గములు, పరిఘలు మొదలుగాగల యాయుధములతోగూడినదియునునైయుండె. అట్టిరథమునందు కిరీటములను ధరించిన యాయతికాయుడధిష్ఠించి యుండుటచేతనారథము మేరుపర్వతముతో సమానముగ బ్రకాశించుచుండె. మఱియు నాసమయమునందు రథమునధిష్ఠించిన వాడును, మహాబలుడును, నగు నాయతికాయుడనేకవేల రాక్షసులతోగూడుకొని దేవతలతోగూడుకొనిన యింద్రునివలె బ్రకాశించుచుండె. ఆసమయమునందు నరాంతకుడను రాక్షసోత్తముడు, ఉచ్చైశ్శ్రవస్సుయొక్క కీర్తివంటి కీర్తిగలదియును, తెల్లనిదేహచ్ఛాయగలదియును, బంగారపుసొమ్ములచేత నలంకరింపబడినదియును, మనోవేగమువంటి వేగముగలదియును, మిగులగొప్పదగు శరీరముగలదియును, నగు గుఱ్ఱమునెక్కె. మఱియు నానరాంతకుడట్టి గుఱ్ఱమునెక్కి యుల్కములతో సమానమగు ప్రాసమను నాయుధమునుధరించినవాడును, కుక్కుటమను వాహనమునెక్కినవాడును, నగు కుమారస్వామివలె బ్రకాశించుచుండె. మఱియు నాసమయమునందు దేవాంతకుడను రాక్షసోత్తముడు వజ్రములచేత నలంకరింపబడిన పరిఘయను నాయుధమును ధరించి పూర్వము సముద్రమథనకాలమునందు మందరపర్వతమును బాహువులచేత ధరించినవిష్ణుదేవునిబోలియుండె. మఱియు నాసమయమునందు వీర్యవంతుడును, గొప్పదగు శరీరముగలవాడును, నగు మహాపార్శ్వుడు గదయనునాయుధమునుధరించినవాడై యుద్ధమునందు గదాపాణియైన కుబేరునివలె బ్రకాశించుచుండె. అప్పుడు మహాత్ములగు నారాక్షసవీరులందరును, ఈడులేనిబలముగల రాక్షససైన్యముతో గూడుకొనినవారై నిరుపమానమగు బలముగల దేవతలతో గూడుకొనిన దేవతలవలె యుద్ధోన్ముఖులై బయలువెడలిరి. ఆసమయమునందు మిగులశ్రేష్ఠములగు నాయుధములను ధరించినవారును, మహానుభావులును, నగు రాక్షసులందఱును, ఏనుగులతోడను, గుఱ్ఱములతోడను, మేఘధ్వనివంటి ధ్వనిగల రథములతోడను, గూడుకొనినవారై దేవతలనుబోలియుండిరి. మఱియును మహానుభావులును, పసివారలును, సూర్యునియొక్క తేజస్సువంటి తేజస్సుగలవారును. కిరీటముగలవారును, నగు నారాక్షసకుమారులందఱును, అధికమగు కాంతితో గూడుకొనినవారై యంతరిక్షమునందలి గ్రహములవలెబ్రకాశించుచుండిరి. మఱియు నారాక్షసవీరులచేత గ్రహింపబడినదియును, తెల్లనిదియును,నగు నాయుధసమూహము శరత్కాలమునందలి మేఘసముదాయము ఆకాశమునందు ఏవిధముగా బ్రకాశించుచుండునో యావిధముగా బ్రకాశించుచుండె. మఱియు నారాక్షసవీరులందఱును యుద్ధమునందు, కుతూహలముగలవారై తమకు మరణము గలిగినగలుగనిమ్మనియును, అపజయము గలిగినను గలుగనిమ్మనియును, నిశ్చయించుకొనిరి, అంతట నారాక్షసులందఱును గర్జించిరి. అధికముగా ధ్వనిజేసిరి. ఆయుధములను విసరుచుండిరి. పిమ్మట నందఱును యుద్ధమునందధికమగు కుతూహలముగలవారగుచు బయలువెడలిరి. ఆసమయమునందు రాక్షస సైన్యముయొక్క పాదఘట్టనలచేత భూమియంతయును గడగడవణకె. రాక్షసులయొక్కసింహనాదములచేత, అంతరిక్షముబ్రద్దలయ్యె. అవ్విధముగ మహాబలులగు నారాక్షసోత్తములందఱును బయలువెడలినవారై పర్వతములను, చెట్లను, ఆయుధములుగాధరించిన వానరసైన్యమునుజూచిరి. ఆసమయమునందు మహాత్ములగు వాన

రవీరులందఱును, రాక్షసబలమును సర్వమునుజూచిరి. అప్పుడు ఆ రాక్షససైన్యమంతయును, ఏనుగులు, గుఱ్ఱములు, మొదలగువానియొక్క సమ్మర్దముగలదియును, అనేకముల గుచిరుగంటలయొక్క ధ్వనితోగూడుకొనినదియును, నల్లని మేఘములతో సమానమైనదియును, గొప్పవగు నాయుధములను ధరించినదియును, ప్రజ్వలించుచున్న యగ్నిహోత్రముతోడను, సూర్యునితోడను, సమానులగు రాక్షసులతోగూడుకొనినదియును, నైయుండె. అట్టిసైన్యము సర్వమును యుద్ధసన్నద్ధమై వచ్చుటనుజూచి యధికమగుపరాక్రమముగల వానరవీరులందఱును మిగుల గొప్పవగు పర్వతములను, వృక్షములను, ఆయుధములనుగా ధరించి రాక్షసులయొక్క సంతోషధ్వనులను సహింపజాలక యధికముగా సింహనాదములు జేసిరి. అప్పుడు మహాబలులగురాక్షసులందఱును వానరులయొక్క సింహనాదధ్వనులనువిని సహింపక యావానరులకంటె నధికముగ సింహనాదములను జేసిరి. ఆసమయమునందు వానరవీరులందఱును మిగుల భయంకరమగు రాక్షససైన్యమునందుప్రవేశించిరి. పిమ్మట యుద్ధముకొఱకెత్తబడిన యాయుధములచేత శిఖరములుగల పర్వతములవలె ప్రకాశించుచుండిరి. మఱియు నాసమయమునందు గొందఱువానరులుఅంతరిక్షమునకెగిరిరి. కొందఱు వానరులు భూమియందే గంతులువైచుచుండిరి. మఱి కొందఱు వానరులు వృక్షములను, పర్వతములను నాయుధములుగాధరించినవారును, అధికమగు కోపముగలవారును, నై యారాక్షససైన్యమునందు ప్రవేశించి యథేచ్ఛముగాసంచరించుచుండిరి. మఱియు నావానరులందఱును, మిగుల పెద్దవగు కొమ్మలుగల వృక్షములను, ఆయుధములనుగాగ్రహించి యుద్ధమునకుద్యమించిరి. అంతట రాక్షసులకును, వానరులకును, మిగులభయంకరమగు యుద్ధమయ్యె. ఆసమయమునందు వానరులు, వృక్షములయొక్కయు, రాళ్ళయొక్కయు, పర్వతములయొక్కయు, వర్షమునుగురిపించిరి. అప్పుడు భయంకరమైన పరాక్రమముగల వానరులందఱును, రాక్షసులయొక్క బాణసముదాయముచేత ననేకవిధముల నివారింపబడిరి. ఆయుద్ధమునందు వానరులును, రాక్షసులును, సింహనాదములనుజేసిరి. అప్పుడు వానరులు రాళ్ళచేత రాక్షసులను జూర్ణముగాజేసిరి. మఱియు నావానరులధికమగు కోపముగలవారై కవచములచేతను, ఆభరణములచేతను, అలంకరించిన రాక్షసులను మర్దించిరి. ఆసమయమునందు, కొందఱు వానరులు రథమునందున్న రాక్షసులను, పీఠులను, ఏనుగులమీదను, గుఱ్ఱముమీదను, ఎక్కియున్న రాక్షసులను సంహరించిరి. అప్పుడుగొందఱు వానరులు రాళ్ళచేతను, పిడికిళ్ళచేతను రాక్షసులయొక్క గ్రుడ్లువెడలబెట్టి మరణమునుబొందించిరి. అప్పుడు కొందఱు రాక్షసులు నిలువజాలక పరుగెత్తిరి. కొందఱు రాక్షసులు పరాక్రమించి సింహనాదములనుజేసిరి. ఆసమయమునందు రాక్షసులు గోపోద్దీపితులై తీక్ష్ణములగు బాణములచేతను, శూలములచేతను, ముద్గరములచేతను, ఖడ్గములచేతను, ప్రాసములను నాయుధములచేతను, శక్తులను నాయుధములచేతను, వానరోత్తములనువధించిరి. మఱియు నాసమయమునందొకరినొకరు జయింపవలయునని మెండు కోరికగలవారును, నెత్తురుచేత, ఎఱ్ఱగాజేయబడిన శరీరముగలవారును, నై యొకరినొకరు పడవైచుకొనిరి. పిమ్మట వానరులును, రాక్షసులును, నానావిధములగు శిలలయొక్కయు, ఖడ్గములయొక్కయు, వర్షమునుగురిపించిరి. అప్పుడు క్షణమాత్రములో భూమియంతయును, నెత్తురుచేత దడపబడినదయ్యె. మఱియు నాసమయమునందు యుద్ధమునందు ప్రేమగలవారును, పర్వతములయొక్కయాకారములవంటి యాకారముగలవారును,శత్రువులనుమర్దించుటయందు దగినసామర్థ్యముగలవారును, నగు రాక్షసులచేత భూమియంతయునునిండె. మఱియు నాసమయమునందు వానరులు పాదములచేత వానరులదన్నుచుండిరి. మఱియుపాదములచేత,ఎగురదన్నుచుండిరి.ఇవ్విధముగమిగుల భయంకరమగు యుద్ధమును జేసిరి. అంతట రాక్షసులందఱును, గోపోద్దీపితులై వానరులచేత వానరులను జంపుచుండిరి. అప్పుడు వానరులును గోపోద్దీపితులై రాక్షసులను రాక్షసులచేత సంహరించిరి. అంతట రాక్షసులు పర్వతములనెత్తి వానరుల శిరస్సులమీద ప్రయోగించిచంపిరి. అప్పుడు వానరులు రాక్షసులయొక్క యాయుధములను గ్రహించి యాయుధములచేత రాక్షసులను సంహరించుచుండిరి. అప్పుడు రాక్షసులును, వానరులును, పరస్పరమును నాయుధములచేతను, పర్వతములచేతను గొట్టుకొనిచచ్చిరి. మఱియు నాసమయమునందు వానరులును, రాక్షసులును, సింహనాదములనుజేసిరి. మఱియు నాసమయమునందు వానరులు, రాక్షసులయొక్క కవచములనుచించిచంపిరి. అప్పుడు రాక్షసుల శరీరమునుండి రక్తము వృక్షములనుండి నిర్యాసము (బంక) బయలువెడలినవిధముగ బయలువెడలుచుండె. మఱియు నాసమయమునందు, వానరులు రథముచేత రథమును, ఏనుగుచేత నేనుగును, గుఱ్ఱముచేతగుఱ్ఱమును, వధించిరి. మఱియునప్పుడు వానరులందఱును మిగుల సంతోషముగలవారును, గ్రహింపబడినపర్వతములుగలవారునునై రాక్షసులను, నానావిధములగు

వృక్షములచేతగొట్టిరి. అప్పుడు వానరులకును, రాక్షసుల
కును మిగులసంకులమగుయుద్ధమయ్యె. ఆసమయమునందు
రాక్షసులందఱును, క్షురప్రములను నాయుధములచేతను,
అర్ధచంద్రాకారములగు బాణములచేతను, మిగులదీక్ష్ణము
లగు బాణములచేతను, వానరోత్తములయొక్క వృక్షము
లను, రాళ్ళను, ఛేదించిరి. ఆసమయమునందు యుద్ధభూ
మియంతయును, క్రిందబడియున్న పర్వతాగ్రములచేతను,
ఛేదింపబడియున్నవృక్షములచేతను, చంపబడియున్న వా
నరరాక్షసులచేతను, ప్రవేశింపవలవిగానిదైయుండె.

అప్పుడు వానరులందఱును, గర్వముతోడను, సంతోష
ముతోడను, గూడుకొనినచేష్టలుగలవారగుచు మిగులభ
యంకరమగు యుద్ధభూమియందుప్రవేశించి నానావిధ
ములగు నాయుధములనుధరించినవారును, అధికమగుబల
ముగలవారునునగుచు రాక్షసులతోగూడ మిగులభయంక
రమగు యుద్ధమును జేసిరి. అట్టిసంకులసమరమునందు, వా
నరులుసంతోషించుటను, రాక్షసులుమృతులై క్రిందబడుట
నుజూచి యాకాశమునందలి దేవతలందఱును నధికముగా
సంతోషమునుబొందిరి. అప్పుడు నరాంతకుడను రాక్షసో
త్తముడువాయువేగమువంటి వేగముగలగుఱ్ఱమునెక్కి మి
గులదీక్ష్ణమగుశక్తియనునాయుధమునుధరించినవాడై యా
వానరసైన్యమునందు, మిగులపెద్దదగు సముద్రమునందు
మీనముప్రవేశించినవిధముగ బ్రవేశించె. అంతటనానరాం
తకుడధికముగా బ్రకాశించుచున్న ప్రాసమనునాయుధ
ముచేత నేడునూరులవానరులను ఛేదించె. ఇవ్విధముగనిం
ద్రునకుశత్రుండగు నానరాంతకుడొక్కడే వానరసైన్యము
నుసర్వమునువధించె. అప్పుడుగుఱ్ఱముమీదనెక్కి వానరసై
న్యమునందు సంచరించుచున్నవాడును, మహానుభావుడు
ను, నగు నరాంతకునివిద్యాధరులును, మహర్షులునుజూచి
మిగులనాశ్చర్యమునుబొందిరి. మఱియు నాసమయమునం
దా నరాంతకునియొక్కమార్గము మాంసముచేతను, నెత్తు
రుచేతను, బురదగలదైయుండె. మఱియు నానరాంతకు
డు పర్వతాకారముగలవానరులచేతజుట్టబడియుండె. వా
నరులందఱును నొక్కటిగా జేరి విక్రమించుటకాలోచించు
నంతలోనరాంతకుడు వానరసైన్యమునందుబ్రవేశించి వా
నరసైన్యమును సర్వమునువధించె. మఱియు నాసమయ
మునందు నరాంతకుడు మిగులనధికముగా బ్రకాశించుచు
న్నప్రాసమను నాయుధమునుధరించి యుద్ధభూమియం
దు, వనమునందుసంచరించుచున్న యగ్నిహోత్రునివలె
సంచరించుచు వానరసైన్యమును సర్వమునుదహింపజేసె.
మఱియు వానరవీరులందఱును పర్వతములను, చెట్లనుపె
ల్లగించుకొని యాయాయుధములనుగాధరించి యుద్ధమునకువ
చ్చునంతలోపల వానరులందఱును, వజ్రాయుధముచేత
ఛేదింపబడినపర్వతములు క్రిందబడినవిధముగాబడిరి. మ
ఱియు నానరాంతకుడు వర్షాకాలమునందలి వాయువువ
లెసకలదిక్కులయందును సంచరించుచు నాయుద్ధభూమి
యందలి వానరులననేకులసంహరించె. ఆసమయమునందు
వానరులుభయమువలన బరుగెత్తిపోవుటకును, నిలుచుటకు
ను, కదలుటకును, గూడశక్తిలేనివారైయుండిరి. అంతట
వీర్యవంతుడగు నరాంతకుడు, ఎగురుచును, గంతులువే
యుచును, మఱియు ననేకవిధములసంచరించుచును వాన
రసైన్యమును సర్వమునువధించె. అప్పుడుసూర్యునియొక్క
తేజస్సువంటి తేజస్సుగలవాడును, యమునితోసమానుడు
ను, నగు నరాంతకుడొక్కడే వానరులననేకులనుసంహ
రించె. అట్లు నరాంతకునిచేత సంహరింపబడిన వానరులం
దఱునుగ్రిందబడిరి. మఱియు నాసమయమునందు వాన
రులందఱును వజ్రాయుధముతోసమానమగు ప్రాసమను
నాయుధముయొక్కదెబ్బనుసహింపజాలక మిగులభయం
కరమగు కూతనుబెట్టిరి. అట్లు నరాంతకునియాయుధము
చేత జంపబడినవానరులందఱును దేవేన్ద్రునిచేతగొట్టబడిన
పర్వతములవలెగ్రిందబడిరి. ఆసమయమున నంతకుముం
దుకుంభకర్ణునిచేత జేయబడినయుద్ధమునందతనియాయుధ
ముచేతగొట్టబడి మూర్ఛనొందినవానరులందఱును మూర్ఛ
నుండి తేరినవారై సుగ్రీవునొద్దకుబోయిరి. అప్పుడుసుగ్రీవు
డు, నరాంతకునివలనభయముచేత బరుగెత్తుకొనిపోవుచు
న్నవానరసైన్యమును, జూచె. మఱియు వానరసైన్యమును
దఱుముచున్ననరాంతకునిజూచె. ఆసమయమునందా న
రాంతకుడుగుఱ్ఱమునధిష్ఠించి వానరసైన్యమును సర్వమును
భయపెట్టుచుండె. అట్టినరాంతకునిజూచి సుగ్రీవుడుఆశ్చ
ర్యమునుబొందుచు దేవేన్ద్రునియొక్క పరాక్రమమువంటి
పరాక్రమముగలవాడును, వీరుడును, నగు నంగదునిబిలిచి
యిట్లనియె.

నాయనా! అంగదా! వీరుడవగు నీవుయుద్ధమునకుబో
మ్ము. పోయిగుఱ్ఱముమీదనెక్కి వానరసైన్యమును సర్వము
నుభయపరచుచున్న నరాంతకునిసంహరింపుమనియె. అ
వ్విధముగా వానరాధిపతియగుసుగ్రీవుడుచెప్పినవాక్యము
నువిని యంగదుడుపరమసంతోషముగలవాడై మేఘమధ్య
మునుండి సూర్యుడుబయలువెడలివచ్చినవిధముగా వానర
సైన్యమధ్యమునుండి బయలువెడలె. పర్వతములయొక్కసము
దాయముతోసమానుడును, వానరులలోనుత్తముడును, న
గు నంగదుడుధాతువులతోగూడినపర్వతమువలె బ్రకాశిం

చుచుండెను. ఆసమయమునందు, ఆయుధములేనివాడును, గొప్పదగు తేజస్సుగలవాడును, గోళ్ళును, పన్నులును, ఆయుధములుగాఁగలవాడును, వాలికిబుత్రుడును, నగు నంగదుడు నరాంతకునిసమీపమునకువచ్చి యిట్లనియె.

ఓరీ! వానరాధమా! నీవుపారిపోక నిలిచియుండుము. సామాన్యులగు నీవానరులతో నేమిప్రయోజనముగలదు. ఏమియును లేదు. కావున నో రాక్షసోత్తమా! వజ్రాయుధముతో సమానమగు ప్రాసమను నాయుధమును నా వక్షస్థలమునందు బ్రయోగింపుమనియె. ఆవచనమును విని నరాంతకుడధికముగ కోపముగలవాడై పెదవులకొరికి సర్పమువలెనిట్టూర్పులను విడుచుచు నంగదునిసమీపమునకుబోయి మిగులనధికముగా బ్రకాశించుచున్న ప్రాసమను నాయుధమును బ్రయోగించె. అట్లు నరాంతకునిచేత నంగదునియొక్క వక్షస్థలమునందు బ్రయోగింపబడిన ప్రాసమను నాయుధము తుత్తునకలయ్యె. అప్పుడు గరుత్మంతునిచేత ఛేదింపబడిన సర్పముతో సమానముగ నాఖడ్గము తునుకలైనపిమ్మట నంగదుడు పరమసంతోషముగలవాడయ్యె. అంతట నయ్యంగదుడు కోపోద్దీపితుడై యానరాంతకునియొక్క శిరస్సు బ్రద్దలగునట్లు గుద్దె. అప్పుడు గుఱ్ఱము విరిగిపోయిన దౌడలును, బ్రద్దలైనకనుగ్రుడ్లును, బయలునకు వెడలుకొనివచ్చినజిహ్వగలదియును, పర్వతముతో సమానమైనదియును, బ్రద్దలైనశిరస్సుగలదియునునై క్రిందబడియె. అవ్విధముగ నంగదునిచేత జంపబడిన గుఱ్ఱమును జూచి నరాంతకుడు అధికమగు కోపమును బొందెను. అటు కోపోద్దీపితుడును, మిగుల పెద్దదగు ప్రభావముగలవాడును, నగుచు వాలిపుత్రునియొక్క తలకాయమీద నొక్కగుద్దును గుద్దె. అప్పుడంగదుని తలకాయనుండి యధికముగా నెత్తురు స్రవించె. అంతటనయ్యంగదుడు మోహమును జెందె. అంతగొంతసేపటికి దెలివొంది యత్యాశ్చర్యమును బొందెను. అంతట నంగదుడు వజ్రాయుధముయొక్క వేగమువంటి వేగముగలదియును, పర్వతశిఖరముతో సమానమైనదియును, నగు పిడికిలిని గిరగిర ద్రిప్పి నరాంతకునియొక్క ఱొమ్మున నొక్కగుద్దును గుద్దె. అవ్విధముగ నంగదుని పిడికిలిచేత బ్రద్దలైన వక్షస్థలముగలవాడును, స్రవించుచున్న నెత్తురుచేత వ్యాప్తమైనశరీరముగలవాడును, నగు నానరాంతకుడు వజ్రముచేత ఛేదింపబడినపర్వతమువలె గ్రిందబడియె. ఆసమయమునందు ఆకాశమున సంచరించుచున్న దేవతలయొక్కయు, యుద్ధభూమియందు సంచరించుచున్న వానరులయొక్కయు, సంతోషసూచకమగు మహాధ్వనియొక్కటిగలిగె. మఱియు నాసమయమునందు వానరోత్తముడగు నంగదునిచేత నరాంతకుడు చంపబడుటవలన నెల్లవారును మహానందమును బొందిరి. అప్పుడు, అధికములగు వీర్యపరాక్రమములుగలవాడును, యుద్ధమునందధికమగు సంతోషముగలవాడునునగు యంగదుడు రాముని మనస్సునకు సంతోషమును గలుగజేయునట్టిదియును, దుష్కరమైనదియును నగు కర్మను చేసి తనపరాక్రమమును గుఱించి సంతోషాశ్చర్యములను బొందె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి యరువదితొమ్మిదవ సర్గము ముగిసెను.

అంగదుడు దేవాంతక త్రిశిర మహోదరులను రాక్షసులతో యుద్ధము చేయుట.

అవ్విధముగ నంగదునిచేత జంపబడిన నరాంతకుని జూచి రాక్షసోత్తములందఱును నధికముగా వ్యసనమును బొందిరి. అప్పుడు దేవాంతకుడును, త్రిశిరుడును, పౌలస్త్యనిపుత్రుడగు మహోదరుడును, అధికముగా వ్యసనమును బొందిరి. అప్పుడు వీర్యవంతుడగు మహోదరుడు మేఘమువంటి యేనుగు నెక్కి గొప్పదగు పరాక్రమముగల యంగదునకభిముఖముగా బరుగెత్తె. మఱియు నాసమయమునందు, అన్నయగు నరాంతకునియొక్క మరణమువలన నధికమగు వ్యసనముగలవాడును, బలముగలవాడును, నగు దేవాంతకుడుగూడ మహోదరునివలెనే క్రోధోద్దీపితుడై పరిఘయనునాయుధమును గ్రహించి యంగదునకభిముఖముగా బరుగెత్తె. మఱియు నాసమయమునందు వీరుడగు త్రిశిరుడుగూడ సర్వోత్తములగు గుఱ్ఱములను బూన్చిన రథమునెక్కి వాలిపుత్రుడగు నంగదునిగుఱించి పరుగెత్తె. అవ్విధముగ రాక్షసోత్తములగు ముగ్గురును దనమీదికి యుద్ధమును జేయవలయునని యెడు గోరికగలవారై వచ్చుటను జూచి యంగదుడు మిగుల గొప్పదగు వృక్షము నొక్కదాని బెల్లగించె. అంతటనయ్యంగదుడు మిగుల గొప్పవగు కొమ్మలుగలదియును, వజ్రాయుధముతో సమానమైనదియును, నగు నావృక్షమును దేవాంతకునిమీద బ్రయోగించె. అప్పుడు త్రిశిరుడు కోపోద్దీపితుడై సర్పములతో సమానములగు బాణములచేత, ఆవృక్షమును ఛేదించె. అట్లు వృక్షము ఛేదింపబడుటను జూచి యంగదుడెగిరె. అట్లెగిరిపోయి వానరోత్తముడగు నంగదుడు వృక్షములయొక్కయు, రాళ్ళయొక్కయు వర్షమును గురిపించె. ఆవర్షమును సర్వమును త్రిశిరుడు తీక్ష్ణములగు బాణములచేత ఖండించె. మఱియు నాసమయమునందు దేవాంతకుడుగూడ పరిఘయొక్క కొనచేత నావృక్షములనన్నింటిని విఱిచె. అప్పుడు త్రిశిరుడు మిగుల

దీక్ష్ణములగుబాణములను బ్రయోగింప దలచి యంగదునిమీదకిబరుగెత్తె. మఱియు నాసమయమునందు, ఏనుగునెక్కియున్నమహోదరుడు అంగదునిమీదికి బరుగెత్తుకొనివచ్చి వజ్రాయుధముతో సమానములైనవియును, మిగుల దీక్ష్ణములైనవియును, నగు బాణములచేత నంగదునియొక్క వక్షస్థలమును బ్రద్దలగునట్లుకొట్టె. అప్పుడు వేగవంతుడగు నంగదుడుగూడ కోపోద్దీపితుడై పరిఘయను నాయుధమును నంగదునిమీదబ్రయోగించె. అట్లుముప్వురగు రాక్షసోత్తములచేతనొక్కమాటుగా గొట్టబడియును, వాలిపుత్రుడును, ప్రతాపవంతుడును, నగునంగదుడు, కొంచెమైనను, భయమునుబొందకపోయె. అంతట నధికమగువేగము గలవాడును, శత్రువులచేతజయింపనలవిగానివాడును, నగునంగదుడు మిగులగొప్పదగు వేగము నవలంబించిపోయి యామహోదరుని యేనుగుయొక్క ముఖము పగులునట్లు ముఖముమీదగొట్టె. ఆదెబ్బచేత, ఏనుగుయొక్క నేత్రములూడిక్రిందబడియె. అంతటనయ్యేనుగు తాళజాలక యధికముగాఘీంకారముజేసె. అంతట మహాబలుడును, వాలికిబుత్రుడును, నగు నాయంగదుడు ఆయేనుగుయొక్క దంతములనుపెరికి యాదంతములచేత దేవాంతకుని మర్దించె. ఆదెబ్బకు దాళజాలక యాదేవాంతకుడు శిథిలమైన యవయవములుగలవాడై "గాలిదెబ్బకుదాళలేనిచెట్టువలె" గ్రిందబడె. అప్పుడతనిశరీరమునుండి లత్తుకయొక్క రసముతో సమానమగునెత్తురును స్రవించె. అంతట గొంతసేపటికి, మిగులగొప్పదగు తేజస్సుగలవాడును, బలవంతుడును, నగు దేవాంతకుడు తేరుకొని తనచేతనున్న పరిఘయనునాయుధమునుగిరగిరద్రిప్పి యంగదునిమీద బ్రయోగించె. అట్లుపరిఘయను నాయుధముచేత గొట్టబడిన యంగదుడు మోకాళ్ళనుబట్టుకొని క్రిందబడిమరల గొంచెముసేపులోలేచె. అట్లులేచుచున్నసమయమునందు త్రిశిరుడను రాక్షసోత్తముడు మిగులదీక్ష్ణములగు మూడుబాణములచేత నంగదునియొక్క ముఖమును బ్రద్దలుసేసె. అట్లుముప్వురురాక్షసోత్తములును నొక్కటిగాజేరి యంగదుని కొట్టడమునుచూచి హనుమంతుడును, నీలుడునుబయలువెడలిరి. అంతటనీలుడనువానరోత్తముడు గోపోద్దీపితుడైయొక్కపర్వతమును త్రిశిరునిమీదబ్రయోగించె. అప్పుడాపర్వతమును, రావణాసురునకు బుత్రుడగు త్రిశిరుడు మిగులదీక్ష్ణములగు బాణములచేత భేదించె. అవ్విధముగ ననేకనూములబాణములచేత భేదింపబడినయాపర్వతము బ్రద్దలై విస్ఫులింగములతోగూడబోయి యొకపర్వతముమీదబడియె. ఆసమయమునందుయుద్ధరంగమునందు విజృంభించిన హనుమంతునిజూచి దేవాంతకుడు గోపోద్దీపితుడై పరిఘయను నాయుధమునుగిరగిరద్రిప్పుచు నాహనుమంతునిమీదికి బరుగెత్తుకొనివచ్చె. అట్లు తనమీదికివచ్చుచున్న దేవాంతకునిజూచి వాయుదేవునకు బుత్రుడగు హనుమంతు డొకయెగురెగిరివజ్రాయుధముతో సమానమగు పిడికిలిచేత నాదేవాంతకునిశిరస్సుబ్రద్దలగునట్లుగుద్దె. అవ్విధముగ నతనిశిరస్సుమీదగుద్దునవుడు ఆహనుమంతుడు భూమియంతయును వణకునట్లరచె. అట్లు పిడికిటిపోటుచేత బ్రద్దలైన శిరస్సుగల దేవాంతకుడు బయలునకువచ్చిన నేత్రములును, దంతములును, నాలుకయునుగలవాడగుచు గ్రిందబడి ప్రాణహీనుడయ్యె. అట్లురాక్షసయోధులలో ముఖ్యుడును, మహాబలముగలవాడును, దేవతలకు శత్రువును, నగు దేవాంతకుడు మరణమునుబొందుటనుజూచి త్రిశిరుడను రాక్షసోత్తముడు కోపోద్దీపితుడైనీలునియొక్కఱొమ్మునందు బాణవర్షమునుగురిపించె. అంతట మహోదరుడుగూడ నధికమగు కోపముగలవాడై సూర్యుడుమందరపర్వతముమీద నెక్కినవిధముగా బర్వతముతో సమానమగు మఱియొకయేనుగునెక్కె. అవ్విధముగ నేనుగునెక్కియున్న మహోదరుడు మెరుపులతోడను, ఇంద్రధనుస్సుతోడనుగూడుకొనిన మేఘము పర్వతముమీద వర్షించువిధముగా నీలునియొక్క ఱొమ్మునందు బాణవర్షమునుగురిపించె. అట్టి బాణవర్షమునందు మునిగియున్ననీలుడను వానరోత్తముడు కలుషమైన సకలావయవములును గలవాడై మహాబలుడగు నామహోదరునిచేత నటునిటుకదలుటకు వీలులేనట్లు చేయబడియె. అంతటగొంతసేపటికి ఆనీలుడు తెలివిని దెచ్చుకొని వృక్షసముదాయమును పెల్లగించుకొని యాచెట్లచేత నామహోదరుని శిరస్సు బ్రద్దలగునట్లుకొట్టె. అంతట నూరకుండకమరియొకపర్వతమును బట్టికొనివచ్చి యామహోదరుని నేనుగుతోగూడమర్దించె. ఆదెబ్బకుదాళజాలక మహోదరుడుక్రిందబడి మరణమునుబొందె. అట్లునీలునిచేత దనపిన్నతండ్రియగు మహోదరుడు చంపబడుటను జూచి త్రిశిరుడు గోపోద్దీపితుడై ధనుస్సును గ్రహించె. పిమ్మట నాత్రిశిరుడు కోపోద్దీపితుడైమిగులదీక్ష్ణములగు బాణములను హనుమంతునిమీద బ్రయోగించె. అంతట హనుమంతుడును గోపోద్దీపితుడై పర్వతముయొక్క శిఖరము నొక్కదానినాత్రిశిరునిమీద బ్రయోగించె. అప్పుడు బలవంతుడగు త్రిశిరుడు మిగుల దీక్ష్ణములగు బాణములచేత నాపర్వతశిఖరమును భేదించె. అట్లుతనచేత బ్రయోగింపబడిన పర్వతశిఖరమువ్యర్థమగుటనుజూచి వానరోత్తముడగు హనుమంతుడు మిగులగొప్పదగు వృక్షవర్షమును గురిపించె.

అట్లుతనమీదికివచ్చుచున్న వృక్షవర్షమునుజూచి ప్రతాపవంతుడగు త్రిశిరుడు మిగులతీక్ష్ణములగు బాణములచేతనా వృక్షవర్షమును ఛేదించిసింహనాదమునుజేసె. అంతటహనుమంతుడు క్రోధోద్దీపితుడైయెగిరి యాత్రిశిరునియొక్క గుఱ్ఱమును "గోళ్ళచేతసింహమేనుగును ఛేదించిన విధముగ" ఛేదించెను. అంతటరావణాసురునకు బుత్రుడగు త్రిశిరుడు యమునివలె కాళరాత్రితోసమానుడగు శక్తియనునాయుధమునుగ్రహించి హనుమంతునిమీద బ్రయోగించె. అట్లు త్రిశిరునిచేత బ్రయోగింపబడినదియును, అంతరిక్షమునుండి జారిపడుచున్నయుల్కతో సమానమైనదియును, నగు నాశక్తియను నాయుధమునుగ్రహించి హనుమంతుడు దానినివిఱిచి యతిభయంకరమగు సింహనాదమునుజేసె. అట్లుహనుమంతునిచేత మిగుల భయంకరమగు నాయుధమువిరవబడుటనుజూచి వానరులందఱును నధికసంతోషముగలవారైసింహనాదములనుజేసిరి. అంతట రాక్షసోత్తముడగు త్రిశిరుడు ఖడ్గమను నాయుధమును గ్రహించి హనుమంతునియొక్క మిగుల విశాలమగువక్షస్స్థలమునందు బ్రయోగించె. అట్లుహనుమంతుడు ఖడ్గముచేత గొట్టబడుటవలననధికమగు కోపముగలవాడై హస్తతలముచేత త్రిశిరునిమర్దించె. అట్లుహనుమంతునిచేత గొట్టబడిన యాత్రిశిరుడు తాళజాలక చేతిలోనుండు నాయుధములను దిగవిడిచి క్రిందబడి తెలివిదప్పినవాడయ్యె. అవ్విధముగ గ్రిందబడుచున్నసమయమునందతనిచేతనున్న ఖడ్గమును గ్రహించిహనుమంతుడు సింహనాదమును జేసె. ఆసింహనాదమునువిని ఖడ్గధారియైయున్న హనుమంతునిజూచి రాక్షసులందఱును మిగులభయమును జెందిరి. ఆసింహనాదమును సహింపజాలకకొంతసేపటికిలేచి హనుమంతునిబిడికిటబొడిచె. అట్లు త్రిశిరుడు పిడికిటబొడుచుటచేత హనుమంతుడు మునుపటికంటెనధికమగుకోపముగలవాడై యారాక్షసోత్తముని కిరీటములనపహరించె. పిమ్మటదనచేతనున్నఖడ్గముచేతగుండలములచేత బ్రకాశించుచున్న యాత్రిశిరునియొక్క శిరస్సును దేవేంద్రుడువృత్రాసురునియొక్క శిరస్సులను ఖండించినవిధముగఖండించె. అప్పుడుమిగులవిశాలములగు నేత్రములుగలవియును, పర్వతములతోసమానములైనవియును, మిగులనధికముగా బ్రకాశించుచున్న వైశ్వానరుడను త్వష్టృపుత్రునినేత్రములతో సమానముగ నున్నవియును, నగు నాత్రిశిరుని తలకాయలుమూడును నంతరిక్షమునుండి మూడునక్షత్రములు క్రిందబడిన విధముగ బడియె. అట్లు, మూడుశిరస్సులుగలవాడును, దేవతలకు శత్రుడునునగు త్రిశిరుడనురాక్షసోత్తముడు దేవేంద్రునియొక్క పరాక్రమమువంటిపరాక్రమముగల హనుమంతునిచేతజంపబడగానే వానరులందఱునుసంతోషముచేత సింహనాదములనుజేసిరి. భూమియంతయునుగడగడవణకె. రాక్షసులందఱును భయముచేతనలుదిక్కులకును బరుగిడిరి. అవ్విధముగ త్రిశిరుడును, మహోదరుడును, మహాబలవంతులగు దేవాంతకనరాంతకులును, మరణమునుబొందుటను గనుగొని మహాపార్శ్వుడనుపేరుగల రాక్షసోత్తముడు అపరిమితమగుకోపముగలవాడై ప్రజ్వలించుచున్నదియును, మిగుల భయంకరమైనదియును, నగుగదయను నాయుధమును గ్రహించె. ఆగదబంగారుపట్టచేత నలంకరింప బడినదియును, మాంసముచేతను, నెత్తురుచేతను, వ్యాప్తమైనదియును, శత్రువులయొక్క నెత్తురుచేతమిగులమనోహరముగా బ్రకాశించుచున్నదియును, అధికమైనతేజస్సుచేత బ్రకాశించుచున్నదియును, ఎఱ్ఱనిమాలికలచేత నలంకరింపబడినదియును, ఐరావతము, మహాపద్మము, సార్వభౌమముమొదలుగాగల దిగ్గజములకుగూడ భయమును గలుగజేయునదియును, నైయుండె. అట్టిగదను గ్రహించిరాక్షసోత్తముడగు మహాపార్శ్వుడు ప్రళయకాలాగ్నివలె మండిపడుచు వానరులమీద గవిసె.

అంతట వృషభుడనునామధేయముగల వానరోత్తముడు రావణునకుదమ్ముడగు మహాపార్శ్వున కభిముఖముగా యుద్ధసన్నద్ధుడైనిలిచె. అట్లు పర్వతముతోసమానుడును, తనకభిముఖముగానున్నవాడును, నగు వానరోత్తమునిజూచి యారాక్షసోత్తముడుగోపోద్దీపితుడై యతనిఱొమ్ము పగులునట్లుగదతోగొట్టె. అవ్విధముగ గదచేతగొట్టబడిన ఋషభుడను వానరోత్తమునియొక్కఱొమ్మునుండి యధికముగానెత్తురుస్రవించుచుండె. అంతట గొంతసేపటి కా ఋషభుడను వానరోత్తముడు తేరుకొనియతివేగముగ బరుగెత్తుకొనిపోయి మహానుభావుడగుమహాపార్శ్వునియొక్క చేతనున్నగదయనునాయుధమునులాగికొనిగిరగిరద్రిప్పి మహానుభావుడగు నారాక్షసునియొక్క శిరస్సుబ్రద్దలగునట్లు గొట్టె. అట్లుగదచేతగొట్టబడినయామహాపార్శ్వుడు గ్రుడ్లనువెడలబెట్టి వజ్రాయుధముచేత గొట్టబడినపర్వతమువలెక్రిందబడియె. అట్లుగ్రుడ్లనువెడలబెట్టుకొని భూమియందుబడి ప్రాణహీనుడైన మహాపార్శ్వుడనురాక్షసోత్తమునిజూచి యతనిసైన్యమంతయునునిలువజాలక భీతిచేతనలుదిక్కులకునుబరుగెత్తె. మఱియునవ్విధముగా నారాక్షసోత్తముడుచంపబడగానే సముద్రముతోసమానమగు రాక్షససైన్యమంతయును, నాయుధములను గ్రిందబడవైచి ప్రళయకాలమునందలి సముద్రమువలెహద్దులేనిదై నలుది

కక్కులకు బరుగెత్తె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి డెబ్బదవసర్గము గిసెను

అతికాయుడను రాక్షసుడు వానరులతో యుద్ధము జేయుట.

అట్లు రాక్షసబలమంతయును మిగులభయమును జెంది నలుదిక్కులకును బరుగిడిపోవుటను, దేవేన్ద్రునియొక్క పరాక్రమమువంటి పరాక్రమముగలతమ్ములందఱును మరణమునుబొందుటను, పిన్నతండ్రులిరువురును జచ్చిపోవుటను, రాక్షసోత్తములగు మహోదరమహాపార్శ్వులు హతులగుటను, జూచియధికమగుతేజస్సుగలవాడును, యుద్ధములయందుదుర్జయుడగునట్లుగా బ్రహ్మదేవునివలన వరములనుబొందినవాడును, దేవతలయొక్కయు, దానవులయొక్కయు, మదమునునణచువాడును, నగు నతికాయుడను రాక్షసోత్తముడు మిగులగోపముగలవాడయ్యె. పిమ్మటవేయిసూర్యులయొక్క కాంతివంటికాంతిగలదియును, మిగులమనోహరమైనదియును, నగు రథమునెక్కి దేవేన్ద్రునియొక్కపరాక్రమమువంటి పరాక్రమముగల యాయతికాయుడువానరులనందఱునుదరిమె. పిమ్మట ధనుష్టంకారమును జేయుచు గిరీటముచేతను, కుండలములచేతను నలంకరింపబడిన యాయతికాయుడు సింహనాదమునుజేసి తనపేరతికాయుడని యెల్లవారునువినునట్లుబలికె. అప్పుడతనినామధేయమును, సింహనాదమును, ధనుష్టంకారమునువిని వానరులందఱును మిగులభయమునుబొందిరి. మఱియు నావానరులందఱును, ఆయతికాయునియొక్క దేహమాహాత్మ్యమునుజూచి మరలగుంభకర్ణుడు లేచివచ్చెనను తలంపుగలవారై వానరులందఱును మిగులభయముతోనలుదిక్కులకునుబరుగెత్తిరి. ఆసమయమునందుఅయతికాయునియొక్కశరీరముత్రివిక్రమావతారమునవలంబించిన విష్ణుదేవునియొక్కశరీరమునుబోలియుండె. అందువలన వానరులందఱునుమిగులభయమునుజెందినవారై నలుదిక్కులకును బరుగెత్తుకొనిపోయిరి. అప్పుడువానరులందఱును భయముచేతనేమియునుదెలియనిమనస్సుగలవారై లక్ష్మణునికన్నయగు రామునియొద్దకుబోయి శరణుశరణనిప్రార్థించిరి. అంతట గకుత్థ్సునివంశమునందు బుట్టినరాముడు రథమునందున్నవానిను, పర్వతముతోసమానుడును, ధనుర్ధారియును, నల్లనిమేఘమువలె దూరమునుండి ధ్వనిజేయుచున్నవాడును, మహానుభావుడును, నగు రాక్షసోత్తమునిజూచి మిగులనాశ్చర్యమునుబొందె. పిమ్మట వానరులనందఱనూరార్చి విభీషణునితోనిట్లనియె.

మిత్రుడా! విభీషణుడా! పర్వతముతోసమానుడును, ధనుర్ధారియును, పచ్చనినేత్రములుగలవాడును, వేయిగుఱ్ఱములచేత లాగబడినరథమునెక్కినవాడును, మిగులదీర్ఘములగు శూలములతోడను, తీక్ష్ణములగుప్రాసములు, తోమరములు మొదలుగాగల యాయుధములతోడను, మిగులగాంతిగల యనేకవిధములగునాయుధములతోడనుగూడుకొని మహేశ్వరునివలెప్రకాశించుచున్న యీరాక్షసోత్తము డెవ్వడు? మఱియు నోరాక్షసోత్తమా! విభీషణుడా! ఈరాక్షసోత్తమునియొక్క యాయుధములన్నియును, యమునియొక్కనాలుకలవలె బ్రకాశించుచున్నవి. మఱియునోరాక్షసోత్తమా! రథముతోడను, శక్తులనియెడునాయుధములతోడను గూడుకొనినయీరాక్షసోత్తముడు మెరుపులతోగూడకొనినమేఘునివలె బ్రకాశించుచున్నాడు. మఱియునోవిభీషణుడా! బంగారముచేతనలంకరింపబడిన పృష్ఠభాగములుగలవియును, సజ్యములైనవియును, నగు ధనుస్సులితనిరథశ్రేష్ఠమును, ఆకాశమునింద్రధనుస్సుప్రకాశింపజేసినవిధముగ బ్రకాశింపజేయుచున్నవి. మఱియునోవిభీషణుడా! రణభూమిని సర్వమునుప్రకాశింపజేయుచున్నవాడును, రథికులలోనుత్తముడును, నగునీరాక్షసోత్తముడు సూర్యునియొక్కతేజస్సువంటి తేజస్సుగలరథమునెక్కివచ్చుచున్నాడు? వీడెవ్వడు? మరియునోవిభీషణుడా! ఈవచ్చురాక్షసోత్తముడు రాహుధ్వజముచేతను, సూర్యునియొక్కకిరణములవలె బ్రకాశించుచున్నబాణములచేతను పదిదిక్కులనుబ్రకాశింప జేయుచున్నాడు. మరియునోవిభీషణుడా! ఆదిమధ్యాంతములయందువంపబడినదియును, మేఘధ్వనివంటి ధ్వనిగలదియును, బంగారముచేత నలంకరింపబడినవెనుకటిభాగముగలదియును, చక్కగ నలంకరింపబడినదియును, నగు నీతనిధనుస్సుదేవేంద్రునియొక్కధనుస్సువలె బ్రకాశించుచున్నది. మరియునోవిభీషణుడా! ధ్వజముతోగూడుకొనినదియును, పతాకతోగూడుకొనినదియును, అనుకర్షతో గూడుకొనినదియును, నలుగురుసారధులతోగూడుకొనినదియును, నగు నీతనిరథము మేఘధ్వనివంటిధ్వనిగలదై ప్రకాశించుచున్నది. మరియునోవిభీషణుడా! ఇతనియొక్కరథమునందు ముప్పదెనిమిదివిధములుగల యంబులపొదులు అమర్పబడియున్నవి. అటులనేభయంకరములైనవియును, బంగారముచేత జక్కగనలంకరింపబడినవియునునగు కార్ముకములును ననేకవిధములుగలవి గానమర్పబడియున్నవి. మరియునీతనిరథముయొక్క యిరుపార్శ్వములయందును నాలుగుచేతుల

పొడవుగలకత్తులును, పదిచేతులపొడవుగలవియును, నగు రెండుఖడ్గములమర్పబడియున్నవి. మరియునో విభీషణుడా! ఎత్తునికంఠముగలవాడును, ధీరుడును, మిగులగొప్పదగుపర్వతముతోసమానుడును, మిగులపెద్దదగునోరుగలవాడును నగు నీరాక్షసోత్తముడురథారూఢుడై మేఘారూఢుడైన సూర్యునివలె ప్రకాశించుచున్నాడు. మరియు నో విభీషణుడా! ఈరాక్షసోత్తముడు బంగారపుభుజబందులనిమొదు నాభరణములచేత నలంకరింపబడినభుజములచేత మిగుల పొడవులగుశిఖరములచేత ప్రకాశించుచున్న హిమవత్పర్వతమువలె ప్రకాశించుచున్నాడు. మరియు నో విభీషణుడా! మిగులశుభములగు నేత్రములుగల యీరాక్షసోత్తముని యొక్క ముఖముకుండలములచేత "పునర్వసూనక్షత్రమధ్యగతుండగు చంద్రబింబమువలె" ప్రకాశించుచున్నది. రాక్షసోత్తమా! విభీషణా! ఇట్టిమహిమగలయీరాక్షసోత్తముడెవ్వడోనాకుజెప్పుము. ఈరాక్షసోత్తముని జూచివానరులందఱును మిగులభయముచేత బరుగిడిపోవుచున్నారు. ఈవిషయమునుసర్వమును నాకుజక్కగ దెలియజెప్పుమనియె. ఇవ్విధముగనపరిమితమగు తేజస్సుగలవాడును, రాజనందనుడును, నగు రామునిచేతనడుగబడినవృత్తాంతమునుసర్వమునువిని మహాతేజస్సుగల విభీషణుడు ఆరాక్షసునివృత్తాంతము రామునికొఱకుజెప్పదలచియిట్లనియె

రఘుకులోత్తమా! రామచంద్రా! అధికమైనతేజస్సుగలవాడును, కుబేరునకుదమ్ముడును, భయంకరముగాయుద్ధమునుజేయువాడును, మిగులగొప్పదగు నుత్సాహముగలవాడును, రాక్షసులకధిపతియును, పదితలకాయలుగలవాడును, నగు రావణాసురునకితడు వీర్యవంతుడగుపుత్రుడు. యుద్ధమునందితడురావణునితోసమానుడు. మరియునితడువృద్ధులనుసేవించువాడు. ఇంతయగాక వేదశాస్త్రజ్ఞానముగలవాడు. సకలాస్త్రవేత్తలలో నుత్తముడు. మరియునో రఘుకులోత్తముడా! రామా! ఇతడు, గుఱ్ఱమునెక్కియు, ఏనుగునెక్కియు, రథమునెక్కియు, యుద్ధమునుజేయుటయందు మిగులనేర్పుగలవాడు. మరియునీతడుసామదానభేదదండములను నాలుగువిధములగు నుపాయములయందునుమిగులనేర్పుగలవాడు. నీతియందును, ఆలోచనయందును, మిగులసామర్థ్యముగలవాడు. లంకాపట్టణమంతయును నితనిభుజబలమునాశ్రయించుకొని నిర్భయముగనున్నది. ఇతడురావణాసురునకు ధాన్యమాలిని యందు బుట్టినయతికాయుడను నామధేయముగలపుత్రుడు. మహానుభావుడగు నీతడు ఘోరమైనతపస్సుజేసి బ్రహ్మదేవునిసంతోషపెట్టె. ఆబ్రహ్మదేవునివలన ననేకములగువరములను నస్త్రములనుబొందె. ఇతడనేకయుద్ధములయందుశత్రువుల నపజయమునుబొందించె. మరియు నీతడు బ్రహ్మదేవునివలన దేవదానవులచేతగూడ జయింపనలవిగానివాడగునని వరమునుబొందె. ఇతనిరథకవచములుదివ్యములైనవి. ఇతనిరథముసూర్యునివలె ప్రకాశించుచున్నవి. ఇతడీరథమునెక్కి యనేకవేలదేవతలను, దానవులనుజయించె. మరియు ననేకవేలరాక్షసులను రక్షించె. యక్షులననేకవేలనుసంహరించె. ధీమంతుడగునింద్రునియొక్క వజ్రాయుధమును నీతడనేకపర్యాయములు మొక్కపఱచె. మరియుననేకపర్యాయములు యుద్ధమునుజేసి వరుణదేవునిపాశమునుజిక్కుపరిచె. ఈయతికాయుడురాక్షసులలోనుత్తముడు. మరియు రావణాసురునకుపుత్రుడగు నీయతికాయుడుదేవదానవులయొక్క మదమునడచువాడు.

కాబట్టి పురుషోత్తముడా! రాముడా! ఈతనితో యుద్ధమునుజేయుటయందుమిగుల దృఢమగు ప్రయత్నమునుజేయవలయును. ఇతడింతకుముందు తనబాణములచేత వానరసైన్యమును నాశమునుబొందించెనని యారాక్షసోత్తమునివృత్తాంతమును జెప్పె. ఇట్లుజెప్పుచుండగ నాబలవంతుడగునతికాయుడు, వానరసైన్యమునందు ప్రవేశించిధనుష్టంకారమునుజేసి సింహనాదమునుజేసె. అట్లు ధనుష్టంకారసింహనాదములను జేయుచున్నవాడును, రథికులలోనుత్తముడును, రథమునెక్కియున్నవాడును, నగు నతికాయుని జూచి మహానుభావులును, వానరులలోపల నుత్తములును, నగు కుముదుడు, ద్వివిదుడు, మైందుడు, నీలుడు, శరభుడు మొదలుగాగల వానరోత్తములు వృక్షములను, పర్వతశిఖరములను నాయుధములనుగా గ్రహించి యొక్కమాటుగానాయతికాయునిమీద గవిసిరి. ఆసమయమునందస్త్రవేత్తలలోశ్రేష్ఠుడును, గొప్పదగు తేజస్సుగలవాడును, నగు నతికాయుడనువాడు బంగారముచేత నలంకరింపబడినతన బాణములచేత నావానరులు ప్రయోగించిన వృక్షములను, పర్వతములను నాశముసేసె. మఱియు భయంకరమైనశరీరముగలవాడును, బలవంతుడును, నగు నాయతికాయుడుఆవిధముగా వానరులయాయుధములనుధ్వంసముచేయుటయేగాక యావానరులనుగూడ మిగుల దృఢముగామర్దించె. అవ్విధముగ నతికాయునిచేత గురిపింపబడిన బాణవర్షముచేత భగ్నమైన యవయవములుగల వానరులందఱును నాయతికాయునితో యుద్ధమునుజేయుటకు శక్తిలేనివారైరి. అంతట రాక్షసాధిపతియగు నాయతికాయుడు వా

నరసైన్యమును సర్వమును "యౌవనముచేత మదించినదియును, కోపోద్దీపితమైనదియును, నగు సింహము లేళ్ళగుంపును భయపఱచినవిధముగా" భయపఱచె. అంతట వానరులందఱును నిలువలేక పరుగిడిపోయిరి. అప్పుడు ఆ యతికాయునితో నాయుద్ధభూమియందొక్కడును యుద్ధమును జేయఁగలవాఁడు లేకయుండెను. అంతట నాయతికాయుడు ధనుస్సుగలవాఁడును, దివ్యములగు నాభరణములచేత నలంకృతుడునునై రామునిసమీపమునకుబోయి మిగులగర్వముతో నిట్లనియె.

ఓరీ! రాముడా! నేను అతికాయుడను రాక్షసుడను. నీతోయుద్ధమును జేయుటకు వచ్చితిని. నేనుధనుర్ధారినైనసామాన్యులగువారితో యుద్ధమును జేయువాఁడను గాను. నీయొద్ద నెవ్వడైనను మిగులసమర్థుడును, యుద్ధమునందు వెనుకదీయనివాఁడును నెవ్వడైన యున్నయెడల నాతోయుద్ధమును జేయుటకు బంపుము. కాదేని నీవెయుద్ధమునకు రమ్మనియె. అవ్విధముగనతికాయుడు మిగుల గర్వముతో జెప్పుచున్నవాక్యములనువిని శత్రునాశకుడగు లక్ష్మణుడు మిగుల గోపమును బొందెను. పిమ్మట నామాటలను సహింపనివాఁడగుచు ధనుర్ధారియై యతివేగముగ నక్కడకువచ్చి అవ్విధముగ లక్ష్మణుడు గోపోద్దీపితుడై యంబులపొదిలోనుండి యొక్క బాణమును వెలుపలకుదీసి యతికాయునిముందరనిలిచి యధికముగా ధనుష్టంకారమును జేసె. అప్పుడు రావణాసురునకు బుత్రుడును, మహాబలవంతుడును, నగు నతికాయుడు లక్ష్మణునియొక్క భయంకరమగు ధనుష్టంకారమునువిని యత్యాశ్చర్యమును బొందెను. అంతట నయ్యతికాయుడు అధికమగు కోపమును జెంది తనకభిముఖముగానున్నలక్ష్మణునిజూచి మిగుల దీక్ష్ణములగు బాణమును గ్రహించి యిట్లనియె. ఓసుమిత్రానందనుడా! లక్ష్మణుడా! నీవుపసివాఁడవు. పరాక్రమములయందు నేర్పుచాలనివాఁడవు. కావున దొలగిపొమ్ము. యమునితో సమానుడనగు నాతో యుద్ధమును జేయుటకుదగవు. నాబాహువులనుండివిడిచిపెట్టబడిన బాణములయొక్క వేగమును హిమవంతుడుగూడ సహింపజాలడు. భూమ్యాకాశములుగూడ సహింపజాలవు. నీవు పసితనముచేత సుఖముగా నిద్రించుచున్న కాలాగ్నిని లేవుటకిచ్ఛయించుచున్నావు. ధనుస్సును గ్రిందబెట్టి మరలిపొమ్ము. నాతోయుద్ధమును జేసి ప్రాణములను బోగొట్టుకొనకుము. నామాటలనువినక నాతో యుద్ధమును జేయుటకే యిచ్ఛయించెదనని ప్రయత్నించితివేని నిలువుము. ప్రాణములనువదలి యమలోకమునకుబోదువు. మఱియు నోలక్ష్మణుడా! శత్రువులయొక్క మదమును నణచివేయునట్టివియును, మిగుల తీక్ష్ణములైనవియును, నగు బాణములనుజూడుము. నాబాణములన్నియు నీశ్వరుని బాణములతో సమానములైనవి. ఇంతయగాక పుటమువేయబడిన బంగారముచేత నలంకరింపబడినవి. ఇదిగో మిగులదర్పముతో గూడిన యీబాణము నీనెత్తురునుసర్వమును ద్రాగగలదు. కోపోద్దీపితమగు సింహము ఏనుగుయొక్క నెత్తురును పీల్చినవిధముగ బీల్చుననియె. ఇవ్విధముగా జెప్పి యాయతికాయుడు బాణమును ధనుస్సునందు సంధానమును జేసె. అప్పుడు రాజపుత్రుడగు లక్ష్మణుడు అతికాయునియొక్క గర్వోక్తులనువినియె. పిమ్మట మహాబలుడును, అధికమగు సంపదగలవాఁడును, నగు లక్ష్మణుడు మిగుల గంభీరమయిన యర్థముగల మాటలను జెప్పదలచి యిట్లనియె.

ఓరీ! రాక్షసుడా! మాటలచేతనే నీవుగొప్పవాఁడవుగావు. తన్నుదాను శ్లాఘించుకొనుటచేత సత్పురుషులుగా నేరరు. ఓరీ! దురాత్ముడా! నేను ధనుర్ధారినై యుండగనప్పుడు నీబలమును జూపుము. పనిచేత నీసామర్థ్యమును జూపుము. వ్యర్థముగా నిన్ను నీవే పొగడుకొనకుము. పౌరుషముగలవాఁడు శూరుడగును గాని మాటలు నేర్చినవాఁడు శూరుడుగాడు. నీవుసర్వాయుధములను గలవాఁడవై రథమునెక్కియున్నావు. బాణములచేతనైనను, అస్త్రములచేతనైనను, నీపరాక్రమమును జూపుము. పిమ్మట మిగులదీక్ష్ణములగు నాబాణములచేత "పండినతాటిపండును గాలిక్రిందబడవేయువిధముగ" నీశిరస్సును క్రిందబడవేయుదును. మఱియు నోదురాత్ముడా! పుటమువేయబడిన బంగారముచేతనలంకరింపబడిన నాబాణములు నీశరీరమునందుండి బయలువెడలు రక్తమును పానముసేయగలవు. నేను బాలుడననితలచి నన్నవమానపఱుపగూడదు. నేనుపసివాఁడనయిననీకేమి? వృద్ధుడనైననీకేమి నన్ను నీకుమృత్యువునుగా నెంచికొనుము. పూర్వము పసితనమునవలంబించిన విష్ణుదేవుడు మూఁడువిధములగు పరాక్రమములచేత మూడులోకములను నాక్రమింపలేదా? కావున నీవికమీద నిట్టివృథాలాపములనాడకుమనియె. అట్లులక్ష్మణునిచేత జెప్పబడినవియును, హేతుగర్భితములైనవియును, మిగుల గంభీరమగునర్థముగలవియును, నగు మాటలనువిని యతికాయుడధికమగుకోపముగలవాఁడై మిగులశ్రేష్ఠమగు బాణమును సంధానముసేసె. ఆసమయమునందు విద్యాధరులును, భూతములును. మహర్షులును, మహాత్ములగు గుహ్యకులును, దేవతలును, లక్ష్మణాతికాయుల యుద్ధమును జూచుటకువచ్చి యాకాశమునందునిలిచిరి. అంతట నయ్యతికాయుడపరిమితమగు కోపముగలవాఁడై బాణము నెక్కుపెట్టి యాకాశ

ముసు సర్వమును గ్రసించుచు లక్ష్మణునిమీద బ్రయోగించె. అవ్విధముగ నతికాయునిచేత బ్రయోగింపబడినదియును, తనకభిముఖముగావచ్చుచున్నదియును, మిగులక్రూరమగు సర్పముతో సమానమైనదియును, నగు బాణమును, శత్రువీరులను జంపివేయువాడగు లక్ష్మణుడర్ధచంద్రాకారమగు బాణముచేత ఛేదించె. అట్లులక్ష్మణునిచేత "పాముయొక్క పడగను ఖండింపబడినవిధముగ" తనబాణముఖండింపబడుటనుజూచి యతికాయుడు అపరిమితమగు కోపముగలవాడై యైదుబాణములను మరలసంధించె. అంతటరాక్షసోత్తముడగు నతికాయుడు మిగుల దీక్ష్ణములగు నైదుబాణములను లక్ష్మణునిమీద బ్రయోగించె. అవ్విధముగ నతికాయునిచేత బ్రయోగింపబడిన నైదుబాణములను లక్ష్మణుడుమిగుల దీక్ష్ణములగు బాణములచేత ఛేదించె. అంతటశత్రువీరులను సంహరించునట్టి లక్ష్మణుడు మిగులదీక్ష్ణములగు బాణములచేత నయ్యతికాయుని బాణములను ఛేదించియధికమగు తేజస్సుగలవాడై మిగులదీక్ష్ణమయినదియును, ప్రకాశించుచున్నదియును, నగు నొకయొక్క బాణమును స్వీకరించె. వీర్యవంతుడగు నాలక్ష్మణుడు ధనుశ్శ్రేష్ఠమునందు దానిని సంధానముసేసి యధికముగా నాకర్షించి మహావేగముగా బాణమును బ్రయోగించె. ఆబాణముమిగులవేగముతో బోయి భయంకరుడైనయారాక్షసునియొక్క లలాటమునందుమగ్నమయ్యె. అట్లు లలాటమునందు మగ్నమైనదియును, నెత్తురుచేత దడపబడినదియును, నగు నాబాణముహిమాలయమునందు సర్పము నిలిచియున్నవిధముగ నుండె. అప్పుడు రుద్రునిబాణముచేత గొట్టబడినదియును, మిగులభయంకరమైనదియును, నగు త్రిపురాసురునియొక్క గోపురమువలె లక్ష్మణునియొక్క బాణములచేత బీడింపబడినయతికాయుడు అధికముగా గంపమునుబొందె. అంతగొంతసేపటికి మహాబలుడగు నతికాయుడు ఆలోచించి చేయదగినకార్యమును నిశ్చయించి లక్ష్మణునితోనిట్లనియె.

ఓరీ! లక్ష్మణుడా! నీవుమిగుల దీక్ష్ణమగు బాణమును బ్రయోగించి నన్నునొప్పించితివి. అందువలననాకు మిగులగొనియాడదగిన శత్రుడవైతివనియె. ఇవ్విధముగాజెప్పికొంతసేపటికిశ్రమను దీర్చికొని భుజములను రెంటిని విదర్చికొని తనరథమునకు సమీపముననున్న లక్ష్మణునిమీదికి రథమును దోలించె. అంతట నాయతికాయుడు ధనుస్సును మిగులదృఢముగానాకర్షించి యైదారేసిబాణముల నొక్కొక్కమాటుగా లక్ష్మణునిమీద బ్రయోగించె. అట్లురాక్షసోత్తముడగు నతికాయునిచేత బ్రయోగింపబడినవియును, యముతోసమానములైనవియును, రాక్షసేంద్రునియొక్కధనుస్సునుండిబయలువెడలినవియును, బంగారు పిడులుగలవియును, సూర్యునియొక్కకాంతివంటి కాంతిగలదియును, నగు బాణములు ఆకాశమును సర్వమును బ్రకాశింపజేసె. అంతట రఘుకులోత్తముడగు రామునకుదమ్ముడగు లక్ష్మణుడు కొంచెమైనను భయములేనివాడై రాక్షసోత్తముడగునతికాయునిచేత విడిచిపెట్టబడిన బాణములనన్నిటిని మిగులదీక్ష్ణములగు బాణములచేత భ్రాంతిలేనివాడగుచు ఛేదించె. అప్పుడు రావణాసురునకు బుత్రుడగు నతికాయుడు తనబాణములన్నియును ఛేదింపబడుటనుగురించి యధికమగుకోపముగలవాడై మిగుల దీక్ష్ణమగు మఱియొకబాణమునుసంధించె. అవ్విధముగ మహాతేజోవంతుడగు నాయతికాయుడు తానుసంధించిన బాణమును బ్రయోగించె. ఆబాణముపోయి యెదురుగావచ్చుచున్న లక్ష్మణునియొక్క స్తనాంతరమునందుదాకె. అట్లుబాణమువచ్చి తొమ్మునదాకినతోడనే లక్ష్మణుడుమిగులవ్యసనమునుబొందె. అప్పుడతనిశరీరమునుండి రక్తముఅపరిమితముగాగారుచుండె. అంతగొంతసేపటికి లక్ష్మణుడు తేరుకొని మిగులదీక్ష్ణమగు బాణమునొక్కదానినిగ్రహించి ధనుస్సునందు సంధానముసేసె. మఱియునాబాణముతోగూడనాగ్నేయాస్త్రమునుసంధించె. ఆసమయముననాయాగ్నేయాస్త్రముఅపరిమితముగాసంధానము సేయబడియె. అప్పుడు తేజోవంతుడగునతికాయుడు సూర్యదేవతాకమైనయస్త్రమునుసంధించె. అంతటలక్ష్మణుడుసర్పముయొక్క కాంతివంటికాంతిగలదియును, బంగారపుపిడిగలదియునునగు బాణమునుసంధానముసేసె. అట్లుప్రజ్వలించుచున్నబాణమునందు ఆగ్నేయాస్త్రమును జేర్చి యతికాయునిమీదబ్రయోగించె. ఆబాణమప్పుడు కాలదండముతో సమానమైనదైయుండె. ఆసమయమునందతికాయుడుగూడ సూర్యాస్త్రముతోగూడుకొనినబాణములక్ష్మణునిమీదబ్రయోగించె. అంతటనాయస్త్రములురెండును నంతరిక్షమునందొకదానితోనొకటి యతిఘోరముగాబోరికొట్టుకొనియె. అట్లుకొంతసేపటికి అవిరెండునునాకాశమునందుగొట్టుకొనితుదకవి రెండునుభస్మరూపమును జెందినశించె. అంతటనతికాయుడు అపరిమితమగు కోపముగలవాడై యిషీకాస్త్రమునుబ్రయోగించె. అంతటవీర్యవంతుడగు నాలక్ష్మణుడైంద్రాస్త్రమును బ్రయోగించె. ఆయైంద్రాస్త్రముపోయి యతికాయునియొక్కయిషీ మునునాశముజేసె. అప్పుడతికాయుడుఅపరిమితమగుకోపముగలవాడై యామ్యాస్త్రమునుబ్రయోగించె. అంతటనయ్యస్త్రమునులక్ష్మణుడు వాయవ్యాస్త్రముచేత ఖండించె. అట్లువాయవ్యాస్త్రముచేత నారాక్షసునియామ్యా

స్త్రమును ఖండించి యాయతికాయునిమీద మిగుల ఘోరమగు బాణవర్షమునుగురిపించెను. ఆబాణములు వజ్రకవచమునుధరించిన యతికాయునకేమియును బాధనుగల్పింపజాలనివయ్యె. మఱియు నాబాణములన్నియును భగ్నమైనయగ్రభాగములుగలవై క్రిందబడియె. అట్లు తనబాణములన్నియు వ్యర్థములగుటనుజూచి శత్రునాశకుడగు లక్ష్మణుడు మునుపటికంటె నధికమగు కోపముగలవాడై మఱలమిగుల గొప్పదగు బాణవర్షమునుగురిపించెను. అట్లపరిమితమగుబాణవర్షముచేత గొట్టబడియును, మహాబలుడగు నతికాయుడు గొంచెమైనను బాధనుబొందినవాడుకాకపోయె. అంతట మానవోత్తముడగు లక్ష్మణుడు ఆయతికాయునకట్టిబాణములచేతను బాధనుగల్పింపజాలకయుండె. ఆసమయమునందు వాయుదేవుడు లక్ష్మణునిసమీపమునకువచ్చి యిట్లనియె. రఘుకులోత్తమా! లక్ష్మణుడా! ఈయతికాయుడు బ్రహ్మదేవునిచేత వరములను బొందినవాడు. మఱియును శత్రువులచేత భేదింపశక్యముగాని కవచముగలవాడు. కాబట్టి యితడు సామాన్యములగు బాణములచేత జయింపనలవిగానివాడు. కావున నీవీ రాక్షసునిమీద బ్రహ్మాస్త్రమును బ్రయోగింపుము. ఇతరములగు నస్త్రములను బ్రయోగించుటచేత గొంచమైనను బ్రయోజనము లేదనియె. అట్లు వాయుదేవుడు చెప్పినమాటలనువిని దేవేంద్రునియొక్క పరాక్రమముతో సమానమైన పరాక్రమముగలవాడును, సుమిత్రాదేవికి బుత్రుడునునగు లక్ష్మణుడు వాయుదేవునియొక్క వచనమునువిని యమోఘమైన వేగముగలదియును, మిగులభయంకరమైనదియును, నగు బ్రహ్మాస్త్రమునుసంధించెను. అట్లు లక్ష్మణుడు బ్రహ్మాస్త్రమును సంధానముసేసిన సమయమునందు దిక్కులును, చంద్రుడును సూర్యుడును, మిగులబెద్దవగునక్షత్రములును, భూమియును గంపమునుబొందెను. అవ్విధముగ నాలక్ష్మణుడు యమదూతవంటి యస్త్రమును సంధానముచేసి మిగులభయంకరుడును, రావణాసురునకు బుత్రుడును, నగు నతికాయునిమీదబ్రయోగించెను. అట్లు లక్ష్మణునిచేత బ్రయోగింపబడినదియును, సఫలమగు వేగముగలదియును, అగ్నిహోత్రమువలె బ్రకాశించుచు నభిముఖముగావచ్చుచున్నదియును, బంగారముచేతజేయబడి రత్నములచేత జెక్కబడిన పిడిగల బాణముతో మిళితమై యున్నదియును, నగు బ్రహ్మాస్త్రమును నాయతికాయుడుసూచెను. అట్లు బ్రహ్మాస్త్రమును జూచి యతికాయుడు మిగులదీక్ష్ణములైనవియును, అనేకములైనవియును, నగు బాణములచేత నాబ్రహ్మాస్త్రమునుగొట్టెను. అంతట నాబ్రహ్మాస్త్రమధికమగు వేగముగలదై యతికాయునియొక్క సమీపమునకుబోయెను. అప్పుడతికాయుడు మిగుల బ్రకాశించుచున్నదియును, యమునితో సమానమైనదియును, నగు నాబ్రహ్మాస్త్రమును శక్తి, గద, కుఠారము, శూలము, మొదలుగాగల యాయుధములచేతగొట్టుచుండెను. ఆసమయమునందు ఆబ్రహ్మాస్త్రము అతికాయునిచేత బ్రయోగింపబడిన యాయుధములనన్నింటిని వ్యర్థములైనవానినిగాజేసి కిరీటముతోగూడిన యతికాయునియొక్క శిరస్సును హరించెను. అట్లు లక్ష్మణుని బ్రహ్మాస్త్రముచేత బ్రయోగింపబడిన యాయతికాయునియొక్క శిరస్సు క్రిందబడియె.

ఆశిరస్సు క్రిందబడునపుడు హిమవత్పర్వతముయొక్క శిఖరము క్రిందబడునట్లుండెను. అవ్విధముగ గ్రిందబడినదియును, నానావిధములగు భూషణములచేత నలంకరింపబడినదియును, నగు నతికాయునియొక్క శిరస్సునుజూచి యావానరులందఱును నధికమగు నానందమునుబొందిరి. అప్పుడు రాక్షసులందఱును వ్యసనమునుబొందుచున్నముఖములుగలవారును, వానరులు గొట్టినదెబ్బలచేత బుట్టినశ్రమగలవారును, నై యధికముగా వికారస్వరములతో రోదనమునుజేసిరి. అంతట నారాక్షసులందఱును నపేక్షారహితులై యికనిక్కడ మనము జేయదగిన పనియేమియును లేదనితలచి లంకాపట్టణమునకభిముఖులై బయలువెడలిపోయిరి. అప్పుడు వానరులందఱును సంతోషముచేత వికసించినముఖపద్మములుగలవారై యతికాయుని జంపినందుకుగా లక్ష్మణుని అనేకవిధముల బూజించిరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి డెబ్బదొక్కటవ సర్గ ముగిసెను.

——(*)——

రావణాసురుడు అతికాయుని మరణమునకు చింతించుట.

అంతట మిగులనధికమగు తేజస్సుగల లక్ష్మణునిచేత నతికాయుడు జంపబడెనను వార్తనువిని రావణాసురుడు మిగులనుద్వేగముగలవాడై యిట్లనియె.

అయ్యో! ధూమ్రాక్షుడును, మిగుల నధికమగుకోపముగలవాడును, ధనుర్ధారులలో నుత్తముడును, శస్త్రములను ధరించినవారలలో నుత్తముడును, నగు నకంపనుడును, ప్రహస్తుడును, కుంభకర్ణుడును, చంపబడిరి. మఱియు నీరాక్షసోత్తములందఱును, నధికమగు బలముగలవారు. ఇంతయగాక యుద్ధమునందధికమగు కోరికగలవారు. మఱియు శత్రుసైన్యములను నిర్మూలనముచేయుటయందు దగినసామర్థ్యముగలవారు. ఇట్టి మహానుభావులగు రాక్షసోత్త

ములందఱును శత్రువులచేత జయింపబడిరి. మఱియు ననాయాసముగ యుద్ధమునుజేయునట్టి రాముడు వీరలనందఱజంపె. మఱియు నధికమగు శరీరముగలవారును, నానాశస్త్రములను ధరించినవారును, మహాత్ములును, నగు ననేకమంది రాక్షసులుగూడ రామునిచేత జంపబడిరి. మఱియు మిగుల బ్రసిద్ధమైన బలపరాక్రమములుగల వాడును, నాకు బుత్రుడును, నగు నింద్రజిత్తు కోపోద్దీపితుడై రామలక్ష్మణులను బాణపంజరములయందు బద్ధులనుగాజేసె. ఆ బాణపంజరము దేవతలచేతను, రాక్షసులచేతను, సిద్ధవిద్యాధరాదులచేతగూడ భేదింపనలవిగానిది. అట్టిబాణపంజరమును నీరామలక్ష్మణులు అనాయాసముగ భేదించిరి. నాయాజ్ఞానుసారముగ యుద్ధమునకుబోయిన రాక్షసవీరులందఱునుమహాబలులగు వానరులచేత సంహారింపబడిరి. కావున రామలక్ష్మణులను, సుగ్రీవుని, వానరసైన్యమును, యుద్ధమునందు జంపదగినవాడు రాక్షసులలో నొక్కడును సమర్థుడుగాడని తోచుచున్నది. ఆహా రాముడెంతబలవంతుడు. రామునియస్త్రబలము సర్వోత్తమమైనది. ఆరామునియొక్క పరాక్రమముచేత రాక్షసులందఱును నాశమునుబొందిరి. ఇదియంతయును విచారింపగ నీరాముడు నారాయణుడని తోచుచున్నది. కావున రామునివలన నవశ్యముగ లంకాపట్టణమునకాపద ఘటిల్లును, కాబట్టి లంకాపట్టణమునందలి ద్వారతోరణములనన్నింటిని జక్కగా గాపాడదగినది. మఱియును బ్రమాదరహితులగు రాక్షసులచే లంకాపట్టణము రక్షింపదగినది. మఱియు సీతయున్నచోటునకు నెవ్వడును నాయాజ్ఞనుబొందక పోగూడదని యాజ్ఞనివ్వవలయును. ఈవిషయములయందు నేనుసర్వాత్మనాజాగరూకతతో బ్రవర్తింపవలయునని తలచి రాక్షసవీరులనుబిలిచి యిట్లనియె.

ఓరాక్షసోత్తములారా! మనపట్టణమునం దెక్కడెక్కడగుల్మములుగలవో ఆయాస్థలములయందు చతురంగబలములతోగూడ గావలియుండవలయును. మఱియు నోరాక్షసోత్తములారా! వానరులయొక్క నివాసస్థానములను దెలిసికొనవలయును. సర్వకాలములయందును వానరులవృత్తాంతమును దెలిసికొనుచుండవలయును. కొంచమైనను పొరబాటునుబొందగూడదు. మిగుల జాగరూకతతో నుండవలయుననియె. ఇవ్విధముగ జెప్పుచున్న రావణాసురునియొక్క వాక్యమునువిని రాక్షసులందఱును దగినసేనలతో గూడుకొని రావణుని యాజ్ఞానుసారముగ గుల్మరక్షణయందు బ్రవేశించిరి. అట్లు సకల రాక్షసవీరులను దగినకృత్యములయందు బ్రవేశపెట్టి వ్యసనమనియెడు శల్యముచేత బాధింపబడుచున్న హృదయము గలవాడగుచు దనగృహములోనికిబోయెను. అట్లు నిజనివాసమునకు బోయినపిమ్మట మహాబలుడును, రాక్షసాధిపతియును, కోపాగ్నితో గూడుకొనినవాడును, నగు రావణాసురుడు పుత్రమూలకమగుదుఃఖముచేత నపరిమితముగా బీడింపబడినవాడగుచు నధికముగా నిట్టూర్పులను విడుచుచుండె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి డెబ్బదిరెండవ సర్గ ముగిసెను.

▸(✱)◂

ఇంద్రజిత్తు రామలక్ష్మణాదులను మూర్ఛిల్లజేయుట.

అంత గొంతసేపటికి యుద్ధమునందు జావగా మిగిలిన రాక్షసులు పరుగెత్తుకొనివచ్చి రావణాసురునకు నమస్కరించి రాక్షసోత్తములగు దేవాంతకుడును, త్రిశిరుడును, అతికాయుడును, మరణమును బొందిరనువార్తను దెలిపిరి. అంతట నారావణాసురుడు తనవారలుచచ్చిన వృత్తాంతమునువిని కన్నీళ్ళనుబెట్టికొనుచు మోహమునుజెందె. అంతగొంతసేపటికి దెలివొంది పుత్రులను, తోడబుట్టువులను, నశించుటను దలచుకొని యధికముగా వ్యసనమును బొందె. అట్లు దుఃఖసముద్రమునందు మునిగినవాడును, దుఃఖముచేత దీనమైన మోముగలవాడును, నగు రావణాసురునిజూచి రాక్షసులలో నుత్తముడును, రావణాసురునకు బుత్రుడును, నగు నింద్రజిత్తు యిట్లనియె.

తండ్రీ! రాక్షసోత్తమా! రావణాసురుడా! ఇంద్రునిజయించిననేను జీవించియుండగ నీవు వ్యసనమునుబొందుట యుచితముగాదు. నాబాణములచేత గొట్టబడినపిమ్మట నెవ్వడును బ్రాణములను గాపాడుకొనజాలుడు. కావున నిప్పుడు చూడుము. నేనుయుద్ధమునకుబోయి లక్ష్మణునితో గూడుకొనిన రామునిజంపెదను. మఱియునా రామలక్ష్మణులిరువురును, నాబాణములచేత గొట్టబడిన శరీరముగలవారై బాణములచేత వ్యాప్తమైన శరీరముగలవారగుచు భూమియందుబడియుండుటను జూడగలవు. మఱియు నోరాక్షసేంద్రా! రావణాసురుడా! నాదప్రతిజ్ఞనువినుము. నేను వ్యర్థముగ మాటలాడువాడగాను. ఇప్పుడేపోయి రామలక్ష్మణులనుజంపినాబాణములకు సంతోషమునుగల్పించెదను. మఱియు నోరాక్షసోత్తమా! తండ్రీ! బలిచక్రవర్తియొక్కయజ్ఞభూమియందు విష్ణుదేవునియొక్క పరాక్రమమును జూచి యానందమునుబొందినవిధముగ నిరుపమానమగు నాపరాక్రమమును గూడజూచి యిప్పుడు దేవతలును, యముడును, ఇంద్రుడును, విష్ణుదేవుడును, సూర్యుడును,

సాధ్యులును, అశ్వినీదేవతలును, చంద్రుడును, మఱియు ననేకులగు దేవతలును సంతోషమును బొందుదురుగాక. కావున నీవు భయమును బొందకుమనియె. ఇవ్విధముగా దేవేంద్రునకు శత్రుడును, అపరిమితమగు బలపరాక్రమ సంపదగలవాడును, నగునింద్రజిత్తు చెప్పి వాయువేగమువంటి వేగముగలదియును, ఉత్తమాశ్వములచేత బూన్పబడి నదియును, నగురథమునధిష్ఠించెను.

అవ్విధముగ నధికతేజస్సుగల యింద్రజిత్తు దేవేంద్రునిరథముతో సమానమగు రథమునెక్కి యుద్ధమును జేయుదగినస్థలమునకు బయలువెడలిపోయెను. అట్లు బయలువెడలిపోవుచున్నవాడును, మహానుభావుడును, నగు నాయింద్రజిత్తుతోగూడ నధికమగుబలముగలవారును, యుద్ధమును జేయుటయందు మిగుల సంతోషముగలవారును, శ్రేష్ఠములగు ధనుస్సులను ధరించినవారును, నగు ననేకమంది రాక్షసులు బయలువెడలిపోయిరి. అవ్విధముగనింద్రజిత్తుతోగూడ బయలువెడలిన వానరవీరులలో గొందఱేనుగు నధిష్ఠించిరి. కొందఱుత్తమాశ్వములనెక్కిరి. కొందఱు రథారూఢులైరి. కొందఱు ప్రాసములు, ముద్గరములు, ఖడ్గములు, గండ్రగొడ్డండ్లు మొదలుగాగల యాయాయుధములను ధరించి బయలువెడలిరి. అట్లు చతురంగబలములతోగూడ బయలువెడలినయింద్రజిత్తు శంఖమువలె దెల్లనగుగొడుగుతోగూడుకొనినవాడును, రాక్షసోత్తములచేత గొనియాడబడుచున్నవాడునై పోయెను. మఱియు ధనుర్ధారులలో నుత్తముడగు నయ్యింద్రజిత్తునకు ననేకవేలమందిరాక్షసులు దివ్యములగు వింజామరలను వీచుచుండిరి. అప్పుడు నిరుపమానములగు బలపరాక్రమములుగల యింద్రజిత్తుచేత లంకాపట్టణమంతయును, సూర్యునిచేత నంతరిక్షము ప్రకాశించుచున్నవిధముగ బ్రకాశించుచుండెను. అప్పుడు అధికమగు తేజస్సుగలవాడును, శత్రువులను నశింపజేయుటయందు దగినసామర్థ్యముగలవాడును, నగునింద్రజిత్తు రాక్షసోత్తములగు వారలను దనరథముచుట్టును నిలిపిపెట్టెను. పిమ్మట రాక్షసోత్తముడును, సకలమంత్రరహస్యములను జక్కగ దెలిసినవాడును, అగ్నిహోత్రునితో సమానమగు కాంతిగలవాడును, నగునింద్రజిత్తు శాస్త్రోక్తప్రకారముగ నగ్నిదేవుని బూజించెను. అంతట బ్రతాపవంతులలో నుత్తముడును, రాక్షసేంద్రుడును, నగు నింద్రజిత్తు లాజలు మొదలుగాగల హోమద్రవ్యములతో నగ్నిదేవునకుద్దీప్తి గలుగునట్లు హోమమును జేసెను. ఆసమయమునందు యింద్రజిత్తు శస్త్రములను దర్భలనుగా జేసెను. మఱికొన్నియగు నాయుధములను సమిధలనుగా జేసెను. కాష్ఠాయసమును నాయుధమును స్రువమునుగా జేసెను. మఱియు నస్త్రోయాయుధముల నస్త్రోసాధనములనుగా జేసి నల్లనిమేకను గొనివచ్చి ధూమరహితముగా బ్రజ్వలించుచున్న యగ్నియందు బెట్టి హోమమును జేసెను. ఆసమయమునందనేకములగు శుభనిమిత్తములు గలిగె. అప్పుడగ్నిదేవుడు ప్రదక్షిణాకారముగదిరుగుచున్న యగ్నిజ్వాలలు గలవాడును, ముటము వేయబడిన బంగారువుసొమ్ములుగలవాడును, నగుచునింద్రజిత్తుయొక్క హోమద్రవ్యములను మిగులకుతూహలముతో గ్రహించెను. అంతటనగ్నిదేవుడుప్రసన్నుడై బ్రహ్మాస్త్రము మొదలుగాగల యనేకాస్త్రములను దెచ్చి యాయింద్రజిత్తునకు సమర్పించెను. అవ్విధముగ నింద్రజిత్తు హోమమును జేయుచున్న సమయమునందు సూర్యచంద్రనక్షత్రాదులతోగూడ నాకాశమంతయును గడగడవణకె. దేవేంద్రునితో సమానమైన ప్రభావముగలవాడును, అగ్నిహోత్రునియొక్క తేజస్సువంటి తేజస్సుగలవాడును, నగునింద్రజిత్తు, అగ్నిదేవుని బూజించి యగ్నిదేవునిచేత నివ్వబడినధనుర్బాణాయుధాదులతోగూడుకొనినవాడై యాకాశమున కెగిరిపోయెను. అట్టి యాయుధములు మొదలగువానినిచ్చి యగ్నిదేవుడును నంతర్హితుడయ్యె. ఆసమయమునందు గుఱ్ఱములు రథములు మొదలగువానితో గూడుకొనినదియును, పతాకములు, ధ్వజములు మొదలగువానిచేత బ్రకాశింపజేయబడుచున్నదియును, యుద్ధమును జేయవలయునని మెదుకుతూహలముచేత ధ్వనిచేయుచున్నదియును, నగు రాక్షసబలము బయలువెడలె. అట్లుబయలువెడలిపోయిన రాక్షసులందఱును గోపోద్దీపితులై నానావిధములగు బాణములచేతను, మిగుల దీక్ష్ణములైనవియును, వేగముగలవియును, నగుతోమరములను, నాయుధములచేతను, అంకుశములచేతను, వానరులనందఱను గొట్టిరి. అంతట నయ్యింద్రజిత్తు కోపోద్దీపితుడై యుద్ధమును జేయుచున్న రాక్షసులను జూచి యిట్లనియె.

రాక్షసోత్తములారా! మీరందఱును సంతోషముగలవారై వానరులతో యుద్ధమును జేయుడనియెను. అంతట రాక్షసులందఱును యుద్ధమును జేయవలయునని కోరికగలవారును, సింహనాదములను జేయుచున్నవారునునై భయంకరులగు వానరులమీద బాణవర్షమును గురిపించిరి. ఆసమయమునందింద్రజిత్తు విశాలములగు నగ్రభాగములుగల బాణములతోడను, గదలతోడను, ముసలములను నాయుధములతోడను, రాక్షసవీరులతోడను గూడుకొనినవాడై భయంకరులగు వానరులననేకులను ఖండించెను. అట్లు మిగుల గోపముతో యుద్ధము జేయుచున్న యింద్రజిత్తును జూచి వానరులందఱును వృక్షములే యాయుధములుగాగలవారై

యాయింద్రజిత్తుమీదికి గవిసిరి. అంతట నధికమగుబలముగలవాడును, అధికమగుతేజస్సుగలవాడును, నగు నింద్రజిత్తు కోపోద్దీపితుడై వానరులయొక్క శరీరములను నానావిధములగు బాణములచేతమథించె. మఱియు నాసమయమునందింద్రజిత్తు క్రోధోద్దీపితుడై యొక్కొక్కబాణముచేతను, తొమ్మిదేసిబాణములచేతను, అయిదేసి బాణములచేతను, ఏడేసిబాణములచేతను, రాక్షసులకందఱకును సంతోషమునుగల్పించుచు వానరులననేకులవధించె. మఱియు వీరుడును, దుర్జయుడును, నగు నయ్యింద్రజిత్తు, సూర్యునితోసమానములైనవియును, బంగారముచేత నలంకరింపబడినవియును, నగుబాణములచేత ననేకులగువానరవీరుల నువధించె. అవ్విధముగ నింద్రజిత్తుప్రయోగించినబాణములచేత గొట్టబడిన సకలావయవములునుగల వానరులు మిగులవ్యసనముగలవారై దేవదానవయుద్ధమునందు దేవతలచేతగొట్టబడినరాక్షసులు గ్రిందబడినవిధముగా గ్రిందబడిరి. ఆసమయమునందివ్విధముగా బాణములనియెడు కిరణములచేత సూర్యునివలె దహించుచున్న యింద్రజిత్తును జూచివానరోత్తములందఱును నొక్కటిగాజేరుకొని యుద్ధసన్నద్ధులైగవిసిరి. అంతటనయ్యింద్రజిత్తుచేత గొట్టబడినశరీరముగలవానరులందఱును మూఢచిత్తులును, నెత్తురుతోగూడుకొనిన యవయవములుగలవారునునై క్రిందబడిరి. మఱియు నాసమయమునందనేకులగు వానరులు రామునికొఱకు బరాక్రమించి ప్రాణత్యాగమును జేసిరి. మఱికొందఱువానరులు ఱాళ్లుమొదలగునవియే యాయుధములుగాగలవారై యాయింద్రజిత్తుమీదగవిసిరి. మఱికొందఱు వానరవీరులుపర్వతాగ్రములను, వృక్షములను నాయుధములుగాధరించి యాయింద్రజిత్తుమీద శిలావర్షమును వృక్షవర్షమును గురిపించిరి. ప్రాణాపహారమును జేయుటకుదగినదియగు వృక్షములయొక్కయు, ఱాళ్లయొక్కయు, భయంకరమైన యావర్షమును, సర్వోత్తమమగుతేజస్సుగలయింద్రజిత్తు నాశమునుబొందించె. పిమ్మట యుద్ధమునందు సమర్థుడగునయ్యింద్రజిత్తు, అగ్నిహోత్రముతోసమానమైనవియును, సర్పములతో సమానములైనవియును, నగుబాణములచేత వానరులయొక్క సైన్యమునుసర్వమును ఛేదమునుబొందించె. పిమ్మట మిగుల దీక్ష్ణములగు పదునెనిమిది బాణములచేత గంధమాదనుడనియెడు వానరోత్తమునిగొట్టె. తొమ్మిదిబాణములచేత దూరమునందున్న నళుడను వానరోత్తమునిగొట్టె. పిమ్మట మర్మస్థానములను బ్రద్దలుసేయుటయందు దగినసామర్థ్యముగల యేడుబాణములచేత నధికమగు తేజస్సుగల యింద్రజిత్తుమైందుడను వానరోత్తమునిగొట్టె. మఱియు నైదుబాణములచేత గజుడను వానరోత్తముని గొట్టె. జాంబవంతునిమీద ముప్పదిబాణములను బ్రయోగించె. ఆవిధముగానేనీలుడను వానరోత్తమునిమీదగూడ మిగుల దీక్ష్ణములైనవియును, వరమువలన సంపాదింపబడినవియును, నగుముప్పదిబాణములను బ్రయోగించె. ఆవిధముగానే ఋషభసుగ్రీవాంగదులమీదగూడ ముప్పదేసిబాణముల బ్రయోగించె. అంతట నూరకుండక మిగుల దీక్ష్ణములైనవియును, వరమువలనసంపాదింపబడినవియును, నగుననేకబాణములచేత ఇతరులగు ననేకవానరులను గూడ సంహరించె. ఇవ్విధముగ ననేకవిధములగు బాణములనుబ్రయోగించుచు నయ్యింద్రజిత్తు మిగులగోపముగలవాడై కాలాగ్నివలె మండిపడుచుండె. ఇవ్విధముగా మిగుల గొప్పదగు నాయుద్ధమునందు సూర్యునితో సమానములైనవియును, మిగులవేగముగాబోవునవియును, నగుబాణములచేత వానరసైన్యమును సర్వమును మర్దించె. ఆసమయమునందు బాణసముదాయముచేత మోహమును బొందింపబడినదియును, మిగుల వ్యాకులమును బొందియున్నదియును, నెత్తురుచేత వ్యాప్తమైనదియును, నగువానరసైన్యమును జూచి పరమానందమునుబొందె. అంతట నూరకుండక మిగుల గొప్పదగు తేజస్సుగలవాడును, రావణాసురునకుబుత్రుడును, బలవంతుడును, నగునింద్రజిత్తు మిగుల భయంకరమైనదియగు బాణవర్షమును మరల గురిపించె.

మఱియును మిగులగొప్పదగు నయ్యుద్ధమునందుదనసైన్యమునువదలి వానరసైన్యముమీద నల్లనిమేఘమువర్షించు విధముగా మిగులగొప్పదగు బాణవర్షమునుగురిపించె. ఆ బాణవర్షమునుగురిపించునపుడు కనబడకుండునట్లు ఆకాశమునందునిలిచియుండె. ఆసమయమునందు వానరవీరులందఱును, ఇంద్రజిత్తుయొక్కబాణములచేత బ్రద్దలుసేయబడినశరీరములుగలవారును, రాక్షసమాయచేత మోహముపొందింపబడినవారును, వికారమైనధ్వనిగలుగునట్లుగా రోదనమును జేయుచున్నవారునునై యింద్రునియొక్క వజ్రాయుధముచేతగొట్టబడిన పర్వతములవలె గ్రిందబడిరి. ఆసమయమునందు వానరులందఱును, వానరసైన్యమునందుమిగులదీక్ష్ణములగు బాణములనేచూచిరిగాని మాయచేతకనబడకుండువాడును, దేవతలకుశత్రుడును, నగు నింద్రజిత్తునుజూడలేకపోయిరి. అంతటమహానుభావుడును, రాక్షసాధిపతియును, నగు నింద్రజిత్తుమిగులదీక్ష్ణములగు నగ్రభాగములుగల బాణసముదాయములచేత వానరులందఱనుగప్పివేసె. మఱియు నాయింద్రజిత్తు ప్రజ్వలించుచున్న

యగ్నిదేవునితో సమానములైనవియును, విస్ఫులింగముల తోఁగూడిన యగ్నిజ్వాలలవంటి జ్వాలలతోఁగూడుకొనినవియును, నగు శూలములయొక్కయు, ఖడ్గములయొక్కయు, గండ్రగొడ్డండ్లయొక్కయువర్షమునుగురిపించె. అంతటనగ్నితోసమానములగు నింద్రజిత్తుయొక్క బాణములచేతగొట్టబడిన వానరయూథనాథులందఱును, వికసించిన మోదుగుచెట్లవలె బ్రకాశించుచుండిరి. అంతటనావానరులందఱునొకరితోనొకరు తమబాధలనుజెప్పికొనుచు వికారస్వరములతో నేడ్చిరి. మఱియునావానరోత్తములందఱునునింద్రజిత్తుయొక్క బాణములచేత గొట్టబడిన శరీరముగలవారై క్రిందబడిరి. మఱియు నయ్యింద్రజిత్తుతన్నుజూచుచున్న వానరులయొక్క నేత్రములయందు మిగులదీక్ష్ణములగుబాణములను బ్రయోగించె. అంతటనావానరులందఱును మిగులబాధవొందిన శరీరముగలవారును, మిగులవ్యసనమునుబొందుచున్నవారును, నగుచు గ్రిందబడిరి. మఱియునాసమయమునందా రాక్షసోత్తముడగు నింద్రజిత్తుప్రాసములచేతను, మిగులదీక్ష్ణములగు శూలములను నాయుధములచేతను, మంత్రములతోఁగూడుకొనిన యస్త్రములచేతను, వానరోత్తములగుహనుమంతుని, సుగ్రీవుని, అంగదుని, గంధమాదనుని, జాంబవంతుని, వేగవంతుడగుసుషేణుని, మైందుని, ద్వివిదుని, నీలుని, గవాక్షుని, గజుని, గోముఖుని, పచ్చనివెండ్రుకలుగలకేసరిని, విద్యుద్దంష్ట్రుని, సూర్యాననుని, జ్యోతిముఖుని, దధిముఖుని, పావకాక్షుని, నలుని, కుముదుని, మిగులదృఢముగామర్దించె. మఱియునాసమయమునం దింద్రజిత్తుగదలచేతను, బంగారపుపిడులుగల బాణములచేతను, వానరవీరులనుమర్దించి సూర్యకిరణములతోసమానములైన బాణపరంపరలచేత రామలక్ష్మణుల మీదబాణవర్షమునుగురిపించె. అట్లుబాణవర్షముచేత నంతటనుముంపబడినవాడును, ఆబాణవర్షమునుజూచి మిగులనాశ్చర్యమునుబొందుచున్నవాడును, నగు రాముడుఅప్పుడులక్ష్మణునితోనిట్లనియె.

తమ్ముడా! లక్ష్మణా! రాక్షసోత్తముడును, దేవేంద్రునకుశత్రుడును, నగు నింద్రజిత్తుమిగులదీక్ష్ణములగుబాణములచేత మిగులభయంకరమైనవానరసైన్యమునుమర్దించె. ఇప్పుడు బ్రహ్మాస్త్రమునాశ్రయించి మనలనుగొట్టుచున్నాడు. మఱియునోతమ్ముడా! లక్ష్మణా! దేవేంద్రునిచేతనివ్వబడినవరములుగలవాడును, మహానుభావుడును, అంతర్ధానముగాజేయబడిన భయంకరమగు శరీరముగలవాడును, అస్త్రములనుబ్రయోగించుటకారంభించినవాడును నగు నీయింద్రజిత్తుమనచేత యుద్ధమునందుజయింపబడడని తలచుచున్నాను. మఱియునోతమ్ముడా! లక్ష్మణా! ఇతనికిట్టియస్త్రమునిచ్చుటచేత బ్రహ్మదేవుడుఅపరిమితమగు ప్రభావముగలవాడని తలచుచున్నాను. కాబట్టిబుద్ధిమంతుడవైన యోలక్ష్మణా! నీవునిశ్చలమనస్సుగలవాడవై యీయింద్రజిత్తుయొక్కబాణములనుసహింపుము. మఱియు నీయింద్రజిత్తు బాణవర్షముచేత దిక్కులుదెలియకుండునట్లు చేయుచున్నాడు. ఇతనిబాణవర్షమునందు మునిగిపోయిన వానరసైన్యమేమియును గనబడడములేదు. ఇప్పటిస్థితిని జూడగ నీయింద్రజిత్తు మిగులదీక్ష్ణములగు బాణములనుబ్రయోగించి మనలనుయుద్ధభూమియందు మూర్ఛవొందిబడియుండునట్లుసేసి పిమ్మటసకలసంపదలచేతను మనోహరమగు లంకాపట్టణమునకుబోవునని తోచుచున్నదనియె. ఇట్లు రాముడుచెప్పుచుండగ నింద్రజిత్తు మిగులదీక్ష్ణములగు బాణములనుబ్రయోగించె. అవ్విధముగ నింద్రజిత్తుచేత బ్రయోగింపబడిగొట్టబడినవారై యీరామలక్ష్మణు లిరువురును బరవశులైక్రిందబడిరి. అవ్విధముగ నారామలక్ష్మణుల నిరువురను మూర్ఛవొందించి రాక్షసేంద్రుడగు నింద్రజిత్తు పరమసంతోషమునుబొందె. అవ్విధముగ నయ్యింద్రజిత్తు యుద్ధమునుజేసి వానరసైన్యమునుసర్వమును, రామలక్ష్మణులనుమరణమునుబొందునట్లుగాజేసి రావణాసురునిచేత బరిపాలింపబడిన లంకాపట్టణమునకు మిగులవేగముతోబోయె. పోయియందుబ్రవేశించె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి డెబ్బదిమూడవసర్గ ముగిసెను.

{ విభీషణుడును నాంజనేయుడును మూర్ఛవొందినజాంబవంతుడు మొదలగువారిని వెదకుట. }

అట్లు రామలక్ష్మణులిరువురును, ఇంద్రజిత్తుచేతగొట్టబడగానేవానరసైన్యమంతయును మిగులవ్యసనమునుబొందె. మఱియుసుగ్రీవనీలాంగదజాంబవంతులుగూడ గదలుటకును మెదలుటకును శక్తిలేనివారైక్రిందబడి యేమియును దెలియనివారైయుండిరి. అట్లు మిగులనధికమగుదుఃఖసముద్రమునందుమునిగియున్న వానరసైన్యమునుజూచి బుద్ధిమంతులలోనుత్తముడగు విభీషణుడు వానరవీరులనందఱునోదార్పదలచి నిరుపమానములగు వాక్యములతో నిట్లనియె.

వానరోత్తములారా! మీరువ్యసనమునుబొందకుడు. రాజపుత్రులగు నీరామలక్ష్మణులిరువురును బ్రహ్మదేవుని వాక్యమునువ్యర్థముగా జేయదగదనితలచి యింద్రజిత్తుయొక్క యస్త్రసముదాయముచేత బద్ధులవలె గ్రిందబడి

యున్నారేగాని వాస్తవముగవివశత్వమును బొందినవారుగారు. మఱియునీరామలక్ష్మణులు బ్రహ్మదేవునిచేతనింద్రజిత్తునకు బ్రహ్మాస్త్రమివ్వబడినదనియెడు సంకల్పముగలవారై యీయస్త్రమునకుబద్ధులై యున్నారుగాన మీరు వ్యసనమునుబొందకుడు. ఇదివ్యసనమును బొందదగినకాలముగాదనియె. అప్పుడు ధీమంతుడును, వాయుదేవునకుబుత్రుడుననగు హనుమంతుడు బ్రహ్మదేవునివాక్యముల వ్యర్థముచేయగూడదను సంకల్పముగలవాడై కొంచెముసేపుబ్రహ్మాస్త్రముచేత బద్ధుడైనవానివలెగనబడి పిమ్మట దెలివొంది విభీషణునివాక్యమునువిని యిట్లనియె.

రాక్షసోత్తమా! విభీషణుడా! ఈవిధముగాజంపబడిన యీవానరసైన్యమునం దెవ్వడెవ్వడుప్రాణములనుధరించియున్నాడో చూతము. చూచిముందుగవారలనోదార్తమనియె. అంతటవానరరాక్షసోత్తములగు నయ్యిరువురును దీపములను జేతబట్టుకొని యాయుద్ధభూమియందంతటనుసంచరించుచుండిరి. ఆసమయమునందు పర్వతాకారులగువానరులందఱును, భిన్నములగుతోకలును, పాదములును, వ్రేళ్లును, కంఠములును, గలవారును, సర్వావయవములనుండియు స్రవించుచున్నరక్తముగలవారును, నైయుద్ధభూమియందు బడియుండిరి. మఱియు నాయుద్ధభూమియంతయును, క్రిందబడియున్నవియును, ప్రకాశించుచున్నవియును, నగు నస్త్రములచేత మిగులభయంకరమైనదైయుండె. ఆసమయమునందు ఆయిరువురునావిధముగావెదకుచు, సుగ్రీవుడు, అంగదుడు, నీలుడు, శరభుడు, గంధమాదనుడు, గవాక్షుడు, సుషేణుడు, మొదలుగాగలవానరోత్తములందఱును మరణమునుబొంది క్రిందబడియుండుటనుజూచిరి. మఱియును, మైందుడు, నళుడు, జ్యోతిముఖుడు, ద్వివిదుడు, పనసుడు మొదలుగాగలవారుగూడ క్రిందబడియుండిరి. ఇవ్విధముగా క్రిందబడియున్నవానరవీరులనుజూచిరి. పిమ్మటసముద్రముయొక్క ప్రవాహముతోసమానమైనదియును, ఇంద్రజిత్తుయొక్కబాణములచేతబీడింపబడినదియును, నగు వానరసైన్యమునుజూచి హనుమంతుడునువిభీషణుడును జాంబవంతుడు పడియున్నచోటునువెదకుచుండిరి. ఆసమయమునందు డెబ్బదాఱుకోట్లవానరులుమరణమునుబొంది క్రిందబడియుండిరి. అట్టివానరసమూహమునందు సహజమగు ముసలితనముతో గూడుకొనియున్నవాడును, అనేకములగు బాణములచేత వ్యాప్తమైన దేహముగలవాడును, మిగులబాధనొందుచున్నవాడును, నగు జాంబవంతునివెదకివెదకికనుగొనిరి. అట్లుజాంబవంతునిజూచినపిమ్మట పులస్త్యునకుబుత్రుడగు విభీషణుడిట్లనియె.

పూజ్యుడవైన యోజాంబవంతుడా! తీక్ష్ణములగుబాణములచేత నీప్రాణములునిన్నువదలి పోలేదుగదాయనియె. అవ్విధముగ విభీషణుడుపలికినపలుకులనువిని ఋక్షగణమునందుత్తముడును, నగు జాంబవంతుడు మిగులకష్టముగా బాధనోర్చుకొని యావిభీషణునితోనిట్లనియె. రాక్షసోత్తమా! గొప్పదగుపరాక్రమముగలవాడా! విభీషణుడా! నేనుమిగులదీక్ష్ణములగు బాణములచేత బీడింపబడుచుండుటచేతకన్నులుదెరచిచూడలేకపోయినను స్వరముచేత నీవు విభీషణుడవని తెలిసికొంటిని. రాక్షసోత్తమా! అంజనాదేవియందు వాయుదేవునివలనబుట్టినవాడును, వానరోత్తముడును, నగు హనుమంతుడుజీవించియున్నాడా? యనియె. ఆవాక్యమునువిని విభీషణుడుజాంబవంతునితో నిట్లనియె. పూజ్యుడవైనయోజాంబవంతుడా! నీవురామలక్ష్మణులనువదలి హనుమంతునిజీవించియున్నాడా? యనియడుగుటకుగారణమేమి? మఱియునోజాంబవంతుడా! రామునందును, సుగ్రీవునియందును, నీవుప్రేమనుజూపింపకపోవుటకుగారణమేమి? వాయుపుత్రుడగు హనుమంతునియందే ప్రేమనుంచుటకుగారణమేమి; ఈవిషయమును సర్వమునువిశదముగ నాకుంగజెప్పవేయనినవిని జాంబవంతుడిట్లనియె.

విభీషణుడా! రామలక్ష్మణాదులనందఱునువదలి హనుమంతునియొక్క వృత్తాంతమునేయడుగుటకు గారణమునుజెప్పెదవినుము. వీరుడగు హనుమంతుడు మరణమును బొందెనేని వానరబలమంతయును నశించిపోయినదనుటకు గొంచెమైనసందేహములేదు. హనుమంతునిప్రాణములు పోయెనేని మనప్రాణములన్నియును, పోయినవనియే తెలిసికొనుము. కావుననేను అవ్విధముగ నడిగితిని. విభీషణుడా! వాయువుయొక్క వేగముతోసమానమగు వేగముగలవాడును, అగ్నిదేవునియొక్కతేజస్సుతోసమానమగు తేజస్సుగలవాడును, నగుహనుమంతుడునిజముగాజీవించి యున్నాడా? యనియె. ఆసమయమునందుహనుమంతుడు మిగులవినయముతో వృద్ధుడగుజాంబవంతునియొద్దకువచ్చి యతనిపాదములనుబట్టుకొని నమస్కారమునుచేసి హనుమంతుడనగు నేనువచ్చితిననియె. అట్లు హనుమంతుడుచెప్పిన మాటలవినిజాంబవంతుడు మిగుల వ్యసనమును బొందుచున్నవాడయ్యును, పరమసంతోషముగలవాడై తన్నుజచ్చిపుట్టినవానిగాదలచె. పిమ్మట మిగులతేజోవంతుడగు జాంబవంతుడుహనుమంతునితో నిట్లనియె.

నాయనా! వానరోత్తమా! హనుమంతుడా! నీవిటుర

మ్ము. వచ్చి వానరుల నందఱను రక్షింపుము. నీయట్టిపరాక్రమముగలవాడు లోకములో నెవ్వడును లేడు. నీవు నాకుబరమస్నేహితుడవు. ఇదినీపరాక్రమమును జూపించుటకుదగినకాలము. ఇప్పటియాపదను దీర్చుటకు నీకంటెనితరుడెవ్వడును లేడు. హనుమంతుడా! భల్లూకములయొక్కయు, వానరులయొక్కయు వీరులకు సంతోషమును గల్పింపుము. ఇంద్రజిత్తుయొక్క బాణములచేత నపరిమితముగా బీడింపబడిన రామలక్ష్మణులనిరువురను బాధారహితులనుగా జేసిబ్రతికింపుము. ఆకాశమార్గము నవలంబించి సముద్రమునుదాటి పర్వతములలో నుత్తమమగు హిమవత్పర్వతమునకుబొమ్ము. పిమ్మట నాపర్వతమునుదాటి సువర్ణమయమైనదియును, మిగులబొడవైనదియును, సకల పర్వతములలో నుత్తమమైనదియును, నగు కైలాసపర్వతమునకుబొమ్ము. ఆపర్వతశిఖరములయొక్క మధ్యప్రదేశమునందు మిగుల బ్రకాశించుచున్నదియును, నిరుపమానమైన కాంతిగలదియును, నానావిధములగు నోషధులతో గూడుకొనినదియును, నగు నోషధిపర్వతమును జూడుము. ఆపర్వత శిఖరమునందు దశదిక్కులను బ్రకాశింపజేయుచు నాలుగౌషధములుగలవు. ఆయౌషధములు నాలుగును గ్రమముగ మృతసంజీవని యనియును, విశల్యకరణియనియును, సావర్ణ్యకరణియనియును, సంధానకరణియనియును జెప్పబడును. ఆయౌషధములను నాలుగింటిని గ్రహించియతిశీఘ్రముగ రమ్ము. తిసికొనివచ్చి ప్రాణహీనులగు వానరులనందఱను బ్రదికింపుమనియె. ఇవ్విధముగ వానరోత్తముడగుజాంబవంతుడు చెప్పినమాటనువిని యుదకవేగముచేత సముద్రమునిండిన విధముగ బలవేగములతో సంపూర్ణుడయ్యె. పిమ్మట హనుమంతుడాపర్వతముయొక్క తటాగ్రమునందునిలిచె. అప్పుడాహనుమంతుడు రెండవపర్వతమువలె ప్రకాశించె. మఱియు నాసమయమునందు వానరోత్తముడగు హనుమంతునియొక్క పాదములచేత బీడింపబడినయాపర్వతము ఆబాధనుసహింపలేనిదయ్యె. అంతటనాహనుమంతుడు గుప్పించి యంతరిక్షమునకెగిరె. అప్పుడాహనుమంతునియొక్క వేగముచేత నాపర్వతమునందలి వృక్షములన్నియును బెల్లగిలి యంతరిక్షమునకెగిరె. మఱియు నాపర్వతముయొక్క శిఖరములన్నియును భిన్నములయ్యె. అవ్విధముగ బీడింపబడినదియును, భగ్నములగువృక్షములును, తొఱ్ఱలనుగలదియును, ఘూర్ణిల్లుచున్నదియునునగు నాపర్వతోత్తమునందు వానరులందఱును నిలువజాలకపోయిరి. మఱియునారాత్రియందు లంకాపట్టణము శిథిలములగు పెద్దపెద్దద్వారములు గలదియును, భగ్నములగుగృహములును, గోపురములునుగలదియును, భయముచేత వ్యాకులమైనదియునునై నాట్యమును జేయుచున్నదానివలె గడగడవణకె. మఱియు నాసమయమునందు, పర్వతముతోసమానుడును, వాయుదేవునకుబుత్రుడును, నగు హనుమంతుడు సముద్రములతోగూడభూమినిసర్వమును గంపింపజేసె. అప్పుడాహనుమంతుడు మేరుమందరపర్వతములతో సమానమైనదియును, నానావిధములగు కొండయూటలచేత వ్యాకులమైనదియును, నగు మలయపర్వతమునధిష్ఠించె. ఆమలయపర్వతము నానావిధములగు వృక్షములతోడను, తీగలతోడను, గూడుకొనినదియును, వికసించుచున్నపద్మములును, కలువలునుగలదియును, దేవతలచేతను, గంధర్వులచేతను, సేవింపబడుచున్నదియును, అప్సరస్త్రీలతో గూడుకొనినదియును, అఱువదియామడ వెడల్పుగలదియును, విద్యాధరులుమొదలగువారిచేత సేవింపబడినదియును, నానావిధమృగగణములచేత వ్యాప్తమైనదియును, నానావిధములగు చరియలచేత బ్రకాశించుచున్నదియును, నై మిగులమనోహరముగ బ్రకాశించుచుండె. ఆసమయమునందు వాయుదేవునకు బుత్రుడును, మేఘముతో సమానుడునునగు హనుమంతుడు ఆపర్వతమునందున్న యక్షులను, గంధర్వులను, కిన్నరులను, మఱియునితరులను, వ్యాకులపరచుచు దనదేహమును వృద్ధినిబొందించె. అప్పుడాహనుమంతుడు పాదములచేత నామలయపర్వతమును బలముగా దొక్కిపట్టి బడబాముఖమునకు దుల్యముగ దననోరును దెరచికొనిసకలరాక్షసులను భయపఱచుచు మిగులనధికమగు సింహనాదమును జేసె. అట్లు ధ్వనిచేయుచున్న హనుమంతునియొక్క సింహనాదధ్వనినివిని లంకాపట్టణమునందున్న రాక్షసులందఱును భయముచేత నిలువలేకపోయిరి. ఆసమయమునందు భయంకరమగు పరాక్రమముగల హనుమంతుడు రామునికొఱకు నమస్కారమును జేసి రామునికొఱకు మిక్కిలియాశ్చర్యకరమగు కార్యమును జేయుటకు యత్నించె. అంతటనధికమగు వేగముగలయాహనుమంతుడు సర్పముతోసమానమగు తోకనెత్తికొని పృష్ఠభాగమున వంచి చెవులనుముడుచుకొని బడబాముఖముతో సమానమగునోరును దెఱచికొని యాకాశమునకెగిరె. అంతట నాహనుమంతుడు తనపాదవేగముచేత వృక్షములయొక్కసముదాయములను, పర్వతశిఖరములను, పర్వతమునందలి శిలలును. సామాన్యులగు వానరులను నంతరిక్షమునకు, తనతోగూడనెగిరివచ్చునట్లుపోయె. అవ్విధముగ హనుమంతునితోగూడనెగిరిపోయిన యవియన్నియును, గొంతదూ

రమపోయి పిమ్మట సముద్రమునందు బడియె. ఆసమయమునందు పర్వతముతో సమానుడును, వాయుదేవునకు బుత్రుడును, నగు నాహనుమంతుడు సర్పముల యొక్క పడిగలతో సమానములగు భుజములను ప్రసరింపజేసికొని పోవునప్పుడు పర్వతములకధిపతియగు మేరుపర్వతము పోవుచున్నదికాబోలునని యెల్లవారికిని సంకల్పముగలుగునట్లుండె. మఱియు నాసమయమునందు హనుమంతుడు, సముద్రమును, దానియందలియలలను, సకలభూతసముదాయములను, కంపింపజేయుచు మహావేగముతో విష్ణుచక్రముపోయినవిధముగ బోయె. మఱియును వాయుదేవునియొక్క వేగమువంటి వేగముగల హనుమంతుడు నానావిధములగు పర్వతములను, వృక్షములను, మడుగులను, నదులను, తటాకములను, పట్టణములను, పల్లెలను, చూచుచు నంతరిక్షమార్గమున బోయె. మఱియు నాహనుమంతుడప్పుడు తండ్రియగువాయుదేవునియొక్క పరాక్రమమువంటిపరాక్రమముగలవాడును, శ్రమలేనివాడును, నగుచు నంతరిక్షమార్గమునబోవుచుండె. అట్లుపోవునప్పుడు ఆహనుమంతుడధికమగు వేగముగలవాడైయుండె. మఱియునా హనుమంతుడు సింహనాదముచేత దశదిక్కులను బూరించుచుండె. అవ్విధముగ బోవుచున్నసమయమునందు ఆహనుమంతుడు జాంబవంతునియొక్క వాక్యములను మరవకస్మరించుచుండె. అవ్విధముగ బోయిపోయి వానరోత్తముడగు హనుమంతుడు మిగుల శీఘ్రముగా నేహిమవత్పర్వతమునుజూచె. ఆహిమవత్పర్వతము నానావిధములగుకొండయూటలతో గూడుకొనినదియును, నానావిధములగుదరియలును, గుహలును, గలదియును, తెల్లనిమేఘములయొక్క తునుకలతో సమానములైనవియును, చూచుటకు మనోహరముగనున్నవియును నగు శిఖరములచేత బ్రకాశించుచున్నదియును, నానావిధములగు వృక్షములతోగూడుకొనినదియును, నైయుండె. అట్లుమిగుల మనోహరమైనదియును, మిగుల బ్రసిద్ధములైనవియును, మిగుల శ్రేష్ఠములైనవియును, అత్యున్నతములైనవియునునగు శిఖరములు గలదియును, నగుహిమవత్పర్వతమునుజూచె. అంతటనా పర్వతమునందు, మిగుల పావనములైనవియును, దేవతలయొక్కయు, ఋషులయొక్కయు, సముదాయముచేత సేవింపబడుచున్నవియును, నగు నాశ్రమస్థలములను జూచె. మఱియునాపర్వతమునందు బ్రహ్మకోశము, రజతాలయము, శక్రాలయము, ఈశ్వరబాణమోక్షస్థానము, హయగ్రీవస్థానము, బ్రహ్మశిరశ్ఛేదస్థానము, మొదలుగాగల ప్రదేశములనుజూచె. మఱియు నయ్యాప్రదేశములయందుసంచరించుచున్నయమకింకరులనుజూచె. మఱియు నాపర్వతము నందలి వజ్రాలయమును, కుబేరాలయమును, సూర్యాలయమును, బ్రహ్మాలయమును, పరమేశ్వరునిధనురాలయమును, పాతాళలోకమునకు బోదగిన బిలమును, మఱియు ననేకప్రదేశములనుజూచె. పిమ్మట మిగులశ్రేష్ఠమగు కైలాసపర్వతమును, ఆపర్వత సమీపమునందున్న హిమవంతమను శిలను, అవ్విధముగానే దానిసమీపమునందున్న ఋషభమను పర్వతమును, మఱియు బంగారపుకొండను, ప్రకాశించుచున్న సర్వౌషధములచేతను బ్రకాశించుచున్న మఱియొకపర్వతోత్తమును జూచె. అట్లుమిగుల తేజస్సుగలదై ప్రకాశించుచున్న పర్వతోత్తమునుజూచి వాయుదేవునకు బుత్రుడగుహనుమంతుడు ప్రదక్షిణమును జేసి యాపర్వతమునందలి యౌషధముల నన్వెటనివెదకె. వానరోత్తముడగు నాహనుమంతుడు వేయియామడ నతిక్రమించి దివ్యౌషధములను ధరించిన యాపర్వతమునందంతటను సంచరించె. ఆసమయమునందాపర్వతోత్తమము నందలి మిగుల గొప్పవగు నౌషధములన్నియును, తమనుగొనిపోవుటకు హనుమంతుడువచ్చెననుసంగతిని దెలిసికొనినవై యంతర్హితములయ్యె. అప్పుడు మహానుభావుడగు హనుమంతుడు ఆయౌషధములు కనబడకపోవుటచేత మిగులకోపముగలవాడును, ఔషధములు గనబడకపోవుటను సహింపనివాడును, అగ్నివలెనెఱ్ఱనైననేత్రములుగలవాడును, నగుచు సింహనాదమునుజేసి యాపర్వతముతో నిట్లనియె.

ఓపర్వతోత్తమా! నీవు రామునియందు దయలేనిదానవైనట్లు తోచుచున్నది. ఇట్లు తోచుట నా స్తవమయ్యెనేని నాబలముచేత దిరస్కరింపబడినదానవై మిగులశ్రమహొందగలవనియె. అట్లు చెప్పి యేనుగులతో గూడుకొనినదియును, బంగారముతో గూడుకొనినదియును, అనేకవేల ధాతువులతో గూడుకొనినదియును, ప్రజ్వలించుచున్న శిఖరములుగలదియును, నగు నాపర్వతమును మిగులశీఘ్రముగ మధించె. పిమ్మట నాపర్వతశిఖరమును బెల్లగించుకొని యంతరిక్షమునకెగిరి దేవదానవులకుగూడ భయమునుగలుగజేయుచు నంతరిక్షమార్గమున బోవుచుండె. అట్లుగరుడునియొక్క వేగమువంటి వేగముగలవాడై పోవుచున్న యాహనుమంతునిజూచి యాకాశమునందు దిరుగునట్టి సిద్ధవిద్యాధరాదులందఱును సంతోషముతో ననేకవిధములస్తోత్రములను జేసిరి. అవ్విధముగ నాహనుమంతుడు తనతో సమానమగు శిఖరమును గ్రహించి యాకాశమున బోవుచు రెండవసూర్యునివలె బ్రకాశించుచుండె. మరియు

వా సమయమునందా పర్వతశిఖరమునుధరించి యంతరిక్షమునబోవుచున్న హనుమంతుడు వేయియంచులుగలదియును, అగ్నితెరాగూడుకొనినదియును నగు చక్రమునుధరించియంతరిక్షమార్గమునబోవుచున్న విష్ణుదేవునిబోలియుండె. ఇవ్విధముగ నాహనుమంతుడు పర్వతశిఖరమునవలంబించి యంతరిక్షమార్గమున మరల లంకాపట్టణమునకువచ్చె.

అప్పుడు వానరులలోజీవించియున్న కొందఱు హనుమంతునిజూచి సంతోషముతోనధికముగా సింహనాదమునుజేసిరి. ఆమహాధ్వనులనువిని లంకాపట్టణమునందు నివసించినరాక్షసులందఱును మిగులభయంకరముగా గూతలిడిరి. అంతటనాహనుమంతుడు ఆపర్వతమునువానరులయొక్కమధ్యమందుదించి యుత్తములగు వానరులకందఱకును నమస్కారమునుజేసె. అంతట విభీషణునిగౌగిలించుకొనియె. ఆసమయమునందు మానవోత్తములగు రామలక్ష్మణులిరువురును ఆయౌషధములయొక్క గంధమునాఘ్రాణించినతోడనే ప్రాణరహితములగు శరీరములుగలవారైనిద్రపోయిలేచినవారివిధముగ లేచికూర్చుండిరి. అవ్విధముగానే వానరులందఱును లేచికూర్చుండిరి. మఱియునయ్యింద్రజిత్తుచేత జంపబడినవానరులందఱును మరల జీవించుటయేగాక తొల్లిటిచందముగ బలముగలవారుగూడనైరి. మఱియు, నారాక్షసులతో యుద్ధమునుజేయుటకారంభించినకాలముమొదలుకొని చచ్చినవానరులుగూడజీవించి తొల్లిటివిధముగా బలముగలవారైరి. ఆసమయమునందు వానరులందఱును నదివఱకుజచ్చినరాక్షసులు మరలజీవించినయెడల హానిగలుగునని యెడుతలంపుతో నారాక్షసులకళేబరములను సముద్రమునందుబడవైచిరి. అంతట వాయుపుత్రుడును, అపరిమితములగు బలపరాక్రమములుగలవాడును, నగు హనుమంతుడు మిగులవేగముతోనాపర్వతమునుమరలగొనిపోయి హిమవత్పర్వతమునందుబెట్టివచ్చె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి డెబ్బదినాలుగవసర్గ ముగిసెను.

(*)-

వానరులు లంకాపట్టణమును నిప్పుకొరవులచే గాల్చుట.

అంతట నధికమగు తేజస్సుగలవాడును, వానరాధిపతియునునగుసుగ్రీవుడు, అర్థయుక్తమైనదియును, మిగులశ్రేష్ఠమైనదియునునగు మాటనుజెప్పదలచి హనుమంతునితో నిట్లనియె.

వానరోత్తమా! హనుమంతుడా! కుంభకర్ణుడుమొదలుగాగలసోదరులును, పుత్రులును నగు రాక్షసోత్తములందఱును మరణమునుబొందుటచేత రావణుడుమరలయుద్ధమునకురాజాలడు. కావుననోహనుమంతుడా! మహాబలులగువానరోత్తములందఱును నిప్పుకొఱవులను జేతబట్టుకొని లంకాపట్టణమునందు ప్రవేశించి కాల్చునట్లుచేయుమనియె. అంతగొంతసేపటికిసూర్యుడస్తమయమునుబొందె. అంతట మిగులభయంకరమగు సాయంకాలమువచ్చె. అప్పుడువానరోత్తములందఱును నిప్పుకొఱవులను జేతబట్టుకొని లంకాపట్టణమునకభిముఖులై బయలువెడలిపోయిరి. అవ్విధముగ నిప్పుకొఱవికట్టెలనుబట్టుకొని వచ్చుచున్నవానరులనుజూచి గుల్మములయందు గావలియున్నరాక్షసులందఱును మిగులభయముగలవారై నానాదిక్కులకుబరుగెత్తిరి. అంతటనావానరులందఱును, గోపురములయందును, వీధులయందును, నానావిధములగు రక్షాస్థానములయందును, మేడలయందును నిప్పునుబెట్టిరి. అంతటనాయగ్నిదేవుడు రాక్షసులయొక్క గృహములను దహనముసేసె. ఆసమయమునందు పర్వతముతోసమానములగు గృహములన్నియును, కాలిక్రిందబడియె. మఱియు నాగృహములయందలియగరు, చందనము, మొదలగునవియన్నియును గాలిపోయె. మఱియు నాపట్టణమునందలి ముత్యములును, మృదువులగుమణులును, వజ్రములును, పవడములును, పట్టువస్త్రములును, మిగులమంగళకరములగు కౌశేయములును, నానావిధములగు కంబళివస్త్రములును, మఱియు నానావిధములగు భాండములును, నానావిధములగు స్థలములును, ఏనుగులయొక్కకంఠాభరణములును, రథములును భస్మములయ్యె. మఱియు నాసమయమునందు యోధులయొక్కకవచములును, ఏనుగులయొక్కయు, గుఱ్ఱములయొక్కయు, కవచములును, ఖడ్గములు, ధనుస్సులు, నారులు, బాణములు, తోమరములు, అంకుశములు, కంబళములు మొదలగునవియును, చామరములుమొదలగునవియును, పెద్దపులిచర్మములును, కస్తూరిమొదలగుపరిమళద్రవ్యములును, ముత్యములును, మణులును, విచిత్రములగుమేడలు మొదలగునవియును, కాలిభస్మములయ్యె. మఱియు నాసమయమునందగ్నిదేవుడు సకలవస్తువులనుదగులబెట్టె. ఇంతయగాకయాయగ్నిదేవుడు నానావిధములగుగృహములయొక్క కప్పులనుదగులబెట్టె. మఱియు నాసమయమునందు గృహములయందు భ్రమముగలరాక్షసులయొక్క ప్రియములగు గృహములన్నియును దగులబడిపోయె. సువర్ణమయములును, చిత్రములును నగు కవచములుగలవారును, పుష్పమాలికలను, దివ్యములగువస్త్రముల

నుధరించినవారును, మద్యపానముచేత చపలములగునేత్రములుగలవారును, మదముచేత తెల్లగా నడచుచున్నవారును, సురతములయందాసక్తినిబొందియున్నవారును, శత్రువులయందధికమగు కోపముగలవారును, గదలను, శూలములను, ఖడ్గములను, చేతులయందుధరించినవారును, మిగులవెలగలపరువులయందు భార్యలతోగూడ శయనించిన వారును, భీతచిత్తులై పుత్రులనుగ్రహించి యతిశీఘ్రముగ బరుగెత్తుచున్నవారును, నగు లంకాపురనివాసులు అనేకులు ఆసమయమునందు గాలిపోయిరి. మఱియు నాసమయమునందు మిగులసారముగలవియును, మిగులవెలగలవియును, గంభీరములగు గుణములుగలవియును, బంగారముచేతనిర్మింపబడినచంద్రశాలలతో గూడుకొనినవియును, రత్నములచేత చిత్రములగుగవాక్షములుగలవియును, మణులచేతను, పతకములచేతను, మిగులమనోహరముగ బ్రకాశించుచున్నవియును, సూర్యమండలమువఱకును వ్యాపించియున్నవియును, క్రౌంచపక్షులయొక్కయు, నెమళ్ళయొక్కయు, వీణలయొక్కయు, ఆభరణములయొక్కయు ధ్వనులతోగూడుకొనినవియును, పర్వతములతో సమానములైనవియును నగు గృహములన్నియును భస్మములయ్యె. మఱియు నాపట్టణమునందలి బహిర్ద్వారములుమొదలగునవియన్నియును నగ్నిచేతవ్యాప్తములైనవయ్యె. మఱియు నాసమయమునందు ఆపట్టణమునందలి మేడలుమొదలగునవియన్నియును నగ్నిజ్వాలలతో గూడుకొనియుండుటచేత మెఱుపులతోగూడుకొనిన మేఘములనుబోలియుండె. మఱియు ననేకవిధములగృహము లాసమయమునందుఅగ్నిచేత గాల్పబడినవై క్రిందబడియె. మఱియు నవ్విధముగ గ్రిందబడుచున్న యాగృహములన్నియును, దేవేంద్రునియొక్కవజ్రాయుధముచేత ఛేదింపబడినవగు పర్వతములయొక్కశిఖరములవలె గ్రిందబడియె. ఆసమయమునందు విమానాగ్రములయందు బవ్వళించినవారును, తగులబెట్టబడినశరీరములుగలవారును, వదలబడిన సర్వావయవములునుగలవారును నగు స్త్రీలందఱును హాహాకారములను జేయుచు రోదనమునుజేసిరి. అవ్విధముగ దగులబెట్టబడుచున్నగృహములు, ప్రజ్వలించుచున్న యోషధులతోగూడుకొనిన హిమాలయపర్వతములయొక్క శిఖరములవలె బ్రకాశించె. మఱియు నారాత్రియందగ్నిజ్వాలలచేత బ్రజ్వలింపజేయబడుచున్న యామేడలయొక్క యగ్రభాగములన్నియును పుష్పించిన మోదుగుచెట్లనుబోలియుండె. ఆసమయమునందు మావటివారలచేత విడిచిపెట్టబడిన యేనుగులును, గుఱ్ఱపురౌతులచేత విడువబడినగుఱ్ఱములు ను, లంకాపట్టణమునందు, ప్రళయకాలమునందు మహాసముద్రమునదిరుగుచున్న మొసళ్లుమొదలుగాగల క్రూరజంతువులనుబోలియుండె. మఱియు నాసమయమునందు విడివడివచ్చుచున్న యేనుగులనుజూచి గుఱ్ఱములును, గుఱ్ఱములనుజూచి యేనుగులును మిగులభయముగలవై పరుగెత్తుచుండె. అవ్విధముగలంకాపట్టణము తగులబడుచున్నసమయమునందు ఆమంటప్రతిఫలించుటచేత మహాసముద్రము యెఱ్ఱనిసముద్రమునుబోలియుండె. ఆసమయమునందువానరులచేతదగులబెట్టబడుచున్న లంకాపట్టణము ప్రళయకాలమునందు మండుచున్నభూమినిబోలియుండె. మఱియునాసమయమునందు ఆపట్టణమునందలి జనులందఱును ధూమముయొక్క బాధకుజాలక యపరిమితముగా రోదనమునుజేసిరి. ఆరోదనధ్వని పదియామడవఱకును వినబడియె. ఆసమయమునందు గొందఱురాక్షసులు ఆమంటయందుబడి చచ్చిపోదుమనుభయముతో బయలునకువచ్చుచుండిరి. అట్లువచ్చుచున్న రాక్షసులనుబట్టుకొని వానరులందఱును మిగులసాహసముగలవారై యాయగ్నియందుబడవైచిరి. ఆసమయమునందలి వానరులయొక్కయు, రాక్షసులయొక్కయు ధ్వనులుపదిదిక్కులను, సముద్రములను, భూమిని, ఆకాశమును, ప్రతిధ్వనులుగలవానినిగా జేసె. అంతనటవ్రణరహితులును, మహానుభావులును నగు రామలక్ష్మణులు మిగులధైర్యమును అవలంబించినవారలై మిగులశ్రేష్ఠములగు ధనుస్సులనుగ్రహించిరి. అప్పుడురాముడు ధనుస్సునుసవరించిటంకారమునుజేసె. ఆసమయమునందు రాక్షసులకుభయంకరమయినదియును, సంకులమైనదియునునయ్యె. ఆసమయమునం దవ్విధముగా ధనుష్టంకారమునుజేయుచున్నరాముడు వేదమయమగు ధనుస్సునుసవరించిటంకారమును జేయుచున్నవాడును, క్రోధోద్దీపితుడును, నగు పరమేశ్వరునిబోలియుండె. మరియు నారామునియొక్క ధనుష్టంకారము వానరులయొక్కయు, రాక్షసులయొక్కయు, ధ్వనులనతిక్రమించి వినబడుచుండె. అంతటరాముడుగోపోద్దీపితుడై కైలాసపర్వతముయొక్క శిఖరముతోసమానమగు నాలంకాపట్టణమునందంతటను దనబాణములువ్యాపించునట్లు బాణములను బ్రయోగించె. అట్టిబాణములచేత నాపట్టణమునందలి గోపురములన్నియును, కైలాసశిఖరములవలె గ్రిందబడియె. ఆసమయమునందు రామునియొక్కబాణములనుజూచి విమానములయందును, గృహములయందును నివసించినరాక్షసులు యుద్ధసన్నద్ధులై యపరిమితములగుకూతలనుబెట్టిరి. అట్లుయుద్ధసన్నద్ధులును, సింహనాదములను జేయుచున్న

వారలును, నగు రాక్షసులకు ఆరాత్రి కాళరాత్రివలె భయంకరమైనదైయుండెను. మఱియు నాసమయమునందు మహాత్ముడగు సుగ్రీవునిచేత యుద్ధమును జేయుటకు నియమింపబడిన వానరులందఱును, సుగ్రీవుని మ్రోలకువచ్చి నమస్కరించిరి. అప్పుడు సుగ్రీవుడు ఆవానరులతో నిట్లనియె. వానరోత్తములారా! మీరందఱును సమీపమునందలి ద్వారములనాక్రమింపుడు. మఱియు మీప్రయత్నమునకు ఏరాక్షసుడు విఘ్నమును జేయునో యట్టివానిని జంపివేయుడు. రాజాజ్ఞనతిక్రమించువానినిజంపుటవలన దోషమేమియును లేదనియె. అంతట వానరులందఱును మండుచున్నకొఱవికట్టెలను జేతులయందు బెట్టుకొని లంకాపుర ద్వారమునందు బ్రవేశించిరి. ఆసమయమునందు రావణాసురుడు అపరిమితమగుకోపముగలవాడయ్యె. అంతట రావణాసురుడు విజృంభించె. అప్పుడు దిశదిక్కులును నొక్కటైపోయినట్లుకనబడెను. ఆసమయమునందు రావణాసురుడు మూర్తీభవించిన రుద్రునియొక్క కోపమువలెనుండెను. అంతట రాక్షసోత్తముడగు రావణాసురుడు, కుంభకర్ణునిపుత్రులగు కుంభనికుంభులను వారిని యుద్ధమునకు బంపెను. వారితోగూడ యూపాక్షుడు, విరూపాక్షుడు, ప్రజంఘుడు, కంపనుడు, అను నలువురును రావణాసురుని యాజ్ఞనుబొంది యనేకవేలమంది రాక్షసులతోగూడ బయలువెడలిపోయిరి. ఆసమయమునందు ఆకుంభనికుంభులిరువురును రాక్షసులనుజూచి ఓరాక్షసోత్తములారా! శీఘ్రముగాయుద్ధమునకు బయలువెడలిరండు. ఆలస్యమును జేయవలదని రాక్షసవీరులకందఱకును నాజ్ఞనిచ్చిరి. అంతట నారాక్షసులందఱును యుద్ధసన్నద్ధులై సింహనాదములను జేయుచు లంకాపట్టణమునుండి బయలువెడలిరి. ఆసమయమునందు రాక్షసులు ధరించిన యాభరణకాంతులచేతను, వానరుల హస్తములయందలి యగ్నిజ్వాలలచేతను, ఉభయసేనలయొక్కయు మధ్యయందుండునట్టి యాకాశము చక్కగ బ్రకాశించుచుండెను. మఱియు నాసమయమునందు చంద్రునియొక్కయు, నక్షత్రములయొక్కయు, ఆరాక్షస వానరులు ధరించినయాభరణములయొక్కయు, కాంతులచేతనాకాశమంతయును మిగులమనోహరమైనదై ప్రకాశించుచుండెను. మఱియుచంద్రునియొక్కకాంతియును, భూషణములయొక్క కాంతియును, మండుచున్నగృహములయొక్క కాంతియును వానరులయొక్కయు, రాక్షసులయొక్కయు, కాంతియును, రాక్షసులయొక్కయు వానరులయొక్కయు, సేనలు మిగులజక్కగాబ్రకాశించునట్లు సేయుచుండెను. మఱియు వీనియొక్క కాంతులచేత సముద్రమునందలియడుగుప్రదేశముగూడమిక్కిలి యధికముగా బ్రకాశించుచుండెను. ఆసమయమునందు రాక్షససైన్యము, భయంకరములగు రథగజతురగపదాతులు గలదియును, ప్రకాశించుచున్న శూలగదాఖడ్గప్రాసతోమరకార్ముకములు గలదియును, భయంకరములగు పరాక్రమ పౌరుషములు గలదియును, ప్రకాశించుచున్న ప్రాసములను నాయుధములు గలదియును, అనేకవేలచిరుగంటలయొక్క ధ్వనులుగలదియును, బంగారపుత్రాళ్ళచేత బ్రకాశించుచున్న భుజములుగలదియును, ప్రకాశించుచున్న గండ్రగొడ్డండ్లుగలదియును, మిగులనధికముగాబ్రకాశించుచున్న గొప్పవగునాయుధములుగలదియును, బాణములచేత బ్రకాశించుచున్న ధనుస్సుగలదియును, గంధముపూలమాలికలు, మద్యము, మొదలగువానిచేత బరిమళించుచున్న వాయువుగలదియును, మిగుల భయంకరమైనదియును, శూరులగు జనులచేత వ్యాప్తమైనదియును, మిగులగొప్పదగు మేఘములయొక్క ధ్వనులుగలదియును, నైయుండెను. ఇవ్విధముగనున్నదియును, యుద్ధమును జేయవలయునని యెడు కుతూహలముతో వచ్చుచున్నదియును, నగు రాక్షససైన్యమునుజూచి వానరసైన్యమంతయును మిగులజపలతగలదై యధికముగా గూతలనుబెట్టె. ఆసమయమునందు మిగులగొప్పదగు రాక్షసబలమంతయును, మిగుల వేగముతో నెగిరి యావానరసేనమీదికి, నిప్పుమీదికిశలభములుపోయినవిధముగబోయె. మఱియు నాసమయమునందు భుజములయొక్క సమ్మర్దముచేత మ్రోగుచున్నపరిఘలు, అశనులు మొదలగు నాయుధములు గలదియును, మిగులశ్రేష్ఠమైనదియును, నగు రాక్షసబలము అధికముగా బ్రకాశించుచుండెను. అప్పుడు వానరులందఱును యుద్ధమును జేయవలయునని యెడు కోరికగలవారై మదించినవారలవలెనెగురుచుండిరి. మఱియు వృక్షములచేతను, శిలలచేతను రాక్షసులను గొట్టుచుండిరి. అవ్విధముగగొట్టుచు మిగుల వేగముతో వచ్చుచున్న వానరులయొక్క శిరస్సులనుమిగుల దీక్ష్ణములగు ఖడ్గములచేత భయంకరులగు రాక్షసులు నరికిరి. ఆసమయమునందొకనితో యుద్ధమును జేయుచున్నవానిని మఱియొకడు చంపుచుండెను. ఒకని నొకడు క్రిందబడవైచుచుండగా మరియొకడువచ్చివానినిక్రిందబడవైచె. ఒక్కనినొక్కడు కఱచుచుండగా మఱియొకడువచ్చి వానిని కఱచుచుండెను. మఱియు నొక్కడు నాకుయుద్ధమునివ్వరాయనుచుండెను. అవిధముగానే మఱియొక్కడువచ్చుచుండెను. ఒకడు మఱియొకని నిలువుమీయనుచుండెను. అవిధముగానే నిలుచుచుండెను. ఇవ్విధముగా నారాక్షసులును, వానరులును మిగులభయంకరముగా యుద్ధమును జేయుచుండిరి. ఆసమ

యమునందలి యుద్ధము వ్రేలాడుచున్న వస్త్రములుగలదియును, విడివడిపోయిన కవచములును గలదియును, చంపుటకెత్తబడినవియును, మిగులగొప్పవియును, నగు ఖడ్గములుగలదియును, మఱియునేకవిధములైనయినుపకట్లు శూలములు, ఖడ్గములును, గలదియును, నైయుండె. మఱియు నాసమయమునందు రాక్షసులు పదేసమంది వానరులను, ఏడేసిమంది వానరులను నొక్కొక్కమాటుచంపుచుండిరి. ఈవిధముగానే రాక్షసులనువానరులుజంపుచుండిరి. మఱియు నాసమయమునందువానరులందఱును,విడివడిపోయినవస్త్రములును, తలవెండ్రుకలును, గలదియును, విచ్ఛిన్నమైపోయిన కవచములును, గలదియును, నగు రాక్షససేనయందు వ్యాపించిరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి డెబ్బదైదవ సర్గముగిసెను,

(*)

— సుగ్రీవుడు మొదలగు వానరులు కుంభుడు మొదలగు రాక్షసులతో యుద్ధముజేయుట. —

ఇవ్విధముగ జనక్షయకరమైనదియును,, మిగుల భయంకరమైనదియును, సంకులమైనదియును, నగు యుద్ధము ప్రవర్తించిన సమయమునందు యుద్ధమునందు ఉత్సాహముగల యంగదుడు వీరుడగు కంపనుడనువానితో యుద్ధమును జేయుట కుద్యమించె. అప్పుడా కంపనుడు ముందుగ నంగదునిబిలిచి గదచే నాయంగదునిగొట్టె. ఆదెబ్బకు తాళజాలక యంగదుడు మూర్ఛనొందె. అంతగొంతసేపటికి అంగదుడు తెలివొంది పర్వతశిఖరము నొక్కదానింబట్టుకొని వచ్చి యాకంపనునిమీద విసరివైచె. ఆదెబ్బకు తాళజాలకయాకంపనుడు క్రిందబడియె. అట్లుక్రిందబడి ప్రాణహీనుడయ్యె. అట్లుమరణమునుబొందిన కంపనునిజూచి శోణితాక్షుడనియెడు రాక్షసుడు భయరహితుడును, రథారూఢుడునునై యాయంగదునితో యుద్ధమునుజేయుటకు వచ్చె. వచ్చి మిగుల దీక్ష్ణములైనవియును, ప్రళయకాలాగ్నితో సమానములైనవియును, శరీరమును బ్రద్దలుసేయుటయందు దగినసామర్థ్యముగలవియును, నగు బాణములచేత నయ్యంగదుని అతిగాఢముగాగొట్టె. మఱియు మంగలకత్తులవలె దీక్ష్ణములైనవియును, వత్సదంతాకారములైనవియును, శల్యములనుగూడ భేదించుటయందు దగినసామర్థ్యముగలవియును, నగు బాణములనుగూడ బ్రయోగించె. అప్పుడధికమగు ప్రతాపముగలవాడును, వాలికిబుత్రుడును, బాణములచేత గొట్టబడిన శరీరముగలవాడును, నగు నంగదుడు, కోపోద్దీపితుడై మిగులవేగముతో నాశోణితాక్షునియొక్క రథమును, ధనుర్బాణములను ధ్వంసముచేసె. అంతట నాశోణితాక్షుడనియెడు రాక్షసోత్తమముగోపోద్దీపితుడై ఖడ్గమును, చర్మమును, ధరించి యంతరిక్షమునకెగిరె. అప్పుడంగదుడు మిగులనేర్పుగలవాడైయారాక్షసునితోగూడ నంతరిక్షమునకుబోయి యారాక్షసునిచేతియందలి ఖడ్గము మొదలగు వానిని లాగుకొని సింహనాదమునుజేసె. అంతట నయ్యంగదుడు ఆఖడ్గము మొదలగు వానితో నారాక్షసునిగొట్టె. పిమ్మట చర్మమును యజ్ఞోపవీతమును దెంచిన విధముగ దెంచివైచె. అంతట నూరకుండక యాయంగదుడు ఆరాక్షసునియొక్క గొప్పదగు ఖడ్గమును గ్రహించి యారాక్షసుని మర్దించి యతనిని క్రిందబడవైచి యితరులగు శత్రువులను జంపుటకు మఱియొకచోటునకుబోయె. ఆసమయమునందు బంగారపుభుజబందులుగలవాడును, వీరుడును, నగు నాశోణితాక్షుడు తెలివొంది గద యనునాయుధమునుబట్టుకొనియాయంగదుని వెంటనంటె. ఆసమయమునందు బలవంతుడును, వీరుడును, నగు యూపాక్షుడు ప్రజంఘుడను వానితోగూడుకొనినవాడును, కోపోద్దీపితుడునునై రథమునెక్కి మహాబలముగలవాడును, వాలికిబుత్రుడును, నగు నంగదునకభిముఖముగాబోయె. అట్లు శోణితాక్ష ప్రజంఘులయొక్క మధ్యయందున్న యాయంగదుడు విశాఖా నక్షత్రములయొక్క మధ్యయందుప్రవేశించిన పూర్ణచంద్రునిబోలియుండె. ఆసమయమునందు మైందద్వివిదులను వానరోత్తములిరువురును నొకనితో నొకడాలోచించుకొని యంగదునిరక్షింపదలచి యతని సమీపమునకువచ్చిరి. అప్పుడు మిగుల గొప్పవగు శరీరములుగలవారును, పరాక్రమమును జూపదలచినవారును, మిగులశ్రేష్ఠమగు బలముగలవారును, ఖడ్గమును, చర్మమును, గదను, ధరించినవారును, నగు రాక్షసులు వానరులమీదికి మిగుల గోపముతో బోయిరి.

ఆసమయమునందు మైందుడుద్వివిదుడు అంగదుడు అనియెడు మువ్వురువానరులకును, ప్రజంఘయూపాక్షశోణితాక్షులకునుమిగుల భయంకరమగుయుద్ధమయ్యె. అప్పుడా మువ్వురువానరులును, వృక్షములను విసరివైచిరి. ఆచెట్లను మహాబలుడగు ప్రజంఘుడు తీవ్రములగు బాణములచేత ఖండించె. మఱియు నాసమయమునందు వానరులువృక్షములచేతను, శిలలచేతను, రాక్షసులయొక్కరథములను, గుఱ్ఱములను, నాశమునొందించుచుండిరి. ఆవృక్షములను. శిలలను, యూపాక్షుడను రాక్షసోత్తముడు మిగులదీక్ష్ణములైనయనేకబాణములచేత ఛేదించె. మఱియు మైందద్వివిదులచేత బ్రయోగింపబడుచున్న వృక్షములను, శిలలను, వీర్య

వంతుడును, ప్రతాపవంతుడును, నగు శోణితాక్షుడనిమెడు రాక్షసోత్తముడు గదచేత భగ్నముసేయుచుండె. ఆసమయమునందు ప్రజంఘుడనురాక్షసోత్తముడు మిగుల విశాలమైనదియును, శత్రువులయొక్క మర్మస్థానములను భేదించునట్టిదియును, నగుఖడ్గమును ధరించి యతివేగముగా నంగదునిమీదికురికె. అట్లుతనసమీపమునకు వచ్చిన రాక్షసోత్తమునిజూచి యధికమగుబలముగల యంగదుడుమద్దిచెట్టుచేతగొట్టె. మఱియును దృఢముగా ఖడ్గమును ధరించియున్న యారాక్షసునిభుజముమీదగుద్దె. అవ్విధముగగుద్దుటచేత నారాక్షసునిచేతియందలి ఖడ్గము క్రిందబడియె. అట్లునల్లగలువవంటిదగు తనఖడ్గము క్రిందబడుటనుజూచి మహాబలుడగు నాప్రజంఘుడు వజ్రాయుధములో సమానమగుపిడికిలిని గిరగిరద్రిప్పె. అట్లుత్రిప్పి మిగులబరాక్రమముగలవాడును, వానరోత్తముడునునగు నంగదునియొక్క లలాటమ్ముబ్రద్దలగునట్లుకొట్టె. అప్పుడు అధికమగు తేజస్సుగల యంగదుడా దెబ్బకు దాళజాలక క్రిందబడియె. అంతగొంతసేపటికి అంగదుడు తెలివొంది ప్రతాపవంతుడును, తేజోవంతుడుననగు నారాక్షసునిశిరస్సును ఖడ్గముచేత ఖండించె. అప్పుడాప్రజంఘునియొక్క శిరస్సుక్రిందబడియె. అవ్విధముగ భిన్నతండ్రియగు ప్రజంఘుడుమరణమును బొందగానే యూపాక్షుడు కన్నీళ్ళుగారగా రోదనమునుజేసె. పిమ్మటనాయూపాక్షుడు బాణములన్నియును పోవుటచేత ఖడ్గమునుధరించి రధమునుండి క్రిందికిదుమికె. అవ్విధముగ ఖడ్గమునుధరించి మిగుల వేగముతోవచ్చుచున్న యూపాక్షునిజూచి ద్వివిదుడనువానరోత్తముడు మిగులత్వరగలవాడును, కోపోద్దీపితుడునునై యతనిఱొమ్మునగుద్దె. అవ్విధముగయూపాక్షుని బట్టుకొని కొట్టుచుండుటనుజూచి మహాబలుడగు శోణితాక్షుడు కోపోద్దీపితుడై గదాగ్రముచేత నాద్వివిదునిఱొమ్ము పగులునట్లుగొట్టె. అట్లుగదచేత గొట్టగానే మహాబలుడగునాద్వివిదుడుకొంచెముసేపు మిగులభయమునుబొందె. అప్పుడు మరల నాశోణితాక్షుడు గదతో గొట్టుటకుద్యుక్తుడయ్యె. ఆసమయమునందు ద్వివిదుడు మిగులనేర్పుతో నాగదనపహరించె. ఇంతలోపల వీరుడును, వానరాధిపతియును, వీర్యవంతుడునునగు మైందుడనువానరోత్తముడు పిడికిలిచేత ఆయూపాక్షుని ఱొమ్ము పగులునట్లుగొట్టె. అంతట నాశోణితాక్ష యూపాక్షులకును, మైందద్వివిదులకును, మిగులభయంకరమగు యుద్ధమయ్యె. ఆయుద్ధమునందు ద్వివిదుడను వానరోత్తముడు గోళ్లచేత నాశోణితాక్షుని ముఖమునుజీల్చె. మఱియువీర్యవంతుడగు నాద్వివిదుడు ఆరాక్షసునిబట్టుకొని విసరినేలవైచె. ఆసమయమునందు వానరాధిపతియగు మైందుడును, కోపోద్దీపితుడై బాహువులచేత యూపాక్షునిబట్టుకొనిమర్దించె. అంతటనాయూపాక్షుడు మరణమునుబొందిక్రిందబడియె. ఆసమయమునందే ద్వివిదుడును శోణితాక్షునిసంహరించె. అవ్విధముగ నాయిద్దఱురాక్షసపుంగవులును మరణమునుబొందినతోడనే రాక్షససైన్యమంతయును మిగుల భయమును బొందినదై కుంభుడున్న దిక్కునకు బరుగెత్తుకొనిపోయె. అట్లుమిగులభయముతో బరుగెత్తుకొనివచ్చుచున్న రాక్షససైన్యమునుజూచి కుంభుడనురాక్షసోత్తముడు మృదుమధుర వచనములచేత నూరార్చె. మఱియు నాసమయమునందు కుంభుడు తేజోవంతులును, నిరుపమానమైన పరాక్రమను గలవారును, నగువానరులచేతనాక్రమింపబడిన తనసైన్యమునుజూచి యాకుంభుడు కోపోద్దీపితుడై మిగులభయంకరమగు యుద్ధమునుజేసె. అప్పుడు ధనుర్ధారులలోనుత్తముడును, తేజోవంతుడును, నగునాకుంభుడు మిగులతీక్ష్ణములగు ననేకబాణములను బ్రయోగించె. ఆసమయమునందతనిధనుస్సు మెఱుపుతీగెలతో గూడుకొనిన యింద్రధనుస్సువలె బ్రకాశించుచుండె. మఱియు నప్పుడాకుంభుడను రాక్షసోత్తముడు చెవివఱకును ధనుస్సును లాగి బంగారపుపిడిగల బాణముద్వివిదునిమీదబ్రయోగించె. అవ్విధముగ నాబాణముచేత గొట్టబడినయావానరోత్తముడగు ద్వివిదుడు తాళజాలక మిగులబాధనొందె. అట్లుభయమునుబొందుచున్న సోదరునిజూచి మైందుడపరిమితమగుకోపముగలవాడై మిగులపెద్దదగుశిలయను నాయుధమునుదీసికొని మిగుల వేగముతో బరుగెత్తుకొనివచ్చి మహాబలుడగు నామైందుడాశిలను బ్రయోగించె. ఆశిలనుకుంభుడు మిగుల తీక్ష్ణములగు నైదుబాణములచేత ఖండించె. అంతటనూరకుండక యాకుంభుడనురాక్షసోత్తముడు మిగులతీక్ష్ణమైనదియును, సర్పముతో సమానమైనదియును, నగుబాణమును మైందునిఱొమ్మునందు దాకునట్లు ప్రయోగించె. ఆబాణముచేత గొట్టబడినవాడై మైందుడు తాళజాలకక్రిందబడి మూర్ఛనొందె. అట్లుమేనమామలగు మైందద్వివిదులిరువురును కుంభునిచేతగొట్టబడినవారై మూర్ఛనొందుటనుజూచి యంగదుడు కోపోద్దీపితుడై యాకుంభునితోయుద్ధమునుజేయుటకు బరుగెత్తుకొనివచ్చె. అట్లుమిగులవేగముతోవచ్చుచున్న యంగదునిమీద నాకుంభుడు అయిదుబాణములను బ్రయోగించె. మఱియును వేగముతో వచ్చుచున్న యంగదునిమీద నేనుగుమీదబ్రయోగించిన విధముగమరలదీవ్రములగు మూడుబాణములను బ్రయోగించె. మఱియును వీర్యవంతుడగు నాకుంభుడనురాక్షసోత్తము

డు నానావిధములగు బాణములచేత నంగదునిఁగొట్టుచుండె. మఱియు మొక్కపోని యంచులుగలదియును, మిగుల దీక్ష్ణములైనవియును, బంగారపుసొమ్ములచేత నలంకరింపబడినవియును, నగుబాణములను బ్రయోగించె. అవ్విధముగ ననేకబాణములచేత గొట్టబడిన శరీరముగలవాడయ్యును నంగదుడు భయమునుబొందక యాకుంభుని శిరస్సుమీద ఱాళ్లవర్షమును, వృక్షవర్షమును గురిపించుచుండె. ఆసమయమునందు ప్రతాపవంతుడగు కుంభుడు, వాలిపుత్రుడగు నంగదునిచేత బ్రయోగింపబడినవృక్షములను, శిలలను, ఖండించె. మఱియు నాసమయమునందు మిగులవేగముతో వచ్చుచున్నవాడును, వానరాధిపతియును, నగునంగదుని జూచికుంభుఁడు గోపోద్దీపితుడై నిప్పుకొఱవులచే నేనుగును గొట్టినవిధముగ తీవ్రములగు బాణములచేత నతనికనుబొమలయొక్క మధ్యప్రదేశమును బగులగొట్టె. అప్పుడయ్యంగదునికనుబొమలయొక్క మధ్యప్రదేశమునుండి యపరిమితముగ రక్తము స్రవించుచుండె. ఆసమయమునందంగదుడు హస్తముచేత గన్నులను మూసికొని మఱియొకహస్తముచేత సమీపమునందున్న యేపచెట్టును బెల్లగించె. ఆచెట్టును పెల్లగించునపుడు ఒక్కచేయియే యగుటచేత ఱొమ్మును చెట్టుకానించి కొంచెమువంపబడిన శరీరముగలవాడై యాయొక్కచేతిచేతనే పెల్లగించె. ఆసమయమునందు అంగదుడు ఏనుగునుబోలియుండె. అవ్విధముగ నంగదునిచేత బెల్లగింపబడినదియును, ఇంద్రధ్వజముతో సమానముగ నున్నదియును, మందరపర్వతమును బోలియున్నదియును, నగు నావృక్షమును రాక్షసులందఱును జూచుచుండగమిగులదీక్ష్ణములగు నేడుబాణములచేత ఖండించె. పిమ్మట ననేకములగు బాణములను నంగదునిమీద బ్రయోగించె. ఆబాణములకు దాళజాలక యంగదుడు మిగులవ్యసనమునుబొందె. అవ్విధముగ వానరోత్తముడైన యంగదుడు వ్యసనమునుబొందుటను వానరులందఱును రామునకు దెలియజేసిరి. ఆసమయమునందు రాముడు అంగదుడు వ్యసనమునుబొందుటను దెలిసికొని యతిశీఘ్రముగ జాంబవంతుడుమొదలగు వానరోత్తములను బొండనియాజ్ఞాపించె. అంతట వానరులందఱును రామునియాజ్ఞానుసారముగ బయలు వెడలి మిగుల గోపోద్దీపితులై ధనుర్ధారియైయున్న కుంభుడను రాక్షసోత్తమునిమీద బడిరి. పిమ్మట గోపముచేత నెఱ్ఱని నేత్రములుగలవారును, బాధనుబొందుచున్నయంగదుని రక్షింపవలయుననియెడు కోపముగలవారునునై వృక్షములను, శిలలను, ఆయుధములనుగా ధరించిరి. మఱియు నాసమయమునందు జాంబవంతుడును, సుషేణుడును, వేగదర్శియనువానరుడును మిగుల గోపోద్దీపితులై కుంభకర్ణునకుమారుడును, వీరుడును, నగు కుంభునిమీద గవిసిరి. అవ్విధముగ మిగులవేగముతో వచ్చుచున్న యావానరోత్తముల నందఱనుజూచి కుంభుడను రాక్షసోత్తముడు బాణపరంపరలచేత, పర్వతముచేత ప్రవాహమును నడ్డుపఱచిన విధముగ నడ్డుపఱచె. అప్పుడావానరులందఱును నాకుంభునియొక్క బాణమార్గమునందుబడి కదలను మెదలనుశక్తిలేనివారైరి. అట్లుబాణవర్షముచేత బీడింపబడుచున్నవారును, మహాత్ములునునగు వానరులనుజూచి వానరాధిపతియగు సుగ్రీవుడన్నకుమారుడగు అంగదుని వెనుకబెట్టుకొని యధికవేగముతో కుంభుడను రాక్షసోత్తమునిమీదికిబరుగెత్తె. ఆసమయమునందు సుగ్రీవుడు కొండచరియలయందు సంచరించుచున్న యేనుగుమీదికి బరుగెత్తుసింహమును బోలి యుండె.

అంతటనాసుగ్రీవుడు మిగులగొప్పవగుమద్దిచెట్లను, ఏపిచెట్లను, మఱియుననేకములగు నితరవృక్షములను నాకుంభునిమీదవిసరివైచె. అవ్విధముగసుగ్రీవునిచేత, కల్పింపబడినదియును, ఆకాశమునుగప్పుచున్నదియును, ప్రవేశింపనలవిగానిదియును, నగు వృక్షవర్షమును, కుంభకర్ణునకుబుత్రుడగు కుంభుడనురాక్షసోత్తముడు మిగులదీక్ష్ణములగు బాణములచేత నాశమునుబొందించె. మఱియు నాకుంభుడనురాక్షసోత్తమునిబాణములచేత రంధ్రములు వేయబడినవృక్షములు శతఘ్నులనునాయుధవిశేషములవలె ప్రకాశించుచుండె. అట్లువృక్షవర్షమంతయును కుంభుడనురాక్షసోత్తమునిచేత నాశముపొందింపబడుటనుజూచి వీర్యవంతుడును, వానరాధిపతియును, శ్రీమంతుడును, అధికమగు బలముగలవాడును, నగు సుగ్రీవుడువ్యసనముబొందక యాకుంభునిబాణములనువిఱుచుచు నతనిచేతియందలి ధనుస్సునుబలాత్కారముగలాగికొని పెళపెళవిఱిచివైచె. అవ్విధముగ సుగ్రీవుడత్యద్భుతమగు కార్యమునుజేసి యాసుగ్రీవుడు కొమ్ములుపోయినయేనుగువలెనున్న కుంభుడనురాక్షసోత్తమునితోనిట్లనియె.

నికుంభునకన్నయగు నోరాక్షసోత్తముడా! కుంభుడా! నీపరాక్రమము బాణవేగమువలె మిగులనాశ్చర్యకరమైయున్నది. రాక్షసులవిషయమై యణకువయును, ప్రభావమును, నీయందును, రావణునియందును దప్ప దక్కినవారియందు లేదు. మఱియునోరాక్షసోత్తమా! నీవుప్రహ్లాదునితోడను, బలిచక్రవర్తితోడను, దేవేంద్రునితోడను, కుబేరునితోడను, వరుణదేవునితోడను,సమానుడవు. నీవొక్కఁడవేబలవీర్యములచేత మాతండ్రితో సమానుడవు. మిగుల

గొప్పదగు భుజబలముగలవాడవును, ధనుస్సునుధరించిన వాడవును, శత్రువులనునశింపజేయువాడవును నగు నిన్నొకని దేవతలందఱును నేకమయ్యును "ఇంద్రియములనుజయించినవానిని మనోవ్యధలుబాధింపలేనివిధముగ" బాధింపజాలరు. కావుననధికబుద్ధిమంతుడవైన యోకుంభుడా! నీవ్యాపారములను నేనుజూచుచుండగా బరాక్రమింపుము. నీపెద్దతండ్రియగు రావణాసురుడు వరదానముచేత దేవదానవులనుజయించె. నీతండ్రియగుకుంభకర్ణుడు పరాక్రమముచేత దేవదానవులనుజయించె. నీవుధనుర్విద్యయందు ఇంద్రజిత్తునకుసమానుడవు. ప్రతాపమునందు రావణాసురునకుసమానుడవు. కాబట్టియోరాక్షసోత్తమా! నీవుబలవీర్యములచేత రాక్షసులలోపలనుత్తముడవైతివి. ఇప్పుడు మనమిరువురమును యుద్ధముజేయుదము. ఇంద్రశంబరయుద్ధమువలెనుండు మనయుద్ధమునుజూచి యెల్లవారును సంతోషమునుబొందుదురుగాక. మఱియు నోరాక్షసోత్తమా! నీవునిరుపమానమగుయుద్ధమును జేసితివి. అత్యద్భుతమగు నస్త్రవిద్యనుజూపితివి. మిగులభయంకరములగుపరాక్రమములుగల వానరవీరులనేకులు నీచేతయుద్ధమునందుజంపబడిరి. ఇప్పుడునీవనేకులతోయుద్ధమునుజేసి యలసియున్నాడవను సంకల్పముచేత నిన్నుజంపకుంటిని. కావుననీవుకొంచెముసేపువిశ్రమించి పిమ్మటనాపరాక్రమమునుజూడుమనియె. ఇవ్విధముగా సుగ్రీవుడుచెప్పినవాక్యమునువిని యాకుంభుడు నేయిపోసినయగ్నివలె వృద్ధినిబొందుచున్న తేజస్సుగలవాడయ్యె. అంతట నాకుంభుడనురాక్షసోత్తముడు కోపోద్దీపితుడై బాహువులచేతసుగ్రీవునిగట్టిగాబట్టికొనియె. అంతటనయ్యిరువురును మదించినయేనుగులవలె మాటిమాటికిని నిట్టూర్పులనువిడుచుచుండిరి మఱియునయ్యిరువురును నొకరొకరిశరీరముల నాకర్షించుచుమర్దించుకొనిరి. ఆసమయమునందాయిరువురునుకోపముచేత ధూమముతోగూడుకొనిన జ్వాలలనువిడుచుచుండిరి మఱియు నాయిరువురియొక్కయు, పాదఘాతములవలన భూమిక్రుంగెను. మఱియు నాసమయమునందు సముద్రముఅధికములగునలలుగలదయ్యె. అంతట సుగ్రీవుడు సముద్రముయొక్క మధ్యప్రదేశమునుగమనించిచూచి కుంభుడను రాక్షసోత్తమునిబట్టుకొనినిసరి సముద్రమునందుబడవైచె. అట్లు కుంభుడనురాక్షసోత్తముడుపడిన తాకుడుచేత వింధ్యమందరపర్వతములంతయెడుగులేచె. అప్పుడు ఆకుంభుడుసముద్రమునుండి రివ్వునబయలువెడలివచ్చి వజ్రాయుధముయొక్క వేగమువంటివేగముగల పిడికిలిచేత సుగ్రీవునిఱొమ్మునబొడుచుకొనెను. ఆదెబ్బచేత సుగ్రీవునిచర్మముపగిలె. అందువలన నపరిమితముగా నెత్తురుస్రవించె మఱియు నాపిడికిటిపోటుచేత నెముకలుచూర్ణములయ్యె మఱియు నాదెబ్బయొక్క తాకుడుచేత నాసుగ్రీవునియొక్క వక్షస్స్థలమునందు విస్ఫులింగములు ఉదయించె. అవ్విధముగకుంభుడను రాక్షసోత్తమునియొక్క పిడికిలిచేతగొట్టబడిన సుగ్రీవుడుగోపోద్దీపితుడై వజ్రాయుధముతోసమానమగుపిడికిలినిధరించె. అంతటవీర్యవంతుడగు నాసుగ్రీవుడనేకవేలతేజస్సులతో గూడుకొనినదియును, సూర్యమండలముతోసమానమైనదియును, నగు పిడికిటిచేతనారాక్షసునిఱొమ్ముపగులునట్లుగొట్టె. అవ్విధముగ నాపిడికిటచేత బొడువబడిన యాకుంభుడనురాక్షసుడు మిగులవిహ్వలుడై శాంతమైనయగ్నివలె గ్రిందబడియె. అట్లు క్రిందబడుచున్నయాకుంభుడను రాక్షసోత్తముడు రుద్రుడుతిరస్కరించుటచేత గ్రిందబడుచున్నసూర్యునిబోలియుండె. అవ్విధముగ భయంకరమైనపరాక్రమముగల సుగ్రీవునిచేత యుద్ధమునందాకుంభుడుచంపబడగానే పర్వతములును, వనములును, భూమియునుగడగడవణకె. మఱియు నధికముగా రాక్షసులుభయమునుబొందిగడగడవణకిరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి డెబ్బదియాఱవసర్గ ముగిసెను.

——(✻)——

——(✻) హనుమంతుడునికుంభునిజంపుట. (✻)——

అవ్విధముగ సుగ్రీవునిచేతనన్నయగు కుంభుడుచంపబడుటనుజూచి నికుంభుడనురాక్షసుడు కోపోద్దీపితుడై యగ్నిదేవునివలెమండిపడుచు వానరోత్తముడగు సుగ్రీవునిజూచె. అంతటభయంకరమగు పరాక్రమముగల నికుంభుడుపూలమాలికలచేత నలంకరింపబడినదియును, చందనము, కుంకుమ, మొదలగువానిచేత వ్యాప్తమైనదియును, పర్వతశిఖరమువలె నున్నదియును, నగు పరిఘయనునాయుధమునుగ్రహించె. ఆయాయుధము బంగారుపట్టతోగూడుకొనినదియును, వజ్రములచేతను, పవడములచేతను నలంకరింపబడినదియును, యమదండముతో సమానమైనదియును, రాక్షసులభయమునుబోగొట్టునదియును నై యుండె. అప్పుడువీరుడును, భయంకరమగు పరాక్రమముగలవాడును, అధికమగుతేజస్సుగలవాడును, నగు నికుంభుడు అపరిమితమగు కోపముతో సింహనాదమునుజేసె. ఆసమయమునందు నికుంభుడురత్నపదకముచేత నలంకరింపబడినవక్షస్థలముగలవాడును, భుజబంధులచేత నలంకరింపబడినభుజములుగలవాడును, మిగులచిత్రములగు కుండలముల

చేత నలంకరింపబడిన చెవులుగలవాడును, విచిత్రములగు పూలమాలికలచేత నలంకరింపబడినవాడునునై యింద్రధనస్సుతోడను, మెఱుములతోడను, ఉరుములతోడను గూడుకొనినమేఘమువలె ప్రకాశించుచుండెను. మఱియు నాసమయమునందు నికుంభుడుపరిఘాగ్రముచేత ఆవహాముమొదలుగాగలసప్తవాతస్కంధమునువిఱియగొట్టుచుండెను. మఱియు నానికుంభుడుపొగలేనియగ్నివలె మండిపడుచుండెను. అప్పుడుగంధర్వులగృహములతోగూడుకొనియున్న యలకాపట్టణమును, దేవగృహములతోగూడుకొనిన స్వర్గపట్టణమును, అశ్విన్యాదినక్షత్రములతోడను, చంద్రాంగారకాదిగ్రహములతోడను, గూడుకొనినయాకాశమును మిగులదల్లడిల్లె. ఆసమయమునందు పరిఘయనునాయుధముయొక్క కాంతులచేతను, ఆభరణములయొక్కయు, కాంతులచేతనుప్రకాశించుచున్న యానికుంభుడనురాక్షసోత్తముడు ప్రళయకాలమునందలి యగ్నివలెప్రకాశించుచుండెను. ఆసమయమునందురాక్షసులును, వానరులునుభయముచేతనిలువజాలకపోయిరి. అప్పుడు హనుమంతుడు ధైర్యమునవలంబించి యారాక్షసునకభిముఖముగనిలిచెను. ఆసమయమునందు బలవంతుడును, పరిఘలవంటిభుజములుగలవాడును, నగు నానికుంభుడను రాక్షసోత్తముడుసూర్యునియొక్క కాంతివంటికాంతిగల పరిఘయనునాయుధమును, ఆహనుమంతునియొక్క వక్షస్థలమునందు ప్రయోగించెను. అప్పుడాపరిఘయనునాయుధము మిగులదృఢమగువక్షస్థలమునందుబడిప్రద్దలై యనేకనూరులవిస్ఫులింగములుగలదై యంతరిక్షమునందువ్యాపించెను. ఆదెబ్బచేతభూకంపముగలుగునప్పుడు పర్వతముచలించినవిధముగ నాహనుమంతుడువణకెను. అంతగొంతసేపటికి హనుమంతుడు ధైర్యముతో నధికమగుకోపముగలవాడై బలవంతుడగు నాహనుమంతుడుదృఢమగుపిడికిలినిధరించెను.

అంతటవానరోత్తముడగు హనుమంతుడు పిడికిలిచేతనికుంభునిగొట్టెను. ఆదెబ్బచేత నికుంభునియొక్క లోపస్నాయువు పగిలి యపరిమితముగా నెత్తురుగారెను. మఱియు నాసమయమునందు నికుంభుడు మెఱుములతోగూడుకొనిన మేఘమువలెనుండెను. మఱియు నాదెబ్బకు దాళజాలక యానికుంభుడు గడగడవణకెను. అంతగొంతసేపటికి స్వస్థచిత్తుడై యారాక్షసోత్తముడు మహాబలుడగు హనుమంతుని బట్టికొనియెను. ఆసమయమునందు నికుంభునిచేతపైకెత్తబడినహనుమంతునిజూచి రాక్షసులందఱును మిగులభయమును జెందిరి. అవ్విధముగ నికుంభునిచేత దీసుకొనిపోబడుచున్న హనుమంతుడు కోపోద్దీపితుడై వజ్రాయుధముతో సమానమగు పిడికిలిచేతబొడిచెను. అంతటదనను విడిపింపజేసికొని వాయుపుత్రుడగు హనుమంతుడు ఆనికుంభునిబట్టుకొని భూమియందు బడవైచిమథించెను. మఱియువీర్యవంతుడగు నాహనుమంతుడు అధికమగువేగముతో నారాక్షసోత్తముని లోమ్మునందుగుద్దెను. పిమ్మటహనుమంతుడా రాక్షసునియొక్క కంఠమునుబట్టుకొని గిరగిరద్రిప్పిక్రిందబడవైచి మిగులభయంకరారావముగలుగునట్లుగా సింహనాదమును జేసెను. అవ్విధముగ నానికుంభుడు మర్దింపబడగానే దశరథమహారాజునకు బుత్రుడగురామునకును, రాక్షసేన్ద్రుని పుత్రుడగు మకరాక్షునకును మిగులభయంకరమగు యుద్ధము జరిగెను. అట్లునికుంభుడు ప్రాణహీనుడైనతోడనే వానరులందఱును పరమానందమునుబొందిరి. భూమికంపముగలదయ్యెను. ఆకాశముబ్రద్దలయ్యెను. అంతటరాక్షసులందఱును మిగులభయమునుజెందిరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి డెబ్బదియేడవసర్గ ముగిసెను.

—{ మకరాక్షుడను రాక్షసుడుయుద్ధమునకు బైలుదేరుట. }—

అట్లుకుంభనికుంభు లిరువురును మరణమునుబొందిన వృత్తాంతమునువిని రావణాసురుడు అపరిమితమగు కోపముగలవాడై యగ్నిహోత్రమువలె బ్రజ్వలించెను. పిమ్మటనారావణాసురుడు క్రోధశోకములతో గూడుకొనినవాడై ఖరుడను రాక్షసోత్తముని పుత్రుడును, విశాలములగు నేత్రములుగలవాడునునగు మకరాక్షుని యుద్ధమునకు బొమ్మనదలచి యిట్లనియెను.

పుత్రుడా! నీవునాచేత నియమింపబడిన రాక్షససైన్యముతో గూడుకొనినవాడవై యుద్ధమునకుబొమ్ము. పోయి రామలక్ష్మణులను, వానరులను జయించిరమ్మనియెను. అంతట శూరుడనని యెడు నభిమానము గలవాడును, ఖరుడనువానికిబుత్రుడును, నగుమకరాక్షుడు రావణాసురుని వచనమునువిని వల్లెననియెను. పిమ్మటనామకరాక్షుడు రావణాసురునకు బ్రదక్షిణనమస్కారములను జేసి తనసారథితోరథమునుదెమ్మనియెను. మఱియునుఖరునిపుత్రుడగు నామకరాక్షుడు సమీపమునందున్న బలాధ్యక్షునితో నిట్లనియెను.

బలాధ్యక్షుడా! రథమునుదీసికొనిరమ్ము. శీఘ్రముగ సైన్యమువచ్చునట్లు జేయుమనియెను. ఆమాటనువిని బలాధ్యక్షుడు మిగులత్వరతో రథమును సైన్యమును, అతనిసమీపమునకుగొనివచ్చెను. పిమ్మటనామకరాక్షుడను రాక్షసోత్తముడు రథమునకు బ్రదక్షిణమును జేసి యారథమునధిష్ఠిం

చె. పిమ్మట సూతునితో రథమునుదోలిమ్మనెను. అంతట సమీపమునందున్న రాక్షసులతో నిట్లనెను.

రాక్షసోత్తములారా! మీరు శీఘ్రముగ నాతోగూడవచ్చి యుద్ధమును జేయుడు. రామలక్ష్మణులను జంపుటకు నేను రావణాసురునిచేత నాజ్ఞాపింపబడితిని. కావున నేను రామలక్ష్మణులను వధించెదను. మఱియు నో రాక్షసులారా! నేనిప్పుడే శూలముచేత రామలక్ష్మణులను బొడిచివేయుదును. మఱియు నగ్నిహోత్ర మెండినకట్టెలను దగులబెట్టువిధముగ నేను రామలక్ష్మణులను దహించెదను. కావున మీరందఱును మిగుల ధైర్యముతో యుద్ధమునకు రండనెను. ఆవచనములను విని రాక్షసులందఱు నానావిధములగు నాయుధములతో గూడుకొనినవారై యుద్ధసన్నద్ధులైరి. అంతట కామరూపులును, పచ్చని నేత్రములుగలవారును, మిగుల దీక్ష్ణములగు కోరపన్నులుగలవారును, నగు రాక్షసులందఱును జుట్లను విరియబోసికొని మదపుటేనుగులవలె నపరిమితముగా సింహనాదములను జేసిరి. అంతట నధికములగు శరీరములుగల రాక్షసులందఱును, మిగుల దొడ్డదగు శరీరముగలవాడును, ఖరుడనువానికి బుత్రుడునునగు మకరాక్షుని జుట్టుకొని మిగుల సంతోషముగలవారై భూమినివణకించుచు మిగుల సంతోషముతో బయలువెడలిపోయిరి. ఆసమయమునందనేకములగు శంఖములు, రణభేరులు మొదలుగాగల వాద్యములను మ్రోగించిరి. మఱియు నాసమయమునందు రాక్షసులయొక్క ఘీంకారమువలనను, భుజములను చరుచుటవలనను గలిగినశబ్దము మిగుల గొప్పదయ్యె.

అవ్విధముగ నెల్లవారును యుద్ధసన్నద్ధులై బయలువెడలిపోయిరి. అప్పుడు సారథియొక్క చేతియందలి గుఱ్ఱపుకొరడా జారిక్రిందబడెను. మరియు నాసమయమునందు మకరాక్షునియొక్క ధ్వజము విరిగి క్రిందబడెను. మఱియు నప్పు

మకరాక్షుని గుఱ్ఱములు బలహీనతగలవియును, కన్నీళ్లుగలవియునునై దొట్రుపడుచున్న కాళ్లుగలవయ్యె. మరియు నాసమయమునందు మిగుల దారుణమైనదియును, దుమ్ముతోగూడుకొని నదియునునగు నెదురుగాలివీచె. అట్టియపశకునములను జూచియును, నధికమగు పరాక్రమముగల రాక్షసులు లక్ష్యమును జేయక రామలక్ష్మణులున్న చోటునకు బయలువెడలిపోయిరి. మరియు నాసమయమునందు, మేఘములయొక్కయు, ఏనుగులయొక్కయు, ఎనుములయొక్కయు కాంతివంటి కాంతిగలవారును, అనేకపర్యాయము లనేకయుద్ధములయందు గదలయొక్కయు, ఖడ్గములయొక్కయు దెబ్బలచేత బ్రద్దలైనశరీరములుగలవారును, యుద్ధములయందు మిగుల నేర్పుగలవారును, నగు రాక్షసులు నేను నేననుచు గూతలిడుచు యుద్ధమునకు బయలువెడలిపోయిరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి డెబ్బదెనిమిదవసర్గము ముగిసెను.

రాముడు మకరాక్షునిజంపుట.

అవ్విధముగ యుద్ధసన్నద్ధుడై బయలువెడలిన మకరాక్షునిజూచి వానరోత్తములందఱును యుద్ధసన్నద్ధులై మొగిరి దుముకుచుండిరి. అంతట రాక్షసులకును, వానరులకును, దేవదానవులకువలె మిగుల భయంకరమైనదియును, రోమాంచమును గలుగజేయునదియునునగు యుద్ధమయ్యె. మఱియు నాసమయమునందు వానరులును, రాక్షసులును, వృక్షములచేతను, శూలములచేతను మిగుల గొప్పదగు యుద్ధమును జేసిరి. మఱియు నయ్యిరుతెగలవారును నొకరినొకరు నపరిమితముగా మర్దించుకొనుచుండిరి. ఆసమయమునందు రాక్షసులు, శక్తి, గద, ఖడ్గము, మొదలుగాగల యనేకాయుధములచేత వానరులను గొట్టిరి. మఱియును, పట్టసములు, బిండివాలములు, మొదలగు నాయుధములను బ్రయోగించిరి. మఱికొందఱు పాశములు, ముద్గరములు, దండములు, మొదలుగాగల యనేకాయుధములను బ్రయోగించిరి. అప్పుడా రాక్షసవీరులకును, వానరవీరులకును, మిగుల భయంకరమగు యుద్ధమయ్యె. ఆసమయమునందు ఖరునిపుత్రుడగు మకరాక్షుడు వానరులమీద మిగుల క్రూరములగు బాణముల నపరిమితముగా బ్రయోగించె. అంతనతని బాణములచేత నధికముగా బీడింపబడి వానరులందఱును నిలువజాలక పరుగెత్తిపోయిరి.

అవ్విధముగ యుద్ధమును జేయజాలక పరుగెత్తుచున్న వానరవీరులను జూచి రాక్షసులందఱును పరిహాసములను జేయుచు సింహనాదములను జేసిరి. అట్లు వానరులందఱును బరుగెత్తిపోవుటను జూచి రాముడు వారలతో భయమును బొందకుడని చెప్పి వారలను నిలిపె. మఱియు నారాముడు మిగుల ఘోరమగు బాణవర్షమును గురిపించి రాక్షసుల నడ్డుపఱచె. అట్లు రాముని బాణవర్షముచేత బీడింపబడిన రాక్షసులను జూచి మకరాక్షుడను రాక్షసోత్తముడు క్రోధాగ్నితో గూడుకొనినవాడై యిట్లనెను.

ఓరీ రాముడా! నీవు పారిపోక నిలువుము. నాతోగూడ ద్వంద్వయుద్ధమును జేయుము. నేను మిగుల దీక్ష్ణములగు బాణములను బ్రయోగించి నీప్రాణముల నపహరించెదను. మ

ఓయివో రాముడా! నీవుపూర్వము దండకారణ్యమునందు మాతండ్రియగు ఖరునిసంహరించితివి. నేనుజీవించియుండగ నీవాకార్యమును జేయుటవలన నాకపరిమితముగకోపముగలుగుచున్నది. మరియును రఘుకులోద్భవుడవైన యోరాముడా! దురాత్ముడా! ఆసమయమునందావనములో నిన్నునేనుజూచియుండలేదు. నాయదృష్టవశముచేత నిప్పుడు నాకంటికి గనబడితివి. మరియునిప్పుడాకలిచేత పీడింపబడుచున్న సింహమునకు మృగముకనబడిన విధముగ నాకంటికి గనబడితివి. నేనిప్పుడేమిగుల దీవ్రములగుబాణములచేత నిన్నుయమునియొద్దకుబంపెదను. పంపిమాతండ్రులతోగూడ నక్కడనుండునట్లు సేసెదను. ఓరీరాముడా! వ్యర్థముగామాటలాడుటవలన నేమిప్రయోజనముగలదు. ఇప్పుడుసకలలోకములవారును, నాపరాక్రమమునుజూచి యాశ్చర్యమునుబొందునట్లు యుద్ధమునుజేసెదను. చూడుము. మరియునో రాముడా! నీవీగొప్పయుద్ధరంగమునందు అస్త్రములచేత యుద్ధమును జేయదగినయెడల నస్త్రములతో యుద్ధమునుజేయుము. కాదేనిగదచేత జేయగలిగితివేని గదతో జేయుము. అట్లుగాదేని బాహువులతో యుద్ధమునుజేయుము. మరియునో రాముడా నీవుపవిధముగా యుద్ధమును జేసినను నేనుయుద్ధమును జేయుటకు సిద్ధముగనున్నాననియె. ఇవ్విధముగా మకరాక్షుడుచెప్పిన మాటనువిని దశరధరాజనందనుడగు రాముడుపకపక నవ్వుచుబ్రత్యుత్తరమును జెప్పదలచి యామకరాక్షునితో నిట్లనియె.

ఓరీరాక్షసాధమా! వ్యర్థముగా నిరుపమానములును, అనేకములును, అగువచనములచేత నిన్నునీవేస్తోత్రమునుజే

పవలయునుగాని వాగాడంబరముచేత జయింపనలవిగాదు. నేనుపూర్వమునందు పదునాలుగువేలమంది రాక్షసులతోగూడనీతండ్రినిమృతినొందించితిని. మఱియు దండకారణ్యమునందుత్రిశిరుని దూషణునిగూడజంపితిని. ఇప్పుడునిన్నుఖండించి నీమాంసముచేత గాకులకును, గ్రద్దలకును, తృప్తిగలిగించెదను. నీమాంసమునుభక్షించికాకులును గ్రద్దలును పరమానందమునుబొందగలవు. కావుననీవు భయమునుబొంది పరుగిడకయుద్ధమునుజేయుమనియె. ఇవ్విధముగా రాముడుచెప్పినమాటనువిని ఖరునిపుత్రుండగు మకరాక్షుడు కోపోద్దీపితుడై యారామునిమీద ననేకములగుబాణములను బ్రయోగించె. ఆబాణములను రాముడు పెక్కుబాణములను బ్రయోగించిఖండించె. అంతటనామకరాక్షునియొక్క బంగారపుపిడులుగల బాణములన్నియును గిందబడియె. అప్పుడు రామమకరాక్షుల కిరువురకు మిగుల భయంకరమగు యుద్ధమయ్యె. మఱియు నాసమయమునందు రామమకరాక్షులయొక్క ధనుష్టంకారములుమేఘగర్జనములను బోలియుండె. ఆసమయమునందాయుద్ధమునుజూచుచు నాకాశమునందున్న దేవతలును, దానవులును, గంధర్వులును, కిన్నరులును, ఉరగులును, మిగుల నాశ్చర్యమునుబొందిరి. అప్పుడయ్యిరువురును మిగుల దీక్ష్ణములగు బాణములచేత నొండొరులశరీరములనువ్రణములనుగా జేయుచుండిరి. మఱియునొకరిబాణములనొకరు ఖండించుచుండిరి. అప్పటియుద్ధము మిగుల భయంకరమైనదయ్యె. మఱియు నాసమయమునందు రామునిచేతబ్రయోగింపబడిన బాణములను మకరాక్షుడుఖండించుచుండె. మకరాక్షునిచేత బ్రయోగింపబడినబాణములను రాముడుఖండించుచుండె. అప్పుడయ్యిరువురును బ్రయోగించుబాణములచేత దిక్కులన్నియును గప్పబడియె. ఆసమయమునందు చూచువారలకీదిక్కిదియని తెలియశక్యము గాకయుండె. భూమియంతయును బాణములచేతగప్పబడియె. అంతట మిగులగొప్పదగుభుజబలముగల రాముడు మకరాక్షునియొక్కధనుస్సుఖండించె. పిమ్మటరఘుకులోద్భవుడగు రాముడెనిమిదిబాణములచేత నామకరాక్షునియొక్క సూతునిఖండించె. కిదపనామకరాక్షునిరథమునుఖండించె. పిమ్మటనతనియశ్వములనుఖండించె. అంతటనామకరాక్షుడు విరథుడై భూమియందునిలిచె. అట్లుభూమియందునిలిచి శూలమనునాయుధమునుధరించె. ఆశూలము ప్రళయకాలాగ్నితోసమానముగనుండుటచేత జూచువారలకు అపరిమితముగుభయముగలిగియుండె. అంతటనామకరాక్షుడు మిగులగొప్పదగు నాశూలమునుగిరగిరద్రిప్పుచు మిగులనధికముగబ్రకాశించుచుండె. పిమ్మట మిగుల కోపోద్దీపితుడై యాశూలమును రఘుకులోద్భవుడగు రామునిమీదబ్రయోగించె. అవ్విధముగ ఖరునిపుత్రునియొక్క హస్తముచేత బ్రయోగింపబడినదియును, ప్రజ్వలించుచున్నదియును, నగునాశూలమను నాయుధమును రఘుకులమునందుబుట్టిన రాముడు మూడుబాణములచేత ఛేదించె. అవ్విధముగ రామునిచేత ననేకశకలములుగా ఖండింపబడినదియును, మిగులశ్రేష్ఠమగు బంగారముచేత నలంకరింపబడినదియును, నగునాశూలము మిగులగొప్పదగు నుల్కలై బడ్డలయ్యె. అవ్విధముగననాయాసముగ రామునిచేత నాశూలము చూర్ణముచేయబడుటనుజూచి భూతములన్నియును మంచిదిమంచిదనుచుబొగడె. మఱియు నాకాశమునందున్నదేవతలందఱును మేల్మేలనిపొగిడిరి. అట్లుతనశూలము

వ్యర్థమైపోవుటనుజూచి మకరాక్షుడను రాక్షసోత్తముడు దృఢమగు పిడికిలినిబట్టి రామునితో నిలుమనియె. అవ్విధముగ పిడికిలిని బట్టుకొని తనమీదికివచ్చుచున్న మకరాక్షుని జూచి రాముడు పకపకనవ్వి యాగ్నేయాస్త్రమును సంధానముసేసె. అట్లుసంధానమునుసేసి అయ్యాగ్నేయాస్త్రమును బ్రయోగించె. అట్లుబ్రయోగించినతోడనే యాయస్త్రము మకరాక్షుని హృదయమును బ్రద్దలుసేసె. అంతట నామకరాక్షుడు క్రిందబడి విలవిలదన్నుకొని మరణమునుజెందె. అట్లుమకరాక్షునిమరణమును జూచి రాక్షసులందఱును రామునిబాణములచేత బీడింపబడినవారగుచు నక్కడనిలువజాలక లంకాపట్టణమునకభిముఖులై పరుగిడిరి. ఖరాసురునకు బుత్రుడగు మకరాక్షుడు దశరథమహారాజపుత్రుడగు రాముని యాగ్నేయాస్త్రముచేత పర్వతము వజ్రాయుధముచేతగొట్టబడినట్లు గొట్టబడుటనుజూచి యాకాశమునందలి దేవతలందఱును పరమానందమును బొందిరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి డెబ్బదితొమ్మిదవ సర్గము ముగిసెను.

(*)

ఇంద్రజిత్తు మరల యుద్ధమునకువచ్చి భయపడిపరుగెత్తిపోవుట

అవ్విధముగ రామునిచేత యుద్ధమునందు మకరాక్షుడు చంపబడుటవిని రావణుడు అపరిమితమగు కోపముగలవాడై పటపటలాడునట్లు దంతములను కొఱికె. అట్లు క్రోధోద్దీపితుడై యిప్పుడుచేయదగిన పనియేమని కొంతతడవాలోచించి పిమ్మట నింద్రజిత్తును దనసమీపమునకురప్పించి యిట్లనియె. ఇంద్రునిజయించినవాడవును, మహావీరుడవును, అయినయోపుత్రుడా! నీవుయుద్ధమునకుబోయి యెల్లవారలకును గనబడుచునైనను, కనబడకయైనను, మిగులబరాక్రమవంతులగు రామలక్ష్మణులను జయింపుము. నీవుపూర్వము యుద్ధమునందు నిరుపమానమగు యుద్ధమునుజేయుచు దేవేంద్రునిజయించితివి. అట్టిపరాక్రమముగలనీవు మానవులగు రామలక్ష్మణులను జయించుదువనుటకు కొంచెమైనను సందేహములేదనియె. ఇవ్విధముగ రావణాసురుడుచెప్పిన మాటలనువిని యింద్రజిత్తు మంచిదని యజ్ఞభూమికిబోయి శాస్త్రోక్తప్రకారముగ నగ్నిదేవుని వేల్చె. అట్లుహోమమును చేయుచున్న సమయమునందయ్యగ్నికుండమునుండి ఎఱ్ఱని తలగుడ్డలనుధరించిన స్త్రీలనేకులు బయలువెడలివచ్చి ఇంద్రజిత్తుయొక్క సమీపమునకుబోయిరి. ఆ స్త్రీలనుజూచి రాక్షసులందఱును మిగులనాశ్చర్యమునుబొందిరి. అవ్విధముగ బయలువెడలివచ్చినస్త్రీలు శస్త్రములను, శరపత్రములను, ఎఱ్ఱనివస్త్రములను, కాష్ణాయసము, అనునట్టి యాయుధమును నింద్రజిత్తుకొఱకిచ్చిరి. అంతట నాయింద్రజిత్తు తోమరములను, శరపత్రములను, సమిధలనుగాజేసి యగ్నికుండముచుట్టును బఱచి నల్లనిదేహకాంతిగల మేకయొక్క కంఠమును బట్టికొనిచంపె. అట్లు చంపి యామేకను హోమమునుజేసె. అప్పుడు మిగులనభివృద్ధినిబొందినవాడును, మిగులగొప్పవగు జ్వాలలుగలవాడును, ధూమరహితుడును, నగు నగ్నిదేవునియొక్క విస్ఫులింగములు ఆయింద్రజిత్తునకు జయముగలుగునని తెలుపుచుండె. మఱియు నాసమయమునందు అగ్నిదేవుడుప్రదక్షిణాకారముగదిరుగుచున్నజ్వాలలుగలవాడును,పుటమువేయబడిన బంగారమువలె బ్రకాశించుచున్నవాడునునై ప్రత్యక్షమునుబొంది హవిస్సును స్వయముగానే గ్రహించె. అవ్విధముగ నగ్నియందు హోమమునుజేసి దేవతలను, రాక్షసులను, దానవులను, తృప్తులనుగావించి పిమ్మటనంతర్ధానమై సంచరింపదగినదియును, మంగళకరమైనదియును, నగు రథమునధిష్ఠించె. పిమ్మట నాలుగు గుఱ్ఱములతోగూడుకొనినదియును, మిగుల తీక్ష్ణములగు బాణములతోగూడుకొనినదియును, ఇంద్రజిత్తుచేత నధిష్ఠింపబడినదియును,నగు రథశ్రేష్ఠము మిగుల మనోహరముగా బ్రకాశించుచున్నశరీరముగలదియును, పుటము వేయబడిన బంగారముగలదియును, మృగాకారములగు రచనలతోడను, అర్ధచంద్రాకారములగు రచనలతోడను గూడుకొనినదియునునై మిగులమనోహరముగ బ్రకాశించుచుండె. అంతట బ్రహ్మాస్త్రముతోగూడుకొనినవాడును, మహాబలుడును, నగు నాయింద్రజిత్తు శత్రువులచేత జయింపనశక్యముగానివాడై ప్రకాశించుచుండె. అంతట యుద్ధమునందు జయముగల యాయింద్రజిత్తు మంత్రములచేత నగ్నిదేవుని జక్కగనారాధించి పిమ్మట రాక్షసులతోగూడుకొని నంతర్హితుడై యాకాశమునకుబోయె. అవ్విధముగ నంతర్ధానమునుబొందినవాడైయిట్లనియె. రాక్షసవీరులారా! నేనిప్పుడే బయలువెడలిపోయి రామలక్ష్మణులనుజయించి మాతండ్రియగు రావణాసురునకు యుద్ధమునందు జయమును గలుగజేయుదును. మఱియు నిప్పుడు రామలక్ష్మణులతోగూడ వానరులనందఱనుజంపి భూమియందెక్కడను వానరులులేకుండునట్లుచేయగలను. మఱియును మాతండ్రియగు రావణాసురునకు మిగులప్రియమును గలుగజేయుదునని యె. అంతట రావణాసురునిచేత బంపబడిన యాయింద్రజిత్తుమిగు ప్పదగు కోపముగలవాడును మిగులదీక్ష్ణములగు

లుగలవాడునునై యుద్ధమునకుబోయెను. ఘోయిమిగుల వధీకమగు పరాక్రమముగలవియును, మూఘుతలలుగలవియును, వగు సర్పములవలె ప్రకాశించుచున్నవారును, వానరులయొక్క మధ్యయందున్నవారును, అపరిమితముగా బాణములనుప్రయోగించుచున్నవారును, నగు రామలక్ష్మణులను జూచె. చూచియా రామలక్ష్మణులు వీరలేయనినిశ్చయించి తనధనుస్సును జక్కపఱచి వర్షాకాలమునందలి మేఘము వర్షించినవిధముగ బాణములను వర్షింపజేసె. మఱియునాయింద్రజిత్తు రథముతోగూడ నంతర్హితుడైయుండి మిగుల దీక్ష్ణములగు బాణములచేత రామలక్ష్మణులను మిగులదృఢముగామర్దించె. అంతట నారామలక్ష్మణులిరువురును గోపోద్దీపితులై శరవేగముతోగూడినవారై ధనుస్సులయందు బాణములను సంధానమునుజేసి దివ్యాస్త్రములనుప్రయోగించిరి. పిమ్మటమహాబలులగు నారామలక్ష్మణులు బాణపరంపరలచేత నంతరిక్షమునుగప్పిరి. మఱియును సూర్యునియొక్కప్రకాశమువంటిప్రకాశముగలబాణములనుప్రయోగించిరి. ఆబాణములలోనేవియును నాయింద్రజిత్తునుస్పృశింపనివయ్యె. ఆసమయమునందు ధూమాంధకారముచేతనాకాశమునుసర్వమునుగప్పె. మఱియు నాసమయమునందు శ్రీమంతుడగు నయ్యింద్రజిత్తు మంచువంటి చీకటిచేతదిక్కులన్నింటినిగప్పె. మఱియు నాసమయమునందుయుద్ధమునుజేయుచున్న యాయింద్రజిత్తుయొక్క ధనుష్టంకారమును, రథముయొక్కధ్వనియునువినబడెను గాని రూపము కనబడదయ్యె. మఱియు నయ్యింద్రజిత్తుయొక్క బాణవర్షముచేతనపరిమితమగు చీకటిగలిగె. ఇవ్విధముగ మిగులగొప్పదగుభుజబలముగల యింద్రజిత్తు మిగులభయంకరమైన బాణవర్షమును గురిపించె. మఱియు నాసమయమునందింద్రజిత్తు బ్రహ్మదేవునిచేత వరమునుబొందినవాడగుటవలన సూర్యునితో సమానములగు బాణములచేతరామలక్ష్మణులయొక్క సర్వావయవములును బాధనుబొందునట్లుకొట్టెను. అట్లుమిగుల దీవ్రములగు బాణములచేత గొట్టబడుచున్నరామలక్ష్మణులు గోపోద్దీపితులైమిగుల దీక్ష్ణములగుబాణములను ప్రయోగించిరి. ఆ బాణములన్నియును నంతరిక్షమునందున్న యింద్రజిత్తునుదాకి యతని నెత్తురుచేతవ్యాప్తమైనవై క్రిందబడియె. మఱియు నాసమయమునందా రామలక్ష్మణులిరువురును నింద్రజిత్తుయొక్కబాణములచేత నపరిమితముగా బీడింపబడినవారలగుచు ననేకములగుబాణములచేత నాయింద్రజిత్తుయొక్క బాణములను ఛేదించుచుండిరి. మఱియు నింద్రజిత్తు ఏదిక్కునుండి బాణములను ప్రయోగించుచుండెనో యాదిక్కునకభిముఖముగబాణములనుప్రయోగించుచుండిరి. ఆసమయమునందు మహారథుడగునయ్యింద్రజిత్తు దశరథరాజపుత్రులగు రామలక్ష్మణులమీదమిగుల దీక్ష్ణములగుబాణములను ప్రయోగించె. మఱియు నప్పుడు బంగారపుపిల్లుగలవియును, మిగులదీక్ష్ణములైనవియును, నగు బాణములచేత నపరిమితముగా గొట్టబడిన రామలక్ష్మణులు పుష్పించిన మోదుగుచెట్టువలె ప్రకాశించుచుండిరి. మఱియును నాసమయమునందింద్రజిత్తుయొక్కరూపముకనబడకపోయె. ధనుస్సునుకనబడనిదయ్యె. బాణములుమాత్రముకనబడుచుండె. మఱియునాయింద్రజిత్తు తనమాయచేత నావృతమైనశరీరముగలవాడై మేఘావరణచేత సూర్యునివలె గనబడనివాడయ్యె. మఱియు నాసమయమునందు వానరులందఱును నపరిమితముగా గొట్టబడిరి మఱియునప్పుడనేక వేలమంది వానరులు బాణములచేతభిన్నమైనశరీరములుగలవారై క్రిందబడిరి. ఆసమయమునందు లక్ష్మణుడపరిమితముగా గోపమునుజెందినవాడై యన్నయగురామునితోనిట్లనియె. రఘుకులోత్తమా! రాముడా! రాక్షసులనందఱనుజంపుటకొఱకు బ్రహ్మాస్త్రమును బ్రయోగించెదను. అనుజ్ఞనిమ్మనినవిని రాముడు శుభలక్షణములుగలలక్ష్మణునితోనిట్లనియె. తమ్ముడా! లక్ష్మణుడా! ఒక్కనికొఱకనేక వేలమంది రాక్షసులను సంహరించుట న్యాయము గాదు. మఱియునోతమ్ముడా! యుద్ధములుజేయనివానిని ప్రచ్ఛన్నుడును, దోసిలియొగ్గినవాడును, శరణాగతుడును, పఱుగెత్తుచున్నవాడును,మిగులమదించినవాడును, నగుశత్రువునుసంహరించుట యుచితముగాదు. కావున మనమితరులగురాక్షసులను వధింపక యీయింద్రజిత్తును వధించుటయందుదగినప్రయత్నమును జేయవలయును. కాబట్టి మహాబలుడవైనయోలక్ష్మణుడా! మిగులవేగముగలవియును, సర్పములతోసమానములైనవియును, నగు బాణములను బ్రయోగింతము. పిమ్మట మాయకుడగు నీరాక్షసునియొక్క మాయనుహరింతము. అట్లుసేసితిమేని మనవానరులందఱును నీరాక్షసునిసంహరింపగలరనియె.

అట్లుసెప్పి యంతటనూరకుండక రాముడు బాణమునెక్కుపెట్టియిట్లనియె. తమ్ముడా! లక్ష్మణా! మనమీ బాణములనుప్రయోగించుచున్నశత్రువుడు భూమియందు[illegible]నను, స్వర్గమునకుబోయిననను, ర[illegible]తలమునందు[illegible]నను, నభస్థలమునందున్నను, మఱియొక్క[illegible] బాణముచేతదగ్ధుడునుప్రాణహీనుడునునై క్రిందబడుననియె. ఇవ్విధముగజెప్పి మహానుభావుడును, రఘుకులోత్తముడును, వానరవీరులచేతజుట్టబడియున్నవాడును, మహాత్ముడును, నగురాముడుమిగులభయంకరమగు యుద్ధమునుజేయు

చున్న యింద్రజిత్తును సంహరించుటకుజూచె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి యెనుబదవ సర్గ ముగిసెను.

▸(✽)◂

ఇంద్రజిత్తుమాయాసీతనుహనుమంతునియెదుటసంహరించుట.

అట్లుమహానుభావుడగు రాముడుచెప్పిన మాటలనువిని యింద్రజిత్తు భయమును బొందినవాడై యుద్ధమును వదలి లంకాపట్టణమునకు బోయె. పోయినపిమ్మట గుంభకర్ణుడు మొదలుగాగల రాక్షసులయొక్క మరణవృత్తాంతమునుస ర్వమునుదలచుకొని క్రోధాతిశయముచేతనెఱ్ఱనైన నేత్రములుగలవాడును, గొప్పదగు తేజస్సు గలవాడునునగుదు యుద్ధమునకు మరలబయలువెడలె. అంతటననేకవేలరాక్షసులతో గూడుకొనినవాడై పశ్చిమద్వారమునుండి బయలువెడలె. అవ్విధముగ బయలువెడలినపిమ్మట రావణాసురునకుబుత్రుడును, దేవకంటకుడును, మిగులగొప్పదగు పరాక్రమముగలవాడును, నగునింద్రజిత్తు యుద్ధభూమియందు సంచరించుచున్నవారును, అన్నదమ్ములును, నగు రామలక్ష్మణులనుబూచి యితరులకు మోహమును గలుగజేయునట్టి సీతాదేవియాకారముగలమాయను నావిర్భవింపజేసె. అంతట నయ్యింద్రజిత్తు తనరథమునందు ఆమాయామయమగుసీతనుబెట్టి వానరాభిముఖుడై యాసీతను జంపుటకుద్యుక్తుడయ్యె. అవ్విధముగ లంకాపట్టణమునుండి బయలువెడలి వచ్చుచున్న యింద్రజిత్తునుజూచి, వానరులందఱును యుద్ధమును జేయవలయుననియెడు కోరికగలవారును, ఱాళ్లనునాయుధములనుగా ధరించినవారును, కోపోద్దీపితులునునై యుద్ధసన్నద్ధులైరి. ఆసమయమునందు ఆవానరులయొక్కముందర వానరోత్తముడగు హనుమంతుడుబయలువెడలె. మఱియు నాహనుమంతుడు మిగుల గొప్పదగు పర్వతశిఖరమును నాయుధమునుగాధరించె. అప్పుడాహనుమంతుడు, ఇంద్రజిత్తుయొక్క రథమునందుంచబడినదియును, సంతోషరహితమైనదియును, ఒక్కటగుజడనుధరించినదియును, ఉపవాసములచేత కృశించినమోముగలదియును, మిగులమాసిన వస్త్రముగలదియును, మిగుల వ్యసనమును బొందుచున్నదియును, రామునకు బ్రియురాలును, దుమ్ముచేతవ్యాప్తమైన శరీరముగలదియును, స్త్రీలలో నుత్తమురాలును, నగునొకస్త్రీనిబూచి సీతనుగానిశ్చయించె. ఆసీత చిరకాలమునాడు చూడబడినదగుటవలన శీఘ్రముగాగుర్తింపలేకపోయె. అంతట నాహనుమంతుడు దుమ్ముచేత వ్యాప్తమైనశరీరముగలదియును, ఇంద్రజిత్తుయొక్కరథమునందుంచబడినదియును, నగు సీతనుబూచి హనుమంతుడుకన్నీళ్లచేత వ్యాప్తమైన శరీరముగలవాడయ్యె. పిమ్మట నాహనుమంతుడు దుఃఖముచేత బీడింపబడినదియును, సంతోష రహితమైనదియును, తపస్వినురాలును, రథమునందున్నదియును, ఇంద్రజిత్తుచేత నాక్రమింపబడినదియును, నగు సీతాదేవినిబూచి యిట్లనియె.

వానరోత్తములారా! సీతను రథమునందు బెట్టుకొనివచ్చిన యీదుర్మార్గుని యభిప్రాయ మేమియో తెలియకున్నదనిచెప్పి యావానరవీరులతో గూడ నింద్రజిత్తునకభిముఖముగాబోయె అప్పుడుమహాబలుడగునింద్రజిత్తు వానరబలమునుబూచి ఖడ్గమును సీతాదేవియొక్క నెత్తియందు బెట్టె. మఱియు నాసమయమునందు సీతను బూచి వ్యసనమును బొందుచున్న వానరులమీద నాయింద్రజిత్తు అపరిమితముగా బాణములనుబ్రయోగించె. ఆసమయమునందు ఆమాయాసీత రామా! రామా! యనివ్యసనమును బొందుచుండె. మఱియు నాసమయమునందు యింద్రజిత్తు సీతాదేవియొక్కశిఖనుబట్టికొనియె. అవ్విధముగనింద్రజిత్తుచేత నాకర్షింపబడినసీతనుజూచి హనుమంతుడు మిగులదైన్యమును బొందినవాడై నేత్రములచేతనపరిమితముగా గన్నీళ్లనువిడిచె. అంతటనాహనుమంతుడు అపరిమితమగు కోపముగలవాడై సుందరములగు సర్వావయవములును గలదియును, రామునిపట్టపుదేవియును, నగు సీతనుజూచి రావణాసురునకుబుత్రుడగు నింద్రజిత్తుతో మిగులగఠినములగు మాటలను జెప్పదలచి యిట్లనియె.

ఓరీ! దుష్టుడా! నీనాశముకొఱకు నీవు సీతామహాదేవియొక్కతలవెండ్రుకలను బట్టుకొంటివి. నీవు బ్రహ్మర్షియొక్క వంశమునందుబుట్టి రాక్షసయోని నాశ్రయించితివి. ఛీ నీపాపపుబుద్ధి నేమనవచ్చును. నీకిట్టిదుర్బుద్ధిపుట్టెను ఓరీ! ఘాతకుడా! అనార్యుడా! దుర్వృత్తిగలవాడా! నీచుడా! పాపాత్ముడా! పాపకృత్యములను జేయుటయందు దగిన సామర్థ్యముగల పరాక్రమముగలవాడా! ఇటువంటిపనిచేయదగునా? నీకుగొంచెమైనను దయలేనట్లు తోచుచున్నది. గృహమునుండియు, భర్తయగు రాముని హస్తమునుండియు, తొలగిదుఃఖించుచున్నదియగు నీసీతామహాదేవిని కేమియపకారమునుజేసె. నీవేమినిమిత్తముగ నీమహాదేవిని జంపెదవు. నీవుసీతనుజంపినపిమ్మట క్షణము నీవుగూడ జీవింపజాలవు. నీవిటువంటిదుష్కార్యమును జేయబూనినవాడవగుటచేత వధార్హుడవైతివి. మఱియు నాయెదుట బడితివి. స్త్రీహత్యనుజేయునట్టి పాపాత్ములను జంపుటవలన గూడ పాతకముగలుగును. అయినను నిన్నువిడిచిపెట్టను. ఇప్పు

దునీవుమరణమునుబొంది మిగుల భయంకరములగు నరకములను బొందగలవనియె. ఇవ్విధముగాబలికి హనుమంతుడు నానావిధములగు నాయుధములను ధరించియున్న వానరవీరులతో గూడుకొనినవాడును, అపరిమితమగుకోపము గలవాడునునై రాక్షసేంద్రునకు బుత్రుడగు నింద్రజిత్తునకభిముఖముగాబోయె. అట్లుతనకభిముఖముగా వచ్చుచున్నదియును, మిగులగొప్పదియగు పరాక్రమముగలదియును నగువానరసైన్యమునుజూచి యాయింద్రజిత్తు తనసైన్యమును సర్వమునువెనుకకుబంపి యనేకవేలబాణములచేత వానరసైన్యమును నానావిధముల బాధించె. మఱియు వానరోత్తముడగు హనుమంతునితో నాయింద్రజిత్తు యిట్లనియె. ఓరీ! వానరుడా! ముందుగానీసీతను జంపి పిమ్మట రామలక్ష్మణులను జంపెదను. పిమ్మటనిన్నును సుగ్రీవునిజంపెదను. మీరందఱునుసీతకొఱకు వచ్చితిరి. కావునసీతతో గూడ నిమ్ములజంపెదను. మఱియునో హనుమంతుడా! మిమ్ములనందఱనుజంపినపిమ్మట మీకుసహాయముగవచ్చిన విభీషణునిసంహరించెదను. వానరోత్తముడవైన యోహనుమంతుడా! స్త్రీవధను జేయగూడదనిచెప్పితివి. అట్లుచెప్పుట యుచితముగాదు. శత్రువులకుదేనివలన వ్యసనముగలుగునో యాకార్యమునుజేయవలయుననునీతివచనమును నీవెఱుంగవా? యనియె. ఇవ్విధముగాజెప్పి యప్పుడువ్యసనమును బొందుచున్నదియును, మాయామయమైనదియును, నగుసీతను, ఇంద్రజిత్తుమిగులదీక్ష్ణమగు నగ్రభాగముగల ఖడ్గముచేతగొట్టె. మరియు నాయింద్రజిత్తు దీనురాలగుసీతను యజ్ఞోపవీతాకారముగా ఛేదించె. అంతటప్రియముగా జూడదగినదగు సీత క్రిందబడియె. అవ్విధముగ నాసీతనుజంపియాయింద్రజిత్తు స్వయముగామరల హనుమంతునితోనిట్లనియె. రామునిభార్యయగు సీతనుకోపముచేత జంపితిని. ఇకనామీశ్రమయంతయును వ్యర్థమయ్యె. కావుననికమీకేమిచేయగలరనిచెప్పి మరియునధికముగా ఖడ్గముచేత నాసీతనుగొట్టిపరమసంతోషముగలవాడై రథమునెక్కి యధికమైనధ్వనిగలుగునట్లుగా ధ్వనిచేసె. ఆసమయమునందు సమీపముననున్నవానరులందఱును నాశబ్దమునువినిరి. వినిమిగుల భయమునుబొందిరి. అప్పుడింద్రజిత్తు మిగుల సంతోషముగలవాడై రథమునెక్కి మరియు నధికముగాధ్వనిజేయుచుండె. అట్లుసీతనుజంపి యపరిమితముగా సింహనాదమునుజేయుచున్నయింద్రజిత్తునుజూచి వానరులందఱును మిగుల భయముచేత నలుదిక్కులకును బఱుగిడిరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి యెనుబదొక్కటవ సర్గ ముగిసెను.

హనుమంతుడుసీతచనిపోయెననువ్యసనముచే రామునొద్దకు బోయిన పిమ్మటఇంద్రజిత్తు నికుంభిలాయాగము జేయుటకు బోవుట.

అప్పుడు భయంకరమైన ధ్వనిగలదియును, పిడుగుయొక్క చప్పుడువంటి చప్పుడుగలదియును, నగునామహాధ్వనినివిని వానరులందఱును మిగులభయముగలవారై నలుదిక్కులకునుబఱగెత్తిరి. ఆసమయమునందు వాయుదేవునకు బుత్రుడగుహనుమంతుడు వ్యసనమునుబొందుటచేత దీనమైనమోమునుగలవారును, భయగ్రస్తులును, వేరువేరుగా బఱుగెత్తుచున్నవారలునునగు వానరులతోనిట్లనియె.

ఓవానరులారా! మీరందఱును వ్యసనయుక్తములగుముఖములుగలవారై యెక్కడకుబఱుగెత్తుదురు. యుద్ధోత్సాహమును వదలిపెట్టిపోవుచున్నా మీశూరత్వమంతయును నిప్పుడెక్కడకుబోయె. మీరునావెనుకరండు. నేను ముందుగయుద్ధమునకుబోయెదను. శూరులును, శ్రేష్ఠమగుకులమునందు బుట్టినవారును, యుద్ధమునువదలి పరుగెత్తిపోవుట యుచితముగాదనియె. ఇవ్విధముగా హనుమంతుడుచెప్పిన మాటలనువిని వానరులందఱును సంతోషము గలవారును, యుద్ధమును జేయవలయు ననియెడు కుతూహలముగలవారును,నై పర్వతశిఖరములను, వృక్షములను నాయుధములనుగాగ్రహించిరి. అంతట నావానరోత్తములందఱును మిగుల నుత్సాహముగలవారై రాక్షసులమీదబడిరి. మఱియు నావానరులందఱును హనుమంతునిజుట్టుకొని తిరుగుచుండిరి. అట్లు సకలవానరవీరులతోడను గూడుకొనిన హనుమంతుడు కోపోద్దీపితుడై యపరిమితముగా బ్రజ్వలించుచున్న కార్చిచ్చు అడవులను దగులబెట్టువిధముగ రాక్షససైన్యమునుసర్వమును దహించుచుండె. మరియు నాసమయమునందు హనుమంతుడు రాక్షసులతోగూడ మిగులభయంకరమగు యుద్ధమునుజేసె. మరియు నవ్విధముగా వానరసైన్యముతోగూడుకొనిన హనుమంతుడు ఆసమయమునందు ప్రళయకాలమునందలి యమునిబోలియుండె. అంతట నాహనుమంతుడు అపరిమితమగు కోపముతోగూడుకొనినవాడై యింద్రజిత్తుయొక్క రథమునందు మిగులగొప్పదగు పర్వతశిఖరమునుబడవైచె. అవ్విధముగహనుమంతునిచేత విసరివేయబడినదియును, తనకభిముఖముగా వచ్చుచున్నదియును, నగుశిలనుజూచి యింద్రజిత్తుతనరథమును మరియొకప్రక్కకుబోనిచ్చె. అంతట నాశిలయింద్రజిత్తుయొక్క రథమునందుబడక క్రిందబడియె. అప్పుడుహనుమంతునిచేత బ్రయోగింపబడినశిల వ్యర్థముగాక్రిందబడియె. ఆశిలయొక్క తాకుడుచేత భూమియంతయును నదరె. ఆశిలపడునపుడు రాక్షససైన్యమంతయును మిగుల బాధనుబొం

దింపబడినదయ్యె. మఱియు నాశిలపడునప్పు డనేకవేలమంది రాక్షసులుమరణమునుబొందిరి. ఆసమయమునందుఅపరిమితముగా గూతలిడుచు హనుమంతునితోడ జేరుకొనియుద్ధమును జేయుచుండిరి. మఱియు నప్పుడు భయంకరమైన పరాక్రమముగలవానరులు శిలలను, పర్వత శిఖరములను, వృక్షములనుఇంద్రజిత్తుమీఁదప్రయోగించిరి. మఱియునావానరులందఱునుమిగులగొప్పదగువృక్షవర్షమునుఅపరిమితముగా గురిపించిరి. అంతట నయ్యిరుతెగలవారలకును మిగుల భయంకరమగు యుద్ధమయ్యె. మఱియు నాసమయమునందధికమగు పరాక్రమముగల వానరవీరులచేత రాక్షసులనేకులు చంపబడిరి. మఱికొందఱు వానరవీరులు భయంకరములగు నాకారములుగల రాక్షసులను వృక్షములచేతజంపిరి. అట్లుతనసైన్యమంతయును వానరసైన్యముచేత బీడింపబడుటనుజూచి యింద్రజిత్తు మిగులగోపముగలవాడై శత్రువులకభిముఖముగాబోయె. పోయితనసైన్యముతో గూడుకొనినవాడై వానరసేనయందనేకవేల బాణములను బ్రయోగించుచుండె. మఱియు నధికమగు పరాక్రమముగల యాయింద్రజిత్తు, అనేకవానరవీరులకు నాశమును గల్పించె. ఆసమయమునందు ఇంద్రజిత్తుయొక్క సేనలోని వారందఱును ఖడ్గములచేతను, శూలములచేతను, పట్టసములనునాయుధములచేతను, కూటములను నాయుధములచేతను, ముద్గరములను నాయుధములచేతను, అనేకవేలవానరలను జంపిరి. అప్పుడు మహాబలుడగు హనుమంతుడు వృక్షవర్షమును, శిలావర్షమును, రాక్షసులమీద గురిపించి మిగులభయంకరమగు యుద్ధమును జేసె. అంతట నారాక్షససైన్యమును సర్వమును దరిమి వానర వీరులతో యిట్లనియె.

ఓవానరవీరులారా! ఇకనుయుద్ధరంగమునుండి బయ వెడలుడు. మనమీరాక్షససైన్యమును సంహరింప జాలము. మనమందఱమును రామునకుప్రియమును జేయవలయునని యెడు కోరికగలవారమై ప్రాణములమీది యాశను వదలి యుద్ధమును జేసితిమి. మనము ఏసీతాదేవినిమిత్తముగయుద్ధమును జేయుచుంటిమో అట్టి సీతామహాదేవి మరణమును బొందె. ఇకనుమనము యుద్ధమును జేయుటవలన బ్రయోజనమేమిగలదు. కావునమనమిక్కడనుండి బయలువెడలిపోయి యీవృత్తాంతమును సర్వమును రామసుగ్రీవులతో జెప్పుదము. పిమ్మటవారుఏవిధముగా జెప్పుదురో యావిధముగా బ్రవర్తింతమనియె. ఇవ్విధముగాజెప్పి వానరోత్తముడగు హనుమంతుడు వానరులనందఱను మరలించె. అంతట నాహనుమంతుడు నిర్భయుడైమెల్లమెల్లగ వెనుకకు బోవుచుండె. అట్లుహనుమంతుడు రాముడున్నచోటునకు బోవుటనుజూచి ఇంద్రజిత్తు హోమమును జేయవలయు ననియెడుకుతూహలముగలవాడై చైత్యనికుంభిలమను చోటునకు బోయె. పోయినికుంభిలాప్రదేశమునధిష్ఠించి యక్కడ నా ఇంద్రజిత్తు హోమమును జేయదొడగె. మఱియు నాసమయమునందు యజ్ఞభూమియందు యింద్రజిత్తు శాస్త్రోక్తప్రకారముగ హోమమును జేసె. అట్లుహోమము చేయబడుచున్నకాలమునందు అగ్నిహోత్రుడు మాంసమును నెత్తురును భుజించుచున్నవాడై అపరిమితముగా బ్రకాశించుచుండె. మఱియునాసమయమునందు నెత్తురుచేతదృప్తిని బొందింపబడిన అగ్నిదేవుడు సంధ్యాకాలమునందలి యగ్నివలెప్రకాశించుచుండె. అంతట నాయింద్రజిత్తు హవ్యమునుశాస్త్రోక్తప్రకారముగనగ్నియందుప్రేల్చె. శాస్త్రోక్తవిషయములను, శాస్త్రోక్తముగాని విషయములను దెలిసినరాక్షసులందరును నాసమయమునందు హోమకృత్యములను జూచి సంతుష్టులైరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి యెనుబదిరెండవ సర్గ ముగిసెను.

ఆంజనేయుడు సీతనుయింద్రజిత్తునరికివేసెనని రామునితో జెప్పుట.

ఆసమయమునందక్కడ రాముడువానరులయొక్కయు రాక్షసులయొక్కయు యుద్ధభూమియందు బుట్టిన కలకల ధ్వనులనువిని జాంబవంతునితో నిట్లనియె.

సౌమ్యస్వభావముగల యోజాంబవంతుడా! హనుమంతుడు మిగులగొప్పదగు యుద్ధమును జేయుచున్నాడు. అందువలననే మిగులభయంకరముగా గూయుచున్నాడు. కావున నీవుమిగులశీఘ్రముగాబోయి యతనికి సాహాయ్యమును జేయుము. ఆలస్యమును జేయకుమనియె ఇవ్విధముగా రాముడు చెప్పిన మాటనువిని భల్లూకాధిపతియగు జాంబవంతుడు తనసైన్యముతోగూడుకొనినవాడై యతిశీఘ్రముగహనుమంతుడున్న పశ్చిమద్వారమునకుబోయె. అట్లు బయలువెడలివచ్చుచున్న జాంబవంతుడు తనకభిముఖముగా వచ్చుచున్నహనుమంతునిజూచె. ఆసమయమునందు హనుమంతుడు మొదలుగాగల వానరులందఱును అపరిమితముగా నిట్టూర్పులను విడుచుచుండిరి. ఆసమయమునందు హనుమంతుడు యుద్ధసన్నద్ధమైవచ్చుచున్న వానరసైన్యమును మార్గమధ్యమునందుజూచె. చూచినీలమేఘముయొక్కకాంతివంటికాంతిగల యాభల్లూకసైన్యమును వెనుకకుమరలించె. అట్లుగొప్పదగు కీర్తిగలహనుమంతుడు సకల వానర

సైన్యముతోడను గూడుకొనినవారై యతిశీఘ్రముగబోయి యపరిమితముగ వ్యసనమును బొందుచు రామునితో ని ట్లనియె.

రఘుకులోత్తమా! రామచంద్రా! యుద్ధమునుజేయుచున్న మేమందఱమును జూచుచుండగ రావణునకు బుత్రుడగు నింద్రజిత్తు వ్యసనమును బొందుచున్న సీతనునరికె శత్రునాశకుడవైనయోరాముడా! నేనుజూచి మిగుల భ్రాంతినొందినచిత్తముగలవాడనై యపరిమితముగా వ్యసనమునుబొందితిని. అంతట నీవృత్తాంతమును నీకు దెలుపుట కొఱకు నిక్కడవచ్చితిననియె. ఆవచనమునువిని రఘుకులోద్భవుడగు రాముడుదుఃఖముచేత మూర్ఛనుబొందినవాడైమొదట నరకబడినవృక్షమువలె గ్రిందబడియె. అట్లుక్రిందబడినవాడును, దేవునితోసమానుడును, రఘుకులోద్భవుడును నగు రామునిజూచి వానరులందఱును మిగులబరితాపముగలవారై క్రిందబడిమూర్ఛనొందిరి. అంతట నావానరులందఱును మరలదెలివొందిన చిత్తములుగలవారైమూర్ఛనొందియున్నరామునిమీద బద్మపత్రోదకములను జల్లిరి. మరియు నాసమయమునందు వానరులందఱును మిగుల నధికముగా మండుచున్న యగ్నిమీద నీళ్ళనుజల్లినవిధముగా జల్లిరి. ఆసమయమునందు మూర్ఛనుబొందియున్న రాముని భుజములచేతఁబట్టుకొనిలక్ష్మణుడుచిత్తస్వాస్థ్యములేకయున్నరామునితో నభిప్రాయ గర్భితములగు మాటలను జెప్పదలచి యిట్లనియె.

అన్నా! రామా! జితేంద్రియుడవును, పరిశుద్ధమగున్యాయమార్గమునందు సంచరించుచున్నవాడవును,నగు నీకనర్థములుగలుగకుండునట్లు ధర్మముగాపాడకపోయెనేని ధర్మమునునది వ్యర్థమగునని యెఱుంగవలయును. మరియు నోరాముడా! స్థావరజంగమము లెట్లుకనబడునో ధర్మమునునది యావిధముగా గనబడదు. కావున ధర్మమునునదిలేదని నామనస్సునందుదోచుచున్నది. అట్లుగాకేనినీకిట్టియనర్థము సంభవించునా? సంభవింపదు. మరియునోరాముడా! స్థావరజంగములెట్లుప్రత్యక్షముగ గనబడుచున్నవో యావిధముగా ధర్మమనునది ప్రత్యక్షముగ గనబడుటలేదు. కావున ధర్మమునునదిలేదని నాయభిప్రాయము. అట్లుగాక ధర్మమనునది వాస్తవముగనుండెనేని నీయట్టిధర్మాత్ముడువ్యసనమునుబొందదగదు. మరియునోరాముడా! అధర్మమనునది వాస్తవముగనుండెనేని రావణుడుముఖ్యముగా నరకమునుబొందును. ధర్మయుక్తుడవగు నీవీవిధముగా వ్యసనమునుబొందదగదు. అట్లుగాక ధర్మాత్ముడవగునీకు వ్యసనమును, అధర్మాత్ముడగు రావణాసురునకు సంతోషమును గలుగుటచేత ధర్మాధర్మములురెండును పరస్పర విరుద్ధములునవ య్యెనని తోచుచున్నది. మరియు నోరాముడా! ధర్మముచేతనే ధర్మమునుబొందవలయును. అధర్మమువలననే యధర్మముగలుగుననియును జెప్పుటయుచితముగనుండలేదని తోచుచున్నది. మరియునోరాముడా! అట్లుగాదేని యధర్మవంతులగు నీరాక్షసులు అధర్మఫలమునే పొందవలయును అట్లుపొందియుండిరేని లోకములోనిజనమంతయును ధర్మమునందాసక్తి గలవారగుదురు. అట్లుగాకుండుటచేత నెల్లవారలకును ధర్మాధర్మములయందు సందేహము గలిగియున్నది. మరియునోరాముడా! ధర్మాధర్మములువాస్తవముగసుఖదుఃఖముల నిచ్చునవియయ్యెనేని ధర్మమునుదప్పకసంచరించుచున్నవారలకు సుఖమేగలుగవలయును. అట్లుగాక యధర్మముగ సంచరించుచున్న యీరాక్షసుల యందర్థములువృద్ధినిబొందుచున్నవి. ధర్మశీలురగువారు మిగులదుఃఖములను బొందుచున్నారు.

రఘుకులోద్భవుడవైనయోరాముడా! అధర్మముచేత పాపాత్ములనుజంపుటవలన దోషములేదు. మఱియును పుణ్యపాపరూపకర్మలురెండును మూడుక్షణములకంటె నెక్కుడుకాలముండనివగుటవలన నవియేమిచేయగలవు. అట్లుగాకనిజముగనధర్మమనునది చంపుటనిజమయ్యెనేని యదిదైవయోగమేకావున నందువలనదోషమేమియును లేదని గ్రహింపవలయును. మఱియు శత్రునాశకుడవైన యోరాముడా! కనబడని ప్రతిక్రియగలదియును, సదసత్స్వరూపమైనదియును, నగు ధర్మముచేత పరమునుబొందుట కెట్లుశక్యమగును. మఱియు నోఅన్నా! రఘుకులోత్తమా! ధర్మమనునది వాస్తవముగనుండెనేని ధర్మముగసంచరించుచున్న నీకిట్టికష్టము లెట్లువచ్చును. మఱియు నోరామచంద్రా! నీయట్టిధర్మాత్ముడిటువంటికష్టములను బొందుటచేత ధర్మమనునది లేదనినాకు దృఢముగ దోచుచున్నది. అట్లుగాదేని యోఅన్నా! ధర్మమనునదిబలరహితమైనదనియును, ఏకార్యమును జేయజాలదనియును దోచుచున్నది. కావున దుర్బలమైనదియును, నియమితమగు ఫలమునివ్వజాలనిదియును, నగు ధర్మము సేవింపశక్యముగానిదని యెఱుంగవలయును. మఱియు నోరాముడా! ధర్మముకంటె బరాక్రమమునకధిక సామర్థ్యముగలిగియున్నయెడల ధర్మమునువదలి పరాక్రమమునవలంబింపుము. మఱియును శత్రువులను దపింపజేయునట్టిసామర్థ్యముగల యోరాముడా! సత్యవచనము ధర్మమయినయెడల నీతండ్రియగు దశరథమహారాజు నీకుబట్టాభిషేకమునుజేసెదనని చెప్పినిన్ను అరణ్యమునకేల బంపును. మరియు నోరఘుకులోత్తమా! అన్నా! ధర్మాధర్మములనునవి

రెండునువా స్త - ములమ్యోనేని దేవేంద్రుడుమునినిజంపియజ్ఞమును జేయకపోవున. కావుననవి రెండును నసత్యములనిదోచుచున్నవి.

మఱియు నోరఘుకులోత్తమా! రామడా! అధర్మముతోగూడుకొనిన ధర్మముసర్వమును నశింపజేయునుగదా? అట్లుగాకపోవుటవలనకూడ, నవి రెండును లేవని ధృథముగా దోచుచున్నది. అన్నా! రామా! నాయభిప్రాయమియీవిధముగానున్నది. మఱియు నోరాముడా! లోకములోనివారందఱును సర్వకార్యములను దమ యిష్టానుసారముగా జేతురు

రఘుకులోత్తమా! నీవు రాజ్యమునువిడిచిపెట్టినపుడే ధర్మమునకుగారణమగునర్థమునువిడిచిపెట్టితివి. అర్థములుఅపరిమితముగా వృద్ధినిబొందియున్నయెడల సకలకార్యములను మిగుల శీఘ్రముగాను, సుఖముగాను సాధించుకొనవచ్చును. పర్వతములవలన నదులువృద్ధిని బొందిన విధముగా నర్థములవలన కార్యములు వృద్ధినిబొందును. మఱియు నోరాముడా! అర్థరహితుడగువాడు తేజోహీనుడగును. మఱియు నర్థహీనుడగువానికార్యములు గ్రీష్మకాలమునందు చిన్నచిన్ననదులు నశించిపోయినవిధముగ నశించిపోవును. కావున నర్థహీనుడగువాడు సుఖములుగావలయునని కోరినయెడల పాపమునుజేయవలసివచ్చును. మఱియు అట్టివాడు పాపమునుజేయుటకు యత్నించును. ధనముగలవానికి మిత్రులుగలుగుదురు. ధనముగలవాడే లోకములో బురుషుడనబడును. లోకమునందు ధనముగలవాడే పండితుడనబడును. మఱియు నోరఘుకులోత్తమా! శ్లో॥యస్యార్థాస్సచవిక్రాంతోయస్యార్థాస్సచబుద్ధిమాన్। యస్యార్థాస్సమహాభాగోయస్యార్థాస్సమహాగుణః॥ ఎవని కర్థములు గలిగియుండునో వాడే పరాక్రమవంతుడు. అర్థములుగలవాడే బుద్ధిమంతుడనబడును. అర్థములుగలవాడే మహానుభావుడనబడును. అర్థములుగలవాడే మిగులగొప్పదగు గుణముగలవాడనబడును. అర్థములేనివానికివి యేవియునుగలుగనేరవు. అన్నా! రఘుకులోత్తమా! అర్థహీనునకుగలదోషములనన్నింటిని విస్పష్టముగ దెలిపితిని.

మఱియు నోరాముడా! నీవేమియభిప్రాయముతో రాజ్యమునువిడిచిపెట్టితివో నాకు తెలియలేదు. మఱియునోరాముడా! అర్థముగలవానికి ధర్మకామములు సులభములై యుండును. నిర్ధనునిచేతను, ద్రవ్యమును గోరువానిచేతను, ఎట్టికార్యమునుసాధింపబడదు. మఱియు నోరాజేంద్రా! అన్నా! శ్లో॥ హర్షః కామశ్చధర్మశ్చధర్మఃక్రోధశ్శమోదమః। అర్థాదేతానిసర్వాణిప్రవర్తంతేనరాధిప॥ సంతోషము, కోరిక, ధర్మము, కోపము, శాంతి, దాంతి, మొదలగుగుణములన్నియును, అర్థమువలనగలుగును. కావున నర్థహీనులుధర్మముగసంచరింపదలచినను, తమతలంపును నెరవేర్చుకొనజాలరు. కావున నర్థహీనుడవగునీయందు మేఘావరణకలిగినదినమునందు గ్రహములేవియును గనబడనివిధముగ నేకార్యములును గనబడవు.

మరియు నోఅన్నా! రామా! నీవుధర్మమనితలచి తండ్రియగు దశరథుని వచనానుసారముగ సంచరించినందుకు ప్రాణములకంటె నధికప్రియురాలగు నీభార్యరాక్షసునిచేతనపహరింపబడియె. అదియునుగాక యిప్పుడింద్రజిత్తుమూలకముగ తెంపులేనిదుఃఖముగలిగె. అయిననుగానిమ్ము. రఘుకులోత్తముడవైనయో రాముడా! నేనిప్పుడు మిగులభయంకరమగుకర్మనవలంబించి నీదుఃఖమును బోగొట్టెదను. కావున మానవోత్తముడవును, మిగులబొడవులగు భుజములుగలవాడవును, దృఢమైనవ్రతములుగలవాడవును, అయినయో రాముడా! మహామహిమగల నీయాత్మను నీవు తెలియజాలకయున్నావు. ఇట్లుండుట యుచితముగాదు. మఱియు నోరాముడా! సీతాదేవియొక్క మరణమునుజూచి నేనుమిగులగోపముగలవాడనై నీకుప్రియముగలుగుటకొఱకు నిప్విధముగాబలికితిని. మఱియు నోరాముడా! నేనిప్పుడు మిగులదీక్ష్ణములగు బాణములచేత గుఱ్ఱములు, ఏనుగులు, రథములు, కాల్బలములుగల రాక్షససైన్యమును సర్వమును నశింపజేసెదను. మఱియు నోరాముడా! లంకాపట్టణమును సర్వమును నశింపజేసెదననియె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి యెనుబదిమూడవ సర్గముగిసెను.

▶❋◀

సీతాదేవిచనిపోయెనని వ్యసనపడుచున్న రామునకు విభీషణుడు ధైర్యముజెప్పట.

ఇవ్విధముగ లక్ష్మణుడు శ్రీరాముని నోదార్చుచుండగా విభీషణుడు గుల్మములయందుదగినవారలను నియమించి యారామలక్ష్మణులున్న చోటునకువచ్చె. ఆసమయమునందు విభీషణుడు నానావిధములగు నాయుధములనుధరించిననలుగురుమంత్రులతోగూడుకొనియుండె. అప్పుడావిభీషణుడు కాటుకకొండవంటికాంతిగలనాలుగు ఏనుగులతోగూడుకొనిన గజనాథునివలె బ్రకాశించుచున్న నలుగురు వీరులతో విభీషణుడు అపరిమితముగావ్యసనపడుచున్నవాడును, మహానుభావుడును నగు రాఘవుని, శోకసంతప్తములగు నేత్రములుగలవానరులను చూచెను విభీషణుడు సిగ్గునుబొందుచున్నవాడును వి

గులబరితాపమును బొందుచున్నవాడును, మోహమును బొందినవాడును, లక్ష్మణునియొక్క తొడమీదనున్నవాడును ఇక్ష్వాకువంశమునకు సంతోషమును గలుగజేయువాడును, నగు రామునిజూచి లోపలమిగుల దుఃఖముగలవాడయ్యును, దుఃఖమునునణచుకొని యిదియేమియనియె. ఆసమయమునందు లక్ష్మణుడు కన్నీళ్ళచేతవ్యాప్తమైన శరీరముగలవాడగుచు విభీషణునియొక్క ముఖమును, సుగ్రీవుని, వానరులనుజూచి మిగులఘుందమగు నర్థముగలమాటను జెప్పదలచియిట్లనియె.

ఓవిభీషణుడా! హనుమంతునివలన సీతామహాదేవి ఇంద్రజిత్తుచేతజంపబడెననువార్తనువిని రాముడు మిగులమోహమును జెందియున్నాడనియె. ఇవ్విధముగా జెప్పుచున్నలక్ష్మణునివాక్యమునువిని విభీషణుడిక నూరకుండుమనిచెప్పి యిట్లనియె. రఘుకులోత్తమా! హనుమంతుడుచెప్పినమాట వాస్తవము గాదు. ఆహనుమంతుడు రాక్షసమాయనుదెలిసికొనలేక యిట్లుచెప్పెనని తలచుచున్నాను. సముద్రమునెండింపజేయుట యెట్లుసులభముగాదో యటులనేసీతను జంపుటగూడ సులభముగాదని తెలిసికొనుము. మఱియునధికమగుభుజబలముగల యోరఘుకులోత్తమా! రామా! దుష్టాత్ముడగు రావణునియొక్క యభిప్రాయమును నేను బాగుగనెఱుగుదును. ఆరావణాసురునకు సీతనుజంపుటయందు గొంచెమైనను సమాధానములేదు. కావున సీతాదేవినిజంపనీయడు. నేనుబూర్వము అనేకపర్యాయములు సీతనువిడిచిపెట్టుమని ప్రార్థించితిని. అప్పడాదుష్టాత్ముడు నేనుసీతనువిడువననియెనుగాని చంపుదునని చెప్పినవాడుగాడు. సామదానభేద దండముల చేతగాని, మఱిదేనిచేతగాని సీతాదేవినిజూచుటకుగూడ శక్యముగాదు. ఇప్పుడింద్రజిత్తు తనమాయచేత వానరులనుమోసపుచ్చి లంకాపట్టణమునకుబోయె. పోయినికుంభిలయను ప్రదేశమునందు హోమమును నెరవేర్చుకొనినపిమ్మట దేవదానవులచేత గూడ జయింపశక్యముగానివాడగుచు రాదలచియున్నాడు. హోమముశాస్త్రోక్తప్రకారముగ సంపూర్ణమయ్యెనేని రావణాసురునకు బుత్రుడగు ఇంద్రజిత్తుజయింపశక్యముగానివాడగును. కావుననాయింద్రజిత్తు తనకార్యమును నెరవేర్చుకొనుటకు మాయనుగల్పించి మమ్మలనందఱ మోసపుచ్చెను, కావున ఓ రఘుకులోత్తమా! ఇప్పుడు ఆయింద్రజిత్తుచాము హోమమునకు విఘ్నమును జేయుటకొఱకు సకల సైన్యముతో గూడుకొని మనమందఱమును బోదము పూర్తిగాకముందే హోమమునకు విఘ్నమును జేతము. శత్రుసంహారకా! నీవిప్పుడు లేనివ్యసనమునుగల్పించుకొని దుఃఖమునుబొందకుము. నీవు వ్యసనమును బొందుచుంటివేని వానరవీరులందఱును వ్యసనమును బొందుదురు. దానిచేతమనకు మిగులగీడువాటిల్లును. కావుననీవీమిథ్యావ్యసనమునువదలి స్వస్థచిత్తుడవైయుండుము. మాతోగూడలక్ష్మణునిబంపుము. సకలవానరసైన్యమును వెంటబెట్టుకొనిలక్ష్మణుడువచ్చెనేని మేముసకలకార్యములను జేయగలము.

మానవోత్తముడగు నీలక్ష్మణుడు మిగులదీక్ష్ణములగుబాణములచేతఇంద్రజిత్తునుసంహరింపగలడు. లక్ష్మణుడు మిగులదీక్ష్ణములగుబాణములచేతగొట్టినయెడల, ఇంద్రజిత్తుతాను జేయుచున్న కర్మనువదలిపెట్టగలడు. మఱియునోరామచంద్రా! మిగులదీక్ష్ణములయినవియును, మిగులవేగముగలవియును, పక్షిఱెక్కలుగలవియును, నగు నీలక్ష్మణునియొక్కబాణములు, ఇంద్రజిత్తుయొక్క నెత్తురును బానముచేయగలవు. కావున నధికమగుభుజబలముగల యోరాముడా! మంగళకరములగు లక్షణములుగల లక్ష్మణునిబంపుము. రాముడా! వజ్రాయుధధారియగు దేవేంద్రుడు రాక్షసులను నశింపజేసిన విధముగా నీలక్ష్మణుడు రాక్షసులను నశింపజేయగలడు. మానవోత్తముడవైనయోరాముడా! శత్రువధనుగురించి యాలస్యమును జేయకుము. ఇప్పుడు చేయదగినకార్యమేదియోదానిని జేయుము. శత్రునాశముకొఱకు దేవేంద్రుడాజ్ఞనిచ్చినవిధముగ నీవును శత్రువధకొఱకు నాజ్ఞనివ్వుము. ఇంద్రజిత్తుచేయుచున్నయాగము సమాప్తినొందెనేని దేవదానవులచేతగూడ జయింపశక్యముగాని వాడగును. మఱియునాయింద్రజిత్తుయొక్క యాగము సమాప్తినిబొందెనేని యతనిజయించునట్టి సామర్థ్యము దేవదానవులకుగూడ గలుగనేరదు. మఱియును దేవతలు మొదలగువారందఱును మిగులభయమునబొందుదురనియె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి యెనుబది నాలుగవ సర్గముగిసెను.

నికుంభిలాయాగమును ధ్వంసముజేయుటకు విభీషణుడు మొదలగువారు బోవుట.

అట్లు విభీషణుడుచెప్పినమాటలనువిని రఘుకులోద్భవుడగు రాముడుదుఃఖముచేత బీడింపబడుచున్నవాడగుటవలన విభీషణుడుచెప్పినమాటలను విస్పష్టముగవినినవాడయ్యె. అంతగొంతసేపటికి శత్రువులను జయించునట్టి సామర్థ్యముగలరాముడు ధైర్యమునవలంబించి వానరుల సమీపమునందు గూర్చున్న విభీషణునితో నిట్లనియె.

రాక్షసాధిపతివైనయోవిభీషణుడా! ఇప్పుడునీవుచెప్పిన

మాటలను జక్కగవినలేదు. కావున మరలవినవలయునని మెదుకోరికగలవాడనై యున్నాను. కావున మరలజెప్పు మనియె. అంతటవాక్యములను జెప్పుటయందు మిగుల నేర్పుగలవిభీషణుడు రామునివాక్యములనువిని మరల మునుపటివాక్యములనన్నింటిని స్పష్టముగ జెప్పె. మిగులగొప్పదగు భుజబలముగలయోరాముడా! నీవాజ్ఞాపించిన విధముగ జెప్పెదను. వినుము. ఇంద్రజిత్తుమాయసీతను జంపిన పిమ్మట దనయూధనాథులందఱను న్యాయానుసారముగుల్మముల యందు నిలుచునట్లుచేసె. అంతట రాక్షససేనానాయకు లందఱును దగినస్థలములయందు బ్రవేశించి యున్నారు. మఱల నేనుజెప్పినమాటలను జెప్పెదను. వినుము. నీవు నిర్నిమిత్తముగ వ్యసనమును బొందుచుంటివేని మేమందఱమును వ్యసనమునుబొందెదము. కావుననోరాముడా! లేనివ్యసనమునుబెట్టుకొని దుఃఖింపకుము. కాబట్టి యోరామచంద్రా! శత్రువులకు సంతోషమునుగలుగజేయునట్టి యీదుఃఖమునువిడిచిపెట్టుము. మరియును వీరుడవైన యోరాము [illegible]దుతగినప్రయత్నమును జేయుము. సంతోషమున వలఁజంపుము. మరియు నోరాముడా! నీవిప్పుడు సీతను బొందుటముఖ్యకార్యమైయున్నది. రాక్షసులనందరను జంపుట మరియొకముఖ్యకార్యమైయున్నది. కాబట్టియోరాముడా! ఈరెండుకార్యములను జేయుము నేనుజెప్పునట్టిహితవచనములను వినుము. మరియునోరాముడా! ఈలక్ష్మణుడు గొప్పదగువానరసైన్యముతో గూడుకొనియుద్ధమును జేయుటకు బోవునట్లు చేయుము.

మరియునోరాముడా! సర్పములతో సమానములైనవియునగు బాణములచేత నికుంభిలయందున్న యింద్రజిత్తునుజంపునట్లుచేయుము. మిగులగొప్పదగు భుజబలముగల యీలక్ష్మణుడు దృఢముగానింద్రజిత్తును మిగుల దీక్ష్ణములగు బాణములచేత జంపగలడు. కావున లక్ష్మణుని యుద్ధమునకుబంపుము. వీరుడగు నాయింద్రజిత్తు బ్రహ్మదేవుని యొక్క వరమువలన బ్రహ్మశిరమను నస్త్రమును, ఇచ్ఛానుసారముగ సంచరించుచున్నట్టి గుఱ్ఱములనుబొందెను. మరియునాయింద్రజిత్తు నికుంభిలయందు సకలరాక్షససైన్యముతోగూడ బ్రవేశించి యున్నాడు. ఆయింద్రజిత్తు తానుజేయుచున్నహోమమును సమాప్తినిబొందించెనేని మనలనందరను నిస్సంశయముగ జంపగలడు. కావున నోరామచంద్రా! దేవేంద్రునకుశత్రువగు నింద్రజిత్తు నికుంభిలను విడిచి పోవునట్లును, హోమమునుబూర్తిచేయకుండునట్లును జేసినయెడల మరణమునుబొందగలడు.

ఇవ్విధముగాజేసి యాతతాయియగు నాయింద్రజిత్తునువధింపుము. ఇట్లుచేసిన యెడల నింద్రజిత్తు మరణమును బొందునని సర్వలోకేశ్వరుడగుబ్రహ్మదేవుడువరమునిచ్చె. కావుననోరాజోత్తమా! ఇంద్రజిత్తును జంపుటకు వరము నివ్వుము. మరియునోరాముడా! ఇంద్రజిత్తు చచ్చినపిమ్మట రావణాసురునిమరణమును బొందినవానినిగా దెలిసికొనుమనియె. ఇవ్విధముగా విభీషణుడు చెప్పినవచనమును విని, రఘుకులోద్భవుడగు రాముడిట్లనియె.

సత్యపరాక్రముడవైన యోవిభీషణుడా! భయంకరుడగు నాయింద్రజిత్తు యొక్కమాయను గుర్తెఱుగుదును. అధికమగుమాయగలవాడును, మహాబలుడును, చండిక్షును, నగునాయింద్రజిత్తు బ్రహ్మాస్త్రమును దెలిసినవాడు. అతడుయుద్ధమునందు దేవతలను, వరుణదేవుని, మరియు నితరులనుగూడ జయింపగలడు. మరియు నోవిభీషణుడా! ఆయింద్రజిత్తురథమునెక్కి యాకాశమునందు సంచరించుచు దనమాయచేత మేఘాచ్ఛాదనచేత సూర్యుడు కనబడకుండినట్లు కనబడకయుండెననియె. మరియును రఘుకులోద్భవుడగురాముడు దురాత్ముడగు నింద్రజిత్తుయొక్క మాయాపరాక్రమమును దెలిసికొని కీర్తిసంపన్నుడగు లక్ష్మణుని జూచి యిట్లనియె.

తమ్ముడా! లక్ష్మణా! సకలవానరసైన్యముతోడను, హనుమంతుడు మొదలుగాగల వానరవీరులతోడనుగూడుకొనినవాడవును, జాంబవంతుని వెంటబెట్టుకొనిన వాడవునునై యుద్ధమునకుబోయి మాయాబలవిశారదుడగు నింద్రజిత్తునుజయింపుము. మహాత్ముడైనయీవిభీషణుడింద్రజిత్తునివసించియున్నచోటునెఱింగినవాడు. కావున నీమహానుభావుడునీవెంటనంటివచ్చును. కావున నీవుమిగుల ధైర్యమును నవలంబించిపొమ్మనియె. అవ్విధముగ రఘుకులోద్భవుడగురాముని మాటనువిని లక్ష్మణుడు విభీషణునితోగూడుకొనినవాడై సర్వోత్తమమగు ధనుస్సునధిష్ఠించె. అవ్విధముగ నత్యద్భుతమగుపరాక్రమముగల లక్ష్మణుడు, సన్నద్ధుడును, కవచముగలవాడును, ఖడ్గముగలవాడును, ధనుర్బాణముల నుధరించినవాడునునయ్యె. అంతట సుమిత్రానందనుడగులక్ష్మణుడు సంతోషించినవాడై రాముని పాదములను స్పృశించియిట్లనియె.

రఘుకులోత్తమా! రాముడా! ఇప్పుడునాధనుస్సువలన విడిచిపెట్టబడిన బాణములు రావణాసురుని పుత్రుడగు నింద్రజిత్తునుజంపి లంకాపట్టణమునందు బోయిపడగలవు. మరియునోరాముడా! నాబాణములు భయంకరుడగు నాయింద్రజిత్తుయొక్కశరీరమును నాశముసేయగలవనిచెప్పె. తేజోవంతుడగు లక్ష్మణుడు అన్నయగురామునితోనిట్లుజెప్పి

యింద్రజిత్తును జంపవలయుననియెడు కోరికచేత మిగుల ద్వరగలవాడగుచు బోయెను. అంతట నాలక్ష్మణుడు గుణవగు రామునిపాదములకు ప్రదక్షిణ నమస్కారముల నాచరించి యింద్రజిత్తుచేత పాలింపబడుచున్న నికుంభిలమును ప్రదేశమునకుబోయెను. ప్రతాపవంతుడును, రాజపుత్రుడునునగు లక్ష్మణుడట్లువిభీషణునితోగూడ బయలువెడలిపోయెను. అవ్విధముగలక్ష్మణుడు పోవునపుడు రాముడనేక విధములనాశీర్వదించెను. ఆసమయమునందనేక వేల వానరవీరులతో గూడుకొని హనుమంతుడును, మంత్రులతో గూడుకొనివిభీషణుడును, లక్ష్మణునితోగూడ బయలువెడలిపోయిరి. మరియు నాసమయమునందు లక్ష్మణుడనేక వేల వానరవీరులతోగూడుకొనిచనియెను. మరియు నప్పుడు లక్ష్మణునితో గూడ భల్లూకసైన్యమపరిమితముగా బయలువెడలిపోయెను. ఇట్లనేక వేల వానరవీరులతో గూడుకొనినవాడై లక్ష్మణుడు మిగులత్వరగలవాడగుచు మిగులదూరముగాబోయి తనకు సమీపమునందు వ్యూహాకారముగా నిలిచియున్నరాక్షససైన్యమునుజూచెను.

అంతటశత్రువులను నశింపజేయునట్టి సామర్థ్యముగల లక్ష్మణుడు మాయాయోగముగల యింద్రజిత్తునుజూచిబ్రహ్మవిధానముచేత జయించుటకొరకు నిలిచియుండెను. ఆసమయమునందు ప్రతాపవంతుడగు లక్ష్మణుడు హనుమంతుడు, అంగదుడు, మొదలుగాగల వానరవీరులతో గూడుకొనినవాడై నానావిధములైనవియును, నిర్మలములైనవియును, నగునస్త్రములచేత ప్రకాశించుచున్నదియును, అనేకములగుధ్వజములుగలదియును, అనేకములగు రథములుగలదియును, మదపుటేనుగులుగలదియును, శత్రువులకు భయమును గలుగ జేయునదియునునగు రాక్షససైన్యమునందు ప్రవేశించెను.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి యెనుబదైదవసర్గ ముగిసెను.

ఇంద్రజిత్తుసైన్యమును వానరసైన్యమును యుద్ధము జేయుట.

అంతట రావణాసురునకు దమ్ముడగు విభీషణుడు ఆసమయమునందు శత్రువులకు నాశమును గలుగజేయునట్టి మాటను జెప్పదలచి లక్ష్మణునితో నిట్లనియె.

రఘుకులోత్తమా! లక్ష్మణుడా! మేఘమువలె మిగుల నల్లగానున్న యీరాక్షససైన్యముతో వృక్షములేయాయుధములుగాగలవానరులందరును యుద్ధమును జేయునట్లు సేయుము. మరియునోలక్ష్మణుడా! మిగులగొప్పదగు నీరాక్షససైన్యమును ఛేదించుటయందు యత్నమును జేయుము. ఈసైన్యమంతయును భిన్నమయ్యెనేని రాక్షసేంద్రునకు బుత్రుడగునింద్రజిత్తు కనబడును. కావుననోలక్ష్మణుడా! ఇంద్రునియొక్క వజ్రాయుధముతో సమానములగు బాణములను బ్రయోగింపుము. ప్రయోగించి యింద్రజిత్తియొక్క యాగముసంపూర్ణముగాకుండునట్లు సేయుము. మరియు నోలక్ష్మణా! మాయలనుగల్పించుటయందు మిగుల సమర్థుడును, ధర్మరహితుడును, దురాత్ముడును, నగు నీయింద్రజిత్తును జయింపుము. ఈయింద్రజిత్తుమిగుల క్రూరములగు కర్మలను జేయువాడు. ఇంతయగాక సకల లోకములవారికిని భయమును గల్పించుటయందు దగిన సామర్థ్యము గలవాడు. కావున మిగులశీఘ్రముగ నీయింద్రజిత్తును జయించుటకు యత్నింపుమనియె. ఇవ్విధముగా విభీషణుడు చెప్పినమాటనువిని శుభలక్షణములుగల లక్ష్మణుడు రావణాసురునిపుత్రుడగు నింద్రజిత్తుమీద ననేకవిధములగు బాణవర్షములను గురిపించె.

ఆసమయమునందు రాక్షసులందఱును వానరసైన్యమును జంపవలయుననియెడు కోరికతో మిగుల దీక్ష్ణములగు బాణములను, ఖడ్గములను, తోమరములను, మరియు ననేకవిధములగు నాయుధములను బ్రయోగించిరి. అప్పుడు వానరవీరులందఱును నపరిమితమగు కోపముగలవారై వృక్షములను బ్రయోగించిరి. ఆసమయమునందు రెండు తెగలవారికిని మిగుల భయంకరమగు యుద్ధమయ్యె. అప్పటియుద్ధమునందలిధ్వని లంకాపట్టణమునందంతటను వ్యాపించె. మరియు నానావిధములగు శస్త్రములను, తీక్ష్ణములగుబాణములను, మిగులగొప్పవగు వృక్షములను, మిగుల గొప్పవగు పర్వత శిఖరములను రెండు తెగలవారును బ్రయోగించిరి. అట్టి యాయుధములచేత నాకాశమంతయును గప్పబడియె. ఆసమయమునందు వికారములగు మోములును, భుజములునుగల రాక్షసులందఱును నానావిధములగు నస్త్రములను బ్రయోగించి మిగులభయమును గలిగించిరి. అవ్విధముగానే వానరులందఱును, నానావిధములగు వృక్షములను, మిగులగొప్పవగు పర్వత శిఖరములను బ్రయోగించి రాక్షసోత్తములను మిగుల నధికముగా గొట్టిరి. మరియును భల్లూకాధిపతులును, వానరాధిపతులును, మహాబలులగు వానరులును, నానావిధ రాక్షసులను జంపుచుండిరి.

అట్లువానరులచేత మిగుల బాధింపబడుచున్నదియును కావుననే దుఃఖమును బొందుచున్నదియును, నగు తనసైన్యమునుజూచి శత్రువులచేత నణపశక్యముగాని పరాక్ర

మముగల ఇంద్రజిత్తు తనయాగము పూర్తిగాకమునుపే విడలిచెను. అంతట ఇంద్రజిత్తు న్యగ్రోధవృక్షమునుండి బయలువెడలి మునుపటిరథమునే యధిష్ఠించెను. మఱియు నాసమయమునందు భయంకరమగు ధనుస్సును ధరించినవాడును, నల్లని మేఘముతో సమానమైన కాంతిగలవాడును, ఎఱ్ఱని మోమును, నేత్రములుగలవాడును, క్రోధోద్దీపితుడును, నగు నా ఇంద్రజిత్తు ప్రళయకాలమునందలి యమునివలె ప్రకాశించుచుండెను. అట్టివిధముగ బయలువెడలినవాడును, రథమునందు నివసించియున్నవాడును, నగు ఇంద్రజిత్తును జూచి రాక్షససైన్యమంతయును, మిగుల ధైర్యముగలదై మరల యుద్ధసన్నద్ధమయ్యెను. అంతట రాక్షససైన్యమంతయును, లక్ష్మణునితో మిగుల భయంకరమగు యుద్ధమును జేసెను. ఆసమయమునందు పర్వతముతో సమానుడును, శత్రునాశకుడును, నగు హనుమంతుడు పొందశక్యముగానిదగు వృక్షము నెత్తికొని యుద్ధసన్నద్ధుడై బయలువెడలెను. అంతట నా రాక్షససైన్యమును సర్వమును ప్రళయకాలమునందలి యగ్నిదేవునివలె దహించుచుండెను. మఱియు నానావిధములగు వృక్షములను ప్రయోగించి యా రాక్షససైన్యమును సర్వమును మూర్ఛనొందించెను.

అట్లు మిగులవేగముతో రాక్షససైన్యమును, సర్వమును, చంపుచున్నవాడును, మిగుల కోపోద్దీపితుడును, నగు హనుమంతునిజూచి ఇంద్రజిత్తు కోపోద్దీపితుడయ్యెను. ఆసమయమునందు రాక్షసవీరులందఱును మిగులదీక్ష్ణములగు శూలములను ధరించినవారును, ఖడ్గములు చేతియందుగలవారును, శక్తులను నాయుధములను ధరించినవారును, పట్టసములను నాయుధములుగలవారును, మిగులభయంకరములగు గండ్రగొడ్డండ్లను ధరించినవారును, భిండివాలములను నాయుధములుగలవారును, చక్రములను నాయుధములను ధరించినవారును, వజ్రాయుధముతో సమానములగు పిడికిటిపోటులుగలవారును, ముద్గరములను నాయుధములు గలవారును, నై హనుమంతునిమీదగవిసిరి.

పిమ్మట నాయాయుధములచేత పర్వతముతో సమానుడగు హనుమంతుని గొట్టిరి. అంతట హనుమంతునకును. రాక్షసులకును, మిగులభయంకరమగు యుద్ధమయ్యెను. ఆసమయమునందింద్రజిత్తు పర్వతమువలె ప్రకాశించుచున్నవాడును, రాక్షససైన్యమును సంహరించుచున్నవాడును, వాయుదేవునకుబుత్రుడును, వానరోత్తముడును, నగు హనుమంతునిజూచి తనసారథితో రథమును హనుమంతుడున్నచోటునకు బోనిమ్మని మఱియు నిట్లనియె. సారథీ! నేనిప్పుడుపేక్షించితినేని యీహనుమంతుడు రాక్షసులనందఱను జంపు ననియె. ఇవ్విధముగనింద్రజిత్తు చెప్పినమాటలను విని సారథి హనుమంతుడున్నచోటునకు రథమును బోనిచ్చె. ఆరథము నెక్కి యుద్ధములయందు జయింపశక్యముగాని ఇంద్రజిత్తు కూడబోయె. అంతట నయ్యింద్రజిత్తు మిగులదీక్ష్ణములగు బాణములను, ఖడ్గములను, గండ్రగొడ్డండ్లను, హనుమంతుని శిరస్సునందు వర్షింపజేసె. అంతట వాయునందనుడగు హనుమంతుడా శస్త్రములనన్నింటిని సహించి యధికమగు కోపముగలవాడై యిట్లనియె.

ఓరీదురాత్మా! రావణాసురునకుబుత్రుడా! నీవు శూరుడవైతివేని యుద్ధమును జేయుము. వాయుదేవునకు కుమారుడనగునన్ను యెదిరించినపిమ్మట నెవ్వడును జీవించిపోజాలడు. మఱియు నోరాక్షసాధమా! నీవు సమర్థుడవైతివేని భుజములతో ద్వంద్వయుద్ధమును జేయుము. ఓరీదుష్టాత్మా! నాబలవేగమును సహింపుము. అట్లు చేసితివేని నీవు రాక్షసులలో నుత్తముడవు. అనిచెప్పి ఆసమయమునందు హనుమంతుని జంపలయునని తలచుచున్నవాడును, ధనుర్బాణములను ధరించినవాడును, రావణాసురునకు బుత్రుడును, నగు ఇంద్రజిత్తును జూచి లక్ష్మణునితో ఇట్లనియె. రఘుకులోత్తముడా! ఇంద్రుని జయించినవాడును, రావణాసురునకు బుత్రుడును, నగు నీయింద్రజిత్తు రథారూఢుడై హనుమంతుని జంపవలయునని యెడు కోరికగలవాడగుచున్నాడు. కావున సుమిత్రానందనుడవైనయో లక్ష్మణా! నిరుపమానములైనవియును, శత్రువులను బ్రద్దలుసేయుటయందు సమర్థములైనవియును, ప్రాణాంతమును జేయునట్టివియును, నగు బాణములచేత నీయింద్రజిత్తును జంపుమనియె. ఇవ్విధముగా విభీషణుడు చెప్పినవాక్యములను విని మహానుభావుడగు లక్ష్మణుడు భయంకరమగు నాకారముగలవాడును, పర్వతముతో సమానుడును, మిగులగంభీరముగ సింహనాదమును జేయుచున్నవాడును, నగు లక్ష్మణుని జూచె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి యెనుబదాఱవ సర్గము ముగిసెను.

—(*)-

—*ఇంద్రజిత్తు విభీషణుని నిందించుట.*—

ఇవ్విధముగ జెప్పి యావిభీషణుడు పరమసంతోషముగలవాడై సుమిత్రాదేవికి బుత్రుడును, ధనుర్ధారియును, నగు లక్ష్మణుని వెంబడిబెట్టుకొని యతిశీఘ్రముగ బోయె. అట్లుకొంతదూరము పోయి మిగులగొప్పదగు నొక్కయరణ్యమునందు బ్రవేశించి ఇంద్రజిత్తు చేయబూనినదియును, మిగులభయంకరమైనదియును, నగు కర్మను లక్ష్మణునకు జూపె. మ

యును, రావణాసురునకు దమ్ముడగు విభీషణుండు నల్లనిమేఘముతో సమానమైనదియును, చూచుటకుగూడభయంకరమైనదియును, నగు నొక్క మఱ్ఱిచెట్టునుజూపె. చూపిమఱియు బలవంతుడును, రావణాసురునకుదమ్ముడును, నగు విభీషణుండిట్లనియె. లక్ష్మణుడా! ఇంద్రజిత్తుభూతములకిక్కడబలినిజేసినపిమ్మట యుద్ధమునకు రావలయునని యత్నించుచున్నాడు. పిమ్మట రాక్షసుడగు నయ్యింద్రజిత్తు సకలభూతములకును నదృశ్యుడైయుండి యుద్ధములయందు శత్రువులనందఱను సంహరింపగలడు. కావున ఇంద్రజిత్తువచ్చియీచెట్టుక్రిందబ్రవేశించి హోమమును జేయకమునుపే మిగుల దీక్ష్ణములగు బాణములచేత సంహరింపుమనియె. అంతట నధికమగు తేజస్సుగలవాడును, సుమిత్రాదేవికి బుత్రుడును, నగు లక్ష్మణుడువల్లెయని ధనుష్టంకారమును జేయుచునక్కడనిలిచియుండె. అంతలోపల బలవంతులలో మిగులబ్రసిద్ధుడును, రావణాసురునకు బుత్రుడును, కవచమును, ధనుస్సును, ధరించినవాడును, నగు ఇంద్రజిత్తు అగ్నివలెబ్రకాశించుచున్నరథములోగూడ నక్కడకువచ్చె. అట్లుసమీపమునకువచ్చినవాడును, శత్రువులచేత జయింపనలవిగానివాడును, పులస్త్యునివంశమునందు బుట్టినవాడును, నగు ఇంద్రజిత్తునుజూచి యాలక్ష్మణుడు నాతోయుద్ధమునుజేయుమనియె. ఇవ్విధముగాలక్ష్మణుడుచెప్పినమాటనువిని దృఢమైన మనస్సుగలవాడును, మిగులగొప్పదగు తేజస్సుగలవాడును, రావణాసురునకు బుత్రుడును, నగు ఇంద్రజిత్తు తనకుసమీపమునందున్న విభీషణునిజూచి ఇట్లనియె. విభీషణుడా! నీవునాకంటెబెద్దవాడవు. ఇంతియగాక నాతండ్రియగు రావణాసురునకు దమ్ముడవు. కావుననాకు బిన్నతండ్రివైతివి. ఇట్టినీవునాకు ద్రోహమునుజేయుటతగునా? మరియును ధర్మదూషకుడవైనయోవిభీషణుడా! దుర్మతీ! నీకుబంధుత్వము, స్నేహము, కులము, సౌందర్యము, ధర్మము, మొదలగువానిలోనేదియును, నియామకముగాలేదు. కావుననో దుష్టాత్మా! విభీషణా! నీవువిచారింపదగినవాడవైతివి. సాధుజనులచేతనిందింపదగినవాడవైతివి. ఆహా నీబుద్ధికి నేమనవచ్చును. స్వజనమునువిడిచిపెట్టి యితరులకుభృత్యుడవైతివి. మఱియునోవిభీషణుడా! నీవుచెడిపోయినబుద్ధిచేత రాక్షసులకును, వానరులకును, మిగులదారతమ్యముగలదనియోచింపవైతివి. బంధుజనముతోగలసిమెలసి యుండుటయెక్కడ. నీచులనాశ్రయించుటయెక్కడ, ఇవిరెండును మిగులదారతమ్యముగలవి. మఱియునోవిభీషణుడా! శ్లో॥ గుణవాన్వాపరజనస్స్వజనోనిర్గుణోపివా । నిర్గుణస్స్వజనశ్శ్రేయాన్యః పరః పరఏవసః ॥ తనవారు గుణహీనులైనను, పరులుగుణవంతులైనను, తనవారలే తనకు మిగులశ్రేయస్సునుగలుగజేయువారగుదురు. పరులెంతమంచివారలైనను పరులేయగుదురనియెఱుంగవలయును. కావున నోవిభీషణుడా! పరులనుజేపట్టి తనవారలను విడిచిపెట్టుట యుక్తముగాదు. మరియునోవిభీషణుడా! శ్లో॥ యస్స్వపక్షంపరిత్యజ్యపరపక్షంనిషేవతే । సస్వపక్షేక్షయంప్రాప్తేః పశ్చాత్తైరేవహన్యతే॥ లోకములోనెవ్వడుతనవారలను విడిచిపెట్టియితరులనాశ్రయించునో వాడుతనవారలనందఱను జచ్చినపిమ్మట నాయితరులచేతనే చంపబడును. కావుననోవిభీషణుడా! తనవారలనునిందించి ఇతరులనాశ్రయించుటహానికరమైనకార్యమనియెఱుంగుము.

మఱియునోవిభీషణుడా! మాకార్యమునకు విఘ్నమునుగలుగజేయునట్టి సామర్థ్యము మాకుబంధువుడవగు నీకుదప్ప ఇతరులకులేదు. బంధువుడవగు నీవిట్టిక్రూరకర్మనుజేయదగునా? తగదు. కావుననోవిభీషణుడా! ఇకనైననిట్టిక్రూరకర్మనుజేయకుమనియె. ఇవ్విధముగానింద్రజిత్తుచెప్పినమాటలనువిని విభీషణుడిట్లనియె. ఓరీదురాత్మా! ఇంద్రజిత్తా! నీవునాయభిప్రాయమును దెలిసికొనియుండియును దెలియనివానివలె జెప్పుచున్నావు. మఱియు నిర్నిమిత్తముగ నిందారూపములును, స్తోత్రరూపములును నగు మాటలనుజెప్పుచున్నావు. రాక్షసేంద్రుడగు రావణాసురునకుబుత్రుడవైనయో ఇంద్రజిత్తా! నీవుమిగుల కఠినములగుమాటలనుబలుకకయూరకుండుము. మఱియు నోరాక్షసోత్తమా! విచారింపగానేను క్రూరకర్ములగు రాక్షసులయొక్క కులమునందేపుట్టితిని. అయినను నాస్వభావము మాత్రమురాక్షసస్వభావముగాదు. అట్లుగాకపోవుట సకాలభూతములకును మంచిగుణమేగదా? మఱియు నోరాక్షసాధమా! ఇంద్రజిత్తా! నామనస్సుమిగుల దారుణమగు నధర్మమునందుబ్రవేశింపదు. విషమస్వభావముగల భ్రాతచేత దమ్ముడెట్లు హింసింపబడకుండును. మఱియును ధర్మరహితమగు స్వభావముగలవాడును, పాపస్వభావముగలవాడును, నగు పురుషునివిడిచి చేతిలోనిసర్పమును వదలినవానివలె సుఖమునుబొందగలడు. మఱియు నో రాక్షసాధమా! శ్లో॥ హింసాపరస్వహరణే పరదారాభిమర్శనం। త్యాజ్యమాహుర్దురాచారం వేశ్మప్రజ్వలితంయథా॥ హింస, పరద్రవ్యమునపహరించుట, పరులభార్యనుబట్టుట, గృహములయందగ్నినిబెట్టుట, మొదలగునవి దురాచారములనియును, వానినివిడిచిపెట్టవలయుననియును, పెద్దలుచెప్పుదురు. మఱియును పరద్రవ్యాపహారము, పరులభార్యనుబట్టుట, స్నేహితులయందునమ్మకములేకపోవుట, అసూయాదులును, నాశమును

గలుగఁజేయునట్టి దోషములని యార్యులు సెప్పుదురు. మరియును, మహర్షులను జంపుట, సకలదేవతలతోడను యుద్ధమును జేయుట, అభిమానము, కోపము, వైరత్వము, ప్రతికూలముగ సంచరించుట, అనునవిగూడ దుష్టగుణములని యార్యులు సెప్పుదురు. ఈగుణములన్నియును రావణాసురునియందు గలవు. కావున నాగుణము లన్నియును, రావణాసురునియొక్క ప్రాణమును, ఐశ్వర్యమును నశింపజేయునవియని యెఱుఁగుము. మరియు నీదుర్గుణములన్నియును మేఘములు పర్వతములను గప్పినవిధముగ రావణాసురునిగప్పివైచె. ఇట్టిదుర్గుణములన్నియును గలిగియుండుటచేత, అన్నయగు రావణాసురుని నేను విడిచివచ్చితిని. ఇక నీలంకాపట్టణము నిలువదు. నీవును నీతండ్రియగు రావణాసురుడును జీవించుట దుర్లభము. మీరిరువురును నతిమానులును, దుష్టమగునీతిగల వారును నైయున్నారు. మరియును నీవు బాలుడవగుటచేత నధికమగుమానమును, దుర్నీతియును, గలవాడవైయున్నావు. నీవిప్పుడు కాలపాశముచేత బద్ధుడవైతివి. నీవిప్పుడు దేనిఁ జెప్పఁదలచుచున్నావో దానిం జెప్పుము. ఇప్పుడు నీకుమిగులగొప్పదగు వ్యసనము సంప్రాప్తమైనది. కావున నేమి చెప్పదలచితివో చెప్పుము.

ఓరీ రాక్షసాధమా! ఇంద్రజిత్తా! ఇకమీదట నీవుమఱ్ఱిచెట్టుక్రింద బ్రవేశించుట యుచితముగాదు. కకుత్స్థవంశమునందుబుట్టిన రామలక్ష్మణులకు శత్రుత్వము నవలంబించుటచేత నికజీవింపవు. ఎవ్వనిచేతనైనను మరణమును బొందుటకు సిద్ధముగనున్నావు. కావున నిప్పుడు వ్యసనమును బొందుటవలన బ్రయోజనము లేదు. మానవాధిపతియగు లక్ష్మణునితోగూడ యుద్ధమును జేయుము. నీవీలక్ష్మణునిచేత జంపబడినపిమ్మట యమలోకమునకుబోయి దేవతాకార్యమును జేయుము. కావున ముందుగనిక్కడ నీబలమును జూపుము. సర్వవిధములగు నాయుధములను, బాణములను, బయలుపరపుము. లక్ష్మణునిచే యెదుటబడిన పిమ్మటనిక నీవుజీవింపవు. మహాబలుడవగు నీవిప్పుడు అవశ్యముగా మరణమును బొందగలవనియె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి యెనుబదియేడవసర్గము ముగిసెను.

ఇంద్రజిత్తు లక్ష్మణవిభీషణాదుల పైబాణములను బ్రయోగించుట.

అట్లు విభీషణుడు చెప్పినమాటలను విని యింద్రజిత్తు కోపోద్దీపితుడై మిగులగఠినముగా విభీషణునిదిట్టి యధికవేగముతో బయలువెడలె. అంతట సకలాయుధములను సన్నద్ధముగజేసికొనినవాడై మిగుల మనోహరముగ నలంకరింపబడినదియును, నల్లనిగుఱ్ఱములతో గూడుకొనినదియును, మిగుల గొప్పదియునునగు రథము నెక్కె. ఆసమయమునందు నాయింద్రజిత్తు ప్రళయకాలమునందలి యమునితో సమానుడైయుండె. పిమ్మట మిగులనధికమగు ప్రమాణముగలదియును, విపులమైనదియును, దృఢమైనదియును, భయంకరమైనదియును నగు ధనుస్సునందు మిగులదీక్ష్ణములగు బాణములను సంధించె. అంతట మిగుల గొప్పదగుధనుస్సు గలవాడును, రథమునందు మిగులమనోహరముగ నలంకరింపబడినవాడును, నగునింద్రజిత్తు, అలంకరింపబడినవాడును, శత్రునాశమును జేయువాడును, రామునకుదమ్ముడును, నగులక్ష్మణునిజూచె. చూచిమిగుల సంరంభముగలవాడై విభీషణునితో గూడుకొనిన లక్ష్మణునితో నిట్లనియె.

ఓరీలక్ష్మణా! వానరవీరులు మొదలగు వారితోగూడ నాపరాక్రమమును జూడుము. మఱియునోలక్ష్మణుడా! ఇప్పుడు నాధనుస్సునుండి బయలువెడలినదియును, పొందశక్యముగానిదియును, నగుబాణవర్షమును నీకుసామర్థ్యము గల దేనివారింపుము. మఱియునిప్పుడు మిగులగొప్పదగు ధనుస్సునుండి బయలువెడలునట్టి బాణములగ్నిదేవుడు దూదినికాల్చివేయునట్లు నీయవయవములన్నింటిని నశింపజేయగలవు. మఱియునిప్పుడు మిమ్ములనందఱను, శూలములు, శక్తులు, ఋష్టులు, తోమరములు, మొదలగునాయుధముల చేత బ్రద్దలయిన శరీరములుగల వారినిగాజేసి యమునిగృహమునకు బంపెదను. యుద్ధమునందు మిగులశీఘ్రహస్తము గలిగినట్టివంటివాడను, బాణవర్షమును గురిపించుచున్నవాడను, మేఘునివలెధ్వనిని జేయుచున్న వాడనునగు నాయొక్క ముందర నెవ్వడు నిలువగలడు. మఱియునో లక్ష్మణుడా! పూర్వమొక పర్యాయము రాత్రియుద్ధమునందు మిగులదీక్ష్ణములగు బాణములను బ్రయోగించి యన్నదమ్ములగు మీయిద్దఱను భూమియందు బరుండబెట్టితిని. అప్పుడు మీరిరువురును స్మృతిలేకయున్నారనియును, యమలోకమునకు బోతిరనియునుదలచి యూరకుంటిని. కావున మిమ్మునంతటితో విడిచిపెట్టితిని. మఱియునోలక్ష్మణుడా! కోపోద్దీపితమగు సర్పమువలెనుండునట్టి నాతోనెవ్వడు యుద్ధమును జేయగలడు. ఎవ్వడును నాతోయుద్ధమును జేయజాలడనియె. ఇవ్విధముగా జెప్పుచున్నయింద్రజిత్తుయొక్క మాటలనువిని యప్పుడులక్ష్మణుడు కొంచెమైనను భయములేనివాడును, కోపోద్దీపితుడునునై యింద్రజిత్తుతో నిట్లనియె.

ఓరీ రాక్షసుడా! నీవుకార్యములయొక్క యంతమును

బొందితివి. మాటలచేత బ్రయోజనములేదు. లోకములో నెవ్వడు కార్యములను జేసి ముగించునో యట్టివాడుబుద్ధిమంతుడనబడును. నీవుహీనార్థుడవగుటచేత చేయశక్యముగాని కార్యమునునోటితో మాత్రముచేసితినని చెప్పుచున్నావు. ఇట్లుచెప్పుటవలన నేమిప్రయోజనముగలదు. నోటితో నిరర్థకములగు మాటలనుజెప్పుచు కృతార్థుడనైతినని తలచుచున్నావు. పూర్వము నీవు యుద్ధరంగమునందు గనబడక యుండి యుద్ధమునుజేసితివి. అదిదొంగవాడు చేయదగిన యుద్ధముగాని వీరుడు చేయదగినయుద్ధముగాదు. అదియంతయు నటుండనిమ్ము.

ఓరీ రాక్షసుడా! ఇప్పుడు నేను నీబాణములకు గోచరుడనై యుంటిని. ఇప్పుడు నీపరాక్రమమును జూపుము. వ్యర్థముగా నిన్ను నీవేల బొగడుకొనెదవనియె. ఇవ్విధముగా జెప్పిన కార్యములనువిని యుద్ధములయందు జయమునుబొందునట్టి యింద్రజిత్తుమిగుల భయమగుధనస్సును జేబూని మిగుల దీక్ష్ణమగుబాణవర్షమును గురిపించె. అవ్విధముగనింద్రజిత్తుచేత బ్రయోగింపబడినవియును, మిగులవేగముగలవియును, సర్పముయొక్క విషముతో సమానమైనవియును, నగుబాణములు కోపముచేత నిట్టూర్పులను విడుచుచున్న సర్పములవలె లక్ష్మణునిమీదబడియె. మఱియును రావణాసురునకు బుత్రుడగునింద్రజిత్తు మిగులవేగముగల బాణముచేత శుభకరములగు లక్షణములుగల లక్ష్మణుని మిగుల బాధనొందించె. అవ్విధముగ ననేకములగు బాణములచే గొట్టబడినవాడును, నెత్తురుచేత వ్యాప్తమైనశరీరము గలవాడును, శ్రీమంతుడును, నగులక్ష్మణుడు ధూమములేనియగ్నివలె బ్రకాశించుచుండె. ఆసమయమునందింద్రజిత్తుతనయొక్క యత్యద్భుతమగు కర్మనుజూచి మిగులభయంకరారావముగలుగునట్లు సింహనాదమునుజేసి యిట్లనియె.

ఓరీసుమిత్రానందనుడా! మిగులదీక్ష్ణములగు నంచులుగలవియును, నాధనస్సునుండి జారినవియును, నగుబాణములు నీప్రాణములను నపహరించును. మఱియునో లక్ష్మణుడా! నాచేతజంపబడి క్రిందబడియున్న నీమీదనిప్పుడు నక్కలును, డేగలును, గ్రద్దలునుబడగలవు. దానస్వభావముగల యోలక్ష్మణుడా! సర్వకాలములయందును బూజ్యుడవును, రామునకుబంధువుడవును, మరియు దమ్ముడవును నగు నీవునాచేతజంపబడి క్రిందబడియుంటవేని దుష్టులయందు కూడ ననుగ్రహముగల రాముడు చూడగలడు. మరియు గవచహీనుడవును, భూమియందువిడిచి పెట్టబడినధనుర్బాణములు గలవాడవును, అపహరింపబడిన శిరస్సుగలవాడవును, నగునిన్నుజూచి రాముడు వ్యసనమును బొందగలడనియె. ఇవ్విధముగా బలుకుచున్నవాడును, మిగులసంరంభముగలవాడును, మిగులగర్వితుడును, రావణాసురునకు బుత్రుడును, నగునింద్రజిత్తునుజూచి లక్ష్మణుడు మిగుల గంభీరార్థముతో నిట్లనియె.

ఓరీదుష్టాత్మా! ఇంద్రజిత్తా! నోటిబలమును విడిచిపెట్టుము. వ్యర్థముగనిట్లు మాటలాడుటవలన నేమిప్రయోజనముగలదు. తగినవిధముగ యుద్ధమునుజేసి నీపరాక్రమమునుజూపుము. రాక్షసాధముడా! ఏకార్యముజేయకయే నిర్నిమిత్తముగ నేలబొగడుకొనియెదవు. నీవుచేయదగిన కార్యమునుజేయుము. నీమాటనీపొగడ్తవిని నమ్మకముగలవాడను, సంతోషముగలవాడనునయ్యెదను. మఱియునో రాక్షసాధమా! నేనుగొంచెమైనను బరుషవచనములను బలుకకయును, కొంచెమైన నవమానకరములగు మాటలనుచ్చరింపకయును, నన్ను నేనుబొగడు కొనకయును, నిన్ను వధింతుననియె.

ఇవ్విధముగా జెప్పి మిగులదీక్ష్ణములగు నైదుబాణములను చెవులవఱకును ధనుస్సునులాగి యాయింద్రజిత్తుయొక్క ఱొమ్మునందు దగులుకొనునట్లు ప్రయోగించె. చక్కని ఱెక్కలు గలవియును, సర్పములవలెబ్రజ్వలించుచున్నవియును, నగులక్ష్మణుని బాణములు సూర్యకిరణములవలె బ్రకాశించుచు నింద్రజిత్తుయొక్క హృదయమునందు దగులుకొనినవయ్యె. అట్లులక్ష్మణుని బాణములచేత గొట్టబడినవాడును, రావణాసురునకు బుత్రుడుగు, నగునింద్రజిత్తు మిగుల దీక్ష్ణములగు బాణములనులక్ష్మణునిమీద బ్రయోగించె. ఆసమయమునందు వానరులకును, రాక్షసవీరులకును, మిగులభయంకరమగు యుద్ధమయ్యె. మఱియునొకరినొకరు జయింపవలయునని మొదల కోరికగలయీయిరువురియొక్కయు యుద్ధముమిగుల సంకులమైనదియును, సమ్మర్దముగలదియునునైయుండె. మరియు నయ్యిరువురును, మిగుల బలముగలవారును, పరాక్రమముచేత నొప్పుచున్నవారును నైయుండిరి. మరియు నయ్యిరువురును విక్రమముగలవారును, శస్త్రాస్త్రములను జక్కగ దెలిసినవారునునై యుండిరి. మరియునయ్యిరువురును జయింపనలవిగానివారును, నిరుపమానములగు బలపరాక్రమములు గలవారునునైయుండిరి. అట్టివీరోత్తములగు నయ్యిరువురును నాకాశమునందలి గ్రహములవలె మిగులభయంకరమగు యుద్ధమునుజేయుచుండిరి. మఱియునయ్యిరువురును, ఇంద్రుడును, వృత్రాసురుడును, యుద్ధమునుజేసినవిధముగ యుద్ధమునుజేసిరి. మరియు నాసమయమునందు యుద్ధమును జేయుచున్న యాయిరువురును సింహములను బోలియుండిరి. మఱియు

నయ్యిరువురును నపరిమితముగా బాణవర్షమును గురిపించిరి. నరరాక్షససింహులగు నయ్యిరువురును నద్భుతమగు యుద్ధమును జేసిరి. మఱియు నాసమయమునందయ్యిరువురును, మిగుల సంతోషముగలవారును, జయమును గోరుచున్నవారును, ధనుర్బాణములను ధరించినవారును, బాణములను మేఘములుదకమును వర్షించినవిధముగవర్షించిరి. మఱియునధికముగావృద్ధినిఁబొందినవారును, యుద్ధమునందు బండితులును,ధనుస్సులచేతను, ఖడ్గములచేతభయంకరులును, మిగులదీక్ష్ణములగుశస్త్రములను ధరించినవారును, అధికముగుబలముగలవారునునగునయ్యిరువురును, శంబరాసురదేవేన్ద్రులవలె మిగులగొప్పదగు యుద్ధమును జేసిరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి యెనుబదేనిమిదవసర్గము ముగిసెను.

లక్ష్మణుడును యింద్రజిత్తును మహద్యుద్ధము జేయుట.

అంతట నపరిమితముగా శత్రువులను బాధింపఁ టయందుదగినసామర్థ్యముగలవాఁడగు లక్ష్మణుడుక్రోధోద్దీపితమగుసర్పమువలె నిట్టూర్పులనువిడుచుచు ధనుస్సునాసంధానముచేసి యధికమగుబాణవర్షమునుగురిపించె. ఆసమయమునందు రావణాసురునకుబుత్రుడగు నింద్రజిత్తుధనుస్సుయొక్క టంకారమునువిని వెలవెలబోవుచున్న మోముగలవాఁడైలక్ష్మణునిఁజూచె. అట్లు వెలవెలబోవుచున్నముఖముగలవాడును, రావణాసురునకు బుత్రుడును, నగునింద్రజిత్తును, అపరిమితముగాయుద్ధమును జేయుచున్న లక్ష్మణునిన్నిఁజూచివిభీషణుండులక్ష్మణునితోనిట్లనియె.

రఘుకులోత్తమా! లక్ష్మణుడా! యుద్ధమునందనేకములగుదుశ్శకునములుగలుగుచున్నవి. కావున మిగులనధికమగుభుజబలముగల యోలక్ష్మణుఁడా! నిశ్చయముగనీకుజయముగలుగుననియును, ఇంద్రజిత్తున కపజయముగలుగుననియును, దోచుచున్నదనియె. అంతట సుమిత్రానందనుడగులక్ష్మణుడు మిగులగొప్పదగువిషముగల సర్పమునుబోలియున్నవియును, అగ్నిజ్వాలలతోసమానములైనవియును,నగుబాణములనువర్షించె. అట్లులక్ష్మణునిచేత బ్రయోగింపబడినవియును, పిడుగులతోసమానములైనవియును, నగు బాణములచేత గొట్టబడినయాయింద్రజిత్తు క్షోభనుబొందుచున్న యింద్రియములుగలవాడును, మూఢచిత్తుడునునయ్యె. అంతగొంతసేపటికి దెలివొందినయింద్రియములుగలవాఁడైవీరుడును, యుద్ధమును జేయుచున్నవాడును, దశరథమహారాజునకుబుత్రుడును, నగులక్ష్మణునిఁజూచె. అంతట నయ్యింద్రజిత్తుకోపముచేత నెఱ్ఱనైననేత్రములుగలవాఁడైలక్ష్మణునిదగ్గిరకువచ్చియిట్లనియె.

ఓరీలక్ష్మణుఁడా! తొల్లిటియుద్ధమునందలి నాదుపరాక్రమమునెఱుగుదువుగదా? అప్పుడు నిన్నునునీయన్నను గూడబంధించితినిగదా? వజ్రాయుధముతో సమానములగుబాణములచేత మిమ్ములనిరువురను, యుద్ధభూమియందు బడవైచితినిగదా? అప్పుడు మీరిరువురును మూర్ఛనొంది క్రిందబడియుండుటనుజూచి మరణమును బొందితిరిగదాయని తలచితిని. అట్లుతలచినేనూరకుంటిని. అందువలననీవిప్పుడువచ్చి నాతోయుద్ధమును జేయగలిగితివి. ఒకవేళనీవుమొదటియుద్ధమునందు నాపరాక్రమమునుజూడకపోయినను, ఇప్పుడుస్థిరముగానిలిచి నాపరాక్రమమును జూడుమనిచెప్పి మిగులదీక్ష్ణములగు నేడుబాణములను బ్రయోగించి లక్ష్మణునిగొట్టె. మఱియుమిగులదీక్ష్ణములైనవియును, శ్రేష్ఠములయినవియును, నగు పదిబాణములనుహనుమంతునిమీద బ్రయోగించె. అంతటవీర్యవంతుడగు నాయింద్రజిత్తుమిగులశ్రేష్ఠములగు నూఱుబాణములచేతవిభీషణునిబలముగాగొట్టె.

అవ్విధముగ నింద్రజిత్తు విభీషణునిదృఢముగాగొట్టుటనుజూచి రామునకుదమ్ముడగులక్ష్మణుడునవ్వుచు నేమియునుమాటలాడక మిగులదీక్ష్ణములగు బాణములనునింద్రజిత్తుమీదబ్రయోగించె. అట్లుప్రయోగించి యాలక్ష్మణుడుగోపోద్దీపితుడును, భయరహితుడునునై యింద్రజిత్తుమీదమఱియు ననేకములగు బాణములనుబ్రయోగించె. అట్లుప్రయోగించియిట్లనియె.

ఓరీరాక్షసుడా! యుద్ధమునకువచ్చినవీరులు యీవిధముగాజులకతనముగలవియును, స్వల్పములైనవియును నగు బాణములనుబ్రయోగింపరు. నీబాణములు నాశరీరమునకు సుఖకరములై యున్నవిగాని దుఃఖకరములైయుండలేదు. మఱియు నోరాక్షసుడా! ఇంద్రజిత్తా! యుద్ధమునందు జయమునుగోరునట్టిశూరులు యీవిధముగా యుద్ధమును జేయరనియె. ఇవ్విధముగమాటలాడుచు నయ్యింద్రజిత్తుమీదమిగులదీక్ష్ణములగు బాణములను అపరిమితముగా బ్రయోగించె. ఆబాణములచేత నింద్రజిత్తుయొక్క కవచము బ్రద్దలయ్యె. అట్లుబ్రద్దలైనయాకవచముయొక్కతునుకలు రథముమీదనుండి యాకాశమునుండి నక్షత్రములుజారిపడినవిధముగజారిపడియె. మఱియునవ్విధముగా బాణములచేత గొట్టబడినవాడును, శరీరమునందు వ్రణములుగలవాడును, వీరుడునునగు నింద్రజిత్తుచరియలుగల పర్వతమునబోలియుండె. అంతట రావణాసురునకుబుత్రుడగు నింద్రజిత్తు

మిగులకోపముగలవాడై యాయుద్ధమునం దనేకములగు బాణములను బ్రయోగించి లక్ష్మణుని కర్కశముగ మర్దించె. పిమ్మట లక్ష్మణుని యొక్క కవచమును బ్రద్దలు సేసె. అంతటన య్యిరువురును సమముగన పకారమును జేసికొనుచు యుద్ధమును జేసిరి. మఱియు నయ్యోద్ధలు సంకులసమరమును జేయుచు నధికముగా నిట్టూర్పులను విడుచుచుండిరి. మఱియును బాణములచేత సర్వావయవములయందును వ్రణములను గల్పించుకొనిరి. ఇంతియగాక నెత్తురుచేత వ్యాప్తమైన యవయవములుగలవారైరి. ఇవ్విధముగా నయ్యిరువురును, మిగుల తీక్ష్ణములగు బాణములచేత జిరకాలము యుద్ధమును జేసిరి. మఱియును మహానుభావులును, యుద్ధమునందు మిగుల నేర్పుగలవారును, భయంకరమగు పరాక్రమముగలవారును, ఒకరినొకరు జయింపదలచియున్నవారును, నగు నయ్యిరువురును శరీరములనుండి నెత్తురును వర్షించునట్లు యుద్ధమును జేసిరి. ఆసమయమునం దాయోద్ధలు ప్రస్రవణాచలములను బోలియుండిరి. మఱియు నతివేగముగా బాణవర్షమును గురిపించుచున్న యాయిరువురి యొక్కయు సింహనాదధ్వనియు నపరిమితముగా వర్షించుచున్న మేఘములయందలి యురుమును బోలియుండె. ఇవ్విధముగ నయ్యిరువురును చాలసేపు యుద్ధమును జేసిరి. అట్లు చిరకాలము యుద్ధమును జేసియును నయ్యిరువురిలో నొక్కడైనను, యుద్ధమునుండి తొలగడయ్యె. శ్రమనుగూడ బొందరైరి. మఱియు నస్త్రవంతులలో నుత్తములగు నయ్యిరువురు నుదమతమ యస్త్రములను జూపిరి. మఱియు ననేకవిధములును, నేర్పుతగ్గులుగలవియును, నగు బాణములను, బ్రయోగించి యాకాశమును సర్వమును నావరింపజేసిరి. మఱియు ననేకవిధములగు యుద్ధములను జేసిరి. ఇంతియగాక నరరాక్షసులగు నాయోద్ధలు మిగులసంకులమగు యుద్ధమును జేసిరి. మఱియు నాసమయమునం దయ్యిరువురి యొక్కయు పాదతలాదిధ్వనులు వేఱువేఱుగ వినబడుచుండె. ఆ ధ్వని జనులకు గంపమును గలుగజేయుచున్నదియును, భయంకరమైనదియును, మిగుల దారుణమైనదియును నై యుండె. మఱియు నవ్విధముగా ధ్వనిచేయుచున్న యాయిరువురి యొక్కయు ధ్వని యురుమును బోలియుండె. మఱియును బంగారపు పిల్లుగల బాణములచేత శరీరములను వ్రణములనుగా జేసికొనిరి. మఱియును బరస్పరమును జయించి కీర్తి నిబొందవలయునని యెడుతలంపులతో శరీరములనుండి నెత్తురుగారునట్లు కొట్టుకొనిరి. అందువలన నాయిరువురును ప్రస్రవణాచలములను బోలియుండిరి. మఱియును కీర్తిమంతులగు నయ్యిరువురి యొక్కయు శరీరమునుండి యపరిమితముగా రక్తము ప్రవహించుచుండె. మఱియు నావీరులయొక్క శరీరములనుండి రత్నపుపిడులుగల బాణములు క్రిందబడుచుండె. మఱికొన్ని బాణములు వారిశరీరమునుండి యంతరిక్షమున కెగిరిపోవు. మఱికొన్ని బాణములను నయ్యిరువురును నడుమనే ఖండించుచుండిరి. ఆసమయమునందు వారియొక్క బాణమయమగు యుద్ధము మిగుల భయంకరమైనదై యుండె. ఆసమయమునందు బాణములన్నియు ను సత్రయాగమునందు బ్రజ్వలించుచున్న యగ్నులను బోలియుండె. అప్పుడు వ్రణములతోగూడిన శరీరములుగల యాయిరువురును పుష్పించిన మోదుగుచెట్లను బోలియుండిరి. అంతట నూరకుండక మఱియు నయ్యిరువురును మిగుల సంకులమైనదియును, భయంకరమైనదియును నగు యుద్ధము జేయుచుండిరి. ఆసమయమునందు యింద్రజిత్తు లక్ష్మణు లియిరువురును నొకరినొకరు జయింపవలయునని యెడు కోరికగలవారై యుండిరి. మఱియు నప్పుడు లక్ష్మణుడింద్రజిత్తును, ఇంద్రజిత్తు లక్ష్మణుని దృఢముగా మిగుల దీక్ష్ణములగు బాణములచేత గొట్టుకొనిరి. అట్లు బలముగా గొట్టుకొనియును శ్రమను జెందినవారుగారైరి. మఱియు నాసమయమునందు నెత్తురుచేత దడసబడినవియును, బాణములచేత వ్యాప్తములైనవియును, నగు వారియవయవములన్నియును ప్రజ్వలించుచున్న యగ్నులవలె బ్రకాశించుచుండె. అట్లు యుద్ధమును జేయుచున్న యాయిరువురికిని చిరకాలము గడచె. అవ్విధముగ జిరకాలము యుద్ధమును జేసియును నయ్యిరువురును, కొంచెమైనను శ్రమను బొందకుండిరి. మఱియు నప్పుడు యుద్ధములయందు మిగుల బరిచయముగల యింద్రజిత్తును జంపవలయునని యెడుతలంపుతో యుద్ధమును జేయుచున్నవాడును, యుద్ధమునందు జయింపబడనివాడును, నగు లక్ష్మణునకు బ్రియమును, హితమును జేయదలచినవాడై విభీషణుడు సమీపమునకు వచ్చియుండె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి యెనుబదితొమ్మిదవ సర్గము ముగిసెను.

*

విభీషణుడు లక్ష్మణునకు యింద్రజిత్తును జంపునట్టి విధమును దెలుపుట.

అవ్విధముగ యుద్ధమును జేయుచున్నవారలును, మదపుటేనుగులవలె బరస్పరజయమును గోరుచున్నవారును, యుద్ధమునం దొకరినొకరు చూచుచున్నవారును, నగు నింద్రజిత్తు లక్ష్మణులనిజూచి శూరుడును, రావణాసురునకు దమ్ముడును నగు విభీషణుడు యుద్ధముయొక్క యగ్రభాగ

ము నందు నిలిచి యుండెను. అంతట దనధనుస్సును నపరిమితముగా టంకారమును జేయుచు రాక్షసులయందు మిగుల దీక్ష్ణములును, అనేకములును, నగు బాణములను బ్రయోగించె. అవ్విధముగ విభీషణునిచేత బ్రయోగింప బడిన వియును, అగ్నిజ్వాలలతో సమానములైనవియును, నగు నాంబాణములు వజ్రాయుధములు పర్వతములను బ్రద్దలు సేసిన విధముగ రాక్షసులను బ్రద్దలు సేసె. ఆసమయమునందు విభీషణుని యనుచరులందఱును శూలములు, ఖడ్గములు, పట్టసములు మొదలుగాగల యాయుధములచేత ననేకులగు రాక్షసులను గొట్టిరి. మఱియు నాసమయమునందు తనయనుచరులగు రాక్షసులతో గూడుకొనినవాడై యావిభీషణుడు ఏనుగు గున్నలనడుమ బ్రకాశించు మదపుటేనుగును బోలి యుండెను. అంతట కాలవేత్తయును, రాక్షసులలో శ్రేష్ఠుడును, నగు విభీషణుడు యుద్ధమునందు బ్రియముగల వానరులను బ్రేరణను జేసినవాడై యిట్లనియె. ఓవానరోత్తములారా! రావణాసురునకు యీయింద్రజిత్తు ఒక్కడే యాధారుడై యున్నాడు. కాబట్టి మీరందఱును నితని జంపుటకొరకు దృఢచిత్తములు గలవారై యుండుడు. భయముచేత ఒదిగిడకుడు. ఈ యింద్రజిత్తు ఒక్కడును జంపబడెనేని రావణాసురుడు తప్ప దక్కిన రాక్షస సైన్యమంతయును జంపబడినదని యెన్నుడు. మఱియు నోవానరోత్తములారా! ఇదివఱకు వీరుడగు బ్రహస్తుడు, మహాబలుడగు నికుంభుడు, కుంభకర్ణుడు, కుంభుడు, ధూమ్రాక్షుడు, జంబుమాలి, మహామాలి, అధికమగు వేగముగల యశనిప్రభుడు, సుప్తఘ్నుడు, యజ్ఞకోపుడు, వజ్రదంష్ట్రుడు, సంహ్రాది, వికటుడు, నిఘ్నుడు, తపనుడు, దముడు, బ్రఘాసుడు, బ్రఘసుడు, వజ్రజంఘుడు, జంఘుడు, అగ్నికేతువు, దుర్ధర్షుడు, రశ్మికేతువు, విద్యుజ్జిహ్వుడు, ద్విజిహ్వుడు, సూర్యశత్రుడు, అకంపనుడు, సుపార్శ్వుడు, చక్రమాలి, కంపనుడు, మిగుల బలవంతులగు దేవాంతక నరాంతకులు, మొదలగు మహాబలులనందఱును సంహరించితిరి.

బాహువులచేత సముద్రమును గోష్పద ప్రాయమునుగా దాటితిరి. ఇకను యీయింద్రజిత్తు ఒక్కడేమిగిలి యున్నాడు. మరియు నోవానరోత్తములారా! బలగర్వదర్పితులగు రాక్షసులనందరను జంపితిరి. కావున నితనిగూడ జంపుటకు యత్నము జేయుడు. వానరోత్తములారా! ఈ యింద్రజిత్తును నేను జంపగలను. అయినను నితడు నాయన్నకు కుమారుడగుటచేత నేను జంపుట యుచితము గాదు. నేను రాముని కొఱకు నావారలయందు దయను వదలిపెట్టి చంపుటకు నుద్యుక్తుడనైతిని. ఇప్పుడు కన్నీళ్లునా కన్నుల నడ్డుపఱచుచున్నవి. కావున నేనూరకుంటిని. ఈ యింద్రజిత్తును నిప్పుడు లక్ష్మణుడు నాశమును బొందింపగలడు. వానరోత్తములారా! మీరందఱును నొక్కటిగా జేర యీయింద్రజిత్తుయొక్క సమీపమునందు సంచరించుచున్న రాక్షసులను జంపుడనియె. ఇవ్విధముగా నధికములగు బలకీర్తులుగల విభీషణుడు చెప్పిన మాటలను విని వానరులందఱును నపరిమితమగు సంతోషము గలవారై తమతోకలను నేలవేసికొట్టిరి.

పిమ్మట నావానరులందఱును మాటిమాటికిని గర్జనములను జేసిరి. మఱియును మేఘములను జూచిన నెమళ్ళవలె నానావిధములగు ధ్వనులను జేసిరి. అంతట జాంబవంతుడు నానావిధ వానర సమూహముతో గూడుకొనినవాడై గోళ్ళచేతను, దంతములచేతను, ఱాళ్ళచేతను, రాక్షసులనుగొట్టె. ఆసమయమునందు అనేకవిధములగు నాయుధములుగల యారాక్షసులందఱును, భయరహితులై భల్లూకాధిపతియగు నాజాంబవంతుని అనేక విధముల గొట్టిరి. మరియు నారాక్షసులందఱును, శరములచేతను, ఖడ్గములచేతను, మిగుల దీక్ష్ణములగు పట్టసములను నాయుధములచేతను, కఱ్ఱలచేతను, తోమరములచేతను, నాజాంబవంతుని గొట్టిరి. అంతట వానరులకును, రాక్షసులకును, మిగుల సంకులమగు యుద్ధమయ్యె. అప్పటియుద్ధము దేవాసురుల యుద్ధమునుబోలి యుండెను. మరియు పస్పటికలకల ధ్వని మిగులభయంకరమైనదై యుండెను. అంతట హనుమంతుడు అపరిమితమగు కోపముగల వాడై యొక్క యేపిచెట్టును పెల్లగించుకొనివచ్చి యనేక వేలమంది రాక్షసులను సంహరించె. ఆసమయమునందు యింద్రజిత్తు పినతండ్రియగు విభీషణునితో మిగుల భయంకరమగు యుద్ధమును జేసి యంతట నతనినివదలి శత్రువీరులను సంహరించునట్టి లక్ష్మణుని కెదికి బోయెను.

అంతట నయ్యింద్రజిత్తును లక్ష్మణుడును మిగులభయంకరమగు యుద్ధమును జేసిరి. మరియు నయ్యిరువురును అనేకవేల బాణములచేత నధికముగా యుద్ధమును జేసిరి మరియు నాయిరువురును దమబాణములయందు జూచువారలకు గనబడకయుండిరి. ఆ బాణములచేత గప్పబడిన నయ్యిరువురును మేఘములచేత గప్పబడిన సూర్య చంద్రులను బోలి యుండిరి. మరియు నయ్యిద్దఱును యుద్ధమును జేయునప్పుడు బాణములను గ్రహించుట, ప్రయోగించుట, ధనుస్సునులాగుట, మొదలగుకార్యములు చూచువారలకు దెలియ శక్యముగాకయుండెను. మరియు నయ్యిరువురియొక్క

యు ధనస్సులనుండి బయలు వెడలిన బాణములయొక్క సముదాయముచేత నాకాశమంతయును గప్పబడి యుండుటవలన నయ్యిరువురును చూచువారలకు గనబడక యుండిరి. ఆసమయమునందు లక్ష్మణుడు యింద్రజిత్తు మీదను, ఇంద్రజిత్తు లక్ష్మణుని మీదను నపరిమితముగా బాణవర్షమును గురిపించిరి. అవ్విధముగ నతివేగముగా బ్రయోగింపబడినవియును, మిగుల దీక్ష్ణములైనవియును నగు బాణములచేత నాకాశమంతయును దట్టముగా గప్పబడుటవలన నధికమగు చీకటిచేత వ్యాప్తమయ్యె. మఱియు నవ్విధముగా బ్రయోగింపబడినవియును, ననేకనూరులసంఖ్యలు గలవియును, మిగుల దీక్ష్ణములైనవియును నగు బాణములచేత దిక్కులన్నియును మిగుల సంకులములయ్యె. అంతట చీకటిచేతదిక్కులన్నియును గప్పబడినవయ్యె. అప్పట చీకటి సూర్యాస్తమయమైనపిమ్మటగ్రమ్మెడుచీకటినిబోలియుండె. మఱియు నాసమయమునందు నెత్తురుయొక్క ప్రవాహముగలవియును, మిగుల గొప్పవియును నగు నదులుప్రవహించుచుండె. అప్పుడు గ్రద్దలు మొదలుగాగల పక్షులు మిగుల భయంకరముగా గూయుచుండె. మఱియు నప్పుడు వాయువు విసరకుండె, అగ్నిదేవుడు మండడయ్యె. ఆసమయమునందుమహర్షులందరునులోకములకు మేలు గలుగుగావుతమనిరి. (మరియునాసమయమునందుగంధర్వులు, చారణులుమొదలగువారితోగూడ నేలోకదిక్కులనుండియుద్ధమునుజూడనిశ్చయించిరి)అంతటలక్ష్మణుడు.మిగులదీక్ష్ణములగునాలుగుబాణములచేతఇంద్రజిత్తుయొక్కనల్లనివియును, బంగారపు సొమ్ములచేత నలంకరింపబడినవియును, నగు వాలుగు గుఱ్ఱములను నధికముగా మర్దించె. అంతట మఱియును, శ్రీమంతుడును, రఘుకులోద్భవుడును, నగులక్ష్మణుడు, మిగుల దీక్ష్ణమైనదియును, తెల్లనిదియును, చెవివరకును లాగివిడువబడినవియును, మంచిఱెక్కలు గలవియును, అధికమైన తేజస్సుగలవియును, వజ్రాయుధముతో సమానమైనవియును, పిడుగువంటి ధ్వనిగలవియును, నగు బాణముచేత సారథియొక్క శిరమునుద్రుంచి క్రిందబడవైచె. అవ్విధముగా మరణమును బొందిన పిదప మండోదరీపుత్రుడగు నయ్యింద్రజిత్తు తానే సారథ్యమును జేసికొనుచు మిగుల భయంకరమగు యుద్ధమును జేసె. అప్పుడు అతని సామర్థ్యమును జూచి యెల్లవారును మిగుల నాశ్చర్యమును బొందిరి,

ఆసమయమునందు లక్ష్మణుడు మిగుల వేగము గలవియును, తీక్ష్ణములయినవియును, నగు బాణములచేత గుఱ్ఱములనధికముగా మర్దించె. మఱియు నింద్రజిత్తుమీదగూడ ననేకములగు బాణములను బ్రయోగించె. అవ్విధముగ లక్ష్మణుడు సారథినిజంపుటను, గుఱ్ఱములను గొట్టుటను,తనమీదబాణములను బ్రయోగించుటను జూచి యింద్రజిత్తు మిగుల వ్యసనముచేత దీనమైన మోముగలవాడై యుద్ధసన్నాహమును విడిచిపెట్టె. అవ్విధముగ నింద్రజిత్తు వ్యసనమును బొందుటను జూచి వానరులందరును నధికమగు సంతోషముగలవారైరి. లక్ష్మణుని నధికముగా బూజించిరి. అంతట, ప్రమాథి, శరభుడు, రభసుడు, గంధమాదనుడు, అనునట్టి నలుగురువానరులును నధికమగు వేగముగలవారై యుద్ధమును జేయదలచి వచ్చిరి. అట్లు వచ్చిన యానలుగురును,మిగులవేగముతోగుఱ్ఱములమీదబడిరి. అంతట నాగుఱ్ఱములు వారుగొట్టెడు దెబ్బలకు దాళజాలక ముఖములనుండి నెత్తురును గ్రక్కినవయ్యె మఱియు నాగుఱ్ఱములనేకవిధములుగా మర్దింపబడినవై క్రిందబడి మరణమును బొందినవయ్యె. అట్లుగుఱ్ఱములను జంపి రథమును విఱిచి యానలుగురు వానరులును మిగుల వేగముతో వచ్చి మరల లక్ష్మణునియొక్క ప్రక్కను నిలిచిరి. అవ్విధముగ గుఱ్ఱములు చచ్చినపిమ్మట నింద్రజిత్తు రథముమీదనుండి క్రిందికిదుమికి లక్ష్మణునిమీద బాణవర్షమును గురిపించె. అంతట దేవేంద్రునితో సమానుడగు లక్ష్మణుడు అపరిమితమగు కోపముగలవాడై మిగుల దీక్ష్ణములగు బాణములను బ్రయోగించుచున్నవాడును, పాదములతో సంచరించుచున్నవాడునునగు నింద్రజిత్తును మిగుల దీక్ష్ణములగుబాణములచేతగొట్టె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి తొంబదవ సర్గ ముగిసెను.

—* లక్ష్మణుడు ఇంద్రజిత్తును సంహరించుట. *—

అవ్విధముగ గుఱ్ఱములు చచ్చినపిమ్మట నయ్యింద్రజిత్తు భూమియందునిలిచి యుద్ధమును జేయుచుండె. మరియునపరిమితమగు కోపముగలవాడై యధికమగు తేజస్సుచేత బ్రకాశించుచుండె. అంతట ధనుర్ధారులలో నుత్తములగు నయ్యింద్రజిత్తును లక్ష్మణుడును ఒకరినొకరు బాణములచేత నపరిమితముగా గొట్టుకొనిరి. ఆసమయమునందు ఆయిరువురును వనములయందలి వృషభములవలె మిగులభయంకరముగా యుద్ధమును జేసిరి, మఱియు నాయిరువురును, రాక్షసులను, వానరులను, నపరిమితముగా జెదరించుచుండిరి. అప్పటికిని వానరరాక్షసులు పరుగెత్తిపోక నిలిచి యుండిరి. ఆసమయమునందు యింద్రజిత్తు తనవార

లగు రాక్షసులకందఱకును సంతోషమును జేయుచు, వారి వలన స్తోత్రము చేయబడినవాడగుచును యిట్లనియె. ఓరాక్షసోత్తములారా! మీరందఱును వానరులు మోహమును జెందునట్లు యుద్ధమును జేయుడు. ఇంతలోపల నేను లంకాపట్టణమునకుబోయి రథారూఢుడనై మిగులవేగముతో వచ్చెదను. ఇప్పుడు చీకటిచేత సకలదిక్కులును గప్పబడి యున్నవి. కాబట్టి తమవారినియును, పరులనియును నిర్ణయింప శక్యముగాకయున్నది కావున మీరు మిగులజాగరూకతతో యుద్ధమును జేయుడు. నేను బట్టణములోనికిబోయినపిమ్మట మహాత్ములగు వానరులు యుద్ధమును జేయరు కాబట్టి మీరు భయమునుబొందక ఇక్కడనే నిలిచియుండుడని చెప్పి రావణాసురునకు బుత్రుడగు నింద్రజిత్తు వానరులను మోసపుచ్చి రథముకొఱకుగా లంకాపట్టణమునకు బోయెను. పోయి బంగారముచేత నలంకరింపబడినదియును, మిగులమనోహరమైనదియును, ఖడ్గములు, ఈటెలు, మొదలుగాగల యాయుధములచేత పూర్ణమైనదియును, మిగుల శ్రేష్ఠములగు గుఱ్ఱములచేత బూన్పబడినదియును, అశ్వశాస్త్రమును జక్కగ జదివినవాడును, హితమును ఉపదేశించువాడును, నగు సూతుడుగలయును, నగు రథమునెక్కి యనేకవేల రాక్షసులతో గూడుకొనినవాడును, యమునిచేత బ్రేరణ చేయబడినవాడునునై లంకాపట్టణమునుండి యతిశీఘ్రముగ బయలువెడలివచ్చె

మఱియును శత్రువీరులను జయించునట్టి ఇంద్రజిత్తు మిగుల వేగముగల గుఱ్ఱముతో గూడుకొనిన రథమునెక్కి వచ్చి లక్ష్మణ విభీషణులకు గనబడియె. అట్లు రథారూఢుడైవచ్చిన ఇంద్రజిత్తునుజూచి యధికమగు పరాక్రమము గలవానరులును, రాక్షసులును, విభీషణుడును లక్ష్మణుడును అతనిలాఘవమునకు మిగుల ఆశ్చర్యమును బొందిరి. అప్పుడు ఆయింద్రజిత్తు మిగుల కోపముగలవాడై మిక్కిలి తీక్ష్ణములగు బాణములచేత అనేకవేల వానరవీరులను గొట్టి క్రిందబడవైచె. ఆసమయమునందయ్యింద్రజిత్తు మండలాకారముగా జేయబడిన ధనస్సుగలవాడై యుండె. మఱియు అప్పుడా రాక్షసోత్తముడు మిగుల లాఘవముగలవాడును, క్రోధోద్దీపితుడునునైయావానరులను అధికముగా మర్దించె. అవ్విధముగా నింద్రజిత్తుయొక్క బాణములచేతగొట్టబడుచున్న యావానరులందఱును నిలువజాలక లక్ష్మణుని యొద్దకుబోయి శరణుజొచ్చిరి. అంతట నాలక్ష్మణుడు అపరిమితమగుకోపముగలవాడై మిగుల లాఘవమును జూపుచు నయ్యింద్రజిత్తుయొక్క ధనస్సును దునుకలనుగా జేసె. అంతట నయ్యింద్రజిత్తు మరియొక ధనుస్సును గైకొనియె. అంతలోపల లక్ష్మణుడు మూడు బాణములను బ్రయోగించి దానినిగూడ ద్రుంచివైచె. అట్లు ధనుస్సును ద్రుంచివైచి సర్పమువలె బుసగొట్టుచున్న ఇంద్రజిత్తుయొక్క వక్షస్థలమునందు మిగుల తీక్ష్ణములగు నైదు బాణములను బ్రయోగించె. ఆబాణములయ్యింద్రజిత్తుయొక్క శరీరమును గూటుసేసికొనిపోయి మిగులపెద్దవియగు సర్పములవలె భూమియందు బ్రవేశించె. ఆసమయమునందింద్రజిత్తు బద్ధమైన కవచముగలవాడును, నోట నెత్తురును గ్రక్కుచున్నవాడును నై మిగుల దృఢమగు నారిగల వేఱొక్క ధనుస్సును గ్రహించె.

అంతట నయ్యింద్రజిత్తు లక్ష్మణునుద్దేశించి మిగుల హస్తలాఘవమును జూపించె. పిమ్మట ఇంద్రుడు వర్షమును గురిపించిన విధముగ బాణవర్షమును గురిపించె. అప్పుడు శత్రువులను జయించునట్టి సామర్థ్యముగల లక్ష్మణుడ కొంచెమైనను భయమును బొందనివాడగుచు నింద్రజిత్తుచేత గురిపింపబడుచున్న బాణవర్షమును నివారించె. అట్లు రఘుకులోద్భవుడగు లక్ష్మణుడు సేయుటనుజూచి ఇంద్రజిత్తు మిక్కిలి యాశ్చర్యమునుబొందె. అంతట నాలక్ష్మణుడు అపరిమితమగు కోపముగలవాడై ముగ్గురేసి రాక్షసులను నొక్కొక్క బాణముచేత గొట్టుచుండె. మఱియును మిగుల తీక్ష్ణములగు బాణములను నింద్రజిత్తుమీద బ్రయోగించె. అవ్విధముగ శత్రువులను సంహరింపజేయుచున్న వాడును, బలవంతుడును, శత్రుదును, నగు లక్ష్మణునిచేత గొట్టబడిన ఇంద్రజిత్తు లక్ష్మణునిమీద అనేకవేల బాణములను బ్రయోగించె. అప్పుడు రఘునందనుడగులక్ష్మణుడు ఇంద్రజిత్తు ప్రయోగించిన బాణములను దనయొద్దకు రాకమునుపే మిగుల తీక్ష్ణములగు బాణములచే ఛేదించె. అంతట నూరకుండక ధర్మాత్ముడగు నాలక్ష్మణుడు అతితీక్ష్ణములగు బాణములచేత, రథికులలో నుత్తముడగు ఇంద్రజిత్తుయొక్క సారథియొక్క శరీరమును దెగటార్చె. అప్పుడుసారథిలేక పోవుటచేత గుఱ్ఱములు రథమును విపరీతముగా ఈడ్చుచుండె. ఆసమయమున ఇంద్రజిత్తు తనరథమునకు దానే సారథియునునై మండలాకారముగ రథమును నడపించుచు అతిభయంకరమగు యుద్ధమును జేసె. అప్పుడు లక్ష్మణుడు మునుపటికంటె అధికమగు కోపముగలవాడై తీక్ష్ణములగు బాణములచేత ఇంద్రజిత్తుయొక్క గుఱ్ఱములను జావగొట్టె. అట్లుతన గుఱ్ఱములను గొట్టుటనుజూచి ఇంద్రజిత్తు మిగుల కోపముగలవాడై లక్ష్మణునిమీద బడిబాణములను బ్రయోగించె. అవ్విధముగ నింద్రజిత్తుచేత బ్రయోగింపబడినవియును, వజ్రాయుధముతో సమానములైనవియు

ను, సర్పములవంటివియును, నగు నాబాణములు బంగారముయొక్క కాంతివంటి కాంతిగల యాలక్ష్మణునియొక్క కవచమునందుదాకి విరిగి క్రిందబడియె. అప్పుడు రావణాసురునకు బుత్రుడగు నింద్రజిత్తు లక్ష్మణునియొక్క కవచమును భేదింప శక్యముగాదని తలచి అపరిమితమగ కోపముగలవాడగుచు లక్ష్మణునియొక్క ఫాలభాగమునందు మూడుబాణములను బ్రయోగించె. అవ్విధముగ నింద్రజిత్తుయొక్క బాణములచేత గొట్టబడినవాడును, అపరిమితమగు కోపముగలవాడును, రఘునందనుడును, నగు నాలక్ష్మణునియొక్క ఫాలభాగమునందు ఆబాణములు మిగుల విచిత్రముగ బ్రకాశించుచుండె. మఱియు నాసమయమునందు లక్ష్మణుడు త్రికూటాచలమువలె బ్రకాశించుచుండె. అవ్విధముగ నాయుద్ధమునందింద్రజిత్తుయొక్క బాణములచేత పీడింపబడిన యాలక్ష్మణుడు గోపోద్దీపితుడై నైదుబాణములను నాయింద్రజిత్తుయొక్క ముఖమునందు దగులుకొనునట్లు ప్రయోగించుటచేతనతడపరిమితమగువ్యసనమునుబొందె అంతట నధికమగుబలముగలవారును, మిగులగొప్పవగు ధనుస్సులుగలవారును, నగు లక్ష్మణుడును ఇంద్రజిత్తును మిగుల దీక్ష్ణములగు బాణములచేత బరస్పరమును గొట్టుకొనిరి. అంతట వీరులగు నాయిద్దరును నెత్తురుచేత వ్యాప్తమైన శరీరముగలవారైరి. ఆసమయమునందు ఆయిద్దఱును పుష్పించిన మోదుగచెట్లవలె బ్రకాశించుచుండిరి. అంతన య్యిరువురును పరస్పర జయమును గోరుచున్నవారై యధికములగు బాణములను బ్రయోగించుకొనిరి. మఱియును మిగులభయంకరముగు బాణములచేత శరీరములను బ్రద్దలుచేసికొనిరి.

ఆసమయమునందు రావణాసురునకు బుత్రుడైన ఇంద్రజిత్తుమిగుల గోపముగలవాడై మూడుబాణములచేత విభీషణునిముఖమునందుగొట్టె. అవ్విధముగ నినుపములుకులుగల మూడుబాణములచేత రాక్షసోత్తముడగు విభీషణునిగొట్టి పిమ్మట నొక్కొక్క బాణముచేత సకల వానర వీరులనుగొట్టె. అప్పుడు విభీషణుడు అపరిమితమగు కోపముగలవాడై గదయను నాయుధముచేత దురాత్ముడగు నింద్రజిత్తుయొక్క గుఱ్ఱములనుజంపె. అట్లు విభీషణునిచేత గుఱ్ఱములు చంపబడిన పిమ్మట నయ్యింద్రజిత్తు విరథుడయ్యె అంతట నాయింద్రజిత్తు రథమునుండిదిగి తనయొక్క శరశక్తిని పిన్నతండ్రియగు విభీషణునిమీద బ్రయోగించె. అంతట నాశక్తి మిగుల వేగముతో విభీషణునిమీదికి వచ్చుచుండె. అట్లు మిగుల భయంకరాకారముతో వచ్చుచున్న యాశక్తినిజూచి సుమిత్రాదేవికి బుత్రుడగు లక్ష్మణుడు అపరిమితమగుగోపముగలవాడై మిగుల తీక్ష్ణములగు బాణములచేత దానిని పదివిధములుగా ఛేదించె. అంతట నాశక్తి పతితునకువలె క్రిందబడియె. అప్పుడు విభీషణుడు మిగుల దృఢమగు ధనుస్సుగలవాడును, అపరిమితమగు కోపముగలవాడును, నగుచు వజ్రాయుధముతో సమానములగు నైదుబాణములను నింద్రజిత్తుయొక్క ఱొమ్ముమీద బ్రయోగించె. అట్లు విభీషణునిచేత బ్రయోగింపబడనవియును, బంగారపు పిల్లలుగలవియును, వజ్రాయుధముతో సమానములైనవియును, నగు బాణములింద్రజిత్తుయొక్క ఱొమ్మును దూటుపొడుచుకొని బయలునకు వెడలిపోయె. ఆసమయమునందా బాణములు నెత్తురుచేతవ్యాప్తములైనవై మిగుల భయంకరములగు సర్పములను బోలియుండె.

అంతట నయ్యింద్రజిత్తు మిగుల గోపముగలవాడై యమునిచేత నివ్వబడిన యొక మహాస్త్రమును రాక్షసులలో నుత్తముడగు విభీషణునిమీద బ్రయోగించె. అట్లు విభీషణునిమీద బ్రయోగింపబడిన యా యస్త్రమును జూచి భయంకరమగు పరాక్రమముగల లక్ష్మణుడు కుబేరునిచేత స్వప్నమునందివ్వబడినదియును, ఇతరులచేత జయింపనలవిగానిదియును, దేవదానవులచేతగూడ సహింపశక్యముగాని పరాక్రమముగలదియును, నగు బాణమును బ్రయోగించె. ఆసమయమునందా యిరువురియొక్క పరిఘలతో సమానములైన భుజములయందలి ధనుస్సులు లాగబడినవగుచుండుటచేత బక్షులవలె గూయుచుండె. అట్లు వారిరువురుచేత, చెవులవఱకును లాగి విడువబడినవియును, మిగుల శ్రేష్ఠములైనవియును, నగు బాణములు మిగుల భయంకరముగా బ్రకాశించుచుండె. మఱియు నాబాణములు ఆకాశమును సర్వమును బ్రకాశింప జేయుచుండె. మఱియు నాబాణములురెండును నొకదానితో నొకటికొట్టుకొనియె. అందువలన నాబాణములవలన విస్ఫులింగములు మిగుల భయంకరములైయుండె. అంత గొంతసేపా రెండుబాణములు మిక్కిలి భయంకరమగు కోపముగలవై యుద్ధమునుజేసి యొకదానితో నొకటికొట్టుకొని క్రిందబడినవయ్యె.

అవ్విధముగా నారెండును వ్యర్థములగుటనుజూచి యాలక్ష్మణుడును నింద్రజిత్తును మిగుల సిగ్గునుబొందిరి. అంతట లక్ష్మణుడు మిగుల సంరంభముగలవాడై వారుణాస్త్రమును నింద్రజిత్తుమీద బ్రయోగించె. ఆవారుణాస్త్రమును రౌద్రాస్త్రముచేత నింద్రజిత్తు నశింపజేసె. పిమ్మట మిగులనధికమగు తేజస్సుగలవాడును, యుద్ధమునందు జయించు

నట్టి సామర్థ్యముగలవాడును, నగునింద్రజిత్తు మిగులభయంకరమైనదియును, లోకములనుగంపింప జేయుచున్నదియును, నగునాగ్నేయాస్త్రమునునివారించె. అప్పుడువీరుడగు లక్ష్మణుడు సౌరాస్త్రముచేత నాయస్త్రమునునివారించె. అట్లుతనయస్త్రము నివారింపబడుటనుజూచి యింద్రజిత్తుమిగుల గోపముగలవాడై శత్రువగులక్ష్మణునియొక్క నాశముకొఱకు మిక్కిలిభయంకరమగు నాసురాస్త్రమును బ్రయోగించె. ఆయస్త్రమువలన ప్రకాశించుచున్న కూటములు, ముద్గరములు శూలములు, ముసలములు, గదలు, ఖడ్గములు, గండ్రగొడ్డండ్లు, మొదలగునాయుధములు అపరిమితముగా నుత్పన్నములయ్యె.

అవ్విధముగ నింద్రజిత్తుచేత బ్రయోగింప బడినదియును, సకలశత్రువులను నశింపజేయుటయందు దగినసామర్థ్యముగలదియును, నివారింప శక్యముగానిదియును, నాయసురాస్త్రమును, మాహేశ్వరాస్త్రముచేతనివారించె. అంతట నారెండస్త్రములకును మిగులభయంకరమగు యుద్ధముజరిగె. ఆయుద్ధమునుజూచి యాకాశమునందలి భూతములన్నియును మిగులభయమునుబొందె. మరియునాసమయమునందు వానరులకును, రాక్షసులకును, మిగులభయంకమగు యుద్ధముజరిగె. అప్పటియుద్ధమునందు మిక్కిలిభయంకరములగు ధ్వనులుగలిగె. ఆసమయమునందు నానావిధములగు భూతములచేత నత్యాశ్చర్యకరముగా నాకాశమంతయును నావరింపబడినదయ్యె. మరియునాసమయమునందు, పితృదేవతలు, దేవతలు, గంధర్వులు, గరుడులు, ఉరగులు, మొదలగు వారందఱును, దేవేంద్రునిముందర బెట్టుకొని లక్ష్మణునిగాపాడిరి. అంతట రఘుకులోద్భవుడగు రామునితమ్ముడగు లక్ష్మణుడు మరియొక్క బాణశ్రేష్ఠమును, సంధానముచేసె.

ఆబాణ మగ్నిసూత్రముతో సమానమైనదియును, ఇంద్రజిత్తును జంపుటయందుదగిన సామర్థ్యముగలదియునునై యుండె. మరియు మిక్కిలిశ్రేష్ఠములగు ఱెక్కలుగలదియును, సుంద్రనియవయవములు గలదియును, బంగారముచేత నలంకరింప బడినదియును, దేహనాశమును జేయుటయందు మిక్కిలిసామర్థ్యము గలదియును, నివారింప శక్యముగానిదియును, రాక్షసులకును, దేవతలకును, భయమును గలుగజేయునదియును, సర్పమువలెమిగుల భయంకరమైనదియును, దేవతలయొక్క సముదాయముచేత బూజింపబడినదియును, నైయుండె. మరియును, పూర్వము ఆయస్త్రముచేత రాక్షసులనుజయించె. మరియు నాయస్త్రముచేతనే దేవేంద్రుడుజయమునుగైకొనియె. అట్లుదేవేంద్రునిచేతగూడ బ్రయోగింప బడినదియును, ఐంద్రాస్త్రమను పేరుగలదియును, నగునాయస్త్రమును మానవోత్తముడగు లక్ష్మణుడు శ్రేష్ఠమగు ధనుస్సునందు సంధానముచేసె. మరియునాసమయమునందు లక్ష్మణుడుప్రళయకాలమునందలి యమునివలెశత్రువుల శరీరమునుబ్రద్దలు సేయునట్టిదియగు బాణము శ్రేష్ఠమగు నారిగలధనుస్సునందు సంధానముసేసె. మరియు నాబాణముయితరులుచేత జయింపనలవిగానిదైయుండె. అట్టిబాణమును మిగులశ్రేష్ఠమగు ధనుస్సునందు సంధానముసేసి లక్ష్మీవంతుడగు లక్ష్మణుడు తనయొక్క కార్యమును నెరవేర్చికొనుటకు దగినవాక్యమును చెప్పదలచి యిట్లనియె.

ఓబాణమా! దశరథరాజనందనుడగు రాముడు వాస్తవముగ ధర్మాత్ముడును, సత్యసంధుడును, పౌరుషమునందు నిరుపమానుడును నయ్యేనేని నీవుపోయిరావణుని పుత్రుడగు నింద్రజిత్తునుజంపుమనియె. ఇవ్విధముగా జెప్పి ధనుస్సును చెవివఱకును లాగిమిగుల గఠినమైనదియును, శత్రువులను జంపునట్టిదియును, నగునాబాణమును నింద్రజిత్తును జంపుటకొఱకుగా వీరుడగులక్ష్మణుడు ప్రయోగించె. అంతటనామైంద్రాస్త్రము ప్రజ్వలించుచున్నకుండలములు గలదియును, శిరస్త్రాణముతో గూడుకొనినదియును, నగునింద్రజిత్తుయొక్క శిరస్సునుద్రుంచి క్రిందబడవైచె అట్లుక్రిందబడినదియును, మిగులపెద్దదియునునగు నాయింద్రజిత్తుయొక్కశిరస్సు, అగ్నితోసమానముగ బ్రకాశించుచుండె. అతటకవచము గలవాడును, తెగగొట్టబడిన శిరస్త్రాణము గలవాడును, నగురావణాసురునకు బుత్రుడగు నింద్రజిత్తుయొక్క శరీరముక్రిందబడియె. అప్పుడువిభీషణునితోగూడ వానరులందఱును నింద్రజిత్తుమరణమును బొందుటవలన గలిగినసంతోషముచేత నపరిమితముగా గూతలిడిరి. ఆసమయమునందు నాకాశమునందు దేవతలయొక్కయు, మహానుభావులగు ఋషులయొక్కయు, గంధర్వులయొక్కయు, అప్సరస్త్రీలయొక్కయు, సంతోషసూచకములగు ధ్వనులువినబడియె. మరియునవ్విధముగ నింద్రజిత్తుచచ్చినపిమ్మట వానరులచేత నపరిమితముగాగొట్టబడుచున్నదియును, దిక్కులేనిదియును, నగునారాక్షససైన్యమంతయును నిలువజాలక నానాదిక్కులకును బరుగెత్తె. మరియునారాక్షసు లందఱును వానరులయొక్క దెబ్బలకు దాళజాలకశస్త్రములను విడిచిపెట్టి లంకాపట్టణమున కభిముఖులైపరుగెత్తిరి. మరికొందఱు రాక్షసులుక్రిందబడి మూర్ఛనొందిరి. మరికొందఱు రాక్షసులు భీతచిత్తులై నానాదిక్కులకు బరుగెత్తిరి. మరియునాసమయమునందు,

రాక్షసులందఱును, ఖడ్గములు, కత్తులు, గండ్రగొడ్డండ్లు, మొదలుగాగల యాయుధముల నన్నిటినివదలిరి. అట్టి రాక్షసులలోగొందఱు మిగులభయమును బొందినవారును, వానరులచేత బీడింపబడినవారునునగుచు లంకాపట్టణమునకుబోయిరి, కొందఱు సముద్రమునంబడిరి. కొందఱుపర్వతముల మీదికిపరుగెత్తిరి. ఆయింద్రజిత్తుమరణమును బొందినపిమ్మట నక్కడనొక్క-రాక్షసుడును నిలువలేకపోయె నదికారణముగ నచ్చోటురాక్షస శూన్యమైనదైయుండె. మరియు నప్పుడారాక్షసులందఱును, సూర్యుడస్తమించినపిమ్మట సూర్యకిరణములన్నియును బోయినవిధముగా నాయింద్రజిత్తును విడిచిపెట్టిపోయిరి.

అవ్విధముగ నింద్రజిత్తుజచ్చినపిమ్మట రాక్షసులందఱును నానాదిక్కు-లకు బరుగిడిపోయిరి. ఆసమయమునందా యింద్రజిత్తు శాంతిమైన కిరణములుగల సూర్యునివలెను, దల్లాఱిన యగ్నివలెనునుండె. అవ్విధముగనింద్రజిత్తు మరణమునుబొంది క్రిందబడినపిమ్మట లోకమునకుగల బాధలన్నియునుదొలంగె. అనర్థములన్నియునశించె. మరియును లోకమంతయును మిగులసంతోషమునుబొందె. భగవంతుడగునింద్రుడుసకలదేవతలతోగూడ బరమానందమునుబొందె. మరియును పాపాత్ముడగున య్యింద్రజిత్తుచచ్చుటవలనగలిగిన సంతోషముచేత నాకాశమునందు దేవతలందఱును దుందుభులను వాద్యములను బ్రయోగించిరి. మరియునాసమయమునం దప్సరస్త్రీలు నృత్యమును జేసిరి. మహాత్ములగు గంధర్వులుపాడిరి.

మఱియు వారిందఱును బరమసంతోషముతో బుష్పవర్షమును గురిపించిరి. క్రూరుడగున య్యింద్రజిత్తుమరణమును బొందినపిమ్మట బహువిధముల బ్రశంసించిరి. ఉదకములును, దిక్కు-లును, పరిశుద్ధములయ్యె. దైత్యులును దానవులును, సంతోషమునుబొందిరి. బ్రాహ్మణులందఱును భయరహితులును, నిర్మలమనస్కు-లునునై సంచరింతురుగాక యని దేవదానవగంధర్వులు ఆశీర్వాదధ్వనులనునల్పిరి. అంతటవానరులందఱును పరమానందమును బొందిరి. మఱియు నిరుపమానమగు బలపరాక్రమములు గలవాడును, వృత్తిపొంది క్రిందబడియున్నవాడునునగు నాయింద్రజిత్తును జూచి విభీషణుడు, జాంబవంతుడు, హనుమంతుడు, మొదలగువారందఱును జయముగలుగుటచేత మిగులసంతోషమును బొందినవారగుచు నాలక్ష్మణుని అనేకవిధములస్తోత్రమును జేసిరి. మఱియునావానరులందఱును నధికముగా నానావిధములగు కూతలనుబెట్టిరి. మరియునావానరులందఱును బరమసంతోషముతో లక్ష్మణునినసేక విధములస్తోత్రమును జేయుచు నాలక్ష్మణునిజుట్టుకొని కూర్చుండిరి. మరియునప్పుడు కొందఱువానరులు సంతోషముచేత, తోకలనునానావిశేషముల నాడించిరి. మఱికొందఱువానరులు సంతోషముచేత తోకలనుగిఱ్ఱుదిప్పికొట్టిరి. మఱియు లక్ష్మణుడుజయించెనని యపరిమితముగా కూతలనుబెట్టిరి. మరియు నావానరులందఱును, సంతోషముచేత నొకరినొకరు కౌగలించుకొనిరి. ఇంతియగాక రామలక్ష్మణులచరిత్రముల ననేకవిధములుగా గానముసేసిరి. మఱియునాసమయమునందు దేవతలందఱును నింద్రజిత్తు చచ్చినవృత్తాంతమునువిని యెల్లలోకములవారికిని దుష్కరమగు కర్మను జేసినందుకుగాను, పరమానందమును బొంది లక్ష్మణునినసేకవిధముల బ్రశంసించిరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి తొంబదొక్క-టవసర్గముగిసెను.

ఇంద్రజిత్తును సంహరించిన లక్ష్మణుని రాముడు గౌరవించుట.

అట్టిగొప్పదగు యుద్ధమునందు శత్రువుచేత వ్యాప్తమైన శరీరముగలవాడును, శుభకరములగు లక్షణములుగలవాడును, నగులక్ష్మణుడింద్రజిత్తును జంపిపరమానందముగలవాడయ్యె. అంతటవీర్యవంతుడగు లక్ష్మణుడు జాంబవంతుడు, హనుమంతుడు, మొదలుగాగల వానరయోధులతో గూడుకొనినవాడై రామసుగ్రీవులున్న చోటునకుబోయె. అచ్చోటునకు బోవునప్పుడు లక్ష్మణుడు విభీషణహనుమంతులను బట్టికొనియె.

అంతట నాలక్ష్మణుడు రాముని సమీపమునకుబోయి నమస్కారమును జేసి యన్నయగు రాముని యొక్క- సమీపమునందు దేవేంద్రునియొక్క- సమీపమునందు బృహస్పతికూర్చున్న విధముగగూర్చుండె. అంతటవీరుడగు నాలక్ష్మణుడు మహాత్ముడగు రామునికి యింద్రజిత్తుయొక్క-మరణ వృత్తాంతముఁజెప్పె. మఱియు నాసమయమునందు విభీషణుడుమిగుల సంతోషముగలవాడగుచు మహాత్ముడగు లక్ష్మణునిచేత నింద్రజిత్తుచంపబడెనని యావృత్తాంతమును సర్వమును దెలియజేసె. ఆవృత్తాంతమును సర్వమునువిని మహావీర్యుడగు రాముడుమిగుల సంతోషముగలవాడై యిట్లనియె.

లక్ష్మణా! లక్ష్మణుడా! నీవుచేసినకర్మచేతమిక్కిలిగా సంతోషమునుబొందితిని. నీచేతమిగులగొప్పదగు కర్మము చేయబడినది. ఇంద్రజిత్తుమరణమునుబొందుటచేత మనకుజయముగలుగునని నిశ్చయింపుమనిచెప్పి యాలక్ష్మణుని

యొక్క శిరస్సును ముద్దును బెట్టుకొని లక్ష్మీవర్ధనుడగు లక్ష్మణు స్నేహాతిశయముచేత దనతొడమీద గూర్చుండబెట్టుకొనియె. అట్లు తొడమీదగూర్చుండబెట్టుకొని తమ్ముడగులక్ష్మణుని ప్రేమచేత ననేకపర్యాయములు జూచె. మఱియు నా సమయమునందు బాణములచేత బీడింపబడిన శరీరముగలవాడును, నిట్టూర్పులనువిడుచుచున్నవాడును, మిగుల స్నేహితుడును, నగులక్ష్మణునిజూచి యపరిమితమగు వ్యసనముగలవాడయ్యె. మఱియు నారాముడధికమగువ్యసనముచేత బెద్దవగు ట్టూర్పులను విడుచుచుండె. అట్లునిట్టూర్పులనువిడుచుచు నాలక్ష్మణునియొక్క శిరస్సును మరలముద్దును బెట్టుకొని పురుషోత్తముడగురాముడు లక్ష్మణునితో నిట్లనియె.

తమ్ముడా! మిగులదుష్కరమైనదియును, అనేకముల గుమంగళములనుగలుగజేయునదియును, నగు కర్మను జేసితివి. ఇవ్విధముగనింద్రజిత్తునుజంపుటచేత నిక రావణాసురుడు యుద్ధమునందు జంపబడెనని యేనిశ్చయింతుము. మఱియునో లక్ష్మణుడా! మనకుశత్రువుడును, దురాత్ముడును, నగు నింద్రజిత్తుమరణమునుబొందుటచేత నిప్పుడు నేనుజయముగలవాడనైతిని. మఱియును వీరుడవైనయో లక్ష్మణుడా! నీనిప్పుడుయుద్ధమునందు మిగులఘాతకుడగు రావణాసురునియొక్క దక్షిణభుజము ఖండింపబడినది. యుద్ధమునందుహనుమంతునియొక్కయు, విభీషణునియొక్కయు సహాయముచేత మిగులభయంకరమును, ఆశ్చర్యకరమునునగుకర్మమును జేసితివి. మూడుదినములు రాత్రింబగళ్లుమిగులఘోరమగు యుద్ధమును జేసి తుదకావీరవరునిజంపితివి. అందువలన నేనిప్పుడుశత్రువులులేనివాడనైతిని. మఱియు నోలక్ష్మణుడా! మిగులగొప్పదగు బలవ్యూహముచేత తన పుత్రుడగు నింద్రజిత్తుమరణమునుబొందిన వృత్తాంతమునువిని రావణాసురుడు మిగులవ్యసనమునుబొందును. అట్లు మిక్కిలివ్యసనముగలవాడును, యుద్ధమునకుబయలువెడలినవాడును, రాక్షసాధిపతియును, నగురావణాసురుని మిగులగొప్పదగుబలముతో గూడుకొనినవాడనై జయింపగలను. మఱియు నోలక్ష్మణుడా! నీవిప్పుడుయుద్ధమునందు, ఇంద్రజిత్తునుసంహరించిసీతాదేవిని, భూమిని, నాకువొసంగితివి. కావుననీవుమిగుల నుపకారమును జేసితివని తమ్ముడగులక్ష్మణునిబ్రశంసించె. అంతటరాముడు మిగుల సంతోషముగలవాడగుచు సుషేణుడనువానరోత్తముని సమీపమునకుబిలిచియిట్లనియె.

వానరోత్తమా! పండితులలోనుత్తముడా! సుషేణుడా! మిత్రులయందుమిగులదయగలవాడును, సుమిత్రాదేవికిబుత్రుడును, నగు లక్ష్మణుడు శరీరమునందు దగులుకొన్నబాణములచేత మిగులబాధనుబొందుచున్నాడు. కావుననితడుమునుపటివలె స్వస్థచిత్తుడగునట్లు సేయుము. మఱియు నీవిభీషణుడును బాణములుశరీరమునందుదగులుకొనుటచేత మిగులబాధనుబొందుచున్నాడు. కావుననితనినిగూడస్వస్థచిత్తునిగాజేయుము. మఱియు నోవానరోత్తమా! సుషేణుడా! ఆయుద్ధమునందలి బాణములచేత బీడింపబడుచున్న వానరయోధులందఱును స్వస్థచిత్తులైయుండునట్లుచేయుము. మరియు మిగిలినవానరులనుగూడ స్వస్థచిత్తులనుజేయుమనియె. ఇవ్విధముగా రాముడుచెప్పినవచనములనువినిమహాత్ముడును, వానరాధిపతియును, నగు సుషేణుడులక్ష్మణునికొఱకు మిగులశ్రేష్ఠమగు నౌషధమునిచ్చె. ఆయౌషధముయొక్కగంధమునునాఘ్రాణించినతోడనేలక్ష్మణుడు స్వస్థచిత్తుడయ్యె. శరీరమునందలిబాణములన్నియునువిడిపోయె. మరియు వ్రణములన్నియునుశాంతి నొందె. ఇవ్విధముగావిభీషణాదులుగూడ స్వస్థచిత్తులును, వ్రణరహితులునునైరి. అవ్విధముగాసుషేణుడుచేసిన చికిత్సవలన లక్ష్మణుడుమొదలగువారందఱును బాధనుండి తొలగినవారై మునుపటివలెసుఖముగలవారైరి. ఆసమయమునందురాముడు, వానరాధిపతియగుసుగ్రీవుడు, విభీషణుడు, భల్లూకాధిపతియగు జాంబవంతుడుమొదలగువారందఱునులక్ష్మణుడువ్రణరహితుడగుటనుజూచి యధికమగుసంతోషమునుబొందిరి. మరియు నాసమయమునందు దశరథమహారాజునకుబుత్రుడును, మహానుభావుడును, నగురాముడు, లక్ష్మణుడుసేసినయుద్ధమును అనేకవిధములబ్రశంసించె. ఆవృత్తాంతమునువిని వానరులందఱునుఅపరిమితానందమునుబొంది యధికముగాగూతలిడిరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి తొంబదిరెండవసర్గ ముగిసెను.

రావణాసురుడు యింద్రజిత్తుయొక్కమరణమునువినిదుఃఖించుట.

అంతనక్కడరావణాసురునిమంత్రులందఱును ఇంద్రజిత్తుయొక్కమరణమునువిని యావృత్తాంతమును సర్వమును మిగులవ్యసనముతో రావణాసురునకుదెలియజేసి మఱియునిట్లనిరి.

రాక్షసరాజోత్తమా! రావణాసురుడా! నీపుత్రుడగు నింద్రజిత్తునులక్ష్మణుడు విభీషణునియొక్కసహాయముతో మేమందఱమునుజూచుచుండగజంపె. అట్లుశూరుడగునీకుమారుడుశూరుడగులక్ష్మణునితో చిరకాలము యుద్ధమును

జేసి మరణమునుబొందెను. ఆయింద్రజిత్తుమరణమునుబొందుటకు బూర్వమునిగులదీవ్రములగుబాణములచేత లక్ష్మణునిగొట్టి యనేకవిధములబాధించెను. మరియును అనేకులగువానరులను నానావిధములబాధించెనని జరిగినవృత్తాంతమునుసర్వమును జెప్పిరి. అట్లు మంత్రులుచెప్పినమాటలను విని యింద్రజిత్తుమరణమునుబొందుటను దెలిసికొని యధికమగుదుఃఖమునుబొందెను. అంత నాదుఃఖమును భరింపజాలకమూర్ఛనొందెను. పిమ్మటగొంతసేపటికి రాక్షసపుంగవుడగురావణాసురుడు మూర్ఛనుండి తేరెను. అంతటనారావణుడుపుత్రమరణశోకముచేత బీడింపబడినవాడును, దీనుడును, వ్యాకులమైన యింద్రియములుగలవాడునునగుచు వ్యసనమునుబొందెను. మరియు నాసమయమునందిట్లనియె. అక్కటా! రాక్షసులసైన్యమునకధిపతివియును, మహారథుడవును, నగునోబిడ్డా! ఇంద్రజిత్తా! ఇంద్రునిజయించిన నీవిప్పుడు లక్ష్మణునియొక్కవశమునుబొందితివి.

మరియునోపుత్రుడా! ఇంద్రజిత్తా! నీవుబాణములతో కాలాంతకులనుగూడ జంపగలవు. మరియునోపుత్రుడా! నీవుమందరపర్వతముయొక్క శిఖరములనుగూడ నాశముసేయగలవు. అట్టినీవులక్ష్మణునిజంపకపోవుటనుగుఱించిమిగులనాశ్చర్యముగనున్నది. ఆహా యముడిప్పుడిప్పుడు నాకు మిగులమంచివాడయ్యెను. కావుననే యిప్పుడుయముడు కాలధర్మముతోగూడుకొనినవాడై నిన్నుజంపించెను. మఱియునోపుత్రుడా! ఇంద్రజిత్తా! లోకములోని యోధులకు యుద్ధమునందుమరణమునుబొందుట దేవతలలోగూడ గొనియాడదగినది. మఱియునోపుత్రుడా! యజమానునినిమిత్తముగ మరణమునుబొందుభృత్యుడు స్వర్గలోకమును బొందగలడు. కావుననోపుత్రుడా! నీవిప్పుడవశ్యముగాస్వర్గలోకమునుబొందగలవు. మఱియునోపుత్రుడా! ఇప్పుడు, ఇంద్రజిత్తుఅనిప్రసిద్ధినొందిన నీమరణవృత్తాంతమును విని సకలదేవతలును, లోకపాలురును, ఋషులును, నిర్భయులును, పరమసంతోషముగలవారును నగుదురు. మఱియునోపుత్రుడా! ఇంద్రజిత్తా! ఇప్పుడుముల్లోకములునుసముద్రపర్వతనదీనదారణ్యములతోగూడ నొక్కయింద్రజిత్తులేకపోవుటవలన శూన్యములైనట్లు తోచుచున్నవి. మఱియునోపుత్రోత్తమా! ఇప్పుడు నాగృహమునందు రాక్షసస్త్రీలయొక్క రోదనధ్వనులనువినగలను. ఆరోదనధ్వనులుపర్వతగుహాయందలి ఆడఏనుగులధ్వనులనుబోలియుండును. పుత్రోత్తమా! ఇంద్రజిత్తా! నీవిప్పుడుయావద్రాజ్యమును, లంకాపట్టణమును, రాక్షసులను, నీతల్లియగుమండోదరిని, తండ్రినగునన్నునువదలి యెక్కడకుబోతివి. మఱియునోపుత్రుడా! నేనుయమలోకమునకు బోయినపిమ్మటనన్నుద్దేశించి నీవుపితృకార్యములను జేయదగినవాడవు. దైవయోగముతప్పిపోవుటచేత నీయొక్కప్రేతకార్యములనునేను జేయవలసివచ్చెనే? ఎట్లుచేయుదును. పుత్రుడా! ఇంద్రజిత్తా! రామలక్ష్మణసుగ్రీవులు బ్రతికియుండగా నేనీవెక్కడకుబోతివి. నామనస్సునందలివిరోధశల్యమునువదలిపెట్టినీకుపరలోకమునకు బోదగునాయనియె. ఇవ్విధముగనధికమగు విలాపవచనములచేత బీడింపబడినవాడును, రాక్షసాధిపతియును, నగురావణాసురునకు బుత్రునియొక్కమరణమువలన గలిగినదుఃఖము అపరిమితముగాగలిగె. మఱియు స్వభావముచేతనే క్రోధస్వభావముగల యారావణాసురుడు పుత్రమరణమువలన అపరిమితమగు కోపముగలవాడయ్యె. ఆసమయమునందు పుత్రమరణమువలన గలిగినమనోవ్యథలు, గ్రీష్మకాలమునందలి కిరణములు సూర్యునివృద్ధిఁబొందించినవిధముగా రావణాసురుని వృద్ధినిబొందించె. మఱియు నప్పుడుకోపముయొక్కతీవ్రత లలాటమునందు బొమముడులచేత గనబడుచుండె. అప్పటిబొమముడులచేత రావణాసురునియొక్క మోము పెద్దవగుతరంగములచేత సముద్రముప్రకాశించుచున్న విధముగ బ్రకాశించుచుండె. ఆసమయమునందుకోపముచేత నధికముగా వృద్ధినిబొందుచున్న యారావణాసురునియొక్క ముఖమునుండి వృత్రాసురునియొక్కనోటనుండి బయలువెడలినవిధముగ ధూమముతోగూడ నగ్నిహోత్రుడుప్రజ్వలించుచు గ్రిందబడియె. ఆసమయమునందు శూరుడగు రావణాసురుడుపుత్రమరణమువలన గలిగినదుఃఖము చేత, అత్యధికముగాదపింపజేయబడినవాడై పిమ్మటకోపవశమునుబొందె.

అంతట నారావణాసురుడు నాలుగుదిక్కులనుబరికించిచూచి సీతాదేవినిజంపుదమనితలచె. అప్పుడుసహజముగానే యెఱ్ఱనివగు నారావణాసురునియొక్క నేత్రములు కోపాగ్నిచేతనధికమగు నెఱుపుగలవియును, మిగులభయంకరమగు ప్రకాశముగలవియునునయ్యె. మఱియు నాసమయమునందు కోపాగ్నిచేత వ్యాప్తమైనదియును, స్వభావముచేతనే భయంకరమైనదియును, నగు రావణాసురునియొక్క రూపము ప్రళయకాలమునందలి రుద్రునియొక్కరూపమునుబోలియుండె.

అవ్విధముగ క్రోధోద్దీపితుడైన యారావణాసురునియొక్క నేత్రములనుండి కన్నీటిబిందువులు, ప్రజ్వలించుచున్నదీపములనుండి తైలబిందువులు స్రవించినవిధముగస్రవించె. మఱియు నాసమయమునందు, రాక్షసులచేత

ద్రిప్పబడుచున్న ఘట్టయంత్రముయొక్క ధ్వనివంటి ధ్వని కోపముచేత నారావణాసురుని యొక్క దంతముల వలన గలిగె. అవ్విధముగ నారావణాసురుడు చేసిన దంతధ్వనులనువిని యెల్లవారును, మిగులనాశ్చర్యమును బొందిరి. ఆ సమయమునందు రావణాసురుడు కోపాగ్నిచేత, కాలాగ్నివలె మండిపడుచు నేయేదిక్కును జూచెనో యాయాదిక్కులయందున్న రాక్షసులందఱును నధికముగాభయమును బొందిరి. మఱియు నాసమయమునందు రావణాసురుడు చరాచరాత్మకమగు ప్రపంచమును సర్వమునుదిగ్రమింగదలచిన యమునిబోలియుండె. అంతట నారాక్షసులందఱును నానాదిక్కులకు బరుగెత్తిరి. అంతట రాక్షసాధిపతియగు రావణాసురుడు రాక్షసులలోపల నొక్కడును నిలువజాలక యుండె. అప్పుడారావణాసురుడు యిట్లనియె. నేను బూర్వము వేయిసంవత్సరములు బ్రహ్మదేవుని నుద్దేశించి మిగులభయంకరమగు తపస్సును జేసితి. ఆతపస్సునందు బ్రాహ్మణులనేకపర్యాయములు సంతోషమునుబొందించితి. అంతట నాబ్రహ్మదేవుడు నాతపస్సునకు సంతోషమును బొందినవాడగుచు దేవదానవులలో నెవ్వరి వలనను భయము గలుగకుండునట్లు వరమును యిచ్చె. మఱియు నాబ్రహ్మదేవునివలన మిగుల శ్రేష్ఠమైనదియును, అభేద్యమైనదియునునగు కవచమును బడసితిని. కావున నాకవచము దేవాసుర యుద్ధమునందు వజ్రముయొక్క శక్తుల చేతగూడ భేదింపనలవిగాకపోయె. అట్టిదివ్యాయుధములు గల నేనురథస్థుడనైన పిదప యుద్ధమునందునిలిచి నాతో నెవ్వడు యుద్ధమును జేయగలడు. ఎవ్వడును యుద్ధమును జేయజాలడు. ఇంద్రుడుగూడ నన్ను జయింపజాలడు. మఱియు నోరాక్షసోత్తములారా! దేవాసురులతో యుద్ధమును జేయుసమయమునందు నేనుజయించుటకు దగిన శరశరాసనములు బ్రహ్మదేవునిచేత నివ్వబడినవి. కావుననేనవశ్యముగా జయమును బొందగలను. కాబట్టి యోరాక్షసోత్తములారా! ఇప్పుడు రామలక్ష్మణులను జంపుటకు దగిన నాధనుస్సును యెత్తింపుడనియె. పిమ్మట పుత్రవధచేత మిగుల బరితాపముగలవాడును, అపరిమితమగు కోపముగలవాడును, నగు రావణాసురుడు కొంతసేపు ఆలోచించి తుదకు సీతాదేవిని ముందుగ జంపుదమని నిశ్చయించె. అంతట నెఱ్ఱనినేత్రములు గలవాడును, చూచుటకు మిగుల భయంకరమైనవాడును, దీనుడునునగు రావణాసురుడు దీనధ్వనులుగలిగియున్న రాక్షసులనుజూచియిట్లనియె.

రాక్షసోత్తములారా! వానరులను వంచించుట కొఱకు నాపుత్రుడగు నింద్రజిత్తు తనమాయచేత కల్పింపబడిన సీతనుజంపె. అందువలన వానియభిలాషతీరదయ్యె. కాబట్టియోరాక్షసోత్తములారా! ఇప్పుడు నేను యథార్థమైన సీతనేచంపి నాకుసంతోషమును గలిగించుకొనియెదను. నావచనములను నమ్ముడు. క్షత్రియులకందఱకును పరమాప్తుడగు రామునిభార్యయును, పతివ్రతయునునగు సీతను జంపి రామునకు నిజముగ దుఃఖమును గలిగింతుననియె. ఇవ్విధముగా జెప్పి ఖడ్గమునుదీసికొనిరండని మంత్రులతో జెప్పె. అంతట మంత్రులచేత దేబడినదియును, అనేకములగు గుణములుగలదియును, స్వచ్ఛమగు నాకాశముయొక్క యాకారమువంటి యాకారముగలదియును, నగు ఖడ్గమునుచేబూని మంత్రులతోగూడ రామునిభార్యయగు సీతయున్న చోటునకుబోయె.

ఆసమయమునందు రావణాసురుడు పుత్రమరణ శోకముచేత నపరిమితమగు దుఃఖముగలవాడైయుండె. అవ్విధముగనపరిమితమగు కోపముతో బోవుచున్న రావణాసురునిజూచి రాక్షసులందఱును సంతోషముచేత సింహనాదములను జేసిరి. మఱియు నారాక్షసులందఱును మహాసంతోషముచేత నొకరికొకరు కౌగిలించుకొని యనేకవిధములనృత్యమును సల్పిరి. మఱియు నిప్పుడీరావణాసురుని జూచి యన్నదమ్ములగు రామలక్ష్మణు లిరువురును భయమునుబొందుదురనిరి. మఱియునుకోపయుక్తుడగు నీరావణాసురునిచేత లోకపాలకులు నల్వురును జంపబడుదురనిరి. మఱియు నీరావణాసురుడు పూర్వము అనేకపర్యాయములు యుద్ధములయందు అనేకులగు శత్రువులను జంపినవాడగుటచేత నిప్పుడితనికేమియును హాని గలుగదనిరి. మఱియు నీరావణాసురుడు ముల్లోకములయందునుగల శ్రేష్ఠములగు పదార్థములను అపహరించిన వాడగుటచేత నీరావణునకు పరాక్రమమందును, బలమునందును, సమానుడు ముల్లోకములయందును లేడనిరి.

ఇవ్విధముగ రాక్షసులందఱును మాటలాడుచుండగానే యారావణాసురుడశోకవనమునకు బోయె. అట్లు క్రోధగతుడగు రావణాసురుడు సీతాదేవియొక్క సమీపము అపరిమితమగు వేగముతో బరుగెత్తుకొనిపోయె. మఱియు నాసమయమునందు కోపయుక్తుడగు నారావణాసురుని చుట్టును నతనిమంత్రులుగూడ బరుగెత్తుచుండిరి. మఱియు నాసమయమునందు ఆమంత్రులందఱును నానావిధములగు వచనములచేత నివారించినను నిలువక యాకాశమునందలి రోహిణీదేవినిగుఱించి దుష్టగ్రహము పరుగెత్తువిధముగ రావణాసురుడు సీతాదేవిని గుఱించి పరుగెత్తె. ఆసమయమునందు రాక్షసులచేత గాపాడబడుచు

వ్రతయును, పతివ్రతయును, నగు సీతాదేవి మిగులశ్రేష్ఠ
మగు ఖడ్గమును ధరించినవాడును, అపరిమితమగు కోపము
గలవాడును, నగు రావణాసురుని జూచి యపరిమితమగు
వ్యసనము గలదయ్యె. మఱియు పతివ్రతా సీతాదేవి, మంత్రు
లచేత బహువిధముల నివారింపబడియును, మరలనివాడును
స్నేహితులతో గూడుకొనినవాడును, ఖడ్గధారియును, త
నసమీపమునకు వచ్చుచున్నవాడును, నగు రావణాసురుని
జూచి యపరిమితమగు దుఃఖముగలదగుచు నిట్లనియె. అ
య్యో! నేనేమిచేయుదును. దుర్మార్గుడగు నీరావణాసురు
డు కోపోద్దీపితుడై నాయొద్దకు వచ్చుచున్నాడు. ఈదు
ర్మార్గుడు దిక్కుగలిగియున్న నన్ను దిక్కులేనిదానిని వధిం
చినవిధముగా వధింపగలడు. మఱియు నీదుష్టుడు పూర్వ
ము నాకు భార్యవగుమని యనేక పర్యాయములు నాతో
జెప్పె. ఆమాటలకు నేనంగీకారమును బొందక యనుచి
తములగు మాటలను జెప్పుచున్నావని చెప్పి పంపితిని. అం
దువలన నీరావణాసురుడు నాయందు నిరాశుడయ్యె. కా
వుననే యిప్పుడీరావణాసురుడు క్రోధోద్దీపితుడై నన్ను
జంపుటకు వచ్చుచున్నాడని తోచుచున్నది. అట్లుగాదేని
యీదుర్మార్గుడు, మానవోత్తములును, అన్నదమ్ములును,
నగు రామలక్ష్మణులను నానిమిత్తముగ యుద్ధమునందు జం
పి నాయొద్దకు వచ్చుచున్నాడా? అని తోచుచున్నది. అయ్యో
నేనేమిచేయుదును నానిమిత్తముగ రాజపుత్రులగు రా
మలక్ష్మణులు మరణమును బొందిరి కాబోలునని కొంతసే
పు దుఃఖించి మఱియు నిట్లనియె.

భయంకరుడును, పాపమును జేయుటయందే నిశ్చయ
ముగలవాడును, నగు నీరావణాసురుడు పుత్రశోకముచే
త బీడింపబడినవాడగుచు రామలక్ష్మణులను జంపక యే న
న్ను జంపదలచివచ్చెనా? యని మిక్కిలి దుఃఖించి మఱి
యునిట్లనియె, అయ్యో, నేనెంతయవివేకురాలనైతిని. పూ
ర్వమునందు హనుమంతుడు తనవీపుమీద నను నుంచుకొని తీ
సికొనిపోయి రామలక్ష్మణులయొద్ద బెట్టెదననియె. ఆవచ
నమునకు నేనంగీకారమును బొందనైతిని. అందువలననభా
గ్యురాలనగు నేననర్థమును బొందితిని. అప్పుడు పోయి
యుంటినేని యిప్పుడిట్టియాపద సంభవింపదుగదా? ఇప్పు
డు నేనేమిచేయుదును. ఏకపుత్రురాలగు కౌసల్యాదేవి పు
త్రునియొక్క మరణమును వినినతోడనే బ్రద్దలైన హృదయ
ముగలదై మరణమును బొందగలదు,
ము మఱియు నా కౌసల్యాదేవి, మహాత్ముడగు రాముని
యొక్క బాల్యమున, యౌవనమును, చక్కదనమును, ధ
ర్మకార్యములను దలచుకొని యపరిమితముగా వ్యసనమును
బొందును. అయ్యో! దుష్టస్వభావములుగల కైకేయీ మం
దరలవలనను, నావలనను, మహానుభావురాలగు కౌసల్యా
దేవికి అపరిమితమగు దుఃఖము గలిగెనని యధికముగా సీ
తాదేవి వ్యసనమును బొందుచుండె. ఇట్లధికముగా వ్యసన
మును బొందుచున్నదియును, దీనురాలును, జనకచక్రవ
ర్తికి బుత్రికయును, చంద్రునివదలి యన్యగ్రహముతో గూ
డిన రోహిణివలె యున్నదియును, నగు సీతను జూచి
మిగులబుద్ధిమంతుడును, మంత్రులలో నుత్తముడును, పరిశు
ద్ధుడును, నగు సుపార్శ్వుడను మంత్రిపుంగవుడు రావణా
సురునితో నిట్లనియె.

రావణాసురుడా! నీవు కుబేరునకు దమ్ముడవు. అది
యునుగాక ధర్మాత్ముడవు. ఇటువంటి నీవు కోపము వలన
ధర్మమును దలిపెట్టి యీసీతను జంపదగువాడ? మఱియు
నో రాక్షసరాజేంద్రా! నీవు వేదవిద్యావ్రతుడవు. అదియును
గాక స్వకర్మనిరతుడవు. ఇట్టినీవు స్త్రీవధయందు పాప
ము లేదని యెట్లుతలచితివి, ఇట్లు తలపదగునా? తగదు.
కాబట్టి యో రాక్షసోత్తమా! నీకిప్పుడు గలిగియున్న కో
పమును రామునియందు బెట్టుము. నీవిప్పుడే యుద్ధమునకు
లెమ్ము. ఈదినము కృష్ణపక్షచతుర్దశి యనబడును. ఈదిన
మునందు బయలుదేరితివేని నిశ్చయముగా అమావాస్య
యందు జయమును బొందగలవు. కావున నీ స్త్రీవధనమా
ని యుద్ధమునకు బయలు వెడలుము. మఱియు నో రాక్షస
రాజోత్తమా! శూరుడవును, ధీమంతుడవును, రథికులలో
శ్రేష్ఠుడవును, నగు నీవు రథారూఢుడవై యుద్ధమునకు
బోతివేని రాముని జంపగలవు. అట్లుచేసి నీవీ సీతాదేవిని
బొందగలవు. కావున నావచనానుసారముగ బ్రవర్తింపు
మనియె. ఇవ్విధముగా మంత్రిపుంగవునిచేత జెప్పబడిన వా
క్యములను విని దురాత్ముడగు రావణాసురుడు మరల నిం
టికివచ్చి కొలువుకూటము నందు ప్రవేశించె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి తొంబది మూడవ
ముగిసెను.

—{ రావణాసురుడు సైన్యముతో గూడ వెలువెడలి రామునితో యుద్ధము జేయుట }—

అంతట రావణాసురుడు సభయందు బ్రవేశించి దీను
డును, అపరిమితమగు దుఃఖముగలవాడును, నయ్యె. పి
మ్మట సింహాసనమందు కూర్చుండి యా రావణాసురుడు
కోపోద్దీపితమైన సింహమువలె నిట్టూర్పులను విడుచుచుం
డె. అంతట మహాబలుడగు రావణాసురుడు తనవారల
లో ముఖ్యులను, మిగుల నధికములగు బలపరాక్రమము

లుగలవాడును, నగు రాక్షసులనుజూచి పుత్రశోకముచేత పీడింపబడినవాడును, డోసిలియొగ్గినవాడును, నగుచు నిట్లనియె.

రాక్షసోత్తములారా! మీరందఱును, గుఱ్ఱములు, ఏనుగులు, రథములు, పదాతులు, మొదలుగాగలవానితో గూడుకొని బయలువెడలుడు. మీరందఱును నొక్కడగు రాముని నవశ్యముగా జంపగలరు. మఱియును మీరు వర్షాకాలమునందలి మేఘములను వర్షించిన విధముగా బాణవర్షమును గురిపింపగలరు. కావున మీరందఱును శీఘ్రముగ బయలువెడలుమని చెప్పి మఱియు నిట్లనియె. రాక్షసోత్తములారా! మీచేత రామలక్ష్మణులు చంపబడక పోయిరేని రేపటిదినము నేను మిగుల తీక్ష్ణములగు బాణములచేత లోకములోనివారును, మీరును, జూచుచుండగ రాముని సంహరించెదననియె. ఇవ్విధముగా రాక్షసేంద్రుడగు రావణాసురుడు చెప్పిన వాక్యమును విని యారాక్షసులందఱును, మిగుల శీఘ్రగమనముగల అనేకవేల రథములతోడను, మఱియు ననేకవేల గజతురగాదులతోడను గూడుకొనిన వారై యుద్ధమునకు బయలువెడలి పోయిరి. పోయినపిమ్మట నారాక్షసులందఱును, పరిఘములను, నాయుధములను మఱియు పట్టసములు బాణములు ఖడ్గములు, గండ్రగొడ్డండ్లు, మొదలగు నాయుధములను వానరులయొక్క ప్రాణములను అపహరింపదలచి ప్రయోగించిరి. మఱియు నాసమయమునందు వానరులును కోపోద్దీపితులై యారాక్షసులమీద వృక్షములను, శిలలను, బ్రయోగించిరి. ఆయుద్ధము సూర్యోదయకాలమును మొదలుకొని ప్రవర్తించె.

మఱియు నప్పుడు వానరులకును, రాక్షసులకును జరుగుచున్న యుద్ధము మిగుల సంకులమైనదియును, మిగుల భయంకరమైనదియునునై యుండెను. మఱియు నాయుద్ధమునందు వానరులును, రాక్షసులును, విచిత్రములగు గదలచేతను, ప్రాసములచేతను, ఖడ్గములచేతను, గండ్రగొడ్డండ్లచేతను, పరస్పరమును గొట్టుకొనిరి. ఇవ్విధముగా బ్రవర్తించుచున్న యుద్ధమునందధికముగా దుమ్ము బయలువెడలె. అట్టిదుమ్ము రాక్షసులయొక్కయు, వానరులయొక్కయు నెత్తురుచేత శాంతిని బొందింపబడియె. మఱియునాసమయమునందా వానర రాక్షసులయొక్క రక్తము నదీరూపముగ బ్రవహించుచుండెను. ఆనదికి ఏనుగులయొక్కయు, గుఱ్ఱములయొక్కయును, శరీరములు కట్టెలయ్యె. వానరులయొక్కయు, రాక్షసులయొక్కయు, శరీరములు పడవలను బోలియుండెను. అప్పుడు వానరులందఱును నెత్తురుయొక్క ప్రవాహముచేత దడుపబడిన శరీరముగలవారై యాగిరియొక్కశిఖరమునుండి పడుచు రాక్షసులయొక్క గుఱ్ఱములను, ఏనుగులను విఱిచి చంపుచుండిరి. మఱియు నరాక్షసులయొక్క యాయుధములను పరిచ్ఛేదించిరి.

మఱియు నాసమయమునందు వానరులందఱును, మిగులదీక్ష్ణములగు గోళ్లచేతను దంతములచేతను, రాక్షసులయొక్క తలవెండ్రుకలను, చెవులను, లలాటములను, ముక్కులను, నానావిధములుగా ఖండించిరి. మఱియు నాసమయమునందొక్కొక్క వానరుడును, నూఱేసిమంది రాక్షసులను మర్దించుచుండిరి. అట్లు రాక్షసుల గుంపుమీదికి దుముకుచున్న వానరులు ఫలవృక్షము మీదికెగురుచున్న పక్షులను బోలియుండిరి. ఆసమయమునందు పర్వతములతో సమానులగు రాక్షసులు, మిగుల పెద్దవగు గదలచేతను, శూలములచేతను, ఖడ్గములచేతను, గండ్రగొడ్డండ్లచేతను, మఱియు ననేకవిధములగు నాయుధములచేతను, భయంకరులగు వానరులను గొట్టిరి.

అవ్విధముగ రాక్షసులచేత గొట్టబడుచున్న వానరసైన్యము నిలువజాలక సకలలోకరక్షకుడును, దశరథమహారాజునకు బుత్రుడును, నగు రామునియొద్దకు బోయి మమ్ము గాపాడుమని ప్రార్థించిరి. అంతట నధికమగు తేజస్సుగలవాడును, వీర్యవంతుడును, నగు రాముడు సర్వోత్తమమగు ధనస్సును గ్రహించి రాక్షససైన్యమునందు బ్రవేశించి మిగుల భయంకరముగా బాణవర్షమును గురిపించెను. మఱియు యుద్ధరంగమునందు బ్రవేశించినవాడును, భయంకరుడును, బాణాగ్నిచేత దహింప జేయుచున్నవాడును, నగు రామునిచుట్టును రాక్షసులు సూర్యునిచుట్టును మేఘములుండజాలక పోవునట్లు పోయిరి. మఱియు నాయుద్ధమునందు రాముడు మిగుల భయంకరమగు కర్మలను జేయుచుండెను. వానినన్నిటినిజూచి రాక్షసులు మిగుల భయమును బొందుచుండిరి. మఱియు నాసమయమునందు రాముడు వనమునందు బ్రవేశించిన మహావాయువువలె భయంకరుడగుచు రాక్షససైన్యమును సర్వమును జంపింపజేయుచుండెను. మిగుల గొప్పవగు రథములను విరిచివేయుచుండెను. మఱియు నాసమయమునందు రామునియొక్క తీక్ష్ణములగు బాణములచేత ఛేదింపబడినదియును, దహింపజేయబడినదియును, ధ్వంసము చేయబడినదియును, శస్త్రములచేత పీడింపబడినదియును, నగు సైన్యము కనబడెనుగాని యతిశీఘ్రముగ యుద్ధమును జేయుచున్న రాముడు కనబడకపోయె. మఱియు నాసమయమునందు రాక్షసులందఱును దమ శరీరములయందు మిగుల తీక్ష్ణములగు బాణములను బ్రయోగించుచున్న రాముని యింద్రియార్థములయందు నివసిం

చియున్న పరమాత్మను బాడజాలని విధముగ జూడలేకపో యిరి.

మఱియు నాసమయమునందు రాక్షసులందఱును నీరాముడు ఏనుగులయొక్క సమూహమును జంపుననియును, మిగుల గొప్పవగు రథములను విఱుచుననియును, మిగులతీక్ష్ణములగు బాణములచేత పదాతులను, గుఱ్ఱములతోగూడ నశింపజేయుననియును, జెప్పుకొనుచుండిరి. ఇవ్విధముగ జెప్పుకొనుచున్న యారాక్షసులందఱును నాయుద్ధమునందు భ్రాంతిచేత దమవారినే రామునిగా దలచి యొకరినొకరు మిగుల భయంకరములగు నాయుధములతో గొట్టుకొనుచుండిరి. మఱియు నాసమయమునందు మహాత్ముడగు రామునిచేత బ్రయోగింపబడినదియును, సర్వోత్తమమైనదియును, నగు గాంధర్వాస్త్రముచేత మోహితులగు రాక్షసులందఱును శత్రుసైన్యమును నశింపజేయుచున్న రామునిజూడజాలక పోయిరి. మఱియు నాసమయమునందు రాక్షసులందఱునునొక్కొకమాటు అనేకవేల రాములనుజూచినట్లు తలచి మిగుల భయమును బొందుచుండిరి. మఱియు నొక్కొకమాటు యుద్ధరంగమునందు రామునినొక్కనినే చూచుచుండిరి. మఱియు నాసమయమునందు రాక్షసులందఱును మహానుభావుడగు రామునియొక్క బంగారపుఅంచులుగలధనుష్కోటినిజూచికొఱవికట్టెకాబోలునని భయమును బొందుచుండిరిగాని రామునెక్కడనున్నదియును, కనిపెట్టజాలకుండిరి. మఱియు నాసమయమునందు రాక్షసులందఱును శరీరమనే నాభిగలదియును, బలమనియెడు జ్వాలలుగలదియును, బాణములనియెడు నంచులుగలదియును, ధనుస్సనియెడు నంచుగలదియును, ధనుష్టంకారమనియెడు తలనిర్ఘోషముగలదియును, తేజోబుద్ధిగుణములనియెడు కాంతులుగలదియును, దివ్యాస్త్రములయొక్క సామర్థ్యమనియెడు ధారలుగలదియును, నగు రామచక్రమును, కాలచక్రమునుగా జూచిరి. మఱియు నాసమయమునందు వాయువేగనువంటి వేగముగల పదివేలరథములును, మిగుల వేగముగల పదునెనిమిదివేల ఏనుగులును, పదునాలుగువేల గుఱ్ఱపు రౌతులును, రెండులక్షల పదాదులును, నాదినముయొక్క యెనిమిదవ భాగము కాకమునుపే రామునిచేత నాశముచేయబడియె. అవ్విధముగ రాముడొక్కడే కామరూపులగు రాక్షసులనందఱను, జంపిన పిమ్మట జావగా మిగిలినవారు మిగుల భయముగలవారగుచు లంకాపట్టణమునకు బోయిరి.

అవ్విధముగ రామునిచేత జంపబడిన చతురంగబలములతోడను గూడుకొనిన యాయుద్ధభూమి, ప్రళయకాలమునందలి రుద్రునియొక్క క్రీడాస్థానమువలె బ్రకాశించుచుండె. ఆసమయమునందు దేవతలును, గంధర్వులును, సిద్ధులును, మిగుల శ్రేష్ఠులగు ఋషులును, రామునియొక్క వ్యాపారము మిగుల గొనియాడదగినదైయున్నదని పూజించిరి. ఆసమయమునందు రాముడు, సుగ్రీవుడు, విభీషణుడు, హనుమంతుడు, జాంబవంతుడు, మైందుడు, ద్వివిదుడు, మొదలగువారలతో యిట్లనియె.

వీరోత్తములారా! ఇట్టిసామర్థ్యముగల గాంధర్వాస్త్రము పరమశివునియొద్దను, నాయొద్దను తప్ప మఱియెవ్వరియొద్దను లేదనియె. ఇవ్విధముగ రాక్షసులను వధించిన వృత్తాంతమును జెప్పి మహానుభావుడును, దేవేంద్రునితో సమానుడును, నగు రాముడు అస్త్రశస్త్రములయందు శ్రమలేనివాడును, దేవతలచేత స్తోత్రమును, చేయబడుచున్నవాడునునై యుండె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి తొంబదినాల్గవ సర్గ ముగిసెను.

-(*)

లంకాపట్టణమునందలి స్త్రీలు మొదలగువారు రాక్షసుల మరణమునకు దుఃఖించుట.

అంతట నాసమయమునందు గుఱ్ఱపు రౌతులయొక్క యనేకవేలును, అగ్నియొక్క కాంతివంటి కాంతిగలవియును, ధ్వజములతో గూడుకొనినవియును, నగు రథములయొక్క యనేకవేలును, గదలు, పరిఘలు, మొదలుగాగల యాయుధములచేత యుద్ధమును జేయుచున్నవారును, బంగారపుధ్వజములచేత చిత్రములైనవియును, శూరులును, కామరూపులును, నగు ననేకవేల రాక్షసులును, బంగారపు పిఞ్ఛగలవియును, మిగుల దీక్ష్ణములైనవియును, నగు రామునిబాణములచేత జంపబడిరను వృత్తాంతమును విని, రాక్షసస్త్రీలుదఱును నధికమగు వ్యసనముగలవారైరి. మఱియు నాలంకాపట్టణమునందలి రాక్షసులును నధికముగా వ్యసనమును బొందిరి. మఱియు నాసమయమునందు, విధవలును, చచ్చిన బిడ్డలుగల రాక్షసస్త్రీలును, హతమైనబంధువులుగలవారును, నగు రాక్షసస్త్రీలందఱును మిగులదుఃఖముచేత బీడింపబడినవారగుచు నపరిమితముగా విలాపములను జేయుచుండిరి. మఱియు వారందఱును నిట్లని చెప్పకొనుచుండిరి. అయ్యో దుర్మార్గురాలును, భయంకరురాలును, నగు శూర్పణఖ, మన్మథునియొక్కరూపమువంటిరూపముగలవాడును, సుకుమారుడును, మిగులగొప్పదగుబలముగలవాడును సర్వభూతములకును హితమునందాసక్తిగలవాడును, నగు రామునిజూచి యధికమగు కామముగలదయ్యె.

అయ్యో సకలగుణములచేతను హీనురాలును, సకలదుర్గుణములును గలదియును, నగుశూర్పణఖ, గుణవంతుడును, అధికమగు తేజస్సుగలవాడును, సుముఖుడును, నగురాముని నెట్లుగోరెను. లోకులందఱును దురదృష్టులగుటవలన నుంగరములవలె జుట్టుకొనినవియును, తెల్లనివియును, నగు తలవెండ్రుకలుగల శూర్పణఖ, సర్వలోకములవారిచేతను నిందింపదగినదియును, పరిహసింపదగినదియును, నగుదుష్టకార్యమును జేసె. మరియును దుర్మార్గురాలగు నాశూర్పణఖ, రాక్షసుల యొక్కయు, ఖరదూషణులయొక్కయు, నాశముకొఱకు రాముని మనస్సున కాయాసమును గల్పించె. పిమ్మట రావణాసురుడు ఆశూర్పణఖకొఱకుగా నిట్టిక్రూరకృత్యమును జేసె. మరియు నారావణాసురుడుతన నాశముకొఱకు సీతాదేవిని నెత్తుకొనివచ్చె. ఈరావణాసురుడు జనకచక్రవర్తియొక్క పుత్రికయగు సీతను బొందజాలడు. మరియును రావణాసురుడు బలవంతుడగు రామునితో వైరమునవలంబించె. పూర్వమునందు సీతాదేవిని గోరుచున్న విరాధుడను రాక్షసోత్తముని రాముడొక్క బాణముచేత ఖండించె. దానినిదలచుకొన్నతోడనే భయముగలుగుచున్నది.

మఱియు నారాముడు, జనస్థాననివాసులును, భయంకరములగు కర్మలుగలవారును, నగుఖరదూషణాదులను, పదునాలుగువేలమందిని మిగులదీక్ష్ణములగు బాణములచేత సంహరించె. రాముడప్పుడు ప్రయోగించిన బాణములు సూర్యునితో సమానములైయుండె. మఱియు నారాముడు, యోజనబాహుడు, కబంధుడు, మొదలగు రాక్షసులనుగూడ సంహరించె. మఱియును మహానుభావుడగు రాముడు, దేవేంద్రునకు బుత్రుడును, మేరుపర్వతముతోసమానుడును, మిగులబలవంతుడును, నగువాలినొక్క బాణముచేత సంహరించె. పిమ్మట ఋశ్యమూక పర్వతమునందు రాజ్యపదభ్రష్టుడును, దీనుడును నైయున్న సుగ్రీవుని రాజ్యమునందు నిలిపియతని కోరికలన్నియును నెరవేరునట్లు చేసె.

ఆకార్యములన్నియును రామునకుజయము గలుగునని యును, రాముడుమిగుల నధికములగు బలపరాక్రమములు గలవాడనియును దెలుపుచున్నవి. మఱియు దుర్మార్గుడగు రావణాసురుడు, విభీషణునిచేత జెప్పబడినదియును, సకలరాక్షసులకును హితమైనదియును, నగుమాటను వినకపోయె. కుబేరునకుదమ్ముడగు రావణాసురుడు విభీషణునియొక్క మాటనువిని యుండెనేని యీలంకాపట్టణము శ్మశానముతో సమానమైనదియును, రోదనధ్వనులుగలదియును, గాకుండునుగదా? అయ్యో యిప్పుడు మనమేమిచేయగలము. మఱియు మహాబలుడగు కుంభకర్ణుడు రామునిచేత జంపబడియె. మఱియులక్ష్మణుడు దుర్ధర్షుడగు నతికాయుని జంపె.

మఱియును లక్ష్మణుడు రావణాసురునకు బ్రియపుత్రుడగు నింద్రజిత్తునుగూడ సంహరించె. మఱియునిప్పుడింటింటను, నాయన్నచచ్చెను, నాబావచచ్చెను, నాతండ్రిచచ్చెను, నాభర్తచచ్చెను, నాపుత్రుడుచచ్చెను, అనునట్టి రోదనధ్వనులతిశయించె. మఱియును, శూరుడగు రాముచే మిగులదీక్ష్ణములగు బాణములచేతరథములు, గుఱ్ఱములు, ఏనుగులు, పదాతులును, ననేకలక్షలునశింప జేయబడియె. రుద్రుడో, విష్ణువో, దేవేంద్రుడో, యముడో, రామరూపము నవలంబించివచ్చి మనలనందఱను జంపుచున్నాడు. మరియును రామునిచేత వీరులందఱును జంపబడిరి. కావుననికమనము జీవింపజాలమని పట్టణములోని వారందఱును నపరిమితముగా దుఃఖమును బొందుచుండిరి. రామునిమూలకముగ నిట్టియాపదగలుగుటను దెలిసియును, మహాశూరుడగు రావణాసురుడు మిగులగొప్పదగు భయమువచ్చెనేయని తెలియజాలకున్నాడు. మనమేమిచేయగలము. యుద్ధమునందు రామునిచేతియందు దగులుకొనిన వానిని కాపాడుటకు దేవతలు, గంధర్వులు, పిశాచములు, రాక్షసులు, మొదలగువారలలో నెవ్వరును సమర్థులుగారు. మరియు యుద్ధమునందు రావణాసురునకు నాశమును, రామునకు జయమును జూపించునట్టి యుత్పాతములనేకములుగలుగుచున్నవి. ఈరావణాసురుడు పూర్వమునందు ఘోరమగు తపస్సునుజేసి దేవదానవరాక్షసులవలన మరణముగలుగకుండునట్లు వరమునుబొందెగాని మానవులవలన మరణముగలుగకుండునట్లు వరమునుబొందడయ్యె. కాబట్టి నిశ్చయముగ నిప్పుడుమానవుడగు రామునివలన రావణాసురుడు మరణమునుబొందునని తోచుచున్నది. మరియున నేకులగు రాక్షసులింకను మరణమును బొందగలరని తోచుచున్నది. పూర్వము రావణాసురునిచేత సకలలోకములోని వారలును బీడింపబడిరి. పిమ్మటమునులు మొదలగువారందఱును మిగులభయంకరమగు తపస్సుచేత బ్రహ్మదేవుని బూజించిరి. అంతట మహానుభావుడగు బ్రహ్మదేవుడు, దేవతలకు హితమును జేయుటకొఱకు దేవతలతో నిట్లనియె.

ఓమునికులోత్తములారా! మీరందఱును సంతోషమును బొందుడు. ఇదిమొదలుకొని ముల్లోకములయందలి దేవదానవ రాక్షసమానవాదులకు సంతోషముగలుగును. మ

రియు నిదిమొదలుకొని దానవరాక్షసులు మిగులభయము గలవారగుచువిరుగుదురు. ఇప్పుడింద్రుడు మొదలుగాగల దేవతలతో, పరమేశ్వరు డిట్లనిచెప్పెను.

ఓదేవోత్తములారా! మీరందఱును నికమీదటరావణాసురుడు మొదలగువారివలన గలిగినభయమునువిడిచిపెట్టుడు. శీఘ్రకాలములోపల రాక్షసనాశమును జేయుటయందు దగినసామర్థ్యముగల యాడుదిపుట్టగలదు. పూర్వము నందాకవియనునది పంపబడినవిధముగ నిప్పుడురాక్షసనాశముకొఱకీ యాడుదిపంపబడియె. కావుననీసీతరావణాసురుడు మొదలుగాగల రాక్షసులనందఱను జంపగలదు. ఈకాలమునందు దుష్టబుద్ధిగల రావణాసురునకు నాశకరమగు కాలమైయున్నది. కావునరావణాసురుడిప్పుడు అపరిమితమగు వ్యసనమును, బొందగలడని పరమేశ్వరుడు సెప్పెనని బ్రహ్మదేవుడు మునులుమొదలగు వారితోజెప్పి మఱియు నిట్లనియె.

మునికులోత్తములారా! ఆసీతకుభర్తయైన నారాయణుడు రఘుకులమునందు రాముడను నామధేయముగలవాడైపుట్టును. కావునరామునిదాకిన రాక్షసులందఱును నాశమును బొందుదురుఅని యాబ్రహ్మదేవుడుచెప్పిఅంతర్హితుడయ్యె. ఇప్పుడట్టిబ్రహ్మదేవుని వచనానుసారముగ రాముడుదయించె. కావున నీరాముని దాకిన వారందఱును నాశమునుబొందగలరు. మఱియునిప్పుడు రామునిదాకిన రాక్షసులందఱును, దవాగ్నియందు దగులుకొనిన యాడేనుగులవిధముగ నాశమునుబొందగలరు. ఈవిషయమును సర్వమును దెలిసినవాడగుటచేత విభీషణుడు రామునియొద్దకుబోయి శరణుజొచ్చె. కాబట్టివిభీషణుం డవశ్యముగజీవింపగలడని యాపట్టణములోని స్త్రీలందఱును నొకరితో నొకరుచెప్పికొనుచు నపరిమితమగు వ్యసనమునుబొందుచుండిరి. ఆసమయమునందు లంకాపట్టణము నందంతటను రోదనధ్వను లతిశయించె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి తొంబదైదవసర్గ ముగిసెను.

-- రావణాసురునకపశకునములుగలుగుట. --

అంతట రావణాసురుడు లంకాపట్టణములోని యింటింటనుండియును బయలువెడలినదియును, మిగులగతీవ్రమైనదియునునగు రోదనధ్వనినివినియె. అంతటరావణాసురుడు నిట్టూర్పులనువిడుచుచు గొంతసేపుధ్యానముజేసి విస్మటనపరిమితమగు కోపముగలవాడును, భయంకరమైన యాకారముగల వాడునునయ్యె. మరియు నాసమయమునందు రావణాసురుడు కోపముచేతనెఱ్ఱనైన నేత్రములు గలవాడై పెదవులను గొరికికొనియె. అప్పుడురావణాసురుడు తనవారలకుగూడ బ్రళయకాలాగ్నివలె జూడనలవిగానివాడైయుండె. అంతటరాక్షసాధిపతియగు రావణాసురుడు తనసమీపమునందున్న రాక్షసులతో నిట్లనియె.

ఓరాక్షసోత్తములారా! మనపట్టణములోని స్త్రీలుమొదలగువారందఱును భయముచేత నపరిమితముగా రోదనమును జేయుచున్నారు. కావునమనమిప్పుడు యుద్ధమునకు బోవలయును. కాబట్టిమహోదర మహాపార్శ్వులను, విరూపాక్షుని, పిలిచిశీఘ్రముగ యుద్ధమునకు బయలువెడలుడని చెప్పుడనియె. అంతట నారాక్షసులందఱును రావణాసురుని యాజ్ఞానుసారముగ జరవుటకొఱకు తగినవారలను నియమించిరి. అట్లుసేసియును వారందఱును రావణాసురునికోపమునుజూచి యపరిమితమగు భయముగలవారైయుండి. అంతట నారాక్షసులందఱును రావణాసురునకు మేలుగలుగు గాతయనిచెప్పిరి. పిమ్మట నెల్లవారును యుద్ధసన్నద్ధులైరి. అంతట నారాక్షసులందఱును రావణాసురునకు జయముగలుగవలయునని తలచినవారై న్యాయానుసారముగ రావణునిబూజించిరి. మఱియునారాక్షసులందఱును చేతులనుముకుళించుకొని యారావణాసురుని జుట్టునునిలిచిరి. అంతట క్రోధమూర్ఛితుడగు రావణాసురుడు పకపకనవ్వుచు మహోదరమహాపార్శ్వులతోడను, విరూపాక్షునితోడను నిట్లనియె.

రాక్షసోత్తములారా! ఇప్పుడునాధనుస్సువలన విడిచిపెట్టబడినవియును, ప్రళయకాలమునందలి సూర్యునితో సమానములైనవియును, నగుబాణములచేత రామలక్ష్మణులను యమలోకమునకుబంపెదను. మఱియునో రాక్షసోత్తములారా! ఖరుడు, కుంభకర్ణుడు, ప్రహస్తుడు, ఇంద్రజిత్తు, మొదలగువారినిజంపిన రామలక్ష్మణులనుజంపి యిప్పుడు యమలోకమునందున్న వారలకు సంతోషమునుగలిగించెదను. మఱియునో రాక్షసోత్తములారా! నాబాణములనియెడు మేఘములచేత నావరింపబడెనేని యాకాశము, దిక్కులు, నదులు, సముద్రములు, మొదలగునవి ప్రకాశింపనేరవు. మరియునో రాక్షసోత్తములారా! నాధనుర్బాణములచేత నిప్పుడు వానరముఖ్యులనందఱను జంపెదను, మరియునో రాక్షసోత్తములారా! వాయువేగమువంటి వేగముగల రథమునధిష్ఠించి ధనుస్సనియెడు సముద్రమువలన బుట్టినబాణములనియెడు తరంగములచేత వానరసైన్యములనుమర్దించెదను. మఱియు నో రాక్షసోత్తము

లారా! కొంచెమువికసించినపద్మములవంటి మోములుగలవారును, పద్మమునందలి కింజల్కములయొక్క కాంతివంటికాంతిగలవారును, నగు వానరసముదాయములని మెడుతటాకములనేనుగువలెమథించెదను.

మఱియు నోరాక్షసోత్తములారా! ఇప్పుడువానరాధిపతులందఱును, బాణములతో గూడుకొనినముఖములుగలవారై భూమియందుబడి నాళములతోగూడుకొనిన పద్మములవలె ప్రకాశించుచుందురు. మఱియు నోరాక్షసోత్తములారా! యుద్ధములయందుమిగులభయంకరులును, వృక్షములచేత యుద్ధమును జేయువారును, నగువానరులయొక్కయనేకనూరులనునొక్కబాణముచేతనేవధింతును. మఱియు నిప్పుడెవ్వరెవ్వరియొక్కభర్తయు, అన్నదమ్ములును, పుత్రులున, చంపబడిరోయట్టివారలయొక్క కన్నీళ్ళనుదుడిచివేయుదును. మఱియు నోరాక్షసోత్తములారా! ఇప్పుడునాబాణములచేత చంపబడినవానరులచేత భూమియంతయునునిండునట్లుసేసెదను. మఱియు నోరాక్షసోత్తములారా! ఇప్పుడువానరులయొక్క మాంసాదులచేత యిప్పుడునక్కలు, గ్రద్దలు, మొదలుగాగలమాంసమునుదినిజీవించునట్టిజంతువులకు దృప్తినిగలుగజేసెదను. కాబట్టియోరాక్షసోత్తములారా! నారథమును ధనుర్బాణములను, శీఘ్రముగ దెప్పింపుడు. మఱియు నోరాక్షసోత్తములారా! రాక్షసభటులందఱును నా వెంటవచ్చునట్లుచేయుడనియె.

ఇవ్విధముగా రావణాసురుడు చెప్పినవచనమునువిని మహాపార్శ్వుడను మంత్రిపుంగవుడు బలాధ్యక్షులతో సైన్యమునుశీఘ్రముగరప్పింపుడనియె. అంతటనాబలాధ్యక్షులందఱునుబోయి ప్రతిగృహమునందలి రాక్షసులతోడను యుద్ధమునకుబయలువెడలుడనిచెప్పిరి. అంతట ననేకవేల రాక్షసులుయుద్ధసన్నద్ధులై బయలువెడలిరి. ఆసమయమునందు భయంకరములగుమోములుగల రాక్షసులందఱును భూమ్యంతరిక్షములునిండునట్లు సింహనాదములను జేసిరి. మఱియు నాసమయమునందుఆరాక్షసులందఱును, ఖడ్గములు, పట్టసములు, శూలములు, గదలు, ముసలములు, హలములను నాయుధవిశేషములు, తీక్ష్ణములగునంచులుగలశక్తులు, మిగులగొప్పవగుకూటములు, ముద్గరములు, కర్రలు, నిర్మలములగుచక్రములు, మిగులదీక్ష్ణములగు గండ్రగొడ్డండ్లు, భిండివాలములు, శతఘ్నులు, మఱియు ననేకవిధములగు నాయుధములునుగలవారై యుండిరి.

ఇవ్విధములగు నాయుధములనుధరించిన రాక్షసవీరులనందఱును, బలాధ్యక్షుడు, రావణాసురునియాజ్ఞానుసారముగరప్పించె. మఱియు నాబలాధ్యక్షుడురావణాసురుడెక్కదగినదియును, ఎనిమిదిగుఱ్ఱములచే బూన్పబడినదియును, నగు రథమునుగూడరప్పించె. అంతటభయంకరమైన యాకారముగలవాడును, అనేకవేలరాక్షసులతోగూడుకొనినవాడును, నగు రావణాసురుడధిష్ఠించె. పిమ్మట నారావణాసురుడు సకలరాక్షసవీరులతోగూడ బయలువెడలె. ఆసమయమునందు రావణాసురుడు భూమినిబ్రద్దలుసేయువానివలెగనబడియె.

మఱియునప్పుడు, రావణాసురునియాజ్ఞనుబొంది మహోదరమహాపార్శ్వులును, విరూపాక్షుదుర్ధర్షులును, తమతమరథములమీదనెక్కిరి. అంతటవారందఱును నపరిమితమగు సంతోషముగలవారును, జయమునుగోరుచున్నవారును, నై భూమియంతయునుబ్రద్దలగునట్లు మిగులభయంకరమగు సింహనాదమును జేసిరి. అంతట, తేజోవంతుడును, రక్షోగణములతో గూడుకొనినవాడును, అనేకవేలయోధులతో గూడుకొనినవాడును, ప్రళయకాలమునందలి యమునితోసమానుడును, నగు రావణాసురుడుధనుర్ధారియైబయలువెడలె. అవ్విధముగ మిగులవేగముగలగుఱ్ఱములచే బూన్పబడినరథమునెక్కిన రావణాసురుడు రామలక్ష్మణులున్నచోటునకుబోవ నిశ్చయించి తూర్పుద్వారమునుండిబయలువెడలె. ఆసమయమునందు సూర్యుడునష్టమైన కాంతిగలవాడయ్యె. దిక్కులన్నియును చీకటిచేత వ్యాప్తములయ్యె. పక్షులన్నియును, మిగులభయంకరములగుకూతలనుకూసె. భూమియంతయును, గడగడవణకె. ఇంద్రుడునెత్తురునువర్షింపజేసె. మఱియు నాసమయమునందు రావణాసురునియొక్కగుఱ్ఱములు స్ఖలనముగలవయ్యె. మఱియునప్పుడారావణాసురునియొక్క ధ్వజాగ్రమునందు గ్రద్దలుతిరుగుచుండె. మఱియు నాసమయమునందు నక్కలుసమీపమునకువచ్చి యమంగళకరములగుకూతలనుబెట్టుచుండె. అప్పుడు రావణాసురునకెడమనేత్రమదరుచుండె. ఎడమభుజమునందు కంపముగలిగె. మఱియునాసమయమునందు రావణాసురునిమోము వెలవెలబోవుచుండె. మఱియునప్పుడారావణుడు గద్గదస్వరముగలవాడయ్యె. అవియన్నియును రావణాసురునకుమరణమునుజూపించునట్టిశకునములని యెల్లవారును మిగులభయమునుబొందుచుండిరి. మఱియును ననేకములగు నపశకునములుగన్పట్టె. మఱియు నాసమయమునందాకాశమునుండియుల్కలపరిమితముగారాలె. మిగులభయంకరమగుధ్వనితోగూడ బిడుగులుపడుచుండె. మఱియును గ్రద్దలపరిమితముగాగుంపుగూడి పరుషముగా గూయుచుండె. అసమ

యమునందు రావణాసురుడు మరణకాలమువచ్చియుండుటచేతను, క్రోధోద్దీపితుడగుటచేతను, మిగులభయంకరములగు నాయాపశకునములను లక్ష్యముచేయడయ్యె. ఆ సమయమునందు మహాత్ములగు రాక్షసులయొక్క రథధ్వనులనువిని వానరులందఱును యుద్ధసన్నద్ధులైరి. అప్పుడు రాక్షసులయొక్కయు, వానరులయొక్కయు, సేనలయందుగలిగినధ్వని మిగులభయంకరమైనదయ్యె. అంతటనా రెండుతెగలవారికిని మిగులభయంకరమగు యుద్ధమయ్యె. ఆసమయమునందు రాక్షసులయొక్కయు వానరులయొక్కయు, నాహ్వానధ్వనులతిశయించె. ఆసమయమునందు క్రోధోద్దీపితుడగు రావణాసురుడు బంగారముచేత నలంకరింపబడిన బాణములచేత ననేకములగుబాణములను వానరసైన్యమునందుబ్రయోగించె.

మఱియు నాసమయమునందు రావణాసురుడు మిగుల దీక్ష్ణములగుబాణములచేత ననేకవేల వానరవీరులయొక్క శిరస్సులనుఖండించె. ఆసమయమునందు గొందఱువానరులుబ్రద్దలుసేయబడిన హృదయములుగలవారైరి. కొందఱు తెగగొట్టబడిన చెవులుగలవారైరి. కొందఱువానరులు నిట్టూర్పులనుగూడవిడువజాలక మరణమునుబొందిరి. కొందఱువానరులు రావణాసురునిబాణములచేత పార్శ్వములయందుగొట్టబడినవారై మరణమునుబొందిరి. కొందఱు వానరులుబ్రద్దలుసేయబడిన శిరస్సులుగలవారై మరణమునుబొందిరి. కొందఱువానరులు నేత్రహీనులైమరణమునుబొందిరి. ఆసమయమునందు రావణాసురుడుకోపోద్దీపితుడై యాయుద్ధరంగమునందే యేదిక్కునకుబోవునో యాయాదిక్కునందలి వానరులందఱును రావణాసురునియొక్కబాణవేగమునుసహింపలేకపోయిరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి తొంబదాఱవసర్గ ముగిసెను.

—* వానరులును రాక్షసులును యుద్ధముజేయుట. *—

అవ్విధముగ రావణాసురునియొక్క తీవ్రములగు బాణములచేత ఛేదింపబడుటవలన మరణమునుబొందినవానరులచేత యుద్ధభూమియంతయును, వ్యాప్తమయ్యె. ఆసమయమునందు వానరులందఱును, శలభములుప్రజ్వలించుచున్నదీపమును సహింపలేనివిధముగ రావణాసురునిబాణవేగమునుసహింపజాలక మరణమునుబొందిరి. మఱియు నాసమయమునందు రావణాసురునిబాణములచేత పీడింపబడినవానరులు, దావానలమునందు బ్రవేశించినయేనుగులవలె దల్లడిల్లి మరణమునుబొందుదురు. మఱియునప్పుడువానరసైన్యమంతయును, రావణాసురునియొక్క తీవ్రములగుబాణములచేత వాయువులచేత మేఘములుచిమ్మివేయబడినవిధముగ జిమ్మబడియె. అవ్విధముగారావణాసురుడువానరులతో మిగులభయంకరమగు యుద్ధమునుజేసియావానరులనందఱనోడించె. పిమ్మటనతిశీఘ్రగమనముగలవాడై రాముడున్నచోటునకుబోయె. ఆసమయమునందు మిగులభయముచేత బరుగెత్తుచున్న వానరులనుజూచి సుగ్రీవుడపరిమితమగు కోపముగలవాడై సుషేణునిగుల్మమునందునిలిపి యద్భుతమగుయుద్ధమునుజేసె. అవ్విధముగగుల్మమునందు దనకుసమానుడును, వానరోత్తముడును, నగు సుషేణునినిలిపి సుగ్రీవుడుమిగులపెద్దదగు వృక్షమును నాయుధముగా ధరించినవాడై శత్రువగురావణాసురునకభిముఖముగాబోయె. ఆసమయమునందా సుగ్రీవునకుపార్శ్వభాగమునందును, పృష్ఠభాగమునందును ననేకవేలవానరవీరులు, వృక్షములను, పర్వతములను,ఆయుధములనుగాధరించి బయలువెడలిరి. ఆసమయమునందు సుగ్రీవుడు మిగులభయంకరారావముగలుగునట్లు సింహనాదమునుజేయుచు రాక్షససైన్యమునందుబ్రవేశించి యతిభయంకరులగు ననేకవేలరాక్షసులను వృక్షముతోగొట్టి క్రిందబడవైచె. మఱియు నాసమయమునందు మిగులగొప్పదగుశరీరముగలవాడును, వానరాధిపతియును, నగుసుగ్రీవుడు ప్రళయకాలమునందలి వాయువు మిగులపెద్దవగు వృక్షములనుబడవైచినవిధముగ గ్రిందబడవైచె. మఱియు నాసమయమునందు వానరులందరునురాక్షసులమీద, మేఘుడువనమునందలి పక్షులయందు వడగళ్ళవర్షమును, గురిపించినవిధముగ శిలావర్షమునుగురిపించె. ఇవ్విధముగసుగ్రీవునిచేతగురిపింపబడిన శిలావర్షముచేత రాక్షసులందరును బ్రద్దలుసేయబడిన శిరస్సులుగలవారైక్రిందబడిరి. అవ్విధముగవానరులచేత గురిపింపబడిన శిలావర్షముచేత రాక్షసులందరును మరణమునుబొందుసమయమునందుమిగులభయంకరములగు దీనాలాపములనుజేసిరి. వానరులందరును సంతోషముచేత సింహనాదములనుజేసిరి. అదియంతయునుజూచి యాసమయమునందు విరూపాక్షుడను రాక్షసోత్తముడపరిమితమగు కోపముగలవాడై రథముమీదినుండి యేనుగుమీదికిదుమికె. మహారథుడగు విరూపాక్షుడవ్విధముగానేనుగునెక్కి భయంకరమగు సింహనాదమునుజేయుచు వానరాభిముఖుడైపోయె. పిమ్మటవానరసేనాముఖమునందునిలిచి మిగులభయంకరమగు యుద్ధమునుజేయుచున్న సుగ్రీవునిమీద మిగులదీక్ష్ణములగు ననేకవే

ల బాణములను బ్రయోగించె. అవ్విధముగ విరూపాక్షుని చేత బ్రయోగింపబడినవియును, మిగుల దీక్ష్ణములైనవియును, నగుబాణములచేత గొట్టబడిన సుగ్రీవుడపరిమితమగు కోపముగలవాడై యావిరూపాక్షుని జంపదలచె. పిమ్మట శూరుడగు సుగ్రీవుడు మిగుల గొప్పదగు వృక్షము నుధరించి యతివేగముతోబోయి యావిరూపాక్షుని యేనుగుయొక్క ముఖము బ్రద్దలగునట్లుకొట్టె. అవ్విధముగా సుగ్రీవునిచేత గొట్టబడిన యాయేనుగు నిలువజాలక బారెడుదూరము వెనుకకుబోయె. మఱియు నాబాధకు దాళజాలక ఘీంకారమును జేసె. అవ్విధముగ భీతినొందిన యేనుగునుండిక్రిందికిదుమికి వీర్యవంతుడగు నావిరూపాక్షుడు విరోధియగు సుగ్రీవునకభిముఖముగా బయలువెడలె. అంతట స్వల్పమగు పరాక్రమముగల యావిరూపాక్షుడు, ఋక్షచర్మమును, ఖడ్గమును, ధరించి యుండె. ఆసమయమునందు సుగ్రీవుడు అపరిమితమగు కోపముగలవాడై మిగులగొప్పదియును, మేఘముతో సమానమైనదియును, నగు శిలను విరూపాక్షునిమీద బ్రయోగించె. అవ్విధముగసుగ్రీవునిచేత బ్రయోగింపబడినదియును, తనమీదికివచ్చుచున్నదియును, నగు శిలను జూచి విరూపాక్షుడు అపరిమితమగు కోపముగలవాడై ఖడ్గముచేత నాశిలను ఖండించివైచె. పిమ్మట బలవంతుడగు రాక్షసునిచేత ఖడ్గముచేత గొట్టబడినవాడును, వీరుడును, నగు సుగ్రీవుడు కొంచెముసేపు మూర్ఛనొందిన వాని చందముగ గ్రిందబడెను. అంతగొంతసేపటికి దెలివొంది లేచి యపరిమితమగు కోపముగలవాడై వజ్రాయుధముతో సమానమగు పిడికిలిచేతబొడిచె. అవ్విధముగ సుగ్రీవునియొక్క పిడికిలిచేత గొట్టబడిన విరూపాక్షుడు గోపోద్దీపితుడై ఖడ్గముచేత సుగ్రీవునియొక్క సేనాముఖమందున్న యనేకవేల వానరవీరులను ఖండించె. మఱియు నాసమయమునందు సుగ్రీవుని, పాదములతో దన్నె. ఆదెబ్బచేత సుగ్రీవుని కవచము శిథిలమై క్రిందబడెను. అంతట సుగ్రీవుడు అపరిమితమగు కోపముగలవాడై వజ్రాయుధముయొక్క సారమువంటి సారముగల పిడికిలితో నావిరూపాక్షుని గొట్టుటకు నుంకించె. అంతట నావిరూపాక్షుడు సుగ్రీవునియొక్క పిడికిలిని విడిపింపజేసి మరల నాసుగ్రీవునియొక్క వక్షస్థలము బ్రద్దలగునట్లు గొట్టె. అంతట వానరాధిపతియగు సుగ్రీవుడు మిగుల కోపముగలవాడై యావిరూపాక్షుని గొట్టుటకు దగిన యవకాశమును వెదకుచుండె. అంతగొంతసేపటికి ఆవిరూపాక్షునియొక్క లలాట ప్రదేశము బ్రద్దలగునటుల గుద్దె ఆపిడికిటిపోటు వజ్రాయుధముయొక్క దెబ్బతో సమానమైనదైయుండె. ఆసమయమునందు ఆవిరూపాక్షుడు నెత్తురునుగ్రక్కె. అప్పుడు విరూపాక్షుడు ప్రస్రవణాచలమునుబోలియుండె. మఱియు నాసమయమునందు, త్రిప్పబడుచున్న నేత్రములుగలవాడును, నోటనురుగును విడుచుచున్నవాడును, నెత్తురుచేత వ్యాప్తమైన దేహము గలవాడును, వికృతములగు నేత్రములు గలవాడును, దీనముగా ధ్వనిని జేయుచున్నవాడును, నగు విరూపాక్షునిజూచి వానరులందఱును పరమానందమును బొందిరి. అంతట నాయిరుతెగలవారికిని మిగుల భయంకరమగు యుద్ధమయ్యె. అప్పుడవ్విధముగా యుద్ధమునుజేయుచున్న వానరులయొక్కయు, రాక్షసులయొక్కయు సైన్యములు సముద్రమును లభంగి కూతలను బెట్టుచు హద్దులను మిగిలి వచ్చుచున్న సముద్రములను బోలియుండె. మఱియును మహాబలవంతుడగు నావిరూపాక్షుడు ఆసమయమునందు మరణమును బొందుటవలన శోకసంతోషములచేత రెండుతెగలవారును నుద్రిక్తులై హద్దు మిగిలి వచ్చుచున్న గంగానదినిబోలియుండిరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి తొంబదేడవ సర్గ ముగిసెను.

మహోదరుడు మొదలగు రాక్షసులుమరణము నొందుట.

అవ్విధముగ నారెండుతెగలవారును మిగులభయంకరమగు యుద్ధమునుజేయుచున్న సమయమునందు రెండుతెగలసైన్యమును, మిగుల గొప్పదగు వేసవికాలమునందు సరస్సుకృశించిపోయిన విధముగ దరిగిపోయెను. ఆసమయమునందు రాక్షసాధిపతియగు రావణాసురుడు తనసైన్యమంతయును నశించుటచేతను, విరూపాక్షుడు మరణమును బొందుటచేతను, అపరిమితమగు కోపము గలవాడయ్యె. మఱియును వానరులచేత జంపబడుటవలన క్షీణించిపోయిన సైన్యము నశించిపోవుటను, దైవయోగము తప్పిపోవుటను, జూచి మిగుల మనోవ్యథగలవాడయ్యె. పిమ్మట సమీపమునందున్నవాడును, శత్రువులను నశింప జేయువాడును, నగు మహోదరుడను వానితో నిట్లనియె.

మిగుల గొప్పదగు భుజబలముగల యోమహోదరా! ఈసమయమునందు జయాశనీయందు నిలిచియున్నది. కావున నోవీరోత్తమా! ఇప్పుడు నీపరాక్రమమును జూపి ఈ వానరసైన్యమును సర్వమును నశింపజేయుము. నావలన జీతమును పుచ్చుకొనినందుకు దగిన యుపకారమును జేయుట కిదితగినకాలమై యున్నది. కాబట్టి నీవు మిగుల భ

యంకరమగు యుద్ధమును జేయుమనియె. పిమ్మట రాక్షసోత్తముడగు మహోదరుడు నివ్విధముగా జెప్పబడినవాడగుటచే నగ్నిజ్వాలా గ్రమునందు శలభము ప్రవేశించినవిధముగ వానరసైన్యమునందు బ్రవేశించె. పిమ్మట మహాబలుడును, తేజోవంతుడును, ప్రభువగు రావణాసురునియొక్క వాక్యముచేతను, తనయొక్క పరాక్రమముచేతను, ప్రేరేపింపబడినవాడునునై యావానరసైన్యమునందు ప్రవేశించి మిగుల భయంకరమగు యుద్ధమును జేసె. ఆసమయమునందు అధికమగు బలముగల వానరులందఱును, మిగుల గొప్పవగు పర్వతములచేత మిగుల భయంకరులగు రాక్షసవీరుల ననేకులను సంహరించిరి. మఱియు నాసమయమునందు ఆ మహోదరుడు బంగారపు పిడ్లుగల బాణములచేత వానరులయొక్క హస్తములను, పాదములను, తొడలను, నరికివైచె. అంతట వానరులందఱును, రాక్షసవీరులచేత నపరిమితముగా బీడింపబడినవారై నానాదిక్కులకు బరుగిడిరి. కొందఱు సుగ్రీవునొద్దకుబోయిరి. అవ్విధముగ రాక్షసవీరులచేత జంపబడినదియును, నానాదిక్కులకు భయముచేత బరుగెత్తుచున్నదియును, నగు వానరసైన్యమును జూచి సుగ్రీవుడు మహోదరునితో యుద్ధమును జేయుటకు బరుగిడివచ్చె. అట్లువచ్చిన వానరాధిపతియగు సుగ్రీవుడు మిగుల భయంకరమైనదియును, మిగుల పెద్దదియును, మిగుల గొప్పదగు పర్వతముతో సమానమైనదియును, నగు నొక్కశిలను నామహోదరునిమీద బ్రయోగించె. అట్లుసుగ్రీవునిచేత బ్రయోగింపబడినదియును, తనమీదికివచ్చుచున్నదియును, నగు శిలనుజూచి యామహోదరుడు కొంచెమైనను భయములేనివాడై మిగుల దీక్ష్ణములగు బాణములచేత నాశిలనుఖండించె. అంతట నాశిల గ్రద్దల సమువాయము తునిగి క్రిందబడిన విధముగా అనేక తునుకలై క్రిందబడిమె. అవ్విధముగ ననేకతునుకలై క్రిందబడుటనుజూచి సుగ్రీవుడు అపరిమితమగు కోపముగలవాడై మిగుల గొప్పదగు నేపిచెట్టును పెల్లగించి యారాక్షసుని శిరస్సుమీద బ్రయోగించె.

అప్పుడు ఆ నృశుమును శత్రుపట్టణములను జయించుటయందు దగిన సామర్థ్యము గలవాడును, శూరుడును, నగు మహోదరుడు మిగుల దీక్ష్ణములగు బాణములచేతఖండించె. అంతట సుగ్రీవుడు అపరిమితమగు కోపముగలవాడై క్రిందజారిపడిన మహోదరునియొక్క పరిఘయనునాయుధమును గ్రహించి యామహోదరునియొక్క గుఱ్ఱములనుగొట్టె. అంతట నాగుఱ్ఱములు మరణమునుబొందె. అవ్విధముగ గుఱ్ఱములు క్రిందబడిన పిమ్మట మిగుల గొప్పదగు రథమునుండి క్రిందదుమికి యధికమగు కోపముగలవాడై గదయను నాయుధమును గ్రహించె. అట్లు గదాపరిఘలను నాయుధములను గ్రహించి యుద్ధసన్నద్ధులైనవృషభములవలె రంకెలువేయుచుండిరి. మరియును మెఱుపుల తోగూడుకొనిన మేఘములను బోలియుండిరి. అంతట రాక్షసాధిపతియగు మహోదరుడు కోపోద్దీపితుడై సూర్యునియొక్క తేజస్సువంటి తేజస్సుగలదియును, మిగులమనోహరమైనదియును, నగు గదయను నాయుధమును సుగ్రీవునిమీద బ్రయోగించె. అట్లు మహోదరునిచేత బ్రయోగింపబడినదియును, తనకభిముఖముగా వచ్చుచున్నదియును మిగుల భయంకరమైనదియును, నగు నాగదను, సుగ్రీవుడు కోపోద్దీపితుడై తనచేతనున్న పరిఘయను నాయుధముచేత విఱుగగొట్టె. ఆసమయము నందు సుగ్రీవుని చేతియందలి పరిఘయను నాయుధముగూడ విరిగిక్రిందబడెను. అంతట నధికమగు తేజస్సుగల సుగ్రీవుడు మిగులవేగముతో యుద్ధభూమియందలి భయంకరమగు ముసలమను నాయుధమునగ్రహించె అట్లుగ్రహించి మరల మహోదరుడు ప్రయోగించిన గదమీద ప్రయోగించె. అంతట నవి రెండును తునుకలై క్రిందబడియె. అంతట నయ్యిరువురును ప్రజ్వలించుచున్న యగ్నులవలె వెలుంగుచు ముష్టియుద్ధమును జేయుటకు ఆరంభించిరి.

ఆసమయమునందయ్యిరువురును పిడికిటిపోటులతోగొట్టుకొనిరి. మరియు నతిభయంకరారావము గలుగునట్లు సింహనాదములను జేసిరి. అంతట భూమి యదరునట్లు పాదఘట్టనములను జేయుచు పాదతలములతోడను, హస్తతలములతోడను, యుద్ధమును జేసిరి. మరియు నయ్యిరువురును నొకరిమీద నొకరు, ఎగిరిదుముకుచు భయంకరమగు యుద్ధమును జేయుచుండిరి. మరికొంతసేపయ్యిరువురును భుజములతో యుద్ధమును జేసిరి. అవ్విధముగ చాలసేపు యుద్ధమును జేయుటచేత మిగుల శ్రమ నొందినవారైరి. అప్పుడు మహోదరుడు అపరిమితమగు కోపముగలవాడై తనసమీపమునందున్న ఖడ్గమును, చర్మమును గ్రహించి యుద్ధసన్నద్ధుడయ్యె. అప్పుడు వానరాధిపతియగు సుగ్రీవుడును నపరిమితమగు కోపముగలవాడై యుద్ధభూమియందు బడియున్న చర్మ ఖడ్గములను జైకొనియె. అవ్విధముగ నాయుధపాణులును, అపరిమితమగు కోపముగలవారును, అధికమగు తేజస్సుగలవారును, నగు మహోదరసుగ్రీవులు పరస్పరజయేచ్ఛచేత నొకరిమీదనొకరుదుమికిరి. పిమ్మట నొకరిమీద నొకరయ్యాయుధములను బ్రయోగించిరి. ఆసమయమునందు సుగ్రీవుడు అపరిమి

తమగు కోపముగలవాడై ఖడ్గముచేత నామహోదరుని శిరస్సును కుండలములతోగూడ నరికె.

అంతట నామహోదరుడు క్రిందబడియె. అంతట రాక్షససైన్యమంతయును మహోదరుని మరణమును జూచి మిగుల భయముగలదై యచ్చోట నిలువజాలకపోయె. అవ్విధముగ నామహోదరుని జంపిన సుగ్రీవుడు అపరిమితమగు సంతోషముచేత సింహనాదమునుజేసె. ఆసమయమునందు రాముడు పరమ సంతోషముగలవాడయ్యె. రావణాసురుడు అపరిమితమగు కోపముగలవాడయ్యె. మఱియునాసమయమునందు రాక్షసులందఱునుదీనులును, వ్యసనముగలవారును, భయముగలవారునునై నానాదిక్కులకు బరుగిడిరి. అవ్విధముగ సూర్యపుత్రుడగు సుగ్రీవుడు మిగులగొప్పదగు పర్వత ప్రదేశమునందు మహాబలవంతుడగు మహోదరునిజంపిజయలక్ష్మితోడను, తనయొక్క తేజస్సుతోడను, గూడుకొనినవాడై సూర్యునివలె జూడనలవిగానివాడైయుండెను.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి తొంబదేనిమిదవ సర్గ ముగిసెను.

మహాపార్శ్వుడు అంగదునిచే మరణము నొందుట.

అట్లు సుగ్రీవుడు మహోదరుని జంపినపిమ్మట మహాబలుడగు మహాపార్శ్వుడు అపరిమితమగు కోపముచేత నెఱ్ఱనగాజేయబడిన నేత్రములుగలవాడై మిగుల దీక్ష్ణములగు బాణములచేత నంగదునియొక్క సైన్యమును సర్వమును అధికముగా బాధించె. అంతట నామహాపార్శ్వుడు అపరిమితమగు కోపముగలవాడై వానరోత్తములయొక్క శిరస్సులనుద్రుంచి క్రిందబడవైచె. ఆసమయమునందు వానరుల శిరస్సులు తాడిచెట్లవలన ఫలములు క్రిందబడునట్లు పడుచుండె. అంత నాసమయమునందు మిగుల దీక్ష్ణములగు బాణములచేత వానరులయొక్క మూపురములను ఖండించి క్రిందబడవైచె. అంతట వానరులందఱును మహాపార్శ్వుని బాణవర్షముచేత మిగుల నధికముగా బీడింపబడినవారును, వ్యసనముగలవారును, నై క్రిందబడిరి. ఆసమయమునందు అంగదుడు, మహాపార్శ్వుడను రాక్షసోత్తమునిచేత బీడింపబడినదియును, మిగుల నుద్వేగముగలదియును, నగు వానరసైన్యమునుజూచి పర్వకాలమునందు వృద్ధినొందిన సముద్రునివలె విజృంభించె. అంతట వానరోత్తముడగు నంగదుడు సూర్యునియొక్క కిరణములతో సమానమగు కాంతిగలదియును, ఇనుముతో జేయబడినదియును, నగు పరిఘుయను నాయుధమును మహాపార్శ్వుడను రాక్షసోత్తమునియందు బ్రయోగించె.

అంతట నాయాయుధముయొక్క దెబ్బచేత మహాపార్శ్వుడు క్రిందబడి మూర్ఛనొందె. అట్లు మహాపార్శ్వుడు సూతునితోగూడ మూర్ఛనొంది రథముమీద బడియుండె. అంతట జాంబవంతునితో గూడుకొనిన యంగదుడు మిగుల గోపముగలవాడును, నీలపర్వతముతో సమానమైనవాడును, తేజోవంతుడును, గొప్పదగు పరాక్రమముగలవాడునునై తనవానరసమూహములోనుండి బయలువెడలి పర్వతశిఖరముతో సమానమైనదియును, మిగుల గొప్పదియునునగు శిలచేత మహాపార్శ్వునియొక్క గుఱ్ఱములను జంపె. మఱియు నాశిలను మహాపార్శ్వునిమీద బ్రయోగించె. అప్పుడు మహాపార్శ్వుడు కొంచెముసేపు తెలివిలేక క్రిందబడియుండె,అంతట గొంతసేపటికిమహాబలుడగు మహాపార్శ్వుడు మిగులతీక్ష్ణములగుబాణములచేతనంగదుని గొట్టె. జాంబవంతునియొక్క వక్షస్థలమునందుమూడుబాణములనుబ్రయోగించె. బల్లూకాధిపతియగుగవాక్షునిమీద అనేకములగు తీక్ష్ణబాణములనుబ్రయోగించె. అప్పుడు అంగదుడుమహాపార్శ్వునిచేత బీడింపబడినజాంబవంతుని,గవాక్షునిజూచి అపరిమితమగు కోపముగలవాడై పరిఘుయను నాయుధమునుగ్రహించి యామహాపార్శ్వునిమీద బ్రయోగించె. ఆపరిఘుము మిగుల భయంకరమైనదియును, సూర్యునికిరణముల కాంతివంటికాంతిగలదియునునై యున్నది. అట్లుమిగులగొప్పదగు తేజస్సుతో గూడుకొనిన యాగదను నంగదుడు రెండుభుజములచేతను, గిరగిరద్రిప్పి మహాపార్శ్వుని జంపుటకొఱకు బ్రయోగించె. అవ్విధముగ అంగదునిచేత బ్రయోగింపబడిన యాపరిఘుమను నాయుధముపోయి మహాపార్శ్వునియొక్క ధనుర్బాణములను, శిరస్త్రాణమును జూర్ణముసేసె. అంతట అంగదుడు అపరిమితమగు వేగముతోబోయి మహాపార్శ్వునియొక్క చెవిగూబయందు కర్ణకుండలములు గ్రిందబడునట్లు పిడికిటితో బాడిచె. అంతట అధిక తేజోవంతుడగు మహాపార్శ్వుడు అపరిమితమగు కోపముగలవాడై యొక హస్తముచేతనే మిగుల గొప్పదగు గండ్రగొడ్డలియను నాయుధమును గ్రహించె. అంతట నామహాపార్శ్వుడు తైలముచేత గడుగబడినదియును, నిర్మలమైనదియును, పర్వతముయొక్క సారమువంటి సారముగలదియును, దృఢమైనదియును, నగు నాగండ్రగొడ్డలిని మిగుల గోపముతో అంగదునిమీద బ్రయోగించె. అంతట అంగదుడు మిగుల నేర్పరితనముతో నాగండ్రగొడ్డలి తనమీద బడకుండునట్లుచేసికొని అపరిమితమగు

కోపముగలవాడై వజ్రాయుధముతో సమానమగు పిడికిలిచేత నామహాపార్శ్వునియొక్క ఱొమ్మునందు మిగుల వేగముతోగొట్టె. ఆదెబ్బ వజ్రాయుధముయొక్క దెబ్బతో సమానమైయుండె. ఆదెబ్బచేత ఆమహాపార్శ్వునిహృదయము బ్రద్దలయ్యె. అంతట నామహాపార్శ్వుడు క్రిందబడిమరణమునుబొందె.

అట్లు మహాపార్శ్వుడు మరణమును బొందగానే యతనిసైన్యము సర్వమును మిగుల వ్యసనమునుబొందె. ఆసమయమునందు రావణాసురునకు అపరిమితమగు కోపము వచ్చె. వానరులందఱును అపరిమితమగు సంతోషము గలవారై సింహనాదములను జేసిరి. ఆ సింహనాదధ్వనులచేత లంకాపట్టణమును ప్రాకారములు మొదలగునవి యన్నియును బ్రద్దలయ్యె. మఱియు నాసింహనాదధ్వనులు దేవేంద్రుడు జయించినపుడు దేవతలుసేసిన సింహనాదధ్వనులను బోలియుండె. మఱియు నాసమయమునందు ఆకాశమున నివసించియున్న దేవతలందఱును అపరిమితమగు సంతోషముచేత సింహనాదములను జేసిరి. అట్లు దేవతలును, వానరులును జేసిన సింహనాదధ్వనులనువిని రావణాసురుడుఅపరిమితమగుకోపముగలవాడై మరల యుద్ధసన్నద్ధుడైనిలిచె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి తొంబదితొమ్మిదవ సర్గముగిసెను.

రామ రావణు లిరువురును యుద్ధము జేయుట.

అవ్విధముగ మహోదర మహాపార్శ్వులును, మహాబలుడగు విరూపాక్షుడునుమరణమును బొందినపిమ్మట రావణాసురుడు అపరిమితమగు కోపముగలవాడయ్యె. పిమ్మట సూతుని ప్రేరణచేయదలచి యిట్లనియె. సూతుడా! రాక్షసోత్తములగు మనవారిలను జంపుటవలనను, మనపట్టణమును నాక్రమించుటవలనను, గలిగిన దుఃఖమును బోగొట్టగలను. మఱియు నోసూతుడా! సీతయను పుష్పఫలముగలదియగు రాముడను వృక్షమును జంపెద. మఱియు నావృక్షమునకు శాఖలగు సుగ్రీవుడు, జాంబవంతుడు, కుముదుడు, నళుడు, మైందుడు, ద్వివిదుడు, అంగదుడు, గంధమాదనుడు, హనుమంతుడు, సుషేణుడు, మొదలగు వానరంలనందఱను నశింపజేయుదుననియె. అంతట నతిరధుడును, మిగులగొప్పవాడును, నగు రావణాసురుడు పదిదిక్కులయందును, ధ్వనిగలుగజేయుచు రాముడున్నచోటునకు రథమునుదోలించె. ఆరథధ్వనిచేత నదులు, పర్వతములు,కాననములు, వరాహములు, మృగములు, ఏనుగులు మొదలగువానితో గూడుకొనిన భూమియంతయును, గంపమునుబొందె. అంతట రావణాసురుడు కోపోద్దీపితుడై మిగుల భయంకరమైనదియును, మిగుల క్రూరమైనదియును, నగు తామసాస్త్రమును బ్రయోగించె. ఆయస్త్రము వలన అనేకవేల వానరవీరులను సంహారించె. అప్పుడనేకులగు వానరవీరులు భయముచేత నానాదిక్కులకు బరుగెత్తిరి. అట్లు వానరవీరులు పరుగెత్తుటవలన అపరిమితమగు దుమ్ముబయలువెడలె. అంత నాదుమ్ము సహింపగూడనిదైయుండె.

మఱియు నాసమయమునందు మిగుల దీక్ష్ణములగు ననేకవేల బాణములచేత ననేకవేల వానరవీరులను సంహరించె. అవ్విధముగ అనేకవేల వానరవీరులు నశించుటను రాముడు సూచె. మఱియు నాప్రకారముగా రావణాసురుడు వానరసైన్యమును సర్వమునుదరిమి పిమ్మట యుద్ధమునుజేయుచున్నవాడును, శత్రువులచేత బరాభవమును బొందనివాడును, నగు రామునిజూచె. ఆసమయమునందు లక్ష్మణునితోగూడుకొనిన రాముడు విష్ణుదేవునితో గూడుకొనిన దేవేంద్రునిబోలియుండె. మఱియు ఆకాశమువఱకును వ్యాపించిన గొప్పదగు ధనుస్సును ధరించియున్నవాడును, పద్మపత్రములవలె విశాలములగు నేత్రములుగలవాడును, పొడవులగు భుజములుగలవాడును, నగు రామునిజూచి రావణాసురుడు అపరిమితమగు కోపముగలవాడయ్యె. అంతట అధికమగు తేజస్సుగలవాడును, బలవంతుడును, నగు రాముడు యుద్ధమునందు భగ్నులైపోవుచున్న వానరులను, తనకభిముఖముగా వచ్చుచున్న రావణాసురుని జూచి అపరిమితమగు సంతోషముగలవాడగుచు మిగులశ్రేష్ఠమగు ధనుస్సును గ్రహించె. పిమ్మట భూమ్యంతరిక్షములు బ్రద్దలగునట్లు ధనుష్టంకారమును జేసె. ఆసమయమునందు రామునియొక్క బాణములచేతను, ధనుష్టంకారముచేతను, భూమ్యంతరిక్షములు బ్రద్దలగునట్లుండె.

మఱియు నాసమయమునందు రాముని బాణములచేత ననేకవేల రాక్షసవీరులు మరణమును బొందిరి. ఆసమయమునందు రావణాసురుడు రామలక్ష్మణులయొక్క బాణములకు గోచరుడయ్యె. అప్పుడు రావణాసురుడు చంద్రసూర్యులయొక్క సమీపమునందు సంచరించునట్టి రాహువువలె బ్రకాశించుచుండె. మఱియు నాసమయమునందు లక్ష్మణుడు రావణాసురునితో ముందుగ యుద్ధమును జేయదలచిధనుస్సును జెవివఱకునులాగి యగ్నితో సమానములగు బాణములను బ్రయోగించె. అప్పుడు అధికమగు తేజస్సుగల రావణాసురుడు ధనుర్ధారులలో నుత్తముడగు

లక్ష్మణునిచేత ప్రయోగింపబడిన బాణములను, రావణాసురుడు మిగుల దీక్ష్ణములగు బాణములచేతనివారించె. మఱియు నారావణాసురుడొక్క బాణముచేత నొక్కబాణమును, మూడుబాణములను, మూడుబాణములచేతను,పదిబాణములను పదిబాణములచేతను, ఛేదించె.

ఇవ్విధముగ రావణాసురుడు తనదుహస్తలాఘవమును జూపి పిమ్మటబర్వతముతో సమానుడగు రామునియొద్దకుబోయెను. పోయియారావణాసురుడు కోపముచేతనెఱ్ఱనైన నేత్రములుగలవాడై రావణాసురునిమీద ననేకవిధములగు బాణవర్షములను గురిపించె. అవ్విధముగ రావణాసురునిచేత బ్రయోగింపబడిన బాణములను రాముడుమిగుల దీక్ష్ణములగు బాణములచేత నివారించె. అంతటరఘుకులోద్భవుడగు రాముడుమరల రావణాసురునిచేత బ్రయోగింపబడినవియును, మిగులభయంకరములైనవియును, కోపమునుబొందిన సర్పములతో సమానములైనవియును, నగుబాణ సముదాయములను మిగులదీక్ష్ణములగు బాణములచేత ఖండించె. మరియునాసమయమునందు రాముడు రావణాసురునిమీదను, రావణాసురుడు రామునిమీదను, మిగుల భయంకరమగు బాణవర్షమును గురిపించిరి. మరియు నారామలక్ష్మణులు బాణవేగములను జిమ్ముచున్నవారును, అపరిమితముగా యుద్ధమును జేయుచున్నవారునునై మిగుల జిత్రములగు సవ్యదక్షిణగతుల తోసంచరించిరి. మరియును నారామరావణులు నానావిధములగు బాణములను బ్రయోగించుచు యమరుద్రులతో సమానులై యుండిరి. మరియును, ఆసమయమునందు సకలభూతములును భయమును బొందుచుండె

అప్పుడు రామరావణులచేత బ్రయోగింపబడినబాణములంతరిక్షమునందు వ్యాపించినవై వర్షాకాలమునందలి మెఱుపులతోగూడిన మేఘములను బోలియుండె. మఱియును బాణవర్షములచేత నాకాశమంతయునుగవాక్షములుగలదానివలె బ్రకాశించుచుండె. మఱియు నారామరావణుల బాణములు మిగులవేగముగలదియును, తీక్ష్ణములైన యగ్రభాగములు గలవియునుమిగులశ్రేష్ఠములగు ఱెక్కలుగలవియునునైయుండె. మఱియునాసమయమునందు రామరావణులు సూర్యుడుఅస్తమించినపిమ్మటనుండునట్టి మేఘములు మిగులగొప్పదగు చీకటినిగల్పించిన విధముగ బాణవర్షముచేత నపరిమితమగు చీకటినిగల్పించిరి. మరియు నొకరినొకరు చంపవలయునని మెండు కోరికగలరామరావణులు వృత్రాసురుడును, ఇంద్రుడును, యుద్ధమును జేసినవిధముగ యుద్ధమునుజేసిరి. మరియుమిగుల శ్రేష్ఠములగు ధనుస్సులుగలవారును, శస్త్రవిద్యయందు బండితులును, అస్త్రవేత్తలలో ముఖ్యులును, నగునయ్యిరువురును, యుద్ధమునందు సంచరించిరి. మరియునతివేగముగల బాణములను తరంగములుగల యారామరావణులు వాయువుచేత గొట్టబడిన సముద్రములను బోలియుండిరి. ఆసమయమునందు సకలలోకములవారిని నేడిపించిన రావణాసురుడు రామునియొక్క లలాటమునందు బాణపరంపరల నపరిమితముగా బ్రయోగించె. మరియునప్పడు రాముడు, భయంకరమగుధనుస్సువలన బ్రయోగింపబడినవియును, నల్లనికలువరేకులతో సమానమగు కాంతిగలవియును, నగుబాణపరంపరలు లలాటమునందు దగులుకొనుటచేత గొంచెమైనను భయమును బొందనివాడయ్యె.

అంతటరాముడు అపరిమితమగు కోపముగలవాడై రౌద్రాస్త్రమును బ్రయోగింపదలచి యనేకములగు బాణములను, మంత్రోచ్చారణసహితముగా ధనుస్సునందు సంధానమునుజేసె. పిమ్మట నధికమగు తేజస్సుగలవాడును, వీర్యవంతుడును, నగురాముడు ధనుస్సునులాగి ప్రయోగించె. అంతట నాబాణములన్నియును, మిగులగొప్పదగు మేఘముతో సమానమగు కవచమునందుబడెను. అవ్విధముగ రావణాసురునియొక్క కవచమునందుబడిన బాణములన్నియును, అభేద్యమగు నాకవచమును భేదింపదాయెను. మరియునప్పుడు యుద్ధమునందు సకలాస్త్రములను బ్రయోగించుటయందధికమగు సామర్థ్యముగల రాముడు, రాక్షసాధిపతియును, రథమునందున్నవాడును, నగురావణాసురునియొక్క లలాటమునం దురౌద్రాస్త్రముచేతగొట్టె.అంతట రావణాసురుడు అపరిమితమగు కోపముగలవాడై యారాముని బాణములను బ్రతిహతములుగావించె. అంతలోపల రామునిబాణములు రావణాసురునియొక్క కవచమును భేదించి యైదుతలలుగల సర్పములవలె భూమియందు ప్రవేశించె

అవ్విధముగా, క్రోధోద్దీపితుడగు రావణాసురుడు రఘుకులోద్భవుడగు రామునియొక్క యస్త్రమునునివారించి యంతటితోనూరకుండక యాసురాస్త్రమును బ్రయోగించె. అంతటనాయస్త్రము, సింహవ్యాఘ్రములయొక్క ముఖములవంటి ముఖములుగలవియును, కంకపక్షులయొక్కయు, కాకపక్షులయొక్కయు, ముఖములవంటి ముఖములుగలవియును.గ్రద్దలయొక్కయు, డేగలయొక్కయు, ముఖములవంటిముఖములుగలవియును, నక్కలయొక్క ముఖములవంటిముఖములుగలవియును, ఈహామృగములయొక్క ముఖములవంటి ముఖములుగలవియును, తెర

వబడినవోల్కలవియును, మిగుల భయంకరమైనవియును, అయిదుతలలుగల సర్పములయొక్క నాలుకలవలెమిగులభయంకరమైనవియును, నగుబాణములను బుట్టించె. అవియన్నియును రామునిబాధింపదొడంగె. మరియును, కుక్కలయొక్కయు, కోళ్ళయొక్కయు, ముఖములవంటిముఖములు గలవియును, మొసళ్ళయొక్కయు, సర్పములయొక్కయు, ముఖములవంటి ముఖములుగలవియును, గాడిదెలయొక్క ముఖములవంటి ముఖములుగలవియును, అడవిపందులయొక్క ముఖమువంటి ముఖములుగలవియును, నగుబాణములను రామునిమీదప్రయోగించె. మరియు నాసమయమునందు రావణాసురుడు నిట్టూర్పులను విడుచుచున్నసర్పములనుబోలియుండె.

అవ్విధముగ క్రోధోద్దీపితుడగు రావణాసురునిచేత బాధింపబడుచున్న రాముడపరిమితమగు కోపముగలవాడును, మిగుల నుత్సాహముగలవాడునునై యాగ్నేయాస్త్రమును బ్రయోగించె. మరియు నారాముడు, అగ్నిజ్వాలలతో సమానములైన యగ్రభాగములు గలవియును, సూర్యముఖములైనవియును, చంద్రాకారములైనవియును, అర్ధచంద్రాకారములైనవియును, ధూమకేతువుయొక్క ముఖమువంటి ముఖముగలవియును, గ్రహములయొక్కయు, నక్షత్రములయొక్కయు, ముఖములవంటి ముఖములుగలవియును, మెఱుపుతీగలతో సమానములైనవియును, మిగుల దీక్ష్ణములైనవియును, నగుబాణములనుగూడ బ్రయోగించె. అవి యన్నియును, రావణాసురునియొక్క యస్త్రమువలన బుట్టినవియును, మిగులభయంకరములైనవియును, నగుబాణములనన్నింటిని నాశమునొందించె. అంతట నారావణుని బాణములన్నియును నాకాశమునందె నశించె.

అవ్విధముగ ననాయాసముగ రాముడు రావణాసురుని బాణములను నశింపజేయుటనుజూచి కామరూపులగు వానరులందఱును మహాసంతోషముగలవారై యతిభయంకరారావములుగల సింహనాదములను జేసిరి. మరియును సుగ్రీవుడుమొదలగు వానరోత్తములందఱును రాముని ననేకవిధములబొగడిరి. రఘుకులోద్భవుడగు రాముడవ్విధముగ రావణాసురుని యస్త్రమునునశింపజేసి పరమసంతోషముగలవాడయ్యె. అంతట వానరులును నధికసంతోషముగలవారైరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి నూఱవసర్గముగిసెను.

▸❋◂

లక్ష్మణుడు రావణాసురునిబాణముచే మూర్ఛిల్లుట.

అవ్విధముగా నాయస్త్రము ప్రతిహతముకాగానే రాక్షసాధిపతియగు రావణాసురుడు మునుపటికంటె నధికమగు కోపముగలవాడయ్యె. పిమ్మట నధికతేజోవంతుడగు రావణాసురుడు మయబ్రహ్మచేత నిర్మింపబడినదియును, మిగులభయంకరమైనదియును, నగునస్త్రమును రామునిమీద బ్రయోగింపనుద్యమించె.

పిమ్మట నాయస్త్రమువలన శూలములును, గదలును, ముసలములును, మొదలుగాగల యాయుధములు వజ్రాయుధముయొక్క సారమువంటి సారముగలవై బయలువెడలె. మరియు నాయస్త్రమువలన ముద్గరములు కూటములు, పాశములు, ప్రజ్వలించుచున్న వజ్రాయుధములు మొదలగునవి, ప్రళయకాలమునందలి నానావిధములైనవియును, తీక్ష్ణములైనవియును, నగువాయువులవలె బయలువెడలె. అంతట శ్రీమంతుడును, అస్త్రవేత్తలలోపలను త్తముడును, అధికమగు తేజస్సుగలవాడును, రఘుకులోద్భవుడునగు రాముడు ఆరావణాసురుని యస్త్రమును, గాంధర్వాస్త్రముచేత నాశమునొందించె.

అవ్విధముగ మహానుభావుడగు రామునిచేత నారావణాసురుని యస్త్రము ప్రతిహతముకాగానే రావణాసురుడపరిమితమగు కోపముచేత నెఱ్ఱగాజేయబడిన నేత్రములుగలవాడగుచు సౌరాస్త్రమును బ్రయోగించె. అంతట బుద్ధిమంతుడగు రావణాసురునియొక్క ధనుస్సువలన, మిగుల భయంకరముగా బ్రకాశించుచున్నవియును, మిగుల గొప్పవియునగు ననేకచక్రములు బయలువెడలె. అవ్విధముగా బయలువెడలిన యాచక్రములచేత, క్రిందబడుచున్న సూర్యచంద్రాది గ్రహములచేతవలెనే యాకాశమంతయును వ్యాప్తమయ్యె. అంతట రఘుకులోద్భవుడగు రాముడనేకములగు బాణములచేత సౌరాస్త్రమువలన బుట్టినబాణముల నన్నింటిని నశింపజేసె. మరియు ననేకవిధములైనవియును, చిత్రములగునవియును, నగుబాణములను రావణాసురునియొక్క సైన్యాగ్రమునందు బ్రయోగించె. అంతగొంతసేపటికి రావణాసురుని సౌరాస్త్రము నశించె. అప్పుడు రాక్షసాధిపతియగు రావణాసురుడు తనయస్త్రము నశించిపోవుటనుజూచి యధికమగు కోపముగలవాడై రామునియొక్క మర్మస్థానములయందు బదిబాణములను బ్రయోగించె.

అంతట యుద్ధములయందు జయించునట్టివాడును, రఘుకులోద్భవుడునగు రాముడు మిగుల గోపముగలవాడై

రావణాసురునియొక్క సకలావయవములయందును ననేకములగు బాణములనుబ్రయోగించె. ఆసమయమునందధికమగుబలముగలవాడును, రామునకుదమ్ముడును, శత్రువీరులనునశింపజేయుటయందు మిగుల సామర్థ్యముగలవాడును, నగు లక్ష్మణుడుకోపోద్దీపితుడై యేదుబాణములను బ్రయోగించె. పిమ్మటనధికమగు తేజస్సుగల లక్ష్మణుడుమిగులబాణములచేత మనుష్యశిరస్సుగల రావణునిధ్వజమునునపహరించె. మఱియునుమహాబలముగలవాడును, శ్రీమంతుడును, నగులక్ష్మణుడు మఱియొక్కబాణమునుబ్రయోగించి ప్రజ్వలించుచున్న కుండలములుగల సారథియొక్కశిరస్సునుఖండించె. పిమ్మటనాలక్ష్మణుడు మిగులదీక్ష్ణములగు నైదుబాణములచేత, ఏనుగుతొండముయొక్కయాకారమువంటి యాకారముగల రావణునిధనుస్సును ఖండించె. ఆసమయమునందు విభీషణుడుపరుగెత్తుకొనివచ్చిగదాహస్తుడై నల్లనిమేఘములతో సమానములైనవియును, పర్వతములతోసమానములైనవియును, నగు రావణాసురుని గుఱ్ఱములనుజంపె. అట్లుగుఱ్ఱములనుచంపినపిమ్మటరావణాసురుడు మిగులవేగముగలవాడై గొప్పదగు రథమునుండిక్రిందికిదుమికి తమ్ముడగువిభీషణునిమీద నపరిమితమగుక్రోధమునుజూపె.

అంతటనపరిమితమగుసామర్థ్యముగలరావణాసురుడు, ప్రజ్వలించుచున్న వజ్రాయుధముతో సమానమైనదియును, మిగులగ్రూరమైనదియును నగు శక్తియనునాయుధమును, విభీషణునిమీదబ్రయోగించె. అప్పుడులక్ష్మణుడాశక్తినిమూడుబాణములచేత ఛేదించె. ఆసమయమునందువానరులపరిమితముగా సింహనాదములనుజేసిరి. అవ్విధముగలక్ష్మణునిచేత ఛేదింపబడిన యాశక్తిమూడుతునకలై యాకాశంబుననుండి యులుకలురాలినవిధముగ గ్రిందబడియె. ఇంతలోపలరావణాసురుడు మిగులభయంకరమగు మఱియొకశక్తినిబ్రయోగించె. ఆశక్తి యింద్రునియొక్కవజ్రాయుధముతో సమానమైనదియును, మిగులభయంకరమైనదియునునైయుండె. అట్టిమహాశక్తివిభీషణునిమీదికి మహావేగముతోవచ్చుచుండె. ఆసమయమునందు వీరుడగు లక్ష్మణుడు ప్రాణసంశయదశనుబొందియున్న విభీషణునిసమీపమునకువచ్చె. వచ్చియావిభీషణునివిడుపించుటకు, మిగులభయంకరమైనదియును, మిగులగొప్పదియును, నగు ధనుస్సును, నెక్కుపెట్టియారావణునిమీద ఘోరమగు బాణవర్షమునుగురిపించె.

మఱియు నారావణునిశక్తినశింపజేసె. అట్లుమహానుభావుడగు లక్ష్మణునిబాణవర్షమునుభరింపజాలక రావణుడుకొంచెముసేపుతల్లడించె. అంతటదమ్ముడగువిభీషణునివదలిపెట్టె. ఇవ్విధముగ విభీషణునివిడిపింపజేసినపిమ్మట రావణాసురుడు లక్ష్మణునిజూచియిట్లనియె.

ఓరీలక్ష్మణా! నాశక్తిచేత విభీషణుడుమరణమునుబొందకుండునట్లుచేసితివి. ఇట్లుచేసి నీవుమరణమునుబొందుటకంగీకరించితివి. ఈశక్తినినీమీదబ్రయోగించెదను. ఈమహాశక్తి నీహృదయమునుబ్రద్దలుసేసి మరణమునుబొందించును. నాబాహువులనుండి విడిపింపబడిన యీశక్తినీప్రాణములనవశ్యముగహరించుననియె. ఇవ్విధముగాజెప్పి యెనిమిదిఘంటలుగలదియును, మిగులభయంకరమగు ధ్వనిగలదియును, మయునిమాయాబలముచేత నిర్మింపబడినదియును, శత్రువులనునశింపజేయుటయందు దగినసామర్థ్యముగలదియును, మిగులభయంకరమగు తేజస్సుచేత బ్రజ్వలించుచున్నదియును, నగు నాశక్తియనునాయుధమును లక్ష్మణునిమీదబ్రయోగించె. అట్లు ప్రయోగించి మిగులభయంకరమగు ధ్వనిగలుగునట్లుగా సింహనాదమునుజేసె. అవ్విధముగ నపరిమితమగుకోపముగల రావణాసురునిచేతబ్రయోగింపబడినదియును, పిడుగుయొక్క ధ్వనివంటిధ్వనిగలదియును, నగు నాశక్తియనునాయుధము మహావేగముతోవచ్చి లక్ష్మణునిదాకె. అవ్విధముగ రావణాసురునిచేతబ్రయోగింపబడి లక్ష్మణునిమీదికివచ్చుచున్న శక్తియనునాయుధమునుజూచి రాముడులక్ష్మణునకు క్షేమముగలుగవలయుననియును, ఆశక్తి వ్యర్థమైనసామర్థ్యముకలదిగావలయుననియును నాశీర్వదించె. మఱియు నవ్విధముగారావణునిచేత బ్రయోగింపబడినదియును, క్రోధోద్దీపితమగు సర్పముతోసమానమైనదియును, మిగులవేగముగలదియును, నగు నాశక్తిమహావేగముతోవచ్చి లక్ష్మణుని ఱొమ్మునదాకె. అంతటనాశక్తియొక్కదెబ్బకురాలజాలక లక్ష్మణుడు క్రిందబడియె. అట్లు క్రిందబడినలక్ష్మణునిజూచి రఘుకులోద్భవుడును, మిగులనధికమగుతేజస్సుగలవాడును, నగు రాముడువ్యసనముతోగూడిన మనస్సుగలవాడయ్యె. అంతగొంతసేపుకన్నీళ్ళచేత వ్యాప్తమైనకన్నులుగలవాడయ్యె. అంతటబ్రళయకాలమునందలి యగ్నివలెనపరిమితమగు కోపముగలవాడయ్యె. పిమ్మటరఘుకులోద్భవుడగునారాముడిది దుఃఖమునుబొందుటకు దగినకాలముగాదనియాలోచించె. అవ్విధముగనాలోచించి రావణాసురునితో మిగులభయంకరమగు యుద్ధమునుజేసె. మఱియునానావిధప్రయత్నములతో లక్ష్మణునిజూచుచుండె. మఱియు నాసమయమునందు రాముడుశక్తిచేత లక్ష్మణుడుహతుడయ్యెనని నిశ్చయించె. మఱియు నాసమయము

నందువానరవీరులు మిగులబ్రయత్నముజేసియును రావణాసురునిచేత బ్రయోగింపబడిన శక్తినివారింపజాలకపోయిరి. మఱియు నారావణునిబాణములచేత నపరిమితముగాబీడింపబడిరి. ఆసమయమునందురావణాసురునిచేత బ్రయోగింపబడిన శక్తియనునాయుధములక్ష్మణునిశరీరమును దూటుచేసికొనిపోయిభూమియందుబ్రవేశించె. అప్పుడురాముడుహస్తములచేతమిగులభయంకరమగు నాశక్తియను నాయుధమునుబట్టుకొనివిరిచివైచె. ఆసమయమునందు బలవంతుడగురావణుడురామునియొక్క సర్వావయవములయందును, నానావిధములైనవియును, మిగులదీక్ష్ణములైనవియును నగు ననేకబాణములనుబ్రయోగించె. ఆబాణములనన్నిటిని లక్ష్యముసేయక రాముడుప్రేమచేత దమ్ముడగు లక్ష్మణునిగాగిలించుకొని హనుమత్సుగ్రీవులతో నిట్లనియె.

'నరోత్తములారా! మీరీలక్ష్మణునిగాపాడుచు నిక్కడనుండుడు. చిరకాలమునుండి యోచించుచున్న నాకుబరాక్రమమునుజూపించుటకు దగినకాలమువచ్చినది. పాపాత్ముడును, పాపకృత్యములనేచేయువాడును నగు నీరావణుడువధింపదగినవాడు. మఱియు నోవానరోత్తములారా! వేసవికాలముపోయినపిమ్మట మేఘదర్శనమును గోరుచున్నచాతకపక్షికి మేఘుడుకనబడినవిధముగ జిరకాలమునుండివెదకుచున్న నాకీరావణాసురుడు గోచరుడయ్యె. ఈదినముతోగూడ లోకమునందు రావణుడయినను, రాముడైనను, నశించిపోవును. మీరందఱునుజూచుచుండుడు. మఱియు నోవానరోత్తములారా! ఇదివఱకునేను, రాజ్యనాశము, వనవాసము, దండకారణ్యసంచారము, సీతాపహరణము, రాక్షసులతోయుద్ధమునుజేయుట, మొదలగువానివలన నరకతుల్యములగు దుఃఖములనుభవించితిని. అట్టిదుఃఖములనన్నిటిని, ఇప్పుడుయుద్ధమునందు రావణునిజంపిపోగొట్టుకొనియెదను. మఱియు నోవానరోత్తములారా! ఎవనికొఱకు వానరసైన్యముసంపాదింపబడినదో, ఎవనికొఱకువాలినియుద్ధమునందుజంపి సుగ్రీవునకురాజ్యమునిచ్చితినో, ఎవనికొఱకు సముద్రముదాటబడెనో, ఎవనికొఱకుసముద్రముబంధింపబడెనో, అట్టిరావణుడిప్పుడు నాకన్నులయెదుటబడియె. ఈదుష్టుడునాకంటియెదుటబడినపిమ్మటజీవింపజాలడు. మఱియు నోవానరోత్తములారా! చూపునందే విషముగల సర్పమునకెదుటబడినవాడవశ్యముగ మరణమునుబొందువిధముగ నాయెదుటబడిన యీరావణాసురుడు జీవింపజాలడు. కాబట్టియోవానరోత్తములారా! మీరందఱును స్వస్థచిత్తులును, ధర్షింపశక్యముగానివారునునై నాయుద్ధమునుజూడుడు. మఱియునోవానరోత్తములారా! మీరందఱునునిప్పుడునాయందలిరామత్వమునుజూడుడు. ఇప్పుడు, గంధర్వులు, ఋషులు, చారణులు, దేవతలు, మొదలగువారితోగూడినముల్లోకములయందును, నాప్రతాపము స్థిరముగనుండునట్లు యుద్ధమునుజేసెదను. మఱియు నోవానరోత్తములారా! నాప్రతాపముభూమియున్నంతవఱకును నిలిచియుండునట్లుచేసెదను. మఱియు దేవతలుమొదలగువారందఱునునాయుద్ధమునేకవిధముల శ్లాఘించునట్లు చేసెదననియె. ఇవ్విధముగాజెప్పియారాముడుసమాహితుడై, మిగులదీక్ష్ణములయినవియును, పుటమువేయబడిన బంగారముచేత నలంకరింపబడినవియును, నగు బాణములచేతరావణాసురునిగొట్టె. అంతటరావణాసురుడు అపరిమితమగుకోపముగలవాడై మిగులబ్రకాశించుచున్నవియును, భయంకరములైనవియును, నగు బాణములచేతను, ముసలములచేతను, రామునిగొట్టె. ఆసమయమునందురామరావణులచేత బ్రయోగింపబడినవియును, ఒకదానితోనొకటికొట్టుకొనుచున్నవియును, నగు బాణములవలన మిగులసంకులమైనధ్వనికలిగె. మఱియును, రామరావణులచేతనవ్విధముగా బ్రయోగింపబడిన బాణములాకాశమునందొకదానితోనొకటిపోరి తుదకవియన్నియును, చూర్ణములై క్రిందబడియె. మఱియునాసమయమునందురామరావణులయొక్క ధనుష్టంకారధ్వని సకలభూతములకునుమిగులభయమునుగలుగజేయునట్టిదియయ్యె. మఱియు నాసమయమునందు మహాత్ముడగు రాముడుఅపరిమితముగా బాణవర్షమునుగురిపించె. ఆబాణవర్షమునకుదాళజాలక రావణాసురుడు, "వాయువేగమునకుదాళజాలక మేఘములుపరుగెత్తినవిధముగ" బరుగెత్తుకొనిపోయె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి నూటయొక్కటవసర్గముగిసెను.

సుషేణుడను వానరుడు లక్ష్మణుని మూర్ఛదేర్చుట.

అప్పుడురాముడు, బలవంతుడగు రావణాసురునియొక్క శక్తిచేత గొట్టబడినవాడును, నెత్తురుయొక్క సముదాయముచేతవ్యాప్తమైనవాడును, యుద్ధమునందు మిగులశూరుడును, మరణమునుబొందినవానివలె క్రిందబడియున్నవాడును, నగు లక్ష్మణునిజూచె. పిమ్మటనారాముడు దురాత్ముడగు రావణాసురునితో మిగులభయంకరమగు యుద్ధమునుజేసి యారావణాసురునిమీద అనేకములగు

బాణములను బ్రయోగించుచుండె. అట్లుప్రయోగించుచుసుషేణుడను వానరోత్తమునితో నిట్లనియె. వానరోత్తముడా! సుషేణా! ఈలక్ష్మణుడు రావణాసురునియొక్క పరాక్రమముచేత గొట్టబడి క్రిందబడియె. మఱియు నీలక్ష్మణుడు సర్పమువలె జుట్టుకొనుచు నాకు మిగుల దుఃఖమును గలిగించుచున్నాడు. మఱియు నోవానరోత్తమా! సుషేణా! నెత్తురుచేత వ్యాప్తమైన శరీరము గలవాడును, వీరుడును, ప్రాణులకంటె మిగుల బ్రియుడును, నగు లక్ష్మణుని చూచుచున్న నాకు శక్తియంతయును జచ్చిపోవుచున్నది. మఱియు నోవానరోత్తమా! సుషేణా! యుద్ధమునందు మిగుల గొనియాడదగినవాడును, మంగళ కరములగు చిహ్నములుగలవాడును, నాకుదమ్ముడును, నగులక్ష్మణుడు వాస్తవముగ మరణమును బొందెనేని నాకు బ్రాణములతోడను, సుఖముతోడను, ప్రయోజనము లేదు. మఱియు నిప్పుడు నాపరాక్రమము సిగ్గును బొందుచున్నవిధముగనున్నది. మఱియు నీసమయమునందు నాధనుస్సు "చేతినుండి జారిపోవుచున్న విధముగ" నున్నది. బాణములు జారిపోవుచున్నవి. ఇంతయగాక కన్నీటిచేతచూపుయొక్క శక్తితగ్గిపోవుచున్నది. మఱియు నోవానరోత్తమా! సుషేణా! స్వప్నగమనమునందు మనుష్యులయొక్క పాదములు తొట్రుపడు విధముగా నాఅవయవములన్నియును, శిధిలములును, తొట్రుపాటుగలవియును, నగుచున్నవి. మఱియు నోవానరోత్తమా! సుషేణా! నాకు చింతవృద్ధిని బొందుచున్నది. మఱియు నిప్పుడునాకు మరణమునుబొందవలయునని కోరికపుట్టుచున్నది. మఱియు నోవానరోత్తమా! సుషేణా! దురాత్ముడగు నీరావణాసురునిచేత నాతమ్ముడు చంపబడినపిమ్మట నాకేదియును నెందుకనియె. ఇవ్విధముగ దురాత్ముడగు రావణాసురునిచేత గొట్టబడిక్రిందబడియున్నవాడును, నిట్టూర్పును విడుచుచున్నవాడును, దుఃఖముచేత బీడింపబడుచున్నవాడును, మర్మస్థానములయందు గొట్టబడినవాడును, వెలుపలసంచరించుచున్నప్రాణములతో సమానుడును, నగు లక్ష్మణుని జూచి రఘుకులోద్భవుడగు రాముడు, గొప్పదగు దుఃఖముచేత వ్యాప్తుడును, ధ్యానశోకములు గలవాడునునయ్యె వ్యాకులములగు నింద్రియములు గలవాడయ్యె. ఇట్లునానావిధములగువ్యసనములుగల వాడగుచు నపరిమితముగా రోదనముజేసె. మరణమునుబొంది యుద్ధభూమియందలి దుమ్మునందు పొర్లింతలు పెట్టుచు నిట్లనియె.

అయ్యో మరణమును బొందిన లక్ష్మణునిజూచిన పిమ్మట నాకు యుద్ధముతో బ్రయోజనమేమి? నాకు బ్రాణములతో బ్రయోజనమేమి? నాకురాజ్యముతో బ్రయోజనమేమి? అయ్యో నాతమ్ముడగు లక్ష్మణుడు యుద్ధభూమియందు బడి నిదురను బొందుచున్నాడు. ఇప్పుడు నాకు దేనితోడను బ్రయోజనములేదు. మరియు నోవానరోత్తమా! సుషేణా! ప్రతిదేశమునందును, భార్యలుగలుగుదురు. ప్రతిదేశమునందును బంధువులు గలరు. సహోదరులగు నన్నదమ్ములు మాత్రము ఏదేశమునందును గలుగరు. నేనికనేదేశమునందుండియును బ్రయోజనమేమియనియె. ఇవ్విధముగా దుఃఖమును బొందుచున్నవాడును, దుఃఖముచేత గాలుష్యమును బొందుచున్న యింద్రియములు గలవాడును, దుఃఖముచేత జుట్టుకొనుచున్నవాడును, మిగుల దీనముగా నిట్టూర్పులను విడుచుచున్నవాడును, నగు రాముని నోదార్చుచు సుషేణుడను వానరోత్తముడిట్లనియె.

మిగులగొప్పదగు భుజములుగలయో రాముడా! సంపదనువృద్ధినిజేయునట్టి యీలక్ష్మణుడు మరణమునుబొందలేదు. మఱియు నీలక్ష్మణునియొక్క ముఖము వికారమును బొందియుండలేదు. మఱియు నీతని ముఖము నల్లదనమునుబొందలేదు. కాంతిరహితమైనదిగాలేదు. మఱియు నీలక్ష్మణునియొక్కముఖము చక్కని కాంతిగలదియును, ప్రసన్నమైనదియునునై యున్నది. హస్తములు పద్మములవలె మృదువులును, ఎఱ్ఱనివియునునై యున్నవి మఱియును నేత్రములు ప్రసన్నములైయున్నవి. రాజోత్తమా! రామచంద్రా! మరణమునుబొందినవారికి యిటువంటి రూపముండదు. దీర్ఘాయుష్యముగల మనుష్యులముఖము యీవిధముగానుండును. ఈలక్ష్మణుడు మరణమునుబొందలేదు. శత్రునాశకుడగునీలక్ష్మణునియందు ప్రాణములు నిలిచియున్నవి. కావున వీరుడవైనయోరాముడా! వ్యసనమును బొందకుము. మఱియు నోరాముడా! భూమియందుబడి నిదురను బొందుచున్నవానికివలె నితనికిని వేడి నిట్టూర్పులు వచ్చుచున్నవి. హృదయము మాటిమాటికిని గొట్టుకొనుచున్నదనియె. అనియిట్లు వాక్యజ్ఞుడగు సుషేణుడివ్విధముగా రామునితో జెప్పె. పిమ్మట హనుమంతునిజూచి యిట్లనియె.

సౌమ్యుడవైన యోహనుమంతుడా! నీవిక్కడనుండి బయలు వెడలి యతిశీఘ్రముగ ఓషధిపర్వతమునకుబొమ్ము. పోయిపూర్వము జాంబవంతుడుచెప్పినవిధముగా నాపర్వతమును చూడుము. పిమ్మట నాపర్వతముయొక్క దక్షిణశిఖరమునందున్నదియును, మంగళకరమైనదియును, నగువిశల్యకరణియనుదానిని, సంవర్ణ్ణకరణియనుదానిని, సంజీవిని, సంధానకరణియను, దానిని దీసికొని యతిశీఘ్రముగ రమ్ము. ఆయౌషధములను దెచ్చితివేని మహానుభావుడగు నీల

లక్ష్మణుడు జీవింపడనినెను. ఇవ్విధముగా సుషేణుడుచెప్పిన మాటనువిని హనుమంతుడు మిగుల వేగముగలవాడై యోషధులు గల పర్వతమునకు బోయెను. పోయియాపర్వతము యొక్క దక్షిణశిఖరమునందంతటను వెదకి వెదకి యా మందును దెలిసికొనలేక యిట్లనియోచించెను. ఎంత వెదకినను మందుగనబడకపోయెను. కాలహరణమును అగుచున్నది. కాబట్టి యింకనునిక్కడవెదకుచుండుట యుచితముగాదు. కాబట్టి యీపర్వతశిఖరమునే దీసికొనిపోదును. ఈపర్వతశిఖరమును దీసికొనిపోతినేని సుఖకరమగునోషధినిసుషేణుడు యోచించి తెలిసికొనును. నేనిప్పుడీపర్వతశిఖరమును దీసికొనకపోతినేని కాలహరణమగును. దానివలన నధికమగు కీడు సంభవించును కావున గాలహరణమును జేయుట యుచితముగాదని యోచించెను.

పిమ్మట మహాబలవంతుడగు నాహనుమంతుడు ఆపర్వతముయొక్క శిఖరమును ఊగించిపెల్లగించెను. అవ్విధముగ నానావిధములగు వృక్షాదులతోగూడుకొనిన పర్వత శిఖరమును పెల్లగించి యాశిఖరమును హస్తములచేత బట్టుకొనియతివేగముతో గొనివచ్చె. అవ్విధముగ నాపర్వతశిఖరమును దీసికొనివచ్చి సుషేణుని ముందర బెట్టి యిట్లనియె. వానరోత్తమా! సుషేణుడా! ఓషధియెదియో నాకు దెలియలేదు. కావున నాపర్వతముయొక్క దక్షిణ శిఖరమును గైకొనివచ్చితిని. ఈపర్వతశిఖరమునందువెదకి యోషధిని దీసికొనుమనియె. ఇవ్విధముగ హనుమంతుడు చెప్పిన మాటనువిని సుషేణుడు హనుమంతుని శ్లాఘించి యాపర్వతశిఖరమునందలి యోషధిని దీసికొనియె. ఆసమయమునందు వానరులును, రాక్షసులును, నపరిమితమగు నాశ్చర్యమును బొందిరి.

మఱియు దేవతలచేత గూడ జేయశక్యముగాని కర్మమునుజేసిన హనుమంతుని అనేకవిధముల బొగడిరి. అంతట నాసుషేణుడు తగినయౌషధమునునలిపి యధికమగుతేజస్సుగలవాడగు లక్ష్మణునకిచ్చె. ఆసమయమునందు శత్రువీరులను సంహరించునట్టి లక్ష్మణుడు ఆయోషధి గంధమును నాఘ్రాణించినతోడనే యేమియును బాధలేని వాడగుచు లేచి కూర్చుండెను. అవ్విధముగ లేచికూర్చున్న లక్ష్మణునిజూచి వానరులందఱును నధికసంతోషముగలవారై యా సుషేణుని మిగుల స్తోత్రమును జేసిరి. మఱియు నధికముగా బూజించిరి. ఆసమయమునందు శత్రువీరులను జంపుటయందు దగినసామర్థ్యముగల రాముడు లక్ష్మణుని దగ్గరకు బిలిచి స్నేహముచేత గాఢాలింగనమును జేసె, మఱియు నారాముడు కన్నీళ్ళచేత వ్యాప్తములైన నేత్రములుగల వాడయ్యె. మఱియు నాసమయమునందు రాముడు శత్రుఘ్నుని, సుమిత్రానందనుడును, నగు లక్ష్మణుని నాలింగనమును జేసికొని యిట్లనియె.

తమ్ముడా! వీరుడా! లక్ష్మణా! దైవయోగముచేత మరణమును బొంది మరల జీవించినవాడవై వచ్చిన నిన్నుజూచితిని. తమ్ముడా! నీవుసత్యముగ మరణమును బొందితివేని నాకుసీతతో గాని, ప్రాణములతో గాని యేమిప్రయోజనము గలదు. మరియు నాకు జయము గలిగినను బ్రయోజనమేమి! అనియెను. ఇవ్విధముగా జెప్పుచున్నవాడును, మహాత్ముడును, రఘుకులోద్భవుడును నగు రామునితో లక్ష్మణుడు కొట్రుపడుచున్నమాటలు గలవాడై యిట్లనియె. సత్యమగు పరాక్రమముగల యోరామా! నీవుపూర్వము ఆవిధముగ ప్రతిజ్ఞను జేసి యిప్పుడు పరాక్రమహీనుడవై యివ్విధముగ బలుకుటకు దగదు.

మఱియును, పాపరహితుడవైన యోరాముడా! సాధువులగువారు చేసిన ప్రతిజ్ఞనువ్యర్థముగా జేయరు. మరియు నోఅన్నా! రాముడా! మహత్త్వమును గాపాడుకొనుటకు ప్రతిజ్ఞా పరిపాలనమే గదాగుర్తు. కావున పాపరహితుడవైన యోరాముడా! నానిమిత్తముగనీవు నిరాశను బొందుటయుచితముగాదు. ఇప్పుడు రావణాసురుని సంహరించి నీప్రతిజ్ఞను బాలింపుకొనుము. మరియునోరాముడా! నీబాణములయొక్క మార్గమునుబొందినవాడు, గర్జించుచున్న సింహమునకెదుటబడిన యేనుగువలె జీవింపడు. మరియునోరాముడా! నేనిప్పుడు దురాత్ముడగు రావణాసురునియొక్క మరణమును గోరుచున్నాను. మరియును నీదినముననే సూర్యుడస్తమింపక మునుపే జంపుము. మరియు నోఅన్నా! రాముడా! నీవుయుద్ధమునందు రావణాసురుని జంపవలయుననియును, నీప్రతిజ్ఞను నెరవేర్చుకొనవలయుననియును, నీకభిలాషగలదేని నావచనానుసారముగ రావణాసురుని జంపుమనియెను.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి నూట రెండవ సర్గ ముగిసెను.

రాముడు యింద్రుని రథమునెక్కి యుద్ధము జేయుట.

ఇవ్విధముగా లక్ష్మణుడుచెప్పిన మాటను విని రఘుకులోద్భవుడును, శత్రుసైన్యమును సంహరించుటయందు దగిన సామర్థ్యముగలవాడును, ప్రతాపవంతుడును, నగు రాముడు ధనుస్సును గ్రహించె అంతట నారాముడు రావణాసురునిమీద ననేకములగు బాణములను బ్రయో

గించె. పిమ్మట రావణాసురునియొక్క సేనాముఖమునందు అనేకములగు బాణములను బ్రయోగించెను. ఆసమయమునందు రాక్షసాధిపతియగు రావణాసురుడు వేరొక రథమునెక్కి రాహువు సూర్యునిమీదికి బోవువిధముగ రామునిమీదికి బోయె. అంతట నవ్విధముగ రథారూఢుడైన రావణాసురుడు వజ్రాయుధముతో సమానములైనవియును, మిగులభయంకరములైనవియును, నగు బాణములను రామునిమీద బ్రయోగించె. ఆసమయమునందు రాముడు అపరిమితమగు కోపముగలవాడై ప్రజ్వలించుచున్నయగ్నితో సమానములైనవియును, బంగారముచేత అలంకరింపబడినవియును, నగు బాణములచేత యుద్ధసన్నద్ధుడైయున్న రావణాసురునిగొట్టె. ఆసమయమునందు ఆకాశమున యుద్ధమునుజూచుటకు వచ్చియున్న దేవతలందఱును, రాముడు భూమియందుండి యుద్ధము జేయుటయును, రావణాసురుడు రథముమీదనుండి యుద్ధమును జేయుటయును, ఉచితముగనుండ లేదనిరి. అంతట దేవేంద్రుడు తనసారథియగు మాతలినిబిలిచి యిట్లనియె.

మాతలీ! బంగారముచేత, చిత్రములైన అవయవములుగలదియును, అనేకములగు ఘంటలచేత అలంకరింపబడినదియును, బాలసూర్యునితో సమానమైనదియును, వైడూర్యములగు కాణికిని, రథమునకును మధ్యమునందు వేసిన నొగలుగలదియును, బంగారపుసొమ్ములచేత అలంకరింపబడినవియును, తెల్లని దేహకాంతిగలవియును, మిగులశ్రేష్ఠములైనవియును, సూర్యాశ్వములతో సమానములైనవియును, బంగారపు గొలుసులచేత గట్టబడినవియును, నగు గుఱ్ఱములచేత పూన్పబడినదియును, బంగారపు వేణుధ్వజముగలదియును, సంపత్కరమైనదియును, నగు నీరథమును రామునియొద్దకు దోడ్కొనిపొమ్మనియె. ఇవ్విధముగా ఇంద్రుడు చెప్పిన మాటనువిని మాతలి పరమసంతోషముతో రథారూఢుడై యాకాశలోకమునుండి రాముడున్నచోటునకువచ్చె.

వచ్చి కోలతోగూడ రథముమీదగూర్చుండి ముకుళింపజేసినచేతులుగలవాడై రామునిజూచి యిట్లనియె. రఘుకులోత్తమా! రాముడా! దేవేంద్రుడు నీకు జయమునుగోరినవాడై ఈరథమునుబంపె. మఱియు శత్రునాశకుడవైన యోరాముడా! నీవీరథమును నెక్కి ఇంద్రుని ధనుర్బాణములను అవలంబింపుము. మఱియు నోరాముడా! ఈబాణములన్నియును, సూర్యునితో సమానములైయున్నవి. మఱియు నిర్మలములును, మిగుల దీక్ష్ణములైనవియునునైయున్నవి. కావున వీనినన్నింటిని గైకొనుమనియె. మఱియునోరాముడా! ఈరథమునెక్కి జయింపుము. నేనుసారథినైయుండెదను. నీవీరథమునెక్కి దేవేంద్రుడు రాక్షసులనువధించినవిధముగ నీవును నీరాక్షసులనందఱును వధింపుమనియె. ఇవ్విధముగా మాతలిచెప్పిన వాక్యమునువిని యారథమునకు బ్రదక్షిణనమస్కారములను జేసి యారథముమీద నెక్కె. ఆసమయమునందు రాముడు ప్రతాప సంపదచేత ముల్లోకములను బ్రకాశింపజేయుచుండె. అంతట రాముడు చూచువారలకు రోమాంచమును గలుగజేయునట్టియును, మిగులసంకులమైనదియును, నగు యుద్ధమును జేసె. మఱియు నాసమయమునందు రామరావణులకు మిగుల భయంకరములగు యుద్ధమయ్యె. మఱియు మిగులశ్రేష్ఠములగు నాయుధములను గుర్తెరిగిన రాముడు రాక్షసాధిపతియగు రామునియొక్క గాంధర్వాస్త్రమును గాంధర్వాస్త్రముచేతను, దైవాస్త్రమును దైవాస్త్రముచేతను, జయించుచుండె.

అంతట రాక్షసాధిపతియగు రావణాసురుడు అపరిమితమగు కోపముగలవాడై మరల మిగుల భయంకరమగు సస్త్రమును బ్రయోగించె. ఆసమయమునందు రావణాసురునియొక్క ధనుస్సునుండి ప్రయోగింపబడినవియును, మిగుల భయంకరములైనవియును, బంగారపు సొమ్ములచేత అలంకరింపబడినవియును, నగు బాణములన్నియును, అధికమగు విషముగల సర్పములయొక్క ఆకారమువంటి యాకారముగలవై రామునిదాకె. మఱియు నా బాణములన్నియును, దీప్తములగు ముఖములుగలవియును, ముఖములచేత అగ్నులను గ్రక్కుచున్నవియును, తెఱవబడిన నోరుగలవియునునై రామునిదాకె. ఆసమయమునందు వాసుకియను సర్పముయొక్క సర్పమువంటి స్పర్శముగలవియును, ప్రకాశించుచున్న పడగలుగలవియును, అధికమగు విషముగలవియును, నగు బాణములచేత దశదిక్కులును వ్యాపింపబడియె.

అవ్విధముగ బయలువెడలినవియును, సర్పాకారములైనవియును, నగు బాణములనుజూచి రాముడు అపరిమితమగు కోపముగలవాడై మిగుల భయంకరమగు గారుడాస్త్రమును బ్రయోగించె. అంతట రామునియొక్క ధనుస్సునుండి బయలువెడలిన యాబాణములన్నియును, బంగారపు పిడులుగలవియును, అగ్నిజ్వాలలయొక్క కాంతులవంటికాంతులుగలవియును, గరుత్మంతునియొక్క ఆకారమువంటి యాకారముగలవియునునై బయలువెడలె. అంతట గామరూపములైనవియును, గరుత్మంతునియొక్క ఆకారమువంటియాకారముగలవియును, నగు రాముని బాణములన్ని

యును, సర్పాకారములును, మిగుల వేగముగలవియును, నగు రావణాసురుని బాణములనన్నింటిని సంహరించె. ఇవ్విధముగా నాయస్త్రము నశింపజేయబడగానే రాక్షసాధిపతియగు రావణాసురుడు అపరిమితమగు కోపముగలవాడై రామునిమీద మిగుల భయంకరమగు బాణవర్షమునుగురిపించె.

పిమ్మట అనాయాసముగ యుద్ధమును జేయుచున్నట్టి రాముని, ఇంద్రుని సారథియగు మాతలిని, మిగుల దీక్ష్ణములగు బాణములచేత అపరిమితముగా బాధించె. మఱియును మాతలిమీద అపరిమితమగు బాణములను బ్రయోగించె. అంతట మఱియొక బాణముచేత, ఇంద్రరథధ్వజమును ఛేదించె. పిమ్మట బంగారపు టెక్కెమును విరిచె. పిమ్మటనా రావణాసురుడు అనేకములగు బాణపరంపరలచేత ఇంద్రుని గుఱ్ఱములనుగొట్టె. అవ్విధముగ దురాత్ముడగు రావణాసురుడు సేయుచున్న యుద్ధమునుజూచి దేవతలును, గంధర్వులును, దానవులును, చారణులును, మిగుల దుఃఖమును బొందిరి. మఱియు నాసమయమునందు రావణాసురుని బాణములచేత నధికముగా బీడింపబడినవాడును, అపరిమితముగా బీడనుబొందుచున్నవాడును, నగు రాముని జూచి సిద్ధులును, ఉత్తములగు ఋషులును, వానరోత్తములును, విభీషణుడును అపరిమితముగా వ్యసనమునుబొందిరి. మఱియు నాసమయమునందు రావణాసురుడను రాహుచేత నాక్రమింపబడిన రాముడను చంద్రునిజూచి బుధుడు బ్రహ్మదేవతాకమైనదియును, చంద్రునకు బ్రియమైనదియును, నగు రోహిణీనక్షత్రము నధిష్ఠించి లోకములకు బీడను గలుగజేయువాడైయుండె. మఱియు నాసమయమునందు బుధుడు కోపోద్దీపితుడై సూర్యుని స్పృశించుచున్నవానివలె గనబడియె. మఱియు నాసమయమునందు సూర్యుడు నల్లని కాంతిగలవాడును, మిగుల మందమైన కిరణములుగలవాడును, మిగుల భయంకరుడునునై యుండె. మఱియును ధూమకేతువుతో గూడుకొనినవాడును, కబంధాంకుడునునై కనబడియె.

మఱియు నాసమయమునందు ఇంద్రాగ్నిదేవతాకమగు కోసలదేశ నక్షత్రము మిగుల స్పష్టముగ గనబడుచుండె. అంగారకుడు అంతరిక్షమునందు విశాఖా నక్షత్రము నాక్రమించియుండె. ఆసమయమునందు ఇరువది భుజములుగలవాడును, పదితలకాయలు గలవాడును, నగు రావణాసురుడు మైనాక పర్వతమువలె గనబడుచుండె. అప్పుడా రావణాసురుడు రామునిమీద మిగుల దీక్ష్ణములను, అనేకములును, నగు బాణములను బ్రయోగించె. అందువలన రాముడు బాణములను సంధించుటకుగూడ శక్తిలేనివాడైయుండె. అంతట రాముడు కనుబొమలను ముడివేసికొనినవాడును, మిగుల కోపముగలవాడును, ఎఱ్ఱనినేత్రములు గలవాడునునై కోపముచేత లోకములను దగుల బెట్టువానివలెనుండె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి నూటమూడవ సర్గ ముగిసెను.

-(*)-

రామ రావణులు మహాశక్తి మహాశూలములచే యుద్ధము చేయుట.

అవిధముగా గోపమునుబొంది యున్నవాడును, మిగులబుద్ధిమంతుడును నగు రామునిజూచి లోకములోని భూతములన్నియును అపరిమితముగా గోపమునుబొందె. మఱియును భూమియంతయును, గడగడవణికె. సింహశార్దూలాది మృగములతోగూడిన పర్వతములును, వృక్షములును, గడగడవణికె. మఱియు నాసమయమునందు నదీపతియగు సముద్రుడు అపరిమితముగా క్షోభనుబొందె. మఱియు నాసమయమునందు పక్షులన్నియును గాడిదెలయొక్క ధ్వనులవంటి ధ్వనులుగలవియును, మిగుల కఠినములగు ధ్వనులుగలవియునునైయుండె. మఱియు అప్పుడనేకములగును త్పాతములుగలిగె. అప్పుడు కోపోద్దీపితుడగు రాముని, మిగుల భయంకరములగు ఉత్పాతములనుజూచి సకల భూతములును గడగడవణకె. రావణాసురుడును అపరిమితముగా భయమునుబొందె. మఱియు అప్పుడు మహాశూరులును, మిగుల వేగముతో యుద్ధమును జేయుచున్నవారును, నగు రామరావణులయొక్క యుద్ధమునుజూచి విమానములయందున్న దేవతలును, గంధర్వులును, మహోరగులును, ఋషులును, దానవులును, దైత్యులును, గరుడులును, ఖేచరులును, మిగుల ఆశ్చర్యమునుబొందిరి. మఱియు నాయుద్ధమును జూడవచ్చిన దేవతలును, రాక్షసులును,మిగుల భయంకరమగు నాయుద్ధమునుజూచి అపరిమితమగు సంతోషముగలవారై జయజయధ్వనులను జేసిరి. మఱియు నాసమయమునందు రాక్షసులందఱును రావణాసురుడా! జయింపుమని యాశీర్వదించిరి. ఆసమయమునందు రావణాసురుడు రామునిజంపవలయుననియెడు తలంపుగలవాడై తగిన యాయుధమునుగ్రహింప నాలోచించె. అంతట వజ్రాయుధముయొక్క సారమువంటి సారముగలదియును మిగుల గొప్పదగు ధ్వనిగలదియును, సకల శత్రువులనుసంహరించునట్టిదియును, పర్వతశిఖరములతో సమానములగు కూటములచేత వ్యాప్తమైనదియును, తీక్ష్ణములగు జ్వాలా

గ్రీములు గలదియును, ధూమముతో గూడుకొనినదియును ప్రళయకాలమునందలి యగ్నితో సమానమైనదియును, మిగులభయంకరమైనదియును, యమునిచేత గూడబొందశక్యముగానిదియును, సకలభూతములకును, భయమునుగలుగజేయునదియును, సకలభూతములను బ్రద్దలుసేయుటయందును, ఛేదించుటయందును, మిగులసామర్థ్యము గలదియును, కోపముచేత మిగులనధికముగా బ్రజ్వలింపజేయబడినదియును, మిగుల భయంకరమైనదియును, నగుశూలమను నాయుధమును గ్రహించె. అంతట వీర్యవంతుడగు నారావణాసురుడు శూలహస్తుడై యపరిమితమగు కోపముగలవాడయ్యె.

మరియునది వఱకనేకయుద్ధములయందనేకవానరవీరులను సంహరించినవాడును, మిగులగొప్పదగు శరీరముగలవాడును, నగురావణాసురుడు మిగుల భయంకరమగు సింహనాదమును జేసె. మరియు గోపముచేత నెఱ్ఱగాజేయబడిన నేత్రములుగలవాడయ్యె. ఆసమయమునందు రావణాసురుని చేత జేయబడినదియును, మిగులభయంకరమైనదియును, నగుసింహనాదముచేత, దిక్కులును, విదిక్కులును, భూమ్యాకాశములును గడగడవణకె. మరియును దురాత్ముడగు నారావణాసురునియొక్క సింహనాదముచేత సకలభూతములును భయమునుబొందె. సముద్రము అపరిమితముగా క్షోభనుబొందె. అంతట నపరిమితమగు వీర్యముగల రావణాసురుడు మిగుల భయంకరమగుశూలమును గ్రహించి మిగుల భయంకరమగు సింహనాదమును జేసిరామునితో బరుషవచనములను జెప్పదలచి యిట్లనియె.

ఓరీరాముడా ! ఈశూలము వజ్రాయుధముయొక్క సారమువంటి సారముగలది. దీనినిమిగులగోపముచేత బ్రయోగింపనుద్యమించితిని. ఈశూలమిప్పుడే నీతమ్మునియొక్కయు, నీయొక్కయు, బ్రాణముల నపహరింపగలదు. మరియును, యుద్ధమునందు గొనియాడదగిన యోరాముడా! ఇప్పుడునిన్నుజంపి యిదివఱకుమరణమును బొందినవారును, శూరులును, నగురాక్షసులకు దృప్తినిగలిగించెదను. మరియు నీరాక్షససైన్యమునకు సర్వమునకును, సంతోషమునుగలిగించెదను. కావున నీవుతొలగిపోక నిలువుమని యాశూలమును బ్రయోగించె. ఇవ్విధముగ రావణాసురునిచేత బ్రయోగింపబడినదియును, మెరుపుతీగలవంటి జ్వాలలతోగూడుకొని నదియును, ఎనిమిదిఘంటలు గలవియును మిగులగొప్పదగు ధ్వనిగలదియును, నగునాశూలము ఆకాశమునందు అపరిమితమగు కాంతితో బ్రకాశించుచుండె. అట్లుమిగుల భయంకరముగా బ్రకాశించు చున్నదియును, మిగుల నధికముగా బ్రజ్వలించుచున్నదియును, రావణాసురునిచేత బ్రయోగింప బడినదియునునగు శూలమునునాయుధమునుజూచి రాముడుమిగుల దీక్ష్ణములగుబాణములను బ్రయోగించె. మరియుదనమీదికి మిగులవేగముతో వచ్చుచున్న యాశూలమును బాణపరంపరలచేతనివారించె. ఆసమయమునందు రాముడు ప్రళయకాలాగ్నిని వర్షోదకముచేత శాంతినిబొందించు చున్నదేవేన్ద్రుని బోలియుండె. మరియు నప్పుడు ఆశక్తియను నాయుధము రామునిచేత బ్రయోగింప బడినబాణమును మిగులగొప్పదగు నగ్నిశలభములను నాశముచేసినవిధముగజేసె.

అవ్విధముగ శూలముచేత దనయాయుధములన్నియును భస్మమైపోవుటనుజూచి రాముడు అపరిమితమగు కోపముగలవాడయ్యె. అట్లుమిగుల గోపముగలవాడై మాతలిచేత దీసికొనివచ్చి యివ్వబడినదియును, దేవేన్ద్రునిచేత నిర్మింపబడినదియును, నగుశక్తియనునాయుధమును గ్రహించె. అంతట రఘుకులోద్భవుడగు రాముడు మిగులబలము గలదియును, అపరిమితమగు ధ్వనిగలదియును, నగునాశక్తియను నాయుధమును బ్రయోగించె. అట్లురామునిచేత బ్రయోగింప బడినశక్తియను నాయుధము రావణాసురునియొక్క శూలమునందుబడియె. అంతట నాశక్తిచేతరావణాసురునియొక్క యధికమైన తేజస్సుగల శూలము క్రిందబడియె.

పిమ్మట రాముడు మిగులదీక్ష్ణములగు బాణములచేత మిగులవేగముగల గుఱ్ఱములనుగొట్టె. ఆబాణములన్నియును, మిగులదీక్ష్ణములైనవియును, అధికమగు వేగముగలవియును, వజ్రాయుధముతో సమానములైనవియునునైయుండె. అంతట నూరకుండక రావణాసురునియొక్క లలాటమునందు మిగులదీక్ష్ణములగు మూడుబాణములను బ్రయోగించె. అవ్విధముగ రాముని బాణములచేత బ్రద్దలైనశరీరముగలవాడును, సర్వావయవములయందును బ్రవహించుచున్న నెత్తురుగలవాడును, నగురావణాసురుడు మిగులజక్కగా బ్రకాశించుచున్నదియు, పుష్పించినదియును, నగు నశోకవృక్షమువలె బ్రకాశించుచుండె. మఱియునవ్విధముగా రామునిబాణములచేత గొట్టబడిన సర్వావయవములును గలవాడును, నెత్తురుచేత దడపబడిన సర్వావయవములును గలవాడును, నగురావణాసురు డపరిమితమగు వ్యసనముగలవాడయ్యె. అంతట నధికమగు కోపముగలవాడునునయ్యె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి నూటనాలుగవసర్గ ముగిసెను.

రావణుని సారథి రథమును దూరముగ గొనిపోవుట.

అవ్విధముగ గకుత్థ్సకులసంభవుడగు రాముని బాణములచేత నపరిమితముగా బీడింపబడినవాడును, యుద్ధములయందు గొనియాడదగినవాడును, నగు రావణాసురుడపరిమితముగా గోపమునబొందె. పిమ్మట వీర్యవంతుడగు నా రావణాసురుడు గోపముచేత నెఱ్ఱగా జేయబడిన నేత్రములుగలవాడై మిగులభయంకరమగు ధనుస్సునుధరించె. అంతట నపరిమితమగు కోపముగలవాడయ్యె. పిమ్మట ననేకములగు బాణములచేత రాముని శరీరముసర్వమును, మేఘుడు ఉదకములచేత జెరువును బూరించిన విధముగ బూరించె.

అవ్విధముగ ననేకములగు బాణములచేత గ్రుచ్చబడిన శరీరముగలవాడయ్యును మిగులగొప్పదగు పర్వతమువలె గొంచెమైనను గంపములేనివాడయ్యె ఆసమయమున రాముడు ఆబాణములనన్నింటిని దనబాణములచేత సూర్యుడు కిరణముల నాక్రమించుకొను విధముగ నాక్రమించె. అంతట రావణాసురుడు అపరిమితమగు కోపముగలవాడై మహాత్ముడగు రామునియొక్క వక్షస్థ్సలమునం దనేకవేల బాణములను బ్రయోగించె. ఆవిధముగా బాణములచేత గొట్టబడినవాడును, నెత్తురుచేత వ్యాప్తమైన శరీరముగలవాడుననగు రాముడు "పూచినమోదుగు వృక్షమువలె" బ్రకాశించుచుండె. అవ్విధముగననేకవేల బాణములచేత గొట్టబడియును, అధికమగు తేజస్సుగలవాడును, కకుత్థ్సునియొక్క కులమునందు బుట్టినవాడును, ప్రళయకాలమునందలి సూర్యునియొక్క తేజస్సువంటి తేజస్సుగలవాడును, నగు రాముడు రావణాసురుని బాణములనన్నింటిని జూర్ణములు సేసె. అంతనయ్యిరువురును ఒండొరులమీదనపరిమిత సంఖ్యాకములగు బాణములను బ్రయోగించుకొనిరి అప్పుడు ఆబాణములచేత నంధకారముగలిగె. ఆబాణాంధకారమునందు రామరావణులిరువురును గనబడకపోయిరి. ఆసమయమునందు దశరథరాజనందనుడగు రాముడు అపరిమితమగు కోపముగలవాడై రావణాసురునితో గఠినములగు మాటలను జెప్పదలచి యిట్లనియె.

ఓరీ రాక్షసాధమా! రావణాసురుడా! నీవు నేనుసమీపమున లేనిసమయమునందు మారువేషముతో వచ్చి నాభార్యయగు సీతనపహరించితివి. కావున నీవు వీర్యవంతుడవని తలపను. మఱియు నో రాక్షసాధమా! రావణుడా! నా వియోగమునుబొంది యున్నదియును, దీనురాలును, మిగుల గొప్పదగు వనమునందు సంచరించుచున్నదియును, నగు సీతను బలాత్కారముగ నెత్తికొనివచ్చి వీరుడనని తలచుచున్నావు. మఱియు నో రాక్షసాధమా! రావణాసురుడా! పరభార్యలను ముట్టుకొనునట్టి పాపాత్ముడా! దిక్కులేకయున్న స్త్రీలయందు నీపరాక్రమమును జూపి మహాశూరుడనని తలచుచున్నావు. మఱియు నో రాక్షసాధమా! మర్యాదారహితుడా! సిగ్గులేనివాడా! రావణాసురుడా! నీవు గర్వమువలన మృత్యువును బట్టుకొని శూరుడనని తలచుచున్నావు. మఱియు నో రాక్షసాధమా! శూరుడవును, కుబేరునకు దమ్ముడవును, నానావిధసైన్యముతో గూడుకొనినవాడవును, నగు నీవు అపకీర్తికరమైనదియును, కొనియాడదగనిదియును, మిగుల నీచమైనదియును నగు కర్మమును జేసితివి. మఱియు నో రాక్షసాధమా! గర్వోద్రేకమును బొందినవాడవును, నిందితుడవును, శత్రుడవును, నగు నీవు నీకర్మమునకు దగిన ఫలమును బొందుము. ఓరీ దురాత్మా! రావణాసురుడా! నిన్ను నీవే శూరుడని తలచుచున్నావు. దొంగవానివలె సీతను నపహరించిన నీకు సిగ్గుకలుగక పోవుటను గుఱించి మిగుల నాశ్చర్యమును బొందెదను. మఱియు నో రాక్షసాధమా! రావణుడా! నీవు నాసమక్షమునందు బలాత్కారముగ సీతను అపహరించితివేని నీభ్రాతయగు ఖరునితో సమముగ నిన్నును గూడ నాబాణములచేత నప్పుడే చంపియుందును.

ఓరీ దుష్టాత్మా! రావణాసురుడా! దైవయోగముచేత నీవిప్పుడు నాకంటకినబడితివి. ఇప్పుడు నా దుక్రూరబాణములచేత యమలోకమును బొందింతును. మఱియు నో రాక్షసాధమా! రావణుడా! ఇప్పుడు నాబాణములచేత ఛేదింపబడినదియును, ప్రకాశించుచున్న కుండలములతో గూడుకొనినదియును, యుద్ధభూమియందు బొరలుచున్నదియును, నగు నీశిరస్సును క్రవ్యాదములు భక్షించుగాక. మరియు నో రాక్షసాధమా! యుద్ధభూమియందు బడియున్న నీఱొమ్మునందు గ్రిద్ధలు మొదలగునవి ప్రవేశించి నీ యెముకల సందునుండి బయలువెడలునట్టి నెత్తురును ద్రాగుగాక. మరియు నో రాక్షసాధమా! నాబాణములచేత బ్రద్దలుసేయబడిన శరీరము గలవాడును, మరణమును బొందినవాడవును, నగు నీపేగులను, పక్షులు, గరుత్మంతులు సర్పములను భక్షించుగాక. మరియు నో రాక్షసాధమా! రావణాసురుడా! ఇప్పుడు నా పరాక్రమమును జూడుమనియె.

ఇవ్విధముగాఁజెప్పిపీరుడును, శత్రునాశకుడును, నగు రాముఁడు సమీపమునందున్నవాఁడును, రాక్షసాధిపతియును, నగు రావణాసురునిమీద అనేకములగు బాణములను బ్రయోగించె. మఱియు శత్రువులయొక్క మరణమునుగోరుచున్న రామునియొక్క బలవీర్యసంతోషములు అప్పుడు రెండింతలయ్యె. మఱియు నాసమయమునందు ప్రసిద్ధమైనయాత్మముగల రామునకు ఆసమయమునందు సకలాస్త్రములునుజ్ఞప్తికివచ్చె. మఱియు నప్పుడు రాముడుసంతోషమువలన మిగులశీఘ్రమగు హస్తలాఘవముగలవాఁడాయె. మఱియు నాసమయమునందు రామునకుజయసూచకములగుచిహ్నములనేకములుగనబడియె. మఱియు నాసమయమునందు రాక్షసనాశమునుజేయునట్టి రావణాసురుని అపరిమితముగాబీడించె. మఱియు నాసమయమునందు వానరులయొక్క రాతిదెబ్బలచేతను, రామునియొక్క బాణవర్షములచేతను, రావణాసురుడు అపరిమితముగాగొట్టబడినవాఁడై ఘూర్ణిల్లుచున్న హృదయముగలవాఁడయ్యె. అప్పుడు రావణాసురుడు రామునిబాణములచేత బీడింపబడుచున్నవాఁడగుటవలన శస్త్రమునుగాని, ధనుర్బాణములనుగాని గ్రహించుటకు శక్తిలేనివాఁడైయుండె. మఱియు నాసమయమునందు రావణాసురునిజంపుటకొఱకు రాముడునానావిధములును, అసంఖ్యాకములును నగు బాణములను బ్రయోగించె.

మఱియు నప్పుడు రావణుండు మృత్యుకాలముసమీపించినవానివలెనుండె. ఆసమయమునందు రావణాసురుని సారథి రావణాసురునియొక్కయవస్థనుజూచి రావణాసురునకు మరణముగలుగునని యెదు తలంపుగలవాఁడై మెల్లమెల్లగా రథమునుయుద్ధరంగమునుండితొలగించె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి నూటమైదవసర్గము గిసెను.

⁂

{ రావణాసురుడు సారథినినిందించి రథమునుమరలయుద్ధమునకుఁబోలుమనుట. }

అప్పుడు మోహమువలన మిగులగోపమునుబొందినవాడును, యమునియొక్కబలముచేత బ్రేరణచేయబడినవాడును, కోపముచేతనెఱ్ఱగాజేయబడిన నేత్రములుగలవాడును, నగుచు నారావణాసురుడు సూతునితో నిట్లనియె.

ఓరీ! దురాత్మా! సారథీ! నన్నుహీనమైనపరాక్రమముగలవానినిగాను, పౌరుషహీనునిగాను, భయమునుబొందినవానినిగాను, స్వల్పమైనబలముగలవానినిగాను, తేజోరహితునిగాను, మాయాశక్తిహీనునిగాను, అస్త్రహీనునిగాను, తలచినాకుఅవమానమునుగల్పింపదలచి నీవురథమునుదొలగదోలుచున్నావు. ఓరీదురాత్మా! సారథీ! నాయభిప్రాయమును దెలిసికొనక నన్నుఅవమానించుచున్నావు. నీవేమినిమిత్తముగ శత్రునియొద్దనుండి నారథమునుదొలగించితివి. మఱియు నోదురాత్ముఁడా! సారథీ! నాచేత జిరకాలమునుండి సంపాదింపబడిన తేజోబలవీర్యాదులు నశించిపోవునట్లు రథమునుదొలగించుకొనివచ్చితివి. మఱియునోరాక్షసాధమా! సారథీ! పరాక్రమములచేతరంజనీయుడున, ప్రసిద్ధమగుపరాక్రమమునుగలవాడును, నగు శత్రువుచూచుచుండగ యుద్ధలుబ్ధుడనగు నేనునీచేతగాపురుషుడనై చేయబడితిని. ఓరీదుష్టాత్మా! సారథీ! నీవుమోహముచేత నీవిధముగారథమునదోలుకొనివచ్చితివని తలపను. వాస్తవముగ నీవుశత్రువులబోధకులోనై యీవిధముగాజేసితివని తలచుచున్నాను. స్నేహితుడును, హితమునుగోరువాడును, నగు వాడిట్టికార్యమును జేయగూడదు. శత్రువులుచేయదగినకార్యమును నీవుచేసితివి. శీఘ్రముగరథమునుబోనిమ్ము. శత్రువుపోకమునుపు నేనుబోయి కలిసికొనవలయును. నీవుచిరకాలమునుండి నాయొద్దనుంటివిగదా? నాగుణములనుదలంచితివా? నీవుమిగులమూఢుడవగుటచేత నివ్విధముగాజేసితివి. ఇకనివ్విధముగాజేయుటతగదనియె. ఇట్లుమిగులగఠినముగాబలికినదుష్టాత్ముఁడగు రావణాసురునియొక్కమాటలువిని మిగుల బుద్ధిమంతుడగుసారథివినయపూర్వకముగమాటలాడదలచి యిట్లనియె.

రాక్షసరాజోత్తమా! రావణాసురుఁడా! నేనుభయమునుబొందలేదు. మూఢుడనుగాను. శత్రువులబోధకులోబడినవాడనుగాను. ప్రమాదమును బొందినవాడనుగాను. నీయందు స్నేహములేనివాడనుగాను. నీవుచేసినసత్కారమును మరచిపోయినవాడనుగాను. నేనునీకుహితమును జేయుదలచినవాడను, నీకీర్తిని వృద్ధినిబొందింపదలచినవాడను, స్నేహప్రసన్నమనస్కుడనునై నేనునీకు బ్రియమును జేయుదలచి యివ్విధముగాజేసితిని. మఱియు నో రాక్షసరాజోత్తమా! రావణాసురుడా! నీకుబ్రియమునుజేయుటయందుబ్రియముగలవాడను, నగు నన్నునీవిషయమై స్వల్పమైనబుద్ధిగలవానినిగాను, దుష్టునిగాను, తలపకుము. మఱియునోరాక్షసోత్తమా! రావణాసురుడా! నేనేమినిమిత్తముగ రథమునుదొలగించుకొనివచ్చితినోచెప్పెదను. వినుము. నీవుమిగులనలసటనొంద టనుజూచితిని. మిగులగొప్పదగుయుద్ధము నీయలయునకుకారణమని తెలిసికొంటిని. మఱియు నీకుయుద్ధమునందు సుముఖత్వములేకయుండుట

ను, సంతోషములేకయుండుటను దెలిసికొంటిని. అంతయగాక మనరథాశ్వములు బాణములుతగులుటచేత బాధనొందుటను దెలిసికొంటిని. మఱియు నోరాక్షసోత్తమా! మహాప్రభూ! రావణాసురుడా! ఈరథాశ్వములు "వర్షముచేత గోవులుబాధనొందినవిధముగ" బాణవర్షముచేతబాధనొందినవయ్యె. మఱియు నోరాక్షసోత్తమా! మనకునమంగళమునుసూచించునట్టి యనేకాపశకునములుగలుగుచున్నవి. ఆవిషయములను దెలిసికొనుటచేత నామనస్సునందు అనేకవిధసందేహములుబుట్టె. కావున రథమునుద్రోలగించితి. మఱియు నోరాక్షసరాజోత్తమా! సారథియగువాడు దేశకాలములను, ఇంగితములను, శుభాశుభలక్షణములను, దైన్యఖేదహర్షములను, రథికుని యొక్క బలాబలములను, భూమియందలి మెరకపల్లములను, యుద్ధకాలమును, శత్రువుయొక్క బలాబలములను, దెలిసికొనుటకు దగినసామర్థ్యముగలవాడై యుండవలయును. మఱియునోరాక్షసరాజోత్తమా! సారథియగువాడు శత్రువుయొక్క ఛిద్రములను దెలిసికొనవలయును. ఇంతయగాక సమీపగమనమును, పార్శ్వగమనమును, అభిముఖగమనమును, పృష్ఠభాగగమనమును, దెలిసికొనవలయును. ఈవిషయములనన్నింటిని నీయనుగ్రహముచేత నేనుదెలిసికొంటిని. మఱియు నిప్పుడునీవుశ్రమనొందియుండుటను, గుఱ్ఱములుఅలయుటను, నేనుదెలిసికొంటిని. కావుననేనివ్విధముగ రథమునుద్రోలగించితిని. మఱియుశూరుడా! రాక్షసోత్తమా! నేనుస్వేచ్ఛచేతనివ్విధముగాజేసినవాడనుగాను. నీయందు మిగులప్రియముగలవాడనగుటచే తనిట్లుచేసితిని. కాబట్టి నాయందు కోపమును బొందకుము ఇప్పుడు నేనుజేయదగినకార్యమేదియో దానిని దెలియజేయుము. నీయభీష్టానుసారముగ జేయుటకు సిద్ధముగనున్నాడననియె. ఇవ్విధముగసూతుడుచెప్పినవాక్యములనువిని రావణాసురుడుయిట్లనియె.

సారథీ! మనరథమునుశీఘ్రముగ రామునకభిముఖముగాబోనిమ్ము. ఈరావణాసురుడు శత్రుసంహారమును జేయక యుద్ధమునుండి మరలిపోవువాడుగాడని దలంపుమనియె. ఇవ్విధముగా రాక్షసాధిపతియగు రావణాసురుడు మహానందముతోజెప్పి యాసూతునకు మిగులమంగళకరమైనదియును, మిగులశ్రేష్ఠమైనదియును, సకలాభరణములలోపల నుత్తమమైనదియును, నగు హస్తాభరణమునుసమర్పించె. అట్లు రావణాసురుడుచెప్పినమాటనువిని యాసారథిరథమునుమరల్చె. మఱియు నావిధముగా రావణాసురునివాక్యములచేత బ్రేరేపింపబడిన యాసారథిగుఱ్ఱములను మిగులవేగముగాద్రోలి యారథమునుక్షణములోపల రామునిసమీపమునకుబోనిచ్చె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలినూటయారవసర్గము గిసెను.

▶✱◀

రామునకు అగస్త్యమహాముని ఆదిత్యహృదయమునుపదేశించుట.

అంతటయుద్ధమునుజేసి యలసియున్నవాడును, మిగులవిచారమును బొందుచున్నవాడును, మరల యుద్ధమునకు వచ్చినవాడును, నగు రావణాసురునిజూచి యగస్త్యమునివరుడు దేవతలతోగూడ రాముడున్నచోటునకువచ్చి భగవంతుడగు నయ్యగస్త్యమునివరుడు రామునితో నిట్లనియె.

తతోయుద్ధపరిశ్రాంతం సమరేచింతయాస్థితమ్। రావణంచాగ్రతోదృష్ట్వా యుద్ధాయసముపస్థితమ్॥ దైవతైశ్చ సమాగమ్య ద్రష్టుమభ్యాగతోరణమ్। ఉపగమ్యాబ్రవీద్రామమగస్త్యోభగవానృషిః॥ రామరామ మహాబాహోశృణుగుహ్యంసనాతనమ్। యేనసర్వానరీన్వత్స సమరేవిజయిష్యసి॥ ఆదిత్యహృదయంపుణ్యం సర్వశత్రువినాశనమ్। జయావహంజపేన్నిత్యమక్షయంపరమంశుభమ్॥ సర్వమంగళమాంగళ్యంసర్వపాప ప్రణాశనమ్। చింతాశోకప్రశమనమాయుర్వర్ధనముత్తమమ్॥ రశ్మిమంతంసముద్యంతం దేవాసురనమస్కృతమ్। పూజయస్వవివస్వంతం భాస్కరంభువనేశ్వరమ్॥ సర్వదేవాత్మకోహ్యేష తేజస్వీరశ్మిభావనః। ఏషదేవాసుర గణాఁల్లోకాన్పాతిగభస్తిభిః॥ ఏష బ్రహ్మాచవిష్ణుశ్చ శివస్స్కందఃప్రజాపతిః। మహేంద్రో ధనదః కాలోయమస్సోమోహ్యపాంపతిః। పితరోవసవస్సాధ్యాహ్యశ్వినౌమరుతోమనుః। వాయుర్వహ్నిః ప్రజాః ప్రాణాఋతుకర్తాప్రభాకరః॥ ఆదిత్యస్సవితాసూర్యఃఖగః పూషాగభస్తిమాన్। సువర్ణసదృశోభానుః స్వర్ణరేతాదివాకరః॥ హరిదశ్వస్సహస్రార్చిస్సప్తసప్తిర్మరీచిమాన్। తిమిరోన్మథనశ్శంభుస్త్వష్టామార్తాండ అంశుమాన్॥ హిరణ్యగర్భశ్శిశిరస్తపనోభాస్కరోరవిః। అగ్నిగర్భోఽదితేః పుత్రశ్శంఖశ్శిశిరనాశనః॥ వ్యోమనాథస్తమోభేదీ ఋగ్యజుస్సామపారగః॥ ఘనవృష్టిరపాంమిత్రోవింధ్యవీథీప్లవంగమః॥ ఆతపీమండలీమృత్యుః పింగళస్సర్వతాపనః। కవిర్విశ్వోమహాతేజా రక్తస్సర్వభవోద్భవః॥ నక్షత్రగ్రహతారాణామధిపోవిశ్వభావనః। తేజసామపితేజస్వీ ద్వాదశాత్మన్నమోస్తుతే॥ నమఃపూర్వాయగిరయే పశ్చిమాయాద్రయేనమః। జ్యోతిర్గణానాంపత

దినాధిపతయే నమః। జయాయ జయభద్రాయ హర్యశ్వాయ నమోనమః। నమోనమస్సహస్రాంశో ఆదిత్యాయ నమోనమః॥ నమ ఉగ్రాయ వీరాయ సారంగాయ నమోనమః। నమః పద్మప్రబోధాయ మార్తాండాయ నమోనమః॥ బ్రహ్మేశానాచ్యుతేశాయ సూర్యాయాదిత్యవర్చసే। భాస్వతే సర్వభక్షాయ రౌద్రాయ వపుషే నమః॥ తమోఘ్నాయ హిమఘ్నాయ శత్రుఘ్నాయామితాత్మనే। కృతఘ్నఘ్నాయ దేవాయ జ్యోతిషాంపతయే నమః॥ తప్తచామీకరాభాయ వహ్నయే విశ్వకర్మణే। నమస్తమోఽభినిఘ్నాయ రుచయే లోకసాక్షిణే॥ నాశయత్యేష వై భూతం తదేవ సృజతి ప్రభుః। పాయత్యేష తపత్యేష వర్షత్యేష గభస్తిభిః॥ ఏష సుప్తేషు జాగర్తి భూతేషు పరినిష్ఠితః। ఏష ఏవాగ్నిహోత్రం చ ఫలం చైవాగ్నిహోత్రిణామ్॥ వేదాశ్చ క్రతవశ్చైవ క్రతూనాం ఫలమేవ చ। యాని కృత్యాని లోకేషు సర్వ ఏష రవిః ప్రభుః॥ ఏనమాపత్సు కృచ్ఛ్రేషు కాంతారేషు భయేషు చ। కీర్తయన్ పురుషః కశ్చిన్నావసీదతి రాఘవ॥ పూజయస్వైనమేకాగ్రో దేవదేవం జగత్పతిమ్। ఏతత్త్రిగుణితం జప్త్వా యుద్ధేషు విజయిష్యసి। అస్మిన్ క్షణే మహాబాహో రావణం త్వం వధిష్యసి। ఏవముక్త్వా తదాగస్త్యో జగామ చ యథాగతమ్। ఏతచ్ఛ్రుత్వా మహాతేజా నష్టశోకోఽభవత్తదా। ధారయామాస సుప్రీతో రాఘవః ప్రయతాత్మవాన్॥ ఆదిత్యం ప్రేక్ష్య జప్త్వా తు పరం హర్షమవాప్తవాన్। త్రిరాచమ్య శుచిర్భూత్వా ధనురాదాయ వీర్యవాన్॥ రావణం ప్రేక్ష్య హృష్టాత్మా యుద్ధాయ సముపాగమత్। సర్వయత్నేన మహతా వధే తస్య ధృతోఽభవత్॥ అథ రవిరవదన్నిరీక్ష్య రామం ముదితమనాః పరమం ప్రహృష్యమాణః। నిశిచరపతిసంక్షయం విదిత్వా సురగణమధ్యగతో వచస్త్వరేతి॥ ఇతి శ్రీమద్యుద్ధకాండే - సప్తోత్తరశతతమస్సర్గః.............॥

సర్వోత్తమమగు భుజబలముగలయో రాముడా ! మిగుల సనాతనమైనదియును, మిగుల రహస్యమైనదియునునగు దానిని జెప్పెదను. ఈమంత్రబలముచేత యుద్ధమునందు నీవు సకల శత్రువులను జయింపగలవు. మరియునో రాముడా! నేను జెప్పదలచినది యాదిత్యహృదయమను మంత్ర రాజము. ఇది సర్వశత్రునాశకమైనది. మరియు జయమును గలుగజేయును. నాశరహితమైనదియును, మిగుల శ్రేష్ఠమైనదియునునగు మంగళమును గలుగజేయును. మరియునో రాముడా! ఈయాదిత్యహృదయము సకలశుభములను గలుగజేయునదియనియును, సర్వపాప నాశకమనియును, చింతాశోకములను నశింపజేయునది యనియును, ఆయుర్వృద్ధిని జేయునదియనియును, మిగుల శ్రేష్ఠమైనదనియును, దెలిసికొనుము. కావుననో రాముడా! కిరణములుగలవాడును, క్రొత్తక్రొత్తగా బుట్టుచున్నవాడును, దేవాసురులచేత నమస్కరింప బడినవాడును, నిరతిశయముగా బ్రకాశించుచున్నవాడును, సకలలోక ప్రకాశకుడును, సకలలోకములకును నధిపతియునునగు సూర్యుని బూజింపుము. మరియునో రాముడా! ఈసూర్యుడు సర్వదేవాత్మకుడు. అధికతేజోవంతుడు. కిరణములచేత లోకములను గాపాడుచున్నవాడు. మరియు నీసూర్యుడు కిరణములచేత దేవాసురగణములను, లోకములను రక్షించుచున్నాడు. మరియునో రాముడా! బ్రహ్మవిష్ణు మహేశ్వరులును, స్కందేంద్రులును, కుబేరయములును, సోమవరుణులును నీసూర్యుడే గాని యితనికంటె భిన్నులుగారు-

మరియునో రాముడా! పితృదేవతలును, వసువులును, సాధ్యులును, అశ్వినీదేవతలును, మరుత్తులును, మనువును, వాయువును, అగ్నియును, ఈసూర్యుడె గాని యీసూర్యునికంటె వేరుగాదని యెఱుంగుము, మరియునో రాముడా! ఈసూర్యుడు ప్రజలకును, ప్రాణములకును, ఋతువులకును, కర్తయని యెఱుంగుము. మరియునో రాముడా! అదితికిబుత్రుడును, జగత్తును బుట్టించువాడును, లోకోపకారముకొఱకు ఆకాశమునందు సంచరించుచున్నవాడును, వర్షముచేత జగత్తును బోషించువాడును, అనేకములగు కిరణములుగలవాడును, బంగారముయొక్క వర్ణమువంటివర్ణముగలవాడును, ప్రకాశించునట్టి స్వభావముగలవాడును, హిరణ్మయబ్రహ్మాండమునకు గర్తయును, బగటిని జేయువాడును, పచ్చనిగుఱ్ఱములుగలవాడును, వేయియగుకిరణములు గలవాడును, ఏడుగుఱ్ఱములు గలవాడును, ప్రసిద్ధములగు కాంతులుగలవాడును, చీకటిని నశింపజేయువాడును, సుఖమునను భవించువాడును, సర్వసంహారకుడును, అచేతనాత్మకమగు ప్రపంచమును జీవింపజేయువాడును, హిరణ్యగర్భుడును, చల్లనిస్వభావముగలవాడును, లోకములను దపింపజేయువాడును, ప్రకాశమును గలిగించువాడును, సకలలోకములవారిచేత స్తోత్రముచేయబడువాడును, అగ్నిగర్భమునందు గలవాడును, అదితికిబుత్రుడును, సాయంకాలమునందు స్వయముగానే శాంతిని బొందువాడును, మంచును నాశము లేనివాడును, ఆకాశమునకధిపతియును, చీకటిని భేదించువాడును, ఋగ్యజుస్సామ వేదములయొక్కయంతమును దెలిసికొన్నవాడును, అధికముగా వర్షించువాడును, ఉదకములకు మిత్రుడును, వింధ్యవీధియందు సంచరించువాడును, ఎండను గలుగజేయువాడును, మండలము గలవాడును, మృత్యుదేవతా స్వరూపుడును, పింగళవర్ణ

ముగలవాడును, సర్వలోకములను దహింపజేయువాడును, సర్వముదెలిసినవాడును, విశ్వరూపుడును, మిగులనధికమగు తేజస్సుగలవాడును, సకలభూతములయందును అనురాగముగలవాడును, సర్వలోకసంసారకారణుడును, నక్షత్రములకును, గ్రహములకును, అధిపతియును, సకలలోకములవారిని స్థాపించువాడును, తేజోవంతులలోపల తేజోవంతుడును, పదిరెండువిధములగు నాత్మలుగలవాడును, నగుసూర్యునకు నమస్కారమును జేయుము.

మరియునో రాముడా! ఈవిధముగా సూర్యునకునమస్కారమును జేయుము. పూర్వపర్వతము కొఱకునమస్కారము. పశ్చిమాద్రికొఱకు నమస్కారము నక్షత్రములయొక్క సముదాయము నధికపతియును, పగటికధిపతియును, నగుసూర్యునికొఱకు నమస్కారము, జయముగలవాడును, ఉపాసకులకుజయమును, మంగళములను, గలుగజేయువాడును, పచ్చనిగుఱ్ఱములు గలవాడును, నగుసూర్యునికొఱకు నమస్కారము. మఱియును, వేయికిరణములుగల సూర్యునకు నమస్కారము. అదితిపుత్రునకొఱకు నమస్కారము. మిగులభయంకరుడును, వీరుడును, శీఘ్రముగబోవువాడును, పద్మములను బోధించువాడును, మార్తండుడును, బ్రహ్మరుద్రవిష్ణువులకధిపతియును, ప్రకాశించువాడును, దేవతలయొక్క ప్రకాశమువంటి ప్రకాశముగలవాడును, ప్రకాశించుచున్నవాడును, సర్వమును భక్షించువాడును, భయంకరమైన శరీరముగలవాడును, చీకటిని బోగొట్టువాడును, మంచునుబోగొట్టువాడును, శత్రువులను నశింపజేయువాడును, అపతమగు శరీరముగలవాడును కృతఘ్నులను నశింపజేయువాడును, ప్రకాశించువాడును, తేజస్సులకధిపతియును, పుటమువేయబడిన బంగారముయొక్క కాంతివంటి కాంతిగలవాడును, సకలకర్మస్వరూపుడును, చీకటినిబోగొట్టువాడును, కాంతిగలవాడును,లోకములయొక్క కర్మములకుసాక్షియును, నగుసూర్యునికొఱకు నమస్కారము,

మఱియునో రాముడా! ఈసూర్యుడు సకలలోకములకును సృష్టిస్థితిలయములను గలుగజేయునట్టి ప్రభుడనియెఱుంగుము. ఈసూర్యుడు ఉదకపానమును జేయుచుండుచున్నాడు. మఱియు నీసూర్యుడు సకలలోకములకును ఎండనుగలుగజేయుచున్నాడు. మఱియునీసూర్యుడు కిరణములచేత వర్షింపజేయుచున్నాడు. మరియు నీసూర్యుడునిదురనుబొందుచున్న భూతములయందు నంతర్యామిరూపముతోనున్నాడు. మరియు నీసూర్యుడెయగ్నిహోత్ర స్వరూపుడనియును, సోమయాజులకు ఫలమునిచ్చువాడనియును నెఱుంగుము. వేదములును, క్రతువులును, క్రతుఫలమును, మరియు లోకములోనివారల కృత్యములయొక్క ఫలస్వరూపుడును, నీసూర్యుడనియే యెఱుంగుము. మరియునో రాముడా! నానావిధములగునాపదలయందును, అడవులయందును, భయకాలములయందును, ఈసూర్యునిస్మరించువారికి గీడుగలుగనేరదు. కావుననో రాముడా! ఏకాగ్రచిత్తుడవై దేవదేవుడును, జగత్పతియును, నగుసూర్యునిబూజింపుము. మరియునీయాదిత్యహృదయమును, యుద్ధములయందు మూడుపర్యాయములు స్మరించువాడవశ్యముగా జయమునుబొందును. కావుననీవును స్మరింపుము. మిగులగొప్పవగు భుజబలముగల యోరాముడా! ఈక్షణమునందే నీవు రావణాసురుని వధింపగలవనిచెప్పి యాయగస్త్యమహాముని యిష్టానుసారముగబోయెను.

ఇవ్విధముగా నగస్త్యమునివరుడు చెప్పినమాటనువిని రాముడు దుఃఖరహితుడును, వియమితమైన మనస్సుగలవాడునునయ్యె. అంతటరఘుకులోద్భవుడగు రాముడుసూర్యునిజూచి యపరిమితానందమును, బొందె, పిమ్మటవీర్యవంతుడగు రాముడు మూడుపర్యాయములు ఆచమనముజేసి ధనుస్సునుగ్రహించె. అంతట రావణాసురునిజూచి సంతోషించిన మనస్సుగలవాడై యుద్ధమునకుబయలువెడలె. మరియును, సర్వప్రయత్నములచేతను, రావణాసురునివధయందు నిశ్చయముగలవాడయ్యె. ఆసమయమునందు సూర్యుడుసంతోషించిన మనస్సుగలవాడునునై యపరిమితానందమునుబొంది రామునితో రావణాసురునివధించుటకు మిగులశీఘ్రముగా బ్రయత్నమును జేయుమనియె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి నూటయేడవసర్గముగిసెను.

రావణాసురునకు అమంగళకరములగును
త్పాతములుగలుగుట.

అంతట రావణాసురునియొక్క సారథిమిగుల సంతోషముగలవాడై పరసైన్యమును, జీకాకుపఱచుటయందుదగిన సామర్థ్యముగలదియును, గంధర్వ నగరముయొక్కయాకారమువంటి యాకారముగలదియును, మిగులబొడవగు పతాకముగలదియును, మిగులనుత్తమమగు కులమునందు బుట్టినవియును, బంగారపుహారములచేత బ్రకాశించుచున్నవియునునగు గుఱ్ఱములచేత బూన్పబడినదియును, యుద్ధమునకుదగిన సాధనములతోగూడ నిండియున్నదియును పతాకములయొక్కయు, ధ్వజములయొక్కయు, మాలికలుగలదియును, ఆకాశమువఱకును వ్యాప్తమైనదియు

ను, భూమియందంతటను, ధ్వనినిగలుగఁజేయుచున్నది యును, పరసైన్యమును, నశింపజేయుటయందుదగినసామర్థ్యముగలదియును, తమసైన్యమునకుసంతోషమునుగలుగఁజేయునదియును, నగురావణాసురునియొక్క రథమునుమిగులశీఘ్రముగాబోనిచ్చె.

అట్లు మిగులశీఘ్రముగావచ్చుచున్నదియును, అధికముగా ధ్వనినిగలుగఁజేయుచున్నదియును, మిగులగొప్పదగుధ్వనిగలదియును, నగు రావణాసురునిరథమును రాముడుచూచె. మఱియునాసమయమునందు రాముడువల్లనిగుఱ్ఱములతోగూడుకొనినదియును, మిగులభయంకరమగు తేజస్సుతోగూడుకొనినదియును, మెఱుపులవంటి పతాకములచేత మిగులదుష్ప్రహరమైనదియును, చూపింపబడిన యింద్రధనుస్సువంటిధనుస్సుగలదియును, బాణపరంపరలను బయలువెడలజేయుచున్నదియును, వర్షించుచున్న మేఘముతోసమానమైనదియును, నగు శత్రువునియొక్క రథమునుజూచి పర్వతములనుబద్దలుసేయుచున్న వజ్రాయుధముయొక్క ధ్వనివంటి ధ్వనుగలుగునట్లుగా ధనుష్టంకారమును జేయుచునారాముడింద్రసారథియగుమాతలితోనిట్లనియె.

సారథీ! మాతలీ! యుద్ధసన్నద్ధమై వచ్చుచున్నశత్రువుయొక్క రథమునుజూడుము. అపసవ్యముగాను, మిగులవేగముగానువచ్చుచున్న యీరావణాసురుడు నన్నుజంపవలయునని మెదుతలంపుగలవాడైయున్నాడు. కాబట్టిప్రమాదరహితుడవై మనరథమును శత్రురథమునకభిముఖముగా బోనిమ్ము. ఇప్పుడునేనువాయువుమేఘమును బారదోలువిధముగ నీరావణాసురునివధింపదలచి యున్నాను. మఱియునోసారథీ! మాతలీ! వివశతను బొందకుండునట్లును, భ్రాంతినిబొందకుండునట్లును, హృదయమునందును, చూపునందును, వ్యాకులతగలుగకుండునట్లును, పగ్గములువదలిపోకుండునట్లును, రథమునుదోలుము. మఱియు నోమాతలీ! ఇంద్రునకుసారథ్యమును జేయునట్టి నీకునేనేమియును జెప్పనక్కరలేదు. యుద్ధమును జేయదలచిన నేనివ్విధముగ రథముడుండవలసినదని స్మరించుచున్నానుగాని నీకుజెప్పుచుండలేదనియె. ఇవ్విధముగ రాముడుచెప్పినమాటలనువిని యింద్రసారథియగు మాతలిరథమును మిగులమెళకువతోన తిశీఘ్రముగాబోనిచ్చె.

మఱియు నాసమయమునందు సారథియగుమాతలీరామునిరథమునపసవ్యముగాదోలుచు రథచక్రమువలన బుట్టినదుమ్ముచేత రావణాసురునిరథమునుగప్పె. ఆసమయమునందు మిగులసామర్థ్యమును, కోపమునుగలరాముడు మిగులధైర్యరోషములచేతవిజృంభించె. అంతటరావణాసురుడు మిగులకోపముగలవాడును, కోపముచేత నెఱ్ఱనగునేత్రములుగలవాడును, నై రామునిమీద అనేకములగు బాణములనుబ్రయోగించె. అంతటరాముడును అపరిమితమగుకోపముగలవాడై యింద్రునియొక్క ధనుస్సునుగ్రహించి సూర్యునియొక్క కిరణములతో సమానములగుబాణములను రావణాసురునిమీద బ్రయోగించె. అంతటబరస్పరవధనుగోరుచున్న యీరామరావణులుసింహములవలె మిగుల భయంకరమగు యుద్ధమును జేసిరి. ఆసమయమునందు దేవతలును, గంధర్వులును, సిద్ధులును, పరమర్షులును, రావణాసురునియొక్క నాశమునుగోరుచున్నవారై యీయిరువురియొక్కయు యుద్ధమునుజూచుటకువచ్చిరి. ఆసమయమునందు రావణాసురుని నాశమును దెలుపునట్టివియును, రామునకు జయమునుజూపించునట్టివియును, మిగులభయంకరమైనవియును, రోమాంచమునుగలుగజేయునవియును, నగు ననేకోత్పాతములుగలిగె. మఱియు నాసమయమునందువాయుదేవుడు రావణాసురునిరథముమీద బుష్పవర్షమునుగురిపించె. సుడిగాలులు అపసవ్యముగావీచుచుండె. మఱియునునాసమయమున నాకాశమునందు మిగులగొప్పదగుగ్రద్దలయొక్కసముదాయము రావణాసురునియొక్క రథమునకగ్రభాగమునందు మండలాకారముగ దిరుగుచుండె. మఱియునాగ్రద్దలన్నియును, రావణాసురునియొక్క రథమువేవైపునకుబోయిన నావైపునకుబోవుచుండె. మఱియునాసమయమునందు జపాపుష్పముతో సమానమగు సంధ్యాకాలముచేత లంకాపట్టణమంతయును ఆవృతమయ్యె. పగటియందే సంధ్యాకాలమునందుగలిగెడుకాంతి లంకాపట్టణమునందు వ్యాపించుటచేత ఎల్లవారును మిగులనాశ్చర్యమునుబొందిరి. మఱియు నాసమయమునందు మిగులభయంకరములగుపిడుగులును, ఉల్కలును, లంకాపట్టణమునందు అపరిమితముగ బడుచుండె. ఆసమయమునందుఆయుత్పాతములనుజూచి రావణాసురునకు హితమునుగోరునట్టిరాక్షసులందఱును మిగులవ్యసనమునుబొందిరి. అప్పుడురావణాసురుడు భూమితోగూడ గడగడవణకె. మఱియునాసమయమునందు యుద్ధమును జేయుచున్న రాక్షసులయొక్కబాహువులు నిగ్రహింపబడినవైయుండె. మఱియునాసమయమునందు, పర్వతముమీద నానావిధధాతువులువ్యాపించువిధముగ రావణాసురునిమీద తెల్లనివియును, పచ్చనివియును, ఎఱ్ఱనివియును, నగుసూర్యకిరణములనేకములువ్యాపించె. మఱియునుగ్రద్దలన్నియును నిప్పులనుగ్రక్కుచు రావణాసురునిరథముమీదదిరుగుచుండె. మిగులభయంకరమైనవియును, నమంగళకరములైనవియును, న

గుకూతలను బెట్టుచుండె. మఱియు నప్పుడు వాయువు ప్రతికూలముగ వీచుచుండె. మఱియు నావాయువు అపరిమితముగ దుమ్ములను వెదజల్లుచుండె. అప్పుడు రాక్షసాధిపతియగు రావణాసురుని యొక్క నేత్రములయందు దుమ్ము వ్యాపించుట చేత, ముందరనుండు వస్తువులు గోచరములు గాకయుండె. మఱియు నాసమయమునందు రావణాసురుని సైన్యమునందంతటను బిడుగులు పడుచుండె. మఱియు నప్పుడు మేఘములు సహింపగూడని ధ్వనులుగలవై గర్జించుచుండె. మరియును ఆసమయమునందు దిక్కులును, విదిక్కులును, చీకటిచేత వ్యాప్తములయ్యె. మరియు నప్పుడు ఆకాశమంతయును, జూడ శక్యముగాని దుమ్ము చేత వ్యాప్తమయ్యె. మరియు నాసమయమునందు భయంకరములగు కూతలను బెట్టుచు మిగుల భయంకరముగ బోరుచు జిలుకలు అనేకములు రావణాసురుని రథముమీద బడుచుండె. ఆసమయమునందు రావణాసురుని యొక్క గుఱ్ఱములు, జఘనప్రదేశములనుండి స్ఫులింగములును, నేత్రములనుండి కన్నీళ్లను, గార్చుచుండె. ఈవిధముగ ననేకములును, మిగుల భయంకరములైనవియును, రావణాసురునకు నాశమును దెలుపుచున్నవియును, నగు ననేకోత్పాతములు పుట్టె. మరియు నాసమయమునందు రామునకు జయసూచకములగు సుశకునములు అనేకములు గలిగె. అట్టిసుశకునములు అనేకములను జూచి రాముడు మిగుల సంతోషముగలవాడై రావణాసురుని జచ్చినవానిని గా దలచె. మరియు నాసమయమునందు రఘుకులోద్భవుడును, నిమిత్తములను జక్కగ దెలిసినవాడును, నగు రాముడు యుద్ధభూమియందు గలిగిన యనేక నిమిత్తములను జూచి పరమసంతోషమును జెందె. మరియును, యుద్ధమును జేయుటయందు మిగుల గుతూహలముగలవాడయ్యె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి నూటయెనిమిదవసర్గ ముగిసెను.

రామరావణులు లోకమునకు భయమును గలుగజేయు నట్టి యుద్ధము జేయుట.

అంతట నాసమయమునందు రామరావణులకు, మిగుల భయంకరమైనదియును, సకలలోకములకును, భయమును గలుగజేయునదియును నగు యుద్ధము ప్రవర్తించె. ఆసమయమునందు రాక్షసులయొక్కయు, వానరులయొక్కయు, సైన్యమంతయును, రామరావణుల యుద్ధమును జూచి నిశ్చేష్టితమయ్యె.

అవ్విధముగా యుద్ధమును జేయుచున్నవారును, బలవంతులును, నగు రామరావణులను జూచి యుద్ధమును జూడవలయునని యెడ కుతూహలముగల చిత్తముగలవారై మిగుల నాశ్చర్యమును బొందిరి. మరియు నాసమయమునందెల్లవారును ఆశ్చర్యముతో గూడిన బుద్ధిగలవారై నానావిధములగు నాయుధములుగలవియును, మిగుల భయంకరములైనవియును, నగు భుజములతో సమీపించిన యుద్ధమునందు ప్రవేశింపజాలకుండిరి. ఆసమయమునందు రావణాసురుని జూచుచున్న రాక్షసులును, రాముని జూచుచున్న వానరులును, యుద్ధములను జాలించి చిత్తరువులపోలిక నిశ్చేష్టితులై యుండిరి. అప్పుడు వీర్యవంతుడగు రావణాసురుడు అపరిమితమగు కోపముగలవాడై రాముని యొక్క రథమునందనేకములగు బాణములను బ్రయోగించె. ఆసమయమునందు గలుగుచున్న యనేకనిమిత్తములను యుద్ధమును జేయుచున్న రామరావణులను జూచి వానరులును రాక్షసులును, స్థిరమగు కోపముగలవారయ్యును, నిశ్చలచిత్తులై యుండిరి. మరియు నాసమయమునందు రాముడు జయింపవలయునని వానరులును, రావణాసురుడు జయింపవలయునని రాక్షసులును, మిగుల గుతూహలముతో గోరుచుండిరి. అప్పుడు రాముడు రావణాసురుని యొక్క ధ్వజముమీద ననేకములగు బాణములను బ్రయోగించె. ఆబాణములన్నియును, ఇంద్రుని యొక్క రథధ్వజమును ఏమియును జేయజాలక నిర్వీర్యములై క్రిందబడియె. అంతట వీర్యవంతుడగు రాముడు మిగుల కోపముగలవాడై ధనస్సును అధికముగా నాకర్షించి రావణాసురుడు ప్రయోగించిన బాణములను నాశముసేయునట్టి బాణములను, బ్రయోగించుటకు ద్యుక్తుడయ్యె. పిమ్మట రావణాసురుని ధ్వజముమీద అనేకములగు బాణములను బ్రయోగించె. ఆసమయమునందు రావణాసురుని యొక్క ధ్వజము అపరిమితమగు తేజస్సుతో మిగుల క్రూరమైనదియును, గొప్పదియును, నగు సర్పమును బోలియుండె. అట్లు రాముని చేత బ్రయోగింపబడిన రాముని బాణము రావణాసురుని ధ్వజమును విరిచి భూమిని భేదించుకొనిపోయె. ఆసమయమునందు రావణాసురుని యొక్క ధ్వజము విరిగి క్రిందబడియె. అవ్విధముగ విరిగి క్రిందబడిన ధ్వజమును జూచి మిగుల గొప్పదగు బలముగల రావణాసురుడు కోపోద్దీపితుడై క్రోధామర్షములవలన దహించువానివలె గనబడియె. ఆసమయమునందు రావణాసురుడు అపరిమితమగు కోపముగలవాడై యపరిమితముగా బాణవర్షమును గురిపించె. మరియు నందీప్తములగు బాణముల చేత రాముని గుఱ్ఱములను గొట్టె. మరియు నాసమయమునందు ఆగుఱ్ఱములు రావణాసురుని యొక్క బాణముల చేత అపరిమితముగా గొట్టబడినవి

యును, తొట్రుపాటులేనివియును, తిరుగుడుపడనివియును నయ్యె. ఆసమయమునందు గుఱ్ఱములు పద్మనాళములచేత గొట్టబడిన వానివలె స్వస్థచిత్తములు గలవయ్యె. అవ్విధముగ నాగుఱ్ఱములు కొంచెమైనను బాధనొందకుండుటను జూచి రావణాసురుడు మునుపటికంటె నధికమగు కోపముగలవాడై యధికముగా బాణవర్షమును గురిపించె. అట్టిబాణవర్షమువలన ననేకములగు గదలు, పరిఘములు, చక్రములును, ముసలములును, పర్వతశిఖరములును, వృక్షములును, శూలములును, గండ్రగొడ్డండ్లును, మొదలగు నాయుధములుపుట్టె మఱియును రావణుని మాయచేత గల్పింపబడినదియును, సంకులమైనదియును, భయమును గలుగజేయునదియును, భయంకరమైనదియును, భయంకరమగు ధ్వనిగలదియును, నగు నాబాణవర్షము నానావిధములగు నాయుధములను, బాణములను గలిగించుచుండెను. అట్టిబాణవర్షమువలన గలిగిన యాయుధములు రావణాసురునియొక్క రథమునందును, వానరసైన్యమునందును, దట్టముగా వ్యాపించె. మఱియు నాసమయమునందు బాణములచేత నాకాశమంతయును వ్యాప్తమయ్యె ఇవ్విధముగ నపరిమితమగు ప్రయత్నముగల రావణాసురుడు నిస్సంగమగు నంతరాత్మగలవాడై యనేకవేల బాణములను బ్రయోగించె. అట్లు యుద్ధసన్నద్ధుడును, అపరిమితములగు బాణములుగలవాడును, నగు రావణాసురునిజూచి రాముడు నవ్వుచు మిగుల దీక్ష్ణములగు బాణములను సంధానమును సేసె. పిమ్మట నయ్యుద్ధమునందు రాముడు అనేకములగు బాణములను బ్రయోగించె. అట్లు రాముడు ప్రయోగించిన బాణములనుజూచి రావణాసురుడు అనేకములగు బాణములచేత నాకాశమును సర్వమును వ్యాపింపజేసె. అట్లు రామరావణులచేత బ్రయోగింపబడిన బాణవర్షముచేత వ్యాప్తమైన యాకాశము రెండవయాకాశమువల బ్రకాశించుచుండె ఆబాణములలో నొక్కటియైనను నిష్కారణముగ బ్రయోగింపబడనిదిలేదయ్యె. మరియు నాబాణములలో నొక్కటైనను, శత్రువులను భేదింపనిదియును, నిష్ఫలమైనదియును, లేదయ్యె. ఆబాణములన్నియును నొకదానితో నొకటికొట్టుకొనినవై క్రిందబడియె. ఆసమయమునందు రామరావణులు సవ్యాపసవ్యగతులతో నపరిమితముగా బాణములను బ్రయోగించి యుద్ధమునుజేసె. మరియు నాసమయమునందు రామరావణుల బాణములచేత ఆకాశమంతయును దట్టముగా వ్యాప్తమయ్యె మరియు నాసమయమునందు రావణాసురునియొక్క గుఱ్ఱములను రాముడును, రామునియొక్క గుఱ్ఱములను, రావణాసురుడును, అపరిమితముగా గొట్టిరి. మరియు నాసమయమునందు రామరావణులు మిగుల గొప్పదగు యుద్ధమును జేసిరి. ఆయుద్ధము, క్షణమాత్రమునేవు మిగుల సంకులమైనదియును, రోమాంచముగలదియును, నై యుండె. మరియు నాసమయమునందు మహాబలులగు రామరావణులు మిగుల దీక్ష్ణములగు బాణములను బ్రయోగించుచుండిరి. అప్పుడు రాముడు రావణుని ధ్వజమును బడవైచె. అంతట రావణుడు అపరిమితమగు

శ్రీమద్యుద్ధకాండము నందలి నూటతొమ్మిదవ సర్గ ముగిసెను.

—{ రామునిచే రావణునితలలు ఖండింపబడుచుండెననుమరలమరలవృద్ధియగుట. }—

అట్లు మిగుల భయంకరముగా యుద్ధమును జేయుచున్న రామరావణులనుజూచి సకల భూతములును నధికముగా నాశ్చర్యమును బొందె. ఆసమయమునందు రామరావణులిరువురును అపరిమితమగు కోపముగలవారై యొకరిరథముచేత నొకరిరథము రుద్దుచు నతిశీఘ్రముగ రథములను దోలించిరి. మరియు నయ్యిరువురును, పరస్పర మరణమును గోరుచున్నవారును, భయంకరములగు నాకారములు గలవారునునైరి. మరియును మండలగతులచేత రాకపోకలను జేయుచుండిరి మరియు ననేకవిధములగు రథగతులను జూపుచుండిరి. ఆసమయమునందు రాముడు రావణాసురుని పీడించుచుండె. రావణాసురుడు రాముని బాధించుచుండె. మరియును అపరిమితమగు వేగముతో వచ్చుచు బోవుచునుండిరి. మరియు నొకరిరథముమీద నొకరుమిగుల దీక్ష్ణములగు బాణములను నపరిమితముగా బ్రయోగించుచుండిరి. మరియు నప్పుడు యుద్ధభూమియందు రామరావణులిరువురును, ధారావర్షమును గలుగజేయుచున్న మేఘములను బోలి యుండిరి. ఒకరిరథముయొక్క కాడిని, మరియొకరి రథముయొక్క కాడితోడను, రథముయొక్క ముఖమును ముఖముతోడను దాకునట్లు రథమును దోలించుచుండిరి. మరియు నాసమయమునందొక రథముయొక్క మరియొకరథముయొక్క పతాకతో దగులుకొనియె.

అంతట రాముడు అపరిమితమగు కోపముగలవాడై మిగులదీక్ష్ణములగు నాలుగు బాణములచేత రావణాసురుని యొక్క గుఱ్ఱములనుగొట్టె: అంతనాగుఱ్ఱములు తొలగిపోయె. అవ్విధముగ గుఱ్ఱములు భయముచేత దొలగుటను జూచి రావణాసురుడు అపరిమితమగు కోపముగలవాడై

మిగులదీక్ష్ణములగు బాణములను బ్రయోగించెను. అట్లు రావణాసురునిచేత నారాముడు కొట్టబడినవాడై యపరిమితమగు కోపము గలవాడయ్యెనుగాని కొంచెమైనను వికారముగలవాడును, వ్యసనముగలవాడును గాకపోయె. అంతట నారావణుడు వజ్రాయుధముతో సమానములగు బాణములను మాతలిమీద బ్రయోగించెను. అట్లు మిగుల వేగముగల బాణములచేత గొట్టబడియును, మాతలియైనను కొంచెమైనను వ్యసనమును బొందలేదు. అప్పుడు రాముడు మిగుల గోపముగలవాడై రావణాసురునిమీద అనేక బాణములను బ్రయోగించి రావణాసురుని విముఖునిగాజేసెను. మఱియు నొక్కొక్కటూరి యిరువదేసి బాణములను, ముప్పదేసిబాణములను, అరువదేసిబాణములను, నూరేసి బాణములను బ్రయోగించుచుండెను. అంతట రావణాసురుడు అపరిమితమగు కోపముగలవాడై గదల యొక్కయు, ముసలములయొక్కయు, వర్షమును గురిపించెను. అప్పుడు ఆ రామరావణుల కిరువురకును, మిగుల భయంకరమగుయుద్ధమయ్యెను. మఱియు నాసమయమునందు గదల యొక్కయు, ముసలములయొక్కయు, పరిఘములను, నాయుధములయొక్కయు, బాణములయొక్కయు, పడుటవలన గలిగిన ధ్వనిచేత సముద్రములన్నియును, మిగుల క్షోభను బొందెను. అట్లు సప్తసముద్రములును, క్షోభను బొందుటవలన పాతాళలోకమునందు నివసించునట్టి పన్నగదేవదానవాదులు మిగుల బాధనొందినవారైరి. మఱియు నాసమయమునందు పర్వతములతోడను, వనములతోడను, గూడుకొనిన భూమియంతయును గంపమును బొందెను. మఱియు నప్పుడు సూర్యుడు కాంతిహీనుడయ్యెను. వాయువుసంచరింపక యూరకుండెను. అంతట దేవతలును, గంధర్వులును సిద్ధులును, పరమర్షులును, కిన్నర మహోరగులును, మిగుల విచారమును బొందిరి. మఱియు నప్పుడు వారందఱును గోబ్రాహ్మణులకు మేలుగలుగవలయుననియును, లోకములకు మేలుగలుగవలయుననియును నాశీర్వచనమునుజేసిరి. రాముడు రావణాసురుని జయింపవలయునని యాశీర్వచనములను జేసిరి.

ఇవ్విధముగా దేవతలును, ఋషులును, ఆశీర్వచనములనుజేసి మిగుల భయంకరమైనదియును, రోమాంచమును గలుగజేయునదియును, నగు రామరావణులయొక్క యుద్ధమును జూచుచుండిరి మఱియును రామరావణులయుద్ధము నిరుపమానమగుటచేత రామరావణుల యుద్ధమునకు రామరావణుల యుద్ధమే సమానమనియును, ఆకాశమునకు ఆకాశమే సమమైనవిధముగ సాదృశ్యరహితమై యున్నదనియును జెప్పిరి. ఇవ్విధముగ జెప్పికొనుచు దేవదానవగంధర్వాదులు మిగుల నాశ్చర్యముగలవారై యాయుద్ధమును జూచుచుండిరి. అంతట రఘుకులము నందలి వారలయొక్క కీర్తిని వృద్ధిబొందించువాడును, మిగులగొప్పదగు భుజబలము గలవాడును నగు రాముడు కోపోద్దీపితుడై సర్పముతో సమానమగు బాణమును సంధానముచేసి మిగుల ప్రకాశించుచున్న కుండలములతో గూడుకొనిన రావణునియొక్క శిరస్సును ఖండించెను. అంతట రావణాసురుని శిరస్సు మూడులోకములవారును జూచుచుండగ గ్రిందబడియె. అప్పుడే మరల రావణాసురునకు దొల్లిటిశిరస్సుతో సమానమగు శిరస్సుగలిగె. ఆశిరస్సుగూడ రామునిచేతఖండింపబడియె. మరల మరియొకశిరస్సు మునుపటి విధముగ నుత్పన్నమయ్యె. ఆశిరస్సునుగూడ వజ్రాయుధముతో సమానములగు బాణములచేత ఖండించెను. ఇవ్విధముగా సమానమైన తేజస్సుగల నూరు శిరస్సులు ఖండింపబడియె. అప్పటికిని రావణాసురుడు మరణమును బొందడయ్యె. అంతట సకలాస్త్రములయొక్క రహస్యమును తెలిసినవాడును, కౌసల్యకు సంతోషమును గలుగజేయువాడును, నగు రాముడు అనేకవిధములగు బాణములతో గూడినవాడై యిట్లని యోచించెను. ఆహా! యిదియేమి? విచిత్రముగ నున్నది. నేనీబాణములచేతనే ఖరదూషణాదులను సంహరించితిని. క్రౌంచావనియందు విరాధుని వధించితిని. దండకారణ్యమునందు కబంధుని వధించితిని. ఈబాణములన్నియును నాకు యుద్ధమునందు నమ్మకమును గలిగించియుండెను. అట్టిబాణములన్నియును నిప్పుడేమి కారణముచేత బ్రయోజనరహితములయ్యెనో గదా! యనిరాముడు మిగులవిచారముగలవాడయ్యె. అట్లువ్యసనముగల వాడయ్యును యుద్ధమునందు గొంచెమైనను విచారములేనివాడయ్యె. మరియు నాసమయమునందు రఘుకులోద్భవుడగు రాముడు రావణాసురునియొక్క వక్షస్థలమునందు అపరిమితముగ బాణవర్షమునుగురిపించెను. అప్పుడు రాక్షసాధిపతియగు రావణాసురుడు అపరిమితమగు కోపముగలవాడై రామునిమీద గదలను, ముసలములను వర్షింపజేసెను. అంతట మిగుల గొప్పదియును, రోమాంచమును గలుగజేయునదియును, సంకులమైనదియును నగు యుద్ధముజరిగె. ఇవ్విధముగరామరావణులిరువురును, దేవదానవయక్షులును, పిశాచోరగ రాక్షసులును జూచుచుండగ నంతరిక్షమునందును, భూమియందును, పర్వతశిఖరమునందును నిలిచి యేడురాత్రులు మిగుల భయంకరమగు యుద్ధమునుజేసిరి. ఆయేడుదినములలోపల నొక్కక్షణము నేమైనను విరామములేక జ

రుగుచుండె. అట్టిరామ రావణయుద్ధమునందు రామునకు జయము గలుగకుండుటఁజూచి యింద్రునిసారథియగు మాతలి రామునితో నిట్లనియె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి నూటపదియవసర్గ ముగిసెను.

▸✱◂

— బ్రహ్మాస్త్రముచేజంపుమనిమాతలివలనఁజెప్పబడిన రాముడు రావణాసురుని సంహరించుట. —

అంతట మాతలిరామున కొక్కవిషయమును దెలుపఁదలచి యిట్లనియె.

ఓ, ఓ, రాముడా! వీరుడా! నీవేమినిమిత్తముగ యిట్లువ్యసనమును బొందుచున్నావు. నీకు దెలియని విషయమే మిగలదు? ప్రభుడవైనయో రాముడా! ఈరావణాసురుని జంపుటకొఱకు బ్రహ్మాస్త్రమును బ్రయోగింపుము. రావణాసురుడు బ్రహ్మాస్త్రముచేత నాశమునుబొందును. రావణాసురునకు వినాశకాలము సంభవించినదనియె. అంతట రాముడు మాతలియొక్క వాక్యమునువిని బ్రహ్మాస్త్రమును జ్ఞప్తికిదెచ్చుకొనియె.

అంతట మిగుల ఘోరమైనదియును, నిట్టూర్పులను విడుచుచున్నదియును, నగుసర్పముతో సమానమగు బ్రహ్మాస్త్రమునుగ్రహించె. ఆబ్రహ్మాస్త్రము, యుద్ధములయందు అమోఘమగు పరాక్రమము గలదియును, బ్రహ్మదేవునిచేత నివ్వబడినదియును, అగస్త్యమహామునివలన గ్రహింపబడినదియును, దేవేంద్రునికొఱకు బూర్వము బ్రహ్మదేవునిచేత నిర్మింపబడినదియును, ముల్లోకములను జయింపదలచినయింద్రునకు జయమును గలుగజేసినదియును, పక్షములయందు వాయుదేవుడు గలదియును, ఫాలభాగమునందు సూర్యాగ్నులు గలదియును, ఆకాశమయమగు శరీరముగలదియును, గౌరవమునందు మేరుమందరములతో సమానమైనదియును, అధికముగ బ్రకాశించుచున్న శరీరముగలదియును, మిగుల దృఢమగుపిడిగలదియును, బంగారముచేత నలంకరింపబడినదియును, సకలభూతములకును రెండవసూర్యుడు గాబోలునను తలంపును గలుగజేయుచున్నదియును, ధూమముతోగూడిన ప్రళయకాలాగ్నిని బోలినదియును, మిగులకోపముగల సర్పముతో సమానమైనదియును, శత్రుసేనలోని యేనుగులు, గుఱ్ఱములు, మొదలగువానిని సంహరించునట్టిదియును, ద్వారములను, పరిఘములు, పర్వతములు, మొదలగువానిని బ్రద్దలుసేయునదియును, నానావిధరక్తములచేత బూయబడిన శరీరముగలదియును, మేదస్సుచేత వ్యాప్తమైనదియును, మిగులభయంకరమైనదియును, వజ్రాయుధముయొక్క సారమువంటి సారముగలదియును, సర్వలోకములకును భయమును గలుగజేయునదియును, నిట్టూర్పులను విడుచుచున్న సర్పముతో సమానమైనదియును, కంకములు, గృధ్రములు, బొల్లిగ్రద్దలు, నక్కలు, రాక్షసులు, మొదలగువారికి భయమునుగలుగ జేయుచున్నదియును, యమునివలె భయంకరమైనదియును, వానరోత్తములకు సంతోషమును గలుగజేయునట్టిదియును, రాక్షసులకు నాశమునుగలుగ జేయునట్టిదియును, గరుత్మంతునియొక్క ఱెక్కలవంటి ఱెక్కలుగలదియును, సకలలోకములవారిచేతను గొనియాడదగినదియును, ఇక్ష్వాకువంశమునందు బుట్టినవారలకు భయమును బోగొట్టునట్టిదియును, శత్రువులయొక్క కీర్తినినశింపజేయునట్టియును, ప్రయోగించువానికి సంతోషమును గలుగజేయునట్టిదియును, నైయుండె. అట్టిబ్రహ్మాస్త్రమును రాముడభిమంత్రించి వేదోక్తవిధిచేత ధనుస్సునందు సంధానముచేసె.

ఆబ్రహ్మాస్త్రము ఆవిధముగా రామునిచేత సంధానముచేయబడిన సమయమునందు సకలభూతములును మిగుల భయమునుబొందె. భూమియంతయును గడగడవణకె. అంతట శత్రువునియొక్క మర్మస్థానములను భేధించునట్టి యాబ్రహ్మాస్త్రమును సంధించె. విశాలమగు ధనుస్సునలాగి రావణాసురుని సంహరించుటకొఱకు బ్రయోగించె. అంతట నాబ్రహ్మాస్త్రము దేవేంద్రునిచేత బ్రయోగింపబడిన వజ్రాయుధమువలెను, యమునివలెను, నివారింపనలవిగానిదై యతివేగముగబోయి రావణాసురునియొక్క వక్షస్స్థలమునందుబడియె. అంతట శరీరమునకు నాశమునుగలుగజేయునట్టిదియును, మిగులవేగముగలదియును, రామునిచేత బ్రయోగింపబడినదియును, నగునాబ్రహ్మాస్త్రము దురాత్ముడగు రావణాసురునియొక్క హృదయమును భేదించె.

పిమ్మట జీవితాంతకరమగు నాబ్రహ్మాస్త్రము రావణాసురునియొక్క ప్రాణములనపహరించినదై భూతలమునందు బ్రవేశించె. మఱియు నాబ్రహ్మాస్త్రము అవ్విధముగా రావణాసురునియొక్క ప్రాణములనపహరించి నెత్తురుచేత వ్యాప్తమైనదగుచు మరలనతివేగముతోవచ్చి రామునియొక్క యంబులపొదియందు మరలబ్రవేశించె. ఆసమయమునందు రావణాసురునియొక్క హస్తమునందలి ధనుర్బాణములు క్రిందబడియె. అంతట రావణాసురుడు ప్రాణరహితుడై రథముమీదనుండి క్రిందబడియె. అవ్విధముగా, గొప్పదగు కాంతిగలవాడును, భయంకరమైన వేగముగలవాడును, రాక్షసాధిపతియును, నగురావణాసురుడు వజ్రాయుధముచేత గొట్టబడిన వృత్రాసురునివలె గ్రిందబడియె.

అట్లు మరణమునుబొంది క్రిందబడియున్న రావణాసురుని జూచి హతశేషులగు రాక్షసులందఱును దిక్కులేనివారును, భయము గలవారును నై నానాదిక్కులకు బరుగెత్తిరి. ఆసమయమునందు వృక్షములే ఆయుధములుగాగల వానరులందఱును మిగులసంతోషముచేత గూతలిడుచు నారాక్షసుల నందఱను దఱిమిరి.

అట్లు రావణాసురుడు మరణమును బొందుటచేతను, రాముడు జయించుటచేతను, వానరులు, రాక్షసులందఱును నానావిధములుగా బాధించిరి. అంతట రాక్షసులందఱును మిగుల భయముగలవారై లంకాపట్టణమునకు బరుగెత్తిరి. మఱియు నాసమయమునందు రాక్షసులందఱును, దిక్కులేనివారగుటచేత దీనస్వరముతో నేడ్చుచున్నవారును, కన్నీళ్ళచేత వ్యాప్తమైనముఖములు గలవారును నైరి. మఱియు నాసమయమునందు జయశీలురగు వానరులు రామునియొక్కజయమునుఘు, రావణాసురునియొక్క వధను జెప్పికొనుచు నపరిమితముగా సింహనాదములను జేసిరి. ఆసమయమునందు దేవతలు ఆకాశమునందు దుందుభులను వాద్యములను బ్రయోగించిరి. వాయువు దివ్యమగు గంధముగలదై వీచుచుండె. ఆకాశమునుండి భూమియందు బుష్పవర్షముగురిసె. ఆపుష్పవర్షము రామునియొక్క రథమునందు మిగులమనోహరముగా బడుచుండె. మఱియునంతరిక్షమునందు సంచరించువారు రాముని గొనియాడుచుండుటచేత వారిస్తోత్రధ్వనులు మిగుల స్పష్టముగా వినబడుచుండె. మఱియు నాసమయమునందు దేవతలందఱును నంతరిక్షమునందుండి మేలు మేలని ప్రశంసించుచుండిరి. ఆప్రశంసాధ్వనులు సర్వస్థలములయందును వ్యాపించె. మఱియు నాసమయమునందు దేవతలును, చారణులును, మహానందమును బొందిరి.

మఱియును, సర్వలోకములకును, భయంకరుడును, రౌద్రుడును, నగు నారావణాసురుని జంపి రఘుకులోద్భవుడగు రాముడు మిగుల బ్రియముగలవాడై మహాబలులగు సుగ్రీవాంగదాది వానరులకు అపరిమితానందమును గలుగజేసె. ఆసమయమునందు మరుద్గణములు మిగుల నానందమును బొందె. దిక్కులు నిర్మలములయ్యె. ఆకాశము స్వచ్ఛముగనుండె. భూమియంతయును గంపములేనిదయ్యె. వాయువు చక్కగా వీచుచుండె. సూర్యుడు స్థిరమగు కాంతిగలవాడయ్యె. అంతట సుగ్రీవవిభీషణాది స్నేహితులు లక్ష్మణునితో గలిసికొని పరమానందముగల వారగుచు శాస్త్రవిధిచేత రాముని బూజించిరి. మఱియు నాసమయమునందు శత్రునిసంహరించిన రాముడు సకలసైన్యముతో గూడుకొనినవాడై "దేవతలతో గూడుకొనిన యింద్రునివలె" బ్రకాశించె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి నూటయెనిమిదవ సర్గము ముగిసెను.

(*)

—{ మరణమును బొందిన రావణాసురుని జూచి విభీషణుడు దుఃఖించుట. }—

అంతట రామునిచేత జంపబడియున్నవాడును, మరణమును బొంది భూమియందు బడియున్నవాడును, నగు రావణాసురుని జూచి విభీషణుడు శోకవేగపరీతాత్ముడై యిట్లని విలపించె.

అయ్యో! అన్నా! వీరుడా! పరాక్రమముచేత బ్రసిద్ధుడా! వినయమును, నీతిని, జక్కగ దెలిసినవాడా! మిగులవెలగల శయ్యయందు బరుండదగినవాడా! ఇప్పుడు రామునిచేత జంపబడి భూమియందు బడియుంటివా? ఓ అన్నా! రావణాసురుడా! మిగులబొడవు గలవియును, అంగదములను సొమ్ములచేత నలంకరింపబడినవియును, నగు భుజములను క్రిందబడవైచుకొని నిద్రించుచున్నావా? అయ్యో! అన్నా! సూర్యునియొక్క తేజస్సువంటి తేజస్సుగల నీకిరీటము క్రిందబడిపోయినదా? అయ్యో! అన్నా! రావణాసురుడా! పూర్వము నే నిట్టియవస్థ సంప్రాప్తమగునని చెప్పియుంటిని. అట్టియవస్థను నిప్పుడు పొందుచున్నావా? కామమోహితుడవగు నీకు ఆసమయమునందు నామాటయందు ఇష్టములేకపోయెగదా? సీతాదేవిని అపహరించుటవలన నిట్టువంటి నాశము గలుగునని దర్పమువలన బ్రహస్తుడు పలుకపోయె. ఇంద్రజిత్తును దలపడయ్యె. మఱియు నితరులగు వారును దలపరైరి. అతిరథుడగు కుంభకర్ణుడును దలపోయడయ్యె. అతికాయ నరాంతకులును దలపరైరి. నీవును దలపవైతివి. మఱియును ఓ అన్నా! రావణాసురుడా! నీవు మిగుల జక్కనివగు నీతులకు అవధియైయుంటివి. మఱియు మూర్తీభవించిన ధర్మస్వరూపుడవైతివి. ఆకారమును ధరించినబలమవి చెప్పవగియుంటివి. ప్రస్తావములకు బరమావధివై యుంటివి. ఇట్టినీవు నేడు మరణమును బొందితివి నేనేమిచేయుదును. మఱియు ఓ అన్నా! రావణాసురుడా! వీరుడవగు నీవీయుద్ధభూమియందు బడియుండుటచూడగా సూర్యుడు భూమియందు బడినట్లు తోచుచున్నది. చీకటియందు జంద్రుడు మునిగిపోయినట్లున్నది. అగ్నిహోత్రుడు జ్వాలలను, తేజస్సును లేనివాడై క్రిందబడియున్నట్లు తోచుచున్నది. వీరుడవగు నిన్ను జంపిన యీరాముని కు భూలోకమునందు శక్యముగాని కార్యమే దిగలదు.

మఱియును ఓ అన్నా! రావణాసురుడా! వీరుడవగు నీవు

మరణమునుబొంది యీదుర్మ్ము నేలయందు బడియుండుట చూడగా భూమియంతయును శూన్యమైనట్లుతోచుచున్నది. మఱియు నిప్పుడు ధైర్యమనియెడు చిగురుటాకులుగలదియును, ప్రసహమనియెడు పుష్పములుగలదియును, తపస్సనియెడు బలముగలదియును, శౌర్యమనియెడు వ్రేళ్లుగలదియును, నగురావణాసురుడనియెడు వృక్షము రాముడను వాయువుచేత బెల్లగింపబడియె. మరియును, తేజస్సనియెడు కొమ్ములుగలదియును, పితృపితామహాది వర్గమనియెడు పృష్ఠభాగావయవము గలదియును, ప్రసాదమనియెడు తుండమునుగలదియును, క్రోధమనియెడు నపరగాత్రముగలదియును, నగురావణాసురుడనియెడు మదపుటేనుగు రాముడనియెడు సింహముచేత జంపబడియె.

మరియును, పరాక్రమోత్సాహములనియెడు విజృంభించిన జ్వాలలుగలదియును, నిట్టూర్పువాయువులనియెడు ధూమముగలదియును, స్వబలమనియెడు ప్రతాపముగలదియును, నగురావణాసురుడనియెడు అగ్నిహోత్రము రాముడనియెడు మేఘునిచేత సంహరింపబడియె. రాక్షసోత్తములనియెడు మూపురమును, కొమ్ములును గలదియును, శత్రువులను జయించుటయందు మదపుటేనుగుతో సమానమైనదియును, చాపల్యమనియెడు నేత్రములను, చెవులును గలదియును, నగురావణాసురుడనియెడు వృషభము, రాముడనియెడు పెద్దపులిచేత జంపబడియెనని యనేకవిధముల విభీషణుడు విలపించుచుండె. ఇవ్విధముగ నభిప్రాయగర్భితములగు వచనములను బలుకుచున్నవాడును, విచారింపబడిన సకలకార్యార్థ నిశ్చయముగలవాడును, దుఃఖముచేత వ్యాప్తమైన చిత్తముగలవాడును, నగువిభీషణునితో రాముడిట్లనియె.

రాక్షసోత్తమా! విభీషణుడా! ఈరావణాసురుడు పరాక్రమరహితుడై మరణమును బొందినవాడుగాడు. యుద్ధమునందు మిగుల భయంకరమగు పరాక్రమమును జూపినవాడై మరణమునుబొందె. మఱియు నీరావణాసురుడు అపరిమితమగు నుత్సాహముతో యుద్ధమునుజేసి భూమియందుబడియె. ఇవ్విధముగా క్షత్రధర్మము నవలంబించి యుద్ధమును జేసినవారును, వృద్ధినిగోరుచు యుద్ధరంగమునందు సంచరించువారునునై మరణమును బొందినవారలను గుఱించి వ్యసనమును బొందగూడదు. మఱియునో విభీషణుడా! ఈరావణాసురుడు యుద్ధమునందు దేవేంద్రునితో గూడ ముల్లోకములను నశింపజేసె. అట్టిపరాక్రమముగల యీరావణాసురుడు కాలవశమునుబొందె. కావుననితనిని గుఱించి వ్యసనమునుబొందుట యుచితముగాదు. మఱియునో విభీషణుడా! యుద్ధమునందు జయముగలుగునని నిశ్చయములేదు.

శత్రువులచేత దానుమరణమును బొందినను బొందును. లేక తానుజయించినను జయించును, పూర్వులందఱును క్షత్రియుల కీవిధమగు గతిగలుగునని నిశ్చయించిరి. ఇప్పుడు క్షత్రియధర్మము నవలంబించిన యీరావణాసురుడు యుద్ధమునుజేసి మరణమునుబొందె. కావున వ్యసనమును బొందగూడదు. కావుననీవిషయమును సర్వమును జక్కగవిచారించి వ్యసనరహితుడవుగమ్ము. పిమ్మట కార్యములను గుఱించి యోచింపుమనియె. ఇవ్విధముగా మాటలాడుచున్నవాడును, పరాక్రమవంతుడును, రాజనందనుడునునగు రామునితో శోకసంతప్తుడగు విభీషణుడు రావణాసురునకు హితమును జేయదలచినవాడై యిట్లనియె.

రాముడా! ఈరావణాసురుడు యిదివఱకెన్నడును యుద్ధములయందపజయమును బొందినవాడుగాడు. అట్టివంటి రావణాసురుడు యిప్పుడు నిన్నెదిరించి సముద్రమును తీరమును జేరినను, వచ్చి భగ్నమైనవిధముగ భగ్నుడయ్యె. మఱియునో రామచంద్రుడా! ఇతనిచేత ననేకములగు దానములు జేయబడినవి. మఱియునితడు సేవకులను అపరిమితముగా బూజించె. మరియునీ రావణాసురునిచేత ననేకములగు భోగములను భవింపబడియె. అనేకమంది భృత్యులు చక్కగా గాపాడబడిరి. మిత్రులకపరిమితముగ ధనములివ్వబడియె. అనేకమంది శత్రువులు సంహరింపబడిరి. మరియునో రాముడా! ఈరావణాసురుడు అగ్నిపూజను నిత్యమును జేయుచుండును. మిగులగొప్పదగు తపస్సును జేసె. వేదాంతములను జక్కగనెరింగినవాడు. వైదికకర్మలయందు ముందుగాగణన జేయదగినవాడు. కావునమరణమునుబొందిన యీరావణాసురుడు వేదోక్తవిధిచేత దహింపదగినవాడు. అట్టికార్యమును నీయనుగ్రహముచేత జేయవలయునని యిచ్ఛయించుచున్నాను. అనుజ్ఞనిమ్మనియె. ఇవ్విధముగా విభీషణుడు చెప్పినమాటలనువిని మహానుభావుడగు రాముడువిభీషణునితో నిట్లనియె.

రాక్షసరాజోత్తమా! విభీషణుడా! ఈరావణాసురునకు స్వర్గలోకప్రాప్తి సాధనములగు ప్రేతకృత్యములను వేదోక్తప్రకారముగ జేయుము. మరియునో విభీషణుడా! వైరములు మరణమును బొందువఱకేగాని పిమ్మటగూడనుండవు. ఒకవేళ వైరము నవలంబించినను బ్రయోజనములేదు. కావుననాకిప్పుడు యీరావణాసురునిమీద విరోధమేమియును లేదు. కాబట్టి యీరావణాసురునకు వేదోక్తప్రకారముగ ప్రేతకృత్యములను జేయుము. నీకీరావణాసురు

వియుండు ఏవిధముగు ప్రియముగలదో నాకునునిప్పుడట్టిప్రేమగలిగియున్నది. కావున ప్రేతకృత్యములను జరుగఁజేయుమనెను.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి నూటపదిరెండవసర్గము ముగిసెను.

✽

మరణముపొందిన రావణాసురునివద్దకు అంతఃపురస్త్రీలువచ్చి దుఃఖించుట.

అట్లు మహాత్ముడును, రఘుకులోద్భవుడును, నగు రామునిచేత రావణుడు చంపబడెనను వార్తవిని రాక్షసస్త్రీలందఱును దుఃఖముచేత కృశించినవారలగుచు నంతఃపురమునుండి బయలువెడలిరి.

అంతట నాస్త్రీలందఱు బహువిధములుగా దమవారిచేత నివారింపబడిన వారలయ్యును దుఃఖమును భరింపజాలక భూమియందుబడి పొర్లిగింతలను బెట్టిరి. మరియు నా సమయమునందు స్త్రీలందఱును దుఃఖముచేత బీడింపబడినవారును, వీడిపోయినకొప్పులు గలవారునునై "దూడలేని గోవులవలె" రోదనమును జేయుచుండిరి. అంతట నాస్త్రీలందఱును రాక్షసులతో గూడ లంకాపట్టణము యొక్క యుత్తరద్వారమునుండి బయలువెడలిరి. అంతట మిగుల భయంకరమగు యుద్ధభూమియందు బ్రవేశించి మరణమును బొంది క్రిందబడియున్న రావణాసురుని వెదకుచుండిరి.

మరియు నో మహారాజా! ప్రాణనాయకుడా! రావణాసురా! అని సర్వస్థలములయందును అపరిమితముగా రోదనమును జేయుచుండిరి. అంతట గొంతసేపటికి రావణాసురుని మొండెముతో గూడుకొనినదియును, నెత్తురుచేత బురదబురదగా జేయబడినదియును, నగు భూమియందు బ్రవేశించిరి. అంతట నాస్త్రీలందఱును, కన్నీళ్ళచేత వ్యాప్తమైన నేత్రములు గలవారును, భర్తృమరణ దుఃఖముచేత బీడింపబడిన వారునునై మగఱేనుగు చచ్చినపిమ్మట ఆడేనుగులు రోదనమును జేయువిధముగ రోదనమును జేసిరి. అంతట మిగులగొప్పదగు పరాక్రమముగలవాడును, మిగుల గొప్పదగు శరీరముగలవాడును, మిగులగొప్పదగు తేజస్సు గలవాడును, కాటుకకొండవలె క్రిందబడియున్నవాడును, నగు రావణాసురుని జూచిరి. అట్లు యుద్ధభూమియందలి దుమ్మునందు బొర్లిగింతలను బెట్టుచున్నవారును, భర్తయును, నగు రావణాసురుని జూచి యాస్త్రీలందఱును ఛేదింపబడినలతలవలె రావణాసురుని యొక్క యవయవములయందు బడిరి.

ఆసమయమునందు ఒకస్త్రీ మిగుల ప్రేమగలదగుటవలన మృతుడగు రావణాసురుని కౌగిలించుకొని రోదనమును జేసె. మరియొకతె రావణాసురుని యొక్క పాదములవాలింగనమును జేసికొని రోదనము జేసె. మరియొకతె కంఠము గౌగిలించుకొని రోదనమును జేసె. మరియొకతె భుజములను కౌగిలించుకొని రోదనమును జేసె. మరియొకతె భూమియందుబడి పొర్లిగింతలు పెట్టుచు రోదనమును జేయుచుండె. మరియొకతె రావణాసురుని యొక్క శిరస్సును దొడమీద బెట్టుకొని యతని ముఖమును జూచుచు రోదనమును జేయుచుండె. మరియొకతె మరణమును బొందియున్న రావణాసురుని యొక్క ముఖమును జూచి మోహమును బొందె. మరియొకతె తనకన్నీళ్ళచేత రావణాసురుని యొక్క ముఖమును దడుపుచు రోదనమును జేయుచుండె. ఈ ప్రకారముగా నాస్త్రీలందఱును, మరణమును బొంది క్రిందబడియున్న రావణాసురుని జూచి యధికముగా రోదనమును జేసిరి. మరియు నివ్విధముగా నాస్త్రీలందఱును యిట్లు విలపించిరి.

అయ్యో! మనోనాయకుడా! దేవేంద్రుని బారద్రోలితివి. యమునకు భయమును గల్పించితివి. కుబేరుని పుష్పకమును నపహరించితివి. మరియు నో మనోనాయకుడా! ప్రాణనాథా! గంధర్వులను, ఋషులను, దేవతలను, మరియు నితరులగు మహానుభావులను బలుమారులు జయించితివి. అట్టి నీవిప్పుడు మరణమును బొందితివే? హా! దైవయోగమున కే మనవచ్చును. మరియు నో రావణాసురుడా! ప్రాణనాయకుడా! నీకిదివఱకు, రాక్షసులు, దేవతలు, పన్నగులు, మొదలగు వారలలో నెవ్వరివలనను భీతి కలిగినది గాదు. అటువంటి నీవిప్పుడు మనుష్యుని మూలకముగ మరణమును బొందితివి, మరియు నో రాక్షసోత్తమా! ప్రాణనాయకుడా! దేవతలచేతను, దానవరాక్షసులచేతను, జయింపనలవిగాని వాడవై యుంటివి.

అటువంటి నీవిప్పుడు పదాతియును, మానవుడును నగు రామునిచేత జంపబడితివా? అహా! ప్రాణనాథా! దేవతలు, యక్షులు, రాక్షసులు, మొదలగువారిచేత జయింపనలవిగాని వాడవును, మృత్యుదేవతకు సమానుడవును నగు నీవు మర్త్యునిచేత మరణమును బొందితివి. మే మేమి చేయగలమని యాస్త్రీలందఱును నీవిధముగా రావణాసురుని యొక్క గుణములను జెప్పికొనుచు నధికముగా రోదనమును జేసిరి. మరియును, మరలమరల నపరిమితముగా రోదనమును జేయుచు రావణాసురుని గుణములను బొగడుచుండిరి. మరియు నిట్లనిరి.

హా! రాక్షసరాజోత్తమా! ప్రాణనాథా! హితమును జె

ప్పుడున్న స్నేహితుల యొక్క మాటలను వినక నీయొక్కయు, రాక్షసుల యొక్కయు, మరణముకొఱకు సీతనెత్తికొనివచ్చితివి. ఇప్పుడు నీతోఁగూడ నీరాక్షసులందఱును మరణమును బొందిరి. మేమును మరణమును బొందినవారమైతిమి. నీకుఁదమ్ముఁడగు విభీషణుఁడు హితవాక్యముల ననేకములను జెప్పె. ఆవచనములను నీవు వినక నీవా విభీషణుని బహువిధముల బెదరించితివి. మఱియు నో రావణాసురుఁడా! హృదయేశ్వరా! నీవు సీతను రామున కిచ్చియుంటివేని యిట్టివ్యసనము మాకు సంభవింపదు గదా? మఱియు నీవిధముగా రాక్షసకులమంతయును నాశమును బొందకుండును గదా? మఱియు నీవు సీత నిచ్చియుంటివేని రాముఁడు సఫలమనోరథుఁడై మనకు స్నేహితుఁడగును. మేమందఱమును విధవలము గాక యుందుము. మఱియును మనము శత్రురహితులమై యుందుము. నీవు దుర్మార్గవృత్తిన నవలంబించి సీతాపహారమును జేసితివి. అన్యాయముగ రాక్షసులను జంపితివి. నీవును మరణమును బొందితివి. మమ్ములను గూడ జంపితివి. మఱియు నో రాక్షసోత్తమా! ప్రాణేశ్వరా! నీవు స్వేచ్ఛానుసారముగ బ్రవర్తించువాఁడవు గావు. నీకే విషయమునందును గోరికయును లేదు. దైవమే యీప్రకారముగ నిన్ను బ్రవర్తింపఁజేసె. నీవు దైవముచేత ముందుగా జంపఁబడితివి. పిమ్మట రామునిచేత జంపఁబడితివి. లోకములో బ్రతిమానవుఁడు ముందుగ దైవముచేత జంపఁబడును. పిమ్మట నితరునిచేత జంపఁబడును. రాక్షసోత్తమా! ప్రాణనాథా! ఈయుద్ధమునం దనేకులగు రాక్షసులు మరణమును బొందిరి. వానరులును జచ్చిరి. దైవయోగముచేత నిట్లు యిరుతెగలవారును మరణమును బొందిరి. మఱియు నో రాక్షసోత్తమా! రావణాసురుఁడా! అయ్యో దైవగతిని ద్రవ్యముచేతను, కామముచేతను, పరాక్రమముచేతను, ఆజ్ఞచేతను, తప్పింపఁజాలరు. దైవము ప్రతికూలమయ్యెనేని సకలప్రయత్నములును నిష్ఫలములగు ననిరి. యీవిధముగా రాక్షసస్త్రీలందఱును దీనస్వభావముగలవారై అపరిమితముగా రోదనమును జేసిరి. మఱియు నాఁడు జింకలవలె గన్నీళ్ళను విడుచుచు నధికముగా దుఃఖమును బొందిరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందు నూటపదిమూఁడవసర్గ ముగిసెను.

మండోదరి అంతఃపురమును బైలువెడలి వచ్చి దుఃఖించుట.

ఇట్లు రాక్షసస్త్రీలందఱును అపరిమితముగా రోదనము జేయుచున్న సమయమునందు రావణాసురునకు జ్యేష్ఠభార్యయగు మండోదరి మిగుల దీనురాలగుచు నచ్చోటునకు వచ్చి మరణమును బొందియున్న రావణాసురుని జూచి. పిమ్మట అచింత్యములగు కర్మలుగల రామునిచేత జంపఁబడియున్న రావణాసురుని జక్కఁగ జూచి యామండోదరి మిగుల దీనురాలగుచు రోదనమును జేయుచు నిట్లనియె.

హా! రాక్షసరాజోత్తమా! నాహృదయేశ్వరా! కుబేరునకుఁదమ్ముఁడా! మహానుభావుఁడా! నీవు కోపమును బొందితివేని నీయెదుట దేవేంద్రుఁడుగూడ నుండఁజాలఁడు గదా? మఱియు నో ప్రాణనాథా! రాక్షసరాజోత్తమా! ఋషులును, బ్రాహ్మణులును, గంధర్వులును, నీయొక్క వేగమును సహింపఁజాలక దశదిక్కులకును బరుగెత్తుకొని పోయిరి గదా? అటువంటి నీవు మానవమాత్రునిచేత యుద్ధమునందు జంపఁబడితివి. ఇట్లు మనుష్యునిచేత మరణమును బొందుటవలన నీకు సిగ్గుగా నుండలేదా? హా! ప్రాణనాయకుఁడా! రాక్షసరాజోత్తమా! నీ వెందుకు సిగ్గును బొందుటలేదు. అయ్యో, సంపదచేతను, పరాక్రమముచేతను ముల్లోకములను నాక్రమించినవాఁడవును, శత్రువులచేత సహింపఁ నలవిగానివాఁడవును నైన అటువంటి నిన్ను వనములయందు దిక్కులేక సంచరించుచున్న మానవుఁడు నిన్నెట్లు చంపెను. హా! నాహృదయేశ్వరా! రాక్షసరాజోత్తమా! మనుష్యులకు గోచరముగాని ప్రదేశమునందు సంచరించుచున్నవాఁడవును, ఇచ్ఛానుసారముగ సంచరించువాఁడవును, నగు నీకు యుద్ధమునందు నాశమెట్లు గలిగె. మఱియు నో ప్రాణనాథా! రాక్షసరాజోత్తమా! యుద్ధభూమియందు నీకు రామునిచేత మరణము గలుగుటను గుఱించి నాకు నమ్మకము లేదు. సర్వస్థలములయందును జయమును బొందిన నీకు జయము లేకపోవుటను గుఱించి నాకు మిగుల ఆశ్చర్యము గలుగుచున్నది. మఱియు నో మనోనాయకుఁడా! రాక్షసోత్తమా! ఈరాముఁడనేకవేల రాక్షసులతో గూడుకొనిన ఖరుఁడను రాక్షసోత్తముని సంహరించెను. కావున విచారించిచూడఁగ నీరాముఁడు మానవుఁడని తోఁచదు. మఱియు నో హృదయేశ్వరా! రాక్షసోత్తమా! దేవతలచేతఁగూడ బ్రవేశింప నలవిగాని లంకాపట్టణమునందు హనుమంతుఁడు ప్రవేశించినతోడనే మేమందఱమును మిగుల వ్యసనమును బొందినవారమైతిమి. మఱియు నో హృదయేశ్వరా! రాక్షసోత్తమా! మిగుల భయంకరులగు వానరులు సముద్రమును బంధించినపుడే రాముఁడు సామాన్యమానవుఁడు గాఁడని తలచితిమి. మఱియు నో రాక్షసోత్తమా! యముఁడు రామరూపమును ధరించి నీమాయను సర్వమును నాశముసేయుటకొఱకు వచ్చెనని తలచితిమి. అదియునుంగాక హా మనోనాయకా! రాక్షసోత్తమా! ఇంద్రుఁడే రామరూపమును ధరిం

చివచ్చి నిన్ను అవమానించెనాయని తోచుచున్నది. మఱియు నో రాక్షసోత్తమా! ఇట్లు చెప్పుటయును బాగుగనుండలేదు. దేవేంద్రునకు నిన్ను జయింపదగిన సామర్థ్యమెక్కడిది. (లేదు) కాబట్టి యింద్రుడును గాడు. మఱియు నో ప్రాణనాథా! రాక్షసరాజోత్తమా! స్వాభావికమగు జ్ఞానశక్తితో గూడుకొనినవాడును, పరమాత్మస్వరూపుడును, సనాతనుడును, ఆదిమధ్యావసానములు లేనివాడును, మహత్తత్త్వముకంటె బరుడును, మిగుల గొప్పవాడును, ప్రకృతికంటె బరుడును, లోకములను సృజించువాడును, శంఖచక్రగదాధరుడును, శ్రీవత్సము వక్షస్స్థలమునందు గలవాడును, నిత్యలక్ష్మి గలవాడును, జయింపనలవి గానివాడును, శాశ్వతుడును, నిత్యుడును, సత్యపరాక్రముడును నగు విష్ణుదేవుడు, మానవదేహమును ధరించి వానరరూపులగు దేవతలతో గూడుకొనినవాడై యిక్కడకు వచ్చినట్లు తోచుచున్నది. మఱియు నో ప్రాణేశ్వరా! రాక్షసరాజోత్తమా! సర్వలోకేశ్వరుడగు నారాయణుడు లోకములకు హితమును జేయవలయునని మొదుతలంపుతో రాక్షససైన్యముతో గూడిన నిన్ను జంపెనని తోచుచున్నది. హా మనోనాయకా! రాక్షసరాజోత్తమా! పూర్వము నీవింద్రియములను జయించినవాడవగుటచేత ముల్లోకములను జయించితివి. ఇప్పుడు యింద్రియజయము లేనివాడవగుటచేత నీ యింద్రియములచేత నే జయింపబడితివి. మఱియు నో ప్రాణనాథా! రాక్షసరాజోత్తమా! రామునితో విరోధమును బెట్టికొనుటయుచితము గాదని చెప్పితిని. నా మాటల నప్పుడు వినకపోతివి. అందువలన నిట్టి దుఃఖము సంప్రాప్తమయ్యె. మఱియు నో హృదయేశ్వరా! రాక్షసరాజోత్తమా! ఆరోగ్యైశ్వర్యమును, దేహమును, బంధువులను, చంపుకొనుటకొఱకుగా నీవు సీతాదేవియందు గోరిక గలవాడవైతివి. మఱియు నో దుర్మతీ! ప్రాణనాథా! అరుంధతితో సమానురాలును, రోహిణితో సమానురాలును, మిగుల బూజ్యురాలును, సీతను దెచ్చి యధికమగు కీడును, సంపాదించితివి. మఱియు నో మనోనాయకా! రాక్షసరాజోత్తమా! ఈ సీత భూమిదేవికి భూమి యనబడును. లక్ష్మికి లక్ష్మి యనబడును. మఱియు నా లక్ష్మి భర్తయందు మిగుల వాత్సల్యము గలది. మఱియు నో హృదయేశ్వరా! రాక్షసరాజోత్తమా! మిగుల నిర్మలములగు నవయవములు గలదియును, మంగళకరురాలును, విజనమగు నరణ్యమునందు నివసించు నదియును, నగు సీతామహాదేవి నపహరించి యింత కీడును సంపాదించితివి. మఱియు నో దుర్మార్గుడా! ప్రాణేశ్వరుడా! కపటోపాయముచేత సీతాదేవిని దెచ్చి సీతాశరీరమును ముట్టుకొని పాపమును సంపాదించికొంటివి. మఱియును, ప్రభుడవైన యో రాక్షసరాజోత్తమా! హృదయేశ్వరా! పతివ్రతయగు సీతయొక్క తపస్సుచేత నిశ్చయముగా దగ్ధుడవైతివి. మఱియు నో ప్రాణేశ్వరా! రాక్షసరాజోత్తమా! నీవప్పుడే దగ్ధుడవై యుండవలసియుండె. అట్లుగాక యిప్పుడు దగ్ధుడవైతివి. మఱియు నో ప్రాణనాథా! రాక్షసరాజోత్తమా! నీవు సీతాదేవిని అపహరించు సమయమునందు నింద్రుడు, అగ్ని, మొదలుగాగల దేవతలందఱును మిగుల భయమును బొందిరి. మఱియు నో రాక్షసరాజోత్తమా! "శ్లో॥ అవశ్యమేవ లభతే ఫలం పాపస్య కర్మణః। ఘోరం పర్యాగతే కాలే కర్తా నాస్త్యత్ర సంశయః॥ శుభకృచ్ఛుభమాప్నోతి పాపకృత్పాపమశ్నుతే," ఓ ప్రాణేశ్వరా! లోకములో నే మానవుడు పాపమునకు దగిన ఫలము నవశ్యముగా ననుభవించియే తీరవలెను. సమయము వచ్చినపుడు పాపమును జేసినవాడు మిగుల భయంకరమగు ఫలమును బొందుననుటకు గొంచెమైన సందేహము లేదు. శుభకర్మమును జేయువాడు శుభమును బొందును. పాపకర్మమును జేయువాడు పాపమును బొందును. ఓ ప్రాణనాథా! విభీషణుడు సుఖమును బొందె నీవు పాపఫలమును బొందితివి. నా ప్రాణేశ్వర! రాక్షసశ్రేష్ఠుడా! నీకు సీతాదేవికంటె నధిక సౌందర్యము గల స్త్రీలనేకులు గలరు. అట్టి స్త్రీలు గలిగియున్నను, నీవు మన్మథవశమును బొందినవాడవై మోహముచేత నేమియును దెలియనివాడవైతివి. మఱియు నో మనోనాయకా! రాక్షసోత్తమా! కులరూపదాక్షిణ్యములయందు నాకంటె సీత యెక్కువ గాదు నీవు మోహితుడవై యుండుటచేత గొంచెమైనను దెలివి లేనివాడవైతివి. మఱియు నో హృదయేశ్వరా! రాక్షసోత్తమా! లోకములో నే జంతువును మృత్యువును బొందకుండగనుండజాలదు నీకిప్పుడు సీతాదేవియే మృత్యువై వచ్చినది. మఱియు నో రాక్షసరాజోత్తమా! రావణాసురుడా! సీతారూపమగు మృత్యుదేవతను నీవు దూరదేశమునుండి తీసికొనివచ్చితివి. హా! ప్రాణనాథా! ఇక మీదట సీతాదేవి రామునితో గూడ దుఃఖరహితురాలై జీవింపగలదు. అల్పపుణ్యము గలదాన నగుటచేత నేను దుఃఖసముద్రమునందు బడిపోతిని. రాక్షసోత్తమా! హృదయేశ్వరా! ఇదివఱకు పూర్వము నేను నీతో గూడ కైలాసపర్వతమునందును, మందరపర్వతమునందును, మేరుపర్వతమునందును, చైత్రరథమను పేరుగల యరణ్యమునందును, నానావిధములగు దేవోద్యానములయందును సంచరించితిని. మఱియు నో రాక్షసశ్రేష్ఠుడా! ప్రాణేశ్వరా! నిరుపమానమైన యాకారము గలదియును, నిరుపమానమగు

సంపదగలదియును, నగువిమానమునెక్కి సీతోగూడ వానా దేశములయందు చిత్రములగు పూలమాలికలను, వస్త్రములను ధరించి సంచరించితిని. అయ్యో! రాక్షసరాజోత్తమా! ప్రాణనాయకుడా! వీరుడవగు నీవు మరణమును బొందుటవలన నేను కామభోగహీనురాలనైతిని.

మఱియు నో రాక్షసోత్తమా! నేను మును పటికంటె ఇతరమగు రూపము గలదాననైతిని. ఛీ, ఛీ, రాజులసంపదలు చంచలస్వభావము గలవియయ్యెను గదా? అయ్యో దైవమా! నే నేమి చేయుదును. రాక్షసశ్రేష్ఠుడా! ప్రాణనాథా! నాస్వామీ! మిగుల సుకుమారమై నదియును, మంచికనుబొమలు గలదియును, మంచిచర్మము గలదియును, మిగుల సాగసగు ముక్కు గలదియును, చంద్రునివంటి కీర్తితోడను, పద్మమువంటి కాంతితోడను, సూర్యునివంటి తేజస్సుతోడను గూడుకొనినదియును, కిరీటముయొక్క శిఖరములచేత ప్రకాశించుచున్నదియును, ఎఱ్ఱని మోము గలదియును, ప్రజ్వలించుచున్న కుండలములు గలదియును, మదముచేత వ్యాకులములైనవియును, చపలములైనవియును, నగు నేత్రములు గలవియును, నానావిధములగు పూలమాలికలను ధరించినదియును, మిగుల సుందరమైనదియును, మృదువైనదియును, మనోహరమైన నవ్వు గలదియును, నగు నీ మోము, ఇప్పుడు కాంతిరహితమైనదయ్యె. అయ్యో! నే నేమి చేయుదును. మఱియు నో రాక్షసోత్తమా! ప్రాణేశ్వరా! ఇప్పుడు నీ మోము రాముని యొక్క బాణముచేత బ్రద్దలు సేయబడినదియును, నెత్తురుయొక్క ప్రవాహముతో గూడుకొనినదియును, బయలునకు వెడలివచ్చిన మేదోమస్తిష్కములతో గూడుకొనినదియును, స్యందనరేణువులచేత మిగుల బరుషమైనదియును నైయున్నది. అయ్యో! నే నేమి చేయుదును. ఇప్పుడు వైధవ్యమును గలుగజేయునట్టి దురవస్థను బొందితిని. ఇటువంటి దురవస్థ సంప్రాప్తమగునని మందబుద్ధిగల నేను దెలియలేకపోతిని. హా! దైవమా! నేనిప్పు డేమి చేయుదును. మఱియు నో రాక్షసరాజోత్తమా! రావణాసురుడా! నా తండ్రి దానవాధిపతి యనియును, నా భర్త రాక్షసాధిపతి యనియును, నా పుత్రుడు దేవేంద్రుని జయించె ననియును, నేను గర్వమును బొందియుంటిని. మరియు నో రాక్షసరాజోత్తమా! ప్రాణనాయకుడా! మదించిన శత్రువులను మర్దించుటయందు దగిన సామర్థ్యము గలవారును, మిగుల ప్రసిద్ధములగు బలపౌరుషములు గలవారును, నగు భృత్యులనేకులున్నారని నే గర్వించితిని.

హా, నాథా! రాక్షసశ్రేష్ఠుడా! మహావీరులగు నటువంటి భృత్యులును, నీవును, యమునకు నెట్లు స్వాధీనులైతిరి. మఱియు నో రాక్షసరాజోత్తమా! మిగుల మనోహరములగు నింద్రనీలమణులవలె మిగుల మనోహరమగు నైల్యము గలదియును, మిగుల గొప్పదగు పర్వతమువలె నున్నతమైనదియును, కేయూరములు, అంగదములు, వైడూర్యములు, ముత్యాలహారములు, పుష్పమాలికలు మొదలగువానిచేత ప్రకాశించుచున్నదియును, మిగుల మనోహరమైనదియును, విహారములయం దధికమైనదియును, యుద్ధభూములయందు ప్రకాశించుచున్నదియును, ఆభరణకాంతులచేత ప్రకాశించుచున్నదియును, మెఱుపులతో గూడిన మేఘమువలె ప్రకాశించుచున్నదియును, నగు నీ శరీర మిప్పుడు అనేకములగు బాణములచేత వ్యాప్తమైయున్నది.

కావున నో రాక్షసరాజోత్తమా! ప్రాణనాథా! నీ శరీరము నిప్పుడు కౌగిలించుకొనుటకు గూడ శక్యము గాకయున్నది. మరియు నో రాక్షసరాజోత్తమా! ప్రాణేశ్వరా! అనేకములగు బాణములచేత వ్యాప్తమైన యీ శరీర మిప్పుడు ముళ్ళపందియొక్క శరీరమును బోలియున్నది మరియును మిగుల దీక్ష్ణములగు బాణములచేత మర్మస్థానములయందు గొట్టబడియున్నది. మరియు నీ శరీరము నెత్తురుతో సమానమైన కాంతిగలదై భూమియందు బడియున్నది. అయ్యో మనోయకా! రావణాసురుడా! నాస్వామీ! ఇప్పుడు రాముని బాణములచేత, వజ్రాయుధముచేత గొట్టబడిన పర్వతమువలె గ్రిందబడియుంటివి. అహో యిది స్వప్నమా? లేక వాస్తవముగా నే రామునిచేత జంపబడితివా? ఓ రాక్షసశ్రేష్ఠుడా! ప్రాణనాథా! నీవు మృత్యువునకు గూడ మృత్యుదేవతవు గదా? అట్టి నీవు ఏవిధముగా మృత్యువశమును బొందితివి.

ఓ, ఓ, రాక్షసరాజోత్తమా! రావణాసురుడా! మూడు లోకములయందలి ధనమును అపహరించువాడవును, మూడు లోకములకును ఉద్వేగమును గలుగజేయువాడవును, లోకపాలకులనందఱను జయించినవాడవును, శంకరుని బాగ జిమ్మినవాడవును, మదించినవారలను నిగ్రహించినవాడవును, సర్వస్థలములయందును ప్రకాశింపజేయబడిన పరాక్రమము గలవాడవును, లోకములకు క్షోభను గలుగజేయువాడవును, సింహనాదములచేత భూతములనన్నింటిని నేడిపించువాడవును, శత్రువులయొక్క సమీపమునందు తేజస్సుచే తమదించి మాటలాడుచున్నవాడవును, భయంకరములగు కార్యములను జేయునట్టి నీ భృత్యవర్గములను బరిపాలించువాడవును, అనేక వేలమంది దానవేంద్రులను, యక్షులను, సంహరించువాడవును నివాతకవచాదులను సంగ్రహించినవాడవును, సకలలోకేశ్వరుడవును, అనేకములగు యజ్ఞము

లకు లోపములను గల్పించినవాడవును, స్వజనమునకు రక్షకుడవును, ధర్మవ్యవస్థను బాధుసేసినవాడవును, యుద్ధములయందు మాయలను బుట్టించువాడవును, దేవతలయొక్కయు, రాక్షసులయొక్కయు, మానవులయొక్కయు, కన్యకలను అపహరించువాడవును, లంకాద్వీపమునకు రక్షకుడవును, భయంకరములగు కర్మలను జేయువారలను సంహరించువాడవును, మాకు గామభోగములను గలుగజేయువాడవును, రథికులలోపల శ్రేష్ఠుడవును, మరియు ననేకములగు కార్యములను జేసినవాడవగు నాకు భర్తవును, నగు నీవు రాముని బాణములచేత జంపబడి క్రిందబడియుంటివి.

హా, నాహృదయేశ్వరా! రాక్షసరాజోత్తమా! నాస్వామీ! నీవు మరణమును బొంది క్రిందబడియుండుటను జూచియును నేను బ్రతికియుండుటచేత నేను కఠినురాలనని వచ్చును. ఓ, ఓ, రాక్షసాధిపతీ! మిగుల వెలగల శయ్యలయందు బరుండు నీవిప్పుడు దుమ్ముగల నేలయందు ఏవిధముగా నిద్రను బొందుచున్నావు? మరియు నో రాక్షసరాజోత్తమా! లక్ష్మణుని చేత నింద్రజిత్తు చంపబడినప్పుడే నేను జంపబడితిని. ఇప్పుడు నీవు కూడ మరణమును బొందితివి. నేను బంధుజనులు లేనిదాననైతిని. భర్తవగు నీవును మరణమును బొందితివి. కావున నేను కామభోగహీనురాలనై యికమీదట ననేక వేల సంవత్సరములు దుఃఖమును బొందవలసియున్నది. హా, రాక్షసశ్రేష్ఠుడా! నాస్వామీ! నీవిప్పుడు దుర్గమమగు స్వర్గమార్గమును బట్టిపోతివి. నన్ను గూడ నీవు పోయిన మార్గమున దీసికొనిపొమ్ము. నేను నిన్ను వదలిపెట్టి యొక్కడ జీవించియున్నాను. అయ్యో! నా దేవుడా! రాక్షసరాజోత్తమా! నీవు దీనురాలనగు నన్ను వదలిపెట్టి యెట్లు పోతివి. దీనురాలను, మందురాలును, మిగుల వ్యసనమును బొందుచున్నదానను, నగు నాతో సంభాషింపకుండుటకు గారణమేమి? హా, ప్రాణేశ్వరా! రాక్షసరాజోత్తమా! అవకుంఠనము లేక వచ్చిన నన్ను జూచి యిప్పుడు కోపమును బొందితివేమి? నేను పాదచారినై పట్టణమునుండి బయలునకు వచ్చితిని. హా, నాథా! నాస్వామీ! నీభార్యలందఱును అవకుంఠనములను వదలి బయలునకు వచ్చియున్నారు. వెలుపలకు వచ్చియున్న యీ స్త్రీలనందఱను జూచి నీవు ఏమినిమిత్తముగ వ్యసనమును బొందవు?

ఓ, ఓ, రాక్షసరాజోత్తమా! ప్రాణనాథా! నీకు క్రీడలయందు సహాయముగనుండినట్టి యీ జనమంతయును వ్యసనమును బొందుచున్నది. నీవు ఏమినిమిత్తముగ నీ జనమును నోదార్పవు. మరియు నీవు ఏమినిమిత్తముగ నీ స్త్రీజనమును గౌరవింపకుండుటకు గారణమేమి? హా, రాక్షసోత్తమా! ప్రాణనాయకుడా! ఇప్పుడనేకమంది స్త్రీలు నీచేత విధవలై చేయబడిరి. ఈ స్త్రీలందఱును పతివ్రతలును, ధర్మపరులును, గురుశుశ్రూషయందు మిగుల నాశగలవారునునై యుండియున్నారు. హా, నాథా! నాస్వామీ! శోకముచేత నీ స్త్రీలందరును బరితపించుచున్నారు. నీవలన బాధలను బొందిన స్త్రీలందరును నిదివఱకు నిన్ను శపించియుండిరి. ఇప్పుడు నీవా శాపఫలము ననుభవించితివి. హా, నాహృదయేశ్వరా! పతివ్రతలయొక్క కన్నీళ్ళు క్రిందబడెనేని మరణముగలుగునని చెప్పిన మాట వాస్తవముగ నిన్ను బొందె.

ఓ, ఓ, రాక్షసరాజోత్తమా! తేజస్సుచేత ముల్లోకములను నాక్రమించిన నీవు దొంగవానివలె రాముని భార్యనపహరించితివి. ఓ, రాక్షసోత్తమా! నీవు మృగమనియెడు నెపముచేత రాముని భార్యను నరణ్యమునుండి తీసికొనివచ్చితివి. అదికారణముగ నీకిట్టియాపద గలిగెను. హా, ప్రాణనాథా! నీకెన్నడును యుద్ధములయందు అపజయము గలిగియుండలేదు. అట్టివంటి నీవిపుడు మాదురదృష్టవశమున నిట్టియాపదను బొందితివి. అయ్యో! రాక్షసోత్తమా! నాస్వామీ! అతీతానాగతములను దెలిసినవాడును, వర్తమానవిషయములను గ్రహించుటయందు దగిన సామర్థ్యముగలవాడును, నా మరదియును, నగు విభీషణుండు సీతాదేవిని నపహరించుటవలన రాక్షసకులమునకు నాశముగలుగునని చెప్పె. అతనివచనము సత్యమయ్యె. ఓ, నాస్వామీ! రాక్షసశ్రేష్ఠుడా! కామక్రోధముల మూలకముగ నీవీయనర్థమును సంపాదించితివి. నీచేత నీ రాక్షసకులమంతయును దిక్కులేనిదై చేయబడెను. మరియు నో రాక్షసోత్తమా! నాహృదయేశ్వరా! ప్రసిద్ధములగు బలపౌరుషములుగల నీవు మిగుల నధికముగా విచారింపదగినవాడవు గావు. నేను స్త్రీస్వభావముగలదాననగుటవలన నాబుద్ధి కారుణ్యమునందు బ్రవర్తించుచున్నది. నీవు నీసుకృతదుష్కృతములను నీవెంటబెట్టుకొని నీలోకమునకు నీవు పోతివి. నీవియోగము గలుగుటవలన నన్ను గురించి నేను దుఃఖమును బొందుచున్నాను.

అయ్యో నాస్వామీ! రాక్షసరాజోత్తమా! హితమును గోరుచున్న స్నేహితులయొక్కయు, అన్నదమ్ములయొక్కయు, మాటలను వినక కులమునకు సర్వమునకును నాశమును గల్పించితివి. ఓ, పాపదాతుడా! రాక్షసోత్తమా! నాదేవుడా! విభీషణుడు మిగులగొప్పదగు నభిప్రాయముతో గూడుకొనినదియును, శాస్త్రసమ్మతమైనదియును, దారుణముగానిదియును, శ్రేయస్కరమైనదియును, నగు మాటను చెప్పె. అట్టిమాటను వినక నీవిట్టివంటి యాపదను బొందితివి. హా, నాథా! రాక్షసోత్తమా! మారీచకుంభకర్ణులయొ

కన్యయు, నాతండ్రియొక్కయు, హితవచనములనువినక కనిటువంటి ఫలమును బొందితివి. మఱియు నల్లని మేఘముతో సమానుడవును, పచ్చని పట్టువస్త్రము గలవాడవును, మంగళకరములగు అంగదాది భూషణములు గలవాడవును, నగు నో రాక్షసరాజోత్తమా! నాహృదయేశ్వరా! నెత్తురుచేత వ్యాప్తమైనశరీరముగలవాడవై నీ అవయవములను క్రిందబడవై చుకొని నిద్రించుటకు గారణమేమి? అయ్యో! రాక్షసరాజోత్తమా! నాస్వామీ! మిగులదుఃఖమును బొందుచున్న నాతో మాటలాడకుండుటకు గారణమేమి? అయ్యో రాక్షసోత్తమా! ప్రాణనాథా! మిగుల గొప్పదగు వీర్యము గలవాడును, మిగులసమర్థుడును, యుద్ధములయందు వెనుకదీయనివాడును, నగు రాక్షసోత్తమునకు మనుమరాలనగు నాతో మాటలాడకుండుటకు గారణమేమి? నన్నెందుకుబూడవు. హా, ప్రాణేశ్వరా! రాక్షసోత్తమా! మిగుల శీఘ్రముగ లెమ్ము లెమ్ము. ఇప్పుడిట్టి పరాభవము నీకు గలుగుటవలన సూర్యునియొక్క కిరణములు నిర్భయముగ లంకాపట్టణమునందు బ్రవేశించుచున్నవి. హా, మనోనాయకా! రాక్షసోత్తమా! నీవు యే యాయుధముచేత యుద్ధములయందు శత్రువులను జంపితివో యటువంటి నీ యాయుధములు రాముని బాణములచేత ఛేదింపబడెను.

అయ్యో! రాక్షసోత్తమా! ప్రాణేశ్వరా! దేవేంద్రుని యొక్క వజ్రాయుధముతో సమానమైనదియును, యుద్ధమునందు శత్రువులను జంపుటకు సాధనమైనదియును, బంగారు పుత్రాళ్ళచేత అలంకరింపబడినదియును, నగు నీ చేతియందలి పరిఘమను నాయుధము రాముని బాణములచేత ఛేదింపబడినదై క్రిందబడెను. హా! రాక్షసోత్తమా! ప్రాణనాథా! యుద్ధభూమిని "ప్రియురాలిని గాగిలించుకొనిన విధముగ" గాగిలించుకొంటివా? యేమి? అయ్యయ్యో! రాక్షసరాజోత్తమా! నాస్వామీ! నీవు నాతో "ఇష్టురాలు గాని దానితోవలెనే" సంభాషింపకుండుటకు గారణమేమి? ఛీ, ఛీ, నాహృదయ మెంత దుష్టమైనదనవచ్చును. నీవు మరణమును బొందినపిమ్మట నాహృదయము దుఃఖముచేత పీడింపబడినదై బ్రద్దలు గాకయున్నదే, అనియె. అనియిట్లు ఆమండోదరి వ్యసనమును బొందుచున్నదియును, కన్నీళ్ళచేత వ్యాప్తమైన నేత్రములుగలదియును, స్నేహముచేత దడపబడిన హృదయముగలదియును, నగుచు మిగుల మోహమును బొందె. అంతట నా మండోదరి రావణాసురునియొక్క హృదయముమీద బడినదై సంధ్యాకాలమునందు ఎఱ్ఱనిదగు మేఘమునందు బ్రకాశించుచున్న మెఱుపుతీగవలెనుండె. ఆసమయమునందు మండోదరియొక్క సవతులందఱును ఆమండోదరితో గూడ మిగుల భయంకరముగా రోదనమును జేయుచు నిట్లనిరి. అక్కా! మండోదరీ! లోకములో నెవ్వరికిని ఏయవస్థయును స్థిరముగానున్నది. రాజులయొక్క సంపద చపలస్వభావముగలదిగదా? మనమేమి చేయుదము. వ్యసనమును బొందకుము. అని యివ్విధముగా, చెప్పుచున్న సవతులయొక్క మాటలను మండోదరి వినికన్నీళ్ళను గార్చుచు మిగుల నధికముగా రోదనమును జేసె. ఆసమయమునందు విభీషణుడు రాముని యొద్దకబోయి యిట్లనియె.

రామచంద్రా! నాయన్నయొక్క ప్రేతకర్మలను జేయవలయును. కాబట్టి యీ స్త్రీలందఱును మరలిపోవునట్లు సేయుమని ధర్మజ్ఞుడును, వినయసంపదగలవాడును నగు విభీషణుడు ధర్మార్థసహితమగు మాటను జెప్పె. మఱియును రాముని యాజ్ఞను బొందక యే కార్యమును జేయుట యుక్తము గాదని తలచి రాముని యభిప్రాయప్రకారముగ బ్రవర్తింప దలచి యిట్లనియె.

రఘుకులోత్తమా! రాముడా! ధర్మవ్రతమును వదలినవాడును, క్రూరుడును, ఘాతుకవ్యాపారములను జేయువాడును, అసత్యములను మాటలాడువాడును, పరభార్యలను స్పృశించినవాడును, నగు నీ రావణాసురునకు ప్రేతకృత్యములను జేయుటయందు నాకిష్టము లేదు. మఱియు నో రాముడా! సకలభూతములకును అప్రియములగు కార్యములను జేయుటయందిష్టము గల యీ రావణాసురుడు నాకు భ్రాతృరూపుడగు శత్రుడని తోచుచున్నది. మఱియు నో రామచంద్రా! రావణాసురుడు గురుగౌరవమువలన బూజ్యుడైనప్పటికిని నాచేత బూజను బొందుటకు దగినవాడు గాడు. మఱియు నో రాముడా! అన్నయగు రావణునకు ప్రేతకర్మలను జేయకపోవుటవలన నన్ను గ్రూరుడని చెప్పినను పిమ్మట విచారించి పాపాత్ముడగుటచేత రావణాసురునకు ప్రేతకృత్యములను జేయలేదని విభీషణుడు సాధువనియు లోకులు చెప్పుదురు. కావున నేనీ రావణాసురునకు ప్రేతకృత్యములను జేయననియె. ఇవ్విధముగా విభీషణుడు చెప్పినమాటలను విని ధర్మవంతులలో నుత్తముడగు రాముడు మిగుల ప్రియము గలవాడై సర్వమును దెలిసి మాటలాడునట్టి విభీషణునితో నిట్లనియె.

రాక్షసోత్తమా! నీమహిమవలన నేను జయించితిని. కావున నేనవశ్యముగా నీకు మేలును జేయవలసియున్నది. మఱియు నో రాక్షసోత్తమా! విభీషణుడా! నేను నీకు దగిన విషయము చెప్పదగియున్నది. ఈ రావణాసురుడు వాస్తవముగ అధర్మానృతములు గలవాడనుటకు సందేహము లేదు. అయినను తేజోవంతుడును, బలవంతుడును, యుద్ధములయందె

న్నుడును, పరాభవమునుబొందనివాడును, దేవేన్ద్రుడుమొదలగు దేవతలనుజయించినవాడును, మహాత్ముడును, బలసంపన్నుడును, లోకములనేడిపించువాడును ననిప్రఖ్యాతిని వహించెను. మఱియు నో రాక్షసోత్తమా! విభీషణా! వైరములు మరణమును బొందినపిమ్మట గాంతములగును. ఇప్పుడు రావణాసురుడు మరణమునుబొందుటచేత మాకార్యమంతయును దీరిపోయినది. ఇతనికిసంస్కారమును జేయుము. ఈ రావణాసురుడు నీకెట్టివాడో నాకును అట్టివాడే. మఱియును ధర్మజ్ఞుడవైన యో విభీషణుడా! నీవలననీ రావణాసురుడు విధ్యుక్తప్రకారముగా ప్రేతసంస్కారమును బొందుటకుదగినవాడు. మఱియు నో విభీషణుడా! నీవు కీర్తిం బొందుటకుదగినవాడవు. కావున రావణాసురునకు ప్రేతకృత్యములను జేసి కీర్తిని బొందుమనియె. ఇవ్విధముగా రాముడు చెప్పినవాక్యములను విని విభీషణుడు మిగులత్వరగలవాడగుచు రావణాసురునకు ప్రేతకృత్యములను జేయుట కుద్యుక్తుడయ్యె. పిమ్మట దగినబుత్విక్కులను సంపాదించె. అంతట మంచిగంధపుద్రుమానులచేతను, మఱియు నితరములగు పరిమళద్రవ్యములచేతను, శాస్త్రోక్తప్రకారముగ చితిని నిర్మించిరి. ఆసమయమునందు బుత్విజులందఱును మరణానంతరమునందు జేయదగిన యిష్టిని జేసిరి. అంతట పితృమేధమును బ్రారంభించిరి. అంతట నా చితికి ఆగ్నేయభాగమునందు వేదికను నిర్మించిరి. ఆచితియందు అగ్నిహోత్రమును స్థాపించిరి. పిమ్మట నా బుత్విజులందఱును పెరుగుతో గూడుకొనిన నేతిచేత పూర్ణమైన స్రువమును, చితియందు వైచిరి. అంతట రావణాసురునియొక్క పాదములయందు సోమరాజానయనశకటమును బెట్టిరి. తొడలయొక్క మధ్యయందు ఉలూఖలమును బెట్టిరి. పిమ్మట దారుపాత్రములు, అరణి, ఉత్తరారణి, మొదలగు యజ్ఞోపకరణములను బెట్టదగినస్థానములయందు బెట్టిరి. అంతట నా బుత్విజులందఱును శాస్త్రోక్తప్రకారముగ పశుహననమును జేసిరి. పిమ్మట రాక్షసులందఱును, గంధమాల్యాదులచేత రావణాసురునకు అలంకారమును గల్పించిరి. మఱియు నా రాక్షసులందఱును విభీషణుడు సహాయముగాగలవారై నానావిధములగు పేలాలను రావణాసురునిముఖమునందు జల్లి మిగులవ్యసనముచేత, కన్నీళ్లను బెట్టుకొనిరి. అంతట విభీషణుడు శాస్త్రోక్తప్రకారముగ అన్నదానమును జేసె. పిమ్మట స్నానమును జేసి తడివస్త్రముతో దర్భలుమొదలగువానితో గూడిన తిలోదకమును శాస్త్రోక్తప్రకారముగ విడిచె. పిమ్మట నా రావణాసురునకు శిరస్సుతో గూడ వందనమును జేసి యచ్చటనున్న స్త్రీలనందఱును మృదువచనములచేత నూరార్చె. అంతట నా స్త్రీలనందఱును గృహమునకు రండని పిలిచె. పిమ్మట నా స్త్రీలందఱును నగరమునందు బ్రవేశించిరి. అవ్విధముగ స్త్రీలందఱును నగరములోనికి బోయినపిమ్మట విభీషణుడు రాముని పార్శ్వమునందు మిగులవినయముగలవాడై కూర్చుండె. ఆసమయమునందు రాముడు లక్ష్మణునితోడను, సుగ్రీవాదివానరోత్తములతోడను, గూడుకొనినవాడై రావణాసురుని సంహరించినపిమ్మట దేవేన్ద్రుడు సంతోషమును బొందినవిధముగ సంతోషమును బొందె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి నూటపదునాలగవసర్గ ముగిసెను.

▸❋◂

—{ రాముడు విభీషణునకు లంకారాజ్య పట్టాభిషేకము సేయుట. }—

అంతట దేవదానవ గంధర్వాదులందఱును రావణాసురుడు మరణమునుబొందుటనుజూచి తమతమవిమానములనెక్కి పోయిరి. అట్లుపోవునప్పుడు వారందఱును రావణాసురునియొక్క మరణమును, రామునియొక్క పరాక్రమమును, వానరరాక్షసులయొక్క యుద్ధమును, సుగ్రీవునియొక్క యాలోచనను, సుమిత్రానందనుడగు లక్ష్మణునియొక్క యనురాగమును, వీర్యమును, నానావిధములుగా జెప్పికొనుచుబోయిరి. అంతట రఘుకులోద్భవుడగు రాముడు దేవేన్ద్రునిచేత నివ్వబడినదియును, అగ్నిదేవునియొక్క కాంతివంటికాంతిగలదియును, రథమును దీసికొనిపొమ్మని చెప్పుచు మాతలిని అనేకవిధములబూజించెను. అంతట నా మాతలిరథముతో గూడ స్వర్గలోకమునకు బోయె. అట్లు మాతలి స్వర్గలోకమునకుబోయినపిమ్మట రఘుకులోద్భవుడగు రాముడు పరమసంతోషముగలవాడై లక్ష్మణుని ఆలింగనము చేసికొనియె. అవ్విధముగ లక్ష్మణుని నాలింగనమును జేసికొనినపిమ్మట రాముడు లక్ష్మణునిచేత విజ్ఞాపింపబడినవాడును, వానరోత్తములచేత బూజింపబడినవాడును, నగుచు శిబిరములోనికి (గుడారములోనికి) వచ్చె. అంతట నా రాముడు సమీపమునందున్నవాడును, సుమిత్రానందనుడును, సత్వసంపన్నుడును, ప్రకాశించుచున్న తేజస్సుగలవాడును, నగు లక్ష్మణునితో నిట్లనియె.

సౌమ్యస్వభావముగల యో తమ్ముడా! లక్ష్మణా! నాకనురక్తుడును, భక్తుడును, ఉపకారమును జేయువాడును, నగు విభీషణుని లంకాపట్టణమునం దభిషిక్తునిగా జేయుము. మఱియు నో తమ్ముడా! లక్ష్మణా! లంకాపట్టణమునందు ప్రభుత్వమును వహించియున్న విభీషణుని జూచుటయే నాకు మిగులశ్రేష్ఠమైన కోరికయైయున్నదనియె. ఇవ్విధముగా

మహానుభావుఁడగు రాముఁడు చెప్పినమాటను విని లక్ష్మణుఁడు వల్లెయని పరమసంతోషము గలవాఁడగుచు బంగారపు కలశమును జేకొనియె. అంతట నాకలశమును మిగులబలముగల వానరులచేతికిచ్చి సముద్రోదకమును మిగుల శీఘ్రముగ దీసికొనిరండనియె. పిమ్మట వానరోత్తములందఱును మిగుల శీఘ్రముగ బోయి సముద్రోదకమును దెచ్చిరి. అంతట నాకలశమును శ్రేష్ఠమగు నొక్కయాసనమునందు బెట్టిరి అప్పుడు లక్ష్మణుఁడు ఆఘటోదకముచేత విభీషణునకభిషేకమును జేసె. అవ్విధముగ బరిశుద్ధమగు నంతఃకరణగల లక్ష్మణుఁడు రామునియొక్క యాజ్ఞను సారముగ రాక్షసులనడుమ శాస్త్రోక్తప్రకారముగ స్నేహితులతో గూడుకొనియున్న విభీషణునకు లంకాపట్టాభిషేకమును జేసె. ఆసమయమునందు ఆవిధముగా లంకాపట్టాభిషిక్తుఁడైన విభీషణుని జూచి యతని మంత్రులందఱును మిగుల సంతోషమును బొందిరి. అప్పుడు విభీషణుఁడు రామునిచేత నివ్వబడినదియును, మిగులగొప్పదియును, నగు రాజ్యమును బొంది మంత్రులు మొదలగు వారలనందఱను మృదుమధురవచనములచేత సంతోషముగల వారినిగా జేసి లక్ష్మణునితోగూడ రామునియొద్దకు బోయె. ఆసమయమునందు రాక్షసులందఱును, అక్షతలను, మోదకములను, పేలాలను, దివ్యములగు పుష్పములను, రాముని బూజించుటకు దీసికొనివచ్చిరి అంతట దుర్ధర్షుఁడగు విభీషణుఁడు ఆపుష్పాదులను జేకొని రామలక్ష్మణులకు సమర్పించె. అప్పుడు రాముఁడు పరమానందమునుబొంది యామంగళద్రవ్యములను మరల విభీషణునకు ఆశీర్వదించి యిచ్చె. పిమ్మట నానాముఖ పర్వతముతోసమానుఁడును, వీరుఁడును, దోసిలియొగ్గియున్నవాఁడును, తనసమీపమునందున్నవాఁడును, వానరోత్తముఁడును, నగు హనుమంతునితో నిట్లనియె.

మంచిస్వభావముగల యోహనుమంతుఁడా! మహారాజగు నీవిభీషణుని యనుమతమును బొంది లంకాపట్టణములోనికిబొమ్ము. బోయి రావణాసురుని యాలయమునందు ప్రవేశించి జయము గలిగినందుకు సంతోషమును బొందుము. పిమ్మట సీతయున్న చోటునకు బోయి రామలక్ష్మణసుగ్రీవులు కుశలముగ నున్నారనియు రామునిచేత రావణాసురుఁడు చంపబడియె ననియును చెప్పుము. ఈవిషయమును సీతతో జెప్పి మరల సీత చెప్పునట్టి విషయమును దెలిసికొని రమ్మనియె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి నూటపదునైదవ సర్గ ముగిసెను.

— { సీతాదేవిదగ్గిరకుహనుమంతుఁడుపోయి రాముఁడు రావణాసురునిసంహారించెనని చెప్పుట. } —

అవ్విధముగా రాముఁడు చెప్పిన వాక్యములను విని హనుమంతుఁడు రాక్షసులచేత బూజింపబడిన వాఁడగుచు లంకాపట్టణమునందు బ్రవేశించె. అంతట నధికమగు తేజస్సుగల హనుమంతుఁడు రావణాసురుని యాలయమునందు బ్రవేశించె. పిమ్మట శరీరసంస్కారములేనిదియును, గ్రహపీడతో గూడుకొనిన రోహిణివలె నున్నదియును, రాక్షసస్త్రీలచేత జుట్టుకొనఁబడినదియును, అశోకవృక్షము క్రింద సంతోషరహితముగా నున్నదియును, నగు సీతాదేవిని జూచె. పిమ్మట నానావిధ వినయసంపద గలవాఁడగుచు నాసీతాదేవికి నమస్కారమును జేసె. అట్లు తనసమీపమునకు వచ్చి నమస్కారమును జేయుచున్నవాఁడును, మహాబలుఁడును, నగు హనుమంతునిజూచి యేమియును మాటలాడక సంతోషము గలదగుచు నూరకుండె. అంతట వానరోత్తముఁడగు హనుమంతుఁడు సంతోషచిహ్నములుగల సీతాదేవియొక్క ముఖమునుజూచి రాముఁడు చెప్పిన వృత్తాంతమును సర్వమును జెప్పదలచి యిట్లనియె.

తల్లీ! విదేహరాజపుత్రీ! సీతాదేవీ! రాముఁడు సుగ్రీవలక్ష్మణవిభీషణవానరులతో గూడ సుఖముగనున్నాఁడు. మఱియునోదేవీ! సీతా! శత్రువులను జంపినవాఁడును, శత్రువులను నశింపజేయునట్టివాఁడును, కృతార్థుఁడును నగు రాముఁడు నీకు, కుశలమును జెప్పెను. ఓదేవీ! సీతా! లక్ష్మణునియొక్క నీతిబలముచేతను, విభీషణుని సహాయముచేతను, వానరులయొక్క బలిమిచేతను రాముఁడు రావణాసురుని సంహరించె. మఱియునోసీతా! వీరుఁడును, రఘుకులనందనుఁడును, నగు రాముఁడు కుశలమును జెప్పి కృతార్థమైన యంతరాత్మచేత మిగుల బ్రియమును బొందినవాఁడై మఱియు నిట్లనియె.

ఆరాముని వాక్యములనుగా నేను జెప్పెదను. ఓదేవీ! సీతా! నీకు నేను బ్రియమును జెప్పుచున్నాను. నిన్ను నిప్పుడు ప్రీతురాలినిగా జేయుచున్నాను. నేనుజయింతునని తలచి నీవింతకాలము జీవించుచుంటివి గనుక నీకు జెప్పుచున్నాను. ఓసీతా! నేనుజయమును బొందితిని. ఇప్పుడు నేను రావణాసురుని జంపితిని. ఈలంకాపట్టణమంతయును నావశమునందున్నది. నేను రావణాసురుని జంపెదనని చేసిన ప్రతిజ్ఞ తప్పిపోవునేమోయని తలచి నిద్రాహారములనుదల నిన్నువిడిపించుటకు సముద్రమునుబంధించి నాప్రతిజ్ఞను నెరవేర్చితిని. నేను రావణాసురుని గృహమునందుండ వాసి వచ్చెనేయని యుద్వేగముగల దానవుగాకుము. ఇప్పుడీలం

కాపట్టణమును, దీనియందలి యైశ్వర్యమును విభీషణాధీనమై యున్నది. కాబట్టి స్వగృహమునందు నివసించిన దానివలె భయరహితురాలవగుమని రాముడు చెప్పెనని చెప్పి యాహనుమంతుడు మరియు నిట్లనియె.

ఓదేవీ! సీతా! ఈరాముడు నిన్నుజూడవలయునని మిక్కుతూహలము గలవాడైయున్నాడనియె. ఇవ్విధముగాహనుమంతుడు చెప్పిన మాటను సీతాదేవి విని చంద్రునివంటి మోముగలదియును, ధర్మమునందు నిలిచి యున్నదియును, అధికమగు సంతోషముగలదియును, నగుచు నేమియును మాటలాడక యూరకుండెను. ఆసమయమునందు వానరోత్తముడగు హనుమంతుడు మరలనిట్లనియె. ఓతల్లీ! సీతాదేవీ! ప్రియమగు వార్తను దెలుపుచున్న నాతో మాటలాడకుండుటకు కారణమేమి? ఏవిషయమును గుఱించియో యాలోచించుచున్నట్లు తోచుచున్నది. ఇవ్విధముగ నాలోచించుటకు కారణమేమియనియె. ఇవ్విధముగా హనుమంతుడు చెప్పినమాటలను విని సీతాదేవి అపరిమితమగు సంతోషముగలిగి యుండుటచేత గద్గదస్వరముగలదగుచు నిట్లనియె.

ఓవానరోత్తమా! హనుమంతుడా! నాభర్తయగు రాముడు జయించిన వృత్తాంతమునువినుటచేత నధికమగుసంతోషముగలదాననైతిని. అందువలన నేమియును మాటాడలేకపోతిని. మఱియు నోవానరోత్తమా! నాకుప్రియమును జెప్పి సంతోషమును గలిగించిన నీకేమియిచ్చి సంతోషమునుగలిగింపగలనాయని యోచించుచున్నాను. మఱియు నోహనుమంతుడా! సౌమ్యుడా! నాకు ప్రియమును జెప్పుటయందు నీకుసమానమగు వస్తువు భూమియందేదియునులేదు. మఱియు నోహనుమంతుడా! బంగారము, వెండి, నానావిధములగు రత్నములు, ముల్లోకాధిపత్యము, మొదలగు దానిలో నేదియును, నీవుచెప్పిన ప్రియవచనములకు బహుమానముగ నివ్వదగినదికాదనియె. ఇవ్విధముగా సీతాదేవి చెప్పిన వాక్యమునువిని దోసిలియొగ్గి సీతకభిముఖముగానుండి యిట్లనియె.

భర్తకుప్రియమును గోరుదానవును, యుక్తురాలవును, భర్తవిజయమును గోరుదానవును, అయినయోసీతా! నీవు ఈవిధముగా సంభాషించుటకు దగదు. సౌమ్యస్వభావముగల యోసీతా! నీవచనము మిగుల సారవంతమును, మార్దవమునునైయున్నది. ఓసీతా! నీమాట, నానావిధములగు రత్నసముదాయములకంటెను, దేవరాజ్యముకంటెను నధిక సంతోషమును గలిగించునదినై యున్నది. మఱియు నోసీతా! నేను జయించినరాముని జూచుచుండుటచేత నాకు సకలలోక రాజ్యమును దొరికినట్లు సంతోషము గలిగి యున్నది. కావున నాకేపదార్థమునందును కోరికలేదనియె. ఇవ్విధముగా హనుమంతుడు చెప్పిన వచనమును విని జనకచక్రవర్తికి పుత్రికయగు సీతాదేవి మరల వాయునందనుడగు హనుమంతునితో మిగుల శుభకరమగు వాక్యములను జెప్పదలచి యిట్లనియె.

ఓహనుమంతుడా! నీవు నానావిధములగు శుభలక్షణములుగలదియును, మాధుర్యగుణములతో గూడుకొనినదియును, ఎనిమిది విధములగు బుద్ధిలక్షణములతో గూడుకొనినదియునగు వాక్యమును జెప్పుటకుదగినవాడవు. నీవలె మాటలాడదగిన వాడులేడు. వాయుపుత్రుడవైన యోహనుమంతుడా! నీవుమిగుల శ్లాఘనీయుడవైతివి. ఓహనుమంతుడా! బలము, శౌర్యము, శాస్త్రజ్ఞానము, సత్వము, పరాక్రమము, దాక్షిణ్యము, శ్రేష్ఠమగుతేజస్సు, ఓర్పు, ధృతి, స్థైర్యము, అణకువ, మొదలుగాగల గుణములన్నియును నీయందు నిలిచియున్నవనియె. అంతట నాహనుమంతుడు మునుపటికంటె నధికమగు వినయముగలవాడగుచు సీతాదేవికెదుట చేతులను ముకుళించుకొని నిలుచుండి మరల నిట్లనియె.

ఓసీతాదేవీ! నీవంగీకరించినయెడల నిదివరకు నిన్ను బెదరించిన, ఈరాక్షసస్త్రీలనందఱను సంహరించెదను. మరియు నోసీతా! మిగుల వ్యసనమును బొందుచున్నదానవును, భర్తయేదేవుడుగాగలదానవును, అశోకవనమునుబొందినదానవును, నగు నిన్ను భయంకరములగు రూపములును, కార్యములును, గలవారును, క్రూరులును, క్రూరముగాజూచువారును, దారుణములగు కథలుగలవారును, నగు నీరాక్షసస్త్రీలందఱును సంహరింపదగినవారు. కాబట్టి యాజ్ఞనుయివ్వుము. ఈరాక్షసస్త్రీలనందఱను జంపెదను. మంగళస్వరూపురాలవైన యోసీతా! పిడికిటిపోట్లచేతను, హస్తములచేతను, పాదములచేతను, మరియు నానావిధములచేతను, వీరలనందఱ జంపవలయునని తలచుచున్నాను. మరియు నోసీతా! మిగుల భయంకరములగు జానుప్రహారములచేతను, దంతములచేతను, ఈరాక్షసస్త్రీలయొక్క చెవులను, ముక్కులను, నశింపజేయుదును. మరియు నీరాక్షసస్త్రీలయొక్క కేశములను ఛేదించెదను. మరియును, మిగులదీక్ష్ణములగు గోళ్ళచేతను, నానావిధములగు దెబ్బలచేతను, ఈరాక్షసస్త్రీలనందఱను సంహరించెదను. కావున నాజ్ఞ యివ్వుమనియె. ఇవ్విధముగా హనుమంతుడు చెప్పినవాక్యములను విని యశోవంతురాలును, జనకచక్రవర్తికి గూతురును, నగు సీతాదేవి ధర్మార్థసహి

తమగు వాక్యమును జెప్పదలచి హనుమంతునితో నిట్లనియె. ఓహనుమంతుడా! రాజును ఆశ్రయించి జీవించుచున్నవారును, రాజానుమతముచేత సకల కార్యములను జేయుచున్నవారును, విధేయులును, దాసీతనమునందు నియమింపబడినవారును, నగు వారిమీద నెవ్వడు కోపమును బొందును. మఱియు నోహనుమంతుడా! నేను పూర్వజన్మమునందు జేసిన పాపవశముచేత నేను దుఃఖము ననుభవించితిని. నేనీదుర్దశ ననుభవింప దగిన దగుటచేత ననుభవించితిని. ఈ రాక్షసస్త్రీ లేమిచేయుదురు. వీరందఱును రావణాసురుని యాజ్ఞానుసారముగ సకల దుష్కార్యములను జేసిరి. వానరోత్తముడవైన యోహనుమంతుడా! రావణాసురుడు మరణమును బొందిన పిమ్మట వీరిలో నొకర్తెయును, నన్ను బెదరించుట లేదు. మరియు నోవానరోత్తముడా! పూర్వమునందొక పెద్దపులివద్ద నొక భల్లూకము మిగుల న్యాయముతో గూడిన మాటను నొకదానిని జెప్పె. ఆమాట శ్లోకరూపముగనున్నది. దానిని జెప్పెదను. వినుము.

"శ్లో॥ నపరఃపాపమాదత్తేపరేషాంపాపకర్మణాం।సమయోరక్షితవ్యస్తుసంతశ్చారిత్రభూషణాః॥" ఇతరులకు కీడును జేయునట్టి పాపాత్ములకు బుద్ధిమంతుడగు వాడు కీడును జేయడు. సమయము రక్షించుకొనదగినది. సత్పురుషులు సచ్చరిత్రయే భూషణముగా గలవారు. చంపదగిన పాపాత్ములైనను, పుణ్యాత్ములైనను, చంపదగదు. అట్టివారిని జంపకపోవుటవలన దోషమేమియును లేదు. లోకములకు హింసను గలుగజేయు వారును, కామరూపులును, పాపకృత్యములను జేయుచున్నవారును, నగు పాపాత్ములనుగూడ జంపగూడదు. అట్టికృత్యమును జేయక పోవుటవలన గొంచెమైన నపరాధము లేదు. కావున నీరాక్షసస్త్రీలందఱును చంపదగినవారుగారు. కాబట్టి యూరకుండుమనియె. ఇవ్విధముగా సీతామహాదేవి చెప్పిన వాక్యములను విని హనుమంతుడు యశోవంతురాలును, రామునకు భార్యయును, నగు సీతాదేవితో మరల నిట్లనియె.

ఓపూజ్యురాలా! సీతాదేవీ! పూర్ణచంద్రునివంటి మోముగలవాడును, లక్ష్మణునితో గూడినవాడును, స్థిరమైన స్నేహితులు గలవాడును, చంపబడిన శత్రువులు గలవాడును, నగు రాముడు, దేవేంద్రుడు శచీదేవిని చూచిన విధముగ నిన్నుజూడగలడనియె. ఇవ్విధముగ సాక్షాల్లక్ష్మివలెనున్న సీతతో జెప్పి యాహనుమంతుడు మిగుల వేగము గలవాడై రాముడున్నచోటునకు వచ్చె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి నూటపదునారవ సర్గ ముగిసెను.

రాముడు సీతనుబిలుచుకొనిరమ్మని విభీషణుని బంపుట.

అట్లు రామునియొద్దకు బోయినపిమ్మట జక్కగా మాటలాడ నేర్చినవాడును, వానరోత్తముడును నగు హనుమంతుడు ధనుర్ధారులలో నుత్తముడును, మిగుల ప్రాజ్ఞుడును నగు రామునితో నిట్లనియె.

రఘుకులోద్భవుడవైన యోరాముడా! నీవేమి నిమిత్తముగ నింతటిప్రయత్నమును జేసి జయమును బొందితివో యాఫలమును బొందుటకు దుఃఖముచేత బరితపించుచున్న సీతాదేవినిచూడుము. మరియు నోరాముడా! అధికమగు దుఃఖముతో గూడుకొనినదియును, కన్నీళ్ళచేత వ్యాప్తమైన చూపులుగలదియును, నగు సీతాదేవి నీవు జయించితివను వార్తనువిని యధికమగు సంతోషమును బొందె. మునుపటి విశ్వాసముచేత పూజ్యురాలగు సీతాదేవి నమ్మకముగలదై యుద్ధమును జేసి జయమును పొందినవాడును, భర్తతో గూడుకొనినవాడును నగు భర్తను జూడవలయునను కోరికగలదాననై యున్నాననియెనని హనుమంతుడు చెప్పె. ఇవ్విధముగా హనుమంతుడు చెప్పినమాటను విని ధర్మవంతులలో నుత్తముడగు రాముడు కొంచెముగా కన్నీళ్ళచేత వ్యాప్తమైన చూపుగలవాడగుచు నేదోయొక విషయమును ధ్యానించె. పిమ్మట దీర్ఘనిట్టూర్పును విడిచి భూమిని జూచుచు సమీపమునందున్నవాడును, మేఘముతో సమానుడును నగు విభీషణునితో నిట్లనియె.

రాక్షసోత్తముడవైన యోవిభీషణుడా! విదేహరాజపుత్రికయగు సీతాదేవిని దివ్యమైన యంగరాగముగల దానినిగాను, దివ్యములగు నాభరణములచేత నలంకరింపబడిన దానినిగాను, శిరస్స్నానమును జేసినదానినిగాను జేసి యతిశీఘ్రముగ నికడకు దీసికొని రమ్మనియె. ఇవ్విధముగా రాముడు చెప్పిన వాక్యమును విని విభీషణుడు మిగుల త్వరగలవాడై యంతఃపురములోనికి బోయి తనయాడువారలచేత సీతకు స్నానాదికమును జేయింపదలచి తగు యత్నమును జేసి యాసీతయొద్దకు బోయి యిట్లనియె. ఓదేవీ! తల్లీ! నీవుదివ్యమైన యంగరాగము గలదానవును, దివ్యములగు నాభరణములచేత భూషితురాలవునునై విమానముమీద నెక్కుము. నిన్ను శ్రీరాముడు చూడవలయునని కుతూహలము గలవాడై యున్నాడనియె. ఇవ్విధముగా విభీషణుడు చెప్పినవాక్యమును విని యాసీతాదేవి విభీషణునితో నిట్లనియె.

రాక్షసోత్తముడవైన యోవిభీషణుడా! నేను స్నానమును జేయకయే నాభర్తయగు రాముని జూడవలయునని తలంపుగలదానవై యున్నానని యెను. అట్లుసీతాదేవి చెప్పిన మాటనువిని విభీషణుడిట్లనియె. ఓసీతా! నీభర్తయగురాముడేవిధముగా జెప్పెనో యావిధముగా జేయుట యుచితమనియెన్నుమనియె. అంతట భర్తనే దేవునిగా దలచుచున్నదియును, పతివ్రతయునునగు సీతాదేవి యావిధముగానే చేయుదుననియె. అంతట స్నానమును జేసినదియును, రాక్షసస్త్రీలచేత జక్కగ నలంకరింపబడినదియును, మిగుల వెలగల యాభరణములను ధరించినదియును, మిగుల వెలగల పట్టువస్త్రమును ధరించినదియును, నగు సీతను విమానమునం దెక్కించి యనేకవేలరాక్షసస్త్రీల కావలితో రామునియొద్దకు దీసికొనివచ్చె. వచ్చి మహాత్ముడును, ధ్యానమునవలంబించి యున్నవాడును, రామునకు వినయ సంపదతో గూడుకొనినవాడును, నమస్కారమును జేయుచున్నవాడును నగుచు సీతాదేవిని సమర్పించె. అప్పుడు రాముడు చిరకాలమునుండి రాక్షసులయొక్క గృహమునందు నివసించియున్న సీతవచ్చియున్నదను వార్తనువిని హర్షదైన్యరోషములు మూడునుగలవాడయ్యె. అంతట జక్కగ నాలోచించుచు దనసమీపముననున్న విభీషణుని జూచి రఘుకులోద్భవుడగు రాముడిట్లనియె.

రాక్షసాధిపతివియును, సర్వకాలముల యందును నా విజయమునం దభిలాషగలవాడవునునైన యోవిభీషణుడా! సీత మిగుల శీఘ్రముగ నాయొద్దకు వచ్చునట్లు చేయుమనియె. అట్లు రాముడు చెప్పినమాటలనువిని విభీషణుడు మార్గమునందున్నవారలను దూరముగా దొలగించి మార్గమునందాటంకములేకుండునట్లు చేయుటకు యత్నించె. ఆసమయమునందు తలపాగలను, కవచములను, ధరించిన వారలును, బెత్తములు చేతియందుగలవారును, నగు పురుషులు వచ్చిమార్గమునందడ్డముగా నున్నజనుల నందఱను దూరముగా దొలగించుటకు బ్రవర్తించిరి. పిమ్మట భల్లూకములయొక్కయు, వానరులయొక్కయు, రాక్షసులయొక్కయు, సమూహములు దూరముగా దొలగింప బడుచుండె. అట్లు దూరముగా దొలగింపబడుచున్న వారలయొక్క కలకలధ్వని వాయువుచేత మిగులనధికముగా గొట్టబడుచున్న సముద్రముయొక్క ధ్వనిని బోలియుండె. మరియు నాసమయమునందు దూరముగా దొలగింపబడుచున్నవారలును, అధికమగు సంభ్రమము గలవారును, నగు వానరులు మొదలగు వారినిజూచి రఘుకులోద్భవుడగు రాముడు విభీషణుడు చేయుచుండుచున్న కార్యమునందిష్టము లేనివాడయ్యె. అంతట నారాముడు కోపముగలవాడై నేత్రముచేత దగులబెట్టుచున్నవానివలె జూచుచు బుద్ధిమంతులలో నుత్తముడగు విభీషణునితో నిట్లనియె.

రాక్షసోత్తముడవైన యోవిభీషణుడా! నాయనుమతమును బొందకయే యీజనము నీవిధముగా దూరముగా దొలగించుటకు గారణమేమి? ఇట్టికార్యము నెవని యాజ్ఞమీద జేయుచున్నావు. ఇకనీకార్యమును నివారింపుము. ఇందున్నవారందఱును నాస్వజనమైయున్నారు. మరియు నో విభీషణుడా! "శ్లో॥ నగృహాణిసవస్త్రాణినప్రాకారాస్తిరస్క్రియాః। నేదృశారాజసత్కారా వృత్తమావరణంస్త్రియః॥ వ్యసనేషునకృచ్ఛ్రేషు నయుద్ధేషుస్వయంవరే। నక్రతౌనవివాహేచ దర్శనందుష్యతిస్త్రియః॥" గృహములు, వస్త్రములు, ప్రాకారములు, తెరలు, అధికములగు రాజసత్కారములు, మొదలగునవి యేవియును, స్త్రీకికారణములుగావు. స్త్రీలకు దమపాతివ్రత్య మొకటియే యావరణము. మరియు నోవిభీషణుడా! వ్యసనములయందును, కృచ్ఛ్రములయందును, యుద్ధములయందును, స్వయంవరమునందును, క్రతువుల యందును, వివాహమునందును, స్త్రీలనుజూచుటవలన దోషములేదు. కాబట్టి యిప్పుడీసీత యుద్ధమునందును, మిగులగొప్పదగు కష్టమునందును దగులుకొనియున్నది. కావున నీసమయమునందు సీతను నితరులు చూచుటవలన దోషమేమియును లేదు. అదియునుగాక నేనుదగ్గరనున్నకాలమునందెవరు చూచినను దోషములేదు. కావున నెవరికిని బాధగలుగకుండునట్లు మిగులశీఘ్రముగా సీతను, నాయొద్దకు దీసికొనిరమ్ము. స్నేహితులయొక్క సముదాయముతో గూడుకొనిననన్ను సీతవచ్చి చూచునట్లు చేయుమనియె. ఇవ్విధముగా రాముడు చెప్పిన వాక్యమునువిని విభీషణుడు జనులకు బాధగలుగకుండునట్లు నేసి మిగుల వినయముగలవాడగుచు సీతను రామునియొద్దకు దీసికొనివచ్చె. అప్పుడు లక్ష్మణసుగ్రీవులును, వానరోత్తముడగు హనుమంతుడును, రామునియొక్క వాక్యమునువిని మిగులవ్యసనముతోగూడిన మనస్సుగలవారైరి. మరియు నసమయమునందు భార్యయందపేక్షలేనితనమును చూపించునట్టివియును, భయంకరములైనవియును, నగు చేష్టలచేత రామునకు సీతయందు కోపముగలిగియున్నట్లు తలచి మిగులభయమును బొందిరి.

ఆసమయమునందు సీతాదేవి సిగ్గుచేత సకలావయవములను దాచకొనుచు విభీషణుని యనుమతమును బొంది భర్తయగు రాముని సమీపమునకువచ్చె. అంతట నాసీత జనులయొక్క సన్నిధియందు వస్త్రముచేత గప్పబడిన ము

ఖముగలదగుచు ఆర్యపుత్రుఁడా! యనిభర్తనువ్యసనమును బొందుచుండెను.

మఱియు నాసమయమునందు సీతాదేవిమిగులశ్లాఘ్యమగుముఖముగలదియును, విస్మయమును, సంతోషమును గలదియును, స్నేహముగలదియును, నగుచుభర్తయొక్కముఖమును జూచెను. అంతట చిరకాలమునకు భర్తయొక్కముఖమును జూచి యదివఱకుమనస్సునందుగలిగినవ్యసనమును బోగొట్టుకొనియెను. ఆసమయమునందు సీతాదేవిపూర్ణచంద్రునివంటిమోముగలదయ్యె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి నూటపదునేడవసర్గము ముగిసెను.

రాముఁడు సీతాదేవితో నిన్నుబరిగ్రహింపనని చెప్పుట.

అట్లు మిగులవినయముతో పార్శ్వభాగమునందున్నదియును, జనకచక్రవర్తికి బుత్రికయును, నగు సీతనుజూచి రాముఁడు మనస్సులోపలనధికమగు కోపముగలవాఁడగుచు విశేషముగా మాటలాడుటకొఱకు నుపక్రమించెను. ఓసీతా! నేనుయుద్ధమునందుజయించి నిన్నుసంపాదించితిని. పౌరుషమువలననెట్టికార్యమును జేయవలయునో యట్టికార్యమును జేసితిని.

ఓసీతా! ఇప్పుడు నాకోపమునకు అంతమునుగల్పించితిని. ధర్షణనువిడిచివేసితిని. అవమానమును, శత్రువును, ఏకకాలమునందే నశింపజేసితిని. ఇప్పుడు నాపౌరుషమంతయును జక్కఁగజూడఁబడియెను. ఇప్పుడు నాశ్రమయంతయును, సఫలమయ్యె. మఱియునోసీతా! నాప్రతిజ్ఞనెరవేరుటవలన నేనుమిగులసమర్థుఁడనైతిని. నేనులేనికాలమునందు జపలచిత్తుఁడగు రాక్షసుఁడునిన్నుదీసికొనివచ్చె. అందుమూలకముగ దైవవశముచేత వచ్చినదోషమును బోగొట్టితిని. మఱియునోసీతా! "[illegible] సంప్రాప్తమవమానం యస్తేజసా నప్రమార్జతి। కస్తస్యపురుషార్థోస్తి పురుషస్యాల్పతేజసః" సంప్రాప్తమైన యవమానమును ఏపురుషుఁడుతనతేజస్సుచేత బోగొట్టుకొనఁడో యట్టిపురుషుఁడల్పతేజస్సుగలవాఁడగుటవలన వానికేమియును, పురుషార్థములేదనియెఱుంగుము. మఱియునోసీతా! హనుమంతుఁడు సముద్రమును దాటుటయును, లంకయనుపేరుగల రాక్షసస్త్రీనిసంహరించుటయును, మఱియునితరములగు గొప్పగొప్పకార్యములును, నేడుసఫలములయ్యె.

మఱియునోసీతా! యుద్ధమునందు మిగులనధికముగా బరాక్రమించినవాఁడును, హితమునుఆలోచించినవాఁడును, సైన్యముతోఁగూడ యుద్ధమునుజేసినవాఁడును, నగుసుగ్రీవుని యొక్కశ్రమయంతయును నేడుసఫలమయ్యె. మఱియునో సీతా! గుణరహితుఁడగు అన్ననువదలినాయొద్దకువచ్చి మిగులభక్తితోబ్రవర్తించిన యీవిభీషణునియొక్కశ్రమయంతయును నిప్పుడు సఫలమయ్యెననియెను. ఇట్టివిధముగాజెప్పుచున్నరామునియొక్క మాటలనువినిసీతాదేవి యాఁడులేడివలెభయమునుబొంది చూచుచున్నదియును, కన్నీళ్ళచేత వ్యాప్తములైననేత్రములుగలదియునునగుచునుండెను. ఆసమయమునందు సీతనుజూచుచున్నరామునియందు నేతిచేతయగ్నిహోత్రునియందు మంటయధికమైనవిధముగ కోపమధికమయ్యె. అంతటనారాముఁడు కనుబొమలనుముడివైచి యడ్డముగాజూచుచు వానరులయొక్కయు, రాక్షసులయొక్కయుమధ్యయందుసీతతోనిట్లనియెను.

ఓసీతా! ఇతరులుచేసెడి యవమానమును సహింపని మానవునిచేత నేకార్యముచేయఁదగియున్నదో యట్టికార్యమును జేసితిని. తపస్సుచేతమహానుభావుఁడైనయగ్నిహోత్రునిచేత దక్షిణదిక్కు ఉద్ధరింపబడినవిధముగా నాచేతనీవును, నుద్ధరింపబడితివి. మంగళకరురాలవైనయోసీతా! నేనుయుద్ధమునందు మిగులకష్టమునుజెందుట యంతయును నీకుదెలిసియేయున్నది. అట్టిశ్రమను సర్వమును స్నేహితులయొక్కసహాయముచేత దాటితిని. ఆశ్రమయంతయును నీనిమిత్తముగగాదు. ఇదివఱకు మావంశమునకుగలిగియున్న కీర్తినిగాపాడుటకొఱకును, లోకాపవాదమును బోగొట్టుకొనుటకొఱకును, నేనిట్టికష్టముల ననుభవించితిఁగాని నీనిమిత్తముగగాదు. నేత్రరోగముగలవాని యెదుటనుండుదీపమువిధముగానుండునో యావిధముగాశత్రుగృహమునందుండుటచేత దూషితురాలవైన నీవునునాయెదుట నుంటివి. కాబట్టినీవిక్కడనుండక నీయిష్టానుసారముగ బదిదిక్కులలోనెక్కడకైనను బొమ్ము. నాకునీతోనేమియు నుప్రయోజనములేదు. మఱియునోసీతా "కఃపుమాన్హికులేజాతః స్త్రియంపరగృహోషితాం। తేజస్వీపునరాదద్యాత్సుహృల్లేఖ్యేనచేతసా" శత్రుగృహమునందు నివసించియున్నభార్యను తేజోవంతుఁడగుపురుషుఁడెవ్వఁడు పరిగ్రహించును. వానిచిత్తమునకు నమ్మకమెట్లుగలుగును. మఱియునోసీతా! రావణాసురునియొక్క తొడనుండి భ్రష్టురాలవును, దుష్టమగునేత్రముచేతజూడబడినదానవును, నగునిన్నునేనెట్లుగ్రహింతును. నిన్నుబరిగ్రహించితినేని కులమునకుఅప్రతిష్ఠగలుగును. మఱియునోసీతా! శత్రువుయొక్కహస్తమునుబొందినసీతను రాముఁడుమరలసంపాదించెనను కీర్తినిబొందుటకు నేనురావణాసురుని సంహరించితిని

గాని నీనిమిత్తముగాదు. నాకునీమీదనాసక్తిలేదు. కావున నీయిచ్ఛానుసారముగఁబొమ్ము.

మంగళస్వరూపురాలవైనయోసీతా! నీవుపుత్రతుల్యుఁడగులక్ష్మణునియందైనను, భరతునియందైనను రక్షకత్వబుద్ధినుంచి సుఖముగాజీవింపుము. అట్లుగాదేని వానరోత్తముఁడగు సుగ్రీవునొద్దనైనను, రాక్షసాధిపతియగు విభీషణునొద్దనైనను, నివసించి నీయాత్మకుసంతోషముగలుగునటు వర్తింపుము. దుర్మార్గుఁడగురావణాసురుఁడు, మనోహరురాలవును, దివ్యమైనయాకారముగలదానవును, చిరకాలమునుండివానియింటియందె నివసించినదానవును, అయిన నిన్నుఁజూచియూరకుండెననితోఁచదు. కావుననిన్నునేనుబరిగ్రహింపననిరి. ఇవ్విధముగా రాముఁడుచెప్పినవాక్యమునువిని చిరకాలమునుండి ప్రియవచనమును వినవలయునని తలఁచుచున్నయాసీత"యేనుఁగుయొక్క తుండముచేత గొట్టబడిన సల్లకీలత క్షీరమునువిడిచినవిధముగా" గన్నీళ్లను విడిచె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలినూటపదునేడవసర్గముగిసెను.

▸❋◂

—{ సీతాదేవి అగ్నియందుఁబ్రవేశించి బైలువెడలి వచ్చుట. }—

ఇట్లు రోమాంచమునుగలుగఁజేయునట్టిదియును, మిగులదారుణమైనదియును, నగు రామునియొక్కవాక్యమును వినిసీతాదేవి యపరిమితమగు వ్యసనముగలదయ్యె. ఎట్టియునదివఱకెన్నఁడునువిననిమాటను కోపవంతుఁడగు భర్త చెప్పగావినిసిగ్గుచేతసగముశరీరముగలదయ్యె. అంతటజనకచక్రవర్తికిఁబుత్రికయగు నాసీతాదేవి తనయవయవములయందుఁ బ్రవేశించినదై (అనగాఁగ్రుంగిపోయినదై) రాముని మాటలనెడు శల్యములచేతబీడింపబడినదగుచు నపరిమితముగా గన్నీళ్లనువిడిచె. అంతటగన్నీళ్ళచేతవ్యాప్తమైనతనమోమునుదుడిచికొనుచు గద్గదస్వరముతో మెల్లగాభర్తయగురామునితోనిట్లనియె.

ఓవీరుఁడా! రామచంద్రా! ప్రాకృతుఁడగుమానవుఁడు ప్రాకృతస్త్రీనిదూషించినవిధముగ నావిషయమై మాటలాడఁదగనిదియును, వినుటకుభయంకరమైనదియును, నగు నిట్టిమాటనుజెప్పుచున్నావేమి? మిగులగొప్పదగు భుజబలముగలయోరాముఁడా! నేనునీవుతలఁచినవిధముగ గాలేదు. నీవావిధముగాదలఁపకుము. నేనుపాతివ్రత్యమునందు, ఒట్టునుబెట్టికొనియెదను. నామాటనునమ్ముము. మఱియును ప్రభుఁడవైనయోరాముఁడా! లోకములోని స్త్రీలయొక్క సంచారమునుజూచి నన్నుగూడనావిధముగానే తలఁచుచున్నావు. ఇదివఱకుఅనేకపర్యాయములు శరీక్షించియుంటివి గావుననీవీసందేహమును విడిచిపెట్టుము. ప్రభుఁడవైనయోరాముఁడా! నేనువివశురాలనగుటచేత నాశరీరమునితరుఁడుస్పృశించెను. దానికినేనేమిచేయుదును. అది దైవయోగముచేత సంప్రాప్తమైనదిగాని నాబుద్ధిపూర్వకముగసంభవించినదిగాదు. ఆకాలమునందు నాశరీరము నాయధీనమైయుండలేదు. మనస్సుమాత్రము నాయధీనమైయున్నది. కావున నామనస్సునుమాత్రము నీయందుబెట్టుకొనియుంటిని. అవయవములుపరాధీనములగుటచేత నేనసమర్థురాలనుగాకపోతిని. నేనేమిచేయుదును. మానమునిచ్చునట్టియోరాముఁడా! నీవుస్వభావపరిజ్ఞానహేతువగు సంవర్ధనముతోఁగూడ సంసర్గముచేత సంశ్లేషముచేతను నీకుఁదెలియబడనైతిని. కావుననేనిప్పుడు శాశ్వతముగఁజచ్చినదాననైతిని. మఱియునోరాముఁడా! నన్నుఁజూచివచ్చుటకుహనుమంతునిఁబంపితివిగదా? అప్పుడు నేనులంకాపట్టణమునందుండుటనుహనుమంతునివలన దెలిసికొంటివిగదా? అప్పుడేనేలవిడిచిపెట్టకపోతివి. మఱియు నోరాముఁడా! వానరోత్తముఁడగు హనుమంతునియొక్కసమీపమునందు నీవాక్యమునువినినపిమ్మట నీచేతవిడిచిపెట్టబడితినని తెలిసికొంటిని. కావుననిప్పుడు నాచేతనాప్రాణమువిడివింపబడియె. మఱియునోరాముఁడా! ప్రాణసంశయదశనుబొంది నీవుపడినశ్రమయంతయును నిష్ఫలముగుటయేగాక నీస్నేహితులగు సుగ్రీవాదులయొక్కశ్రమగూడ వ్యర్థమయ్యె. మానవోత్తముఁడవైనయోరాముఁడా! నీవుసామాన్యజనునివలె అపరిమితమగు కోపముగలవాఁడవై నన్నుస్త్రీమాత్రమునుగాదలఁచితివిగాని నాస్వభావమును దెలిసికొనినవాఁడవుగావు. జనచక్రవర్తినిపెపముగాజేసికొని భూమియందుబుట్టితిననితలఁపకపోతివి. మఱియును సకలసచ్చరిత్రలను దెలిసికొనుటయందు మిగులసామర్థ్యముగలయోరాముఁడా! నాస్వభావమునుగుఱించి కొంచెమైననుయోచింపవైతివి. బాల్యమునందుబాలుఁడవగు నీవునాహస్తమును గ్రహించితివి. అదిమొదలుకొని నాయోగ్యతనుదెలిసికొనియుండియు నునావిషయమును సర్వమునుపృష్ఠభాగమునకు ద్రోసివైచితివనియె. ఇవ్విధముగాబలికి యాసీతాదేవికన్నీళ్లుగలదగుచుగద్గదస్వరముతోఁ బీనుచును, ధ్యానించుచు రామునిసమీపమునందున్నవాఁడునగు లక్ష్మణునితోనిట్లనియె.

సుమిత్రానందనుఁడా! లక్ష్మణా! నాదుఃఖమునుబోఁగొట్టుటకుఁదగినయౌషధమగు చితినిగల్పింపుము. లేనియపవాదమునుబొందినపిమ్మట నాకుజీవింపవలయునని కోరికలేదు.

గుణములచేత ప్రీతినొందనిభర్తచేత ననేకవేలజనులుగలసభయందువిగిచిపెట్టబడిన నాకుమఱియొక్కచోటుసియును లేదు. కావునఅగ్నిహోత్రమునందు బ్రవేశించెదనని యెను. ఇవ్విధముగా సీతాదేవిచెప్పినవాక్యమునకు శత్రుసంహారకుడగు లక్ష్మణుడువిని యధికమగుకోపమునుబొందినవాడైరఘుకులోద్భవుడగు రామునియొక్క మోమునుజూచెను. అంతటసుమిత్రానందనుడును, వీర్యవంతుడును, నగు లక్ష్మణుడురాముని యొక్కయాకారమునుజూచిరాముని యభిప్రాయమును దెలిసికొని చితినిగల్పించెను. ఆసమయమునందు, సీతాదేవిఅధోముఖుడగు రామునకుబ్రదక్షిణమును జేసిప్రజ్వలించుచున్న యగ్నిహోత్రునిదగ్గరకుబోయెను. అంతటనాసీతాదేవి దేవబ్రాహ్మణులకొఱకు నమస్కారమును జేసి దోసిలియొగ్గినదై యగ్నిదేవునియొక్కసమీపమునందుంగూర్చుండియిట్లనియెను.

శ్లో॥ యథామేహృదయంనిత్యం నాపసర్పతిరాఘవాత్। తథాలోకస్యసాక్షీమాం సర్వతఃపాతుపావకః॥ యథామాంశుద్ధచారిత్రాం దుష్టాంజానాతిరాఘవః। తథాలోకస్యసాక్షీమాం సర్వతఃపాతుపావకః॥ కర్మణామనసావాచా యథానాతిచరామ్యహమ్। రాఘవంసర్వధర్మజ్ఞం తథామాంపాతుపావకః॥ ఆదిత్యోభగవాన్వాయుర్దిశశ్చంద్రస్తథైవచ। అహశ్చాపితథాసంధ్యే రాత్రిశ్చ పృథివీతథా॥ యేచాన్యేప్యభిజానంతి యథాచారిత్రభూషితాం। తథాలోకస్యసాక్షీమాం సర్వతఃపాతుపావకః॥

నామనస్సునురామునివదలి మఱియొకనిమీదికిబోకయుండుటవాస్తవమయ్యేనేని లోకముయొక్క సకలకర్మలకును సాక్షియగు నగ్నిదేవుడునన్నుగాపాడుగాత. మఱియును దుష్టురాలినిగా దలచుచున్నరాముడు నన్నుపరిశుద్ధురాలినిగాదలచునట్లు లోకసాక్షియగు నగ్నిదేవుడు నన్నుగాపాడుగాత. మఱియును మనోవాక్కాయకర్మలలోదేనిచేతను నేనుసకలధర్మములనుదెలిసిన రామునతిక్రమింపకయుంటినేని సర్వలోకసాక్షియగు నగ్నిదేవుడునన్నుగాపాడుగాత. మఱియును సర్వకాలములయందును నేనుపరిశుద్ధమగు నడవడికగలదానినిగా సూర్యుడు, వాయువు, చంద్రుడు, దిక్కులును, పగలు, రాత్రి, భూమి, మొదలగు కర్మసాక్షులుచూచుట వాస్తవమయ్యేనేని యగ్నిదేవుడు నన్నుగాపాడుగాత. మఱియునితరులగు దేవతలునునన్నుగాపాడుదురుగాత, అనుచుసీతాదేవి యగ్నిదేవునకు బ్రదక్షిణనమస్కారమునుజేసి నిస్సంగమగు మనస్సుతోబ్రజ్వలించుచున్న యగ్నియందుబ్రవేశించెను.

ఆసమయమునందు బాలురుమొదలుకొని వృద్ధులవఱకునుగల జనమంతయును అపరిమితముగా భయమునుబొందెను. మఱియు నందలివారందఱును, అగ్నిహోత్రునియందు బ్రవేశించుచున్న సీతాదేవినిజూచిరి. అంతట నెల్లవారును జూచుచుండగ బుటమువేయబడిన బంగారముయొక్క కాంతివంటి దేహకాంతిగలదియును, స్వచ్ఛమగుబంగారపుసొమ్ములచేత నలంకరింపబడి నదియునునగు సీతాదేవిప్రజ్వలించుచున్న యగ్నియందుబడెను. ఆసమయమునందు ముల్లోకములోనివారలును, మహానుభావురాలును, అగ్నియందు బ్రవేశించు చున్నదియును, నగుసీతాదేవిని, పావనమగు నాజ్యాహుతినిజూచిన విధముగజూచిరి. మరియు నాసమయమునందగ్నియందు బ్రవేశించుచున్న సీతాదేవినిజూచి స్త్రీలందఱును హాహాకారములను సల్పుచురోదనమునుజేసిరి. అప్పుడు సీతాదేవి, యాజ్ఞమునందు మంత్రపూతమగు నాజ్యధారఅగ్నిహోత్రునియందు బ్రవేశించు విధముగబ్రవేశించెను.

ఆసమయమునందు ముల్లోకములయందును నివసించునట్టి దేవగంధర్వదానవులు శపింపబడిస్వర్గలోకమునుండి పడుచున్న దేవతవలెనున్నదియును, అగ్నిహోత్రమునందున్నదియును, నగుసీతనుజూచి యాశ్చర్యమునుబొందిరి. అవ్విధముగ నాసీతాదేవియగ్నియందు బ్రవేశించుచుండగా రాక్షసులయొక్కయు, వానరులయొక్కయు, హాహాకారములు భూమ్యాకాశముల యందంతటను వ్యాపించెను.

ఇది శ్రీమద్యుద్ధకాండమునందలి నూటపందొంబదవసర్గముగిసెను.

దేవేంద్రుడు మొదలగు దేవతలు రామునకు బ్రత్యక్షమై రామునిస్తుతించుట.

అంతట ధర్మాత్ముడగు రాముడు దుఃఖితమైనమనస్సుగలవాడును, కన్నీళ్ళచేత వ్యాప్తములగు నేత్రములుగలవాడునునగుచు కొంచెముసేపు విచారించుచుండెను. అంతట శత్రునాశకుడగు యమధర్మరాజును, విశ్రవసకుబుత్రుడగు కుబేరుడును, వేయినేత్రములుగల దేవేన్ద్రుడును, శత్రువులను దపింపజేయునట్టి వరుణదేవుడును, మూడునేత్రములుగలవాడును. శ్రీమంతుడును, వృషభధ్వజుడును, నగుమహాదేవుడును, బ్రహ్మవేత్తలలో గొప్పవాడును, సర్వలోకములకును, కర్తయును, నగుబ్రహ్మదేవుడును, మొదలగు దేవతలందఱును సూర్యునితోసమానములగువిమానములెక్కివచ్చిరి. వచ్చిరామునకు సమీపించిరి. అంతటనాదేవతోత్తములందఱును, మిగులవిపులములును, నానావిధములగు నాభరణములతో గూడుకొనినవియును, నగుభుజ

ములనుజాచి చేతులనుముకుళించుకొని సమీపమునవున్న రామునితో నిట్లనిరి.

రఘుకులోత్తముడా! రామచంద్రా! సర్వలోకములకు నుకర్తవును, జ్ఞానవంతులలో శ్రేష్ఠుడవునువైననీవు, అగ్నియందు ప్రవేశించుచున్న సీతనుజూచి యుపేక్షించుటకు గారణమేమి? మఱియునో రాముడా ! నిన్ను సకలదేవతలలో నుత్తమునిగాదెలిసి కొనకయుండుటకు గారణమేమి? మఱియునో రాముడా ! నీవులోకసృష్టికి బూర్వమందు ఋతధాముడను పేరుగలవసువైయుంటివి. మఱియు నీవు ప్రజాపతివి. మఱియు నీవుముల్లోకములకును ఆదికర్తవు. ఇంతయగాక నీకునీవేప్రభుడవు. నీవురుద్రులలోపల నెనిమిదవరుద్రుడవు. సాధ్యులలోపల నైదవవాడవు. (అంగారాముడే నారాయణుడును, మహాదేవుడునుననిరి యెఱుంగవలయును) మఱియునో రాముడా! నీకుఅశ్వినీదేవతలు చెవులు. చంద్రసూర్యులు నీకునేత్రములు. శత్రువులనుదపింపజేయునట్టి యోరాముడా ! నీవులోకములయొక్క యాద్యంతములయందు స్థిరముగానుండువాడవు. ఇట్టిమహానుభావుడవగు నీవుప్రాకృతమానవునివలెనీతాదేవినిఉపేక్షించుటకు గారణమేమియని యాదేవతలందఱును చెప్పిరి. ఇవ్విధముగ నాదేవతలుచెప్పిన వాక్యములనువిని సకలలోకములకును నధిపతియును, ధర్మవంతులలో నుత్తముడును,రఘుకులోద్భవుడునునగు రాముడు ఆదేవోత్తములతో నిట్లనియె.

దేవతోత్తములారా ! నన్నుదశరథమహారాజునకు బుత్రునిగాదలుచుచున్నాను. నేనేస్వరూపము గలవాడనో, ఏమినిమిత్తముగ దశరథునకు బుత్రుడనైపుట్టితినో యావిషయములనుదెలుపుడనియె. ఇవ్విధముగనడుగుచున్నవాడును, కకుత్స్థవంశములమునందు బుట్టినవాడును, నగురామునితో బ్రహ్మవేత్తలలో నుత్తముడగు బ్రహ్మదేవుడిట్లనియె.

సత్యపరాక్రముడవైన యోరాముడా ! నేనుసత్యముగాజెప్పెదను.వినుము. నీవుచక్రాయుధముగలవాడును, విభుడును,శ్రీమంతుడును, నగు నారాయణదేవుడవు. మఱియునో రాముడా! నీవునొకకొమ్ముగలయాదివరాహస్వరూపుడవు. మరియునో రాముడా! నీవుమధుకైటభాదిరాక్షసులను సంహరించిన మహానుభావుడవు. ముందురాబోవు శిశుపాలాదులను సంహరింపగలవాడవు. నీవక్షరస్వరూపుడవు. బ్రహ్మస్వరూపుడవు. సత్యస్వరూపుడవు. నీవు సకల లోకములయొక్కయు ధర్మస్వరూపుడవు. మరియు నీవుసర్వలోకాధిపతివి. నాలుగుభుజములుగల మహానుభావుడవు. శార్ఙ్గమను ధనస్సునుధరించినవాడవు. ఇంద్రియములకధిపతివి. పురుషోత్తముడవునునీవ.

మరియునో రాముడా! నీవుశత్రువులచేత జయింపబడనివాడవు. ఖడ్గమునుధరించినవాడవు. భూమినిసర్వమును నాకర్షించువాడవు. అధికమైనబలముగలవాడవు. మిగుల గొప్పదగు వానరసేనకు నాయకుడవు. సకలకర్మములను ప్రాణివర్గముబొందునట్లు చేయువాడవు. నీవలనసకలలోకములును పుట్టుచుండును. నీయందేసకలలోకములును లీనములగుచుండును. మరియునీవు దేవేన్ద్రునియొక్క వ్యాపారమువంటి వ్యాపారముగలవాడవు.మహేన్ద్రుడవునునీవ.నీవుపద్మనాభుడవుకావుననాకును జనకుడవు.యుద్ధమునందు శత్రునాశమును జేయువాడవు. మరియునోరాముడా! నిన్నుశరణ్యునిగాను, శరణమునుగాను మహర్షులుచెప్పుచున్నారు. ఇంతయగాక నీవు వేయిశృంగములు గలవాడవు. వేదమేస్వరూపముగా గలవాడవు. నూరుజిహ్వలుగలవాడవు. మిగులశ్రేష్ఠుడవు. మరియునునీవుముల్లోకములకును నాదికర్తయగు ప్రభుడవు.

మరియునోరాముడా! నీవుసిద్ధులకును, సాధ్యులకును, ఆధారుడవు. ఇంతయగాక పూజ్యుడవు. యజ్ఞస్వరూపుడవునీవ. వషట్కారస్వరూపుడవునునీవ. ఓంకారస్వరూపుడవునీవ. ఇంతయగాక నీవుశత్రువులను దపింపజేయువాడవు. నీకుజననమరణములులేవు. ఇట్టిమహిమగలనిన్ను నెవ్వడుతెలిసికొనగలడు. మరియునోరాముడా ! నీవుసర్వభూతములయందును, బ్రాహ్మణులయందును, గోవులయందును, సకలదిక్కులయందును, అంతరిక్షమునందును, పర్వతములయందును, వనములయందును, చూడబడుదువు.మరియునో రాముడా! నీవు వేయిపాదములుగలవాడవు. శ్రీమంతుడవు. నూరుశిరస్సులును, నూరునేత్రములునుగలవాడవు. నీవుసకల భూతములను ధరించుచున్నావు. మరియునునీవు పర్వతములతో గూడినభూమిని సర్వమునుధరించుచున్నావు. మరియునో రాముడా! భూమియంతయును నశించినవిమ్మట నీవుసంకర్షణస్వరూపుడవై యుదకములయందు గనబడుదువు.

మరియునో రాముడా ! నీవు దేవగంధర్వ దానవులతో గూడినముల్లోకములను ధరించుచున్నావు. మరియునో రాముడా ! నేనుపరబ్రహ్మ స్వరూపుడవగు నీహృదయస్వరూపుడను. సరస్వతీదేవి నీజిహ్వాస్వరూపురాలు. దేవతలందఱును నీయవయవములయందు రోమస్వరూపులైకనబడుచున్నారు. నీనిమేషము రాత్రియగుచున్నది. నీయున్మేషముపగలగుచున్నది. నీసంస్కారములువేదములనబడు

ను. కావున నీప్రపంచమునందు నీకంటె వేరేమియును లేదు. జగత్తంతయును నీశరీరము. అగ్నిదేవుడు నీకోపస్వరూపు డవును. చంద్రుడు నీయనుగ్రహస్వరూపుడు. నీవు శ్రీవత్సలక్షణముగలవాడవు. మరియు నోరాముడా! పూర్వమునందు మూడువిధములగు పరాక్రమములచేత ముల్లోకముల నాక్రమించితివి. రాక్షసులలో నధికుడగు బలిచక్రవర్తిని బంధించి దేవేన్ద్రుని ముల్లోకములకును నధిపతినిగా జేసితివి. లక్ష్మీదేవియే సీతయయ్యె.

నీవు విష్ణుస్వరూపుడవు. ఇంతియగాక నీవు సకలలోకముల నాకర్షించునట్టి మహానుభావుడవు. మరియు నీవు ప్రజాపతివి. రావణునిజంపుటకొఱకు నీవు మానవశరీరమును బొందితివి. ధర్మవంతులలో నుత్తముడవైనయో రాముడా! నీవు మానవరూపమునుధరించి మాకు చేయదగిన కార్యమును జేసితివి. నీచేత రావణాసురుడు సంహరింపబడెను. కాబట్టి యిక నీవు దేవలోకమునకు రమ్ము. ఓరాముడా! నీబలవీర్యము లమోఘములైనవి. నీపరాక్రమము గూడ నమోఘమైనది. నీదర్శనమును, స్తోత్రమును నమోఘములైనవి. మఱియు నోరాముడా! నీయందు భక్తిగల మానవులందఱును ధన్యులగుదురు. మఱియు నోరాముడా! పురుషోత్తముడవును, శాశ్వతుడవును, దేవుడవును, నగు నీయందు భక్తిగలమానవు లిహపరలోక సుఖములను బొందుదురు. మరియు ఋషిప్రోక్తమగు నీరామస్తోత్రము నేమానవులు పఠింతురో యట్టి మానవు లెందును బరాభవమును బొందరు.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి నూటయిరువదవ సర్గ ముగిసెను.

అగ్నిదేవుడు సీతాదేవిని తెచ్చి రామునకు సమర్పించుట.

ఇవ్విధముగ బ్రహ్మదేవుడు చెప్పిన శుభవాక్యములను విని యగ్నిదేవుడు సీతాదేవిని తొడయందు బెట్టుకొని బయలునకువచ్చె. అప్పుడా యగ్నిదేవుడు చితిని శిథిలముగా జేసి మూర్తిమంతుడై సీతాదేవిని తొడయందు గూర్చుండబెట్టికొని వచ్చె. ఆసమయమునం దాసీతాదేవి, బాలసూర్యునియొక్క కాంతివంటి కాంతి గలదియును, పుటము వేయబడిన బంగారపుసొమ్ములు గలదియును, ఎఱ్ఱని వస్త్రమును ధరించినదియును, నల్లనివియును, కుంచితములును నగు తలవెండ్రుకలుగలదియును, వాడని పూలమాలికలును, ఆభరణములును, గలదియును, దివ్యమగు రూపముగలదియును, ప్రసన్నమగు మనస్సుగలదియును నైయుండె. ఇట్టి సీతాదేవిని నగ్నిదేవుడు తొడయందు బెట్టికొనివచ్చి రామునకిచ్చె. అంతట సకలలోక సాక్షియగు నాయగ్నిదేవుడు రామునితో నిట్లనియె. ఓరాముడా! ఇదిగో సీత. ఈమెయందు గొంచెమైనను పాపములేదు. సచ్చరిత్రలుగలయో రాముడా! మనోవాక్కాయకర్మములలో దేనిచేతను, ఈ సీతాదేవి నీకంటె నితరులను గోరినదిగాదు. వీర్యోద్రిక్తుడగు రాక్షసునిచేత నీవు లేనిసమయమునందు నిర్జనవనము నుండి యపహరింపబడినది. మఱియు నాసమయమునందు దిక్కులేనిదైయుండె. కావున నీసీత యేమియును జేయజాలనిదియయ్యె. మరియు నోరాముడా! నిన్నే ధ్యానించుచున్నదియును, నీయందే మనస్సునుంచి నదియును నగు నీసీత యింతవఱకును, భయంకరమగు నాకారములుగలవారును, వికారములగు శరీరములుగలవారును నగు రాక్షసస్త్రీలచేత గాపాడబడుచుండె. ఆసమయమునందు, ఈసీతాదేవి నానావిధవచనములచేత లోభపెట్టబడినదియును, బెదిరింపబడినదియును నైనీయందు సక్తమైనమనస్సుగలదగుటచేత రావణాసురునిగురించి కొంచెమైనను యోచింపకుండె. కాబట్టియో రాముడా! పరిశుద్ధమగు నభిప్రాయముగలదియును నిష్పాపురాలును, నగు నీసీతాదేవిని గ్రహింపుము. నామాటకు గొంచెమైనను బదులుచెప్పనక్కరలేదు. నేనాజ్ఞాపించుచున్నాను. కావున నీసీతను గ్రహింపుమనియె. అంతట రాముడు సంతోషించిన మనస్సుగలవాడయ్యె. పిమ్మట మాటలాడనేర్చినవారలలో నుత్తముడును, ధర్మాత్ముడును నగు రాముడు క్షణమాత్రము నేపాలోచించెను. పిమ్మట నధికమగు తేజస్సుగలవాడును, దృఢమగు పరాక్రమముగలవాడును, ధర్మవంతులలోపల నుత్తముడును నగు రాముడు దేవోత్తమునితో నిట్లనియె.

ఓదేవోత్తమా! ముఖ్యముగా సీతాదేవి ముల్లోకములయందును బావనమైనదనుటకు సందేహములేదు. అయినను నీసీత చిరకాలము రావణాసురునియొక్క యంతఃపురమునందుండుటచేత నిట్లు తలచితిని మరియు నేనీవిధముగా సీతను బరీక్షింపకపోతినేని లోకులందఱును, మూర్ఖుడును, కామాతురుడును, నగు రాముడు పరుల గృహమునందున్నభార్యను గ్రహించెనని నిందింతురు. కావున నేను బరిగ్రహించితిని. మరియు నోదేవోత్తమా! ఈసీత యితరులను గోరదనియును, నాయందు భక్తిగలదియనియును, నా చిత్తానుసారముగ బ్రవర్తించునదియనియును, నేనెఱుగుదును. అట్లైనఁగియును, ముల్లోకముల వారికిని నమ్మకము గలుగుటకొఱకు సత్యమునం దభిలాషగలవాడనై యాగ్నిమాత్రమునందు బ్రవేశించుచున్న సీతను ఉపేక్షించితిని. మరియు నోదేవోత్తమా! తన తేజస్సుచేత దనను గా

పోవుచున్న యీసీతను సముద్రుడు చెలియలికట్ట నతిక్రమింపలేని విధముగ నొకడును స్పృశింపజాలడు. మరియును దుష్టాత్ముడగు నారావణాసురుడు మనస్సుచేత గూడ ధర్షింపజాలడు. మరియు సీతయగ్నిజ్వాలవలె స్పృశింపనలవిగానిది. మరియునో దేవోత్తమా! మంగళస్వరూపురాలైన యీసీత రావణాసురునియొక్క యంతఃపురమునందలి యైశ్వర్యమునకు దగినది కాదు. సూర్యునివదలి ఛాయాదేవియుండనివిధముగ సీతాదేవి నన్ను వదలియుండునట్టిది గాదు. మరియును జనకచక్రవర్తికి బుత్రికయగు సీత ముల్లోకములయందును పావనురాలనబడును. కావున బుద్ధిమంతుడగు వానిచేత కీర్తి విడువబడనివిధముగ నీసీతయును విడిచిపెట్టబడదు. అవశ్యముగా మీరందఱును చెప్పినమాట ననుసరించి సంచరించెదను. సకల లోకములయందును బూజింపదగిన వారును, ప్రియముగలవారునునగు మీమాటల నవశ్యముగా నంగీకరించెద ననియె. ఇవ్విధముగా జెప్పి యధికమగు బలముగల దేవతలచేత గొనియాడబడిన వాడయ్యె. పిమ్మట మహాబలుడగు రాముడు ప్రియురాలగు సీతతో గలసికొని సుఖార్హుడైయుండె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి నూటయిరువదొకటవసర్గ ముగిసెను.

-(*)-

దశరథమహారాజు స్వర్గలోకమునుండి రాముని వద్దకువచ్చి సీతను గ్రహింపుమనుట.

ఇవ్విధముగా రఘుకులోద్భవుడగు రామునిచేత జెప్పబడినదియును, శుభమైనదియును, నగు వాక్యమునువిని పరమేశ్వరుడు సమీపమునకువచ్చి శుభతరమగు వాక్యమును జెప్పదలచి యిట్లనియె.

తామరపుష్పములవంటి నేత్రములుగలవాడవును, మిగులగొప్పదగుభుజబలము గలవాడవునునైన యోరాముడా! నీవు దైవయోగముచేత మిగులగొప్పదగు కర్మమును జేసితివి. మరియునో రాముడా! సకల లోకములకును భయమునుగలుగజేయునదియును, మిగుల దారుణమైనదియును, నగు రావణాసురునివలన గలిగిన భయమును నీవు దైవయోగముచేత బోగొట్టితివి. కాబట్టి యికమీదట నీవిక్కడనుండి పోయి దీనుడగు భరతుని, మిగుల గీర్తివంతురాలగు కౌసల్యను, కైకేయీ సుమిత్రలను, జూడుము. పిమ్మట నయోధ్యాపట్టణమునకాధిపత్యమును వహించి స్నేహితులగు వారిని సంతోషపెట్టుము. మరియును మిగుల గొప్పదగుబలముగలయోరాముడా! ఇక్ష్వాకుకులమునకు సంతురమును గల్పించి యశ్వమేధయాగమును జేసి యపరిమితమగు కీర్తిని సంపాదించి బ్రాహ్మణులకు ధనమునొయిచ్చి పిమ్మట దేవలోకమునకు రమ్ము. మరియు నోరాముడా! నీతండ్రియగు దశరథుడు విమానారూఢుడై వచ్చియున్నాడు. చూడుము. మిగులగొప్పదగు కీర్తిగల యీ దశరథమహారాజు నీకును మనుష్యలోకమునందు బూజింపదగిన గురుడు. మరియు నోరాముడా! శ్రీమంతుడగు నీదశరథమహారాజు పుత్రుడవగు నీచేత దరింపజేయబడి స్వర్గమును బొందెను. తమ్ముడగు లక్ష్మణునితోగూడ నీదశరథమహారాజునకు నమస్కారమును జేయుమనియె. ఇవ్విధముగా బరమేశ్వరుడు చెప్పినవాక్యమునువిని కకుత్స్థుని వంశమునందు బుట్టిన రాముడు లక్ష్మణునితోగూడుకొనినవాడై విమానమునందున్న తండ్రికి నమస్కారమును జేసె.

పిమ్మట నధికమగు తేజోలక్ష్మిచేత బ్రకాశించుచున్నవాడును, రజోగుణరహితుడును, నిర్మలమగు వస్త్రమును ధరించినవాడును, తండ్రియును, నగు దశరథమహారాజునకు రామలక్ష్మణులిరువురును నమస్కారమును జేసిరి. అప్పుడు విమానమునందున్న యాదశరథమహారాజు పరమసంతోషముతో గూడుకొనినవాడై ప్రాణములకంటె బ్రియుడగు పుత్రుని జూచె. అంతట శ్రేష్ఠమగు విమానమునందు గూర్చున్న యాదశరథమహారాజు పుత్రుడగు రాముని తొడమీద గూర్చుండబెట్టుకొని బాహువులచేత దృఢముగా గాగిలించుకొని రామునితో నిట్లనియె.

పుత్రోత్తమా! రాముడా! నిన్నువదలుకొని వచ్చిన పిమ్మట నాకీస్వర్గలోకమును, శ్రేష్ఠులగు మునుల పూజయును, గలిగియున్నాను. సంతోషము గలిగియుండలేదు. నేనిప్పుడు వాస్తవమగు వాక్యమును జెప్పుచున్నాను. చక్కగమాటలాడువారలలో నుత్తముడవైన యోరాముడా! నిన్నుఅరణ్యమునకు బంపుటకుగా గైకేయిచేత నేమేమిమాటలు చెప్పబడినవో యామాటలన్నియును నాహృదయమునందున్నవి. అందువలన నిప్పుడధికమగు దుఃఖమును బొందుచున్నాను. మరియునో రాముడా! సుఖమును బొందియున్ననిన్నును, లక్ష్మణునిజూచి యిప్పుడు నేను దుఃఖరహితుడనైతిని. నిన్ను జూచుటచేత నాదుఃఖమంతయును, సూర్యునివలన మంచు విరిగి పోయిన విధముగ విరిగిపోయె. కహోళుడను బ్రాహ్మణుడష్టావక్రునిచేత దరింపజేయబడినవిధముగ సుపుత్రుడవును, మహాత్ముడవును నగు నీచేత నేను దరింపజేయబడితిని. పురుషోత్తముడవైన యోరాముడా! రావణాసురుని జంపుటకొఱకు దేవతలందఱును నీవిధములగు బుద్ధులను బుట్టించిరని తలచుచున్నాను, మరియునో రాముడా! గృహమునకువచ్చిన నిన్ను

జూచి కౌసల్యకృతార్థురాలై యధికమగు సంతోషమును బొందగలదు. వనమునుండి నీవు మరలివచ్చుటకానందమును బొందగలదు. మరియును, శత్రుసంహారకుడవైన యో రాముడా! అనురక్తుడును, బలవంతుడును, పరిశుద్ధుడును ధర్మముగ సంచరించు వాడును, నగు భరతునితో గలసియుండిననిన్ను జూడవలయునని కోరుచున్నాను. మరియును ఓ రాముడా! నీవుపదునాలుగుసంవత్సరములరణ్యమునందు నివసించితివి. సీతాలక్ష్మణులతో గూడ బదునాలుగుసంవత్సరములును నరణ్యమునందుండి యనేకములగు కష్టములను సహించితివి. ఇట్లునివసించి నీప్రతిజ్ఞను నెరవేర్చితివి. యుద్ధమునందు రావణాసురుని సంహరించితివి. మరియును, దేవతలనందఱను సంతోషపఱచితివి. శత్రునాశకుడవైనయోరాముడా! నీచేతమిగుల నద్భుతమగు పనిచేయబడినది. అపరిమితమగు కీర్తియును సంపాదింపబడినది. మరియునోరాముడా! నీవు సోదరులతో గూడ గూడుకొనినవాడవై దీర్ఘాయుష్యమును బొందుమనియె. ఇవ్విధముగా జెప్పుచున్న దశరథమహారాజుతో రాముడు దోసిలియొగ్గినవాడై యిట్లనియె.

ధర్మజ్ఞుడవైన యోదశరథమహారాజా! తండ్రీ! కైకేయీభరతులయందు ననుగ్రహము గలవాడవగుము. నీవు పూర్వమునందు కైకేయిని పుత్రులతో గూడ విడచిపెట్టితినని చెప్పితివి. అందువలన భరతుడు మనమంతతివాడుగాక పోవలసివచ్చె. కావున నాశాపము పుత్రులతోగూడిన కైకేయిని స్పృశింపకపోగాకఅనియె. ఇవ్విధముగా బలికి చేతులను ముకుళించుకొనియున్న రామునితో నీయిష్టానుసారముగ నంగీకరించితినని చెప్పి లక్ష్మణుని గౌగిలించుకొని యిట్లనియె.

నాయనా! లక్ష్మణా! సీతతోగూడిన రామునకు మిగులభక్తితో శుశ్రూషనుజేసితివి. అందువలనేను మిగులసంతోషించితిని. నీకుధర్మఫలములభ్యమయ్యె. మఱియు సకల ధర్మములను దెలిసినయోలక్ష్మణుడా! నీవుమిగులగొప్పవగు ధర్మకీర్తులను బొందగలవు. రాముడు ప్రసన్నుడగుటచేత మిగుల మహిమనుబొందగలవు. స్వర్గమును బొందగలవు. కావున సుమిత్రాదేవికి సంతోషమునుగలుగజేయునట్టియో లక్ష్మణుడా! ఇంకనుమిగుల భక్తితోరామునకు శుశ్రూషను జేయుము. ఈ రాముడు సకలలోకములయొక్కయు శుభములయందు ప్రియముగలవాడు.

మఱియు నోలక్ష్మణా! మూడులోకములయందును నివసించునట్టి ఋషులు మొదలగువారందఱును దేవేంద్రునితో గూడవచ్చి మహాత్ముడును, పురుషోత్తముడును, నగు రాముని నర్చించుచున్నారు. మఱియు నోలక్ష్మణా! శత్రువులను దపింపజేయునట్టి ఈ రాముడవ్యక్తమును, అక్షరమును, వేదస్వరూపమును, వేదాంతములచేత బ్రతిపాదింపబడుచున్నదియును, నగు పరబ్రహ్మస్వరూపమని బ్రహ్మాదులుచెప్పిరి. ఇటువంటి రామునకును, సీతకును, భక్తితో శుశ్రూషను జేయుటవలన నీవుస్థిరములగు ధర్మకీర్తులను బొందితివనియె. ఇవ్విధముగా నాదశరథమహారాజు చేతులనుముకుళించుకొనియున్న లక్ష్మణునితో జెప్పి పిమ్మట ధర్మాత్ముడగు నాదశరథమహారాజు సీతాదేవితో శుభకరమగు మాటను జెప్పదలచి యిట్లనియె.

ఓసీతా! ఈ రాముడు నిన్ను విడిచిపెట్టదలచెనను అభిప్రాయముతో కోపమునుబొందకుము. నీకుమేలునుజేయదలచి యీరాముడు నీపరిశుద్ధతను దెలియజేయుటకొరకిట్లు కోపమునుబొందక రామునకు శుశ్రూషనుజేయుటయందు మిగుల వినయము గలదానవగుము. నావచనమునకు వ్యతిరిక్తముగ బ్రవర్తింపకుము. నీకీరామునికంటె నన్యమగుదైవములేదనియె. ఇవ్విధముగా దశరథమహారాజు సీతారాములకు జెప్పదగిన మాటలనుజెప్పి విమానమునెక్కి మరల ఇంద్రలోకమునకు బోయె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి నూటయిరువదిరెండవ సర్గ ముగిసెను.

ఇంద్రుడు రామునకు అయోధ్యయందుండుపృతమలెల్లప్పుడు ఫలించియుండునట్లు వరమిచ్చుట.

అవ్విధముగ కకుత్స్థనికులమున దుబుట్టిన దశరథమహారాజుచెప్పి స్వర్గలోకమునకుబోగానే పాకుడను రాక్షసునిసంహరించిన దేవేంద్రుడు పరమసంతోషముగలవాడైచేతులను ముకుళించుకొని నమస్కారమును జేయుచున్న రామునితో యిట్లనియె. శత్రువులను దపింపజేయునట్టి యోరాముడా! నీదర్శనము మాకు సఫలమైనదయ్యె. మేమందఱమును నిన్నుజూచుటచేత అధికమగు సంతోషమునబొందితిమి. నీమనస్సునందేమి యభిలాషగలదో యావిషయమును దెలుపుమనియె. ఇవ్విధముగా ఇంద్రుడుచెప్పినపిమ్మట కకుత్స్థనికులమునందుబుట్టినరాముడు చేతులను ముకుళించుకొనినవాడయ్యె. ఆసమయమునందు సీతాలక్ష్మణులుగూడ చేతులను ముకుళించుకొని యాయింద్రునకు నమస్కారమునుజేయుచుండిరి. అంతట రాముడు మిగుల వినయముతో నాయింద్రునకిట్లనియె.

ఓ ఇంద్రుడా! నానిమిత్తముగ సేవానరులు శత్రువులచేత జంపబడి యమలోకమునకు బోయిరో యావానరు

లందఱును నెప్పటివలె లేచితిరుగునట్లు చేయుము. మఱియు నోయింద్రుడా! మాయందు నీకు వాస్తవమగు ప్రీతిగలదేని యింకను నాయభిప్రాయమును దెలిపెదను వినుము. మఱియు నో యింద్రుడా! నానిమిత్తముగా నేవే వానరులు భార్యాపుత్రులను విడిచిపోయిరో వారందఱును మరల భార్యాపుత్రులతో గలసిమెలసి యుండునటుల ననుగ్రహింపుము. నేనీవిధమగు వరమును గోరుచున్నాను. మఱియు నో యింద్రుడా! ఈ వానరులందఱును బలపౌరుషములతో గూడుకొనియున్న వారినిగాను, బాధారహితులనుగాను, వ్రణరహితులనుగాను, జేయుము. మరియును భల్లూకాధిపతులనుగూడ నావిధముగా జేయుము. ఈ వానరులందఱును సుఖముగలవారై యుండగా జూడవలయునని కోరుచున్నాను. మరియు నో యింద్రుడా! వానరులే దేశమునందు నివసించి యుందురో యాదేశమునందు ముఖ్యములగు కందమూల ఫలములును, నిర్మలోదకముతో నిండిన నదులును గలుగునటుల ననుగ్రహింపుమనియె. ఇవ్విధముగా బ్రార్థించుచున్నవాడును, మహానుభావుడును, నగు రామునియొక్క మాటలనువిని యాదేవేంద్రుడు మిగుల బ్రియమును సూచించునట్టి మాటను జెప్పదలచి యిట్లనియె.

రఘునందనుడవైన యో రాముడా! నీవిప్పుడు అడిగిన విధముగా సర్వమును జరుగును. నేనిదివఱకెన్నడును రెండుమాటలు చెప్పియుండలేదు. కావున నీయభిలాష సంపూర్ణముగ నెరవేరగలదు. యుద్ధమునందు రాక్షసులచేత జంపబడిన వానరులందఱును లేవగలరు. మరియును ఋక్షగణాధిపతులును, భల్లూకాధిపతులును, వానరాధిపతులును, మరియు నితరులగు వానరాధిపతులును, మరల జీవించి వ్రణరహితులును, బాధారహితులునునై యుండుటకు సందేహమేమియును లేదు. మరియును యుద్ధమునందు మరణమునుబొందిన నీభటులందఱును స్నేహితులు, బంధువులు, జ్ఞాతులు, స్వజనులు, మొదలగువారితో గూడుకొని యధికమగు సంతోషముగలవారై యుందురు. మరియు నో రాముడా! అకాలమునందుగూడ వానరులు నివసించెడు దేశములయందు వృక్షములు ఫలవంతములును, పుష్పములు గలవియునునై యుండును. మరియు నిర్మలోదకములుగల నదులు ప్రవహించుచుండును. ముందుగా నీవానరులందఱును బ్రాణసహితులగుదురు. పిమ్మట వ్రణరహితులును, బాధాహీనులును నగుదురనియె. అంతట వానరులందఱును ఇంద్రవచనానుసారము బ్రాణసహితులును, వ్రణరహితులును, బాధలేనివారునగునైరి. అపుడు వానరులందఱును నిద్రపోయి లేచినవారివిధముగ లేచి ఇదియేమియని మిగుల ఆశ్చర్యమునుబొందిరి. అంతట నావానరులందఱును, రఘుకులోద్భవుడగు రామునకు నమస్కారమును జేసిరి. ఆసమయమునందు దేవోత్తములందఱును, సకల కార్యములును జక్కగ నెరవేరుటచేత కృతార్థుడైయున్నవాడును, స్తోత్రమును జేయుటకుదగినవాడును, లక్ష్మణునితో గూడుకొన్నవాడును, నగు రాముని జూచి యధికమగు సంతోషముగలవారై యిట్లనిరి.

వీరుడవైన యో రాముడా! నీవయోధ్యాపురమునకుబొమ్ము. ఇకనీవానరులందఱును వారివారి దేశములకు బంపుము. నీయందనురాగముగలదియును, తపోవంతురాలును నగు నీసీతాదేవిని నోదార్చుము. మరియు నో రాముడా! శత్రువులను దపింపజేయువాడా! మహానుభావుడగు శత్రుఘ్నుని, మరియును దల్లులనందఱును, నీవియోగమువలన గలిగిన దుఃఖముచేత నపరిమితముగా వ్యసనమునుబొందుచు వ్రతధారియైయున్న భరతునిజూడుము. పిమ్మట పట్టాభిషిక్తుడవగుము. అంతట పురజనులనందరను సంతోషపఱుపుమనిరి. ఇవ్విధముగా జెప్పి రామలక్ష్మణులనోదార్చి యాదేవతలందఱును విమానారూఢులై పరమసంతోషముగలవారగుచు స్వర్గలోకమునకుబోయిరి. ఆసమయమునందు రాముడు ఆదేవతలకందఱకును నమస్కారమును జేసి లక్ష్మణునితో నివాసయోగ్యమగు ప్రదేశమును జూడుమనియె. అంతట రామలక్ష్మణులచేత జక్కగ బాలింపబడుచున్నదియును అధికమగు సంతోషముగలదియును, సంపదచేత బ్రకాశించుచున్నదియును, మిగుల గొప్పదియును నగు వానరసైన్యము చంద్రునిచేత రాత్రిప్రకాశించు విధముగ బ్రకాశించుచుండె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి నూటయిరువదిమూడవ సర్గ ముగిసెను.

(*)

{ అయోధ్యాపట్టణమునకు బోవుటకై పుష్పకవిమానమును విభీషణుడు తెచ్చి రామునకు సమర్పించుట. }

అంతట రాముడు సీతాలక్ష్మణులతో గూడ నారాత్రి యంతయును, సుఖముగ నిద్రించె. అంత మరునాటి ప్రాతఃకాలమునందు విభీషణుడు చేతులను ముకుళించుకొని రామునియొద్దకువచ్చి జయమును దెలిపి ఇట్లనియె. రఘుకులోత్తముడవైన యో రాముడా! స్నానముసేయుటకు యోగ్యములగు జలములను, అంగరాగములను, వస్త్రములను, ఆభరణములను, చందనములను, దివ్యములగు మాలికలను తీసికొని అలంకరించుటయందు మిగుల నేర్పుగల స్త్రీలువచ్చియున్నారు. వీరందఱును నిన్నుస్నానమును జేయింపగల

రు. కావుననోరాముడా! నన్ను అనుగ్రహించుట యందలి కోరికచేత, ఈసర్వమును అనుగ్రహింపుమనియె. ఇవ్విధముగా జెప్పిన వాక్యములనువిని కకుత్స్థునికులమునందుబుట్టిన రాముడు విభీషణునితోనిట్లనియె. రాక్షసోత్తముడవైన యోవిభీషణుడా! సుగ్రీవుడు మొదలుగాగల వానరోత్తములను స్నానమును జేయింపుము. మరియు నోవిభీషణుడా! ధర్మాత్ముడును, సుఖమును బొందుటకు దగినవాడును, మిగులగొప్పదగు భుజబలముగలవాడును, పసివాడును, సత్యమునందభిలాషగలవాడును, నగు భరతుడు నానిమిత్తముగా మిగులవ్యసనమును బొందుచున్నాడు. మరియును దానుసుఖమును బొందుటకు దగినవాడయ్యును నేనుసుఖహీనుడనై యుంటినను తలంపుతో సుఖములను వదలుకొనియున్నాడు. అట్లునాయందు మిగులభక్తిగలవాడును, నాయందలిప్రేమచేత సుఖములను వదలుకొనియున్నవాడును, ధర్మముగ సంచరించుచున్నవాడును, కైకేయీపుత్రుడును, నగు భరతునివదలి నేనుమంగళస్నానమును జేయను. మరియునేను, వస్త్రాభరణాదులనుగూడ గైకొనను. నేనీవిధముగానే మిగులశీఘ్రముగా అయోధ్యాపట్టణమునకుబోదలచియున్నాను. అయోధ్యాపట్టణముయొక్క మార్గము మిగులదుర్గమమైయున్నదనియె. ఇవ్విధముగా జెప్పిన వాక్యములనువిని విభీషణుడు మరల యిట్లనియె.

మరియును రాజనందనుడవైనయోరాముడా! ఒక్కదినములోనిన్ను అయోధ్యాపట్టణమునకు దీసికొనిపోయెదను. నాయన్నయగు కుబేరునిదియును, రావణాసురునిచేత నపహరింపబడినదియును, సూర్యునితో సమానమైనదియును, నగుపుష్పకమను విమానముగలదు. ఆవిమానముమిగులశ్రేష్ఠమైనది. కోరినట్లుపోదగినది. మఱియును నిరుపమానమైన పరాక్రమముగల యోరాముడా! మేఘముతో సమానమగు నీవిమానమునీనిమిత్తముగ పాలింపబడియున్నది. నీవీవిమానమునధిష్ఠించితివేని మిగులశీఘ్రముగ నయోధ్యాపట్టణమునకుబోగలవు. కావునవ్యసనరహితుడవగుము. మఱియునో రాముడా! నాగుణములనుబట్టినే ననుగ్రహింపదగినవాడనైతినేని యిక్కడనేనివసింపుము. నాయందుస్నేహముగలిగియున్నయెడల సీతాలక్ష్మణులతోగూడ నీపట్టణమునందే నివసించియుండవలయునని కోరుచున్నాను. అట్లుగాదేని యోరాముడా! నాకోరికలన్నియును దీరునట్లు నాచేత బూజింపబడిపోగలవు.

మరియునో రాముడా! అధికముగు ప్రేమగలవాడను, సైన్యముతో గూడుకొనినవాడను, స్నేహితులతోగూడుకొనినవాడను, నగు నాపూజను సర్వమునుగ్రహింపుము, ప్రియముచేతను, బహుమానముచేతను, స్నేహముచేతను, నాపూజనుగ్రహించి నన్నుఅనుగ్రహింపుము. నేను నీచేత, చేయదగినకార్యములయందు నియమింపదగినవాడనైయున్నాను. కావుననో రాముడా! నాకాజ్ఞనుయిమ్ము. నీయాజ్ఞానుసారముగ ప్రవర్తించుటకు సిద్ధముగనున్నానని యె. ఇవ్విధముగా విభీషణుడుచెప్పిన వాక్యమునువిని వానరులు, రాక్షసులు, మొదలగువారందఱును వినుచుండగ విభీషణునితో నిట్లనియె.

సౌమ్యుడవును, శత్రువులనుదపింప జేయువాడవును, నైనయోవిభీషణుడా! నీమంత్రిత్వముచేతను, నీచేష్టచేతను, నీస్నేహముచేతను, నేనుబూజింపబడితిని. నీపూజను నేనుగ్రహింపలేదని తలపకుము. నేనునీమాటలచేత నేసంతోషమునుబొందితిని. నీవచనానుసారముగ సంచరింపలేదనినీవుమనస్సునందు వేరుగాదలపకుము. నామనస్సునందుదమ్ముడగు భరతునిజూడవలయునని మిగులకుతూహలముగలిగి యున్నది.

మరియునో మిత్రుడా! విభీషణుడా! పూర్వమునందు నన్నుఅయోధ్యాపట్టణమునకు దీసికొనిపోవుటకు భరతుడు చిత్రకూటపర్వతము దగ్గరకువచ్చె. వచ్చిశిరస్సువంచి నమస్కారమును జేసి నన్నురమ్మనియనేక విధములయాచించె. అతనివచనములను నేనప్పుడువిననైతిని. ఇప్పుడుకౌసల్యాసుమిత్రలను, కీర్తివంతురాలగుకైకేయిని, గురువులను, స్నేహితులను, పౌరులను, మరియునితరులను జూడవలయునని కుతూహలముగల వాడనైయున్నాను. కావున రాక్షసోత్తముడవైన యోవిభీషణుడా! మిగులశీఘ్రముగనన్నుబంపుము. సకలకార్యములును నెరవేరినపిమ్మట నిక్కడనుండుటకు నాకుసమ్మతములేదు. కాబట్టిసౌమ్యుడా! విభీషణా! నేననీచేత బూజింపబడినవాడనైతిని. నాకనుజ్ఞనిమ్ము. నీవునాయందు గోపమునుబెట్టకుము. శీఘ్రముగనన్ను బంపుటకు యత్నింపుమనియె.

ఇవ్విధముగా రాముడుచెప్పిన వాక్యమునువిని రాక్షసోత్తముడగు విభీషణుడువిమానము దీసికొనిమిగుల శీఘ్రముగ రామునియొద్దకువచ్చె. ఆవిమానము బంగారముచేత జిత్రములగునవయవములు గలదియును, వైడూర్యములచేత జేయబడినతిన్నెలుగలదియును, కూటపుయిండ్లచేత వ్యాప్తమైనదియును, బంగారపుపద్మములచేత నలంకరింపబడినదియును, తెల్లనిపతాకములచేతను, ధ్వజములచేతను నలంకరింప బడినదియును, బంగారపుమేడలచేత ప్రకాశింపబడినదియును, చిన్నచిన్నగంటలచేత వ్యాప్తమైనదియును, ముత్యములచేత జెక్కబడినకిటికీలు గలదియు

ను, ఘంటలయొక్క ధ్వనులచేతమిగుల మనోహరమైనది యును, మేరుశిఖరముయొక్క యాకారమువంటి యాకారముగలదియును, విశ్వకర్మచేతనిర్మింపబడినదియును, ముత్యముల వరుసలను, వెండివరుసను, తెల్లనివగు మేడలచేత నలంకరింపబడినవియును, స్ఫటికములచేత చిత్రములగు నవయవములు గలవియును, వైడూర్యములచేత రచింపబడినవియును, నగుసింహాసనములచేతను, మిగుల వెలగలశయ్యలచేతను, సర్వోత్తమములగు ధనములచేతను, వ్యాప్తమైనదియును, శత్రువులచేత ధర్షింపశక్యముగానిదియును, మనోవేగమువంటి వేగముగలదియును, నైయుండె. అటువంటి విమానమును దీసికొనివచ్చి యావిభీషణుడు రామునకు సమర్పించె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి నూటయిరువదినాల్గవసర్గముగిసెను.

▸❋◂

రాముడుసుగ్రీవవిభీషణాదులతోగూడవిమానముమీద నెక్కుట.

అవ్విధముగవచ్చిన విమానమునుజూచి యావిమానమునకు దూరముగగూర్చున్న రామునితోవిభీషణుడు మిగుల వినయముగలవాడును, చేతులను ముకుళించుకొనినవాడును, మిగులత్వరగలవాడును, నైరామునితో నిట్లనియె. రఘుకులోద్భవుడవైన యోరాముడా! నేనిప్పుడు చేయుదగినపనియేమియనియె. అప్పుడధికమగు తేజస్సుగలరాముడు లక్ష్మణుడు వినుచుండగ నిట్లనియె.

రాక్షసోత్తముడవైన యోవిభీషణుడా! వానరులందఱును మిగులనధికమగు ప్రయత్నముచేత సకలకార్యములను నెరవేర్చిరి. కావుననీవానరులనందఱను, రత్నములచేతను, భూషణములచేతను, నానావిధములగు ధనములచేతను, పూజింపుము. రాక్షసాధిపతివైన యోవిభీషణుడా! వీరందఱును మిగులసంతోషముతో ప్రాణభయమును వదలియుద్ధమును జేయుటచేత లంకాపట్టణము జయింపబడినది. వీరిసహాయము లేకపోయెనేని నేనులంకాపట్టణమును జయింపజాలను. కావునసకలకార్యములను నెరవేర్చిన యీవానరులనందఱను బూజింపుము. మరియునో విభీషణుడా! ధనములు, రత్నములు, మొదలగువానిచేత వీరికిసంతోషము గలుగునట్లుపూజించి వీరిప్రయత్నమంతయును సఫలమగునట్లుచేయుము. మరియునో మానదుడా! విభీషణుడా! నీచేతజక్కగా బూజింపబడినపిమ్మట నీవానరులందఱును నధికమగు సంతోషమునుబొందగలరు

మరియునో విభీషణుడా! మిత్రులనుసంపాదించుటకు దానమును జేయువాడవును, అధికముగా ధనమునుసంగ్రహించువాడవును, దయగలవాడవుగ, మిగులకీర్తిగలవాడవును, నగునిన్నునందఱును బొందుదురు. కావుననిన్నుశ్రేరణను జేయుచున్నారు. మరియునోవిభీషణుడా! ప్రియకరములగు గుణములులేనివాడును, హింసించునట్టిస్వభావముగలవాడును, నగురాజును యుద్ధసమయమునందు విడిచిపెట్టుదురనియె. ఇవ్విధముగా రాముడుచెప్పిన వాక్యములనువినివిభీషణుడురత్నములు మొదలగుద్రవ్యములచేతవానరులనందఱను వేరువేరుగాబూజించె. అట్లునానావిధములగు రత్నాదిద్రవ్యములచేత వానరులనందఱనుబూజించినపిమ్మట రాముడుమిగుల శ్రేష్ఠమగువిమానముమీద లక్ష్మణునితోగూడనెక్కి సీతాదేవినితొడమీద గూర్చుండబెట్టుకొనియె. అట్లువిమానరూఢుడైన రాముడుసకలవానరులను, మహావీర్యముగల సుగ్రీవుని, విభీషణుని, సత్కరించుచునిట్లనియె.

మిత్రులారా! వానరోత్తములారా! మీరందఱును మిత్రుడనగునాకార్యము నునెరవేర్చితిరి. కావునమిమ్ములగురించియధికమగు సంతోషమునుబొందుచున్నాను. మీరందఱును నాచేతననుజ్ఞాతులైతిరి. కావునయథేచ్ఛముగబొండని చెప్పి సుగ్రీవునితోనిట్లనియె. శత్రువులనుదవింప జేయుటయందు మిగులసామర్థ్యముగల యోసుగ్రీవుడా! ప్రియస్నేహితునిచేత నేకార్యముచేయదగియున్నదో, అటువంటి కార్యమును నెరవేర్చితివి. మరియునునీవుధర్మలోపమగునను భయముతో మిగులగొప్పదగు ప్రయత్నముచేసితివి. ఇకమీదనీవునీసైన్యముతోగూడినవాడవైకిష్కింధాపట్టణమునకు బొమ్మనిచెప్పివిభీషణునితో నిట్లనియె.

రాక్షసోత్తమా! నాచేతనివ్వబడిన లంకాపురరాజ్యమునందు నీవుస్థిరుడవైయుండుము. ఇంద్రుడు మొదలగు దేవతలందఱును నొక్కటియైవచ్చినను నిన్నుజయింపజాలరు. మరియును, రాక్షసోత్తముడవైన యోవిభీషణుడా! నేనునాతండ్రియొక్క రాజధానియగు నయోధ్యాపట్టణమునకు బోయెదను. కావున మీరందఱును నాకాజ్ఞనిండు. మిమ్ములనందఱును ప్రార్థించుచున్నాననియె. ఇవ్విధముగా జెప్పిన వాక్యములనువిని మహాబలులగు వానరులందఱును విభీషణునితోగూడ జేతులనుముకుళించుకొనినవారై యిట్లనిరి. రఘుకులోత్తముడవైన యోరాముడా! మేమందఱమును, అయోధ్యాపట్టణమునకు రావలయునని కోరుచున్నాము. కావుననీవుమమ్ములనందఱను నయోధ్యాపట్టణమునకు దీసికొనిపొమ్ము. మరియునోరాముడా! మేముసకలవనములను, సకలపట్టణములను జూడదలచియున్నాము.

మఱియునో రామా! అయోధ్యాపట్టణమునందు పట్టాభిషిక్తుడవగునిన్నుజూచి కౌసల్యాదేవికి నమస్కారమునుజేసిపిమ్మట మాగృహములకుబోదలచియున్నాము. కావున మమ్ములనుగూడ నయోధ్యాపట్టణమునకు దీసికొనపొమ్మనిరి. ఇవ్విధముగా జెప్పుచున్న సుగ్రీవాదివానరులయొక్కయు, విభీషణునియొక్కయు, వాక్యములనువిని శ్రీమంతుడును, రఘుకులోద్భవుడును నగు రాముడువిభీషణుడు మొదలగువారితో నిట్లనియె. మిత్రోత్తములారా! మీవచనములచే బరమానందమును బొందుచున్నాను. మఱియును నాకు మేలుమీద మేలుగలుగుచున్నది. మిత్రులగు మీయందఱతోడ నుగూడుకొని యయోధ్యాపట్టణమునకు బోవుటయందు నాకధికమగు ప్రియముగలదని చెప్పి ముందుగసుగ్రీవునితో నిట్లనియె. వానరోత్తముడవైనయోసుగ్రీవుడా! సకలవానరులతో గూడ నీవువిమానముమీద నెక్కుమని చెప్పి పిమ్మటవిభీషణునితో నిట్లనియె. మఱియును, రాక్షసోత్తముడవైనయోవిభీషణుడా! నీవునీమంత్రులతో గూడవిమానము నెక్కుమనియె. అంతటసుగ్రీవుడువానరసైన్యముతో గూడ విమానముమీద నెక్కె. అంతటవిభీషణుడుమంత్రులతో గూడ నా విమానముమీద నెక్కె. అట్లువానరులును, రాక్షసులును, విమానముమీద నెక్కినపిమ్మట రామునియొక్కయనుమతమును బొందినదై ఆవిమానము అంతరిక్షమున కెగిరె. అంతటచిత్రముగా రచింపబడినహంసలతో గూడుకొనినదియును మిగుల నధికముగా బ్రకాశించుచున్నదియును, నగు విమానముచేత నా రాముడు పరమానందముగలవాడై కుబేరునివలె బ్రకాశించుచుండె. మఱియు నావిమానమునందు మహాబలులగువానరులును, రాక్షసులును, సుఖముగా గూర్చుండిరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి నూటయిరువదైదవసర్గము గిసెను.

రాముడు సీతకు అక్కడక్కడ తాముజేసిన కార్యములను జూపించుట.

అట్లురామునియొక్క యాజ్ఞనుబొందినపిమ్మట మిగుల శ్రేష్ఠమగు నావిమానమువాయువుచేత నెగురగొట్టబడిన మేఘమువలె నంతరిక్షమునకెగిరిపోయె. అప్పుడు రఘునందనుడగు రాముడు నలుదిక్కులను పరికించిచూచి జనకచక్రవర్తికిబుత్రికయును, చంద్రునివంటి మోముగలదియును, నగు సీతాదేవితో నిట్లనియె.

ఓదేవీ! సీతా! కైలాసపర్వతశిఖరముయొక్క యాకారమువంటి యాకారముగలదియగు త్రికూటశిఖరమునందున్నదియును, విశ్వకర్మచేతనిర్మింపబడినదియును, నగులంకాపట్టణమునుజూడుము. మఱియునోసీతా! రాక్షసులయొక్కయు, వానరులయొక్కయు వధతో గూడుకొనినదియును, మాంసముచేతను, నెత్తురుచేతను, బురదగా జేయబడిననేలగలదియును, నగు యుద్ధభూమినిజూడుము. మఱియును విశాలములగునేత్రములుగలయోసీతా! సకలలోకములను మర్దించునట్టివాడును, రాక్షసాధిపతియును బ్రహ్మదేవునివలన వరమునుబొందినవాడును, నగు రావణాసురుడు నాచేతనీనిమిత్తముగ జంపబడియె. మఱియునోసీతా! ఈయుద్ధభూమియందుకుంభకర్ణుడు, ప్రహస్తుడుమొదలుగాగల యనేకరాక్షసులు మరణమునుబొందిరి. మఱియునోసీతా! ఇక్కడవానరోత్తముడగు హనుమంతుడుధూమ్రాక్షునిజంపె. మఱియ నోసీతా! మహాత్ముడగు సీతవిద్యున్మాలియనురాక్షసోత్తమునిజంపె. ఓసీతా! ఈచోటయుద్ధమునుజేసి లక్ష్మణుడు యింద్రజిత్తునువధించె. ఇక్కడనంగదుడు వికటుడనురాక్షసుని సంహరించె. మఱియునోసీతా! విరూపాక్షుడు, మహాపార్శ్వుడు మహోదరులు, అకంపనుడు, మఱియునుబలవంతులగురాక్షసులనేకులునునిక్కడమరణమునుబొందిరి.

ఓసీతా ! ఇక్కడమండోదరియనుపేరుగల రావణుని భార్య రావణాసురునిగుఱించి యధికముగా వ్యసనమును బొందె. మఱియునోసీతా! మండోదరియీచోటననేకవేల సవతులతో గూడుకొని కన్నీళ్లతో గూడవిలపించె. శ్రేష్ఠమగుమోముగలయోసీతా! ఈచోటుమిగులగొప్పదగుతీర్థమని చెప్పబడును. ఈతీర్థమునందు సముద్రమునుదాటిననాటి రాత్రియందు మేమందఱమును సుఖముగానిద్రనుబొందితిమి. ఈసముద్రమునందు నాచేతకట్టబడినసేతువునుజూడుము. ఓసీతా! నీనిమిత్తముగనలుడనువానరోత్తముడు మిగులగొప్పదగునీసేతువునునిర్మించె.

ఓసీతా! నిశ్చలమయినదియును మిగులగొప్పదియును, నగునీసముద్రమునుజూడుము. ఈసముద్రముముత్యపుచిప్పలు, శంఖములు, మొదలగువానితో గూడుకొనినదియును, అపరిమితముగా ధ్వనిచేయుచున్నదియునునైయున్నది. మఱియునోసీతా! సువర్ణమయమైనదియును, హిరణ్యనాభమను పేరుగలదియును, నగు నీపర్వతోత్తమమును జూడుము. ఈపర్వతోత్తమము హనుమంతునకు విశ్రాంతిని గలుగజేయుటకు సముద్రమునందుండిబయలునకువచ్చె. మఱియు నోసీతా! ఈసముద్రముయొక్కకుక్షియందు వానరసేనయంతయునునివసించినచోటునుజూడుము. ఓసీతా! మహాత్ముడగుసముద్రునియొక్క సేతుబంధమనుపేరుగల యీతీర్థముముల్లోకముల వారిచేతను బూజింపదగినది. మఱి

యునో సీతా! సేతుబంధమను పేరుగల యీతీర్థము మిగుల పవిత్రమైనది. ఈతీర్థము మహాపాతకములను నశింపజేయును. ఇక్కడ పూర్వమునందు మహాదేవుడగు వరుణుడు ప్రసన్నుడయ్యె. మఱియు నో సీతా! రాక్షసోత్తముడగు విభీషణుడిక్కడనుండి గావచ్చి నాతో స్నేహమును జేసె. ఓసీతా! అదిగో చూడుము, చిత్రములగు వనములుగల కిష్కింధానగరము కనబడుచున్నది. అదిగో చూడుము. మిగుల రమ్యమగు సుగ్రీవుని పట్టణము కనబడుచున్నది. ఓసీతా! ఆపట్టణమునందు నేను బలవంతుడగు వాలిని జంపితిని. అప్పుడా సీతాదేవి వాలిచేత బూర్వము పాలింపబడిన కిష్కింధాపట్టణమును జూచి ప్రణయముచేతనై సభయముగలదగుచు మిగుల వినయముతో గూడి యీమాటను జెప్ప దలచియిట్లనియె.

ఓరాజేంద్రా! ప్రాణనాథా! రామచంద్రా! సుగ్రీవుని ప్రియభార్యలగు తార మొదలగువారితోడను, మఱియు నితరవానరస్త్రీలతోడను గూడుకొని యయోధ్యాపట్టణమునకు రావలయునని కోరుచున్నాననియె. ఇవ్విధముగా సీతాదేవి చెప్పినవాక్యమును విని యో సీతా! నీయిష్టానుసారముగ జేసెదననియె. అంతట రఘుకులోద్భవుడగు రాముడు విమానమును నిలిపి సుగ్రీవునితో నిట్లనియె. వానరోత్తముడవైనయో సుగ్రీవుడా! వానరోత్తములనందఱను బిలువుము. మనవానరులందఱును దమభార్యలతో గూడ నయోధ్యాపట్టణమునకు వచ్చుట బాగుగనుండునని సీత చెప్పుచున్నది. కాబట్టి వానరస్త్రీలందఱును సీతతో గూడవచ్చినయెడల బాగుగానుండునని తోచుచున్నది. కావున మహాబలుడవైనయో వానరుడా! నీవు కూడ నీ స్త్రీలతో గూడరమ్ము. తక్కిన వారలు గూడవచ్చునట్లు చేయుము. మఱియు వానరోత్తముడవైనయో సుగ్రీవుడా! ఎల్లవారలును త్వరగా బయలువెడలునట్లు చేయుము. మనమందఱమును అయోధ్యాపట్టణమునకు బోవుదమనియె. ఇవ్విధముగా నపరిమితమగు తేజస్సుగల శ్రీరాముడు చెప్పినమాటను విని శ్రీమంతుడగు సుగ్రీవుడు సకలవానరవీరులతో గూడుకొనినవాడై యతిశీఘ్రముగ నంతఃపురములోనికి బోయె. బోయి తారను జూచి యిట్లనియె.

ఓప్రియురాలా! సీతాదేవికి బ్రియమును జేయదలచిన రాముడు మహాత్ములగు వానరులయొక్క భార్యలతో గూడ నయోధ్యాపట్టణమునకు బోవయత్నించె. కాబట్టి యో తారా! మిగుల శీఘ్రముగ బయలువెడలుము. సకలవానరవీరుల భార్యలతో గూడ బయలువెడలిపోదము. పోయి యయోధ్యాపట్టణమును, మఱియు దశరథమహారాజుయొక్క భార్యలను జూతమనియె. ఇవ్విధముగా సుగ్రీవుడు చెప్పినవాక్యమును విని సర్వావయవములయందును సౌందర్యముగల తార వానరస్త్రీలనందఱను నతిశీఘ్రముగ రప్పించి యిట్లనియె.

ఓఅక్కలారా! సకలవానరులతో గూడ నయోధ్యాపట్టణమునకు బోయి దశరథమహారాజుయొక్క భార్యలను జూడవలయునని కుతూహలము కలిగియున్నది. మఱియు రఘుకులోద్భవుడగు రాముడు పట్టణమునందు బ్రవేశించుటను, దశరథుని భార్యలయొక్క యైశ్వర్యమును, జూడవలయునని కోరిక కలిగియున్నది. సీతాదేవియును మనలను దోడ్కొనిపోవలయునని కుతూహలముగలదై యున్నది. కావున మనమందఱమును బోదము రండనియె. అంతట వానరస్త్రీలందఱును తారయొక్క యనుమతమును బొందినవారై చక్కగ నలంకరించుకొని శాస్త్రోక్తప్రకారముగ నా తారకు బ్రదక్షిణమును జేసిరి. అంతట నందఱును బయలువెడలి సీతాదేవిని జూడవలయునని కోరికచేత మిగుల శీఘ్రముగ విమానము నెక్కిరి. అప్పుడు రఘుకులోద్భవుడగు రాముని యాజ్ఞానుసారముగ నవ్విమానమంతరిక్షమునకు లేచె. అంతట నావిమానము నబోవయత్నించె. అప్పుడు రాముడు ఆ ఋశ్యమూకపర్వతముయొక్క సమీపమునందు సీతతో నిట్లనియె.

ఓసీతా! మెఱుపులతో గూడిన మేఘమువలె గనబడుచున్న యీపర్వతమును జూచితివా? బంగారపు ధాతువులతో గూడిన ఋశ్యమూకపర్వతము సర్వోత్తమమైనది. నేనీపర్వతమునందు వానరోత్తముడగు సుగ్రీవునితో గూడుకొంటిని. మఱియు నో సీతా! నేనీపర్వతమునందే వాలిని జంపుదునని ప్రతిజ్ఞను జేసితిని. మఱియు నో సీతా! ఇదిగో చూడుము. పద్మములచేత బ్రకాశించుచున్నదియును, చిత్రములగు వనములతో గూడుకొనినదియును, నగు నీసరోవరము పంపాసరోవరమను నామధేయముగలది. ఈసరోవరము వద్ద నీవు లేకపోవుటవలన నధికముగా వ్యసనమును బొందితిని. మఱియు నో సీతా! ఈసరోవరముయొక్క తీరమునందు పుణ్యాత్మురాలగు శబరిని జూచితిని. మఱియు నో సీతా! ఇక్కడ యోజనబాహువగు కబంధుని జంపితిని. మఱియు నో సీతా! ఇదిగో యిది జనస్థానము. ఈజనస్థానమునందలి సంపత్కరమగు వృక్షమును జూడుము. ఈచెట్టునందు నివసించినవాడును, మహానుభావుడును, నగు జటాయువునకును, మిగుల దుర్మార్గుడగు రావణాసురునకును, ఈప్రదేశమునందపరిమితమగు యుద్ధము జరిగె. మరియు నో సీతా! ఈప్రదేశమునందు మిగుల దీక్ష్ణములగు బాణములచేత ఖరదూషణులును, మహావీర్యముగల త్రిశిరుడును జంపబడిరి.

మఱియునో సీతా! అదిగో చూడుము. ఇది మనయాశ్రమము. ఇక్కడ శుభదర్శనముగల పర్ణశాల కనబడుచున్నది. చూడుము. ఈపర్ణశాలయందే నీవు రాక్షసేంద్రుఁడగు రావణాసురునిచేత బలాత్కారముగ నాకర్షింపబడితివి. మఱియునో సీతా! నిర్మలోదకము గలదియును, మిగుల మనోహరమైనదియును నగు గోదావరీనదిని జూడుము. ఓసీతా! ఇదిగో యగస్త్యమునివరుని యాశ్రమము గనబడుచున్నది. చూడుము. మఱియునో సీతా! మహానుభావుఁడగు సుతీక్ష్ణునియొక్క యాశ్రమము మిగుల మనోహరముగా బ్రకాశించుచున్నది. మఱియునో సీతా! మిగుల గొప్పదగు శరభంగాశ్రమము కనబడుచున్నది. చూడుము. ఓసీతా! పూర్వమీయాశ్రమమును జూచుటకు దేవేంద్రుఁడిక్కడకువచ్చె. ఓ సీతా! ఈచోటనే మిగుల గొప్పదగు శరీరముగల విరాధుని నేను సంహరించితిని. మఱియు సూక్ష్మమైన నడుము గల యోసీతా! ఇక్కడ ననేకములగు ఋష్యాశ్రమములు కనబడుచున్నవి. చూడుము. మఱియునో సీతా! ఇదిగో చూడుము. ఇక్కడ మిగుల గొప్పదగు చిత్రకూటపర్వతము ప్రకాశించుచున్నది. ఈపర్వతము మీఁద మనమున్నప్పుడు భరతుఁడు నన్ను బ్రసన్నునిగా జేసికొనుటకు వచ్చె. ఓసీతా! చిత్రములగు వనములుగల యమునానది మనకు సమీపమున నున్నది. చూడుము. ఈనదీతీరమునందు శ్రీమంతమగు భరద్వాజాశ్రమము ప్రకాశించుచున్నది. చూడుము. మఱియునో వరవర్ణినీ! దేవీ! సీతా! స్వర్గమర్త్యపాతాళలోకములయందు బ్రవహించుచున్న గంగానదీ సమీపమును నకువచ్చితిమి. చూడుము. ఈగంగానది నానావిధపక్షులతోఁ గూడుకొనినదియును, చిత్రములగు నరణ్యములుగలదియు నైయున్నది. ఓసీతా! శృంగిబేరపురమును జూడుము. ఈపట్టణమునందు గుహుఁడు నాతో నపరిమితమగు స్నేహమును జేసె.

ఓసీతా! యూపస్తంభములయొక్క మాలికలుగలసరయూనదిని జూడుము. మఱియునో సీతా! నానావిధములగు వృక్షములు గలదియును, పుష్పించిన యుద్యానవనములుగలదియును, మాతండ్రియొక్క రాజధానియునునగు నయోధ్యాపట్టణము కనబడుచున్నది. చూడుము. ఓసీతా! ఈయయోధ్యాపట్టణమునకు నమస్కారమును జేయుమని రాముఁడు పల్కెను. ఆసమయమునందు సుగ్రీవుఁడు, విభీషణుఁడు మొదలగు వారందఱును లేచి నిగిడి మిగుల మనోహరమగు నాయయోధ్యాపట్టణమును జూచిరి. మఱియు నప్పుడు వారందఱును, తెల్లని మేడలయొక్క పఙ్క్తులచేత మనోహరమైనదియును, విశాలమగు కక్ష్యలుగలదియును, దేవేంద్రునియొక్క యమరావతీ పట్టణముతో సమానమైనదియును, నగు నయోధ్యాపట్టణమును జూచిరి.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండము నందలి నూట యిరువది యొకటవసర్గ ముగిసెను.

రాముడు భరద్వాజాశ్రమమునకు బోవుట.

అంతట బదునాలుగు సంవత్సరములును గడచిన పిమ్మట నైదవదినమునందు లక్ష్మణాగ్రజుఁడగు రాముఁడు భరద్వాజమునివరునియొక్క యాశ్రమమునందు బ్రవేశించి భరద్వాజమునివరునకు నమస్కరించె. అట్లు తపోధనుఁడగు భరద్వాజమునివరునకు నమస్కరించి యిట్లనియె.

మునికులోత్తమా! భరద్వాజమునివర్యా! అయోధ్యాపట్టణమునందున్న వారలకందఱకును సుభిక్షముగలిగి యున్నదా? భరతుఁడు సుఖముగా జీవించియున్నాఁడా! నాతల్లులందఱును బ్రతికియున్నారా? అనియె. ఇవ్విధముగా రాముఁడడిగిన మాటలనువిని భరద్వాజమహాముని పరమసంతోషముగలవాఁడై నవ్వుచు రఘుకులోత్తముఁడగు రామునితో నిట్లనియె. రఘుకులోత్తముఁడవైన యోరామా! భరతుఁడు దుమ్ముచేత వ్యాప్తమైనశరీరముగలవాఁడును, జటిలుఁడును నై నీపాదుకలను ముందునిడుకొని నీ వెప్పుడువత్తువోయని నిరీక్షించుచున్నాఁడు. మఱియునో రామా! పూర్వమునందు నారచీరలను ధరించినవాఁడవును, మిగుల గొప్పదగు నరణ్యమునందు బ్రవేశించుచున్న వాఁడవును, సీతతోఁగూడ మూఁడవవాఁడవును, రాజ్యమును వదలుకొనినవాఁడవును, ముఖ్యముగా ధర్మమునొక్కదానినే కోరుచున్న వాఁడవును, పాదచారివియును, సకలధనములను వదలుకొనినవాఁడవును, తండ్రియొక్క వచనానుసారముగ బ్రవర్తించుటయందిష్టముగలవాఁడవును, సర్వభోగములచేతను శూన్యుఁడవును, స్వర్గములోనుండివచ్చిన దేవునివలె నున్నవాఁడవును, నగు నిన్నుజూచి నాకధికమగు కరుణ గలిగె. మఱియును, యుద్ధమునందు జయముగలవాఁడవును, కైకేయియొక్క వచనానుసారముగ బ్రవర్తించుచున్నవాఁడవును, కందమూలఫలములను భుజించుచున్నవాఁడవునునగు నిన్నుజూచి పూర్వము మిగుల వ్యసనమును బొందితిని. ఇప్పుడు సమృద్ధములగు సకలకార్యములును గలవాఁడవును, మిత్రులయొక్క సముదాయముతోఁ గూడుకొనినవాఁడవును, శత్రువులను జయించినవాఁడవునునగు నిన్నుజూచి యధికమగు సంతోషమును బొందితిని.

మఱియును రఘుకులోద్భవుఁడవైన యోరామా! నీ

సుఖదుఃఖములన్నింటిని దెలిసికొంటిని. మఱియును నీవు జనస్థానమునందలి దుష్టరాక్షసులను, తపోవంతులగు బ్రాహ్మణుల నిమిత్తముగ సంహరించుటను దెలిసికొంటిని. మఱియు నో రాముడా! పరమపతివ్రతయగు నీభార్య రావణాసురునిచేత నపహరింపబడుటయును, మారీచుడు గనబడుటయును, కబంధునిజూచుటయును, పంపాసరోవరమునకు బోవుటయును, సుగ్రీవునితో స్నేహమును జేయుటయును, వాలిని జంపుటయును, వాయుపుత్రుడగు హనుమంతుడు సీతను వెదకియున్నచోటును దెలిసికొని వచ్చుటయును, నలుడు సేతువును బంధించుటయును, అధికమగు సంతోషముగల వానరులచేత లంకాపట్టణమును దగులబెట్టబడుటయును, పుత్రమిత్రబంధు మంత్రులు మొదలగు వారితోగూడ రావణాసురుని సంహరించుటయును, దేవతలు వచ్చి వరములనిచ్చుటయును మొదలుగాగల విషయములన్నింటిని నాతపోబలముచేత దెలిసికొంటిని శస్త్రవేత్తలలో నుత్తముడవైన యో రాముడా! నేనుగూడ నవరము నిచ్చెదను. ఈదినమందిక్కడ నివసించి నాయర్ఘ్యమును గైకొని రేపటిదినము బయలువెడలి పొమ్ము. ఇప్పుడు నేను జేయునట్టి యతిథిసత్కారమును గైకొనుమనియె. ఇవ్విధముగా భరద్వాజమునివరుడు చెప్పిన వాక్యము శిరస్సుచేత శ్లాఘించి మంచిదనియె. అంతట ధీమంతుడగు రాముడిట్లని యాచించె.

మునికులోత్తమా! అయోధ్యాపట్టణ మార్గమునందలి వృక్షములు అకాలమునందుగూడ ఫలింపవలయును. మఱియు నన్నివృక్షములును మకరందమును స్రవించునట్లు చేయవలయును. మఱియు నీవృక్షములయొక్క ఫలములన్నియును మిగులదియ్యనివియై యుండునటుల ననుగ్రహించుమని ప్రార్థించె. ఇవ్విధముగ రాముడడిగిన విషయములను విని యామునికులోత్తముడు నీవచనానుసారముగ బ్రవర్తింపజేసితిననియె. అంతట నయోధ్యాపట్టణముయొక్క మార్గమునందలి వృక్షములన్నియును, స్వర్గలోకమునందలి వృక్షములవలె మధురములగు ఫలములుగలవయ్యె. మఱియును ఫలరహితములగు వృక్షములన్నియును, ఫలవంతములయ్యె. ఎండిపోయిన వృక్షములన్నియును, సంపూర్ణములగు నాకులు, కొమ్మలు, మొదలగునవి గలవియయ్యె. ఇవ్విధముగ మూడుయోజనములలోపల నుండువృక్షములన్నియును సకలసమృద్ధులును గలవయ్యె. అంతట వానరులందఱును పరమ సంతోషము గలవారై యావృక్షములయందలి ఫలములను సంపూర్ణముగ భుజించి స్వర్గమును జయించినవారివలె నధికమగు సంతోషము గలవారైరి.

శ్రీమద్యుద్ధకాండమునందలి నూట యిరువదేడవ సర్గ ముగిసెను.

-(*)-

రాముడు హనుమంతుని భరతునివద్దకు బంపుట.

అంతట రఘుకులోద్భవుడగు రాముడు అయోధ్యాపట్టణమునుజూచి కొంతసేపు విచారించి వానరోత్తముడగు హనుమంతునిజూచి యిట్లనియె.

హనుమంతుడా! రాజమందిరమునందలి జనమంతయును సుఖముగానున్నదేమోయని తెలిసికొనుము. మఱియు నో హనుమంతుడా! ముందుగ శృంగిబేర పురమునకు బొమ్ము. పోయి యరణ్యమునందు సంచరించుచున్నవాడును, నిషాదుల కధిపతియును, నగు గుహునిజూచి నేను క్షేమవార్తనడిగితిననుము. అతనికుశలవార్తను దెలిసికొనిన పిమ్మట నేను కుశలుడను, రోగరహితుడనునై యుంటినని చెప్పుము. నాకుశలవార్తనువిని నాప్రాణస్నేహితుడయిన గుహుడు అపరిమితమగు సంతోషమును బొందగలడు. ఓ హనుమంతుడా! ఆగుహుడు నీకయోధ్యామార్గమును, భరతునియొక్క కుశలవార్తను జెప్పగలడు. ఓ హనుమంతుడా! నీవంతట నయోధ్యాపట్టణమునకు బోయి నాకుశలవార్తను దెలుపుము. మఱియు నో హనుమంతుడా! నేను సీతాలక్ష్మణులతోగూడ కుశలుడనై యున్నాననియును, కృతార్థుడనై యుంటిననియును భరతునితో జెప్పుము. మఱియు నో హనుమంతుడా! బలవంతుడగు రావణాసురుడు సీతనపహరించుకొనిపోవుటయును, సుగ్రీవునితో స్నేహమును జేయుటయును, యుద్ధమునందు వాలిని వధించుటయును, సీతాన్వేషణమును, సీతాదేవిని నీవు తెలిసికొని వచ్చుటయును, నీవు సముద్రముదాటిపోవుటయును, సముద్రముదగ్గరకు మనమందఱము బోవుటయును, సముద్రుని దర్శించుటయును, సముద్రమును బంధించుటయును, వరుణదేవుని వలనను, బ్రహ్మదేవునివలనను, దేవేంద్రునివలనను, వరములను బొందుటయును, పరమేశ్వరానుగ్రహము వలన మాతండ్రియగు దశరథుడు వచ్చుటయును, నేను మఱలనిక్కడకు వచ్చుటయును, విభీషణునితోడను, వానరోత్తముడగు సుగ్రీవునితోడను, గూడుకొని యుండుటయును, మొదలుగాగల సంగతులను దెలియజేయుము. మఱియు నో హనుమంతుడా! ఈవిషయమును సర్వమును దెలిపిన పిమ్మట భరతుని యాకారమును చేష్టలను దెలిసికొనుము. పిమ్మట నేను శత్రువులను జయించుటయును, అపరిమితమగు కీర్తిని సంపాదించుటయును, మహాబలులగు స్నేహితుల

తోఁగూడ వచ్చుటయును, కృతార్థుడనై యుండుటయును, మఱియు నితరములగు కార్యములను దెలియ జేయుము. పిమ్మట భరతునియొక్క యాకారచేష్టలను దెలిసికొనుము.

మఱియు నోహనుమంతుడా! ముఖవర్ణముచేతను, సంభాషణముచేతను, యథార్థముగా నుండుసంగతులన న్నిటిని దెలిసికొనిరమ్ము. సర్వకాలములయందును, సమృద్ధమైనదియును, చతురంగబలములతోఁ గూడుకొనినదియును, తాతతండ్రులనాటనుండి వచ్చుచున్నదియును, నగు రాజ్యముమీద నెవ్వనికాశగలుగదు. అందఱకునుగలుగును. కావున భరతుని యభిప్రాయమును దెలిసికొనిరమ్ము. హనుమంతుడా! భరతునకు వాస్తవముగ రాజ్యమునందాశయున్నయెడల నతడే రాజ్యమును సర్వమును బాలించుగాక. భరతుడు పాలించునేని నాకేమియును గోపముగలుగదు. కావట్టి యోహనుమంతుడా! ఆభరతునియొక్క అభిప్రాయమును, చేష్టలను దెలిసికొనిరమ్ము. మఱియునోహనుమంతుడా! భరతునకట్టి అభిప్రాయము గలిగియుండెనేని మేము అయోధ్యాపట్టణముదగ్గరకు వచ్చునంతలోపలనతి వేగముతోరమ్మనియె.

ఇవ్విధముగా రాముడు చెప్పినమాటలనువిని హనుమంతుడు మానవరూపమును ధరించి అయోధ్యానగరమునకు మిగుల త్వరితగమనముగలవాడై పోయె. అంతట వాయునందనుడగు హనుమంతుడు సర్పము నిమిత్తమెగురునట్టి గరుత్మంతునివలె అధికమగు వేగముగలవాడై యంతరిక్షమునకెగిరె. అంతట నాహనుమంతుడు ఆకాశమార్గమునవలంబించి పోవుచు మిగుల శుభమైనదియును, భుజగేంద్రములకు నాలయమైనదియును, నగు గంగాయమునలయొక్క మధ్యప్రదేశమునకు బోయె. అట్లు ప్రయాగకుబోయి యక్కడనుండి వీర్యవంతుడగు నాహనుమంతుడు శృంగిబేరపట్టణమునకుబోయె. పోయిగుహునిజూచె. అంతట హనుమంతుడు పరమసంతోషముగలవాడై శుభకరములగు మాటలనుజెప్పదలచి యిట్లనియె. ఓనిషాదరాజోత్తమా! గుహునా! నీకు స్నేహితుడును, సత్యమగు పరాక్రమముగలవాడును, కకుత్స్థుని వంశమునందు బుట్టినవాడును, నగు రాముడు సీతాలక్ష్మణులతోఁ గూడవచ్చి నీతోడన కుశలవార్తనుజెప్పుమని నన్నుబంపె.

ఈపంచమినాటి రాత్రియంతయును, భరద్వాజమునివరుని వాక్యానుసారముగ భరద్వాజాశ్రమమందు నివసించె. భరద్వాజమునివరునియొక్క యాజ్ఞనుబొంది వచ్చునట్టి రఘురాముని నీవిప్పుడే చూడగలవనియె. ఇవ్విధముగా జెప్పి మహాతేజోవంతుడును, రోమాంచము గలవాడును, నగు నాహనుమంతుడు ఏవిషయమునుగుఱించియును లోచింపనివాడై యంతరిక్షమునకు మరల నెగిరె. అంతట నాహనుమంతుడు పరశురామతీర్థమును, వాలుకీనదిని, గోమతీనదిని, భయంకరమగు సాలవనమునుజూచె, మఱియు అనేకములగు దేశములను, అనేకవేల జనులను, చిన్నచిన్నపల్లెటూరులను జూచుచు వానరోత్తముడగు నాహనుమంతుడతిదూరముపోయె. అంతట విహరించుచున్న స్త్రీపురుషులచేత అలంకరింపబడినవియును, వికసించినవియును, నందిగ్రామమునకు సమీపమునందున్నవియును, నగు వృక్షములనుజూచె. ఆవృక్షములన్నియును, దేవేంద్రునియొక్క నందనవనముతో సమానములైయుండె. అంతట అయోధ్యాపట్టణమునకు క్రోశమాత్రదూరమునందు నారచీరలను, కృష్ణాజినమును, ధరించినవాడును, దీనుడును, కృశించినవాడును, ఆశ్రమమునందు నివసించినవాడును, నగు భరతునిజూచె. ఆసమయమునందు భరతుడు, జడలుగలవాడును, దుమ్ముచేత బూయబడిన శరీరముగలవాడును, భ్రాతృవ్యసనముచేత గృశించినవాడును, కందమూలఫలములే భోజనపదార్థములుగాగలవాడును, దాంతుడును, తపస్సును జేయుచున్నవాడును, ధర్మముగ సంచరించువాడును, మిగుల సన్నతములగు జడలయొక్క భారముగలవాడును, నారచీరలను, కృష్ణాజినములను వస్త్రములనుగాధరించినవాడును, నియతుడును, ధ్యానమును జేయుచున్నవాడును, బ్రహ్మర్షులయొక్క తేజస్సువంటి తేజస్సుగలవాడును, రాముని పాదుకలను ముందునిడుకొని భూమినిబాలించుచున్నవాడును, చాతుర్వర్ణ్యముతోఁ గూడిన లోకమునకు రక్షకుడును, సకల విషయములయందును జనులకు భయముగలుగకుండునట్లు పరిపాలించుచున్నవాడును, పరిశుద్ధులును, కాషాయవస్త్రధారులును, నగు మంత్రులతోడను, పురోహితులతోడను, ముఖ్యులగు సేనానాయకులతోడను, గూడుకొనియున్నవాడును, నైయుండె. ఇవ్విధముగనున్న భరతునిజూచి ప్రజలందఱును భరతునివలె సర్వమును వదలుకొనియుండిరి.

అంతట నాహనుమంతుడు ధర్మస్వరూపుడును, సకల ధర్మములను దెలిసినవాడును, దేహధారియైన పరబ్రహ్మమువలెనున్నవాడును, నగు భరతునితోఁ జేతులనుముకుళించుకొని యిట్లనియె. ఓరఘుకులోత్తమా! భరతుడా! దండకారణ్యమునందు నివసించినవాడును, నారచీరలను, జడలను, ధరించినవాడును, కకుత్స్థునికులమునందు బుట్టినవాడును, నగు నేరామునికొఱకు నీవువ్యసనమును బొందుచున్నావో యా రాముడు తనకుశలవార్తను నీకు దెలిపె.

ఓభరతుడా! నీకు ప్రియమగు వార్తను దెలిపెదను. దారుణమగు దుఃఖమునువిడిచిపెట్టగలవు. మఱియునోభరతుడా! తత్క్షణమునందే నీవు రామునితో గలసికొనినవాడవై సంతోషమును బొందగలవు. రఘుకులోత్తముడవైనయో భరతుడా! రాముడు రావణుని సంహరించి సీతతో గలసికొని మహాబలులగు స్నేహితులతో గూడ కృతార్థుడై వచ్చియున్నాడు. మహాతేజోవంతుడగులక్ష్మణుడును, కీర్తివంతురాలగుసీతయునువచ్చియున్నది. మఱియునోభరతుడా! సీతసంపూర్ణమగుకోరికలుగలదై శచీదేవి దేవేంద్రునితో గూడ గూడుకొనినవిధముగ రామునితో గూడుకొని యున్నది.

ఇవ్విధముగా హనుమంతుడుచెప్పిన వాక్యమును విని భ్రాతృవత్సలుడగు భరతుడు అధికమగు సంతోషముచేత మైమఱచినవాడై క్రిందబడి మోహమును జెందె. అంతగొంతసేపటికి రఘుకులోద్భవుడగు నాభరతుడు లేచి ప్రియవార్తను దెలుపుచున్న హనుమంతుని ఆలింగనమును జేసికొని సంతోషమువలన గలిగిన కన్నీళ్ళచేత నాహనుమంతుని దడుపుచు నిట్లనియె. పురుషోత్తముడా! నీవు దేవుడవా? మనుష్యుడవా? నాయందలి దయచేత ఇక్కడకువచ్చిన నీవెవ్వడవైనదియును దెలియకున్నది. నాకుప్రియవార్తను దెలుపుచున్న నీకు ప్రియమగు పదార్థములనిచ్చెదను. మఱియు నోధీమంతుడా! నీకు వేయిగోవులనిచ్చెదను. నూఱుగ్రామములనిచ్చెదను. మఱియును మిగుల మంగళకరములును, అధికమగు వెలకలవియును, నగు కుండలములనిచ్చెదను. మఱియు నోపురుషోత్తముడా! బంగారముయొక్క ఛాయవంటి దేహచ్ఛాయగలవారలును, దివ్యములగు వస్త్రములను ధరించినవారలును, మిగులశ్రేష్ఠములగు ముక్కులును, తొడలును, గలవారును, చంద్రునివంటి మోముగలవారును, సర్వాభరణములతోడను గూడుకొనినవారలును, సత్కులమునందు బుట్టినవారలును, నగు స్త్రీలననేకులనిచ్చెదననియె. మఱియును దశరథరాజనందనుడగు భరతుడు రాముడువచ్చుచున్నాడను వృత్తాంతమునువిని అపరిమితమగు సంతోషముగలవాడై రాముని జూడవలయునని మెందు కుతూహలముగలవాడై యిట్లనియె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి నూటయిరువదెనిమిదవ సర్గ ముగిసెను.

——(*)——

హనుమంతుడు భరతునకు రామవృత్తాంతమును జెప్పుట.

అహా! నాయదృష్టమునుగురించి యేమనవచ్చును. రాముడు అరణ్యమునకుబోయి యనేకసంవత్సరములయ్యె. నేటిదినము నేను ప్రీతికరమగు నాప్రభువుయొక్క క్షేమమువింటిని. మఱియు నోపురుషశ్రేష్ఠుడా! శ్లో॥ కల్యాణీబతగాథేయం లౌకికీప్రతిభాతిమే। ఏతిజీవంతమానందో నరంవర్షశతాదపి॥ నూఱుసంవత్సరములకాలము జీవించియున్నయెడల, నెప్పటికైననొకప్పటికి మేలుగలుగును. అనునట్టి కింవదంతి వాస్తవమనుటకు సందేహమేమియునులేదు. నాయనా! పురుషోత్తముడా! రామునకును, వానరులకును, ఏదేశమునందేమినిమిత్తముగ స్నేహము సంఘటించెను. ఆవిషయమునుసర్వమును నాకుదెలియజెప్పుమనియె. ఇవ్విధముగా భరతుడు అడిగినపిమ్మటభరతుని యనుమతమునుబొంది మానవరూపధరుడగు హనుమంతుడు తపోవంతులుగూర్చుండుటకుదగిన ఆసనమునందు గూర్చుండె. అంతట నాహనుమంతుడు వనమునందు జరిగిన వృత్తాంతమును సర్వమును జెప్పదలచి యిట్లనియె.

ఓభరతుడా! రాముడు అరణ్యమునకు బోవుటయును, తల్లియగుకైకేయి నీకు వరమునిచ్చుటయును, పుత్రశోకముచేత దశరథమహారాజు మరణమును బొందుటయును, దూతలవచనములను విని నీవు అయోధ్యాపట్టణమునకు వచ్చుటయును, నీవయోధ్యాపట్టణమునందు ప్రవేశించి రాజ్యమును అపేక్షింపకుండుటయును, నీవుచిత్రకూటపర్వతమునకు బోయి రాముని ప్రార్థించుటయు, రామానుమతమును బొంది ధర్మముగాసంచరించుచు ప్రజాపాలనమును జేయుటయును, రామునిపాదుకలను నీవు తీసికొనివచ్చుటయును, మొదలగు సంగతులన్నియును నీవెఱిగిన విషయమేగాని మఱియొకటిగాదు. కాబట్టి యావిషయమును సర్వమును నేను జెప్పనక్కరలేదు. నీవు రామునివిడిచి వచ్చినపిమ్మట జరిగినవృత్తాంతమును సర్వమును దెలియజెప్పెదను. వినుము. ఓభరతుడా! నీవు రామునివిడచి వచ్చినపిమ్మట రాముడు నానావిధములగు క్రూరమృగములతో గూడుకొనినదియును, పరితప్తమైనదియును, నగు దండకారణ్యమునొద్దకు బోయెను. పోయి ఏనుగులయొక్క సంచారముగలదియును, సింహవ్యాఘ్రములతో గూడుకొనినదియును, జనరహితమయినదియును, నగు నాదండకారణ్యమునందు ప్రవేశించె. అట్లుప్రవేశించి పోవుచుండగా నాసీతారామలక్ష్మణులయొక్క యెదుట మిగులగొప్పదగు సింహనాదమును జేయుచు విరాధుడను రాక్షసుడువచ్చి నిలిచె.

అవ్విధముగ సింహనాదమును జేయుచున్నవాడును, ఎత్తబడినచేతులుగలవాడును, అధోముఖుడును, ఏనుగువలె ధ్వనిజేయుచున్నవాడును, నగు నావిరాధుని రాముడు క్షణమాత్రములోపల సంహరించె. అంతటనన్నదమ్ము

లగు రామలక్ష్మణుల విధముగా విరాధుని సంహరించియా నాటిసాయంకాలమునకు శరభంగ మహామునియొక్క యాశ్రమమునకుఁ బోయిరి. అంతట శరభంగమహాముని స్వర్గమునకుఁ బోయెను. అప్పుడు సత్యపరాక్రమముగల రాముడు సకల మునివరులకును నమస్కరించి జనస్థానమునందు బ్రవేశించెను. అంతట రాముని సమీపమునకు శూర్పణఖయను నామధేయముగల రాక్షసస్త్రీ వచ్చెను. అప్పుడు రాముని యనుమతమును బొంది మహాబలుడగు రామలక్ష్మణుడు ఖడ్గమును గ్రహించి యా రాక్షస స్త్రీయొక్క చెవులను, ముక్కులను ఛేదించెను. అంతట నా జనస్థానమునందు మహాత్ముడగు రాముడు పదునాలుగువేల రాక్షసులను సంహరించెను. ఆ పదునాలుగువేల రాక్షసులతో గూడుకొనివచ్చిన ఖరదూషణులను రాముఁడొక్కఁడే జాముప్రొద్దుకాలమంతలో నాశముసేసెను. ఆవిధముగ దండకారణ్యమునందు నివసించుచున్నవారలును, తపస్సులకు విఘ్నములను జేయువారలును, నగు రాక్షసులందఱును రామునిచేత సంహరింపబడిరి. అంతట రాముని యాజ్ఞానుసారముగ లక్ష్మణునిచేత భేదింపబడిన శూర్పణఖయను రాక్షసస్త్రీ రావణాసురుని యొద్దకుఁ బోయెను. పోయి యా వృత్తాంతమును సర్వమును దెలియజెప్పెను. అంతట మిడతెగక రావణాసురునితోఁగూడ సంచరించువాడును, భయంకరుడునునగు మారీచుడను రాక్షసుడు రావణాసురునితోఁగూడ బయలువెడలివచ్చెను. అంతట నా మారీచుడు మృగరూపమును ధరించి సీతాదేవిని మోసపుచ్చెను.

అప్పుడు సీతాదేవి యా కనకమృగమునందు మిగుల నాశగలదై రామునితో నీమృగమును బట్టియిమ్మనియెను. మఱియు నీమృగము మన యాశ్రమమునందుండెనేని మనయాశ్రమము మిగుల మనోహరముగ నుండుననియెను. అంతట రాముడు ధనుష్పాణియై పరుగెత్తుచున్న యామృగమును వెంబడించెను. అట్లు పరుగెత్తిపోయిపోయి యామృగమును బాణముచేత గొట్టెను. అట్లు రాముడు కనకమృగమును వెంబడించిపోగానే లక్ష్మణుడును గూడ రాముని వెదకుచుఁబోయెను.

ఆసమయమునందు రావణాసురుడు రాముని యాశ్రమమునందు బ్రవేశించెను. ప్రవేశించి "యంతరిక్షమునందు రోహిణీనక్షత్రమును దుష్టగ్రహమాక్రమించిన విధముగ" సీతాదేవి నాక్రమించెను. పిమ్మట నా సీతామహాదేవిని దనరథముమీద బెట్టుకొనిపోవుచుండెను. ఆసమయమునందు జటాయువను పక్షిరాజు సీతాదేవిని విడిపింపదలచి రావణాసురున కడ్డముగ వచ్చెను. అప్పుడు రావణాసురుడా జటాయువును సంహరించెను. అంతట రావణాసురుడు ఆ సీతాదేవిని నెత్తికొని మిగుల శీఘ్రముగఁ బోవుచుండెను. అట్లు రావణాసురునిచేత నెత్తికొనిపోబడుచున్న సీతాదేవిని పర్వతశిఖరమునందు గూర్చున్నవారును, పర్వతముతో సమానములగు దేహములు గలవారును, నగు వానరులు సూచిరి. చూచి యా వానరులందఱును మిగుల నాశ్చర్యమును బొందిరి. అంతట సకలలోకభయంకరుడగు రావణాసురుడు తనచేత బరిపాలింపబడుచున్న లంకాపట్టణమునకుఁ బోయెను. పోయి పిమ్మట నా సీతాదేవిని సువర్ణముచేత నిర్మింపబడినదియును, మిగుల గొప్పదియును నగు గృహమునందు నిలిపెను. పిమ్మట నా సీతాదేవిని సాంత్వవచనములచేత లోభపఱచుచుండెను. అప్పుడు సీతాదేవి యా రావణాసురుని తృణప్రాయముగ మాటలాడుచుండెను. మఱియు నప్పుడు సీతాదేవి రావణాసురునియొక్క యశోకవనమునందు రాముని ధ్యానించుచు నపరిమితమగు దుఃఖముగలదై యుండెను. అంతట రాముడు ఆ మాయామృగమును జంపి లక్ష్మణునితోఁగూడ నాశ్రమమునందు బ్రవేశించెను. అంతట నాశ్రమమునందు సీతను గానక మిగుల వ్యసనముగలవాడై లక్ష్మణునితోఁగూడ సీతను వెదకుచుండెను. అట్లుండ నొకచోట రావణాసురునిచేత గొట్టబడి క్రిందబడియున్న జటాయువును జూచి దానివలన జరిగిన వృత్తాంతమును సర్వమును దెలిసికొనియెను. పిమ్మట నా జటాయువు మరణమును బొందెను. అంతట రాముడు ఆ జటాయువునకు సంస్కారమును జేసి లక్ష్మణునితోఁగూడ సీతాదేవిని వెదకుచుఁబోవుచుండెను. అంతట గోదావరీనదీతీరమునందును, మఱియును, పుష్పించిన వనములయందును సీతాదేవిని వెదకుచుండెను. అట్లు వెదకుచు నొకచోట కబంధుడను రాక్షసుని జూచెను. అంతట నా కబంధుని వచనానుసారముగ సత్యపరాక్రమముగల రాముడు ఋశ్యమూక పర్వతమునకుఁ బోయెను.

పోయి సుగ్రీవునితో స్నేహమును జేసెను. ఆ రామసుగ్రీవు లొకరినొకరు చూడకమునుపె స్నేహయుక్తములగు మనస్సులుగలవారైరి. అంతట సుగ్రీవుడు బలవంతుడును కీర్తనకన్నయును, నగు వాలివలన రాజ్యపదభ్రష్టుడై దుఃఖమును బొందుచున్న సమాచారమును సర్వమును దెలియజేసెను. అంతట నయ్యిరువురకును మిగుల గాఢమగు ప్రేమకలిగెను. అంతట రాముని పరాక్రమముచేత సుగ్రీవుడు వానర రాజ్యమును బొందెను. అంతట రాముడు మహాబలుడును, మిగుల గొప్పదగు శరీరముగలవాడునునగు వాలిని సంహరించెను. పిమ్మట సకల వానరోత్తములతోఁగూడ సుగ్రీవుడు వానర రాజ్యమునకధిపతియయ్యెను. అంతట నా సుగ్రీవుడు సీతాదేవియున్నచోటును వెదకించెదనని రామునితో బ్రతిజ్ఞను జేసెను. అం

తట మహాత్ముడగు సుగ్రీవుడు పదికోట్లవానరులనురప్పించి సకల దిక్కులకునుబంపె. ఆపదికోట్లవానరులలోగొందఱ మగు మేముదక్షిణదిక్కునకు బయలువెడలిపోతిమి. పోయి సకలదేశములయందును వెదకిసీతనుగానక వింధ్యపర్వతము నందు బ్రవేశించి యపరిమితముగదుఃఖమును బొందుచుం టిమి. అట్లుదుఃఖించుచు జిరకాలమునుగడపితిమి. అంతట నప్పర్వతమునందు నివసించియున్నవాడును, జటాయు వునకన్నయును, నగుసంపాతియను గృధ్రరాజుసీతాదేవి లంకాపట్టణమునం దున్నదనిచెప్పె.

అప్పుడు నేనుజ్ఞాతులగు వానరులయొక్క దుఃఖమును బోగొట్టుచు బరాక్రమమునవలంబించి నూరామడవెడల్పు గల సముద్రమునుదాటితిని. అట్లుసముద్రమును దాటిపో యిలంకాపట్టణమున కధిపతియగు రావణాసురునియొక్క యశోకవనమునందు నివసించియున్నదియును, మిగులవ్య సనమును బొందుచున్నదియును, నగుసీతాదేవినిజూచితిని. ఆసమయమునందాసీతాదేవి, నారచీరను ధరించినదియు ను, మలినురాలును, సంతోషరహితురాలును, దృఢమగు వ్రతముగలదియును, మిగులదావనురాలును, నైయుండె. అట్టిసీతాదేవిని శాస్త్రోక్తప్రకారముగజూచి నమస్కరిం చి మిగులదేజోవంతమైనదియును, రామునిచేత నివ్వబడి నదియునగు, నగుమణినినానవాలుగా సీతకునొసంగితిని. మ ఱియును, రామునియొక్క కుశలవార్తను దెలిపితిని. అంత ట సీతాదేవియిచ్చిన యానవాలునుతీసికొని కృతార్థుడనై తివని సంతోషించుచు మరలివచ్చిమహానుభావుడగు రాము నకావృత్తాంతమును సర్వమునుదెలిపితిని. అంతటరాము డు పరమ సంతోషముగలవాడై యమృతపానమునుజేసిన వానివలె సంతుష్టుండయ్యె. అప్పుడురాముడు సకలలోక ములను దహింపజేయునట్టి యగ్నిదేవునివలె భగ్గుభగ్గున మండిపడుచు రావణాసురుని సంహరించుట కొఱకునిశ్చ యింపబడిన మనస్సుగలవాడయ్యె. అంతటరాముడు సకల వానరవీరులతోగూడ సముద్రముదగ్గరకుబోయె. అప్పుడు నలుడనువానరోత్తముడు సముద్రమునుబంధించె. అంతట రాముడు సకలవానరసేనతోగూడ సముద్రమునుదాటె. అంతట వానరులును, రాక్షసులును నపరిమితమగుయుద్ధ మునుజేసిరి.

ఆసమయమునందు నీలుడనువానరోత్తముడు ప్రహ స్తుడను రాక్షసోత్తమునిసంహరించె, రాముడుకుంభకర్ణుని సంహరించె. లక్ష్మణుడు రావణాసురునకుపుత్రుడగునిం ద్రజిత్తునుసంహరించె. అంతట రాముడు రావణాసురుని సంహరించె. ఆసమయమునందు దేవేంద్రుడు, యముడు, వ రుణదేవుడు, పరమేశ్వరుడు, బ్రహ్మదేవుడు మొదలుగా గల దేవతలందఱును దశరథమహారాజుతోగూడ వచ్చిరి. మఱియు ననేకులగుఋషులువచ్చిరి. వారందఱును రాము నకనేకములగు వరములనిచ్చిరి. అట్లుదేవతలుమొదలగు వారగల వారలవలన ననేకములగు వరములనుబొంది యా రాముడు పుష్పకమనువిమానమునెక్కి కిష్కింధాపట్టణ మునకువచ్చె. ఆకిష్కింధాపట్టణమునందు గొంచెముసేపు నివసించియంతట ననేకకోట్లవానరులతోడను, వానరస్త్రీ లతోడనుగూడ బయలువెడలి యనేకదేశములను జూచుచు గంగానదీ సమీపమునకువచ్చె. వచ్చిగంగా తీరమునందుని వసించియున్న భరద్వాజమునివరునిజూచె. చూచియమ్ము నివరునను మతానుసారముగనందునివసించె. రేపుపుష్యమీ నక్షత్రయోగము గలదుగావున రేపుయిక్కడకురాదలచి యున్నాడు. కాబట్టిరేపురాముని జూడగలవనిహనుమం తుడు సర్వవృత్తాంతమును దెలియబలికె.

ఇవ్విధముగ హనుమంతుడుచెప్పిన వాక్యములనువినిభ రతుడు, మిగుల సంతోషముగలవాడును, చేతులను ముకు ళించుకొనినవాడునునై మనస్సునకు సంతోషముగలుగజే యునదియును, మిగులమనోహరమై నదియునునగుమాటను జెప్పుచు నామనోరథము సంపూర్ణమయ్యెననియె.

ఇట్లుశ్రీమద్యుద్ధకాండమునందలి నూటయిరువదితొమ్మి దవసర్గముగిసెను.

భరతుడు మొదలగువారు రామునకు యెదురు గాబోయి పిలుచుకొనివచ్చుట.

అంతట సత్యపరాక్రమముగల భరతుడుపరమసంతో షకరములగు వాక్యములనువిని సంతుష్టుడగు శత్రుఘ్నుని తోనిట్లనియె.

తమ్ముడా! శత్రుఘ్నుడా! మనపట్టణములోని దేవతల ను, చైత్యస్థానములను జక్కగబూజించునట్లుసేయుము. మ ఱియునోశత్రుఘ్నుడా! స్మృతులను, పురాణములనుజక్క గ దెలిసినసూతులను, వైతాళికులను, వాద్యములయందు మిగుల నేర్పుగలవారలను, బయలువెడలునట్లుసేయుము. మనమందఱమునుబోయి చంద్రునివంటి ముఖముగలరాము నిజూతమనియె. ఇవ్విధముగా భరతుడుచెప్పిన వాక్యముల నువిని శత్రుసంహారకుడగు శత్రుఘ్నుడనేకవేల కూలివాం డ్రనుప్రేరణచేసె. అట్లుసేసి యిట్లనియె.

ఓజనులారా! మీరందఱునుపల్లములను, మెట్టలనుజక్క గజేయుడు. నందిగ్రామముమొదలుకొని గలమెరకలనన్నిం టిని బాగుసేయుడు. మఱియునోజనులారా! పన్నీటిచేత

భూమినిసర్వమును దదుపుడనిరి. అంతట వారందఱును శత్రుఘ్న వచనానుసారముగ బయలువెడలిపోయిరి. పిమ్మట కొందఱు పేలాలచేత సర్వస్థలములయందును నలంకరించిరి. మఱికొందఱు పుష్పములచేత నలంకరించిరి. మఱికొందఱు పట్టణమునందంతటను ధ్వజములనెత్తిరి. మఱికొందఱు గృహములనన్నింటిని నలంకరించుచుండిరి. మఱికొందఱు పూలమాలికలచేతను, పుష్పములచేతను, సుగంధద్రవ్యములచేతను, రాజమార్గమునుసర్వమునునలంకరించిరి.

అంతట రాజుయొక్క భార్యలును, మంత్రులును, సేవలును, సేనాపతులును, బ్రాహ్మణులును, రాజోత్తములును, గణాధిపతులును, జయంతుడును, విజయుడును, అర్థసాధకుడగు సిద్ధార్థుడును, అశోకుడును, మంత్రపాలుడును, సుమంత్రుడును, మఱియుపసేకులును బయలువెడలిరి. అప్పుడు మఱికొందఱు సువర్ణకలశోదకములతోగూడిన ననేకవేలయేనుగులతోడను, అనేకవేల యాడేనుగులతోడను, బయలువెడలిరి. మఱికొందఱనేకవేల గుఱ్ఱములతో బయలువెడలిరి. మఱికొందఱనేకవేల ధ్వజములు మొదలగువానితో బయలువెడలిరి. మఱియునసేకవేలయాయుధపాణులు బయలువెడలిరి. అనేకవేలపదాతులు బయలువెడలిరి. అనేకవేలవీరులు బయలువెడలిరి. అంతటదశరథుని భార్యలందఱును దివ్యములగు యానములనెక్కి బయలువెడలిరి. ఆస్త్రీలందఱును కౌసల్యాసుమిత్రలను ముందిడుకొనిబయలువెడలిరి. అవ్విధముగనందఱును బయలువెడలినంది గ్రామమునందుబ్రవేశించిరి. ఆసమయమునందయోధ్యాపట్టణములోని వారందఱును నందిగ్రామమునకు వచ్చిరి. మఱియునాసమయమునందు గుఱ్ఱములయొక్క గిట్టలయొక్క ధ్వనులచేతను, రథముయొక్క ధ్వనిచేతను, భూమియంతయును, గడగడవణకె.

ఆసమయమునందు ధర్మకోవిదుడగు భరతుడనేకవేల బ్రాహ్మణులతోడను, వర్తకులతోడను, మాల్యమోదకములు హస్తమునందుగల మంత్రులతోడను, గూడుకొనినవాడై బయలువెడలె. మఱియునప్పుడా భరతుడురాముని పాదుకలను శిరస్సుచేతవహించె. మఱియును, తెల్లనిపూలమాలికలచేత బ్రకాశింపజేయబడినదియును, మిగులదెల్లనిదియును, నగుగొడుగునుగూడ దీసికొనిపోయె. మఱియు నాసమయమునందు ఉపవాసములచేత గృశించియున్నవాడును, దీనుడునునగు నాభరతుడు తెల్లని వింజామరలనుగూడ గ్రహించియుండె. మహాత్ముడగుభరతుడు రామునియాగమన వృత్తాంతమును వినుటచేత నపరిమితమగు సంతోషముగలవాడై మంత్రులు మొదలగు వారితోగూడబయలువెడలె. ఆసమయమునందు భరతుడువాయుపుత్రుడగు హనుమంతునిజూచి యిట్లనియె.

ఓవానరోత్తముడా! ఆంజనేయా! నీకువానరులకుగల సహజమగు చపలచిత్తతగలిగి యుండలేదుగదా? మఱియు నోహనుమంతుడా! శత్రువులనుదపింప జేయువాడును, పూజ్యుడును, నగురాముడు కనబడుటలేదేమి? మరియు నోహనుమంతుడా! కామరూపులగు వానరులును కనబడుటలేదేమనియె. ఇవ్విధముగా భరతుడుచెప్పినమాటనువిని హనుమంతుడు కాలహరణమునకు గారణమునుజెప్పుచు సత్యవిక్రముడగు భరతునితో నిట్లనియె.

ఓరఘువంశోత్తమా! భరతుడా! చూడుము. భరద్వాజమునివరునియొక్క యనుగ్రహముచేత వృక్షములన్నియును, సర్వకాలములయందును, ఫలములుగలవియును, పుష్పములు గలవియునునై యున్నవి. మరియు నీవృక్షములన్నియును మకరందమును స్రవించుచున్నవి. తుమ్మెదలయొక్క ధ్వనులతో గూడుకొనియున్నవి. మరియునోభరతుడా! వానరులుసంచరించు నరణ్యములయందలి వృక్షములు అకాలములయందుగూడ ఫలించునని దేవేంద్రుడు రామునికొఱకు వరమునిచ్చె. ఆవరప్రసాదమువలన వానరులకువృక్షములన్నియును, ఆతిథ్యమునిచ్చుచున్నవి చూడుము. మరియు నోభరతుడా! సంతుష్టులగు వానరులయొక్క భయంకరమగు శబ్దము వినబడుచున్నది. వినుము. ఈధ్వనినివిన గా వానరులందఱును గోమతీనదినిదాటుచున్నట్లు తెలియుచున్నది.

మరియునోభరతుడా! చూడుము. వానరులపాదములవలన బయలువెడలినదుమ్ము వాలుకినీనదియందు వ్యాపించుచున్నది. మరియునోభరతుడా! వానరులందఱును, రమ్యమగుసాలవనమునందు దిరుగుచున్నట్లుతలచుచున్నాను. మరియునోభరతుడా! అదిగో చూడుము. బ్రహ్మదేవునిమనస్సుచేతనే నిర్మింపబడినదియును, దివ్యమైనదియును, నిర్మలమైనదియును, చంద్రునితోసమానమైనదియును నగువిమానము కనబడుచున్నది. ఆవిమానమును రాముడురావణాసురుని పుత్రమిత్రాదులతోగూడ సంహరించిసంపాదించె. ఈవిమానముబాలసూర్యునియొక్క కాంతివంటికాంతిగలదైయున్నది దీనినికుబేరుడుతొలుత సంపాదించె. ఈవిమానమునందిప్పుడు సీతారామలక్ష్మణులును, మిగులదేజోవంతుడగు సుగ్రీవుడును, రాక్షసుడగు విభీషణుడును, సంతోషముతో గూడుకొనినవారై యాకాశమునందంతటను వ్యాపించునట్లు ధ్వనిచేయుచున్నారనియె.

ఆసమయమునందా మహాధ్వనినివిని స్త్రీలును, బా

లురును, వృద్ధులును, రాముడువచ్చె, రాముడువచ్చె, రాముడువచ్చెనని, యపరిమితముగా గూతలను బెట్టిరి. మరియువారందఱును, ఏనుగులనుండియును, గుఱ్ఱములనుండియును దిగి యపరిమితముగా గూతలను బెట్టుచుండిరి. అప్పటిమహాధ్వని భూమ్యంతరిక్షముల యందంతటనువ్యాపించెను. మఱియు వారందఱును నాసమయమునం దాకాశమునందు జంద్రుని జూచిన విధముగవిమానమునందున్న రామునిజూచిరి. అంతట భరతుడుమిగుల సంతోషముగలవాడును, చేతులను ముకుళించుకొనినవాడును రామునకభిముఖుడునై పోయి రాముని ననేకవిధములబూజించెను.

ఆసమయమునందు బ్రహ్మదేవునిచేత సృజింపబడినవిమానమునందు మిగులవిశాలములును, పొడవులును, నగు నేత్రములుగల రాముడు రెండవ దేవేన్ద్రునివలె బ్రకాశించుచుండెను. అంతట నాభరతుడు మేరుపర్వతమునందున్న సూర్యునివలె బ్రకాశించుచున్నవాడును, విమానాగ్రమునందున్నవాడును, నగు రామునకు నమస్కారమును జేసెను. అంతట హంసలతోగూడు కొనినదియును, మిగులవేగము గలదియును, శ్రేష్ఠమైనదియును, నగువిమానము రాముని యాజ్ఞనుబొంది భూమిమీదికిదిగెను. అంతట సత్యవిక్రముడగు భరతుడు విమానములోనికిబోయెను. పోయిరామునకుశిరస్సుతోగూడ నమస్కారమును జేసెను. అప్పుడు చిరకాలమునకు గనబడినభరతుని లేవనెత్తితొడమీద గూర్చుండబెట్టుకొని మిగులసంతోషముతో నాలింగనమును జేసికొనియెను. అంతట భరతుడులక్ష్మణునియొద్దకుబోయెను. పిమ్మటసీతాదేవికి నమస్కారమును జేసెను. నమస్కారమును జేయునపుడు తననామగోత్రములనుచ్చరించెను.

అంతట నాభరతుడుసుగ్రీవుని, జాంబవంతుని, అంగదుని మైందుని, ద్వివిదుని, నీలుని, నలుని, ఋషభునినాలింగనమును జేసికొనియెను. మఱియు నాభరతుడు, సుషేణుడు, నలుడు, గవాక్షుడు, గంధమాదనుడు, శరభుడు, పనసుడు, మొదలగు వానరులనుగూడ నాలింగనమును జేసికొనియెను. ఆసమయమునందు, కామరూపులగు వానరులందఱును, మానవరూపముధరించి యప్పుడుభరతునితో కుశలవార్తనడిగిరి. అంతటధర్మవంతులలో నుత్తముడును, అధికమగు తేజస్సుగలవాడును రాజనందనుడును, నగుభరతుడు ఆలింగనమును జేసికొని వానరోత్తముడగు సుగ్రీవునితో నిట్లనియెను. వానరోత్తముడవైన యోసుగ్రీవుడా! మేమునలుగుర మన్నదమ్ములము. నీవైదవవాడవు. మంచిహృదయమువలన మిత్రుడగును. అపకారబుద్ధిచేత శత్రువుడగునని యెను. ఇవ్విధముగ సుగ్రీవునితో జెప్పి విభీషణునితో సాంత్వవచనములను జెప్పదలచియిట్లనియెను.

రాక్షసోత్తముడవైన యోవిభీషణుడా! దైవయోగము చేత నీవుసహాయము నవలంబించియుండుటచేత మాయన్నయగు రాముడు మిగులదుర్లభమగు కర్మమును జేసెను. నీసహాయములేకుండిన రాముడిట్టికార్యమును జేయజాలడనియెను. ఆసమయమునందు శత్రుఘ్నుడుగూడ క్రమముగ సీతారామలక్ష్మణుల పాదములకు నమస్కరించెను. అంతట రాముడు దుఃఖముచేత కృశించినదియును, వ్యసనమును బొందుచున్నదియును, నగుతల్లియొక్క పాదములకు నమస్కారమును జేసి యాపూజ్యురాలియొక్క మనస్సునునిర్మలమైనదానినిగా జేసెను. పిమ్మటసుమిత్రాదేవికిని, కీర్తివంతురాలగు కైకేయికిని నమస్కారమును జేసెను. అంతటదక్కినతల్లులకందఱకును నమస్కారమును జేసెను. పిమ్మటపురోహితునియొద్దకుబోయి నమస్కారమును జేసెను.

ఆసమయమునందు పురజనులందఱును రామునియొద్దకువచ్చి మిగులగొప్పదగు భుజబలముగల యోరాముడా! సుఖముగావచ్చితివా! యనిరి. మఱియువారందఱును చేతులను ముకుళించి రామునకునమస్కరించిరి. ఆసమయమునందు పద్మకోశములతో సమానములగు పురజనులయొక్క హస్తముకుళములనుజూచి మిగుల సంతోషమును బొందెను. అంతటధర్మవేత్తయగు భరతుడుతనహస్తములతో రామునిపాదుకలను దీసికొనివచ్చి రామునియొక్క పాదములయందు సంఘటించెను. అంతట నాభరతుడు చేతులను ముకుళించుకొని యన్నయగు రామునితో నిట్లనియెను.

అన్నా! రాజోత్తమా! రామచంద్రా! నీపాదుకలు చక్కగ గాపాడబడినవి. నీపాదుకలకునివేదించుచు రాజ్యమును జక్కగనె నేర్చితిని. ఇప్పుడు నాజన్మము సఫలమయ్యె. నాకోరికలన్నియును నెరవేరె. అయోధ్యాపట్టణమునకు రాజవగునీవుమరల వచ్చుటచేత నేను కృతార్థుడనైతిని. మఱియునో రాముడా! నీవుకోశాగారమునుజూడుము. కోష్ఠాగారమునుజూడుము. పట్టణమునుజూడుము. బలమునుజూడుము. మఱియునో రాముడా! నీతేజస్సుచేత నేనేను రాజ్యమునందలివస్తువులనన్నింటిని పదిగుణములధికముగా జేసితినని యెను. ఇవ్విధముగా జెప్పుచున్నవాడును. అన్నదమ్ములయందు వాత్సల్యముగలవాడును, నగుతమ్మునిజూచి మిగుల సంతోషమును బొందెను. అప్పుడువానరులును, రాక్షసుడగు విభీషణుడును, మిగులసంతోషముతో నానందబాష్పములనువిడిచిరి. అంతటరఘుకులోద్భవుడగు రాముడుమిగుల సంతోషముతో భరతునినాలింగనమును జేసి

కొనిరి. అంతట రాముడు సైన్యముతోగూడ నావిమానము నెక్కి భరతునియొక్క యాశ్రమమునకు బోయెను. అంతట నాసమయమునందు రఘుకులోత్తముడును, సకలసైన్యముతోగూడుకొనినవాడును, నగు రాముడు భరతునియొక్క యాశ్రమమునందు బ్రవేశించె. అంతట రాముడు విమానమునుండి సకలజనులతోగూడ భూమి మీదికి దిగె. అప్పుడు రాముడు మిగుల శ్రేష్ఠమగు విమానముతో నిట్లనియె.

ఓ విమానరాజమా! నేనాజ్ఞ నిచ్చుచున్నాను. నీవుపోయి సేవకుడవు కుబేరుని పూర్వమువలె వహింపుమనియె. అంతట రామునియొక్క యనుమతమును బొంది యావిమానరాజము ఉత్తరదిఙ్మార్గము నవలంబించి కుబేరునియొక్క గృహమునకు బోయెను. అప్పుడు దేవేంద్రునితో సమానుడును, రఘుకులోద్భవుడును నగు రాముడు, బృహస్పతితో సమానుడగు పురోహితునియొక్క పాదములకు నమస్కరించి మంగళకరమగు సింహాసనమందు ఆపురోహితునితోగూడ గూర్చుండె.

ఇట్లు శ్రీమద్యుద్ధకాండమునందలి నూటముప్పదవసర్గ ముగిసెను

రామపట్టాభిషేకముకొఱకు వానరులు నానాపుణ్యతీర్థములను దెచ్చుట.

అంతట కైకేయిపుత్రుడగు భరతుడు చేతులను శిరస్సునందు బెట్టుకొని జ్యేష్ఠుడును, సత్యమగు పరాక్రమముగలవాడును, నగు రామునితో నిట్లనియె.

ఓ అన్నా! రాముడా! నీవు పూర్వము వనవాసమునకు అంగీకారమును బొంది మాతల్లియగు కైకేయిని గౌరవించితివి. పిమ్మట నేను చిత్రకూటపర్వతమునకు వచ్చినప్పుడు నీరాజ్యమును నాయందు బెట్టితివి. అట్టి రాజ్యమునింతవఱకు మిగుల కష్టముతోగాపాడుచుంటిని. ఇప్పుడు నీవు వచ్చుటచేత నీరాజ్యమును, నీకు సమర్పించితిని. మఱియు నో అన్నా! రాముడా! మిగుల బలముగల వృషభముచేత మోయదగిన భారమును లేగదూడ యెట్లు మోయగలదు. కావున నేను మిగుల గొప్పదగు రాజ్యభారమును మోయజాలకయున్నాను. మఱియు నో రాముడా! దుర్బంధనమును, అనేకచ్ఛిద్రములు గలదియును నగు నీరాజ్యము మిగులవేగముగలదియును, గొప్పదియును, నగు నుదకప్రవాహముచేత సేతువువలెనే బహిర్గతములగు ఛిద్రములుగలదగుచుండును. మఱియు నో అన్నా! రాముడా! అశ్వముయొక్క గతిని గాడిదె పొందలేనివిధమునను, హంసయొక్క గతిని వాయసము పొందలేనివిధమునను, నేను నీమార్గమును బొందజాలను. మఱియు నో రాముడా! దొడ్డియందుంచబడిన వృక్షము, మిగుల గొప్పదియును, ఎక్కుటకు నలవిగానిదియును, మిగుల గొప్పవగు శాఖలుగలదియును పుష్పించి ఫలముల నివ్వకయే నశించిపోయినయెడల నావృక్షమునకు బడిన శ్రమయంతయు వ్యర్థమగును. మఱియు నావృక్షమెందుకుగా నారోపింపబడినదో యట్టి ఫలమును బొందినవాడుగానేరడు. కావున మహానుభావుడవైన యో అన్నా! రాముడా! ఇప్పుడు నేను జెప్పినమాట కర్థమును నీవే యెఱుగుదువు. కావున నేను విశేషించి చెప్పనక్కఱలేదు. మఱియు నో అన్నా! రాముడా! నీవు రాజవై భృత్యులమగు మమ్ములనందఱను జక్కగ గాపాడుము. ఇప్పుడు పట్టాభిషిక్తుడవగు నిన్నుజూచి లోకమంతయును సంతోషమును బొందుగాక. మఱియు నిప్పుడు లోకములోనివారందఱును, మధ్యాహ్నకాలమునందు మిగుల దాపమును గలుగజేయుచున్నవాడును, ప్రకాశించుచున్న తేజస్సుగలవాడును నగు సూర్యునితో సమానుడవగు నిన్నుజూతురుగాక. మఱియు నో అన్నా! రాముడా! నీవు, మంగళవాద్యములయొక్క ధ్వనులతోడను, బంగారపు మొలనూళ్ళయొక్క ధ్వనులతోడను, మిగుల మనోహరములగు గీతవాదిత్రశబ్దములతోడను, గూడుకొనినవాడవై జ్యోతిశ్చక్రము తిరుగుచున్నంతకాలమును, భూమియున్నంతకాలమును, ఈరాజ్యమునకు సర్వమునకును బ్రభుడవగుమనియె. ఇవ్విధముగా భరతుడు చెప్పినమాటలను విని శత్రుపురములను జయించునట్టి రాముడు నీవచనానుసారముగ జేసెదనని చెప్పి మంగళకరమగు సింహాసనమునందు గూర్చుండె. అంతట శత్రుఘ్నునియొక్క యనుమతమును బొంది నిపుణులు, శ్మశ్రుసంగ్రాహకులగువారు (మంగలవాండ్రు) సుఖహస్తులును, త్వరగలవారును, నై రామునియొద్దకు వచ్చిరి. అప్పుడు రాముడు ముందుగ భరతుడును, మహాబలుడగు లక్ష్మణుడును, వానరేంద్రుడగు సుగ్రీవుడును, రాక్షసేంద్రుడగు విభీషణుడును, మంగళస్నానము జేయునట్లు చేసి పిమ్మట దాను జడలను విడిచి స్నానమును జేసి చిత్రములగు మాల్యలేపనాదులుగలవాడును, మిగుల వెలగల వస్త్రములను ధరించినవాడును నయ్యె. అప్పుడు రాముడు రాజ్యలక్ష్మిచేత నధికముగా బ్రకాశించుచుండె.

ఆసమయమునందు నిక్ష్వాకువంశవర్ధనుడగు శత్రుఘ్నుడు రామలక్ష్మణులకు హారాదిఅలంకారములనలంకరించె. ఆసమయమునందు దశరథమహారాజుయొక్క భార్యలందఱును సీతాదేవికి మిగుల మనోహరముగా హారాదులచేత నలంకారమును జేసిరి. అప్పుడు పుత్రలాలసయగు కౌసల్యాదేవి వానరస్త్రీలకందఱకును స్నానాద్యలంకారములను జే

యుంచెను. అంతట శత్రుఘ్నుని యొక్క వచనానుసారముగ సుమంత్రుడను మంత్రిపుంగవుడు సర్వావయవములయందు సుందరమగు రథమును సన్నద్ధము నొనరించి తీసికొనివచ్చె. అంతట సత్యపరాక్రముడును, మిగుల గొప్పదగు భుజబలముగలవాడును, నగు రాముడు సూర్యమండలముతో సమానమైనదియును, మిగుల శ్రేష్ఠమైనదియును నగు రథముమీదనెక్కె. ఆసమయమునందు దేవేంద్రుని యొక్క కాంతివంటి కాంతిగల సుగ్రీవుడును, హనుమంతుడును, మంగళస్నానము జేసి శుభకరములగు కుండలములను ధరించి వచ్చేసిరి. మరియు నాసమయమునందు సుగ్రీవుని భార్యలును, మఱియు నితరవానరస్త్రీలును, మిగుల శ్రేష్ఠములగు నాభరణములను ధరించినవారును, దివ్యములగు కుండలములుగలవారును నై సీతాదేవిని జూచుటకు వచ్చేసిరి. ఆసమయమునందు దశరథమహారాజు యొక్క మంత్రులందఱును పురోహితుని ముందునిడుకొని యయోధ్యాపట్టణమునందు జేయదగిన కార్యములను గణించి సార్థకమగునట్లుగా యోచించిరి. మఱియు నప్పుడు, అశోకుడు, విజయుడు, సుమంత్రుడు, మొదలగు మంత్రిపుంగవులందఱును నొక్కటిగా జేరుకొని రామునకభివృద్ధిగలుగుటకొఱకును, పట్టణముయొక్క యభివృద్ధికొఱకును యోచించిరి. మరియును, మహానుభావుడగు రాముని యొక్క పట్టాభిషేకమునకు గావలసిన శుభద్రవ్యములన్నింటిని దీసికొనివచ్చునట్లు నిశ్చయించిరి. ఇవ్విధముగ నామంత్రిపుంగవులందఱును పురోహితునితో నాలోచించి నిశ్చయించి రామునిజూడవలయునని మిగుల కుతూహలముగలవారై పట్టణమునుండి బయలువెడలిరి. వేయినేత్రములుగలవాడును, పాపరహితుడును నగు నింద్రునివలె రాముడు మిగుల శ్రేష్ఠములగు నశ్వములచేత గూర్పబడినరథము నెక్కి మిగుల శ్రేష్ఠమగు నయోధ్యాపట్టణమునకు బయనమయ్యె.

ఆసమయమునందు భరతుడు సారథ్యమును వహించె. శత్రుఘ్నుడు గొడుగును బట్టె. లక్ష్మణుడు వింజామరలను వైచుచుండె. ఆసమయమునందు రాక్షసేంద్రుడగు విభీషణుడు మిగుల తెల్లనిదగు వింజామరను జేబూని వీచుచుండె. మరియు నాసమయమునందు ఋషులును, దేవతలును, సిద్ధవిద్యాధరాదులును, ఆకాశమునందు నిలిచి జయజయధ్వనులను జేసిరి. ఆమహాధ్వని భూమ్యంతరిక్షములయందంతటను వ్యాపించె. అప్పుడు వానరోత్తముడును, సర్వోత్తమమగు తేజస్సుగలవాడును నగు సుగ్రీవుడు శత్రుంజయమను పేరుగలదియును, పర్వతముతో సమానమైనదియును, నగు నేనుగునెక్కె. ఆసమయమునందు వానరులందఱును, సర్వోత్తమములగు నాభరణములను ధరించినవారును, మానవరూపమును ధరించినవారునునై యనేకవేల యేనుగులనెక్కిరి. ఆసమయమునందు, పురుషోత్తముడగు రాముడు, శంఖధ్వనులతోడను, జనులయొక్క సంతోషధ్వనులతోడను, కూడుకొనినవాడై మేడలయొక్క స్త్రీలచేత మిగుల మనోహరమగు నయోధ్యాపట్టణమునకు బోయెను. అనేకవేలజనులతో గూడ వచ్చుచున్నవాడును, అతిధీరుడును, నగు రాముని జూచి యెల్లవారును నపరిమితముగా సంతోషమును బొందిరి. మరియు నాసమయమునందు వారందఱును, మహాత్ములును, అన్నదమ్ములతో గూడుకొనినవాడును, కకుత్స్థకులమునందు బుట్టినవాడును నగు రామునితో గూడ నయోధ్యాపట్టణమునకు బోయిరి. మరియు నాసమయమునందు రాముడు, మంత్రులతోడను, బ్రాహ్మణులతోడను, ప్రకృతిజనులతోడను, గూడుకొనినవాడై నక్షత్రములతో గూడుకొనిన చంద్రునితో సమానముగ ప్రకాశించుచుండె. మరియు నాసమయమునందు మంగళవాద్యములును, తాళస్వస్తికనాదములును, భేరీభాంకారాదులును, నపరిమితముగా జెలంగె. ఆసమయమునందు రాముని ముందర మానవులందఱును, జాతరూపములగు సా[illegible]లును, గోవులును, కన్యలును, మోదక[illegible]నవులు నునడచుచుండిరి. అప్పుడు మహానుభావుడగు రాముడు మంత్రులతో, సుగ్రీవునితోడి స్నేహమును జేయుటయును, హనుమంతునియందు నత్యద్భుతమగు సామర్థ్యముగలిగియుండుటయును, వానరులు మిగుల భయంకరమగు కర్మమును జేయుటయును, రాక్షసులధికబలముగలవారనుటయును, విభీషణునితోడి స్నేహించుటయును, మొదలుగాగల విషయములన్నింటిని జెప్పె. అయోధ్యాపట్టణమునందు నివసించువారందఱును నావృత్తాంతమును సర్వమును విని మిగుల నాశ్చర్యమును బొందిరి. అంతట ననేకవేలవానరులతో గూడుకొనినవాడును, అధికమగు కాంతిగలవాడును, నగు రాముడు, సంతుష్టులును, బలిసినవారును, నగు జనులచేత నిండిన యయోధ్యాపట్టణమునందు బ్రవేశించె. ఆసమయమునందు పురజనులందఱును ప్రతిగృహములలో నుధ్వజములనెత్తి రాముని యభివృద్ధిని దెలుపుచుండిరి. అంతట రాముడు, ఇక్ష్వాకువంశపు రాజులచేత బాలింపబడుచున్నదియును, రమ్యమైనదియును నగు తండ్రియొక్క గృహమునందు బ్రవేశించె. అంతట రఘుకులమునకు సంతోషమునుగలుగజేయువాడును, రాజపుత్రుడును, నగు రాముడు ధర్మవంతులలో నుత్తముడగు భరతునితో నధికయర్థముగలదియును, మధురమైనదియును, నగు మాటను జెప్పె. అంతట మ

హాత్ముడగు రాముడు మహానుభావుడగు తండ్రియొక్క గృహమునందు బ్రవేశించి తల్లులకందఱకును నమస్కారమును జేసె. పిమ్మట భరతునితో మరల నిట్లనియె.

తమ్ముడా! భరతుడా! అశోకవనముతో గూడుకొనినదియును, మిగుల గొప్పదియును, ముక్తావైడూర్యములతో గూడుకొనినదియును నగు గృహమునందు సుగ్రీవుని బ్రవేశపెట్టుమనియె. అట్లు రాముడు చెప్పినవాక్యమును విని సత్యవిక్రముడగు భరతుడు సుగ్రీవుని హస్తమును బట్టుకొని తీసికొనిపోయి రామవచనానుసారముగ దివ్యమగు గృహమునందు బ్రవేశించె. ఆసమయమునందు శత్రుఘ్నుని వచనానుసారముగ ననేకులగు పనివాండ్రు తైలపుదీపములను, పర్యంకాస్తరణములను గ్రహించి సుగ్రీవునితో బోయిరి. ఆసమయమునందు రాముని తమ్ముడగు భరతుడు సుగ్రీవునితో నిట్లనియె.

వానర రాజోత్తముడవైన యోసుగ్రీవుడా! రాముని పట్టాభిషేకమున కుదకమును దీసికొనివచ్చుటకు దూతలను బంపుమనియె. అంతట నాసుగ్రీవుడు, బంగారముచేత జేయబడినవియును, నానావిధములగు రత్నములచేత నలంకరింపబడినవియును, నగు నాలుగు కలశములను నలుగురు వానరులచేతికిచ్చి ప్రాతఃకాలము వచ్చునంతలోపల నాలుగు సముద్రములనుండి యుదకమును కలశములతో దీసికొని రండనియె. ఇవ్విధముగా సుగ్రీవుడు చెప్పినవాక్యములను విని యేనుగులతో సమానులును, మహాత్ములును, నగు వానరులు "శీఘ్రముగా బోవునట్టి సామర్థ్యముగల గరుత్మంతులవలె" నంతరిక్షమున కెగిరిరి. అవ్విధముగ బోయి జాంబవంతుడును, మిగుల వేగముగల హనుమంతుడును, వేగదర్శియగు సుషేణుడను వానరుడును, జాంబవంతుడును, జలపూర్ణములగు కలశములను దీసికొనివచ్చిరి. మఱికొందఱగు వానరు లనేక కలశములను దీసికొనిపోయి యనేకములగు పుణ్యనదులయందలి యుదకమును దీసికొనివచ్చిరి. ఆవానరులలో మిగుల బలవంతుడగు సుషేణుడు నానావిధములగు రత్నములచేత నలంకరింపబడిన ఘటముతో తూర్పుసముద్రమునందలి యుదకమును దీసికొనివచ్చె. ఋషభుడను వానరుడు మిగుల శీఘ్రముగ దక్షిణసముద్రమునందలి యుదకమును దీసికొనివచ్చె. రక్తచందన శాఖలచేత నలంకరింపబడిన ఘటముతో గవయుడు పశ్చిమసముద్రోదకమును దీసికొనివచ్చె. వాయువుయొక్క పరాక్రమమువంటి పరాక్రమముగలవాడును, గరుత్మంతునియొక్కయు, వాయుదేవునియొక్కయు, వేగమువంటి వేగముగలవాడును, ధర్మాత్ముడును నగు నలుడను వానరోత్తముడు మిగుల గొప్పదగు రత్నకలశముతో నుత్తరసముద్రోదకమును దీసికొనివచ్చె. అట్లు వానరోత్తములందఱును తెచ్చిన జలకుంభములను జూచి శత్రుఘ్నుడు మిగుల సంతోషమును బొంది మంత్రులతో నాలోచించి యావృత్తాంతమును సర్వమును బురోహితులకు దెలియజేసి యాజలకుంభముల సమర్పించె.

శ్రీరామచంద్రపట్టాభిషేకఘట్టము

అంతట మిగుల వృద్ధుడగు వసిష్ఠమహాముని బ్రాహ్మణోత్తములతో గూడ నాలోచించి రత్నమయమగు పీఠమునందు సీతారాములను గూర్చుండబెట్టె. అంతట, వసిష్ఠుడు, వామదేవుడు, జాబాలి, కాశ్యపుడు, కాత్యాయనుడు, సుయజ్ఞుడు, గౌతముడు, విజయుడు, మొదలుగాగలవారందఱును, పురుషోత్తముడగు రామునకు సుగంధముగల యుదకముచేత వసువులు దేవేంద్రునకభిషేకమును జేసినవిధముగా నభిషేకమును జేసిరి. మరియును, ముందుగా ఋత్విక్కులును, బ్రాహ్మణులును, నభిషేకమును జేసిరి. పిమ్మట కన్యలును, మంత్రులును, నభిషేకమును జేసిరి. పిమ్మట యోధులును, వర్తకులును, సంతోషముగలవారై యభిషేకమును జేసిరి. ఆసమయమునందు నలుగురగు దిక్పాలురును, బ్రాహ్మణులును, మిగుల శ్రేష్ఠములగు సర్వౌషధీరసములతోడను, దివ్యరసములతోడను, రామునకభిషేకమును జేసిరి. మఱియు నాసమయమునందు శత్రుఘ్నుడు, మిగుల తెల్లనిదగు, ఛత్రము ధరించియుండె. వానరోత్తముడగు సుగ్రీవుడు మిగుల తెల్లనిదియగు వింజామరను వైచుచుండె. రాక్షసోత్తముడగు విభీషణుడు చంద్రునితో సమానమగు మఱియొక్క వింజామరను వైచుచుండె. ఆసమయమునందు దేవేంద్రునిచేత బ్రేరేపింపబడిన వాయుదేవుడు మిగుల బ్రకాశించుచున్నదియును, సువర్ణమయమైనదియును, నూరు పద్మములుగలదియును, నగు మాలికను దీసికొనివచ్చి రామునకు సమర్పించె. మఱియు నాసమయమునందు ఆవాయుదేవుడు, సర్వవిధములగు రత్నములతో గూడుకొనిన ముత్యాలహారమును రామునకు సమర్పించె. ఆసమయమునందు దేవతలును, గంధర్వులును రాముని బొగడిరి. అప్సరస్త్రీలు నృత్యమును జేసిరి. ఆయభిషేకమును శ్రీమంతుడగు రామునకు దగియున్నదని యనేకవిధముల నెల్లవారును బొగడిరి. ఆసమయమునందు భూమి యంతయును సస్యములచేత సమృద్ధమైయుండె. వృక్షములన్నియును ఫలవంతములయ్యె. పుష్పములన్నియును మిగుల బరిమళముగలవైయుండె. ఆసమయమునందు మానవోత్తముడగు రాముడు గజ్జములయొ

కఱ్ఱవేలను, ధేనువులయొక్కయు, గోవులయొక్కయు, వేలను, బ్రాహ్మణులకునిచ్చె. మఱియు నాసమయమునందు రాముడు ముప్పదికోట్ల బంగారపునాణ్యములను బ్రాహ్మణులకునిచ్చె. మఱియు నాసమయమునందు రఘుకులోద్భవుడగు రాముడు, సుగ్రీవునకు, మిగులవెలగలవియును, నానావిధములైనవియును, నగువస్త్రములను, సూర్యునియొక్కకిరణములతో సమానమగు కాంతిగలదియును, బంగారపు దారములగలవియును, మణులచేత నిర్మింపబడినవియును, దివ్యమైనదియునునగు హారమునొసంగె. అంతటనా రాముడు వాలిపుత్రుడగునంగదునకు వైడూర్యమణులచే విచిత్రములైనవియును, వజ్రములచేతను, రత్నములచేతను, నలంకరింపబడినవియును, నగుభుజబంధువులను సమర్పించె. అంతటనా రాముడు శ్రేష్ఠములగు మణులతోగూడుకొనినదియును, మిగులశ్రేష్ఠమైనదియును, చంద్రునియొక్కకిరణములతో సమానమగుకాంతిగలదియును, నగుముత్యాలహారమును, సీతామహాదేవికిచ్చె. పిమ్మటనిర్మలములగు వస్త్రములను, మిగులమంగళకరములగు నాభరణములను సీతాదేవి చూచుచుండగ హనుమంతునకునిచ్చె. ఆసమయమునందు జనకమహారాజునకు బుత్రికయగు సీతాదేవి కంఠమునుండి ముత్యాలహారమునుదీసి వానరులనందఱను జూచి మాటిమాటికిని రామునిజూచుచుండె. ఆసమయమునందు నింగితజ్ఞుడగురాముడు జనకచక్రవర్తికి బుత్రికయగు సీతాదేవినిజూచి యిట్లనియె.

విలాపవతివైన యోదేవి! సీతా! సుభగురాలా! నీవెవ్వనివిషయముగా సంతోషమునుబొందితివో వానికివ్వుము. మఱియునోసీతా! పౌరుషవిక్రమ యశస్సులెవని యందుండెనో వానికివ్వుమనియె. అంతట నాసీతాదేవి యాముత్యాలహారమును వాయుపుత్రుడగు హనుమంతున కిచ్చె. ఆసమయమునందాముత్యాలహారముచేత వానరోత్తముడగు హనుమంతుడు చంద్రునియొక్క కిరణములవలెదెల్లనివగు తెల్లనిమేఘములచేత వ్యాప్తమైనపర్వతమువలె బ్రకాశించుచుండె. అంతటశత్రువులను దపింపజేయువాడగు రాముడుద్వివిదమైందులకును, నీలునకును, కోరదగిన గుణవిశేషములుగల యాభరణాదులనిచ్చె. మఱియు నితరులగు వానరవృద్ధులను, వానరాధిపతులను, వస్త్రములచేతను, భూషణములచేతను, తగినవిధముగా బూజించె. పిమ్మటనాయాసముగ సకలకార్యములను జేయువట్టి రాముడు, విభీషణసుగ్రీవజాంబవంతులను, మఱియునితరులగు వానరముఖ్యులను, సకలపదార్థములచేతను, రత్నములచేతను, తగువిధముగాబూజించె. అంతటవారందఱును రామునిచేతజక్కగాబూజింపబడినవారై మహానుభావుడగు రామునిబొంది తమతమ దేశములకుబోయిరి. అట్లురామానుజ్ఞనుబొంది బయలువెడలినోయి పిమ్మటనా వానరులందఱును కిష్కింధాపట్టణమునకుబోయిరి. వానరోత్తముడగు సుగ్రీవుడవ్విధముగా రామునివలనదగినసత్కారమునుబొంది రామునిపట్టాభిషేక మహోత్సవమునుజూచి మిగులసంతోషమునుబొందెను. ఆసమయమునందు విభీషణుడును, ఇక్ష్వాకుకులధనమగు శ్రీరంగవిమానమునుగైకొని లంకాపట్టణమునకుబోయెను. అంతటశత్రురహితుడును, మిగులగొప్పదగు కీర్తిగలవాడును, రఘుకులోద్భవుడును, నగురాముడు సకలభూమండలమును మిగులమనోహరముగ బరిపాలించుచుండె. అట్లురాజ్యమును బాలించుచున్నవాడును, సకలధర్మములను దెలిసినవాడును, నగురాముడు ధర్మజ్ఞుడగు లక్ష్మణునితోనిట్లనియె.

సకలధర్మములను దెలిసిన యోతమ్ముడా! లక్ష్మణా! మనపూర్వులచేత బాలింపబడినయీభూమిని నాతోగూడ బాలింపుము. మఱియు నోలక్ష్మణుడా! మనపితృపితామహులచేత భరింపబడిన రాజ్యభారమును నాతో సమముగవహింపుమనియె. ఇట్లురాముడనేకవిధములగు ప్రియవచనములతో జెప్పుచున్నవిషయమును విని లక్ష్మణుడు యౌవరాజ్యమును బొందుటకు సమ్మతింపక యౌవరాజ్యమునందు భరతునినభిషిక్తునిగా జేసె. అంతటరాజోత్తముడగు రాముడనేకములగు పౌండరీకాశ్వమేధములను, వాజపేయనామక యజ్ఞములను, మఱియు నానావిధములగు యజ్ఞములను జేసె. పిమ్మటరఘుకులోద్భవుడగు రాముడుత్తమాశ్వములు గలవియును, భూరిదక్షిణలు గలవియును నగు నూరశ్వమేధయాగములను జేసి పదివేలసంవత్సరములు రాజ్యమును బాలించె. మఱియును, జానువులవఱకు వ్యాపించునట్టి భుజములుగలవారును, మిగులగొప్పవగు ఘనశిరస్సులుగలవారును, మిగులప్రతాపముగలవాడును, లక్ష్మణానుచరుడును నగురాముడు భూమినిసర్వమును మిగులమనోహరముగ బాలించుచుండె. మఱియు జ్ఞాతిజనులయందు బంధుత్వమునవలంబించి సంచరించువాడును ధర్మాత్ముడును, నగురాముడు, మిగులశ్రేష్ఠమగురాజ్యమునుబొంది నానావిధములగు యజ్ఞములను జేయుచుండె. రాముడు భూమినిబాలించుచుండ స్త్రీలువిధవలై వ్యసనమునబొందుటలేదు. పాములుమొదలగు క్రూరజంతువులవలన నెవరికిని భయముగలుగుటలేదు. వ్యాధులవలనబీడను బొందుటలేదు. లోకమునందెక్కడను దొంగతనమును జేయువారు లేకయుండిరి. మఱియు నేవిధములగు ననర్థము

లును గలుగుటలేదు. వృద్ధులెవ్వరును బాలురకు ప్రేతకార్యములను జేయుటలేదు. లోకమంతయును సంతోషముగలదైయుండెను. సర్వజనులును, ధర్మపరులైయుండిరి. సర్వజనులును రామునే చూచుచు నొకరినొకరు హింసచేయక సంచరించుచుండిరి. మఱియు నివ్విధముగా రాముడు వేయితరములకాలము రాజ్యమును బాలించుచుండెను. అట్లు రాముడు పరిపాలించుచున్న పదివేల సంవత్సరములును భూలోకమంతయును నిరామయమైయుండెను. మఱియు నావిధముగ రాముడు ప్రజాపరిపాలనమును జేయుచున్న కాలమునం దెక్కడజూచినను, రాముడు, రాముడు, రాముడు, అనుకథలు వినబడుచుండెను. మఱియు లోకమంతయును రామమయమైయుండెను. వృక్షములన్నియును, సర్వకాలములయందును, పుష్పములుగలవియును, ఫలములుగలవియును, విస్తరించినకొమ్మలును, ఆకులును, గలవియునునై యుండెను. తగినకాలమునందు మేఘుడు చక్కగ వర్షించుచుండెను. వాయువు సుఖస్పర్శగలదైయుండెను. బ్రాహ్మణులును, క్షత్రియులును, వైశ్యులును, శూద్రులును, లోభరహితులై యుండిరి. మఱియు నాలుగుజాతులవారును, తమతమ కులోచితములగు కర్మలయందు ప్రవర్తించుచుండిరి. మఱియును, రాముడు ప్రజాపరిపాలనమును జేయుచున్న కాలమునందు మానవులందఱును, ధర్మమునం దాసక్తిగలవారును, అసత్యమును మాటలాడనివారునునై యుండిరి. మఱియు నందఱును, సకలశుభలక్షణములతో గూడుకొనినవారును, ధర్మపరాయణులును నైయుండిరి. ఇవ్విధముగ రాముడు సోదరులతోగూడ బదునొకండువేల సంవత్సరములు రాజ్యమును బాలించెను. ధన్యమును, కీర్తికరమైనదియును, ఆయుర్వృద్ధికరమును, జయమును గలిగించునదియును, ఆదికావ్యమును, నగు శ్రీరామాయణ మహాకావ్యమును, పూర్వమునందు రాముడుచేసె. ఈమహాకావ్యమును లోకములో నేమానవుడు పఠించునో వాడు పాపరహితుడగును. పుత్రకాముడు పుత్రులనుబొందును. ధనకాముడు ధనములనుబొందును. మఱియును రాముని పట్టాభిషేకవృత్తాంతమును విన్నవాడు మిగుల విజయము గలవాడగును. రాజగువాడు వినెనేని యుద్ధమునందు జయముగలవాడగును. మఱియు నీమహాకావ్యమును వినినస్త్రీలు రామలక్ష్మణభరతశత్రుఘ్నులచేత కౌసల్యాసుమిత్రాకైకలేవిధముగా సంతోషమును బొందిరో యావిధముగా పుత్రులమూలకముగ సంతోషమును బొందుదురు. మఱియు శ్రీరామాయణ మహాకావ్యమును వినినవాడు దీర్ఘాయుష్యమును బొందును. అనాయాసముగ సకలకార్యములను జేయునట్టిరాముని విజయవృత్తాంతమును వినినవాడు విజయమును బొందును. మఱియును లోకములో నేమానవుడు చిత్తైకాగ్రతగలవాడై వాల్మీకిమహామునిచేత జేయబడిన యీమహాకావ్యమును వినునో యట్టివాడనేకములగు దుర్గములను దాటును. మఱియును ప్రవాసాంతమునందు సుఖవంతులగు బంధువులతో గలసికొని యధికానందమును బొందును. మఱియు నీమహాకావ్యమును మిగులశ్రద్ధతో వినినవాడు రామునియనుగ్రహముచేత సకలకోరికలను బొందును. మఱియు నీమహాకావ్యమును వినుచున్నవారలనుగుఱించి దేవతలందఱును సంతోషమును బొందుదురు. మఱియు శ్రీరామాయణ మహాకావ్యమును వినువానిగృహమునందు విఘ్నములను జేయునట్టి యశుభదేవతలు శాంతినిబొందుదురు. రాజగువాడు జయమును బొందును. ప్రవాసమును జేయువాడు సకలశుభములునుగలవాడై స్వగృహమునకు బోవును. రజస్వలలగుస్త్రీలు వినిరేని సుపుత్రులను బడయుదురు. మఱియు శ్రీరామాయణ మహాకావ్యమును బూజించువారును, పఠించువారును, సకలపాపరహితులగుదురు. మఱియును దీర్ఘాయుష్యము గలవారగుదురు. క్షత్రియులు దినదినమునందును బ్రాహ్మణులకు శిరస్సాష్టాంగ వందనములను జేసి యీమహాకావ్యమును వినిరేని యైశ్వర్యమును, పుత్రలాభమును బొందుదురు. మఱియు శ్రీరామాయణ మహాకావ్యమును వినినవారలనుగుఱించి సనాతనుడును, సర్వవ్యాపకుడును, ఆదిదేవుడును, మహాబాహుడును, నారాయణుడును నగురాముడు పరమసంతోషమును బొందును. మఱియు శ్రీరామాయణ మహాకావ్యమును భక్తిశ్రద్ధలతో వినువారు కుటుంబవృద్ధిని, ధనధాన్యవృద్ధిని, ఉత్తమస్త్రీలను, సర్వోత్తమమగు సుఖములను, మఱియు నితరములగు సకలార్థసిద్ధులను బొందుదురు. మఱియును, దీర్ఘాయుష్యమును, రోగరాహిత్యమును, కీర్తిని, సోదరాభివృద్ధిని, సుఖమును, తేజోబలధైర్యాదులను బొందుదురు. కావున మిగుల మంగళకరమైనదియును, పూర్వవృత్తవిషయములను బోధించునట్టిదియును, నగునీమహాకావ్యమును పఠించినట్టివారును, విష్ణుదేవుని యనుగ్రహమువలన మిగుల నభివృ

ద్ధిని బొందుదురు. మఱియు నీరామాయణ మహాకావ్య మును భక్తితోవినుటచేత దేవతలందఱును సంతోషమును బొందుదురు. పితృదేవతలు సంతుష్టులగుదురు. మఱియు ను, వాల్మీకిమహామునిచేత జేయబడిన యీరామాయణ మహాకావ్యమును భక్తితో వ్రాయువారు స్వర్గలోకమునం దు చిరకాలము సుఖముగానుందురు.

ఇట్లు సకలకళాకలాప దురంధరుఁడును - బరూరు . సీతారామార్య తనూభవుఁడునునగు

బరూరు - త్యాగరాయశాస్త్రిచే రచియింపంబడిన యాంధ్రవచనకావ్య

శ్రీమద్వాల్మీకిరామాయణమునందు యుద్ధకాండము-ముగిసెను.

శ్రీరామచంద్రార్పణమస్తు.



DIGITAL LIBRARY OF INDIA

Hosted by

International Institute of Information Technolog

Declaration to be given by the Author/Pu
In-copyright books.

To
The Digital Library of India,
IIIT, Hyderabad

Name of the Author/Publisher: S.B.P.

Address: Kapileswarapuram
E.G. Dist

City:
State: A.P.
Phone no:
Email:

We are happy to grant permission to
scan all the books published by our organiza
permission in this letter also authorizes and
right to the Digital Library of India to scan, c
books published by the said publisher / Autho
with out any financial implications from DLI

We will continue to retain the copyrig
can make it free to the read for the gen
provide the above contact information for an
the physical book from us.

SL.NO	TITLE
1	శ్రీమద్వాల్మీకి రామాయణం ఉత్తరకాండం
2	" " యుద్ధకాండం, బాల
3	" " అరణ్య, కిష్కింధ, సుందర
4	" " సుందరకాండం
5	" " అయోధ్యాకాండం
6	కబీరుదాసు చరిత్రము
7	తిరుప్పావై

PS: please add separate sheet for all your ti

Sincerely,

Signature: [illegible] 8/9/08

Name: S.B.P.B.K. SATYANI

Designation: KAPILESWAR

Company: E.G. Dist. A.P.

Date: 8.9.2008